అసలేం జరిగిందంటే..

పి.వి.ఆర్.కె. ప్రసాద్

చరిత్రాత్మక పరిణామాలలో

ఓ ఐ.ఏ.ఎస్. అనుభవాలు....

గుండె లోతుల్లోంచి

ఎమెస్కో

అసలేం జరిగిందంటే...

పి.వి.ఆర్.కె.ప్రసాద్

ఎమెస్కో

అసలేం జరిగిందంటే...
పి.వి.ఆర్.కె.ప్రసాద్

సంపాదకులు
జి.వల్లీశ్వర్

ప్రథమ ముద్రణ : జనవరి, 2010
ద్వితీయ ముద్రణ : జులై, 2011

మూల్యం : రు.150/-

ISBN : 978-93-80409-13-9

ముఖచిత్రం
జి.పురుషోత్త్ కుమార్

డి.టి.పి.
జి.ఎల్.ఎమ్.స్వామి

ప్రింటర్స్
సాయిలిఖిత ప్రింటర్స్
హైదరాబాదు.

ప్రచురణ
ఎమెస్కో బుక్స్
-2-7, బానూ కాలనీ,
గన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్ - 500 029.
ఫోన్ & ఫ్యాక్స్ : 040-23264028
mail : emescobooks@yahoo.com,
ww.emescobooks.com

పంపిణీదారులు
సాహితి ప్రచురణలు
29-13-53, కాళేశ్వరరావు రోడ్డు,
సూర్యారావుపేట, విజయవాడ - 2.
ఫోన్ : 0866-2436643
0866-6460633
e-mail: sahithi.vja@gmail.com

అంకితం

అనేక అనుభవాలు...

అసంఖ్యాక భావాలు...

అపరిమితమైన ఆలోచనలు...

...ఇవన్నీ రాయాలని ఉన్నా రాసే ప్రయత్నం చేసే లోపల కుటుంబ సంబంధమైన, ఉద్యోగ సంబంధమైన అనేక అవరోధాలు!

ఇది రచనా సామర్థ్యం కలిగిన చాలామంది సాటి ఐఏఎస్ అధికారులతో నేను చూస్తున్న పరిస్థితి.

అదృష్టవశాత్తూ -

నేను ఉద్యోగ విధుల్లో లీనమైపోయి కుటుంబ పట్ల నా పాత్రకి న్యాయం చేయలేకపోతున్నానేమో అనిపించిన పరిస్థితుల్లోనూ,

కుటుంబంతోపాటు అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు సమయం కలంపట్టి కథలూ, వ్యాసాలూ రాస్తూ కూర్చుని, కుటుంబ సభ్యులకి సంతృప్తి కలిగేలా వాళ్ళతో గడపలేకపోతున్నాననిపించిన పరిస్థితుల్లోనూ,

ఆధ్యాత్మిక జిజ్ఞాసవున్నా లౌకిక జీవన దినచర్యలో మునిగిపోయి, గురువులు ఆశించిన స్థాయిలో ధర్మసాధన చేయలేకపోతున్నానేమో అనిపించిన పరిస్థితుల్లోనూ...

...ఇలాంటి అన్ని అవాంఛనీయ పరిస్థితుల్లోనూ నా బలహీనతని కప్పిపుచ్చుతూ, కుటుంబంపట్ల సమయపాలనలో నా వైఫల్యం వల్ల కలిగిన అసౌకర్యాన్ని ఆవేదనని భరిస్తూ, నాకు అన్నివేళలా తోడుగా నిలబడిన నా జీవిత భాగస్వామి గీతకు - నేను ఎప్పటికీ మాటల్లో వ్యక్తం చేయలేని మధుర భావాలతో...

పి.వి.ఆర్.కె.ప్రసాద్

ధన్యవాదాలు

'అసలేం జరిగిందంటే...' శీర్షికన నేను రాసిన ఈ అనుభవాల వ్యాసాలని పఠనాసక్తి కలిగించేలా చిత్రిక పట్టి, మెరుగులు దిద్దిన ఆత్మీయుడు జి. వల్లీశ్వర్‌కి,

ఈ వ్యాసాలను 'స్వాతి' వార పత్రికలో ప్రచురించటం ద్వారా లక్షలాది పాఠకులకు చేరేలా చేసిన సంపాదకులు వేమూరి బలరామ్‌గారికీ,

ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ ఈ వ్యాసాలు, ఫొటోల డెలివరీ సమర్థంగా జరిగేలా చొరవతో శ్రమించిన చిరంజీవి మేడూరి గిరి కిరణ్‌కీ,

వ్యాసాలను డి.టి.పి. చేయించటం దగ్గర్నుంచి పుస్తక రూపంలోకి తీసుకువచ్చే వరకూ అత్యంత శ్రద్ధతో సహకరించిన 'ఎమెస్కో' విజయకుమార్ గారికీ

మనసారా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

ముందుగా రెండు మాటలు

'అసలేం జరిగిందంటే...' అన్నది నా అనుభవాల సమాహారమే తప్ప నా స్వీయచరిత్ర కాదు.

ప్రభుత్వాన్ని బయటనుంచి చూసేవాళ్ళకి విశాలమైన బంగళాల్లో నివసిస్తూ, ఎయిర్ కండిషన్డ్ కారుల్లో తిరిగే ఐఏఎస్ అధికారుల జీవితాలు అత్యంత సుఖవంతంగా ఉన్నట్లు అనిపించడం సహజం.

పాలనావ్యవస్థలోని కశ్మలాన్ని కడిగి పారేసి, సంస్కరించి పారేయాలన్న వీరావేశంతో ప్రభుత్వ సర్వీసుల్లోకి ప్రవేశించే యువతీ యువకులకి ఆరంభంలో ఆవేశం, ఆత్మవిశ్వాసం అపరిమితంగా ఉండటం సహజం.

కాని...

ఈ భావాలకి, వాస్తవానికి మధ్య దూరం ఎంతో - నా 34 ఏళ్ల సర్వీసులో నేను అర్థం చేసుకొన్న మేరకు - అందరితో పంచుకోవాలన్న ప్రయత్నం మాత్రమే ఈ 'అసలేం జరిగిందంటే...' అన్న అనుభవాల సంకలనం.

ఈ అనుభవాల వ్యాసాల్లో నాకు తెలిసిన నిజమంతా రాశానో లేదో గానీ, రాసినవన్నీ మాత్రం నిజాలే.

ముఖ్యంగా శ్రీ జలగం వెంగళరావు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, శ్రీ ఎన్.టి.రామారావు, శ్రీ పి.వి.నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ వంటి రాజకీయ నాయకులతో కలిసి పనిచేయాల్సి వస్తే, ఐఏఎస్ అధికారులు ఎదుర్కొనే సంక్లిష్టమైన సందర్భాలు ఎలా ఉంటాయో - ఇంతవరకూ వెలుగు చూడని సంఘటనలు - నా అనుభవాల్లోంచి వెల్లడించటం జరిగింది.

రాజకీయ నాయకులకీ, పాలనా అధికారులకీ మధ్య మానవ సంబంధాల పరిణామ క్రమాన్ని కూడా ఈ వ్యాసాలలో వెల్లడించే ప్రయత్నం చేశాను.

ఇదొక కొత్త ప్రయోగం.

సమకాలీన పాలనా పరిస్థితులకు దర్పణం పట్టే ఒక ప్రయత్నం.

పి.వి.ఆర్.కె. ప్రసాద్

నాహం కర్తా, హరిః కర్తా

ఒక ప్రచురణకర్తగా ఈ సమాజంలో అనేకమంది మేధావులు, ప్రముఖుల్ని కలిసే అవకాశం నాకు కలిగింది. ఒక వినమ్రమైన విద్యార్థిగా వారినుంచి ఎన్నో సంగతులు నేను తెలుసుకుంటున్నాను. చరిత్రలో నిలిచిపోయే అనేక సంఘటనలకు సూత్రధారులైన, సంఘటనలలో పాత్రధారులైన ప్రముఖుల అనుభవాలు వింటూ వుండటం నాకు కలిగిన ఓ అదృష్టం.

ఏ వ్యక్తయినా ఈ సమాజంనుంచి ఎంతో నేర్చుకుని వుంటాడు. తన అనుభవాలను పంచుకోవడం ద్వారా సమాజాన్ని ముందుకు తీసుకువెళ్ళడానికి ఆ వ్యక్తికి అవకాశం వుంటుంది. అయితే అనేకమంది అనుభవాలను పంచుకోవడానికి ఇష్టపడరు. దీనివల్ల సమాజం ఎంతో కోల్పోతుంది. ఈ అభిప్రాయం ఎందరో మేధావులతో మాట్లాడినతర్వాత నాకు ఏర్పడింది.

'నాహంకర్తా, హరిఃకర్తా' (సర్వసంభవామ్) పుస్తక ప్రచురణ సమయంలో శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్‌గారితో చాలా సమయం గడిపే అవకాశం నాకు ఏర్పడింది. గుంటూరు ప్రాంతంలో ఓ సాధారణ ఉపాధ్యాయుడి కుమారునిగా ప్రారంభమైన ఆయన జీవనప్రస్థానం ఓ జిల్లా కలెక్టరుగా, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన కార్యనిర్వహణాధికారిగా, విశాఖపట్టణం పోర్టు ప్రధాన నిర్వహణాధికారిగా, ప్రధానమంత్రి సమాచార సలహాదారుగా, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి స్థాయిలో మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్‌గా, ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం సలహాదారుగా ఇలా సాగుతూ వస్తున్నది. ఉద్యోగం ఇచ్చిన అవకాశాలను ఆయన పూర్తిగా ఉపయోగించుకుని సమాజ హితానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలు చేశారు. విశిష్టమైన ఆయన వ్యక్తిత్వం, ఆయన ప్రతి పనిలోనూ కనపడుతుంది.

శ్రీ ప్రసాద్‌గారు నాపట్ల చూపించిన ప్రేమను, అభిమానాన్ని దృష్టిలో పెట్టుకుని కొంచెం చనువు తీసుకుని "మీరు మీ అనుభవాలన్నిటిని కనీసం ముఖ్యమైనవాటినైనా గ్రంథస్థం చేయవచ్చుకదా" అని అడిగాను. దానికి వారు నా అనుభవాలన్నిటిలో అనేకమంది ప్రముఖులు పాత్రధారులుగా వుంటారు. ఈ విషయాలు గ్రంథస్థం చేయడం బావుంటుందా? అనే సందేహాన్ని వ్యక్తం చేశారు.

అయితే ఈ జీవన ప్రస్థానంలో ఆయన పొందిన అనుభవాలన్నీ ఈ సమాజం నుంచి పొందినవే. ఆయన విజయాలన్నీ ఈ సమాజానికి చెందినవే. అదే విషయాన్ని నేనూ, ఆరోజు మా సంభాషణలో భాగం పంచుకున్న మిత్రులు వల్లీశ్వర్‌గారు వారికి వివరించాం.

దానితో తన అనుభవాలను గ్రంథస్థం చేయాలనే ఆలోచన వారిలో మొదలైంది. ఆ తరువాత 'స్వాతి' సపరివారపత్రికవారు ఈ అనుభవాలను ధారావాహికంగా ప్రచురించడం, ఇప్పుడు ఇలా పుస్తకంగా రావడం అంతా 'నాహం కర్తా, హరిః కర్తా' అని ప్రసాద్‌గారి విశ్వాసం.

ఈ పుస్తక ప్రచురణకు నాకు అవకాశం కల్పించిన ప్రసాద్‌గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఎమెస్కో విజయకుమార్

విషయసూచిక

1.	చెమటలు పట్టించిన 'బైండోవరు' - 1	11
2.	చెమటలు పట్టించిన 'బైండోవరు' - 2	16
3.	ముఖ్యమంత్రి నుంచి 'సమన్లు'	22
4.	నాకు 'నచ్చని భూసంస్కరణలు'	35
5.	ముఖ్యమంత్రి సీటుకే ఎసరు పెట్టానుట!	45
6.	పదవి 'పీడ' - కరెన్సీ 'బండ'	53
7.	సిఎం వెంగళ్రావు అడిగిన ఫేవర్!	63
8.	నన్ను దోషిని చేసిన సంజయ్‌గాంధీ	75
9.	నా పుట్టి ముంచిన జొన్న పంట	88
10.	రెవెన్యూ బోర్డుకి శ్రీముఖం	99
11.	ఖమ్మం పొమ్మంది - ఉప్పెన రమ్మంది	110
12.	మార్చి 31 మజా	116
13.	ఎన్టీఆర్ - సంజీవరెడ్డి - కళాపీఠం	126
14.	ఎన్టీఆర్ - శివతాండవం	135
15.	'మంత్రాలయ మఠం'లో - కాశ్మీర్ అబ్దుల్లా	143
16.	సిఎంలూ- ఆగ్రహ కెరటాలు - 1	153
17.	సిఎంలూ- ఆగ్రహ కెరటాలు - 2	160
18.	సిఎంకి నేను చాలా 'దగ్గర'	167
19.	'వారుణి' తో రొమాన్స్	174
20.	నన్ను నమ్మని కేంద్రం	182
21.	రాజేష్ పైలటూ - రైలింజనూ	190
22.	హార్బర్‌లో 'యుద్ధం'	198
23.	కేంద్రమంత్రితో ఢీ	205
24.	ఇళ్ళు కూలగొట్టి, 'నెహ్రూప్లేస్' కట్టి...	212
25.	సమస్యల సుడిగుండం	220
26.	'పరమదుర్మార్గుడు పి.వి.ఆర్.కె.ప్రసాద్'	224
27.	పి.ఎం. దగ్గర నేను వద్దనుకున్న పోస్టు	230
28.	పి.ఎం.అధికారులూ - అంతః కలహాలు - 1	238

29.	పి.వి. అధికారులూ-అంతఃకలహాలు - 2	244
30.	పి.వి. పై క్షుద్రపూజలు - సంజయ్‌గాంధి	249
31.	వై.యస్.గురించి పి.వి.చెప్పిన 'రహస్యం'	255
32.	మన్మోహన్ సింగ్ రాజీనామా - 1	262
33.	మన్మోహన్ సింగ్ రాజీనామా - 2	269
34.	'చంద్ర' జాలంలో పి.వి	275
35.	ముఖ్యమంత్రిగా రజనీకాంత్! - 1	281
36.	ముఖ్యమంత్రిగా రజనీకాంత్! - 2	287
37.	మా ఇంట్లో అమితాబ్ బచ్చన్ (నేనో 'జోకర్' ముక్కని -1)	294
38.	నేనో 'జోకర్' ముక్కని -2	299
39.	అయోధ్యలో 'పి.వి.'రామాలయం-1	305
40.	అయోధ్యలో 'పి.వి.'రామాలయం-2	311
41.	'నరసింహు'డు - శ్రీనివాసుడు	318
42.	'హవాలా రాకెట్‌లో పి.వి.'	324
43.	పి.వి.గారి 'ఎగిరే గుర్రం'	331
44.	అమెరికాలో చంద్రబాబునాయుడు - 1	337
45.	అమెరికాలో చంద్రబాబునాయుడు - 2	343
46.	పత్రికలపై మంత్రుల రుసరుస	349
47.	బ్రిటిష్ ప్రధానితో చంద్రబాబు	356
48.	చంద్రబాబు - హాంగ్‌కాంగ్ - అవినీతి	364
49.	నా ఇల్లమ్మి పెడతావా ప్రసాద్!	370
50.	ఐఏఎస్ గుండెలోతుల్లోంచి...1	376
51.	ఐఏఎస్ గుండెలోతుల్లోంచి...2	381
52.	ఐఏఎస్ గుండెలోతుల్లోంచి...3	487
53.	ఐ.ఎ.ఎస్ గుండెలోతుల్లోంచి... 4	394
54.	ఐఏఎస్ గుండెలోతుల్లోంచి...5	398
55.	ఐఏఎస్ గుండెలోతుల్లోంచి... 6	405
56.	ఐఏఎస్ గుండెలోతుల్లోంచి...7	412
57.	అసలేం జరిగిందంటే...	418

చెమటలు పట్టించిన 'బైండోవరు' - 1

"**యు**వరానర్, గ్రామంలో వీళ్ళందరూ కొట్లాటలకు దిగుతున్నారు. తాము భవిష్యత్తులో ఎలాంటి తగాదా పడమనీ, అలాచేస్తే తగిన శిక్షకు అర్హులమనీ, కొట్లాటలు లేకుండా గ్రామంలో శాంతియుతంగా ఉంటామనీ, దానికి తగిన బాండు ఇస్తామనీ వాళ్ళదగ్గర్నుంచి హామీకత్తు తీసుకొని బైండోవర్ చేయవలసినదిగా కోర్టును అభ్యర్థిస్తున్నాను" అని పబ్లిక్ ప్రాసిక్యూటరు (ప్రభుత్వం తరపు లాయరు) జంధ్యాల లక్ష్మన్నగారు వాదించి, వారి వాదన విరమించారు.

అంతకు ముందే అవతల పార్టీ వారి వాదన కూడా పూర్తవడంతో ఇక మిగిలింది నేను ఉత్తర్వులు వేయడమే! మొత్తం పదహారుమంది నిందితులు. అటు ఎనిమిదిమంది, ఇటు ఎనిమిదిమంది.

నేను వాళ్ళని చూస్తూ ఉండిపోయాను.

"యువరానర్, వీళ్ళందరినీ బైండోవర్ చేయమని ప్రార్థన" అని మళ్ళీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అంటున్నారు. విన్నాను...

బైండోవరు చెయ్యాలంటే పదహారు మందిని ఏం చెయ్యాలి, ఎలాచెయ్యాలి?... కోర్టులో అదే మొదటి రోజు... అదే మొదటి కేసు...

కోర్టులో ఠీవిగా కూర్చోవాలి కాబట్టి బంద్‌గలా (గొంతు దగ్గర మూసేసిన మేజిస్ట్రేట్ యూనిఫారమ్) వేసుకున్నానేమో-పైగా ఏలూరు ఎండలకు మరీ చెమట కారిపోతోంది...

'బైండోవరు' అంటే ఏంచేయాలో తెలియక టెన్షన్... దాంతో ఇంకా చెమట... ఎవర్నడగాలో తోచలేదు. ట్రైనింగులో ఈ విషయాలు ఎవరూ నేర్పలేదు...

'ఏం తిప్పలొచ్చాయిరా నాయనా' అని తలపట్టుకు కూర్చుందామా అంటే, కోర్టుహాలులో అందరూ నావంకే చూస్తున్నారు... చెమటలు కారిపోతున్నాయి.

దిక్కుతోచక దిక్కులు చూస్తున్న నాకు ఎదురుగా రమ్మీ (పేకాట) ముక్కలే కళ్ళలో కదులుతున్నాయి...!!

★ ★ ★

"**ఇ**ప్పుడు మన జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో జరిగిందంతా మన కొత్త అసిస్టెంట్ కలెక్టరు ప్రసాద్ డిక్టేట్ చేస్తారు..." అంటూ పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు కె.సుబ్రమణ్యంగారు శెట్టిపేట నీటిపారుదలశాఖ అతిథి భవనంలో నా మీద ఒక బాంబు పేల్చారు.

నాకు మతిపోయింది.

లోలోపల వణుకు మొదలైంది.

అక్కడ చాలామంది ముందు ఈ పరిస్థితి!

కలెక్టరుగారితో పాటు, నీటిపారుదలశాఖ ఎస్.ఇ, ఇతర అధికారులు, నర్సాపూరు సబ్ కలెక్టరు, తహశీల్దారు, ఇతర రెవెన్యూ అధికారులు, నీటి తగాదాలో ఉన్న రెండు గ్రామాల ప్రజలు... ఇంతమంది సమక్షంలోనా! నేను ఈ జిల్లాకు వచ్చి మూడు రోజులుకూడా కాలేదు. అందులోనూ శిక్షణ కోసం వచ్చిన ఐఏఎస్ అధికారిని. అసలు విషయంలో అనుభవం లేనివాడిని.

ఆ రోజు జరిగిన తనిఖీ వివరాలన్నీ స్టెనోగ్రాఫర్‌కి డిక్టేషన్ ఇవ్వమని అందరి ముందూ హఠాత్తుగా కలెక్టరుగారు నన్ను ఆదేశిస్తే నా పరువేంకావాలి!

నేనూ, సబ్‌కలెక్టరు ఆనందరావు తనిఖీమీద ధ్యాస పెట్టకుండా కాలవవెంట పొలాల్లో నడిచిన రెండు గంటల సేపూ ఏదో మాట్లాడుకోవడం కలెక్టరుగారు గమనించి ఉంటారు. ఆనందరావు సబ్‌కలెక్టరు గదా... అనుభవం కూడా నాకంటే ఎక్కువ వుంది. ఆయనను అడగవచ్చు గదా? ఆనందరావుకి ఈ తగాదా గురించి అదివరకే బాగా తెలుసు. కాని డిక్టేషను ఇవ్వమని నాకే ఎందుకు చెప్పారు? ఇరకాటంలో ఎందుకు పెట్టారు?

అసలు ఏలూరు (పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం)లో అడుగుపెట్టకుండానే నా జిల్లా శిక్షణ ప్రారంభమైంది.

అది కూడా చాలా నాటకీయంగా!

ముస్సోరీ అకాడమీలో ట్రైనింగు పూర్తిచేసుకొని మా బ్యాచ్ (1966) ఆంధ్రప్రదేశ్‌లో పనిచేయాల్సిన ఎనిమిది మంది ఐఏఎస్ ప్రొబేషనర్లు పదిరోజుల క్రితం హైదరాబాదు వచ్చాం. అక్కడ రోజుకి 20 మంది చొప్పున సీనియరు అధికారులనీ, మంత్రులనీ (ముఖ్యమంత్రి ఛీఫ్ సెక్రటరీతో సహా) కలిశాం. ప్రతి శాఖకు వెళ్ళి పరిచయాలు చేసుకోవడంలోనే మొదటి వారం రోజులూ గడిచి పోయాయి. తర్వాత ఎవరెవరికి నిర్దేశించిన జిల్లాకు వాళ్ళు 18 నెలల శిక్షణకు బయలుదేరాం.

మాలో అర్జునరావు శ్రీకాకుళం, వైద్యనాథ అయ్యర్ కృష్ణాజిల్లా, లలితాంబిక గుంటూరు జిల్లా, నేను పశ్చిమ గోదావరి జిల్లాకి బయలుదేరాం.

అంతా కొత్త. ఎలా ఉంటుందో ఏమో? జిల్లాలో శిక్షణ స్వర్గమా, నరకమా-అన్నది ఆ జిల్లా కలెక్టరుపై ఆధారపడి ఉంటుందని సీనియర్లు చెప్తూండేవారు. ఆయన కనుక మంచివాడై, దగ్గరకు తీసి, నన్నొక తమ్ముడిలా భావించి, ఆప్యాయంగా చూస్తే స్వర్గమే. కాని దూరంగా పెట్టి, అసలు పట్టించుకోకపోయి, లేదా ఏడిపించడానికి ఎక్కువగా పట్టించుకొంటే... ఒక రకంగా నరకమే, దాని విషయమే చర్చించుకుంటూ రాత్రి రైల్లో గడిపాం.

దారిలో పొద్దున్నే విజయవాడలో రైలాగినప్పుడు బోగీ దగ్గరకు దవాలు బంట్రోతులు, డిప్యూటీ తహశీల్దార్లు గుంటూరు నుంచి, కృష్ణాజిల్లా నుంచి వచ్చి, అయ్యర్‌నీ, లలితాంబికనీ చాలా సాదరంగా ఆహ్వానించి తీసుకుపోయారు... మొదటి ఇంప్రెషన్ బాగా ఉండాలని వాళ్ళిద్దరూ రైల్లోనే స్నానంచేసి, శుభ్రంగా తయారై, హుందాగా కలెక్టర్లలాగా ప్లాట్‌ఫామ్ మీద నీట్టుగా దిగి, మందీమార్బలం హడావుడి చేస్తుండగా, ఇతర ప్రయాణికులంతా 'ఎవరబ్బా' అని ఆశ్చర్యంతో చూస్తూ ఉంటే, మాకు 'బై బై' చెప్పేసి హుందాగా నడిచి వెళ్ళారు...

అర్జునరావు ఆ మధ్యాహ్నానికి శ్రీకాకుళం చేరతాడు కనుక ఇంకా తయారవలేదు. ఏలూరు గెస్ట్‌హౌస్‌కి వెళ్ళాక స్నానం చేయవచ్చు అనుకున్న నేను- విజయవాడలో హడావుడి చూశాక, బాగుండదని రైల్లోనే స్నానంచేసి బట్టలు మార్చుకొని, రెడీగా కూర్చున్నాను. (ఆ రోజుల్లో ఫస్ట్‌క్లాసు బోగీల్లో స్నానానికి షవర్లు ఉండేవి)

విజయవాడ హడావుడి చూశాక నాకు బెంగ మొదలైంది. ఏలూరులో నాకోసం ఎవరైనా వస్తారా? లేదా? రాకపోతే ఏంచేయాలి? ఎలా వెళ్ళాలి? ఎక్కడకు వెళ్ళాలి. కలెక్టరు ఆఫీసుకా? అతిథి గృహానికా? ఏ అతిథి గృహమో చెప్పలేదే?... ఎవరూ రాకపోతే?... అర్జునరావు ముందు నా గాలి తీసేసినట్లు అవుతుంది కదా!...

అర్జునరావు కూడా అదే అన్నాడు.

"విజయవాడ, గుంటూరు నుంచి వాళ్ళను ఆహ్వానించడానికి వచ్చారుకాని, మనకు వస్తారో లేదో?" అంటూ అతనూ అదే ఆలోచనలోపడ్డాడు.

ఇలా అనుకుంటూ ఉండగానే పవరుపేట స్టేషన్‌లో (ఏలూరుకి ఇది టౌన్ స్టేషన్) రైలు ఆగింది.

చాలామంది బంట్రోతులు, ఆఫీసర్లు హడావుడిగా రైల్వే ప్లాట్‌ఫామ్ మీద కనిపించారు.

నేను దిగాల్సింది ఏలూరు స్టేషన్‌లోనే. ఇంతమంది నాకోసం పవరుపేటకెందుకొచ్చారు - అని ఆశ్చర్యపోతుంటే... ఒక భారీకాయం కిటికీ దగ్గరకు వచ్చి-

"అసిస్టెంటు కలెక్టరు దొరగారున్నారా? ప్రసాదు దొరగారున్నారా?" అని గట్టిగా అరిచాడు.

ఓహో... ఇంకేం! నాకోసమేననుకుని, కొంచెం గర్వంగా అర్జునరావుకేసి చూసి, ఆ భారీకాయంతో "నేనే" అన్నాను. నా గొంతే నాకు వింతగా అనిపించింది - పెద్దగా అరిచానా అని. ఇంతలో కిటికీలోంచి మళ్ళీ వినిపించింది! "దొరగారు స్నానం చేశారా? రెడీగా ఉన్నారా?" అని.

నాకర్థం కాలేదు... రెడీగా ఉండటానికి స్నానంచేశారా-అని అడగడం ఏమిటి? "ఎందుకు?" అని అరిచాను.

అప్పుడు అతను చెప్పాడు-

"నేను పట్నాయక్‌ని, ఏలూరు తహశీల్దారుని సార్... కలెక్టరు దొరగారు కూడా రైల్లో తాడేపల్లిగూడెం వస్తున్నారు.. అక్కడ పెద్ద రైతుసభ జరుగుతోంది. మీ బోగీలోనే వ్యవసాయశాఖ మినిష్టరు గారు కూడా ఉన్నారు. వారు తాడేపల్లిగూడెంలో దిగుతారు. కలెక్టరు దొరగారు తమర్ని కూడా తాడేపల్లిగూడెం రమ్మన్నారు–"

"నేను రెడీ..." అన్నాను.

"అయితే దొరగారి సామానులు మా దఫేదారు దింపి గెస్ట్‌హౌస్‌కి తీసుకుపోతాడు. దొరగారు తాడేపల్లిగూడెం వెళ్ళి సాయంత్రానికి తిరిగి బంగళాకు చేరవచ్చు" అంటూనే నా సామాను అంతా దింపేశాడు.

అర్జునరావు నవ్వుతూ, "నీ శిక్షణ రైల్లోనే మొదలైంది. ఈ కలెక్టరెవరో నిన్ను వాయించేస్తాడులే" అన్నాడు.

కలెక్టరుగారిని ఏలూరులో ఆ రైల్లోనే కలిశాను. నా పక్క కంపార్ట్‌మెంట్‌లోనే వ్యవసాయ శాఖామంత్రి పెద్దిరెడ్డి తిమ్మారెడ్డిగారు ప్రయాణం చేస్తుంటే, ఆయన్ని కలవడానికి వచ్చి ఆయనతో తాడేపల్లిగూడెం దాకా ప్రయాణంచేసి, కార్యక్రమం వివరాలు ప్రయాణం చేసేటప్పుడు మంత్రికి ఇవ్వాలని ఆయన వచ్చారు.

నాకు నేనే వెళ్ళి పరిచయం చేసుకున్నాను.

ఆయన నన్ను మంత్రిగారికి పరిచయం చేశారు. అంతే! మళ్ళా ఆ రోజు ఆయనకు నాతో మాట్లాడడానికే అవకాశం రాలేదు. రోజంతా ఆయన చాలా బిజీ. 10 వేలమంది రైతులతో సభ. పెద్ద ప్రదర్శన. కొత్త వంగడాలు ఎలా వాడాలి, జిల్లాలో రెండు వరిపంటల బదులు మూడు పంటలు ఎలా తీయాలి... వగైరా అంశాల మీద ఆయన ఈ పథకం తయారుచేసి, అమలు చేయడానికి చాలా కష్టపడుతున్నట్లు అర్థమైంది.

ఆరోజు సాయంత్రం కలెక్టరు క్యాంప్ క్లర్క్ గరటయ్య పుణ్యమా అని ఒక జిల్లా ప్రభుత్వ అధికారి జీపులో ఏలూరు చేరుకున్నాను. కలెక్టరు ఆఫీసు వెనుక ఉన్న రెవెన్యూ అతిథి గృహంలో దిగాను.

మరుసటిరోజు ఉదయం సూటూబూటూ వేసుకొని లాంఛనంగా కలెక్టరుగారిని కలవడానికి వారి బంగళాకు వెళ్ళాను. 10 ఎకరాల స్థలంలో పెద్ద పాత బంగళా.

సుబ్రమణ్యంగారు నన్ను ఆదరంగానే చూశారు. పని గురించే మాట్లాడారు. నా వ్యక్తిగత విషయాలు గురించి ఆయన అంతగా అడగలేదు.

ఆరోజు ఆయన మాటల్లో నాకు అర్థమైన విషయాలు– శిక్షణకు వచ్చిన అధికారులు గ్రామాల్లో ఎక్కువ రోజులు ఉండటానికి ఇష్టపడరనీ, వారిలో శిక్షణపై అంతగా శ్రద్ధ లేకపోవడం కన్పిస్తోందనీ, నేర్చుకోదలుచుకుంటే చాలానే నేర్చుకోవల్సింది వుందనీ, ఇప్పుడు కాకపోతే నేర్చుకొనే అవకాశం భవిష్యత్తులో తక్కువ అనీ...

చివరికి "నువ్వు సీరియస్‌గా పని నేర్చుకోవాలనుకుంటే, నేను సీరియస్‌గా నాకు తెలిసింది నేర్పుతాను. లేదంటే రొటీనుగా పోవచ్చు" అన్నారు.

నేను సీరియస్‌గా నేర్చుకోదలుచుకోలేదని - నిజంగానే నా మనస్సులో ఉన్నా - ఆయనకు చెప్తానా?

"నీకభ్యంతరం లేకపోతే - కలెక్టరు బంగళా వెనుక రెండు మూడు గదులున్నాయి. బాగుచేయించాను. అన్ని వసతులూ ఉన్నాయి. నీ ముందు ఉన్న అసిస్టెంట్ కలెక్టరు ఆనందరావు అక్కడ ఉండడానికి అంత సుముఖత చూపలేదు. నువ్వొ చూసి ఇష్టమైతే ఉండవచ్చు. బంగళాకి దగ్గరే కాబట్టి నేనూ నీతో కొంత సమయం గడపడానికి అవకాశం ఉంటుంది" అన్నారాయన.

సరే, చూస్తును గదా. అవి నౌకర్ల కోసం కట్టిన చిన్న చిన్న మూడు క్వార్టర్లు-బంగ్లా వెనుక. చాలా సంవత్సరాలుగా ఎవ్వరూ ఉన్నట్లులేరు. కాని ఈ మధ్యనే చుట్టూ ఉన్న తుప్పలు కొట్టించి అంతా బాగుచేశారు.

ఉండటానికి, వంటకి, బాత్‌రూమ్... అన్నీ లోపల బాగానే ఉన్నాయి కానీ, బయటకు నౌకర్ల క్వార్టర్సులాగానే కనిపిస్తున్నాయి. అందులో పెద్ద బంగళా పక్కన ఉండటంతో మరీ కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

ఏం చెప్పాలా అని సందిగ్ధ పరిస్థితి. వద్దంటే ఏమనుకుంటారో? అక్కడే ఉంటే- అందరూ నౌకర్లలాగానే ఉన్నాననుకుంటారేమో? అయినా అందులో ఉన్నంత మాత్రాన నౌకర్నయ్యానా? అంతగా బాగాలేకపోతే తర్వాత మారొచ్చులే అని ఉండటానికి ఒప్పుకొన్నాను... కలెక్టరుగారే నా లగేజి తెప్పించేశారు.

క్వార్టర్‌లో మంచమొక్కటే ఉంది. నేను బ్రహ్మాచారిని. వండుకోవడం రాదు. ఒక నౌకర్‌ని ఇచ్చారు. కాని అతనికీ వంట అంతంతమాత్రమే...

సరే, ఏలూరులో ఉన్నప్పుడు హోటలు నుంచి క్యారియరు తెప్పించుకోవచ్చు. కాఫీ మాత్రం ఇంట్లోనే చేసుకొనేలా- కావల్సిన స్టవ్, గిన్నెలు ఉన్నాయి.

ఒక పడక కుర్చీ, ఒక మడత కుర్చీ- ఎవరైనావస్తే వేయడానికి. (ఎవ్వరినీ అక్కడకు పిలవ దలుచుకోలేదనుకోండి)... ఆరోజు రాత్రి భోంచేసి నౌకరు వెళ్ళిపోయాక పడకుర్చీలో పడుకొని కాళ్ళు ఇంకో మడత కుర్చీపై పెట్టి సిగరెట్టు తాగుతూ ఆ రోజు జరిగిందంతా పర్యావలోకనం చేసుకొంటున్నాను.

ఇంతలో జర జర అని ఏదో శబ్దం. చూద్దును కదా- ఒక పెద్ద పాము. పాక్కుంటూ వచ్చేసింది:

★ ★ ★

చెమటలు పట్టించిన 'బైండోవరు' - 2

నాకు కదిలే శక్తిగాని, ఆ అవకాశంకాని లేదు. నా కాళ్ళ కింద కుర్చీల మధ్య అది పాకుతోంది... చెమటలు పడుతున్నాయి. అలాగే కదలకుండా కూర్చుండిపోయాను... అదృష్టంకొద్దీ కుర్చీ చుట్టూరా పాకి, వచ్చిన త్రోవనే బయటకు వెళ్ళిపోయింది. అయినా కొంతసేపటి వరకు లేవడానికి ధైర్యం చాలలేదు... దఫేదారు వచ్చి పెద్ద మూట దింపేవరకూ కుర్చీలోనే ఉండిపోయాను.

"సార్ కలెక్టరుగారు ఈ ఫైల్స్ పంపారు. ఇవి ఆయనకు వచ్చిన ఫైల్సు. వారు ఇంకా చూడలేదట. మిమ్మల్ని చూసి రిపోర్టు రాసి పంపమన్నారు. వీలైతే ఈ రాత్రికే, లేదా ఉదయానికల్లా చూడమన్నారు" అన్నాడు.

మూట పెద్దదే. చాలా ఫైల్స్ ఉన్నాయి. అది ఇంకా జిల్లాలో రెండో రోజే. ఉన్నట్టుండి ఇన్ని ఫైల్స్ పంపిస్తే- అసలు ఫైల్ చూడటమే మొదటిసారి. ఎలా చూడాలో తెలియదు. పైగా రిమార్కులు రాసి పంపమన్నారని దఫేదారు చెప్పడం. ఏం రాయాలి? ఎలా రాయాలి? ముస్సోరీ అకాడమీలో ఇవేమీ నేర్పలేదే అనుకుంటూనే ఒక్కొక్క ఫైలు చూసుకుంటూ కూర్చున్నాను.

కొన్నింటిలో నాకు తోచింది రాశాను. రాత్రి పదకొండు తర్వాత నౌకరు వచ్చి మూట తీసుకుపోయాడు.

మరునాడు కలెక్టరుగారు చూసిన ఫైల్స్ వాపసు పంపే ముందు మళ్ళీ నన్ను చూడమన్నారని కబురు. చూసి పంపించాక, ఆఫీసులో కలవమన్నారు.

రాత్రి, ప్రొద్దున చూసిన ఫైల్సు గురించి వివరంగా చెప్పారు. ఫైల్సు ఎలా చూడాలో, ఏవి ముఖ్యమయినవో, నోటు ఫైలు అంటే ఏమిటో, కరెంట్ ఫైలు అంటే ఏమిటో, పెద్ద ఫైలులో మనకు కావల్సిన విషయం ఎలా పట్టుకోవాలో... వగైరా విషయాలు విపులంగా చెప్పారు.

"ఎల్లుండి నర్సాపూరు డివిజన్లోని బ్రాహ్మణపల్లిలో నీటిపారుదలశాఖ ఇంజనీర్లతో కలిసి సంయుక్తంగా తనిఖీ ఉంది. నువ్వూ రావాలి" అని చెప్పారు.

మరుసటి రోజు నేను వాకబు చేసేప్పటికే కలెక్టరుగారు క్యాంపుకు వెళ్ళిపోయారనీ, రెండ్రోజుల తర్వాతకాని రారనీ తెలిసింది. ఆయన వెళ్ళేది నర్సాపురానికే కదా? నన్నూ తనతో తీసుకొని వెళ్ళి ఉండచ్చు కదా- అనిపించింది.

మూడురోజులనుంచీ-అంటే నేను జిల్లాకొచ్చినప్పటి నుంచి కలెక్టరుగారి ప్రవర్తన ఏదోలా ఉందనిపించింది. నన్ను కొంచెం దూరంగా ఉంచాలని చూస్తున్నారా- అనిపించేలా ఉంది.

వెంటనే శిరస్తాదారు సలహా మేరకు నౌకర్నివెంట బెట్టుకొని బస్స్టాండుకివెళ్ళి, బస్సెక్కి-సాయంత్రానికి నర్సాపురం చేరాను. రిక్షాలో సబ్ కలెక్టరు ఆఫీసుకి వెళ్ళాను.

సబ్ కలెక్టరు ఆనందరావుగారు ఆ జిల్లాలోనే శిక్షణపొందారు. సబ్ కలెక్టరుగా నర్సాపురం డివిజన్‌లో చేరారు. కొద్ది నిమిషాల్లోనే నా పరిస్థితి అంతా ఆయనకి అర్థమైంది. నామీద జాలిపడ్డారు. సర్వీసులో నాకు చాలా దగ్గరైన కొద్దిమందిలో ఆనందరావు ఒకరు. మర్నాడు జరగబోతున్న జాయింట్ ఇన్‌స్పెక్షన్ గురించి ఆయన నాకు వివరంగా చెప్పారు.

అందులో పెద్దగా తనిఖీచేసేదిలేదనీ, తను చాలా విపులంగా రిపోర్టు పంపాననీ, కాని మళ్ళీ నీటిపారుదల, రెవెన్యూ అధికారులందరితో కలిసి ఈ తనిఖీ ఎందుకు చేస్తున్నారో అర్థంకావడంలేదనీ అన్నారు.

* * *

మర్నాడు ఆ ఇన్‌స్పెక్షన్ అయ్యాక, కలెక్టరుగారు "కొత్త అసిస్టెంట్ కలెక్టరు ప్రసాద్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టు డిక్టేట్ చేస్తారు" అంటూ బాంబు పేల్చారు.

అలా అనడంలో ఆయన ఉద్దేశ్యం...?

అదృష్టంకొద్దీ, ముందురోజు ఆనందరావుగారితో ఈ విషయం క్షుణ్ణంగా చర్చించి వుండటంవల్ల కలిగిన పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఏదో ఒక రిపోర్టు డిక్టేట్ చేశాను. కలెక్టరుగారు కొంచెం ఆశ్చర్యపోయినట్లు కనిపించింది. మొత్తంమీద మొదటి గండం గడిచింది.

ఆ రాత్రి సబ్‌కలెక్టరు పిలిస్తే కలెక్టరుగారు భోజనానికి వచ్చారు. అప్పుడు మాటలలో అడిగాను.

"సబ్ కలెక్టరు రిపోర్టు అంత విశదంగా ఉన్నప్పుడు మళ్ళా తనిఖీ ఎందుకు సర్?"

"ఇది రెండు గ్రామాల మధ్య పెద్ద తగాదా. పేపరు మీద పరిష్కారం చేస్తే-గ్రామస్థులకు చాలా విషయాలు తెలియకపోగా, రకరకాల అపోహలకు దారి తీస్తుంది. కొంత మనకు కాలం వృథా అయినా, పెద్ద అధికారులంతా తిరిగి పరిశీలించి, గ్రామస్థులముందే అన్ని విషయాలూ చర్చించి నిర్ణయం తీసుకొంటే, మనం ఇచ్చే నిర్ణయాన్ని వాళ్ళు ఒప్పుకొని, ముందుముందు తగాదాలు లేకుండా కలిసి ఉండే అవకాశం ఉంటుంది" అన్నారు.

అలా అంటూనే, "మీరిద్దరూ ఇన్‌స్పెక్షన్ సమయంలో మాటల్లో పడిపోయారు కదా! అందుకే డిక్టేషన్ ఇమ్మన్నాను..." అని మనస్సులో ఉన్నది కలెక్టరు బయట పెట్టారు. అదృష్టం బాగుండి బయటపడ్డాను అనుకున్నాను. అర్జునరావు మాటలు గుర్తుకొచ్చాయి.

సర్వే ట్రైనింగ్‌కి మా బ్యాచ్‌మేట్లు అందరం విశాఖపట్నంలో కలిశాం. ఒకవారం రోజులు అందరికీ కలిపి ఈ శిక్షణ... పని నేర్చుకోవడం ఎలా ఉన్నా అందరం మా మా జిల్లాల అనుభవాలు

పంచుకోవడానికి అవకాశం వచ్చింది... దాదాపు అందరం చాలా ఉత్సాహంగా ఉన్నాం. వాళ్ళ వాళ్ళ కలెక్టర్లు ఎంత మంచిగా చూసుకొంటున్నారో చెప్పారు. వారి మాటల్నిబట్టి కలెక్టర్ల దగ్గరనుంచి వారికి పెద్ద టెన్షను లేకుండా శిక్షణ జరుగుతుండడమే కాక, వారంతా కలెక్టరు కుటుంబసభ్యుల్లా ఆనందంగా గడుపుతున్నారన్నది నాకు అర్థమయిన విషయం... నా గురించి నేనేం చెప్పుకోను?

ఒకటిరెండు విషయాలలోనే నాకు అసంతృప్తి. నన్ను ఒక ఐఏఎస్ అధికారిగా (దర్పంతో) ఆయన మసలనివ్వడంలేదు. అంతేకాదు, ఒకటి రెండుసార్లు ఇతర అధికారులను కూడా నా విషయంలో అలా ప్రవర్తించకుండా చూశారేమోనని నా అనుమానం.

సాధారణంగా శిక్షణకి వచ్చిన నాలాంటి ఐఏఎస్ అధికారులను గ్రామానికి కరణం పోస్టులో శిక్షణకు పంపేటప్పుడు తహశీల్దారు స్వయంగా గ్రామానికి తీసుకెళ్ళి, గ్రామాధికారులకు పరిచయం చేసి, వసతులున్నాయో లేదో చూసిపోవడం ఒక సంప్రదాయం.

నా విషయంలో కొంచెం ప్రత్యేకం. "సార్, రేపు ఉదయం మిమ్మల్ని జీపులో తీసుకెళ్ళి గ్రామంలో దింపివస్తాను" అని చెప్పిన తహశీల్దారు పొద్దున్నే ఫోనుచేసి "జీపు పాడైంది సార్, తమరు బస్సులో వెళ్తే బాగుంటుందేమో?" అనేవాడు. నేను బస్సులో నా నౌకరుతో సహా గ్రామానికి వెళ్ళి, గ్రామాధికారులను పరిచయం చేసుకొని, పనిలోకి వెళ్ళాల్సి వచ్చింది...

పూళ్ళ అని ఏలూరుకి 30 కిలోమీటర్ల దూరంలో ఉందో గ్రామం. ఆ గ్రామానికి సంబంధించిన అన్ని విషయాలు తెలుసుకొని, గ్రామ సమగ్ర ప్రగతికి సంబంధించిన ప్రణాళిక తయారుచేసి ఇవ్వాలి.

ఇదేకాక, వారానికొకసారి ఆ వారంలో ఏం చేశానో తేదీల వారీగా విపులంగా రాసి కలెక్టర్‌కి పంపాలి.

నేను ఐదు పేజీలు రాస్తే, కలెక్టరుగారి నుంచి ఆరు పేజీల సూచనలతో నా రిపోర్టు వాపసు వచ్చేది. నేనెంత బాగా చేయడానికి ప్రయత్నించినా, చాలా బాగా చేశాననుకొని రాసి పంపినా, ఇంకా చేయాల్సింది ఏముందో, ఎలా చేయాలో ఆయన వివరంగా రాసి (విశ్రాంతిగా నిద్రపోవడానికి వీలులేకుండా) పంపించేవారు.

తర్వాత భీమడోలు రెవెన్యూ ఇన్‌స్పెక్టరు ట్రైనింగు. అక్కడున్న రోజుల్లో ఒక్కసారి కూడా అసిస్టెంట్ కలెక్టర్ హోదాలేదు. ఏలూరు తహశీల్దారు ఆఫీసులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల సమావేశానికి నన్ను రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగానే హాజరవమన్నారు కాని అసిస్టెంట్ కలెక్టరుగా కాదు...

జిల్లాలో పోలీసుశాఖలో ట్రైనింగు విషయంలో కూడా ఎస్.పి.గారిని పిలిచి నాకేం నేర్పాలో, ఏ విషయాలు పూర్తి అవగాహన వచ్చేలా చేయాలో కలెక్టరుగారే చెప్పారు. పోలీసుస్టేషనులో ఒకరోజంతా కూర్చోబెట్టి జరుగుతున్నది తెలిసేటట్లు చేయడం కాకుండా, లారీలు ఆపి తనిఖీలు చేయడంలోకూడా శిక్షణ ఇచ్చారు.

అలాగే, వ్యవసాయం, నీటిపారుదల, పౌరసరఫరాలు, పశుసంవర్ధన, సంక్షేమం... ఇలా అన్ని విభాగాల జిల్లా అధికారులనూ పిలిచి నాకు ఏమేమి నేర్పాలో కలెక్టరుగారే ఆదేశాలిచ్చి మరీ ఏర్పాటుచేశారు. జీవితంలో అంతవరకు ఏ సమయంలోనూ ఇంత కష్టపడి పని చేయలేదన్న ఆలోచన వచ్చేట్లుగా శిక్షణ సాగుతోంది.

ఇదేం ఐఏఎస్ ఉద్యోగం?

...నన్ను నీరసం ఆవహించింది. కాని మొదటి ఆరు నెలల శిక్షణ పూర్తయిన తర్వాత ఆ శిక్షణ విలువ తెలియడం మొదలుపెట్టింది. అప్పటి నుంచీ స్వతంత్రంగా పనిచేసే అవకాశం వచ్చింది. ఒక నెల ఆర్.డి.ఓగా, ఆరు నెలలు బి.డి.ఓగా, మూడు నెలలు జిల్లా పరిషత్ కార్యదర్శిగా పనిచేశాను. ప్రతిరోజూ కలెక్టరుగారు చూడబోయే ముందు ఆ ఫైళ్ళు చూడాలి. ఆయన చూసిన తర్వాత, ఏం ఉత్తర్వులు జారీచేశారో మళ్ళీ చూడాలి.

కలెక్టరుగారితో కూర్చుని, సందర్శకులను చూడటం, సమావేశాలు నిర్వహించడం, బాగా చూసిన తర్వాత ఏ పని చేయాల్సి వచ్చినా ఎటువంటి ఇబ్బందిగాని, టెన్షనుగాని ఉండేదికాదు. ఆ ఆరు నెలల తర్వాత కలెక్టరు సుబ్రమణ్యంగారి ప్రవర్తనలో తేడా వచ్చింది. ఎప్పుడూ తనతోనే ఉంచుకొనేవారు. తనతో కార్లో టూర్‌కి తీసుకు వెళ్ళేవారు. ఏ విషయం వచ్చినా సమావేశాల్లో నా ఉద్దేశ్యం అందరి ముందూ కనుక్కునేవారు...

నాకే చాలా ఆశ్చర్యం వేసేలా మారిపోయారు. ఉండబట్టలేక ఒక రోజున ఆయన్నే అడిగేశాను...

"మీలో ఈ మార్పుకి కారణం ఏమిటి సర్?"

ఆయన నవ్వుతూనే చెప్పారు.

"కావాలనే మొదట నిన్ను దూరంగా ఉంచాను. నాకు చాలా బాధగానే ఉండేది. కాని నువ్వు పని నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నానన్నావు గదా... మన సర్వీసులో పని నేర్చుకోవడానికి ఇదే మంచి అవకాశం.

"జిల్లాలోని కిందిస్థాయి అధికారులు కాని, ప్రజలు కాని, మనం చాలా పెద్ద అధికారులమని మనతో మనస్సు విప్పి మాట్లాడరు. మనకు చాలా మర్యాద ఇచ్చి దూరంగా ఉంచుతారు. దీనివలన వాస్తవాలకు కూడా మనం దూరంగా ఉండడం జరుగుతుంది.

"నేను నీకు చాలా దగ్గరగా ఉండి, నాతోపాటే నువ్వు కూడా కారులో తిరుగుతూ ఉంటే నిన్ను కూడా కలెక్టరుగానే చూస్తారు. మనస్సు విప్పి ఏమీ చెప్పరు.

"అందుకే శిక్షణలోని మొదటి ఆరునెలలు నీ అంతట నువ్వుగా, ఐఏఎస్ అధికారిగా కాకుండా ప్రసారుగా ప్రజలలో కలవాలనీ, జరుగుతున్నవన్నీ తెలుసుకోవాలనీ, కిందవాళ్ళ

మంచి చెడులూ, కష్టసుఖాలు స్వయంగా చూసి, అనుభవించి విషయాలు అర్థం చేసుకోవాలనీ నా ఉద్దేశ్యం... కొంత మనసుకు బాధ కలిగించే విషయమైనా కావాలనే నిన్ను సర్వెంట్ క్వార్టరులో ఉండమన్నానుగాని కలెక్టరు బంగళాలో స్థలం లేకకాదు...

"ఒకసారి అసలు శిక్షణ పూర్తయిన తర్వాత అదివరకులా నిన్ను ఉంచాల్సిన అవసరంలేదు...

"గ్రామానికి కరణం పోస్టులో శిక్షణకు జీపులో తీసుకువెళ్తానని తహశీల్దారు అంటే నేనే వద్దన్నాను. నర్సాపూరుకు ఇంకో ఆఫీసరు కారులో తీసుకువెళ్తానంటే నేనే వద్దని, నువ్వు బస్సులో వచ్చేలా చేశాను. అదంతా నీ మంచికోసం, నువ్వు పనినేర్చుకోవడం కోసం చేసినవే...

"అధికారంలో ఉండి నేర్చుకోవాలంటే కొన్ని ఏళ్ళు పట్టవచ్చు. దానివలన ఇబ్బందులు రావచ్చు. చేద్దామనుకున్నది చేయలేకపోవచ్చు. పని పూర్తిగా తెలియకపోతే, కింద అధికారులకు చులకన అవుతాం... ఇప్పుడు నీకు ఏ పనీ కొత్తగా అనిపించదు. ఉద్యోగంలో కావలసిన ధైర్యం– పని నేర్చుకోవడంవల్లనే వస్తుంది..."

రెవెన్యూ ట్రైనింగ్ ఇలా ప్రారంభమయితే, మేజిస్ట్రేట్ ఉద్యోగం శిక్షణ ఒక 'శిక్ష'లాగానే సాగింది.

ట్రైనింగులో న్యాయవిచారణ విషయాలు ఒక ముఖ్యభాగం. ట్రైనింగులో ఉండగా మూడవ క్లాసు మేజిస్ట్రేటుగా 12 కేసులు చేస్తే, రెండవ క్లాసు మేజిస్ట్రేటు అధికారాలు వస్తాయి. అప్పుడు మళ్ళీ 12 కేసులు చేస్తే ఫస్ట్‌క్లాసు మేజిస్ట్రేటు అధికారాలు వస్తాయి. ఆ పోస్టులో ఆరు కేసులు చేస్తే శిక్షణ పూర్తయినట్లుగా జిల్లా జడ్జిగారు ధృవీకరిస్తారు. ఈ శిక్షణ అంతా జిల్లా జడ్జి లేదా అదనపు జిల్లా జడ్జి పర్యవేక్షణలో జరుగుతుంది.

ఏలూరులో చేరగానే కలెక్టరుగారు జిల్లా జడ్జిగారితో మాట్లాడి నా శిక్షణకు ఏర్పాటుచేశారు. ఏలూరులో అప్పటికి ఒక అదనపు జిల్లా జడ్జికూడా ఉండేవారు. ఆయనకు నా శిక్షణ బాధ్యత అప్పగించారు. ఆయన సంతృప్తి మేరకు కేసులు చేస్తేనే, బాగా చేశాడని ఆయన నిర్ధారిస్తేనే, ఫస్ట్‌క్లాసు మేజిస్ట్రేట్ అధికారాలు వస్తాయి.

ముందు జిల్లా జడ్జిగారిని కలిసి, తర్వాత అదనపు జిల్లా జడ్జిగారిని కలవడానికి వెళ్ళాను. ఆయన పేరు బేగ్. హైదరాబాదు నివాసి. చాలా కలుపుగోలుగా ఆప్యాయంగా మాట్లాడారు. కేసులు వెంటనే ఇస్తానని, ఏం తెలియకపోయినా అడగవచ్చుననీ, దేనికీ సందేహించవద్దనీ చెప్పారు. నేను లేచి వెళ్లబోయేముందు–

ఆయన నవ్వుతూ "కేసులు బాగా చేసినంత మాత్రాన నీకు నేను సర్టిఫికెట్ ఇస్తాననుకోకు, నువ్వు నాకు ఇంకో విషయంలో కూడా సంతృప్తి కలిగించాలి" అన్నారు.

నాకు అర్థం కాలేదు...

"పెద్ద విషయం కాదులే... సాయంత్రం మా ఇంటికి భోజనానికి రా, చెప్తాను..." అన్నారు.

ఆ సాయంత్రం నాకర్థమయింది ఆయనతో రమ్మీ ఆడాలి. ఇంక చేసేదేముంది? ఏలూరులో ఉన్నప్పుడల్లా ఇదొక ముఖ్య 'శిక్షణా' కార్యక్రమం.

మొదటి నాలుగయిదు నెలల్లో జడ్జిగారు నాకు మేజిస్ట్రేట్ ఉద్యోగంలో మెళకువలకన్నా రమ్మీలో మెళకువలే ఎక్కువగా నేర్పారు. అసలూ, జోకర్లూ అప్పుడప్పుడు కలల్లోకి కూడా వచ్చేస్తూ ఉండేవి!!

★ ★ ★

అందుకే మొదటిసారి అసిస్టెంట్ కలెక్టరుగా మేజిస్ట్రేట్ కోర్టులో మొదటికేసు వింటుంటే- పని తెలియడం ఎంత అవసరమో అర్థమయింది.

కలెక్టరుగారిలాగా జడ్జిగారు కూడా రోజుకో అరగంట పాటు కోర్టులో అభ్యాసాలు, కేసుల అధ్యయనాలు, తీర్పుల పద్ధతులు, వగైరా న్యాయవిచారణకు సంబంధించిన అంశాల్ని ఏ కొంచెం నేర్పినా బాగుండేది.

రమ్మీలో ఆయన ఇచ్చిన శిక్షణలో సగం శ్రద్ధ నాకు కోర్టు విషయాల్ని నేర్పడంలో చూపిస్తే బాగుండేది... అన్ని జిల్లాలలో శిక్షణ ఇంచుమించు అలాగే ఇస్తారు. కాని నా అదృష్టం-ఇక్కడ రమ్మీ బాగా నేర్చుకొన్నాను. కోర్టులో కూర్చుంటే పేకముక్కలే కళ్ళల్లో మెదుల్తున్నాయి.

ఆ రోజు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంధ్యాల లక్ష్మన్నగారు పెద్దమనిషి కనుక నా సంకట స్థితిని అర్థంచేసుకొన్నారు. ఫ్యాన్ పూర్తిగా తిరుగుతున్నా నా ముఖంమీద ఆగకుండా కారుతున్న చెమటలుచూసి, నా దగ్గరకొచ్చి చాలా మర్యాదగా, నా అనుమతి తీసుకొని, నా కోర్టుబెంచి మీదకు వచ్చి రహస్యంగా నా చెవిలో చెప్పారు-

"బైండ్ ఓవర్ చెయ్యడమంటే, మీరేమీ చెయ్యనక్కర్లేదు సార్. కేసు ఫైలుమీద 'బైండ్ ఓవర్' అని రాసి అది ఏరోజువరకో తారీఖు వేసి, సంతకం పెట్టండి. చాలు" అని.

అమ్మయ్య! నా టెన్షన్ దిగిపోయింది.

"నిందితులందర్నీ ఫలానా తేదీ వరకూ బైండోవరు చేయడం జరిగింది" అని తారీఖు చెప్పి, తర్వాత మరో కేసు తీసుకొని, చెమటలు తుడిచేసుకున్నాను.

ఐఏఎస్ అర్హత వేరు. ఐఏఎస్‌లో ఉండాల్సిన విషయ పరిజ్ఞానం వేరు. విషయ పరిజ్ఞానం ఉండాలంటే సరైన శిక్షణతోనే అది ప్రారంభం కావాలి. అదృష్టమో, దురదృష్టమో నాకు శిక్షణ అలా ఆరంభమైంది!

★ ★ ★

ముఖ్యమంత్రి నుంచి 'సమన్లు'

ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఒక వైర్‌లెస్ మెసేజ్ వచ్చింది. అది నల్గొండ జిల్లా కలెక్టరు ఓబయ్యకి వచ్చింది.

"మీ జిల్లాలో చిన్నరైతుల అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరక్టర్‌గా పనిచేస్తున్న ప్రసాద్ అనే వ్యక్తిని ముఖ్యమంత్రి తక్షణం చూడాలనుకుంటున్నారు. ఇది చాలా అత్యవసర ఆదేశంగా భావించండి".

కలెక్టరు కార్యాలయంలో ఆ మెసేజ్ సంచలనం కలిగించింది. కలెక్టరు ఓబయ్య కూడా నిర్ఘాంతపోయారు. ఆయనకీ ఏం అర్థం కాలేదు.

1971లో - ముఖ్యమంత్రి నుంచి ఒక జిల్లా కలెక్టరుకి వైర్‌లెస్ మెసేజ్ రావడమే గగనం. పైగా ఆ మెసేజ్‌లో పట్టుమని మూడేళ్ళయినా సర్వీసులేని అత్యంత జూనియర్ ఐ.ఏ.ఎస్. అధికారిని ముఖ్యమంత్రి పిలిపించమన్నారంటే...!!

ఈ మెసేజ్ అందగానే కలెక్టరు గారు దిగాలు పడిపోయారు. ఆగమేఘాల మీద నన్ను పిలిపించారు. మెసేజ్ చూపించారు. "ఏమయ్యా ప్రసాద్, కొంప ముంచినట్లున్నావే, ఏం చేశావేమిటి?" అంటూ ఆరా తీశారు.

నాకు చెమటలు పట్టేశాయి. ఎందుకంటే, నాకు తెలిసి ముఖ్యమంత్రి స్వయంగా పిలిపించి మెచ్చుకునేటంత ఘనకార్యం నేనేమీ చేయలేదు. ఇంకే రకమైన పాలనాపరమైన విషయమైనా ఒక జాయింట్ కలెక్టరు స్థాయి అధికారితో ముఖ్యమంత్రి నేరుగా మాట్లాడడం అసంభవం. ముఖ్యమంత్రికీ నాకూ మధ్య చీఫ్‌సెక్రటరీ, రెవెన్యూ సెక్రటరీ, అడిషనల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, కలెక్టరు... ఇంతమంది ఉంటారు. పాలనా యంత్రాంగపు నిచ్చెనలో నేను ముఖ్యమంత్రిని నేరుగా కలుసుకోవడానికి ప్రొటోకాల్ (పాలనా సంస్కృతి) అనుమతించదు. ఒకవేళ ఎవరైనా జూనియర్ అధికారి, సీనియర్ అధికార్ల అనుమతి లేకుండా ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నం చేస్తే, సీనియర్ల ఆగ్రహానికి గురికాక తప్పదు. ఐ.ఏ.ఎస్.లకు వుండాల్సిన మొదటి లక్షణం ఈ ప్రొటోకాల్ పాటించడం. అదే - ముఖ్యమంత్రి కోరుకుంటే ఎంత మారుమూలను అతి చిన్న అధికారినయినా పిలిపించుకోవచ్చు. అప్పుడైనా ఆ అధికారి ఆ విషయాన్ని తన బాస్‌కి చెప్పి, ఆయన అనుమతితో వెళ్ళి సి.ఎం.ని కలవాల్సిందే. (ప్రొటోకాల్ ఇప్పుడూ వుంది. కాని పాటించే వాళ్ళని కాగడాలతో వెతకాలి.)

ఇలాంటి నేపథ్యంలో ఇప్పుడు ముఖ్యమంత్రి అడుగుతున్నారు: "ఆ ప్రసాద్ ఎవడో, తక్షణం పంపించండి" అని. అంటే నేను చేసిన నేరం చాలా పెద్దదయి ఉండాలి. ఎంత పెద్దదంటే - చీఫ్ సెక్రటరీ, సెక్రటరీలు వగైరా పాలనాయంత్రాంగపు అధికారగణాలన్నింటినీ ప్రక్కనపెట్టి, ముఖ్యమంత్రి నేరుగా నాకు పాఠం చెప్పాలనుకుంటున్నారు.

నాకింత ఆందోళన కలగడానికి కారణం నా భయం మాత్రమే కాదు. జిల్లా కలెక్టరు సహా నా సహ అధికారులు కూడా నేనేదో చేయరాని ఘోరం చేయబట్టే వైర్‌లెస్ మెసేజ్ వచ్చిందని విశ్లేషించడం. అక్కడితో ఆగలేదు.

నా క్రింద పనిచేసే వాళ్ళూ, కలెక్టరు ఆఫీసుకెళితే అక్కడ నాకు మెసేజ్ గురించి చెప్పినవాడి దగ్గర్నుంచి ప్రతివాడూ "సారీ సర్" అంటూ నాపట్ల సానుభూతి కురిపిస్తూండటం, దానికి తోడు కలెక్టరు ఓబయ్య సయితం "కొంప ముంచావుగదయ్యా" అనడం... నాలో భయాన్నీ, ఆందోళనను పెంచేశాయి.

ముఖ్యమంత్రి ఎందుకు పిలిపిస్తున్నారు?... కలెక్టరు ఊహించలేక పోతున్నారు. జిల్లాలో అతిపెద్ద అధికారి ఆయనే చెప్పలేకపోతే ఇంకెవరు చెబుతారు?

కొంచెం ఆలోచించాక ఒక ఐడియా వచ్చింది. ప్రణాళికా శాఖ కార్యదర్శిగా మా అమ్మ తరపు బంధువు బి.పి.ఆర్. విఠల్, రెవెన్యూశాఖ డిప్యూటీ కార్యదర్శిగా ఆయన బావమరిది ఎస్.ఎస్.జయరావులు సెక్రటేరియేట్‌లోనే ఉంటారు. వాళ్ళకి ట్రంకాల్ చేసి (ఆ రోజుల్లో ఎస్.టి.డి. ఫోన్ సదుపాయం కూడా లేదు) సి.ఎం. ఆఫీసులో వాకబు చేయమని చెప్పాను. ఇద్దరూ మరో గంట తరువాత నాకు ట్రంకాల్ చేసి చెప్పిందొకటే: "సి.ఎం. పిలిపించిన మాట నిజమే. ఆ వైర్‌లెస్ మెసేజ్ సి.ఎం. ఆదేశాల ప్రకారమే వచ్చింది...'"

అదంతా సరే, అసలెందుకు పిలిపించమన్నారు? ఇది నా ఉత్కంఠ నిండిన ప్రశ్న.

"అది మాత్రం ఎవరికీ తెలియడం లేదు" ఇది వాళ్ళిచ్చిన జవాబు. నీరసం వచ్చేసింది.

నా నీరసం గమనించిన జయరావు ఒక హాస్యోక్తి విసిరాడు. "నీకు పెళ్ళైందనీ, ఓ కూతురుందనీ ఆయనకి తెలీదేమో, తన పెళ్ళికాని కూతుళ్ళ కోసం నీమీద కన్నేసి ఉంటాడు..."

తట్టుకోలేకపోయాను. నేను సీరియస్‌గా ఆందోళన చెందుతుంటే పరిహాసాలా? "ఏమిటీ జయరావు గారూ! నామీద ప్రయోగం చేస్తున్నారు!" అనేశాను.

అసలు ఇలా తెలుసుకోవాలని నేనెందుకు ప్రయత్నం చేయాలి? ఈ పోస్టులోకి వచ్చాక నేను చేసిన తప్పులేమిటో నేనే నెమరు వేసుకుంటే ఏ రాజకీయనాయకుడు నామీద కడుపుమంటతో ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశాడో తెలిసిపోతుంది కదా! తెలియకపోయినా, అతి ఘోరమైన

నేరంగా రాజకీయ నాయకులు ఎంచగల పని నేను ఏం చేశానో తిరిగి చూసుకుంటే సరి. ఆ నేరానికి ఎలాంటి అక్షింతలు పడవచ్చో ఊహించుకుని దానికి సిద్ధపడిపోవచ్చు కదా!

ఒక్కసారి గడిచిన ఒకటి రెండేళ్ళలో జరిగిన విషయాల్ని నెమరు వేసుకున్నాను.

★ ★ ★

నల్గొండ జిల్లాలో నేను నిర్వహిస్తున్న చిన్న, సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థని బాగా సమర్థంగా పనిచేసే సంస్థగా తీర్చిదిద్దాలని పని చేస్తున్నాను.

చిన్నరైతుల అభివృద్ధి పథకం క్రింద ఈ సంస్థ అర్హులైన చిన్నరైతుల్ని సన్నకారు రైతుల్ని గుర్తించి, వారికి బావులు త్రవ్వుకోవడానికి, పంపుసెట్‌లు ఏర్పాటు చేసుకోవడానికి, పంటలు వేసుకోవడానికి సబ్సిడీలు, అప్పులు ఇస్తూంటుంది. ఇది విజయవంతం కావాలంటే కేవలం నాయకులు సిఫార్సు చేసిన వాళ్ళకి కాకుండా నిజంగా అర్హులైన వాళ్ళనే ఎంపిక చేసి, వాళ్ళకి ఇప్పించాలన్న దృఢనిశ్చయంతో గ్రామసభలు ఏర్పాటు చేయించడం, గ్రామసభలోనే అర్హులైన చిన్నరైతుల్ని గ్రామసభ ఆమోదంతో గుర్తించడం, వాళ్ళకే ఈ పథకం ప్రయోజనాలు అందేలా చేయడం సాగిస్తున్నాను.

సమితి అధ్యక్షులు (మండలాలు ఏర్పడక ముందు సమితులుండేవి), శాసనసభ్యులు, జిల్లా పరిషత్ అధ్యక్షుడు, ఎం.పి.లు..... వగైరా ఎవరు సిఫార్సు చేసినా నేను గ్రుడ్డిగా ఆ సిఫార్సు ప్రకారం పోకుండా, గ్రామసభ ఎంపిక చేసిన వారికే సబ్సిడీలు, ఋణాలు అందేలా చేస్తూ వచ్చాను. నేను తప్పు చేస్తున్నానని వాళ్ళు అనలేరు కాని తమ ప్రత్యర్థి వర్గీయులు కూడా లబ్ధి పొందుతున్నారన్న దుగ్ధ మాత్రం వాళ్ళల్లో పేరుకుపోతూ ఉండవచ్చు. ఒకళ్ళిద్దరు నా మొహంమీదే నర్మగర్భంగా డైలాగులు కూడా వేశారు. వాళ్ళల్లో ఎవరన్నా ముఖ్యమంత్రికి నామీద ఏమైనా కల్పించి చెప్పి ఉండొచ్చు. ఎవరు చెప్పి ఉంటారు? వీళ్ళందరిలోకీ ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉండే వాళ్ళెవరు?

ఒకవేళ కేంద్రప్రభుత్వం నుంచి వచ్చి తనిఖీ చేసి వెళ్ళిన రామకృష్ణయ్య గారేమైనా ముఖ్యమంత్రికి ఫిర్యాదుచేసి ఉంటారా? ఆయన చేస్తే చీఫ్ సెక్రెటరీకి గదా చేయాలి, ముఖ్యమంత్రికి ఎందుకు చేస్తారు? ఒకవేళ చీఫ్ సెక్రటరీకి చెబితే, ఆయన ముఖ్యమంత్రికి చెప్పి ఉంటారా?... ఒకవేళ ఫిర్యాదు చేసిఉంటే రామకృష్ణయ్య గారు ఏమని ఫిర్యాదు చేసి ఉంటారు? ఏముంది - నేను మార్గదర్శక సూత్రాలకి విరుద్ధంగా వ్యవహరిస్తున్నానని చెప్పి ఉండొచ్చు.

ఆయన తనిఖీకి వచ్చినప్పుడు జిల్లాలో 'కమ్యూనిటీ వెల్స్' (సామాజిక బావుల) పథకం అమలు విషయంలో కొన్ని వ్యాఖ్యలు చేశారు. "అర్హులైన వాళ్ళకే ప్రయోజనం అందాలని మీరు ప్రయత్నం చేస్తున్నారు, బాగుంది. కాని, మీరు ఈ పథకం యొక్క మౌలిక మార్గదర్శక సూత్రాల్ని ఉల్లంఘిస్తున్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ పథకం అని తెలుసుకదా! అయినప్పుడు మీరు ముందుగా

కేంద్రం అనుమతి లేకుండా మార్గదర్శక సూత్రాల్ని ఎలా ఉల్లంఘిస్తారు? ఎవరు చెప్పారు అలా చేయమని?...."

నేను అన్నాను: "నేను చేస్తున్న పని అంతిమలక్ష్యం – అర్హులైన వారికి పథకం ప్రయోజనం చేకూరడం. పథకం యొక్క లక్ష్యం కూడా అదే గదా! అది నెరవేరుతున్నప్పుడు ఈ మార్గదర్శక సూత్రాల ఉల్లంఘన ఏమంత పెద్ద నేరం సర్! మీరు ఇప్పుడైనా రాటిఫై చేయవచ్చు (ఆమోదించ వచ్చు) గదా!..."

రామకృష్ణయ్య గారు ఏమీ మాట్లాడలేరు. "ఢిల్లీ రండి, చూద్దాం..." అంటూ వెళ్ళిపోయారు.

కాబట్టి రామకృష్ణయ్య గారే ఏదోచెప్పి ఉంటారు చీఫ్ సెక్రటరీకో, ముఖ్యమంత్రికో. కానీ ఆయన పెద్దమనిషి అనుకుంటున్నానే. నిజంగా అలా ఫిర్యాదు చేసిఉంటారా?...

ఏమీ అర్థం కావటం లేదు.

ఆందోళన వదలటం లేదు.

ధైర్యం చెప్పేవాళ్ళు కనబడటం లేదు.

... అన్నిటికీ సిద్ధపడిపోయాను. మహా అయితే బదిలీ చేస్తారు. లేదా సస్పెండ్ చేస్తారు. అంతేగాని, ఉద్యోగం పీకలేరు కదా!

ఐ.ఏ.ఎస్. ఉద్యోగాల్లో ఇదొక సదుపాయం. ఉద్యోగంలో ఉన్నప్పుడు ఎంత ఛండాలపు పనిచేసినా, అతనిమీద ప్రభుత్వం తీసుకోగలిగిన అతిపెద్ద క్రమశిక్షణా చర్య సస్పెన్షన్.

అది కూడా, అంత సులభంగా జరగదు. సంజాయిషీ అడగడం, మెమో ఇవ్వడం, అత్యవసరమనుకుంటే సస్పెండ్ చేయడం లేదా ఇంకో పోస్టుకి బదిలీ చేయడం. అంటే ఒక పోస్టులో ఒక టరమ్ (సాధారణంగా 2-3 ఏళ్ళు) పూర్తయ్యేదాకా ఉండనివ్వకపోవచ్చు. కానీ రిటైరయ్యేదాకా మాత్రం సర్వీసులో ఉండనిస్తారు. ఉద్దేశపూర్వకంగా తప్పుచేసే ఐ.ఏ.ఎస్. అధికారులకి అదే ధీమా. టరమ్ గ్యారంటీ లేదు, కానీ సర్వీసు గ్యారంటీ ఉంది.

సర్వీసులోంచి పూర్తిగా తొలగించే అవకాశం లేదా ! ఉంది. శిశుపాలుడు వంద తప్పులు చేస్తే శ్రీకృష్ణుడు చక్రం వేసినట్లు ప్రభుత్వం కూడా చాలా తప్పుల్ని భరిస్తూ ఉంటుంది. "ఇక వీడు మనం భరించలేనన్ని తప్పులు చేస్తున్నాడు" అనిపిస్తే అప్పుడు సర్వీసు నుంచి తొలగిస్తారు. అది కూడా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో లేదు. ఫలానా ఇన్ని నేరాలు చేసి, ఇతను ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులో ఉండే అర్హత కోల్పోయాడు. కాబట్టి ఇతన్ని ఐ.ఏ.ఎస్. నుంచి తొలగించాలి – అని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేస్తే, అప్పుడు కేంద్రప్రభుత్వం ఆ నేరాల చిట్టా అంతా చదివి, "నిజంగా అన్ని నేరాలు చేశాడా? ఉద్యోగార్హత కోల్పోయాడా?..." అని సమీక్షించుకున్నాక, న్యాయశాఖకి పంపిస్తే వాళ్ళు కూడా "ఈ తొలగింపు న్యాయస్థానాల్లో నిలుస్తుంది" అని సంతృప్తి

చెందితే, అప్పుడు కేంద్ర ప్రభుత్వంలోని సర్వీసుల శా వారు రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సుని ఆమోదిస్తే, అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆ ఐ.ఏ.ఎస్. అధికారిని సర్వీసు నుంచి తొలగించవచ్చు.... ఇంత రక్షణ వుంటేనే ఐఏఎస్‌లు ఎవరికీ భయపడకుండా అంకితభావంతో పనిచేయగలరని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. కాని ఈ రక్షణ కవచాన్ని దుర్వినియోగం చేసేవాళ్ళు ఇప్పుడు తయారయ్యారు.

(2006లో ఒక ఐ.ఏ.ఎస్. అధికారిని భరించలేక ఇలా సర్వీసు నుంచి తొలగించారు. నాకు తెలిసి మన రాష్ట్రంలో ఇదే మొదటి తొలగింపు.)

ఇంత గందరగోళం ఉంది కాబట్టి నన్ను ఉద్యోగం నుంచి తీసేసే అవకాశం లేదు.

చాలా ధైర్యం వచ్చేసింది...... కాని, బదిలీ చేయొచ్చు, సస్పెండ్ చేయొచ్చు. సస్పెన్షన్ అంటే క్రొత్తగానీ, బదిలీ కొత్త కాదు.

రెండేళ్ళ క్రితం భువనగిరి సబ్‌కలెక్టర్‌గా ఉన్నప్పుడే నాయకులు పట్టుబట్టి నన్ను 48గంటల్లో బదిలీ చేయించారు కదా!

అసలు ఆ బదిలీ కూడా మంత్రిగారు చేయిస్తే జరిగిందే.

★ ★ ★

యువమంత్రి పురుషోత్తమ రెడ్డి గారు మంత్రి కాకముందు శాసనమండలి సభ్యులు మాత్రమే.

నేను భువనగిరి సబ్ కలెక్టరుగా ఉన్నప్పుడే ఆయనతో తరచూ సంభాషణలు జరుగుతుండేవి. యువకుడైనప్పటికీ అధికారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించడం ఆయన సహజగుణం. ఏదైనా పని కావాలని వస్తే, అది ఎందుకు జరగదో వివరించి చెబితే అర్థం చేసుకునే తత్త్వం ఉన్న మనిషి. కాని, జరిగిందేమిటి?

సుమారు 550 ఎకరాల నల్లరేగడి బంజరుభూమి మొత్తం ఒకే ఖండ్రికగా (ఏక ముక్కగా) చదునుగా ఉంది. అంతా ప్రభుత్వ భూమి కనుక దానిని ఆ గ్రామంలోని వారికే పంచిపెట్టాలని - భువనగిరికి నేను సబ్‌కలెక్టర్‌గా వెళ్ళకముందే అక్కడున్న రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్.డి.ఓ) ప్రభుత్వానికి ఒక నివేదిక పంపారు. ఇది ప్రభుత్వ విధానానికి విరుద్ధమూ కాదు, పేదలకు భూమి పంచడానికి ప్రభుత్వం వ్యతిరేకమూ కాదు. అయితే ఆర్.డి.ఓ. పంపిన ప్రతిపాదన వేరు.

ఆ ప్రతిపాదన ప్రకారం - ఈ 550 ఎకరాల భూమిని ప్రభుత్వం ఆ గ్రామంలోని రైతులకి (భూస్వాములందరికీ) వాళ్ళ వాళ్ళ కమతాల పరిమాణానికి తగిన నిష్పత్తిలో విభజించి ఇచ్చేస్తుంది. ఆ రైతులంతా ప్రభుత్వం నుంచి తమకు ఎంత భూమి వస్తోందో అంతే పరిమాణంలో

తమ సొంత కమతాల్లోని భూమిని ప్రభుత్వానికి ధారాదత్తం చేస్తారు. అలా వారు ప్రభుత్వానికి 'ఉదారంగా' వదులుకున్న భూమిని ప్రభుత్వం వారు భూమిలేని పేదవారికి పంచిపెట్టుకోవచ్చు.

ఆర్.డి.ఓ. ఈ ప్రతిపాదనను ఒక నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపటానికి కారణం ఆ గ్రామస్థుల (భూస్వాముల) సమైక్య నిర్ణయం. గ్రామ పెద్దలంతా నిర్ణయించాక ప్రతిపాదన ప్రభుత్వానికి వెళ్ళక ఏమవుతుంది!

నేను అక్కడికి సబ్ కలెక్టర్‌గా వెళ్ళేసరికే పరిస్థితి చాలా మారిపోయింది. ఎలాగూ ఆర్.డి.ఓ. పంపిన రిపోర్టుని ప్రభుత్వం ఆమోదించేస్తుంది (అమోదింపజేసుకుంటాం) కనుక, ఈ 550 ఎకరాల్ని మనం అనుకున్నట్లుగా పంచేసుకుందాం - అనుకుని, రైతులంతా ఆర్.డి.ఓ., తహశీల్దారుల ఆశీస్సులతో ఆ 550 ఎకరాల భూమిని దున్నేసి, పంటలు కూడా వేసేశారు. ఇందులో నేను చేయగలిగింది కానీ, ఆపగలిగింది కానీ ఏమీలేదు.

కాని, ఎప్పుడైతే 550 ఎకరాల నల్లరేగడి నేలని భూస్వాములు దున్ని పంటలు పండించడం ఆరంభించారో అప్పుడు కమ్యూనిస్టు నాయకుల్లో ఇది సంచలనం కలిగించింది. అప్పటికే పెద్దరైతుల 'ఉదారత' ఏమిటో కూడా కమ్యూనిస్టులకు అర్థం కావడంతో వాళ్ళంతా ఆందోళనకు దిగారు.

మొదట్లో నాకూ అర్థం కాలేదు. ఈ భూమికి బదులుగా ప్రభుత్వం రైతుల దగ్గర్నుంచి భూమి తీసుకుని పేదవాళ్ళకి ఇస్తోంది కదా! ఆందోళన ఎందుకు చేస్తున్నారు? కమ్యూనిస్టు నాయకులు చూసిన కోణం వేరు. ఈ 550 ఎకరాల నల్లరేగడి నేల చదునైనది, సారవంతమైనది, వెంటనే దుక్కిదున్ని పండించుకోదగినది. ఈ భూమిని రైతులు తీసుకుని, వాటికి బదులుగా ప్రభుత్వానికి వదులుకునే వాళ్ళ సొంత భూముల్లో అక్కడక్కడ పంటలు పండొచ్చేమో కాని, అధికభాగం రాళ్ళూ, రప్పలు, గుంటలు, గుట్టలు. ఆ భూమిని భూమిలేని పేదలకు ప్రభుత్వం పంచిపెట్టాలా?

ఇలా కమ్యూనిస్టులు ఎదురుతిరిగే నాటికి ఎం.ఎల్.సి. పురుషోత్తమరెడ్డి గారు మంత్రి అయిపోయారు. ఆర్.డి.ఓ. పంపిన ప్రతిపాదన మీద ప్రభుత్వం నుంచి ఆదేశాలేవీ ఇంకా రాలేదు. కానీ నా దగ్గర తహశీల్దారుగా పనిచేస్తున్న గోపాలం మంత్రిగారికి ప్రైవేట్ సెక్రటరీగా చేరిపోయారు. ఇప్పుడు ఈ భూ వివాదానికి వచ్చిన కొత్తరంగు ఏమిటంటే ఈ వివాదం 'మంత్రిగారి' ఊళ్ళోది.

మంత్రి కాకముందు పురుషోత్తమరెడ్డి గారు కూడా గ్రామపెద్దల నిర్ణయంలో భాగస్వామి. ఆర్.డి.ఓ. పంపిన ప్రతిపాదన అమలు జరిగితే పురుషోత్తమరెడ్డి గారి కుటుంబ మాన్యం లోంచి సుమారు 70 ఎకరాల చవుడు, రాళ్ళు, రప్పల భూమి ప్రభుత్వానికి సంక్రమిస్తుంది. అంతే పరిమాణంలో ఈ నల్లరేగడి భూమిలో వాటా రెడ్డిగారి కుటుంబానికి దక్కుతుంది.

పురుషోత్తమ రెడ్డి గారు మంత్రి అయ్యే ముందువరకూ నివురుగప్పిన నిప్పులా ఉన్న ఈ భూ వివాదం ఒక్కసారిగా రాజుకుని ఉద్యమజ్వాలగా మారింది.

"... ప్రభుత్వం ఇచ్చే భూములు రైతులు వదులుకునే పనికిరాని భూములా?... మంచి భూముల్ని కామందులకి పంచి, పేదల నోట్లో రాళ్ళూ, రప్పలు వేస్తారా?... అయినా ప్రభుత్వం తన తుది నిర్ణయం ఇవ్వక మునుపే ప్రభుత్వ భూమిని రైతులు ఎలా ఆక్రమించుకుంటారు?... ఎలా దుక్కి దున్నేసి పంటలు పండిస్తారు?..." ఇలాంటి ప్రశ్నలతో కమ్యూనిస్టు ఉద్యమం ఊపందుకుంది.

ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఆ 550 ఎకరాల నల్లరేగడి నేలలో ఎక్కడెక్కడ రైతులు పంటలు పండించారో ఆ దిగుబడి మొత్తాన్ని స్వాధీనం చేసుకోవాలనీ, ఆ భూమినే భూమిలేని పేదలకు పంచిపెట్టాలనీ కమ్యూనిస్టు ఉద్యమం డిమాండు చేసింది. ఒకవేళ నిరుపేదలకు అక్కడ భూమి పంపిణీ చేసే ప్రతిపాదనకు ప్రభుత్వం సుముఖంగా లేని పక్షంలో, గతంలో ప్రతిపాదించిన మోడల్ వ్యవసాయ పరిశోధనా క్షేత్రాన్ని అక్కడ ఏర్పాటు చేయాలని కూడా డిమాండు చేసింది.

కమ్యూనిస్టు ఉద్యమం వేడెక్కింది. ధర్నాలు, ప్రదర్శనలతో గ్రామం అట్టుడికిపోతోంది. "భూస్వాముల కుట్ర"ని సాగనివ్వరాదని కమ్యూనిస్టులూ, "మావాడే మంత్రి అయ్యాక ఎలా ఆపగలరో చూస్తాం" అని రైతులూ పంతాలు పెంచేసుకున్నారు. రైతులనబడే భూస్వాములకి కాంగ్రెసు మంత్రి మద్దతు ఉంది కాబట్టి, ఎట్టి పరిస్థితుల్లోనూ దీన్ని జరగనివ్వకూడదని కమ్యూనిస్టులు హోరాహోరీ రాజకీయ పోరుకి సిద్ధమయ్యారు. ఆ గ్రామంలో రెచ్చిపోయిన ఆవేశాలు, ప్రకటనలు, ప్రదర్శనలు రాజధానిలో రాజకీయ ప్రకంపనలకు దారితీశాయి.

ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డికి ఈ ఉద్యమం గోల చికాకనిపించింది. పైగా మాటిమాటికీ కాంగ్రెసు మంత్రిపేరు బయటకు వస్తోంది. నల్గొండ జిల్లా రాష్ట్ర రాజధానికి పక్కనే ఉండడం వల్ల ఇక రేపోమాపో హైద్రాబాద్‌లో కూడా కమ్యూనిస్టులు శిబిరాలు వేసి, ప్రదర్శనలు సాగించే పరిస్థితి ఏర్పడింది.

శాంతి భద్రతల పరిస్థితి దృష్ట్యా ఈ అంశంలో వాస్తవ పరిస్థితిపై ఒక నివేదికను తెప్పించవలసిందిగా ముఖ్యమంత్రి ఆదేశించడంతో భువనగిరి సబ్ కలెక్టర్ చేత ఇనస్పెక్షన్ చేయించి, రిపోర్టు తెప్పించమంటూ చీఫ్ సెక్రటరీ ఆదేశాలు జారీచేశారు. అలా... నేను రంగంలోకి దిగాల్సి వచ్చింది. సర్వీసులోకి వచ్చాక మొదటిసారిగా రాజకీయ దుమారం రేపిన వివాదం మీద వాస్తవ పరిస్థితిని అంచనా వేయటం కాబట్టి నేను చాలా జాగ్రత్తగా ప్రతి అడుగు ఆచితూచి వేశాను.

బహిరంగ తనిఖీకి నోటీసులు జారీ చేశాను... ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలో ఎలాంటి శాంతిభద్రతల పరిస్థితి తలెత్తకుండా పోలీసు బందోబస్తుకి ఆదేశాలిచ్చాను.... తాలూకాఫీసులో రికార్డులు రెడీ చేయించాను...

ఈ ఏర్పాట్లు జరుగుతున్నప్పుడు మంత్రిగారి ఊరినుంచి మంత్రిగారి మద్దతుదారు ఒకరు నా దగ్గరకు వచ్చారు. ఆయన వాదన వేరుగా ఉంది. "సర్! ఈ భూముల పంపిణీ ప్రతిపాదనకి కారణం గ్రామస్థుల నిర్ణయం. ఆ రోజు పురుషోత్తమరెడ్డి గారు కూడా గ్రామస్థులలో ఒకరుగా ఈ నిర్ణయాన్ని బలపరిచారు. ఇప్పుడు ఆ నిర్ణయాన్ని మీరు తిరగతోడితే మంత్రిగారు ఆరోజు తాను సమర్థించిన గ్రామస్థుల నిర్ణయాన్ని ఎలా తిరస్కరించగలరు? అదే మాటకు ఇప్పుడు కూడా కట్టుబడి ఉండకపోతే ఆయన ప్రతిష్ఠ ఏమవుతుంది? ఆయన రాజకీయ మనుగడకే ఇది సవాల్. ఇప్పుడిది మంత్రిగారి పరువు ప్రతిష్ఠకి సంబంధించిన విషయం మాత్రమే కాదు, అధికార పార్టీ ప్రతిష్ఠ కూడా. అయినా మేం తీసుకునే భూములకి బదులు, మా భూములు ఇస్తున్నాం గదా! దీనిమీద ఇంత పంచాయితీ ఎందుకు సర్?..." అంటూ ఆ మద్దతుదారు నాకు నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు.

నాకూ మనసులో పీకుతోంది. మంత్రిగారి గ్రామం గొడవలో నన్నిరికించారేమిటబ్బా అని.

సర్వీసులోకి వచ్చేటప్పుడు ప్రతిజ్ఞ చేస్తాం - రాజ్యాంగానికి కట్టుబడి, రాజ్యాంగాన్ని కాపాడుతూ పని చేస్తామని. రాజ్యాంగ పరిధిలో, రాజ్యాంగ పరిభాషలో చెప్పాలంటే ప్రభుత్వ ఆదేశాలను పాటించడమే నేను చేయాల్సిన పని.

అదే చెప్పాను ఆ మద్దతుదారుకి. "ఇనస్పెక్షన్‌ని రద్దు చేస్తున్నట్లుగా చీఫ్ సెక్రటరీ నుంచి ఆదేశాలిప్పించడయ్యా, చాలు" అన్నాను. అతనికి నా తత్వం అర్థమయింది. వాదించకుండా వెళ్ళిపోయాడు.

ఇనస్పెక్షన్‌కి రంగం సిద్ధమయిపోయింది. తెల్లవారితే ఇనస్పెక్షన్ అనగా ఆ రాత్రి మంత్రిగారి ప్రైవేట్ సెక్రటరీ గోపాలం (అంతకు ముందు నా క్రింద తహశీల్దారు) ద్వారా మంత్రిగారు కబురు పంపారు. గోపాలం చాలా విషయాలు చెప్పాడు. 'సర్, మంత్రిగారు అనేదేమిటంటే మీరు ఇప్పుడు ఇనస్పెక్షన్‌కి ఆ ఊరికి వెళ్తే శాంతి భద్రతల సమస్య తలెత్తుతుంది. అక్కడంతా ఉద్రిక్తంగా ఉంది. కాబట్టి ఇనస్పెక్షన్‌ని ఏదో కారణం చూపించి రద్దు చేస్తే మంచిదని చెప్పమన్నారు..... మరోమాట కూడా చెప్పమన్నారు. ఈ భూములు తాము తీసుకుని తమ భూముల్ని ప్రభుత్వానికి ఇవ్వాలన్నది గ్రామస్థుల సామూహిక నిర్ణయమేననీ, ఆరోజు అందులో తానుకూడా ఒకడ్ని మాత్రమేననీ, అంతకు మించి ప్రత్యేకంగా ఆ భూముల్ని కబ్జా చేయాలన్న తాపత్రయం తన కుటుంబానికి లేదని కూడా సార్ చెప్పారు... ఇంకో మాట సర్, ఇప్పుడు ఉద్యమం చేస్తున్న జనంలో తమ ఊరివాళ్ళు ఎవరూ లేరనీ, ఇతరగ్రామాల వాళ్ళని ప్రోగుచేసి, కేవలం తనను అప్రతిష్ఠపాలు చేయడం కోసమే కమ్యూనిస్టులు ఈ ఉద్యమం తలపెట్టారని కూడా సార్ చెప్పమన్నారు....."

మధ్యలో అడ్డు తగిలాను. నాకు సుదీర్ఘంగా ఎవరన్నా చెబితే (విషయం అర్థమయ్యాక) చివరిదాకా వినే అలవాటు లేదు. మంత్రిగారి కవిహృదయం అర్థమైపోయింది కదా! ఇంకా కథలెందుకు? "గోపాలం! నా సంగతి నీకు ఈ పాటికే తెలిసుండాలి" అంటూ గోపాలం వాక్ప్రవాహాన్ని ఆపేశాను.

గోపాలం అంత తేలిగ్గా వదల్లేరు. (తరువాత కాలంలో చాలా సమర్థుడైన ప్రైవేట్ సెక్రటరీగా గోపాలం సెక్రటేరియట్‌లో పేరు తెచ్చుకున్నారు.) "సార్, చివరగా ఒక్కమాట, మంత్రిగారికి మీ గురించి కూడా తెలుసు. అందుకే ఆయన ఇప్పుడు అనవసరమైన ఉద్రిక్తత తలెత్తకుండా కనీసం ఇనస్పెక్షన్‌ని కొన్నిరోజుల పాటు వాయిదా వేయించమన్నారు. ఆ లోపల రైతులు వాళ్ళ పంటని వాళ్ళు కోసుకు వెళ్ళిపోతారు. అనక ప్రభుత్వ నిర్ణయం ఎలాఉంటే దానికే కట్టుబడి ఉంటాం అనికూడా చెప్పారు..."

గోపాలాన్ని ఇంక నేను చెప్పనివ్వలేదు. "మంచిది గోపాలం, నువ్వు చెప్పాల్సింది చెప్పావ్, కానీ నేను ఇప్పటికే నోటీసులు జారీ చేసేశాను. పోలీసు బందోబస్తుకి రిక్విజిషన్ (అభ్యర్థన) ఇచ్చాను. ఇప్పుడు ప్రభుత్వం ఆపమంటే తప్ప నాకుగా నేను ఆపడం సాధ్యపడదు. ఇదేమాట మంత్రిగారికి చెప్పండి, వారు ప్రభుత్వం ద్వారా తనిఖీ ఆపిస్తానంటే నాకు అభ్యంతరం లేదు..." అంటూ ఆ సంభాషణ ముగించాను.

ముందు ప్రకటించిన ప్రకారం - మర్నాడు నేను బహిరంగ తనిఖీకి వెళ్ళాను. వాస్తవ పరిస్థితిని చూసి, యధాతథంగా ఒక రిపోర్టు తయారు చేశాను. నా రిపోర్టు ప్రభుత్వానికి చేరే లోపల మంత్రిగారి మద్దతుదారులైన రైతులు హైకోర్టులో రిట్ వేశారు. ఫలితంగా, హైకోర్టు కేసు విచారణ తేలేవరకూ 'యధాతథస్థితి'ని కొనసాగిస్తూ స్టే ఉత్తర్వులు జారీచేసింది. అంటే

- కేసు తేలేవరకూ ఎవరి కబ్జాలో ఉన్న భూమి వాళ్ళ కబ్జాలోనే ఉంటుంది! కాబట్టి ప్రభుత్వ భూమిలో తాము పండించిన పంటని రైతులు ఆనందంగా కోసుకుపోవచ్చు.

(మరి హైకోర్టులో రిట్‌ని స్వీకరించినప్పుడు ప్రభుత్వ న్యాయవాది శివశంకర్‌గారు ప్రభుత్వం తరఫున వాదించాలి కదా! ఏం వాదించారు? తనకి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ లేవని చెప్పి ఊరుకున్నారు. దానికోసం నేను ఈ వివాదం పూర్వాపరాలన్నీ తీసుకుని ప్రభుత్వ న్యాయవాది దగ్గరికి పరుగెత్తాల్సి వచ్చింది - స్టే వచ్చాకనే).

మొత్తం మీద హైకోర్టులో రిట్ ఎందుకు దాఖలయిందో నాకు అర్థమైపోయిందనుకున్నాను. ఇకముందు ఈ వివాదం విషయంలో ఇంకా అప్రమత్తతతో ఉండాలనుకున్నాను. అంత శ్రమ నాకు కలగకుండా మంత్రిగారే స్వయంగా మా ఇంటికి వచ్చారు!

"ప్రసాద్ గారూ! ఇది నా రాజకీయ ప్రతిష్ఠకి సంబంధించిన విషయం. మీది ముక్కుకి సూటిగా పోయే తత్వం. మంచిదే. మీ విధానాలు మీవి. మా రాజకీయాలు మావి. నా కోసం మీ

విధానాలు మార్చుకోమని చెప్పను. కాని మీరు అభ్యంతర పెట్టకపోతే మిమ్మల్ని బదిలీ చేయించి ఇంకో ఆర్.డి.ఓ.ని తెచ్చుకోవాలనుకుంటున్నాను...." అంటూ మర్యాదపూర్వకంగా చెప్పారు. ఆయన నా ఇంటికి రావలసిన అవసరమూ లేదు, నన్ను ఒప్పించాల్సిన అవసరమూ లేదు. వాళ్ళ రాజకీయ వత్తిడులు వాళ్ళవి. ఏమైనా మంత్రిగారు స్వయంగా ఇంటికొచ్చి చెప్పడం ఆయన సంస్కారానికి అద్దం పట్టింది.

మంత్రి వచ్చి చెప్పినంత మాత్రాన వెంటనే బదిలీ జరిగిపోతుందా? నా టరమ్ అయ్యేదాకా ఉంటా కదా అనుకున్నాను. అనుకుంటూనే ఉన్నాను.... అంతలో, రెండోరోజునే నా బదిలీ ఉత్తర్వులు వచ్చేశాయి!!

నన్ను భద్రాచలం సబ్ కలెక్టరుగా బదిలీ చేశారు. నా బదిలీని నిరసిస్తూ కమ్యూనిస్టులు ఆందోళనకు, 'ఛలో అసెంబ్లీ' ప్రదర్శనకూ దిగారు.

నా సర్వీసులో తగిలిన తొలి 'రాజకీయ బదిలీ' దెబ్బ నుంచి కోలుకునే లోపల – భద్రాచలం వెళ్ళడానికి లారీలోకి సామాను ఎక్కిస్తుంటే – ప్రణాళికా శాఖ కార్యదర్శి (ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి గారికి సన్నిహితుడైన) బి.పి.ఆర్. విఠల్ టెలిఫోన్ చేశారు – "మీ బదిలీ గురించి ప్రభుత్వం పునరాలోచిస్తోంది. తొందరపడి భద్రాచలం వెళ్ళవద్దు". ఆయన మరోమాట కూడా చెప్పారు, "ఎవరితోనూ అనకండి... మంత్రిగారిని పిలిచి ముఖ్యమంత్రి గారు గట్టిగా చెప్పారు. ఎం.ఎల్.ఏ.గానూ, సమితి ప్రెసిడెంటుగానూ చేయగలిగిన అనేక వ్యవహారాల్ని మంత్రిగా ఉంటే చేయలేం. మంత్రి అయినదగ్గర్నుంచీ అందరి కళ్ళూ మనమీదే ఉంటాయి. రోడ్డుకెక్కే పరిస్థితి వస్తోందంటే ప్రతిష్ఠ కోసం పంతానికి పోకూడదయ్యా అన్నారు... ఇది మీ వరకే సుమా".

నా భద్రాచలం ప్రయాణం ఆగిపోయింది. కొద్దిరోజుల్లో కొత్తగా జిల్లాకి మంజూరయిన చిన్నరైతుల అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్‌గా నన్ను నియమించారు.

* * *

అందుకే, ఒకవేళ నన్ను ముఖ్యమంత్రి చీవాట్లు పెట్టి, మహా చేస్తే బదిలీ చేస్తారు, అంతేగదా – అనుకొని, దానికి సిద్ధపడి ముఖ్యమంత్రిగారి వైర్‌లెస్ 'సమన్ల'కి తలవంచి హైద్రాబాద్ బయల్దేరాను.

సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్ళాను. ముఖ్యమంత్రి గారు అసెంబ్లీలో ఉన్నారన్నారు. అక్కడికి వెళ్ళాలా వద్దా? ఇక్కడికి ఆయన రాకపోతే...? నన్ను ఆగమేఘాల మీద పంపించమని కదా కలెక్టరుకి వైర్‌లెస్ మెసేజ్. ఆలస్యం చేస్తే ఇది కూడా ఆయనకి కోపం తెప్పించవచ్చు.

అసెంబ్లీకి వెళ్ళాను. 'పాత' అసెంబ్లీ భవనంలో ముఖ్యమంత్రి ఉండే ఛాంబరులో మొట్ట మొదటిసారిగా అడుగు పెట్టాను. సి.ఎం. ఏం అడుగుతారో తెలీదు కనుక చంకలో నా చిన్నరైతుల

అభివృద్ధి సంస్థ తాలూకు కార్యకలాపాల్ని తెలిపే పెద్ద ఫైలు పట్టుకుని లోపలకు వెళ్ళేసరికి అక్కడ సందర్శకుల గదిలో నలుగురైదుగురు మంత్రులూ, చీఫ్ సెక్రటరీ, కొంతమంది సీనియర్ అధికారులూ, ఎం.ఎల్.ఏ.లూ కూడా నిరీక్షణలో ఉన్నారు.

చీఫ్ సెక్రటరీకి నమస్కారం పెట్టి, ముఖ్యమంత్రిగారి సెక్యూరిటీ ఆఫీసర్ సీతాపతిని కలిసి, "నాపేరు పి.వి.ఆర్.కె. ప్రసాద్, నల్గొండ నుంచి...." అని పూర్తి చేసేలోపల సీతాపతి అందుకున్నాడు. "మీ కోసమే ముఖ్యమంత్రి అడుగుతున్నారు." కాళ్ళల్లో వణుకు మొదలైంది.

సీతాపతి లోపలికెళ్ళి వచ్చి, "సి.ఎం. గారు రమ్మంటున్నారు" అని నన్ను లోపలికి పంపించాడు. ఇక్కడ ఇంతమంది నిరీక్షిస్తుంటే ముఖ్యమంత్రి నన్ను లోపలికి రమ్మన్నారా? అయిపోయాం. మరోసారి 'అన్నిటికీ సిద్ధంగా ఉన్నాను' అనుకొని లోపలికి అడుగు పెట్టాను.

కాని.....

ముఖ్యమంత్రి నన్ను చిరునవ్వుతో ఆహ్వానించారు. "రండి ప్రసాద్, కూర్చోండి" అన్నారు.

"నువ్వేదో సామూహిక బావుల ప్రయోగం చేస్తున్నావట కదా! మార్గదర్శక సూత్రాలకి విరుద్ధంగా కూడా చేస్తున్నావన్నారు. ఈ విషయం నాలుగురోజుల క్రితం జరిగిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. ప్రధానమంత్రి కూడా ఈ అంశం గురించి నన్ను అడిగారు..." ముఖ్యమంత్రి చెబుతున్నారు.

నాకు చెమటలు పట్టేస్తున్నాయి. క్షణాల్లో నాకు – కేంద్రప్రభుత్వం నుంచి అదనపు కార్యదర్శి రామకృష్ణయ్య గారు వచ్చి నల్గొండ జిల్లాలో ఈ ఎస్.ఎఫ్.డి ఏ పథకం అమలుని తనిఖీ చేయడం, నేను చేస్తున్న ప్రయోగమైతే బాగుంది కానీ ఈ పథకం యొక్క మౌలిక మార్గదర్శక సూత్రాలకు విరుద్ధంగా చేస్తున్నానని విమర్శించడం, తొందరపడి 300 బావులు తవ్వించి చాలా ఖర్చు చేసేశానని మందలించడం.. జ్ఞప్తికొస్తోంది.

* * *

ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ఈ చిన్నరైతుల అభివృద్ధి సంస్థ చేయాల్సిన పని – చిన్న, సన్నకారు రైతులయిన వ్యవసాయ కూలీలకు వ్యవసాయ పనులు లేనిరోజుల్లో సామాజిక, సామూహిక పనులు చేపట్టడం. అంటే, ముఖ్యంగా వేసవికాలంలో వ్యవసాయ పనులుండవు కాబట్టి ఆ కాలంలో వీళ్ళకి జీవనాధారం కల్పించాలన్నది ఇందిరాగాంధీ ఆలోచన. (2005లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మూలం ఇది). ఇందుకోసం వేసవికాలంలో వాళ్ళచేత చెరువుల మరమ్మత్తులు, కొత్త చెరువుల త్రవ్వకం, స్కూలు భవనాల నిర్మాణం, రోడ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టి, వాటిద్వారా వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలి. చెరువులు నిర్మింపజేసినా, సాగునీటి చెరువుల్లో పూడిక తీయించినా ఆ చెరువుల

క్రింద ఆయకట్టులో అధికభాగం పెద్దరైతులదే కనుక ఆ పనులవల్ల ప్రయోజనం పొందేది కూడా వాళ్ళే. వ్యవసాయ కూలీలకు లభించేది పనిచేసిన రోజులకు కూలీ మాత్రమే. ఇదేం సన్నకారు రైతుల అభివృద్ధి?

చిన్న, సన్నకారు రైతులు అంటే రెండున్నర ఎకరాల లోపు మెట్టభూమి ఉన్నవాళ్ళు. అధికభాగం హరిజనులే. ఈ చెరువులు, రోడ్లకి బదులు వాళ్ళ పొలాల్లో బావులు త్రవ్విస్తే వాళ్ళకి సేద్యానికి ఉపయోగపడుతుంది కదా! కాని వాళ్ళలో చాలామందికి ఉన్నవి ఇనాం భూములు. అంటే, అనుభవించే హక్కే ఉంటుంది. అలాంటి భూముల మీద అప్పూ పుట్టదు, రాయితీలు ఇవ్వకూడదు. పైగా ఇనాం భూములు ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లాంటివి కాదు. ప్రైవేట్ భూముల క్రింద లెఖ్ఖ. కాబట్టి వాటికోసం ఎలాంటి నిధుల్నీ ప్రభుత్వం ఖర్చుపెట్టకూడదు..... ఇవన్నీ నిబంధనలు.

నాకెందుకో పథకం తాలూకు నిధులు ఎంత ఖర్చు పెట్టినా శాశ్వత లబ్దిదారుడు పెద్దరైతు మాత్రమేననీ, వ్యవసాయ కూలీ ఆ రోజుకి కూలి తెచ్చుకునే కూలీగానే ఉండిపోతున్నాడనీ అనిపించింది. ఆలోచించగా, చెరువులు త్రవ్వించే అవకాశం పథకంలో ఎలాగూ ఉంది కాబట్టి, ఎక్కడెక్కడ చాలామంది చిన్న, సన్నకారు రైతుల (ఇనాం) భూములు, పట్టాభూములు ప్రక్కప్రక్కన ఉంటాయో అలాంటిచోట్ల ప్రతి 10-15 ఎకరాల విస్తీర్ణానికి ఒక సామాజిక సేద్యపునీటి బావిని తవ్విస్తే (చెరువు తవ్వించినట్లు)...! ఆ తవ్వే పనిని వాళ్ళచేతే చేయిస్తాం. వాళ్ళకే కూలీ ఇస్తాం. పని పూర్తయ్యాక ఆ సేద్యపు బావి ప్రయోజనం శాశ్వతంగా వాళ్ళకే దక్కుతుంది గదా!

బావి తవ్వాక నీటిని పైకి తోడిపోయడానికి పంప్‌సెట్ కావాలి. పంప్‌సెట్‌ల ఏర్పాటుకి 50శాతం రాయితీ మాత్రమే ఇచ్చేందుకు పథకంలో వెసులుబాటు ఉంది. అందుచేత బావి త్రవ్వేటప్పుడు వాళ్ళకిచ్చే కూలిలో కొంతభాగాన్ని పంప్‌సెట్‌కి వాళ్ళ వాటా సొమ్ముగా మినహాయించుకుందాం. అలా బావి త్రవ్విన రోజుల్లో వాళ్ళ కూలుల్లోంచి మినహాయించిన సొమ్ముకి అంతే పరిమాణంలో రాయితీ సొమ్ము జతపరిచి పంప్‌సెట్ కొనిచ్చేస్తాం. (వాళ్ళ వాటాసొమ్ము పంప్‌సెట్ వ్యయంలో 50 శాతం కన్నా ఎక్కువుంటే, అది వాళ్ళకే తిరిగి ఇచ్చేస్తాం).. ఇలా చేయడం వల్ల నిజమైన చిన్న, సన్నకారు రైతులకి ఎండాకాలంలో కూలీ లభిస్తుంది. వాళ్ళ పొలాలు సాగు చేసుకొనేందుకు శాశ్వతమైన నీటివనరు సమకూరుతుంది.

ఇలా ఆలోచించి, ఈ పద్ధతిలో కేంద్ర నిధులతో మూడు వందలకి పైగా సామాజిక (సేద్యపు) బావుల్ని తవ్వించాను. కానీ.... చిన్న, సన్నకారు రైతుల అభివృద్ధి పథకంలో నిధుల్ని ఇలా ఖర్చు పెట్టేందుకు మార్గదర్శక సూత్రాలలో ఎక్కడా వెసులుబాటు లేదు. లేకపోతే ఏంటి!

ఎవరికోసం ఈ పథకం ఉద్దేశించబడిందో వాళ్ళకి ప్రయోజనం చేకూరుతోంది కదా!... ఇది నా ఆలోచన.

రామకృష్ణయ్య గారు నా 'ఆలోచనని అభినందించారు కానీ మూడొందల బావులకి ముందస్తు ఆమోదం లేకుండా నిధుల్ని ఖర్చుపెట్టి, నేను నిబంధనల్ని ఉల్లంఘించాననీ, ఈ చర్యని ప్రధానమంత్రి అధ్యక్షురాలిగా ఉన్న గ్రామీణాభివృద్ధి కమిటీ ఆమోదించవలసి ఉంటుందనీ, కమిటీ ఆమోదించకపోతే తానేమీ చేయలేననీ.....!!

★ ★ ★

ఆకస్మాత్తుగా ముఖ్యమంత్రి కంఠస్వరం పెరిగింది.

"ప్రసాద్ వింటున్నావా?"

"సర్, సర్"

"ప్రధానమంత్రి ఈ పథకాన్ని అమలు చేస్తున్న తీరు గురించి ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రస్తావించి, ఇది మీ రాష్ట్రంలోనే అమలు జరుగుతోంది రావు గారూ - అని చెప్పేదాకా నాకే తెలీదు... ఇప్పుడు నువ్ చేస్తున్న విధంగానే దేశమంతటా వెనుకబడిన ప్రాంతాల్లో 'మిలియన్ వెల్స్' (పదిలక్షల బావులు) త్రవ్వించే పథకం అమలు చేయాలని ప్రధానమంత్రి సంకల్పించారు. నీకు అభినందనలు..."

"ఆ...." నోరు వెళ్ళబెట్టాను.

ఏం జరుగుతోందో అర్థం చేసుకునే లోపల మళ్ళీ ముఖ్యమంత్రే అందుకున్నారు.

"నాకు ప్రైవేట్ సెక్రటరీ (అంతరంగిక కార్యదర్శి) గా ఒక ఐ.ఏ.ఎస్. అధికారిని తీసుకోవాలనుకుంటున్నాను. నీకు అభ్యంతరం లేకపోతే నిన్నే తీసుకుంటాను... ఇదివరకెప్పుడూ సెక్రటేరియేట్‌లో నువ్ పనిచేసినట్లు లేదు. అయినా ఫరవాలేదు. మూడు నాలుగు నెలలు చేసి చూడు. నీకు నచ్చకపోయినా, నాకు నచ్చకపోయినా మార్చుకోక తప్పదు కదా! సమన్వయశక్తి, సమయస్ఫూర్తి, సహనం ఉంటే ఇక్కడ పనిచేయడం సులభం.... ఇంతకీ ఎప్పుడొచ్చి చేరగలవ్?..."

"ఆ!...ఆ!... మీ - మీ ఇష్టం సర్...."

మరో వారం రోజుల్లో ముఖ్యమంత్రి కార్యాలయంలో చేరిపోయాను.

వైర్‌లెస్ మెసేజ్‌లు ఒక్కోసారి ఇలాంటి పరిణామాలకి కూడా సంకేతాలని అప్పుడే మొదటిసారి తెలుసుకున్నాను.

★ ★ ★

నాకు 'నచ్చని భూసంస్కరణలు'

1996 జూలై...

డెప్యుటేషన్ మీద కేంద్ర ప్రభుత్వంలో ఎనిమిదేళ్ళకు పైగా పనిచేసి (చివరి నాలుగేళ్ళూ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుగారి దగ్గర అదనపు కార్యదర్శిగా, మీడియా సలహాదారుగా పనిచేసి), ఎన్నికల తరువాత రాష్ట్రానికి తిరిగివచ్చిన నన్ను భూసంస్కరణల కమీషనర్‌గా రాష్ట్రప్రభుత్వం నియమించింది.

ఈ భూసంస్కరణల అమలుకి సంబంధించి ముఖ్య కార్యదర్శిస్థాయిలో ఇంకా ఒక పోస్టు వుందా? నాకు ఆశ్చర్యం వేసింది.

ఈ భూసంస్కరణలు అమల్లోకి వచ్చి 25 సంవత్సరాలయింది. అయినా, ఇంకా ఒక కమీషనర్ పోస్టు ఎందుకుందీ?

పోనీ, ఈ కమీషనర్ అమలుచేయాల్సిన భూసంస్కరణలేమైనా వున్నాయా? "ఇప్పుడు క్రిందిస్థాయిలో అమలు కావాల్సింది ఏమీలేదు సర్" అంటున్నారు నా సిబ్బంది.

సంస్కరణల ఫలితాలను తిరగతోడి, నిజమైన భూస్వాముల నుంచి ఖచ్చితమైన మిగులు భూముల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదా? లేదా- అని రాష్ట్రమంతా జల్లెడపట్టే పనిని ఈ కమీషనర్‌గా నేను చేయొచ్చునా? "అలాంటి విధులేవీ ఈ పోస్టులో లేవు సర్"... అన్నారు.

మరి ఏం చేయాలి?

"భూసంస్కరణల అమలు వల్ల ఏర్పడ్డ న్యాయపరమైన చిక్కులు ఏవైనా ఎక్కడైనా మిగిలివుంటే వాటిని పరిష్కరించాలి సర్" అన్నారు.

పోనీ, ఈ భూసంస్కరణలవల్ల ఎన్ని లక్షల ఎకరాలు ప్రభుత్వానికి వచ్చిందీ, అందులోంచి ఏ మేరకు పేదలకు పంపిణీ అయ్యిందీ, ఇందుకోసం ఎంత ఖర్చయిందీ... వగైరా లాభనష్టాల పట్టిక ఏమైనా వుందా?

"గణాంకాల విషయంలో చాలా అయోమయం వుంది సర్..."

ఎంత విచిత్రం?

భూసంస్కరణలనే పథకాన్ని ఒక మహత్తర ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం - దేశంలోనే తొలిసారిగా - సమగ్రంగా రాష్ట్రంలో అమలుచేసింది. ఈ సంస్కరణల అమలుకోసం ఎంతమంది అధికారులు, సిబ్బందీ పనిచేశారు?

ఎన్ని భూసంస్కరణల ట్రిబ్యునల్స్ పనిచేశాయి?

ఎన్నికోర్టుల్లో లిటిగేషన్‌ల మీద పోరాడడంకోసం ఎంత ఖర్చయింది?

ఇలా పాతికేళ్ళలో ఖర్చయిన మొత్తాన్ని, భూసంస్కరణలవల్ల సంక్రమించిన మిగులు భూముల విలువని పోల్చిచూస్తే... ఎంత ఖర్చుపెట్టి ఎన్ని లక్షల ఎకరాల్ని సేకరిస్తే, ఎంతమందికి పంచిపెట్టామో తెలుస్తుంది కదా!

ఇలా ఆలోచిస్తున్నప్పుడు ఒక లాయర్ మిత్రుడు వచ్చాడు. హైకోర్టులో ఇలాంటి సివిల్ కేసులు కొన్ని వందల్లో వాదించివుంటాడు.

మాటల్లో నాకొచ్చిన సందేహం చెప్పాను.

ఒక విచిత్రమైన నవ్వు నవ్వాడు. అతని విశ్లేషణ వేరు.

"ప్రసాద్‌గారూ! భూసంస్కరణలవల్ల ప్రజలకు చాలా లాభాలు జరగాల్సివున్నమాట నిజం. ఎంతోకొంత జరిగే వుంటుంది. కాని మీరు సంస్కరణల బూచిని చూపెట్టి, ప్రజలనుంచి బలవంతంగా భూముల్ని విభజించి, 'మిగులు భూమి' అంటూ లాక్కున్నారు, చూడండి. ఆ విధానం మాలాంటి లాయర్లకి చేసిన మేలు అపారం. ఈ పాతికేళ్ళలో భూసంస్కరణల కేసులకోసం మీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ట్రిబ్యునల్స్‌లోనూ, అప్పీళ్ళకోసం హైకోర్టు, సుప్రీంకోర్టులోనూ అడుగుపెట్టిన ప్రతిలాయరూ అమోఘంగా బాగుపడ్డారు."

"కాని పేదవాళ్ళకి - భూమిలేనివాళ్ళకి భూమి పంపిణీ జరిగింది కదా!"

"చూసుకోండి ఎంత జరిగిందో! ఏదో మీ కంటికి కనిపించే చల్లపల్లి రాజాలాంటి జమీందారుల భూములతో సమారాధన చేసిందే లెఖ్ఖనుకోకండి..." అంటూ ఆ లాయరు కొన్నిపాత సంఘటనలు చెప్పుకొచ్చాడు.

భూసంస్కరణల చట్టం ప్రకారం ఒక కుటుంబం వుంచుకోదగిన కమతాల విస్తీర్ణంపై పరిమితి విధించబడింది. ఆయా ప్రాంత భూముల సారాన్ని బట్టి ఈ పరిమితి 10 ఎకరాల నుంచి 60 ఎకరాల వరకూ వుంది.

అందుకని 75 ఎకరాల మెట్టవున్న ఓ కామందు తనూ తన భార్యా కొద్దికాలం క్రితమే విడాకులు తీసుకున్నామనీ, విడివిడిగా వుంటున్నామనీ, తన పేరుమీద ఉన్న భూమి విభజన జరిగి, రిజిస్ట్రేషన్ జరిగేలోపల ఈ భూసంస్కరణల ఆర్డినెన్స్ వచ్చేసిందనీ, తమ 'విడాకుల జీవితం' ప్రకారం చెరో పాతికెకరాలు మిగులుతాయనీ కాబట్టి తనదగ్గర మిగులు భూమి అనేదే లేదనీ వాదిస్తూ ట్రిబ్యునల్‌కి వెళ్ళాడు. వాస్తవానికి ఆ భార్యాభర్తలిద్దరూ ఇప్పటికీ ఆనందంగానే అమెరికాలో కొడుకుల దగ్గర వున్నారు.

మరోకేసులో - 40 ఎకరాలున్న కుర్ర జమీందారు తన మైనారిటీ తీరని కొడుకుని తన బంధువులెవరికో (వాళ్ళు ఆస్తి, పాస్తులేమీ లేనివాళ్ళు) దత్తత ఇచ్చేశాననీ, దత్తత కార్యక్రమం

తాలూకు ఫోటోలు, సాక్ష్యాలు బోలెడున్నాయనీ, వాడి సంరక్షణకోసం వాళ్ళకి పాతికెకరాలు రాసిచ్చేశాననీ, రిజిస్ట్రేషన్ జరిగే లోపల ఆర్డినెన్స్ వచ్చేసిందనీ వాదిస్తూ లాయర్లనీ, కోర్టునీ ఆశ్రయించాడు.

ఒక ఆసామి తన 90 ఎకరాల భూమినీ తన దగ్గరే కౌలుదార్లుగా పనిచేస్తున్న నలుగురికి 'కృతజ్ఞతా' భావంతో బహుమతిగా పంచిపెట్టేశాననీ, రాతకోతలు ఎప్పుడో జరిగిపోయాయనీ, తన దగ్గర మిగులుభూమి అనేదే లేదనీ, ఇప్పుడు ప్రభుత్వం తన మిగులుభూమిని అప్పగించమనటం హాస్యాస్పదంగా వుందనీ వాదిస్తూ కోర్టుకెక్కాడు...

ఇలాంటి చాలా సంఘటనలగురించి నా లాయరు ఫ్రెండ్ చెప్పుకొచ్చాడు.

"ప్రసాద్‌గారూ! నాకు తెలిసి ఈ భూసంస్కరణల కేసులు చేపట్టి, బాగుపడని లాయరంటూ ఎవరూలేరు... ట్రిబ్యునల్ స్థాయిలో మేనేజ్ చేసుకుంటే చాలు - మిగులు భూమిని చూపించకుండా మిగుల్చుకోవచ్చు అన్నది చాలామంది భూస్వాముల అనుభవం. ఒకరకంగా చెప్పాలంటే మాలాంటి లాయర్లంతా ప్రభుత్వానికి ఋణపడి వుంటాం..." అంటూ ఓ నవ్వు నవ్వేశాడు.

నాకు 1971లో ఈ భూసంస్కరణల ఆర్డినెన్స్ తయారవుతున్న సమయంలో కార్మికశాఖా మంత్రి అంజయ్యగారు అన్నమాటలు గుర్తుకొచ్చాయి...

★ ★ ★

భూసంస్కరణల బిల్లు అంతా తయారైపోయి, మంత్రివర్గం చేత లాంఛనప్రాయంగా ఆమోదముద్ర వేయించుకునే చివరి నిమిషాల్లో ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావుగారు నన్ను లోపలికి పిలిపించారు.

అక్కడ మంత్రి అంజయ్య ఉన్నారు. ఆయన సమక్షంలోనే ముఖ్యమంత్రి నన్ను నిలదీశారు.

"ఏమిటయ్యా ఇది, ఇలాంటి సమయంలో నువ్వేదో విప్లవాత్మక ఆలోచనలు ప్రచారం చేస్తున్నావట...!"

నేను మాట్లాడలేదు. "తొందరపడ్డానా" అని అనుమానంతో బిగుసుకుపోయా.

ఆయన ఒత్తిడి చేశారు. "చెప్పు, ఏమిటీ 'విప్లవాత్మక' ధోరణి? అది కూడా ఈ సమయం లోనా?"

నేను సంకోచిస్తూనే, మరోసారి ఆయన రెట్టించేసరికి మెల్ల మెల్లగా చెప్పేశాను. అంతావిన్నాక, ముఖ్యమంత్రి సందిగ్ధంలో పడిపోయారు.

నాకు సందేహం కలిగింది. "నేను తప్పుచేస్తున్నానా?"

★ ★ ★

తెలంగాణ ఉద్యమం తరువాత కేంద్రం ఒక ప్యాకేజీ - ఆరు సూత్రాల పథకం వగైరా - తయారుచేసి, తెలంగాణ నాయకుని ముఖ్యమంత్రిగా చేయాలని నిర్ణయం చేయడంవల్ల

పి.వి.నరసింహారావుగారిని ఆ పదవి వరించింది..... రాయలసీమ, ఆంధ్ర, తెలంగాణా నాయకులకు అందరికి ఆమోదయోగ్యుడైన నాయకుని కోసం అధిష్ఠానవర్గం వెదికినప్పుడు, ప్రతినాయకునికి పెద్ద వ్యతిరేక వర్గం ఉండడంతో, సొంతవర్గంగాని, వ్యతిరేకవర్గంగాని లేని, ప్రతిభాపాటవాలుకల వ్యక్తిగా పేరున్న పి.వి.గారిని ఎంపికచేయడం జరిగింది. రాష్ట్రంలోని మరీ సీనియర్ నాయకులను కేంద్రంలో, యితర చోట్ల సర్దుబాటు చేసినా, ముఖ్యమంత్రి పదవిని ఆశించినవారూ, ఆశ కలవారూ రాజకీయంగా పివి గారి కంటే తమకు ఎక్కువ బలంవుందనుకునే సీనియర్లు కొందరు రాష్ట్రంలో ఉండనే వున్నారు - కొందరు మంత్రివర్గంలో, కొందరు బయట.

మంత్రివర్గ నిర్మాణం కూడా ఆ రోజుల్లో ఆ పరిస్థితులలో దాదాపు ఢిల్లీలోనే జరిగిందనవచ్చు. రాష్ట్ర విభజన కాకూడదనే సమైక్య ఆంధ్రనేతగా ఆయనకు మంచిపేరు వుండటంతో ముఖ్య పరిపాలకుడిగా పనిచేయడానికి మొదటి అవకాశం లభించింది. ఏం చేసినా, చెయ్యాలనుకున్నా, అనుకోకముందే ఢిల్లీకి కబురు అందజేసే కార్యకర్తలు కోకొల్లలు. ఢిల్లీలో ఇందిరాగాంధీకి పి.వి. గారంటే మంచి అభిప్రాయం ఉన్నా - అదొక్కటే సరిపోని రోజులు.

ఆవిడ చుట్టూ ఉన్న వాళ్ళందరినీ కలుపుకువెళ్ళడం ఆ రోజులలో కాంగ్రెసు ముఖ్యమంత్రులకు పెద్ద పరీక్ష. తనకు మద్దతునిచ్చేవాళ్ళు తప్పక కావాలి. అంతకంటే తనకు కనీసం వ్యతిరేకంగా ఉండేవాళ్ళు లేకుండా చూచుకోవడం చాలా ముఖ్యం.

అటువంటి పరిస్థితుల్లో, అంత స్వల్పకాలంలో పివిగారు చాలా సంస్కరణలు అమలు చేయడం జరిగింది. వైద్య విద్యారంగాల్లో సంస్కరణలే కాక, ముఖ్యంగా భూసంస్కరణల విషయంలో రాష్ట్రానికి దేశంలోనే మంచి పేరు తెచ్చి, తన ముద్రను వేసి, చరిత్రలో చిరస్థాయిగా నిలవడానికి ఆయన పునాది వేశారు.

1971లో నేను ఆయన దగ్గర కార్యదర్శిగా చేరే సమయానికే భూసంస్కరణల అమలుకు రంగం సిద్ధం చేసేశారు. చట్టపరంగాను, పాలనాపరంగాను అన్ని నిర్ణయాలూ తీసుకోబడి, చివరగా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వబోయే ముందు - మంత్రివర్గంలో చర్చకు వచ్చింది. ఒక్కొక్కకుటుంబానికి ఎంత మెట్ట భూమి, ఎంత మాగాణి - మెట్టకు మాగాణికీ వ్యత్యాసం ఎలా ఉండాలి, కుటుంబంలో ఎవరెవరికి విడివిడిగా యూనిట్స్ ఉండవచ్చు. హిందూ వారసత్వం ప్రకారం వచ్చే చట్టపరమైన ఇబ్బందులను తొలగించడం ఎలా? ఎవరెవరికి ఎటువంటి మినహాయింపులు చట్టం నుండి యివ్వాలి? వాటిని అమలు పరిచే యంత్రాంగం, నిర్ణయాలు చేసే విధానం, నిర్ణయాలపై అప్పీలుకు వెళ్ళే విధానం... ఇలా ఎన్నో విషయాల పై అదివరకే అధికార్ల స్థాయిలో, రాజకీయ పరంగా, చట్టపరంగా ఎన్నో చర్చలు జరిగాయి. మంత్రివర్గ సమావేశాల్లో ఎన్నోసార్లు చర్చలు జరిగాయి. అనంతరం... చివరిసారిగా మంత్రివర్గం ముందు ఈ విషయం ఉంచబడింది...

మంత్రివర్గ సమావేశానికి ముందు ఎజెండా వచ్చినప్పుడు చాలా కుతూహలంతో క్షుణ్ణంగా చదివేశాను. మంచి పథకం. అన్ని విషయాలూ కూలంకషంగా చర్చించారు. అంతా బాగుంది.

కాని నాకెందుకో సందేహం... అధికార్లు తయారుచేసిన పథకం - అధికార్లు అమలు చేయడానికి చేసిన పథకం - ఇంగ్లీషు వారి పరిపాలనలో లాగా ప్రజలమీద నమ్మకం లేక అధికారుల ద్వారా అమలుపరచడానికి చేసినట్లుగా అనిపించింది. దానికి తోడు మన రెవెన్యూశాఖలో గ్రామస్థాయిలో గ్రామ రికార్డులు, హక్కుల జాబితాలు చాలా లోపభూయిష్టం. అమ్మకాలు రిజిస్ట్రేషన్ చేసే అలవాటు లేని పరిస్థితి నెలకొంది. కౌలుదారులు ఎంతో మంది. చేసేవాడి పేరు రికార్డులలో ఉండదు. రికార్డులలో పేరున్న వాడికి భూమిలేక పోవడమో, ఉన్నా అతని ఆధీనంలో లేకపోవడమో, లేదా అతను అదివరకే చనిపోయి ఉండటమో జరుగుతూ ఉండేది. తాతపోయి 20 ఏళ్ళవుతున్నా మనుమలు భూములు సాగుచేస్తున్నా రికార్డుల్లో యింకా తాతపేరే ఉంటుంది.

ఈ పరిస్థితులలో మిగులు భూముల నిర్ధారణ సులువా? చేసినా, ట్రిబ్యునళ్ళ ముందర ఎన్నేళ్ళు? అప్పీలుకి వెళితే కోర్టుల్లో ఎన్నేళ్ళు...!! ఇప్పటికే కోర్టుల్లో భూమి తగాదా వ్యాజ్యంలో పడిందంటే తరాలు మారినా తీర్పులు రావని నానుడి. ఉద్దేశ్యాలు మంచివయినా ఆచరణలో చాలా యిబ్బందులుండేట్లు నాకు అనిపించింది.

దీనికి కారణం నేను అంతకు ముందు చేసిన ఉద్యోగంలోని అనుభవం. అప్పటికి నా మొత్తం సర్వీసు నాలుగేళ్ళే. కాని చిన్న, సన్నకారు రైతుల, వ్యవసాయ కూలీల పథకం ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన (కొంచెం తక్కువగా రెండు సంవత్సరాలు) ప్రతిరోజూ గ్రామాలలోనే వందల వేల రైతుల మధ్య, కరణాలు రెవెన్యూ అధికారుల మధ్య గడిపాను. భూమి దున్నుకుంటూ రికార్డులలో పేర్లు లేని వేల రైతుల మధ్య, అప్పులు ఇద్దామన్నా వారికి అవసరమైనా, డబ్బులు, రాయితీలు ఉన్నా, అప్పు పుట్టని రైతుల మధ్యా, ఎంత సహాయం చేద్దామన్నా చేతకాని నిస్సహాయ అధికారిగా నేను అనుభవించిన ఆవేదన - ఈ పథకం అమలు పై చాలా అనుమానాలకు, నాలో అలజడికి కారణమైంది. ఇది కాక ప్రభుత్వ భూముల పంపిణీ విధానం ఎందుకో నాకు మొదటినుంచీ నచ్చలేదు.

భువనగిరి సబ్‌కలెక్టరుగా ఎన్ని గ్రామాలలో ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూమి పంచాను? భూమి ఇచ్చిన ఒక్క రైతూ దాని నుంచి బాగుపడతాడన్న నమ్మకం ఉండేది కాదు. కారణం - అందరినీ సంతృప్తి పరచాలని ప్రభుత్వ ఉద్దేశ్యం. అందరికీ యివ్వడానికి ప్రభుత్వం దగ్గర అంత భూములు లేవు. ప్రతి గ్రామంలో 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంటే, భూమిలేని వారు అయిదువందలో వెయ్యిమంది ఉంటే అందరికీ సమానంగా పంచాలని ఆదేశాలు. అంటే ప్రతివాడికి 10 సెంట్లో, 20సెంట్లో భూమి ఇవ్వాలి. దానితో అతనికి ఒరిగేదేమిటో అర్థం కాలేదు.

ఇంకొకవైపు ప్రభుత్వమే సన్నకారు రైతులు, చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు పథకాలు ప్రవేశపెట్టింది. ఎందుకంటే చిన్న చిన్న కమతాలతో జీవితం గడపటం సాధ్యం కాదు. కనీసం సాగునీరు కల మాగాణి భూములు రెండున్నర ఎకరాలైనా, వర్షాధారిత మెట్టభూమి ఐదు ఎకరాలైనా ఉంటే కాని ఒక కుటుంబ మనుగడకు చాలదు. అంతకంటే తక్కువ భూములు కల రైతులు వాటిపై ఆధారపడి మనుగడ సాగించలేరు. వారికి ఇతర ఉపాధి పథకాలు చేపట్టాల్సిన

అవసరం ఎంతైనా ఉందనే పెద్ద ఎత్తున ఎస్ఎఫ్‌డిఏ (Small Farmers' Development Agency), ఎంఎఫ్ఏఎల్ఎస్ (Marginal Farmers' Agricultural Labour Scheme)ల క్రింద చిన్న, సన్నకారు రైతులకు, వ్యవసాయ కూలీలకు కోట్ల రూపాయల ఖర్చుతో పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

మరోవైపు ప్రభుత్వ భూమితోనే సన్నకారు/వ్యవసాయ కూలీల సంఖ్య పెంచదానికా అన్నట్లు భూ పంపిణీ పథకాలు. ...సబ్ కలెక్టర్‌గా ఉన్నప్పుడే ఈ విషయాన్ని (చిన్న రైతుకుటుంబాల మనుగడనే దుస్సాధ్యం చేస్తున్న పరిస్థితి గురించి) మా నల్గొండ కలెక్టరు రమేష్ గ్రోవరుతో సంప్రదించడం జరిగింది. ఆయన "చాలా మంచిదే కాని, రాజకీయ నాయకులకు ఇది నచ్చదేమో" అన్నారు.

"ఎవరికివ్వాలో నిర్ణయించడం కష్టమైతే, గ్రామంలో అర్హత ఉన్న (భూమిలేని) నిరుపేద రైతులందరి జాబితా తయారుచేసి, గ్రామ పంచాయితీ సమక్షంలో లాటరీ పద్ధతిలో ఎవరికి భూమి ఇవ్వాలో ఎంపిక చేసి, తలా 2 ఎకరాలకు తక్కువ లేకుండా ఇస్తే భూమి సాగులోకి వస్తుంది. ఇచ్చిన కుటుంబాలకు ఆర్థికంగా నిలకడకలుగుతుంది. ప్రభుత్వ ఉద్దేశ్యాలు కూడా నెరవేరతాయి కదా" అని నా వాదన.

కలెక్టరు గ్రోవరు, "ఇది చాలా బాగుంది...నువ్వింకా చిన్నవాడవు. రాజకీయనాయకుల ఆలోచనలు అలా ఉండవు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు తమవారికి ఏమైనా చేసుకుందామని ఆరాటం వుంటుంది. లాటరీ అంటే అసలే ఒప్పుకోరు. పనికొచ్చినా రాకపోయినా అందరికీ సమానంగా పంచితే, అభివృద్ధి జరిగినా జరగకపోయినా అందరూ సంతృప్తిగా ఉంటారు. అంతే చాలు. మంచి ఆర్థిక విధానాలకూ, రాజకీయాలకూ చాలా దూరం" అనేశారు.

అటువంటి గ్రామీణ పరిస్థితులలో, సాగులో ఉన్న మిగులు భూముల్ని ప్రభుత్వం డబ్బు ఇచ్చి (తక్కువ ధరే కావచ్చు) తీసుకొని, తరువాత పేదలకు సమానంగా ఒక్కొక్కరికి - పూడ్చిపెట్టదానికి 'ఆరడుగుల భూమి' అన్నట్లు - పంచిపెడితే ఎవరికి లాభం? ఎంత భూమి తీసుకోగలం? ఎన్నాళ్ళు తీసుకోగలం? తీసుకొన్నదానికి ఎంత ఖర్చు? రైతులకు ఇచ్చే డబ్బేకాకుండా - లిటిగేషన్లకి కోర్టు ఖర్చులు - లాయర్ల ఖర్చులు - పాలనా యంత్రాంగ ఖర్చులు - దేని కోసం ఇదంతా చేస్తున్నట్లు?

ఎందుకో చాలా బాధ అనిపించింది. ముఖ్యమంత్రిగారితో చెప్పేందుకు ధైర్యం చాలలేదు. ఆయన ఈ పథకం విషయంలో చాలా ఉత్సాహంగా ఉన్నారు. "ఇది వద్దు, ఆపండి" అని చెప్పడం తేలికేగాని, అటువంటివి చెప్పేటప్పుడు ప్రత్యామ్నాయంగా ఏదైనా చేయండని చెప్పాల్సిన బాధ్యత అధికారులది.

వాళ్ళు ఒప్పుకొన్నా, ఒప్పుకోకపోయినా చాలా మంచిదని ఆలోచన మనకు వచ్చినప్పుడు చెప్పవలసిన బాధ్యత మనది. ఈ పథకం గురించే ఎంతో ఆలోచన చేశాను. నిజానికి నేను నా

చిన్నతనం అంతా గ్రామాలలోనే గడిపాను. పేదరికం అంటే తెలుసు. గ్రామస్తుల మనస్తత్వాలు కూడా నాకు అవగాహనలో ఉన్నాయి. ఈ విషయంలో నల్గొండ ప్రాజెక్టులో అనుభవం చాలా పాఠాలు నేర్పింది. కాని ముఖ్యమంత్రి, మంత్రులు, కార్యదర్శుల ముందు నే నెంత? నా అనుభవమెంత? వారందరికీ నా వయసంత సర్వీసుతో అనుభవం. తొందరపడితే అభాసు పాలు అవచ్చు!!....

.... ఇలా ఆలోచిస్తూ ఉంటే ఓ రోజు కార్మికశాఖామంత్రి అంజయ్యగారు నాగదిలోకి ఏదో పనిమీద వచ్చారు. ముఖ్యమంత్రిని కలవడానికి యింకొంత సమయం పట్టేట్టు ఉంది. సరే, ఈయనతో ఈ విషయం ప్రస్తావిస్తే బాగుంటుందేమోననిపించింది. అంజయ్య గారు పెద్దగా చదువుకోలేదు. కూలివాడిగా జీవితం మొదలుపెట్టి, ఇంతవరకు ఎదిగారు. మంచిమనసున్న మనిషి. చూడటానికి అమాయకుడిగా కనిపించినా మంచి లౌకిక జ్ఞానం ఉంది. పేదవాడికి సహాయం చేద్దామన్న తహతహ గలవాడు.

ఆయనతో నాకు గలిగిన ఆలోచనలన్నీ చెప్పాను. మనం చేస్తున్న భూ సంస్కరణల వలన ప్రయోజనం గురించి నా అభిప్రాయం చెప్పాను. ఆయన చాలా అసక్తిగా విన్నాడు. చివరికి నాతో ఏకీభవించి, "దీని వలన బాగుపడే వారు ఉండరని అనుకోవద్దు... ఉంటారు.... గ్రామాధికారులు, రెవిన్యూ అధికారులు, వకీళ్ళు చాలా బాగుపడతారు. చాలా కొత్త ఉద్యోగా లొస్తాయి. రైతులకు ఏం మేలు జరుగుతుందో అప్పటికి మేం అధికారంలో ఉంటామో లేదో..." అనే ధోరణిలో మాట్లాడారు. "అయినా ఇది దేశమంతటా జరుగుతోంది... మనం కాదనలేం గదా!" అని ఆలోచనలో పడ్డారు.

అప్పుడు నాకు కొంచెం ఉత్సాహం వచ్చింది. కనీసం ఒక మంత్రి అయినా నా ఆలోచనకు స్పందిస్తున్నారు గదా అన్న భావన కొంచెం ఊపునిచ్చింది. ఇక చెప్పడం ఆరంభించాను. "మీరు అధికారంలో ఉండగానే కార్యరూపంలో పెట్టగలిగే ఒక మార్గం ఆలోచించాను," అంటూ నేను ఆలోచించిన విధానాన్ని ఆయన ముందు పెట్టాను.

ముఖ్యమంత్రి గారికి చెప్పాలంటే కొంచెం సంకోచం, భయం. కొత్త ఆలోచనలకు ఇది సమయం కాదని తటపటాయింపు...

అంజయ్యగారు కొంచెం ఆశ్చర్యంగా నా వైపే చూస్తూ ఉండిపోయారు. పథకాన్ని గురించి ఏమీ అనలేదు.... ఆయన పథకం గురించే ఆలోచిస్తున్నట్లుగా మాత్రం నాకు అనిపించింది. ఇంతలో ముఖ్యమంత్రిగారు రమ్మన్నారని ఆయనకు పిలుపు వచ్చింది.

లోపలికి పోతూపోతూ "భూ సంస్కరణలే అందరి ధ్యేయం అయితే - నీ విధానం బాగున్నట్టే ఉంది.... మరి రాజకీయాలమాటేమిటి..." అని వెళ్ళిపోయారు శ్రీ అంజయ్య.

నేను ఆలోచనలో పడ్డాను.... నా సూచన చాలా సులభమైంది. భూసంస్కరణల ముఖ్య ఉద్దేశ్యం - ఎవరి భూమి ఎవరికైనా పరిమితిలోనే ఉండాలి.... వారు వ్యవసాయం చేసేవారైనా

లేదా దాని మీదే బతికేవారైనా అయి ఉండాలి. మిగులు భూమి అనేది అసలు భూమి లేనివారికి, అర్హులకు అందాలి. ఇదంతా చేస్తున్నది - భూమి అంతా సాగులోకి రావాలనీ, దున్నేవాడికి భూమి ఉండాలనీ, భూమి మీద రైతు తన కుటుంబ పోషణ జరుపుకోడానికి అనువుగా ఉండాలనీ, రైతుల కష్టాలపై బతికే పెద్ద పెద్ద భూస్వాములను తొలగించాలనీ కదా!

ప్రభుత్వమే ఎందుకు ఈ పనంతా చెయ్యాలి? ఎంత పరిధిలో ఏ ఏ భూములు ఒక కుటుంబానికుండచ్చో నిర్ణయించి, ఒకటో, రెండు సంవత్సరాల గడువు పెట్టి, మిగులు భూములు ఉన్న వాళ్ళు, వారికిష్టమొచ్చిన వారికి అమ్ముకోవడమో, దానంగా యిచ్చుకోవడమో ఈ గడువు లోపల చేసుకోవచ్చునని నిర్ణయించాలి. ఆ గడువు తరువాత ప్రతి రైతు తనకున్న భూమిని ప్రభుత్వానికి ప్రకటించాలి. సైన్యంలో ఉన్నవారికో, లేక వితంతువులకో, లేక ప్రత్యేకంగా పరిశ్రమల వారికో మినహాయింపులు ఇవ్వదలచుకొంటే ఇవ్వవచ్చు. ఇంకా విప్లవాత్మకంగా పోవాలంటే ఎవరికీ రెండు ఎకరాలకు తక్కువ భూమి ఉండరాదని కూడా నిబంధన పెట్టవచ్చు.

గడువు తర్వాత - అంటే అందరినుంచి స్వచ్ఛందప్రకటన వచ్చిన తర్వాత - అవి గ్రామసభల్లో, అన్ని అధికార కార్యాలయాల్లో దండోరా ద్వారా అందరికీ తెలియబరచి, ఎవరైనా దొంగ లెఖ్ఖలు చూపినా, భూమిని దొంగపేర్ల మీద దాచి ఉంచినా, ఇంకెవరి పేరో పెట్టి తామే సేద్యం చేస్తున్నా, తమ పేర్లతో ఉండి వ్యవసాయం చేయకపోయినా... అలాంటి భూములను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకుండా స్వాధీనం చేసుకుంటుందని ఉత్తర్వులు జారీ చేయాలి. దానితోపాటు, ఏ వ్యక్తి అయినా ఏ భూస్వామి గురించి అయినా సమాచారం అందజేసి, మిగులు భూములు చూపించడానికి ప్రభుత్వానికి సహాయం చేస్తే, అవ్యక్తికి భూ సంస్కరణల చట్టం క్రింద అర్హత ఉంటే, అతను ప్రభుత్వానికి సంపాదించి పెట్టిన మిగులు భూములు అతనికే ప్రభుత్వం యిచ్చేటట్లు ఉత్తర్వులు ఇవ్వాలి.

దీనితో ప్రభుత్వ యంత్రాంగాన్ని పెద్దగా నియోగించనవసరం లేకుండా, ప్రభుత్వం దీనిపై డబ్బు ఖర్చుపెట్టకుండా ప్రజలందరు తమ ప్రయోజనాలు కాపాడుకుంటూనే ప్రభుత్వ ఆశయాలకు పనిచేసేటట్లుగా ఉంటుంది.

రెండు సంవత్సరాలు మాత్రమే గడువు కనుక, భూమి ఖరీదులు పడిపోయి, నిజంగా వ్యవసాయం చేసుకొనే వారికి భూములు కొనుక్కొనే అవకాశం లభిస్తుంది.

అవసరమైతే అటువంటి వారికి భూమిని కొనడానికి కావలసిన అప్పులిప్పించాలి. అందువల్ల భూమి మీద ఆధారపడి బతకలేకపోయినప్పటికి ఆ భూమినీ, గ్రామాన్నీ వదలిపోలేని సన్నకారు రైతుల సందిగ్ధ పరిస్థితి తొలగిపోతుంది.

కోర్టుల్లో లిటిగేషన్లు తగ్గుతాయి.

ఈ పథకాన్ని నిరవధికంగా అమలు పరచడానికి అవకాశం ఉంది.

అమలుపరచిన ఏడాదికి, గ్రామస్థాయిలో భూముల స్వాధీనాన్ననుసరించి రికార్డులు తయారు చేయవచ్చు.

... అలా భూమి కావల్సిన ప్రతివాడూ ప్రభుత్వ అధికారి కన్నా కష్టపడి ప్రభుత్వ ఆశయం కోసమే పని చేసే పరిస్థితి ఏర్పడుతుంది.

★ ★ ★

ఇలా ఆలోచిస్తున్న నన్ను అకస్మాత్తుగా ముఖ్యమంత్రిగారు రమ్మన్నట్లు కబురువచ్చింది. లోపలికి వెళ్ళాను. అంజయ్యగారు ఇంకా అక్కడే ఉన్నారు.

ముఖ్యమంత్రి పివిగారు "ఏమిటోయ్ ప్రసాదూ, భూసంస్కరణల విషయంలో ఏదో విప్లవాత్మక ఆలోచన చేశావని అంజయ్య అంటున్నారు" అని అడిగారు.

విప్లవం అనేసరికి కొంచెం తడబడినా, ధైర్యం తెచ్చుకున్నాను.

"అట్లా చేస్తే ఎట్లా ఉంటుందని అంజయ్యగారితో అన్నానంతే" అని దాటేయబోయాను. కాని ముఖ్యమంత్రి వదలలేదు. దాదాపు 20 నిమిషాలు నా ఆలోచన ఏమిటో కూలంకషంగా అడిగి, చాలా ప్రశ్నలు వేసి, విని చివరకు ఆయన ఆలోచనలో పడ్డారు.

"చాలా సులభం... చాలా ప్రభావవంతమైంది... కాని చాలా ఆలస్యం అయిపోయింది. మూడు నాలుగు సంవత్సరాల క్రితం భూసంస్కరణల అమలు గురించి మొదలుపెట్టినప్పుడయితే బ్రహ్మాండంగా ఉండేది. ఇప్పటికల్లా ఆచరణ కూడా పూర్తయివుండేది. ... ఇప్పుడు చేయటం కష్టం... కష్టం ఏమిటి? రాజకీయ ఆత్మహత్య! నాకే కాదు – పార్టీకి కూడా. ప్రతిపక్షాలకు పెద్ద ఆయుధం...." అని తనలో తనే పెద్దగా అనుకుంటున్నారు.

"కావాలంటే 2 ఎకరాలలోపు రైతులుండరాదనే నిబంధన యిప్పుడు పెట్టకుండా– కొన్నేళ్ళ తర్వాత పెట్టచ్చేమో – రాజకీయంగా ఇబ్బందయితే..." అన్నాను.

పివి గారు నా వంక సాలోచనగా చూస్తూ అన్నారు : "అది సరే.. ఎప్పుడైనా చేయవచ్చు. కాని ఇంతదాకా వచ్చాక, ఇంత ప్రచారం జరిగాక, ఇప్పుడు ఇటువంటి నిర్ణయం తీసుకుంటే, పెద్ద రైతులకు సహాయం చేయటానికీ, భూ సంస్కరణలను నీరుకార్చటానికీ, పేద రైతులను అపహాస్యం చేయడానికీ ఇది కాంగ్రెసు నాయకుల కుతంత్రం అంటారు.... రాజకీయంగా చాలా నష్టం జరిగే ప్రమాదం ఉంది..."

కొద్ది క్షణాలుపాటు మౌనంగా వుండి, ఆయనే మళ్ళీ అందుకున్నారు.

"ఏమో 15, 20 సంవత్సరాల తర్వాత నువ్వు చెప్పింది చేస్తే బావుండేదేమో అనిపించవచ్చు. కాని నువ్వు చెప్పినది నాకేకాదు, ఢిల్లీలో అధిష్ఠానానికి కూడా అమలుచేసే ధైర్యం ఉంటుందను కోను. మంచి ఆలోచనలెప్పుడూ ఆలస్యంగానే వస్తుంటాయి...." అంటూ మళ్ళీ ఆలోచనలో పడిపోయారు.

నేనేం మాట్లాడాలో తెలీక అలా ఉండిపోయాను.

మళ్ళీ ఆయనే అకస్మాత్తుగా నోరు విప్పారు : "ఈ విషయం ఇంకెవరికైనా చెప్పావా?"

"'లేదు సార్"

"మంచిది, ఎవరికీ చెప్పకు...."

★ ★ ★

ఇదంతా నెమరు వేసుకొన్నాక భూసంస్కరణల కమీషనర్‌గా నాకు ఆవేశం వచ్చింది. కనీసం భూసంస్కరణలవల్ల జరిగిన లాభం ఎంతో ఎందుకు తెలుసుకోలేం- అనుకున్నాను.

తెలుసుకోవడంకోసం జిల్లాలవారీగా ప్రభుత్వ భూమి "సంస్కరణలకి ముందు ఎంత? సంస్కరణల తరువాత ఎంత? పంచింది ఎంత? మిగిలింది ఎంత?..." వగైరా గణాంక వివరాలు సేకరించే బృహత్ ప్రయత్నం ప్రారంభించాను. కొన్ని జిల్లాలు స్వయంగా తిరిగిచూస్తే అలాంటి గణాంక వివరాలు ఏవీ స్పష్టంగా లేవన్నారు.

"అలాంటి వివరాలు సేకరించడం ఆరంభించండి" అని జిల్లాలవారీగా రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చాను. ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాను.

దానిని అమల్లోపెట్టేనాటికి నేను ఆ కమీషనర్ (భూసంస్కరణల) పోస్టులోకి వచ్చి రెండున్నర నెలలయింది.

ఓరోజు ఆఫీసుకి బయల్దేరుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి కార్యాలయం నుంచి ముఖ్యకార్యదర్శి ఎస్.వి.ప్రసాద్ టెలిఫోన్ చేశారు.

"సర్, ఉన్నత విద్యాశాఖకి ముఖ్యకార్యదర్శిగా మంచివాళ్ళని వేయాలని విద్యాశాఖామంత్రి బాలయోగిగారు ముఖ్యమంత్రిని అడుగుతున్నారు..."

అతను పూర్తిచేసేలోపే అందుకున్నాను.

"సరి... అలాంటి మంచివాళ్ళ పేర్లు చెప్పాలా?..."

"కాదు సర్, బాలయోగిగారు మిమ్మల్నే వేయమని పట్టుబడుతున్నారు. ముఖ్యమంత్రిగారు మీకోమాట చెప్పి పోస్టింగ్ ఇమ్మన్నారు...."

ఏం చెప్పాలి?

"ముఖ్యమంత్రిగారిష్టం ప్రసాద్" అనేసి ఫోన్ పెట్టేశాను. రెండు రోజుల్లో నా పోస్టు మారిపోయింది. అంతే!

భూసంస్కరణల ఫలితాల గురించి తెలుసుకునే అవకాశం మళ్ళీ ఎప్పుడూ రాలేదు!!

★ ★ ★

ముఖ్యమంత్రి సీటుకే ఎసరు పెట్టానుట!

ముఖ్యమంత్రులు తాము రాజులమనో, చక్రవర్తులమనో భావించేలా భట్రాజు పొగడ్తలతో ఆకాశానికెత్తే మనుషులు - రాజకీయాలలో కోకొల్లలు. కాని ప్రజాస్వామ్యంలో ఈ మంత్రి పదవులు, ముఖ్యమంత్రి పదవులు ఏ ఒక్కరికీ శాశ్వతంకాదు.

ఈ స్పృహవున్న ముఖ్యమంత్రులైతే ఇలాంటి భట్రాజుపొగడ్తల మైకంనుంచి తమని తాము కాపాడుకోవడం కోసం అధికార యంత్రాంగంమీద ఆధారపడతారు.

తమకు ఇష్టంలేని వ్యక్తులు వస్తే వాళ్ళని కలవకుండా తప్పించుకోవడం ఎలా?

ఒక నిమిషం మాట్లాడతామని వచ్చి ఎవడన్నా సీటులోంచి కదలకుండా అక్కడే అతుక్కుపోతే వాళ్ళని వదిలించుకోవడం ఎలా?

ఒకేసారి రెండుమూడు వేర్వేరు గ్రూపులకు చెందిన వాళ్ళు వస్తే, వాళ్ళలో ఎవరికి ప్రాధాన్యతనిచ్చినా కొరివితో తలగోక్కోవడంలా వుంటుంది. కాబట్టి వాళ్ళందర్నీ సున్నితంగా సంతృప్తి పరచడం ఎలా?

ఎవరన్నా అతిముఖ్యమైన వ్యక్తి ముఖ్యమంత్రిని ఇరకాటంలో పెట్టేలా - లేదా - అసాధ్యమైన డిమాండుతో వచ్చి కూర్చుంటే అతన్ని సమాధానపరచడం ఎలా?

...ఇలాంటి అన్నిరకాల సమస్యలకి వాళ్ళకి ఎదురుగుండా కనుపించే పనిముట్టు - సెక్రటరీ.

ఈ సంగతి నాకు మొదటిసారిగా తెలిసింది - నేను 1972లో ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావుగారి దగ్గర సెక్రటరీగా చేరాక. ఈ సెక్రటరీ ఉద్యోగానికి ఎంచుకోబడిన తొలి ఐఏఎస్ అధికారిని నేను.

ఏమైనా నల్గొండజిల్లాలో చిన్నరైతుల అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్‌గావున్న నన్ను ముఖ్యమంత్రి స్వయంగా తన సెక్రటరీగా రమ్మని పిలవటంతో నా సాటి ఐఏఎస్‌లు కనుబొమ్మ లెగరేశారు నేనేదో ఏనుగు అంబారీ ఎక్కుతున్నట్లుగా. ఇంతకీ అది అందలమా, కందకమా అన్నది లోపలికి దిగితేగాని తెలీలేదు.

ముఖ్యమంత్రి కావాలని పిలిచినప్పుడు ఆయన దగ్గర విశ్వసనీయత నిలబెట్టుకోవాలనీ, ఆధారపడదగిన ఎగ్జిక్యూటివ్ అనిపించుకోవాలనీ ఏ అధికారి అయినా కోరుకుంటాడు. నేనూ అలాగే అనుకున్నాను. కాని, అది - "నా సీటుకే ఎసరు పెట్టాలనుకొంటున్నావా?" అని సి.ఎం. వ్యాఖ్యానించటానికి దారి తీస్తుందని ఊహించలేకపోయాను.

★ ★ ★

"సి.ఎం.గారు తన సెక్రటరీగా రమ్మంటున్నారు సర్" అని నేను ఛీఫ్ సెక్రటరీతో చెప్పినప్పుడు, ఆయన ఓ విచిత్రమైన నవ్వునవ్వారు.

ఆ ఛీఫ్ సెక్రటరీ పేరు వి.కె.రావు. ఆయన బ్రిటీషువాళ్ళ కాలంనాటి ఐ.సి.ఎస్. అధికారి. క్రమశిక్షణ, సమయపాలన వంటి విశిష్ట లక్షణాలుండి తీరాల్సిన సర్వీసు ఐ.సి.ఎస్. (ఇండియన్ సివిల్ సర్వీసు). నేను ఆయన నవ్వుని పట్టించుకోకుండా, "నాకు అర్డర్సు ఎప్పుడు రావచ్చునుసార్" అని అడిగాను. ఆయన మళ్ళీ అలాగే నవ్వి, "నేను సి.ఎంగారిని ఒంటరిగా కలిసి, పోస్టింగుల గురించి మాట్లాడగలిగినప్పుడయ్యా" అన్నారు.

"అంటే..." నేను నీళ్ళు నమిలాను.

అప్పటికి వారంరోజులుగా కొన్ని ముఖ్యమైన విషయాల గురించి ముఖ్యమంత్రిగారితో మాట్లాడాల్సి వుండి కూడా, ముఖ్యమంత్రి గారి దగ్గర టైమ్ దొరకటం లేదనీ, ఎప్పుడు చూసినా ఆయన చుట్టూ జనం వుంటున్నారనీ వి.కె.రావుగారు వాపోయారు. చివరికి, "ప్రసాద్, నువ్వు సి.ఎం దగ్గర చేరి, నాకు వారానికో అరగంటయినా ఇప్పించాలయ్యా" అనేశారు. నేను నిర్ఘాంతపోయాను.

ఆయన మాటల్లో అబద్ధంలేదని నాకు సి.ఎం ఆఫీస్‌లో చేరిన రెండు రోజులకే అర్థమైంది.

ముఖ్యమంత్రి గారిది సాత్విక స్వభావం. కటువుగా మాట్లాడటం ఆయనకి అలవాటులేదు. గట్టిగా ఏదీ చెప్పరు. సూచనలిస్తూ వుంటారు. వాటిని అర్థంచేసుకుని తన సిబ్బంది వ్యవహరించాలని ఆయన ఆశిస్తారు. ఎవరన్నా అలా ఆచరించకపోతే గట్టిగా మందలించే స్వభావం కూడా కాదు.

నేను జాయిన్ అవగానే నన్ను పిలిచి ముఖ్యమంత్రి చెప్పారు. "నా టైమ్ మేనేజిమెంటు కూడా నువ్వే చెయ్యాలయ్యా.... ఏమిటో, పొద్దున్నుంచి రాత్రిదాకా పనిచేస్తూనే వున్నాను. నాకూ సంతృప్తి కలగటం లేదు, నా దగ్గరకొస్తున్న వాళ్ళకీ సంతృప్తి కలగడం లేదు... ఫైళ్ళు కూడా సరిగ్గా రావటం లేదు. వచ్చినా అవి వెంట వెంటనే బయటికి పోవడంలేదు... ఇక్కడున్న సిబ్బంది అంతా సమర్థులే. కాని ఒకరితో ఒకరికి పొసగదు. వాళ్ళ వైఖరి మూలంగా నాకు చెడ్డపేరు వస్తోంది. వాళ్ళకి ఆ స్పృహ వున్నట్టు లేదు... ఇవన్నీ సక్రమంగా జరిగేట్లు చూడటం నీ బాధ్యత..."

"అలాగే సర్" అంటూ తలూపేశాను. కాని...

నాకు, ఈ పని అంతగా తెలియదు. గతంలో హైదరాబాదులో పనిచేసిన అనుభవం లేదు. మంత్రులతోగాని, పై అధికారులతోగాని పరిచయాలు లేవు. ఎవరు ఎంత గొప్పవారో, ఎవరికి ఎంత ప్రాముఖ్యత యివ్వాలో పూర్తి అవగాహన లేదు. ...ఒక రకంగా అది ఇబ్బందికరమైనా, నిర్మొహమాటంగా పనిచేయటానికి అది మరో రకంగా పనికి వచ్చింది.

ఆ రోజుల్లో సి.ఎంగారి ఇల్లు 'ఆనందనిలయం'గా (గ్రీన్‌లాండు గెస్టుహౌసు ఎదురుగా) వుండేది. ముఖ్యమంత్రి కార్యాలయం బాగుండటం ఎంత ముఖ్యమో, ఆయన ఇల్లు కూడా

అంతే ముఖ్యం. చాలా పని సి.ఎం గారి యింట్లోనే జరిగేది. సి.ఎంగారి గదికి పక్కగా ఒక కీలకమైన దిశలో అందరిని సమన్వయం చేయడానికి వీలుగా ఇంకొక గది వుంది. అప్పటికే దానిలో ఎవరుండాలన్న దానిపై ఒక వివాదం నడుస్తోంది. సి.ఎం గారి అంతరంగిక కార్యదర్శి (పిఎస్), లేక అప్పుడే రాజకీయాల్లోకి వస్తున్న సి.ఎం గారి తనయుడా, లేక రాజకీయ అనధికారిక కార్యదర్శిగా పెత్తనం చెలాయిస్తున్న సి.ఎంగారి మరో నేస్తం లక్ష్మీకాంతమ్మా? ...పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చిందన్నట్లు నేనే వెళ్ళి ఆ గదిలో కూర్చుని పని ప్రారంభించాను.

నరసింహులు అని ఆర్‌డిఓ ర్యాంకు అధికారి. బ్రహ్మానందరెడ్డిగారికి ముందు నుంచి సి.ఎం కార్యాలయంలో పనిచేసేవాడు. కష్టపడి పనిచేస్తాడు. సీతాపతి అని ఒక పోలీసు ఆఫీసరు. సి.ఎం. సెక్యూరిటీ వ్యవహారాలు, సి.ఎం గారి విజిటర్లు, అపాయింట్‌మెంట్‌లు చూస్తూంటాడు. చాలా పరిచయాలున్న ఆఫీసరు. అందరికీ తెలుసు – అతడికిష్టం లేకపోతే సి.ఎం గారిని చూడడం కష్టం అన్నంత పలుకుబడి అతనిది. పివి గారొచ్చాక పాతవారిని మార్చలేదు. అదివరకు ఆయన మంత్రిగా వున్నప్పుడు తన దగ్గర పనిచేస్తున్న ఎవిఆర్ కృష్ణమూర్తిని కూడా తన పేషీలోకి తీసుకువచ్చారు. ఈ ముగ్గురూ దాదాపు సమానహోదా గల అధికారులవడంతో కొంత సమన్వయ సమస్య ఎదురైంది. అందరూ మంచి పనివారే. కాని అహంభావాల సమస్య. అందరినీ కూర్చోపెట్టి వారికి వారివారి పనులు ఏమిటోచెప్పి, అన్ని ఫైల్సూ మొదట నాదగ్గరకు తెప్పించుకొని, తరువాత వాళ్ళకి బాధ్యతలు అప్పగించడం జరిగింది.

మూడునాలుగు రోజులు పాటు సి.ఎంగారి దినచర్య, జరుగుతున్న కార్యక్రమాలు, ఎందుకు, ఎవరికీ సంతృప్తి లేదు ...అన్న విషయంపై కొంత అధ్యయనం చేశాను. సి.ఎంగారు ఉదయం 7 గంటల కల్లా తయారై విజిటర్సుని చూడటానికి క్రిందకు వస్తారు. ఆయన మంచితనంవల్ల ఎవ్వరినీ వెళ్ళిపొమ్మని చెప్పరు. మంత్రులెవరైనా లోపలికి వచ్చి కూర్చోవచ్చు. దర్బారులాగా వుంది. అందరూ అన్ని విషయాలూ మాట్లాడుతుంటారు గాని, వారు వచ్చిన పని గురించి చెప్పడానికి అవకాశం లేదు. ఎవరూ లేకుండా తాము ప్రైవేటుగా సి.ఎం గారితో మాట్లాడాలని అందరికీ ఆశ. ఆ అవకాశం రాదు. వాతావరణం గురించో రాజకీయాల గురించో, అప్పటి వేడివేడి విషయం ఆంధ్ర, తెలంగాణా ఉద్యమాల గురించో ప్రస్తావన జరుగుతూంటుంది. వచ్చేవారు వస్తుంటారు, పోయేవారు పోతుంటారు. బయట వేలమంది జనం నిరీక్షణ. ఆయన కొందరిని కలిసినా, విడివిడిగా మాట్లాడే అవకాశం లేదు. ఎవరైనా సీనియరు మంత్రి ఏదైనా రహస్యంగా మాట్లాడాలంటే రెండు మూడు సార్లు ముఖ్యమంత్రిగారే ఆయన్ని నా గదిలోకి తీసుకొచ్చి మాట్లాడేవారు.

బంగళా అంతా జనం. బయట పెద్దపెద్ద లాన్లలో జనం. అంతా హడావుడే. మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు యితర దరఖాస్తు దారులు ...కొందరితో అర్జంటుగా ప్రత్యేకంగా మాట్లాడాలంటే నా రూములోకి సి.ఎంగారిని రప్పించి మాట్లాడించడం, ఈ హడావుడిలో సి.ఎంగారికి ఫైల్సు చూడటానికి గాని, మాతో మాట్లాడటానికి గాని సరిగ్గా టైమ్ లేకపోవడం

జరిగేది. చీఫ్ సెక్రటరీ నాతో ఎందుకు అలా అన్నారో ఇప్పుడు అర్థమయింది. ఆయన రోజూ రావడం, సి.ఎం గారితో చాలాసేపే వుంటారుగాని, ముఖ్యమైన విషయాలు మాట్లాడాలంటే విడిగా టైం దొరక్క వెళ్ళిపోవడం జరిగేది.

మరుసటిరోజు బయట జనం గురించి వాకబు చేశాను. చాలామంది వచ్చిన వాళ్ళే వస్తున్నారు. మళ్ళీ మళ్ళీ వస్తున్నారు. ఎందుకంటే సి.ఎం గారి దగ్గర టైం దొరకటంలేదు. సావకాశంగా చెప్పుకోవాలి. కుదరటంలేదు. శాసన సభ్యులు "సి.ఎం గారు ఎప్పుడూ మంత్రులతోనే వుంటారు, మాకు టైమే యివ్వరు"అని గోల. అధికారుల విషయంలోనూ అంతే. ముఖ్యమైన వాళ్ళొస్తే సి.ఎంగారిని నా రూముకి తీసుకురావడం, పనికానివ్వడం.

ముఖ్యమంత్రి పదవిలో వుండే వాళ్ళకి ప్రతినిమిషం విలువైంది. వాళ్ళకి రోజుకి 24 గంటల వ్యవధి సరిపోదు. ముఖ్యమంత్రి దగ్గరకి వెళ్ళే అవకాశం వున్న ప్రతివ్యక్తీ ఆయన దగ్గరకే వెళ్ళి ఆయనతో చెప్పించి, తమ పనులూ, తమ వందిమాగధుల పనులూ చేయించుకోవాలనుకుంటారు. ...ముఖ్యమంత్రి మొహమాటస్థుడైతే కొంతమంది తమ చనువుని దుర్వినియోగం చేసుకుంటూ, ముఖ్యమంత్రి దగ్గర ఎంత ఎక్కువసేపు కూర్చున్నట్లు బయటకి కనబడితే తమకి అంత 'లాభం' వచ్చేలా బయట తమ అనుయాయుల్ని, తమని నమ్ముకుని పైరవీలకోసం వచ్చే వాళ్ళని కూర్చోబెడుతుంటారు.

... కొంతమందికి అసలు ముఖ్యమంత్రికి సమయం ఎంత విలువైంది అన్న స్పృహే వుండదు. ముఖ్యమంత్రికి ఎంత సన్నిహితంగా వున్నట్లు కనబడితే అధికారులు తమకి అంత మర్యాదిచ్చి, తమ పనులు చేసిపెడుతుంటారని ఆశ పడుతుంటారు.

ఇలాంటి అనేక రకాల శక్తుల్నుంచి తనని కాపాడుకోవాలనీ, పాలనా పరంగా చాలా చేయాలనీ పి.విగారు తాపత్రయ పడేవారు. కాని ఆయనకున్న సమయంలో అధికశాతం ఆయనకి ఇష్టంలేని 'వృథా దర్బారు' లో గడిచిపోతుండేది. ఫైళ్ళు చూడటానికే టైముండేదికాదు.

ఆయనకున్న ఒక 'జిగ్రీదోస్త్' లక్ష్మీకాంతమ్మ. తరచూ ఎవరెవరో గుంపుల్ని తీసుకొచ్చేది పనులు చేసి పెట్టమంటూ. ఆయనకి ఇష్టముండేదికాదు. కాని ఏమీ అనలేని 'స్నేహ' బంధం.

కోస్తా జిల్లాలకు చెందిన మంత్రి కాకాని వెంకట రత్నంగారు అయిదు నిమిషాలు టైమ్ కావాలనే వారు. ఇప్పించేవాళ్ళి. ఆయనతో అయిదు నిమిషాలు మాట్లాడటానికి ముఖ్యమంత్రికి ఇబ్బందిలేదు. కాని ఆయన తనతో మరో అయిదారుగురు ఛోటా నాయకుల్ని వెంట తీసుకువచ్చి, వాళ్ళ సమక్షంలో తెలంగాణ - ఆంధ్ర వేర్పాటు అంశం గురించి ముఖ్యమంత్రితో సుదీర్ఘంగా చర్చకు దిగేవారు. ముఖ్యమంత్రికి నచ్చేదికాదు. అలాంటప్పుడు నేను మధ్యలో వెళ్ళి, ఇంకెవరో వి.ఐ.పి నాగదిలోవుంటే, అక్కడికే సి.ఎం.ని తీసుకువచ్చి మాట్లాడించాల్సి వచ్చేది.

నేదురుమల్లి జనార్ధన రెడ్డి అప్పట్లో రాజకీయాల్లో ఎదుగుతున్న యువశక్తి. ఢిల్లీలో పరిచయాలు, పట్లు పెంచుకుంటూ తరచూ వస్తుండేవారు. వచ్చినప్పుడల్లా ఢిల్లీ సమాచారం

మోసుకువస్తుండేవారు. అధిష్ఠానం ఏమనుకుంటోందో తెలుసుకోవాలంటే ఆయన ఒక మార్గం. ఆయనా గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చేది. ...ఇలా నిరీక్షించే వాళ్ళతోనే ఆవరణ నిండిపోయేది.

డాక్టరు గోపాలకృష్ణ అప్పట్లో తెలంగాణా విద్యార్థి నాయకుడు. మంత్రి మదన మోహన్‌కి సోదరుడు. ఢిల్లీలో అధిష్ఠానంతో పరిచయాలున్నట్లు చెప్పుకునేవాడు. తెలంగాణాలో ఉద్యమం అదుపులో వుందని అనుకోవడం కోసం ఈయన్ని ముఖ్యమంత్రి 'పట్టించు'కోవాల్సి వచ్చేది. ఈయన ఎప్పుడు వచ్చినా వెంట ఒక బృందం వుండేది. వాళ్ళు మాత్రం ఎందుకు నిరీక్షించాలి? ముఖ్యమైన విద్యార్థి నాయకుడుగదా!

... ఇలా ఎవరికి వాళ్ళు అందరూ ముఖ్యమైన వాళ్ళం అనుకునేవాళ్ళే. ఎవరినీ అసంతృప్తి పరచటానికి లేదు. అలాగని అందర్నీ సంతృప్తి పరచటానికి రోజుకి 50 గంటలున్నా సరిపోని పరిస్థితి.

ప్రత్యేక తెలంగాణా వివాదం ఛాయలు పూర్తిగా తొలగిపోయాయన్న నమ్మకం ఏర్పడే లోపల భూసంస్కరణల వంటి కీలక పథకాలకు శ్రీకారం చుట్టి, కొత్త అసంతృప్తికి అవకాశ మివ్వటంతో, ముఖ్యమంత్రి సంతృప్తి పరచాల్సిన వాళ్ళ సంఖ్య పెరిగిపోతూ వచ్చింది. అలాంటి నిస్సహాయస్థితిలో ముఖ్యమంత్రి ప్రయోజనాలు కాపాడే పాత్రలో నేను ఇరుక్కుపోయాను.

అసలు ఏమిటీ దర్బారులు! ఉదయం 11 గంటలకి సెక్రటేరియట్‌లో జరిగే మీటింగ్‌ల సమయంలో తప్పిస్తే, మిగతా సమయం అంతా దర్బారులే. అవే మనుషులు, అవే విషయాలు. ఎవరికీ సంతృప్తిలేదు. అదే మాట సి.ఎంకి చెబితే, ఆయన నిర్వికారంగా ఓ నవ్వునవ్వారు. "చూస్తూనే వున్నావు గదయ్యా! ఉదయం ఏడు గంటలనుంచీ రాత్రి 11 గంటల వరకూ విశ్రాంతి లేకుండా పనిచేస్తూనే వున్నాను గదా! ఇంకా ఏం చేయాలి?"

ఆయన బలహీనత నాకు అర్థమైంది. ఈ దర్బారుల విషయంలో కొంత క్రమబద్ధత తీసుకురావాలని నిర్ణయించుకొని, కొన్ని మార్పులు తేవడానికి సి.ఎం గారిని అనుమతి అడిగాను "అందుకేగా నిన్ను తెచ్చింది. ఏమైనా చెయ్యి. అందరికీ సంతృప్తినచ్చేట్లు చూడు. నాకు ఫిర్యాదులు రాకుండా ఏం చేసినా నీ ఇష్టం" అన్నారు.

"కొన్ని రోజులపాటు కొందరు సీనియర్లకు కొంచెం ఇబ్బంది కలగవచ్చు - ఎందుకంటే వాళ్ళొచ్చి మీతో గంటల తరబడి గడపటం అలవాటు చేసుకొన్నారు. బయట వాళ్ళ గొప్పతనం, మీతో ఎంత సేపు గడిపాం అన్న విషయంపై ఆధారపడుతుంది. వాళ్ళకి వారి వారి విషయాలు మాట్లాడటానికి తగినంత సమయం తప్పకుండా ఇద్దాం. కాని ఇతరులు మాట్లాడుతున్నప్పుడు వాళ్ళు అక్కడ వుండటం మంచిదికాదు. వాళ్ళ పని అయిన వెంటనే వాళ్ళు వెళ్ళిపోవాలి. వాళ్ళకి ఎవరో ఒకరు కొంచెం నిర్మొహమాటంగా చెప్పాల్సి వుంటుంది. ఆ సంగతి నేను చూసుకొంటాను. మీరు కొద్దిగా సహించాల్సి వుంటుంది" అన్నాను. "తప్పకుండా" అని అభయం ఇచ్చారు.

అంతే. మర్నాటికి సి.ఎం గారి షెడ్యూలు తయారుచేయడం జరిగింది. ఉదయం 7 గంటల నుంచి 7.30 వరకు నాతో గడపాలి. ఆ రోజు చేయవలసిన ముఖ్య కార్యక్రమాలు, వాటిపై బ్రీఫింగు, ముఖ్యమైన పేపర్లు, టపాల్సు పరిశీలన, ఎవరెవరికి ఏమేమి ప్రత్యుత్తరాలు యివ్వాలో నిర్ణయించడం, 7.30 నుండి 8.00 వరకు ఆఫీసులోని యితర అధికారులతో చర్చ, ఫైళ్ళుచూడటం...

8 గంటలకు సి.ఎం గారు బంగళా బయట లాన్లోకి వస్తారు. సీతాపతి తన సిబ్బంది సహాయంతో అక్కడికి వచ్చిన దరఖాస్తు దారులనందరిని వరుసగా నిలబెడతారు. గుంపులుగా వచ్చిన వారిని వారి వారి గ్రూపులలో నిలబెడితే సి.ఎంగారే వాళ్ళ దగ్గరకు వచ్చి వాళ్ళ అభ్యర్థనలను వింటారు. వాళ్ళ వెనకాల నేనూ, ఇతర సిబ్బందీ వుంటాం కాబట్టి, సి.ఎంగారి ఆదేశాలు తీసుకొని వాటిపై చర్య తీసుకోవడం జరుగుతుంది. తరువాత యితర దరఖాస్తు దారులు ఎవరినైనా సి.ఎం గారు ప్రత్యేకంగా కలుసుకోరలచినా / ఎవరైనా ముఖ్యమైన విషయం చర్చించడానికి సమయం అడిగినా వారిని బంగళాలో విజిటర్స్ రూముకు తరలిస్తాం. 8.30 కల్లా యీ పబ్లిక్ దర్శనం అయిపోతుంది. అందులో ఎంపిక చేసిన ముఖ్యుల్ని 8.30 నుండి 9 వరకు విడివిడిగా చూస్తారు.

9 గంటల నుంచి 10 గంటల వరకు మంత్రులు, ఇతర ప్రముఖులకి, 10 నుండి 10.30 వరకు శాసన సభ్యులకి కేటాయించాం. 11 గంటలకు ఆఫీసుకు వెళ్ళటం. 11 గంటల నుంచి ఒంటి గంటవరకు నిర్దిష్టమైన ఇంటర్వ్యూలు, ఒంటిగంట నుంచి 3 గంటల వరకు భోజనం, విశ్రాంతి. ప్రతిరోజూ 3.00 గంటల నుంచి 3.30 వరకు ఛీఫ్ సెక్రటరీ గారితో చర్చలు. 3.30 నుంచి 4 గంటలవరకు మంత్రులతో అధికారిక విషయాలపై సమావేశం. నాలుగ్గంటలకు బంగళాకు తిరిగి రావడం. 4.30 నుంచి 5.30 వరకు రాజకీయపార్టీ నాయకులకు కేటాయింపు. 5.30 నుంచి 7.30 వరకు ఏదైనా సాంస్కృతిక సమావేశాలకు వెళ్ళటం, 7.30 నుంచి రాత్రి 9.00 గంటల వరకు సి.ఎం గారు తనకు కావలిసిన ఎవరినైనా పిలవదలచుకొంటే వారిని – ప్రైవేటు గెస్టులతో సహా భోజనానికి పిలుస్తారు. 9 గంటల తరువాత ఆయన పైకి వెళ్తారు. కొన్ని ముఖ్యమైన ఫైళ్ళు రాత్రికి గాని ఉదయం గాని చూస్తారు.

“ఇది ఒక టైమ్ టేబుల్ సర్. ఖచ్చితంగా అట్లానే చేయడానికి కొన్ని సందర్భాలలో అవకాశం వుండకపోవచ్చు. కొన్ని కార్యక్రమాలు ఉదయం వుండవచ్చు. కొన్ని ముఖ్యమైన మీటింగులు ఎప్పుడైనా పెట్టవలసి రావచ్చు. ఆ వెసులుబాటు పెట్టుకొందాం! ఈ ప్రణాళికను మీరు ఆమోదిస్తే దాన్ని అమలుచేసే బాధ్యతనాది” అని చెప్పాను.

ఆయన చాలా సంతోషించి “ఇవాళే మొదలుపెట్ట”మన్నారు.

అంతే! ఉదయాన్నే 8 గంటలకు సి.ఎంగారు లాన్లోకి వచ్చేప్పటికి సీతాపతి వేలమంది దరఖాస్తు దారులును గ్రూపులుగా, మిగిలిన వారిని వరుసగా నిలబెట్టాడు. సి.ఎం గారు ఒక

వైపునుంచి నడుచుకుంటూ, విన్నపాలు వింటూ ఆదేశాలూ ఇస్తూ వచ్చేశారు. 8.30 కల్లా అందరినీ చూశారు... అందులో 10 మందిని విడిగా చూడటానికి నిర్ణయించారు. 9 గంటలకల్లా వాళ్ళని కలవడం కూడా అయిపోయింది.

మంత్రులు, ముఖ్యులను విఐపి అతిథుల గదిలో కూర్చోపెట్టడం, అలవాటుచొప్పున సి.ఎం గారు నా రూములోకి రాకుండా చూడటం సీతాపతి బాధ్యత. ఒక్కొక్కరిని లోపలికి పంపడం, వారి పని అవగానే మర్యాదగా వారిని బయటకు తీసుకురావడం కూడా సీతాపతి బాధ్యతే.

ఒక రోజున 10 గంటల లోపలే ముఖ్యమైన ఇంటర్వ్యూలు అయిపోయాయి. శాసనసభ్యుల టైం ఇంకా రాలేదు. బయట శాసన సభ్యులు వేచి వున్నారు. ఖాళీగా ఉన్నాం కదా అని సి.ఎం గారు వాళ్ళని పిలవమన్నారు.

"వాళ్ళటైంకి వాళ్ళని పిలుద్దాం. ఇప్పుడు కొన్ని ఫైల్సు చూడండి సర్" అని అడిగాను.

"బయట మనుషులు వేచి వుంటే ఫైల్సు చూస్తామా?" అన్నారు.

"అలాకాదు, ఇవాళ టైంకన్నా ముందు వాళ్ళని చూస్తే, రేపట్నుంచి వాళ్ళే ముందుగా వచ్చి కూచుంటారు. కథ మొదటికి వస్తుంది. ఈ పని ఇప్పుడు చేస్తే రాత్రికి మీకు శ్రమ తగ్గుతుంది కదా!"

అయిష్టంగానే ఆయన ఫైల్సు చూశారు.

ఆఫీసులో కూడా ఇదే తరహా. నిర్దేశించిన ప్రకారం మీటింగులు, ఇంటర్వ్యూలు అయినాయి. చాలా సంతోషించిన వ్యక్తి ఛీఫ్ సెక్రటరీ వి.కె.రావుగారు మూడు రోజుల తరువాత ఆయన "నాకేమీ మాట్లాడేవిషయాలు లేవు, టైం అక్కర్లేదు" అన్నారు. ...ఇలా వారం పదిరోజులకి అందరూ వారివారి టైముకి అలవాటుబడి, ఆలస్యం లేకుండా వాళ్ళ పనులు సి.ఎం గారితో ముగించుకొని వెళ్తున్నారు. బయట వచ్చే జనం కూడా మొదటి వారం రోజులూ బాగా వచ్చారు. అది వరకు కలుద్దామని ప్రయత్నం చేసి విసిగి వూరుకున్న వాళ్ళంతా రావడం, వాళ్ళ విన్నపాలు చేసుకోవడం అయిపోయింది.

పది రోజులయ్యేప్పటికి సి.ఎంగారి నివాసంలో హడావుడి లేదు.

జనం వస్తున్నారు.

చూస్తున్నారు.

పని చేసుకుపోతున్నారు.

ఎప్పుడు చూసినా ఎక్కువమంది లేకపోవడం, అందరూ చాలా సంతోషంతో ముఖ్యమంత్రి గార్ని, నన్ను అభినందించడం, అధికార్లు కూడా తమకు సి.ఎం గారితో చర్చించడానికి చాలా అనుకూలంగా వుందనీ, ఫైల్సు వెంట వెంటనే వాపసు వచ్చేస్తున్నాయనీ అంటూ "అంతా చాలా

ప్రొఫెషనల్‌గా వుందోయ్" అని మెచ్చుకుంటుంటే చాలా ఆనందపడిపోయాను. అది నిలబడే లోపల...

ఒకరోజు సి.ఎం గారు మేడపైకి పిలిచారు.

మరోసారి నన్ను అభినందించడానికి పిలిచారనుకొని హుషారుగా పైకి వెళ్ళాను.

"ఏమయ్యా ప్రసాదు, నీ సమర్థతతో నా ముఖ్యమంత్రి పదవి పోగొట్టాలనుకుంటున్నావా?" అని ముఖ్యమంత్రి నిష్ఠూరంగా మాట్లాడారు.

నేను నిర్ఘాంతపోయాను. ఏం మాట్లాడాలో తెలియలేదు.

"సర్...సర్... మీరు ..." అంటూ నీళ్ళు నములుతున్నారు.

ఆయన గుక్కతిప్పుకోకుండా నాకు ఒక రాజకీయ బోధ చేశారు.

"జనం లేకపోతే ఏం రాజకీయనాయకుడయ్యా! ...ప్రత్యేక ఆంధ్రా ఉద్యమం అంటుకుంది గదా! రాష్ట్రమంతా గొడవలు. కొంతమంది పనికట్టుకొని ఇందిరాగాంధీ గారికి నామీద ఫిర్యాదు చేస్తున్నారు... నన్ను మార్చాలని చెబుతున్నారు. కొందరైతే మార్చాలన్న నిర్ణయం హైకమాండ్ తీసేసుకున్నారనీ, అందుకే సి.ఎం.గారిని చూడ్డానికి సందర్శకులు కూడా రావటం లేదని ప్రచారంచేస్తున్నారు... అది వరకు వేల కొద్దీ జనం సి.ఎం గారింట్లో ఎప్పుడూ వుండేవారని, మంత్రులు, రాజకీయనాయకులు, శాసన సభ్యులూ అంతా వారింట్లో, ఆఫీసులో వుండి అంతా కళకళలాడుతూ వుండేదనీ, ఇప్పుడు ఆయనను సి.ఎం పదవి నుంచి తీసేస్తున్నారు కాబట్టే జనం లేరనీ... ఇలా చెబుతున్నారు... నాకు తెలుసు, నీ విధానం బాగా పనిచేసిందనీ, చాలా సమర్థంగా వుందనీ, అందరికీ సంతృప్తిగా పనులౌతున్నాయనీ. కాని, రాజకీయాలకిది పనికిరాదేమో?... ఇప్పటి పరిస్థితుల్లో ఇంత సమర్థంగా వుంటే మంచిది కాదేమో..." అంటూ కాస్సేపాగారు.

నా ఉత్సాహం అంతా క్రమంగా నీరు కారిపోతోంది. నేనేమీ మాట్లాడే ప్రయత్నం చేయలేదు.

ఆయనే మళ్ళీ అందుకున్నారు.

"రేపటి నుంచీ మనం పాత సిస్టమ్‌కి వెళ్ళిపోదామయ్యా! అన్నీ బాగుంటే సామర్థ్యం సంగతి ఆ తరువాత ఆలోచిద్దాం...." అన్నారు.

నేనేమనగలను?

అంతే!

రెండురోజుల్లో మళ్ళీ బంగళా కళకళలాడింది!

★ ★ ★

పదవి 'పీడ' - కరెన్సీ 'బండ'

ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావుగారు హడావుడిగా ఢిల్లీ బయల్దేరారు. నేనూ విమానాశ్రయం దాకా వెంట పరుగెత్తాను....

* * *

1972 అక్టోబరు చివర్లో ఏలూరులో ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాల విద్యార్థి ప్రతినిధుల సభ నిరవధిక సమ్మెకి పిలుపునివ్వటంతో ఆరంభమైన ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం 1973 వచ్చేసరికి పతాకస్థాయికి చేరుకుంది.

అలాంటి ఉద్యమం ఆంధ్ర ప్రాంతంలో అంతకుముందు ఎన్నడూ జరిగివుండలేదు. విద్యార్థులు క్లాసులు బహిష్కరించారు. ఎన్.జి.ఓ.లు నిరవధిక సమ్మె ప్రారంభించారు. న్యాయవాదులు కోర్టుల్ని బహిష్కరించారు. రైతుసంఘాల పేరుతో భూస్వాములంతా ఎక్కడికక్కడ ధర్నాలు, సభలు చేస్తున్నారు. జై ఆంధ్ర పేరుతో, ఇంకేదో పేరుతో రకరకాల యువసేనలు ఆవిర్భవించి, రాస్తారోకోలకు దిగాయి. రైళ్ళు, బస్సులు ఆగిపోయాయి. రవాణా స్తంభించింది. ఒక ఊరినుంచి మరో ఊరికి వెళ్ళాలంటే నడచివెళ్ళాలి లేదా ఎడ్లబండి మీద వెళ్ళాలి. లారీలు చెదురుమదురుగా నడిచినా దారిలో జై ఆంధ్ర కార్యకర్తలకి 'విరాళాలి'చ్చుకొంటూ వెళ్ళాలి.

ఉండుండి ఒక్కసారిగా ఆందోళనకారులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన రైల్వేస్టేషన్లమీదా, పోస్టాఫీసులమీద, టెలిగ్రాఫ్ ఆఫీసులమీదా దాడిచేసి విధ్వంసం సృష్టిస్తున్నారు. పోలీసు కాల్పులు - మరణాలు - గాయాలు - అరెస్టులు - కర్ఫ్యూ... ప్రతి కోస్తాజిల్లానీ వణికిస్తున్నాయి. మలబార్ నుంచి ప్రత్యేక పోలీసుదళాలు దిగాయి.... కోస్తా జిల్లాలన్నీ నిప్పుల కొలిమిలా వున్నాయి.

అప్పటి పరిస్థితి ఎంత భయంకరంగా వుందంటే– మంత్రి మజ్జి తులసీదాస్ తన శ్రీకాకుళం జిల్లా వెళ్ళటానికి హైదరాబాద్ నుంచి రైల్లో నాగపూర్ - రాయపూర్ మీదుగా వెళ్ళాల్సివచ్చింది.

* * *

ఇలాంటి స్థితిలో ముఖ్యమంత్రి ఢిల్లీ బయల్దేరారు. అధిష్ఠానవర్గం పిలిపించారు. వెళ్తూవెళ్తూ, "అందులోంచి మూడు తీసి మండలి కృష్ణారావుకివ్వు" అని నాకు చెప్పి, విమానం ఎక్కేశారు.

నేను తెల్లమొహం వేశాను.

ఎందులోంచి ఇవ్వాలి? ఏమిటివ్వాలి?

ఆలోచిస్తే, అప్పుడు స్ఫురించింది - ఇంట్లోంచి బయల్దేరేముందు ఆయన నాకొక పెద్ద ప్యాకెట్ ఇచ్చారు. నేను విమానాశ్రయానికి బయల్దేరే హడావుడిలో ఆ ప్యాకెట్‌ని నా రూమ్‌లో టేబుల్‌మీద పెట్టి వచ్చేశాను. ఆ ప్యాకెట్ ఇస్తూన్నప్పుడు ఆయన నాకు చెప్పారు. "ఇది నీ దగ్గరే వుంచు. ఏం చేయాలో తరువాత చెబుతాను." పుస్తకాలిచ్చారేమోననుకున్నాను. (ఆయనకు విపరీతంగా పుస్తకాలు చదివే అలవాటు - జీవితంలో చివరి క్షణాల వరకూ సాగింది.)

విమానం బయల్దేరగానే హడావుడిగా బంగళాకి వెళ్ళి, తాళంవేయని నా రూమ్‌లో చూస్తే... ఆ ప్యాకెట్ అక్కడే వుంది. విప్పి చూశాను. అందులో కరెన్సీ కట్టలు!!

ఒక్కసారిగా నాకు చెమటలు పట్టేశాయి. అయినా ఖంగారు ఖంగారుగా తలుపులు వేసేసి ఆ కరెన్సీ ఎంత వుందా అని చూశాను. పది లక్షలుంది. మైగాడ్! నాకు కాళ్ళల్లోంచి వణుకు పుట్టుకొచ్చింది. నెలనెలా నేను చూసే, జీతం తాలూకు కరెన్సీ 800 రూపాయలకి మించని రోజుల్లో, నేను కారు కొనుక్కోటానికి ప్రభుత్వంనుంచి తీసుకున్న అప్పు, మా మావగారిచ్చిన మూడువేలు కలిపి - 20 వేల రూపాయలు అప్పటివరకూ నేను నా కళ్ళతో ఒక్కసారిగా చూసిన అతిపెద్ద మొత్తం. ఈ పది లక్షలూ నన్ను భయభ్రాంతుడ్ని చేశాయి. ఏం చేయాలి? ఏం చేయాలి?

అసలీ డబ్బు ఎవరిది?

పార్టీదా?

పార్టీదయితే నాకెందుకిచ్చారు? పార్టీవాళ్ళకే ఇవ్వచ్చుగదా?

నేను ఐఏఎస్ ఆఫీసర్‌ని. ఇలాంటి కరెన్సీ కట్టలు మోసే పని నాకెందుకు అప్పగించారు? ఇలాంటివి నేను చేయకూడదని ఆయనకు తెలీదా? ఒకవేళ, ఢిల్లీ వెళ్తూవెళ్తూ హడావుడిలో ఎవరూ లేరని నాకిచ్చారా? ఎవరూ లేకపోవటమేమిటి? ఆయన వెంట కుటుంబ సభ్యులుకూడా వున్నారే! మంత్రులు, ఇతర నాయకులు చాలామంది వున్నారు గదా! అయినా నాకే ఎందుకిచ్చారు???

ఇప్పుడు పదిలక్షల రూపాయల కరెన్సీ కట్టల్ని (ఈ 2009లో దీని విలువ అయిదు కోట్లరూపాయలు వుండొచ్చు) ముఖ్యమంత్రి తిరిగొచ్చేదాగా ఎలా కాపలా కాయాలి? ఎక్కడ దాచిపెట్టాలి?.

భయం భయంగానే ఆ కట్టల్ని ఆ రూమ్‌లోనే బీరువాలో పెట్టి తాళం వేస్తుంటే విద్యాశాఖామంత్రి మండలి కృష్ణారావుగారు వచ్చారు.

"ప్రసాద్‌గారూ, ముఖ్యమంత్రిగారు నన్ను అర్జంటుగా బెజవాడ (విజయవాడ) వెళ్ళి సమైక్య ఆంధ్రప్రదేశ్‌కి అనుకూలంగా కొన్ని సభలు జరిగేలా చూడమని టెలిఫోన్ చేశారు. బెజవాడ వెళ్ళేముందు మిమ్మల్ని కలుసుకోమన్నారు...."

నాకు అర్థమైంది ఆ డబ్బు ఎందుకోసం తీసుకురాబడిందో.

మారు మాట్లాడకుండా, ఆ పదిలోంచి మూడులక్షల రూపాయలు తీసి కృష్ణారావుగారి కిచ్చాను. మిగతా ఏడు లక్షలూ అదే బీరువాలో పెట్టి తాళం వేశాను. వేశాను కానీ ఒకపెద్ద బండరాయిని నెత్తిన పెట్టుకుని మోస్తున్నట్టుగా వుంది. దీన్ని ఎలా పరిలించుకోవాలో తెలీటంలేదు. ఆయనకి టెలిఫోన్‌చేసి చెబుదామంటే, ఆయన విమానంలో వుంటారు. ఢిల్లీలో దిగాక అయినా ఈ ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం గొడవలో ఎంత బిజీగా వుంటారో!

ఇంక ఇంటికెళ్ళే ధైర్యం చేయలేకపోయాను. ఆ రాత్రంతా ఆనందనిలయంలోనే, ఆఫీసుగది లోనే వుండిపోయి, మర్నాడు సిఎంగారు వచ్చాక, ఆ కట్టలు అప్పగించేయాలని నిర్ణయించుకున్నాను.

రెండు గంటల తరువాత ఢిల్లీనుంచి సిఎంగారు టెలిఫోన్ చేశారు. కాని అంతవరకూ నా మనసులో అలజడి, ఆందోళన, బెంగ. "ఎందుకొచ్చానా బాబూ ఈ సిఎం ఆఫీసుకి?" అనుకుంటూ నిస్త్రాణగా సోఫాలో కూలబడ్డాను.

'ఇక్కడికొచ్చి నేను చేసిన మంచిపని ఒక్కటన్నావుందా?' అని నెమరువేసుకున్నాను. ఒక్కటీ గుర్తుకిరాలేదు. ముఖ్యమంత్రిగారి తత్వం, విచిత్రమైన పనితీరే– గుర్తుకొస్తున్నాయి.

★ ★ ★

నేను సిఎం ఆఫీసులో చేరేనాటికి రాజకీయ వర్గాల్లో - కాసు బ్రహ్మానందరెడ్డిగారిని మునసబుతోనూ, పి.వి.గారిని కరణంతోనూ పోల్చేవారు. పార్టీలోగాని, ప్రభుత్వంలోగాని ప్రణాళికలు తయారుచేయడం, తులనాత్మకంగా విషయ పరిశీలనచేసి, నిర్ణయం తీసుకొనేవారికి సలహాలివ్వడం, పార్టీ ఆదర్శాలకనుగుణంగా పథకాలు తయారుచేయడం, మ్యానిఫెస్టోలు రాయడం వంటి మేధస్సుతో నిండిన కసరత్తు చేయడం పి.వి.గారి ప్రత్యేకత.

నిర్ణయాలు త్వరగా తీసుకోలేరని, చాలా జాప్యం చేస్తారని ఆయనపై విమర్శ. ప్రభుత్వ విధాన వ్యవహారాల్లోనూ ఆయన నమ్మిన సిద్ధాంత విషయాలపై విప్లవాత్మకమైన నిర్ణయాలు ఎన్నో ఆయన ముఖ్యమంత్రిగాను, ప్రధానమంత్రిగాను చేశారు. కాని ప్రస్తుత రాజకీయాల్లో విధాన నిర్ణయాల ప్రతిభ ఎవరికి కావాలి! అందరిదృష్టి వ్యక్తిగత ప్రతిష్ఠపెంచుకోవడం మీదనే. ఎవరికి ఏం పదవి యిచ్చారు, ఏ అధికారుల్ని ఎక్కడ పోస్టు చేశారు, కావలసిన వాళ్ళకు ఏమి చేశారు - వాటిమీదే ధ్యాస.

కాని పివిగారికి అందులో నమ్మకమూ లేదు, ఆసక్తీలేదు. అవసరం వుందని అనుకోనూ లేదు. అందుకే అటువంటి విషయాల్లో చాలా జాప్యంకూడా చేసే అలవాటు చేసుకొని, అందరూ

అపార్థం కూడా చేసుకునేందుకు అవకాశమిచ్చారు. చిన్ననాటి నిజాంపాలనలోని అనుభవంవల్లనో లేక తరువాత రాష్ట్రంలో ఆయన విమర్శనాత్మక పరిశీలనవల్లనో – ఆయన అప్పుడప్పుడు అంటూ వుండేవారు : "మన రాష్ట్రంలో రాజకీయాలలో రెడ్లని, పరిపాలనలో (అధికారుల్లో) కాయస్థుల్నీ దూరంగా వుంచకూడదు". చివరిదాకా అది ఆయన ఆచరించినట్లు అనిపిస్తుంది.

ఆయనతో సన్నిహితంగా వున్నవారితో, ఎంత చిన్నవాడైనా, నమ్మితే మనసు విప్పి మాట్లాడగలరు. చాలామంది "ఆయన తన మనస్సులోమాట బయటకి చెప్పడు, అపర చాణక్యుడు" అని అంటే వింటూంటాం. నిజమే. ఎవరితో ఎంతవరకు అవసరమో అంతవరకే మాట్లాడే స్వభావం. మాట్లాడేకంటే యితరులు చెప్పేది శ్రద్ధగా వినే స్వభావం. తనముందు పెట్టిన ఏ కాగితాన్నయినా క్షుణ్ణంగా శ్రద్ధతో చదివే అలవాటు వున్న మనిషి. కొత్త ప్రతిపాదన ఏదైనా ప్రభుత్వం చేపడుతున్నప్పుడు తన అభిప్రాయం బయటకు చెప్పకుండా అందరు చెప్పేది వినే స్వభావం. తన మనసు బయటపెడితే, అందరూ వారి వుద్దేశ్యాలు చెప్పకుండా, తన వుద్దేశ్యాన్నే సమర్థిస్తారు. అప్పుడిక చర్చ చేయడమే అనవసరమని ఆయన భావన. నిర్ణయానికి ముందు అందరు చెప్పిందీ విని తనకు మంచిదనిపించిన విధంగా నిర్ణయాలు తీసుకోవడం అలవాటు. చాలా ప్రజ్ఞావంతుడు అవడంవల్ల ప్రతి విషయాన్ని అన్ని కోణాల్నుంచి ఆలోచించడం అలవాటయింది. ఒక్కోసారి నిర్ణయాలు ఆలస్యం కావడానికి అదొక కారణం. పెద్దపెద్ద విధాన నిర్ణయాలేకాకుండా చిన్న విషయాలకు కూడా అలవాటు చొప్పున ఆలోచించడం మొదలుపెడితే – తప్పకుండా నిర్ణయాలలో జాప్యం జరిగే అవకాశంవుంది.

దీంతో కొంతమంది అధికారులు బాగా ఇబ్బందిపడేవారు. ఫైళ్ళు అన్నీ క్షుణ్ణంగా చదవడం ఆయనకు అలవాటు. ముఖ్యమంత్రికి చాలా ఫైళ్ళు వస్తుంటాయి. అందులో 80/90 శాతం రొటీనుగా సంతకాలు పెట్టేవి, విషయం తెలియ చేయడానికి వచ్చేవి. అదివరకే నిర్ణయం తీసుకోబడి, తదనంతర ఆమోదానికి వచ్చేవి. చాలావరకు ఆయన రాత్రిపూట ఫైళ్ళు చూసి పంపించేసేవారు. కొన్ని ముఖ్యమైన ఫైళ్ళు బయటకు వచ్చేవికావు. కొన్నిటిలో ఆయన నిర్ణయం తీసుకొన్నా, ప్రతిపాదనతో ఏకీభవించినా, ఫైలు పంపించేవారు కాదు. ఎందుకో నాకు అర్థమయ్యేది కాదు. అడిగితే "చూద్దాంలే" అనేవారు. మంత్రులు, అధికారులు మాత్రం, "యిదేమిటయ్యా ముఖ్యమైన ఫైలు యింకారాలేదా. త్వరగా క్లియర్ చేయించి పంపించు" అనేవారు.

కొండపల్లి వాసుదేవరావుగారని ఒక సీనియరు ఐఏఎస్ ఆఫీసర్. అప్పుడు దేవాదాయశాఖ కమిషనరుగా వుండేవారు. సిఎం గారితో వ్యక్తిగత పరిచయం కూడా వుంది. మంచి ఆఫీసరు. ఆయనది ఒక ముఖ్యమైన ఫైలు రెండుసార్లు వచ్చి Speak file గా మారింది. ఆయన ఆ ఫైలు తీసుకొని సిఎం గారితో చర్చించడానికి వచ్చారు. సిఎం గారితో మాట్లాడటానికి ముందు నన్ను కలిసి ఒక సహాయం చేయమన్నారు. "ఈ ఫైలు ఇవ్వాళ క్లియర్ కావాలి. నువ్వు నేను చెప్పినట్లు చేస్తే ఈ ఫైలు క్లియర్ అవుతుంది" అన్నారు. సరేనన్నాను. ఆయన చెప్పుకొచ్చారు : "నేను

సిఎం గారితో విషయం చర్చిస్తున్నప్పుడు నువ్వు పక్కనేవుండు. నేను ఆయనకు విషయం వివరిస్తాను. ఆయన ఒకటి రెండు ప్రశ్నలు వేస్తారు. నేను సమాధానం ఇస్తాను. 'మంచిది' అని ఆయన ఫైలు క్లియర్ చేయడానికి ఒప్పుకొని, సంతకం చేయడానికి కలం తీసి సంతకం చేయబోయి, మళ్ళీ కలమూ, ఫైలూ మూసేసి, 'నేను పంపిస్తాలే, నువ్వు వెళ్ళు' అంటారు. అప్పుడు నువ్వు చొరవతీసుకొని 'అన్ని విషయాలూ చర్చించాంకదండీ, ఇదేదో ఇప్పటికే ఆలశ్యం అయినట్లుంది. కొత్త అంశాలు చర్చించేవి లేకపోతే క్లియర్ చేస్తే మంచిదేమో' అను. ఆయన వెంటనే కలంతీసి సంతకం చేసేస్తారు. అంతే" అన్నారు.

అలాగే నేను ఆయనతోకూడా లోపలికెళ్ళాను. సిఎం గారి ప్రక్కనేవుండి గమనిస్తున్నాను. వాసుదేవరావుగారు చెప్పినట్లే ముఖ్యమంత్రిగారు శ్రద్ధగా విన్నారు.

రెండు ప్రశ్నలు వేసి, సమాధానంతో సంతృప్తిచెంది, సంతకం పెట్టడానికి నిర్ణయించుకొని, కలం మూత తీసి, సంతకం చేయబోయి, మళ్ళీ కలంమూసేసి, "నేను పంపిస్తాలే, మీరు వెళ్ళండి" అన్నారు. వాసుదేవరావుగారు నావేపు చూచారు. నేను ముందే అనుకున్నట్లుగా, "క్లియర్ చేసేస్తే మంచిదేమో సర్" అన్న సలహా ఇచ్చాను. అంతే! వెంటనే సిఎంగారు కలంతీసి ఫైలుమీద సంతకం చేసేశారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. బయటకు రాగానే వాసుదేవరావుగారు నాకు ముఖ్యమంత్రిగారి మనస్తత్వం గురించి వివరించారు.

"వారు నాకు 30 సంవత్సరాలుగా తెలుసు. ఆయన ప్రజ్ఞే ఆయనకు రక్ష. అదే కొన్నిసార్లు ఆయనకు శత్రువు. ఇంకా ఏదైనా పరిశీలించాల్సింది మర్చిపోయానా అన్న సందేహంతో నిర్ణయానికి వచ్చిన తర్వాత కూడా దీన్ని ఇంకోసారి చూడాలనుకుంటారు. ఆయనకు నమ్మకంవున్న వారు దాన్ని సమర్థిస్తే వెంటనే నిర్ణయం తీసుకుంటారు. నువ్వు ముఖ్యమైన విషయాల్లో ప్రయత్నించిచూడు – నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనకు సహాయం చేసినవాడవవుతావు. ఆయన కార్యదర్శిగా బాధ్యత కూడా అదే.... కాని ఇది ఎప్పుడూకాదు. అప్పుడప్పుడూ, ముఖ్యమైన విషయాల్లో అందులోనూ నీకు విషయం పూర్తిగా అవగాహన వుండి నిర్ణయం తప్పకుండా తీసుకోవల్సివస్తేనే.... వుపయోగించు. నువ్వొక్కడవే ఫైలు తీసుకువెళ్ళి ఈ పద్ధతి వాడితే పనికాకపోవచ్చు. ఆలోచించి ఆయనకు మంచిపేరు వచ్చేటట్లు చూడు.... రాజకీయాల్లో యింకా ఎంతో ఎదిగే అవకాశం కలవారు. మనందరం ఎవరికి చేతనయిన సేవ వారు చేయాల్సిన అవసరం వుంది" అన్నారు.

పై సంఘటన జరిగిన కొద్ది రోజుల్లోనే ఒకనాడు మంత్రి జలగం వెంగళరావుగారు ఒక చాలా ముఖ్యమైన ఫైలు గురించి (అడవులలో వెదురుపై రాయల్టీ విషయం అనుకుంటాను) ప్రస్తావన చేశారు. చాలా రోజులనుంచి ఈ విషయం నిర్ణయం తీసుకోలేదనీ, రాష్ట్రానికి చాలా ఆర్థికనష్టం కలుగుతుందనీ, దీనిని ఆసరాగా తీసుకొని క్రింద లెవెల్లో అధికారులు అనధికారికంగా చాలా దొంగ రవాణాకు సానుకూలం చేస్తున్నారనీ, తాను ముఖ్యమంత్రితో మూడునాలుగుసార్లు అప్పటికే మాట్లాడాననీ, ఆయన ఈ విషయంలో తనతో ఏకీభవిస్తున్నారనీ, నిర్ణయం కూడా

ఆయన తీసుకొన్నారనీ, కాని సంతకం అయి కూడా, ఫైల్ వాపసు రావడంలేదనీ.... చెప్పారు. "నువ్వు మామూలు అంతరంగిక కార్యదర్శికాదు. ఒక ఐఏఎస్ అధికారివి. ఆయన కార్యదర్శిగా ఆయనకు సలహానిచ్చి ప్రయత్నించు. నేనైతే చేయించలేకపోయాను" అన్నారు. అప్పుడు వాసుదేవరావు గారి సలహా జ్ఞాపకం వచ్చి, "నా ప్రయత్నం నేను చేస్తా సర్" అన్నాను.

ఆ ఫైలు ముఖ్యమంత్రి ఆఫీసులోనే వుంది. పూర్తిగా చదివి, సంబంధిత కార్యదర్శులతో, అధికారులతో చర్చించాను. అందరూ, ఈ విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలనీ, ఇప్పటికే బాగా ఆలస్యం అయిందనీ చెప్పారు. మళ్ళీ ఫైలు వెంగళరావుగారికిచ్చి ఆయనను సిఎంగారి దగ్గర ఆ విషయంలో ఫైలుమీద మాట్లాడడానికి పిలిపించాను. చర్చ జరిగింతర్వాత ముఖ్యమంత్రి గారు ఆ ప్రపోజల్సుకి ఒప్పుకొన్నారు. అంతా అయ్యాక "ఫైలు తర్వాత పంపిస్తాలెండి" అన్నారు. అప్పుడు నేను అందుకొన్నాను "నిర్ణయం తీసుకొన్నాం గదా సర్. ఇప్పుడే పంపితే సరిపోతుందేమో, ఇప్పటికే ఆలస్యం అయిందంటున్నారు కూడా" అంటూ సలహా ఇచ్చాను. సిఎంగారు సంకోచించకుండా ఫైలుమీద సంతకంచేసి ఇచ్చేశారు.

కొన్ని ముఖ్యమైన విషయాలు వచ్చినప్పుడు, కొన్నింటిలో ఆయన సంతకం చేయడానికి సంకోచించినప్పుడు, నేను ఒకమాట వేసేవాణ్ణి. పని జరిగిపోయేది.

ఇదంతా పరిపాలనా విషయాల్లోనే. రాజకీయ వ్యవహారాలు నేను కల్పించుకునేవికావు. ఆ రోజుల్లో కొన్ని ముఖ్య నిర్ణయాలు తీసుకోవాలంటే హైకమాండు నుండి ఆదేశాల కోసం ఎదురుచూడాల్సిందే. ఇందిరాగాంధీ గారితో మాట్లాడడానికి ముఖ్యమంత్రికి తరచూ అవకాశం దొరకదు. ఆవిడ చుట్టుపక్కల వారితో విషయం చెబితే, వారు ఆవిడతో మాట్లాడి ఆదేశాలు అందచేయాలి. ఇవన్నీ అయ్యేప్పటికి ముఖ్యమంత్రిగారు నిర్ణయాలు తీసుకోరనీ, తీసుకోలేరనీ ప్రచారం జరిగిపోయేది.

అక్కడే, అంత దగ్గరగా పనిచేస్తున్నా, ఈ విషయం తెలియడానికి నాకు కొన్నిరోజులు పట్టింది. ముఖ్యమంత్రిగారి నోటితోనే ఈ విషయం బయటికి రావడంతో కాంగ్రెసు ముఖ్యమంత్రుల జీవితం ఆ రోజుల్లో ఎంత క్లిష్టమయిందో అర్థమయింది. అదైనా ఎలా జరిగిందంటే....

ప్రత్యేక ఆంధ్రా ఉద్యమం ఊపందుకుంటోంది. ఆముదాలవలసనుంచి అనంతపురం దాకా అల్లర్లు, విధ్వంసాలు, ఉద్రేకాలు ఎంతవరకూ వచ్చాయంటే మంత్రివర్గంలోని కొందరు మంత్రులు కూడా రాజీనామా చేసి, బాహాటంగా బయటకు వచ్చి, వుద్యమాన్ని ప్రోత్సహించి అల్లర్లు, అలజడి చేస్తున్నారు. శాంతిభద్రతలు కాపాడాలంటే వెంటవెంటనే నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఒకవైపు విశాఖలో తెన్నేటి విశ్వనాథంగారు, ఇంకోవైపు విజయవాడలో కాకాని వెంకటరత్నంగారు - ఇంకాఎందరో ఎన్నిచోట్లో ఆందోళనలు చేస్తున్నారు. విద్యార్థినాయకులపై,

రాజకీయ నాయకులపై చర్య తీసుకోవాలి, అరెస్టులు చేయాలి. పోలీసులు వారిపని వారు నిష్పక్షపాతంగా కఠినంగా చేయవలసిన అవసరం పెరిగిపోతోంది.

ప్రతి రోజూ, ప్రధాన కార్యదర్శి వి.కె.రావుగారు, ఇనస్పెక్టర్ జనరల్ నారాయణరావు, ఇంటెలిజెన్స్ ఐ.జి, పొలిటికల్ కార్యదర్శి, సిటీ పోలీసు కమీషనరు ముఖ్యమంత్రిగారి దగ్గరకు వస్తున్నారు. వాళ్ళొచ్చి పరిస్థితులు విషమిస్తున్నాయని చెప్పడం, వెంటనే తగుచర్య తీసుకోకపోతే పరిస్థితి చేయిదాటిపోవచ్చని చెప్పటం.... ముఖ్యమంత్రిగారు ఆలోచించి "సరే రేపు నిర్ణయం తీసుకొంటాం" అని చెప్పి వాళ్ళని పంపించేయటం - ఇలా నాలుగు రోజులు గడిచింది.

మరుసటిరోజు, మళ్ళీ సీనియరు అధికార్లందరూ వచ్చి నా రూమ్‌లో కూర్చున్నారు. ముఖ్యమంత్రిగారి రూమ్‌లో దాదాపు 10మంది మంత్రులు, సీనియర్ లీడర్లు ఉదయం నుంచి వున్నారు. వచ్చేవారు వస్తున్నారు, వెళ్ళేవారు వెళ్తున్నారు. వాళ్ళు వస్తే ఈ సీనియరు అధికార్లను సిఎంగారి రూముకి పంపాలని నా ఆలోచనన. అందరూ కనీసం 30 సంవత్సరాల సర్వీసు వున్న ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు. ఆ రూములో నేనొక్కడినే అన్ని విషయాలలో చిన్నవాడిని. నాలుగు సంవత్సరాల సర్వీసు. ఈ విషయాలలో అనుభవం తక్కువ. కాని ముఖ్యమంత్రికి కార్యదర్శిని. సిఎంగారి కోసం వేచి వున్నప్పుడు వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకోవడం వింటూనే వున్నాను.

"....ఇట్లా అయితే కష్టమే... వందమందినైనా నాలుగైదు రోజుల క్రితమే అరెస్టు చేసి వుండాల్సింది. జిల్లాల్లో అధికారులు చాలా అశాంతితో వున్నారు... పరిస్థితులు అదుపు తప్పి పోతున్నాయి... అరెస్టు చేయాల్సిన రాజకీయ, విద్యార్థి నాయకుల జాబితా సిఎంగారికిచ్చి నాలుగు రోజులైంది... నిర్ణయాలు తీసుకోకపోతే శాంతి భద్రతలు కాపాడేదెట్లా? ఏదైనా అవాంఛనీయమైంది జరిగితే అదికూడా ఆయన మీదకే వస్తుంది... ఈయనకు అర్థం కావటంలేదు... ఇవాళ నిర్ణయం తీసుకోకపోతే రేపు నిర్ణయం తీసుకోవడానికి ఆయన సిఎంగా వుండద్దూ..."

అంతలో ఇంకో ఆఫీసరు నొక్కిచెప్పడం మొదలెట్టాడు. "ఇవ్వాళైనా, రేపైనా అదే చెప్తారు - నాలుగురోజులనుంచి చెబుతున్నదే- 'రేపు నిర్ణయం తీసుకొందాం' అని. రేపు నిర్ణయం తీసుకొన్నా ఏం లాభం? జరగవల్సిన నష్టం జరిగిపోయింది... రాష్ట్రపతి పాలన పెట్టాలన్న ప్రతిపాదనలు వినిపిస్తున్నాయి. రేపు ఆయన సిఎంగా వుండకపోవచ్చు కనక ఆ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరమే వుండదు..."- ఈ భావాల్ని మిగతావాళ్ళుకూడా సమర్థిస్తూ తలోమాట వేస్తున్నారు. 'అవునూ, సిఎంగారు ఎందుకు నిర్ణయం తీసుకోరు?' ఇది నాలో నాకు కలిగిన సందేహం.'

నేను రెండుమూడుసార్లు సిఎం గారికి సీనియరు అధికార్లు "మీకోసం నా గదిలో వేచివున్నారు సర్" అని చెప్పాను. ఆయన "ఇదిగో వస్తున్నా" అంటున్నారు. రావడం లేదు.

ఈ అధికార్ల మాటలు వింటుంటే పరిస్థితులు ఎంత క్లిష్టమో తెలుస్తూనేవుంది. సిఎం గారు మాత్రం ప్రతి పది నిమిషాలకూ పైకివెళ్ళటం - క్రిందకురావటం - ఆయన గదిలో నాయకులతో దర్బారు...

నేను ఈ సారి మళ్ళీ ఆయనకు జ్ఞాపకం చేయడానికి వెళ్ళినప్పుడు ఆయన కొంచెం విసుగుతో లేచి అధికార్లను కలవడానికి నా రూముకే వచ్చేశారు. నా సీట్లోనే కూర్చుని వారు చెప్పిన శాంతి భద్రతల గురించి విన్నారు. వెంటనే అరెస్టులు చేయాలని వారనటం -ఆయన తల వూపి "రేపు నిర్ణయం తీసుకొందాం" అనటం జరిగింది. ఆ మాట వింటూనే అంతా నిశ్శబ్దం.

హఠాత్తుగా నాకేమైందో తెలియదు. ఏదో ఆవహించినట్లుగా- ఆయన రాకముందు వాళ్ళు మాట్లాడుకొన్న విషయాలన్నీ ఆయనకు వాళ్ళ సమక్షంలోనే చెప్పేశాను. ముఖ్యంగా.... "ఇవాళ నిర్ణయాలు తీసుకోకపోతే, రేపు నిర్ణయాలు తీసుకోవడానికి మీరు ముఖ్యమంత్రిగా వుండకపోవచ్చని వీళ్ళంతా అనుకుంటున్నారు." ఆ మాటలు చెప్తుంటే చీఫ్ సెక్రటరీ వి.కె.రావుగారు నా చేయి నొక్కి నన్ను ఆపాలని ప్రయత్నించారు.

అంతా నిశ్శబ్దం....

ముఖ్యమంత్రిగారి ముఖం పాలిపోయినట్లయింది. నా తెలివితక్కువతనానికి ఏం చేయాలో తెలియక సీనియరు అధికార్లందరూ చేష్టలుడిగి వుండిపోయారు. అలా కొన్ని క్షణాలు గడిచాయి...

ముఖ్యమంత్రిగారు గబుక్కున కుర్చీలోంచి లేచి, "ప్రసాద్ ఇలా రా" అని నన్ను గదిలోంచి బయటకు తీసుకువెళ్ళారు. అలా మాట్లాడి, నేనేమైనా చాలా తప్పు చేశానా? ఎంతో సీనియరు అధికార్లు, ఆయనకు ఎప్పటినుంచో తెలిసినవారు, చాలా బాధ్యత కలవారు, ఎవరూ చెప్పని విషయం నేనెందుకు చెప్పాను? చెప్పినా అలా అంతమంది అధికారులముందు, వాళ్ళంతా సిఎం గురించి ఏమనుకొంటున్నారో అలా చెప్పడం సమంజసమా? చీఫ్ సెక్రటరీగారు అలా చేయినొక్కి నన్ను ఆపడానికి ప్రయత్నం చేశారంటే, నేను ఆ విషయం అలా మాట్లాడకూడదనేగా!.. ఇలా ఎన్నో ఆలోచనలు. అంత బాధ్యతారహితంగా మాట్లాడినందుకు నన్ను సస్పెండు చేస్తారేమో!.. ...అలా అనుకుంటూ ఆయన వెనకే నడిచాను. ఆయన తన గదిలోకి పోకుండా మేడపైన ఆయన పడక గదిలోకి వెళ్ళారు. సందేహిస్తూ ఆయన వెనకే నడిచాను.

గదిలోకి వెళ్ళగానే నేను చెప్పిందంతా వివరంగా చెప్పమన్నారు. నాలుగురోజులనుంచి జరుగుతున్నదంతా వివరించాను. మనం నిర్ణయాలు ఎలా తీసుకోవడంలేదో, దానికి అధికారుల ప్రతిస్పందన ఎలావుందో చెప్పినప్పుడు- "అది నాకూ తెలుసు, వీరందరూ మన మంచికే చెప్తున్నారు. ఈ నిర్ణయం తీసుకోవడం శాంతిభద్రతలకు ఎంతైనా అవసరం. మూడురోజుల క్రితమే చేయవలసింది. కాని నేనేం చేయను? హైకమాండ్ నుంచి ఆదేశాలు లేవు. గంట

గంటకు మాట్లాడుతున్నాను. ఆ మహాతల్లి (ఇందిరాగాంధి) ఎప్పుడోగాని డైరెక్ట్‌గా మాట్లాడదు. చుట్టుపక్కల వాళ్ళకి చెప్తే, 'తొందరపడద్దు, ఆవిడకు చెప్పాం, వెయిట్ చేయమంటున్నారు' అంటున్నారు. అరెస్టు చేయాలని మూడురోజుల క్రితమే చెప్పాను. అంతా కాంగ్రెసు నాయకులే. విశ్వనాథంగారు నాకు చాలా స్నేహితుడు కూడా. అయినా నేను నిర్ణయం తీసుకొని, ఇది రాజకీయవిషయం కనుక ఆవిడ క్లియరెన్స్ కోసం ఎదురుచూస్తున్నాను..."

"రాష్ట్రపతి పాలన గురించి కూడా మాట్లాడుకుంటున్నారు..." అని వూరుకొన్నాను.

"అవును. నేనూ విన్నాను. రాజకీయ పరిష్కారం కాకపోతే, రాష్ట్ర విభజన చేయకుండా వుండాలంటే, తెలంగాణా ముఖ్యమంత్రిని కనుక నన్ను తొలగించవచ్చు. కాని ఇప్పుడు ఆంధ్రావాణ్ణి సిఎంని చేస్తే తెలంగాణా ఉద్యమం మొదలవుతుందని భయం. అందుకని కొంతకాలంపాటు రాష్ట్రపతి పాలన రావచ్చు-...."

"..... మరి దానికి శాంతి భద్రతల వైఫల్యంగా చూపించి, అంత గందరగోళం జరుగుతూ వున్నా మీరేమీ చర్య తీసుకోలేదని బాధ్యత అంతా మీపైన వేయవచ్చుగదా సర్...!"

"తప్పకుండా వేస్తారు. హైకమాండ్ ఎప్పుడూ తప్పుచేయదు. తప్పు జరిగినప్పుడల్లా నాలోటివాడెవడో ఒకడుంటూనే వుంటాడు...."

"మరి మీకు ఉచితమనుకున్న నిర్ణయం మీరు తీసుకోవచ్చుకదా సర్"

"రాజకీయబలం, స్తోమతవుంటే తీసుకోవచ్చు నామినేటెడ్ ముఖ్యమంత్రుల పని హైకమాండ్ చెప్పినట్లు చేయడమే. ఏదైనా తప్పు జరిగితే బాధ్యత తీసుకోవడమే... అంతే" అని వేదాంత ధోరణిలో అన్నారు.

"ఈ పరిస్థితులు విషమించాయి కనుక ఇలా చెప్తున్నానని హైకమాండ్ కి చెప్పండి సర్. మనం చేయదలచుకొన్నది ఇప్పుడయినా చేద్దాం" అని సంకోచిస్తూనే అన్నాను.

"అలా చేయక ఇంకేం చేస్తాం..." అంటూనే టెలిఫోన్‌లో ఢిల్లీకి మాట్లాడి చెప్పదలచుకొన్నది చెప్పేసి, క్రిందకువచ్చి అధికార్లతో "శాంతి భద్రతల దృష్ట్యా మీరు చేయాల్సింది చేసేయండి" అని ఆదేశాలిచ్చేశారు.

★ ★ ★

"ఇదా నేను చేసిన ఉద్యోగం" అనుకుంటూంటే ఢిల్లీనుంచి సిఎం టెలిఫోన్ చేశారు.

ఒక్క ఉరుకు ఉరికాను ఆ కరెన్సీ కట్టల గురించి మాట్లాడాలని. నేను నోరు విప్పేలోపల ఆయన చెప్పేస్తున్నారు. "ఆ మంత్రి మదన్‌మోహన్ వస్తాడు. ఆయనకి రెండివ్వు. పరకాల శేషావతారం (మంత్రి) వస్తాడు. ఒకటివ్వు. ఇంకో విద్యార్థి నాయకుడు (పేరు గుర్తుకులేదు)

వస్తాడు. ఒకటివ్వు. నేను మళ్ళీ మాట్లాడతాను" అంటూ టక్కున ఫోన్ పెట్టేశారు. మళ్ళీ కూల బడ్డాను.

మరుసటిరోజు పివిగారు వచ్చేశారు. ఆయన వస్తూనే నేను పరుగుపరుగున మేడమీద ఆయన గదిలోకి వెళ్ళి, ఆ పంపిణీలవగా మిగిలిన మూడు లక్షలూ ఆయనకిచ్చేసి ఓ నమస్కారం చేశాను.

"సర్, మీరు నామీద వుంచిన విశ్వాసానికి కృతజ్ఞుణ్ణి. కాని నాకు ఈ పని సబబుగా అనిపించటం లేదు. తమరు ఏమీ అనుకోకపోతే నాకు ఈ పని అప్పజెప్పద్దని ప్రార్థిస్తున్నాను. తప్పకుండా మీరు అర్థంచేసుకొంటారనుకుంటాను..."

ఆయన నవ్వేశారు.

"నేను అనుకుంటూనే వున్నాను. నువ్వు ఇలా అంటావని. ఇటువంటి పని తమకి అప్పగిస్తే బాగుండునని ఎంతోమంది మన ఆఫీసర్లు, మా నాయకులు అనుకుంటుంటారు. వాళ్ళమీద అంతంత మాత్రం నమ్మకమే. అందుకే నీబోటివాడికిద్దామనుకున్నాను. నీకిచ్చి చూశాను. నువ్వు ఒప్పుకొని చేస్తే, నీచేత చేయించాలనుకొన్నాను. ఇది నాకూ నచ్చిన పని కాదు. ఏదో అపరాధ భావం నాకూ వుంది. కాని ఈ రోజుల్లో రాజకీయాల్లో ఇది చేయకుండా జరగటంలేదు... మంత్రిగా వున్నంతకాలం ఇటువంటి వాటికి చాలా దూరంగానే వున్నాను. ఎన్నికల్లో కూడా ఎవరిచేతో చేయించానుగాని, నా అంతటనేను కలగజేసుకోలేదు.... ముఖ్యమంత్రిగా తప్పేట్లు లేదు. అంతా హైకమాండ్‌ని సంప్రదించే చేయాలి. లెక్కసరిగ్గా లేకపోతే నేను తిన్నాననుకుంటారు. ఏమైనా నాకైతే తప్పేట్లు లేదు. నువ్వు కుర్రవాడివి. మంచి భవిష్యత్తువున్న ఐఏఎస్ అధికారివి. ఇటువంటి విషయాలలో నిన్ను ఇంకెప్పుడూ ఇబ్బంది పెట్టను లేవయ్యా...." అంటూ ఓ నవ్వు నవ్వారు.

ఇది జరిగిన కొద్దిరోజుల్లోనే రాష్ట్రపతి పాలనకు రంగం సిద్ధమైంది. పివిగారు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయటానికి వెళ్తుంటే– ఆయన రాజీనామా పత్రాన్ని తయారుచేసి, ఆయనతో పాటే వెళ్ళాను.

రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కిచ్చేసి, బయటకు వచ్చి కారెక్కగానే, పివిగారు ఒక నిట్టూర్పు విడిచారు. చేత్తో తలరుద్దుకొని, "అబ్బ, ఈ పీడ విరగడై పోయిందయ్యా" అన్నారు.

నా మనస్సులో కరెన్సీ కట్టల బండరాయి మెరిసింది.

"అవున్సార్. పెద్దబండ దిగిపోయింది!" అన్నాను నేను కూడా.

★ ★ ★

సిఎం వెంగళ్రావు అడిగిన ఫేవర్!

ఒక పరిపాలనాదక్షుడిగా జలగం వెంగళరావు అంటే నాకు చాలా గౌరవం. కాని, నేను ఖమ్మం కలెక్టరుగా వున్నప్పుడు, రెండేళ్ళు గడిచాక, ఓ రోజు ప్రొద్దున్నే ముఖ్యమంత్రి వెంగళరావుగారు నాకు టెలిఫోన్ చేసి, ఒక 'ఫేవర్' చేసిపెట్టమని అడిగారు.

రాజకీయాలకి ఎవరూ అతీతంకాదు కదా!

★ ★ ★

"ప్రసాదూ, ఖమ్మం జిల్లా కలెక్టరుగా నువ్వు వెళ్ళాలని నా కోరిక. నేను సిఎంగా వుండగా కనీసం నా జిల్లా ఐనా బాగుచేసుకోలేకపోతే ఏం ప్రయోజనం?... నీకు ఎటువంటి జోక్యం ఎవరినుంచీ వుండదు - నా నుంచి కూడా. అంటే ఎటువంటి రాజకీయ వత్తిడులు వుండవు. మీ యంత్రాంగం పనిలో నేను జోక్యం చేసుకోను, నాకు అనవసరపు రాజకీయ యిబ్బందులు నువ్వు తేకూడదు... అంతా కలసి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం... అభివృద్ధి పనులకోసం నువ్వేం కావాలంటే అది ఇవ్వడానికి నేను సిద్ధం..." అన్నారు జలగం వెంగళరావుగారు. ఇది 1974లో.

వెంగళరావుగారు ముఖ్యమంత్రి అయి అప్పటికి ఒక సంవత్సరం కావస్తోంది. మొదట్లో తనకి కావాలని ఆయనే తన ఖమ్మంజిల్లాకి పార్థసారథిగారిని కలక్టరుగా వేసుకొన్నారు. పార్థసారథి మంచి ఆఫీసరు. ఏదేదో వెంటవెంటనే చేయాలన్న తహతహ కల మనిషి. పేదలంటే చాలా అభిమానం కలవాడు. 24 గంటలూ కష్టపడి పనిచేసే స్వభావం... మరి అతనిని ఒక్క సంవత్సరంలోనే మార్పు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? కావాలనే అతన్ని తీసుకువెళ్ళారుగా!

మనస్సులో సిఎం గారినే అడిగెయ్యాలనుకున్నాను గాని బాగుండదేమోనని తటపటాయించాను.

వెంగళరావుగారు చాలా తెలివైనవారు. మనస్సులో విషయాన్ని ఇట్టే పట్టేస్తారు. పెద్దగా చదువుకోలేదు కాని, మంచి లౌకికజ్ఞానం వున్నవారు.

"పార్థసారథిని ఎందుకు మారుస్తున్నానని నీకు సందేహం కలగొచ్చు. మనిషి మంచివాడే, చాలా కష్టపడతాడు... కాని పనులు కావడం లేదు. జిల్లాపరిషత్తుతో తగాదా. కొంత తనమాటే చెల్లాలంటాడు. జిల్లా అభివృద్ధికి ప్రణాళిక తయారుచెయ్యాలని రూ.30,000 కోట్లకు, 3000 పేజీల రిపోర్టు తయారుచేసి, వందలకాపీలు తీయించాడట. అంతడబ్బు కావలసివుండవచ్చు, కాని ఎన్నేళ్ళకు అంత నిధులు దొరుకుతాయి? మనకున్నదాంట్లో ఎంతవరకు మనకున్న

సమయంలో చేయగలమో కొంచెం ఆలోచించాలి గదా? ఆయనపై నాకేం కోపంలేదు. నేనే కదా తీసుకువెళ్ళింది. నాకు సిఎంగా అవకాశం మూడేళ్ళో, నాలుగేళ్ళో. ఈ లోపల జరిగినంత పని చేసేయాలి కాని... వూరికే కాగితం ప్రణాళికలతో నాకేంపని? అందుకే నువ్వు వెంటనే చేయవలసింది, చేయగలిగింది ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా చేసేయ్యాలి" అన్నారు ముఖ్యమంత్రి.

"అలాగేనండి" అని బయటకువచ్చాను.

★ ★ ★

ఖమ్మంలో కలెక్టరుగా పని చేసిన మూడు సంవత్సరాలూ దాదాపు ప్రతిరోజూ జిల్లాలో ఎక్కడవున్నా వెంగళరావుగారు ఉదయం నాతో మాట్లాడేవారు... వేరే విషయాలేమీ వుండేవికావు. అన్నీ జరగాల్సిన, జరుగుతున్న పనులగురించే... ఆ రోడ్డుపని ఎంతవరకు వచ్చింది? ఆ టాంకు పని మొదలు పెట్టారా? అక్కడ కరెంటు సబ్‌స్టేషను పూర్తయిందా? ఆ హౌసింగ్‌కాలనీ విషయమేమిటి? ...ఇలా ఊరు ఊరు పేరుపేరునా ప్రతిపని గురించి అడిగేవారు...

ఆయన మంత్రికాక ముందు ఖమ్మంజిల్లాలో జిల్లాపరిషత్తు ఛైర్మన్‌గా చేశారు. అన్ని గ్రామాలూ తెలుసు, వారికి కావలసిన అభివృద్ధి పనులగురించి తెలుసు... ఏ పనులు మంజూరు అయినాయో, ఇంకేం కావాలో, వేటికి నిధులు వున్నాయో, వేటికి లేవో అన్నీ జ్ఞాపకం వున్నాయి. పనులు జరగాలి, వెంటనే జరగాలి... అదే ఆయనకి ప్రధానం. మూడేళ్ళల్లో... ఒక్కసారి తప్ప, నా అధికారాల్లో కాని, పనిలోకాని ఆయన ఎప్పుడూ అనవసర జోక్యం చేసుకొని రాజకీయ వత్తిడి తేలేదు. జిల్లా కలెక్టరుగా అభివృద్ధి పనులు చేయడానికి పూర్తి రాజకీయ మద్దతు ఇచ్చేవారు. జిల్లా నాయకులనుంచి కాని, పార్టీలవారి నుంచి కాని ఎటువంటి వత్తిడులు రాకుండా, మద్దతు ఇచ్చేవారు.

ఎంత మద్దతు అంటే... ఒకసారి – ఆయన చిన్ననాటి స్నేహితుడు – జిల్లాలో ముఖ్య రాజకీయనాయకుడు, శాసనమండలిసభ్యుడు సీతారామయ్యగారు భూమి తనఖా బ్యాంకులో ట్రాక్టరు కొనటానికి ఎప్పుడో అప్పుతీసుకొన్నారు... కాని ఏదో కారణాలవల్ల తీర్చలేదు. వడ్డీతో కలిపి దాదాపు రూ.29000 కట్టాల్సి వుంది. జిల్లాలో అప్పుల వసూళ్ళకు చాలా పట్టుదలతో పనిజరుగుతోంది. కొత్తగూడెం సబ్‌కలెక్టరు సెహగల్ నాతో "సార్, ఈ ఎమ్మెల్సీ గారు పెద్ద మొత్తం కట్టాలి. ఆయనే కట్టకపోతే, మిగతా వాళ్ళు 'మేమెందుకు కట్టాలి' అంటున్నారు... ఏం చేయమంటారు" అన్నాడు...

"తహశీల్దారుతో ఒకసారి కబురుచేయకపోయావా?" అన్నాను.

"...రెండుసార్లు అతను స్వయంగా ఆయనకు చెప్పాడు సార్."

"... అయితే ఈసారి మళ్ళీ వెళ్ళి, చెప్పమను... కలక్టరు నుంచి వత్తిడి వస్తోందనీ, ఒక వారం రోజులలో కట్టకపోతే ట్రాక్టరుని జప్తు చెయ్యాలని అన్నారని"... అన్నాను.

అలానే సీతారామయ్యగారికి చెప్పడం... ఆయన తహశీల్దారుపై విరుచుకుపడటం జరిగింది. వారం అయినా డబ్బు కట్టలేదు.నా ఆదేశాల మేరకు ఎమ్మెల్సీగారి ట్రాక్టర్‌ని జప్తు చేయడం జరిగింది. ఈ వార్త జిల్లా అంతా గుప్పుమంది...

సీతారామయ్యగారికి ఎక్కడలేని కోపం వచ్చేసింది. అవమానం అయింది. ఆవేశం పొంగుకొచ్చింది.

...నాతో మాట్లాడకుండా, ఆయన నేరుగా తన మిత్రుడైన సి.ఎంగారికి ఫిర్యాదు చేశారు టెలిఫోన్లో. నాకు విషయం తెలిసింది. సి.ఎం. ఏం చెబుతారో చూద్దామని నిరీక్షిస్తున్నాను. కాని...

ఆ సాయంత్రానికి సీతారామయ్యగారే అప్పు పూర్తిగా తీర్చేశారు. ట్రాక్టరు విడుదల చేయించుకొన్నారు. ఏమయిందో తెలియలేదు.

మరునాటి ఉదయం సి.ఎంగారు నాతో టెలిఫోన్లో మాట్లాడినప్పుడు ఆయనే ఈ విషయం ప్రస్తావించారు. "నువ్వు సీతారామయ్య ట్రాక్టరు జప్తు చేశావటగా! నాకు ఫిర్యాదు చేశాడు. నోటీసు ఇవ్వలేదా - అని అడిగాను... ఇచ్చారు అన్నాడు. ... మరి డబ్బు కట్టేయాల్సింది... అన్నాను. ...అతను వూరుకొన్నాడు. 'మన ప్రభుత్వంలో మనమే పన్నులు కట్టకపోతే ఎట్లా? నీ దగ్గర డబ్బు లేకపోతే నేను డబ్బు పంపుతాను. వెంటనే అప్పు తీర్చేయి' అని చెప్పాను. మళ్ళీ తనే డబ్బఖ్ఖరలేదన్నాడు - తరువాత తనే కట్టేశాడని తెలిసింది"... అన్నారు ముఖ్యమంత్రి.

అలాగే మరోసారి ...ఆయన ఖమ్మం వచ్చినప్పుడు - జిల్లాలోని ఒక సీనియరు నాయకుడు - "కలక్టరు గారు బాకీ వసూళ్ళకు- రెవెన్యూ, తక్కావీ, సహకార బ్యాంకుల అప్పులూ - ఒకేసారి పెద్ద ఎత్తున మొదలుపెట్టారు. ... అదీ నాలుగయిదు సంవత్సరాల నుంచీ పెరిగిపోయిన బాకీలు ఒకేసారి తీర్చాలంటే ఎలా? మీరు కలెక్టరుగారికి చెప్పి ఈ విషయంలో వెసులుబాటు చేయించాలి" అని సి.ఎం గారికి విన్నవించాడు నా సమక్షంలోనే.

వెంగళరావుగారు ఆయన వైపు చూచి, "రెండేళ్ళుగా పంటలు బాగా పండుతున్నాయి. రైతులదగ్గర డబ్బులున్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సింది చెల్లించకపోతే ఎలా? వసూళ్ళు చేయమని పైనుంచి ఉత్తర్వులు ప్రభుత్వం తరపున మేమే ఇచ్చాం కదా! కలెక్టరు, అధికార్లు వాళ్ళ పని వారు చేస్తున్నారు... అందరికీ అభివృద్ధి పనులు కావాలి.. పన్నులు, బాకీలు వసూలు చేయకపోతే ప్రభుత్వానికి డబ్బెక్కడి నుంచి వస్తుంది? నేనే వసూలు చేయమన్నాను. ఆ బాకీలన్నీ వసూలయితే మంచిపనులు చేయడానికి ప్రభుత్వానికి కావలసిన నిధులు సమకూరుతాయి. మీరు నన్ను అడగాలంటే ఏమైనా పనులు చేయించమని అడగండి కాని పన్నులు వసూలు చేయద్దని గానీ, బాకీలు మాఫీ చేయమని గానీ అడగొద్దు" అని నిర్మొహమాటంగా చెప్పారు.

జిల్లాలో చేరిన ఒక వారానికి జిల్లా అభివృద్ధికి అదివరకు తయారుచేసిన పథకాలు పరిశీలించాను. పథకాల విషయంలో చేయవలసింది ఎక్కువ కనపడలేదు. ...పార్థసారథి గారు చాలా వివరంగా అన్ని విషయాలు సేకరించడం, వాటన్నిటికీ అంచనాలు తయారుచేయడం జరిగింది. ఆయన చేసిన పొరపాటల్లా. ... అంచనాలు జిల్లాలోని అన్ని పథకాలకూ కలిపి వేయడంవల్ల అన్నీ చేయలేమని అందరికీ తెలుసు. కాలం అంతా పథకాల రచనకే సరిపోయింది, పని ఎప్పుడు అన్న సందేహం కలిగింది. కొన్ని పనులు చేపట్టి, అవి జరుగుతుండగా, మిగతావాటికి అంచనాలు వేస్తే బాగుండేదేమో! అదీకాక అన్ని పథకాలకూ అంత డబ్బు ఒక్కసారి అడిగితే... యిచ్చేవాడికి కూడా గాభరా, చూసేవాళ్ళకీ అసూయ... అంతే జరిగింది. కాని ముఖ్యమంత్రికి పని జరగటం కావాలి. ఎలా?

బాగా ఆలోచించి నేను చేసిందల్లా – అన్ని పథకాల్నీ ఆరు విభాగాలుగా విడగొట్టడం... ఏ జిల్లా అభివృద్ధి అయినా ఈ ఐదారు విషయాల మీదే ఆధారపడతాయి... : 1. జిల్లారోడ్లు 2.జిల్లాలో నీటివనరులు 3. గ్రామాలకు విద్యుత్ సరఫరా 4. జిల్లాలోని ఖనిజవనరులు – పరిశ్రమలు 5. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక శ్రద్ధ. 6.గిరిజనులు, హరిజనుల విషయంలో ప్రత్యేక పథకాలు. ఒక్కొక్క విభాగంలో వచ్చే మూడు నాలుగు సంవత్సరాలలో కావలసినది ఎంత అని అంచనాలు వేసి – వాటిని వివిధ వర్గాలుగా విభజించడం.

రోడ్లకు అంత డబ్బు ఒక్కసారి యివ్వమంటే ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదు. అందుకే ఆరోడ్లను మళ్ళీ వేర్వేరు కేటగిరీలక్రింద విభజించాను. నేషనల్ హైవే బడ్జెట్‌లో కొన్ని రోడ్లు, జిల్లా హైవేలలో కొన్ని రోడ్లు, రాష్ట్ర హైవేలలో కొన్ని రోడ్లు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిలో కొన్ని రోడ్లు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి కిందకొన్ని, సింగరేణి కాలరీసు నుండి – రామగుండానికి మణుగూరు మీదుగా కోల్ సెస్‌రోడ్డు ... వేర్వేరు శాఖలనుండి, వేర్వేరు రోడ్లకు – మంజూరీలు ఇప్పించి, ఆ సంవత్సరానికి కావలసిన నిధులు విడుదల చేసుకొంటే – ఒక పథకం ప్రకారం – మూడు సంవత్సరాలకు కావలసిన రోడ్లు వస్తాయి. ఇంత పెద్ద మొత్తం ఖర్చు చేశారన్న సంగతి ఈ కేటగిరీలన్నీ కలిపి లోతుగా పరిశీలిస్తేగాని ఎవరికీ తెలియదు.

అదే జరిగింది మూడు సంవత్సరాలలో. ఆయా పథకాలక్రింద – విజయవాడనుంచి పెనుబల్లి, కొత్తగూడెం, మణుగూరు రామగుండం వరకు హైవే, సూర్యాపేట ఖమ్మం, తల్లాడ, భద్రాచలం సీలేరు, విశాఖపట్నం హైవే, అలాగే ఖమ్మం – అశ్వారావుపేట, దేవరపల్లి, రాజమండ్రి హైవే, ఇవికాక కనెక్టింగురోడ్లుగా కోరాడ – పెనుబల్లి – సత్తుపల్లి – బూర్గుంపాడు – అశ్వారావుపేట – బూర్గుంపహాడ్ – భద్రాచలం – కూనవరం – భద్రాచలం – వెంకటాపురం ... ఇలా అన్ని రోడ్లూ బాగుపడిపోయాయి.

అలాగే – నీటిపారుదల విషయంలో కూడా. నాగార్జున సాగర్ కాలువలు, మధ్య తరహా నీటి పారుదల పథకాలు, చిన్న నీటి తరహా పథకాలు, బావులు, బోరుబావులు, ఎత్తిపోతల

పథకాలు - ఇలా విడివిడిగా వివిధ శాఖలనుండి పనులకు నిధులు -జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఏదో ఒక పథకంలో కొంత వూరట కలిగేలా చేయడం.

విద్యుచ్ఛక్తి విషయంలో - రాష్ట్రంలోని పెద్ద విద్యుత్ కర్మాగారాలు - కొత్తగూడెం థర్మల్, దిగువ సీలేరు హైడల్ యూనిట్ వున్నా ఖమ్మం జిల్లాలో నేను కలక్టరుగా వెళ్ళేప్పటికి 20% గ్రామాలకు కూడా విద్యుత్తు లేదు... అలాగే వివిధ స్కీములలో, వివిధ శాఖలనుంచి కొంత రాజకీయ పలుకుబడితో గ్రామీణ విద్యుద్దీకరణ సంస్థ నిధులు తెప్పించి, మూడు సంవత్సరాలలో 70% గ్రామాలకు విద్యుత్తు సరఫరా చేయించడం జరిగింది...

పరిశ్రమలు కూడా అంతే... కొత్తగూడెం - భద్రాచలం రోడ్డును పరిశ్రమలకు అనువైన ప్రదేశంగా ఎంపికచేయడం జరిగింది. - వెంగళరావు గారు ముఖ్యమంత్రిగా వచ్చినప్పుడు కొత్తగూడెం థర్మల్ విద్యుదుత్పాదక కేంద్రాలు పాలవంచలో రెండు తప్ప, సీలేరులో హైడల్ యూనిట్ ఒకటి తప్ప జిల్లాలో పరిశ్రమలేలేవు. జిల్లాలో విద్యుత్ వుంది, కావలసినంత బొగ్గు ఇతర ఖనిజాలు వున్నాయి. పట్టించుకొన్నవారెవరూ లేరు. పట్టించుకొనే ముఖ్యమంత్రితో ఆ ప్రాంతం రూపు రేఖలే మారిపోయాయి. కెటిపిఎస్‌లో ప్రతి సంవత్సరం ఒక కొత్త యూనిట్‌లో ఉత్పాదన పెంపకం, అలాగే సీలేరులో, అవికాక పాలవంచలో ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారం, స్పాంజి ఐరన్ కర్మాగారం, ఎ.పి.స్టీల్స్ కర్మాగారం, వాటి అవసరాలకోసం మాధవి ఇంజనీరింగ్, వీటన్నిటికీ తలమానికంగా భద్రాచలం పేపరు బోర్డు ఫాక్టరీ ...ఇలాఎన్నో పరిశ్రమలు, ఇవికాక నాగార్జున సాగర్ కాలవల ప్రభావంవలన ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాలన్నింటిలో వందలకొద్దీ బియ్యం మిల్లులు- ...ఇవన్నీ ఆ మూడేళ్ళలో సాధ్యపడ్డాయి.

నీటిపారుదల విషయంలోనూ అంతే. మూడుసంవత్సరాలలో దాదాపు నాలుగు లక్షల ఎకరాలకు నీటిసరఫరా పథకాలు, నాగార్జునసాగర్ కాలవల క్రింద, బ్యాలన్సింగ్ రిజర్వాయర్ల క్రింద మధ్య తరహా చిన్నతరహా నీటిపారుదల పథకాలు, గిరిజన ప్రాంతాలలో బావులు కుంటలు తీసే పథకాలు...

అవికాక వ్యవసాయ పథకాలు, పశుసంవర్ధన, గిరిజనాభివృద్ధి, కుటుంబ నియంత్రణ ... ఎన్నో కార్యక్రమాలు - ఊపిరి సలపని వ్యవహారం... ఏవిషయంలోనూ 'చూద్దాం లే' అనే అవకాశమే లేదు.

కారణం - వెంగళరావుగారి పట్టుదల. ఉదయం అరున్నరకల్లా నాకు టెలిఫోను చేసేవారు. 15-20 నిమిషాలపాటు అన్ని పథకాలు ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకోవడం, కొత్త పథకాలకు ప్రతిపాదనల విషయం విచారించటం, ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడగటం జరిగేది. నేను చెప్పినవన్నీ జాగ్రత్తగా నోట్ చేసుకొనేవారు. ఏఏ శాఖల నుండి ఏఏ ఉత్తర్వులు జారీ కావాలో, ఏ ఖాళీపోస్టులకు ఎవరిని వేశారో ...ఇలా అన్ని విషయాలు సాయంత్రానికి

మళ్ళా నాకు టెలిఫోను చేసి ఉదయం నేను ప్రస్తావించిన అన్ని విషయాలకు ప్రభుత్వం తరఫున ఏం చేశారో ఆయన స్వయంగా నాకు చెప్పేవారు. ఆయన ఉత్సాహం, ఈ విషయాలలో చూపే చొరవ తెలిసి అప్పటి ఆయన కార్యదర్శి శ్రీరావుసాహెబ్‌గారో లేకపోతే సంబంధిత శాఖాధికారులో నాకు ముందే తెలిపేవారు.

జిల్లాలోని రాజకీయనాయకులకు నామీద ఒక విధంగా గుర్రు ఏర్పడింది.

ఏ విషయంలో ఎవరు ఏది కావాలని జిల్లానుంచి ముఖ్యమంత్రిని హైదరాబాదులో కలిసినా, ముందు వేసే ప్రశ్న: "కలెక్టరుగారితో మాట్లాడారా? ముందు ఆయనతో సంప్రదించండి" అనేవారు. ...ఈపద్ధతి మామూలుగా దరఖాస్తులిచ్చేవారి విషయంలోనేకాదు - తనకి చాలా ముఖ్యులైన - జిల్లా పార్టీ అధ్యక్షుడైనా, సహకార బ్యాంకు అధ్యక్షుడైనా, జిల్లా పరిషత్తు ఛైర్మన్ అయినా, విపక్షాల, స్వపక్షాల శాసనసభ్యులైనా, తన తమ్ముడైనా, తనయుడైనా - అంతే...

జిల్లాలో పర్యటనకు వస్తే ఎందరు సీనియరు మంత్రులున్నా సీనియరు పార్టీనాయకులున్నా.. ఆయన కారులో కలెక్టరు వుండాల్సిందే. అలాగే జిల్లాలో ఏ శాఖలో ఎవరు సరిగ్గా పని చేయకపోయినా, ఏపని కాకపోయినా, అడిగేది కలెక్టర్నే...

"నీకు ఏం కావాలో చెప్పు. అది యిస్తాను - నువ్వు పనిచేసి చూపెట్టు" - అనేదే ఆయన సిద్ధాంతం.

హైదరాబాదులో కూడా ముఖ్యమంత్రి కార్యాలయంలో మార్పులు చేశారు. నేను ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా (పి.వి.గారి హయాంలో) పనిచేసిన మొదటి ఐఏఎస్ అధికారిని. చాలా జూనియర్‌ను. నాలుగు సంవత్సరాలే నా సర్వీసు... వెంగళరావుగారు - దాదాపు ఛీఫ్ సెక్రటరీ హోదా ఆఫీసరైన శ్రీకృష్ణస్వామిరావు సాహెబుగారిని తన కార్యదర్శిగా వేసుకొని ఆయన సలహాపై, పరిపాలన నడిపేవారు... తను ప్రాముఖ్యం ఇచ్చే విషయాలన్నీ జరిగేటట్లు చూడటం ఆయన పని... పనిచేయగలిగే అధికారులను ఎంపిక చేసి, తను ముఖ్యమనుకున్న విభాగాల బాధ్యతలు అప్పగించి, వారికి కావలసిన సదుపాయాలు ఇచ్చి, పనికి మాత్రం వారిని బాధ్యులను చేసేవారు...

ఎంతో చదువుకున్న ఎంతో రాజకీయ చతురులైన నాయకులను, మంత్రులను, ముఖ్యమంత్రులను ఎందరినో చూశాను కాని, వెంగళరావుగారిలాగా అధికారులచేత పనిచేయించుకో గలిగిన రాజకీయనాయకుడ్ని నా అనుభవంలో చూడలేదు. బాధ్యత యిచ్చి, వనరులు యిచ్చి, పూర్తిగా నమ్మేవారు. అధికారులు మనసిచ్చి పని చేసేవారు.

ఒకసారి మాత్రం ఆయన వైఖరి నన్ను ఆందోళనకి గురి చేసింది. ఎంతైనా ఆయనా రాజకీయ నాయకుడే.!

★ ★ ★

ఒకనాడు మా జాయింటు కలెక్టరు బెనర్జీ, నాదగ్గరకు వచ్చి... "ఒక విషయం మీతో మాట్లాడాలనుకుంటున్నాను. జిల్లాలోని కాంగ్రెసునాయకులంతా ఈ విషయంలో కొంత ఆందోళన చెందే అవకాశం వుంది. ...విషయం ముఖ్యమంత్రిదాకా పోవచ్చు. ...జిల్లా ప్రెసిడెంటు, ముఖ్యమంత్రి తమ్ముడు అప్పుడే కొత్తగూడెం సబ్‌కలెక్టరుతో మాట్లాడారు. ...వారు కూడా వచ్చి నాకు ఈ విషయం ఫిర్యాదు చేశారు. సబ్‌కలెక్టరుకు చెప్పినా ఏమీ పట్టించుకోవడంలేదనీ, తనధోరణిలో తను పోతున్నాడనీ ...జిల్లాలోనే పెద్ద ఆందోళన రావచ్చునని ఈ నాయకుల వారన".

"మరి మీరు సబ్‌కలెక్టరుతో మాట్లాడలేదా" అన్నాను.

"మాట్లాడాను... అతను, 'మనం చేసేది ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కదా... కలెక్టరుగారికి గిరిజనులంటే ప్రత్యేక శ్రద్ధ కదా... మరి గిరిజనులకు సహాయం చేయడానికే ఈ ప్రోగ్రామ్' అంటున్నాడు."

"అసలు విషయం ఏమిటి" అని అడిగాను.

"కొత్తగూడెంతాలూకాలో ఒక గ్రామం – ఆ గ్రామంలో గిరిజనులూ వున్నారు. హరిజనులూ వున్నారు. ఇతర పేదలూ వున్నారు. వారితోపాటు చాలామంది మామూలు – పెద్దరైతులూ వున్నారు. ...రికార్డు ప్రకారం ఈ గ్రామం షెడ్యూలు ఏరియాలోకి వస్తుంది. కాని భూములు చాలామంది రైతుల ఆధీనంలో వున్నాయి. వాళ్ళలో చాలామంది రైతులకి సొంత భూములూ వేరే వున్నాయి, ఈ సర్కారు భూమి కూడా వుంది. ...ఇదంతా ఇవాళ్టి విషయంకాదు – దాదాపు పాతికముప్పై సంవత్సరాల నుంచీ ఈ రైతులు ఈ భూములు చేసుకొంటున్నారు."

"అంతకాలంనుంచి చేసుకొంటుంటే ఇప్పుడు గొడవ ఎందుకు వచ్చింది?"

"షెడ్యూలు ఏరియాలో వున్న గిరిజనుల భూముల గురించి ఎప్పటినుంచో ఉత్తర్వులు వున్నాయి. ...అవి గనుక గిరిజనేతరుల ఆధీనంలోకి వెళ్తే, ఎలా వెళ్ళినా, అంటే గిరిజనులే అమ్మినా, లేదా గిరిజనులు వదిలేస్తే ఇతరులు సాగుచేస్తున్నా, బలవంతాన గిరిజనుల నుంచి ఇతరుల తీసుకొన్నా – గిరిజనులకు భూములు తిరిగి వాపసు ఇప్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, అంటే మనది."

"మరి ఇవి గిరిజనుల నుండి తీసుకొన్న భూములా?"

"కావు ... ఇవి ప్రభుత్వ భూములు. ...ఈ ప్రాంతంలో అదివరకే పట్టా భూములుంటే గిరిజనేతరులు అనుభవించవచ్చు – కానీ ప్రభుత్వ భూములను మాత్రం గిరిజనులకే సేద్యానికి ఇవ్వాలి అని ఉత్తర్వులు."

"మరి ఇప్పుడు సబ్‌కలెక్టరు ఏం చేశాడు?" అని అడిగాను.

బెనర్జీ చెప్పినదాని ప్రకారం ప్రభుత్వ భూమి వుందని తెలిసి ఒక గిరిజన వ్యవసాయ సంఘం స్థాపించాలని తలచి సబ్‌కలెక్టరు ఏర్పాట్లు చేశాడు. ...కాని ఆ భూమి అంతా చాలామంది రైతుల ఆధీనంలో దాదాపు పాతికేళ్ళుగా వుంది. వాళ్ళు భూమిని చదునుచేసి బావులు తవ్వుకొని సాగుచేసుకొంటున్నారు. ఈ భూములేకాక వీరిలో చాలామందికి వారి పట్టాభూములు కూడా వున్నాయి. ...సబ్ కలెక్టర్ సెహగల్ రైతులందరికీ నోటీసులు ఇచ్చాడు. ఆందోళన మొదలు. మామూలుగా తహశీల్దారు పంపిన నోటీసు ఖాతరు చెయ్యకుండా మళ్ళీ పంటలు వేసేశారు. ఆ విషయం తహశీల్దారు నుండి తెలుసుకొన్న సబ్‌కలెక్టరు వాళ్ళని ఖాళీచేయమనీ, లేకపోతే పంట జప్తుచేస్తామనీ, ఈ భూములు గిరిజన సహకార వ్యవసాయ సంఘానికి ఇవ్వటానికి ప్రభుత్వం నిర్ణయం చేసిందనీ మళ్ళా నోటీసులు ఇప్పించాడు.

"రూల్సు ప్రకారం సబ్‌కలెక్టరు చేసింది కరక్టే - కాని గిరిజనులనుంచి పెద్ద డిమాండు లేదు. ఇస్తామంటే చాలా సంతోషంగా వున్నారు. ఎంతో కాలంనుండి ఎంతో ఖర్చుపెట్టామని రైతులవాదన. ...ఆ 70 మంది రైతుల్లో దాదాపు పదిమంది హరిజనులూ, ఇతర వెనుకబడిన కులాలవారూ వున్నారు. మొత్తం భూమి మధ్య వీరి భూములు వుండటంతో, వారికి కావాలంటే అనధికారికంగా అంతే భూములు ఇతర ప్రదేశంలో చూపిస్తానంటున్నారు సబ్‌కలెక్టరు... అంతకంటే ముఖ్య విషయం" - అని చెబుతూనే బెనర్జీ కొంచెం సందేహించాడు.

బెనర్జీ చాలా మంచి ఆఫీసరు. కష్టపడతాడు. ముక్కుకు సూటి పోయేవాడు. చాలా సమర్థుడు. విశ్వసనీయుడు, నిజాయితీపరుడు. అంతకుముందు అగ్నిహోత్రికి బదిలీ అయినప్పుడు ముఖ్యమంత్రి నన్ను అడిగే బెనర్జీని వేశారు. సబ్ కలెక్టరు సెహగల్ కూడా మంచి సమర్థుడు. యువకుడు. చాలా ఉత్సాహంతో పని చేసేవారు. ఇంజనీరింగు చదివి అహ్మదాబాదు ఐఐఎంలో ఎంబిఏ చేసి ఎంతో పెద్ద జీతాలిస్తామన్నా వద్దని ఐఏఎస్‌లో చేరాడు. ...పేదలకు ఏదో చేద్దామన్న తహతహ, కొత్త కొత్త పథకాలు తయారుచేసి అమలుచేద్దామన్న ఉత్సాహం. నేను వారికి పూర్తి మద్దతు ఇస్తూ వుండేవాడిని.

సామాన్యంగా జిల్లాలో రాజకీయ నాయకులు కలెక్టరు దగ్గరకువచ్చి పనులు చేయించుకునే కంటే - ఆర్‌డిఓ, తహశీల్దారు లెవెల్లో పనులు చేయించుకొంటారు. ...రూల్సు ప్రకారం అయితే ఎవరిదాకా రాకుండానే పనులౌతాయి. అడిగినా వెంటనే చేస్తారు. వారికి కావల్సింది, వారు అధికారంలో వున్నప్పుడు - రూల్సును చూసీచూడనట్లు కొన్ని పనులు చేసుకోకపోతే అధికారం ఎందుకు?

మరి రూల్సుకు వ్యతిరేకంగా అటు కలెక్టరూ చేయక, జాయింట్ కలెక్టరూ చేయక, సబ్‌కలెక్టరూ చేయక, తహశీల్దార్నీ చేయనీయక, చెప్పుకుందామని ముఖ్యమంత్రి దగ్గరికి వెళ్తే ఆయన 'కలెక్టరుతో మాట్లాడారా' అంటే - మనమేం అధికారంలో వున్నట్లు?... ఎందుకు

అధికారంలో వున్నట్లు? - అని వాళ్ళ బాధ. కడుపులో మండుతున్నా, ఏమీ చేయలేక కోపాన్ని మింగుకొని కాలక్షేపం చేస్తున్నారు. మాపైన కంటే కోపం ముఖ్యమంత్రిపైన - ఇటువంటి అవకాశం అధికార్లకు ఇచ్చినందుకు...

ఇలా పరిస్థితిని అవలోకనం చేసుకుంటూ బెనర్జీని అడిగాను.

"సందేహించకు, విషయమేమిటో చెప్పు"...

"ఈ రైతులలో చాలామంది - వెంగళరావుగారికి బంధువులు. నలభై సంవత్సరాలక్రితం ఈ గ్రామ ప్రాంతానికి వచ్చి, పొలాలు కొనుక్కొని స్థిరపడ్డారు. అప్పుడు కావలసినంత భూమి. కష్టపడి బాగు చేసుకొని వ్యవసాయం చేసుకొంటున్నారు."

"మరి ఈ సంగతి ముఖ్యమంత్రికి చెపుదాం - ప్రభుత్వ ఉత్వర్వుల ప్రకారమే గదా మనం చేస్తున్నది?" అన్నాను.

"నేను విన్నది... జిల్లాలో రాజకీయనాయకులు జిల్లా అధికారులపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయబోతున్నారని. అధికారులు కావాలనే ఇటువంటి పనులు చేస్తున్నారనీ, కలెక్టరు మద్దతుతోనే ఈ వ్యవహారం నడుస్తోందని చెప్పాలని - ముఖ్యమంత్రి మనసు మార్చుకొనేలా చెయ్యాలని వారి ప్రయత్నం"-

"మరి నాకు ఎవరూ ఈ విషయం చెప్పలేదే".

"చెబితే మీరు ఏదో విధంగా పరిష్కరించో లేదా ముఖ్యమంత్రికి ముందుగానే చెప్పి ఆయనను ఒప్పించేస్తారేమోనని భయం. ఇట్లా అయితే గ్రామాలకి గ్రామాలు తమ పార్టీకి వ్యతిరేకం అవుతాయని, తమకు తమ పార్టీకి జిల్లాలో మనుగడ లేని పరిస్థితి జిల్లాలో ఏర్పడుతుందని... అంతేకాక మీరు లేకుండా చూసి ముఖ్యమంత్రికి ఈ విషయం ఫిర్యాదు చేయాలని వారి పథకం" అన్నాడు బెనర్జీ.

"మనకెందుకయ్యా బెనర్జీ ... అన్ని వివరాలూ సేకరించి - ఎవరెవరి అధీనంలో ఎంత ప్రభుత్వ భూమివుందో, ప్రభుత్వ వుత్తర్వులు, సబ్‌కలెక్టరు ఇచ్చిన నోటీసు వివరాలు అంతా తయారుచేసి వుంచు. విషయం ముఖ్యమంత్రి దృష్టికి తెద్దాం. తర్వాత ఆయనిష్టం. ఆయన కిష్టంలేకపోతే బదిలీ చేస్తారు అంతే కదా" అన్నాను.

అనుకున్నట్లే ఆ వారంలోనే ముఖ్యమంత్రి కొత్తగూడెం పర్యటనలో నాయకులు చేరారు. నేను లేని సమయంలో వాళ్ళు సబ్‌కలెక్టరు పై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. షెడ్యూలు ఏరియాపేరుతో కలెక్టరుగారి, జాయింట్ కలెక్టరుగారి మద్దతుతో పేదరైతులను, హరిజనులను, చాకలి, మంగలి వాళ్ళను భూమి నుండి తొలగిస్తున్నారనీ, పార్టీకి చాలా హాని జరిగే అవకాశం అనీ... ఇలా మరికొన్ని విషయాలు చెప్పి ముఖ్యమంత్రికి కోపం తెప్పించారు.

సాధారణంగా నలుగురిలో అధికార్లను మందలించే అలవాటు లేని ముఖ్యమంత్రి తనవాళ్ళందరూ కలిసికట్టుకొని చేసిన ఆరోపణలను నమ్మి, సబ్‌కలెక్టరుకి క్లాసు తీసుకోవడం మొదలుపెట్టారు. ఎడాపెడా వాయించేస్తున్నారు.

బెనర్జీ నాకు వెంటనే కబురు పంపాడు. ఇంకేదో పనిలో వున్న నేను ఆదరా బాదరా పరుగెత్తుకొచ్చి చూస్తే - మొహం చిన్నది చేసుకొని సెహగల్ కళ్ళనీళ్ళను ఆపుకొంటున్నాడు. బెనర్జీ ఏదో మాట్లాడబోతే సి.ఎం ఆపేశారు. అతని ముఖం పాలిపోయింది.

నేను రాగానే ముఖ్యమంత్రి– "ప్రసాదూ, చూడు, అధికారం ఇస్తే మీ సబ్‌కలెక్టరు ఏం చేస్తున్నాడో? రూల్సు వున్నా పేదరైతుల విషయంలో ఇతర ఇబ్బందులు లేకపోతే సానుభూతితో వుండాలి కాని..."

ఆయన పూర్తి చేయకుండానే, "మీకు పూర్తి విషయం చెప్పారా సార్" అన్నాను.

"పూర్తి విషయం ఏమిటి? హరిజనులను, ఇతర పేదవాళ్ళను ఖాళీ చేయాల్సినంత అవసరం ఏమొచ్చింది? ఇదేమైనా కృష్ణా జిల్లానా, తూర్పుగోదావరా? కావలసినంత భూమి వుంది కదా!" అన్నారు.

...అలా కొంచెం సేపు ఆయనను మాటలలో పెట్టి... కొద్దికొద్దిగా విషయమంతా చెప్పాను. జిల్లా నాయకులంతా నిశ్శబ్దంగా వింటున్నారు. పెద్దరైతులెంతమంది వున్నారో వారి పేర్లతోసహా వారు సాగు చేస్తున్న ప్రభుత్వభూముల వివరాలు చూపించాను.

అంతే, నేను ఒక్కో రైతుపేరు చదువుతుంటే, ఆయన మొహంలో రంగులు మారసాగాయి. ఏ పెద్దరైతు పేరు చెప్పినా - "అవును వీడు మావాడే - వాడికి మామూలుగానే 40 ఎకరాలు వుందే. మరి ఇంకా 20 ఎకరాల ప్రభుత్వ భూమి ఎందుకు?" ...ఇలా అంటూ ఆశ్చర్యం వ్యక్తంచేస్తూ వచ్చారు. ఆ పేర్లన్నీ ఆయన బంధువులవే. అప్పటికి నేను ఇచ్చిన వివరాలు అన్నీ విని, మాట్లాడకుండా లేచి వెళ్ళిపోయారు. దాంతో నన్ను కూడా భయం వెంటాడింది. ఏ ముఖ్యమంత్రికయినా తన అనుయాయులకన్నా అధికారులు ముఖ్యం కాదు. బహిరంగంగా మెచ్చుకున్నా, రాజకీయ అవసరాలు అడ్డంపడితే ఏమీ చేయలేరు.

* * *

మరో రెండు రోజులకు వెంగళరావుగారి నుంచి నాకు టెలిఫోను వచ్చింది. ఆయన చాలా ఆచితూచి మాట్లాడుతున్నారు. "ప్రసాదూ, ఒక ఫేవర్ చెయ్యాలయ్యా. మొన్న కొత్తగూడెం విషయంలో మా వాళ్ళంతా మళ్ళీ హైదరాబాదు వచ్చారు. గ్రామాల్లో వాళ్ళ పలుకుబడి పోతోంది. ఇదే అవకాశం చూసుకొని కమ్యూనిస్టులు ఆ ప్రాంతానికి వచ్చేట్లు వున్నారని వాళ్ళవాదన. ఇన్నేళ్ళూ వాళ్ళు చేసింది ఉత్తర్వులకు విరుద్ధంగానే. కాని ఇప్పుడు ఏదో ఒకటి చేయకపోతే నా

అనుయాయులకందరికీ అన్యాయం చేసినవాడినవుతాను. వాళ్ళ మద్దతుకూడా రాజకీయాల్లో కావాలి కదా... మిమ్మల్ని రూల్సుకి వ్యతిరేకంగా చెయ్యమని చెప్పను. సబ్‌కలెక్టరు ఆర్డరు ప్రకారం వాళ్ళ పంట జప్తు చేయాలి ... అది చేస్తే అందరి పరువూ పోయినట్లే ... అందుకే, ఒక ఎండార్స్‌మెంట్ ఇచ్చాను. నీకు చెప్పి కాని అది విడుదల చేయదలచుకోలేదు..."

అంతలో ఎవరో వచ్చినట్లున్నారు. ఆయన నన్ను లైన్లోనే వుంచి వాళ్ళతో ఏదో మాట్లాడు తున్నారు.

అంతా ఒకటి రెండు నిమిషాలే.

ఆ ఒకటి రెండు నిమిషాలు నాకు ఒక యుగంలా గడిచాయి. కొన్ని వందల వేల ఆలోచనలు ఆ కాస్సేపట్లో నా మస్తిష్కాన్ని తొలిచేశాయి...

ఏ రాజకీయ నాయకుడూ రాజకీయాలకి అతీతుడు కాదు. ఈయనా అంతే. తప్పు చేసినవాళ్ళు తన అనుయాయులు కాబట్టి వాళ్ళని కాపాడుకోవటం కోసం అధికారుల్ని బలిచేస్తాడు.

ఏం చేయొచ్చు?

సబ్‌కలెక్టరుని బదిలీ చేయొచ్చు.

ఏదో వంక పెట్టి సస్పెండ్ చేయొచ్చు.

లేదా అతను తప్పు చేశాడని ఓ నివేదిక పంపించమని నన్ను ఆదేశించవచ్చు.

ఎలాగైనా తనవాళ్ళకే అనుకూలంగా చేసేలా సబ్‌కలెక్టరుని ఒప్పించమని అడగవచ్చు.

ఆయన ఆదేశాల్ని పెడచెవిన పెడితే నాకూ పాఠం చెప్పే ప్రయత్నం చేయవచ్చు...

"ప్రసాద్, ఇప్పుడేం చెప్పాను...?" ముఖ్యమంత్రి మళ్ళీ అందుకున్నారు.

"సబ్‌కలెక్టరు ఆర్డరు ప్రకారం చేయాల్సి వస్తే పంటని జప్తు చేయాల్సి వుంటుంది అన్నారు సర్".

"కరా! అది మా పార్టీ వాళ్ళందరికీ భరించలేని పరాభవం అవుతుంది. వాళ్ళంతా నా వాళ్ళు. అందుకే వాళ్ళకి అలాంటి సంకట స్థితి రాకుండా చూడాలి..."

అర్థమవుతోంది.

ఆయన నిర్ణయం తన మనుషుల్ని కాపాడుకోవడం.

కాబట్టి అధికారులు బలికాక తప్పదు.

నా అలవాటు ప్రకారం ఉండబట్టలేక సబ్‌కలెక్టరుకి సమర్థనగా మాట్లాడదామని నోరు విప్పాను.

"సర్, సబ్‌కలెక్టరు ఆర్డరుని మార్చాలంటే..."

ఆయన నన్ను పూర్తిచేయనివ్వలేదు.

"నేను చెప్పేదీ అదేనయ్యా, సబ్‌కలెక్టరు ఆర్డర్‌ని మార్చద్దు. ఆ రైతులు నాకు పంపిన వినతి పత్రాన్ని నా ఎండార్స్‌మెంట్‌తో నీకు పంపిస్తాను. నా ఎండార్స్‌మెంట్ ప్రకారం, సబ్‌కలెక్టరు ఆర్డర్‌ని నిలుపుదలచేస్తూ నువ్వొక ఆర్డరు జారీ చేస్తావ్. చేసి, నువ్వే స్వయంగా ఆ గ్రామానికి వెళ్ళి విచారణ జరుపుతావు. ఇదంతా జరిగేలోపల రైతులు వాళ్ళ పంట వాళ్ళు కోసుకుపోతారు. నువ్వు విచారణ జరిపి, ఆ భూమికి సంబంధించిన వాస్తవం ఎలా వుంటే అలా, నీకు న్యాయమనిపించిన విధంగా పరిష్కారం చేస్తావ్..."

లౌక్యమా? రాజకీయ చతురతా?

సగం ఆయన అనుకున్నట్లే (పంటని రైతులు కోసుకోవటంవరకూ) జరిగింది.

మిగతా సగం (విచారణలో తేలిన వాస్తవాల్ని బట్టి) నేను అనుకున్నట్లూ, సబ్‌కలెక్టర్ సెహగల్ ఆశించినట్లూ జరిగింది... ఆ రైతుల చేతే ఆ ఏజన్సీ భూమిని రైతులకిప్పించాను. ముఖ్యమంత్రిని పిలిపించి, ఆయన చేతులమీదుగా ఆ గ్రామంలో గిరిజన సహకార వ్యవసాయ సంస్థకి ప్రారంభోత్సవం చేయించాను.

* * *

నన్ను దోషిని చేసిన సంజయ్‌గాంధి

ప్రభుత్వంలో ఎలాంటి హోదా లేకపోయినా, రాజ్యాంగేతర శక్తిలా రాష్ట్రానికి వచ్చిన సంజయ్‌గాంధీకి ఖమ్మంజిల్లాలో అడుగడుగునా నీరాజనాలర్పిస్తూ, రాచమర్యాదలు చేయటం కోసం అధికార యంత్రాంగం పూర్తిగా దుర్వినియోగం చేయబడింది. లక్షలాది రూపాయల ప్రజాధనం నీళ్ళలా వృథా అయింది.....!

ఇదీ ఆరోపణ.

1978లో ఈ ఆరోపణ మీద న్యాయవిచారణ జరిపేందుకు జస్టిస్ విమర్‌లాల్ కమీషన్‌ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పుడు ముఖ్యమంత్రి డాక్టర్ చెన్నారెడ్డి.

కమీషన్ ఆరోపణల ప్రకారం ముద్దాయిలుగా పేర్కొనాల్సివస్తే అంతకుముందు నాలుగేళ్ళు ముఖ్యమంత్రిగా పనిచేసిన శ్రీ జలగం వెంగళరావు, సింగరేణి కాలరీస్ కంపెనీ ఛైర్మన్ - మేనేజింగ్ డైరక్టర్ - సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీ బి. ఎన్.రామన్ ముందు వరుసలో వుంటారు.

అసలు జరిగిన 'అధికార దుర్వినియోగా'నికి అప్పటి ఖమ్మం జిల్లా కలెక్టరుగా బాధ్యుణ్ణి నేను. కాని కమీషన్ విచారించేవాళ్ళ (నేరస్థుల) జాబితాలోనూ నేను లేను, సాక్షుల జాబితాలోనూ లేను!

విచారణ మొదలవగానే ఈ తతంగం అంతా గమనిస్తున్న సాటి ఐఏఎస్ అధికారి ఒకరు నా మీద వ్యంగ్య బాణాలు సంధించాడు: "భలే తప్పించుకున్నావ్ గురూ! చేసిందంతా నువ్వయితే, కమీషన్ నిన్నొదిలేసిందేమిటి? నక్కని తొక్కేశావ్ ఫో.... "

నేనూ ఆశ్చర్యపోయాను. కాని.....

* * *

1974 లో ఖమ్మం కలక్టరుగా ఛార్జి తీసుకొన్న తర్వాత మొదటి నెల అంతా ఏఏ పథకాలు, ఏఏ రంగాలలో, ఏఏ శాఖల ద్వారా తీసుకోవాలి, పనులెలా చేయాలి. ఎలా నిధులు తేవాలి అన్నవాటితో, జిల్లాని అర్థం చేసుకోవడానికీ, పరిస్థితులు అవగాహన చేసుకోవడానికీ, క్రింద పనిచేస్తున్న అధికారులను అంచనావేయడానికీ సరిపోయింది.... బలహీన వర్గాల గురించి కాని, జిల్లాలో చాలా భాగం గిరిజన ప్రాంతం కనుక వారి అభివృద్ధి గురించి కాని ఆలోచించడానికి కుదరలేదు:...

ఒకనాడు భద్రాచలం క్యాంపు వెడుతూ జిల్లా గిరిజన శాఖాధికారి కృష్ణమూర్తిని నాతో రమ్మన్నాను. అతను వ్యవసాయశాఖకు చెందినవాడు. కాని చాలా రోజులు గిరిజన ప్రాంతాల

గురించి, గిరిజనుల గురించి - లంబాడీలు - కోయలు - గురించి, వారికోసం నడుపుతున్న ఆశ్రమ పాఠశాలల గురించి, వారి భూములు అన్యాక్రాంతం అయిన విధానం - ప్రభుత్వ ఉత్తర్వుల్ని స్వలాభానికి వాడుకుంటున్న పరిస్థితి... చెప్తూ చెప్తూ- ఇలా అన్నాడు: గిరిజనాభివృద్ధికి డబ్బైతే చాలా ఖర్చు అవుతుంది కాని - అభివృద్ధి ఎంత అవుతోందో ప్రశ్నార్థకమే.... ముఖ్యంగా కావలసినది విద్య, ఆర్థిక స్తోమత. గిరిజన నాయకులున్నా, వీరు రాజకీయ పావులు మాత్రమే. పెద్ద నాయకులతొత్తులేకాని, స్వయంగా గిరిజనుల సమస్యలపై నిలబడగలిగిన నాయకత్వం లేదు అన్నాడు. వినేవాళ్ళుంటే అతనెంతసేపైనా మాట్లాడే స్వభావం. వింటూ కూర్చున్నాను.

చివరికి ఈ విషయంలో ఏదైనా చేయగలమా? ఒక ప్రయత్నం చేద్దామనిపించింది.

"కృష్ణమూర్తీ, గత 20 సంవత్సరాలలో ఖమ్మం జిల్లాలో 'విద్య'పై ఎంత ఖర్చుపెట్టాం? ఎన్ని స్కూల్సు వున్నాయి? ఎంతమందిని ఏ లెవెల్‌కు తీసుకొచ్చాం? ఈ వివరాలు రెండురోజుల్లో ఇవ్వండి" అన్నాను.

వచ్చిన సమాచారం కళ్ళు తెరిపించింది. 40 కోట్ల రూపాయలకుపైగా ఖర్చుపెట్టాం - చాలా బడులు స్థాపించాం. చాలామందికి భోజనాలు పెట్టాం. చివరికి తయారుచేసింది ఒక MA Student, ఒక 2nd year engineering Student, 1st MBBs Student, 1 MBA పాసైన కుర్రాడు - ఇద్దరు గ్రాడ్యుయేట్‌లు - 12 మంది 10వ తరగతి పాసయిన వాళ్ళు. మిగతా వారిలో - కొద్దిమంది 8వ తరగతి, 9వ తరగతి, 10వ తరగతిలో చదువు మానేసిన వాళ్లు, చాలామంది ఐదో తరగతిలోనే చదువు వదిలిన వారు.

కారణాలు చాలా ముఖ్యమైనవి. ఉపాధ్యాయులు గ్రామాలలో వున్నా పాఠశాలలకు వెళ్ళరు. వెళ్ళినా అక్కడవుండరు - వున్నా పాఠాలు చెప్పరు, చెప్పలేరు. దాదాపు ఆశ్రమ పాఠశాలలన్నీ Single Teacher పాఠశాలలు. వారే పాఠాలు అన్ని క్లాసుల వారికి చెప్పాలి. పిల్లల భోజన వసతులు చూడాలి. ఒక రకంగా అవన్నీ భోజన శాలలుగాని పాఠశాలలు కావు. ఉపాధ్యాయులు కొంతమంది పెళ్ళికాని వారు ఆ ప్రాంతాలకు ఒకటిరెండు సంవత్సరాలకు వెళ్ళగలరేకాని, పెళ్లై పిల్లలున్నవారు వెళ్ళే ప్రశ్నేలేదు. వున్న ఉపాధ్యాయులకైనా అక్కడ వుండటానికి వసతి గాని ఇతర వనరులుగాని ఏమీవుండవు. ఈ మాత్రం చదువుకొని బయటపడ్డవారంతా ఇల్లెందులోనో, కొత్తగూడెంలోనో, భద్రాచలంలోనో, పాలవంచలోనో పనిచేయడానికి వచ్చి వుండిపోయిన గిరిజనుల పిల్లలు. వాళ్ళే వుంటారు 90% పైగా. నిజంగా గ్రామంలోని పాఠశాలలనుండి పైకి వచ్చిన వారు చాలా చాలా అరుదు. అంటే మనం పెట్టిన ఖర్చంతా ఏమైనట్లు? ప్రవేశ పెట్టిన మన విద్యా విధానంలో మార్పులు అవసరం. ముందు ఉపాధ్యాయులు అక్కడే వుండి పాఠం చెప్పేట్లు చూడాలి....

ఆ రోజుల్లోనే సింగరేణి కాలరీస్ మేనేజింగు డైరక్టరు బి.ఎన్.రామన్‌గారు, కిన్నెరసాని ప్రాజెక్టు ఏరియాని పర్యాటకులకోసం అభివృద్ధిచేస్తే ఎలా వుంటుందో అన్నప్పుడు ఇద్దరం కలిసి ప్రాజెక్టు ప్రాంతమంతా తిరిగాం. కొన్ని మంచి కాటేజీలు నిర్మించడానికి వారికి స్థలాలు ఇచ్చాం.

ప్రాజెక్టు కట్టేటప్పుడు ఆఫీసుకి, సిబ్బందికి కట్టిన భవనాలు, వాడుక లేక ఖాళీగా కనిపించాయి. కిన్నెరసాని పాలవంచకు 10 కిలోమీటర్లలోపే వుంది. అక్కడ ఉపాధ్యాయులకు మంచి వసతులతో, విద్యార్థులకు వసతి గృహాలతో గిరిజన పాఠశాల (Residential School) పెడితే ఎలా వుంటుంది? బాగానే వుంటుంది కాని, అటువంటి మంచి పాఠశాలనడిపే అనుభవం గిరిజన శాఖకులేదే! మరేం చేయాలి? అప్పుడు తోచింది – AP Residential School Society విద్యాశాఖ గురుకుల పాఠశాలలు నడుపుతోంది. వాటికి మంచిపేరు వుంది. గ్రామీణ ప్రాంతాలనుండి ఎంపిక చేసిన విద్యార్థులకు ప్రవేశం యిచ్చి మంచి విద్య యివ్వడం వారి బాధ్యత. అందరు విద్యార్థులకు 10వ తరగతిలో ఫస్ట్ క్లాసులే. విద్యాశాఖ కార్యదర్శితో మాట్లాడితే – "చాలా కష్టం. మా పాఠశాలల Standard వేరు. మా పేరు పాడుచేయడానికే కాని ఇది గిరిజనులకు ఉపయోగపడకపోవచ్చు" అన్నారు.

నాకు ఆయన చెప్పింది నమ్మ బుద్ధికాలేదు. చిన్నతనం నుంచి మంచి ఉపాధ్యాయులతో మంచి శిక్షణయిస్తే గిరిజనపిల్లలు కూడా ఇతరులలాగే ప్రతిభ చూపించగలుగుతారు అని నా విశ్వాసం. విద్యాశాఖకార్యదర్శి దృష్టి అంతా వారి గురుకుల పాఠశాలలో అందరికీ ఫస్ట్‌క్లాస్ మార్కులు వస్తాయన్న అంశం మీదే. పోటీ పరీక్షలు పెట్టి ఫస్ట్‌క్లాస్ విద్యార్థులకు ప్రవేశం ఇచ్చినప్పుడు, వారందరికీ ఫస్ట్ క్లాస్ రావడం వారిదేం గొప్ప? పిల్లలను పాడుచేయకుండా చూసుకొనేవారున్నంతవరకూ ఒప్పుకోవచ్చు కదా! వారికి నిజమైన పరీక్ష ఇటువంటి గిరిజన బాలబాలికలకు శిక్షణ ఇచ్చి, వారు 10 పాస్ అయ్యేట్టు చేసినా గొప్పేకదా! అట్లా ఒక్క బాచ్ బయటకు వచ్చినా 20 సంవత్సరాలలో ఇప్పుడు పైకి తేలనంత మందిని తయారుచేయవచ్చు. అప్పటినుండి ప్రతి సంవత్సరం అంతమంది విద్యార్థులు బయటకు వస్తారుకదా! ఒక్క ఏడాదిలో ఇన్నివందల పాఠశాలలు చేయలేనిది ఒక్క గురుకుల పాఠశాల చేయొచ్చుకదా....

ఈ కిన్నెరసాని ప్రదేశం మంచి ఆహ్లాదకర వాతావరణం, పెద్ద సరస్సు. కొండలు, అడవి... అయినా టౌనుకు నాగరికతకు దూరం కాదు. ఇక్కడ పని చేసే ఉపాధ్యాయుల పిల్లలకు ఈ స్కూల్లో ఉచిత విద్య అని చెపితే ఇక్కడకు రావడానికి చాలామంది టీచర్లు ముందుకు వస్తారు. కొంత పోటీ వాతావరణం కావాలనుకుంటే 20 – 25 శాతం ఇతర పిల్లలను కూడా చేర్చొచ్చు. కాని మొత్తం మనమే నిర్వహించాలంటే – బాధ్యత తీసుకొనేవాళ్ళు...? చాలా సంవత్సరాలు ఇది నడవాలి. మనం ఇక్కడ నుండి బదిలీ అయితే – దీని సంగతి ఏమిటి?.... అందుకే పేరున్న Residential School Society కే ఈ బాధ్యత అప్పగించాలి.

అదే విషయం ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చి, 20 సంవత్సరాల సమీక్ష చూపించినపుడు ఆయన వెంటనే ఆమోదించి, విద్యాశాఖ కార్యదర్శికి, ఆదేశాలిచ్చి 1వ తరగతి నుండి 10 వ తరగతివరకు క్లాసులుండే రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేశారు.

త్వరలో రాబోయే సంజయ్‌గాంధీ ఖమ్మం పర్యటనలో ఇదొక ముఖ్యకార్యక్రమం!

★ ★ ★

సంజయగాంధీని ఖమ్మంజిల్లాకు ముఖ్యమంత్రి పిలవటానికి ఆయన కారణాలు ఆయన కున్నాయి.

ఆరోజుల్లో దేశంలో సంజయ్‌గాంధీ చాలా బలవత్తరశక్తి – ఇందిరాగాంధీ గారి కుడిచెయ్యి. ఏ పదవిలో లేకపోయినా పదవులలో వున్న వాళ్ళంతా ఆయన చుట్టూ తిరిగేవారు. రాష్ట్రాలలో కాంగ్రెసు ముఖ్యమంత్రుల మనుగడ ఆయన కటాక్ష వీక్షణాలమీద ఆధారపడి వుందనుకునేవారు. అందుకే వారితో మంచిగా వుండటానికి వారికి తాము చేస్తున్న మంచి పనులు చూపించడానికి పోటీలు పడేవారు.

గిరిజన విద్యతో మొదలయిన నా గిరిజనాభ్యుదయ విధానం రాను రాను ఒక obsession గా మారింది. Obsession పెద్ద మాటేకాని అది నా గురించి నేను వాడిందికాదు – జిల్లాలోని అధికారులు, రాజకీయ నాయకుల నోటిమాట.

ఎలా చేయాలన్న తర్జనభర్జన కొంతచేశాను. గిరిజనులకు ప్రభుత్వంమీద, ప్రభుత్వ పథకాలమీద నమ్మకం మొదట కలగాలి కదా! ప్రభుత్వ అధికారులను కాని, రాజకీయ నాయకులను కాని నమ్మే ప్రశ్నేలేదు. గిరిజనుల దృష్టిలో వారు దోపిడీదారులు, అవకాశవాదులు. మరి వారిని చేరేదెట్లా?... ఒక ఆలోచన తట్టింది గిరిజనాభ్యుదయానికి గిరిజనులనే వాడితే ఎలా వుంటుంది? ఎవరా గిరిజనులు? ...

కృష్ణమూర్తి చేత జిల్లాలో వున్న అందరు చదువుకున్న గిరిజనులు ఎక్కడ వున్నారు, ఏ ఉద్యోగాలు చేస్తున్నారు, ఉద్యోగాలు లేకుండా వుంటే ఎక్కడ వున్నారు – అని ఆరాతీయించాను. ఆ సమయంలో ఖమ్మం జిల్లాకు ITDA (Integrated Tribal Development Agency) మంజూరు అయింది. ఏదో ఒక మంచి గిరిజన సంస్కరణను చేపట్టకపోతే ఆ నిధులు కూడా గతంలో లాగానే వృథా అయిపోవచ్చు. దానం అనే ఐ.ఏ.ఎస్. ఆఫీసరని ITDA ప్రాజెక్టు ఆఫీసరుగా వేశారు. యువకుడు, మంచి ఉత్సాహం వున్నవాడు. పేదకుటుంబం నుంచి వచ్చాడేమో చేసే కార్యక్రమాల్లో మనసు పెట్టి నమ్మకంగా చేసేవాడు.

చదువుకున్న గిరిజనులందరి సమాచారం దొరికిన తర్వాత, వాళ్ళందరినీ ఒకనాడు మా ఇంటికి పిలిపించాను. రెండు మూడు గంటలు వాళ్ళతో చర్చించాక, వారి ప్రాంత అభివృద్ధికి వారంతా సిద్ధం అని వాగ్దానం తీసుకొన్నాను. దాదాపు ముప్పై మంది దాకా యువకులు పనిచేయడానికి సిద్ధం. వారిలో కొందరు అటెండర్లు, కొందరు క్లర్కులు, యింకొందరు ఉద్యోగ ప్రయత్నంలో వున్న వాళ్ళు. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నా పూర్తిగా వారు నేను చెప్పిన గిరిజన అభివృద్ధి కార్యక్రమాలలో పనిచేసేట్టు ఏర్పాటుచేసి, వారందరికి గిరిజన Liason Officerగా గుర్తింపుకార్డు లిచ్చి, పదిహేనురోజులు ఖమ్మంలో వారికి అన్ని ఖర్చులూ భరించి, గిరిజనులకు ప్రభుత్వంచేపట్టిన అన్ని పథకాలపై అవగాహన వచ్చేటట్లుగా శిక్షణ ఇప్పించాను. జిల్లాలోని అందరు అధికారులకు పరిచయం చేసి, వారు గిరిజనప్రాంతాలకు వెళ్ళేప్పుడు వీరిని కూడా

తీసుకుపోవాలని వుత్తర్వులు జారీచేశాను. ఈ పదిహేనురోజులూ రాత్రి పూట ఒక గంటసేపు నా బంగళాలో వారితో గడిపేవాడిని. వారు నేర్చుకొన్న విషయాలు, వారికి ఇంకా కావలసిన విషయాలు, ఏ అధికారి ఉత్సాహంగా వారికి సహాయంచేస్తున్నాడో, ఎవరు చేయటం లేదో తెలుసుకొని తగు చర్యలు తీసుకోవడం జరిగేది.

ముఖ్యంగా వారికి శిక్షణ ఇచ్చిన విషయాలు : గిరిజనులకు అప్పు ఎందుకోసం ఎవరు యిస్తారు? అప్లికేషన్ను ఎలా తయారుచేయాలి? లేదా ఎవరిచేత రాయించుకోవచ్చు? Scheduled Area చట్టం ప్రకారం గిరిజనులు పోగొట్టుకొన్న భూమిని ఎలా సంపాదించవచ్చు? ఆవులు, బర్రెలు కావాలన్నా, గొర్రెలు, మేకలు కావాలన్నా ఏంచేయాలి? పంటలకోసం అప్పులు ఎలా దొరుకుతాయి? బావులు తీసుకోవడానికి, పంపుసెట్లు పెట్టుకోవడానికి ఏంచేయాలి? ఉద్యోగాలలో ఖాళీలు ఎక్కడవున్నాయి? ఎవరికి దొరుకుతాయి? పిల్లల చదువుకు ఎక్కడ పాఠశాలలు వున్నాయి? ఎలా చేరాలి? ఏ పనికి ఏ ఆఫీసుకి పోవాలి? వారు పనిచేసి పెట్టకపోతే ఎవరికి ఫిర్యాదు చెయ్యాలి?... ఇలా అనేక విషయాలు ఆ శిక్షణలో బోధించారు.

వీరందరికి నెలకు భోజనాదులకోసం 200 రూపాయలు ఏర్పాటుచేశాను. ఒక్కొక్కరికి వారి వారి పరిసర గ్రామాలనుంచి, కొంచెం రాయడం చదవడం తెలిసిన 20/30 మంది యువకులను, వారి లాగా పనిచేయడానికి వారే తీసుకురావాలి, వారి బంధువులైనా సరే, కొత్త వారైనా సరే. అలా ఆరునెలలయ్యేప్పటికి, ఈపనికి 200 మంది దాకా Liason కార్యకర్తలు - శిక్షణ పొందినవారు తయారయ్యారు.

మొదట వచ్చినప్పుడు నా దగ్గరకు రావటానికి, మాట్లాడడానికి భయపడినవారు, కరచాలనం చేయడానికి చెమటలు పోసే పరిస్థితినుండి ధైర్యంగా ఎవరితోనైనా మాట్లాడగలిగే స్థితికి ఎదిగారు. వారందరికి కలక్టరు సంతకంతో గుర్తింపుకార్డులు ఇప్పించాను. ఆఫీసులనుండి దరఖాస్తులు తీసుకోవడానికి, గిరిజనుల తరపున నింపిన దరఖాస్తులు మరల ఆఫీసులలో ఇవ్వడానికి వారికి అనుమతులివ్వడం జరిగింది.

వీరందరిచేత వారివారి గ్రామాలలో, వారి పరిసరగ్రామాలలో గిరిజన అభివృద్ధి మండళ్ళు ఏర్పాటుచేశాం. 15/20 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన ఈ మండళ్ళకు ఆయా గ్రామాలలో ప్రభుత్వం చేసే పనులు అప్పగించడం జరుగుతుంది. అడవులలో చెట్లు నాటే పనికావచ్చు, సరఫరా చేయడానికి అటవీశాఖకు చిన్నమొక్కల పెంపకం కావచ్చు, చెక్‌డ్యామ్ కట్టడం కావచ్చు, గ్రామాల్లో నిత్యావసరవస్తువుల సరఫరాకావచ్చు... ఇలా వారి ఉపాధికి, ఉపయోగానికి ప్రభుత్వం తరపున ఏమిచేసినా, వారెవరైనా, గ్రూపుగా గాని, వ్యక్తిగతంగా కాని ముందుకు వస్తే వారికే పని అప్పగించే పద్ధతి ప్రవేశపెట్టడంతో అది వారి సంఘాలకు ఆర్థిక స్తోమత కలగటానికి దోహదం చేసింది. సంవత్సరమయ్యేప్పటికి గ్రామగ్రామాన ఈ కార్యక్రమం వాయువేగంతో పాకిపోయి, దాదాపు 30 వేలమంది ఈ గిరిజనాభ్యుదయ సంస్థలో సభ్యులుగా చేరారు.

ఇది మొదలుపెట్టినప్పుడు కోయలకే పరిమితం చేయడం జరిగింది. లంబాడీలు అప్పటికే కొంత అభివృద్ధి చెందివుండటం, వారి తండాలున్నది దాదాపు నాగరిక ప్రాంతాలకు దగ్గరలో వుండటం కారణం. గిరిజనులు పోగొట్టుకొన్న భూములు తిరిగి తెచ్చుకొనే కార్యక్రమం చాలా ఊపందుకొంది. దశాబ్దాలుగా చట్టంవున్నా గిరిజనులకు భూములు వచ్చింది లేదు. గిరిజన యువకులు సంఘాలుగా ఏర్పడి గ్రామాల్లో చైతన్యం రావడంతో గిరిజనేతరులుకూడా కోర్టులకు పోకుండా, అందరూ కలసి కొంత రాజీ, సమన్వయ ధోరణిలో గ్రామాల్లోనే చాలా విషయాలు పరిష్కారం చేసుకోవడం మొదలయింది.

ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలు గ్రామగ్రామాన బాగా తెలిసిపోవటం, గిరిజనులు పెద్ద ఎత్తున ఆ ఫలితాలు పొందటానికి ఆతురత చూపడం, వారి మనుషులే వారి వెంటపడి, ఫలితాలు వచ్చేదాకా చేయడం, ఒక గ్రామాన్ని చూచి ఇంకొక గ్రామం ముందుకు వచ్చి కార్యక్రమాల్లో పాల్గొనడం, చాలామంది గిరిజన యువకులు నాయకత్వ లక్షణాలు చూపించడం, అటువంటివారిలో కొందరిని ఎంపిక చేసి వారికి కొత్తగా నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇచ్చి, కొందరిని గ్రూపు లీడర్లుగా చేసి, వారిక్రింద 15/20 మందిని Liason Officer లుగా వుంచి, జిల్లా స్థాయిలో సమన్వయం చేయడానికి వారిని వుపయోగించడం జరిగింది. అటువంటివారిలో చందా లింగయ్య, వెంకటేశ్వర్లు, భిక్షపతి, రామయ్య, రామచంద్రయ్య... వగైరా కొంతమంది నాకు చాలా సన్నిహితులయ్యారు.

ఇలా రెండు సంవత్సరాలలో ఇది పెద్ద వుద్యమరూపం దాల్చి ప్రజలదృష్టిని, రాష్ట్రస్థాయిలో కొన్ని విషయాలలో జాతీయస్థాయి అధికారుల, పాత్రికేయుల, నాయకులదృష్టిని ఆకర్షించింది. విజయవాడలో 'ది హిందూ' పత్రికలో సీనియర్ విలేకరి చందారం మాధవరావు రాసిన పెద్ద మధ్య పేజీ వ్యాసంతో ఈ కార్యక్రమానికి చాలా ప్రాముఖ్యత వచ్చింది.

ఈ ఉద్యమం ఊపందుకొంటుంటే .... నా భయాలు నాకు మొదలయ్యాయి. ఇంతటి చైతన్యమైన ప్రజావుద్యమం మొదలైనప్పుడు రాజకీయ పార్టీలు, నాయకులు వూరుకొంటారా? ఉద్యమనాయకులను చేరదీసి, వారి వారి ప్రయోజనాలకు ఉద్యమాన్ని వాడుకొనే ప్రమాదం వుందని గ్రహించి ప్రతివారం గిరిజన నాయకులకందరికీ కలక్టరు బంగళాలోనే ప్రోత్సాహక బోధలు మొదలుపెట్టాను. రాజకీయాలకు సంబంధం వుండరాదనీ, ఏ పార్టీ అయినా, ఏ ప్రభుత్వమొచ్చినా, గిరిజన అభివృద్ధే వారి ధ్యేయం కావాలనీ, రాజకీయాలజోలికి వెళితే వారిలో వారికి తగాదాలు వచ్చి వుద్యమం చీలిపోయే ప్రమాదముందని నూరిపోసి, వారందరిచేతా "రాజకీయాలకు దూరంగా వుంటామని" ప్రమాణాలు కూడా చేయించాను. ఒకసారి పార్టీ రాజకీయాలలో తలదూరిస్తే, అధికారులు కూడా చేరదీయరని విపులంగా వివరించడం కూడా జరిగింది.

ముఖ్యమంత్రి వెంగళరావుగారికి కూడా ఈ కొత్త ప్రయోగం గురించి వివరించాను. ఆయన తనదైన శైలిలో "వీరిని రాజకీయాలకు దూరంగా ఎంతకాలం వుంచగలవు? మా

వాళ్ళను (రాజకీయ నాయకులను) తక్కువగా అంచనావేయకు. నువ్వు ఇక్కడ కలెక్టరుగా వున్నంతవరకు, వారికి నీ అండదండలున్నంతవరకు ఇలానే వుంటుంది. రాబోయే అధికారులు వీరిని దగ్గర తీస్తారని నమ్మకం ఏమిటి? అదీకాక, పరపతి పలుకుబడి తన వారిలో వచ్చాక, అవకాశం వస్తే అధికారంలోకి రావడానికి వాళ్ళు ప్రయత్నిస్తారు. కాని ఈ వుద్యమం వలన గిరిజనులు ప్రభుత్వానికి దగ్గరయ్యారు. అధికారులమీద మాత్రమే ఆధారపడకుండా ఫలితాలు ఎక్కువమందికి దక్కే అవకాశం దొరికింది. అధికారులు కూడా అన్ని లెవెల్సులో చచ్చినట్లు పని చేయాల్సి వచ్చింది" అంటూనే మరో మాట చెప్పారు :

"మొన్న ఢిల్లీ వెళ్ళినప్పుడు సంజయ్‌గాంధీ గారితో మాట్లాడాను. మన జిల్లాకు రమ్మని ఆహ్వానించాను... పేదలకు హరిజనులకు అన్ని రాష్ట్రాలలో ఏదో ఒకటి జరుగుతూనేవుంది. గిరిజనుల కోసం ఇంత పెద్ద ఎత్తున గిరిజన యువకులను చొప్పించి పనిచేస్తున్నాం కదా! ఆయన్ని వచ్చి చూడమంటే బాగుంటుందనుకుంటున్నాను...."

నేనేం చెప్పగలను? ఒక రకంగా పార్టీకి అతీతంగా ఈ వుద్యమాన్ని తీసుకువెళ్ళాలని తపన. కాని, సంజయ్‌గాంధీని పార్టీ మనిషి అనటానికీ లేదు, ప్రభుత్వ మనిషి అనటానికీ లేదు. మరి అప్పటి పరిస్థితులలో ప్రభుత్వాన్ని, పార్టీని వెనుక వుండి నడుపుతున్నాడని అందరూ అనుకుంటుండేవారు. ఏ ప్రధానమంత్రో, గిరిజనమంత్రో, కేంద్రహోంమంత్రో అయితే బాగుండును కాని - వెంగళరావుగారు నాతో మాట్లాడిన ధోరణి - "నేను పిలిచేశాను, నీవు కార్యక్రమాలు బాగా చేస్తావనే నమ్మకంతో" అన్నట్లు వుంది.... విని వూరుకొన్నాను.

వారం రోజులలో సంజయ్‌గాంధీ కార్యక్రమం ఖరారు అయింది. మొత్తం అరరోజు - మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి వరకు... తేదీ నిర్ణయం కూడా జరిగింది. ఇంకా నెలరోజులు టైమ్ వుంది.

ముఖ్యమంత్రిగారు నన్నూ, Singareni MD రామన్ గారిని హైదరాబాద్‌లో మీటింగ్‌కి పిలిచారు. "ఇదేదో రొటీను పర్యటనగాదు. ఆయనతోటీ, ఆయనకోసం చాలా మంది రావచ్చు" అన్నారు...

"ఎంతమంది, ఏ స్థాయివాళ్ళు" అని రామన్‌గారు అడిగారు.

"ఏ స్థాయివారైనా వారందరూ తాము చాలా పైస్థాయి వాళ్ళమే అనుకునేవాళ్ళు" అన్నారు నవ్వుతూ సి.ఎం.

"కార్యక్రమం రెండు మూడు చోట్లా, లేక ఒక్కచోటేనా? ఉత్త బహిరంగసభ మాత్రమేనా. అధికారిక కార్యక్రమాలు కూడానా?" అని అడిగాను.

"ఆయన వచ్చేదే సగంరోజుకోసం. రెండు చోట్ల అంటే ఖమ్మంలో, కొత్తగూడెంలో పెట్టాలి. వచ్చే నాయకులందరూ రెండు చోట్ల పాల్గొనాలంటే రెండు మూడు గంటలు ప్రయాణంలోనే పోతుంది."

"గిరిజన ప్రాంతాలదర్శన, గిరిజనులతో ముఖాముఖీ?" అన్నాను.

"ఖమ్మంలో గిరిజనుల కార్యక్రమం చేస్తే ఏం బాగుంటుంది?... కొత్తగూడెం లేదా పాలవంచ అయితే బాగా వుంటుంది?" అన్నారు సి.ఎం.

"పాలవంచకంటె కిన్నెరసాని డాము దగ్గర బాగుండవచ్చు. సరే, గిరిజనులకు సంబంధించిన కార్యక్రమాలన్నీ అక్కడ చేద్దాం. కావలసినంత చోటు, అడవిలో గిరిజన పాఠశాల- సహజంగా వుంటుంది. అన్ని పథకాల గురించి ప్రదర్శన ఏర్పాటుచేద్దాం. గిరిజనులకు మనం ఇచ్చే అన్ని రకాల సహాయం. ఒక్కొక్క విభాగంలో ఏర్పాటుచేసి, మధ్య నుంచి వి.ఐ.పి.లను తీసుకుపోయే ఏర్పాటుచేస్తే, దేశంలోనే ఎక్కడా ఒక్కచోట ఇంతమంది గిరిజనులకు సహాయం ఇదివరకు జరగలేదనేలా చేయవచ్చు. బ్యాంకులను కూడా చొప్పించి రెండుకోట్ల రూపాయల ఋణం వివిధ పథకాల్లో వేలమంది గిరిజనులకు అందేట్లు చేయవచ్చు. ఆకర్షణీయంగా లారీలు/ఆటోలదగ్గర నుండి - గొర్రెపిల్లలదాకా - అన్ని రకాల సహాయాలను లబ్ధిదారుల పక్కన ప్రదర్శించవచ్చు. తరువాత గిరిజనులనుద్దేశించి ప్రసంగాలు కూడా చేయవచ్చు..." అన్నాను.

"అక్కడ బహిరంగ సభ పెడ్తే జనంరారేమో. జనం లేకపోతే బాగుండదు" అన్నారు సి.ఎమ్.

"నా లెక్క ప్రకారం 50 వేలకు తక్కువ కాకుండా గిరిజనులు వస్తారు. ఈ సభ గిరిజనులకు ప్రత్యేకం. అక్కడ అంత జనం క్రిక్కిరిసినట్లు వుంటుంది. మొదటి కార్యక్రమంగా పెడ్తే లైటింగు, భద్రతా వగైరా ఇబ్బందులు వుండవు. తరువాత బహిరంగసభ కావాలంటే కొత్తగూడెంలో పెట్టుకోవచ్చు. అది ఒకరకంగా పార్టీ మీటింగు ..." అన్నాను.

"50 వేలమంది గిరిజనులు వస్తే చాలా పెద్ద సభ క్రింద లెఖ్ఖ - అంతమంది వస్తారా?"

"నాకు వదిలేయండి సర్, మేం రెండేళ్ళుగా చేస్తున్న ఈ గిరిజనాభ్యుదయ సమితులు గిరిజనులను ఎంత చైతన్యం చేయగలిగాయో తెలుసుకోటానికిది ఒక అవకాశం. కొంచెం లారీల్ని గ్రామాలనుంచి రావడానికి ఏర్పాటుచేయాలి ..." అన్నాను.

"కొత్తగూడెంలో సింగరేణి తరఫున మేం కూడా కొన్ని కార్యక్రమాలు ఏర్పాటుచేయగలం. ఒక కాలేజి బిల్డింగు ప్రారంభోత్సవానికి రెడీగా వుంది. సామూహిక వివాహాలకి కలెక్టరుగారు ప్రచారంచేసి, వధూవరులను తెప్పిస్తే, కార్యక్రమం మేం చేస్తాం" అన్నారు రామన్.

"వీలయినంతవరకు వి.ఐ.పి. లంతా రాత్రికి వాపసు వెళ్ళే ప్రయత్నం చేయాలి సర్, లేకపోతే వసతి విషయం చాలా ఇబ్బందికావచ్చు." ఇది నా అభిప్రాయం.

"ఎంతమంది ఎలాంటి వాళ్ళు వస్తారో తెలిస్తే - మనం కొంత ముందుగా ప్లాన్ చేయవచ్చు" అన్నారు రామన్.

"ఇంతవరకు ఇదమిత్థంగా తెలియదుకాని చాలామందే వస్తారు. ఢిల్లీనుంచి ఐదారుగురు క్యాబినెటు మంత్రులు, పార్టీ కార్యదర్శులు, యూత్ కాంగ్రెసు లీడర్లు, రాష్ట్రంనుంచి చాలామంది-

చెప్పలేం - పదిపది హేనుమంది మంత్రులు, పార్లమెంటు, శాసనసభసభ్యులు - కార్పొరేషన్ల అధ్యక్షులు వగైరా నూరు 150 మందైనా వస్తారు... " సి.ఎం. వివరించారు.

"రైల్వేస్ జనరల్ మేనేజర్‌తో మాట్లాడి స్పెషల్ ట్రెయిన్ వేయిస్తే సరి. తక్కువమంది అయితే 4,5 బోగీలు స్లీపర్ లేదా ఫస్ట్ క్లాస్ వేయిస్తే - మధ్యాహ్నానికొస్తారు. ప్రోగ్రాం అయిన తర్వాత రాత్రికి వెళ్ళిపోతారు. వసతి ఇబ్బందేవుండదు సర్" అన్నారు రామన్.

★ ★ ★

సంజయ్ గాంధీ పర్యటన కనీవినీ ఎరుగని రీతిలో జరిగిపోయింది - దాదాపు 60వేల గిరిజనులు కిన్నెరసానికి చేరుకున్నారు. 100 ఎకరాలస్థలం. ప్రదర్శనలతో, డప్పులు, మేళాలు, తాళాలు, బాకాలతో మారు మ్రోగిపోయింది. కార్యక్రమం అంతా ప్రభుత్వం, గిరిజనాభ్యుదయ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. గిరిజన నాయకులకే తమ కార్యక్రమాలమీద, తమ సంస్థ మీద ప్రజలకున్న ఆదరణ ఆశ్చర్యాన్ని కల్గించింది.

కొత్తగూడెంలో కార్యక్రమాలు బ్రహ్మాండంగా జరిగాయి. బహిరంగసభ లక్షల జనంతో క్రిక్కిరిసిపోయింది... సామూహిక వివాహాలు సమాజ పరిస్థితులకు దర్పణం అయ్యాయి. 800 జంటలలో దాదాపు 10 జంటలు పిల్లలతో సహా పీటలపై కూర్చున్నారు. ఇదేమిటంటే... "పిల్లలైతే పుట్టారుకాని, మేం యింకా పెళ్ళి చేసుకోలేదన్నారు. ఇప్పటికయినా చేసుకుందామని వచ్చామ"న్నారు. సరే, కాదనటమెందుకు అనుకొన్నాం. రామన్‌గారు అన్ని ఏర్పాట్లు బ్రహ్మాండంగా చేశారు. వచ్చినవారికి భోజనాలు, ఇతరసదుపాయాలు, ఇంకా సెక్యూరిటీ కోసం నేనడిగినవన్నీ చేశారు.

కాని ...?

★ ★ ★

సంజయ్‌గాంధీకి ఏ పదవీలేదు. వి.ఐ.పి. కాదు. ప్రభుత్వం తరఫున ఇన్ని ఏర్పాట్లు ఎందుకు జరిగాయి?

"ముఖ్యమంత్రి తన రాజకీయ పలుకుబడి నిమిత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారు. పార్టీ కార్యక్రమాలకు సింగరేణి నిధుల్ని (ముఖ్యమంత్రి ప్రోద్బలంతో) ఎమ్.డి. రామన్‌గారు వృథా చేశారు... వూర్లో బ్యారికేడ్లు, బహిరంగసభలో ల్యారికేడ్లు, ప్రభుత్వం తరపున మైకు సెట్లు ఏర్పాటు, వచ్చినవారికి భోజనాలు... ఇలా సింగరేణి నిధుల దుర్వినియోగం జరిగింది". ఇదీ ఫిర్యాదు.

ముఖ్యమంత్రిని వ్యతిరేకించే శాసనసభ్యుడు చేకూరి కాశయ్య ఈ ఫిర్యాదు చేశారు. అప్పటికి ఎలక్షన్లు జరిగి, ప్రభుత్వ సారధులు మారారు. సహజంగానే దాంతో ఈ విషయాల విచారణకు

ఒక జ్యూడిషియల్ కమిషన్‌ని వేయడం జరిగింది. రిటైర్డు న్యాయాధికారి శ్రీవిమద్‌లాల్‌తో ఈ కమీషన్ ఏర్పాటయింది.

విమద్‌లాల్ కమీషన్ తన న్యాయవిచారణను బొంబాయి (ముంబై)లో ప్రారంభించింది.

ఆరోపణలు చేసిన శ్రీ కాశయ్య - ప్రభుత్వంలో ఎలాంటి హోదాలేని "సంజయ్‌గాంధికి అడుగులకు మడుగులొత్తుతూ ప్రభుత్వం ఎలా అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం"చేసిందో కమీషన్ ముందు వివరించారు. బహిరంగసభకు ఏర్పాట్ల దగ్గర్నుంచి భోజనాలదాకా సింగరేణి కాలరీస్ కంపెనీవారు ఎలా "ధన దుర్వినియోగం" చేశారో ఏకరువు పెట్టారు. అందుకు అనుకూల సాక్ష్యాలు (పత్రికల్లో వచ్చినవి) చూపించారు. మాజీముఖ్యమంత్రి వెంగళరావుని, ఐఏఎస్ అధికారి బి.ఎన్.రామన్‌ని కూడా కమీషన్ విచారించింది.

అప్పుడు కమీషన్‌కి ఈ విచారణలో ఒక కొత్తకోణం కనబడింది:

"ఈ కమీషన్ విచారణ అప్పటి ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు మీద... సంజయ్‌గాంధీ రాకకోసం అన్నిపనులూ చేసింది శ్రీరామన్. శ్రీ కాశయ్య ఫిర్యాదులో కూడా వాళ్ళే ముఖ్యనిందితులు. కాని ఏ అధికారిని విచారించినా, రామన్‌తో సహా అందరూ తాము చేసినవన్నీ జిల్లా కలెక్టరు ఆదేశాలమేరకే చేశామంటున్నారు. శ్రీ వెంగళరావు సయితం 'అంతా కలెక్టరునే చూడమన్నాను' అంటున్నారు. జరిగిందంతా కలెక్టరు ఆదేశాల మేరకే జరిగితే, ఆ కలెక్టరు సాక్షుల జాబితాలోనే లేదే!. వాది తరఫు సాక్షుల్లోనూ, ప్రతివాదుల తరఫు సాక్షుల్లోనూ కూడా లేడు.... ఎవరీ కలెక్టరు పి.వి.ఆర్.కె. ప్రసాద్? కమీషన్ తరఫున సాక్షిగా పిలిపించండి..."

అంతే! అలా నేను కూడా కమీషన్ ముందు బోనులో నిలబడ్డాను.

...విమద్‌లాల్ కమీషన్ నా మీద వ్యాఖ్యల, ప్రశ్నల వర్షం కురిపించింది.

"చాలామంది సాక్షులు మీ వుత్తర్వులు ఆధారంగానే పనులు చేశామంటున్నారు.... అప్పటి సి.ఎమ్. వెంగళరావు కూడా అదే చెప్పారు. రామన్ కూడా అదే చెప్పారు. మాకు అర్థం కాని విషయం - అన్ని పనులూ మీ వుత్తర్వుల ఆధారంతో జరిగితే ఎంక్వయిరీ మీ మీద జరగాలి. కాని ఫిర్యాదు పత్రంలో మీ పేరుకాని, కలెక్టరు విషయంగాని ప్రస్తావనలేదు... అందుకే పరిస్థితులు సక్రమంగా అవగాహన కావాలంటే మిమ్మల్ని సాక్షిగా పిలవాలని అనుకొని, కమీషన్ పిలిపించడం జరిగింది. జరిగినది జరిగినట్టుగా చెప్పి కమీషన్‌కు సహకరించండి."

"అలాగే సర్..."

"సంజయ్ గాంధీ వచ్చినప్పుడు మీరు ఖమ్మం జిల్లా కలెక్టరుగా పనిచేస్తున్నారా?"

"అవును"

"మీకు ఆ కార్యక్రమ వివరాలన్నీ తెలుసా?"

"తెలుసు"

"ఏర్పాట్లన్నీ మీ పర్యవేక్షణలో జరిగాయా?"

"అవును"

"సంజయ్ గాంధీకి ఏ అధికారహోదా లేదు. మరి ముఖ్యమంత్రి ఆదేశాల మీద ఆ కార్యక్రమం చేశారా?"

"సంజయ్‌గాంధీ ఒక్కరేకాదు... ఇంకా, కేంద్రనాయకులు, రాష్ట్ర నాయకులు అంతావున్నారు సర్. మేం చేసిన ఏర్పాట్లు అందరికోసమూ"

"అన్ని ఏర్పాట్లూ సంజయ్‌గాంధీ కోసమేనని అందరి అభిప్రాయం?"

"సర్, ఆయన ఒక్కడే వచ్చి, ఏర్పాట్లు మేము చేసివుంటే తప్పకుండా అలాగే అనుకోవచ్చు సర్. కాని అయిదుగురు కేంద్రమంత్రులు, 11మంది రాష్ట్రమంత్రులు, ముఖ్యమంత్రి, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, శాసన సభ అధ్యక్షులు, కార్పొరేషన్ అధ్యక్షులు వస్తున్నట్లు మాకు అధికారిక సమాచారం. మేం మంత్రులు ఎవరొచ్చినా, అధికార కార్యక్రమాలు ఏర్పాటుచేస్తూనే వుంటాం. ముఖ్యమంత్రికి, కేంద్రమంత్రులకు ఇది కొంచెం ఎక్కువ స్థాయిలో చేస్తాం. నాకు తెలిసి ఒక జిల్లాలో ఒక కార్యక్రమానికి ఇంతమంది వి.ఐ.పి.లు రావడం వినలేదు చూడలేదు. అందునా కొత్తగూడెం, ముఖ్యంగా మేం చేసిన గిరిజన కార్యక్రమం కిన్నెరసాని – అడవిలో వుంది. ఆ ఏరియాలో తీవ్రవాద సమస్య వుంది. అందువలన రహస్య సమాచార విభాగం, పోలీసు విభాగం సూచనలమేరకు కార్యక్రమాలు చేశాం".

"మీరు సంజయ్‌గాంధీ కోసమే ఈ ఏర్పాట్లన్నీ చేశారని అంటే మీరేమంటారు?"

"మేం చేసింది అందరికోసం... సర్. ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా కార్యక్రమాలు జరిపి, అధికార కార్యక్రమాలు అందరి మన్ననలు పొందేట్టు చేయడం జిల్లా అధికారుల బాధ్యత. ఆ అధికారుల సారథిగా అది నా బాధ్యత".

"సంజయ్‌గాంధీ వి.ఐ.పి ఎలా అయ్యారు?"

"అది నాకు తెలియదు, తెలియవలసిన అవసరం లేదు కూడా? చాలా మంది వి.ఐ.పిలు వచ్చారు. వారితో సంజయ్‌గాంధీ గారుకూడా వున్నారు. ఆయన వచ్చినా రాకపోయినా, ఆ వచ్చిన వి.ఐ.పిలు ఎంత పెద్దవాళ్ళంటే, ఈ చేసిన ఏర్పాట్ల అవసరం వున్నవాళ్ళే."

"అది సరే, కొత్తగూడెంలో బహిరంగ సభ విషయానికి వద్దాం – అది పార్టీ ఫంక్షనుగదా! మరి అన్ని ఏర్పాట్లు మీరెందుకు చేశారు?"

"మొదట మేం చేయలేదు, పార్టీ వాళ్ళే చేసుకొన్నారు. కాని ముందురోజు పోలీసు, ఇంటలిజెన్సు అధికారులతో తనిఖీకి వెళ్ళినప్పుడు మూడు విషయాలలో వారు అసంతృప్తి వ్యక్తం

చేశారు. ఒకటి - సభా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన బారికేడ్స్, రెండు - కొత్తగూడెం రోడ్లపై చేసిన బారికేడ్స్, మైకుసిస్టమ్ (పి.ఏ.). వాళ్ళ కారణం - లక్షల జనం వచ్చినప్పుడు సరైన ఏర్పాట్లు లేకపోతే జనం తోసుకొనివచ్చి తొక్కిసలాటజరిగే అవకాశంవుంది. వెనుకవారికి సరిగ్గా వినపడకపోయినా అదే ఇబ్బంది. రోడ్డుమీద కూడా అటువంటి ఇబ్బందే... ఇప్పుడు మనమంతా జరిగిన ఏర్పాట్లు వెనుక హేతుబద్ధత గురించి మాట్లాడుకొంటున్నాం. ఆ రోజున అది పార్టీ వాళ్ళ సభ కాబట్టి నాకెందుకు - అని నేను ఇంటెలిజెన్స్ హెచ్చరికల్ని నిర్లక్ష్యం చేసివుంటే, తీవ్రవాద సమస్య వున్న జిల్లా కనుక ఏవన్నా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, తొక్కిసలాటల వల్ల ఏ ఒక్క ప్రాణం పోయివున్నా జిల్లా మేజిస్ట్రేట్‌గా శాంతిభద్రతలు కాపాడలేని నా అసమర్థత, బాధ్యతా రాహిత్యం ప్రశ్నార్థకమై వుండేవి. సరైన బ్యారికేడ్లు కట్టడంవల్లా, మైక్ సిస్టమ్‌ల ఏర్పాటువల్లా - రాగల శాంతిభద్రతల సమస్యను నిరోధించటమా? లేక రాజకీయ విమర్శలొస్తాయని భయపడి చేతులు ముడుచుకొని కూర్చోవటమా? ఈ ప్రశ్న ఉదయించినప్పుడు మొదటి మార్గాన్నే నేను ఎంచుకున్నాను. ఒక్క రోజులో రహదార్లు భవనాలశాఖ వారికి చెప్పి కంట్రాక్టర్ల ద్వారా చేయించాలంటే చాలా ఖర్చు అవుతుంది. సింగరేణి వారి దగ్గర బారికేడ్లుకి కావలసిన సామాను అంతా వుంది. వాళ్ళనే ఆ ఏర్పాట్లు చేసి, తరువాత ఆ సామాను తీసుకువెళ్ళమన్నాను. అవసరమైతే కూలి ఖర్చులు వారికిస్తామన్నాం. రామన్‌గారు - 'మేంచేస్తాం. ఏ ఖర్చులూ అవసరం లేదు' అన్నారు. ఎందుకంటే లేబరు ఖర్చులు ఎక్కువేం కావు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ని మా సమాచార శాఖ నుంచి ఏర్పాటుచేశాం..."

" మరి భోజనాల సంగతి?" అని ప్రశ్నించింది కమీషన్.

"వి.ఐ.పిలకు, అధికారులకు భోజనవసతి ఏర్పాటుచేయవలసిందిగా సింగరేణి ఎమ్.డి.గారిని నేనే అర్థించాను. అక్కడ వారికి కావలసినంత మందీ మార్బలం వుంది...."

ఇలా చెప్పేసి తప్పించుకోవచ్చుననుకున్నాను. కానీ, కమీషన్ వదల్లేదు.

"మరి ఆ కార్యక్రమంలో ప్రభుత్వధనం దుర్వినియోగం చేసినట్లే కదా!"

'చిక్కెనురా మిడతంభొట్లు' అయిపోయింది నా పరిస్థితి... ధైర్యంచేసి నామనసుకి ఎలా తోస్తే అలా చెప్పేయాలనుకున్నాను. చెప్పుకుంటూ వెళ్ళిపోయాను:

"ఎలా అవుతుంది సర్! దేశంలో మొదటిసారిగా ఈ జిల్లాలోని గిరిజనులందర్నీ ఒకచోట సమావేశపరిచాం. వాళ్ళకోసం ప్రభుత్వం ఏయే పథకాలు, కార్యక్రమాలు అమలుచేస్తోందో తెలియజెప్పి, వాళ్ళని చైతన్యపరిచాం... వాళ్ళ వాళ్ళ అర్హతల్ని బట్టి వేరువేరు పథకాలక్రింద నాలుగుకోట్ల రూపాయలమేరకు రాయితీలతో కూడిన ఋణాలు పంపిణీచేశాం... దేశంలో తొలి గిరిజన గురుకుల పాఠశాలు ఏర్పాటుచేసి, దాన్ని వాళ్ళు వాళ్ళ భవిష్యతరాలకోసం ఎలా ఉపయోగించుకోవాలో తెలియజెప్పాం... దాదాపు 60వేల మంది గిరిజనులు ఒకచోట సమావేశమై తమ గురించి ప్రభుత్వం ఏం చేస్తోందో స్వయంగా ముఖ్యమంత్రి, కేంద్రమంత్రుల ముఖతః

తెలుసుకోవడం, ఉత్తేజాన్ని ఉత్సాహాన్ని పొందడం, గుండెలనిండా ఆత్మవిశ్వాసాన్ని నింపుకోవటం – ఇదంతా జరిగి తీరాల్సిన కార్యక్రమం అని నేను విశ్వసిస్తున్నాను. సమాజానికి దూరంగా కొండల్లో, లోయల్లో నివసించే గిరిజనులలో తామూ ఈ సమాజంలో ఒకరమనీ, తమదీ ఒక గౌరవనీయమైన స్థానమనీ విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వాధికారి మీదా వుందనుకొంటున్నాను... ఇలాంటి బృహత్ కార్యక్రమానికి రాష్ట్రమంత్రులంతా వచ్చారు. అయిదుగురు కేంద్రమంత్రులు వచ్చారు. ఇంతమంచి కార్యక్రమంలో ప్రభుత్వయంత్రాంగం పాలుపంచుకోవటం ఎలా 'దుర్వినియోగం'గా నిర్వచింపబడుతుందో నాకు అర్థం కావడంలేదు... ఇక సంజయ్‌గాంధీయో మరో గాంధీయో కూడా వచ్చారంటున్నారు. అది యాదృచ్ఛికం...!"

కమీషన్ నావంక ప్రశ్నార్థకంగా చూశారు.

నేను చెప్పటం ఆపలేదు. ఆపితే మళ్ళీ ఏం ప్రశ్నలు వేస్తారో?

"... ఇలాంటి బృహత్ ప్రయత్నం గతంలో ఎన్నడూ జరిగిన దాఖలా లేదు. కాబట్టి జరిగిన సంఘటన, దాని వెనుకగల ఉదాత్తమైన లక్ష్యం, ఆ లక్ష్యం సాధించటంకోసం చేసిన పరిశ్రమ... ఈ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకుని కమీషన్ విచారిస్తే బాగుంటుందను కుంటున్నాను. ఒక్కొక్కసారి విస్తృతప్రజాప్రయోజనంకోసం జరిగే మంచి పనికూడా ప్రజాప్రయోజన వ్యాజ్యాలకు గురవుతూంటుంది. లక్ష్యం మంచిదైనప్పుడు, జరిగినదానిమీద రంధ్రాన్వేషణ చేసుకుంటూ పోవడం అంత సమంజసం కాదేమోనని నా అభిప్రాయం..." ఓపికున్నంతవరకూ చెప్పేసి ముగించాను.

* * *

కొన్నిరోజుల తరువాత విమద్‌లాల్ కమీషన్ నివేదిక వెలువడింది. దాని సారాంశం.

"... ఈ ఆరోపణల్లో పేర్కొన్నట్లు అధికార దుర్వినియోగం జరిగిందని కమీషన్ భావించటం లేదు..."

* * *

నా పుట్టి ముంచిన జొన్న పంట

'రెవెన్యూ బోర్డు మెంబరు రామిరెడ్డిగారు ఖమ్మంజిల్లా కలెక్టరాఫీసు ఇనస్పెక్షన్‌కి వస్తున్నారు...'

ఈ వార్త నాకు పిడుగులా వచ్చిపడింది.

ఇంచుమించుగా 1970 దశకం మధ్యవరకూ కొనసాగిన రెవెన్యూ బోర్డు వ్యవస్థ జిల్లాల్లో పనిచేసే ఐఏఎస్ అధికారులని పరుగులెత్తించేది. చెమటలు పట్టించేది. మంత్రులకు భయపడని ఐఏఎస్ అధికారులు సయితం రెవెన్యూబోర్డు సభ్యులకు భయపడేవారు. ఇంతకీ రెవెన్యూ బోర్డులో సభ్యులు మాత్రం ఐఏఎస్ అధికారులే.

చీఫ్ సెక్రటరీ సారథ్యంలో వుండే ఈ బోర్డులో భూమి శిస్తు, వాణిజ్యపన్నులు, ఎక్సైజు, వ్యవసాయం వగైరా అన్నిరకాల రెవెన్యూ (ఆదాయాలు) తీసుకువచ్చే శాఖల కార్యదర్శులూ సభ్యులు. ప్రతిజిల్లా కలెక్టరూ ఈ బోర్డులోని ప్రతి సభ్యుడికీ జవాబు దారీయే. ఆయా శాఖల ఆదాయ పరిమాణాన్ని బట్టి బోర్డులో సభ్యుల హోదా వుండేది. ఏడాదికొకసారి ఈ బోర్డు సభ్యులు ఒక్కొక్కరు కొన్ని జిల్లాలను ఇన్‌స్పెక్ట్ చేసి, ప్రభుత్వానికి నివేదికలు పంపుతారు. ఈ నివేదికలు ఆయా జిల్లాల కలెక్టర్ల భవిష్యత్‌ని నిర్ణయిస్తాయి.

అందుకే రెవెన్యూ బోర్డు మెంబరు ఇనస్పెక్షన్‌కి వస్తున్నారంటేనే జిల్లా కలెక్టర్లకు వణుకుపుట్టేది... ఇప్పుడు నా పరిస్థితి ఇంకా ఘోరం. ఎందుకంటే ఇదే రామిరెడ్డిగారు ఏడారి క్రితం టెలిఫోన్‌లో నన్ను ఉతికి ఆరేసినంత పనిచేశాడే!

"ఏమయ్యా ప్రసాదూ! నీ గురించి నువ్వేమనుకుంటున్నావు? నవాబువా? నీదే రాజ్యమా? ముఖ్యమంత్రి జిల్లాలో కలెక్టరుగా వుంటే, నీయిష్టమొచ్చినట్లు చేయవచ్చుననుకుంటున్నావా? రెవెన్యూ బోర్డు మెంబరు ఆదేశాల్ని పాటించనక్కరలేదా? పైగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసి, నా ఉత్తర్వులు ఆపిస్తావా? ఎంత ధైర్యం? ఖమ్మంలో ఎవరికి సహాయం చేద్దామని? వ్యాపారస్తులకా?- దేశంలో కరువు పరిస్థితులువచ్చి, జొవారు (జొన్న)మీద లెవీవేస్తే.... దాన్ని నవ్వులపాలు చేస్తావా? నేనూ చూస్తాను - యిది ఎలా జరుగుతుందో?...." అని ఆరోజు నన్ను మాట్లాడనివ్వకుండా టెలిఫోను పెట్టేశారు రామిరెడ్డిగారు.

రామిరెడ్డిగారు రెవెన్యూ మెంబరుగా పౌరసరఫరాల శాఖ చూస్తుంటారు. చాలా సీనియరే కాకుండా, మంచి ఆఫీసరుగా పేరు. మనిషికి చాలా పట్టుదల. తన మాటే నెగ్గాలన్న మనస్తత్వం. మాట మామూలుగానే కరుకు. కోపం వస్తే వ్యంగ్యం కూడా తోడై, మాటలు పదునైన బాణాలౌతాయి.... సాధారణంగా జూనియరు అధికారులు ఆయనకు దూరంగా వుండటానికి

ప్రయత్నించేవారు. అలాంటి రామిరెడ్డికి నామీద ఎక్కడలేని కోపం వచ్చింది. ఇప్పుడు ఆయనే నా ఆఫీసు, నా పని చూడటానికి నా జిల్లాకు బోర్డు మెంబరుగా తనిఖీకు వస్తున్నారు.

హతోస్మి!

* * *

ఖమ్మం కలక్టరుగా వెళ్ళిన రెండు మూడు నెలలకే జిల్లాలో వివిధ ప్రాంతాలకు అభివృద్ధి పథకాలు తయారుచేసినప్పుడు, ఎటువంటి అభివృద్ధికీ నోచుకోక ఏం చేయాలన్నా కుదరక ఒక ప్రాంతం మిగిలిపోయింది... నాగార్జునసాగరు కాలువకు దిగువన తూర్పుప్రాంతమంతా కాలవనీరు పారే జలం - ఇబ్బంది లేదు.

కాని ఇటువంటి ఏ వనరులూ లేక, బావులు, బోర్లూ లేక వర్షాధారంగాఉన్న ఆ ప్రాంతం కాలువకు పశ్చిమంగా వరంగల్లు జిల్లా, నల్లగొండ జిల్లాల సరిహద్దు ప్రాంతం. అది పూర్తిగా వర్షాధారం. భూములు కూడా మరీ సారవంతమైనవికావు. సాధారణంగా ఆముదాలుకానీ, దేశీయ జొన్నగానీ వేస్తుంటారు. అప్పుడప్పుడు వానలు పడతాయి కాని, కావలసినప్పుడు పడవనీ, అవసరం లేనప్పుడు పడతాయనీ రైతుల గోల. అన్ని ప్రాంతాలకూ పథకాలు వేసి, ఈ ప్రాంతానికి ఏమైనా చేయకపోతే ఎలా? కాని ఏంచేయాలి? ఏంచేసినా వ్యవసాయంలో ఆదాయం పెంచగలిగితేనే అందరికీ లాభం, అభివృద్ధి.

హైదరాబాదువెళ్ళి నాకు అసిస్టెంటు కలెక్టరు ట్రైనింగులో గురువైన సుబ్రహ్మణ్యం గారిని కలిశాను. ఆయన అప్పుడు వ్యవసాయ శాఖకు సంచాలకుడు (డైరక్టరు). పశ్చిమగోదావరి కలక్టరుగా ఉన్నప్పుడు ఆయన కొత్తరకాల వరి వంగడాలు తెప్పించి, రెండు పంటలకి బదులు, మూడు పంటలు తీసేట్లు చేసి చరిత్ర సృష్టించాడు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికీ రైతుల నాలుకపై నానే ఐఏఎస్ అధికారి కె.సుబ్రహ్మణ్యం. ఆయన నే చెప్పిందంతా విని ఆలోచించి- "మనం గంగా ప్రసాదరావుగారిని సలహా అడుగుదాం. ఆయన సొర్గం (చిరుధాన్యాల) ప్రాజెక్టు డైరక్టరు. దేశంలోనే జొన్నవంటి పంటల విషయంలో చాలా అనుభవమూ, పేరూ వున్నవాడూ, తెలుగువాడూ... ఈ ప్రాంతాల గురించి తెలిసినవాడూ. అందులోనూ హైదరాబాదులోనే వుంటాడు. కావల్సినప్పుడు ఖమ్మం రావడానికి ఇబ్బంది ఉండదు. ఆయనతో మాట్లాడతాను. నువ్వెళ్ళి కనబడి ఆయనను ఖమ్మం రమ్మని ఆహ్వానించి, ఆ ప్రాంతాలు చూపించి సలహా అడుగు. తర్వాత ఏం చేద్దామో ఆలోచిద్దాం" అన్నారు.

* * *

"గంగా ప్రసాదరావుగారూ, మన ప్రోగ్రాంలో పెద్ద సమస్య వచ్చింది. లక్ష ఎకరాల్లో మాగీ జొవారు (హైబ్రిడ్‌జొన్న) వేశాంకదా.... గింజలు జల్లి వారంరోజులపైన అయింది... ఇవాళ్టికి మొక్కలు మొలవాల్సివుంది.... ఎక్కడా ఆ సూచనలు కనబడటంలేదు. నాకేమిటో

చాలా ఆదుర్దాగా వుంది. మీరు వెంటనే ఖమ్మం రాగలుగుతారా?" అని గాభారాగా టెలిఫోన్లో ఆయనను రమ్మని పిలిచాను.

గత రెండు మూడు నెలలుగా చేసిన పనులన్నీ మనసులో సినిమారీలులా తిరిగాయి.

ఇప్పటివరకూ దాదాపు రెండు లక్షల ఎకరాల్లో దేశీయ జొన్న పంట వేస్తున్నారు. అంతా వర్షాధారమే. పోయిన సంవత్సరం పంటనుండి వచ్చిన మంచి గింజల్ని విత్తనాలుగా వాడతారు. ఎప్పటినుండో ఇదే పద్ధతి. వాళ్ళ తండ్రులు అలానే పండించారు. ఇప్పుడు రైతులు కూడా అలానే చేస్తున్నారు. వానలు పడగానే భూములు దున్నడం, దున్నాక కొఱ్ఱుతో గింజలు నాటడం, ఆ గింజలు పిట్టలు తినకుండా చెక్కలాగటం, మళ్ళీ వాన పడంగానే ఆ విత్తనాలకు మొలకలువచ్చి, నెమ్మదిగా పెరగడం, మూడు నెలలకు కంకులు వేసి గింజలు రావడం, వచ్చినంతవరకూ కోసుకోవడం, పెద్దగా గింజలు రాకపోతే, గడ్డైనా వస్తుంది కదా! అదీ- ఈ మెట్టభూమిలో వ్యవసాయం.

సుబ్రహ్మణ్యంగారిని, గంగాప్రసాదుగారిని ఖమ్మంలో ఈ ప్రాంతంలో రెండురోజులు తిప్పి, ఒక పెద్ద రైతుల సదస్సు ఏర్పాటుచేసి, అక్కడి పరిస్థితులు పూర్తిగా అవగాహన చేసుకొనేలా చూశాను... తరువాత అన్ని విషయాలూ పరిశీలించి, అందులో ముఖ్యంగా అక్కడ పడే వర్షాలు, ఎంత పడతాయి, ఎప్పుడు ఏ ఏ నెలల్లో ఎంతెంత వర్షపాతం, వేస్తున్న పంటరకాలు, వస్తున్న పంట దిగుబడులు, పండకపోతే కారణాలు, పండినదానితో వచ్చే ఆదాయం, మార్కెట్లో ఉన్న ధరలు.... ఇవన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, ఆ ప్రాంతపు రెండులక్షల ఎకరాలకూ వాళ్ళు వేరొక పథకాన్నిచ్చారు...

మొదటవచ్చే వానలతో పెసరకాని మినుముగాని చాలాతక్కువ కాలపు పంట వేసి, పంటవచ్చిన తర్వాత రొట్టతోనే దున్ని, మళ్ళీ వర్షంపడ్డ వెంటనే మళ్ళీ దున్ని, అప్పుడు హైబ్రిడ్ జొన్న విత్తనాలు వెయ్యమన్నారు. ఇది ఎక్కువకాలం పంటకాదు. కాని దిగుబడి బాగావస్తుంది. చొప్పకూడా బాగానే వుంటుంది.... అక్కడ పడుతున్న వర్షం, అదిపడే తీరునుబట్టి, ఈ హైబ్రిడ్ జొన్నకు కావల్సిన తడి వర్షాధారం వల్ల దొరుకుతుంది... విడిగా ఎరువువేసినా వెయ్యకపోయినా పంట బాగానేవస్తుంది. వేస్తే ఇంకాబాగా వస్తుంది....వేరే ఇబ్బందులేమీ వుండవు. దీనివలన ఇప్పుడు వస్తున్న ఆదాయానికి నాలుగు రెట్లు వస్తుంది.

చేయాల్సిందల్లా – అదునుమీద దున్నటం, అదునుమీద గింజలు జల్లటం. మొదటిపంటగా పెసలో, మినుములో వేసినప్పుడు, పంటగింజలు తీసుకొని పొలంలోనే రొట్ట వదిలివేయాలి. వంటచెరకు కోసం తీసుకుపోకూడదు. ఆ రొట్టే ఎరువుగా పనిచేస్తుంది.

నేను మొదటి సంవత్సరం లక్షే ఎకరాలలో, రెండవ సంవత్సరం రెండులక్షల ఎకరాలలో ఈ ప్రయోగం చేద్దామని నిర్ణయం చేశాను. దాదాపు 100పైన గ్రామాలలో, భూమినంతా ఈ పంటతో నింపివేయాలి.

....అప్పటినుండీ ఇదొక యజ్ఞంలా కార్యక్రమం సాగింది. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులు, హైదరాబాదు నుండి సుబ్రహ్మణ్యంగారు పంపిన అధికారులు, గంగాప్రసాదరావుగారు పంపిన నిపుణులతో 20 బృందాలు తయారుచేసి - ఐదేసి గ్రామాలకో బృందం - ప్రతిగ్రామంలో రైతు సభలు, గోడలకి వాల్‌పోస్టర్లు, కరపత్రాలు.... ప్రతి రైతు ఇంటికి చేరేట్టు, ప్రతి రైతును ఏదో ఒక అధికారి ఒక్కసారైనా కలిసి ఏమి చేయాలో వివరంగా చెప్పేట్టు ఏర్పాటు చేయడం, కావలసిన విత్తనాలు ప్రతి గ్రామంలో చేర్చి వుంచడం, వ్యవసాయిక పరిశ్రమల సంస్థ నుంచి దొరికినన్ని ట్రాక్టర్లు వర్షాకాలంకి ముందుగానే తెప్పించి, తక్కువ ధరకే దుక్కులు దున్నే పథకాన్ని కూడా అమలుచేయడం... ఇలా అన్నీ చేస్తే మొదటి వానలకి పెసరపంట బాగానే పండింది. అంచనా ప్రకారం దాదాపు లక్షా ఇరవైవేల ఎకరాలలో రొట్టతో దున్నటం, హైబ్రిడ్‌జొన్న విత్తనాల్ని కొర్రులతో వేయడం కూడా అయిపోయింది. అదృష్టంకొద్దీ గింజలు వేసిన మరుసటిరోజే ఆ ప్రాంతంలో మంచి వాన కూడా పడింది. శుభసూచకం అని నాతోపాటు అందరూ చాలా సంతోషించారు.

ఇక, 'ఇదిగో మొలక వస్తుందీ, అదిగో మొలక వస్తుందీ' అని అందరూ ఎదురుచూడటం, రేపు వస్తుందిలే అని సర్దుకోవటం. రేపూ వెళ్ళింది. ఎల్లుండీ వెళ్ళింది. రావాల్సిన సమయంలో మొలకలు కనబడకపోయేటప్పటికి నాకు చెమట పట్టడం ప్రారంభం అయింది. అధికారులందరినీ పిలిచి మళ్ళీ పర్యావలోకనం – అధికారులు "రేపుచూద్దాం సార్" అన్నారు. కాని నాకే భయంవేసి, వెంటనే గంగాప్రసాదరావుగారికి ఫోనుచేసి వెంటనే బయలుదేరి రమ్మన్నాను. సుబ్రహ్మణ్యంగారు క్యాంపులో వున్నారు.

రాత్రికల్లా గంగాప్రసాదరావుగారు ఖమ్మం చేరుకొన్నారు.

నాకు ఆ రాత్రి నిద్రపట్టలేదు.... ఒకటా, రెండా, వందా, వెయ్యా – దాదాపు లక్ష ఎకరాలు.... వేలమంది రైతులు. వందపైగా గ్రామాలు. ఏమైనా జరిగితే ఇంక గ్రామాలకి వెళ్ళగలమా? ఇంక రైతు మన మాటవింటాడా? ఎంత నష్టం? ఎంత అభాసుపాలవుతాను? సుబ్రహ్మణ్యంగారు ప్రయోగాత్మకంగా 20 వేలో 30 వేలో ఎకరాల్లో వేయమంటే ఆశ కొద్దీ ఏదో పొడిచేసేవాడిలా లక్షపైగా ఎకరాల్లో పంట వేయించాను... తగిన శాస్తి నాకు జరిగింది.

నాకు శాస్తి జరిగితే సరే. రైతుల విషయం ఏమిటి? వాళ్ళ నష్టం విషయం ఏమిటి? ఇది అసెంబ్లీ దాకా వెళ్ళి, నా సస్పెన్షన్ దాకా దారితీయవచ్చు. 'అసమర్థపు వ్యవసాయంతో మెట్టరైతుల్ని ముంచిన కలెక్టరు' అని పత్రికలు నాకు ముద్ర వేయవచ్చు. అప్పటిదాకా నేనే చేస్తున్నానన్న అహంకారంతో ఉన్న నాకు భగవంతుడు గుర్తుకొచ్చాడు. నన్ను రక్షించమనీ, రైతుల్ని కాపాడమనీ వేడుకొన్నాను...

తెల్లవారంగానే గంగాప్రసాదరావుగారు, ఇతర వ్యవసాయ అధికారులతో కలసి పొలాలమీద పడ్డాం. ఎక్కడా మొలకలేదు – ఎక్కడో కొన్నిచోట్ల తప్ప.... కొన్ని పొలాలు చూశాక గంగాప్రసాద

రావుగారు ప్రతిసాలులో కొంచెం వేళ్ళతో కెలకటం మొదలుపెట్టారు... ఏదో, పరిశీలించి, గబగబ సాలునుంచి సాలుకు కెలుకుతూ వెళ్ళి, తలపట్టుక్కూర్చున్నారు.

ఆయన చుట్టూ చేరిన వ్యవసాయ అధికారులకు ఆయన మొలకెత్తిన విత్తనాలు చూపిస్తున్నారు.... తరువాత రైతులను పిలిచి, దుక్కిదున్నటం, కొర్రువేయటం, విత్తనాలు వేయడం గురించి ప్రశ్నలడిగారు. అంతా అయ్యాక, నా దగ్గరకు వచ్చి, చావుకబురు చల్లగా చెప్పారు. "విత్తనాలు మంచివి, అన్నీ మొలకలెత్తాయి, కొంచెం భూమిలోపలే పెరిగాయి కూడా... కాని గింజలు వేసేటప్పుడు ఈ ప్రాంతంవారు పిట్టలు తినకుండా నాగలి చేసిన గుంటని పూడ్చడానికి ఒక చిన్న కట్టెను నాగలివెనుక కట్టి లాగుతారు... భూమిని కనకులు లోతు కాకుండా దున్ని దుక్కి పోసినా పెద్ద ఇబ్బంది లేదు - ఏదో మరీ పెద్ద వానపడితే తప్ప. కాని ఇక్కడ జరిగింది వేరు. అది వరకు జొన్న వేసినట్లు మొదటి వర్షాలకు విత్తనాలు నాటలేదు. పెసర పంట తీసేప్పటికే భూమి రెండుసార్లు దున్న బడింది. విత్తనాలు నాటడానికి మూడోసారి దున్నారు. దాంతో మామూలుకన్నా ఎక్కువ లోతుకి నాగలిసాలు పోయి, గింజ లోతుగా పడింది. దానిపైకి చెక్క లాగటంతో మూసుకుపోయింది... అయినా మొలక రావలసిందే. కాని దురదృష్టవశాత్తూ మరుసటిరోజు మంచి వాన ఈ ప్రాంతమంతా పడింది. గింజ మొలకకు అది మంచిదయినా, పైన నేలపొర తడి ఎండగానే గట్టిపడింది...

"దానితో గింజలు మొలకలెత్తినా, కొంత లోపలే పెరిగినా, నేలను చీల్చుకొని మొక్క పైకి రాలేక పోయింది... అందుకే పల్చగా దున్నిన భూముల్లో, చెక్క వాడని భూముల్లో మొలక బాగా వచ్చింది... ఇప్పుడైనా వాళ్ళు చెక్క వాడకుండా గింజలు జల్లే ఏర్పాటు చేయగలిగితే పంటకు ఢోకాలేదు. ...ఇంకా కావలసినంత వర్షాకాలం ఈ పంటకు వుంది".

"వుంటే బాగుండును. భగవంతుని దయవలన ఈ సారయినా పంట బాగా వస్తే బాగుండు... నాకైతే చాలా బాధ, భయం - మనల్ని నమ్మి... అంతకంటే మనం రైతులను నమ్మించి... తర్వాత ఇలా జరిగితే జిల్లాలో మళ్ళీ నా ముఖం చూపించగలనా?" ఇది నా ఆవేదన.

రైతులు ఏమనుకొన్నారో? ఏమో? ఈ కుర్ర కలెక్టరు ఏది చేసినా హడావుడిగా చేస్తాడనా? ఆలోచించకుండా చేస్తాడనా? ఏదో పెద్ద ఎత్తున చేశానని చెప్పుకోడానికి చేశాడనా? ముఖ్యమంత్రిని మెప్పించడానికి యిలా చేశాడనా? ...ఇలా ఎన్ని విధాల అనుకొంటున్నారో... చేసిన తప్పేమిటో తెలిసివచ్చింది. అంత చిన్న తప్పుకు ఎంత పెద్ద శిక్ష? ఇప్పుడు ఏమిటి చేయడం? ఏమైనా చేయగలమా? ఇంత ప్రయత్నం చేసి, సాధించింది - రైతులకు మనమీద నమ్మకం పోవడమా? జిల్లాకు ప్రధాన అధికారిగా బాధ్యత నుంచి తప్పించుకొని పారిపోవడమా?

"జరిగినదేదో జరిగింది. ఈ పంట పోకుండా ఏం చేయాలి? ఏమైనా సరే, ఎంత ఖర్చైనా సరే.... రైతుకు నష్టంరాకుండా. గవర్నమెంటు పరువు పోకుండా ఏదో ఒకటి చేయాలండీ" అంటూ గంగాప్రసాదరావుగారినే పట్టుకున్నాను.

"సీజన్ అయితే ఇంకా వుంది. పంట తప్పక తీయచ్చు... కాని అన్ని ఎకరాల్లోనూ మళ్ళీ విత్తనాలు జల్లాల్సిందే. విత్తనాలు జల్లడం అంటే మనిషి నిలబడి జల్లడం కాదు. మళ్ళీ కొర్రు దున్నుతూ విత్తనాలు వేయాలి.... ఇలా వారంరోజులలో ఈ పని చేయగలిగితే పంట తీయవచ్చు. కాని విత్తనాలు వేసేటప్పుడు - పైన చెక్క వేయరాదు. అదే మన కొంపముంచింది. భూమి పదును సరిపోతుంది." అన్నారు గంగాప్రసాదరావుగారు.

"అసలు విత్తనాలు వున్నాయా?" అని అడిగాను.... "ఖమ్మంలో గోడౌనులో వున్నాయ్ సార్ - సాయంత్రానికి గ్రామాలకి చేర్చవచ్చు". అన్నారు వ్యవసాయాధికారులు.

"రైతులందరికి ఉచితంగా విత్తనాలు సరఫరా చేస్తామని చెప్పండి" అన్నాను.

"మరి మనం తెప్పించిన ట్రాక్టర్ల మాట ఏమిటి? అన్నీ ఇంకా గ్రామాల్లోనే వున్నాయి... వెంటనే ప్రతి టీము వారి వారి గ్రామాలకు పోయి, సాయంత్రంలోపల రైతులందరికీ చెప్పి, రేపు ఉదయానికల్లా మళ్ళీ విత్తనాలు వేసేలా చూడాలి. రాత్రికల్లా ప్రతి రైతుకూ విత్తనాలు అందేలా చెయ్యాలి. రైతులను డబ్బు అడగకుండా, అన్ని ట్రాక్టర్లూ రాత్రింబగళ్ళు పనిచేసి, వీలైనంత భూమిని దున్నుతూ గింజలు వేయడానికి సహకరించాలి. 'ఏం జరిగింది, ఎందుకు జరిగింది' - అర్థమయ్యేలా రైతులకు చెప్పి, ఆ తప్పు మళ్ళీ ఎవ్వరూ చెయ్యకుండా చూడాలి. వాళ్ళు విత్తనాలు వేస్తున్నప్పుడు సరిగా దున్నుతున్నారో లేదో అందరు అధికారులూ రైతుల్ని పరిశీలించాలి. రేపు మధ్యాహ్నానికి ఈ విషయంలో రాత పూర్వకంగా మీకు ఉత్తర్వులు అందుతాయి. ఏమీ భయపడవద్దు - జరిగిన దానికి బాధపడుతూ కూర్చోకండి... సమయం వృథా కాకుండా జరగాల్సినపని సక్రమంగా జరిగేట్టు చూడండి" అని అందరికీ చెప్పి పంపాను.

ఏమైనా, ఏమీ లేకపోతే నష్టపోయేది రైతులు. మళ్ళీ విత్తనాలు ఉచితంగా ఇచ్చారు. కాబట్టి రైతులు కొంత నసుగుతూ, కొంత కోపంతో, కొంత అర్థంకాక గబగబా చెప్పినట్లు చేయడానికి సిద్ధపడ్డారు... నాలుగైదు రోజుల్లో దాదాపు పని పూర్తి అయింది. ఇదంతా చూసి కొంతమంది కొత్త రైతులు కూడా ముందుకు వచ్చారు. అందరు అధికారులూ ప్రతి రోజూ వారివారి గ్రామాల్లో జరిగే పురోగతి నాకు తెలపాలనీ, మొలకలు రావడం మొదలుపెట్టిన వెంటనే విషయం నాకు తెలియాలనీ ఆదేశించాను.

నిమిషం ఒక యుగంలా రెండు రోజులు గడిచాయి. నా జీవితంలో అంత ఆదుర్దాతో, అంతటి అనిశ్చిత పరిస్థితులలో మొలకల కోసం ఎదురు చూడటం అదే మొదటిసారి. భయం, బెంగ, ఆదుర్దా, ఆరాటం, ఆందోళన......!!

మూడో రోజు మధ్యాహ్నానికల్లా ఎన్నికల ఫలితాల్లా ఒక్కొక్క గ్రామం నుంచి, మొలకలు బయటికి వచ్చాయనీ, వస్తున్నాయనీ కబురు మొదలైంది. నాలుగోరోజుకల్లా సుబ్రహ్మణ్యంగారు, గంగాప్రసాదరావు గారు వచ్చారు. ముగ్గురం చాలా గ్రామాలకు వెళ్ళి స్వయంగా చూశాం. ఈసారి గంగాప్రసాదరావు గారు సంతృప్తి వ్యక్తం చేశారు.

గడచిన సంవత్సరాల్లో లాగే, ఇంకో మూడు నాలుగు వానలు కొన్ని రోజుల వ్యవధిలో పడితే మంచి పంట, మంచి దిగుబడి వస్తుందని హామీ ఇచ్చారు. అలా వర్షాలు కురిపించమని భగవంతునికి పూజలు చేశాను, చేయించాను.

వారం వారం వెళ్ళి పంటలు చూసి వచ్చేవాడిని. జిల్లాకి వచ్చిన ప్రతి సీనియర్ అధికారిని తీసుకువెళ్ళి చూపించాను. వెంగళరావు గారికి మొదట చూచాయగా చెప్పినా, అన్ని వివరాలూ చెప్పలేదు. ఆ జిల్లా నుంచి చెప్పేవాళ్ళు ఆయనకు చాలామంది వున్నారు. ఇది లక్ష ఎకరాల విస్తీర్ణానికి, వంద గ్రామాలకు సంబంధించిన విషయం.

కంకులు మొదలు పెట్టి గింజవేయడం ఆరంభించాక నాదృష్టి - జొన్నల ధరలమీదకు పోయింది. మార్కెట్ యార్డులో జొన్నలు కొనేవారిని- కొన్నవి ఏంచేస్తారు? ఎక్కడకు పంపుతారు? లోకల్‌గా అమ్ముడుపోతాయా? బయట మార్కెట్‌కు పంపాలా? ...ఇలా కొంత అధ్యయనం మొదలు పెట్టాను. జొన్నలరేటు జిల్లాలో పండినదానికంటే - ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలలో పంటమీద దిగుబడిమీద ఆధారం. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల ధరలమీద చాలావరకు అధారం. కాని చాలా తక్కువ ధరకు జిల్లా వ్యాపారస్తులు కొని, ఇతర రాష్ట్రాలకు మంచి లాభాలకు అమ్మకోవడం సాధారణంగా జరిగేదని...

రాష్ట్రస్థాయిలో మార్కెటింగ్ శాఖ ఈ విషయంలో ఏమీ సహాయం చేయలేకపోయింది. సహకార మార్కెటింగు ఫెడరేషనుతో చెప్పాను. అదివరకు నేను ఈ ఫెడరేషన్ చైర్మన్‌గా వుండటంవలన ఇతర రాష్ట్రాలలో ధరలు కనుక్కొని, రైతులకు మంచి ధరవచ్చేటట్లు చేయాల్సిన బాధ్యత వారిదని వారికి పని అప్పచెప్పాను... కమీషను పద్ధతిమీద జిల్లాలోని వ్యాపారస్తులను కూడా వాడుకోవచ్చని వారికి ఆదేశాలివ్వడం, మంచిధర రావచ్చున్న హామీదొరకడం జరిగింది.

హైబ్రిడ్ జొన్న పంట బాగా పండింది... అన్ని గ్రామాల్లోనూ అదే విధం. ఆ సంవత్సరం మహారాష్ట్ర, గుజరాత్‌లలో వర్షాలు పడక కరువు పరిస్థితి వచ్చింది. రాజస్థాన్ కూడా దాదాపు అంతే... అందుకని చూస్తూ వుండగానే జొన్నలు ధరలు గణనీయంగా పెరగటం మొదలైనాయి. ఖమ్మంలో పంటకోసే సమయానికి అదీ పరిస్థితి. పంటలు కోయడం, కంకులు నూర్చడం అయింది. గింజలు ఆరబెట్టి, తరువాత అమ్మాలి. చెమ్మతోవుంటే జొన్నలు కొనరు. ఎందుకంటే బూజు పట్టే ప్రమాదం వుంది కనుక. కొనటానికి కొనుగోలు కేంద్రాల్ని మార్కెటింగు ఫెడరేషన్ ద్వారా సిద్ధంచేశాం. చాలామంది వర్తకులను కొని ఫెడరేషన్‌కు సరఫరా చేయమని ఆదేశాలు ఇచ్చాను.

ఆ సమయంలో పిడుగులాంటివార్త.

ఆంధ్రప్రదేశ్‌లో లెవీ వసూలుని జొన్నలపై కూడా విధిస్తున్నారు. ఎప్పటినుండో బియ్యం విషయంలో లెవీ పద్ధతి వుంది. తినేవారికి ఖరీదు పెరక్కుండా వుండేందుకు నిర్ణయించిన

తక్కువ ధరకు ప్రభుత్వం బియ్యాన్ని కొనుగోలు చేస్తుంది. వ్యాపారులు, మిల్లర్లు, నిబంధనల ప్రకారం రైతులనుండి నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసి, ప్రభుత్వానికి ఇవ్వాలి... అదే పద్ధతి మొదటిసారిగా రాష్ట్రంలో జొన్నల విషయంలో ప్రవేశపెడ్తున్నారన్న వార్తలో లెవీ ధరలకు ప్రభుత్వంకొని ఉత్తర భారతానికి పంపించాలని నిర్ణయం. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ఈ నిర్ణయం తీసుకోవాలని పౌర సరఫరాల బోర్డు మెంబరు రామిరెడ్డిగారు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఇవాళో రేపో ఉత్తర్వులు జారీ కావచ్చనీ, ముఖ్యమంత్రికి ఫైలు వెళ్ళిందనీ, ఆయన సంతకం అయిపోతే ఉత్తర్వులు వచ్చేస్తాయనీ హైదరాబాద్ నుంచి వార్త వచ్చింది (మా గురువుగారి నుంచి).

నాకేం చేయాలో పాలుపోలేదు. ఒకవైపు కలెక్టరుగా వ్యవసాయ అభివృద్ధి నా బాధ్యత. జిల్లా కలెక్టరు (పౌర సరఫరాలు)గా లెవీ విధానం ఆచరణలోకి తేవడం కూడా నా బాధ్యతే.

ఇంత కష్టపడి, ఇంతమందిచేత పనిచేయించి, రైతులకు ఇంత ఆశ చూపించి, పంట మొత్తం నష్టపోయే ప్రమాదం నుండి తప్పించుకొని, చివరకు రైతుకు గిట్టుబాటు ధర లేకపోతే మళ్ళీ పాత పద్ధతులకు పోయే ప్రమాదం లేదా? వచ్చే సంవత్సరం రెండు లక్షల ఎకరాల సాగు మాట అటువుంచి, ఈ సంవత్సరం చేసినట్లు లక్ష ఎకరాలు కూడా చేయడం కష్టం. అందుకే ఏదైనా చేయాలి. చేయగలిగింది ఏమిటి? ముఖ్యమంత్రికి ఈ విషయం తెలిపి ఆయన విచక్షణకు వదిలివేయటం ఒక్కటేనా?

అదే చేశాను. ముందు రావుసాహెబ్‌గారితో (ముఖ్యమంత్రి కార్యదర్శి) మాట్లాడాను. ఆయన చెప్పింది "ఇవ్వాళే ఫైలు వచ్చింది... ముఖ్యమంత్రి వేరే బిజీగా వుండటం వలన ఇంకా చూడలేదు. రామిరెడ్డిగారు ఇప్పటికే రెండుసార్లు గుర్తుచేశారు... ఇది కొంచెం సున్నితమైన చిక్కు విషయమే. నువ్వే ముఖ్యమంత్రి వెంగళరావుగారితో మాట్లాడు, నేను మాట్లాడటం అంత బాగుండదేమో. నీకు నేను చేయగలిగిందల్లా, నాకుగా నేను ఫైలు తీసుకువెళ్ళి ఆయన సంతకం తీసుకోను. ప్రతిపాదన ఆమోదించమని సలహా కూడా యివ్వను. నువ్వు మాట్లాడాక ఆయన ఏం చెలితే అది మనం అమలు చేద్దాం" అన్నాడు.

వెంటనే ముఖ్యమంత్రిగారితో విషయం చెప్పాను. ఎంతో పెద్దకార్యక్రమం, మొదటి విత్తనాలు మొలవక పడ్డపాట్లు, అన్నీ వివరించి, "వచ్చే సంవత్సరం రెండు లక్షల ఎకరాలు చేయాలని సంకల్పం. ఈ సంవత్సరం రైతులకు లాభాలు వస్తే పెద్ద కష్టం లేకుండా వచ్చే సంవత్సరం మొత్తం ఏరియాలో చెయ్యాలనివుంది. ఇప్పుడేమో లెవీ అంటున్నారు. అదివస్తే వస్తుందనుకున్న లాభం అంతా రైతులు నష్టపోయే ప్రమాదం వుంది. ...మీకు ఫైలు వచ్చిందట. మీరు ఆలోచించి ఏం చెయ్యమంటారో చెప్పండి" అన్నాను.

"మనం చేసింది చాలామంచి కార్యక్రమం - ఖమ్మంలో ఆ ఏరియా నాకు బాగాపరిచయం. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఏమన్నా చేయాలని ఎంత అనుకున్నా ఏమీ చేయలేకపోయాను. సాగరు

నీరూ రాక, పరిశ్రమలూ లేక, ఏమీ లేక వెనుకబడిన ప్రదేశమే అది. ఇంతకీ పంట కోయడం అయిందా? ఇంకా అమ్మటానికి ఎన్ని రోజులుపడుతుంది" అన్నారు.

"పంటకోయడం, నూర్చడం, ఆరబెట్టడం కూడా అయిపోయింది. మా అంచనా ప్రకారం రేపటినుండి అమ్మకాలు మొదలుకావాలి. మార్క్‌ఫెడ్ కొనగానే సరిపోదు. కొనగానే లెవీ వేస్తే మార్క్‌ఫెడ్ బయటకు పంపలేదు. మార్క్‌ఫెడ్ మునిగిపోతుంది. గుజరాత్, రాజస్థాన్ లకు ఎగుమతి కావాలి. లారీలలో ఖరీదు ఎక్కువ – రైల్వే రేక్సు అయితేనే బెస్టు. ఏదైనా చేయదలచుకొంటే రైల్వే జిఎంతో మాట్లాడి రోజుకి నాలుగైదు భారీరేకులు నాలుగైదు సైడింగులలో, ఖమ్మం - వరంగల్లు మీదుగా ప్రతిరోజూ ఇవ్వగలిగితే, ఐదు, ఆరు రోజులలో చాలావరకు పూర్తి చెయ్యవచ్చు" అన్నాను.

"అలాగే ఒక వారంరోజులలో అయ్యేట్టు చూడు – మిగతా విషయం నాకు వదిలెయ్" అన్నారు.

"కొంచెం రైల్వే జిఎంతో..." అంటుంటే, "రావుసాహెబ్‌గారిని ఆ పనికి పురమాయిస్తాను... ఇబ్బంది ఏమైనా వుంటే నాకు వెంటనే చెప్పు... రామిరెడ్డిగారికి ఇది నచ్చదు... తెలిస్తే నిన్ను నలిపేస్తారు"– అంటూ నవ్వేశారు.

అంతే! మరుసటిదినం నుండి యుద్ధప్రాతిపదికపై మాగీ జొవారు పంటని రైతుల దగ్గరకొనడం, స్టేషనుకు రవాణా, రోజుకి 4/5 రేకుల చొప్పున దాదాపు ఏడురోజుల కార్యక్రమం నడిచాక ... ప్రభుత్వ లెవీ వుత్తర్వులు జారీకావడం, అవి జిల్లాలకొచ్చేటప్పటికి ఇంకోరోజు, భారత ఆహారసంస్థవారు సర్దుకునేటప్పటికి మరో రెండురోజులు... ఇలా దాదాపు అమ్మదలచుకొన్న రైతులందరినుండి సరుకు వెళ్ళిపోయింది. వ్యవసాయ అధికారులతో గ్రామాలన్నింటిలో వెంటనే అమ్మకపోతే తక్కువ ధరకు ప్రభుత్వం తీసుకొంటుందని ముందుగానే సమాచారం అందించడంతో, చాలామటుకు అందరు రైతులూ వారు తినేదానికి వుంచుకొని మిగతాది అమ్మేశారు.

ఇలా జరగడం మొదలైన నాలుగోనాటికి రామిరెడ్డిగారికి అనుమానం వచ్చేసింది. మామూలుగా సంతకం పెట్టి పంపించే ముఖ్యమంత్రి ఈ ఫైలుపై రెండుమూడు సందేహాలు వ్యక్తంచేసి, అవి అన్నీ వివరించి పంపినప్పటికీ ఫైలు వెంటనే రాకపోవడం, రావుసాహెబుగారి నడిగినా, ఆయన ఏమీ తెలియనట్లు వూరుకోవడం - ఈ విషయం రామిరెడ్డిగారికి అర్థం కాలేదు. విషయం పూర్తిగా తెలిసేటప్పటికి ఆయనకి ఇష్టంలేని విధంగా జరగాల్సింది జరిగి పోయింది. ఖమ్మం కలెక్టరు వల్ల ఇదంతా జరిగిందనీ, ఏదో ఖమ్మం వర్తకుల వద్ద వున్న జొన్నల నిలువలు బయటికి పంపి వర్తకులకు సహాయం చేయటానికి ముఖ్యమంత్రీ, ఖమ్మం కలెక్టరూ కలిసి ఇదంతా చేశారనీ ఆయన నమ్మడం కూడా జరిగిపోయింది.

* * *

అప్పుడు జరిగిందిది. టెలిఫోనులో రామిరెడ్డి నన్ను ఝూడించేశారు. నామాట వినకుండానే ఫోన్ పెట్టేశారు... వర్తకులకోసంకాదు, నేను చేసింది రైతులకోసం. అయినా నేనేం చేశాను? ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చానంతే. నిర్ణయంతీసుకున్నది ముఖ్యమంత్రికదా! రామిరెడ్డిగారు కూడా రైతుకుటుంబం నుంచి వచ్చినవాడే. సానుభూతి చూపిస్తారనుకున్నాను. కాని విషయం చెప్పడానికవకాశం ఇస్తేనా?

తరువాతనైనా హైదరాబాదు వెళ్ళి ఆయనకు విషయం వివరించాల్సింది. కాని ఆయన అలా మాట్లాడిన తర్వాత వెళ్ళబుద్ధికాలేదు. ఆభిజాత్యం అడ్డం వచ్చింది. భగవంతుని దయ ఎలా వుంటే అలా అని వూరుకొన్నాను. రాదాపు ఏదాది అవుతుండటంతో ఆ విషయమే మర్చిపోయాను.

ఇవాళ రెవెన్యూ బోర్డు మెంబరు హోదాలో రామిరెడ్డిగారు కలెక్టరు ఆఫీసు తనిఖీకి వస్తున్నారని బోర్డునుండి కబురురాగానే పాత జ్ఞాపకాలన్నీ మెదడు తొలిచేస్తున్నాయి.

ఐదుగురు బోర్డు మెంబర్లు వుంటే, నా దురదృష్టం కాకపోతే ఖమ్మానికి ఈయనే రావాలా? ఇంకెవరైనా రావచ్చు కదా?

జరగనున్నది జరగకపోదు. భగవంతునిమీద భారంవేసి మనం చేసేది మనం చేద్దాం అని ఊరుకున్నాను.

మరుసటి రోజు మర్యాదపూర్వకంగా ఆయనతో టెలిఫోనులో మాట్లాడి, ఎప్పుడువస్తున్నారో కనుక్కోవటానికని చెప్పాను. ఆయన కంఠంలో మునుపటి కోపం కనపడలేదు. అలా అని, ఆప్యాయతా కనపడలేదు. ఒక సీనియర్ అధికారి తన జూనియర్‌తో మాట్లాడినట్లు గానే వుంది....

మామూలు కలెక్టరు ఆఫీసు ఇనస్పెక్షన్ మాత్రమే కాకుండా, అన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రత్యక్షంగా చూడటానికి, అధికారులతో సంప్రదించడానికి అవకాశం కల్పించాను. వెళ్ళిపోయేముందు ఇంటికి భోజనానికి పిలిచాను. ఏ మెంబరు, ఏ సీనియరు అధికారి జిల్లాకు వచ్చినా కలెక్టరు విందు ఇవ్వటం ఆనవాయితీ. ఆయన రానంటే కోపం ఇంకా ఉన్నట్లు, వస్తానంటే ఫరవాలేదన్నట్లు అనుకున్నాను. వస్తానన్నారు.

తనిఖీ అంతా బాగా జరిగిపోయింది.... ఆయన నాతో చాలా చనువుగా, ఆప్యాయంగా ప్రవర్తించారు... ఏమేం కార్యక్రమాలు జిల్లాలో చేస్తున్నది అడిగి తెలుసుకున్నారు.

వెళ్తూ వెళ్తూ నా పనిని చాలా అభినందించి, సంవత్సర క్రితం ఆయన నాతో టెలిఫోనులో మాట్లాడిన విషయం ప్రస్తావించారు. "ఏమీ అనుకోవద్దు. నాకు విషయం అప్పుడు పూర్తిగా తెలియదు. నా పని నేను తొందరగా, సమర్థంగా చేయాలన్న పట్టుదలతో వుంటే నువ్వు అడ్డం పడ్డావనీ, రాజకీయనాయకులకు, ముఖ్యమంత్రికి ఏదో సహాయం చేయడానికలా చేశావనీ అనుకున్నాను. నాది వరంగల్లు జిల్లా. మా చుట్టాలు చాలామంది ఖమ్మంలో మీరు మాగీ జొవారు వేసిన ప్రాంతంలో వున్నారు. ఒకాయన నాకు వివరంగా జరిగింది చెప్తూ, 'ఇలాంటి

కలెక్టర్లు వుంటే రైతు తప్పక బాగుపడతాడు' అన్నారు. తర్వాత సుబ్రహ్మణ్యంగారు ఈ విషయంలో నువ్వు ఎంత కష్టపడ్డావో చెప్పారు.... నాకు చాలా సంతోషంగా వుంది. కీపిట్ అప్..." అన్నారు.

గుండెల్లో బరువుతగ్గింది - "అమ్మయ్య" అనుకున్నాను.

కాని నిజమైన ఆశ్చర్యం - రామిరెడ్డిగారి ఇనస్పెక్షన్ రిపోర్టు చదివినప్పుడు కలిగింది. ఖమ్మంలో జరిగిన ప్రగతినీ, అందులో కలెక్టరు పాత్రని శ్లాఘించుతూ చాలా రాసి, చివరగా ఓమాట రాశారు.

"నేను వరంగల్లు జిల్లా నుంచివచ్చాను. వరంగల్లు, ఖమ్మానికి పక్క జిల్లా... ప్రసాదు ఖమ్మానికి కలక్టరు కాకుండా నా సొంతజిల్లా వరంగల్లుకి కలెక్టరు అయితే బాగుండేది. ఖమ్మంజిల్లా చూస్తే అసూయగా వుంది..."

★ ★ ★

రెవెన్యూ బోర్డుకి శ్రీముఖం

నేను 700 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇండియన్ టుబాకో కంపెనీ (ఐటిసి)కి 'ధారాదత్తం' చేశాను!

1976లో ఖమ్మం జిల్లాలో భద్రాచలం పేపరు ఫ్యాక్టరీ పెట్టడానికి 'ఐటిసి'కి నేను 700 ఎకరాలు అప్పగించిన విధానం - రాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత శక్తివంతమైన రెవెన్యూ బోర్డు దృష్టిలో నేరమైంది. రెవెన్యూ బోర్డు ప్రథమ సభ్యుడు కృష్ణస్వామి నామీద అభియోగాలు మోపారు. సామాన్యుడికి వంద గజాలివ్వాలంటేనే సవాలక్ష ప్రశ్నలువేసి, సంవత్సరాల తరబడి త్రిప్పుకునే జిల్లా రెవెన్యూ కలెక్టరు నిబంధనల్ని తుంగలో త్రొక్కి ఒక పారిశ్రామిక సంస్థకి 700 ఎకరాలు ఎలా 'దోచిపెట్టాడు?' అందుకే "పి.వి.ఆర్.కె. ప్రసాద్ మీద కఠినమైన క్రమశిక్షణా చర్య తీసుకోవాల్సింది" అంటూ కృష్ణస్వామిగారు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

* * *

రెవెన్యూ బోర్డు ప్రథమ సభ్యుడు నామీద క్రమశిక్షణా చర్యకు సిఫార్సు చేసిన విషయం గురించి కె.సుబ్రహ్మణ్యంగారు నాకు టెలిఫోన్ చేసి హెచ్చరించారు. అప్పటికి సుబ్రహ్మణ్యం గారు కూడా రెవెన్యూబోర్డులో మెంబరయ్యారు. కాని అందరిలోకీ జూనియర్ (అయిదవ) సభ్యుడు. నేను ఖమ్మం జిల్లా కలెక్టరయినంత మాత్రాన ఆయన నాకు టెలిఫోన్‌చేసి వుండనక్కరలేదు. కాని చేశారు. ఎందుకంటే నేను ఐఏఎస్ అధికారిగా (అసిస్టెంట్ కలెక్టర్‌గా) ఆయన దగ్గరే మొట్టమొదట శిక్షణ పొంది వున్నాను పశ్చిమగోదావరి జిల్లాలో. నామీద ఆయనకొక సోదర వాత్సల్యం కూడా.

సుబ్రహ్మణ్యంగారి హెచ్చరిక విని నేను మ్రాన్పడిపోయాను. ఏం మాట్లాడాలి? ఏం చెప్పాలి?

సుబ్రహ్మణ్యంగారు చెప్పుకుంటూ పోయారు. "...ఆఫ్టరాల్, ఒక జిల్లాకి కలెక్టరు అయినంత మాత్రాన వాడిష్టమేనా వందలకొద్దీ ఎకరాలు గుత్తగా ఇచ్చేయడం - అని కృష్ణస్వామిగారు నీమీద నిప్పులు కక్కుతున్నాడు. రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో జిల్లా కలెక్టరు అంటే ఒక డిప్యూటీ సెక్రటరీ స్థాయి అధికారి కదా! నువ్వు నీ పరిధిని దాటిపోయి, జాయింట్ సెక్రటరీ, సెక్రటరీ, ఛీఫ్ సెక్రటరీ, రెవెన్యూ బోర్డు, మంత్రి మండలి స్థాయిని కూడా దాటిపోయి, రూల్సు-రెగ్యులేషన్స్‌కి స్వస్తిచెప్పి, ఒక నవాబులాగా వందలాది ఎకరాల్ని ఐ.టి.సికి కట్టబెట్టావనీ, ఇప్పుడు నీమీదే క్రమశిక్షణా చర్య తీసుకోకపోతే రెవెన్యూ యంత్రాంగంలో ఎవ్వరికీ ప్రభుత్వం అంటే భయంగానీ, నియమనిబంధనల పట్ల గౌరవంగానీ వుండవని ఆయన విరుచుకుపడుతున్నాడు..."

ఒక్కసారిగా నీరసం, నిస్సత్తువ నన్ను ఆవరించాయి. అయిపోయింది. ఖమ్మంజిల్లా కలెక్టరుగా ఇన్నాళ్ళూ సంపాదించుకున్నా ననుకుంటున్న కాస్తో కూస్తో మంచిపేరు ఏదన్నావుంటే అది దీనితో తుడిచిపెట్టుకుపోయింది. ఒకసారి ప్రభుత్వం క్రమశిక్షణా చర్యతీసుకుందంటే - అది సర్వీసు రిజిష్టర్‌లో రికార్డవుతుంది. ఫినిష్! అక్కడితో భవిష్యత్‌లో ఏ మంచి పోస్టింగ్‌కి అవకాశం వచ్చినా, ప్రమోషన్ రావాల్సివున్నా అది సైంధవుడిలా అడ్డం పడుతూనే వుంటుంది.

(1993 లో నేను ప్రధానమంత్రి కార్యాలయంలో పనిచేసేటప్పుడు మన రాష్ట్రానికి చెందిన ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి పేరుని ప్రతిష్ఠాత్మకమైన సింగరేణి కాలరీల సంస్థ ఛైర్మన్ - మేనేజింగ్ డైరక్టర్ పదవికి రాష్ట్రప్రభుత్వం సిఫార్సు చేస్తే, గతంలో ఆయన బంగారు విగ్రహాల కేసులో దీర్ఘకాలం సస్పెన్షన్‌లో వున్నారన్న కారణంగా ఆయన పేరుని కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది.)

ఒక విధంగా కృష్ణ స్వామిగారి కోపానికి కారణం లేకపోలేదు... ప్రభుత్వభూమిని పేదలకు పంచాలంటే 'ఒక్కొక్క కుటుంబానికి ఇంత భూమి ఇవ్వవచ్చు, అదీ కలెక్టర్లే ఇవ్వచ్చు' అని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసివుంది. ...ఒక ప్రభుత్వ సంస్థ నుండి ఇంకొక ప్రభుత్వ సంస్థకు భూమి బదిలీ చేయాలన్నా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. ప్రభుత్వ భూమిని ఇంకొక ప్రభుత్వ సంస్థకు ఇవ్వాలన్నా, ప్రభుత్వ అనుమతి కావాలి. కాని సామాన్యంగా కలెక్టర్లు భూమిని అత్యవసరంగా అలా మరో శాఖకు ఇచ్చినా, తదనంతర ఆమోదంకోసం ప్రభుత్వానికి రాయడం ఆనవాయితీ. ...ఇవన్నీ ఏదో ఎకరం - రెండెకరాల విషయం.

ప్రభుత్వ భూమిని ప్రైవేటు వారికి ఇవ్వాలన్నా, ప్రైవేటు సంస్థలకు, కర్మాగారాలకు ఇవ్వాలన్నా ప్రభుత్వం ఆమోదించి తీరాల్సిందే ... అందుకే ప్రభుత్వభూమిని ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలంటే ప్రభుత్వం ఇవ్వాలా వద్దా అనే అ⸺సీ, మార్కెటు రేటు ఎంత వుండాలన్న విషయాన్నీ - రెండింటినీ ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.

భూమి విలువ కనుక ఒక పరిమితి దాటితే, నిర్ణయం తీసుకో గలిగింది - రాష్ట్ర మంత్రి మండలే. ఇంకెవ్వరికీ అధికారం లేదు.

భూమిమార్పిడి విషయంలో ఇవీ నిబంధనలు. వాటిని అతిక్రమించి 700 ఎకరాలకు పైగా భూమిని ఖమ్మం జిల్లాలోని బూర్గుంపాడు తాలూకాలో భద్రాచలం దగ్గర గోదావరికి పడమటివైపున గల సారపాక గ్రామం దగ్గర ఐ.టి.సి వారికి పేపరు ఫాక్టరీ పెట్టడానికి ఆధీనం చేశానన్నది ప్రస్తుత అభియోగం. చేశానా అంటే చేశాను - అది నిజం.

ఎందుకు చేశాను? ఏ పరిస్థితుల్లో చేశాను? ఎలా చేశానన్నది రెవెన్యూ బోర్డు ప్రథమ సభ్యుడు కృష్ణస్వామిగారికి అఖ్ఖరలేదు. చేయడానికి అధికారం కలెక్టరుకు లేదు. కాని చేశాడు - కలెక్టరు కేమిటి, రెవెన్యూ బోర్డుకే లేదు. రెవెన్యూ కార్యదర్శికి లేదు, రెవెన్యూ మంత్రిగారికీ

లేదు, చివరికి మంత్రిమండలి తీర్మానించాలి గాని కలెక్టరు 'తగుదునమ్మా' అని నిర్ణయించేయటమే కాకుండా, భూమిని కంపెనీ వారికి స్వాధీనం కూడా చేశాడు.

ఆ రోజుల్లో రెవెన్యూ బోర్డు చాలా శక్తివంతమైన పరిపాలనా వ్యవస్థ. బోర్డులో అయిదుగురు సీనియరు ICS/ IAS అధికారులుండేవారు. ప్రథమ సభ్యుడు అందరికన్నా సీనియరు. చీఫ్ సెక్రటరీ తర్వాత సీనియారిటీలో ఆయనే పెద్ద. రెవెన్యూ సెక్రటరీ కన్నా సీనియరు... రెవెన్యూ విషయాలలో తుది నిర్ణయాలు బోర్డువే. దాదాపు ముఖ్యమైన నిర్ణయాలన్నీ ఈ ప్రథమ మెంబరు అధ్యక్షతన సమావేశమై అయిదుగురు సభ్యులూ సామూహికంగా తీసుకొంటారు. పూర్వం - బ్రిటిషువారి పరిపాలనలో ఏర్పాటైందీ వ్యవస్థ. ...భూ విషయాలు, భూమిశిస్తు, వాణిజ్యపన్నులు, ఎక్సైజ్ వ్యవహారాలు (ఆల్కాహాల్- మత్తు పానీయాలపై పన్నులు), స్టాంపులు రిజిస్ట్రేషన్లు, నీటిపారుదల పన్నులు, ...ఇలా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం అంతా దాదాపు ఈ బోర్డు పరిధిలో వుండేది. కలెక్టర్లు వీరి అధీనంలో పనిచేసేవారు. కలెక్టర్లు, వాళ్ళ ఆఫీసుల తనిఖీలు, ఇన్‌స్పెక్షన్ కూడా ఈ ఐదుగురు బోర్డు మెంబర్లే చూసేవారు...

కాని స్వాతంత్ర్యం వచ్చాక, ప్రభుత్వ విధానాలు మారి ప్రభుత్వం సంక్షేమ రాష్ట్రంగా రూపొందిన తర్వాత, కలెక్టర్ల బాధ్యతల్లో మార్పులు వచ్చి, రెవెన్యూ కలెక్టరులు డెవలప్‌మెంటు కలెక్టర్లుగా రూపు దిద్దుకున్న తర్వాత - ఈ రెవెన్యూ బోర్డు అధికారాలు కొంత తగ్గిపోయాయి. ప్రభుత్వ కార్యక్రమాలు మారినా, పనిచేసే పద్ధతులు మారకపోవడంతో బోర్డులో నిర్ణయాలు త్వరగా కావడంలేదనీ, వారికి వ్యవస్థపట్ల అభివృద్ధి దృక్పథంతో ఆలోచించే తత్త్వం లేదనీ, మారిన పరిస్థితులలో అసలు బోర్డు ఉనికే ప్రశ్నార్థకమనీ ...ఇలా విమర్శలు వస్తున్నాయి.

ఏమైనా కలెక్టరుగా నేను తీసుకొన్న నిర్ణయాన్ని - అంటే 700 ఎకరాలు భద్రాచలం పేపరుమిల్స్ కోసం ఇచ్చేసిన నిర్ణయాన్ని నిర్ధారించమని ప్రభుత్వాన్ని కోరుతూ, ఆ ప్రతిపాదనని నిర్దిష్ట పాలనా యంత్రాంగపు మార్గంలో పంపి వుండాల్సింది. అంటే బోర్డుకు పంపి, వారి ఆమోదంతో ప్రభుత్వానికి పంపవలసింది. బహుశా, నా ప్రతిపాదన రెవెన్యూ బోర్డుకి వెళ్ళేసరికే నేను భూమిని అప్పగించేయటం రెవెన్యూ బోర్డు సభ్యుడి ఆగ్రహానికి గురయింది.

బోర్డులో జూనియర్ సభ్యుడైన సుబ్రహ్మణ్యంగారికి నేనంటే అభిమానం. కాని బోర్డులో అది ఆయన సబ్జెక్టుకాదు. భూవిషయాలు చూసేది ప్రథమ సభ్యుడే. ...అయిన కనుక తన మనసు విప్పకుండా వుంటే సుబ్రహ్మణ్యంగారు నన్ను వెనకేసుకురావడానికి తప్పక ప్రయత్నించేవారే. ...కాని పరిస్థితులు ఆయన చేతిలో లేవు. నన్ను అనుకూలించలేదు. పాపం శిష్యుడికి చేయగలిగిన సహాయం - ముందు హెచ్చరిక చేయడం ఒక్కటే.

సుబ్రహ్మణ్యంగారు చెప్పేది చెబుతున్నారు. నాకింకేమీ తలకెక్కటంలేదు. సర్వీసు రిజిష్టర్‌లోకి ఎక్కబోతున్న 'బ్లాక్‌మార్క్' ఒక్కటే కనుపిస్తోంది.

మధ్యలో సుబ్రహ్మణ్యంగారు మాట్లాడటం ఆపారు. "ప్రసాద్, వింటున్నావా?" ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చాను. "సర్, సర్... వింటున్నాను" అన్నాను యాంత్రికంగా.

"ప్రసాద్, అసలు జరిగిందేమిటో చెప్పు. ఏం చేయాలో ఆలోచిద్దాం" అన్నారు.

నేను మెల్లగా తేరుకుని, జరిగిందంతా చెప్పాను.

★ ★ ★

ఈ విషయం దాదాపు సంవత్సరంపైగా నడుస్తూనే వుంది. ఐటిసి కంపెనీవారు ఒక పేపరు ఫ్యాక్టరీ పెట్టాలని నిర్ణయించడం, కావల్సిన సదుపాయాలన్నీ 'మేం కలగచేస్తాం, మారాష్ట్రంలో పెట్టండి' అని వారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆహ్వానించడం, దానిపై వారి నిపుణుల బృందం కొన్ని జిల్లాలు పర్యటించి ఖమ్మం జిల్లాలోపెట్టాలని నిర్ణయించడం కొన్ని మాసాలక్రితం జరిగింది.

ఖమ్మంజిల్లాలో కూడా రెండు ప్రదేశాలు – గోదావరికి ఇటువైపున, అటు (భద్రాచలం) వైపున కూడా అనుకూలమేనని నిపుణుల బృందం అభిప్రాయపడింది. ఆ సలహా మేరకు ప్రభుత్వంలో పరిశ్రమల శాఖతోను, మంత్రులతోను, ముఖ్యమంత్రితోను కొన్నిసార్లు చర్చలు కూడా జరిగాయి. ఆ చర్చల సారాంశం ఏమిటంటే – రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాలసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.రామారావు గారి అధ్యక్షతన రెవెన్యూ కార్యదర్శి, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి, విద్యుత్‌శాఖ కార్యదర్శి, పరిశ్రమలశాఖ కార్యదర్శి, ఐటిసి ప్రతినిధి సభ్యులుగా ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించాలి. ఈ కమిటీ – ఫ్యాక్టరీ ఎక్కడ పెట్టాలి? ఫ్యాక్టరీకి ఎంత భూమి ఇవ్వాలి? మార్కెట్ రేటు ఎంత వుండాలి? ఆ మార్కెట్ రేటు ఎలా చెల్లించాలి? నీటి సరఫరా, విద్యుత్ సరఫరా ఎలా ఇవ్వాలి? మురుగునీటిని ఏరకంగా బయటికి పంపాలి?... ఇవన్నీ పరిశీలించాలి.

ఈ కమిటీ రెండు మూడుసార్లు ఖమ్మం జిల్లాలో పర్యటించి సారపాక గ్రామాన్ని ఎంపికచేసి, అక్కడ వున్న 730 ఎకరాల ప్రభుత్వభూమిని ఫ్యాక్టరీకి ఇవ్వాలనీ, కలెక్టరు నిర్ణయించిన మార్కెటు ధరని ఫ్యాక్టరీవారు చెల్లించవలసి వుంటుందనీ, ఆ చెల్లించవలసిన ధనాన్ని ప్రభుత్వం తరఫు వాటా ధనంగా పెట్టుబడిలో చూపించాలనీ. ... ఇలాంటి అంశాలతో సిఫార్సులు చేసింది.

ఆ సిఫార్సుల్ని ప్రభుత్వం పరిశీలించి, మంత్రి వర్గానికి పంపి, సూత్రప్రాయంగా ఆమోదం తీసుకొని – ఆ విషయాల్ని ఐటిసికి తెలియపరచడం జరిగింది.

ఈ మధ్యలో నేను కాకినాడలో మా మామగారింటికి వారం రోజులు సెలవుమీద వెళ్ళాను. అదీ – రెండునెలలుగా కామెర్లవ్యాధితో బాధపడుతున్నాను. దానికితోడు సంజయ్‌గాంధీ ఖమ్మం పర్యటన దృష్ట్యా డాక్టర్లు రెస్టు తీసుకోమన్నా తీసుకోలేకపోయాను. ఆ సెలవు వాడుకోలేని కారణం వల్ల – ఆ కార్యక్రమం ముగియగానే ముఖ్యమంత్రి అంగీకారంతో పూర్తిగా విశ్రాంతి

తీసుకోవడానికని కాకినాడ వెళ్ళాను. కాకినాడ వెళ్ళిన నాలుగోరోజున ముఖ్యమంత్రి గారి నుంచి కాకినాడకు టెలిఫోన్ వచ్చింది. ...మా మామగారింట్లో అప్పట్లో టెలిఫోన్ లేదు. తూర్పుగోదావరి కలెక్టరు గారి ద్వారా కబురు చేరింది. కలెక్టరు గారింటికి వెళ్ళి (అప్పుడు కలెక్టరు యు.బి.రాఘవేంద్రరావు అనుకొంటాను) ముఖ్యమంత్రితో మాట్లాడాను.

"ప్రసాద్, నిన్ను ఇబ్బంది పెడుతున్నందుకు ఏమీ అనుకోకు. ...మనకు ఇది చాలా ముఖ్యమైన విషయం. ...వందకోట్ల రూపాయలు పైగా పెట్టుబడితో ఎన్నో వందల వుద్యోగావకాశాలతో ఒక ఫ్యాక్టరీ వచ్చే అవకాశం ఇది. ...ఐటిసి ఛైర్మన్ హక్సర్ టెలిఫోన్ చేశాడు. రేపు కొత్తగూడెంలో వాళ్ళ బోర్డు సమావేశమై, పేపరు ఫ్యాక్టరీకి స్థలాన్ని పరిశీలించి, అక్కడ ఫ్యాక్టరీ పెట్టే విషయమై తుది నిర్ణయం తీసుకొంటారట. మన అధికారులకి చెప్పి, తగిన ఏర్పాట్లు చేయమని కోరాడు. ఇతర ఏర్పాట్లన్నీ నేను చేయించాను. సింగరేణి కాలరీస్ ఛైర్మన్ బి.ఎన్.రామన్ అక్కడే వుండి, ఐటిసి బోర్డు వాళ్ళందరికి వసతి, మీటింగు ఏర్పాట్లు, భోజనాలు మొదలయినవి అన్నీ చూసుకొంటాడు. పరిశ్రమల శాఖ నుండి వి.పి.రామారావుగారిని పంపిస్తున్నాను. రాష్ట్రానికీ, ఖమ్మానికీ ఇది చాలా చాలా ముఖ్యమైన విషయం. ...నాకున్న సమాచారాన్ని బట్టి – ఐటిసి వారు ఒరిస్సాలోనూ, మధ్యప్రదేశ్‌లో కూడా స్థలాలు చూశారు. ఈ ఫ్యాక్టరీ మనకే రావాలి. ఈ ఫ్యాక్టరీ ఉనికి ఖమ్మం జిల్లా అభివృద్ధికీ, ఉద్యోగాల కల్పనకీ విపరీతంగా దోహదపడుతుంది. అందుకే నువ్వు వెళ్ళాలి. నీకు తగిన సదుపాయాలు కల్పించమని రాఘవేంద్రరావుకు చెప్పాను. అతను నీకు కారు ఏర్పాటు చేస్తాడు. వెంటనే బయలుదేరి కొత్త గూడెం వెళ్ళి, అంతా సానుకూలం అయ్యేట్టు చూడు. కామెర్ల నుంచి తేరుకోవడానికి నీకు విశ్రాంతి అవసరమని నాకు తెలుసు. ఈ పని అవగానే పదిరోజులు లీవ్‌లో వెళ్ళువుగాని" అన్నారు.

ఏమంటాను? "సరే" అన్నాను. కలెక్టరు బంగళా నుంచే ఖమ్మం ఇన్‌ఛార్జి కలెక్టరు బెనర్జీతోటి, సబ్‌కలెక్టరు సెహగల్ తోటి మాట్లాడి, అన్ని వివరాలు రెడీగా వుంచమనీ, భూమి గుర్తించడానికి జెండాలు పాతించమనీ, ప్రభుత్వస్థలంలో రిజర్వుడు ఏమైనా వుంటే అదీ, కబ్జాలో ఏదైనా భూమి వుంటే అదీ... అన్నిటికీ విడివిడిగా రంగుల జెండాలు పాతించమనీ, రాత్రికి నన్ను కొత్తగూడెంలో కలుసుకోమనీ చెప్పి, నేను వెంటనే కొత్త గూడెం బయలుదేరాను.

మరుసటి రోజు మధ్యాహ్నం మూడు గంటల సమయం. సింగరేణి కాలరీసు బోర్డు రూములో ఐటిసి ఛైర్మన్, 8 మంది డైరక్టర్లు, కలెక్టరుగా నేను కలిసి చర్చలు జరిపాం. తరువాతరోజు ఉదయం 9 గంటలకు అందరం కలిసి ఫ్యాక్టరీకోసం కోసం నిర్దేశించబడిన స్థలాన్ని సందర్శించడం, తర్వాత వారు ప్రత్యేకంగా బోర్డు సమావేశంలో చర్చించడం, బి.ఎన్.రామన్ (Singareni MD) గారిచ్చిన విందులో పాల్గొనడం – అన్నీ బాగానే జరిగిపోయాయి.

ఇక భూమి విషయంలో సందేహాల నివృత్తికి కలెక్టరుతో చర్చలు మొదలు. హక్సర్‌గారు నావైపు చూచి "ఏమంటారు కలెక్టరుగారు" అన్నారు. నేనేమంటాను? ఆయన ఏమైనా విషయ మడిగితే సమాధానం చెప్పగలను. నేను విన్నది - ఈయన చాలా పలుకుబడి గల మనిషి ... ఇందిరాగాంధీకి, వారి కుటుంబానికీ చాలా కావల్సినవారు. పట్టుకున్న పని అయ్యిందాకా వదిలే స్వభావం కాదు. ఆలస్యం సహించే అలవాటులేదు. ప్రభుత్వమన్నా ప్రభుత్వాధికారులన్నా అంత గౌరవం లేదు. అన్ని విషయాలలో అనవసరంగా జాప్యం జరుగుతూ వుంటుందనీ, పరిశ్రమలు ఏర్పడటానికి కలిగే అవరోధాలకి ముఖ్యకారణం ప్రభుత్వమనీ దృఢమైననమ్మకం గలవాడు.

ఆయనకు వెంగళరావుగారు నచ్చారు. ప్రభుత్వం తరపున వెంబడిపడి పరిశ్రమలకు పాటుబడుతున్నాడని ఆయన నమ్మకం. ఈ ఫ్యాక్టరీ ఆంధ్రకు రావడానికి వెంగళరావు చూపిన చొరవే కారణమని ఆయన భావం...

అక్కడ్నుంచి మా ఇద్దరి మధ్య సంభాషణ ఇలా సాగింది:

"ప్రభుత్వం నుంచి భూమి రావడానికి ఎంతకాలం పడుతుంది? ...నేను విన్నది - సంవత్సరాలు తరబడి ఆలస్యం అవుతుందని. భూమి ఇచ్చిన తరువాత కూడా కోర్టులలో లిటిగేషను ఇబ్బందులున్నాయని, మొదట నిర్ణయించిన ధరల కంటే కోర్టులు చాలా రెట్లు రేట్లు పెంచితే ఆ ప్రకారం సంవత్సరాల తర్వాత, పరిశ్రమల వాళ్ళు చెల్లించాల్సి వుంటుందని విన్నాను" అన్నారు హక్సర్.

"ప్రైవేటు రైతులనుండి పరిశ్రమకోసం భూమిని భూసేకరణ చట్టం (భూసేకరణ చట్టం) క్రింద తీసుకొంటే మీరు చెప్పేది నిజం... కోర్టులో పూర్తిగా నిర్ణయించబడేవరకు భూమి విలువపై సంశయాలకు తావుంది. ...కాని మనం ఈ ఫ్యాక్టరీకి తీసుకోబోయే స్థలం ప్రభుత్వానిది. ప్రభుత్వం ఏ నిర్ణయంచేస్తే - అది ఫైనల్. ఇక రేటు విషయానికొస్తే - రిజిస్ట్రేషన్లను బట్టి భూమి విలువ నిర్దేశించబడుతుంది. అన్ని విషయాలూ చర్చించి కలెక్టరు ప్రభుత్వానికి 'ఎకరానికి ఇంత' అని విలువకట్టి ప్రతిపాదన పంపుతారు. దానిని సాధారణంగా ప్రభుత్వం అంగీకరిస్తుంది. ఒకసారి ప్రభుత్వం అంగీకరిస్తే ఆ రేటు ఫైనలే. అందులో ఇంకేమీ మార్పులుండవు."

"ఇవాళ మేం ఇక్కడ ఫ్యాక్టరీ పెట్టడానికి నిర్ణయించాం అని మీకు తెలిపాక, మేము ఫ్యాక్టరీ పని ప్రారంభించాలంటే పూర్తి చేయాల్సిన లాంఛనాలు, అనుసరించాల్సిన విధానాలు తెలుసుకోవచ్చా!"

"ఈ భూమిని ఉన్నత స్థాయికమిటీ వస్తోందన్నప్పుడే సర్వేచేయించి, చుట్టూ బౌండరీరాళ్ళు పాతించాం. ఉదయం మీరు చూశారుకదా... అందులో వివిధ రంగుల్లో జెండాలు పాతి, ప్రభుత్వభూములు, ప్రభుత్వఫారెస్టు భూములు, రైతుల ఆక్రమణలోని భూములు, ఇళ్ళ ఆక్రమణలోవున్న భూములు విడిగా చూపించడమైంది... ఇతరుల ఆక్రమణలోని ముప్పై ఎకరాల

విషయంలో నిబంధనల ప్రకారం పోతే... వారికి నోటీసులు జారీ చేసి, ఆక్రమణదారులుగా నిర్ణయించి, వారిని భూమి నుండి తొలగించడానికి ఉత్తర్వులు జారీచేసి, ఖాళీ చేయటానికి గడువు పూర్తయిన తరువాత వారు ఖాళీ చేయకపోతే బలవంతంగా ఖాళీ చేయిస్తాం. ఆ తరువాత మీకు యివ్వగలం. దీనికి కొంతకాలం పట్టవచ్చు..."

"ప్రభుత్వంలో కొంతకాలం అంటే ఎన్ని సంవత్సరాలు?"

"ఇది సంవత్సరాలు పట్టదు - ఆక్రమణదారులు కోర్టుకు వెళ్ళి ఏదైనా స్టే పట్టుకువస్తే తప్ప. కోర్టుకు వెళ్తే ఎంత కాలం పట్టేదీ చెప్పడం కష్టం".

"ఇంత అనిశ్చితంగా వుంటే ఫ్యాక్టరీలు పెట్టడం కష్టం. మాకు విషయాలు స్పష్టంగా వుండాలి ... ఎన్నాళ్ళు పడుతుందో తెలియకుండా దిగితే - ఫ్యాక్టరీ పెట్టుబడి రెండింతలు కావచ్చు గదా?"

"కాని మీ విషయంలో అంత ఇబ్బంది ఏమీ లేదే? అదృష్టవశాత్తు ఆక్రమణలో వున్న ముప్పై ఎకరాలు ఒక మూలగా వుంది. ఏ ఇబ్బందీ లేని 700 ఎకరాలు వున్నాయి కదా?"

"ఆ 700 ఎకరాలకి మీరు మాకు స్వాధీనం చేయాలంటే తీసుకోవలసిన చర్యలేమిటి?"

"సాధారణంగా ఈ భూమే కావాలని మీరు నిర్ణయించిన తరువాత మీరు రాతపూర్వకంగా మీ నిర్ణయం తెలపాలి. ఈ విషయంలో మీరు పరిశ్రమలశాఖతో డీల్ చేస్తున్నారు కనుక మీరు వారికి తెలియచేస్తే, వారు మాకు పంపుతారు. కాని కాలం వృథాకాకుండా మీరు మాకు కూడా ఒక కాపీ ఇచ్చి, రిపోర్టు త్వరగా పంపమని అడగవచ్చు - లేదా మీకు మీరు ఇప్పుడే రాతపూర్వకంగా ఇవ్వచ్చు. ఇస్తే, మేము తహశీల్దారు స్థాయినుంచి ఈ భూమ్మీద ఎలాంటి అభ్యంతరాలు లేవని రిపోర్టు తెప్పించుకోవాలి... దాన్ని అంచెలంచెలుగా ప్రభుత్వానికి పంపించాలి... అవి అన్ని స్థాయిలు దాటుకుని మంత్రివర్గం ఆమోదం పొంది జీ.ఓ రావాలి... అప్పుడు భూమికి విలువ నిర్ధారించి, అది మీరు కట్టాక భూమిని స్వాధీనం చేస్తాం..."

"ఇవన్నీ ఈ దశాబ్దంలో అవుతాయా!" అని హాక్సర్ హాస్యంగా నావైపు చూశారు. ఆయన మాటల్లోని వ్యంగ్యం అర్థం కాకపోలేదు.

"రొటీనులో జరిగితే - ఒక సంవత్సరం పట్టవచ్చు. త్వరత్వరగా వెంబడిబడి తిరిగితే మూడు నెలలలో పూర్తిచేయవచ్చు" అన్నాను.

"ప్రసాద్‌గారూ, మీకు అర్థం అయ్యే వుంటుంది... వందల కోట్ల వ్యయంతో కర్మాగారాలు పెడుతున్నప్పుడు ఒక సంవత్సరం అంటే అన్ని అంచనాలూ తారుమారు కావచ్చు, మిషనరీ ఖరీదు పెరగవచ్చు, అప్పు ఖర్చు, వడ్డీ రేట్లు పెరగవచ్చు, ముడిసరుకు ధరలలో, ఉత్పత్తుల

ధరలలో మార్పులు వచ్చి అసలు కర్మాగారం పెట్టాలా వద్దా అన్న మీమాంస రావచ్చు... ఇన్ని అనిశ్చిత అంశాలతో పరిశ్రమని పెట్టడం కష్టమే?"

"మీ విషయంలో నిర్ణయాలన్నీ అయిపోయినాయి. కాని... మీరు కూడా ఫైనాన్సియల్ క్లోజర్ చేసుకోవాలి కదా, మిషనరీ సప్లైయరును చూసుకోవాలి, సివిల్ కాంట్రాక్టరుని ఎంచుకోవాలి, ఫ్యాక్టరీ లే అవుట్ డిజైన్ తయారుచేసుకోవాలి! దీనికంతా మూడు నెలలైనా పడుతుంది కదా! అంత లోపల మేం తీసుకోవాల్సిన చర్యలన్నీ తీసుకొని మూడు నెలలలో మీకు భూమి స్వాధీనం చేస్తాం. ఇవ్వాళ భూమిని మీకిచ్చినా, ఖాళీ వుంచడం తప్ప మీరైనా చేసేదేముంది..." అని నేను కొంచెం దూకుడుగానే చెప్పాను.

"నా వుద్దేశ్యం - మీరు 3 నెలలలో ఇవ్వలేరని కాదు. ఇంతాచేసి మేము అన్నీ చక్కబెట్టాక ఏదైనా ఆలస్యం అయితే అన్ని అంచనాలూ తారుమారు అవుతాయి. అందుకని భూమి స్వాధీనం చేసుకోకుండా ముందుకు వెళ్ళటం అంత మంచిది కాదేమో" హక్సర్ సందేహం వ్యక్తం చేశారు. నాకు ఆవేశం పొంగుకొచ్చింది.

"మీకు భూమి ఎప్పుడు కావాలో చెప్పండి ఆనాటికి మీకు స్వాధీనం చేసే పూచీ నాది. కాని, స్వాధీనం చేసిన మరునాటి నుంచీ పని మొదలుపెడ్తానని నాకు హామీ ఇవ్వాలి" అన్నాను.

హక్సర్ గారు అదో సవాలుగా తీసుకుని, "ప్రసాద్, మీరు ఇవ్వాళ భూమిని స్వాధీనం చేస్తే, రేపు ఉదయం పని మొదలుపెడతాం. మీరు డీల్ చేస్తున్నది 'ఐటిసి'తో అని మర్చిపోకండి" అన్నారు.

నేను ఒక్క నిముషం కూడా ఆలోచించలేదు. "ఇప్పుడు సాయంత్రం నాలుగు గంటలు అవుతోంది... ఇవాళ సాయంత్రం 5.30 గంటలకు మీకు 700 ఎకరాలు స్వాధీనం చేయటం జరుగుతుంది... ఈ గంటలోపల మీరు నాపేరున 'ఈ స్థలం తీసుకొని పేపర్ ఫ్యాక్టరీ పెట్టటానికి నిర్ణయం చేశారనీ, కలెక్టరు నిర్ణయించే ధర మీకు అంగీకారమే'ననీ ఒక లేఖ రాసి ఇవ్వండి. ఈ లోపున మా జాయింట్ కలెక్టరు, సబ్‌కలెక్టరు, తహశీల్దారు మీకు భూమి స్వాధీనం చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తారు" అన్నాను...

...అంతే! కొంతసేపు అంతా నిశ్శబ్దం!!!

కొంతసేపటికి తేరుకొని ఒకేసారి అందరూ మాట్లాడటం మొదలుపెట్టారు...

హక్సర్ నిర్ఘాంతపోయి, ఆశ్చర్యంగా "నిజమేనా!" అన్నారు.

"నిజమే. ఇంకా ఆలస్యం ఎందుకు? మీరు, మేము చేయాల్సిన పని కాగితాలమీద చేసేద్దాం" అన్నాను.

రామన్‌గారు ఏర్పాటుచేసిన స్టెనోగ్రాఫర్‌తో హక్సరూ, నేనూ అప్పటికప్పుడు విడివిడిగా డిక్టేషన్ మొదలుపెట్టాం. సబ్‌కలెక్టరు సెహగలు తహశీల్దారును తీసుకొని సైట్‌కి పరుగెత్తాడు. బెనర్జీ రూల్ పుస్తకం చూస్తూ, ఇవ్వాల్సిన ఉత్తర్వుల గురించి పరిశీలన మొదలుపెట్టాడు.

లాంఛనంగా అందరం సాయంత్రం 5.30 కి మళ్ళీ ఫ్యాక్టరీ స్థలానికి వెళ్ళి, కంపెనీకి భూమిని స్వాధీనం చేశాం. వారికి స్వాధీన పత్రాలిచ్చి, భూమిని తీసుకొన్నట్లు వారి నుంచి సంతకాలు తీసుకోవడంతో ఆ కార్యక్రమం ముగిసింది.

ఆ రాత్రి పదిగంటలకు ఈ ప్రాజెక్టు ఇన్‌ఛార్జి కె.ఎల్.ఛుగ్ (తరువాత కాలంలో అతను ఫ్యాక్టరీకి ఎండి, ఐటిసికి ఛైర్మన్ అయ్యాడు) నా దగ్గరకు వచ్చి, "మా ఛైర్మన్ రేపు ఉదయమే పని మొదలుపెట్టాలని పట్టుపట్టాడు. ఇలా జరుగుతుందని ఎవరూ అనుకోలేదు... మీరు మా ఛైర్మన్‌ను ఛాలెంజ్ చేశారో, మా ఛైర్మన్ మిమ్మల్ని ఛాలెంజ్ చేశారో తెలియదు గాని, ఫ్యాక్టరీ గురించి అసందిగ్ధ పరిస్థితి పోయింది. రేపు ఏ పని మొదలుపెట్టగలం - అని అందరం ఆలోచించాం. ...కనీసం ఒక మూల కాంపౌండు గోదయినా కట్టాలనుకున్నాం. దానికి కూడా ఇప్పటికి ఇప్పుడంటే ఏం చేయాలో తెలియడం లేదు. ఏం చేసినా నేనే చేయాలి. నాకు అప్పగించారు. ఇక్కడ వాళ్ళెంత కొత్తో, నేను అంతే కొత్త. మీరు తప్పితే తెలిసిన వాళ్ళు కూడా లేరు" అన్నాడు.

వెంటనే సింగరేణి ఎం.డి రామన్‌గారితో టెలిఫోన్‌లో మాట్లాడి విషయం చెప్పి - "మీ చీఫ్ ఇంజనీర్ ఎవరినైనా పంపి కాంట్రాక్టరుని చూసిపెట్టగలరా" అని అడిగాను. "ఎందుకు చేయలేం? తప్పకుండా. ఇంకో ఐదు నిమిషాలలో చీఫ్ ఇంజనీరు మీ దగ్గరకు వస్తాడు. ఏం కావాలో అతనికి చెప్పండి. చేయిస్తాడు" అన్నారు.

ఛుగ్ అక్కడ వుండగానే చీఫ్ ఇంజనీరు అక్కడికి రావడం, (గెస్టు హౌసు పక్కనే సింగరేణి సీనియర్ అధికారుల నివాసాలు) విషయం చెప్పడం, మరునాటి ఉదయం 9.30 గంటలకి మంచి ముహూర్తంలో అందరం వెళ్ళి ఐటిసి వారి 'భద్రాచలం పేపరు మిల్స్' పని ప్రారంభానికి చిహ్నంగా ప్రహరీ గోడ శంకు స్థాపనలో పాల్గొనటం జరిగిపోయింది.

నిజానికి అంతకుముందు కాకినాడ నుంచి కొత్తగూడెం చేరిన వెంటనే నేను ఉన్నతస్థాయి కమిటీ సభ్యుడైన వి.పి.రామారావుగారిని కలిశాను. ఆయన కాకతాళీయంగా అన్న విషయం - "మన తరపునుంచి ఇవ్వాల్సిన అనుమతులు అన్నీ ఇచ్చాం. స్థల సేకరణ విషయంలో ఎంత భూమి కావాలో అంతా అక్కడ వుందనీ, ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమనీ, కావలసిన నీళ్ళు, విద్యుచ్ఛక్తి కూడా ఇస్తామనీ, భూమి ఖరీదు ఐటిసికి వారు డబ్బు క్రింద చెల్లించనక్కరలేదనీ, కలెక్టరు నిర్దేశించిన రేటు ప్రకారం ఆ విలువని ఆ పేపర్ మిల్లులో ప్రభుత్వ వాటా ధనంగా చేయాలనీ మంత్రిమండలి ముందు ఎజెండాలో పెట్టాం. వాటిని మంత్రిమండలి సూత్రప్రాయంగా ఆమోదించింది."

"మీ దగ్గర ఆ తీర్మానం కాపీ వుందా సార్" అని అడిగితే, టైపు చేయించి మరో కాపీ ఇచ్చారు మర్నాడు ప్రొద్దున్న.

రేటు విషయంలో కూడా ఇబ్బంది ఏమీ లేదు. ఎందుకంటే ఐటిసి వారి దగ్గర "కలెక్టరు నిర్ణయించిన భూమి రేటు మాకు సమ్మతం" అని లిఖితపూర్వకంగా తీసుకొంటే చాలు. తీసుకొన్నాను గదా!

ఆ రాత్రి వెంగళరావుగారికి జరిగిన విషయం ఫోన్‌లో చెప్పాను. కొంతసేపటికి ఆయన కార్యదర్శి రావుసాహెబ్ గారు నాకు టెలిఫోన్ చేసి, "ప్రసాద్... ఏమైంది? చీఫ్ చాలా ఉత్సాహంగా వున్నారు. నిన్ను ఆకాశానికి ఎత్తేస్తున్నారు" అన్నారు.

★ ★ ★

"ఇలా జరిగింది ఇప్పటిదాకా" అంటూ సుబ్రహ్మణ్యంగారికి వివరించాను. ఇదంతా చెప్పి ఆయన్ని ఓ ప్రశ్న అడిగాను. "మంత్రి మండలి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన విషయంలో నామీద ఎందుకు క్రమశిక్షణా చర్యతీసుకోవాలని కృష్ణస్వామిగారు పట్టుబడుతున్నారు సర్!"

సుబ్రహ్మణ్యంగారు కూడా ఆలోచనలో పడ్డారు.

"...మంత్రి మండలికి ఈ ప్రతిపాదనని నువ్వు రెవెన్యూ బోర్డు ద్వారా పంపలేదన్న కోపం కావచ్చు. లేదా, సూత్రప్రాయంగా మంత్రి మండలి ఆమోదించినంత మాత్రాన ప్రభుత్వానికి ముందుగా చెప్పకుండా భూమిని అప్పగించేస్తావా – అన్న ఆగ్రహం కావచ్చు. లేదా, ప్రభుత్వం నుండి భూమి అప్పగింతకు ఆదేశాలు లేకుండా, రెవెన్యూ బోర్డుకి కూడా తెలీకుండా 700 ఎకరాల భూమిని అప్పగించేశావంటే ముఖ్యమంత్రిగారి దన్ను చూసుకొని విర్రవీగుతున్నావన్న అనుమానం కావచ్చు... ఇలా ఏదైనా కావచ్చు" అన్నారు.

'సరే' అనుకొని అన్నింటికీ సిద్ధపడిపోయాను. ఐఏఎస్ అధికారుల సర్వీసు విషయాలన్నీ రెవెన్యూ బోర్డు దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి వుంటాయి. ఈ బోర్డులో వున్నవాళ్ళంతా ఐఏఎస్ అధికారులే. బోర్డు ఉనికిని నేను తప్పుపట్టలేను. ఎందుకంటే పాలనా యంత్రాంగాన్ని అవాంఛనీయ రాజకీయ వత్తిడులనుంచి కాపాడే రక్షణ కవచం లాంటిది రెవెన్యూబోర్డు. ఈ బోర్డు వుండటంవల్లనే జిల్లాలోని శిస్తువసూళ్ళు, భూముల బదలాయింపులు, పన్నుల వసూళ్ళు వగైరా అన్ని అంశాలలోను జిల్లా కలెక్టరుని జవాబుదారీ చేసి, పాలనా యంత్రాంగాన్ని నడిపించటంలో రెవెన్యూ బోర్డుకి విశేషమైన అధికారాలు, బాధ్యత వుండేవి. (ఇలాంటి వ్యవస్థ ఇప్పుడు లేదు). దురదృష్టవశాత్తు, ఇంతటి శక్తివంతమైన బోర్డు ప్రజాస్వామిక వ్యవస్థలో మారుతున్న కాలానికి అనుగుణంగా తన వ్యవహార శైలిని మార్చుకోకపోవటంవల్ల రాష్ట్రప్రగతి వేగం కుంటుపడుతోందని వెంగళరావుగారు

ఆవేదన చెందేవారు... ఏమైనా భద్రాచలం పేపర్ మిల్స్‌కి భూమిని అప్పగించే విషయంలో నేను నిబంధనల్ని అతిక్రమించి, రెవెన్యూ బోర్డు దృష్టిలో 'ఘోరమైన నేరం' చేశాను. నామీద క్రమశిక్షణా చర్య తప్పదు!

రావుసాహెబ్‌గారికి టెలిఫోన్ చేసి విషయం చెప్పాను. "కృష్ణస్వామి ఇట్లా ఎందుకు చేశారు? ఇప్పటికే ముఖ్యమంత్రికి రెవెన్యూ బోర్డు గురించి సదభిప్రాయం లేదు - Notice Board, Delay Board, Obstructionist Board, Obsolete Board అంటుంటారు. నువ్వు ఐఏఎస్ ఆఫీసరువి కాబట్టి నీమీద చర్య తీసుకోవాలంటే సి.ఎం అనుమతి కావాలి గదా! ఆయన చూసుకొంటారులే" - అన్నారు.

అంతే! వారం రోజుల తర్వాత రావుసాహెబ్‌గారి నుంచి టెలిఫోను: "చీఫ్‌కి చాలా కోపం వచ్చింది... నీపైన కాదులే రెవెన్యూ బోర్డుపైన. వాళ్లు చేయరు, చేసేవాళ్ళని చేయనివ్వరు. పైగా చేసేవారి మీద క్రమశిక్షణాచర్య తీసుకోవాలిట. ఇలా కాలం చెల్లిన బోర్డులతో కాలం చెల్లిన ఆలోచనలతో పనులు జరిగేదెట్లా - అన్నారు. ఆయన స్వయంగా ఫైలులో పెద్ద ఎండార్సుమెంటు చేశారు. ఏమనంటే - It is yet another instance where the Revenue Board has justified its own abolition (రెవెన్యూ బోర్డు రద్దు చేయబడాలి అని చెప్పటానికి ఇది మరో దృష్టాంతం).

యాదృచ్ఛికంగా, ఆ తరువాత కొద్ది మాసాలకే రెవెన్యూ బోర్డు రద్దయింది.

* * *

ఖమ్మం పొమ్మంది - ఉప్పెన రమ్మంది

1977 లో....

ఖమ్మంజిల్లా కాంగ్రెసు నాయకులు నా దగ్గరకు వచ్చారు. చాలాసేపు సాధారణ పరామర్శలు చేశాక వాళ్ళొక 'చిన్న' కోరిక కోరారు.

"ప్రసాద్‌గారూ! మీరు జిల్లా కలెక్టరుగా గత మూడేళ్ళనుంచీ మా జిల్లాకి చాలా అభివృద్ధి పనులు చేశారు. సంతోషం. మీరు ముఖ్యమంత్రి వెంగళరావుగారి శ్రేయస్సుకోరే వారయితే ఇక్కడ్నుంచి వెంటనే బదిలీ చేయించుకుని వెళ్ళిపోవాలని మా కోరిక....!"

నాకు నోట మాట రాలేదు. ఏం చెప్పాలో తెలీలేదు.

బాగా పనిచేస్తున్నానంటూనే బదిలీ చేయించుకుని పొమ్మంటారేమిటి? ఎక్కడన్నా జిల్లాకోసం బాగా పనిచేసే అధికారికి బదిలీ వస్తే, బదిలీ ఆపమని కదా అడుగుతారు!... అయినా నేను జిల్లాని వదిలిపెట్టిపోవడంవల్ల అభివృద్ధి వేగం పెరుగుతుందని ఆశిస్తున్నారా? ఇంకెవరన్నా మంచి ఐఏఎస్ ఆఫీసర్‌ని తెచ్చుకోవటంకోసం ఇలా అడుగుతున్నారా?

ధైర్యం చేసి అడిగాను. "నేను మంచిపనులే చేశామంటున్నారు. అయినా నన్నే బదిలీ తెచ్చుకోమంటున్నారు. మీ మనసులో ఇంకెవరన్నా...?"

"మీరు వెళ్తే ఎవరు రావాలో మేం ఇంకా తేల్చుకోలేదు. కాని మీరు వెళ్ళకపోతే వెంగళరావుగారికి రాజకీయంగా మంచి జరగదు. మీరు అభివృద్ధి చాలాచేశారు. ఈ జిల్లా చరిత్రలో మీ పేరు చిరస్థాయిగా వుండిపోతుంది. కాని అభివృద్ధివేరు, రాజకీయాలు వేరు. అభివృద్ధి పేరుతో మీరు ఏం చేసినా, వాటిల్లో ఎక్కడా మా జోక్యం లేకుండా ముఖ్యమంత్రి మమ్మల్ని దూరం పెడుతూవచ్చారు. ఎన్నికల్లో గెలవాలంటే అభివృద్ధి ఒక్కటే సరిపోదు. రాజకీయంగా మా వాళ్ళకి మేం పనులు చేసిపెట్టాలి. పనులు ఇప్పించి చూపెట్టాలి. ఇది జరగకపోతే ఎన్నికల్లో కార్యకర్తలెవరూ నాయకులకోసం పనిచేయరు - వెంగళరావుగారితో సహా. మరో ఏడెనిమిది నెలల్లో ఎన్నికలు వచ్చేస్తాయి. మీరు వెళ్ళిపోతే కొత్త ఆఫీసర్ ఎలాంటి వాడయినా, అతను స్థిరపడే లోపల క్రిందస్థాయిలో మాక్కావలసిన పనులు మేం చేయించుకుంటాం. ఒకవేళ అతను మాకు సహకరించాడనుకోండి. మరీ మంచిది. మీరుమాత్రం బదిలీ చేయించుకు వెళ్ళకపోతే మేం ఓడిపోవడం ఖాయం... సెలవ్..." అని చెప్పి సెలవు తీసుకున్నారు.

వాళ్ళు ఏం చెబుతున్నారు – నేను ఈ జిల్లానుంచి వెళ్ళిపోవడం ఖాయమని మర్యాదగా చెబుతున్నారా?

ఆరేళ్ళ క్రితం భువనగిరి సబ్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు మంత్రి ఉప్పునూతల పురుషోత్తమరెడ్డి నన్ను బదిలీ చేయించిన సంఘటన జ్ఞాపకం వచ్చింది.

భువనగిరి సబ్‌కలెక్టర్‌గా వున్నప్పుడు కలిగిన బదిలీ అనుభవం దృష్ట్యా ఈ బదిలీ ఏదో మనమే చేయించుకుంటే పోతుంది గదా అనుకున్నాను. 1974 మే నుంచి 1977 మే-జూన్ దాకా దాదాపు మూడేళ్ళు పనిచేశాను ఆ జిల్లాలో. చివరి సంవత్సరంలో కామెర్లు వచ్చి ఆరోగ్యం దెబ్బ తింది. అదే సమయంలో సంజయ్‌గాంధి పర్యటన, భద్రాచలం పేపరు మిల్స్‌కోసం బిటిసి బృందం పర్యటన, ముఖ్యమంత్రి నిర్దేశించే లక్ష్యాలకోసం శరవేగంతో పనిచేయాల్సి రావటం... ఇవన్నీ కలిసి నా ఆరోగ్యం మీద ప్రభావం చూపాయి. దానికితోడు హైద్రాబాద్‌లో నా భార్య గోపీకి మా మామగారు బహుమతిగా ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టాలని ప్రభుత్వం నుంచి అప్పుకోరటం, అది మంజూరవటం జరిగి రెండేళ్ళు దాటుతోంది. ఇల్లు కట్టకపోతే డబ్బు వాపసు చేయమని ప్రభుత్వం నోటీసిచ్చింది.

ఈ వ్యక్తిగత విషయాల్ని మాత్రమే ఉటంకిస్తూ, "నన్ను హైద్రాబాద్‌కి బదిలీ చేయించండి" అని ముఖ్యమంత్రి వెంగళరావుగారిని అడిగాను. ఆయన ఒప్పుకోలేదు. "నీ ఇల్లు కావాలంటే రోడ్లు భవనాల ఛీఫ్ ఇంజనీర్ కృష్ణమోహన్‌కి చెప్పి కట్టిస్తాను. నీ నోటీసు ఉపసంహరింపచేసి, గడువు పొడిగించమని ఛీఫ్ సెక్రటరీకి చెబుతాను. ఎన్నికలయ్యేదాకా మాట్లాడకు..." అంటూ నన్ను వారించే ప్రయత్నం చేశారు.

ఆయన ఇంకోమాట అడిగారు. "జిల్లాలో నిన్ను పని చేయనీకుండా ఎవరన్నా అడ్డు పడుతున్నారా?"

ఏం చెబుతాను. ఆయన వదల్లేదు. ఆ జిల్లాలో రాజకీయ జోక్యం లేకుండా నేను పని చేయటానికి సహకరించిన ముఖ్యమంత్రి ముందు ఎంతకని నిజం దాచగలను? జరిగిందంతా చెప్పాను.

ఆయన ఒక నిట్టూర్పు విడిచారు. నిర్వేదంతో ఒక సుదీర్ఘమైన ప్రసంగం చేశారు. నేను మర్చిపోలేని ఆ ప్రసంగం సారాంశం ఇది : "చూశావా ప్రసాద్, అభివృద్ధికోసం రాజకీయాలు కాదు. పదవులకోసం, పైరవీల కోసం రాజకీయాలు. ఎంతసేపటికీ తన వాళ్ళకి ఏదో చేసిపెడదామని ఆలోచిస్తారు తప్ప, అధికారంలోకి వచ్చాక అందరూ మన ప్రజలే అన్న భావన వుండదు. అన్ని జిల్లాల్లోనూ ఇదే తంతు. పనిచేసే అధికారులకి అడుగడుగునా ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ సభ్యులూ స్వలాభంకోసం అడ్డుపడుతుంటే అభివృద్ధి త్వరత్వరగా ఎలా జరుగుతుంది?... అలాగని క్రిందనుంచి పైదాకా ఈ నాయక గణ యంత్రాంగం లేకుండా

మేమూ నిలబడలేం... ఈ ఎమర్జెన్సీయే (1974-77) లేకపోతే, ఇంతకాలం నన్ను మాత్రం పనిచేయనిచ్చేవాళ్ళా...?" ఆశయాలకీ, రాజకీయ అవసరాలకీ మధ్య ఒక సంఘర్షణ ఆయన సుదీర్ఘ ప్రసంగంలో స్పష్టమైంది.

చివరికి ఆయన సూచన మేరకు నేనే కొత్త కలెక్టరు అభ్యర్థిని ఎంపిక చేశాను. అతను అప్పటిదాకా జాయింట్ కలెక్టరుగా వున్న ఎస్.బెనర్జీ. నన్ను హైద్రాబాద్‌లో రాష్ట్రనీటి పారుదల సంస్థ మేనేజింగ్ డైరక్టరుగా నియమించారు. కాని, మరో నాలుగుమాసాల్లో ఈ పోస్టు నాకు పరీక్ష పెడుతుందని అప్పుడు తెలీదు!

కాకతాళీయంగా - ఈ నీటిపారుదల సంస్థని నేను ఖమ్మం కలెక్టరుగా ఉన్నప్పుడే ముఖ్యమంత్రికి చెప్పి ఏర్పాటుచేయించాను. ఖమ్మంజిల్లాలో నీటిపారుదల సౌకర్యం లేకపోవడంవల్ల చిన్న రైతులు భూస్వాములలాగా రిగ్‌లు తెప్పించుకుని బోర్‌లు వేయించుకోలేకపోతున్నారనీ, భూగర్భజలాలు పుష్కలంగా వున్నాయి కనుక నీటిపారుదల సంస్థ నొకదానిని ఏర్పాటు చేయించి, దానిద్వారా చిన్నరైతులకు కూడా బోర్‌లు వేయించి, కాలువల క్రింద వసూలు చేసినట్లే నీటిపన్ను వసూలు చేసుకోవచ్చనీ, ఇలాంటి సంస్థ వస్తే రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ చిన్నరైతులకు ఈ ప్రయోజనం అందించవచ్చనీ నేను సూచించినప్పుడు ముఖ్యమంత్రి వెంటనే అంగీకరించారు... అమల్లో పెట్టారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అప్లయిడ్ జియోఫిజిక్స్ ప్రొఫెసర్ భీమశంకరంగారితో చర్చించి, ఖమ్మంజిల్లాలో రైతుల కోసం ఒక కార్యాచరణ ప్రణాళిక కూడా తయారుచేయించాను. నీటిపారుదల సంస్థకి ప్రభుత్వం కొంత మూలధనం ఇచ్చింది. దానికి ఆరేడురెట్లు నిర్వహణా పెట్టుబడిని జాతీయబ్యాంకులద్వారా రీఫైనాన్స్ చేయడానికి రిజర్వుబ్యాంకు ముందుకొచ్చింది. రిటైర్డ్ ఛీఫ్ ఇంజనీర్ రంగనాథస్వామి అధ్యక్షుడిగా, మరో ఛీఫ్ ఇంజనీర్ మేనేజింగ్ డైరక్టర్‌గా 1976లోనే ఈ సంస్థ ఏర్పడినప్పటికీ, మొదటి ఏడాదిలో ముఖ్యమంత్రి కోరిన పనులుచేసే వత్తిడిలో మూలధనం అంతా ఖర్చు పెట్టేశారు. నేను జాయిన్ అయ్యేనాటికి మూలధనం ఖర్చయిపోయి, రీఫైనాన్స్ రుణాలు విడుదలకాక, సంస్థ మూత పడే పరిస్థితిలో వుంది.

ముఖ్యమంత్రి మద్దతు వుండటం వల్ల ఈ సంస్థని చక్కదిద్దడం నాకు పెద్ద కష్టం కాలేదు. వెంటనే రిజర్వుబ్యాంకు చేత రీఫైనాన్స్ రుణాలు బ్యాంకులకి విడుదల చేయించటం, గొట్టపుబావుల త్రవ్వకంతో పాటు ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) పథకాల్ని కూడా చేపట్టడం, సమర్థులైన ఇంజనీర్లను ఆయా పోస్టుల్లో వేయించటం - ఇలా అంతా మూడు మాసాల్లో జరిగిపోయింది. ఇక నీటిపారుదల సంస్థ విశ్వరూపంతో పనిచేసి, అన్ని మెట్టప్రాంతాల్లోనూ చిన్నరైతుల వెతలు తీరుస్తుందంటూ పత్రికా సమావేశాల్లో ఊదరగొట్టాను. సరిగ్గా అప్పుడే...

1977 నవంబరు 17 అర్ధరాత్రి - బంగాళాఖాతంలోంచి విరుచుకుపడ్డ ఉప్పెన కృష్ణాజిల్లాలో దివితాలూకా మొత్తాన్ని భీభత్సంలో ముంచేసింది. పదివేల మందికిపైగా ప్రాణాలు నిద్రలోనే

గాలిలో కలిసి పోయాయి... లక్షలకొద్దీ పశువులు కళేబరాలుగా మారిపోయాయి.... బావులూ, చెరువులూ, ఉప్పునీటి మయం... కూలిపోయిన మహావృక్షాలు, సముద్రపు ఇసుక మేట వేసుకుపోయిన పొలాలు, బావుల్లో తేలుతున్న శవాలూ, అనవాలు లేకుండా తుడిచిపెట్టుకుపోయిన ఇళ్ళూ... ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కనీవినీ ఎరగనంతటి భయంకరమైన విపత్తు అది.

దివితాలూకా అంతా ఎంతటి హృదయవిదారకమైన దృశ్యాలంటే - సింగరేణి కాలరీస్ మేనేజింగ్ డైరెక్టర్ బి.ఎన్.రామన్ సారథ్యంలో పీనుగుల్ని కుప్పలు కుప్పలుగా వేసి, వాటిపైన సింగరేణి బొగ్గుకప్పి దహనం చేయాల్సి వచ్చింది.

దెబ్బతినిపోయిన రోడ్లు, రవాణా, కమ్యూనికేషన్ల పునరుద్ధరణ, బ్రతికున్నవారికి పునరావాస కేంద్రాల్లో భోజనాలు, ఇతర జిల్లాల నుంచి వచ్చే సహాయం క్రమబద్ధీకరణ వగైరా సహాయక చర్యల్ని యుద్ధ ప్రాతిపదికన సమన్వయ పరచడంలో జిల్లా స్పెషలాఫీసర్ ఏ.వి.ఎస్.రెడ్డి ప్రశంసనీయంగా పనిచేశాడు.

నాకు పరీక్ష పెట్టిందీ ఉప్పెన.

ముఖ్యమంత్రి ఒక సాయంత్రం నన్ను పిలిపించారు. "నువ్వేం చేస్తావో, ఎలా చేస్తావో నాకు తెలీదు. ఒక్క క్షణం కూడా వృథా కాకుండా పనిచేసి దివితాలూకా గ్రామాల్లో మంచినీటి సదుపాయాన్ని పునరుద్ధరించాలి. ఎంత డబ్బు ఖర్చయినా సరే, అక్కడ ప్రజలకి త్రాగటానికి మంచినీళ్ళు ఇవ్వాలి..."

ఆ రాత్రికి రాత్రి మా నీటిపారుదల సంస్థ ఇంజనీర్లు, అధికార్లు అందరినీ పిలిపించి మీటింగ్ పెట్టాను. నాలుగైదు గంటల పాటు సుదీర్ఘమైన కసరత్తుచేసి, ఒక కార్యక్రమం తయారుచేశాను. దాని ప్రకారం - సంస్థ తాలూకు రిగ్‌లు రాష్ట్రంలో ఏ మూల పనిచేస్తున్నవైనా వెంటనే దివితాలూకాలో నిర్దేశిత ప్రాంతానికి చేరిపోవాలి; ఇంకా ప్రైవేట్ రిగ్‌లు ఎన్నింటిని సేకరించగలమో వాటిని సేకరించాలి; రిగ్గుల్ని సేకరించేవాళ్ళే వాటికి ఒక వారం రోజులకి సరిపడే డీజిల్ కూడా తెచ్చుకోవాలి. రిగ్‌ల డ్రైవర్లు ఇతర సిబ్బంది ఎక్కడపనిచేయాల్సి వస్తే అక్కడే రాత్రి మకాం వేసుకోవటానికీ వీలుగా గుడారాలు, దుస్తులూ తెచ్చుకోవాలి; ఎక్కడ పనిచేస్తుంటే అక్కడే వండుకుని తినేలా వంటసామాన్లు, పప్పులు ఉప్పులు వగైరాలు, రాత్రిపూట వెలుతురు కోసం గ్యాస్‌లైట్లూ వెంట తెచ్చుకోవాలి. మంచినీటి డ్రమ్ముల్ని (మంచినీళ్ళతో సహా) రిగ్‌కి కట్టి పొలాల్లోకి తీసుకెళ్ళాలి; అంటురోగాలకి గురికాకుండా అత్యవసరం కాగల కొన్ని మందులు తీసుకెళ్ళాలి...

నేను ఇవన్నీ ఖరారు చేస్తుంటే ఒక అధికారి అడిగారు. "అవన్నీ అక్కడ రెవెన్యూ వాళ్ళు సమకూరుస్తారు గదా సర్?"

"లేదు. వాళ్ళని నేను అడగలేను. వాళ్ళకి పునరావాసకేంద్రాల నిర్వహణ, రోడ్లపునరుద్ధరణ, విద్యుత్ పునరుద్ధరణ, శవాల తొలగింపు, వచ్చేపోయే మంత్రులు, నాయకుల్ని చూసుకోవటం...

ఇలాంటి సవాలక్ష అవసరాలుంటాయి. వాళ్ళని ఒక్క అగ్గిపుల్ల కూడా అడక్కుండా దివి తాలూకాకి మంచినీళ్ళు ఇవ్వగలిగితేనే మనం పనిచేద్దాం. ఉద్యోగధర్మంగా కాదు, మానవత్వం వున్న మనుషులుగా ఆలోచించి చెప్పండి. చెయ్యగలమా లేదా?" నా ప్రశ్నకు ఎవరూ ఎదురు చెప్పలేదు. అందరూ ఉత్సాహంగా తెల్లవారేలోగా తమ తమ బాధ్యతలు స్వీకరిస్తూ రంగంలోకి దూకారు. అప్పటికి రాత్రి రెండుగంటలయింది.

నేను ఇంటికొచ్చి మరోవారం దాకా రాలేకపోవచ్చని నా భార్యకి చెప్పి, వెంటనే విజయవాడ బయల్దేరాను. తెల్లవారుతూనే పునరావాస కార్యక్రమాల స్పెషలాఫీసరు ఏ.వి.ఎస్. రెడ్డితో మాట్లాడాను. అస్సలు చేరుకోటానికి వీల్లేని గ్రామాల జాబితా తీసుకున్నాను. రిగ్‌లు ఎట్నుంచి ఎలా వెళ్ళాలీ, మార్గదర్శకులెవరు అన్నీ చర్చించాను.

మధ్యాహ్నానికల్లా కొన్ని రిగ్‌లు వచ్చేశాయి. ఇంకా వస్తున్నాయి. కలెక్టరుతో చర్చించినదాని ప్రకారం ఎక్కడ చెరువులు, బావులు ఉప్పునీటితో పూర్తిగా కలుషితమైపోయాయో ఆ గ్రామాలకి ముందు వెళ్ళాలి. ఎన్ని రిగ్‌లు ఎటువెళ్ళాలీ, ఏ టీమ్‌కి ఎవరెవరు బాధ్యత తీసుకోవాలీ, ఎన్ని అడుగుల లోతులో నీళ్ళు పడొచ్చు, ఎంత లోతుగా బోర్ వేయాలీ... ఇలాంటి లెక్కలన్నీ వేసి మొత్తం రిగ్గుల్నీ, సిబ్బందినీ అయిదు విభాగాలుగా విభజించాను. ఒక్కొక్క విభాగానికి ఆరేసి గ్రామాల బాధ్యత అప్పగించాను. ప్రతి విభాగానికి, రిగ్గులతో పాటు, నీళ్ళు తోడే పంప్‌సెట్లు, బోర్ గొట్టాలు, డీజిల్, ఆపరేటర్లు, మరమ్మత్తు వస్తే చేయటానికి మెకానిక్‌లు, టెంట్‌లు, తిండి సామగ్రి ... అన్నీ ఖరారు చేసి పంపించాను.

"మీతో ఎప్పటికప్పుడు మాట్లాడటానికి టెలిఫోన్‌లు లేవు. రోడ్లూ లేవు. కాబట్టి మీరే మీకు అప్పగించిన గ్రామాలన్నింటిలో త్రాగటానికి భూగర్భంలోంచి మంచినీళ్ళు లభిస్తున్నాయి అని నిర్ధారించుకునేటంత వరకూ అక్కడే వుండి పనిచేసి, అప్పుడు దివి తాలూకాలో మనం పెట్టుకున్న కంట్రోల్ పాయింట్‌కి రండి... అవసరమైతే మరికొన్ని పక్క గ్రామాల్లో బోర్‌లు వేయాల్సి వస్తే, నేనిచ్చిన జాబితాలో లేకపోయినా సందేహం లేకుండా పూర్తి చేసి రండి... బోర్‌లు త్రవ్వి ఉప్పెన దెబ్బతిన్న ప్రతి గ్రామానికీ త్రాగునీళ్ళిచ్చే పనిలో - తప్పనిసరిగా వచ్చే నిద్ర, ఆకలి తీర్చుకోవటం మినహా ప్రతిక్షణం త్రాగేందుకు నీళ్ళిచ్చే ప్రయత్నమే చేద్దాం... మీ సామర్థ్యం కొన్నివేల కుటుంబాల్ని నిలబెట్టాలి..." అంటూ ప్రోత్సహించి పంపించాను. ఉన్నతాధికారులనుంచి వచ్చే ప్రోత్సాహం చూపించే ప్రభావం అపారం అని నాకు తెలుసు.

ఇంత చేశాక కూడా ప్రతిరోజూ ఒక అధికారికి ఒక జీపునిచ్చి, దాన్నిండా తినుబండారాలు, డీజిలు వగైరా పెట్టి, ఆయా బోర్‌లు తవ్వేగ్రామాలకి పంపిస్తూ వచ్చాను. నేను వెళ్ళగలిగిన చోట్లకి వెళ్ళి వాళ్ళని ఉత్తేజపరిచే ప్రయత్నం చేశాను. బోర్‌లు ఎంత తవ్వినా నీళ్ళుపడకపోయే అవకాశమున్న కొన్ని గ్రామాలకి మంచినీటి ట్యాంకర్లు పంపించాను. బోర్‌లు పడే వరకూ

రోజూ ఆయా గ్రామాల్లో నీటి సరఫరా కూడా ఈ ట్యాంకర్లతో చేయించేలా ఏర్పాటు చేశాను. రోజువారీగా పర్యవేక్షిస్తూ వచ్చాను.

... ఉప్పెన దెబ్బతిన్న గ్రామాల్లో మంచినీటి బోర్‌ల త్రవ్వకం పని మొత్తం పదిరోజులు పడుతుందనుకున్నాం. కాని – చీకటి రాత్రుల్లోనూ, చలిగాలుల మధ్యా, శవాల కంపులో కూడా మా నీటి పారుదల సంస్థ సిబ్బంది (కొంతమందికి వాంతులు విరేచనాలు పట్టుకున్నా) అవేవీ లెక్కచేయకుండా అలుపెరగని పట్టుదలతో పనిచేసి, ఆరు రోజుల్లోనే అన్ని గ్రామాలకీ పాతాళగంగ ఉబికివచ్చేలా బోర్‌లు వేసేశారు.

అంతా అయిపోయాక, మా సిబ్బంది ప్రతి ఒక్కరినీ స్పెషలాఫీసర్ ఏ.వి.యస్.రెడ్డి ప్రశంసల్లో ముంచెత్తారు.

ముఖ్యమంత్రిని కలిశాను. అంతా ఆయనకి తెలిసిన పురోగతే. అయినా నా బాధ్యతగా చెప్పాను. "మీరు అప్పగించిన పని పూర్తిచేశాం సర్."

ముఖ్యమంత్రి ఆనందం పట్టలేక, ఒక ఛలోక్తి విసిరారు.

"రాజకీయ ప్రయోజనాల కోసం నిన్ను ఖమ్మం జిల్లా నుంచి పంపించేశారు. కాని, ఇప్పుడు దివితాలూకాకి నువ్వు అవసరమవుతావనే అప్పుడు మా ఖమ్మం నాయకులు నిన్ను అక్కర్లేదన్నారేమో ప్రసాద్!"

★ ★ ★

మార్చి 31 మజా

1974 మార్చిలో...

అకస్మాత్తుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సహకార రంగానికి సంబంధించిన ఒక ప్రశ్న వచ్చింది. సమాధానం సహకార శాఖామంత్రి బత్తిన సుబ్బారావు చెప్పాలి. ప్రశ్నకి జవాబిస్తే అనుబంధ ప్రశ్నలొస్తాయి. అది అత్యంత సున్నితమైన అంశం. ప్రతిపక్షాలు ప్రశ్నల వర్షం కురిపించడానికి సిద్ధంగా వున్నారు.

మంత్రి ఖంగారు ఖంగారుగా ఆ అంశాలను చూసే అడిషనల్ రిజిస్ట్రార్ (సహకారం) కోసం వెతకమన్నారు. నేనే ఆ అడిషనల్ రిజిస్ట్రార్‌ని. ఆ టైమ్‌కి నేను ఢిల్లీలో వున్నాను. మార్చి నెలలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరిగేటప్పుడు సీనియర్ అధికారులు, శాఖాధిపతులు ప్రభుత్వానికి అందుబాటులో వుండి తీరాలన్న నిబంధనకి విరుద్ధంగా నేను ఢిల్లీలో వుండటం సహకారశాఖ సెక్రటరీకీ నచ్చదు, ఛీఫ్ సెక్రటరీకీ నచ్చదు.

మా డిప్యూటీ రిజిస్ట్రార్ నరసింహాచారి హైదరాబాద్‌నుంచి నాకు టెలిఫోన్ చేశాడు. "సార్, కొంపలంటుకున్నాయి..." అంటూ, నేను బడ్జెట్ సమావేశాల సమయంలో గైర్ హాజరు కావటం కలిగించిన గందరగోళం గురించి చెబుతున్నాడు.

'ఇదేమిటి? ముఖ్యమంత్రి వెంగళరావుగారు అన్నీ తను చూసుకుంటానన్నారు గదా! ఇలా ఎందుకు జరుగుతోంది?' అన్న సందేహం నా మెదడు తొలిచేస్తోంది. ముఖ్యమంత్రి నాకు వాగ్దానం చేసి ఇలా వదిలేస్తే, నన్ను శాసన సభ తప్పుపడుతుందా? ఛీఫ్ సెక్రటరీ సంజాయిషీ నోటీసు జారీ చేస్తారా? అసూయాపరులు ఇంకాస్త ఎగిరి గంతేస్తారా? ఇప్పటికే నాతో అసంతృప్తితో వున్న సహకారశాఖా మంత్రి బత్తిన సుబ్బారావు నా బదిలీకోసం వెంటబడతారా??... అసలయినా ఎవడడిగాడు నన్ను ఢిల్లీ వెళ్ళమని? ఎందుకింత తాపత్రయపడటం?

ప్రభుత్వంలో - పని చేయకపోతే "ఎందుకు పనిచేయటం లేదు"- అని అడిగి, క్రమశిక్షణా చర్యలు తీసుకునే రివాజు లేదు. పనిచేస్తుంటే మాత్రం "అలా ఎందుకు చేశావ్?, ఇలా ఎందుకు చేశావ్?" అని నిలదీస్తారు. పొరబాటున ఏ మూల ఏకాస్త రాజకీయ వ్యతిరేకత కనుపించినా ఆ అధికారిని బదిలీకి బలి చేసి అయినా తమ ప్రతిష్ఠ కాపాడుకోవాలనుకుంటారు నాయకులు.

★ ★ ★

నేను ఢిల్లీకి చిన్న ఆశతో వచ్చాను. నాలుగైదు రోజులు కష్టపడితే నాలుగైదు కోట్లు పట్టుకుపోవచ్చునని నా ఆశ.

ఇదంతా డాక్టర్ పరమేశ్వరరావు మూలంగా మొదలైంది. అమెరికాలో టెక్నాలజీలో పిహెచ్‌డి చేసి, మంచి ఉద్యోగం చేసుకుంటూ, మధ్యలో ఇండియా వచ్చి, మన గ్రామాలు చూసి, మనసు చలించి, ఆ ఉద్యోగం వదిలేసి, ఇండియా తిరిగొచ్చేశారు. ఆయన ముందున్న ఏకైక లక్ష్యం - మన సుఖం, సంతోషం పరమార్థంగా జీవించే జీవితాన్ని త్యజించి, నిరక్షరాస్యత, అనారోగ్యాలు, దారిద్ర్యంతో బాధపడే పల్లెవాసుల జీవితాలలో కొత్త వెలుగు నింపటం. 1972లో ఆయన నా దగ్గరికి గవర్నరు కార్యదర్శి సంతానం ద్వారా వచ్చారు. విశాఖ జిల్లా దిమిలిలో ఆదర్శవంతమైన స్కూలుని పల్లె పిల్లల కోసం ప్రారంభించే ప్రయత్నంలో వున్నాననీ, కాని స్కూలు పెట్టడానికి అనుమతులకోసం అధికారుల చుట్టూ తిరగడం, వాళ్ళు లంచాలు అడగటం, అధికారుల మధ్య సమన్వయలోపం వల్ల పనులు జరగకపోవడం జరుగుతోందనీ... అన్నీ చెప్పుకొచ్చారు. "ఎన్నిసార్లు తిరిగినా పని కావటంలేదు. ఒక మంచిపని చేయటం ఇంత కష్టమా?" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పుడు విశాఖజిల్లా కలెక్టరుతో మాట్లాడాను. విద్యాశాఖాధికారులతో మాట్లాడాను. ఆయనకి ఊరట కలిగింది. అప్పటి ముఖ్యమంత్రి పివి నరసింహారావుగారితో కూడా కలిపించాను. పరమేశ్వరరావుగారి ఆశయం ఆయనకీ నచ్చింది. "గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపట్టండి - సహాయం చేస్తాం" అన్నారు పి.వి. నెలరోజులు తిరగకుండా రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చింది. పి.వి. గారి మంత్రివర్గం రాజీనామా చేసింది.

కొంతకాలం తరువాత నేను సహకారశాఖలో చేరాక పరమేశ్వరరావుగారు మళ్ళీ వచ్చారు. తాను విశాఖజిల్లాలో యలమంచిలి చుట్టుపక్కల గ్రామాల్లో చేపట్టదలచిన గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. సమగ్ర ప్రణాళిక తయారుచేశారు. "కాని ఏం చేద్దామన్నా పెద్దవాళ్ళందరికీ అనుమానమే. ఈయన ఊరికే ఎందుకు చేస్తున్నట్లు? డబ్బు అఖ్ఖర్లేదన్నాడు అంటే పలుకుబడి పెంచుకుని రాజకీయాల్లోకి వస్తాడా - అని సందేహాలు. ఏమైనా నేను నా లక్ష్యం వదులుకోలేను. అమెరికాలో ఉద్యోగం వదిలేసి వచ్చింది - ఈ వ్యాఖ్యానాలు విని పారిపోడానికి కాదు..." ఇది ఆయన వాదన, ఆవేదన. అప్పటిదాకా ఆయన చేసిందల్లా వాళ్ళ తండ్రిగారిచ్చిన 10వేల రూపాయలతో 'భాగవతుల ఛారిటబుల్ ట్రస్ట్' ఏర్పాటుచేయడం. ఈ ట్రస్టు సహాయంతో గ్రామస్థులలో ఆర్థిక శక్తినిపెంచాలీ, అక్షరాస్యత పెంచాలీ, ఆరోగ్యాలు పెంచాలీ ... ఇవన్నీ ఆయన తపన.

నాకొక ఆలోచన వచ్చింది. "గ్రామస్థుల్ని కలిపి, ఒక సహకార సంఘం ఏర్పాటుచేయండి. దానికైతే ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయవచ్చు."

ఇలా చెప్పటానికైనా రాష్ట్ర ప్రభుత్వం దగ్గర నిధుల నిల్వలేమీ లేవు. కాని క్రిందటిసారి నేను ఢిల్లీ వెళ్ళి వ్యవసాయ - సహకార శాఖల్లో తిరిగి నిధుల గురించి అడిగినప్పుడు, "మార్చి నెలలో రండి. ఏవన్నా రాష్ట్రాలు వాడుకోకుండా నిధులు మిగిలిపోయి వుంటే, మీ రాష్ట్రానికిస్తాం" అన్నారు. వాటిని ప్రయత్నిస్తే ఎంతో కొంత పరమేశ్వరరావు ప్రాజెక్టుకి సహాయం చేయవచ్చుగదా అని ఆశ.

మొత్తంమీద నా హామీ పుచ్చుకొని డాక్టర్ పరమేశ్వరరావు, గ్రామస్థులతో ఒక సహకార సంఘం ఏర్పాటుచేశారు. ఇదే సమయంలో నా సలహాని గౌరవిస్తూ, జియాలజిస్టు పి.వి.ఎల్. ఎన్.రావు, కొందరు జియోఫిజిసిస్టులూ కలిసి ఒక సహకార సంఘంగా ఏర్పడి, 'నేషనల్ డెవలప్‌మెంట్ కోపరేటివ్ సొసైటీ'గా ఏర్పడ్డారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ బోర్ బావులు పడతాయో, ఎక్కడ నీళ్ళు పుష్కలంగా లభిస్తాయో, ఎక్కడ ఎంత లోతు తవ్వాలో... ఇలా రైతులకు సలహా సేవలందించే నిపుణులంతా ఈ సంఘంలో సభ్యులు. ఈ రెండు సంఘాలకి ప్రభుత్వం నుంచి నేను ఆర్థిక సహాయం చేయాలి (కేంద్రం నుంచి నిధులు తేగలిగినప్పుడు).

ఈ ఆలోచన వచ్చాక, ఈ రెండు సంఘాల కోసం కోట్లు అక్కర్లేదు కదా! వీటికోసం ఢిల్లీ వెళ్ళటం కూడా దండగే. అప్పుడనిపించింది - మరికొన్ని పథకాలు కలుపుదామని. తయారుచేయించాను కొత్త పథకాల్ని. సహకార రంగంలో పాఠశాలలు స్థాపించడానికి ఖండేల్వాల్ కపిలలతో ఓ పథకం ... పట్టాభిరామ్‌గారితో పైలట్లకు స్వయం ఉపాధి కల్పన పథకం (సివిల్ ఏవియేషన్ సొసైటీ)... కొందరు డాక్టర్లని కలిపి సహకార రంగంలో ఓ హాస్పిటల్... వజ్రాలు కోసే, సానపెట్టే వారికోసం ఒక సొసైటీ... రిక్షాపుల్లర్స్ సొసైటీ... ఆటో డ్రైవర్ల సొసైటీ... యజమానులు అవ్వాలనుకునే లారీడ్రైవర్ల సొసైటీ...

అడిషనల్ రిజిస్ట్రార్ (సహకారం)తో పాటు చెక్కెర రంగానికి డైరక్టర్‌ని కూడా నేనే. అందుకని షుగర్ ఫ్యాక్టరీకి షేర్ నిధుల సమీకరణ, సహకార రంగంలో గోడౌన్ల నిర్మాణం, మార్కెటింగ్ సొసైటీలకి సహాయం, వ్యవసాయ రంగంలో సహకార పరపతి సంఘాలకు నిధులు, క్షురకులు, రజకులు, వడ్రంగులు తదితర చేతివృత్తులవారి సహకార సంఘాలకు ఆర్థిక సహాయం, వినియోగదారుల సహకార సంఘానికి సహాయం... ఇలా వేర్వేరు సహకార సంస్థల అవసరాలకి తగిన ప్రపోజల్స్‌ని తీసుకొని, ఎన్నికోట్ల రూపాయలు వీలైతే అన్నికోట్లూ కేంద్రం నుంచి తీసుకురావాలని నిర్ణయించుకొని ఢిల్లీకి బయల్దేరాను.

పేరుకి అడిషనల్ రిజిస్ట్రార్‌ని. కాని, నేను అయిదు శాఖల మంత్రులకు జవాబుదారీ. నేను ఢిల్లీ వెళ్తున్నానంటే మా రిజిస్ట్రార్ కె.ఎ.అహ్మద్‌గారు ఒప్పుకున్నారు. కాని సహకారశాఖ సెక్రటరీ ఒప్పుకోలేదు.

"ఏంటి పని?" అని అడిగారు.

"నిధులు దొరుకుతాయేమోనని..."

ఆయన నవ్వాడు.

"ఎవరిస్తున్నారు? ఎంతిస్తున్నారు?... అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముఖ్యమని తెలీదా?..." ఆయన నన్ను మాట్లాడనివ్వలేదు.

నేనూ గట్టిగా చెప్పలేను. ఏమని చెప్పగలను? మార్చి నెలలో ఏవన్నా రాష్ట్రాలు వాడుకోకుండా మిగిలిపోయిన నిధులు వుంటే, అవి ఎక్కడెక్కడ శాఖల్లో మిగిలిపోయాయో వెతికిపట్టుకొని తీసుకురావాలని (బడ్జెట్ సమావేశాలు ఎగ్గొట్టి) వెళ్తున్నాను అని చెప్పగలనా? ఒకవేళ చెబుతాను. తీరా, అక్కడ "మిగులు నిధులు ఏమీలేవు, పోవయ్యా" అని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు మొండి చెయ్యి చూపిస్తే...? నవ్వుల పాలవ్వాలి. ఇక్కడ అంతా గేలి చేస్తారు.

"ఎన్ని వందలకోట్లు తెచ్చావ్ ప్రసాద్? ఓ వందకోట్లు తెచ్చావా?..."

ఇలా దెప్పుతారు... పైగా, చెప్పి వెళ్ళాలంటే అయిదుగురు మంత్రులకి చెప్పాలి.

ఇలా బాగా ఆలోచించి, వీళ్ళెవరికీ చెప్పకుండా ముఖ్యమంత్రి వెంగళరావుగారికి మాత్రమే చెప్పాను.

"సర్, ఇది నా ఆశ. అవకాశం వుంది. జరుగుతుందో లేదో తెలీదు. శూన్యంలో ఆరంభిస్తున్నాను. మూడు నాలుగు కోట్లు వచ్చినా చాలా పెద్దమొత్తమే. (2009లో దీనివిలువ రూ. 100 కోట్లు వుంటుంది). ఎవరికీ చెప్పి వెళ్ళే ధైర్యం చేయటం లేదు. బడ్జెట్ సమావేశాల్లో వెళ్ళకూడదని తెలుసు. కాని మిగులు నిధులు దొరికేది ఈ మార్చిలోనే. మార్చి అయిపోయిన తరువాత వెళ్ళినా ఉపయోగం లేదు..."

వెంగళరావుగారు ఒక్క నిమిషం ఆలోచించారు. ఏమంటారో... ఏమంటారో! వందలాది ఆలోచనలు!

"సరే ప్రసాద్, వెళ్ళిరా. నేను కూడా ఇప్పుడే ఎవరికీ చెప్పను. నిధులు వస్తే అప్పుడే చెప్పవచ్చు. రాకుండా ఎందుకు?... అసెంబ్లీలో నీకు సంబంధించింది ఏవన్నా వస్తే నేను చూసుకుంటాలే..." అని అభయం ఇచ్చారు.

ఒక చిన్న రిక్వెస్టు చేశాను.

"సర్, ఏ మాత్రం నిధులొస్తాయో తెలీదు. అసలొస్తాయో రావో కూడా తెలీదు. వస్తే గిస్తే మూడుకోట్లు రావచ్చు. పథకాలైతే 20 కోట్ల రూపాయలదాకా తయారుచేసి పంపించాను. ఇంకో మూడు కోట్ల రూపాయలకి ఇప్పుడు తయారవుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మా శాఖకి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మొత్తం ప్రణాళికా (జీతాలు కలపని) గ్రాంటు రెండుకోట్లు.

అంతకన్నా ఎక్కువ కేంద్రంనుంచి తీసుకురావాలని నా ఆరాటం... మీరు చిన్న సాయం చెయ్యాలిసర్. ఈ వచ్చిన నిధులు మురిగి పోకుండా వినియోగపడాలంటే, మార్చి 20 తరువాత ట్రెజరీలో పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ఏ బిల్లులూ ఆమోదించకూడదనీ, ప్రణాళికా నిధుల తాలూకు బిల్లులన్నీ మార్చి 20 లోపలే వాళ్ళకి చేరిపోవాలనీ ఆదేశించాలి. అప్పుడు నేను ఏమన్నా కేంద్రం నుంచి నిధులు తెస్తే వాటిని మార్చి 31 లోగా డ్రా చేసేయాలి. చేసి, ఆయా సంస్థలకి విడుదల చేయాలి. ఇదంతా ఆర్థికశాఖ సహకరిస్తే జరుగుతుంది. అదేదో మీరే వాళ్ళకి చెప్పాలి..."

ముఖ్యమంత్రి నవ్వారు. "చాలా పెద్ద జూదం ఆడుతున్నట్లుందయ్యా. కేంద్రం నిధులు వస్తాయో లేదో గాని...! సరే, నువ్వు వెళ్లు. వెళ్తూ వెళ్తూ, నీ మంత్రులందరికీ నీ క్రింద వుండే ఒక్కో ఆఫీసరుని అప్పగించి వెళ్ళు..."

అక్కడికి ముఖ్యమంత్రి అభయమైతే ఇచ్చారు కానీ, మంత్రులెవరేమనుకుంటారో, రేపు ఏమంటారో అన్న భయం వెంటాడుతూనే వుంది. పైగా అప్పటికే సహకారమంత్రి బత్తిన సుబ్బారావుతో ఒక చేదు అనుభవం ఎదుర్కొన్నానుకదా!

* * *

మంత్రి బత్తిన సుబ్బారావుగారు మంచివాడే. కాని ఆయనకీ జనం వస్తుంటారు. రకరకాల పనులకోసం అడుగుతుంటారు. ఆయన వాళ్ళని నా దగ్గరకి పంపిస్తాడు. వాళ్ళందరి పనుల్లో అతి సాధారణమైంది ఉద్యోగాలు. షుగర్ డైరక్టర్‌గా నేను చెప్పగానే సహకార చక్కెర ఫ్యాక్టరీల్లో అందరికీ ఉద్యోగాలొచ్చేస్తాయనుకుంటాడాయన.

నేను షుగర్ డైరక్టర్‌గా వున్నప్పుడే చాలా చక్కెర కర్మాగారాలు సహకార రంగంలో వస్తున్నాయి. దాంతో ఉద్యోగాలకోసం వత్తిడి. నేను కొంచెం ముందు జాగ్రత్త చర్యగా అన్ని సహకార చక్కెర కర్మాగారాలకీ ఉద్యోగుల నియామకాల విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చాను.

ఏ ఉద్యోగానికైనా అభ్యర్థులు ప్రవేశ పరీక్షరాయాలి. ఆ పరీక్షకి 25 మార్కులు. అభ్యర్థి విద్యార్హతలకి 50 మార్కులు. క్రీడలు, కళలు వగైరా ఇతర అర్హతలకి 15 మార్కులు. ఇంటర్వ్యూకి 10 మార్కులు. ప్రతి చక్కెర ఫ్యాక్టరీకి ఒక సెలక్షన్ కమిటీని కూడా నియమించాను. ఏ చక్కెర ఫ్యాక్టరీలో ఏ ఉద్యోగంలో ఎవరిని నియమించాలన్నా ఇదే పద్ధతి. ఇంటర్వ్యూలో మార్కులు 10 శాతం మాత్రమే కావటం వల్ల ఇంటర్వ్యూలో కమిటీని ప్రభావితం చేయాలని ఎవరన్నా ప్రయత్నం చేసినా మిగతా 90 శాతం మార్కులు ఇంటర్వ్యూ కమిటీ చేతుల్లో లేకపోవటం వల్ల పెద్ద ఉపయోగం వుండని పరిస్థితి ఏర్పడింది.

ఇది చక్కెర ఫ్యాక్టరీల చైర్మన్‌లు, ఇతర బోర్డు సభ్యులకి అశనిపాతంలా తగిలింది. తమకిష్టమొచ్చిన వాళ్ళకి ఉద్యోగం వేయించుకోవాలనుకున్న యాజమాన్యాలు, వాళ్ళకి వత్తాసు

పలికే ప్రజాప్రతినిధులు ... అందరికీ కడుపుకోత రగిల్చిన వాడ్నయ్యాను. దాంతో వాళ్ళంతా సహకారశాఖా మంత్రి మీద పడ్డారు.

ఈ గొడవ ఒక జీడిపాకంలా సాగిసాగి చివరికి సహకారశాఖా మంత్రి నామీద విరుచుకు పడటానికి దారితీసింది. నన్ను కలవాలనీ, మాట్లాడాలనీ చాలా రోజులపాటు ప్రయత్నించి ప్రయత్నించి విసుగెత్తి, చివరికి ఓ రోజున ఆయన తానే నా రూమ్‌కి "ఇదిగో వచ్చేస్తున్నా" అంటూ కబురు పంపారు.

ప్రొటోకాల్ ప్రకారం నేను వెళ్ళాలి. నేను ఖంగారుపడి, ఆదరాబాదరా నా ఇతర పని అంతా ప్రక్కకి తోసేసి, ఆయన దగ్గరకి పరుగెత్తాను.

నన్ను చూస్తూనే మంత్రి సుబ్బారావుగారి మొహంలో కోపం, బాధ, ఆవేశం ఒక్కసారిగా పొంగిపొర్లాయి. అయినా వివేకవంతుడు కనుక తమాయించుకుని, అవన్నీ అణుచుకుని చిరునవ్వు నవ్వుతూ అనాల్సింది అనేశారు.

"ఏమండీ ప్రసాద్ గారూ, మంత్రి మీరా నేనా? అయిదు రోజుల్నుంచి మీకోసం ప్రయత్నిస్తుంటే ఇప్పుడా కలుస్తారు?..."

మంత్రులముందు గట్టిగా నోరు విప్పి మాట్లాడటానికి ఐఏఎస్ హోదా సహకరించదు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన నాయకుడే రాజు. ఐఏఎస్ శిక్షణలో మొదట నేర్చుకునేది అదే. ప్రజాస్వామ్య యంత్రాంగంలో ప్రజలు ఎన్నుకొన్న ప్రతినిధులూ, వాళ్ళు ఎన్నుకునే నాయకులే మాకు బాస్‌లు.

నేను వినయంగా "క్షమించండి సర్" అంటూ ఒక షుగర్స్ డైరక్టర్‌గానే కాక, అడిషనల్ రిజిస్ట్రార్‌గా నేను ఎలా అయిదుగురు మంత్రులకి, నలుగురు కార్యదర్శులకి జవాబుదారీ అవుతానో, అందువల్ల నా పని వత్తిడి ఎలా వుంటుందో వివరించి, మళ్ళీ క్షమార్పణ కోరాను. (అప్పట్లో మార్క్‌ఫెడ్, కేంద్ర సహకార బ్యాంకు, వినిమయదారుల సమాఖ్య వగైరా అన్ని రాష్ట్రస్థాయి సహకార సంస్థల బోర్డుల్ని రద్దుచేసి, వాటన్నింటికీ నన్ను 'పర్సన్ ఇన్‌ఛార్జి'గా ప్రభుత్వం నియమించి వుంది.)

మంత్రిగారి మొహంలో ప్రసన్నత చోటుచేసుకొంది. అయినా బాధ బాధే. నిజానికి ఆయన తన సొంత ప్రయోజనం కోసం ఎప్పుడూ ఏ సాయమూ అడగలేదు. అందుకే నాకూ ఆయనంటే గౌరవం. కాని ఆయనక్కావలసింది ఈ గౌరవం కాదు, తన ప్రజల ముందు తన గౌరవం నిలబడాలి.

అసలు విషయం ఎత్తారు. "ఉద్యోగాలు వేయించమంటే ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరక్టర్లంతా తమకి అధికారాల్లేవంటున్నారు. మీరేమో అంతా వారికే అప్పగించామంటున్నారు. మా దగ్గరకొచ్చే వాళ్ళకి ఏం చెప్పాలి మేం?"

నేను మళ్ళీ వినయంగా వివరించాను. "సర్, ఒక్కో చక్కెర ఫ్యాక్టరీలో నాలుగైదు ఉద్యోగాలు నా చేతుల్లో వుంటాయి. అవి - చీఫ్ ఇంజనీర్, చీఫ్ కెమిస్టు, చీఫ్ అగ్రికల్చరల్ ఆఫీసర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, చీఫ్ అక్కవుంట్స్ ఆఫీసర్. వీటికి ఎవరన్నా మీ తాలూకు అభ్యర్థులుంటే సహాయం చేయటానికి ప్రయత్నం చేస్తాను. కానీ..."

ఆయన నన్ను పూర్తి చేయనివ్వలేదు.

"ప్రసాద్‌గారూ! నేను ఎమ్మెల్యే - మంత్రి అయ్యే దాకా మీరు ఇప్పుడు వర్ణించిన పోస్టుల్లో ఆఫీసర్ల మొహాలు కూడా చూసి ఎరుగను. ఎప్పుడన్నా వెళ్ళినా, ఎవరూ నాకు ఇంటర్వ్యూ కూడా ఇచ్చి వుండలేదు. నాకు తెలిసిన వాళ్ళు, నా సాయంకోసం వచ్చేవాళ్ళు ఆశించే ఉద్యోగాలు - నౌకరు పోస్టులో, గుమాస్తా పోస్టులో. నన్నెవరూ చీఫ్ ఇంజనీర్ పోస్టు అడగరు. ఈ గుమాస్తా ఉద్యోగాలకేమో మీరిన్ని తిరకాసులు పెట్టారు...."

నేను మాట్లాడలేదు. వింటున్నాను. ఆయన ఆవేదన, ఆవేశం నామీద కాదు. తన వాళ్ళకి ఉద్యోగాలు వేయించుకోలేని తన నిస్సహాయత మీద. నేను ఏం చేయగలను- నిబంధనల ప్రకారం పనిచేయటం తప్ప.

మళ్ళీ ఆయనే అందుకున్నారు. ఈసారి ఆయన కూడా కొంచెం స్థిమితపడ్డట్లున్నారు.

"అయినా మేం పదిమంది అభ్యర్థుల్ని ఒకే పోస్టుకి పంపితే మీరేం చేస్తారైంది! వాళ్ళకి 'నో' చెప్పనూ లేము. మీలాంటి అధికారులచేత చేయించుకోనూ లేము. ఈ ముఖ్యమంత్రిగారికి ఏం చెప్పినా, మీలాంటి అధికారుల్నే సమర్థిస్తారు..."

ఈ వ్యవస్థలో మంత్రులకీ, శాసన సభ్యులకీ ఇదొక నిరంతర సమస్య. ఎన్నుకొన్న వాళ్ళు పనులు చేసిపెట్టమంటూ వెంటబడతారు. ఏ పని కావాలన్నా అధికార యంత్రాంగం సహకరిస్తేనే తప్ప, ఎన్నికైనవాడు ఏమీ చెయ్యలేదు.

* * *

మంత్రి బత్తినతో అనుభవం దృష్ట్యా, ఢిల్లీ వెళ్ళేముందు ఇతర మంత్రులతో ముందుగా చెప్పి ఆశలు పెంచటమూ వద్దు, అక్షింతలు వేయించుకోవటమూ వద్దు - అనుకొని ఢిల్లీ వెళ్ళిపోయాను.

మార్చి మొదటి వారంలో ఢిల్లీలో దిగాను. కేంద్రప్రభుత్వంలోని మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ శాఖ, సహకారశాఖ, పౌరసరఫరాలు, ప్రణాళికాశాఖ... వగైరా నా ప్రతిపాదనలని ఏయే శాఖలకి పంపానో ఆ అయిదుశాఖల జాయింట్ సెక్రటరీల చుట్టూ తిరగటం మొదలెట్టాను. వాళ్ళంతా హోదాలో నాకన్నా సీనియర్ ఆఫీసర్లు.

ప్రతి గుమ్మం ఎక్కటం – "ఏ రాష్ట్రంనుంచి అయినా మిగులు నిధులు వాపసు ఇచ్చారా? వుంటే వాటిని మా ఆంధ్రప్రదేశ్‌కి మళ్ళిస్తారా?" అని అడగటం, వాళ్ళు మర్నాడు రమ్మనటం, మర్నాడు మళ్ళీ వెళ్ళటం, వాళ్ళు "మీ దగ్గర ప్రపోజల్సు ఏమున్నాయి? మార్చి 31 లోగా ఎలా ఖర్చుపెట్టగలరు?" అని అడగటం, నేను అదివరకే ప్రపోజల్సు పంపానని చెప్పి, వాటిని తీయించి చూపించటం, "గ్రౌండు వర్క్ అంతా అయిపోయింది, మీరు ఇలా నిధులు విడుదల చేస్తే అలా చెక్కులిచ్చేసి, పని మొదలు పెట్టేస్తాం" అని చెప్పటం, వాళ్ళు కాస్త దర్పంగా తలకాయ వూపి, "సరే, రేపురండి" అనటం... ఇలా పదిరోజులు తిరుగుతూనే వున్నాను.

ఇందులో నా ధైర్యం, విశ్వాసం ఒక్కటే. కేంద్ర ప్రభుత్వంలోనయినా సరే, నిధులు రాష్ట్రాలకి పోకుండా (ఖర్చవకుండా) తిరిగి వచ్చాయంటే అందుకు ఆయా జాయింట్ సెక్రటరీలు ప్రభుత్వానికి సంజాయిషీ ఇచ్చుకోవాలి. అందుకని ఏ జాయింట్ సెక్రటరీ కూడా ఈ విషయం సెక్రటరీ దాకా వెళ్ళనివ్వకుండా పరిష్కారమయిపోవాలని కోరుకుంటారు. కాబట్టి ఆ మిగిలిపోయే (మురిగిపోయే) నిధులుంటే మన రాష్ట్రానికి ఇవ్వకపోతారా? ఈ నిధులు తెస్తే ఎన్ని బలహీన వర్గాల సహకార సంస్థలకి, చేతి వృత్తులవారి సహకార సంఘాలకి, వ్యవసాయ పరపతి సంఘాలకి ... వగైరాలకి నిధులు అందుతాయి! ఎన్ని లక్షల మంది ఆయా సంఘాల ద్వారా ప్రయోజనం పొందుతారు?

నేనిలా ఢిల్లీలో మకాం పెట్టి కేంద్ర ప్రభుత్వ శాఖల చుట్టూ తిరుగుతూ మధ్యలో ఒకటి రెండుసార్లు ఇంటికి టెలిఫోన్ చేశాను. (అప్పట్లో మొబైల్ ఫోన్‌లు లేవు) నా భార్య గోపిక నా తిరుగుడు కథ అంతా విని, "ఏమిటండీ ఈ పిచ్చి తిరుగుడు? ఎవరు తిరగమన్నారు మిమ్మల్ని? మీరు ఢిల్లీ వెళ్ళి నిధులు తేకపోతే గవర్నమెంట్ ఆగిపోతుందా? అయినా ఆ పనిమీరే చేయాలా – మీ కన్నా పై ఆఫీసర్లేం చేస్తున్నారు?..." ఇలా అనాల్సినవన్నీ అనేసింది.

నిజంగా ఇంత శ్రమ పడ్డాక నిధులు ఒక్క రూపాయి కూడా రాకపోతే...?

రాకపోతే...?

* * *

సరిగ్గా ఆ సమయంలోనే డిప్యూటీ రిజిస్ట్రార్ నరసింహాచారి ఈ టెలిఫోన్ చేశారు – "కొంపలంటుకున్నాయంటూ". అసెంబ్లీ ఎగ్గొట్టి తిరుగుతున్నందుకు నేను ఏం సమాధానం చెప్పుకోవాలి?

నరసింహాచారి ఆ సాయంత్రం మళ్ళీ ఫోన్ చేశాడు. "సర్, అసెంబ్లీలో మీ సబ్జెక్టుని ముఖ్యమంత్రి గారే స్వయంగా తీసుకుని మాట్లాడారు. మాట్లాడుతూ, మిమ్మల్ని నిధులు తేవటానికి ఢిల్లీకి పంపాననీ, మీరు నిధులు తీసుకువచ్చే పనిమీదే వున్నారనీ ప్రకటించారు. ఇంకా..."

నా నెత్తిన తాటికాయ పడ్డట్లయింది ఆ సమాచారం విని.

ఇక్కడ ఢిల్లీలో ఎవడూ ఒక్క రూపాయి కూడా రాల్చలేదు. అక్కడ ప్రతిపక్షాల విమర్శల్ని తప్పించుకునేందుకు ముఖ్యమంత్రి ప్రకటన చేసేశారు.

ఓరి భగవంతుడా! ఇదేం పరీక్ష?

తెల్లవారగానే ఆవేశంగా మళ్ళీ ముందురోజుల్లో తిరిగిన అన్ని శాఖల కార్యాలయానికీ తిరిగేశాను.

మై గాడ్!

ఆ ఒక్కరోజులో వేర్వేరు శాఖల నుంచి మొత్తం అయిదుకోట్ల రూపాయలు (ఇతర రాష్ట్రాలు ఖర్చుపెట్టలేక కేంద్రానికి తిరిగిచ్చేసిన) కేంద్రం నిధులు ఆంధ్రప్రదేశ్‌కి మంజూరయ్యాయి!

...మరికొన్ని శాఖల వాళ్ళు హామీలు ఇచ్చారు - మళ్ళీ వస్తే ఇంకా ఇస్తామని.

ఆ రోజు మార్చి 15.

ఏనుగెక్కినంత సంతోషంతో రాత్రికి రాత్రి హైదరాబాద్ బయల్దేరి వచ్చేశాను. ఎందుకంటే కేంద్రం మంజూరు చేసిన నిధులకి తగిన తుది ప్రపోజల్సుని మా శాఖనుంచి హైదరాబాద్‌లో సెక్రటేరియట్‌కి పంపితే, అక్కడ సెక్రటరీ అమోదించాక, మన ఆర్థిక శాఖకి పంపితే, వాళ్ళు ఆమోదిస్తే, ఆ ఆమోదం ఆధారంగా మా కార్యాలయం బిల్లులు తయారుచేసి ట్రెజరీకి పంపితే (ఆలస్యం అయినందుకు ప్రత్యేక అనుమతిని ఆర్థిక శాఖనుంచి పొందాక), వాటికి అక్కడ పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ చెక్కులు జారీచేస్తే... అప్పుడు నిధులు చేతికి వచ్చినట్లు.

కేంద్రం ఇచ్చిన అయిదుకోట్లూ మన రాష్ట్రంలో నేను చూస్తున్న రెండు మూడు వేర్వేరు శాఖలలో వందలాది వేర్వేరు సంఘాలకి చెందినవి. ఆయా సంఘాల పేరు మీద చెక్కులు జారీ అయ్యేదాకా ఆగమేఘాలమీద పని నడవాలి. అంతా మార్చి 31 లోగా అయిపోవాలి. నరసింహాచారిని సమన్వయం చేయమని చెప్పాను.

ఉరుకులు... పరుగులు... చెమటలు...

ముఖ్యమంత్రి ఆనందపడి, మెచ్చుకునే లోపల మళ్ళీ ఢిల్లీ పరుగెత్తి, నాకు హామీలిచ్చిన అధికారులందరి వెంటా మరో వారం రోజులు పరుగెడితే...

... అదనంగా మరో 15 కోట్ల 50 లక్షలు వచ్చింది. అంటే మొత్తం 20 కోట్ల రూపాయలకు పైగా (2009 నాటి ధరల ప్రకారం ఇది 400 కోట్లకి సమానం) కేంద్రంనిధులు - ఇతర రాష్ట్రాలు ఖర్చుపెట్టకుండా తిరిగిచ్చేసినవి - ఆంధ్రప్రదేశ్‌కి వచ్చేశాయి.

అన్ని సొసైటీలకి, అన్ని ప్రతిపాదనలకీ నిధుల్ని మార్చి 31 సాయంత్రానికి విడుదల చేసేశాం. ఒక్క 20 లక్షలకి చేయలేకపోయాం. అవి మురిగిపోయాయి. పరమేశ్వరరావుగారి 'భాగవతుల ఛారిటబుల్ ట్రస్టు'కి ప్రభుత్వ పరంగా అందిన తొలి సహాయం 30 వేలుంటుంది. ఇవ్వాళ విశాఖజిల్లాలో మహిళాసాధికారత, దారిద్ర్య నిర్మూలన, అక్షరాస్యతల సాధన ద్వారా రాష్ట్రంలో అగ్రస్థానంలో వున్న స్వచ్ఛంద సంస్థల్లో ఈ ట్రస్టు ఒకటి.

నేను ఢిల్లీలో వుండగా బడ్జెట్ సమావేశాలలో అసెంబ్లీలో నా ప్రస్తావన వచ్చినప్పుడు నాకు బాసటగా నిలబడినందుకు 'ధన్యవాదాలు' చెబుదామని ముఖ్యమంత్రి వెంగళరావుగారి దగ్గరకి వెళ్ళాను.

"సర్, మీకు నేను థాంక్స్ చెప్పాలి..." అంటుంటే ఆయన నన్ను వారించారు.

"ప్రసాద్, మన ప్రభుత్వం ఈ ఏడాది మీ శాఖకిచ్చిన ప్రణాళికా గ్రాంటు రెండుకోట్లే. కాని నువ్వు కేంద్రం నుంచి తెచ్చింది 20 కోట్లు. థాంక్స్ ఎవరు ఎవరికి చెప్పాలయ్యా....! రా, ఇవ్వాళ మనం కలిసి, భోంచేద్దాం..."

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

* * *

ఎన్టీఆర్ - సంజీవరెడ్డి - కళాపీఠం

ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుకి గొప్ప సినీ కళాకారుడిగా పేరుంది. ఆయన ముఖ్యమంత్రి కాగానే కళాకారులంతా విరగబడి ఉత్సవాలు చేసుకున్నారు - "మా కళాకారులకులం నుంచి ఎన్నికైన తొలితెలుగు ముఖ్యమంత్రి ఈయనే" అనుకుంటూ.

కాని అంత నీరాజనాలు పట్టిన కళాకారులూ, 1983లో రాష్ట్రంలో సంగీత సాహిత్య, నాటక అకాడమీల్ని ఎన్.టి.రామారావు రద్దుచేసేసరికి అసంతృప్తి, ఆవేదనతో రగిలిపోయారు. ఎంతగా అంటే, సంగీత అకాడమీ ఛైర్మన్‌గా వున్న మంగళంపల్లి బాలమురళీకృష్ణ "ఎన్.టి.ఆర్ ముఖ్యమంత్రిగా వున్నంతకాలం రాష్ట్రంలో నేను కచేరీలే చేయను" అని ప్రకటించేటంత తీవ్రంగా ఆ అసంతృప్తి జ్వాలలు కళాకారుల్లో వ్యాపించాయి. (తిరిగి పన్నెండేళ్ళ తరువాత 1995లో ముఖ్యమంత్రి హోదాలో మంగళంపల్లిని సన్మానించి ఆ లోపాన్ని సరిచేసుకున్నారు ఎన్.టి.ఆర్.)

ప్రముఖ పత్రికా సంపాదకులు నార్ల వేంకటేశ్వరరావుగారి నివేదిక ఆధారంగానే అకాడమీలన్నింటినీ రద్దు చేస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించటంతో ఆ అపఖ్యాతి నార్లవారిని కూడా చుట్టుముట్టేసింది. దాంతో నార్లవారు నైరాశ్యంలో మునిగిపోయారు.

కళాకారుల్లో అసంతృప్తి వెల్లువెత్తిన తరుణంలో సమాచార, సాంస్కృతిక శాఖ కమీషనర్, కార్యదర్శిగా నియమితుణ్ణయిన నాకు నార్లవారు కబురుచేశారు. వెళ్ళిచూస్తే - ఆయన చాలా డీలాపడిపోయారు. బయటికి చెప్పుకోలేని బాధలో మునిగిపోయారు.

నన్ను చూస్తూనే ఆయనలోని ఆవేదనంతా ఒక్కసారిగా బయటకు తన్నుకొచ్చింది.

"... ఏమిటండీ ప్రసాద్‌గారూ, ముఖ్యమంత్రి ఇలా చేశారేంటి? సాహితీవేత్తలు, కళాకారులు అంతా నన్ను దుమ్మెత్తి పోస్తున్నారు. నేనేమైనా వాళ్ళకి వ్యతిరేకినా? సాహిత్యం, కళలు అంటే అభిమానం లేనివాడినా?... ఒక సంపాదకుడిగా కొన్ని దశాబ్దాల పరిశ్రమవల్ల నేను సంపాదించుకున్న పేరు అంతా ముఖ్యమంత్రిగారు తీసుకున్న ఈ ఒక్క చర్యవల్ల తుడిచిపెట్టుకుపోయింది గదా!..."

విస్తుపోయాను. అకాడమీల పనితీరుపై నార్లకమిటీని ముఖ్యమంత్రి నియమిస్తే, ఆ అకాడమీల పనితీరుని నిశితంగా ఎండగడుతూ నివేదిక ఇచ్చింది నార్లవారు. మరి ఇలా ఎందుకంటున్నారు? అదే అడిగాను. దానికి ఆయన సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు.

"... అవునండీ, సంగీత, సాహిత్య, నాటక అకాడమీలు మూడింటినీ రద్దుచేయాలని నా రిపోర్టులో పేర్కొన్నమాట నిజమే. ఎందుకని! అవి సరిగా పనిచేయడం లేదు కనుక. కొంతమంది

వాటిని కబ్జాచేసి, తమకీ తమ అనుయాయులకీ అడ్డాగా తయారుచేసుకుని దుర్వినియోగం చేస్తున్నారు. అవి ఎంత క్రుళ్ళిపోయాయంటే, వాటిని ప్రక్షాళన చేయడం అసాధ్యం... కాని కళాకారుడైన ముఖ్యమంత్రి ఏం చేశారు? అకాడమీలకి ప్రత్యామ్నాయం ఆలోచించకుండా ఒక్క కలంపోటుతో అకాడమీల్ని రద్దుచేశారు. సాంస్కృతికశాఖలోని అధికారులందర్నీ తీసేశారు. కళల్ని పోషించవద్దనీ, ప్రోత్సహించవద్దనీ నేను ఏనాడూ చెప్పలేదు. కాని ముఖ్యమంత్రి తొందరపాటు చర్యవల్ల జీవితకాలానికి సరిపడా అపకీర్తిని మాత్రం మూటగట్టుకున్నాను. ... దయచేసి మీరే ఏదో చేసి, నన్ను ఈ క్షోభనుంచి బయటపడేయాలి. ముఖ్యమంత్రిగారితో మాట్లాడి ఏదన్నా చేయండి..." ఇలా సాగింది నార్లవారి ఆవేదనాభరిత వివరణ.

నాకు అర్థమవుతోంది ఎక్కడ తేడా వచ్చిందో. ముఖ్యమంత్రి వేసిన నార్లకమిటీ సిఫార్సుని ప్రకటించే ముందు ప్రత్యామ్నాయంగురించి ముఖ్యమంత్రి ఆలోచించలేదు. నేను ఆ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించేనాటికే ఇది జరిగిపోయింది.

"మీరే ముఖ్యమంత్రిగారితో మాట్లాడవచ్చుగదండీ" అని నార్లవారికి ఓ సలహా ఇచ్చాను. "ఆ... చెబుతూనే వున్నాను. ఆయన వినాలి కదా!" అని ముక్త సరిగా చెప్పి వూరుకున్నారు.

ఇది జరిగిన రెండు మూడు రోజుల్లోనే ముఖ్యమంత్రి రామారావుగారికి పత్రికలలో వచ్చిన వార్తల గురించి నేను చెబుతున్నప్పుడు, "అకాడమీల్ని రద్దుచేసిన ముఖ్యమంత్రి కళాకారుల వ్యతిరేకి" అంటూ వచ్చిన ఒక వార్త ప్రస్తావన వచ్చింది. ముఖ్యమంత్రి అక్కడ ఆగిపోయారు. నన్ను మాట్లాడనివ్వకుండా తన సహజధోరణిలో చెప్పడం మొదలెట్టారు.

"... ఏంటి బ్రదర్ ఇదంతా. కళాకారుడిగా గతంలో నాకున్న పేరు, ప్రఖ్యాతి ఎలాంటిదో మీకు తెలుసు. కొత్తపార్టీపెట్టి తొమ్మిది నెలల్లో ఎన్నికల్లో దిగి, దశాబ్దాల కాంగ్రెసు అధికారాన్ని మట్టి కరిపించి, చరిత్ర సృష్టించినవాణ్ణి. తెలుగుజాతి గౌరవాన్ని, ప్రతిష్టను మహోన్నత స్థాయికి తీసుకువెళ్ళాలని బద్ధకంకణం కట్టుకున్న వాణ్ణి. కాని ఇప్పుడు రాష్ట్రంలో సాహిత్యకళారంగాల్లోని వాళ్ళంతా నన్ను ఆడిపోసుకుంటున్నారు. 'కళాకారులకోసం కొత్తగా ఏమీ చేయకపోగా, వున్న సదుపాయాన్ని కూడా రద్దుచేసిన దుర్మార్గుడు' అంటూ నామీద విరుచుకుపడుతున్నారు... నార్లవారు నాకు టెలిఫోన్ చేసి, కళాకారులకోసం ఏమన్నా చేయండి, చేయండి – అంటున్నారు. అకాడమీల్ని రద్దుచేయాలన్న సిఫార్సు చేసిందే ఆయన. ఇప్పటికిప్పుడు ఏం చేయాలి?...."

నేను మాట్లాడటంలేదు. ఆయన బాధ ఏమిటో అర్థంచేసుకునే ప్రయత్నం చేస్తున్నాను. ఇతర ముఖ్యమంత్రులకీ రామారావుగారికీ చాలా తేడా వుంది. నేను పనిచేసిన ఇతర ముఖ్యమంత్రులంతా వాళ్ళకి ఏ ఆలోచన చెప్పినా, అధికారులు చేసే వాదనలోని ఔచిత్యాన్ని పట్టించుకొనేవారు. రామారావుగారి తత్వం వేరు. ఆయన చెప్పిందే జరగాలి. దాని సాధ్యాసాధ్యాల గురించి చర్చ అంతగా ఇష్టపడరు. పైగా నేను ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ఆ పోస్టులో చేరిన కొత్త రోజులు. వాదన ఎందుకు అని వింటూన్నాను.

మళ్ళీ ఆయనే అందుకున్నారు. "కళాకారుల్లో ఈ అసంతృప్తి, ఆగ్రహం పెరగటం నాకు బాధగా వుంది. ఒకసారి నార్లవారితో మాట్లాడండి. ఆయన చెప్పిందే చేశాం గదా! ఇంకా ఏం చేయమంటారో అడగండి. రామారావు కళల వ్యతిరేకి అన్న ముద్ర మిగిలి పోకుండా ఏమన్నా చేయండి బ్రదర్..."

"సరే సర్" అంటూ తలూపాను.

సమస్య అర్థమయింది. నార్లవారు చేసిన సిఫార్సుని ప్రకటించేముందు ప్రత్నామ్నాయం గురించి ముఖ్యమంత్రి ఆలోచించలేదు. అలాంటి ప్రత్నామ్నాయం గురించి నార్లవారు ఎలాంటి సూచనా చేయలేదు. కాని ఇప్పుడు ఇద్దరికీ బాధగా వుంది - కళాకారులంతా తమని తిట్టుకుంటున్నారని. కాబట్టి సాహిత్య కళా రంగాల్ని ప్రోత్సహించటం కోసం ప్రత్యామ్నాయ కార్యక్రమం చేపట్టాలి.

ఏం చేయాలి? ఏం చేయాలి? ...అని ఆలోచించాను. అప్పుడు, అంతకు మూడేళ్ళక్రితమే తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నేను చేసిన ప్రయోగం గుర్తుకొచ్చింది

★ ★ ★

సంప్రదాయ పద్ధతిలో గురుశిష్య పరంపర కొనసాగిస్తూ తమిళనాడులో కర్నాటక సంగీతానికి వచ్చిన ఆదరణ, తెలుగు రాష్ట్రంలో లేకపోవడానికి కారణమేమిటన్న ఆలోచన చేసి, దాన్ని సరిదిద్దేందుకు ఒక 'కళాపీఠం' దేవస్థానంలో స్థాపించడం జరిగింది. ప్రముఖ విద్వాంసుడు, వాగ్గేయకారుడు బాలాంత్రపు రజనీ కాంతరావుగారి ఆధ్వర్యంలో, కొంతమంది నిష్ణాతులైన కర్ణాటక సంగీతవిద్వాంసులు, అధ్యాపకుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.

సంగీత కళాశాలలోనో, లేదా గురువులవద్దనో నేర్చుకొన్న విద్యార్థినీ, విద్యార్థులను ఎంపికచేసి, వారిని కచేరీ యిచ్చేస్థాయి కళాకారులుగా తయారుచేయడం ప్రధాన వుద్దేశం. అలా తర్ఫీదు అయినతర్వాత, వారికి రాష్ట్రంలోని పలు కళాసంస్థలకు పంపి కచేరీలు చేయించి, కచేరీలు బాగా చేయగలమన్న ఆత్మస్థైర్యాన్ని కల్గించడం రెండవ వుద్దేశ్యం. అటువంటి కచేరీల ఖర్చు దేవస్థానం భరిస్తుంది కనుక రాష్ట్రంలోని కళాసంస్థలకు, యువకళాకారులకు ప్రోత్సాహం యివ్వటం జరుగుతుంది.

సాహిత్యరంగంలో వివిధ గ్రంథాలు ప్రచురించడం, రచయితలకు, గ్రంథ ప్రచురణకు ఆర్థిక సహాయం చేసి ప్రోత్సహించడం... నాటక రంగంలో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వరనాటక కళాపరిషత్తుకు పెద్ద ఎత్తున సహాయం చేసి పౌరాణిక నాటక ప్రక్రియకు ప్రోత్సాహం యిచ్చి, కళాకారుల ఆదరణకు తోడ్పడటం, యివే కాక శిల్పకళ, నాట్యం విషయాలలో కూడా దేవస్థానం వారి ద్వారా చాలా పథకాలు... రాయిటీలపై, విగ్రహాలు దేవాలయాలకు అందించే పథకం - వెంపటి చినసత్యనారాయణ, వేదాంతం వారి లాంటి వారిచేత నాట్య రూపకాలు తయారుచేయించి,

దేవస్థానం సహాయంతో ప్రదర్శనలు యిప్పించే పథకాలు చేపట్టడం...ఇవన్నీ 'కళాపీఠం' కార్యక్రమంలో భాగం.

★ ★ ★

ఇదంతా జ్ఞప్తికొచ్చాక అనిపించింది-అసలు ఇలా సాహిత్య, సంగీత నాటకాది రంగాల సముద్ధరణ అన్నది రాష్ట్ర సాంస్కృతికశాఖ కర్తవ్యం. కళాకారులను తయారుచేయడం, వారికి ప్రోత్సాహాన్నివ్వడం, కళాసంస్థలను ఆదరించి ప్రోత్సహించడం, ప్రజలలో కళలపట్ల ఉత్సాహాన్ని పెంపొందించడం....వారు ఆనందించేట్లు చూడటం ఈ శాఖ కర్తవ్యం.

ప్రతిరాష్ట్రంలోనూ, ప్రతిభాషలోనూ కళాపోషణా కార్యక్రమాలు నిర్వహించడానికి దేశస్థాయిలో సాహిత్య అకాడమీ, సంగీత అకాడమీ, నాటక అకాడమీలను స్థాపించి, ఆ సంస్థల అనుబంధ సంస్థలుగా, రాష్ట్రస్థాయిలో, రాష్ట్ర సాహిత్య, సంగీత, నాటక అకాడమీలు ఏర్పాటుచేసి, వాటికి కేంద్ర అకాడమీల ద్వారా ఆర్థికసహాయం చేసేపథకాలు దేశంలో అమలు జరుగుతున్నాయి.... రాష్ట్రప్రభుత్వం కూడా ఈ రాష్ట్రస్థాయి సంస్థలకు ఇతోధిక సహాయం సాంస్కృతికశాఖ ద్వారా ఇవ్వడం ఆనవాయితీ...

ముఖ్యమంత్రిగారికి రాజకీయాలు కొత్త....పరిపాలనా అనుభవమూలేదు....కాని ఏదైనా చేయాలనే తహతహ. త్వరగా చేయాలనే ఉత్సాహం. తన మంచి కోరేవారని ఆయన భావించిన ప్రముఖులను సంప్రదించి, తనకు నచ్చిన నిర్ణయాలను ముందు ప్రకటించి, తర్వాత ఎలా చేయాలో ఆలోచించే స్వభావం....దానికి పరిపాలనా యంత్రాంగంపై ఆయనకు వున్న అపనమ్మకం ఒక కారణం కావచ్చు.

ఇన్నేళ్ళుగా, కాంగ్రెసు ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు, యంత్రాంగం కాంగ్రెస్‌కి సానుభూతిపరులై వుండవచ్చని ఆయన అనుమానం. ఆయన మంత్రివర్గంలో కాని, పార్టీలోకాని, అంతపెద్దగా చెప్పుకోగల అనుభవంకల వారు లేకపోవడం, వున్నా వారికి ముఖ్యమంత్రికి సలహా యివ్వగల చనువుగాని, ధైర్యంకాని లేకపోవడం....యివన్నీ కలిసి రామారావుగారి మొదటి సంవత్సరపాలన కొంత తొందరపాటు నిర్ణయాలతోనూ, హడావిడిగానూ, గందరగోళంగానూ జరిగిందని చాలామంది భావన. ఒక పద్ధతికి అలవాటుపడ్డ ప్రభుత్వయంత్రాంగం, ఆ పద్ధతి పూర్తిగా తప్పు అని భావించే రామారావుగారి పద్ధతికి అలవాటుపడటానికి సమయం పడుతుంది కదా? ముందుగా అధికారులతో సంప్రదిస్తే అన్నీ కాదంటారనీ, ఆచరణసాధ్యం కాదంటారనీ అనుమానంతో ముఖ్యమైన పాలనా నిర్ణయాలను అధికారులతో కాక, తమకు నమ్మకమైనవారి కొందరితో చర్చించి, నిర్ణయాలు తీసుకొని, వాటిని ప్రకటనచేసి, ఆచరణకు మాత్రం అధికార యంత్రాంగాన్ని వినియోగిస్తేనే కార్యక్రమాలు జరుగుతాయి, లేకపోతే కష్టం అన్న నిర్ణయానికి రావటం... ఇదే ఆయన పాలనా సరళి. అలానే చేయటం జరుగుతోంది.

అలా తీసుకొన్న నిర్ణయాలలోనే ఒకటి ఈ అకాడమీలు రద్దుచేయటం...

రామారావుగారికి నార్లవారిమీద ఎంతగౌరవం అంటే పెద్దాయన చెప్పింది వెంటనే అమలు చెయ్యాల్సిందే అని అకాడమీల రద్దుగురించి ప్రకటించి, పాతుకుపోయిన వారిని సాంస్కృతికశాఖకు దూరంచేసి ప్రక్షాళన చేస్తామని ప్రకటించి, ప్రకటించినవి వెంటనే అమలు చేసే మనస్తత్వం కనుక వెంటనే అమలు చేశారు. దీనితో అకాడమీలూ పోయాయి, వాటితో పాటు సాంస్కృతికశాఖ కూడా ఖాళీ అయింది.... ఆ రోజు సాంస్కృతికశాఖలో వుద్యోగులంతా, యితర శాఖలలో పనిచేస్తూ, డెప్యుటేషన్‌మీద యీ శాఖకు వచ్చిన బాపతు. పాతుకుపోయారని వారినీ పంపించివేశారు....

అలా కొన్ని నెలల స్తబ్ధతవలన కళాకారులలో అసంతృప్తి, కళాసంస్థలలో నిరాశ, అదివరకు జరిగే కొద్దిమాత్రం కూడా జరగని దీనస్థితి....ఎవరినడగాలో తెలియని అయోమయపరిస్థితి. నాకు విషయమంతా కొత్త. రామారావుగారు ముఖ్యమంత్రి అయ్యేనాటికి నేను కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఒక కోర్సుచేస్తున్నాను. నేను రాష్ట్రానికి తిరికి వచ్చేప్పటికి రామారావుగారు ముఖ్యమంత్రయి తొమ్మిది నెలలు.... నేను వచ్చిన వెంటనే, తిరుపతిదేవస్థానంలో నేనేదో అవకతవకలు చేశానని కొందరు చెప్పినమాటలు విని, సస్పెండు చేస్తారేమో అన్న పరిస్థితి నుండి బయటపడి, చావుతప్పి కన్నులొట్టపోయిందన్నట్టుగా, రాష్ట్రసహకార బ్యాంకు మేనేజింగు డైరక్టర్ పోస్టులో చేరాను. నాపని నేను చేసుకుపోతున్న సమయంలో, రామారావుగారే నన్ను పిలిచి, "మీ మీద అభియోగాల్లో నిజం లేదని తెలిసింది....తిరుపతిలో, ఖమ్మంలో మీరు చేసిన పని గురించి, చూశాం, విన్నాం....మీరు మాకు సన్నిహితులుగావుంటూ మా ముఖ్యమైన సమాచారశాఖ, చిత్రపరిశ్రమశాఖ, సాంస్కృతికశాఖలకు అధిపతిగా రావాలి....మా యిమేజ్‌ని మీ చేతుల్లో పెడ్తున్నాం.... దాన్ని కాపాడాల్సిన, వృద్ధిచేయాల్సిన బాధ్యతమీది. మీకింకెవ్వరితో యిబ్బందిలేకుండా, మీరే కమీషనరు, మీరే కార్యదర్శి.... ఏదైనా నేరుగా నాతో చర్చించి చేయగలిగిన స్వతంత్రం మీకుంటుంది" అన్నారు.

అలా విద్యాశాఖ నుండి సాంస్కృతికశాఖను విడగొట్టి, సమాచార, సాంస్కృతికశాఖలను కలపడం, హోంశాఖనుండి చిత్రపరిశ్రమను విడగొట్టి యీ కొత్తశాఖలో చేర్చడం- అలా నేను సమాచారశాఖకు, సాంస్కృతిక శాఖకు సచివాలయంలో కార్యదర్శిగాను, విభాగాలలో కమీషనరుగాను, చలన చిత్ర అభివృద్ధిసంస్థకు అధ్యక్షునిగాను మేనేజింగ్ డైరక్టరుగానూ బాధ్యతలు స్వీకరించడం.... జరిగింది.

చూద్దును కదా!....సాంస్కృతికశాఖ అంటే ఆ రోజున సచివాలయంలో వుద్యోగులు లేని ఒక ఖాళీ సెక్షనూ, రవీంద్రభారతిలో ఈలపాట శివప్రసాద్ (విభాగంలో కొత్తగా టెంపరరీగా చేరాడు), యింకొక యిద్దరు చిన్న గుమాస్తాలు....అంతే....ఏడాదిగా కార్యక్రమాలు లేవు. అకాడమీలకు తాళాలువేసి వున్నాయి-చేయడానికి పనీలేదు....నిధులూ లేవు....ఏం చెయాలో ఎవ్వరికీ తెలియదు....

ఈ నేపథ్యంలో నార్లవారూ, ముఖ్యమంత్రీ నామీద ఈ భారం పెట్టారు. ఒక వారం రోజులు పెద్ద కసరత్తు చేసి రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక 'కళాపీఠం' ఏర్పాటుకి పథకం తయారుచేశాను. ఈ లోపల ఒకరోజు ఢిల్లీ వెళ్ళి అక్కడ కేంద్ర అకాడమీలతో మాట్లాడి, వారు నిధులు యివ్వటానికి ఎలాచేస్తే బాగుంటుందో, కళాపీఠంలో ఎలాంటి ఏర్పాట్లు చేస్తేవారికి ఆమోదమివ్వటానికి అనుకూలమో చర్చించి....వ్యవస్థాపరంగా ఆయా ఏర్పాట్లు 'కళాపీఠం'లో చేయడం కూడా జరిగింది.

రాష్ట్రప్రభుత్వానికి ఎంత ఉత్సాహమున్నా, నిధుల విడుదల విషయంలో మహాయిస్తే ఒకటి రెండు సంవత్సరాలు యిస్తారేమోకాని, రాబోయే కాలంలో ప్రతిసంవత్సరం కావల్సిన నిధులు కేంద్రం ఇచ్చే అవకాశం వుంటే దాన్ని పోగొట్టుకోవడంలో అర్థమేమిటి?....అందునా అప్పటికే ఖజానా ఖాళీ. "కాంగ్రెసు వాళ్ళు ఖాళీ ఖజానా యిచ్చారు.... అభివృద్ధి పనులకు నిధులు లేకుండా చేశారు–కేంద్రం చేయాల్సినంత చేయడంలేదు....యివ్వాల్సిన నిధులు యివ్వడం లేదన్న" ఆరోపణల నేపథ్యంలో రెండురూపాయలకి కిలో బియ్యానికి కావల్సిన నిధులు ఎలా వస్తాయా అన్న ఆలోచనలతో సతమవుతున్న రాష్ట్రప్రభుత్వం, సాంస్కృతిక రంగానికి కావల్సిన నిధులివ్వ గలదా?

'కళాపీఠం' అమలు జరగాలంటే, 'కేంద్రం నుండి కొంత తేగలిగినా, రాష్ట్రం కొంత ఉదారంగా ఖర్చుపెట్టడానికి సిద్ధం కావాలి....దీనికి ముఖ్యమంత్రితో మాట్లాడి ఒప్పించడం జరిగింది.... ఈ సంస్థ ఎలావుండాలి? అకాడమీలు అదివరకు చేస్తున్న పనులన్నీ చేయాలి, అంతకంటే బాగా చేయాలి, రాష్ట్రంలో సాంస్కృతిక విప్లవం తేగలగాలి, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనేటట్లు వుండాలి, కళాకారులకు ప్రోత్సహాకారిగా వుండటమే కాకుండా, నిర్ణయాధికారులు కళాకారులకే వుండేట్లు చూడాలి....

కళాపీఠానికి సమన్వయకర్తగా ఒక కులపతి... ప్రతి కళారంగానికి ఒక విభాగం... అంటే–సాహిత్యానికి, సంగీతానికి, నాట్యానికి, నాటకానికి, శిల్పకళకు, చిత్రలేఖనానికి, జానపదాలకు, ఆధునిక కళలకు వేర్వేరు విభాగాలు.... ఆ విభాగాలలో నిర్ణయాధికారాలు, ఆయా విభాగాలలో నిష్ణాతులైన కళాకారులతో సంఘాలు ఏర్పాటుచేసి వారికివ్వడం, ప్రతి విభాగంలో, శిక్షణ, పరిశోధన, ప్రచురణ, ప్రదర్శన, ప్రచారం, నిర్ణయాత్మక ఉపవిభాగాలు వుండి, సాంప్రదాయ పద్ధతిలో, ఎక్కడ అవసరమైతే అక్కడ గురుశిష్యపరంపరానుసారంగా కార్యాచరణకు అవకాశం వుండాలి.

కులపతి ఏ రంగంలో కళాకారుడైతే ఆ విభాగానికి అధ్యక్షుడు కూడా. మిగతా విభాగాలకు ఆయా రంగాలలో ఖ్యాతి గడించిన కళాకారుడు అధ్యక్షుడు గాను, ప్రతి విభాగానికి ఒక సంచాలకుని, కావాల్సిన ఉపాధ్యాయ, యితర సిబ్బందిని యివ్వడం జరుగుతుంది. అన్ని విభాగాల సమన్వయం–కులపతి చేస్తాడు.

అన్ని విభాగాల అధ్యక్షులు కళాపీఠానికి నిర్ణయాత్మక మండలి సభ్యులుగా వుంటారు. ప్రభుత్వం తరపున, కార్యదర్శి, సాంస్కృతికశాఖ సంచాలకులు అధికార సభ్యులుగాను, యితర రాష్ట్రాల నుండి నిష్ణాతులైన యిద్దరు కళాకారులను కూడా సభ్యులుగాను తీసుకోవడం జరుగుతుంది. కేంద్ర అకాడమీల తరపున కూడా సభ్యత్వమివ్వడానికి అవకాశం వుంటుంది. చాలామందితో చర్చించి, యీ పథకం తయారుచేయడం జరిగింది.

ముఖ్యమంత్రితో చర్చించినప్పుడు, నార్ల వెంకటేశ్వరరావుగారితోనూ, న్యాయమూర్తి ఆవుల సాంబశివరావుగారితోనూ కూడా చర్చించి రమ్మన్నారు. వారితో చర్చించి వారి సూచనల మేరకు కొన్ని చిన్న చిన్న మార్పులు చేసి ముఖ్యమంత్రి ఆమోదం తీసుకోవడంతో....ప్రణాళిక అమలు చేయడానికి సిద్ధమైంది.

'కళాపీఠం' ఎక్కడ వుండాలన్న చర్చవచ్చినప్పుడు నెక్లెసురోడ్డులో, సచివాలయానికి ప్రక్కన, హుస్సేన్‌సాగరుకు ఎదురుగా (యిప్పటి ఎన్.టీ.ఆర్ సమాధికి ప్రక్కన) వుండాలని నిర్ణయించడం, శంకుస్థాపనకు, కళాపీఠ ఆవిష్కరణకు శ్రీ నీలం సంజీవరెడ్డిగారిని ఆహ్వానించాలని సంకల్పించడం జరిగింది.

అంతకు ముందు ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారు ఆయనతో టెలిఫోనులో మాట్లాడినప్పుడు సంజీవరెడ్డిగారు మొహమాటం లేకుండా చెప్పేశారు. "నేను బయటికి ఏ కార్యక్రమానికీ వెళ్ళటం లేదు-మానేశాను" అని. అయినప్పటికీ "మీరు వెళ్ళి ఆయన్ను ఒప్పించి తీసుకు రావాలి బ్రదర్" అని ముఖ్యమంత్రి నన్ను అనంతపురం పంపారు.

సంజీవరెడ్డిగారితో నాకు కొంత పరిచయం వుంది. తిరుపతిలో దేవస్థానం కార్య నిర్వహణాధికారిగా వున్నప్పుడే చాలాసార్లు వారిని కలవడం జరిగింది. ఆయన అప్పుడు దేశానికే రాష్ట్రపతి. స్వామివారి దర్శనానికి సంవత్సరానికి రెండు సార్లన్నా సతీమణితో కలిసి వచ్చేవారు. నేను టి.టి.డిలో వున్న నాలుగేళ్ళలో ఆరుసార్లు పైగా వచ్చినట్లు జ్ఞాపకం. వచ్చినప్పుడల్లా రెండు మూడు రోజులన్నా వుండేవారు.... ప్రతిసారీ, దేవస్థానం తరపున మేము ఏర్పాటుచేసిన కార్యక్రమాలలో గంటలకొద్దీ గడిపేవారు.

ఢిల్లీలో రాష్ట్రపతి భవనంలో కూడా మేము దేవస్థానం తరపున తయారుచేసిన ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మిగారి బాలాజీ పంచరత్నమాల మొదటి రికార్డు ఆయన చేతులు మీదుగానే విడుదలైంది. ఇలా ఆయనతో చాలాసార్లు కలవడం-కలిసినప్పుడల్లా చాలా సేపు గడపడంతో, కొంత చనువు కూడా వుంది.....

ఆ విషయం ఎన్.టి. రామారావుగారికి కూడా తెలుసు....

"ఏమిటయ్యా, అకాడమీలు రద్దుచేసి, సాంస్కృతిక విభాగాన్నే మూసేసి, విమర్శలకు తట్టుకోలేక, ఏదో చేసి తన 'ఇమేజ్' బాగుచేసుకోవడానికి నన్ను వాడుకుంటున్నాడేమో ముఖ్యమంత్రి

అనిపిస్తోంది. ఈ కళాపీఠం కార్యక్రమం సక్రమంగా అమలుజరుగుతుందన్న నమ్మకం నాకు ఏ కోశానా లేదు. మీ ముఖ్యమంత్రికి హడావుడే తప్ప ఆలోచించి చేస్తున్నట్లు లేరు. జరగని పనిలో నా వేలు పెట్టి, నాపేరు కూడా పేల్చేస్తాడేమోనని అనుమానం. సినిమాల్లో కళాకారుడేకాని, కళలమీద అభిమానం నిజంగా వుందంటావా?ఎందుకో నాకు ఇందులో దిగాలని లేదు....", అన్నారు సంజీవరెడ్డిగారు. నేను ఏమనగలను? ఐఏఎస్ అధికారులమన్న పేరేగాని ఇలాంటి రాయబారాలు చేయటం మాకు ముస్సోరి అకాడమీలో నేర్పరు. రాజకీయ బాస్‌లకి కూడా తను కోరుకున్నది చేసిపెట్టే అధికారి సమర్థుడుగానూ, చేయలేనివాడు అసమర్థుడుగానూ కనుపిస్తారు తప్ప, తమ కోరికలోనున్న ఔచిత్యంతో, సాధ్యాసాధ్యాలతో పనిలేదు. ముఖ్యమంత్రి స్వయంగా ఆహ్వానిస్తే రాని మాజీ రాష్ట్రపతి నేను పిలిస్తే వస్తాడా? అయినా ప్రయత్నం చేయాలి.

"సర్, పరిపాలనా అనుభవం లేకపోవచ్చేమోగాని, ఏదో చేద్దామన్న తహతహ మాత్రం ముఖ్యమంత్రిగారికి వున్నట్లే కన్పిస్తోంది... ఇందిరాగాంధీగారిని వ్యతిరేకించి రాష్ట్రపతి పదవీ గౌరవాన్ని మీరు నిలబెట్టారని ఆయనకు మీపట్ల ఎనలేని గౌరవం....తమరువస్తే బాగుంటుంది... కొంత కళారంగం బాగుపడే సావకాశం వుంటుంది. కళాపీఠం కార్యక్రమం అమలుచేసే పూచీనాది...." అని హామీ ఇచ్చాను. ఆయన మళ్ళీ ఏమనుకున్నారో, సందేహిస్తూనే ఒప్పుకున్నారు. అలా....చాలా ఆర్భాటంగా కళాపీఠానికి 'శంకుస్థాపన' జరిగింది. రాత్రింబవళ్ళు కష్టపడి, గణపతిస్థపతితో వారంరోజులలో తెలుగుతల్లి విగ్రహం మండపంతో సహా శంకుస్థాపనకు తయారుచేయించాం. 'కళాపీఠం' ప్రారంభోత్సవం కాగానే సంజీవరెడ్డిగారిని రాష్ట్రప్రభుత్వం ఘనంగా సన్మానించింది. (ఈ మంటపం ఇప్పటికీ సెక్రటేరియట్‌కి, ఎన్.టి.ఆర్. సమాధికి మధ్యన కనిపిస్తూ వుంటుంది.)

★ ★ ★

'**క**ళాపీఠం' స్పెషల్ ఆఫీసర్‌గా తెలుగు ప్రొఫెసర్ తూమాటి దొణప్పని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈయన ఎన్.టి.రామారావుగారికి సన్నిహితులు. ఆ సాన్నిహిత్యం వల్ల ఆయనకి ఏదైనా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా వెళ్ళాలని వుండేది.

నేను వారిని కలిసి, ముఖ్యమంత్రి వారిని స్పెషలాఫీసర్‌గా నియమించాలనుకుంటున్నారు అన్నప్పుడు ఆయన పెదిమ విరిచారు. "వైస్ ఛాన్సలర్ పోస్టు అంటే గౌరవంగా వుంటుందికాని, ఈ కళాపీఠం ఏమిటి, స్పెషలాఫీసర్ ఏమిటి ప్రసాద్‌గారూ?" అంటూ తన నిరాసక్తత వ్యక్తంచేశారు. నేను వదిలిపెట్టలేదు. ఆయనే రావాలని ముఖ్యమంత్రి కోరుకున్నారు కదా!

"అయ్యా, మామూలు విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధన మాత్రమే వుంటుంది. కాని కళాపీఠంలో కళాపోషణ, కళాకారుల సంక్షేమం, కళల ప్రచారం, ప్రదర్శనలు, నైపుణ్యాంకల కళాకారుల తయారు....వగైరా వగైరా అనేక అంశాల్ని సంప్రదాయబద్ధంగా అమలుచేసే అవకాశం

వుంటుంది. మీరు ఆశించిన విశ్వవిద్యాలయాల్లో సాహిత్యమే ప్రధానంకావచ్చు. కాని, కళాపీఠంలో సాహిత్యం కూడా ఒక విభాగం. అందువల్ల సాహిత్య, కళారంగాల ప్రోత్సాహానికి గతంలో ఎన్నడూ జరగనంతటి ఉధృతంగా కృషిచేసే అవకాశం కళాపీఠంలో మాత్రమే వుంటుంది. రాష్ట్రంలో సాహిత్య కళారంగాల్లో క్రొత్త అధ్యాయాన్ని ఈ 'కళాపీఠం' ద్వారా సృష్టించే అవకాశం మీకు లభిస్తోంది. కాదనకండి...." అంటూ 'కళాపీఠం' వెనకాల లక్ష్యాన్ని, స్ఫూర్తిని వివరించాక, అయిష్టంగా అంగీకరించారు ప్రొఫెసర్ దొణప్పగారు.

సాంస్కృతిక, సమాచార శాఖల కార్యదర్శిపోస్టులో నేను పనిచేసిన ఏణ్ణర్థం కాలం 'కళాపీఠం' రూపు దిద్దుకోటానికి సరిపోయింది. అకస్మాత్తుగా ఒక రోజు అనూహ్యంగా నన్ను ఆ పోస్టునుంచి బదిలీచేశారు. (ఆ కారణాలు వేరు.)

నెలరోజులు తిరగకముందే దొణప్పగారి సిఫార్సు మేరకు ఆ కళాపీఠాన్ని 'తెలుగు విశ్వవిద్యాలయం'గా మారుస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది!

అంతే! సంజీవరెడ్డిగారి సందేహం నా కళ్ళల్లో మెదిలింది.

మౌనంగా కన్నీళ్ళు కార్చాను.

★ ★ ★

ఎన్టీఆర్ - శివతాండవం

1985... శివరాత్రి దాటిన రెండో రోజున...

అసహనంతో ఊగిపోతున్న ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు నన్ను నిలదీశారు.

నేను మాట్లాడదానికి నోరు విప్పే లోపలే ఆయన తన అసహనాన్నంతా నామీద కుమ్మరించారు.

"ప్రభుత్వానికి మీరింత చెడ్డపేరు తీసుకు వస్తారనుకోలేదు. ఏమిటిదంతా?...."

నేను అవాక్కయ్యాను... ఒక్కసారిగా నాలో నరనరానా ఆవేశం, ఆగ్రహం ఉప్పొంగాయి. నేను కూడా విరుచుకుపడాలనిపించింది. కాని, ఆయన ముఖ్యమంత్రి. ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఎన్నుకున్న నాయకుడు ఆయన. ప్రజలు ఏం ఆశించి ఆయన ప్రభుత్వాన్ని కోరుకున్నారో, ఆ ఆశలు నెరవేర్చేందుకు ఆయన ఆదేశాలను అమలు చేయాల్సిన యంత్రాంగంలో నేను ఒక కార్యదర్శి స్థాయి అధికారిని మాత్రమే.

అవును, నేను కార్యదర్శి స్థాయి అధికారిని (సమాచార, సాంస్కృతిక శాఖల కమీషనర్ని) మాత్రమే. అయితే, నేను ఇదంతా ఆయనకి చెప్పేగదా చేశాను. ఆయన కళాపిపాసని దృష్టిలో పెట్టుకునే కదా చేశాను.

ట్యాంక్‌బండ్ మీద విగ్రహాల విషయంలో ఆయన నా సలహా ఎంత మెచ్చుకున్నాడు! శిల్పాలు చెక్కే కళాకారులకి ఉపాధి కల్పించాలనీ, ఇందుకోసం మొట్టమొదట తెలుగుజాతి ఔన్నత్యం అందరికీ తెలిసేలా విగ్రహాలు పెట్టాలనీ అన్నప్పుడు, ఆయన తన మనసులో ఉన్న కొన్ని పేర్లు చెప్పాడు. "ఇలాంటి ప్రముఖులందరి విగ్రహాలు మనం పెట్టాలి బ్రదర్ అన్నారు."

పక్కనున్న వీరాభిమానులు కూడా "అద్భుతం సార్, అలాగే చేయాలి" అన్నారు. అప్పుడు సిఎం నన్ను అడిగారు, "మీరేమంటారు?"

కొంచెం సంకోచిస్తూనే చెప్పాను. "మీరు ఏ విగ్రహం కావాలంటే ఆ విగ్రహం పెట్టచ్చు. కాని ఇది మొత్తం తెలుగు జాతికి సంబంధించిన విషయం కాబట్టి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మేధావుల సూచనలు తీసుకుని చేస్తే, సమగ్రంగా అధ్యయనం చేసి, విగ్రహాలు పెట్టారన్న పేరు మీకు వస్తుంది కదా!"

"ఎవరికి తోచినట్లు వాళ్ళు చెప్తారు బ్రదర్, అవన్నీ పెట్టాల్సి వస్తే....."

"వస్తే రానివ్వండి సర్, వచ్చిన సూచనలన్నీ పరిశీలించడానికి ఒక కమిటీని వేద్దాం. రాష్ట్రస్థాయిలో ఎంపిక చేయదగిన వాటిని తీసుకుంటే ఎన్ని ఎంపికయితే అన్నీ పెడదాం. నలుగురుశిల్పులకి ఉపాధి కల్పించినపేరు కూడా మీకు దక్కుతుంది కదా"

ముఖ్యమంత్రికి నా సలహా నచ్చింది. ఆ ప్రకారం రాష్ట్రం నలుమూలల నుంచీ సూచనలు తీసుకొని, 32 విగ్రహాలు ఏర్పాటు చేశాం. మొదట - ట్యాంక్‌బండ్‌ని వెడల్పుచేసి (లోయర్ ట్యాంక్‌బండ్ మీద ఫ్లైఓవర్ కట్టి) మధ్యలో డివైడర్ ఏర్పాటుచేసి, దానిమీద ఆచివరనుంచి ఈ చివరిదాకా పొడుగ్గా ఈ విగ్రహాలు పెట్టాలనుకున్నాం. అనేక సాంకేతిక కారణాలు అడ్డొచ్చి విగ్రహాలు ఇప్పుడున్న ట్యాంక్‌బండ్ మీదే ఒక ప్రక్కకి జరిగాయి. అయితే విగ్రహాల ఏర్పాటు విషయంలో నలుగురి అభిప్రాయాలూ సేకరించడం వల్ల ఆ జాబితాకి ఒక సమగ్రరూపం వచ్చింది.....

ముఖ్యమంత్రికి మంచిపేరు వచ్చింది. ఆ సలహా ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నన్ను అభినందించారు.

బుద్ధుడి విగ్రహం ఎక్కడ ప్రతిష్ఠించాలీ అన్న విషయంలో మాత్రం నా సలహా ముఖ్యమంత్రికి నచ్చలేదు. నాగార్జున సాగర్‌లో ఏర్పాటు కావలసిన బుద్ధపూర్ణిమ ప్రాజెక్టులో భాగంగా బుద్ధ విగ్రహం ఏర్పాటు చేయాలన్నది ప్రతిపాదన. అయితే సాగర్‌కి ఎంతమంది వచ్చిచూస్తారు బుద్ధవిగ్రహాన్ని?..... ఇలా సుదీర్ఘంగా చర్చించాం. చివరికి ఆ విగ్రహం ఏర్పాటేదో హుస్సేన్‌సాగర్‌లో చేస్తే ఎక్కువమంది దేశ విదేశీయులు చూస్తారు గదా అనుకున్నాం. అప్పుడు నేను సూచించిన స్థలం సంజీవయ్యపార్కుకి ఆగ్నేయంగా హుస్సేన్‌సాగర్ జలాల అంచున ఒక ద్వీపకల్పంలా ఉండే పార్కుమూలమీద వేదిక ఏర్పాటు చేస్తే, విగ్రహాన్ని అక్కడికి తరలించడం ప్రతిష్ఠించడం సులభం అన్నది నా ఆలోచన.... కాని హుస్సేన్‌సాగర్ మధ్యలో ఉన్న జిబ్రాల్టర్ రాక్ మీద పెడితే ఆకర్షణ పెరుగుతుందని ఆయన ఆలోచన. అలా చేయటం వల్ల ఖర్చు విపరీతంగా పెరుగుతుంది. శిల్పాలు చెక్కే కళాకారులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఆరంభించి, చివరికి వాళ్ళకిచ్చే పారితోషికం కన్నా ఎక్కువ డబ్బు విగ్రహం రవాణా మీద ఖర్చుపెట్టడం ఏం సమంజసం? ఏమైనా "Boss is right"

ఆ బాధ్యత కూడా నాకే అప్పగించారు. "మంచి శిల్పుల్ని ఎంపిక చేసి...48 అడుగుల విగ్రహం తయారు చేయించే బాధ్యత మీరే తీసుకోవాలి. ఈ భారం పూర్తిగా మీమీదే పెడుతున్నాం...." అదీ ఆయన వ్యక్తం చేసిన విశ్వాసం.

చాలాచోట్ల పరిశీలించి, చివరికి నల్గొండ జిల్లాలో యాదగిరిగుట్ట దారిలో రోడ్డు దగ్గరగా వున్న రాతిని దేవాదాయశాఖ స్థపతులు ఎంపిక చేశారు. అప్పుడు నేను వెళ్ళి చూసి, వాళ్ళకు కావలసిన ఏర్పాట్లు చేశాను. అది చాలా పెద్దపని. (మేం ఇచ్చిన ఆకారంలో బుద్ధ విగ్రహానికి మౌలిక రూపం వచ్చేలా చెక్కేదాకా నేను కమీషనర్ గా ఉన్నాను.)

"భేష్ ప్రసాద్‌గారూ! గుడ్ ప్రోగ్రెస్. మేం అనుకున్న విధంగా చేయిస్తున్నారు. మా కాంప్లిమెంట్స్..." ఇది ఆరోజు నాతో ముఖ్యమంత్రి తన ఆనందం పంచుకున్న తీరు.

కాని ఇవ్వాళ... ఆగ్రహంతో ఉన్నారు.

నా మనసుకి తెలుసు నేను తప్పు చేయలేదు.

అసలేం జరిగిందంటే....

* * *

"సర్, ఇదొక అపూర్వమైన కార్యక్రమం. 'ఆంధ్రనాట్యం' గా పిలవబడే పేరిణి శివతాండవ నృత్యాన్ని వరంగల్లు జిల్లాలోని రామప్పగుడి దగ్గర ఈ శివరాత్రికి ప్రదర్శించే ఏర్పాటు చేస్తున్నాం. ప్రముఖ నాట్యాచార్యుడు నటరాజ రామకృష్ణగారి శిష్య బృందం ఈ నాట్యాన్ని ప్రదర్శిస్తారు. ఒకేసారి వందమంది కలిసి చేయగల అపురూపమైన నృత్య సన్నివేశం ఇది. దీనికి మీరు వస్తున్నారంటే విశేష ప్రచారం లభిస్తుంది. ఈ నాట్యం ఏ రామప్పగుడి దగ్గర నుంచి ప్రాచుర్యంలోకి వచ్చిందో అక్కడే దీన్ని పునరుద్ధరించిన వాళ్ళవుతారు. మీరు తప్పకుండా రావాలి..." ఇది ముఖ్యమంత్రి రామారావుగారికి నా ఆహ్వానం.

ముఖ్యమంత్రి చాలా ఆసక్తిగా పేరిణీశివతాండవం గురించి అడిగి తెలుసుకున్నారు. దాని పుట్టు పూర్వోత్తరాలు, రాజుల కాలంలో లభించిన పోషణ, ప్రోత్సాహం... అన్నీ విన్నాక, రామప్పగుడి గురించి అడిగారు.

"రామప్పగుడి వరంగల్లు పట్టణానికి 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ ప్రస్తుతం పూజా పునస్కారాలేమీ జరగటంలేదు. కాని ఆ ఆలయం శైవ ఆగమానికి చెందినది. పైగా ఆ ఆలయ శిల్పకళా సంపద చాలా అపురూపమైనది. చుట్టూ పెద్ద సరస్సు, చెట్లు చేమలు... అందుకని వేదిక నేపథ్యంలో రామప్పగుడి ఉండేలా ఏర్పాటు చేస్తున్నాం. శైవ ఆగమానికి చెందిన ఆలయం కనుక శివరాత్రి నాడు...."

ఉత్సాహంగా వింటూ వచ్చిన ముఖ్యమంత్రి, రామప్పగుడి వరంగల్లుకి 70 కిలోమీటర్ల దూరంలో ఉందనేసరికి పెదవి విరిచేశారు.

"అంతలోపలికి వచ్చి వెళ్ళడమంటే చాలా సమయం పోతుంది. పైగా అలాంటి అటవీ ప్రాంతంలోకి వెళ్ళటానికి ఇంటెలిజెన్స్ వర్గాలు ఏమంటాయో చూడాలి. అయినా జనం వస్తారా అంతలోపలికి? చూద్దాం బ్రదర్!" అంటూ అక్కడితో ముగించారు.

నేను మాత్రం ముఖ్యమంత్రి వస్తే ఎలా వుండాలి- అని ఆలోచించి ఆ స్థాయిలో ఏర్పాట్లకు ఉపక్రమించాను. అంటే, కనీసం ఒక లక్ష మందికి ఏర్పాట్లు చేయాలి!

ఈ ఆలోచనే నాకు సమస్య తెచ్చి పెట్టింది. వరంగల్లు జిల్లా కలెక్టరు, పోలీసు సూపరింటెండెంటూ నవ్వారు. "ఏమిటి సర్, మీ ఆశ? ఇక్కడికి ఏ శివరాత్రి నాడు కూడా 3-4

వేల కన్నా జనం రారు. లక్షమంది ఎక్కడ్నుంచి వస్తారు? పైగా ఈ గుళ్ళో ఎప్పుడూ పూజలూ, ఉత్సవాలూ జరిగిన దాఖలాలే లేవు. ఎందుకొస్తారు...." వాళ్ళు వాదిస్తున్నారు.

"ఎందుకు రాకూడదు? ప్రచారం చేస్తున్నాం గదా. ఆదిలాబాద్ నుంచి ఆమురాల వలసదాకా ప్రచారం చేస్తున్నాం ఇదొక అపురూప కార్యక్రమం అని. రామప్పగుడినీ, గుడితోపాటు ఈ శివతాండవాన్ని శివరాత్రి నాడు చూసి తరిస్తామని జనం అనుకోవచ్చుగదా! మీరు చెప్పినట్లు అయిదువేలే వస్తే నష్టంలేదు. నేను ఆశించినట్లు లక్షమంది వస్తే ఏం చేస్తాం? అప్పటికప్పుడు ఏం ఏర్పాట్లు చేయగలం? పైగా ఇక్కడికి రావడానికి పోవడానికి నాలుగైదు కిలోమీటర్ల దూరం ఒకే రోడ్డు. జనం వస్తే....?" ఇది నా వాదన.

యాభైవేల నుంచి లక్షదాకా వస్తారని నా ఆశ. ఎందుకంటే ప్రచారం అంతపెద్ద యెత్తున చేస్తున్నాం.... స్థానికంగా మేం ఏర్పాటుచేసిన ఆహ్వాన సంఘం సారథి ఛార్టర్డ్ అకౌంటెంట్ మాధవరావుగారు మాత్రం నా వాదనతో ఏకీభవించారు. అలా ఆహ్వానసంఘం నైతిక మద్దతుకూడా నాకు లభించింది....

"కాకతీయుల కాలంలో నిత్యధూప దీప నైవేద్యాలతో వెలిగిన అపురూప శిల్పకళా నిలయమైన రామప్పగుడి ముంగిట్లో ఈ శివరాత్రి నాడు అతి పురాతన పేరిణి శివతాండవం చూసి తరించండి.. ఒకేసారిగా వందమంది కళాకారులచే కాగడాల వెలుగులో ఆంధ్రనాట్యం ఒక అపూర్వ సన్నివేశం..." ఇలా సాగుతోంది మా ప్రచారం.

ఏమైనా జిల్లా అధికారుల్ని ఒప్పించటానికి నేను చాలా ప్రయాసపడాల్సి వచ్చింది. వాళ్ళు లోలోపల ఏం నవ్వుకున్నా, అతికష్టంమీద ఒక లక్ష మందికి ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లు అంటే - ఆ స్థలాన్ని శుభ్రం చేయాలి, అప్రోచ్ రోడ్డు ఎక్కడన్నా దెబ్బతిని ఉంటే బాగు చేయాలి. త్రాగునీటి ఏర్పాటు చేయాలి. అప్రోచ్ రోడ్డులో లైట్లు ఉండాలి. శానిటరీ ఏర్పాట్లు వగైరా చేయాలి... వేదిక మాత్రం అద్భుతంగా వచ్చింది. వెనకాల రామప్పగుడి నేపథ్యంతో అందంగా విశాలంగా తయారైంది. కాకతీయుల కాలం తలపుకొచ్చేలా వెయ్యి కాగడాల వెలుగులో నాట్యం జరిగేలా ఏర్పాటు చేశాం.... కార్యక్రమానికి తగిన విధంగా ఆ సభ ఆవరణ అంతా ఆధునిక మైక్ సిస్టమ్ ఏర్పాటు చేశాం. ఏ మూలనుంచైనా అద్భుతంగా వినిపించేలా, కనుపించేలా, స్టేజిని మైక్ సిస్టమ్‌ని అమర్చాం. కాని...?

శివరాత్రి ఉదయానికి అక్కడ ఎవరూ లేరు మేం తప్ప...

పదిగంటలయింది. ఇంకా జనం వచ్చే సూచనలు కనబడటంలేదు... నా క్కూడా సందేహం కలుగుతోంది. "నా అంచనా తప్పిందా?"

అయితే ఏంటి, ఓ వెయ్యిమంది ఉంటే చాలు కార్యక్రమం జరగటానికి అనుకున్నాను. పైగా మేం అనుకున్న కార్యక్రమం రాత్రి 10 గంటల వరకే. అప్పటిదాకా ఉంటే చాలు ఓ వెయ్యిమంది అని సర్దుకున్నాను. క్షణాలు గడుస్తున్నకొద్దీ నాలో ఆత్రుత పెరిగిపోతోంది...!

... మధ్యాహ్నం రెండు దాటేసరికి గెస్టుహౌస్‌కి కబురు వచ్చింది. ఉండుండొకటీ అరా లారీలో జనం వస్తున్నారు. నాకు ధైర్యం వచ్చింది. ఊపిరిపీల్చుకున్నాను. "ఫరవాలేదు, నాలుగైదు వేలమంది చేరతారు సాయంత్రానికి అనుకున్నాను".

ఉత్సాహంగా తయారై రామకృష్ణగారితో కలిసి నాలుగింటికల్లా రామప్పగుడి కొచ్చేశాను. దారంతా నాట్యం గొప్పదనం గురించి నటరాజ రామకృష్ణ గారు నాకు చెబుతూనే వున్నారు. ఇంత గొప్ప కార్యక్రమానికి నాలుగైదు వేలమంది ఉన్నా చాలు గదా అని నేను ఊరడిస్తున్నాను... (నన్ను నేను ఊరడించుకుంటున్నాను.)

రామప్పగుడి కొచ్చాం. చూస్తే... గ్రౌండ్‌లో వేలకొద్దీ జనం.!!!

ఒక్కసారిగా మాలో ఉత్సాహం పరవళ్ళు తొక్కింది. రామకృష్ణగారు మహా ఉత్సాహంగా మేకప్ అవుతున్న శిష్యుల్ని ప్రోత్సహించటంలో, నేను ఇతర ఏర్పాట్లు చేయడంలో మునిగి పోయాం.... చీకటిపడే వేళకి కాకతీయ వైభవాన్ని గుర్తుకు తెస్తూ రామప్పగుడి సభాప్రాంగణం, వేదిక ఒక్కసారిగా కాగడాల వెలుగులతో నిండిపోయాయి.

అంతే! నాట్యకళాకారులంతా వేదికపై తమ గజ్జల్ని ఘల్లు ఘల్లు మనిపించారు. ఒకేసారి వందమంది కళాకారులు - ఒకేవేదికపై ఘల్లు ఘల్లున నర్తిస్తుంటే, మైకులు మారు మ్రోగిపోయాయి.

శివుడే కైలాసం నుంచి దిగివచ్చి ఆవహించాడా అన్నంత ఉద్వేగభరితంగా నాట్యం ఊపందుకుంది.

తాండవం, పేరిణీ శివతాండవంతో ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తేలా కళాకారులు నర్తిస్తుంటే, అధికారులు సయితం గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాం...

మధ్యమధ్యలో పోలీసు ఇనస్పెక్టరు వచ్చి ఎస్.పి. చెవిలో ఏదో చెప్పి వెళ్తున్నాడు. తెలుసుకోవాలని ఉన్నా, నేను అడిగే మూడ్‌లో లేను. "ఈ నాట్యం మనం ప్రచారం చేసిన స్థాయిలో ఉందా లేదా, లేకపోతే అభాసుపాలవుతామేమో" అన్న దృష్టితో తదేకంగా స్టేజీ వైపే చూస్తున్నాను... రాత్రి ఎనిమిదయింది.... తొమ్మిదయింది... పదయ్యేసరికి ఎస్.పి. నాదగ్గరికి వచ్చాడు. ఆయన మొహంలో ఏదో ఇబ్బందిని గమనించాను.

నన్ను ప్రక్కకి పిలిచి చెవిలో చెప్పాడు: "సర్, జనం ఇంకా వస్తూన్నారు. లారీలు, కార్లు, దూరంగా ఆపేస్తున్నాం. అయినా దిగి నడిచి వచ్చేస్తున్నారు....."

"రానివ్వండి మంచిదేగా, జనం రావాలనే గదా మనం కోరుకున్నదీనూ...."

"అదికాదు సర్, గ్రౌండ్ నిండిపోయింది. అంచనాకి మించి వచ్చేస్తున్నారు. ఇప్పటికే లక్షదాటి పోయారు. ఇంకా వస్తూనే ఉన్నారు. ఎన్ని లక్షలు వస్తారో తెలీదు. ఉన్నది ఒక్కటే అప్రోచ్ రోడ్డు. ఇప్పుడు నిర్ణీత కార్యక్రమం ప్రకారం 10.30కల్లా మీరు కార్యక్రమం ముగించేస్తే ఇక్కడున్న వాళ్ళు తిరిగి వెళ్ళాలన్నా వెళ్ళలేనంతగా జనం ఎక్కడెక్కడ్నుంచో వచ్చేస్తున్నారు. రోడ్డు మీద

ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఈ చీకట్లో ట్రాఫిక్‌ని కంట్రోల్ చేయడం అసాధ్యం. ఏం జరుగుతుందో తెలీదు...." ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. నాకూ పరిస్థితి తీవ్రత అప్పుడే అర్థమైంది. ఎస్.పి ఎందుకు ఆచి తూచి సంకోచిస్తూ మాట్లాడుతున్నాడో కూడా అర్థమైంది. వాళ్ళ అంచనా తారుమారయింది. ఇప్పుడు నేను ఎవర్ని నిందించినా ఏం ప్రయోజనం?

వాళ్ళకేం కావాలి- ఈ జనం తెల్లవారేలోపల ఇక్కడ్నుంచి వెళ్ళకుండా ఉంటే, వచ్చే వాళ్ళు వస్తూంటారు. అప్రోచ్ రోడ్డు మీద ట్రాఫిక్ స్తంభించడం, త్రొక్కిసలాట, దొంగతనాలు వంటి గందరగోళం ఉండదు. అంటే తెల్లవారేదాకా ఈ ఆనాన్ని ఇక్కడే కూర్చోపెట్టేయాలి. అదే ఎస్.పి నన్ను అడుగుతున్నది కూడా.

"అదేనా మీక్కావలసింది" ఎస్.పిని అడిగేశాను.

అతను సిగ్గుతో సంకోచిస్తూనే తల ఊపాడు. అతని చూపులో అభ్యర్థన, ఆత్రుత కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. 10.30కి కార్యక్రమం ముగిస్తే రాగల దుష్పరిణామం గురించి అతను ఆందోళన చెందుతున్నాడు. ఈ ఆందోళన జిల్లా కలెక్టరుకీ ఉంటుంది. కాని ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతలు ఎస్.పి బాధ్యత.

వాళ్ళు ఏం కోరుకుంటున్నారూ అన్నదానికన్నా, ఈ రాత్రి 10.30కే ఆంధ్రనాట్యం ముగిస్తే వచ్చే పరిణామాలకి నైతిక బాధ్యత నాక్కూడా ఉంటుంది. ఏం చెయ్యాలి? 'ఆంధ్రప్రభ' సంపాదకులు పొత్తూరి వేంకటేశ్వరరావుగారు నాప్రక్కనే వున్నారు. కాని నా ఆందోళన ఆయనకి తెలియటం నాకిష్టంలేదు.

బాగా ఆలోచించి, నటరాజరామకృష్ణగారిని పక్కకి పిలిచాను. మెల్లగా పరిస్థితి వివరించాను. "మీరు ఎలాగైనా సరే ఈ కార్యక్రమం – ఈ పేరిణి శివతాండవం తెల్లవారేదాకా నడిపించాలి. కాకతీయులకాలంలో సైనికులని ఉత్తేజ పరిచే నృత్యం అని చెప్పారు కదా. ఆ శక్తే ఇప్పుడు చూపిద్దాం. శివరాత్రి జాగరణ చేశాం అన్న సంతృప్తితో నాలుగ్గంటలకే జనం లేవడం మొదలుపెడతారు. కాస్త వెలుతురు రాగానే ముగించేద్దాం..." చెప్పడం ఎంత సులభం!

రామకృష్ణగారి మొహంలో రంగులు మారుతున్నాయి. అయినా నేను వదల్లేదు. నా సహజధోరణిలో చెప్పుకుంటూ పోయాను....

"ఏం లేదు, రామకృష్ణగారూ, కొంతమందికి రిలీఫ్ ఇవ్వండి, నలుగురైగురితో ఒక అయిటమ్ చేయించండి. వాళ్ళకి రిలీఫ్ ఇచ్చి, మళ్ళా ఓ పదిమంది... ఇలా వాళ్ళకి నచ్చింది చేసేస్తుంటే సరి, మధ్య మధ్యలో భక్తి గానం....లాగించేద్దాం. నో ప్రాబ్లమ్. మీరు చేసేయగలరు. కొంచెం గట్టిగా అనుకుంటే చాలు...."

నాకు తెలుసు, నేను ఒక ప్రముఖ నాట్యాచార్యుడ్ని మొహమాట పెట్టేస్తున్నాను. నిజానికి ఇబ్బందిపెట్టేస్తున్నాను. నాలుగు గంటలపాటు నృత్యం చేసి, అలసిపోయిన వారి శిష్యులచేత

ఇంకో ఆరుగంటల కార్యక్రమం జరిపించమంటున్నాను. ఇది ఆయనకి ఎంత కష్టమో నాకూ తెలుస్తూనే ఉంది. కాని, అంచనాల విషయంలో అధికారులు చేసిన పొరబాటుకి ఎవరో ఒకరు బాధ్యత తీసుకొని సరిచేయకపోతే రాగల దుష్పరిణామం....! ఊహించలేం.

అతి కష్టంమీద రామకృష్ణగార్ని ఒప్పించగలిగాను. నిజం చెప్పాలంటే, ఆయనే మా సమస్యని అర్థం చేసుకుని సహకరించటానికి అంగీకరించారు. "కార్యక్రమం జరిగిపోయింది– నిరాటంకంగా, హమ్మయ్య" అని ఊపిరిపీల్చుకునే లోపల – నేను మొదట్లో భయపడిందే జరిగిపోయింది!

పదిన్నర దాటాక్కూడా కార్యక్రమం కొనసాగింది. దాంతోపాటు లారీల్లో, కారుల్లో, బళ్ళమీద జనం రావడం కూడా కొనసాగింది. అర్థరాత్రి దాటే దాకా జనం వస్తూనే ఉన్నారు... పదులు, వేలు, లక్షలు.... ఎన్ని లక్షలో ఎవరూ లెక్కవేయలేనంతగా జనం విరగబడి వచ్చారు. శివరాత్రి నాడు పేరిణీ శివతాండవాన్ని రామప్పగుడి ముంగిట చూడాలన్న ఆరాటంతో వచ్చారు.

లక్షమంది కోసం ఏర్పాటు చేసిన స్థలంలోకి లక్షల్లో జనం వస్తే....!!

తెల్లవారేసరికి బయటికి వచ్చిన వార్త: "రామప్పగుడి దగ్గర సాంస్కృతిక కార్యక్రమంలో జనం త్రొక్కిసలాట... తోపులాట... చెప్పులు పోగొట్టుకొన్న వాళ్ళు, కలిసివచ్చి విడిపోయిన వాళ్ళు వెతుకులాట.... గందరగోళం...."

మా అధికారులకి నా మొదటి ప్రశ్న: "ప్రాణ నష్టం ఉందా? ఎవరికన్నా గాయాలు తగిలాయా? పిల్లలెవరైనా తప్పిపోయారా?..."

"అలాంటివేమీ జరగలేదు సర్, కానీ త్రోపులాట, త్రొక్కిసలాట, ఏడుపులు, పెడబొబ్బలు, జనం తిరిగివెళ్ళేటప్పుడు ట్రాఫిక్ రద్దీతో రోడ్డు నిండిపోవటం..."

నాకు ఇంకేమీ వినబడలేదు. ఎవరికీ ప్రాణాపాయం జరగకుండా శివరాత్రి గడిచింది. "అమ్మయ్య" అని నిట్టూర్చాను.

కాని....

* * *

మర్నాడు పత్రికలలో వచ్చిన ఇదే వార్తని ముఖ్యమంత్రి గారికి మరింత చిలవలు, పలవలు కల్పించి చెప్పేవాళ్ళు చెప్పాక ఆయన నన్ను పిలిచి అసహనంగా "ప్రభుత్వానికిలా చెడ్డపేరు తీసుకువస్తారనుకోలేదు..." అని వ్యాఖ్యానించినప్పుడు మాత్రం కాస్సేపు మాట్లాడలేకపోయాను.

తమాయించుకున్నాను.

ఆయన అడగాల్సింది అడిగాక, ఆయన ఆవేశం చల్లారాక నేను మొదలుపెట్టాను.

"మిమ్మల్ని ఆహ్వానించాను. మీరు అంతలోపలికి జనం ఎక్కడ వస్తారయ్యా అన్నారు. మీరు రావడం లేదనేసరికి స్థానిక అధికారులు కూడా అదే చెప్పారు. ..." ఇలా మొదలుపెట్టి

జరిగిందంతా వివరించాను. వీలైనంత వరకూ ఏ ఒక్క అధికారినో బాధ్యుడిగా చూపించకుండా జాగ్రత్త పడ్డాను. నిజానికి, జిల్లా అధికారుల అతివిశ్వాసాన్ని, అలసత్వాన్ని బయట పెట్టి నన్ను నేను కాపాడుకోవడం సులభం. కాని అలా చేసినందువల్ల నా సామర్థ్యానికి గుర్తింపు వస్తుందా? నాకు ప్రశంసలు లభిస్తాయా?

ముఖ్యమంత్రి రామారావుగారి మొహంలో క్రమంగా ప్రసన్నత చోటు చేసుకుంది.

నేను కొనసాగించాను. "సర్, మనం ప్రత్యేకంగా బస్సులు, రైళ్ళూ నడపలేదు. అయినా జనం ఎక్కడెక్కడ్నుంచో వచ్చారు. శ్రీకాకుళం నుంచి కూడా వచ్చారు. శివరాత్రి నాడు పేరిణీ శివతాండవం చూడాలన్న వాళ్ళ ఉత్సుకతని బట్టి తెలుస్తోంది కదా ప్రజల్లో ఉన్న ఆధ్యాత్మిక భావన, కళారాధన! మీరు కోరుకునేదీ ఇలాంటి మంచి భావాలు ప్రజల్లో వృద్ధిచెందాలనే గదా!...." ఇలా సాగింది నా సంజాయిషీ.

"నిజమే ప్రసాద్‌గారూ! ప్రజలు వాళ్ళంతట వాళ్ళు ఇంత పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి వచ్చారంటే మాకే విచిత్రంగా ఉంది. ఇలా వస్తారని అనుకుని ఉంటే మేం తప్పకుండా వచ్చి ఉండేవాళ్ళం...."

"మీరు నిజంగా వచ్చి ఉంటే ఇప్పుడు చేసిన ఏర్పాట్లకి మహాబీభత్సమే జరిగిపోయి ఉండేది. రాకుండా మంచిపని చేశారు సర్" అనేశాను. అని వూరుకోలేదు. "భవిష్యత్‌లో ఇంకెప్పుడూ ఇలా జరగకుండా, జాగ్రత్తపడతాం సర్" అని కూడా వినమ్రంగా అన్నాను.

"మంచిది, భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమం ఏది ఏర్పాటు చేసినా తప్పకుండా వస్తాం..." అన్నారు ముఖ్యమంత్రి.

"ఇంకానా...!!!! " ఆ మాట మాత్రం పైకి అనలేదు.

★ ★ ★

'మంత్రాలయ మఠం'లో - కాశ్మీర్ అబ్దుల్లా

"ప్రసాద్‌గారూ... ఒక మంచి శాలువా, ధగధగమెరిసిపోతే చెమ్కీలతో, మంచి ఎరుపురంగు ఖరీదైన శాలువా... టివి, వీడియోల్లో, ఫొటోల్లో బ్రహ్మాండంగా కనపడేట్టుండాలి... ఫరూక్ అబ్దుల్లాగారికి వేయడం కోసం... వెంటనే పదినిమిషాల్లో ... ఏర్పాటు చేయగలరా?"

అడిగింది ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారు. వేదిక లాల్‌బహదూర్ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బ్రహ్మాండమైన వేదిక... లక్షలాది జనం... దేశం నలుమూలలనుంచి వచ్చిన నాయకులు. రామారావుగారి కోరిక చిన్నదే. వచ్చిన చిక్కల్లా - పదినిమిషాల్లో అటువంటి శాలువ తెప్పించాలి. రాత్రి పదిదాటింది. షాపులకు వెళ్ళే టైం లేదు. వెళ్ళినా షాపులుండవు. ఇతర నాయకులకు వేయగా మిగిలిన చాలా మంచి శాలువలు ఇంకా మూడో నాలుగో వున్నా, రామారావుగారికి అవి నచ్చలేదు. శాలువ గురించి అడిగినప్పుడు ఆయన కొంచెం సంకోచిస్తూనే, ఇబ్బంది పడుతూనే అడిగారు.

ఇది నాకు మరో పరీక్ష. రామారావుగారితో పరీక్షలు కొత్తకాదు.

గతంలో కూడా ఇలాగే...

* * *

"తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వంగా ఒక సంవత్సరం పూర్తిచేసిన సందర్భంగా తెలుగుదేశం మహానాడు, కార్యక్రమం బ్రహ్మాండంగా జరగాలి.... లక్షలలో ప్రజలొస్తారు - కాంగ్రెసేతర పార్టీలన్నీ దేశ వ్యాప్తంగా వారివారి నాయకులను పంపుతారు ... ప్రభుత్వం తరఫున బ్రహ్మాండంగా కార్యక్రమం జరిపే బాధ్యత మీదే ప్రసాదుగారూ" అని ముఖ్యమంత్రి అన్నప్పుడు చాలా యిబ్బందే అనిపించింది. సమాచార, సాంస్కృతిక విభాగంతో పనికాదు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు కలిసి పనిచేయాల్సిన అవసరం వుంది. అంతకుముందు, యింత పెద్ద ఎత్తున కాకపోయినా, నంది బహుమతుల ఉత్సవం చేయాల్సి వచ్చినప్పుడు మొదటిసారిగా బాధ్యత నాకే యిచ్చారు. నేనే సమాచార శాఖకు కమీషనరు, కార్యదర్శిని. అలానే సాంస్కృతికశాఖకు నేనే కార్యదర్శిని, కమీషనరునూ. అదీకాక నేనే రాష్ట్రచలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థకు అధ్యక్షుడిని, మేనేజింగు డైరెక్టరును కూడా. ఏ రవీంద్రభారతిలోనో సాధారణంగా జరిగే ఈ కార్యక్రమాన్ని తాను సినీరంగం నుండి వచ్చాడు కనుక, నట రత్న కనుక, తన హయాంలోని మొదటి సినీ బహుమతుల మహాసభ బ్రహ్మాండంగా జరగాలనీ, లాల్‌బహదూర్ స్టేడియంలో - లక్షల ప్రజల సమక్షంలో జరగాలని రామారావుగారి కోరిక.

అలాంటి సినిమా ఆకర్షణ వున్న కార్యక్రమానికి జనం రావడానికి అంత యిబ్బంది వుండదు. చాలామంది నటీనటుల్ని, సినిమా ప్రముఖులను చూడడానికి తండోపతండాలుగా జనం వస్తారు. దీంతోపాటు, సినీనటులతో మంచి కార్యక్రమాలు, ప్రథమ బహుమతి అందుకుంటున్న చిత్రాన్ని చూపెడతాం కనుక ప్రేక్షక లోపం వుండదు.

కాని, రామారావుగారి ప్రభుత్వం - మొదటి సంవత్సరం పూర్తి చేసుకొంటున్న సందర్భంగా అధికారికంగా సభ జరిపితే జనం ఎంతమంది వస్తారు? - లక్షల్లో వస్తే గాని స్టేడియం నిండినట్లు కనపడదు... వస్తే అంతమంది వస్తారా? పార్టీ సభ అయితే పార్టీ నాయకులు జనాన్ని తెచ్చుకుంటారు. అధికారసభకు తెస్తారా? ఇవన్నీ ప్రశ్నలే. యాథాలాపంగా ముఖ్యమంత్రితో జనం మాట ఎత్తితే - నా వైపు సాలోచనగా చూసి, కనుబొమ్మలు పైకెత్తి, కొంచెం నిష్ఠూరంగా "ఏం ప్రసాదుగారూ, ప్రజలలో మా ఆకర్షణమీద మీకు అపనమ్మకమా? మా పాపులారిటీ యింకా పోలేదు..." అనేశారు.

నేను ఆయనతో ఎట్లా చెప్పను? నా ఉద్దేశ్యం అది కాదు. కాని, ఈ విషయం చర్చకి వచ్చినపుడు పార్టీలోని సీనియర్ నాయకులు - చంద్రబాబునాయుడు, హరిరామ జోగయ్య ఉపేంద్ర, దగ్గుబాటి వెంకటేశ్వరరావు మొదలైన వారి వుద్దేశ్యం అదే. జనం రారని కాదు పెద్ద ఎత్తున అంటే లక్షల్లో రాకపోతే, పార్టీకి, నాయకునికి ఆదరణ తగ్గిందనుకుంటారేమో, ఎందుకైనా మంచిది, ప్రభుత్వపరంగా ఫంక్షను కాబట్టి, పట్టించుకోకుండా వదిలేయకూడదనివారి ఉద్దేశ్యం. ఎన్నికలలో గెలిచి, ప్రమాణస్వీకారం చేస్తున్నప్పటి వేడి రాజకీయాలు ఇప్పుడు లేవు కదా! పోనీ, చాలామంది సినీప్రముఖులు - నాయకులు, నాయకీమణులు వస్తున్నారా అంటే అదీ లేదు. ముఖ్యమంత్రి అయ్యాక రామారావు గారు ప్రజలలో తిరగటం, మీటింగులకు వెళ్ళడం - కొంచెం ఎక్కువ కాబట్టి ఆయన్ని చూడాలన్న మోజు జనంలో అంతగా వుండకపోవచ్చు.

... నేను నానుస్తూనే... "మంచి మంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం... ప్రజలు బాగానే రావచ్చు..." అన్నారు.

"ప్రజల గురించి మీకు ఆందోళన వద్దు ప్రసాదుగారు... మమ్మల్ని చూడ్డానికి తండోప తండాలుగా వస్తారు మీ ఏర్పాట్లు మీరు చూడండి" అన్నారు ముఖ్యమంత్రి.

సరేనని వూరుకున్నాను.

మరుసటి రోజుకల్లా, ఏమైందో ఏమో పార్టీ సీనియరు నాయకులను పిలిచి... "మనం ప్రభుత్వంలోకి వచ్చి సంవత్సరమైన సందర్భంగా, ప్రజాసంక్షేమానికి పునరంకితం కావాలి... జిల్లాల నుంచి కార్యకర్తలను తరలి రమ్మని వర్తమానం పంపండి. ప్రతిజిల్లా నుంచి వెయ్యి, రెండు వేలకు తక్కువ కాకుండా కార్యకర్తలు రావాలి" అని సిఎం ఆదేశాలు ఇచ్చారు.

ఆ సభ అలా గడిచి పోయింది.

ఇలా లాల్‌బహదూర్ స్టేడియంలో ఒకటిన్నర సంవత్సరంలో అటువంటి బృహత్తర సభలు అరింటిని నిర్వహించాల్సి వచ్చింది. అన్ని సభలకు సమన్వయకర్తగా నేనే వ్యవహరించాల్సి రావడంతో... ఒక రకంగా యిబ్బంది, ఒకరకంగా ప్రభుత్వంలో పలుకుబడి పెరగడం. అటువంటి సభ ఏర్పాటు చేయాలంటే, చాలా శాఖలతో సమన్వయం చేయాల్సిన అవసరం వుంది, క్రీడాశాఖతో ప్రాంగణం విషయాలు, రోడ్ల భవనాల శాఖతో మీటింగుకు కావల్సిన సదుపాయాలు, రోడ్ల భవనాల శాఖతో షూటింగుకు కావల్సిన సదుపాయాలు, విద్యుత్ వుద్యానవనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మీడియా, అన్ని అభివృద్ధి కార్యక్రమాలను గురించి విషయసేకరణ... ఇలా అన్ని శాఖాధికారులతోనూ, అందరు రాజకీయనాయకులతోనూ - ఎన్నో విషయాలలో సమన్వయం చేయాల్సిన బాధ్యత మనదే కాబట్టి అరడజనుసార్లు చేసేప్పటికి, అందరితో పరిచయాలు బాగా పెరిగాయి.

ఈ సభ ముఖ్యమంత్రికి చాలా కీలకమైన, చాలా కావల్సినది కనుక, ఆయన తరపున చేస్తున్నాం కనుక, అధికారానికి కొదవ లేదు.

నేను అప్పటికే నలుగురైదుగురు ముఖ్యమంత్రులతో (పి.వి.గారు - వెంగళరావుగారు, చెన్నారెడ్డి గారు, అంజయ్యగారు, భవనం వెంకట్రామ్‌గారు, పనిచేసి వున్నాను. కాని వారి వైఖరికి, ఎన్‌టిఆర్. వైఖరికి ఎంతో తేడా వుంది. వారందరికీ రాజకీయ అధికారిక నిర్ణయాలు తీసుకునేటప్పుడు ప్రజలపై వాటి ప్రభావం గురించి ఆలోచన ముఖ్యంగా వుండేది... కాని ఎన్‌టిఆర్‌కి వాటిపై ఎంత ధ్యాసో అంతకంటే ఎక్కువ తన యిమేజి, దాని పరిరక్షణ మీద వుండేది...

ప్రజాసందోహం వుండే ఏ సభలోనైనా, ఆయన ప్రసంగం చేయాలంటే, దానికి కావల్సినంత ముందుగా కసరత్తు చేయాలి. ప్రసంగంలో ఏ విషయాలు ప్రస్తావించాలి. ఎలా ప్రస్తావించాలీ. అన్నది చర్చించడం, డైలాగులుగా స్పీచ్‌ని మలచుకోవడం, మూడునాలుగు సార్లన్నా రిహార్సల్ చేసుకోవడం. దానిని చూసి చదవడానికి యిష్టపడేవారు కాదు. ఆయన అన్ని ఇతర ముఖ్యమైన పనులు ఆపేసి, రోజంతా ఈ విషయంపైనే శ్రద్ధ చూపేవారు. "మీరు అంత శ్రమపడాల్సిన అవసరం లేదు. మీరు బాగా మాట్లాడగలరు" అని నేను ఒకసారి అంటే, "బ్రదర్... మన విషయం ఇతరులలా కాదు. వారికి రాజకీయ అనుభవం, పరిపాలనా అనుభవం వగైరాలే ప్రధానం. కాని నా విషయం వేరు. అటువంటి అనుభవం నాకు లేదు. నా వ్యక్తిగత ఆకర్షణ మీద పార్టీ పెట్టాను. నా ఇమేజ్ నా పార్టీ. నా ఇమేజే నా బలం. దాన్ని కాపాడుకోవాలి. పెంపొందించుకోవాలి. ఏ మాత్రం కూడా తగ్గనీయ కూడదు... దానికి మార్గం ఇటువంటి మెగాసభలే... ప్రజలగుండెలకు హత్తుకునేలా, ప్రతి విషయం సినిమాల్లో డైలాగులా చెప్పి నచ్చేట్లు చేయాలి. `ఇది ఎవరినీ నమ్మి, వదిలేసే విషయమూ కాదూ, మనం తేలిగ్గా తీసుకొనే విషయమూకాదూ. అందుకే ఈ శ్రమ ఈ తాపత్రయం... అంతేకాదు మీకో రహస్యం చెప్పాలి. బ్రదర్... జీవితమంతా డైలాగులు చెప్పడంలో గడిపాను. రాజకీయాల్లోకి వచ్చాక, అంత అవకాశం దొరకడం లేదు... ఇటువంటి సమయాల్లోనే, పాత రోజుల్లోలాగా, డైలాగు రాసుకొని, చూసుకొని,

చదువుకొని, రిహార్సల్స్ చేసి ఆనందించే భాగ్యం... నాకు చాలా యిష్టమైన పని... పాతకాలపు అనుభవాల్లోని ఆనందం అనుభవించడానికిదే అవకాశం" అన్నారు. ఆ రహస్యం ఆయన చెప్పేదాకా నాకు తెలీదు.

అదే శ్రద్ధ చిన్న చిన్న ఫిల్మ్ రికార్డింగులు చేసేటప్పుడు కూడా ఆయన చూపేవారు. రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం అమలు చెయ్యబోయేటప్పుడు ఫిల్మ్ డెవలప్‌మెంట్ సంస్థ తరపున ఒక చిన్న చిత్ర నిర్మాణం చేయాలని నిర్ణయం చేశాం. మొత్తం చిత్రం రెండున్నర నిమిషాలు. అందులో ఆయన సందేశం అరనిమిషం. దానికి రికార్డింగు మూడుగంటలు. ఆయన సందేశం సరిచేయడానికే అరగంట పట్టింది. మొత్తం మూడు వాక్యాలు. ఎన్నో విధాలుగా, ఎన్నోసార్లు మాటలు మార్చి మార్చి చివరకు 'సరే' అన్నారు. ఆ బియ్యం పథకం మరి కొద్దిరోజుల్లో ప్రభుత్వం తరపున అమలు కాబోతోంది. దాంతోపాటే ఈ చిత్రాన్ని కూడా అన్ని సినిమాహాళ్ళలో చూపించాలి...

* * *

నా మటుక్కు నాకు ఈ రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం నచ్చలేదు. కాని తెలుగుదేశం నాయకులంతా చాలా వుత్సాహంగా ఈ పథకాన్ని గురించి మాట్లాడేవారు. ముఖ్యమంత్రి రామారావుగారు సరేసరి. అది పార్టీ మేనిఫెస్టోలో ప్రధాన అంశం. పేదలపాలిటి పెన్నిధిగా ప్రచారం చేసుకొన్నారు. ప్రజలు కూడా ఆదరించారు.

కాని ప్రభుత్వంలో పథకాలు చేసేటప్పుడు, అందునా పెద్ద ఖర్చుతో కూడిన పథకాలు ప్రవేశపెడ్తున్నప్పుడు, ఖర్చు ఎంతఅవుతుందో అన్న విషయంపై స్పష్టమైన అవగాహన వుండాలి... మనచేతిలో లేని అంశాల విషయంలో మరీ జాగ్రత్త వహించాలి. ఈ పథకంలో ఎంతమందికి బియ్యం యివ్వాల్సి వస్తుందో నిర్ధారణ లేదు - నెలకు 50/100 రూపాయలు, ఒక్క కుటుంబానికి సబ్సిడీ వస్తాయంటే, పేదవాడినని సర్టిఫికేట్ తెచ్చుకోవడం ఎవరికీ కష్టం కాదు. ఒక నెల సబ్సిడీ సొమ్ము ఖర్చుపెడితే సర్టిఫికేట్ సంపాదించవచ్చు. అప్పుడు మార్కెట్‌లో బియ్యం - కిలో రూ. 3.75 పైసలే - కాని ఇదే రేటు నిలకడగా వుంటుందని నమ్మకం ఏమిటి? సినిమా తీయించడమే నా బాధ్యతకాని, స్కీము పూర్వాపరాలను చర్చించే విషయం నా శాఖ పరిధిలో లేదు. అయినా ముఖ్యమంత్రితో వున్న చనువుతో, ఏమైతే అయిందని, ఆయన స్క్రిప్టు చదివేటప్పుడు నా మనసులో మాట చెప్పేశాను. అక్కడే వున్న ముఖ్యమంత్రి కార్యదర్శి శ్రీ యు.బి.రాఘవేంద్రరావు దాన్ని సమర్థించాడు. ముఖ్యమంత్రి నా వైపు కొంతవింతగా, కొంత ఆశ్చర్యంగా చూశారు...

"మీరేం సలహాయిస్తున్నారో, ఆలోచించే మాట్లాడుతున్నారా? - దాదాపు సంవత్సరంగా దీన్ని గురించి మాట్లాడుతున్నాం. వాగ్దానాలు చేస్తున్నాం - ప్రజల్ని నమ్మించాం. ఇప్పుడు మాట మార్చమంటారా? దీని పరిణామాలు ఎలా వుంటాయో తెలుసా? పైగా మా ఇమేజ్ విషయం? మాటమార్చే మిగతా రాజకీయనాయకుని లాగా మీకు నేను కనపడుతున్నానా?... అయినా

మీరు ఇచ్చే సలహా ప్రభుత్వ ఖర్చు తగ్గించేవిధంగా వుండాలి కాని, ఖర్చు పెంచే విధంగా వుండరాదు. కిలోకి రూపాయి ముప్పావలా సబ్సిడీతో సరిపోతుంటే, రెండు రూపాయలు సబ్సిడీ యివ్వమని మీరు సలహా ఇస్తారా? అంటే ప్రభుత్వానికి ఇంకో 50–60 కోట్లు గండి ! ఇదేం బాగాలేదు బ్రదర్. " అని ఎన్‌టీఆర్ తీవ్రంగా ప్రతిస్పందించారు. ఆయన మొహంలో అసహనం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

నేను విషయాన్ని పొడిగించాలా వద్దా అని సంకోచిస్తున్నాను. అంతలో రాఘవేంద్రరావు అందుకొని "సర్, కిలోకి ఇంకో పావలా ఎక్కువ సబ్సిడీ ఇప్పుడు ఇచ్చినా, ఎంత మందికిస్తామో నిర్ధారణగా తెలిశాక, ప్రతిసంవత్సరం దీనిమీద ఎంత ఖర్చో మనకు నిశ్చయంగా తెలుస్తుంది. బియ్యం ధర ఎంత పెరిగినా మనకు బాధలేదు..." అని అతను ఇంకా ఏదో చెప్పబోతుంటే, మధ్యలోనే ముఖ్యమంత్రి అందుకున్నారు. "మీరిద్దరూ ఇప్పుడెందుకు ఇలా మొదలు పెట్టారు? అన్ని నిర్ణయాలూ తీసుకొని, పథకం అమలు చేసే సమయంలో కథ మొదటికి తెస్తున్నారు..." బాస్ చీకాకు పడుతున్నారు.

ముఖ్యమంత్రి అలా చీకాకు పడుతుంటే ఎదురు మాట్లాడటానికి సాహసించేపని ఎవరమూ చేయం. ఎందుకంటే రెట్టించి మాట్లాడిన కొద్దీ ఆ చీకాకు అసహనానికి, ఆగ్రహానికి దరితీస్తుంది. గతంలో - అనుభవాలు చాలా వున్నాయి. కాని, ఇది చాలా ముఖ్యమైన విషయం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మీద అపారమైన ప్రభావం చూపించే అంశం. ఏ మాత్రం అనాలోచితంగా అడుగుముందుకేసినా, రాబోయే సంవత్సరాలలో ఈ 'కిలో రెండ్రూపాయల బియ్యం' పథకం ఒక తెల్ల ఏనుగులాగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని కుదిపేసే ప్రమాదం వుంది. దీని ప్రభావం వల్ల అనేక ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలు కుంటుపడే ప్రమాదం వుంది. అప్పటికే 18 సంవత్సరాలు పాలనా యంత్రాంగంలో పనిచేసినవాడిని. నాకున్న కొద్దిపాటి అనుభవంలో 'ఈ నిర్ణయం సరికాదు. రాష్ట్రానికి మంచిదికాదు' అని నా మనసుకి అనిపిస్తుంటే బాస్‌కి సకాలంలో చెప్పకపోవటం విధ్యుక్త ధర్మాన్ని ఉల్లంఘించినట్లే కదా! జీతం తీసుకుంటున్నది ఇలా ఉల్లంఘించటం కోసమా?

కొద్దిక్షణాలు ఆలోచించాను. ధైర్యం చేసి మనస్సాక్షి ఏం చెబుతోందో అది చెప్పి తీరాలని నిర్ణయించుకున్నాను. నా దృక్పథంలో 'కిలోకి రెండ్రూపాయలు సబ్సిడీ' అని పథకాన్ని మారిస్తే ఇప్పటికి ప్రజలకి కిలో రూపాయి 75 పైసలకే బియ్యం లభిస్తుంది. రాబోయే రోజుల్లో బియ్యం ధర పెరిగిన కొద్దీ ప్రజలు చెల్లించాల్సిన ధరలో మార్పు వస్తుందికాని సబ్సిడీ మాత్రం శాశ్వతంగా రెండ్రూపాయలు గానే వుంటుంది. ఇందువల్ల ఆర్థిక వ్యవస్థని నియంత్రించటం సులభం.

"సర్, ఒక్కసారి నేను చెప్పేది వింటానంటే..." అంటూ నసిగాను. అంత చీకాకులోనూ ముఖ్యమంత్రి ఏమనుకున్నారో ఏమో, "సర్, చెప్పండి" అన్నాను.

నేను చెప్పాలనుకున్నది ఆపకుండా గడగడా చెప్పేశాను.

"అయ్యా, ఏమన్నా చేస్తే ఇప్పుడే ఇటువంటిది చేయగలం... దానిని, మనకు అనుకూలంగా మల్చుకోగలం. కిలో రెండు రూపాయలకు బదులు రూపాయి ముప్పావలాకే అమ్ముతాం. చేసిన వాగ్దానం కంటే పావలా ఎక్కువే యిస్తున్నామని సమర్థించుకోవచ్చు. అందరి చేత 'శభాష్' అనిపించుకోవచ్చు. ఎంతకాలమైనా యిబ్బంది లేకుండా ఈ పథకం అమలుచేయవచ్చు. ఆచరణలో అవినీతిని కూడా కొంతవరకు కట్టకి చేయవచ్చు. ఎందుకంటే బియ్యం ధర పెరిగినా తరిగినా యిబ్బంది వుండదు. మనం బియ్యంతో ముడిపెట్టిన 'రెండు' రూపాయలు మాటకూడా వమ్ము కాకపోవచ్చు... ఆలోచించండి. యిలా రెండు రూపాయలకే కిలో బియ్యం యిస్తామన్న మన వాగ్దాన ప్రభావం రెండు మూడు సంవత్సరాల తర్వాత ఎలా వుంటుందో? ఎందుకు ఈ అనిశ్చిత పరిస్థితి అని నా వుద్దేశ్యం" అనేసి ఊరిపిపీల్చుకున్నాను.

"అంటే మీరు చెప్పేది. బియ్యం ధర తక్కువైనా ఎక్కువైనా కిలోకి రెండు రూపాయల సబ్సిడీ ఇస్తామని చెప్పాలని. అంటే, మార్కెట్టు ధరకన్నా పేదలకు ఎప్పుడూ బియ్యం రెండు రూపాయల తక్కువకు ప్రభుత్వం ఇస్తుందనేగా మీ ఉద్దేశ్యం" అంటూ ఆలోచనలో పడ్డారు ముఖ్యమంత్రి...

రాఘవేంద్రరావు అందుకొని "ఇది ఆలోచించాల్సిందే. తేలిగ్గా తీసిపారేసేది కాదండీ" అన్నారు ముఖ్యమంత్రితో.

దూరదృష్టి, విజ్ఞత, పరిపాలనా సామర్థ్యం, మానవతా భావాలుకల అధికారిగా రాఘవేంద్రరావుకి మంచిపేరు వుంది. ముఖ్యమంత్రిక్కూడా ఆయనంటే చాలా ఇష్టం.

నిశ్శబ్దంగా రెండు నిమిషాలు గడిచాయి...

"లాభంలేదు బ్రదర్... ఇన్ని నెలలూ ప్రజలకు మనం చెప్పిందీ ఇదీ వేరుకదా? ప్రజలేం అమాయకులుకారు... ఇది రాజకీయాల్లోకి వస్తూనే మనం - ముఖ్యంగా 'నేను' - చేసిన ప్రథమ వాగ్దానం. ధర ఇప్పుడు తక్కువ కాబట్టి 'రెండు రూపాయలని' సర్దిచెప్పవచ్చునేమోకాని.... ధరలు పెరిగితే... ప్రజలు హర్షించకపోవచ్చు... ఈ విషయాన్ని మీరు మేము పార్టీ ఎన్నికల ప్రణాళిక రాస్తున్నప్పుడు చెప్పివుంటే ఒప్పుకొని వుండేవాడినని అనిపిస్తోంది..." అంటూ ముఖ్యమంత్రి ఒక నిట్టూర్పు విడిచారు. అంతే!

"ఆలశ్యం అవుతోంది... షూటింగు సంగతి చూడండి" అని చర్చకు మూతవేశారు.

★ ★ ★

ఇంకో సందర్భంలో ఇలానే షూటింగు అబిడ్సులో ముఖ్యమంత్రి రామారావుగారి ఇంట్లో జరుగుతోంది. ఆయనేదో కొంచెం అన్యమనస్కంగా వున్నట్లనిపించి, దానితో కెమెరామేన్‌మీద, లైటుబాయి మీద కొంచెం విసుక్కున్నారు. రెండుసార్లు ఆయన మాట్లాడింది ఆయనకే నచ్చక,

మధ్యలో ఆపేసి మళ్ళీ, 'టేక్' తీయమన్నారు... పట్టుదలతో, "ఈసారి చూడండి శ్రద్ధగా చెప్తాన"ని మొదలుపెట్టారు... ఒక సందర్భంలో 'కృతజ్ఞత' అన్న పదాన్ని ఆయన సరిగా చెప్పలేదనిపించి, అనాలోచితంగా 'కట్' అన్నాను... ఆయన చాలా ఆశ్చర్యంగా నావైపు చూశారు - కోపం కూడా వచ్చిందేమోననిపించింది. "సర్, ఈ మాట మరోసారి చెబితే..." అన్నాను. ఆయన రియాక్టయ్యారు.

"అయితే మీరు పెద్ద డైరెక్టరు అయిపోయారన్నమాట" అన్నారు. అప్పుడు నేనేం చేశానో నాకు తెలిసివచ్చింది - ఆయనంత నటుడిని అందరిముందు అలా తప్పుపట్టినట్లు అయింది. ఆయనతో షూటింగు ఆపటం ఒకరకంగా సాహసమూ, తెలివితక్కువ తనమూ కదా! నన్ను నేను తిట్టుకున్నాను.

అయినా తేరుకొని... "ఆ కృతజ్ఞత - అనే మాట సరిగా రాలేదని..." అని నసిగి, "నాదేం పోతుంది సర్, మీ ఇమేజి దెబ్బ తినకూడదని..." అనేశాను. ...ఒక్క క్షణం నావైపుచూసి, ఆయనా నవ్వేశారు. "చెప్పాల్సిందే బ్రదర్... మీరు మా ఇమేజి కీపరు కదా! మర్చేపోయాను... థాంక్స్" అన్నారు. వ్యంగ్యంగా అన్నారా అని అనుమానం వచ్చి - "సారీసార్... పొరపాటయింది" అనేశాను...

"లేదుబ్రదర్... లేదు... నామంచికేగా... కాకుంటే పెద్దపెద్ద డైరెక్టర్లక్కూడా నా సినిమాల్లో అలా చెప్పే అలవాటు లేకపోవడంతో... కొంచెం ఆశ్చర్యం, ఆగ్రహం కలిగాయి. కానీ, మంచిదే. మీ ధర్మం మీరు నిర్వర్తించారు..." అంటూ సమాధానపడ్డారు.

★ ★ ★

సమాచారశాఖను అందరూ వాడుకునేవారేగాని, కావల్సిన వనరులు ఇచ్చే అలవాటు అదివరకు ప్రభుత్వాలకు లేదనే చెప్పాలి... రామారావుగారి ప్రభుత్వంలో కూడా... కొత్తపోస్టుల కోసం, వాహనాల కోసం ఎన్నిసార్లు ప్రతిపాదనలు చేసినా, ఆర్థికశాఖ దాటిపోలేకపోయాం... ఒకటి రెండుసార్లు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చినా 'తప్పకుండా బ్రదర్' అనేవారేకాని, ఆర్థికమంత్రికో, కార్యదర్శికో చెప్పేవారుకాదు.

ఒకనాడు... పార్టీగురించి, పాలసీల గురించి ఆయన 'ఇమేజి' గురించి మాకు నొక్కి జ్ఞాపకం చేస్తూ సమాచారశాఖ ఇంకా శ్రద్ధగా పనిచేయాలంటూ చెప్తూంటే... నాకు కొంచెం మనస్సు చివుక్కుమంది...

"అందరికీ అన్నీచేసి పెట్టాలికాని ఆ శాఖకు ఏమికావాలో ఎవరికీ అక్కర్లేదు. అదివరకు ముఖ్యమంత్రుల విషయం అంటే అర్థం చేసుకోవచ్చు. ప్రచారంమీద, ప్రచార సాధనాలమీద మా ఇమేజిమీద ఇంత శ్రద్ధ వున్న మీరు కూడా ఈ శాఖ అవసరాలు పట్టించుకోలేదంటే నేనెవరికి చెప్పుకోవాలి? ఈ శాఖ నైపుణ్యం పెంచాలన్నా మనం కూడా కొంత సానుభూతితో వారి అవసరాలు గుర్తించాలి" అని కొంత నిష్ఠూరంగానే అనేశాను.

వెంటనే "రాఘవేంద్రరావుగారూ.... ప్రసాద్ గారి ఫైల్... ఇవాళే, ఇవాళే తెప్పించండి ఆర్డర్లు వేసేద్దాం", అన్నారు ముఖ్యమంత్రి.

అంతే ఒక్క ఆర్డర్లోనే 90 కొత్త పోస్టులు, 30 ప్రగతిపథం వ్యానులూ ఇంకా ఇతర సదుపాయాలూ మంజూరయ్యాయి. ఫలితంగా శాఖ రూపురేఖలే మారిపోయి, అన్ని విషయాల్లోనూ శాఖ సామర్థ్యం రెట్టింపయింది.

* * *

ఇంకోసారి లాల్‌బహదూర్ స్టేడియంలో ఇంకో మెగాషో. సభా కార్యక్రమం అప్పుడే అయిపోయి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్టేజి ముందు వివిఐపి ప్రాంగణంలో ముఖ్యమంత్రి ఆయన కుటుంబ సభ్యులు కొంతమంది, మంత్రులు ఇతర పెద్దలు కార్యక్రమం చూస్తున్నారు. నేనూ ముఖ్యమంత్రికి దగ్గరగానే కూర్చున్నాను. ప్రాంగణంలో పరిచిన పరుపులమీద కూర్చున్నాము. ఇంతలో నామీదుగానే ముఖ్యమంత్రివైపు ఎవరో దూకినట్లయింది. చూస్తూండగానే కలకలం. ముఖ్యమంత్రి పైన పడి ఆ అగంతకుడు కత్తితో పొడిచేశాడు. ప్రక్కనే వున్నవారు, సెక్యూరిటీవారు అతన్ని ఒడిసి పట్టుకున్నారు. ముఖ్యమంత్రిని చూస్తే చేతిపైనుండి రక్తం... వెంటనే పోలీసు, సెక్యూరిటీ అధికారులు ఆయనను అక్కడనుండి బయటకు తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తూ, బయటకు తీసుకు నడిపించేశారు...

నాకెందుకో ముఖ్యమంత్రి అలా వెళ్ళిపోతే జనంలో గొడవలు జరిగే అవకాశం ఉందనిపించింది. ఖంగారుగా పరుగెత్తి వెళ్ళి ముఖ్యమంత్రిని ఆపాను. "సార్, మీరు స్టేజిమీదకు వచ్చి జనానికి కనపడి, చేతులు ఊపి వెళ్తే బాగుంటుంది. మీమీద హత్యాప్రయత్నం జరిగిందని బయటపడి, మీరు కనపడకుండా వెళ్ళిపోతే, ఊహాగానాలతో ఈ లక్షల జనంలో గందరగోళం, పెద్ద వదంతులు, శాంతిభద్రతల సమస్య రావచ్చు..."

ముఖ్యమంత్రి నా సలహాని అర్థం చేసుకొన్నారు. పోలీసు అధికారులు వారిస్తున్నా వినకుండా స్టేజిమీదకు వెళ్ళి, కార్యక్రమం మధ్యలోకి వచ్చి జనాన్ని ఉద్దేశిస్తూ అభివాదంచేసి, చేతులుఊపి, స్టేజి దిగివెళ్ళిపోయారు. జనానికి ఆయనలా ఎందుకువచ్చారో అర్థంకాలేదు. కొంత నిశ్శబ్దం, కొంత కలకలం మధ్య నేనే మైకు తీసుకుని విషయం చెప్పేశాను.

"ముఖ్యమంత్రిపై హత్యాప్రయత్నం జరిగింది... అదృష్టవశాత్తూ పెద్దప్రమాదం తప్పింది. చేతికి చిన్న గాయం తప్ప ముఖ్యమంత్రి క్షేమంగా ఉన్నారు... అందుకే ఆయన స్టేజిమీదకు వచ్చి, ఆయన సురక్షితంగా ఉన్నారని మీకు తెలపడానికే వచ్చారు" అని నేనటంతో జనంలో మొదట స్తబ్ధతతో నిశ్శబ్దం.

కొంచెం సేపటికి చప్పట్లు, ఈలలు... అంతే ఆ కార్యక్రమం అర్ధాంతరంగానే ముగిసి పోయింది...

ఎవరో అంత మతిస్థిమితంలేని అర్చకుడు, బక్కగా 30 ఏళ్ళవాడు ఎందుకు అలాచేశాడో కారణమే తెలియని పరిస్థితి.... మరుసటిరోజు వందలు వేలల్లో అభిమానులు ముఖ్యమంత్రిని చూడడానికి ఇంటికి తరలివచ్చారు. అదృష్టంకొద్దీ కత్తి ఒక వ్రేలుకి మాత్రం తగిలి, గాయమై కొంత రక్తం పోయింది. వేలికి కట్టుకట్టుకొని పరామర్శలందుకోవడం ఆయనకి చాలా సంతోషాన్ని ఇచ్చింది... ఆయనచేత రేడియోలో, టెలివిజన్‌లో సందేశం ఇప్పించాను. ఆగంతకునిపై తనకేమీ కోపంలేదనీ, అతనిపై పోలీసులు ఏమీ చర్య తీసుకోకుంటే తాను సంతోషిస్తాననీ ఆయన చెప్పేశారు...

రాత్రి అందరూ వెళ్ళాక, కావల్సినవాళ్ళం ఇద్దరు ముగ్గురి దగ్గర సిఎం అన్నారు. "జరిగిందేదో జరిగిందికాని – మన ఇమేజికి ఇది మంచి boost" ఆయనకూడా సానుభూతి రాజకీయాలు నేర్చేసుకొన్నారు...

★ ★ ★

ఇప్పుడు మెగా షో... కరువు నివారణ నిధులకోసం... సినీ నటులు, ప్రముఖులు ప్రజలలోకి వెళ్ళి.... చందాలు వసూలుచేసి ముఖ్యమంత్రి నిధికి విరాళం ఇచ్చే కార్యక్రమం – రోజంతా హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలలో సినీ ప్రముఖుల ఊరేగింపు... జోలెలుపట్టి – విరాళాలు సేకరించడం – ముఖ్యమంత్రి కూడా పెద్ద జోలెవేసుకొని... ఎండలో రోజంతా తిరిగారు. సాయంత్రం లాల్‌బహదూర్ స్టేడియంలో పెద్ద కార్యక్రమం – సినీ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు – ముఖ్య అతిథిగా కాశ్మీరు ముఖ్యమంత్రి ఫరూఖ్‌అబ్దుల్లాని పిలిచారు... ఏర్పాట్లన్నీ సమాచార సాంస్కృతిక శాఖ, ఫిలిం దెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ల అధికారిగా నామీదే పడ్డాయి. అన్ని విషయాలూ, కారక్రమాలగురించి, సన్మానం గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ముఖ్యమంత్రే నిర్ణయం చేశారు. మెమెంటోలు, శాలువాలు వగైరా... అన్నీ ఆయనే నిర్ణయించారు. కాశ్మీరు ముఖ్యమంత్రికి కాశ్మీరు శాలువా హైద్రాబాద్‌లో మనం కప్పటం ఏమిటి? మన పట్టణ చిహ్నంగా మంచి వెండి చార్మినార్ ఫరూక్‌గారికి బహూకరిద్దాం! శాలువా అక్కర్లేదన్నారు సి.ఎం.

"సరే! అలాగే" అన్నాను.

ధగధగా మిరుమిట్లు గొలిపే లైట్లతో సభ బ్రహ్మాండంగా జరుగుతోంది. సినీ ప్రముఖులకు సన్మానాలయిపోయినాయి. ఇక మిగిలింది ముఖ్యమంత్రి, ఫరూక్ అబ్దుల్లా మాట్లాడటం, ఆ తరువాత ఫరూక్‌గారికి సన్మానం. అకస్మాత్తుగా అప్పుడు స్టేజిమీదవున్న నన్ను ముఖ్యమంత్రి పిలిచి, "బ్రదర్ – ఫరూక్‌గారికి కూడా జిగేల్‌మనే ఖరీదైన ఎర్రశాలువా కప్పితే బాగుంటుంది... చేయగలవా?"

తెచ్చినవాటిలో మిగిలిన రెండు శాలువాల్ని ఆయనకు చూపిస్తే "ప్చ్- లాభంలేదు – చాలా కెమేరాలున్నాయి. ఎర్రశాలువా, చమ్కీలు, జిగినీ బిళ్ళలది... రాజసం ఉట్టిపడేలా వుండేది కావాలి" అన్నారు...

"మీరే వద్దన్నారుగా" అని నేను అందామని నోటిదాకా వచ్చి, అనలేకపోయాను. ఆయనకూ తెలుసు. ఒక్క క్షణం నావంక చూసి "లేకపోతే పోనీలే, చార్మినార్ ఇచ్చేద్దాం, చాలు" అన్నారు ముఖ్యమంత్రి... నా సామర్థ్యానికి ఇదో పరీక్షా!

ఫరూక్‌గారి సందేశం కాగానే నేనే మైక్‌లో "ఫరూక్‌గారిని చార్మినార్ మెమెంటోతో, దుశ్శాలువతో మన ముఖ్యమంత్రి సత్కరిస్తారు" అని ప్రకటిస్తే, ముఖ్యమంత్రి నావైపు ప్రశ్నార్థకంగా చూశారు.

నాచేతులనుండి జిగేల్ జిగేల్‌మనే ఎర్రపూల శాలువా అందుకొని ముఖ్యమంత్రి మురిసి పోయారు. 'చాలా గొప్పగా వుంది సుమా' అన్నట్లు నావంక చూసి కనుబొమ్మలెగరేశారు.

మరునిమిషంలో దానిని ఫరూక్‌గారికి కప్పి, వెండి చార్మినార్ ఆయన చేతులలో పెట్టి, ప్రజల కరతాళధ్వనుల మధ్య సత్కరించారు ముఖ్యమంత్రి. మరుక్షణం ప్రక్కకుతిరిగి నా భుజం తట్టి "గుడ్ బ్రదర్" అని అభినందనగా అన్నారు.

* * *

"**లే**దన్నారుగా... అప్పుడే ఆ శాలువా ఎట్లావచ్చింది బ్రదర్" అని ముఖ్యమంత్రి మర్నాడు ఉదయం అడిగారు.

"నేను తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వుండగా మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి వెళ్ళినప్పుడు, స్వామీజీ అనుగ్రహించి కప్పిన శాలువ అది. మీరు అడిగినప్పుడు నా దగ్గర మిగిలివున్న శాలువాలు మీకు చూపించాను. మీకు నచ్చలేదు. మరుక్షణంలో నాకిది జ్ఞాపకం వచ్చింది. చీటీ రాసి నా పి.ఎ.ని ఇంటికి పంపితే, ఆ పదినిముషాల్లో పెట్టెలో అడుగునవున్న ఈ శాలువాని నా భార్య గోపిక వెతికి తీసి పంపించింది. మా అపార్ట్‌మెంట్ ఇక్కడ లక్డీకాపూల్‌లో వుండటంవల్ల అంత త్వరగా తెప్పించగలిగాను సర్"

"మరి అది తెప్పిస్తున్న సంగతి నాకు చెప్పొచ్చుగదా బ్రదర్!"

"మీకు చెప్పాక నేను ఇంటికి కబురుచేస్తే, అది దొరక్కపోయినా, సకాలంలో ఇక్కడికి చేరకపోయినా మీకు ఆశాభంగం చేసిన వాణ్ణవుతాను కదా..."

"కరెక్ట్ బ్రదర్. మాకు చెప్పకుండా చేసి ఆశ్చర్యం, ఆనందం కలిగించారు. ఎక్కడి రాఘవేంద్రమఠం, ఎక్కడి కాశ్మీర్ అబ్దుల్లా...!"

ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్ మనసారా నవ్వుకున్నారు.

* * *

సిఎంలూ- ఆగ్రహ కెరటాలు - 1

ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుకి నేను 'వెన్నుపోటు' పొడిచానట.

కాణిజేటి రోశయ్యగారితో నేను మాట్లాడటం ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారికి ఆగ్రహం తెప్పించింది. చాలామంది ఐ.ఏ.ఎస్ అధికారులు ప్రభుత్వంలో పనిచేస్తూ వుంటే నామీదే ఎందుకు ఆగ్రహం రావాలి అంటే - సమాచార పౌరసంబంధాల కమీషనర్‌గా నేను ముఖ్యమంత్రి సమక్షంలోనే చాలా సమయం గడుపుతుంటాను కనుక నా విధేయతపట్ల ముఖ్యమంత్రికి నమ్మకం ఎక్కువుంటుంది.

ఇప్పుడా విశ్వాసానికి ఘాతం తగిలి నేను విశ్వాస ఘాతకుణ్ణయ్యాను!

★ ★ ★

ముఖ్యమంత్రుల ఆగ్రహం నాకు కొత్తకాదు. అంతకుముందు, ఆ తరువాత కూడా మర్రి చెన్నారెడ్డిగారి ఆగ్రహం చవిచూశాను. ముఖ్యమంత్రి అంజయ్యగారి ముందూ, భవనం వెంకట్రామ్‌గారి ముందూ వేర్వేరు ఉద్విగ్నపూరిత క్షణాలు గడిపాను. ముఖ్యమంత్రులకుండే బలమైన అంశాలే ఒక్కోసారి వాళ్ళని బలహీనుల్ని చేస్తూంటాయి. ఈ సంగతి తెలుసుకుని స్పృహతో వ్యవహరించే నాయకులు చాలా తక్కువమంది వుంటారు.

ముఖ్యమంత్రులు ఎలా పనిచేయాలో తెలిపే శాస్త్రీయమైన రాజకీయశాస్త్రం ఏదీలేదు. ప్రజలచేత ఎన్నుకోబడ్డాం కాబట్టి ఆ ప్రజల ఆశల మేరకు, రాజ్యాంగబద్ధుణ్ణై పనిచేస్తాను, నీతివంతమైన పాలన అందిస్తాను.....ఇలాంటి ప్రమాణం చేస్తారు తప్ప, పాలనా విధానం ఎవరిది వాళ్ళదే. కాని అందరు ముఖ్యమంత్రులకూ వుండే బలమైన విషయం వాళ్ళకి విధేయులైన వాళ్ళు మోసుకొచ్చే 'రహస్య' సమాచారం. ప్రభుత్వంలో పోలీసుశాఖలో వుండే రహస్య సమాచార విభాగానికి సమాంతరంగా ఈ అసంఘటిత వ్యవస్థ పనిచేస్తూంటుంది. ఈ వ్యవస్థ ద్వారా వచ్చే సమాచారంలో దేనికి ఎంత విలువనివ్వాలీ అన్న విచక్షణ లేకపోతే ఆ బలమే బలహీనతై కూర్చుంటుంది.

1978లో నన్ను తిరుమల తిరుపతి దేవస్థానాలకి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించిన రెండోరోజునే ముఖ్యమంత్రి చెన్నారెడ్డికి నామీద కోపం వచ్చింది. నన్ను పిలిపించారు.

"ఏమయ్యా, వెంగళరావుకి ఏజంటుగా పనిచేద్దామనుకుంటున్నావా?" అంటూ విరుచుకు పడ్డారు.

ఇలా అకస్మాత్తుగా నిలదీస్తే ఏం అర్థమవుతుంది? ఒక ఐ.ఏ.ఎస్. అధికారిని పట్టుకొని, ముఖ్యమంత్రి వెనకాముందూ ఉపోద్ఘాతం లేకుండా విరుచుకుపడితే ఏం చేయాలి? అర్థంకాదు. అర్థమయ్యేదాకా గందరగోళంగానే వుంటుంది. పైగా ముఖ్యమంత్రి ఇలా నిలబెట్టి అరిచినప్పుడు పక్కన ఎవరన్నా సాటి అధికారులు, మనకన్నా క్రిందిస్థాయి అధికారులు వున్నారంటే అవమాన భారంతో క్రుంగిపోవాల్సివస్తుంది. ఈ అవమానం పరిమాణం ముఖ్యమంత్రి అరిచినదానికంటే ఎక్కువగా దీనికి బయట లభించగల ప్రచారాన్ని ఊహించుకునే దాన్ని బట్టి వుంటుంది.

చెన్నారెడ్డిగారికి ఆగ్రహానికి కారణం ఆ ముందు రోజు నేను చెలికాని అన్నారావుగారితో మాట్లాడానట. అన్నారావుగారు వెంగళరావుగారికి ఆప్తుడు. బంధువుకూడా కావచ్చు. వివిధ హోదాల్లో ఆయనకి టి.టి.డితో 33 సంవత్సరాల అనుబంధం. 1978 ఎన్నికలలో వెంగళరావుగారు బ్రహ్మానందరెడ్డి కాంగ్రెసులోనే వుండి 'ఆవు-దూడ' గుర్తుతో పోటీచేసి ఓడిపోయారు. చెన్నారెడ్డిగారు ఎన్నికలకి రెండు మాసాల ముందు పుట్టిన ఇందిరా కాంగ్రెసులో చేరి 'హస్తం' గుర్తుతో పోటీచేసి గెలిచారు. ఇప్పుడు చెన్నారెడ్డిగారిని ప్రతిక్షణం పట్టుకుని వేధించే అనుమానం వెంగళరావుగారు తన ప్రభుత్వానికి అనుకూలంగా ఖచ్చితంగా పనిచేయరు, కాబట్టి ఆయనా, ఆయన తాలూకు మనుషులూ ఓ కంట కనిపెట్టి చూడాల్సిన వాళ్ళు. కాని ఒక ఐ.ఏ.ఎస్. అధికారిని, 'ఫలానా నాయకుడి తాలూకు మనిషి' అని ఎలా ముద్ర వేస్తారు?

వెంగళరావుగారిపట్ల నాకున్న 'విధేయత' కారణంగానే అన్నారావు దగ్గరకెళ్ళి, 'మిమ్మల్నే మళ్ళీ టి.టి.డి ఛైర్మన్‌గా కొనసాగింపచేస్తానుగా, నిశ్చింతగావుండండి" అని హామీ ఇచ్చానట. ఇదీ చెన్నారెడ్డిగారి నమ్మకం. ఇది నాకు అర్థమయ్యేలోపల టన్నులకొద్దీ దెప్పిపొడుపులు, వ్యంగ్యబాణాలు నామీద పడిపోయాయి. వ్యంగ్యబాణాలు సంధించటంలో చెన్నారెడ్డిగారు సిద్ధహస్తులు.

అన్నారావు దగ్గరికి నేను వెళ్ళలేదనీ, ఆయనే నా దగ్గరకువచ్చి, "అమెరికా నుంచి ఇప్పుడే వస్తున్నాను" అంటూ టిటిడిలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నా నియామకం పట్ల హర్షం వ్యక్తం చేసి వెళ్ళారనీ, ఆయన్ని ఛైర్మన్‌గా నియమింపజేసే హక్కు, అధికారం ముఖ్యమంత్రికే తప్ప నాకు లేవనీ....ఇలా చాలా సుదీర్ఘమైన వివరణ ఇచ్చుకున్నాక గానీ ఆయన శాంతించలేదు.

అయినా రాజకీయ విధేయులు నడిపే రహస్య సమాచార వ్యవస్థ దానిపని అది చేస్తూనే వచ్చింది. ఫలితంగా ఏడాది తిరగకుండానే - నేను టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హోదాలో తనకి "వ్యతిరేక కార్యకలాపాల"కు పాల్పడుతున్నానని ఎవరో చెప్పారట. నలుగురైదుగురు అధికారులు, రాజకీయ వందిమాగధుల సమక్షంలో చెన్నారెడ్డిగారు (అక్కడలేని నన్ను ఉద్దేశించి) నోటికొచ్చినట్లు దుమ్మెత్తిపోశారు.

చీఫ్ సెక్రటరీ రామ్మూర్తిగారు నాకు టెలిఫోన్‌చేసి చెప్పారు. నాకు తెలీని ఘోరమైన నేరం ఏం చేశానోనని పరుగెత్తుకుంటూ హైద్రాబాద్ వెళ్ళాను. విషయం ఏమిటి? ముఖ్యమంత్రి

కార్యదర్శులు సంతానం, గోవిందరాజన్‌లు నాకు విషయం వివరించారు. చెన్నారెడ్డిగారికి కడపజిల్లాలో రాజకీయ ప్రత్యర్థి అయిన రత్నసభాపతిగారి పత్రికకీ, ముఖ్యమంత్రిమీద విమర్శనాత్మక వ్యాసాలు గుప్పిస్తున్న 'ఈనాడు' పత్రికకీ ప్రకటనలు ఇవ్వటం నేను చేసిన నేరం. పైగా ఆ ప్రకటనలు పడిన సంచికలోనే చెన్నారెడ్డిని విమర్శిస్తూ వ్యాసాలు వచ్చాయిట. ఆయన రాజకీయ విధేయులు మోసుకెళ్ళి ఆ పత్రికలు చూపించారట. నా ప్రమేయం లేదనీ, నిర్దిష్ట విధానం ప్రకారం ఈ ప్రకటలన్నీ టిటిడి పి.ఆర్.ఓ ఇస్తుంటారనీ నేను వివరించాను. వాళ్ళకి అర్థమైంది కాని ముఖ్యమంత్రికి ఎవరు చెబుతారు?

సాటి అధికారి మీద ముఖ్యమంత్రికి ఆగ్రహం వస్తే, అడ్డంపడే ప్రయత్నం ఏ అధికారీ చేయరు. కాని ఇక్కడ మాత్రం ఛీఫ్ సెక్రటరీ రామ్మూర్తి, సిఎం సెక్రటరీలు సంతానం, గోవిందరాజన్‌లు నామీద అభిమానంతో నాతోపాటుగా సింహం నోట్లో తలదూర్చడానికి సిద్ధపడ్డారు. అందరం కలిసి ఆ ఆదివారంనాడు తార్నాకాలోని చెన్నారెడ్డిగారి ఇంటికి వెళ్ళాం. "ప్రసాద్ చేసిన దాంట్లో మాకేమీ దురుద్దేశ్యం కనుపించట్లేదు సార్.!!" అంటూ ముఖ్యమంత్రికి నచ్చజెప్పాలని వాళ్ళు ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి ఆగ్రహకెరటం ఎగిసిపడటంతో ఆ ప్రయత్నం వికటించింది. వాళ్ళమాటలు వినకపోగా ఆయన నామీద విరుచుకుపడ్డాడు. ఆ సంఘటనతో నా నైతిక స్థైర్యం మొత్తం నీరుకారిపోయింది. "నన్ను రిలీవ్ చేసి, ఇంకో ఆఫీసర్‌ని నియమించుకోండి" అంటూ ఆవేశంగా ముఖ్యమంత్రికి లెటర్ రాసి తిరుపతి వెళ్ళిపోయాను.

ఇది జరిగిన వారం పదిరోజుల్లోనే ఇందిరాగాంధి తిరుపతికివచ్చి, శ్రీనివాసుని దర్శనం చేసుకొని వెళ్ళారు. ఆవిడతోపాటు ముఖ్యమంత్రి చెన్నారెడ్డి కూడా వచ్చారు. అంతా బాగా జరిగిపోయింది. తిరిగి వెళ్ళాక నా పనితీరుని అభినందిస్తూ, మేం ముగ్గురం వున్న ఫొటోగ్రాఫ్‌మీద ఆటోగ్రాఫ్ చేసి పంపించారు చెన్నారెడ్డిగారు. "హమ్మయ్య" అని నిట్టూర్చాను.

1989లో మరోసారి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి హోదాలో నామీద విరుచుకు పడ్డారు. దానికి ముందు.... 1980లో చెన్నారెడ్డి తరువాత వచ్చిన ముఖ్యమంత్రి అంజయ్యగారి ముందు కూడా ఇలాంటి స్థితిని ఎదుర్కొన్నాను. ఇది రాజకీయ 'రహస్య సమాచార వ్యవస్థ' ద్వారా కాదు. తిరుమలలో నేను అమలుచేసిన మాస్టర్‌ప్లాను, సంస్కరణల వల్ల బాధితులైన రాజకీయ శక్తులు తమ కాంగ్రెస్‌పార్టీ విధేయత ఆధారంగా -అంజయ్యగారు ముఖ్యమంత్రిహోదాలో తిరుమల రాగానే నామీద ఫిర్యాదులు చేశారు. మామూలు ఫిర్యాదు కాదు. కొన్నివందలమంది జనాన్ని సేకరించి, నాకు వ్యతిరేక నినాదాలు చేస్తూ, నన్ను టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టు నుంచి అర్జంటుగా తీసిపారేయాలని డిమాండు చేస్తూ పెద్ద ప్రదర్శనగా వచ్చారు ముఖ్యమంత్రి దగ్గరికి. యాచకుల కడుపుకొడ్తున్నాననీ, గోమాతల పాలిట కసాయిననీ, హాకర్ల పాలిట రాక్షసుడ్ననీ....ఇలా పెద్ద పెద్ద ఆరోపణలతో వాళ్ళు దుమారం లేపారు. వాళ్ళు చెబుతుంటే చాలా ఓపిగ్గా ముఖ్యమంత్రి ఆలకిస్తున్నారు. దాంతో "ఈ ముఖ్యమంత్రి ఆగ్రహం నన్ను ఏం చేస్తుందో" అని మనసులో

బెంగపడిపోయాను. మనిషికి కష్టం వచ్చినప్పటికన్నా వస్తుందేమోనన్న భావం కలిగించే టెన్షన్ ఎంత పెద్దదో అప్పుడు అనుభవించాను. అప్పటికి అన్నింటికీ దేవుడి మీద భారం వెయ్యటం అలవాటైపోయింది. చివరికి, గతంలో ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావుగారి సెక్రటరీగా పనిచేసినప్పుడు నన్ను తెలిసున్న వ్యక్తిగా అంజయ్యగారు వాళ్ళ ఫిర్యాదుకాగితాలన్నీ నాకే ఇచ్చి, "ప్రసాద్‌వల్ల మంచి జరక్కపోతే మీకు ఇంకెవరివల్లా జరగదు" అనటంతో గండం గడిచింది.

కాని అంజయ్యగారి తరువాత ముఖ్యమంత్రిగా వచ్చిన భవనం వెంకట్రామ్ ముందర మాత్రం ప్రభుత్వానికే చెందిన 'రహస్య సమాచార వ్యవస్థ' నన్ను దోషిని చేసినప్పుడు, మానసికంగా నలిగిపోయాను. పోలీసుశాఖలో ఒక భాగం ఈ ఇంటెలిజెన్స్. ఇది నేరుగా ముఖ్యమంత్రికే జవాబుదారీ. ఐ.పి.ఎస్ అధికారి విజయరామారావు సారథ్యంలోని ఇంటెలిజెన్స్ విభాగం ఎలాంటి రిపోర్టుని ముఖ్యమంత్రికిచ్చిందంటే –నేను హైద్రాబాద్‌లో మతసామరస్యానికి భంగం కలిగిస్తున్నానంటూ ప్రభుత్వంచేత నాకు నోటీసు ఇప్పించింది.

తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నేను నా పరిధిని అతిక్రమించి, మతసామరస్యాన్ని దెబ్బతీస్తున్నానట..... మీనాక్షిపురంలో జరిగిన మతమార్పిడుల నేపథ్యంలో నైతికవిలువలు, హిందూ ధర్మప్రచారం కోసం వివిధ మఠాధిపతుల మార్గదర్శకత్వంలో ఒక హిందూధర్మ రక్షణ సంస్థని టిటిడిలో ఏర్పాటుచేశాం. విస్తృతమైన హిందూధర్మ ప్రచారం ప్రారంభించాం. అందులో భాగంగానే హైద్రాబాద్‌లో గణేష్ నిమజ్జనోత్సవంలో దారిపొడవునా గణేష్ ఆతిథ్యం పందిళ్ళు వేయించి, భక్తులకు ధార్మిక సాహిత్యం పంపిణీ చేయించాం.

పోలీసు రహస్య సమాచార విభాగం ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ముఖ్యమంత్రి భవనం వెంకట్రామ్ నా సంజాయిషీ కోరారు. టిటిడికి ఇ.ఓగా వున్నంతకాలం టిటిడి చట్టానికి లోబడి హిందూధర్మప్రచారమే చేస్తాననీ, ఆ చట్టం ప్రకారం అలా చేయకపోవటమే నేరమనీ, ఈ విషయంలో నేను ఎవరికీ సంజాయిషీ ఇచ్చుకోనక్కర్లేదనీ ఆవేశంగా జవాబు రాశాను. దీంతో ఇంటెలిజెన్స్ విభాగానికి పంతం పెరిగింది. ముఖ్యమంత్రికి కొందరు రాజకీయ విధేయులు కూడా నూరిపోసినట్లున్నారు– ఛీఫ్‌సెక్రటరీ నన్ను హైద్రాబాద్ పిలిపించారు. ఛీఫ్‌సెక్రటరీ, డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు, ఇంటెలిజెన్స్ ఇనస్పెక్టర్ జనరల్ సమక్షంలో ముఖ్యమంత్రికి నేను సమాధానం చెప్పాలి! సాటి అధికారుల ముందు అవమానం, అసహనం నన్ను వెంటాడాయి.

ప్రభుత్వంలో అధికారుల్ని అధికారులు సమర్థిస్తారనీ, ఒక అధికారి ఎన్ని తప్పులు చేసినా, అతని కొమ్ముకాసేందుకే సాటి అధికారులు ప్రయత్నిస్తుంటారనీ.....ఇలాంటి అపోహలు ప్రజల్లో ప్రచారంలో వుండటం నాకు తెలుసు. కాని, వాస్తవం అలా వుండదు. 'నేను ఎంతోబాగా పనిచేస్తున్నాను' అనిపించుకోవటం కోసం పక్కవారిపనితీరు మీద రంధ్రాన్వేషణ చేసే తత్త్వం మానవ నైజంలో వుంది. ఇదే ప్రభుత్వ యంత్రాంగంలోనూ పనిచేస్తుంటుంది. సాధారణంగా తనకంటూ ప్రత్యేకమైన ప్రయోజనాలు వుంటే తప్ప ఏ అధికారీ మరో అధికారిని ఆరోపణల

వలయం నుంచి కాపాడాలనుకోరు. (ఇందుకు విరుద్ధంగా, ముక్కుకి సూటిగా వెళ్తూ, న్యాయపక్షపాతిగా పనిచేసే అధికారులు కూడా వుంటారు. కాని అలాంటివారి శాతం ఇప్పుడు తగ్గిపోయింది.) మొత్తం మీద పోలీసు శాఖలోని రహస్య సమాచార వ్యవస్థ 'సమర్థంగా' పనిచేసింది. కాలర్టే గణేశ్ నిమజ్జనోత్సవంలో సాగించిన హిందూధర్మ ప్రచారం నేను మతసామరస్యాన్ని దెబ్బతీస్తున్నా ననటానికి ఆధారంగా వాళ్ళకి కనుపించింది.

వాళ్ళందరిముందూ చేయని నేరాన్ని నెత్తినవేసుకుని క్షమార్పణలు చెప్పడానికి నా మనస్సాక్షి అంగీకరించలేదు. కాని ముఖ్యమంత్రి పంచాయితీ పెట్టారే! అయితేనేం! ముఖ్యమంత్రి నన్ను సస్పెండ్ చేసినా, బదిలీచేసినా– అన్నింటికీ సిద్ధపడదాం అనుకుని, సిద్ధపడి, దేవుడిమీద భారం వేసి ముఖ్యమంత్రినే చూస్తూ మొండిగా జవాబిచ్చాను. "నేను నేరం చేయలేదు సర్. నేను ఎవ్వరికీ సంజాయిషీ ఇచ్చుకోనక్కర్లేదు. మీ ఇష్టం వచ్చిన చర్యతీసుకోవచ్చు...."

అంతకుముందు వరకూ ముఖ్యమంత్రికి నామీద వ్యక్తిగతంగా ఎలాంటి కోపమూలేదు. పోలీసు ఇంటెలిజెన్స్ రిపోర్టులు ఆధారంగా మాత్రమే సంజాయిషీ కోరారు. కాని నా మొండితనం ఆయనకి కోపం తెప్పించింది. ఆయన మొహంలో రంగులు మారటం గమనించాను. ముగ్గురు సీనియర్ అధికారుల సమక్షంలో నేను మాట్లాడిన పద్ధతి ఆయనకి నచ్చలేదు. నేనేదో వాళ్ళకి సర్దిచెప్పుకొని, సర్దుకుపోవాలన్న ఆయన ధోరణి నాకూ నచ్చలేదు. ఏ పోస్టులో వుంటే ఆ పోస్టుకి న్యాయం చేయటమే ఐ.ఏ.ఎస్. అధికారి బాధ్యత. అన్నిరకాల పోస్టుల్లోనూ పనిచేయగలిగేలాగానే వీళ్ళకి రెండేళ్ళు ట్రెయినింగ్ ఇస్తారు. టి.టి.డి. లో వున్నప్పుడు నేను చేయాల్సిన విధుల్లో భాగం హిందూధర్మ రక్షణ. ఆ పోస్టు తరువాత ఎన్.టి.ఆర్. హయాంలో నన్ను ఎక్సైజ్ కమీషనర్‌గా వేసి, సారా అమ్మకాలు (వారుణవాహిని) పెంచమన్నారు. అదీ చేశాను.

మొత్తం మీద ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులు, ఛీఫ్‌సెక్రటరీ సమక్షంలో నా మొండితనం కోపం తెప్పించినా, ముఖ్యమంత్రి వెంకట్రామ్‌గారు ఆ కోపాన్ని అణుచుకొని, లేని చిరునవ్వు పెదిమలమీదకు తెచ్చుకుని, "ఆవేశపడొద్దు ప్రసాద్" అంటూ నా దగ్గరకు వచ్చి భుజంతట్టి, "మళ్ళీ మాట్లాడదాం" అంటూ ఆ సమస్యని ముగించేశారు.

(తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వుండగా నేను ముఖ్యమంత్రులతో ఎదుర్కొన్న అనుభవాలను గతంలో 'స్వాతి'లో 'సర్వసంభవామ్' (నాహంకర్తా...) సీరియల్‌లో విపులంగా రాయటం జరిగింది.)

ఏమైనా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఆగ్రహావేశాలు నేను రాష్ట్రం నుంచి కేంద్రానికి డెప్యుటేషన్‌లో వెళ్ళాక కూడా నన్ను వెంటాడాయి. 1989లో నేను విశాఖపట్నం పోర్టుకి ఛైర్మన్‌గా పనిచేస్తుండగా ఆయన రెండోసారి రాష్ట్రముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. కేంద్రంలో వి.పి.సింగ్ ప్రభుత్వపాలన మొదలైంది. విశాఖ పోర్టులో కొత్త బెర్తుకి (నౌకలు నిలిపే ప్లాట్‌ఫారమ్‌కి) ప్రారంభోత్సవానికి

ఉపప్రధానమంత్రి దేవీలాల్‌గారిని ఆహ్వానించాను. ఆయన వచ్చారు. నేను పనిచేసేది కేంద్ర ప్రభుత్వంలో కనుక నా బాస్‌లంతా కేంద్రప్రభుత్వమే. కాబట్టి మా కార్యక్రమాలన్నింటినీ కేంద్రమంత్రులు, కేంద్ర సెక్రటరీలు వగైరా కేంద్ర ప్రభుత్వ యంత్రాంగమే చూస్తుంటారు. అందుకే దేవీలాల్‌గారిని పిలిచాం.

తీరా దేవీలాల్‌గారు నగరంలో దిగాక తెలిసింది. ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారు కూడా విశాఖపట్నం వచ్చారని. ఏం చేయాలి? ప్రొటోకాల్ ప్రకారం- నాకు దేవీలాల్ మాత్రమే సంబంధిత విఐపి. కాని రాష్ట్రముఖ్యమంత్రి నగరంలో వుండగా ఆయన్ని ఆహ్వానించకుండా దేవీలాల్‌తో మాత్రమే బెర్త్ ప్రారంభోత్సవం చేయడం మర్యాదగా వుంటుందా? ఎంతయినా నేను రేపు మళ్ళీ రాష్ట్ర సర్వీసుకి రావలసిన వాణ్ణేగదా!....చెన్నారెడ్డిగారిని నిర్లక్ష్యం చేయడం సంస్కారం కాదనిపించింది. వెంటనే సర్క్యూట్ హవుస్ అతిథి భవనానికి వెళ్ళి చెన్నారెడ్డిగారిని కలిశాను.

"సర్, ఇవ్వాళ పోర్టులో ఒక బెర్తు ప్రారంభోత్సవం వుంది. దేవీలాల్‌గారు చేస్తున్నారు. మీరుకూడా వచ్చి పాల్గొని, వేదిక నలంకరించాలని నాకోరిక. మీరు అన్యథా భావించకుండా...." అంటున్నాను.

నా మాటలు పూర్తవకుండానే విషయం అర్థం చేసుకున్న చెన్నారెడ్డిగారు నామీద నిప్పులు కక్కినంత పనిచేశారు. అంతే! 1978,1979 అనుభవాలన్నీ ఒక్కసారిగా సినిమారీలులా మెదడులో పరుగెత్తాయి. అదే కోపం, అదే ఆవేశం. కళ్ళకి మందం పెరిగిన అద్దాలు వచ్చాయే తప్ప అయన మాట స్పీడు తగ్గలేదు.

"ఏమనుకుంటున్నావయ్యా! ముఖ్యమంత్రిని ఆహ్వానించే తీరు ఇదేనా? నేను ఇక్కడికొచ్చాక, వచ్చి పిలుస్తావా? కేంద్రంలోకి వెళ్ళేసరికి ముఖ్యమంత్రితో పనిలేదనుకుంటున్నావా?......" ఆయన కోపం తారస్థాయిలో వుంది. ఆ గదిలో చుట్టూ రాజకీయ నాయకులూ వున్నారు, అధికారులూ వున్నారు, ఒకరిద్దరు పత్రికా విలేకరులూ వున్నారు. అవమాన భారంతో తలదించుకోవాల్సిన స్థితి.

కాని, అవమానాలు అలవాటైపోయాయి. ఆయన్ని సముదాయించే ప్రయత్నం చేయనట్టుగా చేశాను. "సారీ సర్, చిన్న కమ్యూనికేషన్ గ్యాప్‌వల్ల అలా జరిగింది. వ్యక్తిగతంగా వచ్చి ఆహ్వానించలేదు. కాని మీ ఆఫీసుకి ఇన్విటేషన్ మాత్రం పంపాను సర్... మిమ్మల్ని కాదని కార్యక్రమాలు చేసేటంతటివాణ్ణా? మీకు తెలుసుకదా! నన్ను క్షమించి, మీరు వీలుచేసుకుని, వచ్చి పాల్గొంటే సంతోషిస్తాను. మీరు ఇక్కడవుండీ రాలేదంటే నేను చాలా బాధపడతాను. మీరు నా మనోభావం అర్థం చేసుకోవాలి సర్...." అనుభవం నేర్పిన మాటలు చెప్పాను. ముఖ్యమంత్రి పదవిలో వున్నప్పుడు వాళ్ళకి తమ అహం సంతృప్తి చెందటమే ముఖ్యం. అది జరగటంతో ఆయన శాంతించారు.

ఆ సాయంత్రం బెర్తు ప్రారంభోత్సవంలో దేవీలాల్ సమక్షంలో మాట్లాడుతూ, "మా ప్రసాద్ ఒక సమర్థుడైన ఆఫీసర్" అంటూ కితాబు నిచ్చారు.

నేను పనిచేసిన ముఖ్యమంత్రులతో అనుభవాలన్నీ ఒక ఎత్తు. ఎన్.టి.రామారావు గారితో అనుభవాలు మరో ఎత్తు. ఆయన నన్ను చాలా ఆప్యాయంగా ఒక సోదరుడిలా అభిమానిస్తున్న భావం కలిగిస్తూ, సాటి అధికారులు అసూయపడేంతగా నామీద ప్రేమ కురిపించారు.

కాని, అంతటి ముఖ్యమంత్రి సయితం 'రహస్య సమాచార వ్యవస్థ' మోసిన కథలు నమ్మి, నేను నమ్మలేనంత ఉద్రేకంతో నన్ను తూర్పారపట్టారు. నేను వెన్నుపోటు పొడిచానన్నారు.

అసలేం జరిగిందంటే......

★ ★ ★

సిఎంలూ- ఆగ్రహ కెరటాలు - 2

1984లో ....

"ప్రసాద్‌గారూ, మీరిలా నన్ను వెన్నుపోటు పొడుస్తారని ఎన్నడూ ఊహించలేదు" అని ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారు నిష్ఠూరంగా, ఆవేశంగా, కోపంగా నన్ను నిలదీసినప్పుడు నిశ్చేష్టుణ్ణయిపోయాను. సంగతేమిటో తెలియదు. సందర్భం లేదు.

ఉపోద్ఘాతంగాని, కారణంగాని చెప్పకుండా అంతంతమాటలంటే ఒకవేపు విపరీతమైన ఆవేశం నాకూ వచ్చింది. కాని ఆయన ముఖ్యమంత్రి. ఏమీ చెయ్యలేని నిస్సహాయత, ఎక్కడలేని నిస్పృహ నన్ను కమ్మివేశాయి....

"సర్... విషయం చెప్పకుండా, నేనేం చేశానో నాకు చెప్పకుండా అలా అనటం భావ్యమా?" అని నెమ్మదిగా అనగలిగాను.

"చెప్తానండీ ప్రసాద్‌గారూ, చెప్తాను. మీపై అంత నమ్మకం పెట్టుకున్నందుకు మీరు చేసిన దానికి చాలానే అనాలి... తప్పకుండా చెప్తాను. సంగతి విన్నప్పటినుంచీ నాకూ మనుషులమీద నమ్మకంపోతోంది" అన్నారు ముఖ్యమంత్రి.

'ప్రసాద్‌గారూ' అని సంబోధించడంలోనే తెలిసిపోయింది ఆయన చాలా కోపంగా వున్నారని. మామూలుగా నన్ను చూడంగానే , "హల్లో బ్రదర్" అని అప్యాయంగా సంబోధించే ముఖ్యమంత్రి 'ఏమండీ' అంటే అధికారికంగా ముఖ్యమంత్రి ఒక అధికారితో మాట్లాడుతున్నట్లు. 'ప్రసాద్‌గారూ' అని చాలా ఫార్మల్‌గా, కొంచెం వ్యంగ్యంగా పిలిస్తే, ఆయన చాలా కోపంగా వున్నట్లు అర్థమై పోతోంది. సాధారణంగా ఆయనకు బాగా కావల్సినవాళ్ళను, ఆయన సన్నిహితులను, నమ్మినవారిని... లేదా ఆంతరంగిక విషయం మాట్లాడుతూ అవతలవాడితో ఆయన మనస్సు విప్పిమాట్లాడుతున్నానన్న సందేశం యివ్వాలనుకున్నప్పుడు... 'బ్రదర్' అని సంబోధించేవారు. కాని,ఇప్పుడు పిలుపులో తేడా, కంఠధ్వనిలో తేడా, ఆగ్రహం, ఆవేశం...

ఆ రోజు సచివాలయంలో ముఖ్యమంత్రి గదిలో చాలా పెద్ద సమావేశం జరుగుతోంది. సమాచారశాఖ కార్యదర్శిగా, కమీషనరుగా ఏ సమావేశంలోనైనా, ఆహ్వానితుడనైనా కాకపోయినా నేను పాల్గొనే అధికారాలిస్తూ అంతకు కొన్ని నెలల క్రితమే ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేసి, ప్రభుత్వ యంత్రాంగంలో నాకో విశిష్టస్థానాన్ని కల్పించారు.

వేరే ఇతర పనులలో వుండి, యీ సమావేశానికి నేను కొంచెం లేటుగా వెళ్ళటంతో నెమ్మదిగా తలుపు తీసి ముఖ్యమంత్రి గదిలోకి వెళ్ళి ఆయన వెనక కుర్చీలో కూర్చున్నాను.

ముఖ్యమంత్రి నా రాక గమనించారుగాని, మామూలుగా నన్ను చూసినప్పుడు వచ్చే దరహాసం ఆయన ముఖంలో కనపడలేదు. కాని దాదాపు 15-20 మంది మంత్రులు, అధికారులు పాల్గొన్న సమావేశంలో ముఖ్యమంత్రి ముఖకవళికల్లో ఈ తేడాని నేనేకాదు, ఇతరులు కూడా కనిపెట్టడం గమనించాను.

నాకుగాని నా శాఖకుకాని సంబంధంలేనిది చర్చనీయాంశం. అయినా లేని సందర్భం తీసుకొచ్చి, సమాచార శాఖ పనితీరుపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. మా శాఖ గురించి ఆయన అట్లా మాట్లాడటం అదే మొదటిసారి. అవకాశం వచ్చినప్పుడల్లా మా శాఖను ఆకాశానికెత్తే ముఖ్యమంత్రి అనవసరంగా పనికట్టుకొని మా శాఖను ఎందుకు విమర్శించారో? సమాచారశాఖ మంత్రి చేగొండి హరిరామజోగయ్యగారు కూడా ఆ సమావేశంలో వున్నారు. ఆయన నావైపు 'ఇదేమిట'న్నట్లు చూశారు... అందులో 'నువ్వు మీటింగుకి రావడంతోనే ముఖ్యమంత్రి ఇలా ఎందుకన్నార'న్నట్లుగా ఓ ప్రశ్న నాక్కనిపించింది. నన్ను చూశాకే ఆపుకోలేక ముఖ్యమంత్రి అలా అన్నారని నాకూ అనిపించింది. నాకేమిటి- అక్కడున్న అందరికీ అలానే అనిపించివుంటుంది. తరువాత కొద్ది సేపట్లోనే ముఖ్యమంత్రి ఆ సమావేశాన్ని హడావుడిగా ముగించేశారు...

కలతపడిన మనసుతో నేను తొందరగా బయటకు వెళ్ళిపోతుంటే ముఖ్యమంత్రి "ప్రసాద్‌గారూ మీరు కొంచెం వుండండి" అని ఆదేశించారు. ముఖ్యమంత్రి, మా మంత్రి హరిరామజోగయ్య గారిని కూడా వుండమన్నారు. ఏదో విషయం చాలా తీవ్రంగా మాతో చర్చించాలని ముఖ్యమంత్రి తొందరపడుతున్నట్లు చెప్పకుండానే తెలుస్తోంది... అందరూ వెళ్ళిపోయారు - ముఖ్యమంత్రి, ఆయనకు ముఖ్యకార్యదర్శి శ్రీ శ్రావణకుమార్ తప్ప. ఆయనేదో రెండుమూడు ముఖ్యమైన ఫైళ్ళు ముఖ్యమంత్రితో సంతకం చేయించాలని వున్నారు. కాకపోయినా ఆయన సిఎంకి ముఖ్య కార్యదర్శి. కనుక ఆయనకు తెలియకుండా ముఖ్యమైన నిర్ణయాలు జరగవు.

ముఖ్యమంత్రికి చాలా ఆంతరంగికుడు. ఆయనకి ముఖ్యకార్యదర్శి. అంత సీనియరు అధికారి అయిన శ్రావణ్‌కుమార్ ఏదో ఫైలు తీసి, "ఇది అర్జెంటు సర్" అని ఇంకా ఏదో చెప్పబోయే లోపల, ముఖ్యమంత్రి "శ్రావణ్‌కుమార్‌గారు, కొంచెం తరువాత చూడకూడదా?" అన్నారు. శ్రావణ్‌కుమార్‌గారు మొహం చిన్నది చేసుకొని, "సరే, సరే సార్" అనేశారు.

ఇంకా ఏదో చెప్దామని ఆయన అనుకుంటున్నట్లు ముఖ్యమంత్రి గ్రహించారు... "ఇంకేమైనా వుంటే మళ్ళీ మాట్లాడదాం, తరువాత"... అని ఆయన కొంచెం అసహనంగా చూశారు. తనని వెళ్ళవచ్చునని ముఖ్యమంత్రి చేసిన సూచనగా గ్రహించిన శ్రావణ్‌కుమార్‌గారి మొహంలో రంగులు మారాయి. ఫైలు తీసుకొని బయటకు వెళ్ళిపోయారు.

నిజానికి నాతోనూ, మంత్రి హరిరామజోగయ్యగారితోనూ ముఖ్యమంత్రి మాట్లాడటానికి, శ్రావణకుమార్ గారు బైటకు వెళ్ళటం దేనికి? నాకూ కొంచెం ఆశ్చర్యం అనిపించింది.

అసహనంతో వున్న ముఖ్యమంత్రి, అలా శ్రావణ్‌కుమార్‌గారు బయటకువెళ్ళి తలుపువేశారో లేదో – "ప్రసార్‌గారూ, మీరు ఇంత మిత్రద్రోహం చేస్తారనుకోలేదు... నమ్మిన నన్ను వెన్నుపోటు పొడుస్తారా?..." అని ఉరుము ఉరిమినట్లు అనటంతో నాకు మతిపోయింది.

అసలు సంగతేమిటో తెలియదు. నేనీ గదిలోకి వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను ఆయన ధోరణి. మనిషిలో అలజడి కనుపిస్తోంది. కోపంతో వున్నట్లు తెలుస్తూనే వుంది. అందరినీ పంపించేసింది – నాతో ఈ మాట అనడానికేనా?–

నేను కొంచెం తేరుకొని... "అదేంటండీ, అలా అంటారు? నేనేం చేశాను?... సంగతి చెబితే నేనేమైనా చెప్పగలను. విషయం తెలియకుండా అంత అభాండం నామీద వేయటం ధర్మం కాదు సర్..."

"అవునండీ కమీషనరుగారూ, మీరు మా ప్రత్యర్థులతో చేతులు కలిపి మంతనాలాడటం ధర్మం. నేను ఏమైనా అంటే అది అధర్మం! మిమ్మల్ని ఇంతగా దగ్గరగా నమ్మినందుకు మంచి శాస్తి చేశారు..." ఆయన మాటల్లో ఉద్రేకం తగ్గలేదు.

ప్రత్యర్థులేంటి? మంతనాలు ఏంటి? నాకసలు అంతుబట్టలేదు. అదే అడిగేశాను. "అసలు విషయం చెప్పండి సర్, నేనేమైనా నా సంజాయిషీ ఇవ్వడానికి అవకాశం వుంటుంది."

మర్రిచెన్నారెడ్డిగారి ఆగ్రహావేశాలు రుచి చూసినవాణ్ణి కనుక ఎన్.టి.రామారావుగారి ముందు భయం కలగలేదు. కాని ఆదుర్దా, అలజడి నన్ను వెంటాడాయి. ఎవరో ఏవో చాడీలు మోసి వుంటారు. ఏం జరిగింది? ఆ కొద్ది క్షణాల్లో గత ఆరుమాసాల్లో జరిగిన విషయాలన్నీ నెమరువేసేశాను. అయినా అందలేదు. ముఖ్యమంత్రే అందుకున్నారు.

"మీరు క్రిందటి నెల 6వ తారీఖున కాంగ్రెసు నాయకుడు రోశయ్యగారితో మాట్లాడారా?"

నేనాలోచనలో పడ్డాను. గుర్తుచేసుకున్నాను. అవును. రోశయ్యగారు నాకు టెలిఫోనుచేసి మాట్లాడిన మాట వాస్తవమే. అయితే ఏంటి?

"...."

నేను చెప్పబోయేటంతలో మళ్ళీ ముఖ్యమంత్రే, అందుకున్నారు. "మీరు ఆ విషయం నాతో చెప్పకుండా దాచారు. ఇలా ఇంకా ఏం చేస్తున్నారో నాకు తెలియదు... ఏం మాట్లాడారో, ఎందుకు మాట్లాడారో నాకు తెలియాలి కదా? చెప్పాల్సిన బాధ్యత మీకు లేదా?..."

క్రమంగా ముఖ్యమంత్రి మనసుని ఆక్రమించుకుని వికటాట్టహాసం చేస్తున్న 'అనుమానం' అనే భూతం బయటపడింది.

ప్రతిపక్షంలో వున్న కాంగ్రెసు నాయకుడు కొణిజేటి రోశయ్యగారితో నేను టెలిఫోన్‌లో మాట్లాడాను. అదీ ఎప్పుడు? దాదాపు నెలరోజులక్రితం. అది ముఖ్యమంత్రికి ఇప్పుడు తెలిసింది. టెలిఫోన్‌లో ఆయన అడిగింది – "ఐఏఎస్ అధికారుల సంఘం ప్రకటనని పత్రికలకి మీరే ఇచ్చారా?"

దానికి నేపథ్యం ఏమిటంటే – "ఐఏఎస్ అధికారులంతా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారు?..." అని అర్థం వచ్చేలా కాంగ్రెసువారు విమర్శలు గుప్పించారు అంతకుముందు. దాన్ని త్రిప్పికొట్టాలని ఐఏఎస్ అధికారుల సంఘం భావించింది. మా విధేయత ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికే గాని, కొన్ని పార్టీలకి, కొంతమంది నాయకులకి కాదు. ఇది ప్రతి ఐఏఎస్ అధికారి నమ్మి ఆచరించి తీరాల్సిన సిద్ధాంతం. ఒక్కోసారి ఆయా నాయకుల పనితీరుని బట్టి వ్యక్తిగత అభిమానాలను అధికారులు పెంచుకోవచ్చు. కానీ, విధి నిర్వహణ దగ్గరకొచ్చేసరికి 'Boss is Boss'. అందుకే కాంగ్రెసు నాయకుల ప్రకటన మా ఐఏఎస్ అధికారుల సంఘానికి మింగుడు పడలేదు.

ఆ ఆరోపణని ఖండిస్తూ, కార్యదర్శి కాశీపాండ్యన్‌గారు ఒక ప్రకటనని పత్రికలకి విడుదల చేశారు. ఇదేదో సమాచార శాఖ ద్వారా నేనే పంపిణీ చేశానని రోశయ్యగారి అనుమానం.

ఒక రాజకీయ ప్రకటనకి ఖండన కూడా సమాచార శాఖ కమీషనర్ ద్వారానే విడుదల యిందంటే అర్థం ఏమిటి? ఐఏఎస్ అధికారులంతా అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నట్లే కదా! అంటే తమ ఆరోపణలకి మరో సమర్థన దొరికిందన్నమాట... ఇది రోశయ్యగారి వ్యాఖ్యాన చతురత.

నిజంగా ఆ ప్రకటనని నా కార్యాలయమే పత్రికలకి విడుదల చేసివుంటే ఆ పని సమర్థనీయం కాదనుకోవచ్చు. కాని నా కార్యాలయానికి సంబంధంలేదు. ప్రతిపక్షం అన్నాక దొరికిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుని అధికార పార్టీమీద విరుచుకుపడటం సహజం.

ఏమయినా జరిగింది చాలా చిన్న విషయం. రోశయ్యగారు అడిగారు. మాకు సంబంధంలేదని చెప్పాను. అయిపోయిందిగదా! ఇప్పుడెందుకు బయటికొచ్చింది?

అప్పుడు స్ఫురించింది. పోలీస్ ఇంటెలిజెన్స్ (రహస్య సమాచార వ్యవస్థ) ఛీఫ్ అప్పారావు కార్యాలయం చేస్తున్న పనుల్లో ఒకటి ముఖ్యమైన వ్యక్తుల టెలిఫోన్స్‌ని 'ట్యాప్' చేయటం. ఈ టెలిఫోన్‌లు అధికార పార్టీవి కావొచ్చు, అపోజిషన్‌వి కావచ్చు, అధికారులవి కావచ్చు. ఎవరెవరిమీద అనుమానం వుంటే వారి ఫోన్‌లు.

అంటే- ఆ రకంగా రోశయ్యగారి ఫోన్‌నిగాని, నా ఫోన్‌ని గాని ఇంటెలిజెన్స్ వాళ్ళు ట్యాప్‌చేసి వుంటారా?... అర్థమైపోయింది.

ముఖ్యమంత్రిలో మాత్రం ఆవేశం, అనుమానం ఎగిసిపడుతూనే వున్నాయి.

ఆయన ధోరణిలో ఆయన మాట్లాడుతూనేవున్నారు. నేను మధ్యలో కల్పించుకొని "ముఖ్యమైన విషయమైతే మీతో చెప్పేవాడినే కదా సర్" అని ఇంకా ఏదో చెప్పబోయేంతలో మళ్ళీ ఆయన కల్పించుకున్నారు.

"నేనడిగాక కప్పిపుచ్చుకోవడానికి ఏదో సమాధానం చెప్పకండి... ప్రతిపక్ష నాయకులతో మీరు మాట్లాడాల్సిన అవసరం ఏమొచ్చింది? ఏం మంతనాలు, రహస్య సంభాషణలు చేస్తున్నారు?..." ఆయన గొంతులో ఒక నేరస్థుణ్ణి చీల్చి చెండాడుతున్నంత కసి లుసలుకొడ్తోంది.

దాంతో నాలో బాధ, కోపం, ఆవేశం పొంగుకొచ్చాయి. ముఖ్యమంత్రి నా విశ్వాసాన్ని శంకించడం సహించలేకపోయాను. ఏం మాట్లాడుతున్నానో ఆలోచించి మాట్లాడే సహనంలేదు. కుండబద్దలు కొట్టినట్లు చెప్పాల్సింది చెప్పితీరాలనిపించింది. అంతే, ఆయన కంటె బిగ్గరగా మాట్లాడుతూ చెప్పదలచుకున్నది చెప్పేశాను.

"అయ్యా, నా టెలిఫోనో, రోశయ్యగారి టెలిఫోనో పోలీసువాళ్ళు ట్యాప్ చేసి మీ దృష్టికి తెచ్చివుంటారు. ఆ అప్పారావో మరో ఆఫీసరో మీకు ఏం చెప్పారు? నేను రోశయ్యగారికి టెలిఫోను చేశానా? రోశయ్యగారు నాకు టెలిఫోను చేశారా? అది చెప్పారా?... నేను..."

నా మాట మధ్యలోనే ముఖ్యమంత్రి అందుకొన్నారు. "అది నా కనవసరం. రోశయ్యగారితో మాట్లాడిన మాట మీరు నాతో చెప్పలేదు... అది..."

నేనూ అడ్డంపడ్డాను. ఆయన మాట మధ్యలోనే అందుకొన్నాను. "అది తెలుసుకోవడం అవసరమే సర్. అసలు విషయమేమిటంటే రోశయ్యగారు – సమాచార శాఖవారు, ఐఏఎస్ అధికారుల సంఘ కార్యదర్శి కాశీపాండ్యన్‌గారి పత్రికా ప్రకటనను పత్రికలవారికి అంద చేశారని అభియోగం మోపాలనుకున్నారు. దాని గురించి నిజమేమిటని ఆయన టెలిఫోన్ చేసి అడిగితే 'మా శాఖకు ఆ పత్రికా ప్రకటనతో ఎలాంటి సంబంధం లేదు' అని చెప్పడంతో ఆయన చేద్దామనుకున్న అభియోగాన్ని పత్రికలముందు చేయకుండా విరమించుకొన్నారు. అదేమంత పెద్ద విషయంగాని, ముఖ్యమైనదిగానీ కాదని మీకు చెప్పలేదు..."

"ముఖ్యమైనదో కాదో మీరే నిర్ణయిస్తారా?" అంటూ ఎన్.టి.రామారావుగారు నన్ను నిలదీశారు. అక్కడితో నాలో ఉన్న కాస్త సహనం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. నేనూ ఉద్వేగంగా మాట్లాడేశాను.

"సర్, అది మేము నిర్ణయించలేకపోతే, మేము మా ఉద్యోగం చేయలేం, మీరూ మీ ఉద్యోగం చేయలేరు. నేను రోజూ వందలమందితో మాట్లాడతాను. నా శాఖ పని అటువంటిది. నేనెవరితో ఏం మాట్లాడిందీ మీకు చెబుతూ కూర్చుంటే మీరు మీ ముఖ్యమంత్రి పని చేయడానికి టైమ్ వుంటుందా? మాకు బాధ్యత అప్పగించాక, మామీద నమ్మకం వుంచాలి కదా?"... అంటూండగానే ఆయన అందుకొన్నారు. "మా జాగ్రత్తలో మేం వుండనక్కరలేదా? అందరినీ గుడ్డిగా నమ్మేయమంటారా?" అని సూటిగా ప్రశ్నించారు.

నాలో విపరీతమైన కోపం, కసి, కడుపుమంట తన్నుకొచ్చాయి.

నామీద నాకు స్వాధీనం తప్పింది.

లేచి నిలబడ్డాను. ఇంకా గట్టిగా, ఉద్రేకంగా అరవటం మొదలుపెట్టాను. "అయ్యా, మీరు నా మీద పెట్టిన నమ్మకానికి చాలా కృతజ్ఞుణ్ణి... తెల్లవారుఝామునే లేచి, నాలుగుగంటల లోపల తమ కొలువుకు రావాలి. నాలుగు ఆఫీసుల పని చూసుకోవాలి. ప్రభుత్వంలో మీటింగులు, పత్రికలవాళ్ళతో, కళాకారులతో, సంస్థలతో, మీ రాజకీయ చర్చలతో, నిర్ణయాలతో అర్ధరాత్రి వరకు తీరిక లేకుండా పనిచేయాలి. సెలవులు లేవు, పండగలు లేవు. కుటుంబంతో గడిపే సమయంలేదు. మీమీద అభిమానంతో యింత చేస్తుంటే, మీరు నాకిచ్చిన సర్టిఫికెట్ 'వెన్ను పోటుదారుడు'. నామీద నమ్మకంలేదని, నా వెనకాల 'నేనెవరిని కలుస్తున్నానూ, ఎవరితో మాట్లాడుతున్నానూ' అని ఆరాలు తీయడానికి పోలీసులను పంపుతున్నారు. టెలిఫోన్ ట్యాప్ చేయిస్తున్నారు..."

అప్పటిదాకా ఏమీ మాట్లాడకుండా మా ఇద్దరి సంభాషణ వింటూ కూర్చున్న మంత్రి హరిరామజోగయ్యగారు నా చేయి పట్టుకొని కూర్చోపెట్టడానికి ప్రయత్నం చేశారు.

కాని అహం దెబ్బతిని, ఆత్మాభిమానం పోడుచుకొస్తుంటే నమ్మకద్రోహినన్న అభియోగంతో కడుపు మండిపోతున్న నేను, ఆయన ఆపినా ఆగే పరిస్థితిలో లేను.

"... చాలు, ఈ కొలువు చాలు. నామీద నమ్మకం పోయాక, ఇక్కడ పనిచేయడం నాకూ మంచిదికాదు, మీకూ క్షేమంకాదు... నేను శెలవుమీద పోతాను... మీకు నమ్మకమున్నవాణ్ణి తెచ్చుకోండి..." అని ఓ నమస్కారం పెట్టేసి వెళ్ళబోతూంటే...

"బ్రదర్, బ్రదర్ - మెల్లగా మాట్లాడు, గొంతు తగ్గించు, బయటవారు వింటారు" అని ముఖ్యమంత్రి ఒక చేయిపట్టుకొని, నన్ను ఆపే ప్రయత్నం చేశారు. ఆగాను.

ఆగి, చూద్దునుకదా ! టేబుల్‌కి అవతలవైపు ముఖ్యమంత్రి, ఇవతలవైపు నేనూ, మంత్రి హరిరామజోగయ్య - ముగ్గురం నిలబడే వున్నాం. నా కుడిచెయ్యి ముఖ్యమంత్రి పట్టుకుంటే, నా ఎడమచేయి హరిరామ జోగయ్యగారి చేతుల్లో వుంది... ఇద్దరూ నావైపు ఆశ్చర్యంగా చూస్తున్నట్లనిపించింది. స్పృహలోకి వచ్చాను.

"బ్రదర్, కామ్‌డౌన్... కామ్‌డౌన్" అంటూ ముఖ్యమంత్రి ఒక గ్లాసు మంచినీళ్ళు అందించారు. అనాలోచితంగా గడగడ తాగేశాను.

"కూర్చోబ్రదర్... నాకు మీమీద చాలా నమ్మకం, చాలా గౌరవం, అభిమానం. నా మేలుకోరేవారన్న ధైర్యం అది వరకూ, ఇప్పుడూ, ఎప్పుడూ వున్నాయి, వుంటాయి... ఏదో జరుగుతున్నట్లు, తెరవెనక ఏదో గూడుపుఠానీ జరుగుతున్నట్లు ఇంటెలిజెన్స్ విభాగంవారు

చిత్రీకరిస్తే, నాకు నమ్మకం లేకపోయినా, ఇక్కడ తప్పరు. ఇవి రాజకీయాలు కదా! మాకూ కొత్తే కదా! ఏం చేయాలో తోచలేరు. వారి మాట విని, మిమ్మల్ని వదులుకోవాలని లేదు. కానీ అనుమానం.... ఏం చేయాలా అని ఆలోచించి - మిమ్మల్నే డైరెక్ట్‌గా అడిగేస్తే బెటర్ అనుకొని అడిగాను. నాకు నిజంగా మీమీద నమ్మకం లేకపోతే, మీతో మాట్లాడకుండా వెంటనే బదిలీ చేసేవాడిని కదా! నా కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌ని కూడా పంపించేసి, మీ ఇద్దరితోనే మాట్లాడటానికి కారణం మీమీద నమ్మకమే. మనం ఒక దగ్గరి కుటుంబసభ్యులం బ్రదర్... మీరు నా చెవులు, కళ్ళు. నిజానికి ఇంటెలిజెన్స్ వాళ్ళు ట్యాప్ చేసింది మీ ఫోనుకాదు? సంగతేమిటో తెలుసుకొందామనే కొంచెం నిష్కర్షగా, ఖచ్చితంగా నమ్మకం పోయినట్లు నటించి, ఏమంటారో చూద్దామని, మీ అభిమానంమీద దెబ్బతీశాను. మీరు నాకెప్పుడూ నమ్మకస్తులే?- సారీ బ్రదర్, జరిగిందేదీ మనస్సులో పెట్టుకోవద్దు..."

ఇంకా నేను శాంతించానో లేదోనని, ముఖ్యమంత్రి మా ముగ్గురికీ 'బటర్‌మిల్క్' ఆర్డర్ చేశారు.!

★ ★ ★

సిఎంకి నేను చాలా 'దగ్గర'

ఒక్క జీ.ఓ తో ముఖ్యమంత్రి ఎన్.టీ.రామారావు నా ప్రాధాన్యత పెంచేశారు. "ముఖ్యమంత్రి నిర్వహించే ప్రతి అధికారిక సమావేశంలోనూ సమాచారశాఖ కమీషనర్ పాల్గొనవచ్చు." ఇదే ఆ జీ.ఓ. సారాంశం.

ఈ జీ.ఓ చూసి కొంతమంది అసూయచెందారు. కొందమంది అభినందించారు. మరికొంతమంది ఆశ్చర్యపడ్డారు. ఈ అభినందనల పరంపరతో నాకర్థమైందల్లా ముఖ్యమంత్రికి నేను ఎంతో దగ్గరగా ఉంటానని అందరికీ తెలియటానికి ఇది ఉపయోగపడుతుంది. నిజానికి ఆ జీ.ఓ ఉన్నా, లేకపోయినా ప్రతిరోజూ వచ్చిన వార్తల గురించీ, ఇతర ప్రచార అంశాల గురించీ ఆయన దృష్టికి తీసుకురావటం - సమాచార శాఖ కమీషనర్‌గా నేను రోజూ చేస్తూ ఉన్నదే. బహుశా, నేను ఇంకా క్షుణ్ణంగా ప్రభుత్వంలోని ప్రతి విషయాన్ని తెలుసుకొని ఉండాలని ముఖ్యమంత్రి భావించారేమో- అనుకున్నాను ఆ జీ.ఓ గురించి.

అసలప్పటికే ఒక ప్రచారం - ప్రభుత్వాధికారుల్లో నడుస్తుండేది. ఏ విషయమైనా ముఖ్యమంత్రి దృష్టికి వెళ్ళాలంటే ప్రసాద్‌కి చెప్పేస్తే చాలు. ప్రచారంలో వాస్తవం ఎలా ఉన్నా, ముఖ్యమంత్రి నన్ను విశ్వాసంలోకి తీసుకుంటారు అన్న భావం నాకు చాలా సందర్భాలలో కలిగింది.

ఒకసారి తెల్లవారుఝామున అకస్మాత్తుగా ముఖ్యమంత్రి నాకు ఫోన్ చేశారు. "పద్మశ్రీ వగైరా అవార్డుల కోసం మన రాష్ట్రం నుంచి కొన్ని పేర్లు కేంద్రానికి నామినేట్ చేస్తున్నాం. మనవాళ్ళు (చీఫ్ సెక్రటరీ తదితరులు) ఒక జాబితా తీసుకువచ్చారు. మీరు సాంస్కృతిక శాఖకి కూడా కార్యదర్శి కదా. ఏమైనా కొన్నిపేర్లు చెప్పగలరా బ్రదర్." ముఖ్యమంత్రి అడుగుతున్నారు.

నాకు సంభ్రమం. "సినిమా సాంస్కృతిక రంగాల్లో మీకు తెలీని ప్రముఖులు ఎవరు ఉంటారు సార్... అయినా అడిగారు కనుక తోచిన ఒక పేరు చెబుతాను. వేదవేదాంగాలను ఔపోసన పట్టిన మహాపండితుడు ఉప్పులూరి గణపతిశాస్త్రికి 'పద్మవిభూషణ్' సిఫార్సు చేస్తే బాగుంటుందేమో ఆలోచించండి సర్..."

ఒక మూడు వారాల తరువాత ముఖ్యమంత్రి నన్ను పిలిపించి ఒక నవ్వు నవ్వారు. "ఏం బ్రదర్ మనం తయారుచేసిన జాబితాలో ఏ ఒక్కరికీ 'పద్మ' అవార్డు రాలేదు - ఒక్క మీరు చెప్పిన గణపతిశాస్త్రికి తప్ప. Thanks for your timely suggestion."

అంత చనువు నాకు ముఖ్యమంత్రి ఇచ్చారు. కాని ఆ 'చనువు' ఎంత గొప్పదో నాకు తెలియటానికి చాలాకాలం పట్టలేదు.

రాష్ట్రంలో సంగీత నృత్య నాటక సాహిత్య అకాడమీల పనితీరుపై ప్రముఖ పత్రికా సంపాదకులు నార్ల వేంకటేశ్వరరావుతో ప్రభుత్వం వేసిన కమీషన్ తన నివేదిక పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేసింది. ముఖ్యమంత్రి నివేదికను గురించి పత్రికా విలేకరుల సమావేశంలో వెల్లడిస్తూనే, "అందుకే ఈ అకాడమీలను రద్దుచేస్తున్నాం" అని కూడా ప్రకటించారు. అంతే, అకాడమీలు మూడూ - సంగీత నృత్య అకాడమీ, సాహిత్య అకాడమీ, నాటక అకాడమీ - ఒక్కసారి రద్దయిపోయాయి. (అవి రద్దయిన నేపథ్యంలో సమాచారశాఖ సాంస్కృతిక శాఖకు కార్యదర్శిగా నేను బాధ్యతలు స్వీకరించాను.)

ఈ నిర్ణయం ఒక్కసారిగా సాహిత్య కళాభిమానులలో తీవ్ర నిరసన పెల్లుబికటానికి కారణమైంది. "ఈ ప్రభుత్వం సాహిత్య, కళా పిపాసులకు వ్యతిరేకం" అంటూ విస్తృత ప్రచారం జరిగింది.

"ఏం చేయాలి? ఏం చేయాలి? ...ఏదో చేయాలి.... ప్రభుత్వ ప్రతిష్ఠకు ఇదొక మాయనిమచ్చ కాకూడదు. ఏదో చేయాలి" అన్న తపన నన్ను వెంటాడింది. సాంస్కృతిక శాఖ కమీషనర్గా, కార్యదర్శిగా ఏదన్నా చేసే అవకాశం నాకే ఎక్కువగా ఉంది. కాని ఏం చేయాలి?

అకాడమీతోపాటు సాంస్కృతికశాఖ డైరక్టరేట్ కూడా ఖాళీ అయిపోయింది. ఈ డైరెక్టరేట్లో అంతకుముందు ఇతరశాఖలనుంచి డెప్యుటేషన్ మీద వచ్చి పనిచేస్తున్నవాళ్ళందర్నీ ఆయా శాఖలకు వెనక్కి పంపేశారు. ఒక్క 'ఈలపాట' శివప్రసాద్, మరో చిరుద్యోగి మిగిలారు. సాంస్కృతికశాఖలో ఏ కార్యక్రమం చేపట్టాలన్నా, ముందు సిబ్బంది వుండాలిగదా! డైరక్టరేట్లోకీ, రవీంద్రభారతికీ అధికారుల్ని నియమిస్తేగాని ఒక్క అడుగుకూడా ముందుకుపోలేని శూన్యం ఏర్పడింది.

లాగా ఆలోచించి కనీస సిబ్బంది వుండేలా ఒక ప్రతిపాదన తయారుచేశాను. అందులో భాగం - గతంలో డెప్యుటేషన్ మీద పనిచేసిన ఇద్దరు సమర్థులైన అధికారుల్ని మళ్ళీ సాంస్కృతిక శాఖకు రప్పించటం. ఆ శాఖకు కార్యదర్శిగా ఆ ఇద్దర్నీ తెచ్చుకోవడం నా అధికార పరిధిలో విషయం. చాలా సులభం. అంతా సిద్ధమయ్యాక, ఎందుకో మనసు పీకుతోంది... అంతకుముందు నేను లండన్లో కోర్సు నుంచి తిరిగి వచ్చినప్పుడు నాకు పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వం చాలా తాత్సారం చేసింది. "ఏమిటి విషయం?" అని అడిగితే కొత్త ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావుగారిని కలవమన్నారు. అతికష్టంమీద కలిస్తే, ఆయన ఏమడిగారు? "తిరుపతి దేవస్థానంలో (1978-82 కాలంలో) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా మీ పనితీరుపై మూడు తీవ్ర ఆరోపణలు వచ్చాయి. వాటికి మీ సమాధానం ఏమిటి?"

ఆ భగవంతుడిమీద భారంవేసి నేను అణుచుకోలేని భావోద్వేగంతో సమాధానాలు చెప్పాక, ఆయన సంతృప్తి చెంది, పోస్టింగ్ ఇచ్చారు. కాని ఆయన నామీద మోపిన మూడు అభియోగాలలో ఒకటి - "మీరు తిరుపతి దేవస్థానంలో బ్రాహ్మణులనే ఎక్కువగా ప్రోత్సహించారట గదా!"

అవును. నిత్య వేదపారాయణ వంటి పథకాలు ప్రకటిస్తే వచ్చిన వాళ్ళంతా వాళ్ళే. ఏం చేస్తాం? అదే చెప్పాను... యాదృచ్ఛికంగా, ఇప్పుడు నేను డిప్యుటేషన్‌లో మళ్ళీ సాంస్కృతిక శాఖకు తీసుకు రావాలనుకుంటున్న వాళ్ళిద్దరూ కూడా బ్రాహ్మణులే. రేపు ఎవరన్నా ఈ విషయాన్ని వక్రీకరించి ముఖ్యమంత్రికి మోయచ్చుగదా!

ప్రభుత్వంలో పనిచేయాలని ప్రయత్నించే ప్రతి అధికారికీ, ఉద్యోగికీ ప్రథమ శత్రువు వాళ్ల ప్రక్కనుండే అసూయాపరులు. వాళ్ళు పని చేయలేరు. లేదా చేయడానికి ఇష్టపడరు. ఇంకొకడు పనిచేస్తుంటే, దాన్ని ఎవరన్నా గుర్తిస్తే భరించలేరు. ఈర్ష్యా, అసూయా ఆవహించి ఎలాంటి అభాండాలు వేసే స్థాయికైనా వాళ్ళని దిగజారుస్తాయి. అందుకే రామారావుగారితో ఒక అనుభవం ఎలాగూ వుంది కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా ఈ డెప్యుటేషన్ అధికారుల గురించి ముందే ఆయనకి చెప్పి, ఆయన ఆమోదంతో చేస్తే పోతుంది గదా అనుకున్నాను. ముఖ్యమంత్రి దగ్గర డిప్యూటీ కార్యదర్శిగా ఉన్న మోహన్‌కందాని (సాంస్కృతిక వ్యవహారాలు కూడా చూస్తుంటాడు) తీసుకుని ముఖ్యమంత్రి దగ్గరికెళ్ళాను. విషయం వివరించాను.

"సాంస్కృతిక శాఖ పునరుద్ధరణకి నేను డెప్యుటేషన్ మీద ఇద్దరు సమర్థులైన వాళ్ళని ఇతర శాఖలనుంచి తీసుకోవాలనుకుంటున్నాను. కానీ వాళ్ళిద్దరూ బ్రాహ్మణులు. మీరు ఆమోదిస్తేనే..."

రామారావుగారు ఛివాల్న తలెత్తి నావైపూ, మోహన్‌కందా వైపు తీక్షణంగా చూశారు!!! అంతలోనే చిరునవ్వు నవ్వుతూ అన్నారు : "బ్రదర్, ఏమనుకుంటున్నారు మీరు? బ్రాహ్మణులంటే నాకేమీ ద్వేషం లేదు. మీకు అలాంటి అభిప్రాయం కలిగివుంటే - అయాం వెరీ వెరీ సారీ. సమర్థత ముఖ్యం తప్ప కులంకాదు. వాళ్ళ సామర్థ్యం పట్ల మీకు విశ్వాసం వుంటేచాలు. You can go ahead..."

మొత్తంమీద నా ప్రతిపాదనను ముఖ్యమంత్రి ఆమోదించారు. అధికారులు, ఇతర సిబ్బంది నియామకం జరిగిపోయింది.

ఇంకో అడుగు ముందుకెళ్ళి, అకాడమీల రద్దు ప్రభావాన్ని మరుగుపరచేలా క్రొత్త కార్యక్రమాన్ని రూపొందించి సాంస్కృతిక శాఖామంత్రి శ్రీమతి ప్రతిభా భారతి ముందు పెట్టాను. ఈ కార్యక్రమంతో కళాకారుల, సాహిత్యాభిమానుల దృష్టిలో ప్రభుత్వ ప్రతిష్ఠ నిలబడుతుంది, ఇనుమడిస్తుంది - అని ఆమె ఆనందం వ్యక్తంచేశారు.

కార్యక్రమం అమలు చేశాం. దాని ప్రకారం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సాహితీవేత్తలు/ రచయితలకు ఆర్థిక సహాయం అందిస్తాం. ఏ ఆధారమూలేని వృద్ధ కళాకారులకు పింఛన్లు ఇస్తాం. ఒక నిబద్ధతతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంస్థలకు 'కల్చరల్ గ్రాంట్స్' అందజేస్తాం. ఏవైనా సంస్థలు ఆడిటోరియమ్‌ల నిర్మాణం వంటి శాశ్వత సదుపాయాల కల్పన చేపడితే, వారికి 'మ్యాచింగ్ గ్రాంట్' ఇస్తాం.

రవీంద్రభారతిలో వారమంతా నృత్య, సంగీత, సాహిత్య కార్యక్రమాలు ఉండేలా ఒక్కోరోజు ఒక్కో శ్రేణికి కేటాయించాం. ప్రతి మంగళవారం 'కళామంగళ' పేరుతో ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని సాంస్కృతిక శాఖే నిర్వహిస్తుంది. సురభి సంస్థవారి ప్రదర్శనలకు ప్రోత్సాహకాలిస్తాం. జిల్లాల్లో కమ్యూనిటీ సెంటర్లలో పిల్లలకోసం కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో బోధించే టీచర్లకు ఆర్థిక సహాయం అందిస్తాం. బాలల అకాడమీ ద్వారా కర్ణాటక సంగీతంలో తయారైన దైవభక్తి, దేశభక్తి గీతాల క్యాసెట్లను పాఠశాలలకు సరఫరా చేస్తాం.

ఏయే సంస్థలు, వ్యక్తులు ఈ సహాయానికి అర్హులో ఎవరు నిర్ణయిస్తారు? అందుకని జిల్లా కలెక్టర్ల సారథ్యంలోనే జిల్లా సాంస్కృతిక మండళ్ళు ఏర్పాటుచేసి, వాటి సిఫార్సు ఆధారంగా ఈ ఎంపిక జరగాలని నిర్ణయించాం. రాష్ట్ర స్థాయిలో ఒక నిపుణుల కమిటీ ఈ సిఫార్సులని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుంది.

సాంస్కృతిక శాఖామంత్రి శ్రీమతి ప్రతిభాభారతి అధ్యక్షతన ఈ నిపుణుల కమిటీని ఖరారు చేశాం. ఈ విధానం అంతా ఆమెకు చాలా సంతృప్తి కలిగించింది. కానీ నా మనస్సులో ఎక్కడో ఒక సంశయం వెంటాడుతోంది. మీటింగ్ అవగానే మంత్రితో విడిగా సమావేశమై నా సంశయం ఆమె ముందు పెట్టాను.

"మేడమ్ మీరు ఖరారు చేసిన సంస్థలు, గ్రాంటులు వగైరా వివరాల్ని ముఖ్యమంత్రి గారికి కూడా ఓసారి చెబితే బాగుంటుందేమో!"

"తప్పకుండా చెబుదాం. ఆయన సంతోషిస్తారు."

"వెంపటి చినసత్యంగారి వంటి కొన్ని పేర్లు వుండటం ముఖ్యమంత్రిగారికి నచ్చకపోవచ్చేమోనని నా అనుమానం. ఎందుకైనా మంచిదని..."

"చాలా అన్యాయంగా మాట్లాడుతున్నారండీ. ముఖ్యమంత్రిగారు అలా సంకుచితంగా ఆలోచించే మనిషికాదు. అయినా ఈ నిర్ణయం తీసుకునే అధికారం నాకు లేదా? ఆయనకి చెప్పటం అవసరమా?"

"టెక్నికల్‌గా మాట్లాడితే ఈ విషయంలో తుదినిర్ణయం ఈ కమిటీదే. అయినప్పటికీ ముఖ్యమంత్రికి చెప్పాలావద్దా అన్నది మీ ఇష్టం. అయితే వీటిల్లో ఆయనకి నచ్చని పేర్లేవయినా ఉంటే రేపు వాటిని తొలగించగలమా? ఇంత కసరత్తు చేశాక పేర్లు మారిస్తే బాగుంటుందా?... మీరు చెప్పనంటే నేనూ చెప్పను."

"లేదు, లేదు ముఖ్యమంత్రిగారు అలా సంకుచితంగా ఆలోచించే మనిషికాదు, నాకు తెలుసు గదా..." అని ఆమె విశ్వాసం వ్యక్తం చేస్తూ, "మంచి పనే చేస్తున్నాం గదా!... మార్చినెల మధ్యలో వున్నాం. ఆలస్యమైతే చేసిందంతా వృథా అవుతుంది... మనం కానిచ్చేద్దాం" అని ముక్తాయింపు ఇచ్చారు.

నేను మాట్లాడలేరు.

రాష్ట్రవ్యాప్తంగా 340 సాంస్కృతిక సంస్థలకు ఏటా మూడు కోట్ల రూపాయల మేరకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం అమలు జరిగితే (అకాడమీల రద్దువల్ల కలిగిన) చెడ్డపేరు పోతుందనీ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుందనీ ఆమె ఆశ, నా కోరిక. అదే తన్మయత్వంలో మునిగిపోయాం.

★ ★ ★

సమాచార శాఖకి కమీషనర్‌గా, కార్యదర్శిగా కూడా నాకు విస్తృతమైన బాధ్యతలు ఉన్నాయి. సమాచారశాఖలో అప్పుడున్న అధికారులంతా మరో 4-5 ఏళ్ళల్లో రిటైరయిపోతున్నారు. ఒక్కసారిగా శాఖ అంతా ఖాళీ అయిపోయే పరిస్థితి. డివిజినల్ పిఆర్‌ఓ పోస్టులు కొత్తగా సృష్టిస్తూ, ప్రతి జిల్లాకి ఒక 'ప్రగతిపథం' బస్సు వంతున బస్సులు, కొన్ని కొత్త వాహనాలు కొనుగోలు చేస్తూ, ఈ శాఖకు క్రొత్త జవసత్వాలు తీసుకువచ్చే ఒక ప్రతిపాదనని సి.ఎం ముందు పెట్టాను. ఆయన ఆమోదించారు. వెంటనే పి.ఆర్.ఓ పోస్టులకు దరఖాస్తులు పిలిచాం.

ఈ దరఖాస్తుల్లోంచి కమిటీ ఎంపిక చేసిన (కనీస అర్హతలున్న) అభ్యర్థులకు వ్రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఏర్పాటుచేశాను. పరీక్షా పత్రాన్ని పరీక్షకు అరగంట ముందుగా నా గదిలోనే ఎగ్జామినర్లు తయారుచేస్తారు. నా ఆఫీసు ఎదురుగా ఉన్న గాంధీభవన్ ఆడిటోరియంలో పరీక్ష జరుగుతుంది. ఎగ్జామినర్లు నాతోనే ఉంటారు. పరీక్ష కాగానే అంతా నాతోపాటు నా ఆఫీసుకే వచ్చి, పేపర్లు దిద్ది, మార్కులు వేసి వెళతారు. వాళ్ళ ముగ్గురూ అన్ని పేపర్లూ దిద్దుతారు. వాటి సగటు మార్కుల్ని (60 మార్కుల పేపరు) బట్టి అభ్యర్థుల శ్రేణి నిర్ణయమవుతుంది...

మర్నాడు జరిగే ఇంటర్వ్యూకి 40 మార్కులు. అందులో 30 మార్కులు అభ్యర్థుల విద్యార్హతల్ని బట్టి ఉంటాయి. మిగతా పది మాత్రమే మౌఖిక ప్రశ్నలకిచ్చే జవాబులకి.

ఆ పరీక్ష ఆరోజు ఉదయం ప్రారంభం కాబోతోంది. రాజకీయ ఒత్తిళ్ళ ప్రభావంలేని విధంగా అభ్యర్థుల్ని ఎంపిక చేస్తున్నామన్న ఆనందం, ఇది విజయవంతం కావాలన్న ఆశ నన్ను వెంటాడుతున్నాయి. ఈ విధానంలో అభ్యర్థుల ఎంపిక రాజకీయ వర్గాలకు రుచించేది కాదని నాకు తెలుసు. అయినా మంచి అభ్యర్థుల ఎంపిక జరగాలంటే ఇది తప్పదు.

పరీక్షలు జరిగిపోయాయి. మార్కులు నోటీసు బోర్డులో పెట్టేశాం అదే సాయంత్రం.

మర్నాడు తెల్లవారుఝామున ముఖ్యమంత్రిని కలిసే పని పూర్తి చేసుకొని, ఆయన చీఫ్ సెక్రటరీతో కలిసి ఎయిర్ పోర్టుకి వెళ్ళేదాకా ఉండి వచ్చేశాను. (ఆయన బెంగుళూరు వెళ్తున్నారు)... ఇంకో అరగంటలో ఇంటర్వ్యూ ప్రారంభం కాబోతుండగా నాకు ఒక ఫోన్‌కాల్ వచ్చింది.

జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి కార్యదర్శి శ్రీమతి సతీ నాయర్ ఫోన్ చేశారు. "ప్రసాద్, మిమ్మల్ని రిలీఫ్ కమీషనర్‌గా బదిలీ చేశారు తెలుసా?"

నేను...!! నివ్వెరపోయాను. బదిలీ అయినందుకుకాదు - అరగంట క్రితం నాతో మాట్లాడుతూవున్న ముఖ్యమంత్రి నాకు ఒక్కమాట కూడా చెప్పకుండా చేసేశారే!

ముఖ్యమంత్రికి నేను "ఎంత దగ్గర" అని నలుగురూ చెప్పుకునేవాళ్లో గుర్తొచ్చి నవ్వు కున్నాను...

అగమేఘాలమీద సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ బాధ్యతల్ని సి.వి. నరసింహారెడ్డికి, సాంస్కృతిక శాఖ బాధ్యతల్ని సుబ్బారావుకి అప్పగించి ఓ అరగంటలో ఇంటర్వ్యూ మొదలవుతుందనగా రిలీవ్ అయిపోయాను - రిలీఫ్ కమీషనర్‌గా చేరటం కోసం...

నేను లేకపోయినా ఇంటర్వ్యూ ఫలితాన్ని ఎవరూ మార్చలేరు. ఎందుకంటే మౌఖిక పరీక్షలో మార్కులు 10 శాతం మాత్రమే... మరి నా బదిలీ ఎందుకు జరిగింది? అప్పటికి నెలముందే నాకు బదిలీ కావాలని చీఫ్ సెక్రటరీ శ్రావణ్ కుమార్‌ని కోరివున్నాను. "Are you mad? ఆయన ఒప్పుకుంటారా" అని ఎదురు ప్రశ్నించారు శ్రావణ్‌కుమార్.

అయినా ఆయన ముఖ్యమంత్రిని కలిసి నా అభ్యర్థన గురించి అడిగారు.

ఆ తరువాత నన్ను పిలిచి, "ముఖ్యమంత్రి కుదరదని చెప్పారు ప్రసాద్" అని కూడా చీఫ్ సెక్రటరీ చెప్పేశారు.

* * *

ఓ వారం తరువాత సి.ఎం కార్యదర్శి యు.బి. రాఘవేంద్రరావు చెప్పాడు. "బాస్, కళాకారులకి పెన్షన్లు, ఎయిడ్ అంటూ కోట్ల కొద్దీ రూపాయలు నీ ఇష్టం వచ్చినట్లు, ఇష్టం వచ్చినవాళ్ళకి పంపిణీ చేస్తున్నావనీ, జీ.ఓ కూడా నువ్వే జారీచేశావనీ ముఖ్యమంత్రికి ఎవరో మోశారు. ఆయన హుటాహుటిన నిన్ను బదిలీ చేయించి, యుద్ధప్రాతిపదికన ఆ ఫైళ్ళన్నీ తెప్పించి, పరీక్ష చేయించారు..."

"ఏం తేల్చారుట?"

రాఘవేంద్రరావు ఒక చిన్న నవ్వు నవ్వాడు.

"నేరం ఎంచడానికి ఏమీ లేదని తేల్చారు..."

మళ్ళీ నవ్వుకున్నాను. "ముఖ్యమంత్రికి ఎంత దగ్గరో!"

* * *

ఓ 10 మాసాల తరువాత నన్ను రిలీఫ్ కమీషనర్ పోస్టు నుంచి ఎక్సైజ్ కమీషనర్ పోస్టుకి మార్చారు.

నేను వెంటనే ముఖ్యమంత్రికి దగ్గరికి పరుగెత్తాను. "సర్, ఈ సారా, లిక్కర్ అమ్మటం నా అలవాట్లకి భిన్నమైంది. దయచేసి ఈ పోస్టులో వేరెవర్నయినా వేయించండి సర్." ప్రాథేయ పూర్వకంగా అడిగాను.

ఆయన నా వంక ఆప్యాయంగా చూశారు.

"బ్రదర్, లిక్కర్ మా అలవాట్లక్కూడా భిన్నమే. కాని రెవెన్యూ తెచ్చే 'వారుణివాహిని' పకడ్బందీగా అమలు జరగాలంటే మీవంటి వాళ్ళు ఉండాలి."

కొంచెం ఆగి, "ఒక్కొక్కసారి చెప్పుడు మాటలు వింటే మీవంటి ఆత్మీయుల్ని దూరం చేసుకుంటాం..." ఆయన చెప్పటం ఆపేశారు.

కొద్ది క్షణాలు ఆగి, మళ్ళీ ఆయనే అన్నారు.

"బ్రదర్, మీరు ఎక్సైజ్‌లో చేరండి".

నాకు అర్థమైపోయింది. మన పని తీరునిబట్టే ముఖ్యమంత్రికి దగ్గరా – దూరం.

★ ★ ★

'వారుణి' తో రొమాన్స్

కల్లు కాంపౌండ్‌కి మాత్రమే పరిమితమైన సారాసేవనాన్ని ఇంటింటికీ - ఇంటి లోపలికి, స్టూడెంట్ల జేబుల్లోకి కూడా తరలించిన ఘనత మూటగట్టుకున్నాను.

1978-82లో తిరుపతి దేవస్థానంలో దేవుడికి Spriritual సేవలు చేసిన నేను 1986-88లో ఎక్సైజ్ కమీషనర్‌గా కొత్త పథకాన్ని అమలుచేసి, spririted సేవల్ని ప్రజలకి అంటగట్టాను!

కాకపోతే, ఒక చిన్న ఆత్మానందం ఏమిటంటే నాతోపాటు ఈ 'కీర్తి'ని కొంత దువ్వూరి సుబ్బారావు (ఇప్పటి రిజర్వుబ్యాంకు గవర్నర్) కూడా పంచుకున్నాడు.

* * *

ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారు రిలీఫ్ కమీషనర్‌గా ఉన్న నన్ను అర్జంటుగా పిలిపించి, "బ్రదర్ మిమ్మల్ని ఎక్సైజ్ కమీషనర్‌గా నియమిస్తున్నాం" అన్నప్పుడు గుండెల్లో రాయిపడ్డట్లయింది.

సమాచార, సాంస్కృతికశాఖల కమీషనర్ కార్యదర్శి హోదానుంచి నన్ను అకస్మాత్తుగా తప్పించి, రిలీఫ్ కమీనర్‌గా ప్రభుత్వం నియమించి ఎనిమిది మాసాలు కూడా నిండలేదు. మళ్లీ ఇంతలోనే బదిలీ? సరే ముఖ్యమంత్రులు తమకి నమ్మకమైన వాళ్లు ఏం చెబితే అది నమ్మి, అధికారుల్ని బదిలీచేయటం ఈ ప్రజా ప్రభుత్వ వ్యవస్థలో ఒక భాగం అని సరిపెట్టుకుని, ఆకస్మిక బదిలీల్ని ఆనందంగా ఆలింగనం చేసుకోవటం అలవాటైపోయింది. కనుక ఈ బదిలీ కూడా అలాంటిదేనా? ముఖ్యమంత్రి మాటల్ని బట్టి క్రిందటిసారి బదిలీ అయితే చెప్పుడు మాటలు విని చేశారు కాని, ఈసారికాదు. ఆయన కావాలనే నన్ను ఈ పోస్టుకి ఎంచుకున్నారు. అదే నాకు పెద్ద సమస్య? ఎక్సైజు కమీషనర్ పోస్టు నాకు వద్దనుకున్నాను. "వద్దంటే వద్దు" - నా మనస్సు నొక్కి చెబుతోంది. కాని ప్రభుత్వం ఏ పోస్టు ఇస్తే ఆ పోస్టులో పనిచేయాల్సిందే. ఇష్టం లేకపోతే శెలవు పెట్టిపోవాలి తప్ప. "ఈ పోస్టులో నేను చేరను" అని లిఖిత పూర్వకంగా ఏ ఐఏఎస్ అధికారీ చెప్పడు. చెప్పలేడు. అది సర్వీసు నియమాలకు విరుద్ధం.

నిజానికి ప్రభుత్వంలో ఫలానా పోస్టు గొప్పదనీ, ఫలానా పోస్టు పనికిరానిదనీ అంటూ ఉండదు. అన్ని పోస్టులూ గొప్పవే. దేని ప్రత్యేకత దానిదే. మనిషి శరీరంలో కాలి చిటికెన వేలు దగ్గర్నుంచి నెత్తిమీద శిరోజాల దాకా ఏది పనికిరానిదని చెప్పగలం? కాకపోతే మనిషి మొహంలో కళ్ళు, ముక్కు, బుగ్గలు,.... ఇలా కొన్ని అవయవాల్లో ఆకర్షణ కనిపించినట్లే, ప్రభుత్వంలోనూ

కొన్ని పోస్టులు ఆకర్షణీయంగా ఉంటాయి. సమర్థుడైన అధికారి ఎంత ఆకర్షణ రహితమైన పోస్టుకైనా తన సామర్థ్యంతో ప్రాధాన్యత పెంచేయగలడు.

కాని ఇప్పుడు ముఖ్యమంత్రి నన్ను అడుగుతున్నది వేరు. ఆకర్షణ లేని రిలీఫ్ కమీషనర్ పోస్టునుంచి (చాలామంది ఐఏఎస్ అధికారులు ఆనందంగా స్వీకరించే) ఎక్సైజ్ కమీషనర్ పోస్టులో చేరమంటున్నారు.

"క్షమించండి. సర్, ఆ పోస్టులో నేను చేరలేను. మీరు ఇంకే పోస్టు ఇచ్చినా తప్పకుండా..." నేను ప్రాధేయపూర్వకంగా ముఖ్యమంత్రిని అడుగుతున్నాను.

"లేదు బ్రదర్. మేం బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాం. మీరు చేరండి. అంతా మంచి జరుగుతుంది." ముఖ్యమంత్రి నన్ను పూర్తిగా మాట్లానివ్వకుండానే చెబుతున్నారు. అయినా నేను వదిలిపెట్టలేదు. బ్రతిమాలాను.

"సర్, నేను తిరుపతి దేవస్థానంలో చేరిన మరుక్షణం నుంచీ డ్రింక్స్ తీసుకోవటం మానేశాను. దేవస్థానంలో ఉద్యోగం నా అలవాట్లని, ఆలోచనా విధానాన్ని మార్చేసింది. ఆధ్యాత్మిక సాధనలో పడిపోయాను. ఇప్పుడు మళ్ళీ సారా, బ్రాందీ, విస్కీ అమ్మే ఉద్యోగం చేయాలంటే మనస్కరించటం లేదు. దయచేసి నావిధులు వేరెవర్నయినా వేయండి సార్..."

రామారావుగారు నవ్వారు. "బ్రదర్, మీరు త్రాగరంటే ఇంకా మంచిది. మీలాంటి వాళ్ళే ఆ పోస్టుకి న్యాయం చేయగలుగుతారు నేనూ త్రాగను. కాని ముఖ్యమంత్రి హోదాలో ఎక్సైజు శాఖనుకూడా చూస్తున్నాను కదా! ఇది ఉద్యోగ ధర్మం. పైగా ఇప్పుడు ఆ శాఖలో చాలా మార్పులు తీసుకురావాలి. అబ్కారీ (కల్లు, సారా విక్రయాలు) వేలం పాటలు ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచాలి. లేకపోతే 'కిలో రెండు రూపాయలు బియ్యం' పథకానికి వందలాది కోట్లు ఎక్కడ్నుంచి తెస్తాం?... ఇప్పుడున్న స్థితిలో ఎక్సైజు అధికారులు, సారా కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండికొడ్తున్నారు. ఈ దోపిడీకి బ్రేకు వేయాలి. మరో మూడు మాసాల్లో జరగనున్న అబ్కారీ వేలంపాటల్లో ఆదాయాన్ని పెంచుకోవాలి. సమర్థులు, విశ్వసనీయమైన అధికారులతో మాత్రమే ఇది సాధ్యం అని మిమ్మల్ని ఎంచుకున్నాం. మీరింకేం చెప్పినా నేను వినదల్చుకోలేదు..."

ముఖ్యమంత్రి అంత కరాఖండిగా చెప్పాక ఏం చేయగల్ను? శెలవుపెట్టి వెళ్ళిపోతే...! పిరికిపందలా భయపడి పారిపోయానని సహోద్యోగులంతా చెవులు కొరుక్కుంటారు. దాదాపు ఇరవై ఏళ్ళు సర్వీసు చేసి 'పిరికిపంద' అనిపించుకోవాలా? ఛ...!! అంతలోనే అనిపించింది. భగవంతుడ్ని నమ్ముతున్నాను గదా! ఇది కూడా ఆయన ప్రసాదమే అనుకుందాం... నేనిక ముఖ్యమంత్రికి ఎదురు చెప్పలేదు.

"సరేలే, ఏదో ఒక ఉద్యోగం చేయాలిగదా! కళ్ళు మూసుకుని ఓ ఏడాదో రెండేళ్ళో గడిపేస్తే మళ్ళీ బదిలీ వస్తుంది" అనుకుని సరిపెట్టుకుని కొత్త పోస్టులో చేరిపోయాను... కాని, భయంకరమైన ఊబిలో కూరుకుపోయాను!!

* * *

అబ్కారీ శాఖ ద్వారా ఒక ఏడాదిలో వచ్చే ఆదాయం ఎంతో అక్టోబరుకి ముందుగా జరిగే సారా వేలం పాటలలోనే తేలిపోతుంది. వేలం పాటల్లో ఎంత ఎక్కువగా పాడతారో అదే ఆ ఏడాది కల్లు, సారాల మీద ఖచ్చితంగా వచ్చే ఆదాయం. అమ్మకాలు బాగా వుంటే ఏడాది చివరకి మరికొంచెం పెరగవచ్చు.

నేను ఎక్సైజ్ కమీషనర్‌గా చేరే నాటికి ఈసారా అమ్మకాలన్నీ ఒకటి రెండు సిండికేట్ల గుత్తాధిపత్యంలో ఉండేవి. మాగంటి రవీంద్రనాథ్ చౌదరి, మాగుంట సుబ్బరామిరెడ్డి వంటి కొద్దిమంది ఆధీనంలో ఈ సిండికేట్లు ఉండడంతో వేలంపాట ఎంతవరకు పాడాలో వాళ్ళే నిర్ణయిస్తారు. డమ్మీ పోటీదారుల్ని కూడా వాళ్ళే నిలబెడతారు. ప్రభుత్వపరంగా మేం చేయగలిగిందల్లా ఎన్నిచోట్ల ఎన్ని కల్లు, సారా దుకాణాల్ని నడపాలని అనుకుంటున్నామో ప్రకటించటం మాత్రమే. ప్రభుత్వ సారాదుకాణాలకి వేలం పాటలు జరపటం ఒక పెద్ద సవాలు. పైగా ఆ రోజుల్లో నా సహోద్యోగులు నామీద జోకులు పేల్చేవారు - "ప్ర.సా.దు (ప్రభుత్వ సారా దుకాణాలు) బాగా పనిచేస్తున్నట్టేనా?" అంటూ. నానా అవస్థపడి చిన్న కాంట్రాక్టర్లని ప్రోత్సహించి తీసుకువచ్చి పోటీలో నిలబెట్టినా, సిండికేట్‌ల మనుష్యులు వాళ్ళని భయపెట్టడమో, ప్రలోభపెట్టి సిండికేట్‌లో కలిపేసుకోవడమే చేసేవారు. ఏతావాతా, ఈ వ్యవస్థలో సారాపాటల ద్వారా ఆదాయాన్ని ముఖ్యమంత్రి ఆశించిన రీతిలో పెంచటం దుస్సాధ్యం అని నాకు ఉద్యోగంలో చేరిన కొద్దివారాల్లోనే అర్థమైపోయింది.

దీనికి తోడు, పాటలు జరిగాక కూడా, సారాని ఎలాంటి ప్యాకింగ్ లేకుండా కొలతల లెక్కన అమ్ముతూండటంతో, కాంట్రాక్టర్లే కల్తీచేసి అమ్మేస్తుంటారనీ, ఈ కల్తీ అమ్మకాలపట్ల పోలీసులు, ఎక్సైజు అధికారులూ శీతకన్ను వేస్తుంటారనీ, దాంతో ప్రభుత్వ సారా విక్రయం తగ్గిపోయి, కల్తీసారా అమ్మకం పెరిగి, కాంట్రాక్టర్లూ, వాళ్ళతో కుమ్మక్కయిన ప్రభుత్వ ఉద్యోగులూ మాత్రమే బాగుపడుతుంటారనీ... ఇలా అనేక కొత్త విషయాల్ని తెలుసుకుని, 'సారా విజ్ఞానం' పెంచుకున్నాను.

నాకు ముందు కమీషనర్‌గా ఉన్న కె.వి.ఎస్. సూర్యనారాయణ సిండికేట్ల గుత్తాధిపత్యం తగ్గించటానికి చాలా కష్టపడ్డారు. ఆయన రూపొందించిన కొన్ని విధానాలు సత్ఫలితాలనిచ్చాయి. ఫలితంగా అంతకు రెండుమూడేళ్ళ క్రితం 50-60 కోట్ల రూపాయలుగా ఉన్న ఆదాయం 150-200 కోట్ల దాకా పెరిగింది. కాని, కల్తీ సారాని అరికట్టి, పాటల్లో పోటీ పెంచితే, ఒక్క ఏడాదిలోనే ఇంతకు రెట్టింపు ఆదాయం తీసుకురావచ్చు అనుకున్నాను. కాని ఎలా? ఎలా?

బాగా ఆలోచించాను. నాటు సారాని కూడా బ్రాందీ, విస్కీల్లాగానే ప్రభుత్వమే సీసాల్లో నింపి, సీలుచేసి కాంట్రాక్టర్లకి సరఫరా చేస్తే...! అలా చేస్తే కల్తీకి అవకాశం ఉండదు కదా! ఈ ప్రతిపాదన ముఖ్యమంత్రికి నచ్చింది. (ఆదాయం పెరిగే ఏ ఆలోచన అయినా ముఖ్యమంత్రులకి నచ్చుతుంది.) ఫలితంగా జిల్లాల వారీగా బాట్లింగ్ ప్లాంటులు నెలకొల్పి, ఇలా సారాని సీసాల్లో నింపి, సీలువేసి, త్రాగేవాళ్ళని ప్రోత్సహించే ఉద్యమంలో భాగం పంచుకునేందుకు ప్రభుత్వమే ఒక సంస్థని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. 'ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్' అనే ఈ సంస్థకి ఎక్సైజ్ కమీషనర్ హోదాలో నేను చైర్మన్. నిజాయితీపరుడు, సమర్థుడు అయిన దువ్వూరి సుబ్బారావు మేనేజింగ్ డైరెక్టర్. సుబ్బారావుని ప్రభుత్వం ఈ పోస్టులో వేయగానే నా దగ్గరకి వచ్చి తలపట్టుకుని కూర్చున్నాడు. "నాకు ఆ సారా వాసన పడదు సర్, ఈ పనిలో నన్నిరికించారేమిటి?"

"Right question to wrong person సుబ్బారావ్. ఏం చేద్దాం, నేనూ నీలాగే ఇరుక్కుపోయాను. తప్పోరైటో, ముందుకెళ్ళటం తప్ప మరో మార్గంలేదు మనకి..." అన్నాను.

అంతే, ఇద్దరం మనస్సాక్షిని చంపేసుకున్నాం. సుబ్బారావూ నేనూ కలిసి కార్పొరేషన్ ద్వారా జిల్లాల్లో బాట్లింగ్ ప్లాంట్లకోసం స్థలాలు సేకరించాం. సీసాల్లోకి సారాని నింపే యంత్రాలు కొన్నాం. సీసాలు కొన్నాం. వాటిని సరఫరా చేయటానికి క్రేట్లు కొన్నాం. సీసాలకి సీలు వేసే యంత్రాలు కొన్నాం. పాటలు మొదలవటానికి కొద్ది వారాలు ముందే ఇవన్నీ రెడీ చేశాం. అంటే సారా వేలం పాటల్లో విజేతలైన కాంట్రాక్టర్లు గతంలో లాగా ప్రభుత్వం సారా బట్టీల నుంచి నేరుగా కొలతల లెఖ్ఖన సారా తెచ్చుకోవటం వీలుపడదు. ఎంత సారా అమ్మాలన్నా మా బాట్లింగ్ యూనిట్లనుంచి క్రేట్లలో సీసాలుగా తీసుకెళ్ళి అమ్ముకోవాలి. ఇలా చేయడం వల్ల కల్తీసారా అమ్మకాలు తగ్గిపోయి, ఆదాయం 150-200 కోట్ల రూపాయలదాకా పెరుగుతుంది అని నమ్మకం వచ్చేసింది. చాలా కష్టపడ్డాడుగదా అని సుబ్బారావుని అభినందించాను. "చాలా బాగా చేశావయ్యా ఏర్పాట్లన్నీ". సుబ్బారావు ఒక విచిత్రమైన నవ్వు నవ్వాడు. అతని కవి హృదయం అర్థమైంది. ఇంక చర్చించలేదు. ఏదో ఒక దారిలోకి తీసుకొచ్చేశాం. సారా సరఫరా వ్యవహారం అన్న ఆనందంలో ఉన్నాను.

కాని... ఆ ఆనందం నాలుగు రోజుల కూడా నిలవలేదు.

★ ★ ★

సీసాల్లో సారా నింపి, సరఫరా చేస్తే, ఆ సీసాలన్నీ ఖాళీ అయ్యాక బాట్లింగ్ ప్లాంట్‌కి తిరిగి రావాలి. అప్పటికి బాగా దుమ్ము కొట్టుకుపోయివుండే ఆ సీసాల్ని మళ్ళీ నింపే లోపల వాటిని వేడినీళ్ళతో శుభ్రం చేయాలి. లేదంటే ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం. ఆ ఏర్పాటు సంగతేమిటి? ఇలా చేసే లోపల బాటిల్స్ పగిలిపోతే, ఆ నష్టం ఎవరు భరించాలి?...

ఇలా ఆలోచిస్తుంటే, పాలిథిన్ సంచుల్లో పాలు అమ్మినట్లే, సారా కూడా ఎందుకు అమ్మకూడదు అన్న ఆలోచన వచ్చింది. సుబ్బారావు నేనూ కలిసి ఈ ఆలోచనని ముఖ్యమంత్రి

ముందు పెట్టాం. రామారావుగారికి చాలా నచ్చింది. "అద్భుతం అలాగే చేయండి." అన్నారు. అంతే! బాటిల్స్ కొని, బాట్లింగ్ యంత్రాలు కొని, క్రేట్‌లు కొని... పడిన శ్రమ, పెట్టుబడి అంతా బూడిదలో పోసిన స్కాచ్ విస్కీ అయిపోయింది.

మళ్ళీ మొదలు. ఈసారి బాట్లింగ్ ప్లాంట్లుండేచోటే పాలిథిన్ సంచుల్లోకి సారా నింపే ఏర్పాటు చేయాలి. అదృష్టవశాత్తు సుబ్బారావుకి అలసట లేకుండా పనిచేసే తత్వం ఉండటంతో కొద్దిరోజుల్లోనే మొత్తం ఏర్పాట్లన్నీ మార్చిపారేశాం.

ఈ బాట్లింగ్ యూనిట్ల ఏర్పాని పాలిథిన్ సంచుల్లోకి మార్చిడి చేశాం. ఇదంతా జరుగుతున్నప్పుడు నాకు ఈ సారా అమ్మకాలు పెంచి ప్రజల ఆరోగ్యం నాశనం చేస్తున్నామన్న భావం మనసు తొలిచేసేది. ఎంతగా అంతే - ఆ వ్యథ తట్టుకోలేక నేను నా ఆఫీసులో 'ఎక్సైజ్ కమీషనర్‌కి సెక్రటరీ' హోదాలో పనిచేస్తున్న మరో ఐఏఎస్ అధికారి ఎ.పి.వి.ఎన్. శర్మని పిలిచి, సమకాలీన విదేశాల్లో ఆరోగ్యానికి హాని కలిగించని "మద్యం ఏది? ఎలా అమ్ముతున్నారూ?" అధ్యయనం చేయవలసిందిగా ఆగమేఘాల మీద పంపించాను. అతను అధ్యయనం చేసి వచ్చి చెప్పింది.

"ఆరోగ్యానికి హాని కలిగించనిదీ, ఆల్కహాలు శాతం తక్కువుండేది, మద్యం తాగామన్న తృప్తినిచ్చేదీ, తక్కువ ధరకి సామాన్యుడికి సరఫరా చేయగలిగిందీ బార్లీ గింజల్నుంచీ, గోధుమల నుంచి తయారు చేసే బీరు మాత్రమే... విదేశాల్లో ఇదొక్కటే పేదవాడి మద్యం..."

ఓహ్! చాలా ఆనందం కలిగింది నాకు. మళ్ళీ కొంచెం ఉత్సాహం వచ్చింది. సుబ్బారావుకి చెప్పాను. "--- బాగుంది సర్ ప్రజలకి మేలు చేసిన వాళ్ళమవుతాం. కాని ముఖ్యమంత్రి ఏమంటారో" అంటూ సందేహం వ్యక్తం చేశాడు.

"ఏమంటారు, అద్భుతంగా ఉందంటారు. ఇంత మంచి ఆలోచనలెందుకు వద్దంటారయ్యా? పద చెబుదాం" అంటూ ధీమాగా అనేశాను. ఎక్సైజు ఆదాయాన్ని మనం పెంచటమే ముఖ్యమంత్రికి ముఖ్యంగానీ, ఎలా పెంచాం అన్నది కాదు గదా అనుకున్నాను.

ఎంత వెర్రివాళ్ళం?

* * *

ముఖ్యమంత్రి మా ప్రతిపాదనని నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. "ఇప్పుడేమిటండీ, మళ్లీ రెడ్డొచ్చి మొదలాడమన్నట్లు. ఇప్పుడు చేస్తున్న ఏర్పాట్లతో వేలంపాటల నాటికి సారా సరఫరా చేయలేమని మీకేమన్నా అనుమానమా?" అని ఎదురు ప్రశ్నించారు. అంటే ఇది చేయలేక క్రొత్త ప్రతిపాదన తెస్తున్నామని ఆయన అనుమానం. పైగా బీరు తయారీకి లైసెన్సులు ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి కావాలి... ఇవన్నీ ఎప్పుడు జరగాలి? అయినా కేంద్రంలో కాంగ్రెసు ప్రభుత్వం తనకు సహకరిస్తుందా....? ఇన్ని సందేహాలతో ఆయన 'బీరు' ప్రతిపాదనని బుట్ట దాఖలా చేశారు.

ఏం చేస్తాం! సుబ్బారావూ నేనూ మళ్లీ పాలిథిన్ సంచుల్లో సారా అమ్మకానికి రెడీ అయ్యాం.

ఆ భారీ వేలంపాటలు మొదలయ్యాయి.

అకస్మాత్తుగా ముఖ్యమంత్రి దగ్గర్నుంచి కబురొచ్చింది.

నాకు తెలిసిన ఒకరిద్దరు పండితుల్ని పిలవమన్నారు. పిలిచాను. సారా అమ్మకాలకి ఒకపేరు పెట్టాలని వాళ్ళతో చర్చించాను. ఎన్.టి.రామారావు గారిలా ఒక పథకం పేరుకోసం నిశితంగా సాహితీ వేత్తలతో చర్చించిన ముఖ్యమంత్రిని నేను చూడలేదు. తెలుగు భాషమీద, భారతీయ సంస్కృతిమీద ఆయనకున్న మక్కువ అలాంటిది!

చివరికి- సారాకి - అంటే మద్యానికి మన పురాణాలలో గల అభిమాన దేవత - ఆదిశేషుని భార్య - 'వారుణి' పేరు బాగుందన్నారు. ఆ 'వారుణి'ని ఇప్పుడు ప్రజల్లో ఏరుల్లా ప్రవహింపచేయాలి కాబట్టి 'వారుణివాహిని' అని నామకరణం చేశారు!

నిశ్శబ్దంగా ఆదిశేషుడికి ఓ నమస్కారం పెట్టి 'వారుణి వాహిని' వేలంపాటల్లో మునిగిపోయాను.

★ ★ ★

సిండికేట్లు మళ్ళీ పడగ విప్పాయి. ఏరియాల వారీగా ఎంచేసుకుని పాటల స్థాయి తాము అనుకున్నదానికన్నా పెరగకుండా డమ్మీ పోటీదార్లని రంగంలోకి దింపాయి.

ఒకరోజు... రెండు రోజులు... మూడు రోజులు... హైద్రాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి... ప్రతిచోటా ఇంతే తంతు. నిరాశ, నిస్పృహ చుట్టు ముట్టేశాయి!. ఇప్పుడు పాటలస్థాయి పెరిగి, ఆదాయం పెరగకపోతే, నేను అయిష్టంగా చేస్తున్నాను కాబట్టి పెరగలేదనో, లేక నేను కూడా సిండికేట్లతో చేతులు కలిపాననో ముఖ్యమంత్రి భావించవచ్చు. ఆయన భావించకపోయినా భావించేలా చేసేవాళ్లు ఎవళ్లో ఒకళ్లు వుండనే వుంటారు కదా! పైగా జంట నగరాలలో అప్పుడు సారా అమ్ముతున్న రాజు గారి కంపెనీ "ఈ సారి మీరు గట్టిగా బలవంతం చేస్తున్నారు. కాబట్టి నెలకి రూ 50 లక్షలకి పాడతాం. అదైనా మీరు ధూల్‌పేట గుడుంబాని అరికట్టగలిగితేనే..." అంటూ మాకో సవాల్ కూడా విసిరింది. నా తరఫున వాళ్ళని బ్రతిమాలడం మా అధికారుల పని.

బాగా ఆలోచిస్తే నాకర్థమయిందల్లా ఆంధ్రప్రదేశ్‌లో ఈ సారా సిండికేట్ల గుత్తాధిపత్యాన్ని ఛేదించే శక్తులు ఈ రాష్ట్రంలో లేవు. కాబట్టి బయటనుంచి రప్పించాలి.

ఆలస్యం చేయకుండా బెంగుళూరు, మద్రాసుల్లో ఎక్సైజ్ కమీషనర్లతో మాట్లాడి, అతి కష్టంమీద అక్కడి పెద్ద కాంట్రాక్టర్లకు ఇక్కడ కావలసినంత మద్దతు (?) ఇస్తామని చెప్పి, ఒప్పించి, మూడు గ్రూపుల్ని కొత్తగా రంగంలోకి దింపాను. ఒక గ్రూపు వైజాగ్‌కి, మరొకటి విజయవాడకి, మరొకటి హైద్రాబాద్‌కి.

జంట నగరాల విషయంలో తమిళనాడులో ఎంజి రామచంద్రన్‌కి సన్నిహితుడైన ఒడయార్ గ్రూపుని చాలా మొహమాట పెట్టి, హైదరాబాద్ తీసుకువచ్చి చూపించి, ముఖ్యమంత్రిని కలిసి, ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం వుంటుందని హామీ ఇచ్చి రంగంలోకి దించాను. ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. అంతకుముందు కుంటిసాకులు చూపించి, రూ 50 లక్షలకు మించి పాడుకోమని చెప్పినవాళ్లు రూ.90 లక్షలదాకా వెళ్ళారు. కాని ఒడయార్ గ్రూపు ఒక కోటీ అయిదు లక్షల రూపాయలకి జంట నగరాల్లో సారా అమ్మకాల హక్కు గెల్చుకుంది.

క్రమంగా ఈ వార్త రాష్ట్రమంతా వ్యాపించింది. సిండికేట్లలో అలజడి పెరిగింది. పోటీపడి పాడకపోతే అసలు సారా వ్యాపారం నుంచే పూర్తిగా తుడిచిపెట్టుకుపోతామన్న భయంతో చిన్న చిన్న కాంట్రాక్టర్లు సిండికేట్లనుంచి విడిపోయి, స్థానికంగా తమతమ ప్రాంతాలలో దుకాణాలు పాడుకోవటం మొదలెట్టారు. సిండికేట్లు బ్రద్దలయ్యాయి. క్రమంగా పోటీ పెరుగుతూపోయింది. మా వ్యూహం ఫలించి, ఆ పాటల్లో ఆబ్కారీ ఆదాయం ఒక్కసారిగా 180 కోట్ల రూపాయలు అదనంగా పెరిగింది.!

ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారి ఆనందం కట్టలు తెంచుకుని 'వారుణివాహిని' ఆదాయంలా ప్రవహించింది. మా అదృష్టం బాగుండి నిజాయితీ పరుడైన అశోక్ గజపతిరాజు ఎక్సైజ్ మంత్రి కావడంతో ఆ ఏడాది ఆ కాంట్రాక్టర్లందరికి కల్తీ సారా శక్తుల్నుంచి రక్షణ కల్పించాం, వాళ్లని మా ఎక్సైజ్ అధికారులు పీక్కుతినకుండా అడ్డుపడగలిగాం.

* * *

అప్పటివరకూ సారా తాగటమనేది ఒక దుర్వ్యసనమనీ, ఇది నలుగురూ చూస్తుండగా చేసేదీ, ఎక్కడ పడితే అక్కడ చేసేదీ కాదన్న 'దురభిప్రాయం'లో ఉన్న ప్రజలకి మేం చాలా ప్రోత్సాహం అందించాం. ఇందుకోసం కిందిస్థాయిలో ఎక్సైజ్ అధికార్లూ, సిబ్బంది పల్లెల్లోకీ, పట్టణాల్లో ప్రతి వీధుల్లోకీ వెళ్లేలా ప్రచారం చేసిన సందేశం ఒక్కటే : "వా.వా. సారాని దుకాణం దగ్గరే తాగనక్కర్లేదు. ప్యాకెట్ కొనుక్కుని జేబులో పెట్టుకు తీసుకుపోవచ్చు. ఎక్కడైనా చాటుగా తాగచ్చు." అంతే! రిక్షా లాగేవాళ్లు, కూలి చేసుకునేవాళ్ళూ, సరదాగా తాగాలనుకునేవాళ్ళు వగైరా అన్నిరకాల సారా అభిమానులూ 'వా.వా' సారా ప్యాకెట్లు జేబులో కుక్కుకొని తిరిగారు. 'తాగడం ఎంత సులభం' అనుకుంటూ స్టూడెంట్లుసైతం సారా ప్యాకెట్లను కొని తాగేస్తూవచ్చారు... సారా పాటలు ముగిశాక ముఖ్యమంత్రి నన్ను పిలిచి, ప్రత్యేకంగా అభినందించారు!!!

* * *

కొన్ని మాసాల తర్వాత ఒకసారి ప్రముఖ మద్యం డిస్ట్రిబ్యూటర్ మాగుంట సుబ్బరామిరెడ్డి ఒక సెలవురోజు మధ్యాహ్నం మా ఇంటికి వచ్చారు. మర్యాదపూర్వకంగా కలుస్తున్నానని అంటూ ఆయన పుల్లారెడ్డి స్వీట్సు ప్యాకెట్టు ఇచ్చి, "బెంగుళూరు వెళ్లాలి సర్" అంటూ హడావుడిగా

వెళ్ళిపోయారు. ఆయన అటువెళ్లిన కాస్సేపటికే మా పిల్లలిద్దరూ స్కూలునుంచి వచ్చారు. ఎదురుగా ఉన్న ప్యాకెట్‌చూసి స్వీట్లు తిందామని ప్యాకెట్ విప్పారు.

అంతే! షాక్ తిన్నారు!

అందులో స్వీట్లు లేవు. కరెన్సీ కట్టలున్నాయి. వెంటనే అవినీతి నిరోధక శాఖ అధికారులకి టెలిఫోన్ చేశాను. వాళ్ళు రెడ్డిగారిని బేగంపేట ఎయిర్‌పోర్టులో బెంగుళూరు విమానం ఎక్కకముందే అరెస్టు చేశారు.

ఆ తరువాత కాలంలో ఆయన పార్లమెంటు సభ్యుడైన తరువాత (నేను ప్రధానమంత్రి కార్యాలయంలో పనిచేసేరోజుల్లో) నాతో చెప్పారు : "సర్ మీరు సారా కాంట్రాక్టర్లని దగ్గరకి తీయటం చూసి, ఫలానా మీ డిప్యూటీ కమీషనరే నన్ను అలా ప్రోత్సహించి పంపించారు. లేకపోతే అలా జరిగేది కాదు..."

"అంతేలెండి, మీరు మాత్రం ఏం చేస్తారు? ఆ ప్యాకెట్ 'డెలివరీ' నేను వారుడితో సాగించిన రొమాన్స్ ఫలితమే గదా..." అనేశాను ఆపుకోలేక.

★ ★ ★

నన్ను నమ్మని కేంద్రం

కేంద్ర ప్రభుత్వం నన్ను నమ్మలేదు!

కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ కార్యదర్శి అబ్రహాం విశాఖపట్నం పోర్టు గురించి నేను పంపిన నివేదిక కూడా నమ్మలేరు.

"ఇందులో ఏదో తిరకాసు వుంది. నిజానిజాలను తేల్చడానికి ఒక కమిటీ వేస్తున్నాం" అంటూ ఆయన ఓ అధికార బృందాన్ని నామీదకి పంపారు. అసలు జరిగిందేమిటి!

* * *

రాష్ట్రంలో ఎక్సైజ్ కమీషనర్‌గా 'వారుణి వాహిని' లో ఓలలాడిన నేను ఈ ఊబిలోంచి బయటపడాలంటే కేంద్ర ప్రభుత్వ సర్వీసులోకి డెప్యుటేషన్‌లో వెళ్ళటం ఒక్కటే పరిష్కారం అనుకున్నాను. అదే సమయంలో కేంద్రం నుంచి విశాఖ పోర్టు ఛైర్మన్ పోస్టుకి అర్హులైన సీనియర్ సెక్రటరీ స్థాయి అధికారుల ప్యానెల్ పంపించమని రాష్ట్రానికి సర్క్యులర్ వచ్చింది. నేను కూడా ఆసక్తి చూపడంతో, ప్యానెల్‌లో టి. కుమారస్వామిరెడ్డి, సి. అర్జునరావులతో పాటు నాపేరుని కూడా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపింది. నిజానికి ఆ ప్యానెల్లో అందరికన్నా సీనియర్ కుమారస్వామి రెడ్డి. నా బ్యాచ్‌మేట్ అయిన అర్జునరావు కూడా చాలా సమర్థుడైన అధికారి. అవకాశం నాదాకా వస్తుందా?

నెలరోజుల తరువాత ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు గారు నన్ను పిలిపించారు. "బ్రదర్, మిమ్మల్ని పోర్టు ఛైర్మన్‌గా నియమించటానికి ఎంపిక చేసినట్లు సమాచారం వచ్చిందని ఛీఫ్ సెక్రటరీ చెప్పారు. మిమ్మల్ని వదులుకోవడం మాకిష్టంలేదు. కాని మీరు వెళ్ళిపోవాలని పట్టుబడుతున్నారని నాకు అర్థమైంది. 'ఎందుకు-ఏమిటి' అని అడగను. మీరు పోర్టులో చేరటానికి ఇంకా 3-4 నెలలు టైముంది కదా! ఈ లోపల పంచాయతీరాజ్ కమీషనర్‌గా నియమిస్తాం. పంచాయితీ ఎన్నికల తతంగం పూర్తిచేసి వెళ్ళండి... ఓ.కె.?" అన్నారు ముఖ్యమంత్రి.

కాని, పంచాయితీరాజ్ కమీషనర్‌గా సమర్‌జిత్ రే వున్నారు కదా. ఆయన నాకన్నా సమర్థుడు. చాలామంచివాడు. అలాంటివాళ్ళ్ని కేవలం ఎన్నికలకోసం మూడుమాసాలపాటు పక్కకి తప్పించి మరోవ్యక్తిని కమీషనర్‌గా నియమించడం రాష్ట్ర పాలనా చరిత్రలో అసాధారణమైన విషయం. అప్పుడే నాకు మరోసారి స్పష్టమైంది. పొలిటికల్ బాస్‌లు ఇలాంటి పోస్టింగ్‌ల విషయంలో అధికారుల సామర్థ్యానికన్నా వాళ్లపట్ల తమకున్న నమ్మకానికే ఎక్కువ విలువనిస్తారు.

నేను ఆగమేఘాలమీద సమర్‌జిత్ రే దగ్గరికి పరుగెత్తాను. ఈ పోస్టింగ్ మూలంగా ఆయనతో నా సంబంధాలు చెడిపోకూడదు కదా! పోస్టులకన్నా ముఖ్యమైనది మనం పనిచేసే చోట మానవ సంబంధాలు చెడిపోకుండా చూసుకోవటం. జరిగిందంతా చెప్పి, ఆయన నన్ను అపార్థం చేసుకోకుండా వివరించి బయటపడ్డాను.

* * *

అదృష్టవశాత్తు పంచాయితీ ఎన్నికలు సజావుగా జరిగిపోయాయి. పోర్టు ఛైర్మన్‌గా గతంలో పనిచేసిన టి.ఆర్.ప్రసాద్‌ని (ఈయన ఎన్.డి.ఏ ప్రభుత్వ హయాంలో కేంద్రంలో క్యాబినెట్ సెక్రటరీగా కూడా పనిచేశారు) కలిశాను. టి.ఆర్.ప్రసాద్‌గారు చాలా విషయాలు చెప్పారు:

"...అక్కడి ఆఫీసర్లూ, సిబ్బందీ, యూనియన్ల నాయకులూ అక్కడే శాశ్వతంగా వుంటారు. ఏమీ తెలియని కొత్త వ్యక్తి కేవలం ఛైర్మనే. మనం ఎంత అజ్ఞానుల్లా కనబడితే యూనియన్లూ, అధికారులూ మనల్ని అంతగా ఆటాడించేస్తారు. ... పోర్టు ఇంకా నష్టాల్లోనే వుంది. కార్మికశక్తిని సరఫరాచేసే డాక్ లేబర్ బోర్డులో కూలీలకి పని కల్పించలేకపోతే, పనిలేని సమయంలో కూడా వారికి కూలీ చెల్లించటానికి వీలుగా ఎగుమతులు, దిగుమతుల మీద లెవీ వేస్తారు. దాంతో ఇక్కడ వ్యయభారం ఎక్కువని వ్యాపారవర్గాలు ఈ పోర్టుకి రావటానికి వెనకాడుతుంటారు..."

ఆయన చెప్పిందంతా విన్నాను. వాకాటిపాండురంగారావు అని మరొకాయన Newstime పత్రికలో డిప్యూటీ ఎడిటర్. మంచి రచయిత కూడా. ఈయన కూడా గతంలో పోర్టులో పి.ఆర్.ఓగా పనిచేశాడు. ఒక ఫంక్షన్‌లో కలిసి, పోర్టులో ఎలాంటి 'దిగ్గజాలు' వుంటాయో, ఎంత జటిలమైన వాతావరణాన్ని సృష్టిస్తుంటాయో చెప్పుకొచ్చాడు.

ఇవన్నీ విన్నాక, "ఏమిటిది? చూసి చూసి, పెనం మీంచి పొయ్యిలో పడుతున్నానా" అనిపించింది... ఏమైతేనేం, 1988 మే నెలలో పోర్టు ఛైర్మన్‌గా చేరిపోయాను.

* * *

మొదటివారం అధికారుల సమావేశంలో నా చెవిలో టి.ఆర్. ప్రసాద్‌గారు చెప్పిన విషయాలే గింగురుమంటున్నాయి. అధికార్లు చెబుతున్న విషయాలలో సగం అర్థం కానేలేదు. ఎవరి విభాగం గురించి వారు- వారి పని ఏమిటో, యిబ్బందులేమిటో చెప్పారు. ఓడల్ని లోపలికి తేవడంలో యిబ్బందులు, సముద్రం ఆటూ పోటూ, ఓడల్ని లోపలికి తెచ్చే కాలువ లోతు ఎలా మారుతూంటుందో, ఏ మాత్రం పొరపాటు జరిగినా, ఎంత చిన్న దెబ్బ ఓడకి తగిలినా ఎలా కోట్లరూపాయల నష్టమో, నష్టపరిహారం పోర్టు ఎలా చెల్లించాలో... ఇలా చాలా విషయాలు చెప్పటంతో- ఒక రకంగా నాకే అంతా అయోమయంగా అనిపించింది. కాని ఛైర్మన్‌గా వుండి నా మానసిక పరిస్థితి వాళ్ళందరికీ తెలియనివ్వడం అంతమంచిపని కాదన్నది సర్వీసులో చేరినప్పటి నుంచీ నేర్చుకొన్న విద్యే. ఏ సందర్భంలోనైనా మేకపోతు గాంభీర్యం ప్రదర్శించుకొంటూ, అవగాహన

పెరిగే వరకూ, మన తెలియని తనాన్ని, తెలివితక్కువ తనాన్ని దాచుకోగలిగే సమర్థతని ముందు పెంచుకొంటాం...

అనుభవం, నాబుర్ర చెప్తూనే వున్నాయి - స్థూలంగా ఆలోచించు, ఏ విషయమైనా, ఏ సంస్థ అయినా పనిచేసేది కొన్ని పద్ధతులపైన, సిద్ధాంతాలపైనే. సాంకేతిక విషయాలలో నిష్ణాతులైన వారి నైపుణ్యాన్ని మనం ఈ కొద్ది కాలంలో ఎలానూ పొందలేం. అవసరం కూడా లేదు. ఛైర్మన్‌గా మన బాధ్యత - ఏ విభాగం పని ఆ విభాగం సక్రమంగా చేయడానికి కావలసిన సదుపాయం చేయడం. ప్రతి విభాగంవారి కోసం కావలసిన సమన్వయం చేయడమే. వీటికి కావలసిన వనరులు, నిధులుకాని, సిబ్బందికాని, పరికరాలుగాని సకాలంలో అందేట్లు చూడటం. ఇవన్నీ చేయటానికి ముఖ్యంగా కావల్సింది - సందర్భానుగత పరిజ్ఞానమేగాని సాంకేతిక పరిజ్ఞానం కాదు. అటువంటి సాంకేతిక యిబ్బందులు చక్కపరచడానికే కదా ఆ సాంకేతికనిపుణులు. ఛైర్మన్‌గా నువ్వు చేయాల్సిన విషయాలపై నువ్వు ఆలోచించు, వారు చెప్పే విషయాల వెనుక పరుగెత్తి నీ పని మర్చిపోకు - అని లోపల్నుంచి అంతరాత్మ చెబుతోంది.

ధనరాజు అని రీసెర్చి - డెవలప్‌మెంటు డైరెక్టరు (తరువాత కాలంలో ఈయన మంగుళూరు పోర్టుకి ఛైర్మన్‌గా కూడా పనిచేశాడు) ఇచ్చిన వివరణ సారాంశం ఏమిటంటే- ఈ పోర్టు గత మూడేళ్ళుగా ఏటా ఒక లక్షటన్నుల ట్రాఫిక్ పెరుగుదలని (ఎగుమతి - దిగుమతుల్ని) సాధిస్తోంది. అలాచేసి ఇప్పటికి 15.2 మిలియన్ టన్నులకి చేరుకుంది. అంటే 152 లక్షల టన్నులన్నమాట. ఏటా పోర్టు పెంచగల్గింది లక్ష టన్నులైతే, కేంద్రం అదనంగా పెంచిన లక్ష్యం మరో లక్ష టన్నులు. అలా 1988-89 కాలానికి 15.4 మిలియన్ల టన్నులు హ్యాండిల్ చేయాలని - అంటే 154 లక్షల టన్నులకి తీసుకెళ్ళాలనేది లక్ష్యం.

నేను అమాయకంగా అడిగాను. "ఇంకా ఎక్కువ పెట్టుకోవచ్చుకదా?"

ట్రాఫిక్ మేనేజర్ వి. రొక్కం లేచి వివరించారు. "అది సాధ్యపడదు సార్. క్రిందటేడాదే ఒక లక్షటన్నులు పెంచటానికి చాలా అవస్థ పడ్డాం. ఎగుమతి దిగుమతుల వ్యాపారాన్ని ఆకర్షించడం ఒక ఎత్తు, ఆకర్షించాక, ఇక్కడ జాప్యం లేకుండా ట్రాఫిక్‌ని నిర్వహించడం ఒక ఎత్తు. ఏదో కేంద్ర ప్రభుత్వం మెప్పుకోసం మనం లక్ష్యాన్ని పెంచేసుకోవచ్చును గానీ, చెయ్యాలికదా సర్. ఇప్పుడు 15.4 మిలియన్ టన్నులు చెయ్యటమే గగనం కూడా. ముందు ముందు మీకే తెలుస్తుంది సర్..."

ఎంత బాగా చెప్పాడు. పోర్టు గురించి నాకున్న జ్ఞానం శూన్యం! కానీ ప్రయత్నం చేయకుండా ఎలా మానతాం. నాకు చిన్నప్పుడు మా నాన్నగారు చెప్పిన ఏనుగు లక్ష్మణకవి సుభాషితం గుర్తొచ్చింది. 'ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాససంత్రస్తులై....'

క్లుప్తంగా నేను చెప్పాల్సింది చెప్పాను.

ఆ మర్నాటి నుంచి ప్రతి విభాగానికీ వెళ్ళి తెలుసుకుందామని మొదలెట్టాను. ఏమిటా భాష? ఏమిటా టెక్నాలజీ? నేను ఇంజనీరింగ్ చదవలేదు. ఏదో ఎం.ఎ. చదివి లెక్చరర్ వుద్యోగం చేసుకుంటూ ఐ.ఏ.ఎస్ కి సెలెక్ట్ అయివచ్చేశాను. ఇనుప ఖనిజాల్ని కన్వేయర్ బెల్ట్‌మీద నౌకల్లోకి చేరుస్తారు. ఆ బెల్ట్‌కి తరచూ మరమ్మత్తులే. రకరకాల కారణాలు చెబుతారు. నౌక వచ్చి, బెర్త్ (ప్లాట్‌ఫారమ్) మీద నిలబడ్డాక, లోడింగ్‌లో ఆలస్యమయిన కొద్దీ ఖనిజాలు, లోహాల సంస్థ (ఎంఎంటిసి) ఆయా నౌకలకి చెల్లించాల్సిన అపరాధ రుసుముని డెమరేజి అంటారట. ఎంఎంటిసి మీద ఈ డెమరేజి పడకుండా వుండాలంటే పోర్టులో లోడింగ్‌లో జాప్యం జరక్కూడదు... రవాణా నౌకలు చిన్నవైతే వాటిని ఇన్నర్ హార్బర్‌లోకి హార్బర్ కాలవగుండా జాగ్రత్తగా లాక్కొని తీసుకురావాలి. ఏ మాత్రం పొరపాటు జరిగి నౌక దెబ్బతిన్నా ఆ నష్టం పోర్టు భరించాలి.

హార్బర్‌లో క్రేన్‌లు పనిచేయకపోయినా, డాక్ లేబర్ బోర్డు సకాలంలో కార్మికుల్ని, వాళ్ళకి అవసరమైన లోడింగ్ అన్‌లోడింగ్ పరికరాల్ని (దీన్ని గేర్ అంటారు) సరఫరా చేయకపోయినా కలిగే నష్టం తాలూకు భారమంతా పోర్టుమీదే పడుతుంది. పోర్టు ఛైర్మనే డాక్ లేబర్ బోర్డుకి కూడా ఛైర్మన్. (ఈ డాక్‌లేబరు బోర్డుని పోర్టులో విలీనం చేస్తూ 2008 సెప్టెంబరులో కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది)...క్రేన్‌లు ఎందుకు ఆగిపోతాయి. అది ఎక్కి చూస్తే గాని తెలీదు. మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ప్లానింగ్, ట్రాఫిక్, రైల్వే, ఆపరేషన్స్, ఫైనాన్స్ ... ఇలా ఓ డజను విభాగాల మధ్య సమన్వయం కావాలి. ఎవరిమటుకు వాళ్లే "నా వల్లేపోర్టు నడుస్తోంది. నా విభాగం లేకపోతేనా..." అనుకుంటూ వుంటారు. మానవ సహజమైన అహంభావం వల్ల జనించే సంఘర్షణలు... వీటికి మధ్య తమ ఆధిపత్యానికి ఎక్కడ భంగం వాటిల్లుతుందో అని తల్లడిల్లుతూ ప్రతి చిన్నదానికీ ఛైర్మన్‌ని దబాయించాలని చూసే ట్రేడ్ యూనియన్ల నాయకులు...

ఇంత జటిలమైన వాతావరణం మధ్యలో చిన్న ఊరట ఏమిటంటే ఛైర్మన్ బంగళా ఓ పెద్ద తోట లాంటి ప్రదేశంలో సముద్రపు ఒడ్డున కట్టుదిట్టమైన భద్రత మధ్య వుంటుంది. ఎంతటి భద్రత అంతే- ఆ కొత్త రోజుల్లో ఒకసారి గుంటూరులో అకస్మాత్తుగా మా మేనమామ చనిపోతే నేనూ, నా భార్యా వెళ్ళాం. తిరిగొచ్చేటప్పుడు సాయంత్రం ట్రెయిన్ ఎక్కాం. నా ఆఫీసుకి ఫోన్ చేయడం మర్చిపోయాను. అప్పట్లో సెల్‌ఫోన్‌లు లేవు. దాంతో అర్ధరాత్రి వాల్తేరు స్టేషన్లో దిగేసరికి కారు లేదు. ఆటోరిక్షా ఎక్కి బంగళాకి వచ్చేశాం. బంగళాకి కాపలా వుండే కేంద్ర పారిశ్రామిక రక్షణ దళం సిబ్బంది మమ్మల్ని లోపలికి పోనీయలేదు. "బాబూ, నేను ఛైర్మన్‌ని. ఈ బంగళాలో వుండేది నేనే" అంటున్నా వినకుండా, "సారీసార్, నేను మిమ్మల్నెప్పుడూ చూడలేదు. కాస్సేపు ఆగండి" అని నిలబెట్టేశాడు. (వాళ్ళు షిఫ్టుల్లో మారుతుంటారు) భద్రతా సిబ్బంది వాళ్ళ ఆఫీసరుకి ఫోన్ చేసి చెప్పాడు. ఆయన సలహా విని, వాళ్ళు బంగళాలో నిద్రపోతున్న నౌకర్లని లేపి, పిలిస్తే వాళ్ళు నన్ను అలా గేటు దగ్గర చూసి ఖంగారు పడితే, అప్పుడు వదిలారు. నా భార్య ముందు నా పరిస్థితి!!!

ఈ పోర్టు నిర్వహణ ఒక పద్మవ్యూహం లాంటిది. అభివృద్ధి చేయాలి అనుకోకుండా కళ్ళు మూసుకుని కూర్చుంటే కూడా గడిచిపోతుంది. విశాఖపట్నంలో సగంపైగా భూమి అంతా పోర్టుదే. అంటే అతిపెద్ద కమతానికి అధిపతి ఛైర్మన్. అందువల్ల నగరంలో ఛైర్మన్ లేకుండా ఏ పెద్ద కార్యక్రమం జరగదు. ఏదో గౌరవంగా టరమ్ మూడేళ్ళూ గడిపేసి వెళ్ళిపోవచ్చు. ఈ పోస్టుకి వచ్చింది ఇందుకోసమేనా? ప్రజలు ఇచ్చే పన్నుల్లోంచి జీతాలు తీసుకునేది కాలక్షేపం చేసి వెళ్ళిపోవడంకోసమేనా... ఇలాంటి ఆలోచనలు వచ్చినప్పుడు ఏదో మొండిధైర్యం తెచ్చుకుని ముందుకెళ్ళాలనిపిస్తూంటుంది.

ధనరాజు నాకు సహాయపడేందుకు జయంతి అనే అసిస్టెంట్ డైరక్టర్‌ని అప్పగించాడు. పని మీద ధ్యాస తప్ప మరో వ్యాపకం లేని జయంతి ఈ పోర్టులో ఎగుమతి దిగుమతులు జరుగుతున్న బొగ్గు, సున్నపురాయి, ఇనుపఖనిజం తదితర ఖనిజాలు, ఉత్పత్తులు, ఎరువులు, గ్రానైట్, ఆహారధాన్యాలు, ముడిచమురు వగైరాల వివరాలన్నీ రకరకాల కోణాల్లో విశ్లేషించి తెచ్చి ఇచ్చింది. అప్పటికి వారంరోజుల పాటు పోర్టులో వివిధ శాఖల పనితీరు అధ్యయనంతో కొంత, జయంతి ఇచ్చిన విశ్లేషణతో మరికొంత ... పోర్టు పనితీరు అర్థమవుతున్నట్లనిపించింది.

సరుకుల నౌక 'రోడ్' లోకి వచ్చాక - అంటే హార్బర్ బయట లంగరు వేసిన దగ్గర్నుంచి - ఎంత త్వరగా లోపలికి తీసుకువచ్చి, ఎంత తక్కువ వ్యవధిలో ఎంత ఎక్కువ సరుకుని లోడింగ్ - లేదా - అన్‌లోడింగ్ చేసి, పంపించగలం అన్నదే పోర్టు సామర్థ్యం. మా ట్రాఫిక్ లక్ష్యం పెరగాలంటే ఈ సామర్థ్యాన్ని పెంచాలి. విచిత్రం ఏమిటంటే - జయంతి ఇచ్చిన విశ్లేషణ ప్రకారం - కొన్ని రకాల సరుకుల అత్యధిక ట్రాఫిక్ నిర్వహణా సామర్థ్యం కొన్నిరోజుల్లో రోజుకి 1500 టన్నులూ, 1700 టన్నులూ వుంటే, మరి కొన్ని రోజుల్లో 200 టన్నులకీ, 300 టన్నులకీ పడిపోతూంటుంది. సరుకు తీరుని బట్టి ట్రాఫిక్ నిర్వహణా వేగం మారవచ్చు. కాని ఒకే సరుకు ట్రాఫిక్ హ్యాండ్లింగ్ వేగంలో విపరీతమైన హెచ్చుతగ్గులు ఎందుకు వస్తున్నాయి

"కొన్ని రోజులు చూపించిన అత్యధిక వేగంతోనే అన్ని రోజులూ ఎందుకు పనిచేయలేక పోతున్నాం? అలాంటి అధిక వేగంతోనే అన్నిరోజులూ పనిచేయగలిగితే, పోర్టు సామర్థ్యం ఏడాదికి ఎంతగా వుండవచ్చు?" అని అడిగాను జయంతిని. ఆమె గణాంకాలు వేసి చెప్పింది: "30 మిలియన్ టన్నులు సర్." కాని ఇప్పుడు మేం చేస్తున్నది 15.3 మిలియన్ టన్నులు. ఎక్కడుందీ లోపం?

క్రమంగా అర్థమవుతోంది. ఒక లోడింగో, అన్‌లోడింగో జరుగుతున్నప్పుడు క్రేన్‌కి ఏదైనా మరమ్మత్తువస్తే, దాన్ని మెకానికల్ ఇంజనీరింగ్ వాళ్ళు వచ్చి చేసేదాకా ఆ పని ఆగిపోతుంది. నౌకల్ని ఇన్నర్ హార్బర్‌లోకి లాక్కువచ్చే టగ్‌కి మరమ్మత్తు వచ్చినా అంతే? బెర్త్‌లమీద అన్‌లోడింగ్ అయిన సరుకు అక్కడ్నుంచి లారీల్లోకి లోడ్ చేయటంలో జాప్యం జరిగితే ఆ పని పూర్తయ్యేదాకా ఆ బెర్త్ మీదకి ఇంకో నౌక రవాణా జరగదు. అలా నౌకలు హార్బరు బయట లంగరువేసుకొని

రోజుల తరబడి నిరీక్షిస్తుంటాయి. అందువల్ల సరుకుల రవాణా కంపెనీలు తాము అద్దెకి తీసుకున్న నౌకలకి అనవసరంగా ఎక్కువ అద్దె చెల్లించాల్సివస్తూంటుంది. అందుకే సరుకుల ఎగుమతి దిగుమతి చేసుకునే వ్యాపార సంస్థలు ఏ పోర్టులో నౌకలకి నిరీక్షణ లేకుండా అతివేగంగా సరుకుల ఎగుమతి, దిగుమతులు జరుగుతాయో ఆ పోర్టుకే వెళ్ళాలనుకుంటాయి..., ఇప్పుడు మన పోర్టులో మనకి ట్రాఫిక్‌ని వేగంగా నిర్వహించే సామర్థ్యం వున్నా, ఆ వేగాన్ని స్థిరీకరించలేక పోవటానికి కారణం - వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం.

వెంటనే అన్ని విభాగాల అధికారులన్నీ సమావేశపరిచాను.

"ఇప్పుడు చెప్పండి. కొత్తగా ఎలాంటి శాశ్వత వనరులూ సమకూర్చుకోకుండా మన లక్ష్యాన్ని ఈ ఏడాది ఎంతకి పెంచగలుగుతాం?"

అందరూ పెదిమ విరిచారు. కొత్త యంత్రాలు, కొత్త క్రేన్‌లూ, కొత్త బెర్త్‌లూ వగైరా పెంచకుండా ఏమీ చేయలేమన్నారు. ఇంకా చెప్పారు: "ఆసియా డెవలప్‌మెంటు బ్యాంకు దేశంలోని అన్ని పోర్టుల్నీ అధ్యయనం చేసి మన పోర్టు సామర్థ్యం 16.8 మిలియన్ టన్నులని తేల్చారు సర్. అంటే 16.8 మిలియన్ టన్నుల ట్రాఫిక్‌ని మనం హ్యాండిల్ చేస్తే 100 శాతం పని చేసినట్లే సర్" అన్నారు రొక్కం. ట్రాఫిక్‌లో ఈయనకి అపారమైన అనుభవం వుంది!

నేను అందరికీ కలిపి ఒక పాఠం చెప్పే ప్రయత్నం చేశాను: "మీరు చెప్పేదంతా నిజంకావచ్చు. కాని గతవారం రోజుల నా అధ్యయనంలో తేలిందేమంటే వివిధ శాఖల మధ్య సమన్వయలోపం వల్ల మన ట్రాఫిక్ నిర్వహణా వేగం ఒక్కోసారి పడిపోతోంది. ఓడల్నిలోపలికి తెచ్చే టగ్‌ల డిప్యూటీ కన్సర్వేటర్ దగ్గర్నుంచి సరుకుని లారీల్లో కెత్తించే కాంట్రాక్టరుదాకా 18 రకాల విభాగాలు పనిచేస్తున్నాయి. వీటిల్లో మన పోర్టు విభాగాలే కాక ఇంకా కస్టమ్స్, భారత రైల్వేలు, షిప్పింగ్ ఏజెంట్లు, క్లియరింగ్ & ఫార్వర్డింగ్ ఏజెంట్స్, ప్రజారోగ్యశాఖ, స్టీవ్‌డోర్స్ (లేబర్ కాంట్రాక్టర్లు) వంటి పోర్టు బయటి విభాగాలతో కూడా సమన్వయం కావాలి. 'ఈ పోర్టువాళ్ళు మనల్ని నిర్లక్ష్యం చేస్తున్నారు' అని వీళ్లల్లో ఏ ఒక్కరికి అనిపించినా చాలు. మన ట్రాఫిక్ వేగం పడిపోవటానికి కావలసినంత సందు దొరుకుతుంది. కాబట్టి అందరిమధ్యా సమన్వయంతో ఈ ట్రాఫిక్‌ని ఈ ఏడాది మనం అయిదు మిలియన్ టన్నులు పెంచేద్దాం. ఏమంటారు?"

అంతా నిశ్శబ్దం. ఎవరూ మాట్లాడలేదు. రొక్కం మెల్లగా లేచి నాదగ్గరకు వచ్చి చెవిలో చెబుతున్నారు: "సర్, అయిదు లక్షల టన్నులు అనబోయి అయిదు మిలియన్‌లు అన్నట్లున్నారు మీరు. అయిదు మిలియన్‌లు అంటే 50 లక్షల టన్నులు సర్..."

అంటే, మిలియన్‌కీ, లక్షకీ తేడా తెలియనివాళ్లు కూడా ఐ.ఎ.ఎస్‌లు అయిపోతున్నారన్నదే రొక్కం కవి హృదయం. ఏం చేద్దాం! ఇందులో నాకేమీ అసహజం అనిపించలేదు.

ఏమైనా ఐదు లక్షల టన్నులు పెంచటమే చాలా గొప్పవిషయమని వాళ్ల నమ్మకం. నేను పట్టువదల్లేదు. టిగ్గరగా అందరికీ అర్థమయ్యేలా చెప్పాను. "ఈ సంవత్సరం మన లక్ష్యం 20 మిలియన్ టన్నుల ట్రాఫిక్ కావాలి. అంటే అయిదు మిలియన్ టన్నులు పెంచుతున్నాం. ఇందుకు మీకు అత్యవసరంగా నేను సమకూర్చగల వనరులు ఏం కావాలో చెప్పండి. మీరంతా సమర్థులనీ, ట్రాఫిక్ వేగాన్ని పెంచగలరనీ ఈ గణాంక వివరాలు చెబుతున్నాయి. కాబట్టి ఆ అత్యధిక వేగాన్ని స్థిరీకరించటానికి మీ లోపం లేకుండా ప్రయత్నించండి. సమన్వయంతో పనిచేయండి..."

నిజానికి ట్రాఫిక్ నిర్వహణా సామర్థ్యం పెంచాలంటే ట్రాఫిక్ రావాలిగదా! అప్పటికే తమిళనాడు ఎలక్ట్రిసిటీ బోర్డుతో, విశాఖ స్టీలుప్లాంటుతో, టాటా స్టీలు కంపెనీతో మాట్లాడి వాళ్ళకి కావలసిన బొగ్గు, ఇనుప ఖనిజం, సున్నపురాయి వగైరాల రవాణాకు నోటిమాటగా ఆఫర్లు తీసుకున్నాను. అదే నా ధైర్యం.

అనుమానాలు, సందేహాలు, ఛైర్మన్‌గారి అవగాహన పట్ల సానుభూతి... ఇలాంటి అనేక మానవ సహజమైన భావాల మధ్య వివిధ విభాగాలు వారు మిగతా పదిమాసాలూ పనిచేశారు. నేను చేసిందల్లా వారం వారం వాళ్ళందర్నీ ప్రోత్సహించటం, వాళ్ళకి కావలసిన చిన్న చిన్న వనరులు సమకూర్చటం.

అద్భుతం!

మార్చి 30 నాటికే 20 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించేశాం. పోర్టులో చిరుద్యోగి దగ్గర్నుంచి ఛైర్మన్ దాకా అందరిలోనూ ఉత్సాహం, ఆనందం పరవళ్ళు తొక్కుతున్నాయి...

నాకు ఒక పేరాశ మొదలైంది. మరో 24 గంటల్లో వీలైనంత ఎక్కువ ట్రాఫిక్‌ని హ్యాండిల్ చేస్తే, దేశంలోని మేజర్ పోర్టుల శ్రేణిలో విశాఖపోర్టు స్థాయిని ఇప్పుడున్న ఆరో ఏడో స్థాయినుంచి కనీసం ద్వితీయ స్థానానికో, తృతీయ స్థానానికో తీసుకెళ్లచ్చుగదా! అంతే...! ఆ చివరి 24 గంటలూ అందర్నీ ఇంకాస్త ఉత్సాహపరచటం సాగించాను.

1989 మార్చి 31 అర్ధరాత్రి 12 గంటలకి నేను ఇంకా ఆఫీసులోనే వున్నాను. 12 దాటగానే పోర్టు రైల్వేస్ మేనేజరు శర్మ ఫోన్ చేశారు: "సర్ కంగ్రాట్స్ సర్, మన ట్రాఫిక్ 20.3 మిలియన్ టన్నులై పోయింది సర్..."

మరో ఫోన్‌లో ధనరాజు వచ్చారు. "సర్, గ్రేట్ సర్, 20.3 మిలియన్ టన్నులూ ఇప్పుడే దాటిపోయాం సర్..." మరో నిమిషంలో రొక్కం నా రూమ్‌కే వచ్చేశారు ఇదే పనిమీద. పోర్టు కార్యదర్శి పార్థసారథి, మేనేజర్ (ఆపరేషన్స్) తిరుపతి రాజు, మెకానికల్ ఇంజనీరింగ్ ఛీఫ్ నరసయ్య, ఛీఫ్ ఇంజనీర్ పి.వి.రావు, పోర్టు మేనేజర్ మోహనరావు, ఫైనాన్షియల్ అడ్వయిజర్ సత్యానంద రావు... అందరూ పరస్పర అభినందనలతో నన్ను అభినందిస్తూ....

★ ★ ★

కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ కార్యదర్శి అబ్రహాం మేం పంపిన ఈ రిపోర్టుని నమ్మలేదు. ఏటా లక్ష మిలియన్ టన్నుల కన్నా పెరగని ట్రాఫిక్ ఒక్కసారిగా 5 మిలియన్‌లు (50 లక్షల టన్నులు) పెరగటం అసంభవం అన్నారు.

ఆయన నియమించిన నిజనిర్ధారణ కమిటీ వచ్చి, చూసి వెళ్ళాక, కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది: "1988-89 లో ఎగుమతి దిగుమతుల ట్రాఫిక్ నిర్వహణలో విశాఖపోర్టు దేశంలో ప్రథమస్థానానికి చేరుకుంది".

అదే పెరుగుదలని సాధించిన గుజరాత్‌లోని కాండ్లాపోర్టుకి కూడా ఆ గౌరవాన్ని కేంద్రం పంచింది.

★ ★ ★

రాజేష్ పైలటూ - రైలింజనూ

కేంద్రమంత్రి రాజేష్‌పైలట్ కోపంగా నాకు టెలిఫోన్ చేశారు. దేశంలోని అన్ని మేజరు పోర్టుల్నీ, రహదారుల్నీ నిర్వహించే ఉపరితల రవాణా మంత్రిత్వశాఖకి ఆయన మంత్రి. నేను విశాఖపట్నం పోర్టు ఛైర్మన్‌గా పనిచేయడానికి పనికిరానని ఆయన భావిస్తే, నా డెప్యుటేషన్‌ని రద్దు చేయించి, నన్ను మళ్ళీ ఆంధ్రప్రదేశ్ సర్వీసెస్‌కి వాపసు పంపేయొచ్చు.

"ప్రసాద్! ఏమిటీ గొడవ? మీరెంతో సీనియర్ ఆఫీసర్ అయివుండీ, ఇన్ని రకాలుగా రూల్సుని అతిక్రమించారేమిటి! మీరిచ్చిన సంజాయిషీ కూడా ప్రభుత్వం పట్ల ధిక్కార స్వరంలో వుంది. నాకు నచ్చలేదు మీ పద్ధతి". ఇదీ రాజేష్ పైలట్ గారి సంభాషణ సారాంశం. నాకు భయంవేసింది. కేంద్రమంత్రే నేరుగా ఫోన్‌చేసి అలా మాట్లాడుతుంటే...??

అర్థమయింది. నేను ఊహించిన దానికి భిన్నంగా ఊబిలో కూరుకుపోతున్నాను. ఇప్పుడు మంత్రిగారి ముందు కూడా "క్షమించండి సర్, తప్పయిపోయింది" అని ప్రాధేయపడటమా, కోట్లాదిరూపాయల్ని ప్రభుత్వ ఆమోదం లేకుండా ఖర్చుపెట్టి నేను తప్పుచేయలేదు అని సమర్థించుకోవటమా? రెండోది చేశానా - మంత్రి గారి అహం దెబ్బతిని, నామీద కోపం పెరుగుతుంది. ఏ బాస్‌కి అయినా అంతే గదా! 'నువ్వు తప్పు చేశావు?' అని బాస్ చెబితే, 'నేను చేసింది రైటే' అని సమర్థించుకుంటానంటే, బాస్‌లు 'సెహబాష్' అంటారా!

కాని 'క్షమించండి తప్పయింది' అని చెప్పటమంటే ఆత్మగౌరవాన్ని చంపుకోవటమే. చేసింది రైటే అని నమ్ముతూ ఆత్మసాక్షిని చంపుకొని మాట్లాడటం నా తత్వానికి విరుద్ధం. కొంచెం ధైర్యం కూడగట్టుకొని "సర్, నేను తప్పు చేయలేదు అనుకుంటున్నాను. మీరు నాలుగు నిమిషాలు వింటానంటే జరిగింది చెబుతాను" అన్నాను. పైలట్ గారి మూడ్ బాగుంది. "సరే చెప్పండి?" అన్నారు. జరిగిందేమిటో ఆయనకి క్లుప్తంగా వివరించి, "మీరు సహృదయంతో వైజాగ్ పోర్టుకి సహాయపడాలని నాకోరిక సర్" అని అభ్యర్థించాను.

అసలు జరిగిందేమిటంటే...

★ ★ ★

1988 మేలో నేను పోర్టులో చేరేనాటికి ఏడాదికి ఒక లక్ష టన్నులు ట్రాఫిక్ పెంచడమే పోర్టుకి చాలా గగనంగా వుంది. కాని ఆ ఏడాది ఎలాగైనా సరే 50 లక్షల టన్నులు (5 మిలియన్లు) పెంచాలని నేను ప్రయత్నాలు చేస్తున్నాను. ఇందుకు నాకున్న ముఖ్యమైన అవరోధాలలో ఒకటి పోర్టులోని రైల్వే విభాగం సామర్థ్యం పెరగకపోవడం. నౌకల్లో వచ్చిన సరుకుని గూడ్సు

రైలులోకి మా రైల్వే సైడింగ్‌లో మేం ఎక్కిస్తాం. బయటనుంచి ఎగుమతి కోసం వచ్చిన సరుకుని నౌకల్లోకి చేర్చడం కోసం గూడ్సుల్లోంచి మా సైడింగ్‌లో (గూడ్సు రైళ్ళ ప్లాట్‌ఫారమ్‌లో) దించుతాం. కాని మా సైడింగ్‌లు ఎంత చిన్నవంటే ఒక రేక్‌ని (పెద్ద గూడ్సు రైలు) మూడునాలుగు ముక్కలుగా చేస్తే తప్ప మొత్తం రేక్‌ని ఒక్కసారిగా లోడింగ్, అన్‌లోడింగ్ చేయలేం. పైగా వున్నది ఒకటే సైడింగ్. ఒక సరుకు అన్‌లోడింగ్ జరిగితే, అది నౌకల్లోకి ఎక్కేదాకా, ఇంకో సరుకుని ఆ సైడింగ్‌లో లోడింగూ చేయలేం, అన్‌లోడింగూ చేయలేం.

ఇక మా రైల్వే విభాగం వారి ఇంజన్లు. క్రీస్తు పూర్వ కాలంనాటివా అన్నట్లుంటాయి. ఒక్కొక్కటీ 25 బోగీలనే లాగగలవు. భారత రైల్వేల నుంచి ఎగుమతి సరుకులు తెచ్చే 75 బోగీల రేక్‌లని ఈ ఇంజన్లు లాగలేవు. అందుకని ప్రతి పెద్ద రేక్‌నీ వాల్తేరు స్టేషన్ యార్డు నుంచి మా సైడింగ్‌లోకి తేవాలంటే రెండు మూడు ముక్కలుగా దఫదఫాలుగా మా ఇంజన్లు లాక్కొని వస్తుంటాయి. దీనివల్ల కూడా మా పోర్టులో ఎగుమతి దిగుమతుల్లో జాప్యం బాగా జరుగుతోంది. దీనికి తోడు భారత రైల్వేల రేక్‌లని నిర్దిష్ట సమయంకన్నా ఎన్ని రోజులు ఎక్కువగా లోడింగ్, అన్‌లోడింగ్ కోసం ఆపేస్తుంటామో అన్ని రోజులకీ డెమరేజి (అపరాధ రుసుం) కట్టాల్సివస్తోంది. నేను వెళ్ళటానికి ముందు సంవత్సరం అలాగే కోటి రూపాయలు డెమరేజి కట్టాం భారతరైల్వేలకి. పైగా రేక్‌లు అలస్యంగా ఖాళీచేసి ఇస్తూండటంతో, మళ్ళా మాకు ఖాళీ రేక్‌లు అవసరమైనప్పుడు రైల్వేవారు ఒక పట్టాన ఇచ్చేవారు కాదు.

మా పోర్టు డాక్స్ మేనేజరు శర్మ ఇవన్నీ నాకు చూపించి వివరించాడు.

అప్పట్లో ఆగ్నేయ రైల్వేలోని సరుకుల రవాణా విభాగం క్రింద ఈ గూడ్సు రైళ్ళు నడుస్తున్నాయి. వాల్తేరు డివిజన్ మొత్తం ఆగ్నేయ రైల్వేలోదే. అందుకని దానికి ఛీఫ్ అయిన రామ్‌జీని ఒకసారి మా పోర్టుకి ఆహ్వానించి, మా ట్రాఫిక్ పెరగటానికి సహాయం చేయమని అడిగాను. ఆయన ఓ నవ్వు నవ్వి వివరించాడు. "ఏం చేయగలనండి? మీ సైడింగ్‌లు చిన్నవి. పాతికేళ్ళుగా మీరు సైడింగుల్ని విస్తరించలేదు. పెద్ద రేక్‌లని లాగే ఇంజను ఒక్కటీ లేదు. విశాఖ స్టీలుప్లాంట్‌లో చూడండి - ఎంత పెద్ద సైడింగ్ కట్టారో! ఒకేసారి 75 బోగీల రేక్ మొత్తం ఖాళీ అవుతుంది - లేదా లోడ్ అవుతుంది. జస్ట్ ఎనిమిది - పదిగంటల్లో అయిపోతుంది. మీ పోర్టులో ఇప్పుడు ఎగుమతికి మేం ఏవన్నా ఖనిజాలు తెచ్చి మీకు రేక్ వదిలితే, నాలుగురోజులు తీసుకుంటున్నారు... మీ పోర్టు ఇలా వుంటే ఏమీ చేయలేను. మీరు మాత్రం మాకు డెమరేజీ కడుతూనే వుంటారు..."

చాలా ఆవేశం వచ్చింది. ఐఏఎస్ ఆఫీసర్‌ని కదా! నాకు చాలా అధికారాలుంటాయి. వాటిని ఉపయోగించుకుని తెల్లారేపాటికి పెద్ద సైడింగ్‌లు కట్టించేయొచ్చు. రైలింజన్లు కొనేయొచ్చు. ఏం చేయలేం?... ఎగిరి, ఎదురు దెబ్బతినేదాకా చాలామంది ఐఏఎస్ ఆఫీసర్లు ఇలాగే అనుకొంటూ వుంటారు.

తెల్లవారుతూనే సీనియర్ అధికార్లతో మీటింగ్ పెట్టాను. అందరికీ ఒక క్లాసు తీసుకున్నాను. ఇన్ని సంవత్సరాల నుంచి పెద్ద ఇంజను ఒకటీ లేదు. రైల్వేయార్డు పెంచుకోలేదు. "ఏం చేస్తున్నట్లు మీరంతా" అంటూ నా అసహనాన్ని ప్రదర్శించాను. వాళ్ళు ఒక్కొక్క విషయమే బయటపెట్టారు.

రెండేళ్ళ క్రితమే రైలింజన్ కోసం ప్రతిపాదనని కేంద్రానికి పంపించారు. కేంద్రం ఇంతవరకూ అనుమతివ్వలేదు. ఒకవేళ ఇప్పుడు అనుమతిచ్చినా, రైలింజన్ కొనటానికి భారతరైల్వేలకి ఆర్డర్ ఇస్తే, ఆ ఇంజను రావటానికి మూడేళ్ళు పడుతుంది. ఇక రైల్వేయార్డు సంగతి. రెండు పెద్ద రేక్‌లు పట్టే యార్డు నిర్మాణం కోసం, ఆ యార్డులో కొత్త రైల్వేలైన్ల నిర్మాణం కోసం ప్రతి సంవత్సరం కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతూనే వున్నారు. కాని కేంద్రం నుంచి ఆమోదం ఇంతవరకూ రాలేదు.

"వాట్ నాన్సెన్స్, వాళ్ళు పర్మిషన్ ఇవ్వకపోతే రైల్వేయార్డు మనం కట్టలేమా?" అనేశాను. (ఐఏఎస్ పవర్ అలా అనిపిస్తుంది కాబోలు) ఛీఫ్ ఇంజనీర్ పి.ఎస్.రావు వినమ్రంగా నావంక చూసి, "సర్, ఛైర్మన్ గారు కోటిరూపాయల వరకు ఏ పనైనా పోర్టుబోర్డు ఆమోదంతో చేయించుకోవచ్చు. కాని మనం పంపిన ప్రతిపాదనలు అయిదు కోట్ల రూపాయలవుతాయి. మన అధికారాలు చాలవు కాబట్టి వాళ్ళకి పంపిస్తున్నాం. వాళ్ళు ప్రశ్నలు వేస్తుంటే, సమాధానాలు ఇస్తున్నాం. మన తొందర వాళ్ళకెందుకు వుంటుంది సర్. మన హార్బర్‌లో కోల్ జెట్టీల్ని బెర్త్‌లుగా మార్చాలంటేనే పదేళ్ళుగా కుస్తీపడుతున్నా చేయించుకోలేకపోతున్నాం...'

నా ఆవేశం మీద నీళ్ళు కుమ్మరించినట్లయింది.

రాత్రి బంగళాకి వచ్చిందగ్గర్నుంచీ ఇదే ఆలోచన. రైలింజనూ, రైల్వేయార్డూ! ఈ రెండూ సాధించలేకపోతే 50 లక్షల టన్నుల ట్రాఫిక్ పెరుగుదల లక్ష్యాన్ని సాధించలేం. ఎలా?... అంతలో - మా అబ్బాయి సంజీవ్ ఏదో పద్యం కంఠస్థం చేస్తున్నాడు. వాడి అవస్థ చూసి, నా భార్య గోపిక సలహా చెప్పింది. "అలా మొత్తం పద్యం ఒకేసారి చదివితే కంఠస్థం చేయలేవు. లైన్లుగా విభజించి, ఒక్కో లైను చదివి, మనసులో మననంచేసుకొని తరువాత లైనుకి వెళ్తూవుండు. త్వరగా వస్తుంది..." అది వింటూనే నా మనస్సులో ఐడియా మెరుపులా మెరిసింది.

తెల్లవారగానే ఛీఫ్ ఇంజనీర్ రావుని అర్జంటుగా ఆఫీసుకి పిలిచి రైల్వేయార్డు నిర్మాణంలో ఎన్ని అంశాలున్నాయి అని అడిగాను. బురదగావున్న ప్రదేశాన్ని రాతితో నింపటం, దిమిసా చేయటం, గట్టిపరిచాక రైల్వేలైన్లు వేయడం, అందుకోసం స్లీపర్లు, పట్టాలు సేకరించడం... వగైరా పనులున్నాయని చెప్పారు.

"మీరు రేపీపాటికల్లా మొత్తం రైల్వే యార్డు ప్రతిపాదనని ముక్కలు చేసి వేర్వేరు ప్రాజెక్టులుగా తయారు చేయండి. ఒకేసారి ఆరు రేక్‌ల గూడ్సు ఆగేటంత పెద్దయార్డు కట్టేదాం..." అని ఆదేశించాను.

ఛీఫ్ ఇంజనీర్ రావు భయపడ్డాడు. "సర్, అంతపెద్ద యార్డు అంటే 14-15 కోట్లు అవుతుంది సర్. మంత్రిత్వశాఖకి తెలీకుండా అన్ని కోట్ల రూపాయల పనులు చేయడం..." ఆయన నసుగుతున్నాడు! ఆయన్ని పూర్తిగా చెప్పనివ్వలేదు. నాకేంకావాలో నాకు తెలుసు. అది నేను చేయించాలి అంతే!

"రావుగారూ, బాధ్యత నాది. మీరు నేను చెప్పినట్లు చేయండి. కోటి రూపాయలదాకా పని చేయడానికి అధికారాలు మనకి వున్నాయి. కాబట్టి 14-15 చిన్న ప్రాజెక్టులుగా మొత్తం ప్రాజెక్టుని విభజించండి. ఏ ఒక్కటీ కోటి రూపాయలకు మించకూడదు. బోర్డు మీటింగ్‌లో ఆ ప్రతిపాదనలన్నీ విడివిడిగా అజెండాలో పెట్టండి. నా అధికారాలుపయోగించి నేను ఆమోదింప జేసుకుంటాను. రాబోయే రెండు నెలల్లో రెండు రేక్‌లు పట్టే సైడింగ్ పూర్తయిపోవాలి..." అంటూ స్పష్టమైన ఆదేశాలిచ్చాను.

అంతే! బోర్డులో ఆమోదించేదీ మనమే. ఆనక అమలుచేయించేదీ మనమే. రెండు నెలల్లో రెండు సైడింగ్‌ల నిర్మాణం పూర్తి చేసేశాం.

పేరుకి రెండే కాని, అవి నాలుగు సైడింగ్‌ల క్రింద లెఖ్క. ఒక సైడింగ్‌లో 75 బోగీల రేక్ మొత్తం నిలిచి సరుకుని లోడింగ్ చేసుకొంటుంటే, మరో సైడింగ్‌లో మరో 75 బోగీల రేక్ అన్‌లోడింగ్ చేసుకొంటూండవచ్చు. రేక్‌ని మూడు నాలుగు ముక్కలుగా చేసి మాటిమాటికీ ఇంజనుచేత లాగించి, సరుకుతో నింపి, వెనక్కి వాల్తేరు రైల్వేయార్డుకి పంపి, మళ్ళీ ఇంకో 25-30 బోగీల ముక్కలొక్కొచ్చి, నింపి... ఇలా చేస్తూవచ్చిన పాత విధానానికి శాశ్వతంగా స్వస్తి పలికాం. దీంతో భారతరైల్వేల రేక్‌లని ఎక్కువ రోజులు వుంచుకొని, డెమరేజి కట్టే అవసరం లేకుండాపోతుంది. పైగా ఒక్కో రేక్‌లోకి లోడింగ్, అన్‌లోడింగ్‌ల వ్యవధి 3-4 రోజుల స్థాయి నుంచి 10 గంటల స్థాయికి తగ్గిపోతుంది. కాని 75 బోగీల రేక్‌ని వాల్తేరు స్టేషన్ రైల్వేయార్డు నుంచి మా పోర్టు రైల్వేయార్డులోకి లాక్కొని రాగల ఇంజను మాత్రం మాకు లేదు. మా ఇంజన్లు 25-30 బోగీలకు మించి లాగలేవు. ఏంచేయాలి?

కొంచెం ఆలోచించి, ఈ కొత్త సైడింగ్‌ల ప్రారంభోత్సవానికి ఆగ్నేయరైల్వే ఆపరేషన్స్ ఛీఫ్ రామ్‌జీగారిని ఆహ్వానించాను. ఆయన రెండు మాసాల్లో తయారైన మా కొత్త రైల్వేయార్డుని చూసి విస్మయంలో మునిగిపోయాడు. ఆయనకి చాలా 'మర్యాద'లు చేయించాను. ఏం సాధించాలన్నా మానవ సంబంధాలు ముఖ్యం. అన్ని చోట్లా అధికార దర్పం పనిచేయదు. అధికార దర్పం పనిచేయగలిగిన సందర్భంలో కూడా మానవ సంబంధాలు బాగుండేలా ఎవరు చూసుకుంటారో అలాంటి అధికారుల పట్ల అవ్యాజమైన అభిమానం జనిస్తుంది.

రామ్‌జీ నన్ను ప్రశంసించారు. నేను రామ్‌జీ ఎదురుగుండా మా ఇంజనీర్లని ప్రశంసించాను. రామ్‌జీ మా 'మర్యాద'లకి చాలా ఆనందపడి, "నేను మీకు ఏం చేయగల్ను?" అని అడిగారు. చెప్పాను- "మాకో రైలింజను అమ్మాలి మీరు. లేదా మీ రైలింజన్ ఒకటి లీజుకివ్వండి...

ఇప్పటిదాకా మీ రైల్వేలకి మేం కట్టాల్సిన ఇంజను అద్దెలు, రేక్‌లమీద డెమరేజి వగైరా సర్వీసు ఛార్జిల విషయంలో మీ వాళ్ళకీ, మాకూ తగాదా వుంది. దాని పరిష్కారానికి సహాయం చేయండి."

ఇంజన్లు అమ్మటం రామ్‌జీ చేతుల్లో లేదు. కాని పరిష్కారం చూపించాడు. "మీరొచ్చి మా రైల్వే జనరల్ మేనేజర్‌తో మాట్లాడండి. నేను సిఫార్సు చేస్తాను. అక్కవుంట్స్ వ్యవహారాన్ని మీరు ఫైనాన్షియల్ అడ్వయిజర్‌తో మాట్లాడాలి. కాని ఉన్నతస్థాయిలో ముఖాముఖి మాట్లాడితే పరిష్కారమయిపోతుంది." ఇంక ఆలస్యం చేయలేదు. వారం తిరక్కుండా మా ఫైనాన్షియల్ అడ్వయిజర్ -కమ్- ఛీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ సత్యానందరావుని కలకత్తాలో ఆగ్నేయ రైల్వే కార్యాలయానికి పంపించి, వాళ్ళ ఫైనాన్షియల్ అడ్వయిజర్‌తో ముఖాముఖీ చర్చలకు కూర్చో పెట్టాను. పదేళ్ళనుంచి వున్న తగాదా అది. ఏదో బజార్లో సరుకులు కొని, అకౌంట్స్ సెటిల్ చేసుకున్నంత సులభం కాదు. ఆడిట్ అభ్యంతరాలొస్తే తాను మునిగిపోతానని ఆయన భయం.

ఈలోపల రామ్‌జీ వెళ్ళి ఆగ్నేయ రైల్వే జనరల్ మేనేజర్‌కి విశాఖపోర్టు మేనేజ్‌మెంట్ గురించి ఏవోమంచి మాటలు చెప్పినట్లున్నారు. మా అకౌంట్స్ సెటిల్‌మెంట్‌కి ఆయన కూడా సహకరించారు. ఒక్క కోటి రూపాయల బకాయిలు తప్ప, అన్నీ సెటిలయిపోయాయి. అప్పుడు నేనే స్వయంగా వెళ్ళి ఆ జనరల్ మేనేజర్ దగ్గర కూర్చున్నాను. "ఈ కోటీ కూడా ఇప్పుడు పరిష్కారం కావాలి. ఈ కోటి రూపాయల భారాన్ని చెరి సగం భరిద్దాం. పాత అకౌంట్స్ మూసేద్దాం. ఏమంటారు?" నేను చెప్పదలచుకుంది చెప్పేశాను. ఈ రెండు మాటలు చెప్పడానికి ముందు ఆ జనరల్ మేనేజర్‌గారి ఔదార్యం గురించి నాకు రామ్‌జీ ఎంత గొప్పగా చెప్పాడో కూడా 'వినిపించాను'. ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి తన గురించి అలా మాట్లాడడం ఒక రైల్వే అధికారిగా ఆ జనరల్ మేనేజర్ మొదటిసారి వింటున్నట్లున్నారు. కోటి రూపాయల భారాన్ని చెరిసగం భరించే ప్రతిపాదనని ఇద్దరం మా మా మంత్రిత్వశాఖలకి రాసి, ఆమోదం ఎలా వస్తే అలా చేద్దాం అన్నారు. "ఓ.కె." అనేశాను. నాకు ఇంజను పని ఇంకా ఆయనతో వుందిగా.

ఈ అకౌంట్స్ సెటిల్‌మెంట్ ఎప్పుడయితే పరిష్కారమైందో, బకాయిలు వసూలు చేస్తున్నానన్న ఆనందంలో జనరల్ మేనేజర్‌గారు నన్ను భోజనానికి పిలిచారు. నేనూ నా అసలు 'రంగు' బయట పెట్టాను. "మీరు నాకు ఒక పెద్ద రైలింజన్ ఇప్పిస్తే చాలా కృతజ్ఞుడ్ని...." నేను పూర్తి చేయకమునుపే ఆయన కూడా చెప్పారు. "రామ్‌జీ చెప్పారు. కాని ఇలా ఇంజన్లు అమ్మే పనిని ఆగ్నేయరైల్వేలో గతంలో ఎప్పుడూ చేయలేదు. అయినా నేను రైల్వేబోర్డు చైర్మన్‌తో మాట్లాడి చెబుతాను. అందాకా మా ఇంజన్లే మా వాల్తేరు యార్డునుండి మీ పోర్టు యార్డు దాకా పెద్ద రేక్‌లని తీసుకొచ్చి, తీసుకెళ్ళేలా నేను ఆదేశిస్తాను..."

వారంరోజుల్లో రామ్‌జీ నాకు టెలిఫోను చేశారు. "ప్రసాద్‌గారు, మీరు వెంటనే మూడుకోట్ల రూపాయలు వారణాశిలోని లోకోమోటివ్ వర్క్‌షాప్‌కి కట్టగలరా - మీకు ఇంజన్ ఇప్పిస్తారు మా జి.ఎం.గారు?"

వెంటనే మా ఫైనాన్షియల్ అడ్వయిజర్ సత్యానందరావును పిలిపించి "మూడుకోట్లున్నాయా" అని అడిగాను. ఆయన నోరు వెళ్ళబెట్టాడు. "సర్, మనం ఇలా డైరెక్టుగా డబ్బులిచ్చి కొనగూడదు గదా! మన మంత్రిత్వశాఖ ఆమోదిస్తే, మనం రైల్వేమంత్రిత్వ శాఖకి రాస్తే, వాళ్ళు రైల్వేబోర్డుతో సంప్రదించి..."

"సత్యానందరావుగారూ, మీరు నా ప్రశ్నకి జవాబు చెప్పండి. డబ్బులున్నాయా లేదా? మనం డైరెక్ట్‌గా కడితే ఏమవుతుంది?"

"డబ్బులున్నాయి సర్. కాని, మనం ఇలా చేస్తే రేపు ఆడిట్ అభ్యంతరాలు నన్నూ, దొరగార్నీ చుట్టుకుంటాయి..."

దొరగారు అంటే ఛైర్మన్ అంటే నేనే. ఆయన పాతకాలపు అలవాట్లున్న మనిషి. ఇప్పుడు ఆయన భయమంతా ఈ ఛైర్మన్ 2-3 ఏళ్ళు వుండి వెళ్ళిపోతే, తరువాత ఈ ఆడిట్ దాడినుంచి తన్నెవరు రక్షిస్తారు?

"రైలింజన్ కోసం మన బోర్డులో కొన్ని సంవత్సరాల క్రితమే తీర్మానం చేశాం. మంత్రిత్వశాఖకి పంపించాం కదా! ఇప్పుడు నేను నోట్ ఆర్డర్ వేస్తున్నాను - మూడు కోట్లు వారణాశి ఆటోమోటివ్ వర్క్‌షాపుకి కట్టమని. దానిమీద మీరు మీ అభ్యంతరాలు రాయండి. నేను మీ అభ్యంతరాల్ని త్రోసిరాజంటూ ఆదేశిస్తాను. అప్పుడిక ఆడిట్ అభ్యంతరాలు మిమ్మల్ని చుట్టుకోవు. సరేనా?" నేనలా అన్నాక కూడా సత్యానందరావు వదల్లేదు. చివరికి ఆయన సలహామేరకు పోర్టు ట్రస్టుబోర్డు అత్యవసర మీటింగ్ పెట్టి, మూడుకోట్ల చెల్లింపుకి అందులో తీర్మానం చేయించేశాను. వారంరోజుల్లో డబ్బు కట్టేశాం. పదిరోజుల్లో భారీ రైలింజన్ వచ్చి మా పోర్టు ఖాతాలో చేరిపోయింది.

'అసలేం జరిగిందంటే' అంటూ అప్పుడు రామ్‌జీ చెప్పారు : "మా జనరల్ మేనేజర్‌గారు మీకోసం రైల్వేబోర్డు ఛైర్మన్‌తో మాట్లాడి మా ఆగ్నేయ రైల్వేకి ఇదివరకే కేటాయించి వున్న మూడు కొత్త ఇంజన్లనుంచి ఒకటి మీకు మళ్ళించారు. మీరిచ్చిన డబ్బుతో మాకు కావలసిన ఇంజన్‌కి ఆర్డర్ చేశాం. ఇంకో రెండుమూడేళ్ళ తరువాత మాది మాకొస్తుంది..." ఆగ్నేయరైల్వే జి.ఎం.కి టెలిఫోన్ చేసి ధన్యవాదాలు చెప్పాను. మానవ సంబంధాలు ఎంత గొప్పవి?

ఇదంతా జరిగిపోయిన 6-7 మాసాల తరువాత ఆర్థిక సంవత్సరం ముగిశాక, మా ట్రాఫిక్ పెరుగురల ఆ ఏడాది 50 లక్షల టన్నులు దాటిపోయింది. మొత్తం 203 లక్షల (20.3 మిలియన్) టన్నులు చేశాం. దేశంలోని పోర్టులన్నింటిలో అగ్రస్థానానికి చేరుకున్నాం.

కాని, ఈ విజయం నాకు మంత్రిత్వశాఖ నుంచి అభినందనలకన్నా అభిశంసనలు ఎక్కువ తీసుకువచ్చింది. మంత్రిత్వశాఖ కార్యదర్శి అబ్రహాం నాకు సంజాయిషీ నోటీసు జారీ చేశారు.

"ప్రభుత్వ అనుమతి లేకుండా మీకు తగిన అధికారాలు లేకుండా మీరు రైలింజన్ కొని చాలా తప్పు చేశారు. ఇది అధికార దుర్వినియోగమే. మీరు రైలింజన్ కొన్న చర్యను ప్రభుత్వం

రాటిఫై (తదనంతర ఆమోదం) చేయడంలేదు. తిరస్కరిస్తున్నది... రైలింజన్ కొనుగోలు, వినియోగం గురించి మీరు రాసిన అంశాలేవీ నమ్మదగ్గవిగా లేవు. రైల్వేలలో వున్న పరిస్థితి ప్రకారం కొత్త ఇంజనుకోసం ఇప్పుడు మేం ఆర్డర్ చేస్తే మూడు సంవత్సరాల తరువాతగానీ డెలివరీ కావటంలేదు. అత్యవసర పరిస్థితుల్లో ఒరిస్సాలోని పరదీప్ పోర్టుకి ఒక ఇంజన్ ఇప్పించాలని మంత్రుల స్థాయిలో మేం ప్రయత్నం చేసి ఏడాది గడుస్తున్నా ఇంతవరకూ ఆ ప్రయత్నాలు కార్యరూపం దాల్చలేదు. మీరు మాత్రం ఆరు నెలలక్రితమే డబ్బు కడితే 10 రోజుల్లో ఇంజన్ వచ్చిందనీ, గత అయిదుమాసాలుగా దాన్ని వాడుతున్నామనీ రాశారే. ఇది ఎంత వాస్తవ విరుద్ధమో వేరే చెప్పనక్కర్లేదు... రైలింజన్ పేరుతో మూడుకోట్ల రూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించినట్లు చూపించడం కట్టుకథలా వుంది. ట్రస్టుబోర్డు తీర్మానాన్ని మీరు సాకుగా చూపించినప్పటికీ, నిబంధనలు పాటించవలసిన బాధ్యత ఛైర్మన్‌ది. కనుక ఈ మొత్తం అధికార దుర్వినియోగానికి మిమ్మల్ని బాధ్యుల్ని చేస్తూ మీపై క్రమశిక్షణా చర్య తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీపై ఎందుకు ఈ చర్య తీసుకోకూడదో వివరిస్తూ 15 రోజుల్లో సంజాయిషీ పంపించండి...."

నా కళ్ళల్లో నీళ్లు తిరిగాయి బాధ, ఆవేదనతో.

ఇదే రైలింజన్ కోసం ఇదే మంత్రిత్వశాఖ చుట్టూ నాకు ముందు ఛైర్మన్లు ఎన్నిసార్లు తిరిగారు? నేను ఎన్నిసార్లు రాశాను? సవాలక్ష ప్రశ్నలూ, సందేహాలతో ఆ ఫైలుని ప్లానింగ్ కమీషన్‌కి పంపారు. నేను ఏదో మానవ సంబంధాలు అడ్డం పెట్టుకొని ఇంజన్ తెప్పించి, ట్రాఫిక్ పెంచితే, అభిశంసిస్తున్నారు. నిజానికి ఆ ఇంజన్ రావడంవల్ల రైల్వేలకి అంతకాలం కడుతూ వచ్చిన డెమరేజి కట్టనక్కర్లేకుండా పోయింది. ఆ ఒక్క ఇంజన్ మూలంగా అయిదు మాసాల్లో 10 లక్షల టన్నులు ఎక్కువ ట్రాఫిక్‌ని మా రైల్వే విభాగం నడిపింది. అంటే ఇంజను ఖర్చు మొత్తం రాబట్టేశాం. కాని నేను తప్పు చేశానంటున్నారు.

అబ్రహాం గారు మంచివాడే. కాని ఆయన కూడా రూల్సు కోణంలోనే చూశారు. నేనేదో "పొరబాటయిపోయింది సర్, ఇంకెప్పుడూ ఇలా చేయను" అంటే నా సంజాయిషీతో తృప్తి చెందినట్లు రాసుకుని ఆయన ఆ ఫైల్ మూసేసివుండే వాడే.

కాని, అభిజాత్యం అడ్డం వచ్చింది. నేను చేసింది ఎంత పెద్ద తప్పు అన్నది దాని ఫలితాన్ని బట్టి కదా ప్రభుత్వం అంచనా వేయాలి! 'ఎన్నిరూల్సు అతిక్రమించాను' అన్న దాన్ని బట్టి వేస్తారా! బొంబాయి దగ్గర వెయ్యికోట్ల రూపాయలు ఖర్చు పెట్టి 'నవసేవా' పోర్టు కట్టిందీ ప్రభుత్వం - కేవలం ఏడాదికి అయిదు మిలియన్ టన్నుల ట్రాఫిక్ హ్యాండిల్ చేయటానికి. మేం ఒక్క ఏడాదిలో 15.5 మిలియన్ టన్నుల నుంచి 20.3 మిలియన్ టన్నులకు ట్రాఫిక్‌ని పెంచి, నష్టాల్లోంచి లాభాల్లోకి పోర్టుని నడిపిస్తే ఏదో ఘోరం జరిగిపోయినట్లు నాకు నోటీసు ఇస్తుందా ఈ ప్రభుత్వం?

ఆ నోటీసు చూసినప్పుడు నాకు రక్తం సలసల మరిగిపోయింది. ఘాటిస్తూ జవాబిచ్చాను: ".... మా ప్రతిపాదనని ఏడాదిపాటు మీ దగ్గరుంచుకొని తాత్సారం చేశారు. ఆ ప్రతిపాదన కార్యరూపం ధరించకపోవటంవల్ల మేం ట్రాఫిక్‌ని పెంచలేకపోతే ఆ నష్టానికి ప్రభుత్వం బాధ్యత

వహిస్తుందా? అత్యవసరమైన పరదీప్ పోర్టుకి మీరు ఇంజన్ ఇప్పించలేకపోయారు. నేను ఇంజను తీసుకువచ్చి ట్రాఫిక్ పెంచి, నష్టాల్లోంచి లాభాల్లోకి పోర్టుని తీసుకువస్తే నన్ను సంజాయిషీ అడుగుతున్నారు. ఛైర్మన్‌గా నన్ను ప్రభుత్వం నియమించింది ఈ పోర్టుని నష్టాల్లోంచి బయటకి తెచ్చి, లాభాల్లో నడిపించడానికే అని నమ్ముతున్నాను. కాదా? ...ఇప్పటికైనా ప్రభుత్వం నేను తీసుకున్న చర్యల్ని ఆమోదించి, ప్రోత్సహిస్తే సంతోషం..."

ఈ జవాబుతో కార్యదర్శి అబ్రహాంగారు ఖంగుతిన్నారు. ఆయనకీ తిక్కలేచింది. నాకన్నా సీనియర్ ఐఏఎస్ ఆఫీసరు కదా! క్రిందవాడినించి ధిక్కారస్వరం వినిపిస్తే, తిక్కరేగటం చాలమంది ఐఏఎస్ ఆఫీసర్లకి సహజ గుణం. అయినా అబ్రహాంగారు కొంత సంస్కారవంతుడవటం వల్ల నాకు టెలిఫోన్ చేసి మందలించారు. "ఇదేంటి ప్రసాద్ ఇలా రాశారు? ఇప్పుడిక ఈ ఫైలుని నేను క్లోజ్ చేయలేను. మంత్రిగారికి పంపిస్తున్నాను. నన్ను అపార్థం చేసుకోవద్దు..."

అంతే!

* * *

ఆ ఫైలు చూసి కేంద్రమంత్రి రాజేష్ పైలట్ నాకు టెలిఫోన్ చేశారు.

అంతకుముందు రెండు సందర్భాలలో ఆయన విశాఖపట్నం వచ్చారు. నేను ఛైర్మన్‌గా వెళ్ళిన కొత్తలో మొదటిసారి ఆయన వచ్చినప్పుడు తూర్పునౌకాదళం ఛీఫ్ వైస్ అడ్మిరల్ రాందాస్ మంత్రిని కలిసి, మా పోర్టు రైల్వేలైన్ల మీదుగా నేవీకి వెళ్ళే రోడ్డు బ్రిడ్జి ఎలా సగంలో ఆగిపోయిందో చూపించారు. మంత్రి నాకు చెప్పారు. నేను కాంట్రాక్టరుతో మాట్లాడి త్వరగా పరిష్కరించి, రెండేళ్ళుగా ఆగిపోయిన బ్రిడ్జిని మూడు మాసాల్లో పూర్తి చేయించి, మళ్ళీ మంత్రిగారినే పిలిపించి ఆయన చేతే ప్రారంభోత్సవం చేయించాను. "ఇదొక అద్భుతం" అంటూ రాందాస్ మంత్రిగారి ముందు ప్రశంసించారు. ఆ సందర్భంలో రాజేష్ పైలట్ గారికి మా పోర్టులో జరుగుతున్న కంప్యూటరైజేషన్ పనులు చూపించాను. రాజేష్ పైలట్‌గారితో నాకున్న పరిచయం అంతే.

అందుకే ఆయన ఫోనులో నన్ను అడిగినప్పుడు జరిగిందంతా వివరంగా చెప్పాల్సివచ్చింది.

అంతా విన్నాక రాజేష్‌పైలట్ ఒక నిట్టూర్పు విడిచి చెప్పారు:

"అవును ప్రసాద్, మంత్రిత్వశాఖలో పోర్టుల ప్రతిపాదనలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో పడిపోతున్నాయని మరో రెండు మూడుపోర్టుల ఛైర్మన్లు కూడా నాకు చెప్పారు. మంచిపనులు చేయటమే చాలా కష్టం. అందుకే మీరు తీసుకున్న చర్యల్ని ఆమోదిస్తూ, ఇటుపై మేజరుపోర్టుల ఛైర్మన్‌లు - ట్రస్టు బోర్డుల అధికార పరిధిని ఒక్కోప్రాజెక్టుపై అయిదు కోట్ల రూపాయలకు పెంచుతున్నాను. ఓ.కె.?"

మళ్ళీ నా కళ్ళు చెమర్చాయి - ఈ సారి ఆనందంతో.

* * *

హార్బర్‌లో 'యుద్ధం'

విశాఖపోర్టుని శాసిస్తున్న లేబర్ కాంట్రాక్టర్లు - స్టీవ్‌డోర్‌లు - నాకు తుది హెచ్చరిక చేశారు.

"మాకు పోటీగా కొత్త వాళ్ళకి స్టీవ్‌డోర్ లైసెన్సులివ్వాలని ప్రయత్నిస్తున్నారు. మీకు ముందున్న ఛైర్మన్ గోనెల ఇలాగే చేశారు. చేతులు కాల్చుకున్నారు. తొందరపడి నిర్ణయం తీసుకుంటే తర్వాత పశ్చాత్తాపపడినా ప్రయోజనం వుండదు. జాగ్రత్త..."

1989 వరకూ 12 మంది స్టీవ్‌డోర్లు విశాఖపోర్టులో ఎగుమతులు, దిగుమతుల మీద ఆధిపత్యం చలాయించేవారు. ఏ వ్యాపారవేత్త, పారిశ్రామికవేత్త దేశంలో ఏ పోర్టు ద్వారా ఎగుమతి దిగుమతులు చేసుకోవాలన్నా సరుకుల్ని రైల్వేరేక్‌ల నుంచి, లేదా లారీల్లోంచి ఓడల్లోకి ఎక్కించటానికి, ఓడల్లోంచి దించి లారీల్లోకి లేదా రైల్వే రేక్‌లలోకి లోడింగ్ చేయటానికి కావలసిన లేబర్‌ని పోర్టుకి అనుబంధంగా వున్న డాక్ లేబర్ బోర్డు నుంచి అద్దెకు తీసుకుని, ఆ లేబర్‌తో లోడింగ్, అన్‌లోడింగ్‌లు చేయించటమే స్టీవ్‌డోర్ల వ్యాపారం.

కేవలం 12 మంది స్టీవ్‌డోర్లు 15 మిలియన్ టన్నుల ఎగుమతి దిగుమతుల్ని చేస్తున్నారు. ఈ పోర్టు ద్వారా ఎగుమతో దిగుమతో చేయాలనుకునే ఏ వ్యాపారవేత్త అయినా "ఎవరు ఎంత రేటుకి నా సరుకుని నౌకల్లోకి ఎక్కిస్తారు, లేదా నౌకల్లోంచి దించుతారు" అని కొటేషన్లు పిలుస్తారు. అప్పుడీ 12 మంది ఒక గ్రూపుగా ఏర్పడి, వాళ్ళల్లో వాళ్ళు కూడబలుక్కుని, ఎవరో ఒకరికి ఆ కాంట్రాక్టు వచ్చేలా సర్దులాటు చేసుకొంటాడు. అందువల్ల 'అతి తక్కువ రేటు' అని వాళ్ళు ఎంత ఎక్కువచూపించినా ఆ రేటుకే పారిశ్రామికవేత్తలు లోడింగ్, అన్‌లోడింగ్‌లు చేయించుకోక తప్పదు. అంటే స్టీవ్‌డోర్లలో ఈ ముఠాతత్త్వం మూలంగా విశాఖపోర్టులో లోడింగ్, అన్‌లోడింగ్ రేటు ఎంత వుండాలో స్టీవ్‌డోర్లే శాసిస్తున్నారు. పైగా అధికార్లకు, యూనియన్లకూ డబ్బులిస్తేనే పనులు త్వరగా అవుతాయని చెప్పి, 'స్పీడ్‌మనీ' కూడా పారిశ్రామిక వేత్తల నుంచి వీళ్ళు వసూలు చేస్తుంటారని ప్రతీతి. మొత్తం మీద మొత్తం లేబర్ కాంట్రాక్టుల్ని ఈ 12 మందీ పంచుకున్నారు. ఫలితంగా విశాఖపోర్టులో ఈ రేటు చాలా ఎక్కువగా వుంది. ఇలా అయితే పారిశ్రామికవేత్తలు ఈ పోర్టుకే రావాలని ఎందుకు ఆశపడతారు? విశాఖ స్టీలుప్లాంటులాంటి దగ్గరగా వున్న కొద్ది పరిశ్రమలు మినహా మిగతావాళ్ళు చవగ్గా వున్న పోర్టుని వెతుక్కుంటారు.

నేను పోర్టు ట్రాఫిక్‌ని 1988-89 లో 50 లక్షలు పెంచేలా చేయాలనుకున్నప్పుడు నాకు అర్థమైంది. ఈ స్టీవ్‌డోర్ల రేట్లు తగ్గించగలిగితే ఎక్కువ ట్రాఫిక్‌ని విశాఖపోర్టుకి ఆకర్షించగలుగుతాం.

మొత్తం 12 మంది స్టీవ్‌డోర్లనీ పిలిచి "మీ రేట్లు తగ్గించుకోండి" అని అడిగాను. సాధ్యపడదన్నారు. వాళ్ళలోనే కొంతమందికి రెండు మూడు స్టీవ్‌డోర్ లైసెన్సులున్నాయి కూడా. రేట్లు తగ్గిస్తే ట్రాఫిక్ పెరుగుతుందని ఎంత చెప్పినా వాళ్ళు వినలేదు.

"మమ్మల్ని కాదని ఏ ఛైర్మనూ ఏమీ చెయ్యలేదు" అన్నది వాళ్ళ ధీమా. ఈ సందేశాన్ని వాళ్ళు నాకు అర్థమయ్యేలా ఇతరమార్గాలద్వారా పంపించారు. పోర్టులోనే కొంతమంది అధికారులలో ఈ స్టీవ్‌డోర్ల 'సానుభూతి పరులు' కూడా వున్నారు.

విశాఖపోర్టుకి ట్రాఫిక్ పెంచగలిగితేనే ఛైర్మన్‌గా నా ఉనికికి సార్థకత. పెంచాలంటే బెర్తులు పెంచాలి, రైల్వేయార్డు విస్తరించాలి, ఖనిజాల నిలవ సామర్థ్యం పెంచాలి, స్టీవ్‌డోరింగ్ రేట్లు తగ్గించి, కొత్త వ్యాపారాన్ని ఆకర్షించాలి. ఈ మధ్యలో ట్రేడ్ యూనియన్‌లు సహకరించాలి. ఇవన్నీ జరిగినా పోర్టులోపలా, బయటా కలిపి 18 విభాగాల మధ్య సమన్వయం సాధించాలి.

స్టీవ్‌డోరింగ్ రేట్లు తగ్గించటాన్ని అక్కడే పాతుకుపోయి, 'రింగ్' కొటేషన్‌లతో వ్యాపారాన్ని పంచుకుంటున్న స్టీవ్‌డోర్ల ద్వారా చేయలేం అని తెలిసిపోయాక కొత్త లైసెన్సు లివ్వటం ఒక్కటే పరిష్కారం అనుకున్నాను. అందుకు కేంద్రప్రభుత్వ విధానం కూడా అనుకూలంగా వుంది.

అధికార్లందరితో మీటింగ్ పెట్టాను. "కొత్త స్టీవ్‌డోర్ లైసెన్సులిస్తామని ప్రకటిద్దాం" అన్నాను.

"మీకు ముందున్న ఆర్.కె.ఆర్.గోనెలగారు ఇలాగే ప్రయత్నించారు సర్. అర్హతవున్న ఆరుగురిని ఎంపికచేసి, వారిలో ముగ్గురికే సామర్థ్యం వుందని ఆ ముగ్గురికే ఇవ్వాలని నిర్ణయించారు. దాంతో మిగతా ముగ్గురూ కోర్టుకెళ్ళారు. స్టే వచ్చింది. మొత్తం ప్రక్రియ ఆగిపోయింది... బహుశా ఆ స్టేకి వెనకాల ఇప్పుడున్న స్టీవ్‌డోర్‌ల హస్తం కూడా వుండవచ్చును సర్... వీళ్ళు సామాన్యులు కారు సర్..."

విషయం అర్థమైపోయిందనుకున్నాను. ఇదే అంశంపై అధికారులతో చాలా మీటింగ్‌లు జరిపాను. ప్రతిసారీ పాతస్టీవ్‌డోర్ల 'సానుభూతి పరుల' నుంచి నాకు హెచ్చరికల సంకేతాలు వచ్చేవి.

"ఏమైనా సరే, కొత్తవారికి లైసెన్సులిద్దాం" అని ప్రకటించాను.

పోర్టు అధికార వర్గాలు భయపడ్డాయి. భయం నాకూ వుంది. కాని ట్రాఫిక్ పెంచాలన్న లక్ష్యం పెట్టుకున్నాక అవరోధాల్ని మాత్రమే చూస్తూ కూర్చుంటే లక్ష్యం ఎప్పుడు సాధిస్తాం. నాకు చిన్నప్పుడు మా నాన్నగారు బాగా ప్రాచుర్యం పొందిన సూక్తి ఒకటి చెప్పేవారు. "నీ దృష్టి లక్ష్యం మీదే కేంద్రీకృతమైతే మధ్యలో అవరోధాలు కనబడవు". నిజానికి పోర్టు అనేది ఒక పద్మవ్యూహం. ప్రతిరోజూ ఏదో ఒక మూల ఏదో ఒక సమస్య తలెత్తుతూనే వుంటుంది. 12 వేలమంది ఉద్యోగులూ, నాలుగువేల మంది కార్మికులూ, రెండువేలమంది కస్టమ్స్, ప్రజారోగ్యం, సిఐఎస్ఎఫ్ దళాలు వగైరాలతో యంత్రాలు కూడా పనిచేస్తూ వుంటేనే ఎగుమతి దిగుమతులు

జరుగుతాయి. పోర్టుల్లో ఎగుమతి దిగుమతులు ఒక్కవారంరోజులు స్తంభిస్తే ఈ దేశపు ఆర్థిక వ్యవస్థ మొత్తం తారుమారయిపోవచ్చు.

నేను పోర్టులో చేరిన కొత్తలో ఒకరోజు ఉదయాన్నే హార్బర్‌లో బెర్త్‌ల మీద నడుస్తున్నాను. చిన్న నౌకలలోకి లోడింగ్, అన్‌లోడింగ్ జరుగుతోంది. ఒక ఓడలోకి బొగ్గు ఎగుమతవుతోంది. బయట రైల్వే బోగీ నుంచి టిప్పర్ బొగ్గుని తీసుకొచ్చి ఓడలోకి లోడ్ చేసే క్రేన్ తాలూకు వలలోకి వేస్తోంది. క్రేన్ కెపాసిటీ 10 టన్నులు. టిప్పర్ కెపాసిటీ 10 టన్నులు. కాని ప్రతి టిప్పరు నుంచీ రెండు విడతలుగా బొగ్గుని వలలోకి వేసి నౌకలోకి ఎక్కిస్తున్నారు.

"అదేంటి? మొత్తం టిప్పర్‌లోడ్‌ని ఒకేసారి లోడ్ చేయొచ్చు కదా?" అని అడిగాను.

"కుదర్దు సర్, క్రేన్ కెపాసిటీ 10 టన్నులేకాని, ఈ నార వల కెపాసిటీ అయిదుటన్నులే కదా" అన్నారు అక్కడి సిబ్బంది. అంచేత ప్రతిసారీ అయిదేసి టన్నుల వంతున మాత్రమే లోడ్ చేస్తున్నారు. వలకెపాసిటీకూడా 10 టన్నులు వుంటే...? లోడింగ్ స్పీడు పెంచవచ్చుకదా!

స్టీవ్‌డోర్ల సంఘం అధ్యక్షుడు గంగిరెడ్డిగారిని పిలిచి అడిగాను. "ఇంతవరకూ ఎప్పుడూ ఆలోచించలేదు సర్" అన్నారు. "దేశమంతా గాలించి, నైలాన్ వైరుతోవున్న 10 టన్నుల కెపాసిటీ వలలు ఎక్కడున్నాయో చూడండి, తెప్పిద్దాం" అన్నాను. ఈ యంత్రాలు, పరికరాలు (గేర్) అన్నీ పోర్టు -డాక్‌లేబర్ బోర్డువే. వీటికి స్టీవ్‌డోర్‌లు అద్దె కట్టి వాడుతుంటారు.

పదిరోజుల్లో 10 టన్నుల సామర్థ్యం వున్న నైలాన్ వలని ప్రయోగాత్మకంగా తెప్పించారు గంగిరెడ్డి. అద్భుతం. చాలా దృఢంగా వుందని మా ఇంజనీర్లు కూడా ధృవపరిచారు. అన్ని 10 టన్నుల క్రేన్‌లూ ఇటుపై లోడింగ్, అన్‌లోడింగుల్లో ఈ 10 టన్నుల వలల్నే వాడాలని ఆదేశించాను. కాని అంత సులభంగా ఎలా జరుగుతుంది?

ట్రేడ్ యూనియన్‌లు అడ్డం తిరిగాయి. ఎందుకంటే - అయిదుటన్నుల వలని క్రేన్ కొక్కాలకి నాలుగు మూలలా తగిలించేందుకు నలుగురు కార్మికుల్ని ఇప్పుడు నియోగిస్తుంటే, పదిటన్నుల వలకి ఎనిమిది మందిని తీసుకోవాలి కదా అని వాళ్ళ డిమాండు. ఇదేం లెఖ్ఖ? నిజానికి బొగ్గు వేసేటప్పుడు కాని తీసేటప్పుడు కాని ప్రారంభంలో ఒకసారి, చివరగా ఒకసారి మాత్రమే నాలుగు కొక్కాల్ని తీసే పని వుంటుంది. మధ్యలో లోడింగ్ సమయంలో రెండు కొక్కాల్ని విప్పితే చాలు కదా! వాళ్ళు చేస్తున్నది అదే. కాని ట్రేడ్ యూనియన్లు వూరుకోవు. ఈ పేచీ మూలంగా నాలుగైదు రోజులు కొత్త వలలు వాడలేకపోయాం. స్టీవ్‌డోర్లూ, ట్రేడ్ యూనియన్ నాయకుల్నీ చూస్తుంటే, 'ఎవరి ఆధిపత్యం వాడికిముఖ్యం - పోర్టుకి ట్రాఫిక్ పెరగటం కాదు' అనిపించింది. చివరికి నేను కల్పించుకొని "ఆరుగుర్ని పెట్టండయ్యా, నలుగురు కొక్కాలు తగిలిస్తే, ఇద్దరు క్రిందపడ్డ బొగ్గు ఏరి లోపల వేస్తుంటారు" అని చెప్పి ఒప్పించాల్సి వచ్చింది. మొత్తంమీద ఈ మార్పుతో బొగ్గులోడింగ్ సామర్థ్యం రోజుకి 2400 టన్నుల నుంచి 4800 టన్నులకి పెరిగింది.

ఇలాంటి తలనొప్పులు, అవరోధాలు రోజుకొకటి చొప్పున వెంటాడుతున్నాయి. దీనికి తోడు అధికారులు సమర్థులేకాని, చొరవ తీసుకునే తత్వం తక్కువ. "ఛైర్మన్ చెబితే చేద్దాం, ఛైర్మన్ మద్దతుంటే చేద్దాం" అనుకునే వాళ్ళు. ప్రభుత్వంలో కూడా చాలామంది ఇలాగే పనిచేస్తూండటం చూశాను కాబట్టి నాకు విచిత్రమనిపించలేదు. కాని పనే జరగాలి. ఎలా?

స్టీవ్‌డోర్లలో పోటీ పెంచగలిగితేనే రేటు తగ్గుతుంది. రేటు తగ్గితేనే కొత్త ట్రాఫిక్‌ని విశాఖపోర్టుకి ఆహ్వానించగలుగుతాం. ట్రాఫిక్ వస్తుందంటే కదా మిగతా ఏర్పాట్లన్నీ చేయాలి... అసలు గోనెల గారి హయాంలో ఎక్కడ ఆగిపోయిందీ ప్రక్రియ?

ఫైలు తెప్పించి చూశాను. ఆయన ప్రకటించినప్పుడు 18 మంది కొత్త వాళ్ళు స్టీవ్‌డోర్ లైసెన్సుకి దరఖాస్తు చేశారు. వాళ్ళలోంచి ఆర్థిక స్తోమత, పాత అనుభవం, యంత్ర పరికరాలు కలిగి వున్న 12 మందిని ఎంపిక చేశారు. అధికారులతో ఒక స్క్రీనింగ్ కమిటీ వేస్తే ఆ కమిటీ ఆ 12 మందిలో అత్యంత అర్హులుగా ఆరుగురిని ఎంపిక చేసింది. అంతే ! పాత స్టీవ్‌డోర్లు ఎదురుతిరిగారు. ఒక్కసారిగా ఇంతమంది రంగంలోకి వస్తే వ్యాపారం ఎవ్వరికీ గిట్టుబాటు కాకుండాపోతుందని వాదించారు. ఎదిరించారు. హెచ్చరించారు... చివరికి గోనెలగారు మధ్యేమార్గంగా ఆ ఆరుగురిలో మొదటి ముగ్గురికీ లైసెన్సులు జారీ చేశారు. దాంతో మిగతా ముగ్గురూ కోర్టుకెళ్ళారు.

ఫైలు చూసిన వెంటనే, "కోర్టు కెళ్ళిన ముగ్గురిక్కూడా లైసెన్సు ఇచ్చేద్దాం, కేసు వుండదుకదా" అన్నాను మా అధికారులతో.

"ఒక్కసారిగా ఆరు లైసెన్సులా?" అంటూ మా ట్రాఫిక్ మేనేజర్ రొక్కం ఖంగారుపడ్డారు. ఆయన కూడా నాకు కొన్ని విషయాలు వినిపించాడు. "కొత్తవాళ్ళు సరిగ్గా పనిచేయకపోతే పోర్టుకి చెడ్డపేరు వస్తుంది సర్!" ఎంత దూరదృష్టి!

"లైసెన్సు తీసుకున్నవాళ్ళు కొత్త ఎగుమతి, దిగుమతులు తీసుకురావాలని కష్టపడతారయ్యా. లైసెన్సు తీసుకున్నాక సరిగాపనిచేయకపోతే లైసెన్సు రద్దు చేస్తామని ఓ షరతు అందులో పెట్టేద్దాం. ఇంకేం చెప్పద్దు నాకు" అన్నాను.

ఆరుగురికీ లైసెన్సులిచ్చాం. కాని అందరూ సమర్థులే అని చెప్పలేను. మరి ట్రాఫిక్ పెరగాలంటే పారిశ్రామికవేత్తల్నీ, వ్యాపారవేత్తల్నీ పట్టుకుని విశాఖపోర్టుద్వారా ఎగుమతి, దిగుమతులు చేయించుకోండంటూ వెంటపడే పోటీతత్వం వున్న స్టీవ్‌డోర్లు రావాలి.

ఫలితంగా స్టీవ్‌డోర్ల నిరసన, వాళ్ళ సానుభూతి పరుల నుంచి నాకు మందలింపులు, ట్రేడ్‌యూనియన్ నాయకుల లౌక్య రాజకీయాలు, ప్రతి అధికారిక చర్చనీ క్షణాల్లో మోయకూడని వాళ్ళకి మోసిపెట్టే సిబ్బందీ... ఇటువంటి ప్రతికూల వాతావరణంలో కొత్తగా స్టీవ్‌డోర్ లైసెన్సు లిస్తామని ప్రకటించాను. ఈసారి పాత షరతుల్ని బాగా సరళీకరించాను.

లైసెన్సు తీసుకోవాలంటే పాత అనుభవం అక్కర్లేదు. వాళ్ళ దగ్గర సొంత యంత్రాలు, పరికరాలూ వుండనక్కర్లేదు. బ్యాంకు గ్యారంటీద్వారా డిపాజిట్ కట్టి, ఆర్థిక స్తోమత చూపించగలిగితే చాలు. వాళ్ళకి తాత్కాలిక లైసెన్సు ఇస్తాం. ఏడాదిలోగా వాళ్ళు సొంత యంత్రపరికరాల్నీ, ఆఫీసునీ, సిబ్బందినీ సమకూర్చుకొని లైసెన్సుని రెగ్యులరైజ్ చేసుకోవాలి. లేదంటే డిపాజిట్ స్వాధీన పర్చుకోబడుతుంది. ఇంకా దేశంలో ఏ ఇతర పోర్టులో లైసెన్సు వున్న స్టీవ్‌డోర్‌కైనా ఇక్కడ దరఖాస్తు చేస్తే లైసెన్సు ఇచ్చేస్తాం. ఏడాదికి కనీసం 50 వేల టన్నుల ట్రాఫిక్‌ని వాళ్ళు తెచ్చుకుని ఎగుమతి – లేదా–దిగుమతి చేయలేకపోతే లైసెన్సు రద్దవుతుంది.

అంతే! ఏదో అగ్నిపర్వతం బ్రద్దలయినట్లుగా పాత స్టీవ్‌డోర్లు నాకు హెచ్చరికలు పంపారు. కొన్ని నేరుగా, కొన్ని పరోక్షంగా. నామీద విస్తృతంగా ప్రచారం చేశారు. "ఈ ఛైర్మన్‌కి తొందరెక్కువ... దూరం ఆలోచించడు.... తప్పుడు నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటాడు... పోర్టుని భ్రష్టు పట్టిస్తున్నాడు..." ఇలాంటి ప్రచారాలు, ప్రసంగాలు సాగి సాగి, తుదిహెచ్చరిక చేశారు – "రేపు మీరు పశ్చాత్తాపపడతారు చేతులు కాలాక" అంటూ.

వాళ్ళ హెచ్చరికలు నాలో మొండితనాన్ని పెంచాయి. కసి, పట్టుదలని పెంచాలి. ఇలాంటి సందర్భాలలో రెండు ప్రశ్నలు వేసుకోవటం నాకు అలవాటు. మొదటి ప్రశ్న! ఇది ప్రభుత్వ విధానానికి విరుద్ధంగా వుందా? రెండవ ప్రశ్న: దీనివల్ల నేను ఆశిస్తున్న ప్రయోజనం వెనకాల నా స్వార్థం ఏమైనా వుందా? ఈ రెండు ప్రశ్నలకి జవాబు 'నో' అని వస్తే ముందుకు దూసుకువెళ్ళటం ఒకటే నేర్చుకున్నాను. అదే చేశాను ఇక్కడ కూడా.

స్టీవ్‌డోర్లు కూడా సిద్ధమైపోయారు. ఏదో ఉద్యోగరీత్యా డెప్యుటేషన్ మీద వచ్చి మూడేళ్ళుండి వెళ్ళిపోయే నాకే అంత మొండితనం వుంటే దశాబ్దాల తరబడి విశాఖపట్నం పోర్టులో పాతుకుపోయిన వాళ్ళకెంత ధైర్యం వుండాలి!

నేను లైసెన్సు లిచ్చిన వాళ్ళలో ఒకరైన ఉషోదయా షిప్పింగ్ వాళ్ళు ఒరిస్సాలో పరదీప్ పోర్టులోని స్టీవ్‌డోర్‌తో కలిసి ఒరిస్సా పరిశ్రమ నుంచి ఏదో ఎగుమతికి లేబర్ కాంట్రాక్టు తెచ్చుకున్నారు. మా లేబర్‌ని అద్దెకి తీసుకున్నారు. తెల్లవారితే లోడింగ్ ప్రారంభమవుతుందనగా అప్పుడు ట్రాఫిక్ మేనేజర్ రొక్కం పరుగెత్తుకుంటూ వచ్చారు.

"సర్, నేను ఊహించినట్లే జరిగింది సర్. రేపొద్దున ఉషోదయా షిప్పింగ్ వాళ్ళు ఎలా లోడింగ్ చేస్తారో చూస్తామంటూ పాతస్టీవ్‌డోర్లు బెర్తుమీదే బాహా బాహి యుద్ధానికి తలపడుతున్నారు. పాతవాళ్ళు అందరూ ఒకటైపోయారు. ఉషోదయా అప్పారావుగారు మన మద్దతు లేకపోతే లోడింగ్ ఎలా చేయగలనంటున్నారు. ఏం చేద్దాం సర్?"

What a Pity? కోట్లకి పడగెత్తిన పాత స్టీవ్‌డోర్లంతా కలిసి కొత్తవాళ్ళు రాకుండా చేయడంకోసం బాహాబాహి ముష్టి యుద్ధానికి సిద్ధమవుతున్నారు.

కారణం - స్వార్థం!

మేం 12 మందీ ఎలాగో ఈ పోర్టులో ట్రాఫిక్ వ్యాపారంలో స్థిరపడిపోయాం. పంచుకు తింటున్నాం. కొత్తవాళ్ళు వస్తే మన సంపాదన పల్చబడిపోతుంది. ఎలా అనుమతిస్తాం? - ఇదీ వాళ్ళ కడుపుమంట. కాని నా ఆశ వేరు. కొత్తవాళ్ళు వస్తే తాపీగా వ్యాపారం పంచుకుని రేట్లు పెంచే అనారోగ్యం వదిలిపోయి, పోటీ పెరిగి, స్టీవ్‌డోరింగ్ రేట్లు తగ్గుతాయి. స్టీవ్‌డోరింగ్‌లో వేగం పెరిగి, సామర్థ్యం పెరుగుతుంది. ఇందువల్ల ఇతర పోర్టుల్లో కన్నా మనపోర్టుద్వారా ఎగుమతి దిగుమతులు పెరుగుతాయి. ట్రాఫిక్ పెరిగితే మరో పాతికమంది స్టీవ్‌డోర్లున్నా ఫరవాలేదు. అందరికీ చేతినిండా పని దొరుకుతుంది కదా!

'ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాససంత్రస్తులై...' అన్న భర్తృహరి సుభాషితం నాకు ఇలాంటి సమయాల్లో గుర్తుకొస్తూంటుంది. "రొక్కం, పోలీసుల్ని పిలిపించండి. మన సిఐఎస్ఎఫ్ దళాల్ని రంగంలోకి దించి, ఆ బెర్తుమీద ఉషోదయా షిప్పింగ్ స్టీవ్‌డోర్ తప్ప బయటవాళ్ళని అడుగు పెట్టనీయకుండా అడ్డం పడమని చెప్పండి. మన పోర్టు అధికారులందరికీ ఆ బెర్తు చుట్టుప్రక్కలే డ్యూటీ వేసి, అనుమానాస్పదంగా ఎవరు కనబడినా పోలీసు నిర్బంధంలో వేసేయమని చెప్పండి. కొత్త స్టీవ్‌డోర్‌కి పూర్తి నైతిక, భౌతిక మద్దతునివ్వాల్సిన బాధ్యత మనది. మనవాళ్ళలో ఎవరు ఏ తప్పు చేసినా పరిణామాలు తీవ్రంగా వుంటాయని నా మాటగా హెచ్చరించండి..."

తెల్లవారేసరికి ఆ బెర్తునిండా మా దళాలు, అధికారులు, పోలీసుల మోహరింపుతో కొత్త స్టీవ్‌డోర్‌పై దాడికి దిగుదామని రంగంలోకి దిగిన పాత స్టీవ్‌డోర్లు, వాళ్ళ మందీ మార్బలం అవాక్కయ్యారు. విశాఖపోర్టు చరిత్రలో వాళ్ళు ఊహించని పరిణామం అది. వాళ్ళు రోజూ లోడింగ్, అన్‌లోడింగ్‌లో జరిపే బెర్తుమీదకి వాళ్ళే కాలుపెట్టలేని స్థితి!!!

వాళ్ళల్లో వివేకం మేల్కొన్నట్లుంది. "సరే, రేపు చూద్దాం. ఇవ్వాల్టికి ఊరుకుందాం" అనుకున్నారు. అలారేపు, రేపు ,రేపు... చాలా రేపులు గడిచిపోయాయి. రెండు నెలల్లో కొత్త స్టీవ్‌డోర్లంతా పాతబడిపోయారు.

కాని ప్రతికొత్త స్టీవ్‌డోరూ పోర్టులో నిలదొక్కుకోవటం కోసం ఏడాదికి కనీసం 50 వేల టన్నుల ఎగుమతి, దిగుమతి వ్యాపారం తీసుకురావాలని స్టీవ్‌డోరింగ్ రేట్లు బాగా తగ్గించి పారిశ్రామిక, వ్యాపార వర్గాల్లో ప్రచారం చేసుకున్నారు. ఇంచుమించు ప్రతికొత్త స్టీవ్‌డోరూ ఎంతో కొంత ట్రాఫిక్‌ని విశాఖపోర్టుకి తీసుకువచ్చేస్తున్నాడు. దాంతో పాత స్టీవ్‌డోర్ల రింగు బ్రద్దలయింది. వాళ్ళు కూడా తమరేట్లు తగ్గించి, పోటీపడ్డారు. ఈ పోటీ- స్టీవ్‌డోర్లందరిలోనూ వేగాన్ని, సామర్థ్యాన్ని పెంచింది.

పోర్టు ఆపరేషన్లలో షిప్పింగ్ ఏజంట్లకి లైసెన్సుండాలి. క్లియరింగ్ అండ్ ఫార్వర్డింగ్ ఏజంట్లకి లైసెన్సుండాలి. కస్టమ్స్ ఏజంటుకి లైసెన్సుండాలి. స్టీవ్‌డోరింగ్‌కి లైసెన్సుండాలి...

ఇలాంటి ఓ అరడజను వేర్వేరు లైసెన్సుదారులుంటారు. ఇంతమంది మధ్య సమన్వయం వుంటేనే గాని సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్ సక్రమంగా, సకాలంలో జరగవు.

అందుకని స్టీవ్‌డోర్ లైసెన్సులు ప్రకటించినప్పుడే మరో ప్రకటన చేశాను: "పోర్టులో ఏ ఒక్కలైసెన్సు వున్న వాళ్ళయినా అర్హులై వుండి, కోరితే మిగతా అన్ని రకాల లైసెన్సులు వాళ్ళకి ఇచ్చేస్తాం." ఇందువల్ల ఎగుమతి, దిగుమతి దారులు ఒకే పోర్టులో వేర్వేరు ఏజంట్లను కుదుర్చుకొని కుస్తీపట్టాల్సిన అగత్యం తప్పిపోయింది. ఈ చర్యవల్ల ఒక్కో పార్టీ తాలూకు ఎగుమతికీ, దిగుమతికీ ఒకే ఏజంటు అన్ని రకాల పనులూ చేసిపెట్టే వెసులుబాటు వాడుకలోకి వచ్చేసింది. ఎగుమతి దిగుమతిదార్ల పరంగా చూస్తే, వాళ్ళకి వేర్వేరు ఏజంట్ల మధ్య సమన్వయ భారాన్ని, వేర్వేరు రేట్ల వ్యయభారాన్ని ఈ చర్య బాగా తగ్గించివేసింది.

దీనికితోడు, స్టీవ్‌డోర్లలో పోటీ పెరిగి పెరిగి, రేటు ఎంత తగ్గిందంటే - 1988లో నేను పోర్టులో చేరేనాటికి సగటున టన్నుకి 150 రూపాయలుండే స్టీవ్‌డోరింగ్ రేటు 1991లో నేను ప్రధానమంత్రి కార్యాలయానికి బదిలీపై వెళ్ళేనాటికి టన్నుకి 27-60 రూపాయల స్థాయికి తగ్గిపోయింది. పోటీతోపాటు వాళ్ళ పని సంస్కృతిలో కూడా మార్పు వచ్చింది. ఏ స్టీవ్‌డోర్ ఎంత త్వరగా లోడింగ్, అన్‌లోడింగ్ పూర్తి చేస్తాడో అతడ్నే ఎగుమతిదారులు, దిగుమతి దారులు ఇష్టపడతారు...

1991 నాటికి దేశంలో అన్ని పోర్టుల్లోకీ అతి తక్కువ హ్యాండ్లింగ్ రేట్లున్న పోర్టుగా విశాఖపట్నం పోర్టు పేరు ప్రచారంలోకి వచ్చేసింది. నేను ఆశపడ్డట్లే ట్రాఫిక్ పెరిగిపోయింది. పాత కొత్త స్టీవ్‌డోర్లు అందరికీ వ్యాపారమూ పెరిగిపోయింది. (ఈరోజున విశాఖపోర్టులో చురుగ్గా పనిచేస్తున్న స్టీవ్‌డోర్‌ల సంఖ్య 40 కి చేరుకుంది.)

1988-89 నుంచి వరుసగా ప్రతి సంవత్సరం ట్రాఫిక్ పెరుగుదలలో విశాఖపోర్టే అగ్రస్థానాన్ని ఆక్రమించి, అవార్డు గెల్చుకుంటూ వచ్చింది.

1991 మేలో నేను ప్రధానమంత్రి కార్యాలయానికి బదిలీ అయి వెళ్తున్నప్పుడు పాత, కొత్త స్టీవ్‌డోర్‌లు, కార్మిక సంఘాలు ప్రధానమంత్రికి టెలిగ్రామ్‌లు కొట్టారు.

"ప్రసాద్‌ని మా పోర్టు ఛైర్మన్‌గానే కొనసాగించండి"

స్వార్థంలేని యాజమాన్య నిర్ణయాలు సత్ఫలితాలిస్తాయన్న నా నమ్మకం బలపడింది.

* * *

కేంద్రమంత్రితో ఢీ

కేంద్రమంత్రి ఉన్నికృష్ణన్ నామీద వత్తిడి తీసుకువచ్చారు.

విశాఖపట్నం హార్బర్‌లో ఒక జెట్టీ (నౌకలు నిలవడానికి పూర్తి సదుపాయాలు లేని ప్లాట్‌ఫారమ్) స్థానంలో శాశ్వతమైన బెర్త్ నిర్మించేందుకు రూ. 12 కోట్లతో ఎన్.ఇ.సి. కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్టుని ఆపేయాలని ఉన్నికృష్ణన్‌గారి ఆదేశం. ఈ విషయం నాకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ కార్యదర్శి అబ్రహాం గారు టెలిఫోన్ చేసి చెప్పారు.

"మీరు రాతపూర్వకంగా ఆదేశించండి సర్, మీరు ఎలా చెబితే అలా చేస్తాను. ఎందుకంటే ఎన్.ఇ.సి. కంపెనీ టెండరే అన్ని టెండర్లలోకీ అతి తక్కువగావుందని టెండరు కమిటీ ఆమోదించడం, వాళ్ళు అప్పుడే కొంత మెషినరీ తెచ్చి పని ఆరంభించడానికి రంగంలోకి దిగటం జరిగింది. ఇప్పుడు మీరు రాత పూర్వకంగా ఆదేశిస్తే తప్ప, వేరే ఏ సాకు చూపి ఆపించగలను సర్?" అన్నాను.

అబ్రహాంగారు పెదవి విరిచారు. "రాతపూర్వకంగా ఇవ్వలేను. కాని ఎలాగైనా దాన్ని ఆపి, వాస్తవ పరిస్థితి ఏమిటో ఒక రిపోర్టు పంపించమని మంత్రిగారు ఆదేశించారని" కుండ బ్రద్దలుకొట్టినట్లు చెప్పి ఫోన్ పెట్టేశారు.

ఈ మాట కాంట్రాక్టరుకి చెప్పలేను. ఎందుకంటే అది రికార్డు పూర్వకంగా వచ్చిన ఆదేశం కాదు. ఇంకేదన్నా సాకు చెప్పి ఆపటానికి మనస్కరించటంలేదు. ఈ ఎన్.ఇ.సి. కంపెనీవారు అంతకుముందు ఫిషింగ్ హార్బర్‌లో ఇలాగే రూ.5కోట్ల బెర్త్ ఒకటి కట్టారు. 18 మాసాల్లో కట్టే అవకాశం ఉన్నా 11 మాసాల్లో కట్టేశారు. నాణ్యతగల నిర్మాణం చేశారు. ఇప్పుడు హార్బర్‌లో రూ. 12 కోట్లతో బెర్త్ కట్టడం వాళ్ళు మొదటిసారిగా చేపట్టిన అతి పెద్ద కాంట్రాక్టు. కాని టెండరు కమిటీ విధించిన ఆర్థిక స్తోమత చూపి అతి తక్కువ టెండరుతో పనిగెల్చుకున్నారు.

ఇప్పుడు నేను మంత్రిగారి పేరు బయట పెట్టకుండా వాళ్ళని పనిచేయనీయకుండా ఎలా ఆపాలి? అసలెందుకు ఆపాలి? ఈ మంత్రులు ఇలా ఎందుకు చేస్తారు? అంతకుముందు కూడా విశాఖ పోర్టులో మార్పు తీసుకురావాలని నేను ప్రయత్నించినప్పుడల్లా కేంద్రప్రభుత్వం నుంచి ఎదురు దెబ్బలు తింటూనే ఉన్నాను.

మొదటిసారి నేను పోర్టు ఛైర్మన్‌గా వెళ్ళిన ఓ ఏడెనిమిది మాసాల తరువాత కేంద్ర ఉపరితల రవాణామంత్రి రాజేష్ పైలట్ ఒక ఉన్నతస్థాయి. సమావేశం జరిపారు. దానికి దేశంలోని అన్ని మేజర్ పోర్టుల ఛైర్మన్‌లు, ఆసియా డెవలప్‌మెంటూ బ్యాంకు ఉన్నతాధికారులు, ఈ బ్యాంకు తరఫున దేశంలో ఓడరేవుల అభివృద్ధికి ప్రణాళిక తయారుచేసిన కన్సల్టెంట్లు,

ప్లానింగ్ కమీషన్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. కేంద్రప్రభుత్వం కోరికపై ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు తమ కన్సల్టెంట్లు ద్వారా ఈ దేశంలోని పోర్టుల్లో ఎగుమతి దిగుమతుల పెరుగుదల రాబోయే పదేళ్ళలో ఎలా ఉంటుందో అధ్యయనం చేసి ఒక నివేదిక తయారుచేశారట. దాన్ని గురించి చర్చించడం ఈ సమావేశం లక్ష్యం.

ఈ నివేదిక ప్రకారం విశాఖపట్నంపోర్టు 2000 సంవత్సరం నాటికి 18.5 మిలియన్ టన్నుల సరుకుని హ్యాండిల్ చేస్తుందట. అది చూసి నాకు నవ్వొచ్చింది.

మంత్రిగారి తొలిపలుకులతో మొదలయింది. ఎవరి దృక్పథంలో వాళ్ళు మాట్లాడారు. చివరికి మంత్రిత్వశాఖ కార్యదర్శి అబ్రహాం అడిగారు. "ఇంకెవరైనా ఏమైనా చెప్పేదివుందా?"

నేను అందుకున్నాను. "సర్, నిపుణులు తయారుచేసిన నివేదిక మా పోర్టు యొక్క వాస్తవ పరిస్థితికి విరుద్ధంగా ఉంది. గత మూడేళ్ళుగా ఏటా లక్ష టన్నులు ఎక్కువ చేస్తున్నాం కాబట్టి, ఇప్పుడు మేం 15.03 మిలియన్ టన్నుల స్థాయిలో ఉన్నాం కాబట్టి, మరో పన్నెండేళ్ళలో అంటే 2000 సంవత్సరం నాటికి మహా పెంచితే 30 లక్షల (మూడు మిలియన్) టన్నులు పెంచగలుగుతామని కాకి లెక్కలు వేసినట్లు కనుపిస్తోంది. ప్రభుత్వం కనుక ఈ రిపోర్టు ప్రాతిపదికగా వ్యవహరించదలుచుకుంటే మా పోర్టు అభివృద్ధి దెబ్బతినే ప్రమాదముంది..."

నా విశ్లేషణ అక్కడ నివేదిక తయారు చేసిన కన్సల్టెంట్లకీ, ఉన్నతాధికారులకీ నచ్చలేదు.

కార్యదర్శి అబ్రహాం నన్ను మందలించారు. "ప్రసాద్ నువ్ మాట్లాడే పద్ధతి బాగాలేదు. ఈ నిపుణులు కొన్ని మాసాల పాటు అధ్యయనం చేసిన ఈ రిపోర్టు తయారుచేశారు. నువ్వు అలా తీసిపారేయడం బాగాలేదు. ఇలాంటి వాదన చేసేటప్పుడు వాస్తవ గణాంకాలను ఉదహరిస్తూ మాట్లాడటం మంచిది..." అంతమంది ఉన్నతాధికారుల ముందు నన్ను కార్యదర్శి మందలించటంతో నాకు తల కొట్టేసినట్లయింది.

అంతలో మంత్రి రాజేష్ పైలట్ అందుకున్నారు. "ఓ.కె. మీరు చెప్పండి. ఏ రకంగా ఈ రిపోర్టు సరిగ్గా లేదు." నాకు ధైర్యం వచ్చింది. ఇక వదల్లేదు.

"సర్, ఈ రిపోర్టు ప్రకారమే 18.5 మిలియన్ టన్నుల ట్రాఫిక్‌ని హ్యాండిల్ చేయటానికి ఇంకో పన్నెండేళ్ళు పడుతుంది. కాని, నేను ఛైర్మన్‌గా వచ్చాక ఈ ఎనిమిది మాసాల్లోనే మా ట్రాఫిక్ 18 మిలియన్ టన్నులకి చేరుకుంది. ఇంకో రెండు నెలల్లో అంటే ఈ మార్చి మాసాంతానికి 20 మిలియన్ టన్నులు దాటిపోవాలని ప్రయత్నిస్తున్నాం. అయినప్పుడు ఈ రిపోర్టుని మీరు ప్రామాణికంగా తీసుకుంటే ఎలా...?"

మంత్రి "ఓ.కె." అనేశారు ఇంకెవరూ ఏమి మాట్లాడలేదు...

ఇలాగే ఇంకోసారి డాక్‌లేబర్ బోర్డులో లేబర్ ఛార్జీల గురించి సంజాయిషీ అడిగారు! అసలేం జరిగిందంటే...

ఎగుమతి దిగుమతుల లోడింగ్ అన్ లోడింగ్‌లకి నియోగించే లేబర్‌ని పోర్టుకి అనుబంధంగా ఉండే డాక్‌లేబరు బోర్డ్ సరఫరా చేస్తుంది. అప్పటి ట్రాఫిక్‌ని బట్టి వాళ్ళకి సగటున ఏడాదిలో 100 రోజులు పని ఉంటుంది. కాని ఆ లేబర్‌కి ఏడాదిలో మిగతా 260 రోజుల వేతనాన్ని కూడా మేం చెల్లించాలి. ఇంకా అతని వైద్యం ఖర్చు, రిటైరైతే ప్రావిడెంట్ ఫండు వగైరాల ఖర్చుం మేం భరించాలి. పైగా అయిదుగురు పని చేసేచోట 8-10 మందిని పెట్టాలని యూనియన్ల వత్తిడి... వీటికి నిధులెక్కడ్నుంచివస్తాయి? అందుకని ఎగుమతి దిగుమతి దారులమీద ఒక 'లెవీ'ని ఈ పోర్టు విధించేది. అన్ని పోర్టులూ లెవీ విధిస్తున్నాయి. ఆ లెవీ ద్వారా వచ్చిన డబ్బుతో మేము ఈ లేబర్ సంక్షేమం చూసేది. అయితే మా దగ్గర లెవీ వసూలు ఎక్కువగా ఉండేది. దీంతో ఎగుమతి దిగుమతి దారుల వర్గాల్లో మిగతా పోర్టుల కన్నా విశాఖపోర్టులో లోడింగ్ అన్‌లోడింగ్ ఛార్జీలు ఎక్కువగా ఉంటాయని విస్తృత ప్రచారం జరిగేది. అందువల్ల తప్పనిసరి అయితే తప్ప ఈ పోర్టుకి రావటానికి ఎగుమతి దిగుమతి దారులు ఆసక్తి చూపేవారు కారు... ఇదంతా 1988 మేలో నేను చేరే నాటి స్థితి.

వెంటనే ఏమీ చెయ్యలేను కనుక ఈ పరిస్థితిని కొనసాగిస్తూనే రెండేళ్ళలో పోర్టులో హ్యాండ్లింగ్ సామర్థ్యం పెంచి, సరుకుల, ట్రాఫిక్‌ని 30 శాతం పైగా పెంచే ప్రయత్నాలు చేశాను. ఆ చర్యలు ఫలించాయి. దాంతో ఆ రెండేళ్ళ కాలంలో ఎగుమతి దిగుమతి దారుల నుంచి వసూలు చేసిన లెవీ నుంచి రూ. 50 కోట్లు తీసి బ్యాంకులో డిపాజిట్ చేయించాను. ఈ డిపాజిట్ మీద వచ్చే వడ్డీతోనే ఇకనుంచీ కార్మికుల వైద్యం ఖర్చు, పి.ఎఫ్ ఖర్చు వగైరా భరిద్దామని నిర్ణయించాను. ఎప్పుడైతే ట్రాఫిక్ పెరిగిందో లేబర్‌కి పని లభించే రోజులు ఏడాదిలో సగటున 200 దాటిపోయింది. పి.ఎఫ్. వైద్యం ఖర్చు, ఇతర అడ్వాన్సులూ వగైరాలకు రూ. 50 కోట్ల డిపాజిట్‌పై వడ్డీని మళ్ళించడంతో ఎగుమతి దిగుమతి దారుల నుంచి వసూలు చేస్తున్న లెవీ మిగుల నిధిగా మారుతుంది. దాంతో అసలు లెవీ వసూళ్ళు నిలిపివేయాలని నిర్ణయించాను. ట్రాఫిక్ హ్యాండ్లింగ్ ఛార్జీలు తగ్గించాను.

ఆ వ్యూహం ఫలించింది. దేశంలోని పోర్టులన్నింటిలోకీ మొట్టమొదటి లెవీ రహిత పోర్టుగా 1990లో విశాఖ పట్నం పోర్టు వ్యాపార, పారిశ్రామిక వర్గాల్ని ఆకర్షించింది. ఇంక చెప్పేదేముంది? దేశంలో ఎక్కడెక్కడి ఎగుమతి దిగుమతి దారులు తమ సరుకుల రవాణాన్ని విశాఖపోర్టు మీదుగా మళ్ళించడం ప్రారంభించారు.

అంతే! దేశంలో ఇతర పోర్టుల ఛైర్మన్‌లు వెళ్ళి కేంద్ర ఉపరితల రవాణామంత్రిత్వ శాఖ మీద వత్తిడి తెచ్చారు. కేంద్రం నాకు సంజాయిషీ నోటీసు పంపించింది. "కేంద్రప్రభుత్వం అనుమతి లేకుండా సరుకుల హ్యాండ్లింగ్ ఛార్జీలలో మార్పు చేసే అధికారం మీకు లేదు... ఇది అధికార దుర్వినియోగం... ప్రభుత్వం మీ సంజాయిషీ కోరుతోంది..." అంటే, విశాఖపట్నం పోర్టు సామర్థ్యం పెంచినందుకు నన్ను సంజాయిషీ అడుగుతోందీ ప్రభుత్వం.

నేను చేసింది "తప్పుకాదు" అని నా మనస్సాక్షి చెప్పిన ప్రతిసారీ మొండితనం నన్ను వెంటాడుతూంటుంది. ప్రభుత్వంలో మంచి పనులు చేయాలంటే అధికారం ఒక్కటే ఉంటే సరిపోదు.

సంకల్ప శుద్ధి, చిత్తశుద్ధి, ఆత్మవిశ్వాసం, తదనంతర పరిణామాల్ని ఎదుర్కోగల మనోస్థైర్యం కూడా అవసరం.

సంజాయిషీ నోటీసు మొత్తం రెండు మూడు సార్లు చదివాను. పోర్టు చైర్మన్‌లకున్న అధికారాలేమిటో మరోసారి అధ్యయనం చేశాను. దొరికింది ఒక 'లా' పాయింటు! ఈసారి మరింత మొండిగా జవాలిచ్చాను.

"ఫలానా ఉత్తర్వుల ప్రకారం, ఫలానా నిబంధనల ప్రకారం పోర్టుల్లో హ్యాండ్లింగ్ ఛార్జీలను పెంచాలనుకున్నప్పుడు మాత్రమే కేంద్ర ప్రభుత్వ అనుమతిని తీసుకోవాలి. కాని మేం ఇక్కడ ఒక్కరూపాయి కూడా పెంచలేదు. అన్ని ఛార్జీలూ తగ్గించాం. ఇలా తగ్గించటానిక్కూడా కేంద్రం అనుమతి తీసుకుని తీరాలని ఏ నిబంధనా పేర్కొనటం లేదు...! అయినా మా నిర్ణయం వల్ల పోర్టులో ట్రాఫిక్ నిర్వహణా సామర్థ్యం పెరిగి, వ్యాపార వేత్తలకు ఎగుమతి, దిగుమతి ఖర్చులు తగ్గితే, ఆ పరిణామం ఈదేశ ఆర్థిక వ్యవస్థకి లాభిస్తుందని మేం విశ్వసిస్తున్నాం..."

ఇంకోసారి 1990లో ఇనుప ఖనిజం ఎగుమతి విషయంలో ఖనిజాలు లోహాల వ్యాపార సంస్థ (ఎంఎంటిసి)తో తగాదా పడ్డప్పుడు కూడా ఇలాగే కేంద్రం నన్ను పట్టుకుంది.

ఇప్పటి ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న బైలదిల్ల నుంచి ఇనుప ఖనిజాన్ని జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎండిసి) త్రవ్వితీసి, రైల్వే రేక్‌లలో విశాఖ పట్నం చేరిస్తే, ఈ ఖనిజాన్ని మరోకేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎంఎంటిసి విశాఖపోర్టు ద్వారా జపాన్ ఓడల్లోకి ఎక్కించి, జపాన్‌తో ఎగుమతి వ్యాపారం చేసుకుంటుంది. ఆ ఖనిజానికి జపాన్ చెల్లించే ధరలో ఇక్కడ ఎంఎంటిసికి ఎంత ఇవ్వాలీ, పోర్టుకి ఎంత ఇవ్వాలీ, కేంద్రానికి రాయల్టీ ఎంత ఇవ్వాలీ... అన్న విషయంలో అప్పటికి పదేళ్ళక్రితమే ఒక నిర్ణయం జరిగింది. అయినా ఎంఎంటిసి విశాఖ పోర్టుకి ఇవ్వాల్సిన ధర ఇవ్వకుండా తాత్కాలికంగా సగం రేటు చెల్లిస్తోంది. మిగతా రేటుని ప్రభుత్వం పరిష్కరించాక ఇస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారు.

ఉపరితల రవాణామంత్రిత్వ శాఖ గట్టిగా పట్టుబడితే అప్పటికి మూడేళ్ళ క్రితం సంబంధిత శాఖల మంత్రులంతా కూర్చొని రేటు ఖరారు చేశారు? ఆ రేటు మేం ఆశించినంత గొప్పగాలేదు. కాని ఈ తాత్కాలిక చెల్లింపుకన్నా ఎక్కువ అని ఆనందపడ్డాం. కాని ఆ రేటు కూడా వాళ్ళు మాకు చెల్లించడం లేదు. మూడేళ్ళు గడిచిపోయాయి. నేను మా మంత్రిత్వ శాఖ ద్వారా ఎన్ని ఉత్తరాలు రాయించినా, ఎన్ని ఫోన్‌లు చేయించిన పని జరగలేదు. చివరికి కార్యదర్శి అబ్రహాంగారికి చెప్పాను. "నాకు వదిలేయండి సర్, నేనే చూసుకుంటాను." ఆయన తొందరపడవద్దని నన్ను హెచ్చరించారు. "సరేలెండి" అన్నాను.

అన్నాను కానీ, ఎంఎంటిసికి నోటీసు జారీ చేశాను. "నెల రోజుల్లో --- గత మంత్రులకమిటీ నిర్ణయం ప్రకారం మాకు రావలసినంత బకాయి చెల్లించకపోతే మీ ఇనుప ఖనిజాలు విషయంలో మేం పనిచేయాలో అక్కర్లేదో నిర్ణయించుకుంటాం..." పోర్టుట్రస్టు బోర్డులో సభ్యుడైన ఎంఎంటిసి జనరల్ మేనేజర్ తప్ప, మిగతా, సభ్యులంతా నా చర్యని సమర్థించారు.

మా నోటీసుని ఎంఎంటిసి ఖాతరు చేయలేదు. "ఈ పోర్టు ద్వారా ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేయడం కోసం కన్వేయర్ బెల్టు వగైరాల మీద రూ. 150 కోట్లు ఖర్చుపెట్టాం. ఇదంతా పోర్టుకి అప్పుగా ఇచ్చాం. పైగా ఈ పోర్టు హ్యాండిల్ చేసే ట్రాఫిక్‌లో 40 శాతం మన ఖనిజమే. మనల్ని కాదని పోర్టు ఏం చేయగలదు?" అన్నది ఎంఎంటిసి ధీమా. పైగా అది కూడా కేంద్ర ప్రభుత్వంలో ఒక భాగం.

15 రోజులు గడిచాక ఎంఎంటిసికి చివరి హెచ్చరిక చేశాను. "రాబోయే 15 రోజుల్లో మీరు పోర్టుకి బాకీ చెల్లించకపోతే, ఆ తరువాత ఈ ఖనిజాల ఎగుమతికి మేం బాధ్యతవహించం. 15 రోజులు ముందే చెప్పాం కనుక ఆ రోజునుంచి నెల తరువాత వచ్చే చివరి ఓడ వరకూ మాత్రమే లోడింగ్ జరుగుతుందని మరోసారి గుర్తుచేస్తున్నాం. (జపాన్‌లో ఓడల రాకపోకల షెడ్యూలు నెలకోసారి జరుగుతుంది.) మీరు బాకీ చెల్లించకుండా ఓడ వస్తే మాకు బాధ్యతలేదు..."

అయినా ఎంఎంటిసి నుంచి చలనం లేదు. తెల్లవారితే నేనిచ్చిన గడువు పూర్తవుతుందనగా నాకు తెలిసిన విషయం ఏమిటంటే - ఎంఎంటిసి యాజమాన్యం తన పంతం నెగ్గించుకోవటం కోసం వాణిజ్యమంత్రిత్వశాఖ, మా మంత్రిత్వశాఖల కార్యదర్శుల ద్వారా నా మీద వత్తిడి తేవటానికి సిద్ధమవుతోంది.

ఇప్పుడిక నేను కూడా ఏదో ఒక 'ట్రిక్' ఉపయోగించాలి. లేకపోతే ఎంఎంటిసి నుంచి పోర్టుకి బాకీ వసూలు కాకపోగా, నేనూ - నా పోర్టూ నవ్వులపాలయిపోతాం. పట్టుదల పెరిగింది.

తెల్లవారింది. పోర్టులో ఇనుప ఖనిజం బెర్తు మీదకి జపాన్ నౌక వచ్చింది. దాన్ని నేను ఆపలేదు. కాని, రైల్వే రేక్‌లలో వచ్చిన ఇనుప ఖనిజాన్ని ఒకటిన్నర కిలోమీటరు దూరం మోసుకెళ్ళి నౌకలోకి లోడింగ్ చేసే మా కన్వేయర్ బెల్ట్‌ని పని చేయకుండా ఆపేశాను. ఫినిష్! గంటగంటకీ ఎంఎంటిసికి వేడి పెరిగిపోతుంది. రైల్వే రేక్‌లలో ఖనిజం నిలిచిపోయింది. బెర్తులో ఓడ ఖాళీగా ఉండిపోయింది. పోర్టు లోడింగ్ చేయటం మానేసింది.

ముందురోజు రాత్రి విన్నట్లుగానే తెల్లవారిన దగ్గర్నుంచి ఢిల్లీ నుంచి నాకోసం ఫోన్‌లు మొదలయ్యాయి. ఎంఎంటిసి ఛైర్మన్ నుంచి, వాణిజ్య మంత్రిత్వశాఖ కార్యదర్శి నుంచీ, మా మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ నుంచి, అనక కార్యదర్శి అబ్రహాంగారి నుంచీ ఫోన్‌లు వస్తూనే ఉన్నాయి. నేను ముందుగానే ఆదేశించిన విధంగా అన్ని ఫోన్ కాల్స్‌కీ నా పి.ఏ ఒకే జవాబు ఇస్తూ వెళ్ళాడు. "ఛైర్మన్‌గారు హార్బర్‌లో బెర్తుల దగ్గర ఎక్కడో ఇన్‌స్పెక్షన్‌లో ఉన్నారు, సర్, రాగానే చెబుతాను."

సాయంత్రానికి అవమానభారంతో ఎంఎంటిసి దిగివచ్చింది. 3 గంటలకి పాతబకాయిల్లో భాగంగా రూ. 10 కోట్లకు చెక్కు పంపించింది. మరో రెండు వారాల్లో వారానికి రూ. 10 కోట్లు వంతున చెల్లిస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చింది... ఇది తెలిశాక ఇనుప ఖనిజాల లోడింగ్‌ని అనుమతించాను. ఇదంతా జరిగాక అప్పుడే నేను ఆఫీసుకి వచ్చినట్లుగా ఢిల్లీకి ఫోన్

చేసి, మా శాఖ కార్యదర్శి అబ్రహాంగారితో మాట్లాడాను. "సర్ మీరు టెలిఫోన్ చేశారుట. సారీ సర్, నేను బెర్తుల మీద ఇనస్పెక్షన్‌లో ఉండిపోయి..."

"ప్రసాద్..." అని ఆయన వత్తివత్తి పలుకుతుంటే, నాకర్థమైపోయింది - నన్ను నమిలి మింగేయాలన్నంత కోపంగా ఉంది ఆయనకి. కాని మనసులో ఎక్కడో నాపట్ల కొంచెం సానుభూతి ఉన్నట్లుంది. నోరు పారేసుకోకుండా వదిలేశారు.

పైగా ఆయనకి అప్పటికే నా తత్త్వం అర్థమైపోయింది. ఒకప్పుడు ధాన్యం నిల్వలకోసం కట్టిన గోదాము, ధాన్యం దిగుమతులు ఆగిపోయిన 10-12 సంవత్సరాల తరువాత ఖాళీగా పడివుంటే చూసి, వాటి లోపల అడ్డుగోడలు పగలగొట్టించి, కొత్తగా దిగుమతవుతున్న ఎరువులకోసం వాడటం మొదలుపెట్టినప్పుడు ఇలాగే ఆడిట్ అభ్యంతరం వచ్చింది. చేసినపని వల్ల జరిగింది లాభమా నష్టమా?... ఇలాంటి అభ్యంతరాలు ఎలా అభివృద్ధికి అడ్డంగా నిలుస్తున్నాయో వైజాగ్ వచ్చినప్పుడు అబ్రహాం గారికి చూపించి వివరించాను. ఇలాంటి ఎన్ని అవరోధాలు ఎదురైనా, 47 కోట్ల రూపాయలు నష్టాల్లో ఉన్న పోర్టుకి రెండేళ్ళలో 100 కోట్ల రూపాయల లాభాలు గడించి డిపాజిట్‌ల రూపంలో పెట్టాం. అదంతా కూడా ఆయనకి తెలుసు. బహుశా అందువల్ల కావచ్చు మనసులో చిన్న సానుభూతి ఉంది. పైగా, రేట్లు తగ్గించడం, ట్రాఫిక్ పెంచుకోవడం, వివిధ శాఖల మధ్య సమన్వయంతో పోర్టు సామర్థ్యం పెంచటం వంటి అంశాల గురించి ఆయన విశాఖపోర్టుని ఉదహరిస్తూ ఇతరపోర్టులకి ఒక సర్క్యులర్ కూడా పంపి ఉన్నారు.

ఇంత నేపథ్యం ఉన్నప్పటికీ రూ. 12 కోట్ల రూపాయల బెర్త్ నిర్మాణం విషయంలో కేంద్రమంత్రి ఉన్నికృష్ణన్ మాటకి అబ్రహాంగారు ఎదురు చెప్పదల్చుకోలేదు. రాజకీయ నాయకులతో తగాదాకి చాలామంది ఐఏఎస్ ఆఫీసర్లు ఇష్టపడరు. తగాదా పెట్టుకోవాలని నాకూలేదు. కాని న్యాయంగా టెండరు గెల్చుకున్న వాళ్ళకి అన్యాయం జరగటమూ నాకిష్టం లేదు. పైగా లోపాయికారీగా నేను తెలుసుకున్నదేమిటంటే ఎన్.ఇ.సి కంపెనీకంటే ఎక్కువ మొత్తానికి టెండరు వేసినవాళ్ళు కేరళవాళ్ళు. వాళ్ళకి మంత్రిగారు బాగా తెలుసు. "గతంలో ఇంతపెద్దపని చేసి ఉండని ఎన్.ఇ.సి.కి ఈ పని ఇవ్వటం వెనకాల పెద్ద కుంభకోణం ఉంది." అని వాళ్లు మంత్రికి చెప్పారట.

అబ్రహాంగారికి రిపోర్టు పంపాను. అతి తక్కువ కోట్ చేసిన ఎన్.ఇ.సి. కంపెనీని ఏయే కారణాలవల్ల టెండర్ కమిటీ ఆమోదించిందో వివరంగా రాశాను... పదిరోజులు గడిచాయి. కార్యదర్శి నుండి నాకు ఎలాంటి సమాచారమూ రాలేదు.

మళ్ళీ అబ్రహాంగారికి పాత రిపోర్టు గుర్తు చేస్తూ లెటర్ రాశాను. "కాంట్రాక్టరు త్వరగా పని చేయాలని ఆరాటపడుతున్నాడు. కేవలం నోటిమాట మీద నేను అతన్ని ఎక్కువ రోజులు ఆపలేను. మంత్రిగారి నిర్ణయాన్ని వెంటనే తెలియచేయండి" అంటూ రాశాను.

దానికీ జవాబు లేదు. అబ్రహాంగారితో ఫోన్‌లో మాట్లాడాను. "రెండుసార్లు మంత్రిగారికి గుర్తు చేశానయ్యా. ఫైలు ఆయన దగ్గరుంచుకున్నారు. ఏ సంగతీ చెప్పట్లేదు."

ఇహ ఇలా కాదని, పోర్టు ట్రస్టుబోర్డు మీటింగ్ పెట్టి, ఒక తీర్మానం చేయించాను.

"ఈ పని విషయంలో ప్రభుత్వం నుంచి వారం రోజుల్లో ఎలాంటి ఆదేశాలు రాతపూర్వకంగా రాని పక్షంలో, పోర్టు చైర్మన్ ఈ పనిని వెంటనే మొదలుపెట్టించాలి."

ఈ తీర్మానం ఫాక్స్‌లో అందీ అందగానే అబ్రహాంగారు టెలిఫోన్ చేశారు. "ఇదేంటి ప్రసాద్, ప్రభుత్వానికే నోటీసు ఇచ్చావు?"

నేను వినయంగా నవ్వాను. "సర్, మీరు దీన్ని మంత్రిగారికి పంపించి చూడండి. ఏమైందో చెప్పండి."

వారం దాటిపోయి ఇంకోవారం కూడా గడిచిపోతుంటే ఎన్.ఇ.సి కాంట్రాక్టరుని పిలిచి, "మీరు బెర్త్ నిర్మాణం సాగించేయండి" అని చెప్పేశాను.

ఆ సమయంలో నన్ను భయపెట్టిన అంశం ఒక్కటే, "మంత్రి ఈ కక్ష మనసులో పెట్టుకుని నన్ను ఎన్ని రకాలుగా సాధిస్తారో!" అన్నింటికీ సిద్ధపడ్డాను. ఇలాంటి సందర్భాలలో న్యాయం చేయాలంటే కూడా మొండిధైర్యం కావాలి.

ఓ నెల తరువాత మంత్రి ఉన్నికృష్ణన్‌గారు విశాఖపట్నం వచ్చారు. ఆయన్నే పిలిచి, ఆ బెర్త్‌కి "శంకుస్థాపన రాయి వేయండి సార్" అని ఆహ్వానించాను.

ఆయన వచ్చి చూసి గుంభనగా నా చెవిలో "ఇదే పని కదా...?" అని అడిగారు.

నేను కూడా మరింత గుంభనగా "ఇదే పనిసార్" అని వినమ్రంగా చెప్పాను. ఆయన చిరునవ్వు నవ్వి, శంకుస్థాపన చేసి నా భుజం తట్టి వెళ్ళిపోయారు.

అసలేం జరిగిందీ? నాకు అర్థంకాలేదు.

ఆ తరువాత అబ్రహాంగారు చెప్పారు.

"మంత్రిగారు నీ రిపోర్టు చూశాక కేరళ వాళ్ళ ఆరోపణలో న్యాయం లేదని భావించారు. కాని వాళ్ళని నిరాశ పర్చలేక, ఫైలు తొక్కిపెట్టారు. చివరకు నువ్వు పని మొదలుపెట్టావని తెలిసినప్పుడు మాత్రం వాళ్ళ ఎదురుగుండా కొంచెం కేకలు, అరుపుల సీను జరిపారు వాళ్ళ ఆనందం కోసం..."

తెల్ల మొహం వేశాను.

రాజకీయ నాయకులు ఇలా కూడా చేస్తుంటారా?

చివరికి ఆ బెర్త్ నిర్మాణం నిర్ణీత వ్యవధికన్నా ముందే పూర్తయిపోయింది. ఆ కంపెనీ ఇప్పుడు రూ. 20000 కోట్లు టర్నోవరుతో దేశంలోని పెద్ద కంపెనీల్లో ఒకటైపోయింది!

★ ★ ★

ఇళ్ళు కూలగొట్టి, 'నెప్ర్యూఫ్లేస్' కట్టి...

విశాఖపట్నం పోర్టులో హార్బర్‌కి దగ్గరగావున్న రెండువేల మంది కార్మికుల క్వార్టర్స్‌ని, పారిశ్రామిక భద్రతాదళం బారక్స్‌ని, అక్కడే ఏనాడో కట్టించిన రామాలయం, ఆడిటోరియం, కళ్యాణమండపం, శారదా మహిళా సమాజాల భవనాల్ని కూలగొట్టాలని నిర్ణయించుకున్నాను.

చాలా దూరాలోచనతో పోర్టుకి మంచి చేస్తున్నాననుకున్నానుకానీ, నా నిర్ణయానికి 'దురాలోచన'గా ముద్రపడి, అది నన్ను వివాదాల సుడిగుండంలోకి లాగుతుందని ఊహించలేక పోయాను.

నా నిర్ణయాన్ని పోర్టులో ట్రేడ్ యూనియన్లన్నీ వ్యతిరేకించాయి. ఒక ట్రేడ్ యూనియన్ నాయకుడు వి.వి.రామారావు (ఈయన ఇప్పుడు ఎఐటీయుసి రాష్ట్ర అధ్యక్షుడు), మరో యూనియన్ నాయకులు శాస్త్రి ప్రభృతులు నన్ను తీవ్రంగా హెచ్చరించారు:

"మేం ఎన్నో దశాబ్దాలపాటు పోర్టు యాజమాన్యంతో పోరాడి కార్మికుల కోసం, సిబ్బంది కోసం ఇక్కడ సమకూర్చుకున్న ఈ క్వార్టర్లని, ఇతర వసతి సదుపాయాల్ని ఇక్కడ్నుంచి తొలగించాలనే దుస్సాహసం చేయకండి. చేశారో... బిలాబిలాలు చూసుకోవలసివస్తుంది."

నా వ్యూహం బెడిసికొట్టిందా!

విశాఖపోర్టు బల్కుపోర్టు. బల్క్ అంటే ఇనుప ఖనిజం, స్టీలుమిల్లులకు బొగ్గు, సున్నపురాయి, విద్యుత్ కర్మాగారాలకు థర్మల్ బొగ్గు, ఎరువులు, ఆహారధాన్యాలు, భాస్వరం, రాక్‌ఫాస్ఫేటు, పెట్రోలియం - ఇలాంటి ముడిసరుకు ఎక్కువగా వస్తుంది. కంటైనర్లు ఇతర రకాల ఉత్పత్తులు తక్కువ.

అందుకే పోర్టులో పర్యావరణ కాలుష్యం లేకుండా చూడటం ఒక పెద్ద కార్యక్రమం. ఎక్కడ చూసినా బొగ్గు, ఇనుపఖనిజం పెద్దపెద్ద కొండల్లా కనబడుతుంటాయి. ఎంత నీటి జల్లులతో తడిపించినా, ఓడలోంచి దింపేటప్పుడు ఎక్కించేప్పుడు, గూడ్స్‌రైలు బోగీలనుండి దింపేటప్పుడు, ఎక్కించేటప్పుడు, గాలులు బాగా వీచినప్పుడు ఎంతో కొంత కాలుష్యముండటం సహజం... 1988లో నేను పోర్టు చైర్మన్‌గా వచ్చినప్పటినుంచీ, దేశంలోని అన్ని పోర్టులకన్న బాగా పని చేస్తున్నందుకు మెచ్చుకొంటూ వుత్తరాలు పెద్దగారాలేదు కాని, "చైర్మన్‌గారూ, పోర్టులో కాలుష్యం గురించి ఏం చేస్తున్నారు?"... "మీకు గాలిలో ధూళి కనపట్టం లేదా" ..."AC రూములో కూర్చునే మీకు కాలుష్యం గురించి ఏం తెలుస్తుంది... బొగ్గు, భాస్వరం మధ్య మేం బతకాలా చావాలా?..." - ఇలా వ్యంగ్యంగానూ, కొన్ని తిడుతూనూ, కొన్ని బతిమాలుతూనూ, ఏదోఒకటి

త్వరగా చేయమని వుత్తరాలు వస్తూండేవి. చాలావరకు అవి ఆకాశరామన్న వుత్తరాలు. కాలుష్యనివారణకు చాలా చర్యలు తీసుకోవడం జరిగింది.

ఈ ముడిసరుకు నిలవ ప్రాంగణంలో నీరుజల్లడానికి స్ప్రింకర్లు ఏర్పాటుచేయడం, రోజంతా గంటకి ఒక్కసారైనా జల్లించడం, వీలయినంతవరకు అన్ని లారీలకు టిప్పర్లకు సరుకుపైన టార్పాలిన్లు కప్పించడం... ఇనుప ఖనిజానికైతే కన్వేయర్ బెల్టు నడిచే దారి మొత్తం పైన మూసివేయడం, పోర్టులో వీలయిన చోటల్లా వేలకొద్దీ చెట్లు నాటించి పెంచడం, ఒక మంచి సాంకేతికబృందాన్ని పర్యావరణ పరీక్ష బృందంగా ఏర్పాటుచేసి, ప్రతిరోజూ పోర్ట్‌లోని చాలాచోట్ల – గాలి, నీరు శాంపిల్స్ తెప్పించి, కాలుష్యం ఉందా? ఎంతవుంది? ఎటువంటి కాలుష్యం? – అన్న విషయాలు నిర్ధారణ చేసి ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తీసుకొంటూవుండటం, ప్రొఫెసర్ శివాజీరావుగారి లాంటి వారితో ఒక నిపుణుల సంఘాన్ని ఏర్పాటుచేసి ఆంధ్ర విశ్వవిద్యాలయంవారి సమన్వయంతో ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవడం, కాలుష్య నివారణకు ఎంతైనా నిధులు ఖర్చుపెట్టడానికి తయారుకావడం... ఇలా చాలా చేయించాను అనుకున్నాను. ఇన్నిచేసినా ఉత్తరాలసంఖ్య తగ్గలేదు.

మా విజిలెన్స్ అధికారి తిల్లేశ్వరరావు ద్వారా కూపీ తీయిస్తే బయటపడిందేమిటంటే, ఈ ఉత్తరాలన్నీ హార్బరు ప్రక్కనున్న పోర్టు క్వార్టర్సులోని కార్మికులు రాస్తున్నవే.

నేను ఆలోచనలో పడ్డాను... నిజమే.. సరుకు నిలవ చేయడానికి వందల ఎకరాలు నీరు, బురదతో వున్న స్థలాన్ని నింపి Stacking areaలో రైల్వేలైనులు వేశాం. రోజురోజుకీ సరుకులు లక్షల టన్నులలో పెరుగుతున్నాయి. అదృష్టమో దురదృష్టమో అన్నీ దుమ్ము ధూళితో కూడిన సరుకులే. 40 ఏళ్ళక్రితం పోర్టు చిన్నదిగా వున్నప్పుడు – సరుకు అంత ఎక్కువగా లేనప్పుడు – పోర్టుకి దగ్గరగా అందరికీ అనుకూలంగా వుండాలని హార్బర్‌కి దగ్గరలో – దాదాపు 2000 ఇళ్ళు నిర్మించారు. అవన్నీ కార్మికులకోసం. చిన్న చిన్న ఇళ్ళు. చాలామంది సీనియర్ కార్మికులు పోర్ట్ దగ్గరున్న పోర్టు గృహాల్లోనే వున్నారు. చాలామంది కార్మికనాయకులు కూడా అందులో వున్నారు. ఈ గృహాలు ఇక్కడ నలభై ఏళ్ళ పైబట్టీ ఉండటంతో కార్మికులకు కావలసిన అన్ని సదుపాయాలూ అక్కడే. కళ్యాణమండపం, ఆటస్థలాలు, క్లబ్బులు, దేవాలయం... ఇలా అన్ని సదుపాయాలూ అక్కడే వచ్చాయి... ఇక్కడ అవన్నీ వున్నాయి కాబట్టి నేను వెళ్ళకముందే ఊరికి ఉత్తరంవైపు బైపాస్ రోడ్డుమీద క్రొత్తగా అభివృద్ధిచేసిన సాలిగ్రాంపురం కాలనీలో అటువంటివేమీ తలపెట్టలేదు.

ముందుగా పారిశ్రామిక భద్రతాదళం బ్యారక్స్‌ని తొలగించటంకోసం వాళ్ళకి సాలిగ్రాంపురం దగ్గర విశాలమైన టౌన్‌షిప్‌ని మంజూరుచేసి, నిర్మాణం మొదలుపెట్టాం. మిగిలిన 2000 కార్మికుల క్వార్టర్లు, చిన్నచిన్న భవనాలూ పోర్టు పరిపాలనా భవనానికీ, హార్బరుకీ మధ్యన ఉన్నాయి. అంటే ఈ వంద ఎకరాల స్థలం – చాలాకీలకమైనది. పెరుగుతున్న దిగుమతులకు స్థలం లేక

ఒకటి రెండు కిలోమీటర్ల దూరంలో వాటి నిలవప్రాంగణం తయారుచేసుకొన్నాం. పోర్టులోనుంచి ట్రక్కులలో టిప్పర్లలో సరుకులన్నీ అంతదూరం తీసుకువెళ్ళాల్సివస్తోంది. ఈ క్వార్టర్సు వున్న వందెకరాలూ అవే సరుకుల నిలవకు వాడితే తక్కువ ఖర్చుతో రవాణాకి చాలా అనుకూలమయ్యేది. ఈ భూమికి రోజుకి గజానికింత అని అద్దె ఇవ్వటానికి వ్యాపారవర్గాలు సిద్ధం. అటువంటి కీలకస్థలంలో క్వార్టర్సు వుంచడం పోర్టుకీ లాభం కాదు, కాలుష్యంవల్ల కార్మికులకూ సుఖంలేదు. దీనికి పరిష్కారం ఈ క్వార్టర్సు, ఇతర భవనాల్ని పోర్టుకి దూరంగా తరలించడం. ఈ భవనాలు, ఇళ్ళు బయట కట్టాలంటే మహా అయితే రూ. 15 కోట్లు దాకా కావచ్చు... ఈ స్థలాన్ని సరుకుల నిలవ ప్రాంగణం (Stacking yard) గా మారిస్తే ఒకటి రెండు సంవత్సరాలలో ఆ స్థలం అద్దెక్రింద అంత సొమ్మూ సంపాదించవచ్చు... కాని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే, ఇది జరగదు. బెర్తులకే దిక్కులేదు.

పోర్టుని మొదటిస్థానంలోనే నిలబెట్టాలంటే ఈ నిర్ణయం ముఖ్యం. అందుకే ఈ పథకం అమలు చెయ్యాల్సిందే అని నిర్ణయించుకున్నాను. ఇబ్బందల్లా ప్రభుత్వానికి తెలియకుండా చెయ్యాలి. అది తర్వాత నాకు ఇబ్బంది కాకుండా మనకున్న అధికారాలతో చేయాలి... ప్రయత్నం చేద్దాం అనుకొని ముందుగా కార్మికుల సంఘాలతో మాట్లాడాలని వారిని చర్చకు పిలిచాను.

నేను అనుమానించినట్లుగానే వాళ్ళు ఒప్పుకోలేదు.

కారణం – పథకం మంచిది కారనికాదు. కాని ప్రభుత్వ విధానాలు తెలిసినవారు కదా! ఎలా ఎందుకు పనులు జరగవో వాళ్ళకి బాగా తెలుసు. వాగ్దానాలు చేసినవాళ్ళు అమలుపరచేలోపలే బదిలీలపై పోవడం చూసినవాళ్ళు. మనమాటపై నమ్మకం ఒక్కటే చాలదు. మాటనిలబెట్టుకోవడానికి ముందు మనం అక్కడ నిలదొక్కుకొని వుండాలి కదా! పోర్టు చైర్మన్‌గా నాకు 5 సంవత్సరాలు డెప్యుటేషన్‌లో వుండే అవకాశం వుంది. అందులో అప్పుడే రెండున్నర సంవత్సరాలు అయిపోయాయి. ఈ పథకం తయారుచేసి ప్రభుత్వానికి పంపి, ఆమోదం తెప్పించి, తర్వాత టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్లను ఏర్పాటుచేసి పనులు జరిపించి పూర్తిచేసేటప్పటికి పుణ్యకాలం గడిచిపోతుంది.

యూనియన్ నాయకులు తిరస్కరించాక నేను సందిగ్ధంలో పడిపోయాను. ఏం చెయ్యాలి? ఎలా చెయ్యాలి?

కాని ఈ లోపల కార్మికుల్లో, ఉద్యోగుల్లో ప్రచారం బాగా జరిగిపోయింది. నేనేదో పన్నాగం పన్ని దురాలోచనతో క్వార్టర్సుని కూలగొడుతున్నట్లు కొన్ని శక్తులు ప్రచారం చేశాయి. కరపత్రాలు పంచిపెట్టాయి. నేనూ వదల్లేదు. పట్టుదలగా మళ్ళీ పెద్ద యూనియన్‌లు రెండింటినీ పిలిచాను.

రామారావుగారి యూనియన్, శాస్త్రిగారి యూనియన్ – రెండూ నాకు సహకరించేందుకు నిరాకరించాయి. వారికి ఇంకో ప్రతిపాదన చేశాను. "మీ అభ్యంతరం ఏమిటి? మీరు తెచ్చుకున్న

వసతులన్నీ పోయి చివరకు హామీలు మాత్రం మిగులుతాయనేగా? ఒక పని చేద్దాం. కొత్త కళ్యాణమండపం వచ్చాక, ఇక్కడిది కొట్టేద్దాం. కొత్తగుడి కట్టాక, ఇక్కడిది మారుద్దాం. కొత్త ఆడిటోరియం వచ్చాకే ఇక్కడ దానిని తీసేద్దాం. అలా అన్ని విషయాలలో..." అన్నాను.

"మరి క్వార్టర్సు అన్నీ కట్టే వరకూ ఈ క్వార్టర్సు పడగొట్టం అని హామీ ఇస్తారా"అన్నారు శాస్త్రి.

"ఆ విషయంలో మీరు కొంచెం ఆలోచించాలి... ఇన్ని క్వార్టర్సు కట్టాలంటే నాకున్న సమయంలో పూర్తిచేయగలనని అనుకోను... కాని దీనికొక విధంగా ఆలోచించాను. ఎంతవరకు వీలయితే అంతవరకు కొత్త నిర్మాణాలు చేస్తాం. కొత్త క్వార్టర్లని ఇక్కడనుంచి తరలించే కార్మికులకే ముందు ఇస్తాం. సాలిగ్రాంపురంలో ఖాళీ అయ్యే క్వార్టర్సుకి కూడా ముందుగా ఇక్కడివాళ్ళనే పంపుతాం. ఖాళీ కాబోయేవి కూడా ఇక్కడివాళ్ళకే ముందు కేటాయిస్తాం..." అన్నాను.

"అంటే వీరందరూ ఇక్కడ్నుంచి వెళ్ళేవరకూ కొత్తవాళ్ళకి అసలు క్వార్టర్లు దొరకవు కదా" అన్నారు శాస్త్రిగారి యూనియన్ కార్యదర్శి శర్మ.

"ఒకరకంగా అదీ నిజమే... కాని ఇప్పుడు ప్లాట్లు కొనుక్కొని గృహనిర్మాణం చేసుకోవడానికి సంవత్సరానికి ఒక కోటిరూపాయలు దాకా పోర్టు కార్మికులకు అప్పుగా ఇస్తున్నాం. ఆ బడ్జెట్టును రూ.5 కోట్లకు పెంచి, ఇక్కడ ఖాళీ చేసే వారందరికీ సొంత గృహనిర్మాణ అప్పు మంజూరు చేయడానికి చొరవ తీసుకొంటాం."...

అందరిలో కొంత కలకలం... తర్జన భర్జన... "కాని సీనియారిటీ ప్రకారంగా కదా అప్పులిస్తున్నాం" అని ఒక లీడరు అన్నారు. "మరి ఇప్పుడు అప్పు బడ్జెట్‌ని పెంచుతున్నది ఇక్కడ క్వార్టర్సు ఖాళీ చేస్తున్నారనికదా" అన్నాను.

'అదెలాగ' అని రామారావు అంటుండగానే - "రూ. 5 కోట్లు ఇంతమందికి ఎలా చాలతాయి?" అన్నారు శాస్త్రి.

"మీరు ఈ విధాన నిర్ణయానికి ఒప్పుకుంటే - మన అవగాహన ప్రకారం - ఇక్కడ ఖాళీ చేయడానికి సిద్ధపడ్డ వాళ్ళకి వేరే క్వార్టర్లు మేం ఇవ్వలేకపోతే, అప్పు తీసుకోవడానికి అర్హతవున్న వాళ్ళందరికీ సీనియారిటీతోగాని, బడ్జెటు ప్రొవిజన్‌తోగాని సంబంధం లేకుండా ఇళ్ళు కట్టుకోవడానికి అప్పులివ్వాలి - అంతేకదా"...

"అంతేకదా... అంటే..."అని రామారావు కొంచెం తలపటాయిస్తున్నారు...

"రామారావుగారూ, మీరూ శాస్త్రిగారూ ఆలోచించండి. ముఖ్యంగా అక్కడ కాలుష్యంమధ్య నివసిస్తున్న కార్మికుల పరిస్థితులు గమనించి మాట్లాడండి. పోర్టు పురోభివృద్ధిని దృష్టిలో వుంచుకొని మాట్లాడండి... ఇప్పటికే మీ అందరి సహకారంతో పోర్టు దేశంలోనే ఫస్టుగా వచ్చింది. మనకొస్తున్న

సరుకులెటువంటివో మీకందరికీ తెలుసు. ఈ స్థలం గనుక ఖాళీ అయితే పోర్టుకు ఎంత లాభమో నాకంటే మీకే ఎక్కువ తెలుసు. ఇంకొక 10 మిలియను టన్నుల దాకా ఢోకా లేకుండా ట్రాఫిక్ పెంచుకొంటూ ముందుకు పోవచ్చు.. ఇవి చేసినందుకు కాలం కలిసిరాకపోతే ఇబ్బందుల్లో ఇరుక్కునేది నేను... అయినా నేను సరే అంటున్నాను. ఎందుకు? మీ పోర్టు అభివృద్ధి కావాలని, నాలుగుకాలాలపాటు మీరందరూ బాగుండాలని. మీరందరూ ఒప్పుకుంటే పోర్టు చరిత్రలో మరపురాని మలుపుతెచ్చి, వచ్చే 15/17 సంవత్సరాలు పోర్టు ప్రథమస్థానంలో వుండేట్టుగా పునాదులు వేయవచ్చు. అంతా మీ చేతుల్లోవుంది..." అన్నాను.

"మీరు మమ్మల్ని ఇరుకున పెట్టేస్తున్నారు. నాయకులుగా మేం కాదందామనుకున్నా, కార్మికులకు మీరు చెప్పినవి నచ్చుతాయి... కాని... మిగతా సదుపాయాల విషయమే..." అన్నారు శాస్త్రి.

నాకప్పటికే తెలుసు, కార్మిక నాయకులు సహకార సంఘాలుగా ఏర్పడి భూములుకొని ప్లాట్లువేసి కార్మికులకు ఇళ్ళు కట్టించాలన్న తహతహలో వున్నారు. భూములు కూడా కొన్నారు. ఇళ్ళ అప్పులకోసం బ్యాంకులచుట్టూ తిరుగుతున్నారు... ఈ పథకంతో వారి ఇబ్బందులు చాలావరకు తీరిపోవచ్చు. వారికీ మంచిది, పోర్టుకూ మంచిది... ఇప్పుడు వారి అపనమ్మకం - ఆడిటోరియం, కళ్యాణమండపం, ఇండోర్ షటిల్‌కోర్టు, మహిళా సమాజం వంటి వాటికి కొత్త భవనాలు వెంటనే తయారవుతాయా అని.

వెంటనే ఛీఫ్ ఇంజనీర్‌ని రమ్మని కళ్యాణమండపం, రాములవారి గుడి నిర్మాణం ప్లాన్లు తెమ్మన్నాను... "విశాఖలోనే అత్యుత్తమ కళ్యాణమండపం ఈ బైపాస్ రోడ్డులోనే సాలిగ్రాంపురం పోర్టు క్వార్టర్సు దగ్గర కట్టిస్తాను. దానిపక్కనే రాములవారి గుడి. ఇక్కడ వున్న రాములవారి విగ్రహాలనే బాలాలయం చేసి - పునఃప్రతిష్ఠ చేస్తాం... తిరుపతి దేవస్థానం ఆగమ పండితులను, స్థపతులను సంప్రదించాను. శాస్త్రోక్తంగానే ఈ పునఃప్రతిష్ఠ చేస్తాం. ఇక్కడ ఇప్పుడున్న దేవస్థానం పేరుకే. అది షెడ్డే కదా. అలాగే మీ కళ్యాణమండపం కూడా కదా. కాని ఇవన్నీ పక్కాగా కట్టిస్తాను. ఇవికాక రాష్ట్రంలోనే ఎక్కడా లేనటువంటి క్రీడాప్రాంగణం కట్టించాలని వుంది. సాలిగ్రాంపురం పోర్టు క్వార్టర్సు ప్రక్కనే 51 ఎకరాలు నేషనల్ హైవే(బైపాస్) మీద ఎంపికచేశాను. అందులో ఎయిర్ కండిషన్డ్ ఆడిటోరియం, ఓపెన్ ఎయిర్ థియేటరు, మినీ ఆడిటోరియం (హైదరాబాదు రవీంద్రభారతికన్నా పెద్దది), పక్కనే దేశంలోనే అతిపెద్దదైన ఎయిర్‌కండిషన్డ్ ఇండోర్‌స్టేడియమ్, బాస్కెట్‌బాల్, టెన్నీస్, టేబుల్ టెన్నీస్, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులు, జిమ్నాసియమ్ వగైరా అన్నింటికీ పనికొచ్చేలా 4000 మంది పట్టేలా కట్టాలనుకుంటున్నాను. అదీకాక - 40,000 మంది పట్టే ఓపెన్ ఎయిర్ స్టేడియమ్ కూడా కట్టేద్దాం. ఇవన్నీ ఒక్క ప్రాంగణంలోనే - 20 ఎకరాల తోటలమధ్య... ఇది నెహ్రూగారి శతజయంతి సంవత్సరం కాబట్టి దానికి Nehru Place అని పేరు కూడా ఆలోచించాను. ఇదంతా మీరొప్పుకొంటేనే...

అందరం ఒప్పందంమీద సంతకాలు చేద్దాం, భవిష్యత్తులో నేనిక్కడ లేకపోయినా నా మాట చెల్లుబాటు అయ్యేట్లు వ్రాసి ఇవ్వటానికి నేను సిద్ధం. మీరు సిద్ధపడితే?..."

"ఇక్కడ ఇప్పుడున్న భవనాల్ని మీరు కొట్టేసేది - అక్కడ కొత్తవి కట్టాకనే కదా" అన్నారు రామారావు. కార్మికులలో ఏమాత్రం అపఖ్యాతి రాకుండా చూసుకోవాలని ఆయన తాపత్రయం. నాక్కావలసింది నేననుకున్నట్లుగా పని జరగటం.

"అంతే... అంతవరకు వీటిని ముట్టుకొనేది లేదు - క్వార్టర్లు మాత్రం ఖాళీ అయినవి ఖాళీ అయినట్టు కొట్టేస్తాం."

అంతే! 2000 ఇళ్ళు, ఆడిటోరియం, గుడి, మహిళా సమాజం తదితర భవనాల్ని కూలగొట్టి సాలిగ్రాంపురానికి తరలించే ఒప్పందం మీద ఆ రోజే అందరం సంతకాలు చేసేలా చూశాను. చేసేశాం. అంతకన్నా ఎక్కువగా ఆలోచించుకోడానికి వాళ్ళకి ఒక్కరోజుకూడా వ్యవధి ఇవ్వలేదు నేను. ఎందుకంటే వాళ్ళు ఎంత హేతుబద్ధంగా ఆలోచించేవాళ్ళయినా వాళ్ళని చెడగొట్టాలని చూసే దుష్టశక్తులకి అవకాశం ఇవ్వకూడదు. అలాంటి శక్తులు అన్నిచోట్లా వుంటాయి కదా!

కళ్యాణమండపం, రామాలయం, శారదా మహిళా సమాజాలు ఒక్క సంవత్సరంలో పూర్తి అయ్యాయి. అవన్నీ నా పరిధిలో నా అధికారాలతో చేయించగలిగిన పని. 'నెహ్రూప్లేస' విషయంలో - మొత్తం అంచనా 14 కోట్లకు వచ్చింది... అంతా సంక్షేమ కార్యక్రమం. అంచనాలు మంజూరు అయితేకాని, టెండర్లు పిలవడానికి లేదు. టెండర్లు లేకుండా నామినేషనుమీద అంత పని ఇవ్వడానికి లేదు. విడివిడి ముక్కలుగా చేసి ఇవ్వాలన్నా టెండర్లు పిలవాలి. లేకపోతే నేనేదో తినేశానని, దానికోసమే ఇదంతా చేశానని అనుకునే అవకాశం వుంది. అవకాశం ఏమిటి? తప్పకుండా అనుకొంటారు.

ఏం చేయాలా అని బాగా ఆలోచించి, కలకత్తాలో ఆసియాలోకెల్లా అతిపెద్ద క్రికెట్ స్టేడియం కట్టిన ఎన్.బి.సి.సి. వారి అనుబంధ సంస్థ బ్రిడ్జి అండ్ రూఫ్ కార్పొరేషన్‌ని పిలిపించాను. ఇది కేంద్ర ప్రభుత్వ సంస్థ కాబట్టి నిర్మాణ వ్యయంపైన నిబంధన ప్రకారం ఎంతశాతం చెల్లించవచ్చో అంత చెల్లించేటట్లు ఒప్పందం చేసుకున్నాం. చీఫ్ ఇంజనీర్ రావు, ఆయన తరువాత వచ్చిన లక్ష్మీపతి నా ఆదేశాల మేరకే ఈ 'నెహ్రూప్లేస్' మొత్తం పనిని చిన్న చిన్న పనులుగా విడగొట్టారు. మొత్తం 18 అంచనాలుగా తయారుచేశారు. ఏ ఒక్క అంచనా కూడా పోర్టు ఛైర్మన్ (ట్రస్టుబోర్డు) అధికార పరిధి దాటకుండా తయారయింది. కాని ఆడిటోరియమ్‌కు ఎయిర్ కండిషనింగ్ సమస్యఅయి కూర్చుంది. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా మా దబ్బుతో ఎయిర్ కండిషనింగ్ చేయడానికి నిబంధనలు ఒప్పుకోవు. ప్రభుత్వానికి ఫైలు పంపానా - ఫినిష్. ఈ ప్రాజెక్టు మొదటికే మోసం వస్తుంది. ఇండోర్ స్టేడియమ్‌కు ఎయిర్ కండిషనింగ్ అంటే మూడు కోట్ల రూపాయలు కావాలి. ఎలా? ఎలా? రకరకాల ప్రత్యామ్నాయాలు వెతికాను...

దొరికింది. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కి పోర్టు వాళ్ళు చెల్లించే పన్నుల్లో 50 శాతాన్ని పోర్టు కోరిన ఏరియాలో కార్పొరేషన్ వెచ్చించాలని ఆ ముందు సంవత్సరమే ఒక ఒప్పందం చేసుకున్నాం. ఆ ఒప్పందం అవకాశంగా తీసుకొని విశాఖ మేయర్ డి.వి. సుబ్బారావుగారిని, కమిషనర్ ఎస్.పి.సింగ్‌ని మొహమాటపెట్టేసి, ఆ 50 శాతం పనులక్రింద ఇండోర్ స్టేడియంకి ఎయిర్ కండిషనింగ్ చేయించేలాగా, బీచ్‌రోడ్‌లో ఒక స్విమ్మింగ్ పూల్ కట్టించేలా ఒప్పందం చేయించేశాను... అలా 'నెహ్రూప్లేస్' నిర్మాణం ఊపందుకుంది. అయితే...

హార్బరు దగ్గరున్న 2000 క్వార్టర్లలో 400 మందిని ఖాళీ అయిన పాత క్వార్టర్లలోకి, కొత్తగా కట్టినవాటిల్లోకి తరలించాం. 800 మందికి ఇళ్ళు కట్టుకునేందుకు అప్పులిచ్చి ఖాళీ చేయించాం. ఇంకా దాదాపు 800 కుటుంబాలు ఖాళీ చేయాలి. ఎలా?... మా విజిలెన్స్ ఆఫీసర్ ధిల్లేశ్వర్రావ్ వచ్చి చెప్పాడు – "సాలిగ్రాంపురం క్వార్టర్లలో చాలావాటిని సిబ్బంది బయటవాళ్ళకి అద్దెకిచ్చేసి సొంత ఇళ్ళల్లో ఉంటున్నారు." కాని వాళ్ళని కనిపెట్టడం ఎలా?... ఒక ఐడియా. ఒక సర్క్యులర్ జారీచేశాను: "సాలిగ్రాంపురం క్వార్టర్లలోని ఏ క్వార్టరునయినా సిబ్బంది బయటవాళ్ళకి అద్దెకిచ్చారని హార్బరు క్వార్టర్లలో వాళ్ళు వచ్చి సమాచారమిస్తే, ఆ క్వార్టరు ఖాళీ చేయించి ఆ సమాచారం ఇచ్చినవాళ్ళకే కేటాయిస్తాం."

అద్భుతం!

నెలరోజుల్లో ఉత్తుత్తి సిబ్బంది అంతా సాలిగ్రాంపురం క్వార్టర్లు ఖాళీ చేశారు. హార్బరు క్వార్టర్లన్నీ వదిలేసి, మిగతా 800 మందీ సాలిగ్రాంపురం చేరిపోయారు. తగిన నష్టపరిహారం చెల్లించి, హార్బర్‌కి దగ్గరగా వున్న సెయింట్ అలోషియస్ స్కూలుని, దాని ప్రక్కనున్న జనావాసస్థలం మొత్తాన్ని కూడా పోర్టు సేకరించాలనీ, అందువల్ల అక్కడి జనాభాకి శాశ్వతంగా పోర్టు కాలుష్యం పీడ విరగడవటం, ఆ స్థలాన్ని కూడా పోర్టు స్టాకింగ్ ఏరియాగా వినియోగించుకోవటం సాధ్యపడుతుందనీ నేను చేసిన ప్రతిపాదనను పోర్టు ట్రస్టుబోర్డు ఆమోదించింది. కానీ నేను వుండగా అది కార్యరూపం దాల్చలేదు. కాని, హార్బరు చుట్టూ ఉన్న క్వార్టర్లు, భవనాలు అన్నింటినీ కూలగొట్టేశాం. ఖనిజాల నిలవకు సువిశాలమైన ప్రాంగణం ఏర్పాటయింది. తొలగించిన భవనాలకు బదులుగా అత్యంత అధునాతనమైన కళ్యాణమండపం, ఆడిటోరియం, స్పోర్ట్సుకాంప్లెక్సు వగైరాల నిర్మాణం 'నెహ్రూప్లేస్'లో చకచకా సాగిపోతోంది. రాష్ట్రానికే తలమానికంగా 'నెహ్రూప్లేస్' నిర్మాణం పూర్తి అవటానికి రెండేళ్ళు పట్టింది.

'నెహ్రూప్లేస్' నిర్మాణం జరుగుతున్నప్పుడే 1991 చివర్లో పి.వి.నరసింహారావుగారి మంత్రివర్గంలోని ఉపరితల రవాణాశాఖామంత్రి జగదీశ్ టైట్లర్ విశాఖపోర్టుని సందర్శించారు. మనస్సులో భయపడుతూనే పైకి బింకం ప్రదర్శిస్తూ, "సర్, ఈ ప్రాజెక్టు తాలూకు ఒక్క ఫైలుని కూడా కేంద్రప్రభుత్వ అనుమతికోసం పంపకుండా నాకున్న అధికారాలు ఉపయోగించి ఇలా చేస్తున్నాను. దయచేసి మీరు నన్ను తప్పుగా..." అంటూ వివరణ ఇవ్వబోయాను.

'నెహ్రూప్లేస్' నిర్మాణం పనులు తిలకిస్తూనే, టైట్లర్ నా మనోభావాల్ని సునాయాసంగా చదివేశారు. "ప్రసాద్, మీరు చాలా మంచి పని చేశారు. ఈ ఫైలుని మీరు గవర్నమెంటుకి పంపి వుంటే, ఆ క్వార్టర్లు కూలగొట్టడం, ఈ 'నెహ్రూప్లేస్' కట్టడం ఎప్పటికి జరిగేను?" అంటూ ఆయన నా భుజం తట్టారు.

అయితే 'నెహ్రూప్లేస్' నిర్మాణం పూర్తవటానికి ఏడాదిముందే నాకు ప్రధానమంత్రి కార్యాలయానికి బదిలీ అయిపోయింది.

ఒకప్పుడు బలాబలాలు చూసుకుందామని హెచ్చరించిన కార్మికనాయకులే వేలాది కార్మికుల సమక్షంలో నన్ను సత్కరించి ఘనంగా వీడ్కోలు చెప్పారు!!

★ ★ ★

సమస్యల సుడిగుండం

1989 లో కొత్తగా రిక్రూట్ అయిన విశాఖపోర్టు విజిలెన్స్ ఆఫీసర్ థిల్లేశ్వరరావు నా దగ్గరకు అవినీతి అధికారుల జాబితా ఒకటి తీసుకువచ్చాడు. నేను పోర్టు ఛైర్మన్‌ని కనుక అతను నాకు నేరుగా రిపోర్టు చేయొచ్చు.

ఆ జాబితా చూసి నేను నిర్ఘాంతపోయాను. అందులో కొన్ని పేర్లు చూసి నేను నమ్మలేక పోయాను. బహుశా మా విజిలెన్స్ ఆఫీసర్ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాడనుకున్నాను. అతను ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసి వచ్చినవాడు. అంతకుముందు హిందూస్తాన్ జింక్‌లో పనిచేసినప్పుడు కొందరు అవినీతి అధికారుల్ని 'రెడ్‌హ్యాండెడ్'గా పట్టుకున్న చరిత్ర వున్నవాడు. అతని అధ్యయనం తప్పవుతుందా? ఎందుకు కాకూడదు?

ఇలా చాలా తర్జనభర్జన పడ్డాను. చివరికి అతని జాబితా ఎంత సరైనదో తెలుసుకుందామని నమూనా పరీక్షలాగా ఆ పేర్లలోంచి ఒకపేరు ఎంచి, "ఇతను అవినీతి పరుడని నిరూపించవయ్యా. మిగతా వాళ్ళ సంగతి అప్పుడు చూద్దాం" అన్నాను.

నేను ఎంచుకున్నపేరు నా దగ్గర అత్యంత నమ్మకంగా నా పర్సనల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అధికారిది!

15 రోజులు తిరక్కుండా – టైపిస్టుల రిక్రూట్‌మెంట్‌లో ఒక అభ్యర్థినుంచి అతను నేను లేని సమయంలో నా ఛాంబర్‌లోనే లంచం తీసుకున్నాడు. సాక్షుల్ని రెడీగా పెట్టుకున్న విజిలెన్స్ ఆఫీసర్ అతన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాడు. సస్పెండ్ చేశాం.

పరిపాలనలో మంచిపనులు చేయాలీ అంటే ప్రాజెక్టులు మాత్రమే చేసుకుంటూ మంచిపేరు తెచ్చుకున్నామంటే సరిపోదు. కలుపుమొక్కల్ని ఏరేసే కాఠిన్యం కూడా వుండాలి. అందువల్ల నీతిపరులైన వాళ్ళు ఉత్సాహంగా పనిచేయగలుగుతారు. కనీసం అవినీతిపట్ల ఆకర్షితులవడానికి జంకుతారు.

అలా విశాఖపోర్టులో పోర్టు సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీస్థాయి అధికారులతో సహా అవినీతి పరులైన అధికారుల్ని స్వయంగానో, సి.బి.ఐ.సహకారంతోనో ట్రాప్ చేయటం, లీవ్ ట్రావెలింగ్ అలవెన్స్‌ల దుర్వినియోగం వంటి వాటిని శోధించి, అరికట్టడం వంటి క్షాళన కార్యక్రమాలకి నాకు విజిలెన్స్ ఆఫీసర్‌గా థిల్లేశ్వరరావు అందించిన సహకారం ఎంత విస్తృతమైందంటే, కేంద్ర విజిలెన్స్ కమీషన్ సయితం అతని సేవల్ని ప్రస్తుతిస్తూ 'దేశంలో అత్యుత్తమ విజిలెన్స్ ఆఫీసర్'గా గుర్తింపు నిచ్చింది.

పరిపాలనలో ఇది ఒక భాగంమాత్రమే. విశాఖపోర్టులో నేను పనిచేసిన నాలుగేళ్ళూ (1988-92) సమస్యలని ఎదుర్కోవటమే సరిపోయింది. ప్రతిదీ సమస్యే. ఎం.ఎం.టి.సి. నుంచి ఇనుప ఖనిజాల ఎగుమతి తాలూకు బకాయిల వసూలు సమస్య, రైల్వేయార్డు విస్తరణ, రైలింజను సేకరణ సమస్య, ట్రాఫిక్ పెంచటం ఎలా అన్నది సమస్య, ట్రాఫిక్ పెంచితే బల్క్ (ఖనిజాల) ఎగుమతులకి నిలవ ప్రాంగణం ఏర్పాటు చేయటం సమస్య, దానికోసం క్వార్టర్లు కూలగొడితే గొడవ, కొత్తగా ఏది కొందామన్నా, ఏది కదదామన్నా కేంద్ర ప్రభుత్వంలో అనుమతులు రాక సమస్య.... నా కళ్ళకి ఈ పోర్టు ఒక సమస్యల సుడిగుండంలా అనిపించేది ఒక్కోసారి.

పోర్టు ఛైర్మన్‌గా వెళ్ళిన కొత్తలోనే అవుటర్ హార్బర్‌లో రూ. 20 కోట్లతో కట్టిన ఒక పెద్ద బెర్త్ నిరుపయోగంగా వుండటం చూశాను. కట్టి మూడేళ్ళయిందనీ, ఖనిజాలకోసంకాక, జనరల్ కార్గో (ఇతర రకాల సరుకుల ఎగుమతి దిగుమతుల) కోసం కట్టిన బెర్త్ అనీ చెప్పారు మా అధికారులు. "ఎందుకు ఖాళీగా వుంది? సరుకులు రావటం లేదా?" అని అడిగాను.

"వస్తున్నాయికానీ, సాంకేతికంగా లోపం వుంది. అక్కడ నౌకల్ని నిలపటంలో భద్రత లేదు. అందుకే దాన్ని వాడటం లేదు" అన్నారు డిప్యూటీ కన్సర్వేటర్ పట్నాయక్. హార్బర్ కాలవ ద్వారా హార్బర్‌లోపలికి నౌకల్ని టగ్‌లతో జాగ్రత్తగా లాక్కొచ్చి, లోడింగ్/ అన్‌లోడింగ్ పూర్తయ్యాక మళ్ళీ 'రోడ్స్' (సాగరజలాల్లో) లోకి తీసుకెళ్ళి వదలటం పట్నాయక్ చూసే మెరైన్ శాఖ బాధ్యత.

ఇంకా అడిగితే పట్నాయక్ చెప్పారు. నౌకాదళంవాళ్ళ యుద్ధ విమాన వాహక నౌకలు వచ్చినప్పుడు మాత్రం రెండు సార్లు ఈ బెర్త్‌ని వాడుకున్నారు. అంత పెద్ద బెర్త్ అన్నమాట. కానీ నిరుపయోగంగా పడి వుంది. సంబంధిత అధికారులందర్నీ పిలిచి చర్చించాను.

సాంకేతికలోపం బెర్త్ కట్టాక ఎందుకొస్తుంది? కట్టే ముందే అన్నీ చూసుకోవాలిగదా! ఇప్పుడు రిస్కు నాకా? - ఇది పట్నాయక్ ప్రశ్న.

అన్ని విషయాలు సాంకేతిక నిపుణుల్ని సంప్రదించే కట్టాం. నమూనా అధ్యయనాలు కూడా చేసి మరీ కట్టాం. కాని కట్టాక ఇబ్బంది బయట పడితే ఏం చేయగలం? - ఇది నిర్మాణం పర్యవేక్షించిన ఛీఫ్ ఇంజనీర్ రావు వాదన.

వీళ్ళిద్దరి తగాదా ఎలా వున్నా బెర్త్‌ని వాడుకోకపోవటం వల్ల ఏటా పోర్టుకి రాగల అయిదారు లక్షల టన్నుల జనరల్ కార్గోట్రాఫిక్‌ని ఇప్పుడు నష్టపోతున్నాం. పైగా ఆ జనరల్ కార్గోకోసం ఆ బెర్త్‌కి దగ్గరలో రూ.4 కోట్లతో కట్టిన గోదాములు కూడా నిరర్థకంగా పడివున్నాయి! ఎలా సర్? - ఇది ట్రాఫిక్ మేనేజర్ రొక్కం ఆవేదన.

ఇక అక్కడ్నుంచీ వాళ్ళు ముగ్గురూ ఒకరి శాఖ సామర్థ్యాన్ని మరొకరు దెప్పుకోవటమే సాగుతోంది.

సమస్య ఏమిటంటే - హార్బరు బయట సముద్రపు అలలతాకిడి హార్బర్ మీద పడకుండా పెద్దపెద్ద సిమెంటు దిమ్మలతో హార్బర్‌కాలవకి అడ్డంగా ఒక గోడలాగా కట్టారు. దీన్ని 'బ్రేక్‌వాటర్స్'

అంటారు. తూర్పుముఖంగా ఉండే హార్బరు కాలువ ముఖ ద్వారానికి దక్షిణ వైపునుంచి ఈశాన్య దిశగానూ, ఉత్తరవైపునుంచి ఆగ్నేయదిశగానూ రెండు 'బ్రేక్ వాటర్స్' కట్టారు. తూర్పుదిశలో ఆ రెండు 'బ్రేక్ వాటర్స్' కలవాల్సిన చోట - నౌకలు హార్బరులోపలకి వచ్చిపోయేందుకు వీలుగా - కలవకుండా ఓపెన్‌గా ఉంచేశారు. ఆ ఖాళీలోంచే 'రోడ్స్'లో వున్న నౌకల్ని టగ్‌ల సాయంతో హార్బర్‌లోకి లాక్కొస్తారు. ఇప్పుడీ జనరల్ కార్గోబెర్త్ ఆ రెండు 'బ్రేక్‌వాటర్స్' మధ్య గల నౌకల ప్రవేశ మార్గానికి ఎదురుగా వుంది. ఇందువల్ల అలల ఉధృతం ఎక్కువగా వున్నప్పుడు ఆ అలల తాకిడికి ఈ బెర్త్‌లో వుండే నౌకలు ఊగిపోవచ్చనీ, బెర్త్‌కి కొట్టుకుని ఓడ దెబ్బతినవచ్చనీ, తుఫానులు, పెనుగాలులు వచ్చి అలలు ఎగిసిపడితే ఈ ఉధృతానికి ఈ బెర్త్‌మీద కట్టేసివున్న నౌక తాళ్ళు కూడా తెగిపోవచ్చనీ, లోడింగ్, అన్‌లోడింగ్ జరుగుతుండగా అలా జరిగితే ఇంకా ప్రమాదమనీ, ఆ నష్టానికి మెరైన్‌శాఖ బాధ్యత వహించాల్సి వస్తుందనీ పట్నాయక్ భయం. ఈ వాదనని ఇంజనీరింగ్ శాఖ వాళ్ళు నిర్ద్వంద్వంగా ఖండించలేకపోయినా, "అందర్నీ సంప్రదించే కట్టాం కదా" అని సమర్థించుకుంటున్నారు.

ఈ నిర్మాణాలతో సంబంధంలేని, వాణిజ్యంతో మాత్రమే సంబంధం వున్న రాక్మం ఒక ముఖ్యమైన పాయింట్ లేవనెత్తారు. "ఆ మధ్య నౌకాదళం వాళ్ళ విమాన వాహక నౌక 'విరాట్'ని మూడురోజులపాటు ఇక్కడే కట్టేశారుకదా! ఎన్ని అలలు ఎగిరిపడి నౌకని ఎంత దూరంతోసుకు పోయాయండీ?"

అంటే, ఏమీకాలేదు కదా అన్నది కవి హృదయం,

పట్నాయక్ మాట పడటానికి ఇష్టపడరు. "ఆ నౌకకి సాంకేతిక భద్రత విషయంలో మాకు పూచీలేదని నేవీ వాళ్ళకి ముందే చెప్పాను. దానికి వాళ్ళు ఒప్పుకున్నారు. అత్యవసర స్థితిలో నౌకని 'రోడ్స్' లోకి తోసుకువెళ్ళేందుకు మా టగ్‌ల్ని కూడా ఆ మూడురోజులూ సిద్ధంగా వుంచాను. అదొక ప్రత్యేక పరిస్థితి. ప్రతీ వాణిజ్య నౌకకీ అలా చేయలేం కదా? పైగా మనకున్నవే మూడు టగ్‌లు. వాటిని ఈ బెర్త్‌కోసమే వుంచేస్తే హార్బర్‌లోకి మిగతా నౌకల రాకపోకల్ని ఆపేయాల్సిందే."

పట్నాయక్ వారన అంతా విన్నాక నేను ఒక ప్రశ్నవేశాను.

"పెద్ద పెద్ద అలలు ఎగిసిపడే పరిస్థితి ఏడాదిలో ఎన్ని రోజులు వుండవచ్చు? ఓ 100 రోజులా?"

"వానా కాలంలోగానీ, తుఫానులు, ఈదురుగాలులు వీచినప్పుడుగాని అలా జరగవచ్చు. 100 రోజులు వుండకపోవచ్చు."

"అలాంటి వాతావరణం వుంటే వాతావరణ శాఖ నుంచి మనకు ముందస్తు హెచ్చరిక వుంటుందా? వుంటే ఎంత ముందుగా?"

"హెచ్చరిక చేస్తారు సర్, రెండు మూడు రోజులు ముందుగానే"

"అంటే, వాతావరణశాఖ హెచ్చరిక వచ్చాక నౌకని బెర్త్‌మీద నుంచి 'రోడ్స్'లోకి తరలించటానికి మనకి వ్యవధి వుంటుందన్నమాటే గదా!"

"... సాధారణంగా వుంటుంది సర్. కాని ఎప్పుడన్నా అకస్మాత్తుగా అలలు విరుచుకుపడితే నౌక ఊగిపోతుంది. ఒడ్డుకి కట్టిన త్రాడు తెగిపోవచ్చు. త్రాడు ఖరీదు రూ. 50 వేలు వుంటుంది..."

విషయమంతా అర్థమైపోయింది. అతని భయాందోళనలేమిటో స్పష్టమైంది. త్రాడు తెగిపోయే పరిస్థితే వస్తే ఆ ఖర్చు ఎవరు భరించాలి? దానికి బాధ్యత ఎవరు వహించాలి?

నాకు కావలసింది పోర్టు ప్రయోజనాల్ని కాపాడటం. ఎప్పుడో అరుదుగా అలలు విరుచుకు పడతాయన్న అనుమానంతో రూ.20కోట్ల బెర్త్‌ని మూడేళ్ళపాటు ఖాళీగా వుంచుతామా? ఈ రూ.20 కోట్లూ ప్రజాధనమే కదా! ఎంత పెద్ద నేరం చేస్తున్నాం?

ఈ అధికారుల పరస్పర నిందారోపణలు, వితండవాదనతో నాకు చిరాకెత్తింది. సంస్థకోసం సమస్యని ఎలా పరిష్కరించగలమో అన్నదానికన్నా వ్యక్తిగత అభిప్రాయాలకీ, అహంభావాలకీ ప్రాధాన్యత నిచ్చే దశనుంచి ఎప్పటికి బయటపడతాం?

నేను అప్పటికప్పుడు నా నిర్ణయం ప్రకటించాను.

"ఇప్పటి నుంచి ఈ బెర్త్‌ని వినియోగంలో పెడతాం. ఎంత పెద్ద నౌకలు వచ్చినా రావచ్చని వాణిజ్యవర్గాలలో ప్రచారం చేయండి... మీరు భయపడుతున్నట్లుగా ఎప్పుడన్నా అలలు ఎగిసిపడి, విరుచుకుపడి బెర్త్‌మీద వున్న నౌక త్రాడు తెగిపోతే ఆ నష్టం పోర్టు భరిస్తుందనీ, అలాంటి అత్యవసర స్థితిలో నౌకని 'రోడ్స్'లోకి టగ్‌ల సాయంతో లాక్కువెళ్ళే ఖర్చు కూడా పోర్టే భరిస్తుందనీ చెప్పండి..."

వాళ్ళందరికీ షాక్ తిన్నట్లయింది. ఎవ్వరూ కాస్సేపు మాట్లాడలేదు.

క్రమంగా అందరూ తేరుకుని, నన్నొక వెర్రివాణ్ణి చూసినట్లు చూశారు.

"... ఏ బడ్జెట్‌లోంచి ఇస్తాం సర్? అయినా ట్రేడ్‌నుంచి రాబట్టుకోవడమే తప్ప ఇవ్వడం అనేది పోర్టు చరిత్రలోనే లేదే! అలా మనం ఎందుకివ్వాలి సర్..."

"బెర్త్ కట్టడంలో లోపం వుందని కట్టిన మనమే అంటున్నాం కాబట్టి ఇవ్వాలి. ఈ బెర్త్‌ని కట్టేటప్పుడు ఇది జనరల్ కార్గో కోసమే అని మనకి ప్రభుత్వం అనుమతి ఇచ్చి వున్నప్పటికీ ఇప్పుడిక బల్క్ (ఖనిజాల) సరుకు మోసే నౌకలకి కూడా ఈ బెర్త్ ఇస్తాం. నౌకలోంచి దిగిన ప్రతి టన్నుకీ పోర్టుకి ఛార్జీలు వస్తాయి. లేబర్‌కి కూలి దొరుకుతుంది. సరుకుని నిలవ చేసేందుకు గోదాములు అద్దెకిస్తాం కాబట్టి వాటిమీద అద్దె వస్తుంది... రోజుకి 2-3 లక్షల రూపాయలు కనీస ఆదాయం మనకి వచ్చేటప్పుడు ఏడాదిలో ఒకటి రెండు సార్లు త్రాడు తెగిపోతే రూ.50 వేలు ఇవ్వాల్సివస్తే ఇద్దాం..."

బల్క్ సరుకుని ఆ బెర్త్ మీద దింపటం సాధ్యపడుతుందని రొక్కం చెప్పటంతో ఇంక నేను ఎవ్వరినీ మాట్లాడనివ్వలేదు.

"నా నిర్ణయం మంచిదో కాదో కాలమే తేలుస్తుంది. బాధ్యత నాది. మనం మాత్రం ఈ బెర్త్‌ని ఇలా నిరర్థకంగా వదిలే ప్రశ్న లేదు." నా ఈ ప్రకటనతో ఆ వివాదానికి తెరదించాం. బల్క్ సరుకుని బెర్తుమీదనుంచి బయటకు రవాణా చేయటానికి వీలుగా మా రైల్వేయార్డు నుంచి ఒక రైల్వే సైడింగ్‌ని కూడా వెంటనే నిర్మించాం.

పాలనా పరమైన నిర్ణయాలు అమలుచేయాలంటే కొన్నిసార్లు కటువుగా వ్యవహరిస్తున్నట్లు కనుపించాలి. నిజానికి విడివిడిగా మా అధికారులంతా సమర్థులే. కాని ఒక టీమ్‌గా పనిచేయాల్సి వచ్చినప్పుడే మానవ సహజమైన 'అహం'భావాల ఘర్షణల మూలంగా అసలు విషయం ప్రక్కకి పోతూంటుంది. కాని వాళ్ళ సహకారం లేకుండా నేనొక్కడ్నీ ఏమీ చెయ్యలేను. మళ్ళీ వాళ్ళని ఉత్సాహపరిచి, ఉత్తేజపరిచి సమన్వయపరిస్తేనే లక్ష్యాన్ని సాధించగలుగుతాను.

... మొత్తం మీద ఆ సంవత్సరం ఆ బెర్త్‌ని 300 రోజులకి పైగా వాడాం. 15 లక్షల టన్నుల ట్రాఫిక్ హ్యాండిల్ చేశాం. దాదాపు మూడు కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆ ఒక్క బెర్త్‌మీద ఆర్జించాం. ఆ ఏడాది మొత్తం మీద ఒకే ఒక్కసారి వాతావరణం బాగా లేకపోతే పెద్ద ఓడని ఆ బెర్త్‌మీంచి 'రోడ్స్'లోకి తీసుకువెళ్ళి, రెండు రోజుల తరువాత తీసుకువచ్చాం. అందుకు పోర్టుకి అయిన ఖర్చు లక్షరూపాయలు!

ఆ తరువాత సంవత్సరం నుంచి విశాఖ స్టీలుప్లాంటు వారు తమ బొగ్గు, సున్నపురాయి దిగుమతులకు ఆ బెర్త్‌ని పూర్తిగా కేటాయించాలని అడిగితే ఇచ్చాం. ఇంకా పెద్ద పెద్ద ఓడల్ని తీసుకువచ్చారు. ఆ ఏడాది స్టీలుప్లాంటువారు 30 లక్షల టన్నుల ట్రాఫిక్‌ని హ్యాండిల్ చేశారు. మాకు కోట్లాదిరూపాయల ఆదాయం లభించింది.

నేను ఊహించని విధంగా 1988-89 నుంచి 1990-91 వరకూ వరుసగా మూడు సంవత్సరాల పాటు ట్రాఫిక్ పెరుగుదల వేగంలో విశాఖపట్నం పోర్టు దేశంలోకెల్లా అగ్రస్థానాన్ని ఆక్రమించింది. ప్రతి సంవత్సరం మేజర్‌పోర్టులన్నింటిలోకి 'ఉత్తమపోర్టు' అవార్డు విశాఖ పట్నం పోర్టుకే వచ్చింది.

1991 చివర్లో అనుకుంటాను - హైద్రాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వారు నాకు 'మేనేజర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ప్రకటించారు.

సిగ్గుపడ్డాను.

ఇబ్బంది పడ్డాను.

ఈ అవార్డు తీసుకోవాలా? వద్దా? అన్న సందిగ్ధంలో పడ్డాను.

అసలేం జరిగిందంటే...

★ ★ ★

'పరమదుర్మార్గుడు పి.వి.ఆర్.కె.ప్రసాద్'

ఒక వ్యక్తిని చూడగానే ఈర్ష్య ఎందుకు పుడుతుంది? మరొక వ్యక్తిని చూడగానే ప్రేమ ఎందుకు పుడుతుంది? మనవల్ల ఉపకారం పొందిన వ్యక్తులే మనకి అపకారం చేయాలని చూడటం, మనం ఏ ఉపకారం చేయకపోయినా మనకి సహాయపడాలనుకునే వాళ్ళు తారసపడటం ఎందుకు జరుగుతూంటుంది?... విశాఖపట్నంపోర్టు నాకు ఈ అనుభవాన్ని కూడా మిగిల్చింది.

నాకు హైద్రాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 'మేనేజర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుని ప్రకటించినప్పుడు నేను బాగా ఆలోచించి, ఈ అవార్డు తీసుకోకపోతే ఏమయింది - అనుకున్నాను. ...కాని, నా శక్తికి మించిన వత్తిడి వల్ల అవార్డు తీసుకున్నాను. అప్పటి రాష్ట్ర పరిశ్రమలశాఖా మంత్రి రామచంద్రారెడ్డి ఆ అవార్డు బహూకరిస్తూ ప్రశంసలు కురిపించారు.

ఆ అవార్డు తీసుకున్న కొద్ది మాసాలలోనే - 1992 మే నెలలో - నాకు ప్రధాన మంత్రి కార్యాలయానికి బదిలీ అయింది. విశాఖపోర్టు ఛైర్మన్‌గా నాకున్న డెప్యుటేషన్ కాలం అయిదేళ్ళు. ఇంకో ఏడాది మిగిలి వుండగానే నేను పోర్టుని వదిలేసి వెళ్ళాల్సి వచ్చింది. నేను ఢిల్లీకి వెళ్ళిపోయిన 6-7 మాసాల దాకా కొత్త ఛైర్మన్ నియామకం జరగలేదు. ఆ లోపల ఛైర్మన్ అవ్వాలని విఫలయత్నం చేసిన డిప్యూటీ ఛైర్మనే అప్పటివరకూ ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా కొనసాగారు. ఆ సమయంలోనే "పోర్టు ఛైర్మన్‌గా అధికార దుర్వినియోగం చేసి పోర్టుని భ్రష్టు పట్టించిన పరమ దుర్మార్గుడు పి.వి.ఆర్.కె. ప్రసాద్" అంటూ పోర్టులో కరపత్రాల పంపిణీ, నాకు వ్యతిరేకంగా పోర్టు బయటి శక్తుల సాయంతో విస్తృత దుష్ప్రచారం జరిగాయి.

నేను అధికార దుర్వినియోగం చేశానా?

స్టీవ్‌డోర్ల సంఖ్యనిపెంచి పోటీ పెంచితే, పోర్టు ఛార్జీలు తగ్గాయి. పోర్టుని 'లెవీ రహిత పోర్టు'గా మేం ప్రకటించటంతో ఎగుమతి దిగుమతుల్ని ఎక్కువగా ఆకర్షించాం. హార్బరు ముందున్న క్వార్టర్లు, భవనాలు కొట్టేసి బల్క్ (ఖనిజాల) సరుకు నిలవకి సువిశాల మైదానాన్ని సృష్టించటంతో ట్రేడ్‌లో ఎక్కువ ట్రాఫిక్‌ని విశాఖమీదుగా మళ్ళించాలన్న ఆసక్తి పెరిగింది.

ఇలా ట్రాఫిక్ పెరుగుతోంది. కాని పెరిగే ట్రాఫిక్‌కి ఇప్పుడున్న బెర్తులు సరిపోవటం లేదు. లోపలి హార్బర్‌లో జెట్టీలు (నౌకల్ని నిలిపే అసంపూర్ణ ప్లాట్ ఫారాలు) వున్నాయి. ఎప్పుడో 2-3 దశాబ్దాల క్రితం కట్టినవి. చిన్నచిన్న ఓడలు వచ్చేరోజుల్లో కట్టినవి వున్నాయి. వాటి స్థానంలో శాశ్వత బెర్తులు నిర్మిస్తే మంచిదని కేంద్రానికి నా ముందు ఛైర్మన్‌లు రాస్తూ వచ్చారు. రాసి రాసి అలా పదేళ్ళుగా రాస్తూనే వున్నారు. ఒక్క ప్రతిపాదనా కార్యరూపం దాల్చలేదు.

300 మీటర్ల పొడవైన బెర్త్ కట్టాలంటే రూ. 15 కోట్లు కావాలి. ఈ రూ. 15 కోట్ల బెర్త్‌ని మా డబ్బుతో మేం కట్టుకోడానికి కేంద్రం ఒక పట్టాన అనుమతిచ్చేదికాదు. రూ. 15 కోట్ల బెర్త్‌కి అనుమతివ్వటానికి సంవత్సరాల తరబడి తీసుకునేది ప్రభుత్వం. అందువల్ల రూ. 150 కోట్ల రూపాయల వాణిజ్య నౌకలు – హార్బర్‌లో వున్న బెర్త్‌లు ఖాళీ అయ్యే దాకా 'రోడ్స్'లో నిరీక్షించాల్సి వచ్చేది. ఒక నౌక హార్బర్ బయట 'రోడ్స్'లోకి వచ్చి లంగరు వేసిన దగ్గర్నుంచీ ఆ నౌకని ఎన్ని రోజులపాటు అలా నిరీక్షింపజేస్తారో అన్ని రోజులకీ డెమరేజిని (అదనపు రుసుము) ఆ షిప్పింగ్ కంపెనీకి ఆ నౌకని అద్దెకి తెచ్చుకున్న వాణిజ్యవర్గాలు చెల్లించాలి. అదీ – రూపాయల్లో కాదు. అమెరికా డాలర్లలో! అంటే, రూ. 15 కోట్ల రూపాయల బెర్త్ కట్టనీయకుండా రూ. 150 కోట్ల నౌకమీద వాణిజ్యవర్గాలు విదేశీ మారక ద్రవ్యంలో కోట్లాది రూపాయలు డెమరేజి కట్టడాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు కాదా? ఇది ఎంత జాతీయ నష్టం!

నేను మొండిగా నాకు ముందు ఛైర్మన్‌లు పంపిన 'జెట్టీల స్థానంలో బెర్త్' కట్టే ప్రతిపాదనని తవ్వితీసి, కేంద్రం వెంట పడ్డాను. అలా పడగాపడగా ఒక ఏడాది తరువాత కేంద్రం అనుమతించింది – ఒక బెర్త్ కట్టడానికి. నిజానికి రూ. 5 కోట్లతో కట్టేది 100 మీటర్ల బెర్తే అయితే రాజేష్‌పైలట్ పుణ్యమా అని నాకు పెరిగిన అధికారాల్ని ఉపయోగించి కట్టేద్దును. కాని జెట్టీలను తొలగించి 300 మీటర్ల పొడవైన పెద్దబెర్త్ కట్టాలంటే రూ. 15 కోట్లు ఖర్చుపెట్టాలి. మొత్తానికి నా మొండి తనం భరించలేక ఒక బెర్త్‌కి ప్రభుత్వం అనుమతినిచ్చింది. టెండర్లు పిలిచాం.

ఒకరోజు ఆ జెట్టీల (ఇప్పటి కోల్ బెర్త్) దగ్గర ఇనస్పెక్షన్‌కి వెళ్ళాను. బోస్ స్టీవ్ డోరింగ్ కంపెనీకి చెందిన నాగేశ్వరరావు కనుపించారు. నాగేశ్వరరావు ఆ బెర్త్ నిర్మాణం గురించి మాట్లాడుతూ, "సర్, 300 మీటర్లకి బదులు ఇంకో 100 మీటర్లు పొడుగు పెంచితే రెండు చిన్న ఓడల్ని నిలపచ్చుగదా?" అన్నారు. దాంతో నా అధికారాలుపయోగించి రూ. 5 కోట్లతో ఇంకో 100 మీటర్లకి ఆ బెర్త్‌ని పొడిగించాలని ఆదేశించాను. ఇంకెవరో అన్నారు. ఇంకో 100 మీటర్లు పొడిగిస్తే ఒక పెద్ద ఓడ, చిన్న ఓడ కూడా పడతాయి గదా – అని. ఇంకో రూ. 5 కోట్లు వెచ్చించి అది కూడా చేశాను... అలా రెండేళ్ళలో ఆ పాత జెట్టీల స్థానంలో మొత్తం 600 మీటర్ల పొడవైన బెర్త్ నిర్మాణం ఊపందుకుంది. ఈ మార్పుల కారణంగా సాంకేతికంగా కేంద్రం అనుమతి కోసం రాశాను. కాని, దానికోసం నేనీ నిర్మాణాన్ని ఆపలేదు. ఆ నిర్మాణం పూర్తికావస్తున్న తరుణంలో–

ఒక శుభముహూర్తాన కేంద్రం నుంచి నిపుణుల బృందం వచ్చింది. "ఎక్కడ మీరు కట్టాలనుకున్న రెండ్ బెర్త్‌లు?" అని అడిగింది. మా ఛీఫ్ ఇంజనీర్ తీసుకెళ్ళి చూపించారు. "ఆ" అంటూ వాళ్ళు నోళ్ళు వెళ్ళబెట్టారు.

"మేం అనుమతి ఇవ్వనేలేదు. మీరు నిర్మాణం పూర్తిచేసేశారే? ఎవరిచ్చారు మీకీ అధికారం?" అంటూ కమిటీ చిందులు తొక్కింది.

"వంద - వంద - వంద మీటర్ల చొప్పున పోర్టు ట్రస్టు బోర్డుకున్న అధికారాలుపయోగించి ఛైర్మన్‌గారు చేశారు" అంటూ ఛీఫ్ ఇంజనీర్ రావు వివరించారు.

కమిటీ ఆగ్రహించింది. ఛైర్మన్‌కి అధికారాలు వుంటే మాత్రం ఇంత విశృంఖలంగా వాటిని ఉపయోగిస్తారా? ఇలా ఏ పోర్టు ఛైర్మనూ చెయ్యడు. ఈ ఛైర్మన్ ఎలా చేశాడు?...

మొత్తం మీద కమిటీ నన్ను తప్పుపట్టుకుంది. నేను ఉపయోగించిన టెక్నిక్‌ని కనిపెట్టింది. కాని హర్షించలేదు. ఇలాంటి టెక్నిక్‌ని ఉపయోగించడం కూడా అధికార దుర్వినియోగమేనని వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. ఇంకేముంది? ఉపరితల రవాణా శాఖ కార్యదర్శి అగ్రహాం నాకు టెలిఫోన్ చేసి, "ఏమిటి ప్రసాద్, మళ్ళీ ఏదో తెచ్చిపెట్టావే?"

నాకు నీరసం వచ్చేసింది. ఏమిటిది? మనం శాస్త్రం ప్రకారం అడిగితే ఏళ్ళ తరబడి అనుమతులివ్వని ప్రభుత్వం, మనం ఒక్కడుగు ముందుకేస్తుంటే నాలుగడుగులు వెనక్కి లాగుతోంది. అయినా ఎవడడిగాడు నన్ను జెట్టీలు తీసేసి బెర్త్‌లు కట్టమని? ట్రేడ్ అడిగిందా? ప్రభుత్వం ఆదేశించిందా? కేవలం మనస్సాక్షి చెబుతోంది - ఈ మార్పు చేస్తే సంస్థకి వ్యాపారం పెరుగుతుందని. పోర్టుకి లాభాలు వస్తే పోర్టులో ప్రతి ఉద్యోగికీ బోనస్ పెరుగుతుంది. కాని,నాకు కొత్తగా జీతమూపెరగదు, స్పెషల్ ప్రమోషనూ రాదు. అయితే సంస్థ భవిష్యత్ బాగుంటుంది... ఎవడిక్కావాలి ఇవన్నీ!

నేనూ మొండిగా జవాబిచ్చాను.

"సర్, ట్రాఫిక్ పెరిగిపోతోంది. బెర్త్‌లు చాలటంలేదు. నిబంధనల పేరుతో ఒక్కో బెర్త్‌కోసం సంవత్సరాల తరబడి ప్రభుత్వం చుట్టూ తిరగటమా? పని జరిగే మార్గం వెతుక్కోవటమా? ఈ రెండింటిలో నేను రెండోది ఎంచుకున్నాను. ఇందులో నా స్వార్థం ఏదన్నా వుందని అనుకుంటే మీరు ఎలాంటి చర్య తీసుకున్నా నాకు అభ్యంతరం లేదు..."

"షార్ట్‌కట్‌లు బాగా కనిపెట్టావే! సరే, నేనే వచ్చి చూస్తాలే" అన్నారు. కొన్ని వారాల తరువాత ఆయనే స్వయంగా వచ్చి చూసి, నా భుజం తట్టి 'ఓకె' చేసేసి వెళ్ళారు.

అలా ఎప్పటికప్పుడు ఏ పనిచేయాలన్నా సమస్య ముంచెత్తుకొచ్చేది. ఈ చర్యలన్నీ ఆ 4-5 ఏళ్ళకి సరిపడా ట్రాఫిక్ పెరగటానికి దోహదం చేశాయి. కాని రాబోయే 15-20 సంవత్సరాల కాలంలో ఇంకా ట్రాఫిక్ పెరిగితే? ఈ రోజుకి మాత్రమే అభివృద్ధి సాధించడంవల్ల ఈ రోజుకి ఆనందం లభిస్తుంది. కాని భవిష్యత్ అవసరాలని పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు రచిస్తేనే దూరదృష్టితో వ్యవహరించటమవుతుందని నా సీనియర్‌లు చెప్పుండేవారు.

వాల్తేరు రైల్వేయార్డు నుంచి గూడ్సు రైళ్ళలో ఖనిజాల్ని తెచ్చే గూడ్సురైళ్ళకి వాల్తేరు రైల్వే యార్డు ఒక్కటే అయిపోవటంతో మా యార్డులో లైను ఖాళీ అయ్యేదాకా మిగతా రేక్‌లు వచ్చి పోవటానికి ఇబ్బందిగా వుంటోందని, మిందిలో మా పోర్టు స్థలంలో పెద్ద రైల్వే రేక్ ఎక్స్ఛేంజి

యార్డుకి ప్రణాళిక తయారుచేయించాను. దీంతో తూర్పునుంచి వచ్చే రేక్‌లు వాల్తేరు యార్డుకి వచ్చి వెనక్కి వెళ్ళిపోతాయి. విజయవాడ వైపు నుంచి వచ్చే రేక్‌లు మిందికి వచ్చి వెనక్కి వెళ్ళిపోతాయి. 8-10 రైల్వేలైన్లతో మిందిలో మేము కట్టాలనుకున్న ఈ రైల్వేయార్డు భారతరైల్వేలకీ, మా పోర్టు రైల్వేకీ మధ్య నడిచే గూడ్సు రైళ్ళ ట్రాఫిక్‌ని సులభతరం చేస్తుంది.

అలాగే ఇన్నర్ హార్బర్ కాలవ లోతునిబట్టి 8 మీటర్ల (డ్రాఫ్టు) కన్నా ఎక్కువ లోతుకి దిగే నౌకల్ని లోపలికి రానిచ్చే వాళ్ళం కాదు. కాలవని ఇంకా లోతు చేస్తే 12 మీటర్ల డ్రాఫ్టు వున్న ఓడల్ని కూడా ఇన్నర్ హార్బర్‌లోకి తీసుకురావచ్చుకదా! పైగా జెట్టీల స్థానంలో కట్టిన బెర్తుల దగ్గర అప్పటికే 12 మీటర్ల డ్రాఫ్టు ఉన్న ఓడలు నిలిచేలా లోతు పెంచి వుంచాం... నేను ధైర్యం చేసి హార్బరు కాలువ అంతా 12 మీటర్ల డ్రాఫ్టు ఉన్న నౌకలు కూడా వచ్చేలా లోతు చేయించే పనిని చేపట్టాను. ఎస్సార్ షిప్పింగ్ వాళ్ళకి ఈ కాంట్రాక్టు ఇచ్చాం. ఆ కంపెనీ హార్బరు కాలవలో తవ్వగా తవ్వగా క్రింద రాతినేల ఎక్కువయిపోయి, మధ్యలో పని వదిలేశారు. కాని అప్పటివరకూ వాళ్ళు తవ్విన లోతువల్ల ఇప్పుడు 10 మీటర్ల డ్రాఫ్టు ఉన్న నౌకల్ని ఇన్నర్ హార్బర్‌లోకి తీసుకు రాగలుగుతున్నారు. జెట్టీల స్థానంలో కట్టిన బెర్తులమీదకి ఇలాంటి పెద్ద ఓడలు వస్తున్నాయి. ఇందువల్ల హార్బరులోకి వచ్చివెళ్లే సరుకు పరిమాణం పెరిగింది.

ఖనిజాల లారీలు నగరం మధ్యలోంచి నగరం బైటకు రాకపోకలు సాగించటం వల్ల కాలుష్యం వ్యాపిస్తోంది. దీనికి పరిష్కారంగానూ, భవిష్యత్ అవసరాల దృష్ట్యానూ విశాఖ పోర్టులో నుంచి పడమరగా 4-5 కిలోమీటర్ల దూరంలో వున్న విజయవాడ బైపాస్ రోడ్డుకి (నేషనల్ హైవేకి) ఒక రోడ్డు నిర్మిస్తే ఎలా వుంటుంది అన్న ఆలోచన వచ్చింది. అంటే ఎయిర్‌పోర్టుకి దక్షిణంగా (ఎయిర్‌పోర్టుకి వెనకాల) వున్న విశాలమైన భూమి అంతా పోర్టుదే. మధ్యలో ఒక పెద్ద మురుగునీటి కాలువ వుంటుంది. ఆ కాలవ మీద పెద్ద వంతెన వేసి, విజయవాడ హైవే మీదకి రోడ్డు నిర్మించాం. ఈ ఒక్కరోడ్డు నిర్మాణంతో పోర్టుకి ఎంతో సరుకుని తేగలిగిన ఎస్సార్ కంపెనీవారి పెల్లెట్ ప్లాంట్, లైమ్ కాల్సినింగ్ కర్మాగారాలు స్థలం కావాలంటూ ముందుకొచ్చాయి. ఇచ్చాం. దాంతో మరో 10 మిలియన్ టన్నుల దాకా ట్రాఫిక్ పెరుగుదలకి భరోసా చిక్కింది... అవుటర్ హార్బర్‌లో దేశంలోనే మొట్ట మొదటి ఎల్.పి.గ్యాస్ బెర్త్ నిర్మాణాన్ని మంజూరు చేశాం.

ముడిచమురుని తెచ్చే ఓడల్ని హిందూస్థాన్ పెట్రోలియమ్ తీసుకు వస్తుంది. ఈ సరుకుమీద మాకు ఖర్చు తక్కువ. ఆదాయం ఎక్కువ. అందుకే వాళ్ళ రిఫైనరీకి పక్కన వాళ్ళ భవిష్యత్ అవసరాలకి ఉపయోగపడుతుందని (వాళ్ళు వద్దు మొర్రో అంటున్నా) 300 ఎకరాలు అంటగట్టాను. ప్రత్యేక ఎగుమతుల మండలం నిర్మాణానికి 800 ఎకరాలు కేటాయించాను.

హార్బరు ముందున్న క్వార్టర్లు, భవనాలు కొట్టేయడంతో ఖనిజాల నిలవకి ప్రాంగణం విస్తృతమైంది. పోర్టులో జరిగే ఎగుమతి దిగుమతుల తాలూకు ట్రాఫిక్ వల్ల విశాఖనగరానికి కలుగుతున్న కాలుష్యం ఎంత తగ్గించినా ఎంతో కొంత వుంటుంది కనుక దీనికి పరిహారంగా బీచ్‌రోడ్ అభివృద్ధికి, గాంధీ కొండని చెట్లతో పచ్చగా అభివృద్ధి చేయటానికి, నగరానికి నీటి

సరఫరా పథకానికి, చావులమదుం పరిసరములురుగు ప్రాంతాలన్నీ మట్టితో నింపి దోమల్ని నివారించటానికి నిధులు కేటాయించాం. ఎటుపడితే అటు పోర్టుకి వచ్చివెళ్లే దారులు చాలా వున్నాయి. అందుకని చావులమదుం వైపునుంచి ప్రధాన ప్రవేశద్వారాన్ని సూచిస్తూ తోరణంలా కట్టించి ఆ ప్రాంత రూపురేఖలు మార్చాం. 'నెహ్రూ ప్లేస్' లో విశాలమైన ఎయిర్ కండిషన్డ్ ఇండోర్ స్టేడియమ్‌తో కూడిన బృహత్ క్రీడా ప్రాంగణం నిర్మాణం ద్వారా ఇవ్వాళ విశాఖపట్నంలో క్రికెట్ సహా అనేక అంతర్జాతీయ ఆటలపోటీలు జరిగేందుకు బాటలు వేయగలిగాం... ఇప్పుడు పోర్టు అంటే విశాఖపట్నంలో ఒకప్పటిలా కేవలం కాలుష్యాన్ని పంచిపెట్టే భూతం కాదు.

హార్ట్ ఫౌండేషన్‌కి భూరి విరాళం ఇవ్వటం, 1990 తుఫాన్‌లో దెబ్బతిన్న గణపర్తి గ్రామ పునర్నిర్మాణం వంటి అనేక సంక్షేమ చర్యల ద్వారా పోర్టు అంటే కేవలం ఒక వ్యాపారసంస్థ మాత్రమే కాదు, ప్రజా సంక్షేమం పట్ల బాధ్యతగల ప్రభుత్వ సంస్థ అన్న అభిప్రాయాన్ని కలిగించే ప్రయత్నం చేశాం. రిటైరయ్యే నాటికి ప్రతిపోర్టు ఉద్యోగికీ సొంత ఇల్లు సమకూరేలా ఇంటి రుణాల బడ్జెట్‌ని విపరీతంగా పెంచాం.

పోర్టులో రైల్వేయార్డు అభివృద్ధి, బెర్త్‌ల అభివృద్ధి, పోర్టు ఛార్జీల తగ్గింపు, లెవీరహిత పోర్టుగా మార్చటం, కంటైనర్ కార్గో, ద్రవరూపంలోవచ్చే సరుకుల నిలవకి సదుపాయం వంటి చర్యల ద్వారా పోర్టు ట్రాఫిక్‌ని 1988-92 కాలంలో 15 మిలియన్ టన్నుల స్థాయి నుంచి 23.50 మిలియన్ టన్నుల స్థాయికి పెంచగలిగాం. ఈ పెరుగుదల వేగం ప్రతి ఏడూ మిగతా అన్ని మేజరు పోర్టులకన్నా ఎక్కువగావుండటంతో 'ఉత్తమపోర్టు' అవార్డు సాధించుకుంటూ వచ్చాం.

దాదాపు 12 వేల మంది ఉద్యోగులూ, వందలాది అధికారులూ ఎంత సహకరించి వుండకపోతే ఈ పోర్టుకి ఈ విజయం నా హయాంలో లభించి వుంటుంది? అందుకే అవార్డు వచ్చిన ప్రతిసారీ ఆ అవార్డుని ప్రతి విభాగంలోనూ ఒక వారం పాటు ప్రదర్శించాలని ఆదేశించాను. "ఈ ఘనతకి మనం కూడా కారణం" అన్న ఆనందంతో వాళ్ళంతా పోర్టు ఖర్చుతో సంబరం చేసుకోవాలి.... ఇలా చేస్తూనే అవార్డు వచ్చిన ప్రతిసారీ ప్రతి ఉద్యోగికీ విధిగా ఒక బహుమతిని - వాచీలు, టిఫిన్ క్యారియర్‌లు వగైరా - అందించే సంస్కృతిని ప్రవేశపెట్టాను.

నాకు ప్రధానమంత్రి కార్యాలయానికి బదిలీ అయినప్పుడు విశాఖ పోర్టులోని కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, వాణిజ్యవర్గాలు ఘనంగా వీడ్కోలు సభలు జరిపాయి.

ఒక మిత్రుడు వ్యాఖ్యానించాడు: "నీకు దిష్టి తగిలింది ప్రసాద్"

విశాఖపోర్టుకు కొత్త చైర్మన్‌గా టి.గోపాలరావు నియమితుడు అయ్యేదాకా పోర్టులో నామీద (నాకు వ్యతిరేకంగా దుర్భాషలతో) విస్తృతంగా కరపత్రాల పంపిణీ జరిగినప్పుడు, నా మిత్రుడు మళ్ళీ ఫోన్ చేసి చెప్పాడు:

"నీకు దిష్టిపోయింది ప్రసాద్"!!

★ ★ ★

పి.ఎం. దగ్గర నేను వద్దనుకున్న పోస్టు

"...మీరు నన్ను తప్పుగా అనుకోకండి. నాకన్నా సమర్థులు ఇక్కడ చాలామంది ఉన్నారు. నేను మాత్రం ఈ ఉత్తర్వులతో ప్రధానమంత్రి కార్యాలయంలో చేరదలుచుకోలేదు!"

ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుగారి కార్యాలయంలో ముఖ్యకార్యదర్శి ఎ.ఎస్.వర్మకి నేను చెప్పదలుచుకొన్నది కుండబద్దలు కొట్టినట్టు చెప్పాను. ఆయన నివ్వెరపోయాడు. "మరి ఈ మాట ప్రధానమంత్రికి చెప్పారా?" ఆయన ప్రశ్న.

"ఆయనకి చెప్పాకనే మీకు చెప్పటానికి వచ్చాను. నాకు శెలవిప్పించండి" అంటూ లేవబోయాను.

వర్మ నన్ను లేవనివ్వలేదు. "చూడండి ప్రసాద్, దేశ ప్రధానమంత్రి కార్యాలయంలో పనిచేసే అవకాశం కోసం అనేకమంది ఐఏఎస్‌లు ఎదురుచూస్తున్నారు. మీరెందుకిలా అంటున్నారు. అయినా మిమ్మల్ని కోరుకున్నది ప్రధాని కదా!"

"నన్ను రమ్మన్నది ఇవ్వాళ కాదండి. ఆరుమాసాల క్రితమే రమ్మన్నారు. అప్పుడు మా అబ్బాయి చదువు తదితర కారణాలతో అంగీకరించలేకపోయాను. ఇప్పుడీ ఉత్తర్వులు చూశాక అంగీకరించలేకపోతున్నాను. శెలవ్" అంటూ లేచి వచ్చాను - విశాఖపట్నం విమానం ఎక్కటానికి.

అసలేం జరిగిందంటే...

* * *

1992 ఏప్రిల్.

ఉడిపిలోని కృష్ణమఠంలో శ్రీకృష్ణుడి దర్శనం చేసుకొని, స్వామీజీ వారి వద్ద మంత్రాక్షితలు తీసుకొని బయటకు వచ్చాను. మంగుళూరు పోర్టుట్రస్టుఛైర్మన్ పంపించారని పోర్టుమహిళా పిఆర్ఓ.(ప్రజాసంబంధాల అధికారి) వచ్చి చిన్న కాయితం అందించింది. "ఢిల్లీ నుంచి టెలిఫోన్ వచ్చింది. ఎ.ఎస్ వర్మగారు ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శిట. అర్జంటుగా మాట్లాడాలన్నారు. వైజాగ్‌కు చేశారట, గోవాకి చేశారట, మీరిక్కడున్నారని తెలిసి ఎలా కాంటాక్టు చేయాలో తెలియక మంగుళూరు పోర్టు ఛైర్మన్‌తో మాట్లాడి మీకు ఈ వార్తచెప్పమన్నారు." ఇదీ పోర్టు ఛైర్మన్ కార్యాలయం పంపించిన సందేశం.

ఈ టెలిఫోను ఎందుకు వచ్చిందో తెలుసు. మాట్లాడాలా వద్దా? మాట్లాడితే ఢిల్లీ వెళ్ళాల్సి ఉంటుంది. నేనేమో అంత తయారుగా లేను? ఏం చేయాలి? కాని ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శి టెలిఫోన్ చేయమంటే, మాట్లాడకుండా ఉండటం భావ్యం కాదు కదా!

సరేనని ఉడిపిలోనే పెజావరు స్వామివారి గెస్టుహౌవుస్ నుంచి వర్మగారితో మాట్లాడాను.... ఆ సంభాషణ అదో రకంగా సాగింది...

"సర్, నా పేరు పి.వి.ఆర్.కె. ప్రసాద్. వైజాగ్ పోర్టు ట్రస్టు చైర్మన్‌గా ఉన్నాను. తమరు మాట్లాడమన్నారట"

"అవును, ప్రసాద్, ప్రధానమంత్రిగారు ఈ వేళ నీ విషయం చెప్పారు - మా (ప్రధానమంత్రి) కార్యాలయంలో సంయుక్త కార్యదర్శిగా మిమ్మల్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయమని... ఎప్పుడు వచ్చి చేరదామనుకుంటున్నావు?"

"ఇంకా ఏమీ అనుకోలేదు... ఉత్తర్వులు జారీ అయ్యాక ఆలోచిద్దామనుకుంటున్నాను."

"అలాగా, నువ్వేదో రెండు మూడు రోజులలో వచ్చేస్తున్నావన్నట్లు నా కనిపించింది ఆయన (ప్రధానమంత్రి) మాటల్లో."

ఈ మాటల్లో కొంచెం వెటకారం ధ్వనించింది. కారణం నాకర్థమయింది. ప్రధానమంత్రి కార్యాలయంలో సంయుక్త కార్యదర్శి ఉద్యోగం చాలా ముఖ్యమైన వాటిల్లో ఒకటి. అక్కడికి ఎంపిక చేసే విధానమే వేరు.

ప్రతిపోస్టుకీ ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శి స్వయంగా ఆఫీసర్ల గత సర్వీసు రికార్డులు పరిశీలించి, ఎలాంటి క్రమశిక్షణా చర్యల ముద్రలూ లేవని, సమర్థులని చెప్పబడే ఇద్దరు ముగ్గురిని ఎంపికచేసి, ప్రధానమంత్రితో సంప్రదించి, వాళ్ళలో ఒకరిని నియమించడానికి నిర్ణయించి, అప్పుడు ఆ అభ్యర్థితో మాట్లాడి, అతని యిష్టా యిష్టాలు తెలుసుకొని, ఉత్తర్వులు జారీ చేస్తారు.

ప్రధానమంత్రులు మారినా, వీలయినంతవరకు ప్రధానమంత్రి కార్యాలయంలోని సీనియరు అధికార్లను మార్చే ఆనవాయితీ లేదు. ఎప్పుడైనా వారి డెప్యుటేషన్ పూర్తయితేనే ప్రధాని తన వారిని తెచ్చుకోవటం రివాజు. అది కూడా ముగ్గురి జాబితా తయారుచేసి అందులోంచి ఎంపిక చేస్తారు. పోస్టింగ్ అయ్యే సమయానికి రెండు మూడు నెలలముందే ఈ కార్యక్రమం జరుగుతుంది. దాదాపు ఈ నిర్ణయాలు ముఖ్యకార్యదర్శి పరిధిలో జరుగుతాయి. ఆయన ఈ కార్యాలయానికి అధిపతి. ప్రధానమంత్రికి చాలా నమ్మకం కలవాడు. అందుకని ప్రధానమంత్రులు ఆయనకే నిర్ణయాన్ని వదిలేవారు. తామెవరినైనా తెచ్చుకోవాలనుకున్నా, ముఖ్యకార్యదర్శితో సంప్రదించి ఆయన ద్వారానే వెళ్ళే ఈ ఆనవాయితీ - నెహ్రూ, ఇందిరాగాంధీ కాలం నుంచి వుంది.

అలాగే పి.వి.గారు ప్రధానమంత్రి అయిన తరువాత తన కార్యాలయంలో ఎవరినీ మార్చలేదు. అప్పటికే ఒక సంయుక్త కార్యదర్శి ఉన్నాడు. రెండో సంయుక్త కార్యదర్శి సాధారణంగా ఐ.ఎఫ్.ఎస్ అధికారి అయి ఉంటాడు. మూడోఖాళీలేదు. ప్రధానమంత్రి నా గురించి ఈ వర్మగారితో సంప్రదించినట్లు లేదు. అసలు నాకు తెలిసి, ఈ ప్రధానమంత్రి ఏ పోస్టింగుల విషయంలోనూ ఇంతవరకు బాగా పట్టించుకున్న దాఖలాలేదు. కాని నా విషయంలో ప్రధానే ఒక నిర్ణయం

తీసుకొని వర్మగారిని సంప్రదించకుండా, ఉత్తర్వులు జారీచేయమని మాత్రం చెప్పడం వర్మగారికి అంతగా నచ్చినట్టులేదు.

అందుకే ఆయన మాటల్లో వెటకారం. నేనేదో రాజకీయ పలుకుబడి ఉపయోగించో లేక వ్యక్తిగత పరిచయాలనుపయోగించో, ప్రధానిని ప్రభావితం చేసో, ప్రసన్నం చేసుకునో ప్రధానమంత్రి కార్యాలయంలోకి వస్తున్నానన్నది ఆయన అభిప్రాయం. మామూలుగా ప్రధాని కార్యాలయంలో ఉద్యోగం వస్తే, ఉత్తర్వులిచ్చిన రెండు మూడు గంటల్లో చేరడం పరిపాటి.

ఈ నేపథ్యంలో, బహుశా తాను ఉత్తర్వులిచ్చిన తరువాత నేను ఆలోచిస్తాననటం వర్మగారికి విస్మయం కలిగించి ఉంటుంది. "వచ్చి చేరడానికి వారం రోజులు పడుతుందా?" అని అడిగారు.

"ఉత్తర్వులు వచ్చాక ఒక నెలైనా పట్టవచ్చు సార్"... అనేశాను.

"అదేమిటి... అన్ని రోజులా..."

ఆయనకు అర్థం కాలేనట్టుంది. మళ్ళీ చెప్పారు.

"ఉత్తర్వులు రేపే జారీ అవుతాయి... ప్రధానమంత్రి నువ్వు వెంటనే చేరతావన్నట్లు చెప్పారు. తర్వాత నీ యిష్టం - ఆలస్యం అయ్యేట్లుంటే ఆయనతో మాట్లాడటం మంచిదేమో" అన్నారు. ఆయన కంఠంలో మార్పు కనిపించింది... మునుపటి వ్యంగ్యం లేదు. నాకెందుకులే మీరిద్దరూ చూసుకోండి అన్నట్టుంది.

ప్రధానమంత్రి కార్యాలయం వేరు - అక్కడి అధికారులు వేరు - ప్రధానమంత్రి అంతరంగిక కార్యాలయ సిబ్బంది వేరు. అంతరంగిక కార్యాలయంలో పనిచేసే వారికి ప్రధానమంత్రి కార్యాలయంలో కూడా ఆఫీసులు ఉన్నా, ముఖ్యంగా వీరు ప్రధానమంత్రి ఇంట్లో పనిచేస్తారు. ప్రధానమంత్రి కార్యక్రమాలు, దర్శనానికి వచ్చే వారి గురించి, మీటింగుల గురించి, మీడియాతో సంబంధాలు, విదేశీయాత్రలు, ప్రధానమంత్రి చూడవలసిన ఫైళ్ళు (పి.ఎమ్.ఓ నుండి వచ్చినవి) వగైరా వగైరా. ప్రధానమంత్రి అంతరంగిక కార్యక్రమాల్ని ఈ విభాగం చూస్తుంది. అందులో అందరినీ ప్రధానమంత్రి స్వయంగా ఎంపిక చేసుకొంటారు.

కాని ప్రధానమంత్రి కార్యాలయం - అధికారిక కార్యాలయం. ప్రభుత్వపాలనా పరమైన విషయ విశ్లేషణ, అన్ని శాఖల నుండి వచ్చే అధికారిక విషయాలు, మంత్రివర్గం ముందుకి వచ్చే విషయాలు, ప్రభుత్వ విధానపరమైన విషయాలు మొదలైన పరిపాలనా సంబంధమైన అధికార విషయ విశ్లేషణ చేస్తుందీ కార్యాలయం ప్రధానమంత్రి తరపున. దానికి ముఖ్యఅధికారి ఈ ముఖ్యకార్యదర్శి.

అందుకే వర్మగారికి నా విషయంలో కొంత అనుమానం... అంతరంగిక కార్యాలయంలోకి పనిచేయడానికి సిబ్బందిని ఎంచుకున్నట్లు తన ఆఫీసులో పనిచేయడానికి ఇతన్ని తనకు తెలియకుండా ఎంపిక చేశారు ప్రధాని. ఈ ప్రసాద్ అనేవాడిని ఆంధ్రప్రదేశ్ నుంచి తెస్తున్నారు.

ప్రధాని పేరులో పి.వి., ప్రసార్ పేరులో పి.వి! బహుశా ఆయనకి చుట్టమేమో! ఆయన స్వవిషయాలు చూడటానికి ఎ.వి.ఆర్. కృష్ణమూర్తి అదివరకే ఉన్నాడు కదా? మరి ఇతనెందుకు? ...ఇలా ఎంతో తర్జన భర్జన జరిగినట్లు నాకు తరువాత తెలిసింది. దానికి తోడు వర్మగారు వాకబు చేసి తెలుసుకున్న మరో విషయం - పి.విగారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్నప్పుడు పి.వి.ఆర్.కె. ప్రసాద్ ఆయనకి కార్యదర్శిగా కూడా పనిచేశాడని.

★ ★ ★

ఈ పరిణామాలు ఇంత అర్జంటుగా జరగడానికి కారణం ఉంది. రెండురోజుల క్రితమే రహస్య సమాచార విభాగం ప్రధానాధికారి ఎం.కె. నారాయణ్ (2004-08 కాలంలో ఈయన ప్రధానమంత్రికి ముఖ్యసలహాదారు - National Defence Council Chairman) నాతో మాట్లాడారు. "ప్రధాని మీతో మాట్లాడమన్నారు" అంటూ ప్రధానమంత్రితో జరిగిన సంభాషణ టెలిఫోనులోనే ఆయన నాకు వివరించారు!

ప్రధానమంత్రి: "మీకు ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి తెలుసా?"

"నాకొక ప్రసాద్ కొంచెం తెలుసు... అదివరకు తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేశాడు"

ఎం.కె. నారాయణ్ ప్రధాని ఇందిరాగాంధి దగ్గర చాలాకాలం పనిచేశారు. నేను టి.టి.డి. ఇవోగా ఉన్నప్పుడు ఇందిరాగాంధీ దాదాపు ఆరేడు సార్లు తిరుమల వచ్చారు. వచ్చినప్పుడల్లా ఆవిడతో ఈయన ఉండేవాడు. అలా పరిచయం.

"అవును, అతనే, ఆరు నెలల క్రితమే మనతో పనిచేయడానికి రమ్మన్నాను... పిల్లల చదువులు అని ఏదో సొంత ఇబ్బంది చెప్పి ఆరు నెలల తర్వాత పిల్లల పరీక్షలయ్యాక వస్తానన్నాడు. నాకు నా మనిషొకడు కావాలని ఉంది. అతనితో మాట్లాడి వెంటనే రమ్మన్నానని చెప్పండి."

ఇది నిజమే. పి.విగారు ప్రధానమంత్రి అయిన వెంటనే నాకు కబురు చేశారు. ఆయనకి సన్నిహితుడు, నెల్లూరు జిల్లావాడు, ఇఫ్కో ఛైర్మన్ అయిన రామచంద్రారెడ్డిని నాతో మాట్లాడటానికి వైజాగ్‌కి పంపారు. ఆయనకు నేను చెప్పింది: "మా అబ్బాయి ఇంటర్ రెండో సంవత్సరంలో ఉన్నాడు. సంవత్సరం మధ్యలో వస్తే ఇంటిల్లిపాదికీ ఇబ్బంది. ఇంకొక ఆరు నెలల తరువాత అయితే ఇబ్బంది ఉండదు." అదీకాక నాకు ముఖ్య కారణాలు ఇంకా ఉన్నాయి.

నేనెప్పుడూ ఢిల్లీలో పనిచేయలేదు. అక్కడ పరిచయాలు లేవు. అక్కడ పనిలో అనుభవం లేకపోగా - ఢిల్లీ గురించి చాలా విన్నా...

పి.వి గారితో నేను పనిచేసి కూడా దాదాపు 20 సంవత్సరాలయింది. ఆయన ఎంతో ఎదిగిపోయారు. ఆయనకు అక్కడి విషయాలన్నీ తెలుసు. అందరూ తెలుసు. అక్కడ పని తెలుసుకోడానికి, దానికి తగినట్లు నన్ను నేను మలుచుకోటానికి ఐదారు నెలలైనా పడుతుంది.

ఆయన ముందు చేతకానివాడిగా అయి, వీడినెందుకు తెచ్చాంరా అనుకుంటారేమో... ఢిల్లీ వెళ్ళకూడదనే, కేంద్రపోస్టింగు అయినా ఆంధ్రాలోనే ఉండేట్లుగా వైజాగ్ చైర్మన్ పోస్టుకి (ఖాళీ వచ్చినప్పుడు) దరఖాస్తు చేశాను. అది వచ్చింది. ఇక్కడ బాగానే ఉంది. వచ్చినప్పటి నుంచి దేశంలోనే ఉత్తమపోర్టుగా ఎన్నిక చేయబడి కొంత మంచి పేరు కూడా వచ్చింది. కుటుంబానికి కూడా అన్నీ అనుకూలంగా - సాగరతీరంలో పెద్ద తోట, పెద్ద బంగళా, నౌకర్లూ చాకర్లూ... మందీ మార్బలం... చైర్మన్‌ని కాబట్టి, నా ఇష్టం వచ్చినట్లు కొంత సమయాన్ని నా సొంత విషయాలకు కేటాయించవచ్చు. ప్రతిరోజు ఉదయాన్నే దేవుడి పూజ అలవాటయింది. మడి, ఆచారం - రోజు నైవేద్యం వండి, వైశ్వదేవహోమం చేసిన తర్వాతే ఏమైనా తినే అలవాటు పడ్డాను. ఇవి ఢిల్లీలో జరుగుతాయా? వాటికి టైం ఉంటుందా? విపరీతమైన చలి, ఎండలు... ఆ వాతావరణం మనకు పడుతుందా? నా భార్య గోపికకి అక్కడి వాతావరణం నచ్చుతుందా? వైజాగ్‌లో రాజులా బ్రతికాక, ఢిల్లీలో ...? ఎలా ఉంటుందో...? పైగా ఎవరితో మాట్లాడినా... పి.వి.గారిని ఏదో తాత్కాలిక ప్రధానమంత్రిగా తెచ్చారు. ఇంకెన్నాళ్ళు... నెలో రెండునెలలో ఆయన రాజ్యం అని అంటున్నారు.

మొదటిసారి ఆయన దగ్గర ముఖ్యమంత్రి కార్యదర్శిగా చేరిన తర్వాత మేమిద్దరం కలిసి పనిచేసింది కొన్ని నెలలే. తర్వాత రాష్ట్రపతి పాలన, ఆయన ముఖ్యమంత్రి పదవి పోవడం జరిగాయి. మళ్ళీ నేను ఆయన దగ్గరకు వెళ్తే ఆయన పదవికే ఆరునెలల్లో ఉద్వాసన వస్తుందేమో! ఇది ఒక అనుమానం. అయినా వెళ్ళి చేరాననుకొందాం. రేపు నిజంగా ఆయన ఆరుమాసాల తాత్కాలిక ప్రధానిగానే దిగి పోవాల్సి వస్తే, ఇంక ఆ బాధ జీవితాంతం నన్ను వెంటాడుతుంది గదా!

మనవాడు ప్రధానిగా నాలుగు కాలాలపాటు బాగుండాలి కాని, నేను వెళ్ళి ఆయన్ను పంపించే ఏర్పాటు చేస్తానా? ఈ ఆరునెలలు ఢిల్లీలో స్థిరపడటానికే చాలదేమో? ...ఇలా ఎన్ని ఆలోచనలు. ఇవన్నీ ఆలోచించే రామచంద్రారెడ్డి గారికి అలా చెప్పింది.

కాని ప్రధానిగారు జ్ఞాపకం పెట్టుకొని ఆరు నెలల తర్వాత మళ్ళీ నారాయణ్‌గారి ద్వారా గుర్తు చేశారు. నారాయణ్ కన్నా కొద్ది రోజుల ముందే ప్రధానమంత్రికి సన్నిహితురాలైన జర్నలిస్టు కళ్యాణి శంకర్ టెలిఫోన్ చేసి, "మిమ్మల్ని మీడియా సలహాదారుగా తీసుకురమ్మని పి.ఎం.గారికి చెప్పానండీ. మీరు వస్తే మంచిది" అని చెప్పటం, నేను "చూద్దాంలెండి" అనటం జరిగింది. అందుకే ఇప్పుడు మళ్ళీ నారాయణ్ నేరుగా ఫోన్ చేసి, ప్రధాని మనసులో ఏముందో అధికారికంగా చెప్పాక రావడానికి ఇబ్బందని చెప్పలేకపోయాను. భయంగానే ఉన్నా ప్రధానిని కలుస్తానన్నాను. "కలవండి... కాని ఒప్పుకున్నారని చెప్తాను" - అన్నారాయన. నేను ఏమీ మాట్లాడలేదు. నన్నొప్పించినట్లు ఆయన ప్రధానమంత్రితో చెప్పుంటారు.. దాని పరిణామమే వర్మగారి టెలిఫోను...

★ ★ ★

...రెండు రోజుల్లో, నేను ఉడిపి నుండి వైజాగ్ చేరేటప్పటికి ఆ ఉత్తర్వులు రానే వచ్చాయి. ప్రధాని కార్యాలయంలో సంయుక్త కార్యదర్శి ఉద్యోగం. ఆ ఆర్డర్సులో రెండు విషయాలు స్పష్టంగా కనబడుతున్నాయి. ఒకటి - విశాఖపట్నం ఛైర్మన్‌గా గత నాలుగేళ్ళుగా కేంద్ర ప్రభుత్వ సర్వీసులో డెప్యుటేషన్‌లో ఉన్న నాకు కేంద్రంలో డెప్యుటేషన్ కాలం ఇంకొక్క ఏడాది మాత్రమేననీ, రెండు - నేను పూర్తిగా ప్రధాని కార్యాలయ ముఖ్య కార్యదర్శికి మాత్రమే జవాబుదారీగా పనిచేయాలనీ. వెంటనే ఢిల్లీ ప్రయాణమయ్యాను... చేరటానికి కాదు - చేరలేనని ప్రధానమంత్రితో చెప్పటానికి!!

రేసుకోర్సు రోడ్డులో ప్రధానమంత్రిగారింటికి వెళ్ళడం నాకు అదే మొదటిసారి. గతంలో సీనియర్ ఐఎఎస్ అధికార్లు రాజమణి, కృష్ణస్వామి రావుసాహెబ్ ప్రధానమంత్రి కార్యాలయంలో ఉండగా ఒకసారి ఆ కార్యాలయానికి వెళ్ళటం జరిగింది. ఏదో ఇంకో లోకంలోకి పోతున్నట్లుంది. ప్రధానమంత్రి గారి ఓఎస్‌డి (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) కృష్ణమూర్తి కనపడి, "ఎప్పుడొచ్చారు, చేరిపోయారా" అన్నాడు. ఈయన పి.వి.గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకి ప్రైవేట్ సెక్రటరీగా ఉండేవాడు. కలిసి పనిచేశాం. మా ఇద్దరికీ మంచి సంబంధాలు ఉన్నాయి. ఆయనను అడిగి నా పని వివరాలు తెలుసుకొన్నాను. "ప్రధానమంత్రి ఆఫీసులో, మీకు కొన్ని శాఖలిస్తారు. వచ్చిన ఫైళ్ళు చూసి మీ సలహాలు రాసి ప్రధానికి పంపే ఉద్యోగం. దానితోపాటు కొన్ని రాష్ట్రాల్ని ప్రధాని తరఫున గమనిస్తూ ఉండాలి. ప్రధాని ఆ రాష్ట్రాలకు పర్యటనకు వెళితే, మిమ్మల్ని రమ్మంటే మీరూ వెళ్ళాలి... అప్పుడప్పుడు ప్రధానిని చూస్తూండవచ్చు... మీరు పిఎం గారితో మాట్లాడండి. ఆయన కావాలని పిలిపించారు కదా..."

నా కర్థం కావడం లేదు. ఈ ఉద్యోగం కోసం నన్ను ఇలా పిలిపించడం ఎందుకో...? ప్రధానమంత్రి నేను వచ్చినందుకు సంతోషించారు. నేను చేరడానికి వచ్చాననుకున్నారు. కాని నేను చేయాల్సిందేమిటి అని ఆయనను అడిగాను. "నమ్మకమయిన మనిషి కావాలి... నే చెప్పింది చేస్తూండాలి. ఇక్కడ జరుగుతున్నవి చూస్తూండాలి. వింటూండాలి... చేస్తే చాలా పని ఉంటుంది"..

నాకు ఇచ్చిన ఆర్డరు కాపీ చూపించాను. ప్రధాని కార్యాలయంలో సంయుక్త కార్యదర్శిగా పనిచేయడానికి ఇచ్చిన ఆర్డరు అది.

"అది మూసలో పోసిన ఉద్యోగం. మీరు అనుకుంటున్న పనులు చేసి పెట్టడానికీ, మిమ్మల్ని తరుచూ కలుస్తూ ఉండటానికీ వీలుపడని విషయం. నాకు ఇచ్చిన శాఖలు, అంశాల గురించి తప్ప మిగతా విషయాలు మీరు నాకు చెప్పినా, నేను జోక్యం చేసుకోవటానికి ఈ వ్యవస్థ ఒప్పుకోదు... పూర్తిగా పి.ఎం.ఓలోనే ఉద్యోగం. అంటే ముఖ్యకార్యదర్శి వర్మగారికి చెప్పకుండా, తెలియకుండా ఏ పనీ చేయడానికి ఉండదు. అటువంటి పనికయితే ఇప్పుడున్న ఎస్.కె.సింగ్ (ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులో నా బ్యాచ్‌మేట్, పిఎంఓలో ఒక సంయుక్త కార్యదర్శి) నా కన్న తెలివైన వాడు, బాగా పనిచేయగలిగినవాడు. అతను చేయలేనిది నేనేం చేయగలను? కాని

మీరనుకున్నట్లు మీ కళ్ళు, చెవులుగా ఉండాలంటే, సంయుక్తకార్యదర్శి పోస్టులో ఉంటూ చేయడం దుస్సాధ్యం... అధికారికంగా ఫైళ్ళు చూస్తూ ఎవరితోనైనా మాట్లాడే అవకాశం ఉండాలి. అలా అయితే, ఏదో కొంత చేయడానికి అవకాశం ఉండపచ్చు... పైగా కేంద్రంలో నా డెప్యుటేషన్ కాలం మరో ఏడాదిలో ముగుస్తుందని ఈ ఉత్తర్వులే చెబుతుంటే, నా మాట ఎవరు వింటారు?... అదీకాక, నేనెప్పుడూ ఢిల్లీలో పనిచేయలేదు. ఇక్కడి పద్ధతులు కాని, మనుషులు కాని, పరిపాలనా విధానాలుగాని పరిచయం లేదు. నేను మీకు సహాయపడకపోగా భారం అవుతానేమోనని నా ఆందోళన... ఇంకొక వ్యక్తిగత కారణం కూడా ఉంది. ప్రతిరోజు ఉదయం 2 గంటలు సాలిగ్రామ పూజ, హోమం చేయడానికి అలవాటు పడ్డాను. ఇటువంటి ఉద్యోగంలో వాటికి యిబ్బంది..." అని నాన్చేశాను.

ఇలా చెబితే, ఏ ప్రధానమంత్రి అయినా "నీకెలా కావాలంటే అలా చేద్దాం" అంటారా? అనరు. అనకపోతే...? "సరే మంచిది, ప్రసాద్ వెళ్ళిరా... అవసరమైతే కబురు చేస్తాలే" అని వదిలేస్తే...?

... ఈ ప్రశ్నలు ప్రధానిని కలవకముందే వేసుకున్నాను. నిజానికి ఈ గ్లామర్ పోస్టు కావాలని నేను ఎగబడుతున్నానా? లేదు. ఆ తాపత్రయమే నాకు లేనప్పుడు ఆ పోస్టు చేజారి పోతుందేమోనన్న బెంగ మాత్రం ఎందుకు?

కాని, ప్రధానమంత్రి నన్నొకసారి ఎగా దిగా చూసి సన్నగా నవ్వారు.

"అటువంటి ఇబ్బందులు ఏమీ ఉండవు. ఉదయం 8 గంటలవరకు నిన్ను కదిలించరు. ఏదైనా అత్యవసరమైతే తప్ప నేను కూడా ఫోన్ చేయను... కాని నువ్వన్నట్లు పిఎంఒలో సంయుక్త కార్యదర్శిగా ఉండి నాకు కావలసిన పద్ధతిలో పనిచేయడానికి తప్పకుండా ఇబ్బంది ఉంటుంది. ఇక్కడ అంతా పాతుకుపోయినవాళ్ళే. నా వ్యక్తిగత సిబ్బందికీ, పిఎంఒ సిబ్బందికీ కూడా ఉండవలసిన సమన్వయం లేదు... అయినా ప్రసాద్, నువ్వు వచ్చెయ్యి. అన్నీ తర్వాత చూసుకొందాం" అన్నారు.

నా మనస్సులో గుంఝాటన పోలేదు.

"సర్, ఇక్కడ పరిస్థితులు చూశాను. ఈ ఉద్యోగంలో రొటీన్‌గా యిచ్చిన పని తప్ప ఇంకేమీ చేయడానికి వీలుండదు. చేయనివ్వరు. వచ్చాక నాకూ తృప్తి ఉండదు. మీకూ ఉండదు. మీరు నన్ను ఎందుకు పిలిపిస్తున్నారో, నా కంటే మీకే ఎక్కువ తెలుసు. ఇక్కడ పనితీరు, మనుషుల మనస్తత్వాలు కూడా మీకు బాగా తెలుసు... ఈ పరిస్థితులన్నీ ఆలోచించి నా ఉద్యోగాన్ని మీరే నిర్ణయించండి. ఏ ఉద్యోగం అయినా, నాకు యింకెవరితో ప్రమేయం లేకుండా మిమ్మల్ని నేరుగా కల్సుకొని మాట్లాడే అధికారం ఉండేలా చూడండి. సర్, ఇది దృష్టిలో పెట్టుకొని ఇచ్చిన ఉత్తర్వులు మారిస్తేనే నేను మనస్ఫూర్తిగా రాగలుగుతాను..." కొంచెం నిష్కర్షగా చెప్పినా నా మనస్సులో ఉన్నది వినమ్రంగా చెప్పాను.

ఆయన సాలోచనగా తలపంకిస్తూ లేచారు. నేనూ లేచాను. నా భుజంమీద చెయ్యివేసి, "సరే మంచిది" అన్నారు. అంటే, ఏమిటీ దీనర్థం?

తర్వాత వర్మగారిని కలిశాను. ఆయన "వచ్చేశావా? ఎప్పుడు ఛార్జి తీసుకుంటున్నావు?" అని అడిగారు. నా మనస్సులో ఉన్న విషయం ఆయనకి కొంచెం జాగ్రత్తగా చెప్పాను. "ఇప్పుడిచ్చిన ఉద్యోగానికి నా కంటే మంచి అధికారులు ఢిల్లీలోనే దొరుకుతారు– నిషికాంత్ (శ్రీ N.K.Singh) చేయలేనిది నేను చేయగలనా? ప్రధానమంత్రిగారికి అదే చెప్పాను."

వర్మగారు ఆశ్చర్యంగా నా వైపు చూశారు. "నువ్వెళ్ళి ప్రధానమంత్రికి – నేను మీ ఆఫీసులో చేరడం లేదని – చెప్పి వచ్చావా?... నమ్మశక్యం కాకుండా ఉంది... ఈ ఆఫీసులో ఉద్యోగం ఇస్తే పరుగెత్తుకురావడానికి వేలమంది కాచుకుని ఉన్నారు... నువ్వైతే చేరటల్లేదా?"

అప్పుడు చెప్పాను. "సర్, పి.వి. ప్రధానమంత్రికాగానే కెమికల్స్ – ఫెర్టిలైజర్స్ శాఖ సహాయమంత్రి చింతా మోహన్‌గారు నాకు కబురు చేశారు. పి.విగారికి సహాయ పడటం కోసం దూరదర్శన్ డైరక్టర్ జనరల్‌గా రమ్మనమని. నా కుటుంబ పరిస్థితుల కారణంగా రాలేనని చెప్పాను. తర్వాత కొద్దిరోజులకే పి.వి.గారే టెలిఫోన్ చేయించారు పి.ఎం.ఓలోకి రమ్మని. కాని అవే పరిస్థితులవలన రాలేక పోయాను. నాకు ఢిల్లీలో పనిచేయాలని అంత ఉత్సాహంగా లేదు."

వర్మగారు నన్నేదో కొంచెం వింతగా చూశారు.

* * *

అంతే!

విశాఖపట్నం వచ్చేశాను. రెండు రోజుల తర్వాత, వర్మగారే మళ్ళీ టెలిఫోన్ చేశారు. "నీ ఉత్తర్వులలో మార్పు చేస్తున్నాం. నువ్వు ప్రధానమంత్రి కార్యాలయంలో సంయుక్త కార్యదర్శివి. దానితో పాటు ప్రధానమంత్రికి సమాచార సలహాదారువి కూడా. నీకు పి.ఎం.ఓ లోనూ, పి.ఎం ఇంటి దగ్గరా కూడా ఆఫీసులుంటాయి. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ప్రధానమంత్రిని నేరుగా కలవవచ్చు. నిన్నడిగి ఉత్తర్వులు జారీ చేయమన్నారు ప్రధానమంత్రిగారు" అన్నారు. ఈసారి ఆయన గొంతులో కొంత మర్యాద వినిపించినట్లయింది.

ఈసారి నేనేమీ ఎదురు చెప్పలేదు.

కొద్ది రోజుల్లోనే భార్యా పిల్లల్ని వైజాగ్‌లో వదలి ఢిల్లీ దర్బారుకి ప్రయాణమయ్యాను.

* * *

పి.ఎం.అధికారులూ - అంతః కలహాలు - 1

ఆ ఇద్దరు సీనియర్ అధికారులతో ప్రధానమంత్రికి తలనొప్పి పెరిగిపోయింది.

★ ★ ★

ముఖ్య కార్యదర్శి ద్వారా మాత్రమే ప్రధానికి చేరాల్సిన విషయాల్ని క్యాబినెట్ సెక్రటరీ నేరుగా ప్రధానితో చర్చించేస్తున్నారు... ఆయా శాఖల కార్యదర్శులకు క్యాబినెట్ సెక్రటరీ ద్వారా పంపాల్సిన ఆదేశాలను ముఖ్యకార్యదర్శి నేరుగా పంపించేస్తున్నారు.

తనని ఉద్దేశ్యపూర్వకంగానే ప్రధానమంత్రిగారి ముఖ్యకార్యదర్శి నిర్లక్ష్యం చేస్తున్నాడని క్యాబినెట్ సెక్రటరీ మండిపడుతున్నారు. ప్రధానమంత్రి కార్యాలయానికి ముఖ్య అధికారినయిన తనని ఈ క్యాబినెట్ సెక్రటరీ గడ్డిపోచలా తీసి పారేస్తున్నాడని ముఖ్యకార్యదర్శిలో అక్కసు పెరిగిపోతోంది.

వీళ్ళిద్దరి అహంభావాల ఘర్షణలో క్యాబినెట్ సెక్రటరీ కార్యాలయ, ప్రధాని కార్యాలయ అధికారులు నలిగిపోతున్నారు. ఈ విభేదాలు ఒకటీ అరా పత్రికల కెక్కేశాయి.

క్రమంగా ప్రధానమంత్రికి కూడా విషయం అర్థమయ్యేటప్పటికి చూసి చూసి సహనం కోల్పోయాక, ఒక రోజు అకస్మాత్తుగా నన్ను పిలిచి ఒక బండరాయి నా నెత్తిన వేశారు.

"అదేమిటయ్యా అంత పెద్ద ఆఫీసర్లలో సమన్వయం లేకపోతే ఎలా? సమన్వయం లేకపోతే పోయింది, పోట్లాడుకోవడమేమిటీ... అందునా ప్రధానమంత్రి ప్రధానకార్యదర్శి, Cabinet Secretary - ఇద్దరూ దేశంలోని అతి పెద్ద Civil Servants. చిన్న చిన్న విషయాలకు వారు పంతాలకు పోయి యిలా వాదులాడుకుంటే ఎలా? నువ్వు యిద్దరికి కొంచెం నచ్చచెపితే బాగుంటుందేమో?" అన్నారు ప్రధానమంత్రి.

"నేనా?" అన్నాను.

నేనేమిటి? నా హోదా ఏమిటి? ఆ యిద్దరూ నాకన్నా కనీసం పది సంవత్సరాలన్నా సీనియర్లు. ఒకరు నాకు ప్రత్యక్షంగా బాస్. ఇంకొకరు దేశంలోని అందరు ఆఫీసర్లకే బాస్. నేనేమో వందలమంది సంయుక్త కార్యదర్శులలో ఒకడిని...

అసలీ పరిస్థితి ఎందుకు వచ్చింది?

★ ★ ★

పి.వి. గారు ప్రధాని అయిన తరువాత ప్రధానమంత్రి కార్యాలయ అధికారాలు వీలయినంత వరకు తగ్గించాలని ప్రయత్నించారు. మంత్రులకు, ఆయా శాఖాకార్యదర్శులకు వారి వారి పరిధిలో అధికార వికేంద్రీకరణకు కొంత ప్రయత్నం జరిగింది. ఆర్థిక సంస్కరణలు, పరిపాలనా సంస్కరణలు మొదలు పెట్టిన రోజులవి. పివిగారికి తాను చాలా శాఖలలో మంత్రిగా పనిచేయటం వలన ప్రధానమంత్రి కార్యాలయంతో పడిన యిబ్బందులు గుర్తుంచుకొని వాటిని సర్దుబాటు చేయటానికి ప్రయత్నం చేశారు. ముఖ్యంగా వచ్చే గొడవ అధికారుల నియామకాల విషయంలోనే.

అదివరకు ప్రధానమంత్రి కార్యాలయంలో ఏఏ పోస్టుల్లో ఎవరిని నియమించాలీ, ఈ వ్యక్తి 'మనవాడా, కాదా'... వగైరా లక్షణాలు క్షుణ్ణంగా ముందుగా విచారించేవారు. అప్పుడైనా సదరు అధికారి ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శిని కలిసి తన విధేయత ప్రకటించాక, అప్పుడు ఫలానా పోస్టులోకి అతన్ని తీసుకోవాలని నిర్ణయించేవారు. చాలా వరకు అలా నిర్ణయం చేసిన అధికారి పేరుని ఆయా శాఖలకు తెలిపితే వారు ఆ అధికారి పేరుతోపాటు, లాంఛనంగా యింకా రెండు పేర్లు పంపాక, అనుకున్న అధికారి ఎంపికలో Selection Process అనుసరించినట్లు చూపించి, ఉత్తర్వులు జారీచేసేవారు.

అందుకే ప్రధాని కార్యాలయంలో సంయుక్త కార్యదర్శి పదవి చాలా కీలకమయినది. ప్రధానమంత్రి తనవాడని ఎన్నుకుని నమ్మకం వున్న వాడికి యిచ్చేవారు. ఏ శాఖలో ఏ పని కావాలన్నా మనం వేసిన అధికారి వుంటే మనకు కావలసినట్లు పని చేయించుకోవచ్చు. అధికారులు కూడా రాజకీయ, ఇతర పలుకుబడులతో మంచి మంచి పదవుల కోసం పాకులాడటం, పదవులలో వేయించుకోవటం, మొహమాటాలు పెట్టుకోవటం... ఒక రివాజు అయిపోయింది.

ఆయా శాఖల మంత్రులకు, కార్యదర్శులకు తమకు నచ్చిన మంచి అధికారులను తెచ్చుకొనే అవకాశం తక్కువగా వుండేది. ప్రధానితోను, ప్రధాని ఆఫీసులోని ప్రధాన మనిషితోనూ సంబంధం పెట్టుకుంటేగాని మంత్రులక్కూడా పనయ్యేదికాదు. దీనివలన అధికారుల్లో కూడా నైతిక పతనం వస్తుందని తెలిసినవ్యక్తి పి.వి.గారు... Home, Defence, External affairs, Human Resources Development - ఇలా ఎన్నో కీలక శాఖలలో ఎన్నో సంవత్సరాలు మంత్రిగా పనిచేయడం వల్ల ఈ సాధకబాధకాలన్నీ ఆయనకి బాగా తెలుసు. అందుకే ఆయన వస్తూనే... "అందరూ మనకు కావలసిన అధికారులే..." అన్నారు. ఆయా శాఖలవారు వారికి కావలసిన అధికారులను అర్హత కలవారిని ఎంచుకొని Personnel Department ద్వారా ముగ్గురు అధికారుల జాబితాను ACC (Appointments Committee of the Cabinet) ద్వారా ప్రధానమంత్రికి పంపాల్సి వుంటుంది. వీలయినంతవరకు జాబితాలోని మొదటి పేరునే ఎంపిక చేయడం జరగాలి. ప్రధాని తనకేమీ పరిచయం లేని మా బ్యాచిలోని Merit List లో నెంబరువన్ IAS అధికారి అయిన (బీహారు కేడర్) నిషికాంత్‌సింగ్‌కి ఆ బాధ్యతలు అప్పగించడం జరిగింది. అతను చాలా ప్రతిభావంతుడు, ముక్కుకు సూటిగా పోయే అధికారి...

మానవ స్వభావం తెలుసు కదా!... ప్రధానమంత్రి తనమనుషులను నియమించనవసరం లేదనుకుంటే, మిగతా అధికారిక కేంద్రాలు వారి మనుష్యులను తెచ్చుకునే ప్రయత్నం. మంత్రుల దగ్గర నుండి, సీనియరు అధికారుల వరకూ అదే ప్రయత్నం జరిగేది. ఈ వ్యవస్థలో కేబినెట్ కార్యదర్శి, ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి – ఈ రెండూ చాలా శక్తిమంతమైన పదవులు. చాలా మంది మంత్రులకంటే వీళ్ళకే ప్రాధాన్యత... మిగతా కార్యదర్శులపై కూడా వీళ్ళ ప్రభావం కొంచెం ఎక్కువే. ప్రధానిగారు ఈ వ్యవస్థకు అధికారాలను వదిల్తే ఆ అధికారం ఈ ఇద్దరిలో ఎవరు చలాయించాలన్నది ప్రశ్న. వస్తున్న తగాదా అక్కడే. జాబితాలు తయారుచేసేటప్పుడు తమకు కావలసిన వారిని పై పేరుగా తెచ్చుకోవాలన్న పట్టుదల.

పోస్టింగులలోనే కాక యింకా యితర విషయాలలో కూడా ప్రధానమంత్రి తమ సలహాయే తీసుకోవాలని వాళ్ళ తాపత్రయం. మనుషులు మంచివారే, సమర్థులే. కాని ఎవరి అహంభావం వారిది. ఎవరి పంతం వారిది.

అందుకే, వీరెవ్వరినీ సంప్రదించకుండా ప్రధానమంత్రి నన్ను నేరుగానే ఆయన కార్యాలయానికి తెచ్చుకొన్నారని వీళ్ళందరికీ ఎంతో ఆశ్చర్యం, అనుమానం, ఇంకా...!

కొన్ని రోజులు నేను చెయ్యాల్సిన పనేమిటో నాకే అర్థం కాలేదు. సంయుక్త కార్యదర్శిగా నాలుగు శాఖలిచ్చారు. నేను పోర్టునుంచి వచ్చాను కాబట్టి Surface Transport Ministry, ప్రధానమంత్రిగారు సూచించిన Rural Development, Programme Implementation, Information & Broadcasting నాకిచ్చారు. మిగతా అన్ని శాఖలు, పోస్టింగులు, మరొక సంయుక్త కార్యదర్శి సింగ్‌దగ్గర. Programme Implementation అంటే అన్ని శాఖలకు సంబంధించింది. ఇదికాక, ప్రధానమంత్రికి మీడియా సలహాదారుగా పత్రికా సంపాదకులతోటి, విలేఖరులతోటి సత్సంబంధాలు పెట్టుకోవాలి. ప్రధానమంత్రిగారి ఆశయాలు, ఆంతర్యం, నిర్ణయాలు అవసరాన్ని బట్టి యుక్తి యుక్తంగా ప్రపంచానికి Media ద్వారా అందేట్టు చేయాలి. నేను చేరేటప్పుడు మా నిర్ణయాన్ని బట్టి ఈ పదవి నాకు ఒక ప్రధానమంత్రితో దగ్గరగా ఉండడానికి దోహదకారే కాని అసలు మీడియా పనంతా PIO (Principal Information Officer) నరేంద్ర చేయాలి.

అలానే మొదటి నెల... ఏదో చాలా ముఖ్యమైన పనిచేస్తున్నట్లు హడావుడిగా తిరుగుతూ జరుగుతున్నవి చూడడం, చేతనయినంత నేర్చుకోవడం చేశాను. సరే మొదటినెల యాతి బాధలు, యింటి బాధలు వుండనే వున్నాయి. ప్రధాని సలహాదారుగా పెద్దింటికి అర్హతవున్నా, సంయుక్త కార్యదర్శి హోదా కనుక అందరు సంయుక్త కార్యదర్శులకు యిచ్చినట్లే ఇల్లిస్తామన్నారు. సరేనన్నా.. చాణుక్యపురిలో – చాణక్యుడంత పురాతనం కాదు కాని, ఓ పాత ఫ్లాట్ ఇచ్చారు. మూడు పడక గదుల నివాసం, ఢిల్లీ పరిస్థితులకు మంచి సెంటరులో మంచి ఇల్లు క్రింద లెఖ్ఖ.

నా భార్య గోపికి నచ్చలేదు. ఎక్కడ విశాఖపట్నం పోర్టు బంగళా, ఎక్కడ యీ ఇల్లు? ప్రధానమంత్రి సలహాదారునని ఇంటికి సున్నాలైతే కొట్టారు. ఏదో కొంచెం ఇక్కడా అక్కడా

బాగుచేశారు. వైజాగ్‌లో నెలకు 250 రూపాలు కడితే పోర్టుకారుని ఛైర్మన్ కుటుంబం వాడుకోవచ్చు. అక్కడయితే ఎన్నో కార్లున్నాయి. కాని ఇక్కడ ఒక్కటే కారు. నాది ఒక్క కార్యాలయంలో పని అయితే కారు డ్రైవరుని కావలసినప్పుడు ఇంటికి పంపవచ్చు. ఇక్కడ కూడా 250 రూపాయలకు కారు వాడుకునే వెసులుబాటు వుంది. కాని కారు ఖాళీ ఉండదు. సొంతకారు వుంది కాని, డ్రైవరు లేడు. నాకు టైం ఉండదు. గోపీకి డ్రైవింగు రాదు. డ్రైవరుని పెట్టుకునే స్తోమత లేదు.

అంతే! గోపీ అనేసింది - "ఏం ప్రధానమంత్రి సలహాదారు ఉద్యోగం... కనీస వసతులైనా లేవు..."

ఆమె అలా అనటానికి కారణం - నేను అన్ని వసతులూ వున్న విశాఖపట్నం పోర్టు ఛైర్మన్ పోస్టులో నాలుగు సంవత్సరాలు అలవాటుపడి వుండటం, అక్కడ అందరూ నేను యింకా చాలా పెద్ద హోదాకు పోతున్నానని అనడం. ఏం హోదాయో ఏమిటో కాని ఢిల్లీ వెళ్ళిన 15 రోజులకు కోటు తొడుక్కోవడానికి గోడ అల్మారా తెరిచాను. అంతే, అన్ని కోట్లూ, చొక్కాల్ని చెదలు కొట్టేశాయి. చాల బాధనిపించింది. సొంత ఖర్చుతో చెదల నిర్మూలన మందుతో సిమెంట్ చేయించింది గోపి. (మొదటి నుండీ సర్దుకుపోయే స్వభావం కనుక, కొద్ది రోజులలోనే ఢిల్లీ పరిస్థితికి అలవాటు పడింది గోపి).

పి.వి.గారు నన్ను ఉదయం 5 గంటల నుండి 8 గంటల వరకు వీలయినంతవరకు టెలిఫోనులో కూడా పిలిచేవారు కాదు. RAX (వ్యక్తిగత ఫోన్‌లైన్) లో రెండు మూడుసార్లు టెలిఫోను చేసినా మా ఆవిడతో "పూజ అయిన తరువాత మాట్లాడమనమ్మా" అని పెట్టేసేవారు...

ఓ రెండు నెలల్లో అక్కడి పరిస్థితులు కొంత అవగాహనకు వచ్చాయి. చాలామందికి ఎవరి ఎజెండా వారిదే. కొద్దిమందికి మాత్రమే పివి గారి ఎజెండా.

ప్రధానమంత్రి కార్యాలయంలో ఆంధ్రాకేడరు సీనియర్ ఆఫీసరు కె.ఆర్. వేణుగోపాల్ అదనపు కార్యదర్శిగా వుండేవారు. తర్వాత ఆయన కార్యదర్శిగా పదోన్నతి చెందినా ... మంచి అధికారి కనుక ప్రధాని కార్యాలయంలోనే అదనపు కార్యదర్శి పదవిని కార్యదర్శి హోదాకి పెంచి, అక్కడే వుంచారు. గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరాలు విషయాలలో మంచి అనుభవజ్ఞుడు. ప్రధానమంత్రి అంటే చాలా విధేయత, గౌరవం. ప్రధానికి కూడా మంచి అధికారి అని, కష్టపడి పనిచేస్తాడని అతనిమీద అభిప్రాయం.

కాని వేణుగోపాల్‌కీ ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి వర్మగారికి అంత పడేది కాదు. లోలోపల కోల్డ్‌వార్ నడుస్తుండేది. యిద్దరూ మంచి అధికారులే అయినా, వర్మ ప్రధానికి పూర్తి విధేయులు కారనీ, ఆయన ఎజెండా ఆయనకున్నదనీ వేణుగోపాల్ ఆవేదన. కొన్ని కొన్ని విషయాలలో ప్రధానమంత్రికి సరైన సలహాలు వర్మ యివ్వకపోగా, తప్పుదారి పట్టిస్తున్నాడేమోనని అనుమానం కూడా! ఒకటి రెండుసార్లు నాతో కూడా మాటల్లో వేణు గోపాల్ చెప్పడం జరిగింది... ఆయన బాధ ఏమిటంటే, ఫైల్సులో తను మంచిమంచి సూచనలు చేసినా, కొన్ని కొన్ని విషయాలలో ప్రధానమంత్రి వర్మ సలహాపైనే నిర్ణయాలు తీసుకొంటారని.

రెండు మూడుసార్లు యిలా జరిగి, వేణుగోపాల్ నాతో విషయం చెప్పినప్పుడు, "ప్రధాని దృష్టికి ఈ విషయం తెమ్మంటారా" అని అడిగాను. "మీ యిష్టం" అని ఆయన వూరుకొన్నారు. అవకాశం చూసి, ప్రధానితో ఈ విషయం ప్రస్తావన చేశాను. ఆయన తీవ్రంగా తీసుకోలేదు. "మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే ఆయా శాఖలలో విషయాలు కూలంకషంగా చర్చించాకనే తుది నిర్ణయాల స్థాయిలో ప్రధాని కార్యాలయానికి వస్తాయి... మనం యిక్కడ చూడవలసింది... ఈ నిర్ణయాల ప్రభావం దేశం మీద ఎలా వుంటుంది? మన సిద్ధాంతాలమీద, ఇతర శాఖల మీదా ఎలా వుంటుంది?

"దీనితో యిబ్బందులేమైనా వుంటాయా? అంతర్జాతీయంగా ఆలోచించాల్సిందేమైనా వుందా? ప్రధాని కార్యాలయానికి ఈ విషయంపై అదివరకేమైనా సమాచారం అందిందా? ఇలాంటి విషయాలు - దృష్టిలో పెట్టుకొని క్లుప్తంగా సూచనలు చేయాలి..."

ఆయన ఇంకా చాలా చెప్పారు. "... నిర్ణయాలు తీసుకొనేటప్పుడు, మా యిబ్బందులు మాకుంటాయి. అన్నిటికన్నా మంచి సూచన, ఆచరణ పరంగానూ రాజకీయంగానూ అమలుచేయడానికి యిబ్బందులుండవచ్చు.... మీరు అధికార్లుగా వున్నప్పుడు ఈ సలహాయివ్వడానికి మీకు అవకాశం వుందా లేదా? అని ఆలోచించాలి. ఆ అవకాశం వుంటే మీ బాధ్యత తీరినట్లే అని అంతటితో సంతృప్తి చెందాలి. మీరిచ్చిన సలహానే ప్రధానమంత్రి పాటించాలనుకోరాదు. దానిని వ్యక్తిగత ప్రతిష్ఠగా తీసుకోరాదు... వేణుగోపాల్ మంచి ఆఫీసర్. మన మంచి కోరేవాడే, సమర్థుడే. సలహాలు కూడా మంచివే ఇస్తాడు. అంతమాత్రాన తను ఇచ్చిన సలహాల్నే మనం పాటించాలంటే ఎలా?... ఒకటి రెండుసార్లు వర్మకూడా వేణుగోపాల్‌కీ తనకీ మధ్య వున్న భేదాభిప్రాయాల గురించి సూచన ప్రాయంగా నాకు చెప్పాడు. కాని వేణుగోపాల్‌కి వర్మతో పోటీ పడాల్సిన అవసరంలేదు. ఎవరిచ్చే సలహాలు వాళ్ళిస్తారు. వేణుగోపాల్ ఫైల్‌మీద రాసిన ప్రతి సూచనా నేను కూడా చూస్తున్నాను కదా! ఎవరు ఏ సలహా ఇచ్చినా మనం వేర్వేరు కోణాల్లో దాన్ని చూడాలి. చూసి, ఏది మంచిదని నాకు అనిపిస్తే అదే చేస్తాను. ఇలాంటి సున్నితమైన విషయంలో అనవసరంగా పంతానికిపోవద్దని వేణుగోపాల్‌కి చెప్పు..."

ఇంత చెప్పాక కూడా పి.వి.గారు. ఒకమాట నొక్కిచెప్పారు. "... ఆయనంటే నాకు గౌరవం వుందని కూడా చెప్పు..."

సమర్థులైన అధికారుల మనోభావాలు దెబ్బతినకుండా ఒక పాలకుడు ఎలా వ్యవహరించాలో పి.వి. గారిని చూసి నేర్చుకోవాలి అనుకున్నాను.

వేణుగోపాల్‌గారికి ఈ విషయంలో అంత సహనం వుండేదికాదు. చివరికి, రిటైర్‌మెంట్‌కి రెండు నెలలుముందుగానే స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి, ఒక స్వచ్ఛంద సంస్థద్వారా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి వెళ్ళిపోయారు. వర్మగారి అనుయాయులు మాత్రం వేరే రకంగా ప్రచారం చేశారు. కార్యదర్శి హోదా రాగానే తననే ప్రధానికి ముఖ్య కార్యదర్శిని చేయాలన్న వేణుగోపాల్ కోరిక తీరలేదనీ, ఇంక అక్కడ కొనసాగటం కుదరదనీ భావించి,

ఆయన స్వచ్ఛందపదవీ విరమణ చేశారనీ వాళ్ళు చేసిన ప్రచారం. ...నిజం భగవంతుడికే తెలుసు. (ఆయన వెళ్ళిపోయాక ఆ స్థానంలో ఆంధ్రప్రదేశ్ చెందిన యుగంధర్ నియమితు లయ్యారు.)

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తల బొప్పికట్టిన కారణాలుకావచ్చు. పి.వి.గారు తరచూ అంటుండేవారు : "రాజకీయాల్లో రెడ్లతోనూ, పరిపాలనలో కాయస్థులతోనూ ఎంతో తప్పనిసరి అయితే తప్ప తగాదా పడకూడదు." వర్మ కాయస్థులు కావటం కాకతాళీయం. నేనున్న నాలుగేండ్లలో ప్రధాన కార్యదర్శిగా ఎ.ఎన్.వర్మగారే వున్నా, Cabinet Secretary ల మారుతూ వచ్చారు. వర్మగారికి క్యాబినెట్ సెక్రటరీలతో మొదట్లో బాగానే ఉన్నా - కొంత ''ల్డ్‌వార్ ఉంటుండేది. ఖాన్‌గారు క్యాబినెట్ సెక్రటరీగా ఉన్నప్పుడు ఈ విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. వాళ్ళిద్దరి మధ్య విభేదాల ప్రభావం ఎంత దాచిపెట్టాలనుకున్నా, ప్రధాని దృష్టికి రాకుండా ఆగేది కాదు. పైగా ప్రధాని కార్యాలయం పై వాటి ప్రభావం పడకుండా ఉండేదీ కాదు. ఒక సందర్భంలో ఈ విభేదాలు భగ్గుమన్నాయి.

★ ★ ★

అప్పుడే ప్రధానమంత్రి మాటల్లో ఈ ప్రస్తావన వచ్చింది. "అంత పెద్ద అధికారులు, అలా చిన్న పిల్లల్లా దెబ్బలాడుకుంటున్నారేమిటీ" అని అడిగారు.

"మనం మన అధికారం పూర్తిగా వాడటం లేదని మన అధికారం వాళ్ళిద్దరిలో ఎవరు వాడాలో తేల్చుకోవడానికే ఈ ఘర్షణ" అన్నాను.

"అంటే" ... అని ప్రశ్నార్థకంగా నావైపు చూశారు...

నేను తటపటాయించాను.

నాకన్నా సీనియర్ అధికారుల గురించి ప్రధానమంత్రి దగ్గర - కేవలం ఆయన నాకు చనువిచ్చారు కదా అని - అవాకులు చవాకులు మాట్లాడటం వల్ల రాగల అనర్థాలు తలుచుకుని ఆగిపోయాను. ఒకవేళ ఏ అనర్థమూ లేకపోయినా వాళ్ళిద్దరి మధ్య తగాదా గురించి ప్రధాని ముందు నేను బయట పెట్టడమంటే వాళ్ళిద్దర్నీ తక్కువచేసి మాట్లాడటమే. నా సీనియర్లగురించి అలా మాట్లాడటం విజ్ఞత అనిపించుకుంటుందా?... అనవసరంగా ఇరుక్కుపోయాన్రా, బాబూ, అనుకొని టక్కున నోరుమూసుకున్నాను...

కాని, ప్రధాని వదల్లేదు.

"ఫరవాలేదు, నీకు తెలిసిందేమిటో నిర్మొహమాటంగా చెప్పు" అంటూ నన్ను వత్తిడి చేశారు. అయిష్టంగా, నోరువిప్పాను.

"అసలు జరిగిందేమిటంటే సర్..."

★ ★ ★

పి.వి. పాలనా రహస్యం

(పి.వి. అధికారులూ-అంతఃకలహాలు - 2)

భారత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికీ - అంటే క్యాబినెట్ సెక్రటరీకీ, ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శికీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేటంతగా విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి.

ఒకటి రెండు సంఘటనలు పత్రికలలో కూడా రావటంతో ప్రధానమంత్రి పి.వి. నరసింహా రావుగారు నన్ను ఒత్తిడి చేయటంతో నేను అయిష్టంగా జరిగిందేమిటో చెప్పటం మొదలుపెట్టాను.

అసలీ విభేదాలకి మూలకారణమేమిటో ముందు చెప్పాను. "సర్, మీ అధికారాల్ని మీరు ఉపయోగించకుండా, వ్యవస్థ మీద నమ్మకంతో మీ అధికారాల్ని వాళ్ళకి వదిలేశారు. అందువల్లే ఈ సమస్య ఉత్పన్నమయింది..."

"నేను అధికారాలను వదులుకోవటమేమిటయ్యా?" అంటూ అర్థంకానట్లు చూశారు.

నేను ఆచితూచి మాట్లాడాలి అనుకుంటూనే నా మనసుకి అనిపించిన విషయాలన్నీ చెప్పేశాను.

"సర్, అధికారం చూపించడం అంటే మనకు కావల్సిన వాళ్ళను మనకు కావలసినచోట వేయడం, మనకి మద్దతునిచ్చే వాళ్ళను, వాళ్ళ సపోర్టర్లను అవకాశం వచ్చినప్పుడల్లా పదవులలో ఇరికించడం. అలా చేస్తేనే అధికారులు కాని, రాజకీయ నాయకులు కాని మనం అధికారంలో ఉన్నా లేకున్నా మనకు నమ్మకంగా ఉంటారు. అధికారంలో ఉన్న అందరూ ప్రధానమంత్రి పదవిలోనే కాదు, ఏ పదవిలో ఉన్నా చేస్తున్నదదే. ఇంతకు ముందు ప్రధానమంత్రులను చూడండి. వారికోసం అప్పటి అధికారులు, రాజకీయ నాయకులు ప్రాణాలివ్వటానికి సిద్ధంగా ఉన్నారంటే - అధికారంలో ఉన్నప్పుడు వారిని బాగా చూసుకొన్నారు కాబట్టి. మీరు ఈ విషయాలు ఈ వ్యవస్థకు వదిలామనుకుంటున్నారు. అంతా పద్ధతి ప్రకారం మంచి అధికార్లను ఎంపిక చేస్తున్నామనుకుంటున్నారు. కాని వ్యవస్థ అంతా పాత పద్ధతులకు అలవాటుపడివుంది. మీ బదులు మీ అధికారాలు ఎవరు చలాయించాలా అన్నది ప్రశ్న. దాని పరిణామమే ఈ కొట్లాట..." కొంతసేపు నిశ్శబ్దం.

పి.వి.గారు కొంచెం ఆగి ఆయన మనసులో మాట చెప్పారు.

"నన్ను మొదటి నుండి చూస్తూనే ఉన్నావు కదా. నాకెప్పుడూ పార్టీ, పార్టీ లీడరే ముఖ్యం కాని, నా మనుగడ పెంచుకోవాలని నేను ఎప్పుడూ ప్రయత్నించలేదు. పార్టీలో కూడా అంతా నా వాళ్ళే అనుకున్నాను. కాని, కొందరిని దగ్గరగా తీయడం, కొందరిని దూరం పెట్టడం ఎప్పుడూ

చేయలేదు. అధికారుల విషయంలోనూ అంతే - వీలయినంత వరకు అది వరకు ఉన్న వాళ్ళతోనే పనిచేయించుకొందామనే కాని నా వాళ్ళతో ఆఫీస్‌ని నింపుకుందామని ఎప్పుడూ చూడలేదు. ప్రధానమంత్రి అయిన తర్వాత నా కార్యాలయంలో నేను తెచ్చుకున్న రామూదామోదరన్, ఖండేకర్, కృష్ణమూర్తి తప్ప మిగతా వాళ్ళంతా అదివరకటి వాళ్ళే. కొన్నాళ్ళకు నువ్వొచ్చావు. నాకు నమ్మకం ఉన్నవాళ్ళు, నా పనితీరుతో పరిచయం ఉన్నవాళ్ళు కొందరు కావాలి కదా. పి.సి.అలెగ్జాండర్‌గారు సూచిస్తే ఎ.ఎన్.వర్మని తీసుకొన్నాను. ఆర్థిక విధానాలు, సంస్కరణలు అమలుచేయడానికి మన్‌మోహన్ సింగ్‌గారిని తీసుకోవడం జరిగింది. ఇవన్నీ కూడా పని అవసరాలను బట్టి, ప్రతిభను బట్టి వేసినవే కాని నా స్వలాభానికి చేసినవి కావు కదా...

"భగవంతుడి దయవలన నా పనితీరు చూసి నాకు రావలసిన పదవులు వచ్చాయి. ఏ గ్రూపు సహాయంతోనూ రాలేదు. నాకు పదవి లేనప్పుడెవరు, ఎందరు నాతో ఉన్నారో నాకు తెలుసు. నాతో లేరని బాధలేదు, ఉండాలని కోరికా లేదు. నా పార్టీ వాళ్ళందరూ నా గ్రూపు అనుకున్నాను. అధికారుల విషయంలోనూ అంతే. నాకు తెలిసిన అధికార్లు సీనియర్లు ఎందరో ఉన్నారు. చాలామంది చాలా బాగా చేస్తూ ఉండి ఉండవచ్చు. కాని నా వాళ్ళు, పరాయివాళ్ళు అంటూ ఎవరినీ చూడలేదు. నాకు చాలా దగ్గర అంటూ ఎవరూ లేరు. దూరమూ ఎవరూ లేరు. క్యాబినెట్ సెక్రటరీ, నా ప్రిన్సిపల్ సెక్రటరీ ఇద్దరూ నాకు ఒక్కటే.

"ఇంత పైకొచ్చినా, నా విషయం తెలిసి కూడా ఈ సీనియరు అధికారులు అలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో అర్థంకావడం లేదు... నువ్వు వాళ్ళిద్దరికీ నచ్చ చెపితే బాగుంటుంది" అన్నారు.

"నేనా!" ఒక్కసారిగా షాక్ తిన్నట్లనిపించింది నాకు.

"నువ్వే - చేసి చూడు. నీ అంతట నువ్వు చెయ్యడం లేదుగదా! ప్రధానమంత్రి తరఫున చేస్తున్నావు - ప్రయత్నం చెయ్యి" అన్నారు.

భయపడిపోయాను. చాలా సందేహించాను. వాళ్ళు ఇద్దరూ నాకు బాస్‌లే చాలా సీనియర్లు. రోజూ వారికింద పనిచేయాలి. ఇదివరకు ఇటువంటివి చేసే భాగ్యం కలగలేదు. కాని ప్రధానిగారి ఆజ్ఞ... ఏం చేయాలి?... ఒక రోజంతా మానసికంగా కసరత్తు చేశాక, కొంచెం దూరంగా వున్న ఖాన్ గారితో టెలిఫోనులో మాట్లాడాను. "సార్, మీతో చాలా ముఖ్యమైన విషయం - ప్రధానిగారు మాట్లాడమన్నారు. మీరు టైం ఇస్తే..."

వెంటనే ఆయన "ఇంకొక గంటలో నేనే అటువైపు వస్తున్నాను. నేను నీ రూమ్ కొస్తాలే" అన్నారు... మంత్రివర్గ సమావేశాల కొచ్చినప్పుడు ఆయన నా రూములోకి తొంగి చూడటం అలవాటే. నా రూమ్ క్యాబినెట్ మీటింగ్ హాల్ ప్రక్కనే ఉంది. అరగంటలో వచ్చేశారు.

క్యాబినెట్ సెక్రటరీ వస్తే లేచి నిలబడాలి. "సర్, సర్" అంటూ వినయవిధేయతలు ప్రదర్శించాలి... అవన్నీ చేశాను. కూర్చోపెట్టాను. చెప్పాలనుకున్నది చెప్పటానికి సంకోచం. ఎక్కడ ఆయన విపరీతంగా ప్రతి స్పందిస్తాడో, అలా జరిగితే నేను తట్టుకోగలనా?... "సర్ టీ

తీసుకుంటారా?... ఎ.సి.తగ్గించమంటారా?" ఇలాంటి వినయ వ్యక్తీకరణలు చేస్తూ ధైర్యం చేసి, రంగంలోకి దిగాను.

మెల్లగా అసలు విషయం ప్రస్తావించానో లేదో - 'నేనూ అదే విషయం నీతో మాట్లాడాలని చాలా రోజులుగా అనుకుంటున్నానయ్యా" అంటూ ఆయన మొదలు పెట్టారు!!!

తనని సరిగా పనిచేయనీకుండా ప్రధానకార్యదర్శి ఎలా అడ్డువస్తున్నారో, తన పరిధిలోని విషయాలతో ఎలా జోక్యం చేసుకుంటున్నారో, ప్రధానమంత్రి గారి పేరు వాడుకొని ఎలా అన్ని విషయాల్లో వేలు పెడుతున్నారో తన దృక్పథంలోంచి విపులంగా చెప్పారు. కావాలంటే ఫైల్సులో నిదర్శనాలు చూపగలనన్నారు. క్రమంగా నా భయం, బెరుకు తగ్గిపోయాయి. క్యాబినెట్ సెక్రటరీ నా దగ్గర అంత మనసు విప్పి మాట్లాడుతున్నారంటే కారణం - ప్రధానమంత్రి నాకు ఇస్తున్న చనువన్నమాట.

నాకు ఇప్పుడు చాలా ధైర్యం వచ్చేసింది. ఈ సారి చొరవ పెంచాను.

ప్రధానమంత్రి గారు ఈ విషయంలో ఎలా అనుకుంటున్నారో చెప్పాను. నన్ను వర్మగారితో కూడా మా ్లాడమన్నారని కూడా చెప్పాను. "అవును, నువ్వు మాట్లాడు, తర్వాత మనం మళ్ళీ మాట్లాడదాం" అన్నారాయన. అక్కడికి ఆ రంగం ముగిసింది.

తర్వాత వర్మగారితో మాట్లాడాలి... నాకెందుకో కొంచెం జంకుగానే ఉంది. సంయుక్త కార్యదర్శిగా ఆయన క్రిందే పనిచేస్తున్నాను. నేనీ విషయం ప్రస్తావిస్తే ఏమనుకుంటారో అని సంశయం. సంకోచిస్తూనే ఆయన దగ్గరకు వెళ్ళాను. రోజూ ఎన్నోసార్లు కలుస్తున్నా ఇవ్వాళ కొంచెం బెరుకు... అలా అని ప్రధానిమాట కాదని ఊరుకోనూలేను. ఈయన సి.ఆర్.ని (సర్వీసుకార్డు) పాడుచేస్తే!

అంతే సంగతులు. ముందు ముందు అదనపు కార్యదర్శి, కార్యదర్శి పదవులకు ప్రమోషను నేను వదులుకోవాల్సిందే... అంతా భగవంతుని దయ అని మనస్సు నిబ్బరం చేసుకొని ప్రస్తుత విషయానికొచ్చాను...

★ ★ ★

ఆయనా నేను మొదలు పెట్టిన వెంటనే... "ఈ విషయం నాకూ బాధగానే ఉంది. ప్రసాద్. అదివరకు ఏ cabinet secretary తోనూ ఇలా కాలేదు. ఏదో చిన్న చిన్న విషయాలలో విభేదాలు ఉండవచ్చు కాని, ఇలా రభస ఎప్పుడూ కాలేదు. ఏమైనా ఉంటే నాతో మాట్లాడవచ్చుగా. వెళ్ళి రామూతో (రామూ దామోదరన్) చెప్పాడు. ప్రధానితోనే నేరుగా విషయాలు చర్చించడం మొదలుపెట్టాడు. అంటే ప్రధానమంత్రి కార్యాలయంతో ప్రమేయం లేకుండా తానే చేసుకుపోవాలని ఉద్దేశ్యమా?... ఇది మంచి సంప్రదాయం కాదు. ప్రధానమంత్రికి ఏ విషయమైనా అన్ని

కోణాలనుంచి పరిశోధన జరిపి, విశ్లేషణతో ఆయన ముందుంచాలి. కొన్ని విషయాలలో అధికారికంగా cabinet secretary దగ్గరలేని సమాచారం మన దగ్గర ఉండవచ్చు. ఈ పరిస్థితులను అర్థం చేసుకోకుండా, అహంభావం మూలంగా, ఇంకా కొంత ఇతర కారణాల వల్లా ఇలా చేస్తున్నాడు. ప్రధానమంత్రే మనల్ని పరిశీలన చేయద్దంటే – అది వేరే విషయం కదా! ఏమైనా ఈ విషయంలో నువ్వే కల్పించుకుని cabinet secretary కి నచ్చజెప్పితే బాగుంటుంది. ప్రధానమంత్రితో ఇటువంటి విషయాలు మాట్లాడాలంటే అంత బాగుండదు. అయినప్పటికీ ఒకటి రెండుసార్లు ప్రస్తావిస్తే అంతగా స్పందించలేదు. ప్రధానమంత్రిగారే నీకు చెప్పారు కాబట్టి నువ్వు కలుగజేసుకుని దీన్ని సమన్వయపరిస్తే బాగుంటుంది..." ఇలా సాగింది.

విషయం సంగతి, పరిష్కారం సంగతి ఎట్లా ఉన్నా, వర్మగారు కోప్పడనందుకు 'బ్రతుకు జీవుడా' అని మనస్సు తేలికపడి... ప్రధానమంత్రి గారికే విషయాలు విపులంగా వివరిస్తానని హామీ ఇచ్చి బయటపడ్డాను.

బయటపడ్డాను కాని, సమస్య పరిష్కారం కాలేదు. పి.వి. గారు ఏమంటారో?

జరిగిందంతా ఎప్పటికప్పుడు ప్రధానిగారికి తెలియచేస్తూనే ఉన్నాను.

ఇదంతా ఆయన విని, "ఇద్దరినీ కూర్చోపెట్టి ఒకసారి మాట్లాడు... వారిద్దరూ ఒక అవగాహనకు వచ్చేట్లు చూడు. వస్తే ఊరుకో, లేకుంటే ముగ్గురం వెళ్ళి ప్రధానితో మాట్లాడదామని చెప్పు" అని సలహా ఇచ్చారు. ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల ఆలోచనా ధోరణుల్ని కాచివడపోసిన రాజనీతిజ్ఞుడు ఆయన.

అంతే, అలాగే చేశాను. ప్రధాని దాకా విషయాలు వెళ్ళాయని, ఆయన కొంచెం సీరియస్‌గా తీసుకున్నారని తెలియగానే, ఎవరికి వారు కొంచెం సర్దుబాటు చేసుకోవాలనే ధోరణికి వచ్చేశారు. ముగ్గురం కలిసి మాట్లాడటానికి ఇద్దరూ ఒప్పుకొని అలానే చేశారు.

దాదాపు అన్ని విషయాలలో అవగాహనకు వచ్చినా – రెండు మూడు అంశాలలో ఇంకా కొంత సంశయం. అయితే ముగ్గురం ఈ విషయంపై ప్రధానమంత్రితో చర్చిద్దామన్నాను. ఇద్దరూ ఒప్పుకోలేదు. ఈ విషయం పై చిన్న పిల్లల్లా ఆయన దగ్గరకు వెళ్ళటం బాగుండదు.

"నువ్వే ప్రధానమంత్రిగారితో మాట్లాడు, ఆయన ఎలా చేయమంటే అలా చేద్దాం. ఇక ముందు, ఇటువంటి సందర్భాలు వస్తే, మన ముగ్గురం కూర్చుని ఒక అవగాహనకు వచ్చి ప్రధానమంత్రి గారికి సలహాఇద్దాం" అన్నారు.

అదృష్టం బాగుండి, తర్వాత విషయాలు పెద్ద ఇబ్బంది లేకుండా పనులు జరిగిపోయాయి. ఆ తరువాత పి.వి.గారు ప్రధానమంత్రిగా ఉన్నంతకాలం వీళ్ళ భేదాభిప్రాయాలు బయటపడకుండా పరిపాలన సాగిపోయింది.

అయినా నా మనస్సులో సంశయం అలానే ఉండిపోయింది. అంతపెద్ద అధికారులతో మాట్లాడటానికి నాలాంటి చిన్న అధికారిని ప్రధాని ఎందుకు ఉపయోగించారు అని. ఉండలేక ఆయన్నే అడిగేశాను...

ఆయన చెప్పిన సమాధానం...!!!

"నువ్వు ఢిల్లీ వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు అవుతోంది కదా! నిన్ను ఎందుకు తెచ్చానో ఆ పని నీతో చేయించుకోవాలి కదా! ఢిల్లీలో పెద్ద, చిన్న ఆఫీసర్లని లెక్కలేదు. ఎవరు ప్రధానమంత్రికి దగ్గరివాళ్ళో, వాళ్ళే పెద్దవాళ్ళు. అదివరకు ప్రధానమంత్రుల దగ్గర టైపిస్టులు, స్టెనోగ్రాఫర్లు, పర్సనల్ అసిస్టెంట్లూ - ఎంత పెద్దవాళ్ళు కాలేదు! కారణం? వాళ్ళ గొప్పతనం కంటే ప్రధానికి వారు దగ్గరవారు కావటం. మేము దగ్గర అని చాలామంది చెప్పుకొంటారు. కొందరు నిజంగానే దగ్గరగా ఉంటారు. కాని తనకు ఎవరు దగ్గర అని ప్రధాని సంకేతాలు పంపితే వారే దగ్గరన్నది ఈ దర్బారులో అందరికీ తెలుసు. నీకు ఢిల్లీ విషయాలు తెలీవనే నిన్ను ఇక్కడకు తెచ్చాను. నీ సొంత లాభానికి మన సాన్నిహిత్యాన్ని నువ్ వాడుకోవని నా నమ్మకం. ఈ ఉద్యోగం మీద కానీ, అధికారం చెలాయించడంలో కానీ నీకు తాపత్రయం లేదని నా విశ్వాసం. దుర్వినియోగం చేసే వాడికి అధికారం చాలా అవకాశాన్నిస్తుంది. దానిమీద ఆశ గానీ, అలా వాడాలన్న తాపత్రయంగానీ లేనివాడికి అధికారం పెనుభారం మాత్రమే... నా బాధ కూడా అదే... ఇక ముందు ఇటువంటి విషయాలు నా తరఫున నువ్వే చాలా చేయాల్సి ఉంటుంది... ఆ సంకేతం పంపటానికే ఇదంతా..."

"అమ్మ - ప్రధానిగారూ"... అనుకున్నాను.

★ ★ ★

పి.వి. పై క్షుద్రపూజలు - సంజయ్‌గాంధి

నేను ప్రధానమంత్రి కార్యాలయంలో 1992 మేలో జాయింట్ సెక్రటరీ హోదాలో మీడియా సలహాదారుగా చేరాను. అప్పటికి పి.వి.నరసింహారావుగారు ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకుని పదిమాసాలు దాటింది.

నేను చేరిన కొన్ని మాసాల తరువాత ఉజ్జయిని మహంకాళి ఆలయం నుంచి కొందరు పండితులు ప్రధానమంత్రికివ్వాలని ప్రసాదం తీసుకొచ్చారు. ప్రధానిని కలుసుకోవడం దుస్సాధ్యం కావడంతో నన్ను కలిశారు.

వాళ్ళు చెప్పిన విషయం నన్ను సంభ్రమంలో ముంచేసింది.

"అయ్యా, వచ్చే నెలలో ఉజ్జయినిలో ఒక భారీ క్షుద్రపూజని ఎవరో తలపెట్టారు. ఆ పూజ లక్ష్యం – నరసింహారావుగారిని ప్రధానమంత్రి పదవినుంచి దించేయటం. ఇదే విషయం వారికి తెలియజేయాలని మా తాపత్రయం..."

క్షుద్రశక్తుల ఆరాధనకు ఉజ్జయినిలో కొందరు హేమాహేమీ స్వాములున్నారనీ, ఇలాంటి విషయాల్లో వారు విచక్షణారహితంగా వ్యవహరిస్తారనీ, అయితే పి.వి.గారి మంత్రివర్గంలోని వారో, ఆయన దిగిపోతే తాము లాభపడతామనుకునేవారో – ఎవరో పెద్ద వ్యక్తి ఈసారి ఈ క్షుద్రశక్తుల ఆరాధన చేయిస్తున్నారనీ, విషయం ఎలాగైనా ప్రధానికి చేరవేయాలన్నది తమ కోరిక అనీ చెప్పి వెళ్లిపోయారు ఆ పండితులు.

ప్రధానమంత్రిగా పి.వి. బలపడకూడదనీ, ఆయన దిగిపోతే ఆ స్థానం తమకు దక్కాలనీ ఆశించేవాళ్ళు ఎవరైవుంటారు? ప్రధానంగా అర్జున్‌సింగ్, ప్రణబ్ ముఖర్జీ, ఎం.ఎల్.ఫోతేదార్, బలరామ్ జక్కర్... ఇలా రకరకాల పేర్లు నా మనస్సులో మెదిలాయి. స్పష్టమైన ఆధారం లేకుండా ఫలానావాళ్ళే చేయిస్తున్నారని అనలేం. అయితే వీళ్ళల్లో ఎవరికి ఉజ్జయిని పండితులతో సంబంధాలుండే అవకాశాలున్నాయి?

...ఇలా ఆలోచించాక నా అనుమానానికి ఒక స్పష్టమైన రూపం వచ్చింది.

ఈ విషయంపై వివరంగా పి.వి.గారితో మాట్లాడటానికి రెండురోజులదాకా వీలుపడలేదు. మూడోరోజు రాత్రి ఆయన భోజనానికి వెళ్ళేముందు కలిశాను.

"ఒక అర్జెంటు విషయం వుంది..." అంటూ నసుగుతున్నాను. ఆయన తనతోపాటు నివాసానికి రమ్మన్నారు. ఆయన భోజనం చేసి, స్థిమితపడ్డాక, ఉజ్జయిని పండితులు చెప్పిందంతా చెప్పాను.

ఆయన పెద్ద పెట్టున ఒక నవ్వునవ్వి మొత్తం విషయాన్ని తేలిగ్గా కొట్టి పారేశారు.

"ఏమయ్యా ప్రసాదూ, నాకు ప్రధానమంత్రి పదవి ఎవరు ఏ శక్తులకి పూజ చేస్తే వచ్చిందయ్యా? ఇవాళ ఎవరో క్షుద్రపూజలు చేయిస్తే పోతుందా? అది పోయే రోజు వస్తే, నాకు అనుకూలంగా ఎవరెన్ని పూజలు చేస్తే మాత్రం ఆగుతుందా...." ఇలా వేదాంతం చెప్పసాగారు.

"అంటే సర్, మీరు ఈ పూజల్నే నమ్మరా? లేక ఎవరో చేయిస్తున్నారన్నది నమ్మరా?..."

"పూజల ప్రభావం గురించి నాకు తెలీదయ్యా. ఉజ్జయిని పండితులు చెప్పింది నిజం కాదని మాత్రం అనలేను. ఎందుకంటే ఇలాంటివి ఢిల్లీ రాజకీయాలలో సహజం. చాలామంది నాయకుల కోసం ఇలాంటి పూజలు చేసే వాళ్ళు ఇక్కడ సిద్ధంగా వుంటారు. నెహ్రూగారు నమ్మేవారో లేదో తెలీదు కాని ఆయన కూతురు నమ్మేది. ఆమె దగ్గర కొంతమంది మంత్రులు కూడా బాగా నమ్మేవారు. నీకు గుర్తుందో లేదో, నువ్వు తిరుపతిలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వున్నప్పుడు ఒక కాశ్మీరీ పండితుణ్ణి 'వివిఐపి'గా చెప్పి నీ దగ్గరకు పంపించాను..."

"జ్ఞాపకం వుంది సర్. ఆయన ఆ తరువాత కూడా చాలాసార్లు వచ్చి ఇందిరాగాంధీ తరపున శ్రీనివాసుడిదగ్గర పూజలు జరిపించి ప్రసాదం తీసుకెళ్ళేవారు..."

"ఆయనంటే ఇందిరాగాంధీకి బాగా నమ్మకం. ఆవిడకోసం ఆయన హోమాలు, యాగాలు, పూజలు చేయిస్తూ వుండేవాడు. మనకి దక్షిణాదిలో కన్నా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, హిమాచల్ ప్రాంతాల్లో ఈ రకమైన క్షుద్రపూజల మీద విశ్వాసం ఎక్కువ. చాలామంది పండితుల కుటుంబాల్ని ఢిల్లీ రాజకీయాలే పోషిస్తుంటాయి...."

ఆయన అసలు విషయం వదిలేసి, ఏదో స్టూడెంట్‌కి పాఠం చెప్పినట్లు చెబుతున్నారు. నాకు లోలోపల అసహనంగా వుంది. ఈయన మంచి కోరి చెబుతుంటే ఆ విషయం మాట్లాడరేమిటి?

ఆయన ఎక్కడో ఆపీ ఆపగానే నేను అందుకున్నాను.

"సర్, మనం కూడా ఏమన్నా చేద్దాం సర్."

"ఏమిటీ, క్షుద్రపూజలా?" ఆయన నావంక నమ్మలేనట్లుగా చూశారు. బహుశా తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా చేసిన ప్రసాదేమిటి, ఇలా క్షుద్రపూజ లంటున్నాడేమిటి? – అని ఆయనకి విస్మయం కలిగించవచ్చు.

నేను కంగారుపడ్డాను. "అహహ, అది కాదు సర్. వాళ్ళు చేసే క్షుద్రపూజలని నిర్వీర్యం చేయించే సాత్త్విక పూజలేమైనా చేయిస్తే మంచిదిగదా అని... మీ ఇష్టం. మీరెలా చెబితే అలా సర్..."

ప్రధానమంత్రి ఎంత చనువిస్తున్నట్లు కనుపించినా, అతి చనువు తీసుకొనే ప్రయత్నం చేయదల్చుకోలేదు. మనం చెప్పదల్చుకున్నదేదో సూచనప్రాయంగా అందిస్తే చాలు, మన అంతర్యం

మొత్తాన్ని క్షణాల్లో చదివేయగల సూక్ష్మగ్రాహి పి.వి.గారు. పైగా ఇది చాలా సున్నితమైన విషయం అనిపించింది. అందుకే ఆచితూచి మాట్లాడాను.

పి.వి. గారు కొంతసేపు మాట్లాడలేరు. నేనూ మాట్లాడలేదు. చివరికి ఆయనే నోరు విప్పారు.

"ప్రసాద్, గతంలో ఇలాంటివాటిని నేనెప్పుడూ చేయించలేదు. ముగ్గురు నలుగురు మంత్రులు నా దగ్గరకు వచ్చి ఇలాంటి పూజలేవో చేయిస్తామంటే నేను ఉత్సాహం చూపించలేదు. చివరికి 'మీ పేరున మేమే చేస్తాంలెండి' అన్నారు. 'నన్నొచ్చి కూర్చోమనకుండా వుంటే చాలు, మీ నమ్మకం కొద్దీ మీరేం చేసుకున్నా సరే' అని చెప్పి పంపించాను."

"అంటే, మీకు అసలు విశ్వాసం లేదా సర్?"

"పూజలు పునస్కారాల మీద విశ్వాసం లేక కాదు ప్రసాద్. వేదవిద్యల మీద నాకు అపారమైన నమ్మకం. కాని మనకి నమ్మకం వుందని నలుగురికీ తెలిస్తే, ముఖ్యంగా మనం కీలకమైన పదవులలో వున్నప్పుడు, ఈ విశ్వాసాన్నే మన బలహీనతగా భావించి రకరకాల వాళ్ళు మనచుట్టూ చేరతారు. దానివలన మనకెంత లాభం జరుగుతుందో తెలీదుకాని వాళ్ళు మాత్రం ఖచ్చితంగా లాభపడతారు... అంతెందుకు! చంద్రస్వామిని అన్ని పార్టీల నాయకులు చేరదీస్తుంటారు, ఎందుకంటావ్? ఇదే సేవ చేస్తుంటాడు కాబట్టే..."

కొంచెం ధైర్యం వచ్చింది నాకు. "పోనీ మీ తరపున ఆయనేమైనా చేస్తున్నాడంటారా?"

"నేను చేయమని అడగలేదు, తను చేస్తానన్నా ప్రోత్సహించలేదు. నామీద అతనికి ఆ అసంతృప్తి వుంది. హైదరాబాద్‌లో నేను మంత్రిగా వున్నప్పట్నుంచీ తెలిసినా ఇలాంటి వాటి విషయంలో ఎప్పుడూ ప్రోత్సహించలేదు. కావలసిన వాళ్ళు చేయించుకొంటారు. చాలా ఖరీదైన స్వామి కూడా. డబ్బుల్లేకుండా ఏ పూజా ఎవరికీ చేయడు... ఆ మధ్య ఒకసారి కలిసి, 'మీరేం ఖర్చుపెట్టక్కర్లేదు, మీరు సరేనంటే మీ తరఫున ఖర్చుపెట్టేవాళ్ళని నేను చూసుకుంటాను' అన్నాడు. నాకు ఇష్టం లేదు. అతనికి చనువిస్తే ఎక్కడిదాకా వెళ్తుందో తెలీదు. ముందు ప్రచారం మాత్రం బాగా జరుగుతుంది. ...అయినా ప్రసాద్, పూజలు, హోమాలు, యాగాలు ఎన్నో చేయించి కూడా ఇందిరాగాంధీ ఎన్నికల్లో ఓడిపోయిన విషయం మనం మర్చిపోకూడదయ్యా..."

ఆయన నాకో మంచి సందేశం ఇచ్చాననుకుని, అక్కడితో ముగించి లేవబోయారు.

నేను ఉండబట్టలేక ఒకమాట జారాను.

"కాని, ఈ రకమైన ఉపాసనలు పనిచేస్తాయా లేదా అంటే సంజయ్‌గాంధి విషయం కూడా చూడాలి సర్."

ఆయన టక్కున ఆగిపోయారు. లేవబోయిన వ్యక్తి మళ్ళీ కూర్చుండిపోయారు.

"ఏమిటన్నావ్, మళ్ళీ చెప్పు" అన్నారు.

నేను తడుముకోలేదు. "అంటే, అదొక్కటేకాదు, మరొకటి కూడా జరిగింది" అన్నాను.

"సరే, రెండూ చెప్పు" అంటూ ప్రధాని ఉత్సుకత ప్రదర్శించటంతో ఆ రెండింటినీ ఏకధాటిగా 3-4 నిమిషాల్లో చెప్పేశాను. అసలు జరిగిందేమిటంటే...

★ ★ ★

హైదరాబాద్‌లో ఉప్పులూరి గణపతిశాస్త్రి అనే వేద పండితులుండేవారు. ఆయన 48 సంవత్సరాలపాటు నిర్విరామంగా వేదాధ్యయనం చేసి వేదాలను ఉపవేదాలను ఔపోసన పట్టినవాడు. నేను తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వుండగా, ఆయన్ని టీ.టీ.డికి ఆస్థానవిద్వాంసుడిగానూ, వేదశాస్త్ర సంరక్షణ పథకాలకు సలహాదారునిగానూ నియమించాం.

నేను టీటీడిలో వుండగా ఒక సంవత్సరం తిరుపతి తిరుమల ప్రాంతమంతా విపరీతమైన వర్షాభావం ఏర్పడింది. అప్పటికి తిరుమలకి మంచినీరు సరఫరా జరిగేది ఒక్క గోగర్భం డ్యామ్ నుంచే. ఆ డ్యామ్ కాస్తా ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. కొండమీద నీటికి కటకట పెరిగిపోయింది. దాంతో ఆవేసవిలో భక్తుల్ని తిరుపతి యాత్ర వాయిదా వేసుకోమని అడగాల్సినంత ఘోరమైన స్థితి వచ్చేసింది. దిక్కు తోచక నేను వెళ్ళి గణపతిశాస్త్రిగారిని సంప్రదించాను. "వేదాలలో పరిష్కారం వుందా?" అని అడిగాను.

"నిష్ఠతో నిష్ణాతులైన పండితులు వేదాల్లో చెప్పబడిన విధంగా జపాలుచేస్తే వర్షాలు కురుస్తాయి" అన్నారు.

ఆయన ఎలా చెప్పారో అలా పూర్తిగా ఆయన మార్గదర్శకత్వంలో నియమనిబద్ధతలతో జపాలుచేసే ఋత్విక్కుల్ని పిలిపించి, తిరుమల కొండమీద వరుణజపం చేయించాను. అందర్నీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతూ, వరుణజపం చివరి దశలో వుండగా తిరుమల కొండమీద కుండపోతగా వర్షం కురిసింది, గోగర్భం డ్యామ్ నిండిపోయింది! విచిత్రంగా, తిరుమల కొండ క్రిందగానీ, చుట్టుప్రక్కలగానీ ఒక్క చుక్కవర్షం పడలేదు!!

గణపతిశాస్త్రిగారితో రెండవ అనుభవం సంజయ్‌గాంధీకి సంబంధించింది. ఇది ఇంకా దిగ్భ్రాంతి కలిగించింది.

వరుణజపం వల్ల గణపతిశాస్త్రిగారితో సాన్నిహిత్యం పెరిగింది. అప్పుడే గమనించాను – ఆయనంటే ముఖ్యమంత్రి మర్రిచెన్నారెడ్డిగారికి కూడా చాలా గౌరవం. గణపతిశాస్త్రిగారి విద్వత్‌మీద చెన్నారెడ్డిగారికి చాలా గురి కూడా. రెండుమూడు మాసాల కొకసారైనా ఆయనే స్వయంగా వెళ్ళి గణపతిశాస్త్రిగారిని కలుస్తూండేవారు. అప్పుడప్పుడు చెన్నారెడ్డిగారి కోరిక మేరకు రాష్ట్రంకోసం హోమాలు, జపాలు చేస్తున్నట్లు కూడా శాస్త్రిగారు చెప్పేవారు.

ఒకసారి ఇందిరాగాంధీకి, చెన్నారెడ్డికి మధ్య విభేదాలు పొడసూపాయనీ, ఆయన పదవీచ్యుతుడవుతాడనీ ప్రచారం జరిగింది. ఆ సమయంలోనే చెన్నారెడ్డిగారు హడావుడిగా

తిరుమలకి వచ్చి దాదాపు వారం రోజులు కొండమీదే వుండిపోయారు. ఏమైందో ఏమోగానీ, ఆయన పదవిపోలేదు. నిలిచింది...

ఈ సంఘటన జరిగిన కొన్ని వారాలకి ఏదో పనిమీద నేను శాస్త్రిగారిని కలిశాను. అప్పుడు ఆయనే బైటపెట్టారు– "చెన్నారెడ్డిగారికి క్రిందటిసారి పదవీగండం ఏర్పడింది. అందుకే ఆయన్ని తిరుమల వెళ్ళివుండమని చెప్పి, నేనిక్కడ శాంతిహోమం చేయించాను. గండకాలం ముగిసేదాకా ఆయన తిరుమలలో శ్రీనివాసుడి సన్నిధిలో భద్రంగా వున్నారు."

94 ఏళ్ళ గణపతిశాస్త్రిగారి ముఖంలో వర్చస్సు, గాంభీర్యం, తపోనిష్ఠవల్ల సమకూరిన దైవికబలం తాలూకు ఏకాగ్రత కొట్టొచ్చినట్లు కనుపిస్తాయి. ఆయన చెబుతున్నది వింటూంటే నమ్మాలో లేదో తెలీలేదు.

"ఇప్పుడిక పదవీ గండం తప్పిపోయినట్లేనా?" అని అడిగాను.

"అప్పుడు తప్పిపోయింది. కాని ఇప్పుడు మళ్ళీ గండం వుంది. ఇప్పుడు తప్పించుకోగలరో లేదో చూడాలి. నేను నా జీవితంలో ఇప్పటివరకూ ఎవరినైనా కాపాడటం కోసం మాత్రమే జపాలు, హోమాలు చేశాను. కాని ఎవరిమీదా ప్రయోగాలు చేయలేదు. శాస్త్రాల్లో అలాంటి ప్రక్రియలూ వున్నాయి. ఇప్పుడు చెన్నారెడ్డిగారికి ప్రతిబంధకం ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్‌గాంధీ నుంచి వస్తోంది. చెన్నారెడ్డిగారిని తొలగించేవరకూ అతను నిద్రపోయేట్లు లేడు. సంజయ్‌గాంధీని ప్రసన్నంచేసుకునే స్థితి దాటిపోయింది ఆయనకి. మన వైపునుంచి చూస్తే వేదరక్షణకి, శాస్త్ర రక్షణకి చెన్నారెడ్డిగారిచ్చిన ప్రోత్సాహం అంతా ఇంతాకాదు. దేవాలయాలన్నా, పండితులన్నా, సంప్రదాయమన్నా ప్రాణమిచ్చే వ్యక్తి, అందుకే ఆయన్ని కాపాడుకోవటం నా బాధ్యత అనుకుంటున్నాను. ఆ విశ్వాసంతోనే ఇప్పుడొక బృహత్తర హోమం మొదలుపెట్టాను. అది గాని ఎలాంటి విఘ్నం లేకుండా పరిసమాప్తి అయితే సంజయ్‌గాంధీనుంచి చెన్నారెడ్డిగారికి ఇక ఎప్పటికీ ఎలాంటి అవరోధం వుండదు..."

ఇలా చెప్పుకుంటూవెళ్ళారు శాస్త్రిగారు.

వరుణజపం వల్ల తిరుమలలో వర్షాలైతే కురిశాయిగానీ, సంజయ్‌గాంధీనుంచి చెన్నారెడ్డిని కాపాడటానికి హోమాలు, ప్రయోగాలు పనిచేస్తాయా? నేను నమ్మలేదు.

నా అపనమ్మకం చూసి, శాస్త్రిగారు నవ్వారు. "పదిరోజులు పోయాక మాట్లాడుకుందాం" అన్నారు. అయినా నాకు నమ్మకం కలగలేదు.

కాని–

శాస్త్రిగారితో నేను ఈ సంభాషణ జరిపిన పదోరోజున ఢిల్లీలో విమాన ప్రమాదంలో సంజయ్‌గాంధీ మరణించాడు!!

★ ★ ★

...ఇలా నాకు తెలిసిన రెండు అనుభవాల్ని పి.వి.గారికి వివరించాను. వివరిస్తూ, "సంజయ్‌గాంధీకి సంబంధించి ఈ విషయం నేను ఇంతవరకూ చెప్పింది మీ ఒక్కరికే సర్" అంటూ ముగించాను.

ఆయన కూడా సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు. "గణపతిశాస్త్రిగారి గురించీ తెలుసు, చెన్నారెడ్డిగారికీ ఆయనకీ గల సాన్నిహిత్యం గురించీ తెలుసు. కానీ, ఇప్పుడు నువ్వు చెప్పింది మాత్రం ఒక సంచలనమేనయ్యా" అన్నారు.

అప్పుడు మళ్ళీ ఉజ్జయిని పండితులు చెప్పిన విషయాలు ఎత్తాను. "మీరు దిగిపోవాలని కోరుకునే వాళ్ళున్నారా సర్?"

"వున్నారయ్యా - ముగ్గురు నలుగురున్నారు. ఇటువంటి ప్రయోగాలు వాళ్ళకేం కొత్త కాదు..."

"కాబట్టి సర్, మన జాగ్రత్తలో మనం వుండాలి. మనం ఎవరికీ అపకారం చేయద్దు. కాని అసాధారణమైన సంస్కరణలు తీసుకొస్తున్న మిమ్మల్ని మేం కాపాడుకోవాలి. ఈ దేశంకోసమైనా కాపాడుకోవాలి... మీరింకేమీ చెప్పకండి. సాత్త్విక పూజలు, హోమాలూ చేసేవాళ్ళున్నారు. నేను ఏర్పాటుచేస్తాను... పార్టీ తరఫున కోట్లు ఖర్చుపెడుతున్నాం. అందులోంచే కొంత దీనికీ పెడదాం. పదిమంది పండితుల్ని పోషించాం అనుకోండి..."

పి.వి.గారు కొంచెం మెత్తబడ్డారు. "ఢిల్లీలో అనవసర ప్రచారం ఎక్కువగా జరుగుతుందయ్యా..."

"సర్, టి.టి.డిలో పనిచేయటం వల్ల నాకు ఎక్కడెక్కడి పండితులతోనూ పరిచయాలున్నాయి. ఢిల్లీలో కాకుండా దక్షిణాదిన ఎక్కడో మారుమూల చేయిస్తాను. మీరు రానక్కర్లేదు. అవసరమైతే నేను వెళ్తాను. లేదంటే అదీ లేదు. ఖర్చుమాత్రం మీరు ఏర్పాటు చేయాలి..."

నా ఉత్సాహాన్నీ ఊపునీ ఆయన గట్టిగా కాదనలేకపోయారు. ఆయనేం చెప్పినా నేనింక వినే స్థితిలో లేనని అర్థం చేసుకున్నారు. అయిష్టంగా తలూపేసి లోపలికెళ్ళిపోయారు.

ఆ తరువాత పి.వి.గారి మైనారిటీ ప్రభుత్వం పార్లమెంటులో విశ్వాసపరీక్ష నెదుర్కొనే ముందే మొదటి హోమం జరిగింది... ఆయన ప్రభుత్వం విశ్వాసపరీక్షలో నెగ్గింది.

ఆనక అలాంటి ప్రయోగాలు చాలా జరిగాయి. పి.వి.గారు అయిదేళ్ళూ పదవిలో గడిపిన తొలి 'నెహ్రూ కుటుంబేతర' ప్రధానమంత్రిగా చరిత్రలో నిల్చిపోయారు.

* * *

వై.యస్.గురించి పి.వి.చెప్పిన 'రహస్యం'

1994లో ప్రధానమంత్రి పాల్గొన్న కడప బహిరంగసభలో రసాభాస జరిగింది. ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి లక్ష్యంగా కొందరు కార్యకర్తలు స్టేజిమీదకి చెప్పులు విసిరారు. కేకలు - అరుపులు - పోలీసులు- హడావుడి...

ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుగారి వెంట ఆ సభకు నేనూ వెళ్ళాను. కాని చెప్పులు విసిరే సంఘటన జరిగినప్పుడు దూరంగా వుండి పోవటంతో జరిగిందేమిటో తెలుసుకోడానికి సమయం పట్టింది.

నంద్యాల నుంచి హైదరాబాద్ మీదుగా ప్రధానమంత్రి ఢిల్లీ వెళ్ళాలి... హైదరాబాద్ వచ్చేశాం. ముఖ్యమంత్రి విజయభాస్కరరెడ్డి గారు ప్రధానమంత్రిని కలిసి చెప్పేశారు. "ఇదంతా వై.యస్. రాజశేఖరరెడ్డి చేయించాడు. నామీద ఎంత ద్వేషం ఉంటే మాత్రం ప్రధానమంత్రి వున్న వేదిక మీదకి చెప్పులు వేయిస్తాడా? ఈ సంగతి అటో ఇటో తేలిపోవాలి. మీరు తక్షణం అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయండి" అంటూ డిమాండు చేశారు. వ్యూహం ప్రకారం ఒకరిద్దరు విజయభాస్కరరెడ్డి అనుయాయులు కూడా ప్రధానమంత్రిని కలిసి ఇదే చెప్పారు. ఆయన విని వాళ్ళదగ్గర మాత్రం క్లుప్తంగా స్పందించారు : "ఇదంతా భాస్కరరెడ్డి చేతులారా చేసుకున్నదే కదా!"

ఈ సమాచారం తిరిగి విజయభాస్కరరెడ్డిగారిని చేరింది. ఆయనకి ఆగ్రహం పెల్లుబికింది. తనకు జరిగిన అవమానానికి ప్రధానమంత్రి పి.వి.గారి స్పందన సముచితంగా లేదని ఆవేదన చెందారు. ఆ ఆవేదన పెరిగి పెరిగి ఎంతవరకూ వెళ్ళిందంటే - "రాజశేఖరరెడ్డిని సస్పెండ్ చేస్తారా? నన్ను రాజీనామా చేయమంటారా?" అని ప్రధానమంత్రికి భాస్కరరెడ్డి తుది హెచ్చరికని తన దూతల ద్వారా పంపారు.

కాంగ్రెసు ప్రభుత్వాలకి చాలా ఎక్కువ సందర్భాలలో పార్టీ అధ్యక్షులూ, ప్రధానమంత్రీ ఒకరే కావటం వల్ల పార్టీ పరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవటం కూడా ప్రధాని చేతుల్లోనే వుంటుంది. ప్రధానమంత్రి ఆ రాత్రి ఢిల్లీ బయల్దేరేముందు వరకూ భాస్కరరెడ్డిగారి హెచ్చరికని ఆయన అనుయాయులు పి.వి.గారికి మోస్తూనే వున్నారు.

బేగంపేటలో ఢిల్లీకి విమానం ఎక్కబోయే ముందు పి.వి.గారు నన్ను ఒక పక్కకి పిలిచారు. "ప్రసాద్, నువ్వు ఇప్పుడు నాతో రావద్దు. ఈ రాత్రికి ఇక్కడే వుండిపో. నేను ఒక పని చెప్తాను. అది పూర్తి చేసి, రేపు ఢిల్లీకి రా" అన్నారు.

అప్పుడు ప్రధానమంత్రి నేను ఏం చేయాలో చెప్పారు. చెప్పి విమానం ఎక్కేశారు.

అసలు జరిగిందేమిటంటే...

★ ★ ★

1992 చివర్లో... ముఖ్యమంత్రిగా వున్న నేదురుమల్లి జనార్ధనరెడ్డిని ఇంజనీరింగ్ కాలేజిల కేటాయింపు విషయంలో న్యాయస్థానం అభిశంసించింది. కాంగ్రెసు ప్రభుత్వానికి ఇది మచ్చ తీసుకువస్తోందని పి.వి. భావించారు. జనార్ధనరెడ్డి రాజీనామా చేయకతప్పలేదు.

తరువాత ముఖ్యమంత్రిగా ఎవర్ని నియమించాలీ అన్న ప్రశ్న ఉత్పన్నమైంది. ఢిల్లీనుంచి కాంగ్రెస్ శాసనసభాపక్షం అభిప్రాయం తెలుసుకోవటం కోసం ఒక కమిటీని పంపటం రివాజు. కాని చివరికి ముఖ్యమంత్రిని ఎంపికచేసేది మాత్రం పార్టీ అధ్యక్షుడే.

పి.వి.గారి మనస్తత్వం అందరికీ తెలుసు. అదేమిటంటే ఆయన మనసులో ఏముందో ఒక పట్టాన ఎవరికీ చెప్పరు. కమిటీని హైదరాబాద్ పంపిస్తే అక్కడ ముఖ్యమంత్రి కావాలని తహతహలాడుతున్న వాళ్ళంతా వాళ్ళ వాళ్ళ అనుయాయుల ద్వారా తమ తమ 'శక్తి'ని ప్రదర్శించారు. ఈ ఎంపిక ప్రక్రియని అంత త్వరగా ముగించేందుకు పార్టీ అధ్యక్షుడికి వ్యవధి చిక్కటంలేదు. లేదా వ్యవధి లేనట్లుగా కనుపిస్తున్నారు! ఇదొక రాజకీయ చతురత. ఆలోచించు కోడానికి సమయం చాలకపోతే కూడా బిజీగా వున్నట్లుగా కనుపిస్తారు.

ఆ రోజుల్లోనే ఒకరోజు ఉదయం నేను ఆఫీసుకి వెళ్ళేందుకు తయారవుతున్నప్పుడు జర్నలిస్టు మిత్రుడు వల్లీశ్వర్ మా ఇంటికి వచ్చాడు. ఎప్పుడు నన్ను కలిసినా వృత్తిపరమైన విషయాలు మాత్రమే మాట్లాడే అలవాటున్న వల్లీశ్వర్ ఆ రోజుమాత్రం కొంచెం రాజకీయాలు మాట్లాడాడు.

"వై.యస్.రాజశేఖరరెడ్డి మిమ్మల్ని కలవాలనుకుంటున్నారు. మీకు వీలుగా వుండే టైమ్ చెబితే..."

నేను ఆసక్తి చూపించలేదు. సందర్భం ఏమిటో తెలుస్తోంది కాబట్టి రాజశేఖరరెడ్డి నన్ను ఎందుకు కలవాలనుకుంటున్నాడో కూడా ఊహించాను. "ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారు. అంతేనా?" అవతలివాళ్ళు పూర్తి చేయకముందే మిగతాది ఊహించి మాట్లాడటం నా అలవాటు కదా!

నేను వల్లీశ్వర్‌కి స్పష్టంగా ఒక విషయం చెప్పాను. "ఈ ముఖ్యమంత్రుల ఎంపిక వ్యవహారం పూర్తిగా రాజకీయం కదా! ఇందులో నేనెందుకు తలదూర్చటం? ఇంతవరకూ ఇలాంటి బాధ్యత ఏదీ నాకు పి.ఎం.గారు అప్పగించలేదు. రాజశేఖరరెడ్డి మెహర్బానీ కోసం కల్పించుకొని మాట్లాడి, లబ్ధిపొందాలన్న తాపత్రయం నాకు లేదు. నీకూ లేదనే అనుకుంటున్నాను."

"మీరన్నది నిజమే. కాని, పి.ఎం. ఆఫీసులో ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలు చూసే ఎ.వి.ఆర్. కృష్ణమూర్తిని భాస్కరరెడ్డి మేనేజ్ చేసినట్లున్నారు. పి.ఎం.కి వై.యస్. తన వాదన పూర్తిగా వినిపించాలంటే మీరొక్కరే సరైన మార్గం అనుకున్నారేమో, ఈ విషయంలో ఆయన నా సాయం కోరితేనే వచ్చాను. ఏమైనా ఇప్పుడున్న రాజకీయ వాతావరణం కూడా మీకు తెలుసు. రాజశేఖరరెడ్డికి ముఖ్యమంత్రి కాదగిన సత్తా వుండీ, తగినంత మద్దతు వుండి కూడా, ఆయన్ని రానీయకుండా అడ్డంపడాలని చూసే శక్తులు అడ్డుపడుతూనే వున్నాయి. ఎవరు ముఖ్యమంత్రి అవుతారూ అన్నది ప్రక్కన బెడితే, ఆయన పి.ఎం. గారికి చెప్పుకోలేని విషయాలు మీరు విని, మీకు ఇష్టమైతేనే పి.వి.గారికి చెప్పండి. లేదంటే అదేమాట వై.యస్.కి చెప్పండి. ఆయనొచ్చి మిమ్మల్ని కలిసినంత మాత్రానికే మీరు సి.ఎం. ఎంపికలో జోక్యం చేసుకున్నట్లయి పోదుకదా!..." అలా వల్లీశ్వర్ నాకు నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు.

నిజానికి అప్పటికే ఉత్తరాంధ్ర ఎం.పిలు ద్రోణంరాజు సత్యనారాయణ, కొణతాల రామకృష్ణ, కణితి విశ్వనాథం నా దగ్గరకు వచ్చి వై.యస్ అభ్యర్థిత్వం గురించి మాట్లాడారు. ఈ రాజకీయ ఎంపికలో నేను కల్పించుకోనని వాళ్ళకి ఖండితంగా చెప్పేసివున్నాను కూడా. కాని వల్లీశ్వర్ చెప్పింది విన్నాక కాదనలేకపోయాను. "సరే, ఆయన్ని రమ్మను" అన్నాను.

అన్నానుకానీ, ఒక ఐఏఎస్ అధికారిగా, ప్రధానమంత్రికి సంయుక్త కార్యదర్శిగా ముఖ్యమంత్రుల ఎంపిక గురించి పి.ఎం దగ్గర నాకుగా నేను మాట్లాడటం ఉచితంకాదు. అలాంటప్పుడు వై.యస్. వచ్చి నాతో మాట్లాడితేమాత్రం ఆయనకేం ఉపయోగం వుంటుంది? ఆయనకేమీ ప్రయోజనం వుండదని తెలిసీ నేను ఆయన్ని రావచ్చని అంటున్నానంటే లేనిపోని ఆశ కల్పిస్తున్నట్లే కదా? ... ఇది న్యాయం కాదనిపించింది. బాగా ఆలోచించి, ఆ మధ్యాహ్నం పి.ఎం. గారు భోజనానికి వెళ్ళబోయేముందు కలిసి చెప్పాను. "వై.యస్ నన్ను కలుస్తానంటున్నారు సర్."

రాజనీతిజ్ఞుడు కదా, ఆయన క్షణాల్లో నా మనసు చదివేశారు. "తప్పులేదు ప్రసాద్. వచ్చి మాట్లాడనీ. అతను చెప్పిందంతా విను. మనం మళ్ళీ మాట్లాడదాం." పి.వి.గారి స్పందన ఇది.

వై.యస్. నన్ను కలిశారు. చాలా విషయాలు సుదీర్ఘంగా మాట్లాడారు. ఆయన అభ్యర్థిత్వం పట్ల సానుభూతి కలిగే విధంగా ఆయన తన కేసు వివరించారు. అంతావిని "ఊ" కొట్టాను. అంతకుమించి ఆయనకెలాంటి హామీని ఇవ్వలేనుగదా! కాని అంతా అయ్యాక, పి.వి.గారితో ఏకాంతంగా 10-15 నిమిషాలు మాట్లాడే అవకాశం కల్పించాలని అడిగారు. నేను పి.ఎం.ని అడిగి చెబుతానన్నాను. ఆ రాత్రే జరిగిందంతా పి.ఎం.గారికి చెప్పాను. "నాకెందుకో మీరొకసారి వై.యస్‌తో మాట్లాడితే మంచిదనిపిస్తోంది సర్" అంటూ నా మనసులో మాట బయటపెట్టాను. ఎలాంటి చర్చలేకుండానే ఆయన "సరే, రమ్మను" అన్నారు. మర్నాడు వై.యస్. వచ్చి పి.వి.గారిని కలిశారు. ముఖాముఖీ తాను చెప్పదల్చుకున్నవన్నీ ఆయనకి వివరించారు. తనకు గల శాసనసభ్యుల మద్దతూ, తెలుగుదేశం పార్టీని ఎదుర్కోటానికి తన వ్యూహం... ఇలాంటివన్నీ.

ఆయన అప్పటికే విజయభాస్కరరెడ్డిగారిని కూడా కలిశారు. భాస్కరరెడ్డి కూడా తనకేమీ ముఖ్యమంత్రి పదవి మీద ఆశలేరనీ, వై.యస్. అభ్యర్థిత్వం ప్రతిపాదన వస్తే తాను అడ్డుపడబోననీ కూడా చెప్పారట. ఈ విషయంకూడా వై.యస్. చెప్పారు. ఏమైనా మరో వారం రోజులపాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంపిక విషయంలో స్తబ్ధత అలాగే కొనసాగింది.

ఒక రోజు రాత్రి నేను ఇంటికి వెళ్ళబోయే ముందు పి.ఎం.గారిని వారి బంగళాలో కలిశాను. ఆయన ఒక్కరే తన గదిలో దీర్ఘాలోచనలో మునిగివున్నారు. నన్ను చూస్తూనే ఆయన తనలో తాను మాట్లాడుకుంటున్నట్టుగా మాట్లాడటం ఆరంభించారు.

"...ఇంకో రెండేళ్ళలో జరగబోయే ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం పార్టీ మీద కాంగ్రెసు పార్టీ గెలవాలంటే ఒక మంచి నాయకుడు కావాలి. ఫలానా గ్రూపువాడు అనే ముద్ర లేకుండా ఉండి, అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే పెద్దమనిషి అయి ఉండాలి. అనుభవజ్ఞుడయి ఉండాలి... భాస్కరరెడ్డి సీనియరూ, అనుభవం గలవాడే గాని, ముఠా రాజకీయాల నుంచి పైకి ఎదగలేకపోయాడు. ఒకసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేశాడు. ఇప్పుడు కేంద్రమంత్రిగా ఉన్నాడు. అయినా ఇంకా రాయలసీమ - కర్నూలు జిల్లా ముఠా లీడర్‌గానే ఆలోచిస్తున్నాడు..."

ఆయన అలా రాష్ట్ర రాజకీయాల గురించి, భాస్కర రెడ్డిగారి గురించి మాట్లాడుతూ మాట్లాడుతూ ఆకస్మాత్తుగా ఆపేసి నావంక తిరిగి అడిగారు. "ఏమనుకుంటున్నారయ్యా అంతా? నువ్వేమైనా వింటున్నావా?" నేను విన్న విషయాలు చెప్పాను.

"కాంగ్రెస్ శాసన సభ్యులు అందరూ కలిసి ఏ ఒక్కరి నాయకత్వాన్నీ సమర్థించటంలేదు సర్. కానీ, గణనీయమైన సంఖ్యలో రాజశేఖరరెడ్డికి మద్దతు ఉన్నట్లు కనుపిస్తోంది... ఈయన వెళ్ళి కలిసినప్పుడు తాను అడ్డు పడబోనని భాస్కర్‌రెడ్డిగారు చెప్పారన్నారు కదా. కాని వాస్తవంలో భాస్కరరెడ్డిగారి వర్గీయులు, జనార్దనరెడ్డిగారి వర్గీయులు వై.యస్. అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు..."

"...రాజశేఖరరెడ్డిని వాళ్ళు వ్యతిరేకించడంలో అసహజం లేదు ప్రసాద్. అతను ఆవేశపరుడు. ప్రతిదానికీ బాహాటంగా ప్రతిస్పందించే తత్త్వం. రాజకీయాల్లో మనం పచ్చినిజమే మాట్లాడుతున్నామని అనుకున్నా అనేక సందర్భాలలో నిజం కూడా మాట్లాడకుండా ఉండటం, మనసులో మండుతున్నా ప్రతిస్పందిస్తున్నట్లు కనుపించకుండా ఉండటం చాలా అవసరం... రాజశేఖరరెడ్డికి నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి కానీ, ముఖ్యమంత్రి అవటానికి అతని రాజకీయ పరిణతి సరిపోదు... నా దృష్టిలో అతనికి ఆ రాజకీయ పరిణతి రావడానికి మరో పదేళ్ళు పడుతుంది..."

"... సర్, మీరు ఏమీ అనుకోనంటే నా మనసుకి తోచిన కొన్ని విషయాలు చెబుతాను. మీ పార్టీలో అనుభవజ్ఞులు అని చెప్పబడుతున్న చాలా మంది సీనియర్లలో ప్రజలతో సంబంధాలు వదులుకొన్న వాళ్ళు, అధికారం లేకుండా బ్రతకలేనివాళ్ళు తయారయ్యారు... పార్టీలో అంతర్గతంగా

ఎన్నికలు జరగకపోవడం వల్ల నిజంగా ప్రజలను స్పందింప చేయగలిగి, ఉత్తేజపరచగలిగి, స్థానికంగా తమ తమ ప్రాంతాల్లో బలమైన రాజకీయ పునాదులు ఉన్నవాళ్ళు చాలామంది అధికారానికి దూరంగా ఉండిపోయారు... రాష్ట్రంలో ఇప్పుడున్న పార్టీల్లో తెలుగుదేశం పార్టీ యువతకి ప్రాధాన్యత ఇస్తోంది. ఇందువల్ల ఆ పార్టీలో యువనాయకత్వం ఎదుగుతోంది. ఓటర్ల జాబితాలో కూడా యువత శాతం పెరుగుతోంది. ఇది మీరు గుర్తించే ఉంటారు. ఇలాంటప్పుడు తెలుగుదేశం పార్టీకి పోటీ ఇవ్వగల సమర్థుడైన యువ నాయకుడు, కార్యకర్తలను ప్రోత్సహించి, ఉత్తేజ పరిచేవాడు ముఖ్యమంత్రి అవటం మంచిదేమో... ఇంకో మాట సర్, మీరేమీ అనుకోనంటే చెబుతాను..."

"ఊ...ఊ" అన్నారు ప్రధాని.

"అదే సర్. Congress party suffers from old men and young women...నెహ్రూ, ఇందిరాగాంధీ కాలాలనాటి రాజకీయాలకి ఇప్పుడు చోటులేదు సర్. వ్యవస్థాపరమైన రాజకీయాలని ప్రోత్సహించాలనే కదా మీరు తిరుపతి ప్లీనరీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి ఎన్నికలు జరిపించారు. ముఖ్యమంత్రుల దగ్గరకొచ్చే సరికి మాత్రం పాతపద్ధతిలో నామినేటెడ్ విధానాన్ని అవలంబిస్తే అది పార్టీని బలోపేతం చేయటానికి ఎలా ఉపకరిస్తుంది సర్?... పార్టీ అధినాయకులు ఎవరో ఒక్కరి పేరు మీద మాత్రమే పార్టీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుస్తుంది అనే ధీమా ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగా ఎవర్ని నామినేట్ చేసినా ఫరవాలేదు సర్. కానీ అలా కాక పార్టీ సిద్ధాంతాన్ని చూసి మాత్రమే ప్రజలు ఓటు వేయాలి అని ఇక్కడ మీరు అనుకునే పక్షంలో రాష్ట్రాల్లో నాయకత్వం ఎంపికని శాసన సభ్యులకే వదిలేస్తే బాగుంటుందేమో సర్... ఏమైనా, పార్టీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేది అధినాయకుడి ప్రతిష్ఠ ఆధారంగానా, పార్టీ ప్రతిష్ఠ ఆధారంగానా – అన్నదాని మీదే అంతా ఆధారపడి ఉంటుందని అనుకుంటాను..."

పి.వి. నవ్వారు. ఆయన నవ్వటం చాలా అరుదుగా చూస్తుంటాను.

"ఏఐసిసి ప్లీనరీలో చూశావ్‌గదా! 50 ఏళ్ళుగా నాయకుడి తోక పట్టుకుని ఈదే సంస్కృతికి అలవాటు పడిన పార్టీ వ్యవస్థని ఇవ్వాళ ఒక్కసారిగా మార్చలేం ప్రసాద్. మార్పు రావాలని నేను కోరుకుంటున్నమాట నిజమే. ప్లీనరీలో నా ప్రసంగంలో కూడా ఈ విషయం స్పష్టంగా చెప్పాను. ఇది అంత సులభంగా సాధ్యపడదు. ఈ స్థితిలో ముఖ్యమంత్రిగా సరైన వ్యక్తిని మనమే ఎంపిక చేయాలి... కాని ఇప్పుడున్న పరిస్థితుల్లో తెలంగాణాకి చెందిన మంత్రి రామచంద్రారెడ్డిని ముఖ్యమంత్రిగా పంపించాలని నాకుందయ్యా! అనుభవం కలవాడు, గ్రూపు రాజకీయాల ముద్రలేనివాడు... ఓ పని చెయ్యి. అనధికారికంగా రామచంద్రారెడ్డిపేరు పత్రికల్లో పొక్కేట్లు చెయ్యి. రియాక్షన్ చూద్దాం..."

ఆయన లేచారు. మీడియా సలహాదారుగా ఆయన చెప్పింది నేను చేశాను. ఆ పేరుకి సానుకూలత, ప్రతికూలత రెండూ ఎక్కువగా లేవు. అతి తక్కువ అభ్యంతరాలు ఎదుర్కొంటున్న

అభ్యర్థిత్వం ఆయనది. కాని పార్టీని ఎన్నికలలో గెలిపించగలడా - అని ఎవర్నడిగినా అంత ఉత్సాహంగా ఎవరూ చెప్పటంలేదు.

రామచంద్రారెడ్డి పేరు బైటకు రాగానే విజయభాస్కరరెడ్డిగారు తీవ్రంగా ఆందోళన చెందారు. ఆగమేఘాల మీద వచ్చి పి.వి. గారిని కలిశారు. 1982లో తాను ముఖ్యమంత్రిగా చేసినా వ్యవధి తక్కువ కావటం వల్ల ఎన్.టి.రామారావు మీద పార్టీని గెలిపించలేక పోయాననీ, అదొక మాయనిమచ్చగా మిగిలిపోయిందనీ, ఈసారి ఒక్క అవకాశం ఇస్తే పార్టీని గెపిలించి తీరతాననీ, అన్ని వర్గాలనీ కలుపుకుపోతాననీ, ముఖ్యంగా వై.యస్. వర్గానిక్కూడా న్యాయం చేస్తాననీ... ఇలాంటి అనేక వాగ్దానాలతో ఆయన ముఖ్యమంత్రి పదవికోసం ప్రాధేయపడ్డారు. ఒక రకంగా అయన పి.వి.ని తమ పాత రాజకీయ అనుబంధం గుర్తు చేసి మొహమాట పెట్టారు.

"చూద్దాం" అంటూ పి.వి. బెంగుళూరు వెళ్ళిపోయారు. కాని ఆయన బెంగుళూరు నుంచి తిరిగి వచ్చే లోపల భాస్కరరెడ్డిని ముఖ్యమంత్రిగా ఖరారు చేసేశారంటూ ప్రచారం జరిగిపోయింది. ఎవరు చేశారు?

పి.వి. వెంటనే భాస్కరరెడ్డిగారికి టెలిఫోన్ చేసి అడిగారు, "ఏమిటిదంతా?"

"నాకూ తెలియటం లేదు ఎవరు చేశారో. ప్రచారమైతే జరిగిపోయింది. ఎక్కడెక్కడ వాళ్ళు నాకు శుభాకాంక్షలు కూడా చెప్పేస్తున్నారు... ఇప్పుడు నేను ముఖ్యమంత్రిని కాకుండా వేరొకరు అయితే నాకు తల తీసేసినట్లే. ఈ వయసులో ఈ మనోవేదన భరించగలనా?..."

పి.వి. ఇరకాటంలో పడ్డారు. ఏమనుకున్నారో ఏమో, "రాజశేఖరరెడ్డిని కూడా కలుపుకుపోగలరా?" అని భాస్కరరెడ్డిని అడిగారు.

"నేనే వచ్చి మీ ముందే అతనితో కూడా మాట్లాడతాను..." భాస్కరరెడ్డిగారిది కూడా తల నెరిసిన రాజకీయం కదా!

వై.యస్. వర్గం నీరు కారిపోయింది. ఆగ్రహంతో నిప్పులు కక్కింది. దీనికి సమాధానంగా పి.వి.గారు భాస్కరరెడ్డిగారినీ, రాజశేఖరరెడ్డిగారినీ పిలిపించి, కూర్చోబెట్టుకుని నేను చూస్తుండగానే భాస్కరరెడ్డిగారి చేత వాగ్దానం చేయించారు. "రాజశేఖర్ వర్గానికి ఆరు మంత్రి పదవులిస్తాను. అవి కూడా అన్నీ మంచి శాఖలే ఇస్తాను... తప్పకుండా అతన్ని కలుపుకు వెళ్తాను..."

అలా కోట్ల విజయ భాస్కరరెడ్డి ముఖ్యమంత్రి అయిపోయారు. కాని ఆ తరువాత ఆయన మాట నిలబెట్టుకోలేదు. వై.యస్. వర్గానికి ఇస్తానన్న మంత్రి పదవులూ ఇవ్వలేదు, ముఖ్యశాఖలూ ఇవ్వలేదు. (పి.వి.గారు విధించిన షరతు ప్రకారం తెలంగాణాకి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి. అదీ చేయలేదు) మొదట్లో రెండు మంత్రి పదవులిచ్చారు. మళ్ళా పి.వి.గారి వత్తిడి మీద ఇంకో రెండిచ్చారు. కానీ శాఖలకి ప్రాముఖ్యతలేదు. భాస్కరరెడ్డిగారి వాగ్దాన భంగం ఆయనకీ, వై.యస్.కీ మధ్య దూరం పెంచుతూ వచ్చింది. అది పెరిగి, పెరిగి ఇప్పుడు కడపలో

ప్రధానమంత్రి సమక్షంలో వై.యస్. అభిమానులుగా చెప్పబడుతున్న వాళ్ళు ముఖ్యమంత్రి మీదకి చెప్పులు విసిరేదాకా వచ్చింది.

★ ★ ★

అందుకే పి.వి. ఇప్పుడు ఢిల్లీ వెళ్ళబోతూ భాస్కరరెడ్డి అనుయాయుల ముందర "ఆయన మూలంగా నాక్కూడా అవమానం జరిగినట్లే కదా! ఇదంతా ఆయన స్వయంకృతాపరాధం" అనేసి వెళ్ళిపోయారు.

నేను పి.వి.గారు నాకు అప్పగించిన పనిని పూర్తిచేసి, ఢిల్లీ విమానం ఎక్కేశాను. 24 గంటల్లో పి.వి.గారి మందు పనిచేసింది. అంతే, మళ్ళీ ఎప్పుడూ భాస్కరరెడ్డిగారు వై.యస్. సస్పెన్షన్ ఊసెత్తలేదు.

ఇంతకీ పి.వి.గారు నాకు చెప్పిందేమిటి?

"భాస్కరరెడ్డిగారు రాజీనామా చేస్తే ఆమోదించటానికి పార్టీ అధ్యక్షుడిగా నేను సిద్ధంగా ఉన్నానని పత్రికలలో పొక్కేట్లూ, భాస్కరరెడ్డి వర్గానికి తెలిసేట్లూ చేసి, అప్పుడు ఢిల్లీకి రా."!

★ ★ ★

మన్మోహన్ సింగ్ రాజీనామా - 1

అకస్మాత్తుగా డాక్టర్ మన్‌మోహన్ సింగ్ రాజీనామా చేశారు!

.....ఈ వార్త మొదటిరోజు ఎవరికీ తెలీకపోయినా రెండురోజుల్లో పత్రికల్లో పతాక శీర్షిక కెక్కింది. దేశమంతా వ్యాపించింది. ఈ వార్త కలిగించిన సంచలనం జాతీయ-అంతర్జాతీయ రంగాల్లో అంతా ఇంతా కాదు. ఎందుకంటే స్వతంత్ర భారతదేశంలో ప్రపంచీకరణ, సరళీకరణ సంస్కరణలను అమలు చేసే ప్రక్రియలో అతికీలకపాత్ర నిర్వహిస్తున్న వ్యక్తి డాక్టర్ మన్‌మోహన్ సింగ్.

ఇప్పుడు ఆయన రాజీనామా చేశారంటే ఇప్పుడిప్పుడే వేళ్ళూనుకుంటున్న సంస్కరణలేం కావాలి? దేశభవిష్యత్తేం కావాలి? ఒక్కసారిగా భారత ప్రభుత్వ యంత్రాంగంలో ఒక అయోమయ పరిస్థితికి తెర లేచింది. ప్రధానమంత్రి పి.వి. నరసింహారావుగారు నాకు కబురు చేశారు. ఇంత అర్జంటుగా ఎందుకు పిలిచారో అనుకుంటూ వెళ్ళాను. వెళ్తూవెళ్తూ వివిధ ముఖ్య పత్రికలలో మన్‌మోహన్‌సింగ్ రాజీనామా గురించి, పి.వి.గారి ప్రభుత్వం పై ఆ రాజీనామా ప్రభావంగురించి వచ్చిన వార్తా కథనాల క్లిప్పింగ్స్ తీసుకువెళ్ళాను. వెళ్ళగానే ముందు అవే చూపించాను.

అవి చూసి, ఆయన ఒక నిట్టూర్పు విడిచారు.

"ఈయన పూర్తిగా రాజకీయాల నుండి వచ్చుంటే ఓ సీనియరు మంత్రిని పంపి మాట్లాడించి ఉండేవాడిని. పూర్తిగా అధికారి అయివుంటే వర్మగారితోనో, యింకో అధికారితోనో మాట్లాడించి వుండేవాడిని. నేనే మాట్లాడటం ఈ పరిస్థితుల్లో బాగుండకపోగా అది ప్రతికూల ఫలితాన్నివ్వచ్చు. పైగా నా స్థాయిలోనే ఆయన ఒప్పుకోకపోతే మరో ప్రయత్నానికి అవకాశం ఉండదు! పోనీ... ఓ పనిచేద్దాం" అని ఆగారు.

నేను ఉత్సుకతతో వింటున్నాను.

"నాతరపున నువ్వేవెళ్ళి మాట్లాడివస్తావా ఆయనతో?" అన్నారు ప్రధాని.

"సర్" అంటూ అయోమయంలో ఉండిపోయాను.

నేను మాట్లాడవలసిన వారు - ఆర్థిక శాఖామంత్రి డాక్టర్ మన్‌మోహన్‌సింగ్. మాట్లాడాల్సిన విషయం - ఆయన రాజీనామా గురించి!

ఇది జరిగే పనేనా?

పి. వి. గారు ప్రధానమంత్రి అయినప్పటి దేశ ఆర్థిక పరిస్థితులు అందరికీ తెలిసినవే. దివాలా పరిస్థితి!!

అప్పులు తీర్చడానికి ఇంగ్లాండులో బంగారం కుదువ పెట్టాల్సిన సన్నివేశం. విదేశీమారక ద్రవ్యం నిల్వలు రెండు మూడు రోజులకు బొటాబొటీగా సరిపడేంతగా ఉండి ప్రభుత్వ ఖజానా అటూ ఇటూ మెసలటానికి ఏమాత్రమూ వీలులేని క్లిష్టస్థితి. పేరు పొందిన ఆర్థిక శాస్త్రవేత్త శ్రీమన్‌మోహన్ని ఒప్పించి దేశానికి ఆర్థిక మంత్రిగా నియమించారు. అదివరకు World Bank లో పనిచేసి, తర్వాత ప్రధానమంత్రికి సలహాదారుగా పనిచేసిన మన్‌మోహన్‌సింగ్ చాలా ప్రతిభాశాలి, మంచి ఆర్థిక నిపుణుడు, ముక్కుకు సూటిగా పోయే మనస్తత్వం, చాలా సున్నిత స్వభావం కలవాడు. ....మచ్చలేని జీవితం. అనుకున్నది సాధించే పట్టుదల గల కార్యదక్షుడు. మృదువైన మితభాషి. దేశంకోసం ఏదైనా చేద్దామన్న తపన.

ఆయనను ఆర్థిక మంత్రిని చేసినప్పుడు అందరూ హర్షించారు. ఆయన తనకు కావలసినవాడిని ఆర్థిక శాఖ కార్యదర్శిగా తెచ్చుకోవడానికి ప్రధానమంత్రి అవకాశం కల్పించారు.... మిగతా ఆర్థిక శాఖ ఉద్యోగాల్లో కూడా ఆయనకు కావలసిన వారిని ఇచ్చి ఒక మంచి టీమ్ తయారు చేసుకోవటానికి అవకాశం ఇచ్చారు.

కాని అక్కడ తీసుకోవలసిన నిర్ణయాలు ఆర్థిక పరిజ్ఞానంతో తయారు చేయబడినా, రాజకీయంగా వాటికి సమర్థన ఉంటేనే వాటిని కార్యరూపంలో పెట్టే అవకాశం ఉంటుంది. బయటనుంచి, తన కాంగ్రెస్ పార్టీలోనే కొందరు ముఖ్యమైన నాయకుల నుంచి ఎంత వ్యతిరేకత వచ్చినా, డా॥ సింగ్‌కి పూర్తి మద్దతునిచ్చి, ఆర్థిక సంస్కరణల అమలుకు పి.వి. గారు దోహదం చేసి భారతదేశ గతిని మార్చి వేశారు. లైసెన్స్ రాజ్‌గా ప్రసిద్ధి చెందిన వ్యవస్థ శృంఖలాలు ఛేదించి లైసెన్స్ రహిత సరళీకృత విధానాలకి తెర తీశారు. దేశాన్ని నిద్రాణస్థితిలోకి తోసిన వాణిజ్య, వ్యాపార పారిశ్రామిక రంగాల పరిమితుల కవచాల్ని చీల్చి, ప్రపంచీకరణ ద్వారా బయట ప్రపంచంతో సంబంధాలకు దోహదం చేశారు. అది చేసేటప్పుడు, ఎలాంటి తొందరపాటు చర్యల్తోనూ స్వదేశీ పెట్టుబడిదారులు దెబ్బతిని పోకుండా ఏర్పాట్లు చేసి స్వదేశీ విదేశీ కంపెనీలు కలిసి ముందుకు పోయే అవకాశం కల్పించారు.

జాతీయ బ్యాంకులలో కార్మికసంఘాల ప్రభావం దృష్ట్యా (చాలా వరకు అప్పటికే ప్రభుత్వపరం అవటం వలన) చాలా కొత్త బ్యాంకులను ప్రైవేటు రంగాలలో ప్రోత్సహించారు. ఒకవైపు ఆధునీకరణకు దోహదం చేస్తూ, బ్యాంకుల మధ్య పోటీ పద్ధతిని ప్రవేశపెట్టి "తాము కూడా తమ తమ విధానాలు, సమర్థత పెంచుకోకపోతే తమ మనుగడకే ముప్పు" అన్న భావన ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగులలో, మేనేజ్‌మెంట్‌లలో వచ్చేట్లు చేశారు. పెట్టుబడి పద్ధతులలో తెచ్చిన సంస్కరణలు దేశంలోని పెట్టుబడి విధానంలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేశాయి. చాలా పెద్ద పెట్టుబడి దారులకీ, నగరాలలో బాగా పరిజ్ఞానం ఉన్న చదువుకున్న వారికీ పరిమితమైన

'షేర్ మార్కెట్' సామాన్యుడికి కూడా ఉత్సుకత కల్గించే విధంగా ఆర్థిక విధానాలు తయారయ్యాయి. ప్రైవేటు, పబ్లిక్, మ్యూచువల్ ఫండ్‌లను ప్రోత్సహించి చిన్న చిన్న పెట్టుబడుదారులు కూడా ఆర్థిక పురోగతిలో భాగస్వాములు అయ్యేట్లుగా రూపొందించారు. పురోగతిని సూచించే రెండు బడ్జెట్‌లను మన్‌మోహన్ సింగ్ అప్పటికే ప్రవేశపెట్టి చాలా విప్లవాత్మక మార్పులకు అవకాశం కల్పించారు. వీలైనంతవరకు ఆయనకు ఈ విషయాలలో పూర్తి స్వేచ్ఛనిచ్చి, రాజకీయ వత్తిడిలు ఆయనపై పడకుండా ప్రధానమంత్రి కాపుకాశారు.

వ్యవస్థలో రకరకాల వారుంటారు. కొంత మంది ఈ ప్రైవేటీకరణకు వ్యతిరేకులు. కొందరు అదివరకటి పరిస్థితులలో కష్టపడకుండా లైసెన్సులు అమ్ముకొని, లేదా లైసెన్సులు చేజిక్కించుకొని పోటీ లేకుండా చూసుకుని ఢిల్లీలో రాజకీయపలుకుబడులతో తమకు తాము లాభం చేసుకుంటూ తమ పోటీదారులు దెబ్బతినేటట్లు చేసి ముందుకుపోయే సంస్థలు, వారికి మద్దతు యిచ్చి, వారికి పనులు చేసి చేయించిపెట్టే రాజకీయనాయకులు, మధ్యవర్తులు..... అలాంటి ఎంతోమందికి రానురాను మనుగడ కష్టమయ్యే పరిస్థితి ఏర్పడింది.

ఇటురాజకీయ పరిస్థితులు చూస్తే - పి.వి.గారిది అల్పసంఖ్యాక ప్రభుత్వం. పి.వి.గారు వ్యక్తిగా మహోన్నతుడు, సమర్థుడూ, అనుభవజ్ఞుడూ అయినప్పటికీ రాజకీయంగా బలం లేనివాడు. రాజ్యసభ సీటుకూడా వచ్చే పరిస్థితి లేక, రాజకీయ సన్యాసం చేసి, నిజమైన సన్యాసం తీసుకునే పరిస్థితి. ఆయన కొద్దికాలంలో కుర్తాళంలోని సిద్ధేశ్వర పీఠానికి అధిపతిగా పోవటానికి రంగం సిద్ధం అయింది. అయనకున్న ఆస్తి అయన పుస్తకాలు, లైబ్రరీ. దానిని కూడా ఢిల్లీ నుండి హైదరాబాదుకు పంపించేశారు. ఢిల్లీలో బిచాణా ఎత్తేసే ప్రయత్నాలు దాదాపు పూర్తి అయ్యాయి.

అటువంటి పరిస్థితులలో రాజీవ్‌గాంధీ హత్య జరిగింది. కాంగ్రెసులో అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది. అప్పటికే ఎన్నికల ప్రహసనం మొదలై ఒక భాగం పూర్తయిన పరిస్థితులలో కాంగ్రెసులో కొత్త నాయకుని అవసరం కలిగింది. అప్పటిదాకా నెహ్రూ, గాంధి కుటుంబాలవారే తప్ప (లాల్‌బహదూర్‌శాస్త్రి మినహా) వేరే ఎవరూ సమర్థంగా ప్రభుత్వాన్ని నడిపిన పరిస్థితి లేదు. దేశంలో సోనియాగాంధీ గారికి అప్పట్లో చాలా వ్యతిరేకత. పైగా ఆమె రాజకీయాల్లో ఉత్సాహం చూపకపోవడమే కాక, ఆమెకి రాజీవ్‌గాంధీని కూడా రాజకీయాల నుండి దూరంగా ఉంచాలనే కోరిక ఉన్నట్లు అందరికీ తెలిసిన విషయం.

అటువంటి స్థితిలో ఆమెను ప్రతిపాదించడానికి కాంగ్రెసు నాయకులలోనే చాలా సందిగ్ధ స్థితి నెలకొంది. అప్పటికే పార్టీ ఎలక్షన్లలో గెలిచి అధికారంలో ఉంటే, ఆవిడను ముందుకు తీసుకురావడాన్ని సమర్థించే నాయకులకు పార్టీలో కొదవలేదు. కాని ఎన్నికల మధ్యలో అటువంటి సాహసం చేసే ధైర్యం ఎవ్వరికీ ఉన్నట్లు అనిపించలేదు. కాంగ్రెసులో పరిస్థితి నాయకుల కొదవవల్ల కాదు. ఏ నాయకుడికీ రాజకీయ పలుకుబడి అంతగా లేని పరిస్థితి. ఎవరి వెనకాలన్నా పట్టున 10మంది పార్లమెంటు సభ్యులు ఉన్నారా అంటే అదీ లేదు. ఎవరికన్నా 10మంది ఉన్నారంటే

- యితరులు ఆయనకు వ్యతిరేకం. ఒక ఎన్నికలలో కూడా పోటీ చేయని, చేసినా గెలవని నాయకులు చాలామంది. ఢిల్లీలో హడావుడి చాలామటుకు వారిదే. అవకాశం వస్తే మంత్రో, ప్రధానమంత్రో అవ్వాలని ఆశ...

దీనికంతా కారణం నెహ్రూ కుటుంబ రాజకీయ చరిత్ర ప్రభావం. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి అవకాశం లేకుండా చేశారు. కష్టపడిన కార్యకర్తలకు వారివారి పరిధిలో ప్రజాబలం వున్నా చిన్న నాయకులకు పై కెదగడానికి అవకాశాలు వస్తాయన్న ఆశలేదు. పైగా ఈ పరిస్థితుల్లో అసలే రావన్న నిస్పృహ.

ఒక రకంగా చెప్పాలంటే పి.వి. కూడా ఆ కోవకు చెందినవారే. కాకుంటే చాలాసార్లు ఎన్నికల్లో గెల్చారు. క్రింద నుండి పై దాకా దాదాపు అన్ని పదవుల్లో పనిచేసిన వారే. కాని ఆయనకూ వెనుక 10మంది కూడా లేరు. ఆయనకి "పదవి ఇవ్వాలి" అని వెళ్ళి అడిగే వారెవరూ లేరు. కాని ఆయనకిస్తామంటే వద్దనేవాళ్ళెవరూ కూడా లేరు. ఆయన అజాతశత్రువు. మొదటి నుంచీ నెహ్రూ కుటుంబానికి చాలా నమ్మకస్తుడు. ఎప్పుడూ నోరు విడిచి తనకీ పదవి కావాలని అడిగింది లేదు. తనవాళ్ళంటూ ఎవ్వరినీ చేరదీయలేరు, అటువంటి వారికి ఏమైనా ఇప్పిద్దామనే తాపత్రయమూ లేదు.... సరే, అలా అని అంగబలమూ లేదు... న్యాయంగా నీతిగా బతకడం అలవాటు పడ్డారుగాబట్టి 'అర్థ' బలం అంతకంటే లేదు.

రాజీవ్‌గాంధీ హత్య జరిగిన వెంటనే కాంగ్రెసు నాయకులంతా కలిసి అధికశాతం నాయకులకు అభ్యంతర రహితుడైన అభ్యర్థికోసం వెతగ్గా వెతగ్గా ఢిల్లీ వదిలి వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్న పి.వి. కనిపించారు. "ఈయనైతే నామాట జవదాటడు" అని ఎవరికి వారే అనుకొని, అందరూ కలిసి పార్టీ అధ్యక్ష పీఠం ఎక్కించారు. ఎన్నికలయ్యాక అల్పసంఖ్యాక వర్గ ప్రభుత్వంలో ప్రధానమంత్రిని చేశారు. కానీ భగవంతుని అనుగ్రహం వల్లనే ఈ పదవి దొరికిందని ఆయన నమ్మకం. ఇవి ప్రయత్నిస్తే వచ్చేవి కావు. ప్రతిభావంతుడని, అనుభవం ఉన్నవాడని చాలామందికి అభిమానం, గౌరవం ఉన్నా, "రాజకీయంగా బలంలేనివాడు కనుక మనపై ఆధారపడక తప్పదు, చెప్పిన మాట వినేట్లు చేసుకోవచ్చు, ఈ గండం గట్టెక్కాక, ఆయన్ని దింపి వేరే ప్రయత్నం చేసుకోవచ్చు" అనుకునే నాయకులు ఆయనను సమర్థించారు. ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు చాలా సీనియర్‌నేత అయినా పి.వి. ఆ పదవికి ఆశ చూపకపోవడం, రాజీవ్ గాంధీకి మద్దతునివ్వడం, నెహ్రూ కుటుంబానికి నమ్మకస్తుడుగా మెలగడం, రాజీవ్ గాంధీ (మరీ దగ్గరకు తీయకపోయినా) ఆయన్ని దూరంగా పెట్టలేకపోవడం...ఇవన్నీ ఆయన ప్రధాని కావడానికి దోహదపడిన చారిత్రకాంశాలు.

కాని, ప్రధాని అయిన తరువాత, "ఇదుగో పోతాడు, అదుగో పోతాడు... అసలే మైనారిటీ ప్రభుత్వం..." అంటూ ఎదురు చూసిన వాళ్ళకు చాలా నిరాశ ఎదురయింది. ప్రధానమంత్రి పదవిని సమర్థంగా నిర్వహించడమే కాక, పార్టీలో కూడా అధ్యక్షుడిగా ఉండి రెండేళ్ళలో ప్రభుత్వం

పైనా పార్టీ పైనా పట్టు సంపాదించారు. 'ఏదో రోజు అధికారం మన హస్తగతం అవుతుంది' అని ఆశలు పెట్టుకున్న వారు దేశప్రగతి, ఆర్థిక ప్రగతి, ఒడిదుడుకులు లేకుండా ప్రభుత్వం నడవడం చూచి సహించలేకపోవడం సహజం. కాని ఏమీ చేయలేని పరిస్థితి. ప్రభుత్వం లోనే ఉండి అవకాశం వచ్చినప్పుడల్లా ప్రధానిని కొంత కించపరిచే విధంగా పరిస్థితులు సృష్టించేవారు. అయోధ్య లాంటి విషయాలలో తీసుకున్న నిర్ణయాలకు వాళ్ళుకూడా పూర్తిగా భాగస్వాములై కూడా తప్పంతా పి.వి. గారి మీదకు తోయడానికి ప్రయత్నం చేశారు. అవకాశం వచ్చినప్పుడల్లా పి.వి.ని సోనియాగాంధీ కుటుంబానికి దూరం చేయడానికి విశ్వ ప్రయత్నం చేశారు. ఇలాంటి చర్యలు అర్జున్‌సింగ్ వంటి కొందరికి రాజకీయ దినచర్య అయిపోయింది.

వీళ్ళకి - పి.వి.కి ఎదురుగా నిలబడి ప్రశ్నించే ధైర్యం లేదు. పోనీ ఆయన మనుషుల్ని ఇబ్బందిపెడదామంటే మంత్రివర్గంలో ఆయన సొంతమనుషులు అంటూ ఎవరూలేరు ఒక్క మన్‌మోహన్ సింగ్ తప్ప. ఆయనేమో అధికారిలాగానే ఉండేవాడుకాని రాజకీయ నాయకుడిగా ఉండేవాడు కాదు. రాజకీయ నాయకులు కూడా ఆయనకు ఏదో సలహాదారులాగానో, కార్యదర్శికి పైకార్యదర్శిలాగానో చూసేవాళ్ళు కాని తమలో ఒకడిగా చూడలేకపోయారు.

ప్రపంచంలోనూ, దేశంలోనూ పి.వి. - మన్‌మోహన్ సింగ్‌ల జంటగుర్రాల (ప్రభుత్వ) కథల గురించే చర్చ జరుగుతూండడం, ప్రగతిశీల విధానాలతో ఒడిదుడుకులు లేకుండా సాగుతున్న వారి సంబంధం, ఒకరి పై ఒకరికి గల గౌరవం, అరమరికలులేని పరస్పర చర్చలు.... ఇవన్నీ కొందరు నాయకులలో "పి.వి.ని బలహీనపరచాలంటే సింగ్‌ని దూరం చేస్తే సరి" అన్న ఆలోచనకు బీజం వేశాయి. అదనుకోసం వేచివున్న వారికి - బ్యాంకు కుంభకోణపు ప్రచారం, షేర్ మార్కెట్‌లో హర్షద్ మెహతా లీలల కారణంగా ఏర్పడిన సంక్షోభం మంచి అవకాశం ఇచ్చాయి. ఈ ఆరోపణలపై పార్లమెంటులో చర్చలు జరిగి అవి పార్లమెంటరీ కమిటీ వేయడానికి దారి తీశాయి. అటువంటి కమిటీలలో అధికారపక్షంవారూ, ప్రతిపక్ష సభ్యులు కూడా ఉంటారు. సహజంగా అటువంటి కమిటీలలో ప్రతిపక్షాలవారు ప్రభుత్వాన్నీ, పనితీరునూ విమర్శించడం సహజం. కాని అధికార పక్షం సభ్యుల అండదండలతో విమర్శలను త్రిప్పికొట్టీ, తోసుకుపోవడం ఆనవాయితీ. పి.వి.ని యిబ్బందిపెట్టడానికి కొందరు అధికారపక్ష సభ్యులు కూడా ఆర్థిక శాఖ విధానాలని దుయ్యబట్టడం, సందర్భోచితంగా ఆర్థికమంత్రి మన్‌మోహన్ సింగ్‌పై కూడా కొన్ని విమర్శనాస్త్రాలు ప్రయోగించడం జరిగింది.

ప్రతిపక్షాల విమర్శలకు సిద్ధమే కాని అధికార పార్టీ వారు కూడా తనను కించపరిచే విధంగా మాట్లాడటాన్ని మన్‌మోహన్ సింగ్ సహించలేకపోయారు. నీతిమంతుడికి, సున్నిత మనస్సు కలవాడికి ఆ విమర్శలు మనస్సు చివుక్కుమనేట్లు చేస్తాయి.

అకీర్తించాపి భూతాని కథయిష్యంతి తే వ్యయామ్।
సంభావితస్యచా కీర్తి ర్మరణాద తిరిచ్యతే॥ - భగవద్గీత

"ఆత్మగౌరవం కలవ్యక్తికి అపనింద అనేది మరణం కంటే దుర్భరమైనది......."

ఈ కోవకు చెందినవాడు డాక్టర్ మన్‌మోహన్ సింగ్. ఆయన ఆత్మ గౌరవం దెబ్బతిని ఖిన్నుడై - తన పదవికి రాజీనామా చెయ్యడానికి ధృఢనిశ్చయుడయ్యేట్లు చేశాయి. ప్రధానమంత్రికి తన రాజీనామా లేఖ పంపి, ఆయన దానిని ఒప్పుకోకుండా తాను కొనసాగాలని బలవంతం చేస్తారేమోనని, తనను బలవంతం చేయవద్దని, తన మనస్సు విరిగిపోయిందనీ, రాజీనామాను ఒప్పుకోవాలనీ, ప్రధానమంత్రికి కబురు పంపారు. ఆయన రాజీనామా వార్త ఢిల్లీలోనూ దేశమంతా గుప్పుమంది.

★ ★ ★

ఆ పరిస్థితులలో పి.వి.గారు నాకు చెప్పిన విషయం: "ఆయన రాజకీయ నాయకుడూ కాదూ - అటు పూర్తిగా ఆఫీసరూ కాదు... రాజకీయాలలో యిటువంటి విమర్శలు సహజం, ప్రతిపక్షాల వారైనా అర్థం చేసుకొంటారుకాని, కావాలని చేసే మన వాళ్ళు ఎందుకు అవకాశం వదులుతారు! వారి విమర్శలన్నీ సింగ్‌గారి మీద కావని, వారు గురిపెడుతున్నది నన్నేనని ఆయన అర్థం చేసుకోరు. మన పార్టీ ఎంపీ లంతా మన చెప్పుచేతలలో వున్నారకుంటాడాయన.... ఒకటి రెండు సార్లు ఆయన మన వాళ్ళు కొంతమంది గురించి నాతో చెప్పిన మాట నిజమే. కాని వాళ్ళ లక్ష్యమే వేరు. ఏదో విధంగా ఎత్తి చూపి. రాజకీయంగా యిబ్బందిపెట్టడమే వారి ధ్యేయం... పార్టీ పరంగా కొంత చర్య తీసుకోవడానికి అవకాశం ఉంది. కాని దానికి సమయం, సందర్భం చూడాలి కదా.... ఇదంతా అర్థంచేసుకోవాల్సిన అవసరం తనకు లేదంటాడాయన... తాను రాజకీయనాయకుడినే కాదంటాడు.... ఆర్థిక మంత్రిగా చేరాక రాజకీయ నాయకుడిని కాదంటే ఎలాగయ్యా?....."

పి.వి. ఎదుర్కొంటున్న సంకట స్థితి అర్థమవుతోంది. మన్‌మోహన్ సింగ్ వంటి సమర్థుణ్ణి వదులుకోవటానికి ఆయన సిద్ధంగా లేడు. అలాగని సింగ్‌ని సంతృప్తి పరచటంకోసం పార్టీలోని అసంతృప్త గళాలమీద చర్య తీసుకోవటానికీ సిద్ధంగా లేడు.

"రాజకీయ నాయకులంటే సింగ్‌గారికి ఒక రకమైన అయిష్టత. అందుకని ఏ నాయకుణ్ణీ ఆయన దగ్గరకు పంపలేం. పంపినా ఎవరి ఎజెండా వారిది. ఇది చాలా సున్నితమైన విషయం. అధికారులను పంపుదామంటే అది వాళ్ళ సొంత అభిప్రాయంగా ఆయన తీసుకోవచ్చు. కాని, అవి నేను మనసు విప్పి చెప్పేమాటలని నమ్మకం కలగాలి. నేనే స్వయంగా మాట్లాడడం యిప్పుడు సమంజసంగా ఉండకపోవచ్చు. అతని మనస్థితి - ఏమైనా సరే, రాజీనామా చెయ్యాల్సిందే, ఇక రాజకీయాల్లో ఉండకూడదు - అన్న పట్టుదలతో ఉంది..." ఆయనేం చెప్పదల్చుకున్నారో. అర్థమవుతోంది.

ఆయన చెప్పదల్చుకున్నది చెప్పేస్తే, అది నన్నూ ఇరకాటంలో పెట్టేదే. అందుకని కల్పించు కొని, "మీరు మాట్లాడితే పనయిపోతుంది సర్" అనేశాను.

"ప్రసాద్, ఇది నువ్వనుకొన్నంత సులభంగా జరగదు... ఓ పనిచేద్దాం. ...నా తరఫున, నా మాటగా నువ్వే మాట్లాడితే బాగుంటుంది" అన్నారు పి.వి.

దిగ్భ్రాంతి, నవ్వూ కలిగాయి నాకు.

"నేనా! నామాట వింటారా? నేను ఆయనతో మాట్లాడడానికి చిన్న అధికారిని కానా?" పైకి అలా అన్నాను కానీ, నిజానికి ఒక ఐఏఎస్ అధికారిగా ఈ రాజకీయం నెరపటం నా పని కాదని నా సంకోచం.

"ఇక్కడ చిన్న, పెద్ద అధికారి అన్నవిషయం కాదు ముఖ్యం. నేను నిజంగా పంపించానా, వచ్చిన వ్యక్తి ప్రధానమంత్రికి నమ్మకమైన వ్యక్తా కాదా అన్నది ముఖ్యం".

నాకేమాత్రం వెళ్ళటం ఇష్టంలేదు. కానీ, ఏం చేయాలి?

అప్పుడేం జరిగిందంటే...

* * *

మన్మోహన్ సింగ్ రాజీనామా - 2

ఆర్థికమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ రాజీనామా వ్యవహారంలో ప్రధానమంత్రి పి.వి. నన్ను జోక్యం చేసుకోమనటంలో ఔచిత్యం లేదని కొంచెం అందంగా చెప్పాలని ప్రయత్నించాను.

కాని పి.వి. నా మనస్సు క్షణాల్లో చదివేశారు. నన్ను మాట్లాడనివ్వలేదు.

"ప్రసాద్, ఈ పనికి నువ్వు వెళ్ళినట్లు ఎవ్వరికీ తెలియనఖ్ఖర్లేదు. ఇది రాజకీయం అనుకోకు. దేశంకోసం ఒక మంచిపని చేస్తున్నట్లు భావించు. నేను చెప్పినట్లు చెయ్యి..." అంటూ ముగించారు.

నేను నిరుత్తరుణ్ణయ్యాను.

రహస్యంగా చెయ్యమన్నారన్నది అర్థమయింది కాబట్టి 'ఐఏఎస్' అహం ప్రక్కనపెట్టి బయల్దేరాను.

నిజానికి సింగ్‌గారితో నాకు పరిచయం లేదని చెప్పటానికి లేదు. పి.వి. గారి తరపున నాలుగయిదుసార్లు ఆయనతో మాట్లాడటం, మీటింగులకు వచ్చినప్పుడు పి.వి. గారితో విదేశాలకు వెళ్ళినపుడు ఆయన కూడా రావడం జరిగింది... (పి.విగారు వెళ్ళే విదేశీ పర్యటనలో Media Advisorగా ప్రధాని బృందంలో ఎప్పుడూ ఉండేవాడిని).... అలా ఇతను ఒక ఐఏఎస్ అధికారి అయినా పి.వి గారికి సన్నిహితుడు అన్న విషయం (నా గురించి) ఆయనకు బాగా తెలుసును.

అందుకే ఆయనతో ఫోన్‌లో "మీ యింటికి వచ్చి మాట్లాడాలని" నేనన్నప్పుడు, "ప్రసాద్, నువ్వెందుకు వస్తున్నావో తెలుసు, నాయింటికి రావడానికి నీకెప్పటికీ అభ్యంతరం లేదు. కాని రాజీనామా విషయంలో అయితే నేను యింకేమీ వినదల్చుకోలేదు" అన్నారు. "అయినా ఒక్కసారి వచ్చి అదే విషయం మాట్లాడిపోతాను. సర్ - మీరొక్కసారి నాకు అవకాశమిస్తే..." అంటూ అభ్యర్థించాను ఆయన కాదనలేకపోయాడు.

ఆయన యింటికి వెళ్ళగానే చాలా మర్యాదగా ఆహ్వానించి, ఆయన భార్యను పరిచయం చేశాక, డ్రాయింగ్ రూములో కూర్చున్నాక, నేనేదో చెప్పడానికి మొదలు పెట్టబోతుండగా ఆయనే ఉద్వేగంతో ప్రారంభించారు....

"... నేను రాజకీయ వేత్తను కాను. నేను రాజకీయవాదుల్లాగా ముదిరిపోలేదు. ఈ అవమానాలు పడటానికి, అందరిచేతా మాటలు పడటానికి నాకేం ఖర్మ? జీతం కోసంగాని, డబ్బు కోసం కాని పనిచేస్తున్నానా? ప్రపంచబ్యాంకు ఇచ్చే పెన్షను నాకు చాలు..."

ఆయన ఆగి, ఆగి చెబుతున్నారు. కాని ఆవేదన, ఆవేశం మిళితమై చెబుతున్నారు. "అయినా ప్రతి పక్షాలు విమర్శిస్తాయి అంటే అర్థంఉంది. మనవాళ్ళే - అధికార కాంగ్రెసు వాళ్ళే అట్లా

మాట్లాడితే అర్థమేమిటి? క్రమశిక్షణ వుండాలి... ఉందా? మాట్లాడేదాంట్లో నిజముంటే సరిపెట్టుకోవచ్చు. తలవంచుకోవచ్చు. నిజంలేదని వాళ్ళకీ తెలిసినా యిలా పదిమందిలో అవమానం చేయడం వాళ్ళకి తగునా? నాకెందుకీ బాధంతా! జీవితంలో యిన్నేళ్ళూ, దేశ, విదేశాల్లో పనిచేసినా, ఎక్కడా ఒక్కమాట పడకుండా పనిచేశాను...." ఆయన ఆవేదన నాకు అర్థంకావాలని నొక్కి నొక్కిచెబుతున్నారు.

"ఇక్కడ ఎన్ని చేస్తున్నా? ఒళ్ళు దాచుకోకుండా 24గంటలూ అవస్థపడటం ఎందుకు? అభిమానం కొద్దీ పి.వి పిలిచారు. దేశానికి సేవ చేసే అవకాశం యిచ్చారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. మనవంతు చేతనయింది చేద్దాం అనేకదా! ఈ విమర్శలు చేసే వాళ్ళు దేశానికి ఏం చేశారు?..... అదంతా నా కెందుకు లెండి. నేను విసిగిపోయాను. చేసింది చాలు. ఈ రాజకీయాలు వదిలేసి ఏదో ప్రశాంతంగా కాలం గడపాలని నిర్ణయిం తీసుకొన్నాను. బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకొన్నాను. పి.వి.కి చెప్పండి, ఆయన మీద నాకు చాలా గౌరవం.... ఆయన చాలా ప్రోత్సాహం యిచ్చారు..... రాజీనామా చేయటానికి ఆయన కారణం కాదు. ...యిందులో ఆయన ప్రమేయం ఏమీ లేదు... ఇది నా వ్యక్తి గత నిర్ణయం... మార్చుకోదలుచుకోలేదు." ఖండితంగా తేల్చి చెప్పేశారు. ఆ మాటల్లో కృతనిశ్చయం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

నేను అలా వింటూ కూర్చున్నాను. ఆత్మగౌరవం కోసం దేశంలోనే ఒక ముఖ్య పదవిని వదిలేయడానికి సిద్ధపడిన ఈయనను చూస్తుంటే చాలా సంతోషం, గర్వం కలిగాయి. ఇంతలో ఆయన భార్య కాఫీలు, అల్పాహారం తీసుకొచ్చారు.. ఆర్థిక మంత్రి, వారి భార్య వాటిని స్వయంగా నాకు అందించారు. వారి ఆత్మీయత, నిరాడంబరత, నిష్కపట వైఖరి నాకు ఎంతో నచ్చాయి. నేను కూడా మెల్లగా పి.వి.గారి రాయబారిగా సంభాషణకి ఉపక్రమించాను.

"ఇదంతా పి.వి గారికి బాగా తెలుసు. అందుకే ఆయన చాలా బాధ పడుతున్నారు. మీరు ఇద్దరు ముగ్గురి గురించి ఒకటి రెండుసార్లు ఆయనతో అన్నారట గూడా. ఆయన కూడా వాళ్ళకు కబురు పంపారట... మీకు తెలుసు. కొంతమంది కావాలని చేస్తున్న పనియిది... రాజకీయాల్లో యిది సహజమే. కాని మీకు రాజకీయాలు కొత్త. మిమ్మల్ని కాచుకోవడం, యిటువంటి వారి విమర్శలకు దూరంగా ఉంచడం పి.విగారి బాధ్యత, ధర్మం. కాని పార్టీలో ఆయన పరిస్థితి మీకు తెలుసుగదా! ఆయన చేస్తున్నది కత్తి మీద సాము. అసలే అల్పసంఖ్యాక ప్రభుత్వం. అందులోనూ పార్టీలోనే రకరకాల గ్రూపులు. ఏదో చాకచక్యంతో, భగవదనుగ్రహంతో ప్రభుత్వాన్ని నడుపుకొస్తున్నారు. అందులో దేశస్థాయిలో, ప్రపంచ స్థాయిలో ఈ ప్రభుత్వానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెట్టింది ఆర్థిక సంస్కరణలు, పరిపాలనా సంస్కరణలు. వీటికి మీరిద్దరూ మూలస్థంభాలు_...."

మొదట అసలు నాతో మాట్లాడటానికే అయిష్టత చూపించిన డాక్టర్ సింగ్ ఇప్పుడు నేను చెబుతున్నవన్నీ శ్రద్ధగా ఆలకిస్తున్నారు.

నాకు కొంచెం ధైర్యం వచ్చింది.

"... ఆయనను (పి.వి.గారిని) దెబ్బతీయాలని, గద్దె దింపాలని, కొంతమంది ఎంత తీవ్రంగా ఎలా ప్రయత్నాలు చేస్తున్నారో మీకు తెలియనిది కాదు. అందులో వాళ్ళు సఫలీకృతులు కాలేక, ప్రభుత్వాన్ని సుస్థిరం చేస్తున్న మీ ఆర్థిక విధానాల్ని, ఈ సంస్కరణలను ఛిన్నాభిన్నం చేస్తే ఆయన మీద ప్రజలకు, యితరనాయకులకు ఇప్పుడున్న అభిమానం పోతుంది. అప్పుడు ఆయనను బలహీనపరిచి, తొలిగించవచ్చని వారి ఉద్దేశ్యం. ఆ పథకంలో భాగంగానే మీ మీద బురదజల్లే ప్రయత్నం. మీరు చాలా సున్నిత స్వభావులు. మీ మనసుని గాయపరిచి, మీరు టీములోనుండి బయటకు వెళ్ళేట్టు చూడడం వారి ధ్యేయం. అంతే జరిగింది".... అలా నాకు తెలిసిన విషయాలన్నీ కలిపి పి.వి. గారు చెప్పిన విశ్లేషణ ఆయన ముందుంచాను.

అప్పటికి డాక్టర్ సింగ్ మెత్తబడ్డారు. అయినా ఆయన వెనక్కి తగ్గలేదు.

"ఇదొక్కటే కాదు. నాకు మొదటినుంచీ రాజకీయాలంటేనే యిష్టంలేదు. నా మనస్తత్వం దానికి సరిపడదు. మనస్సాక్షిని చంపుకొని కుటిల వాతావరణంలో పనిచేయటం నావల్ల కాదు...." అన్నారు.

అయితే ఆ మాటల్లో మొదట్లో వున్న ఆవేశంలేదు.

నేను ఇంక ఆగలేదు.... "ఆ విషయంలో కూడా పి.వి. గారు ముఖ్యంగా చెప్పమన్నారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు సొంత రాష్ట్రంలో అంత ఇబ్బంది లేదు. కాని, మీరు యిప్పుడున్న పరిస్థితే ఆయన ముఖ్యమంత్రి అయినప్పుడు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రతి పక్షాలు చాలా గౌరవం చూపించినా – స్వపక్షంలోనే కొందరు రకరకాల ఇబ్బందులు పెట్టడానికి ప్రయత్నం చేసేవారు. ఎన్నోసార్లు మనసు వికలమై, రాజీనామా చేసిపోదామని అనిపించేది... కాని రాష్ట్రానికి, దేశానికి సేవచేసే భాగ్యం ఇటువంటి పదవుల్లోనే అధికంగా ఉంటుంది. తన ఆత్మగౌరవం కోసం దేశ సేవచేసే అవకాశాన్ని పోగొట్టుకోవాలా? అని ప్రశ్నించుకునేవారు...

"బయటకు వచ్చి, తాను యిప్పుడు చేయగలిగినంత సేవ దేశానికి చేయగలనా – అన్న ఆలోచన వచ్చినప్పుడల్లా అహం చంపుకొని, అవమానాల్ని దిగమింగి మృదుస్వభావాన్ని కొంచెం ముదురు స్వభావంగా మార్చుకొని, తన వంతు సేవ చేయడం మొదలుపెట్టారు. ఏ పదవినీ కోరుకొని ఆయన అవమానాలకు గురి కాలేదు. పదవి వస్తుందనో, దానిని ఆశించో రాజకీయాల్లో అహం చంపుకోలేదు. పదవిలో లేకపోయినా, పదవులు ఆశించకపోయినా యితరులు మన వైపు అంతగా చూడరు. అనవసరంగా మనల్ని యిబ్బంది పెట్టడానికి పూనుకోరు. పదవి ఉన్నప్పుడే, ఆ పదవులు ఆశించే వారికి మనం అడ్డంకి అనుకున్నప్పుడే ఇలాంటివి జరుగుతాయి.."

క్రమంగా డాక్టర్ సింగ్ ముఖంలో ప్రసన్నత చోటు చేసుకోవటం గమనించాను.

నేను చెప్పాల్సింది చాలా ఉంది... "మీరు రాజీనామా చేసి వెళ్ళిపోతే మీ ఆత్మగౌరవం నిలుస్తుంది. మీరు సుఖంగా ఉంటారు. కాని మీరు మొదలు పెట్టిన సంస్కరణల మహోద్యమం మాటేమిటి? మీరు చెయ్యాల్సిందంతా అయిపోయిందా? చేసేశారా? యింకా చేయాల్సిందేమీ లేదా? ...ఇప్పుడు వదిలేస్తే దేశానికి అది మంచిదేనా? చేసిందంతా వృధా అయ్యే ప్రమాదం లేదా? మనల్ని విమర్శించే వాళ్ళ వల్ల దేశానికి ఆ తరువాత మేలు జరుగుతుందా?.... ఇప్పుడు వదిలేస్తాం. తరువాత ఈ అవాంఛనీయ శక్తుల చేతుల్లో దేశం దిగజారుతుంటే, మనకిచ్చిన అవకాశం చేజార్చుకున్నామన్న అలజడి మనలో కలగదా? అప్పుడు మనశ్శాంతి వుంటుందా?..."

డాక్టర్ సింగ్ సాలోచనగా తలపంకిస్తున్నారు.

".... అయినా వచ్చే విమర్శలు అందరి నుంచీ వస్తున్నాయా? వాళ్ళు మొత్తం పార్టీ కార్యకర్తల మనోభావాల్ని వ్యక్తం చేస్తున్నారా? లేక కొద్ది మంది వారి వారి స్వప్రయోజనాల కోసం చేస్తున్నారా? ఏదో ఇద్దరు ముగ్గురు అలా విమర్శించారని మనం ఇలా స్పందించడం భావ్యమేనా? దేశ అభివృద్ధి ముఖ్యమా... ఈ ఇద్దరు ముగ్గురి అభిప్రాయాలు ముఖ్యమా?.... ఈ దృష్టితో ఆలోచిస్తే మన అహంకార తృప్తికోసం, దేశప్రగతిని దెబ్బతీసినవాళ్ళం కామా?..."

నాకు తోచినట్లు చెప్పుకుంటూ వెళ్ళిపోయాను.

సింగ్‌గారి ముఖకవళికలు గమనిస్తున్నాను. ఆయన అకస్మాత్తుగా నా మాటల ఉధృతాన్ని ఆపారు.

"ప్రసాద్ నువ్వు చిత్రీకరించేది చూస్తే .... నేనేదో దేశద్రోహం చేస్తున్నట్లు...." అని సింగ్‌గారు అనబోయారు.

నేను ఖంగారుపడ్డాను. "సర్ సర్, ఇవి నామాటలు కావు.... ఉద్దేశ్యమూ అది కాదు.... మీరింతవరకు మీ కోణంలో, మీ ఆత్మగౌరవం దృష్టితో చూస్తున్నారు. కాని – దాని పరిణామాలేమిటి? వాటి ప్రభావం దేశం మీద, పార్టీమీద, నాయకుని మీద ఎలా ఉంటాయి? ఆ దృష్టితో మనం తీసుకునే నిర్ణయం సమంజసమా – అన్నది ఆలోచించాలని పి.వి. గారి సూచన" అంటూ అసలు విషయం చెప్పేశాను.

ఆయన మాట్లాడడం ఆపేశారు. "ఊ" అంటున్నారు.

నేను ఇంకొంచెం చొరవ తీసుకున్నాను.

"రాజకీయాల్లోకి వచ్చాక దేశానికి సేవచేసే అవకాశం ఉన్నప్పుడు, అహం చంపుకొని నిర్హేతుకమైన విమర్శల పట్ల ఉదాసీన వైఖరిని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. మీరు ఒప్పుకొన్నా ఒప్పుకోకపోయినా, ఆర్థికమంత్రి పదవి చేపట్టారూ అంటే రాజకీయాల్లోకి వచ్చినట్లే!– ఆత్మ గౌరవమా? దేశ ప్రగతా? ఏది ముఖ్యం? అని మనం ఆలోచించాకనే ఏది త్యాగం చెయ్యాలో నిర్ణయించుకోవటం సలబుగా ఉంటుందేమో....."

కొంచెం ఎక్కువ మాట్లాడానా - అనిపించింది. ఏమైనా మనసుకి తోచినవన్నీ చెప్పేశాను. ఇంక ఆయన ఇష్టం.... మళ్ళా అంతలోకే - అలా అనుకొని వదిలేస్తే ఎలా? పి.వి. గారు నన్నే ఎందుకు పంపించారు. ఏదో ఉద్ధరిస్తాననే గదా! మరి వదిలేస్తే ఎలా?- అనుకున్నాను.

మళ్ళీ అందుకున్నాను.

"సర్, వయస్సులో, అనుభవంలో మీరు నాకన్నా పెద్దవారు. నాకన్నా ఎక్కువగా ప్రపంచాన్ని చూసినవారు... దేశభవిష్యత్ దృష్టిలో వుంచుకుని, పి.ఎం గారితో కలిసి కీలకమైన సంస్కరణలు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అవి పూర్తిగా ఒక కొలిక్కి రాకముందే - అంటే మిమ్మల్ని ఏ లక్ష్యంతో ఆయన (పి.వి.) తీసుకువచ్చారో, ఆ లక్ష్యం పూర్తిగా నెరవేరకముందే - మీరు ఇలా ఒకరిద్దరు అసంతృప్తి వాదుల వ్యాఖ్యానాల కారణంగా ఆయన్ని, ఆయన లక్ష్యాల్ని వదిలేసి వెళ్ళిపోవాలనుకోవటం ఎంతవరకు సమంజసమో ఆలోచించండి..."

ఇప్పుడు కొంచెం ఊపిరి పీల్చుకున్నాను.

కొద్దిసేపు నిశ్శబ్దం!...

డాక్టర్ సింగ్ నోరు విప్పారు. ఇప్పుడు ఆయన మాటల్లో మొదట ఉన్న కరుకుదనం లేదు.

"అయితే - నేనేదో చెయ్యరాని పని చేస్తున్నట్లు నీకు అనిపిస్తోందా ప్రసాద్?...."

నేను 'ఔనన్నట్లు తలూపాను.

ఆయన మాట్లాడలేదు. నేనూ మాట్లాడలేదు. ఆయన ఆలోచనలో పడిపోయారు... అలా కొన్ని నిమిషాలు గడిచిపోయాయి.

మెల్లగా ఆయనే మళ్ళీ అందుకున్నారు. ఇప్పుడు చాలా నిదానంగా ఆచి తూచి మాట్లాడుతున్నారు.

"నువ్వు చెప్పిందాట్లో కొంత నిజం ఉంది ప్రసాద్... ఈ రెండు సంవత్సరాలకాలంలో ఆర్థిక సంస్కరణల విషయంలో చాలా చేశాం. సందేహం లేదు, ప్రధాని మద్దతు లేకపోతే, ఏ మాత్రం కూడా సాధ్యపడేది కాదు... కాని ఇంకా చేయాల్సింది చాలా ఉంది. అదీ నిజమే.... కానీ..."

ఆయన చెప్పటానికి సంకోచిస్తున్నారు.

"ఫరవాలేదు చెప్పండి సర్, మీరు నన్ను పూర్తిగా విశ్వాసంలోకి తీసుకోవచ్చు...." అన్నాను. ఈ సారి మరింత ఆగి ఆగి చెబుతున్నారు.

"అదే... నేను రాజీనామాను వాపసు తీసుకోనని... ఖండితంగా చెప్పేశాను గదా!... ఇప్పుడు మళ్ళీ నేనే ఎలాగ....?"

అర్థమైపోయింది. ఆయన పునరాలోచనలో పడ్డారు. పి.వి.కీ, దేశానికీ అన్యాయం చేస్తున్నానేమోనన్న భావనలోకి వచ్చారు. కాని, తనకుగా తాను రాజీనామా వెనక్కి తీసుకుంటే చూసేవాళ్ళ దృష్టిలో తన ప్రతిష్ఠ ఏమవుతుంది– అన్నదే ఆయన బెంగ.

ఇంక నేను వదలదల్చుకోలేదు.

"సర్, అది నాకు వదిలేయండి... రాజీనామాను మీరు వాపసు తీసుకోవద్దు. తీసుకోరు. అయితే, పార్టీలో అనేకమంది నాయకుల బలవంతం వల్లా, దేశ అవసరాల దృష్ట్యా మీ రాజీనామాను అంగీకరించేది లేదని ప్రధానమంత్రే చెబుతారు. అలాగే కొంతమంది నాయకులు ప్రధానమంత్రి తరఫున మీకు పత్రికా ప్రకటనల రూపంలో విజ్ఞప్తులు చేస్తారు - 'రాజీనామా గురించి ప్రధాని పై ఒత్తిడి చేయకండి' అంటూ. ఎలాగూ, మీరు పదవి కోసం ప్రాకులాడే మనిషి కారని అందరికీ తెలుసు. కాబట్టి ఇన్ని పరిణామాలు జరిగాక మీరు రాజీనామా కోసం పట్టుబట్టలేదూ అంటే అది మీ ఔన్నత్యం మాత్రమే అని అందరికీ అర్థమవుతుంది. మీరు రాజీనామా పై వత్తిడి చేయకపోవటం కేవలం దేశ ప్రయోజనాలకోసమే అని పత్రికల ద్వారా ప్రచారంలోకి వచ్చేలా ప్రధానమంత్రి మీడియా సలహాదారుగా నేను చేయిస్తాను...."

నా హామీతో ఆయన సంతృప్తి చెందారు.

" ఇప్పుడేం చేద్దాం?" డాక్టర్ సింగ్ ప్రశ్నించారు.

"సర్, మిమ్మల్ని తీసుకురమ్మని నన్ను ప్రధానమంత్రి పంపించారు. మనం ఆయన దగ్గరకు వెళ్దాం. ప్రధానమంత్రి మీ రాజీనామాను ఆమోదించడం లేదని చెబుతారు. ఆయన చెప్పదల్చుకున్న విషయాలేమైనా వుంటే చెబుతారు... ఇహ, మిగతా కార్యక్రమం అంతా నేను హామీఇచ్చిన విధంగా జరిగిపోతుంది...."

డాక్టర్ మన్‌మోహన్ సింగ్ భార్యవైపు చూశారు. ఆమె కూడా "వెళ్ళిరండి" అన్నట్లు చూసింది.

డాక్టర్ సింగ్ నా వైపు చూసి చిరునవ్వు నవ్వుతూ కుర్చీలోంచి లేచారు. నాతో కరచాలనం చేస్తూ అన్నారు.

"సరే పద.. వెళ్దాం"

* * *

డాక్టర్ మన్‌మోహన్‌సింగ్ రాజీనామాను పి.వి. నరసింహారావు గారు అనాడే ఆమోదించి వుంటే......???

* * *

'చంద్ర' జాలంలో పి.వి

ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుగారికి అత్యంత సన్నిహితుడుగా ప్రచారంలో వున్న 'మంత్ర-తంత్ర-ఆంత్ర నిపుణుడు' చంద్రస్వామి నన్ను పట్టుకుని నిలదీశారు.

"నేను పి.వి.గారికి ఎంత చేశాను? మీకు తెలుసుకదా! ఆయన ఇప్పుడిలా చేయొచ్చా? నా ఖర్మకి నన్నొదిలేస్తారా? ఇదేనా న్యాయం?..." అంటూ Godman గా పిలవబడే చంద్రస్వామి సంధించిన ప్రశ్నలకి నాకు నోటమాట రాలేదు.

సమాధానం చెప్పలేని నిస్సహాయ స్థితి నాది.

అసలు జరిగిందేమిటంటే...

ప్రధానితో పనిచేసిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో మొదటి రెండు సంవత్సరాలు ఎలావున్నా, చివర చివరకు ప్రధాని సన్నిహిత వర్గాలలో నాకు లేని పెద్దరికం ఆపాదించే సందర్భాలు చాలానే వచ్చాయి... అదిగో పులి అంటే ఇదిగో తోక అనే మనస్తత్వం అక్కడ... స్నేహితులుగానే వుంటూ ఆప్యాయంగానే మాట్లాడుతూ, అవకాశంవస్తే దెబ్బ తీయడానికి కొంతమంది అవకాశవాదులు అక్కడ అధికార కేంద్రాల చుట్టూ వుంటూనే వుంటారు. నేనెంతవాడిని?... ప్రధానిగారి నిర్ణయాలను అర్థం చేసుకొనే విషయంలో ఆయనకు చాలా దగ్గరవారే చాలా పొరపాటు చేశారు. పదవీ విరమణ తరువాత ప్రధానికి అదే పెద్ద సమస్య కావడానికి అవకాశమిచ్చింది.

చంద్రస్వామికి, పి.వి.గారికి గల సంబంధాల విషయంలో చాలా విమర్శలు, విశ్లేషణలు జరిగాయి. నాకు ఈ విషయంలో చాలామంది కంటే ఎక్కువగా అవగాహన చేసుకొనే అవకాశం కలిగింది. చంద్రస్వామి కూడా హైదరాబాదు వారే... కనుక పి.వి.గారితో పరిచయం ఈనాటిదికాదు... పి.వి.గారి స్వభావం ఎవరినీ దూరంపెట్టేదీకాదు, ఎవ్వరినీ దగ్గరకు తీసేదీకాదు... ఎవరు ఏం చెప్పినా వినేవారు. తాను చేయదలచినది చేసేవారు... ఆయనగా ఆయన ఎవ్వరికీ చెయ్యవలసినదానికంటే ఎక్కువ సహాయం (out of the way) చేసే అలవాటు లేదు...

కాని ఆయనకు మొదటినుంచీ ఒక అలవాటు. ఆయనగా ఆయన ఏమీచేయకపోయినా, ఆయన పేరు వాడుకొని ఎవరైనా ఏమైనా చేసుకొంటే ఆయన పట్టించుకొనేవారు కాదు. ఒక్క విషయం మాత్రం అందరికీ తెలిసేలా ప్రవర్తించేవారు... తన ప్రమేయం అందులో ఏమీలేదనీ, ఇతరులు తన పేరుతో ఏమైనా చేసుకొంటే బాధ్యత వారిదేనని, తానుమాత్రం దానిని సమర్థించేదిలేదని...

ఎంతమందిని మనం ఆపగలం? మనం చేయవలసినదల్లా, అప్పుడప్పుడు అందరికీ అర్థమయ్యేలా ఇతరులు తన పేరు వాడుకొంటే తన బాధ్యత లేదన్న విషయం అందరికీ తెలియచేయడం. ఆయన కొంచెం మొహమాటస్తుడు. ఎవ్వరినీ కటువుగా తనను చూడడానికి రావద్దని చెప్పేవారు కాదు. దీనితో ఆయనపై ఒక విమర్శ వచ్చేది. ఎవరన్నా ఆయన పేరు వాడుకుంటున్నారని తెలిసినా, వారిని పూర్తిగా దూరంగా ఉంచడం లేదని.

ప్రధానిగా ఉన్నప్పుడు కొందరు కుటుంబసభ్యుల ప్రవర్తన గురించి వచ్చిన విమర్శకు ఆయన సమాధానం అదే... "వారి కర్మలకు వారే బాధ్యులు... నేనెవ్వరినీ విమర్శించేదీ లేదు, సమర్థించేదీలేదు. పట్టుబడితే వారి ఖర్మ వారు అనుభవిస్తారు. నేను జోక్యం చేసుకోను. కాని మన తరఫున అప్పుడప్పుడు పత్రికలలో, 'నా పేరు వాడుకొనటానికి ఎవరికీ అధికారం ఇవ్వలేదని, అలా ఎవరైనా చేస్తే ప్రజలు మోసపోరాదనీ, దానికి నేను బాధ్యుడ్ని కాను - అని' ప్రకటించండి" అనేవారు. అలానే నేను ప్రకటనలు ఇప్పించేవాడిని.

చంద్రస్వామి విషయంలో పి.వి.గారిపై వచ్చిన విమర్శకూడా ఇదే విధమైనది. ఎవరూ పి.వి.గారు అధికార దుర్వినియోగం చేశారని ఆరోపించలేదు... కాని చంద్రస్వామి ఈయన పేరు వాడుకుంటుంటే నివారించలేరన్నదే వారి అభియోగం. చివర చివర చంద్రస్వామి మాత్రం పి.వి.గారు తనకేమీ చేయలేదని నిందారోపణలు చేశారు...

అసలు చంద్రస్వామి అనే వ్యక్తికి పి.వి. ఎందుకు ప్రాధాన్యతనివ్వాల్సివచ్చింది?

అయోధ్య విషయంలో కొంతమంది స్వామీజీలను కొత్తగా ప్రారంభించబోయే రామాలయ నిర్మాణ సంస్థలో చేర్చడానికి ప్రధాని తరఫున చంద్రస్వామితో నాకు మొదలైన పరిచయం, ప్రధాని అమెరికా యాత్రతో కొంతవరకు సన్నిహితమైందని చెప్పాలి. ప్రధాని అమెరికా యాత్రల్లో, ఆసారి యాత్ర చాలా కీలకమైనది. సంస్కరణలు మొదలై వ్రేళ్ళు నాటుకుంటున్న రోజులవి. విదేశీ పెట్టుబడుల అవసరం దేశానికి ఎంతైనా వుంది. మనం సంస్కరణలు చేస్తున్నామనుకోవడం వేరు. విదేశీ పెట్టుబడుదారులు మనపై నమ్మకం వుంచి పెట్టుబడులు పెట్టడం వేరు.... రాజకీయంగా మొదటినుంచీ అమెరికా పాకిస్థాన్‌కి దగ్గర, మనం రష్యాకి దగ్గర. నెహ్రూగారి ఏ వర్గానికి చెందని కూటమిగా మనం ప్రకటించుకున్నా - అమెరికా దృష్టిలో మనం పాత సోవియట్ యూనియన్‌కి (రష్యా) దగ్గర వారమనే ఉద్దేశ్యం...

పి.వి.గారి హయాంలో అప్పటివరకు అమెరికాకు గల వ్యతిరేక దృక్పథం నుంచి దౌత్య సంబంధాలను వ్యతిరేకరహిత స్థాయికి తీసుకురావడం జరిగింది. పెట్టుబడులు పెట్టాలంటే అది చాలదు - ఆ వాతావరణాన్ని చాలా సానుకూలంగా మలుచుకోగలిగితేనే అది సాధ్యం... మన రాజకీయాలకు అమెరికా రాజకీయాలకు చాలా వ్యత్యాసం వుంది. రెండూ ప్రజాస్వామ్యాలే అయినా, అమెరికాలో కొంత బాహాటంగానే పారిశ్రామికుల, పెట్టుబడిదారుల, వాణిజ్యవేత్తల ప్రభావం రాజకీయాలమీద, రాజకీయ నాయకుల మీద వుంటుంది. పత్రికలు, టీవిలు కూడా

తమదేశపు వాణిజ్యానికి, ఆర్థిక విధానాలకు పనికొస్తారనుకొంటేనే, ఇతర దేశాల నాయకులకు ఏ కొంచెమైనా ప్రచారం ఇచ్చేది.

మన సంస్కరణలు ఎంతవరకు సఫలీకృతం అయ్యాయి అన్నది తెలుసుకోవాలనుకుంటే, ఎంతమంది పారిశ్రామిక వేత్తలు భారత ప్రధానిని వారి అమెరికా పర్యటనలో కలిశారు?'ఎందరు సెనేటర్లు ఆయనతో సంప్రదించారు? వారి సెనేటుకు ప్రధానిని పిలిచి ప్రసంగం చేయించారు? లేదా, మన ప్రధాని పలకరించిన వారిలో 'ఫార్ట్యూన్ 500' సంస్థలెన్ని? అమెరికా అధ్యక్షుడు ఆయనతో ఎంతసేపు గడిపాడు?... మీడియాలు ఎలా రాశాయి?... ఇవన్నీ సూచికలే.

ఏ దేశమైనా డబ్బులు ఖర్చుపెట్టి Lobby (మన తరఫున పనిచేయటానికి) సంస్థలను ఎంపికచేసి వారి ద్వారా అమెరికా పెద్దలను కలవడం పద్ధతి. అమెరికాలోని మన రాయబార కార్యాలయం ఈ విషయాలు చూచుకోవాలి. పి.వి.గారికి విదేశీమంత్రిగా చాలా అనుభవం వుంది. రాయబార కార్యాలయంవారు కొన్ని పనులు బాగా చేసినా ఇటువంటి విషయాలలో మంచి పని చేయగలరన్న నమ్మకం ఆయనకు లేదు. Lobby ని ఎంపిక చేసినా, డబ్బు ఖర్చవడానికే కాని నిజంగా వారు మనకు కావలసిన పని చేయగలరా అన్న అనుమానం చాలావుంది. అయినా Lobyyist కోసం చాలా ఖర్చు పెట్టి ఎంపిక చేయడం జరిగింది... అమెరికా రాష్ట్రపతి క్లింటన్‌తో భేటీవేసి, సుహృద్భావపూరిత వాతావరణంలో చర్చలు జరపడం ద్వారా అమెరికాలో భారత దేశ సంబంధాల విషయంలో ఒక చెరగని ముద్ర వేయాలన్నది పి.వి.గారి అభిమతం.

ఆయన విడిగా కొన్ని ప్రయత్నాలు చేశారు. మంత్రుల్ని, కొంతమంది పార్లమెంటు సభ్యుల్ని, కొందరు పారిశ్రామిక వేత్తల్ని అమెరికా పంపారు. నన్ను పిలిచి, ఎవరెవరిని పంపారో వివరాలు చెప్పి, "వారితో నిన్ను contact చేయమనీ, ఎవరినైనా నన్ను కలవడానికి తీసుకువస్తే నువ్వు ఏర్పాటుచేస్తావనీ చెప్పాను" అన్నారు... వారు కొద్దిమందే - అందులో చంద్రస్వామి ఒకరు!

అమెరికాలో వీరిలో ఒకరిద్దరు నన్ను కలిసి, ఒకరిద్దరు అమెరికా ప్రముఖులు కలవడానికి ఏర్పాట్లు చేయమన్నారు... హ్యూస్టన్‌లో, వాషింగ్టన్‌లో చంద్రస్వామి, వారి తరఫున ఇంకో ఇద్దరు నాకు, ప్రధానికి ఊపిరి సలపనివ్వనంతమందిని తీసుకువచ్చారు. దాదాపు 30 మంది పారిశ్రామిక వేత్తలను – అందునా 'Fortune 500'లో వున్న 16 మందిని ప్రధానితో కలిపించాను. దాదాపు 8 మంది ప్రస్తుత సెనేటర్స్‌ని, నలుగురు మాజీ సెనేటర్లని కలిపించాను... ప్రముఖుల్ని ఇంకొందరిని కలిపాను. మిగతా అందరూ, Embassy, Lobbyist తో కలిపి చేసింది ఒక ఎత్తు, చంద్రస్వామి ఒక్కరూ చేసింది ఒక ఎత్తు. దానితో ప్రధాని అమెరికా యాత్ర రూపురేఖలు మారాయి. మనదేశంతో అమెరికా సంబంధాలలో మార్పు కనిపించేటంత ప్రభావం కనిపించింది. మన ప్రధాని కుటుంబ సభ్యులకి, క్లింటన్ భార్య హిల్లరీ గారితో వైట్‌హౌస్‌లో విందు ఏర్పాట్లని మన రాయబార కార్యాలయం చేయలేకపోతే, ఆఖరి నిమిషంలో చంద్రస్వామి తన సంబంధాలుపయోగించి చేశారు... ఆయన ఎలా చేశారు అన్నది నాకు తెలియదుకాని, అక్కడ ఉన్నతవర్గాలలో చాలామందితో ఆయనకు కీలక సంబంధాలు ఉన్న విషయం మాత్రం బాగా అర్థమైంది.

కొన్నాళ్ళ తరువాత ఒకనాడు చంద్రస్వామి వచ్చీరాని తెలుగులో "ఏవండీ, మీరైనా పి.వి. గారికి చెప్పండీ... దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. ఆయన మడికట్టుకు కూర్చుంటే తరువాత ఆయనకూ ఇబ్బంది, ఆయనకి అయినవాళ్ళకూ ఇబ్బంది. వి.పి.సింగ్ గారి హయాంలో నన్ను బదనాం చేయటానికి ప్రయత్నాలు జరిగాయి. కొన్నింటిలో పి.వి.గారి పేరుకూడా లాగారు. మనం అధికారంలో ఉండగానే, ఏం చేసుకోగలిగినా! నేను రెండుమూడు సార్లు అన్నాను... ఆయనేమీ పట్టించుకున్నట్లు లేదు. మీరు జ్ఞాపకం చేయండి" అన్నారు.

ఈ విషయం పి.వి.గారికి చెప్పాను. "ఆయనేదో మీపట్ల చాలా సానుభూతితో వున్నట్లున్నారు. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న సామెతని మీరు మర్చిపోయారేమో గుర్తుచేయ మంటున్నారు".

"నీతోనూ చెప్పాడూ? నన్ను చంపుకు తింటున్నాడు... మనకు అధికారం వచ్చింది - మనల్ని మనం బాగు చేసుకోడానికి కాదు. దేశానికి ఏమైనా చేయగలిగితే చేయడానికి... ఆయన కోరికలు చాలా వుంటాయి. ఎవ్వరికీ ఇబ్బంది లేనివి ఏదో ఒకటి రెండు చెయ్యవచ్చు... ఆయన స్వార్థానికో, మన స్వార్థానికో చేయటం మొదలుపెడ్తే మనకూ ఇతరులకూ తేడా ఏముంటుంది?"

"మరి ఆయన మళ్ళీ అడిగితే ఏం చెప్పమంటారు?" అన్నాను.

"నా దృష్టికి తెచ్చానని, నేనూ చూస్తానన్నాననీ చెప్పు" అన్నారు.

అదే చెప్పాను.

చంద్రస్వామి అసహనం ప్రదర్శించారు.

"ఆయన చూస్తూ వుంటే మన పుణ్యకాలం పూర్తవుతుంది. ఆయనకు చెప్పినా ఆయన చేయడు. ఇవాళ ప్రధానమంత్రి అయినప్పుడేకాదు, నాకు ఆయన 20 ఏళ్ళక్రిందట ముఖ్యమంత్రి అయినప్పటినుండి తెలుసు. ఆయన చేసుకోడు, మనకు చెయ్యడు... దేశం, దేశం అంటూ కూర్చుంటే ఆ తరువాత దేశం మనకేమీ చేయదు. ఇందిరాగాంధీని చూడు. తనకు కావలసిన వాళ్ళందరినీ ఎంచి మంచి అధికారహోదాల్లో వుంచింది. ఆవిడ దాకా వెళ్ళాల్సిన పని లేకుండానే, వారి పనులు, వారికి కావలసిన వారి పనులూ అయిపోయేవి. అధికారం పోయినా ఆవిడకు ఆవిడ కుటుంబానికి చేసిపెట్టడానికి సిద్ధపడేవారు ఇప్పుడూ ఉన్నారు. మరి ఈయన సంగతో, అధికారంలో ఉండగానే చేసేవాళ్ళు లేరు. ఈ అధికారం శాశ్వతమా? అది పోయినప్పుడు తెలుస్తుంది... అందుకే నీలోటివాళ్ళు కొంచెం సమయం చూసి సలహాలివ్వాలి... ఆయన మంచికే చెప్తున్నాను." అంటూ కొంచెం కరకుగా హితవు చెప్పారు చంద్రస్వామి.

"సరే ప్రధానితో మళ్లీ చెప్తాను" అన్నాను. నాది పోస్ట్‌మ్యాన్ ఉద్యోగం! ఒక శెలవురోజు ఉదయాన్నే వెళ్ళి యథాతథంగా ఈ సంగతి ప్రధానితో ప్రస్తావించాను.

"ఆయన చెప్పింది నిజమే. అదివరకు వారు అలా చేసుకొన్నారు కూడా! కాని, నాకెందుకో మొదటినుండి ఆ ధ్యాస లేదు. నీ నా తేడా చూపించే అలవాటు చేసుకోలేదు. భగవంతుడు

తప్ప మనకు చేసేవాళ్ళు ఎవ్వరూ లేరు. మనకు ప్రాప్తం వుంటే అవుతుంది, కాకుంటే లేదు... మనవాళ్ళు అని మనం తాపత్రయం పడటం తప్ప, ఎవ్వరూ మన వాళ్ళు కాదని రాజకీయ అనుభవంతో తెలుసుకొన్న నిజం. అందుకే ఎవ్వరేరనుకున్నా నా మనస్సాక్షిని బట్టి పోదలచుకొన్నాను. ఏ అధికారుల్ని ఎక్కడ వేయాలో నిర్ణయం ఆయన సలహామేరకు చేయాలనీ, వాళ్ళని అడ్డం పెట్టుకొని కొంత చక్రం తాను తిప్పవచ్చనీ చంద్రస్వామి ప్రయత్నం. Enforcement Department లో Director గా ఎవరో IAS అధికారిని వేయించమని అడిగాడు. ఇదేం IAS అధికారులయ్యా? పోస్టింగుకోసం ఆయన దగ్గరకు వెళ్ళేవాళ్ళు, ఆయన చెప్పుచేతలతో వుండకుండా వుంటారా? అంత సీనియర్ లెవెల్లో ఇంత కక్కుర్తి ఎందుకో? ఇప్పటికి నాలుగుసార్లు అతనిపేరు చెప్పాడు. నేను పట్టించుకోలేదు. నీతో చెప్పించాలని చూస్తున్నాడు...

"...కాని, కొన్ని విషయాలు – మనం అధికారికంగా చేయలేనివి, రాజకీయానికి దేశానికి అవసరమయ్యేవి చేయగల కుశలత అతనిలో వుంది... దానికోసం అతనితో సంబంధాలు అవసరం. అయితే అవకాశం ఇస్తే గుడిని, గుడిలో లింగాన్ని మింగగల సామర్థ్యం వుంది. అందుకని ఎంతవరకు అవసరమో అంతవరకే చేయించుకోవాలి. వీలయినంతవరకు చట్టపరంగా చేయగలిగినవి అయనకు చేసి పెట్టడం, చేయదలచుకోని విషయాలు, చేయకూడని విషయాలు దాటవేసుకుపోవడం అందరికీ శ్రేయస్కరం... ఎప్పుడైనా ఫలానా పనిని చేయలేమని ఖండితంగా మాత్రం చెప్పొద్దు" అన్నారు ప్రధాని.

1996లో పి.వి.గారి ప్రభుత్వం మారిపోయిన కొన్ని వారాల్లోనే కొత్త పరిణామాలు తోసుకువచ్చేశాయి.

చంద్రస్వామి సి.బి.ఐ కేసులలో ఇరుక్కోవడం, పి.వి.గారిని ఆయనతో పాటు నిందితుడుగా చూపడం... అంతా చంద్రస్వామి ఊహించినట్లే జరిగింది.

సెయింట్ కిట్స్ కేసులో సి.బి.ఐ. చంద్రస్వామిని నిందితుణ్ణి చేసింది. అప్పటి పరిస్థితులను బట్టి చంద్రస్వామితో పాటు పి.వి.ని కూడా ఆ కేసులో ఇరికించారు. లఖూభాయ్ పాఠక్ చీటింగ్ కేసులో కూడా చంద్రస్వామితో పాటు పి.వి.గారు ఇరుక్కుపోయారు. సి.బి.ఐ. కేసులు చంద్రస్వామిని నైతికంగా బాగా దెబ్బతీశాయి. అది కూడా పి.వి.గారికి చంద్రస్వామి సన్నిహితుడు అని బయట ప్రచారంలో ఉన్న కాలంలో జరగడం చంద్రస్వామిని కోలుకోలేని దెబ్బతీసింది.

సెయింట్ కిట్స్ కేసులో సిబిఐ చేసిన ఆరోపణ ఏమిటంటే – 1988–1989 కాలంలో – రాజీవ్‌గాంధి ప్రభుత్వంలో పి.వి.నరసింహారావు విదేశాంగమంత్రిగా వున్నప్పుడు రాజీవ్‌గాంధికి ప్రధాన ప్రత్యర్థిగా మారిన వి.పి.సింగ్ కొడుకు అజయ్‌సింగ్ పేరుమీద ఫోర్జరీ చేసిన పత్రాలతో 'అతను కారిబియన్ దీవుల్లోని సెయింట్ కిట్స్ దీవిలోగల ఫస్ట్ ట్రస్ట్ కార్పొరేషన్ బ్యాంకులో 21 మిలియన్ అమెరికన్ డాలర్లతో అక్కవుంట్ తెరిచినట్లు' ఒక కథ సృష్టించారు. అంటే ఈ సొమ్ము మొత్తానికి అప్పటి ప్రధానమంత్రి వి.పి.సింగే లబ్ధిదారు అని చూపించే ప్రయత్నం చేశారన్నది

ఆరోపణ. ఈ కేసులో పి.వి.గారిని, ఆయన మంత్రివర్గంలోని కె.కె.తివారిని, చంద్రస్వామిగా పిలవబడే నేమీచంద్ జైన్‌ని, ఆయన ప్రైవేట్ సెక్రటరీ కె.ఎస్.అగర్వాల్‌ని నిందితులుగా సి.బి.ఐ. పేర్కొంది.

ఈ కేసు నమోదయింది 1990 మేలో. కాని సి.బి.ఐ. విచారణ ఫలితం బయటపెట్టాలనీ, పి.వి.గారిని, ఇతర నిందితుల్ని ప్రాసిక్యూట్ చేయాలనీ వత్తిడి పెరిగింది మాత్రం 1996లో.

రెండో కేసులో - ఇంగ్లాండులో నివసిస్తున్న లఖూభాయ్ పాఠక్ తనను ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు పేరుమీద చంద్రస్వామి, ఆయన ప్రైవేట్ సెక్రటరీ కె.ఎస్.అగర్వాల్ (మామాజీ) లక్ష డాలర్ల మేరకు మోసం చేశారని ఆరోపించాడు. తాను ఇండియాకి కాగితపు గుజ్జు సరఫరా చేయటానికి సహాయం చేస్తామంటే చంద్రస్వామికి, మామాజీకి 30 వేల డాలర్లతో 'మర్యాదలు' చేశాననీ, కాని చివరికి మోసపోయాననీ ఆరోపిస్తూ పాఠక్, పి.వి.గారినీ, చంద్రస్వామినీ, మామాజీనీ కోర్టుకీడ్చాడు...)

ఆ కేసులు నడిచేరోజుల్లోనే ఒకసారి చంద్రస్వామి నాకు తారస పడ్డారు. నన్ను నిలదీశారు.

"ఏమండీ, చూశారా! నా మాట విన్లేదు ఆయన. ఇప్పుడు నాతోపాటు ఆయనా తిరుగుతున్నాడు కోర్టుల చుట్టూ. నేను చెప్పినట్లు చేసి వుంటే ఈ ఖర్మ పట్టేదికాదు కదా!..." చంద్రస్వామిగారి మాటల్లో ఆయన కడుపుమంట కొట్టొచ్చినట్లు వినబడింది.

నాకూ అప్పుడే సందేహం కలిగింది.

నిజమే. ఆ కేసుల విషయంలో పి.వి.గారు తలుచుకునివుంటే తన పేరూ, చంద్రస్వామి పేరూ కూడా లేకుండా రికార్డు మొత్తం తారుమారు చేయగలిగేవారు కదా? ఎందుకు చేయలేదు?

- నేను ఏ తప్పూ చేయనప్పుడు ఈ తప్పుడు పని మాత్రం ఎందుకు చేయాలన్న నైతిక నిబద్ధతా?
- జరిగేది ఎలాగూ జరిగి తీరుతుంది, మనమెవరం ఆపడానికీ - అన్న కర్మ సిద్ధాంతమా?
- ఎంతటి ఉపద్రవం వచ్చినా ఉదాసీన వైఖరి నవలంబించే తత్వమా?
- కేసులు మాఫీ చేయించాలని మనసులో వున్నా చేయించే ధైర్యం లేకపోవడమా?....

1972లో ఆయన ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసినప్పట్నుంచి, ఆయన తుదిశ్వాస వరకూ ఆయనతోవున్న అనుబంధంతో నేను అర్థం చేసుకున్న పి.వి తత్వాన్నిబట్టి ఒకే ఒక్క కారణం - అదే మొదటిది!

(పై కేసులన్నింటిలోనూ పి.వి.ని నిర్దోషిగా కోర్టులు ప్రకటించాయి.)

★ ★ ★

ముఖ్యమంత్రిగా రజనీకాంత్! - 1

తమిళ సినీరంగంలో ధృవతారలా వెలిగిపోతున్న రజనీకాంత్ కాంగ్రెసు పార్టీలో చేరటానికి రంగం సిద్ధమైంది....!

తమిళనాడు కాంగ్రెసు నాయకులు చాలాకాలంగా ఈ మహత్తర పరిణామం కోసం అర్రులు చాస్తున్నారు. "ఎప్పుడు రజనీకాంత్ కాంగ్రెసులో చేరతాడా, ఎప్పుడు జయలలితకి, కరుణానిధికి రాజకీయ సమాధి కట్టేద్దామా" అని వాళ్ళంతా ఉర్రూతలూగుతున్నారు.

రజనీకాంత్‌ని తీసుకొచ్చి ప్రధానమంత్రికి కలిపించి, మాట్లాడించటం, ఆ మరుక్షణమే రజనీకాంత్ కాంగ్రెసు తీర్థం తీసుకోవడం, మర్నాడే డిఎంకె, అన్నా డిఎంకెల మీద ఎన్నికల యుద్ధభేరి మ్రోగించడం - ఇదీ నిర్ణీత కార్యక్రమం.

ఒకటి రెండు రోజుల్లో రజనీకాంత్ వచ్చి కాంగ్రెసు పార్టీ సారధితో కలిసి మాట్లాడటానికి ఏర్పాటు జరిగింది. ఇదంతా రహస్యంగా జరుగుతున్న ఏర్పాటు అని మేం అనుకుంటున్నాం. కానీ రాజకీయ వర్గాలలో ఇది బహిరంగ రహస్యం మాత్రమే.

ఎందుకంటే తమిళనాడులో కాంగ్రెసు పార్టీ మళ్ళీ అధికారంలోకి రావాలంటే రజనీకాంత్ వంటి అసాధారణ ప్రజాదరణ, ప్రజాకర్షణగల తారని అక్కున చేర్చుకుని, ముందు పెట్టుకుని వెళ్ళక తప్పదు. ఆ పరిస్థితి ఎందుకు ఏర్పడిందంటే...

* * *

తమిళనాడులో ఎం.జి.ఆర్ యుగం ఆరంభమైనప్పట్నుంచీ అక్కడ రాజకీయాలు ప్రధానంగా రెండే పార్టీల మధ్య - డిఎంకె, ఎఐఎడిఎంకె - నడుస్తున్నాయి. ఈ మధ్యలో కాంగ్రెసుకి కొన్ని స్థానాలైనా దక్కాలంటే ఈ రెండింటిలో ఏదో ఒక పార్టీతో పొత్తు పెట్టుకోక తప్పదు... అధికారంలో ఒక పార్టీ ఉంటే, కాంగ్రెసు ప్రతి పక్ష పాత్ర నిర్వహించటం, ఎన్నికలప్పుడు ప్రధాన ప్రతిపక్షంతో పొత్తు పెట్టుకుని పోటీచేయడం జరుగుతోంది.

ఈ నేపథ్యంలో 1996 లో లోక్‌సభ ఎన్నికలొచ్చాయి. లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలలో తమిళనాడు ఒకటి. అప్పటికి జయలలిత సారథ్యంలోని ఎఐఎడిఎంకె అధికారంలో ఉంది. వారితో కాంగ్రెసు పొత్తు కుంటి నడక నడుస్తోంది.

మామూలు పరిస్థితుల్లో అయితే, ప్రతిపక్షంలో ఉన్న డిఎంకె పార్టీతో కాంగ్రెసు పొత్తు పెట్టుకోవాలి. కాని... రాజీవ్‌గాంధీ హత్యకి ముందు సంవత్సరాలలో తమిళనాడులో జరిగిన

అనేక ఎల్‌టిటిఇ అనుకూల ప్రదర్శనల్లో, కార్యక్రమాలలో డిఎంకె నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఉండడం, ఎల్‌టిటిఇకి చెందిన ఆయుధాల్ని, వైర్లెస్ పరికరాల్ని పెద్ద ఎత్తున పోలీసులు స్వాధీనం చేసుకొన్నప్పుడు ఎల్‌టిటిఇ నాయకుడు ప్రభాకరన్ అమరణ నిరాహారదీక్ష చేస్తే, ప్రభాకరన్ పట్ల డిఎంకె నాయకులు సానుభూతి వ్యక్తం చేయడం, డిఎంకె అధికారంలో ఉన్నకాలంలో తమిళనాడులో అనేక చోట్ల ఎల్‌టిటిఇ శిక్షణా శిబిరాలు నడవడం, రాజీవ్ గాంధీని ఎల్‌టిటిఇ హత్య చేసిన తరువాత 'స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్' (సిట్) దర్యాప్తు చేస్తున్న కాలంలో నిందితులకి ఆశ్రయం ఇవ్వడం వంటి ఆరోపణలను డిఎంకె వర్గాలు ఎదుర్కోవల్సిరావడం.... ఇలాంటి అంశాలన్నీ 'సిట్' దర్యాప్తు నివేదికలో బయటపడిన నేపథ్యంలో డిఎంకెతో పొత్తు పెట్టుకోవాలనే ధైర్యం ఏ కాంగ్రెస్ నాయకుడికి ఉంటుంది!

అందుకే తమిళనాడులో కాంగ్రెసు నాయకులెవరూ ఈ సారి ఎన్నికలలో ప్రధాన ప్రతిపక్షం (డిఎంకె)తో చేతులు కలపాలని ఆరాటపడటంలేదు. మరి, కరుణానిధి నాయకత్వంలోని డిఎంకె తోనూ కలవక, సొంతంగా పోటీచేసి గెలిచే అవకాశాలూ లేక కాంగ్రెసు పార్టీ ఏం చేయాలి? అధికారంలో ఉన్న జయలలిత సారథ్యంలోని ఎఐఎడిఎంకె తో పొత్తును కొనసాగించాలి. కాని ఇందుకు మూపనార్, చిదంబరం ప్రభృతులు సిద్ధంగా లేరు.

ఆమెది మొదట్నుంచీ ఎవరికీ అంతుపట్టని మనస్తత్వం. ఆమె మనస్సులో ఏముందో, చివరిదాకా ఆమె ఏం చేస్తుందో ఎవరికీ తెలీదు. ఆవిడకి ఎవరు దగ్గర వాళ్ళో, ఎవర్ని ఎంతకాలం దగ్గరగా ఉండనిస్తుందో తెలీదు. పొత్తుల వంటి విషయాలను ఆమెతో నేరుగా మాట్లాడాలి తప్ప ఆ పార్టీలో ఇంకెవరితో మాట్లాడినా ఉపయోగం లేదు. రాజకీయంగా పొత్తులో ఉన్న కాంగ్రెసు పార్టీ తాలూకు రాష్ట్ర నాయకుల్ని ఆమె దగ్గరికి రానీయదు... ఇలాంటి స్థితిలో తమవల్ల అధికారంలోకి వచ్చిన జయలలిత తమని నిర్లక్ష్యం చేస్తోందన్న భావం రాష్ట్ర కాంగ్రెసు నాయకులలో ఆమె పట్ల కావలసినంత కసి, ద్వేషం పెరగటానికి కారణమైంది.

మూపనార్, చిదంబరం, వారి సహచరులు, అనుయాయులు అనేకసార్లు పి.వి.గారి దృష్టికి ఈ విషయాలు తీసుకు వచ్చారు. ఆయన కూడా జయలలిత దగ్గర ఒకటి రెండుసార్లు ప్రస్తావించారు. అంతకుమించి సీరియస్‌గా జయలలితతో చర్చించడానికి పి.వి. ఇష్టపడలేదు. అయినా ఆమె వైఖరి మారలేదు. అలా జయలలిత వాళ్ళకి ఒక కొరకరాని కొయ్యగా తయారైంది.

"జయలలితతో పొత్తు ఇక మనకు కుదరదు సార్. ఆమెని మనమే అందలం ఎక్కించి, ఇప్పుడు మాత్రం మా నోరు విప్పి మాట్లాడటానికి వీలులేని విధంగా ఆ పల్లకీని మోస్తూనే ఉండాలా? పార్టీ కార్యకర్తలకి కడుపుమండి పోతోంది... ఈసారి ఎన్నికలలో మాత్రం జయలలితతో మనకి పొత్తు వద్దు".... ఇది ప్రధాని, పార్టీ అధ్యక్షుడైన పి.వి. సమక్షంలో మూపనార్, చిదంబరం వంటి తమిళనాడు కాంగ్రెసు నాయకుల వాదన. కొద్దిమంది కాంగ్రెసు నాయకులు జయలలితతో పొత్తుకు సిద్ధంగా ఉన్నా అది జయలలితపై అభిమానంతో కన్నా మూపనార్‌పై వ్యతిరేకత కారణంగా రాష్ట్ర పార్టీలో ఏర్పడిన వర్గ తగాదాల వల్లనే.

పి.వి దగ్గర ఒక సుగుణం వుంది. ఎవరేం చెప్పినా వింటారు. అవతలివాళ్ళు చెప్పేది వినటానికి ఎక్కువ సమయం ఖర్చుపెడతారు. తాను నిశ్చితాభిప్రాయానికి వచ్చాక చెప్పదల్చుకున్నది క్లుప్తంగా చెప్పేస్తారు.

జయలలితతో పొత్తు వద్దు అంటే 'అలవాటు' ప్రకారం ప్రధాన ప్రతిపక్షమైన డి.ఎం.కెతో పొత్తు పెట్టుకోవాలి. కానీ, రాజీవ్ గాంధీ హత్య దర్యాప్తులో బయటపడిన వాస్తవాల దృష్ట్యా "డిఎంకెతో పొత్తు" అనే మాటను ఉచ్చరించటానికి ఎవరికీ ధైర్యం లేదు... తమిళనాడు ముఖ్య కాంగ్రెసు నాయకులు ఈ అంశాలన్నీ చర్చించుకొని రజనీకాంత్‌ని రాజకీయాల్లోకి దించటమే 'సంజీవని' లాంటి పరిష్కారంగా ఎంచుకున్నారు.

అందుకే "అయితే ఏం చేద్దామంటారు?" అని పి.వి ప్రశ్నించగానే ఈ పరిష్కారాన్ని ఆయన ముందు ఆవిష్కరించారు.

".... రజనీకాంత్ రాజకీయాల్లోకి రావటానికి సుముఖంగా ఉన్నాడు. అతనికి ప్రజల్లో అపారమైన ఆదరణ ఉంది. నిజాయితీపరుడని పేరుంది. కరుణానిధిని, జయలలితని కూడా దెబ్బతీయాలంటే, అతన్ని కాంగ్రెసులో చేర్చుకుని, అతని సారథ్యంలో తమిళనాడులో మన పార్టీ ఎన్నికలకి వెడితే, మనకి విజయం తథ్యం. మీరు 'ఊ' అంటే అతని చేత మీతో మాట్లాడిస్తాం."

పి.వి బాగా ఆలోచించి, అడిగారు : "రజనీకాంత్ కాంగ్రెసులో చేరతారని మీరు నమ్ముతున్నారా?"

మూపనార్, చిదంబరం ప్రభృతులు కోరుకొంటున్న సమయం వచ్చేసింది. "ఆ విషయం మాకు వదిలేయండి. రజనీ రావడం ఖాయం" అని హామీ ఇచ్చేశారు.

"సరే, ఈ విషయం ఖరారయ్యేదాకా రహస్యంగా ఉంచండి. అలాగే జయలలితని దూరం చేసుకొంటున్నట్లుగా ఇప్పుడేమీ మాట్లాడకండి...." అంటూ రజనీకాంత్ 'రాక'కి పివి తెరతీశారు.

పి.వి అంగీకారంతో ఆనందపడిన తమిళనాడు నాయకులకి ఇందులో రెండో భాగం నచ్చలేదు. "రజనీకాంత్ రావడం ఖాయం అన్నాక, ఇంకా జయలలితని దూరం చేసుకోవద్దంటాడేమిటి ఈయన! అహంభావం తలకెక్కిన జయలలితని మళ్ళీ మోస్తామా? అసంభవం..." ఇలా ఉన్నాయి వాళ్ళ ఆలోచనలు. ఏదైనా పార్టీ అధ్యక్షుడి మాట వినక తప్పదు....

పి.వి నరసింహారావు కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు. భారతదేశానికి ప్రధానమంత్రి. పైగా ఇందిరాగాంధీ కుటుంబానికి విధేయుడు.... పార్టీకి సంబంధించి ఏ నిర్ణయం తీసుకోవాల్సివచ్చినా ఆయన ఈ మూడు కోణాల్లోంచి ఆలోచించి తీసుకోవటానికే అలవాటుపడ్డారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం ఆయన నైజానికి విరుద్ధం.

పార్టీ ఎన్నికలలో గెలవడం ఎంత ముఖ్యమో, పార్టీ ప్రతిష్ఠ కూడా అంతే ముఖ్యమనీ, మన ఆలోచనలు పార్టీ ఈ ఒక్కరోజు గెలవడం కోసమే కాక దీర్ఘకాలం మనుగడ సాగించడానికి

దోహదపడేలా ఉండాలనీ ఆయన విశ్వసించారు. పార్టీ శ్రేయస్సు కోసం గానీ, ప్రభుత్వ ప్రయోజనాలకోసం గానీ ఆయన ఇవ్వదల్చుకున్న సూచనల్ని, సలహాల్ని (ఇందిరాగాంధీ హయాంలోనూ, రాజీవ్‌గాంధీ హయాంలోనూ) అంతర్గత సమావేశాల్లో మాత్రమే ఇచ్చేవారు. బయట అనవసర వ్యాఖ్యలు చేయడం గానీ, తోటి నాయకులతో వివాదాస్పద చర్చలలోకి దిగడం గానీ, పత్రికలవారితో వాగ్వాదానికి దిగటం గానీ.... ఇవన్నీ ఆయన ప్రవృత్తిలో లేని లక్షణాలు. పైగా మొదట్నుంచీ కాంగ్రెసు పార్టీలోనే ఉన్న పి.వి 1969లో కాంగ్రెసు పార్టీ చీలినప్పుడూ, తిరిగి 1978లో చీలినప్పుడూ కూడా ఇందిరాగాంధీతోనే ఉన్నారు.

బహుశా అందుకే, రాజీవ్ గాంధీ హత్యానంతరం ఎవరు పార్టీ పగ్గాలు స్వీకరించాలి అన్న ప్రశ్న వచ్చినప్పుడు అన్ని వర్గాల నాయకులకీ ఏకాభిప్రాయం తీసుకువచ్చిన ఒకే ఒక్క పేరు పి.వి నరసింహారావు.

"కాంగ్రెసు పార్టీపట్ల ఆయనకున్న విధేయత, నిజాయతీ, నిరాడంబరత, రాజనీతిజ్ఞత కారణంగా ఆయన ఈ బాధ్యతలు స్వీకరించాలని పార్టీ కోరటం జరిగింది..." ఇది 1991 మే చివరివారంలో కాంగ్రెసుపార్టీ అధ్యక్షునిగా పి.వి.ని కాంగ్రెసు వర్కింగ్ కమిటీ ఎన్నుకున్న తర్వాత పార్టీ అధికార ప్రతినిధి విలేకరుల సమావేశంలో చెప్పిన మాటలు.

తాను ప్రధానమంత్రి అయ్యాక కూడా ఆయన రాజీవ్‌గాంధీ కుటుంబం గురించి ఆరాటపడేవారు. తరచూ వెళ్ళి శ్రీమతి సోనియాను పరామర్శిస్తూండేవారు. ఆమెకీ, ఆమె పిల్లలకీ ఎటువంటి లోటూ రాకూడదని అధికారుల్ని పదే పదే ఆదేశించేవారు. వాళ్ళ భద్రతా ఏర్పాట్ల గురించి ఎప్పటికప్పుడు వాకబు చేస్తుండేవారు. "వాళ్ళ అవసరాలని ఎప్పటికప్పుడు మనమే కనిపెట్టి చూస్తూండాలి ప్రసాద్. కొంచెం నువ్వూ, రామూ (పర్సనల్ సెక్రటరీ రామూ దామోదరన్) కూడా శ్రద్ధ తీసుకోండి... రాజీవ్ గాంధీ విషయంలో సంభవించిన భద్రతాలోపం ఆ కుటుంబం విషయంలో ఎప్పుడూ జరక్కూడదు..." ఇలా ఉండేది ఆయన ఆరా, ఆదుర్దా.

అందుకే ఆయన – "రాజీవ్ గాంధీ హత్యకి కారణమైన ఎల్‌టిటిఇతో సంబంధాలున్న డిఎంకెతో పొత్తు ప్రసక్తే లేదు," అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. .... ఇవన్నీ తెలుసు తమిళనాడు కాంగ్రెసు నాయకులకి. అయితే దీనికి పరిష్కారం ఏమిటి? తమిళనాడు ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ పరిస్థితి ఏమిటి???

ఈ దశలో ఒకరోజు ప్రధానమంత్రి పి.వి నన్ను పిలిపించారు.

"దేశంలో అత్యంత విశ్వసనీయత ఉన్న సంస్థ ద్వారా తమిళనాడులో ఒక సర్వే చేయించాలి ప్రసాద్" అన్నారు. నాకు విషయం అర్థమైంది.

ప్రధానమంత్రికి మీడియా సలహాదారుగా, అదనపు కార్యదర్శిగా నాకు విస్తృతమైన పరిచయాలు, అధికారాలు ఉంటాయి. కనుక వాటిని ఉపయోగించి మూడు రకాలుగా సర్వే చేయించాను.

'ఓ.ఆర్.జి మార్గ్' దేశంలో ఒక పెద్ద మార్కెట్ సర్వే ఏజన్సీ. వాళ్ళతో అతి విస్తృతమైన సర్వే తమిళనాడులో జరిపించాను. అప్పటి భద్రతా విభాగం సెక్రటరీగా ఉన్న వ్యక్తికి గతంలో ఇంటెలిజెన్స్‌లో దీర్ఘకాలం పనిచేసిన అనుభవం ఉన్న దృష్ట్యా ఆయన ద్వారా మరో సర్వే అనధికారికంగా జరిపించాను. మూడవది – కేంద్ర ఇంటెలిజెన్స్ విభాగం నిర్వహించిన సర్వే.

ఈ మూడు సర్వేల ఫలితాలు 1996లో ఎన్నికలకు మూడు మాసాలు ముందుగా మాకు చేరాయి. వీటన్నిటినీ క్రోడీకరించి, ఒక సమగ్ర నివేదికను ప్రధానికి సమర్పించాను. ఆ నివేదిక సారాంశం:

"...ఏ ఇతర పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా కాంగ్రెసు పార్టీ స్వతంత్రంగా పోటీ చేస్తే సీట్లు రావు. డిఎంకె, ఎఐఎడిఎంకె పార్టీలలో ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా, ఆ రాష్ట్రంలో కాంగ్రెసు మనుగడ కొనసాగుతుంది... రజనీకాంత్ కనుక రాష్ట్రంలో కాంగ్రెసు పార్టీ పగ్గాలు చేపడితే, ఆయన సారథ్యంలో కాంగ్రెసు పార్టీ స్వతంత్రంగా పోటీచేస్తే అధికారంలోకి వస్తుంది. ఎందుకంటే ఇప్పుడున్న కాంగ్రెసు నాయకుల సామర్థ్యం మీద ప్రజలకు నమ్మకం లేదు. కానీ, రజనీకాంత్‌కు అపారమైన ప్రజాదరణ వుంది. .... ఎఐఎడిఎంకెతో పొత్తు పెట్టుకుంటే గెలవడం కష్టం. జయలలితకి ప్రజాదరణ సన్నగిల్లింది.... డిఎంకెతో పొత్తు పెట్టుకుంటే గెలిచే అవకాశాలు ఎక్కువ...."

....ఈ నేపథ్యంలో మూపనార్ – చిదంబరం వర్గం పి.వి.ని కలిసి, రజనీకాంత్‌ని కాంగ్రెసులోకి ఆహ్వానించటమే పరిష్కారంగా సూచించారు. అప్పటికే సర్వే నివేదికల సారాంశం క్షుణ్ణంగా చదివి జీర్ణించుకున్న పి.వి కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరించారు. "డిఎంకె, ఎఐఎడిఎంకెలతో పొత్తు పెట్టుకోకుండా రజనీకాంత్‌ని రాజకీయాల్లోకి దించితే కాంగ్రెసు గెలుపు తథ్యం" అన్నదే అందరి విశ్వాసం.

★ ★ ★

అలా–

రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశానికి రంగం సిద్ధమైంది 1996 ఫిబ్రవరిలో.

ఇది తమిళ కాంగ్రెసు నాయకులలో కొత్త ఉత్సాహం, ఊపు తీసుకువచ్చింది. పి.వి.గారు రజనీకాంత్ కాంగ్రెసు ప్రవేశానికి ఒప్పుకున్నారన్న విషయం మూపనార్ తదితర నాయకులందరినీ ఆనందంలో ముంచేసింది. ఎందుకంటే, రజనీకాంత్‌ని తీసుకొస్తానన్నదే మూపనార్. అప్పటికే ఆరునెలలుగా వాళ్ళంతా తమిళనాడులో జయలలిత "ప్రజావ్యతిరేకపాలన" గురించి బాహాటంగా దుమ్మెత్తిపోస్తూ వచ్చారు. అనేక బహిరంగ ప్రకటనలు చేశారు. ఫలితంగా కాంగ్రెసు పార్టీలో కొంతమంది అప్పటికే జయలలితకి చాలా దూరమయ్యారు. (అయినప్పటికీ ఎన్నికలలో పొత్తుకి ఆమె సిద్ధంగానే ఉంది. ఈ మేరకు ప్రధానమంత్రికి ఆమె రాయబారం కూడా పంపారు.) ఈ

స్థితిలో రజనీకాంత్ వస్తే.... కాంగ్రెసు పార్టీ రంగుల హరివిల్లు ఎక్కి తమిళనాడులో స్వైర విహారం చేసినట్లే!

రజనీకాంత్ రావటానికి అంతా సిద్ధమయ్యాక కూడా పి.వి ఈ నాయకుల్ని పిలిచి మరోసారి హెచ్చరించారు:

"రాజీవ్ గాంధీ హత్య విషయంలో ఎల్‌టిటిఇ పాత్ర, ఎల్‌టిటిఇతో డిఎంకె సంబంధాల దృష్ట్యా మనం డిఎంకెతో పొత్తు పెట్టుకోవడం లేదు. ఇది సుస్పష్టం. ఎఐఎడిఎంకెతో పొత్తు విషయంలో మీరు ఇప్పుడేమీ మాట్లాడకండి. రజనీకాంత్ వ్యవహారం పూర్తిగా ఫలప్రదం అని తేలేదాకా జయలలితతో పొత్తు మార్గాల్ని మూసి వేయొద్దు...."

నాయకులు అయిష్టంగానే తలూపారు. అయినా వాళ్ళ ఆశ అంతా అప్పటికి రజనీకాంత్ మీదే కేంద్రీకృతమై ఉండటంతో జయలలితతో పొత్తు అన్న అంశం తలెత్తబోదని వాళ్ళు ధీమాగా ఉన్నారు.

* * *

రజనీకాంత్‌ని మూపనార్ ఢిల్లీ తీసుకువచ్చారు.

ఆ రాత్రి రేస్ కోర్సు రోడ్డులోని ప్రధానమంత్రి నివాసంలో రజనీకాంత్ స్వయంగా పి.వి.ని కలిశారు. పి.వి తన రాజనీతిజ్ఞత అంతా ఉపయోగించి, రజనీకాంత్‌ని లాంఛనంగా కాంగ్రెసులోకి ఆహ్వానించారు. రజనీకాంత్ కాంగ్రెస్ పార్టీలో చేరి, ఆ పార్టీని తమిళనాడులో అధికారంలోకి తీసుకువచ్చినట్లయితే అతనే ముఖ్యమంత్రి కాగలడు అన్న విశ్వాసం అతనిలో కలిగేలా చేశారు.

రజనీకాంత్ ఆ పూట అత్యుత్సాహం ప్రదర్శించారు. కాంగ్రెసు నాయకులంతా "హమ్మయ్య" అని నిట్టూర్చారు. మూపనార్‌కైతే అంబారీ ఎక్కినంత ఆనందంగా ఉంది. "ఇహ చూస్కో జయలలితకి చూపిస్తా నా తడాఖా" అంటూ వ్యాఖ్యలు సంధించారు.

క్షణాలమీద తమిళనాడులోని కాంగ్రెస్ నాయకులందరికీ మూపనార్ ప్రభృతులు టెలిఫోన్‌లు చేశారు. "సిద్ధంగా ఉండండి. రేపు రజనీకాంత్‌కి వీరగంధంతో స్వాగతం పలకాలి" అంటూ వాళ్ళు ఎడతెరిపి లేకుండా కార్యకర్తలకి ఆదేశాలు పంపారు.

కాని, అసలు జరిగిందేమిటి...?

* * *

ముఖ్యమంత్రిగా రజనీకాంత్! - 2

ప్రముఖ సినీ నటుడు రజనీకాంత్‌కి కాంగ్రెస్‌పార్టీ తీర్థం ఇచ్చేసి, తమిళనాడులో 'అహంభావి' జయలలిత పాలనకి చరమగీతం పాడేస్తున్నామన్న ఆనందంతో ఆ రాత్రంతా తమిళనాడు కాంగ్రెస్ నాయకులు మూపనార్ ప్రభృతులు న్యూఢిల్లీలో చాలా హడావుడి చేశారు.

ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు తన అసాధారణ రాజనీతిజ్ఞతతో రజనీకాంత్‌ని ఒప్పించేశారని వాళ్ళంతా పి.వి.గారిమీద ప్రశంసల వర్షం కురిపించారు. తమిళనాడులో కొన్ని దశాబ్దాల తరువాత కాంగ్రెస్‌పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చేసినట్లూ, రజనీకాంత్ ముఖ్యమంత్రిగా తాము రాజకీయాలలో చక్రం తిప్పేస్తున్నట్లూ ఆ రాత్రంతా కలలుకంటూనే గడిపారు ఆ నాయకులంతా.

ఈ ఆనందం అంతా ఆ ఒక్క రాత్రికే.

మర్నాడు సాయంత్రం చెన్నైలో రజనీకాంత్ విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాల్లోకి దిగాలన్న ఆలోచన ఏమీ లేదు పొమ్మన్నారు. "ప్రధానమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నాను. అంతే" అన్నారు...

అంతే!!

మూపనార్, చిదంబరం తదితర తమిళ కాంగ్రెసు నాయకులు షాక్ తిన్నారు!....

తేరుకోవటానికి వాళ్ళకి టైమ్ పట్టింది.

రెండోరోజు సాయంత్రం మూపనార్, చిదంబరంలు పరుగెత్తుకుంటూ వచ్చారు పి.వి దగ్గరకి. పి.వి. ఓ చిన్న నవ్వు నవ్వారు. నలభై ఏళ్ళ రాజకీయానుభవంతో పరిణతి చెందిన నవ్వు అది!

"జరిగినదాని గురించి మన సమయం వృథా చేయవద్దు. జయలలితని దూరం చేసుకుంటున్నట్లు ఇంతవరకూ మనం అధికారికంగా ఏమీ చెప్పలేదు కదా! సీట్ల సర్దుబాటు గురించి మాట్లాడడానికి సిద్ధంగా ఉన్నామని కబురు చేయండి. కసరత్తు ప్రారంభించండి.. " అని ముక్తసరిగా చెప్పేశారు పి.వి.

ఇది మరో షాక్!

వాళ్ళకి మింగుడు పడలేదు.

చూసి, చూసి జయలలితతో పొత్తా?

ఏ జయలలిత తమను నిర్లక్ష్యంచేస్తోందని నిన్నటిదాకా దుమ్మెత్తిపోశారో, ఆమెతో మళ్ళీ పొత్తా? ఎఐఎడిఎంకెతో సీట్ల సర్దుబాటా?

ఎలాంటి సంకోచం లేకుండా వాళ్ళు చెప్పదలచుకున్నది చెప్పేశారు. "... సర్, జయలలితతో పొత్తుకి మన కార్యకర్తలు ఇష్టపడరు.."

"మనకి వేరే ప్రత్యామ్నాయం లేదు గదా? కార్యకర్తలకి నచ్చచెబుదాం..."

తమిళనాడు కాంగ్రెసు నాయకులు ఆచి తూచి మాట్లాడుతూ, మెల్లగా తమ మనస్సులో మాట బయట పెట్టారు.

"... డిఎంకెతో పొత్తు పెట్టుకుందాం...."

ఈ సలహా పి.వికి సుతరామూ నచ్చదని వాళ్ళకీ తెలుసు. కానీ వాళ్ళ ప్రాధాన్యత వాళ్ళ ఆత్మగౌరవానికే.

పి.వి హెచ్చరించారు : "చరిత్ర మర్చిపోయినట్లున్నారు...!"

"... కాదు సర్, ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీ గెలవాలంటే డిఎంకెతో పొత్తు పెట్టుకోవడం తప్ప మనకు గత్యంతరం లేదు. పైగా కరుణానిధితో పొత్తు వల్ల పార్టీ ఎక్కువ స్థానాలు గెల్చుకుంటుంది...."

"రాజీవ్ గాంధీని హత్య చేసిన ఎల్‌టిటిఇ తో డిఎంకెకి సంబంధాలున్నాయని అప్పట్లో అంతా ప్రకటనలు చేశారు గదా!...."

"... అదంతా నిజమే సార్. కానీ రాజకీయంగా ముందు మా రాష్ట్రంలో నిలదొక్కుకోవాలంటే ఎవరితోనో ఒకరితో పొత్తు పెట్టుకోవాలి గదా! రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వాలు, మిత్రత్వాలు ఉండవని మీకు తెలుసు కదా!...

"...జయలలిత నాయకత్వ నైజంతో నలిగిపోయిన రాష్ట్ర కాంగ్రెసు నాయకులు మళ్ళీ ఎలా ఆమెతో కలుస్తారు?... ఎల్‌టిటిఇతో డిఎంకె నాయకులకు సంబంధాలున్నాయని అందరం అప్పట్లో ప్రకటనలు చేసిన మాట నిజమే. అంతమాత్రాన కరుణానిధే రాజీవ్‌గాంధీని హత్య చేయించాడని మనం అనలేదు గదా!..."

ఇలా సాగాయి వాళ్ల వాదనలు. విచిత్రం ఏమంటే మూపనార్, చిదంబరం, మణిశంకర్ అయ్యర్, జయంతి నటరాజన్ వంటి – రాజీవ్ గాంధీకి, ఆయన కుటుంబానికి అత్యంత విధేయులమని చెప్పుకునే – నాయకులే ఎక్కువగా ఇలా వాదించారు ప్రధానమంత్రి పి.వితో.

వాళ్ళ వాదనల వెనకాల వాళ్ళని వెంటాడుతున్న మరో అక్కసు ఏమిటంటే కరుణానిధిని వ్యతిరేకించే కాంగ్రెసు నాయకుడు తంగబాలు వర్గం జయలలితతో పొత్తుకి అనుకూలురు.

ఇదికాక, ఎవరో జ్యోతిష్కుడు చెప్పాడనో, పి.వి.గారి సన్నిహిత సలహాదారులు చెప్పారనో ఆయన ఈ నిర్ణయానికి వచ్చారని జరుగుతున్న నిరాధార ప్రచారం కొంత. మొత్తం మీద ఆయన నిర్ణయం వాళ్ళకి గొంతులో పచ్చి వెలక్కాయలా తయారైంది. ఎవరు ఎన్నిరకాలుగా మాట్లాడినా రాజీవ్‌గాంధీని హత్య చేసిన ఎల్‌టిటిఇతో సంబంధాలున్నట్లు ముద్ర పడిన డిఎంకెతో పొత్తు పెట్టుకోవడానికి పి.వి. ససేమిరా అంగీకరించలేదు.

తమిళనాడు నాయకులకి ఏం చేయాలో తోచలేదు. సందిగ్ధంలో పడిపోయారు. చివరికి.... "సరే సర్, ఇప్పుడు కార్యకర్తల్ని ఒప్పించడం చాలా దుర్లభం. ఆర్నెల్లుగా వాళ్ళంతా జయలలితకి వ్యతిరేకంగా ఏకమయ్యారు. ఇప్పుడు ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో!... సరే, ప్రయత్నం చేస్తాం..." అంటూ అయిష్టంగానే ఆ నాయకులు చెన్నై బయల్దేరి వెళ్ళారు.

★ ★ ★

48 గంటలు తిరిగే లోపల పరిణామాలు శరవేగంగా చోటుచేసుకున్నాయి. "జయలలితతో పొత్తుకి కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు.... డిఎంకెతో పొత్తు అనివార్యం.... తమిళనాడులో అసలు కాంగ్రెసు మాదే.... " అంటూ కొందరు కాంగ్రెసు నాయకులు ప్రకటనలు గుప్పించారు. అలా కాంగ్రెసు పార్టీ కార్యాలయాల్ని మూపనార్ వర్గీయులు ఆక్రమించేశారు. తమిళనాడులో కాంగ్రెసు రెండుగా చీలిపోయింది. ఒకటి పి.వి సారథ్యంలోని జాతీయ కాంగ్రెసు, మరొకటి మూపనార్ కాంగ్రెసు.

వెంటనే కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సమావేశమైంది. జయలలిత సారథ్యంలోని ఎఐఎడిఎంకెతో పొత్తుని ప్రకటించింది.... అప్పటికి నామినేషన్ల దాఖలుకి తుది గడువు రెండు రోజులు మాత్రమే.

పొత్తు అనిశ్చితంగా కనిపించడం వల్ల అప్పటికే అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ రెండు పార్టీల వాళ్ళూ నామినేషన్లు దాఖలు చేసేశారు. ఇప్పుడు జరగాల్సింది సీట్ల సర్దుబాటుకి కసరత్తు మాత్రమే.

ఆ రాత్రి చెన్నై నుంచి జయలలిత తరఫున ఇద్దరు మంత్రులు ఢిల్లీకి వచ్చారు. మరోసారి కాంగ్రెసు వర్కింగు కమిటీ రేస్ కోర్సురోడ్డు నెంబర్ 7 (ప్రధాని క్యాంపు కార్యాలయం) లో ఆ రాత్రి సమావేశమవుతోంది. ఆ దృష్ట్యా జయలలిత ప్రతినిధులతో మంతనాలకి శరద్ పవార్‌ని, పార్టీ ప్రధానకార్యదర్శి జనార్ధన్ పూజారినీ, సెక్రటరీ ద్వివేదిని రేసుకోర్సు రోడ్డు నెంబర్ 5కి పంపించారు.

ఆ రాత్రికి రాత్రి సీట్ల సర్దుబాటు ఖరారై తీరాలి. ఒక్క రోజు గడిస్తే నామినేషన్లు వేసే అవకాశం కూడా ఉండదు.

రేస్‌కోర్సు రోడ్డులోని 3,5,7 నెంబర్లతో ప్రక్కప్రక్కనే వుండే భవనాలు ప్రధానమంత్రికే కేటాయించివుంటాయి. 'నెంబరు 3' ప్రధానికి నివాస భవనం. 'నెంబరు 5' ఆయనకి ప్రైవేట్ కార్యాలయం. 'నెంబరు 7' ఆయనకి అధికారిక క్యాంప్ కార్యాలయం.

నేను ఉద్దేశపూర్వకంగా ఈ సీట్ల సర్దుబాటు చర్చలు జరుగుతున్న 'నెంబరు 5' భవనంవైపు పోలేదు. ఒక ఐఏఎస్ అధికారిగా పార్టీ వ్యవహారాల్లో కల్పించుకోవటం నా పనికాదు. పైగా గతంలో మాధవరావు సింధియాగారి పుణ్యమా అని ఒక చేదు అనుభవం తాలూకు ఛాయలు ఇంకా నన్ను వెంటాడుతూనే వున్నాయి.

★ ★ ★

1992 లో ఘోర విమాన ప్రమాదం ఒకటి జరిగింది. దాంతో మనస్తాపం చెందిన అప్పటి పౌర విమానయాన మంత్రి మాధవరావు సింధియా ఆ ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ తన మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పత్రికలలో ఆ ప్రకటన వార్త వచ్చాక, అప్పుడు తన రాజీనామా లేఖని ప్రధానికి పంపించారు.

కాకతాళీయంగా ప్రధాని ఆ లేఖకి ప్రతిస్పందించినప్పుడు అక్కడ నేను కూడా ఉన్నాను. "ఇలా ప్రతి దానికీ ప్రతి మంత్రీ నైతిక బాధ్యత వహించేట్లయితే మన మంత్రివర్గం మొత్తం ఖాళీ అయిపోతుందేమో" అంటూ పి.వి.గారు జోక్ చేశారు. నేనూ నాతోపాటు అక్కడున్న మరో ఒకరిద్దరు అధికారులూ నవ్వేశాం. సింధియాగారు పెద్దమనిషి. ఆయనంటే పి.వి.గారికి చాలా ఇష్టం. రాజకీయ వర్గాలలో అందరికీ ఈ సంగతి తెలుసు. "ఈ రాజీనామాని వాపసు తీసుకోవలసిందిగా నేను కోరుతున్నట్లు ఆయనకి కబురు చేయండి" అన్నారు పి.వి. ఆ పనిని వేరెవరికో అప్పగించారు. కాని కొన్ని గంటలలోనే సింధియాగారి ప్రతిస్పందన వచ్చేసింది. "నేను వాపసు తీసుకోను. నా రాజీనామాని అంగీకరించడంలేదని ఆయననే ప్రకటించమనండి" అన్నారు సింధియా. అలాగే జరుగుతుందని కూడా ఆయన అనుకున్నారు. అంటే, రాజీనామా ప్రహసనంలో రాజకీయ లబ్ధి పొందాలనుకొన్నారా?

పి.వి.నరసింహారావుగారు మరో మాట మాట్లాడకుండా ఆ రాజీనామాని అంగీకరిస్తూ రాష్ట్రపతికి పంపేశారు. ఈ పరిణామంతో సింధియా షాక్ తిన్నారు. ఎవరో చెప్పారుట సింధియాకి – "పి.వి.గారు ఇలా చేయటానికి కారణం పి.వి.ఆర్.కె.ప్రసాద్ సలహా ఇవ్వటమే"అని.

ఈ విషయం నాకు తెలియటానికి ఒక ఏడాది పట్టింది. అప్పుడైనా ఎలాగంటే – ప్రధానమంత్రి బొంబాయి-గోవా-మంగుళూరు రైల్వేలైను ప్రారంభోత్సవానికి వెళ్తున్నప్పుడు ఆ దగ్గర్లోవున్న ఉడుపి, శృంగేరీ క్షేత్రాల్ని కూడా సందర్శించమని నేను సూచించాను. "అలాగే" అన్నారు. ఆ పర్యటనలో మాతోపాటు శృంగేరికి మాధవరావు సింధియా కూడా వచ్చారు. గ్వాలియర్ సింధియా వంశీయులకు గురుపీఠం శృంగేరి. ఆ మధ్యాహ్నం అక్కడ భోజనాలయ్యాక ప్రధానమంత్రి ఒక గదిలో, సింధియాగారు నేను కలిసి మరోగదిలో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు ఆయన ఈ విషయం ఎత్తారు.

"మీకు నామీద కోపం ఎందుకు ప్రసాద్‌గారు...? నా రాజీనామాను ఆమోదించమని మీరే సలహా ఇచ్చారటగదా పి.వి.గారికి..." అంటూ మాధవరావు సింధియా సున్నితంగా నన్ను నిలదీశారు. అవాక్కయ్యాను. ఆ విషయంలో నా ప్రమేయం లేదని ఆయన్ని ఎలా నమ్మించగలను? నేను చెప్పాల్సింది చెప్పాను. ఆయన నమ్మారో లేదో తెలీదు... కాని ఆ సంఘటనతో నేను మాత్రం ఈ రాజకీయ చదరంగానికి వీలైనంత దూరంగా వుండాలని మరింత దృఢంగా నిశ్చయించుకున్నాను.

★ ★ ★

అలా అనుకొనే ఇప్పుడు సీట్ల సర్దుబాటు చర్చలు జరుగుతున్న 'నెంబరు 5' భవనానికి పోలేదు. 'నెంబరు 7'లోనే వుండిపోయాను.

కాని జరిగింది వేరు!

రేస్ కోర్సు రోడ్డు 'నెంబరు 5'లో చర్చలు మొదలయ్యాయి. 'నెంబరు 7 భవనం'లో కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సమావేశం మొదలైంది. కాస్సేపయ్యాక, పి.వి బయటకొచ్చారు. నన్ను పిలిపించారు. "నువ్వు కూడా అక్కడికి వెళ్ళు. ఆ చర్చల్లో కూర్చో. పని సక్రమంగా, తొందరగా జరగటం ముఖ్యం" అని చెప్పి వెళ్ళిపోయారు. ఆయన్ని అలా చూడగానే నా దృఢనిశ్చయమంతా నీరుకారిపోయింది.

సీట్ల సర్దుబాటులో నేను చేసేది ఏముంటుంది? తెలీదు. అయినా సరే వెళ్ళాను.

రాత్రి తొమ్మిదిగంటలకి చర్చలు మొదలయ్యాయి. ఒంటిగంటయినా ఒక కొలిక్కి రావటం లేదు. సీట్లు మాకు ఎక్కువ కావాలి అంటే మాకు ఎక్కువ కావాలీ అంటూ వాదనలు, వాటికి మద్దతుగా పాత గెలుపు ఓటముల తాలూకు గణాంకాల నివేదికల విశ్లేషణలు సాగుతూనే ఉన్నాయి... ఇది ఎప్పటికి తెగుతుంది! కాంగ్రెస్‌లో చీలిక ఆసరా చేసుకుని ఎఐఎడిఎంకె వర్గం చెట్టెక్కి కూర్చుంది.

ఎంత దురదృష్టం! ఇదే కసరత్తు ఒక నెల ముందు జరిగి ఉంటే? మూపనార్ వర్గం కాంగ్రెసు పార్టీని చీల్చకుండా వుంటే??

నాలో అసహనం పెరిగిపోయింది. నాకు సంబంధం లేకపోయినా, పి.వి గారి ఆత్రుత, ఆదేశాల దృష్ట్యా కలగజేసుకున్నాను. నేను ఎరిగున్న పి.వి. ఆలోచనలకు తగినట్లుగా సాహసం చేసి, పవార్‌తో, పూజారితో చెవిలో చెప్పాను.

"ఇప్పుడున్న పరిస్థితుల్లో మనకి లోక్‌సభ ఎన్నికలు ముఖ్యం. అసెంబ్లీలో వాళ్ళకి ఎక్కువ సీట్లు ఇచ్చేద్దాం. లోక్‌సభలో మనకి ఎక్కువిమ్మందాం.... తెల్లారేలోపల ఏదో ఒకటి తేలకపోతే, మనకి ఏమీ మిగలకపోవచ్చు బేరమాడటానికి కూడా..."

వాళ్ళు ఈ సూచనకి విలువిచ్చారు. ఆ సూత్రం మీద ఎఐఎడిఎంకె ప్రతినిధుల చేత అప్పటికప్పుడే జయలలితతో టెలిఫోన్‌లో మాట్లాడించడం, ఆమె అంగీకరించడం, దానికి అనుగుణంగా రాత్రి రెండు గంటలకల్లా సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకోవడం, ఆ ఒప్పందానికి అప్పటిదాకా కొనసాగుతూనే వున్న కాంగ్రెసు వర్కింగ్ కమిటీలో ఆమోదముద్ర వేయటం... అన్నీ శరవేగంగా జరిగిపోయాయి.

ఆ సీట్ల సర్దుబాటుతో జాతీయ కాంగ్రెస్, ఎఐఎడిఎంకె పార్టీలు ఎన్నికలలో పోటీ చేశాయి....

సరైన నిర్ణయం సరైన సమయంలో తీసుకోకపోతే వచ్చే అనర్థం ఎలా ఉంటుందో ఆ ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ అనుభవించక తప్పలేదు.

డిఎంకె అధికారంలోకి వచ్చింది.

రజనీకాంత్ రాజకీయాల్లోకి వచ్చివున్నా, పి.వి.గారు మనస్సాక్షిని చంపుకుని, "రాజీవ్‌గాంధీ – సోనియా కుటుంబ మనోభావాలు" అనుకుంటూ విధేయత కోసం, నైతిక విలువల కోసం డిఎంకెతో పొత్తుని వ్యతిరేకించకుండా ఉన్నా తమిళనాడులో కాంగ్రెసు పార్టీ మరో వెలుగు వెలిగేది. పి.వి మరోసారి ప్రధాని పదవిని అలంకరించడానికి అవకాశం ఉండేది.

1991లో రాజీవ్ గాంధీ మరణానంతరం మైనారిటీ కాంగ్రెసు ప్రభుత్వానికి చాకచక్యంగా మెజారిటీ సాధించడంలో...

కొత్త ఆర్థిక వ్యూహంతో ఇంగ్లాండులో తాకట్టులో ఉన్న బంగారం నిల్వల్ని విడిపించి దేశ ప్రతిష్ఠను నిలబెట్టడంలో...

సరళీకరణ – ప్రపంచీకరణ సంస్కరణలతో దేశ ఆర్థిక రథచక్రాలను పురోగమన పథంలో పరుగులెత్తించడంలో...

శాంతి భద్రతలు క్షీణించిన పంజాబ్, జమ్మూ – కాశ్మీర్‌లలో ఎన్నికలు నిర్వహించి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడంలో .... అపారమైన రాజకీయ, పాలనా దక్షతను ప్రదర్శించిన పి.వి. 2004 డిశెంబరు 23న స్వర్గస్థులయ్యారు.

విచిత్రమేమిటంటే, ఆయన ఏ ఇందిరా-రాజీవ్‌ల కుటుంబంపట్ల విధేయతని నిలబెట్టుకోవటం కోసం రాజకీయంగా ఆటుపోట్లకు గురయ్యారో, ఆ కుటుంబంలోని సోనియాగాంధీ పార్టీ అధ్యక్షురాలిగా, కేంద్రప్రభుత్వాన్ని నడుపుతున్న యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ సారథిగా ఉండగా ఆయన కీర్తిశేషులైతే, ఆ కీర్తి ప్రపంచ వీథుల్లోకీ, ఆయన భౌతికదేహం హైద్రాబాద్‌లో నెక్లెస్ రోడ్డులోకి తరలించబడ్డాయి.

అప్పటికి మరణించిన అందరు మాజీ ప్రధానమంత్రులకీ స్మారక ఘాట్‌లు ఢిల్లీలో యమునా తీరంలో వెలిశాయి. పి.వి సమాధి మాత్రం హైద్రాబాద్‌లో హుస్సేన్ సాగర్ పక్కన వెలిసింది.

ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ఇలా అన్నారు.

"తెలుగువాడైన పి.వికి న్యాయం జరిగేలా ప్రపంచం మెచ్చేటట్లుగా గొప్ప స్మారకం హైద్రాబాద్‌లో నిర్మిద్దాం. రూ. 200 కోట్లు నిధిని ప్రభుత్వం ఇస్తుంది... ఆయన పేరున ఒక రీసెర్చి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేస్తాం. స్మారక పార్కు, స్మారకోపన్యాసాలు వగైరా చాలా చేద్దాం...."

... ఇదంతా జరిగింది 2004 డిశెంబరులో.

ఆ తరువాత...........?

★ ★ ★

మా ఇంట్లో అమితాబ్ బచ్చన్

(నేనో 'జోకర్' ముక్కని -1)

ప్రధానమంత్రి పి.వి.దగ్గర మీడియా సలహాదారుగా పనిచేసిన ఒక 'జోకర్'... అంటూ 1996లో ఒక జర్నలిస్టు Out look అనే ఆంగ్లవారపత్రికలో రాసిన వ్యాసంలో నాగురించి వ్యాఖ్యలు చేశారు..

ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొన్నాను. అసలు జరిగిందేమిటో చెప్పాలంటే కొన్ని సంఘటనలను నేను వెల్లడించక తప్పదు...

ఒకసారి అమితాబ్ బచ్చన్ మా ఇంటికొచ్చారు. అది నాకిష్టంలేదు. అమితాబ్ బచ్చన్ మా ఇంటికిరావటం వల్ల చూసేవాళ్ళ దృష్టిలో నాకు జనాకర్షణ (Glamour) పెరగవచ్చు నేమోగాని, ప్రధానమంత్రి కార్యాలయం మీద ఎలాంటి ముద్రపడుతుందోనన్నది నా ఆందోళన. దీనికి ప్రధాన కారణం - ప్రధానమంత్రికి అదనపు కార్యదర్శి హోదాలోకంటే, మీడియా సలహాదారు పాత్రలో నేను ఆయనకి అత్యంత సన్నిహితుణ్ణి అని ప్రచారం జరగడం.

అమర్‌సింగ్ నాదగ్గరకు వచ్చి "అమితాబ్ బచ్చన్ మీతో కొంచెం మాట్లాడాలి, ఎప్పుడు రమ్మంటారు?" అని అడిగినప్పుడే, నేను చెప్పేశాను. "ఎందుకండీ, ఆయన రావడం. ఆయన చెప్పాల్సింది ఏమైనావుంటే మీరే చెప్పచ్చుగదా!".

అమర్‌సింగ్ ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో అప్పుడప్పుడే ఎదుగుతున్న పారిశ్రామికవేత్త. అమితాబ్ కుటుంబానికి సన్నిహితులు. (ఇప్పుడు సమాజ్‌వాది పార్టీకి ప్రధాన కార్యదర్శి.) అలాంటి అమర్‌సింగ్ ఏదన్నా పనివుంటే తనకి పరిచయం వున్న కేంద్రమంత్రులెవర్నన్నా కలుసుకోవాలిగాని, నాదగ్గరకు ఎందుకు వచ్చినట్టు!

అమర్‌సింగ్ నా వంక విచిత్రంగా చూశారు. "అదేమిటి సర్, అమితాబ్ గారే వచ్చి మాట్లాడతామంటే వద్దంటారు!".

"ఆయన నాకోసం ఎందుకు వస్తారు? నాదగ్గరకు వస్తున్నారంటే, నేను ప్రధానమంత్రి కార్యాలయంలో వున్నాను కనుక ఏదోపని మీద రావాలనుకోవచ్చు. వారి పని ఏదో చెబితే చెయ్యగలిగితే చేస్తాను. లేదంటే అదే చెబుతాను. దానికోసం ఆయన సమయం ఎందుకు వృథా చేయటం." నేను కచ్చితంగా చెప్పేశాను.

నేను ఇలా చెప్పటానికి ఒక కారణం వుంది.

★ ★ ★

ప్రధానమంత్రి పి.వి. నరసింహారావుగారికి నేను మీడియా సలహాదారుని. అంటే, ప్రధానంగా పత్రికలలో వచ్చే - ప్రధాని తెలుసుకోదగిన అంశాలని ప్రధాని దృష్టికి తీసుకువెళ్ళడం, ఆయన అవసరమనుకున్న అంశాలకి సమాచారశాఖ ప్రధానఅధికారి (PIO) ద్వారా వివరణ ఇప్పించడం, ప్రధానిని కలుసుకోగోరే ముఖ్యమైన దేశవిదేశీ పత్రికా సంపాదకులను· ఆయా సందర్భాన్ని, అవసరాన్ని, ఔచిత్యాన్ని బట్టి ప్రధానితో కల్పించడం, ప్రధాని విదేశీ పర్యటనలకు వెళ్ళేటప్పుడు ఆయనతో వచ్చే పాత్రికేయ బృందాల ఎంపిక, వారికి ఏర్పాట్ల పర్యవేక్షణ, సమాచార సహకారం.....వగైరా పనులు చేయాల్సిన ఉద్యోగం నాది. (ప్రధానికి సంయుక్త కార్యదర్శిగా/ అదనపు కార్యదర్శిగా కొన్ని ప్రభుత్వశాఖలను, ప్రధానికి వచ్చే ఫైళ్ళను చూడడం కూడా నా విధుల్లో ఒకటి.)

కాని ప్రధాని కార్యాలయంలో పోస్టురీత్యా నాకు సంబంధంలేని అనేక కీలక అంశాలను కూడా నాకు ప్రధానమంత్రి అప్పగిస్తూ వుండేవారు. వాటిల్లో చాలావరకు అవి అమలు జరిగేవరకు గోప్యంగా వుంచాల్సిన విషయాలు. ఆ గోప్యం లేకపోతే, అనేక మంచిపనులు జరగవు, జరగనీయకుండా అడ్డుపడే నిరోధకశక్తులకు తక్కువేమీలేదు. అలాంటి వాటిల్లోదే అయోధ్య రామమందిర నిర్మాణం విషయం. అక్కడ ప్రధాని నాకు ఏం చేయమని చెప్పారో ఆ విషయం నేను ఎవరికీ చెప్పక పోయినా, పత్రికలలో పొక్కితే చాలు- అది జరగదు.

ఢిల్లీ సంస్కృతే వేరు. ప్రధానమంత్రి కార్యాలయంతో ఏ కొంచెం సంబంధమున్నా దాన్ని గోరంతలు కొండంతలుగా ప్రచారం చేసుకుని లబ్దిపొందే శక్తులు చాలా వుంటాయి. ఇక ప్రధానికి దగ్గరగా వుండే వాళ్లయితే, 'తాము ప్రధానికి ఎంతోదగ్గర' అని నలుగురికీ తెలిసేలా ప్రచారం చేసుకోవడం, తమ మనుగడని సుసంపన్నం చేసుకోవడానికి ప్రయత్నించడం చాలా సాధారణ విషయం.

దురదృష్టవశాత్తు, పి.వి.గారితో నాకు సాన్నిహిత్యం ఆయన ముఖ్యమంత్రిగా పని చేసినప్పట్నుంచీ (1971-72) వున్నప్పటికీ, ప్రధానమంత్రిగా ఆయన నాపట్ల వుంచిన విశ్వాసం వల్లగానీ, ఆయన నాకు అప్పగిస్తున్న కొన్ని పనులు కీలకమైనవీ - గోప్యం నిండినవీ కావడం వల్లగానీ, నా వ్యక్తిత్వంలో లోపం వల్ల గానీ నేను ప్రధానమంత్రికి చాలాసన్నిహితుడ్ని అని ప్రచారం చేసుకోలేక పోయాను. పైగా, నేను చేసే అనేక పనులు నాదగ్గరకు రాగలిగిన పాత్రికేయులకు కూడా చెప్పదగినవి కావు. అందువల్ల ఎవరన్నా సంపాదకులు, సీనియర్ విలేకర్లు నన్ను కలిస్తే, వాళ్ళ దగ్గర్నుంచి సమాచారాన్ని (బయట ఎవరేం అనుకుంటున్నారు అన్నది) రాబట్టడం, అవసరమైన మేరకు సంభాషించడం తప్ప వృథా కాలక్షేపం చేయటానికి సమయం వుండేది కాదు. పైగా, పత్రికలవారితో కలిసి సంభాషించడానికి పి.వి. ఎక్కువ ఆసక్తి చూపేవారు కాదు. మాట్లాడాల్సివస్తే, అనర్గళంగా ఏ అంశం మీదైనా ఎంతలోతుగానైనా మాట్లాడగల విజ్ఞానఖని ఆయన.

కాని, "పత్రికల వాళ్ళు మనం, ఎన్ని విషయాలు ఎంత విపులంగా చెప్పినా, చివరికి వాళ్ళు ఎంచుకున్న దృక్పథమే వ్యక్తమయ్యేలా వక్రీకరించడం ఎక్కువగా జరుగుతూ ఉంటుంది" అన్నది ఆయన నిశ్చితాభిప్రాయం. అందుకే, పత్రికలకి దూరంగా ఉండాలనుకునేవారు. నాదొక ఇరకాట పరిస్థితి. ప్రధాని తత్త్వం ఇదీ అని పత్రికలకి చెప్పలేను. అలాగని వాళ్ళని దూరంగానూ ఉంచలేను. అక్కడికీ ముఖ్యమైన వాళ్ళందరికీ ఆయనతో ఇంటర్వ్యూలు ఇప్పిస్తూనే ఉండేవాణ్ణి.

అయితే, ప్రభుత్వం తరఫున పత్రికలవారికి అవసరమైన సమాచారాన్ని అందించేందుకు, ప్రధాన సమాచార అధికారి (పిఐఒ)గా శ్రీనరేంద్ర ఎప్పుడూ అందుబాటులో ఉండేవారు. అయినప్పటికీ, ప్రధానమంత్రికి పత్రికల ద్వారా ప్రతిష్ఠ పెరగాలంటే, పాత్రికేయులకు పార్టీలు, అవీ ఇచ్చే పని ప్రధాని మీడియా సలహాదారు చేయకపోతే ఎలా – అనుకునే జర్నలిస్టులు కూడా లేకపోలేదు.

పత్రికలతో వ్యవహారాలు ఇలా వుంటే, ప్రధానమంత్రికి చెప్పాలనుకున్న అనేక సొంత సమస్యలను – ఆయన దగ్గరికి నేరుగా వెళ్ళి చెప్పుకోలేని వాళ్ళు క్రమంగా నా ఉనికిని గుర్తించి, నన్ను కలిసి చెప్పడం మొదలెట్టారు. వాళ్ళేం చెప్పినా నేను చేయగలిగిందల్లా వాళ్ళ అభ్యర్థన ఏమిటో ప్రధానికి చేరవేయడం, ఆయన ఏం చేయమని చెబితే అది మాత్రమే చేయటం. ప్రధానికి తెలియకుండా ఏమీ చెయ్యలేను. ఆయన నా మీద ఆ విశ్వాసంతోనే గదా విశాఖపోర్టు చైర్మన్ పదవిలో నుంచి ఢిల్లీకి తీసుకొచ్చారు!

* * *

ఈ దశలో అమర్‌సింగ్ వచ్చి అమితాబ్‌బచ్చన్ కలవాలనుకుంటున్నారన్నారు.

నేను గట్టిగా అడిగాక విషయం చెప్పారు.

"అమితాబ్ బచ్చన్ సినిమా ప్రపంచంలో మకుటంలేని చక్రవర్తిలాంటివాడు. చాలా సంపాదించాడు. కానీ ఈ మధ్య తమ్ముడితో కలిసి ఒక మీడియా కంపెనీ వ్యాపారంలో బాగా దెబ్బతిన్నారు. ముఖ్యంగా దూరదర్శన్‌తో చేసుకున్న ఒప్పందం వల్ల కోట్లాదిరూపాయలు నష్టపోయారు. గతంలో అయితే ఆయన రాజీవ్‌గాంధీకి చాలా సన్నిహితుడు. ఇప్పుడు పరిస్థితులు వేరు. ఆయన ప్రధానమంత్రిని కలిసి ఒకసారి తన సమస్యను విన్నవించుకోవాలనుకుంటున్నారు. మీరు సహాయపడతారని...."

"ఈ విషయం గురించి అయితే నన్ను కలవనక్కర్లేదు కదా!.... ఓ పనిచేద్దాం. మీరు చెప్పిన విషయాన్ని నేను ప్రధానమంత్రికి చెబుతాను. ఆయన ఎప్పుడంటే అప్పుడు అమితాబ్ బచ్చన్ గారిని ఆయనతో కలిపిద్దాం. ఆయన స్వయంగా నేరుగా ప్రధానికి వివరించుకోవచ్చు గదా!" అన్నాను.

అమర్‌సింగ్ చాలా ఆనందపడ్డారు.

ఆ రాత్రి నేనీ విషయం పి.వి. గారికి చెప్పాను.

అయన ఒక్క నిమిషం ఆలోచించి, "సహాయం చేయదగిందైతే చేద్దాం. దానికోసం ఆయన నాదాకా రానక్కర్లేదు. అయన నేరుగా నా దగ్గరకే వచ్చేస్తే, పత్రికలలో కావలసినంత ప్రచారం జరుగుతుంది. ఆ తరువాత మనం ఆయనకి చేయదగిన సహాయమే చేసినా దానికి కావలసినంత వక్రీకరణ జోడించి ప్రచారం జరుగుతుంది. కాబట్టి ప్రసాద్, ఆయన్ని నా దగ్గరకు తీసుకురావద్దు. నువ్వే ఎవరికీ తెలియకుండా పిలిపించుకుని మాట్లాడు. ఆయన సమస్య ఏమిటో తెలుసుకో. మనం ఎంతవరకు చేయగలమో ఆలోచించి నాకు చెప్పు. సమాచారశాఖ కార్యదర్శి స్థాయిలో పరిష్కరించగలిగితే పరిష్కరించండి... ఇంకో విషయం ప్రసాద్, ఆయన్ని మీ ఆఫీసుకి పిలిపించి మాట్లాడితే పత్రికలలో విపరీత ప్రచారం వచ్చేస్తుంది, జాగ్రత్త...." అని నన్ను హెచ్చరించి పంపారు. ఆయన అన్ని హెచ్చరికలు చేశాక అమితాబ్ బచ్చన్ మా ఇంటికి రావడం కూడా నాకు ఇష్టంలేదు. కాని ప్రధాని చెప్పాక తప్పదు కదా!

నేను జరిగిందంతా అమర్‌సింగ్‌కి చెప్పాను. ఆయన రెండురోజుల్లోనే అమితాబ్ బచ్చన్‌ని చాణక్యపురిలోని నా క్వార్టరుకి తీసుకువచ్చారు.

అమితాబ్‌బచ్చన్ నిగర్వి. ఓ గంటసేపు ఆయన తన సమస్య అంతా వివరించారు. నేను ప్రభుత్వపరంగా చేయదగింది, చేయగలిగిందీ చేస్తానని చెప్పాను. అమితాబ్‌బచ్చన్ ఆనందపడ్డారో లేదో కాని అమితాబ్ మా ఇంటికి వస్తున్నారంటే మా పిల్లలు తెగ ఆనందపడ్డారు.

మా అమ్మాయి మాధవి, అబ్బాయి సంజీవ్‌లు ఆరోజుకి కాలేజీలు మానేసి అమితాబ్‌ని చూడటానికీ, ఆయనతో ఫొటోలు దిగటానికీ పడిన హడావుడి అంతా ఇంతా కాదు. కాని అమితాబ్ నా ఇంటికొచ్చారనీ, నాతో పనివుండి తిరుగుతున్నారనీ... ఇలాంటి మాటలు ఎక్కడా అనటానికి వీల్లేని పరిస్థితి నాది. ఆయన నా దగ్గరకు వచ్చింది ప్రధానమంత్రి కార్యాలయంలో నా హోదాని బట్టి, లేదా ప్రధానితో నాకుగల సాన్నిహిత్యాన్ని బట్టి. అందుకే నేను బయట అమితాబ్ రాక గురించి ఏం మాట్లాడినా అది ప్రధానమంత్రి మీద, ఆయన కార్యాలయం మీద ప్రతిఫలిస్తుంది.

కొన్ని సందర్భాలలో ప్రధానమంత్రిని ఎరిగున్న వాళ్ళెవరెవరో వచ్చి, సమస్య చెప్పి పరిష్కారం కోరేవాళ్ళు. అది అసాధారణ విషయం కూడా కావచ్చు. నేను నా నెత్తిన వేసుకోకుండా వెళ్ళి ప్రధానితో చెప్పేవాణ్ణి. ఆయన ప్రభుత్వ ప్రతిష్ఠ, నియమ నిబంధనలను అంచనావేసి, "ఇది చాలా అడ్డగోలు వ్యవహారం, మనం చేయలేమయ్యా" అని చెప్పేసేవారు. కాని ఈ మాటే వాళ్ళకి చెబితే, వాళ్ళ దృష్టిలో పి.వి.గారిని చెడ్డవాణ్ణి చేసినట్లవుతుంది. ఆయన నన్ను ప్రధాని కార్యాలయానికి తీసుకొచ్చింది ఇందుకేనా?....

ఫలితంగా చివరికి వాళ్ళకి నేను చేసిపెట్టలేదన్న విషయమే కనుపించేది. ప్రధాని వద్దన్నారన్న విషయం తెలిసేదికాదు. ఇలా 'నావల్ల' అసంతృప్తి చెందినవాళ్ళలో కొందరు సీనియర్ పాత్రికేయులు కూడా ఉన్నారు.

ఒకసారి అంబానీల తరపున ఢిల్లీలోని వాళ్ళ ఉపాధ్యక్షుడు సుబ్రమణియన్ నా దగ్గరకు వచ్చారు. "ముఖేష్ అంబానీ, అనిల్ అంబానీలు మిమ్మల్ని కలవాలనుకుంటున్నారు. వీలైతే మీ ఇంటి దగ్గర....."

"నేను ప్రధానితో మాట్లాడి చెబుతాను. విషయమేంటో ఇప్పుడే చెలితే అదికూడా ప్రధానితో మాట్లాడి చెబుతాను...." అన్నాను. ఆయన విషయం తనకు తెలీదన్నాడు.

నేను ఇదే విషయాన్ని పి.వి.గారికి చెప్పాను. ఆయన కొంచెం ఆశ్చర్యపడ్డారు. "అదేమిటి ప్రసాద్, వాళ్ళు మనదాకా వచ్చారా! వాళ్ళకి పనులు చేసిపెట్టే వాళ్ళు మన మంత్రి వర్గంలో చాలామంది ఉన్నారు కదా!..... సరే, మాట్లాడి విషయమేమిటో తెలుసుకో" అన్నారు.

నేను సుబ్రమణియన్‌కి ఫోన్ చేసి చెప్పాను. మర్నాడే అంబానీ సోదరులిద్దరూ మా ఇంటికొచ్చారు. వాళ్ళు అడిగిందల్లా వాళ్ళ నాన్నగారు ధీరూబాయ్ అంబానీ స్వయంగా నాతో మాట్లాడాలనుకుంటున్నారనీ, ఆయనకి పక్షవాతం రావటం వల్ల బొంబాయి వదిలి బయటకు వచ్చే పరిస్థితి లేదనీ, అయినప్పటికీ అతి కష్టంమీద ఆయన్ని ఢిల్లీ తీసుకువచ్చి ఒక హోటల్‌లో ఉంచామనీ, నేను వచ్చి ఆయన్ని కలవగలిగితే కృతజ్ఞులమనీ...

ఇది నాకు మరో ఇరకాట స్థితి.

ధీరూబాయి అంబానీ అంటే ఈ దేశంలో 1970, 1980 దశకాల్లో ఒక ప్రభంజనంలాగా ఎదిగిన పారిశ్రామిక దిగ్గజం. అంతటి మహాశక్తి నా క్వార్టరుకి రావటమంటే సామాన్యమైన విషయమా?.... కాని ధీరూబాయి అంబానీ వస్తానన్నది నామొహం చూడటానికా! వాళ్ళకి కావలసింది ప్రధానికి సన్నిహితుడైన వ్యక్తితో మాట్లాడటం. ప్రధానికి సన్నిహితులు చాలామంది ఉండొచ్చు. కాని వాళ్ళు నన్ను ఎంచుకున్నారు. బహుశ నేను ప్రధానికి సన్నిహిత అధికారిని కావటమే వాళ్ళు నన్ను ఎంచుకోవడానికి నా దగ్గరున్న అర్హత కావచ్చు.

నేను అంబానీ సోదరుల్ని ఒక్క నిమిషం ఉండమని చెప్పి, ఇంట్లోకి వెళ్ళి Rax లో (ప్రధాని బృందానికి మాత్రమే పరిమితమైన ప్రత్యేక టెలిఫోన్‌లో) ప్రధానితో అంబానీ సోదరుల విజ్ఞప్తి గురించి చెప్పాను. "ధీరూబాయి చాలా పెద్దవాడు. ఆరోగ్యం సరిగా లేదంటున్నారు కదా! వెళ్ళి మాట్లాడిరా! కాని విషయం ఎవరికీ తెలియకుండా ఉంటే మంచిది. లేదంటే అందరికీ ఇబ్బంది" అన్నారు ప్రధాని.

అప్పుడేం జరిగిందంటే...

★ ★ ★

నేనో 'జోకర్' ముక్కని - 2

అలా ప్రధానమంత్రి అనుమతి తీసుకున్నాక ధీరూభాయి అంబానీ గారిని వారి హోటలు గదిలోనే కలుసుకున్నాను.

మనిషి చాలా మర్యాదస్తుడు. ముక్కుకు సూటిగా పోయే వ్యక్తిలా కనుపించారు. నాకు మాత్రం ఆయనను చూస్తే చాలా ఆనందం కలిగింది. దేశం గర్వపడేలా ఎదిగిన వ్యక్తి.

దాదాపు రెండుగంటలసేపు ప్రపంచీకరణ, ఆర్థిక సంస్కరణలు, మన ప్రభుత్వ విధానాలు, పాలనా విషయాలు మాట్లాడారు. ఇప్పటిదాకా చాలా రక్షిత విధానంలో ఉన్న వ్యవస్థను ఒక్కసారిగా విదేశీ సంస్థలతో పోటీకి వదిలితే- స్వదేశీ సంస్థలు చాలా దెబ్బతినే పరిస్థితి అనీ, గుత్త వ్యవహారాలను అదుపు చేయడం కోసం పరిశ్రమల స్థాయిని పెరగనివ్వలేదనీ, దానివలన మన సంస్థలు చేసే ఉత్పత్తుల ప్రచారం బహుళజాతి సంస్థల ఉత్పత్తులతో పోటీపడదం కష్టమనీ, ఇతర దేశాల్లోని వడ్డీరేట్లతో పోలిస్తే మనదేశంలో చాలా ఎక్కువ అనీ, దానివలన మన కంపెనీలు బహుళజాతి సంస్థలతో పోటీ చేయలేకపోవచ్చనీ, ఈ విషయాలు దృష్టిలో ఉంచుకొని, స్థానిక పరిశ్రమలు, పెట్టుబడులు దెబ్బతినకుండా, విదేశీ పెట్టుబడులు పెద్ద ఎత్తున దేశానికి వచ్చేటట్లు విదేశీ సంస్థలు, మన సంస్థలు కలిసి పనిచేసే విధానం ప్రవేశపెడితే బాగుంటుందనీ, ఈ విషయం కొందరు మంత్రులతోనూ, అధికారులతోనూ చెప్పడం జరిగినా సంస్కరణలే ఆలస్యం అయ్యే అవకాశం ఉంది కాబట్టి వారేమీ చేయలేని స్థితి నెలకొన్నదనీ, ప్రధాని మాత్రమే చేయగలరని అన్నారనీ, ఈ విషయం ప్రధాని దృష్టికి తెచ్చి సంస్కరణలను మన దేశ ప్రగతికి దోహదపడేలా విధానాల్లో మార్పులు చేయాలనీ... ఇలా ఎన్నో సూచనలిచ్చారు... దానితోపాటు వారి సొంతసమస్య కూడా ఒకటి చెప్పారు.

ఆయన విషయపరిజ్ఞానం, చక్కని ఆలోచనా విధానం, అవతలివాళ్ళని మంత్రముగ్ధుల్ని చేయగల వాక్చాతుర్యం చాలా కొద్దిమందిలో చూస్తాం.

ఆయనతో జరిగిన సంభాషణ అంతా పూసగుచ్చినట్లు ప్రధానికి తెలపడం, ఆయన నన్నే ఈ విషయంలో ఒక చర్చా పత్రం తయారుచేయమని అనడం, నాకు ఈ విషయాలు అంతగా అవగాహన లేని కారణంగా అప్పుడు Financial Express పత్రికలో సంపాదకుడిగా ఉన్న సంజయ్ బారు (2004-2008 కాలంలో ప్రధాన మంత్రి మీడియా సలహాదారు)కి ఈ బాధ్యతను అప్పగించడం జరిగింది. ఆయన స్థానిక, విదేశీ సంస్థలకు మధ్య 'Level Playing Field' (వారి వారి శక్తికి, అవసరాలకి తగిన అవకాశాలు కల్పించే విధానం) ఎలా ఉండాలన్న అంశంపై

ఒక సిద్ధాంత పత్రాన్ని రూపొందించారు. ప్రధానమంత్రి దానిపై సంబంధిత నిపుణులతో చర్చించి, చాలా సూచనలను అమలులోకి తీసుకురావడం జరిగింది.

ఇంకోసారి ప్రధానమంత్రి ఇండోనేషియా పర్యటనలో ఉండగా నేను ఆయన వెంట వెళ్ళాను. ఆయన మిత్రుడు మిట్టల్‌గారు ఆయనను కలిసి, వారి యింటికి భోజనానికి ఆహ్వానించడం జరిగింది. ప్రధానిగారు చాలా బిజీగా ఉండటంతో "మా ప్రసాద్‌ని పంపిస్తాను. అతనికి మంచి శాకాహార భోజనం కూడా దొరుకుతుంది.... అన్ని విషయాలు అతనితో మాట్లాడండి" అని మిట్టల్‌గారితో నన్ను పంపారు.

ఆయనను ఇదివరకే రెండుమూడుసార్లు ఢిల్లీలో కలిసే అవకాశం కలిగింది. వారిది నాగపూరు దగ్గర రామ్‌టెక్. పి.వి. గారి పార్లమెంటు నియోజకవర్గం కూడా రామ్‌టెక్. మిట్టల్‌గారికి ఆంధ్రాలో విశాఖపట్నం దగ్గర ఒక స్టీలు రోలింగ్ మిల్లు ఉంది. ఆయన పి.వి.గారికి చాలా సన్నిహితుడు. దేశం అభివృద్ధి చెందాలంటే పారిశ్రామికవేత్తలకు మంచి ప్రోత్సాహకాలు యివ్వాలనీ, ఆలస్యం కాకుండా పనులు జరగాలనీ, అలా మన దేశంలో జరగడం లేదనీ.... యిలా ఎన్నో సూచనలు ఆయన చేశారు.

అలా మాట్లాడుకుంటూ వాళ్ళ యింటికి (మేమున్న హోటలు నుంచి ఒక గంట ప్రయాణం) చేరాం. వాళ్ళింట్లో వాళ్ళబ్బాయిని పరిచయం చేశారు. అతని పేరు లక్ష్మీమిట్టల్. ఇప్పుడు ఇండోనేషియాలోని పరిశ్రమలు, వ్యాపారం అతనే చూస్తున్నాడనీ, అంతేకాక, దక్షిణ అమెరికా, బ్రెజిల్‌లో ఒక పాత స్టీల్ మిల్లు కొన్నాడనీ, యింకొక స్టీల్ మిల్లు కొనడం కోసం ప్రయత్నం చేస్తున్నాడనీ చెప్పారు. లక్ష్మీమిట్టల్ మంచి స్ఫురద్రూపి. చాలా తెలివైనవాడు. మంచి వినయం, నమ్రతగల మనిషి, పట్టుదల కలవాడు.

లక్ష్మీమిట్టల్ సంభాషణ అంతా – ఇండోనేషియా, మలేషియా ఎంత త్వరగా అభివృద్ధి చెందుతున్నాయి, ఎన్నో వనరులు ఉన్నా మన దేశం ఎందుకు అభివృద్ధి కావడం లేదు... వగైరా అంశాలమీద ప్రవాహంలా సాగింది. చాలా ఉద్వేగంగా మాట్లాడాడు.

"మన దేశంలో నాయకులకు టైమ్ విలువ తెలియదు. నిర్ణయాలు తీసుకోవడానికి చాలా జాప్యం జరుగుతుంది. ఏ పనైనా చేద్దామన్నా పరిశ్రమలు స్థాపిస్తామన్నా... ఎందరినో కలవాలి, లంచాలు యివ్వాలి. అయినప్పటికీ సకాలంలో పనులు జరగవు. ... ప్రభుత్వంలో ఒక విభాగానికీ, యింకొక విభాగానికీ పడదు. ఒకరు ఔనంటే యింకొకరు కాదనడం. వాళ్ళిద్దరూ బలాబలాలు చూసుకుంటూ ఉంటే మధ్యలో పెట్టుబడిదారులు యిరుక్కుపోతారు. ఎంతో సమయం ఖర్చుపెట్టి చేసిన అంచనాలన్నీ తారుమారు అయిపోతాయి. సరైన అంచనాలు లేకుండా, కాలపరిమితిపై పట్టులేకుండా, ఎవరు నిర్ణయాలు తీసుకోవాలో నిర్ధారణ లేకుండా, నష్టానికి, ఆలస్యానికి బాధ్యత తీసుకోనవసరంలేని వాళ్ళకి అనవసర ప్రశ్నలు వేసే అధికారం ఇస్తూ... ఇలా ప్రభుత్వ పరిస్థితి ఉంటే పెట్టుబడులు, పరిశ్రమలు రమ్మంటే ఎలా వస్తాయి?" అని అతను ఆవేదన వ్యక్తం చేశాడు.

"మా సంగతే చూడండి, ఇక్కడికి వచ్చాక మా ప్రణాళికని ఇండోనేషియా అధ్యక్షుడు సుకర్ణోకి వివరించే అవకాశం దొరికింది. అంతే, రాజకీయంగా, ప్రభుత్వపరంగా, అధికారికంగా ఏ విషయమైనా ఆయన, ఆయన మనుషులు సమన్వయం చేసి వెంట వెంటనే పనులు ముందుకు పోయేట్టు చేస్తారు. మనం చేయాల్సిందల్లా మన పెట్టుబడి సేకరణ, నిర్మాణం, ముడిసరుకులు, విక్రయాలు... వగైరా సకాలంలో జరిగేలా చూసుకోవటం. వారితో ఒక అవగాహనకు వచ్చాక ఇక ప్రభుత్వం నుంచి ఎలాంటి రాజకీయ తలనొప్పులుండవు...

"అదే విధంగా బ్రెజిల్లో, మలేషియాలో కూడా. ఇదే మనదేశంలో అయితే - ప్రధానమంత్రి ఆమోదించినా, పనులు కావు. అందరూ ఒప్పుకున్నాక కూడా పనులు కావు. అధికారుల పై గాని, వ్యవస్థ పై గాని ఎవరికీ అదుపాజ్ఞలు ఉన్నట్లు లేదు. పనిచేసేవాళ్ళను చేయనీయకుండా ఎందుకు ఇన్ని నిబంధనలు, లైసెన్సులు, పర్మిట్లు...? పని చేసేవాడికి పిచ్చెక్కుతుంది.!....

"మీరు ప్రధానమంత్రిగారితో చెప్పి ఏమైనా చేయాలి. మనవాళ్ళు ఎవరికీ తీసిపోరు. ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా ఉంటే ఎంతైనా ముందుకు పోతాం!! అలా జరిగేలా ఏదైనా చేయండి. అందరి గురించి ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం లేదు. ఆలోచించి పనిచేసే వాడికి అడ్డం పడకుండా ఉంటే చాలు..."

(ఆ రోజు అలా మాట్లాడిన ఆ వ్యక్తే ఇప్పుడు ప్రపంచాన్నంతా దిగ్భ్రాంతి చెందిస్తున్న ఉక్కు వ్యాపార దిగ్గజం లక్ష్మీమిట్టల్.)

ఇండియా తిరిగొచ్చాక ఆయన చెప్పినవన్నీ ప్రధాని గారికి వివరించాను. ఆయన మిట్టల్ వాదనతో పూర్తిగా ఏకీభవించారు.

"కాని అటువంటి రాజకీయ శక్తి రాచరికపు దేశాల్లోనూ, నియంతృత్వపు దేశాల్లోనూ, లేదా కమ్యూనిష్టు దేశాల్లోనూ ఎక్కువగా పనిచేస్తుంది. ఏదో ఒక్క నాయకుని మాట మీద నడుస్తుంది. కాని ప్రజాస్వామ్యంలో యిది కొంత కష్టమే. ప్రభుత్వ జోక్యం తగ్గించుకొంటేనే యిది సాధ్యపడుతుంది అమెరికాలో లాగా. ... మనది ప్రజాస్వామ్యం. సోషలిస్టు ప్రజాస్వామ్యం. కమ్యూనిజం వైపు మొగ్గు చూపే ప్రజాస్వామ్యం. పారిశ్రామికవేత్తలను, వాణిజ్యవేత్తలను లాభాలార్జించే వాళ్ళందర్నీ నేరస్థులుగా చూసే మనస్తత్వానికి అలవాటుపడే పరిస్థితులు కల్పించుకున్నాం. అందరి తరఫునా మనమే ఆలోచించాలి. ప్రజలకేమీ తెలియదు. తెలివితేటలంతా ప్రభుత్వం దగ్గరే ఉన్నాయనుకునే మూసలో పడ్డాం. దాదాపు 50 సంవత్సరాల పాటు సంక్షేమరాజ్యం నడిపాం. అవే రాజకీయాలు...

"నెహ్రూ, ఇందిరాగాంధీలాంటి ఏకచ్ఛత్రాధిపత్యం ఉన్న నాయకుల కాలంలో జరిగితే జరగాలి కాని, ఇప్పుడు జరగడం కష్టం... మనం చేయగలిగిందల్లా - వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తలు వీలయినంతవరకు లైసెన్సులకోసం, పర్మిట్లకోసం ప్రభుత్వం దగ్గరకు వచ్చే అవసరం లేకుండా చేయడం. రావల్సిన అవసరం వస్తే పదిమంది దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం

లేకుండా, అందరూ కలిసి తగు నిర్ణయాన్ని ఎలాంటి జాప్యం లేకుండా ఒకచోటే తీసుకునేలా కమిటీలు ఏర్పాటుచేసి, వాటికి అధికారాలిచ్చి పనులు తొందరగా జరిగేటట్లు చూడాలి. ప్రభుత్వ ఆర్థికసంస్థలను వీలైనంత ప్రజలకు దగ్గరగా తీసుకుపోవాలి... పూర్తిగా ఈ సంస్థల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా ప్రజలే పెట్టుబడిపెట్టే మ్యూచువల్ ఫండ్ సంస్థల్ని, యూనిట్ సంస్థల్ని, షేర్ మార్కెట్‌ని పటిష్ఠం చేయాలి... ఇప్పుడున్న బ్యాంకులు దాదాపు ప్రభుత్వ బ్యాంకులే. దబ్బొకరిది, పెత్తనం మరొకరిది. లాభాలు ఎవ్వరికీ లేని పరిస్థితి. వీళ్ళు కార్మిక సంఘాల తగాదాలలో పడి ఏ పనీ కాకుండా ఇరుక్కుపోయే కన్నా, క్రొత్త ప్రైవేటు బ్యాంకులు స్థాపించి విదేశీ బ్యాంకులకు ప్రోత్సాహం చూపించి, విదేశీ పెట్టుబడులు – దేశీయపెట్టుబడులు ప్రభుత్వం మీద ఆధారపడకుండా చేయగలిగితే – మనం చేయగలిగింది చేసిన వాళ్ళమవుతాం..." ఇలా సాగింది ప్రధాని భావనా ప్రవాహం.

ఈ విషయాలన్నింటిలోనూ ప్రధాని నిర్ణయాలు తీసుకొని, అమలు చేయించారు. ఆర్థికమంత్రి మన్‌మోహన్ సింగ్ గారికి ఈ విషయాలలో తాను కోరేది ఏమిటో స్పష్టంగా వివరించి, వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చి, వారిని రాజకీయ ఒత్తిడుల నుంచి కాపాడి, దేశ దిశను దశను మార్చారు.

ఈ విషయాలు చర్చకు వచ్చినప్పుడే ప్రధాని ఒకసారి నాతో అన్నారు "మనం ఎన్నో వేల కోట్లు ఖర్చుపెట్టి ప్రాజెక్టులు, పథకాలు తయారుచేశాం. చాలా కోట్లు ఖర్చవుతున్నాయి. కాని ప్రాజెక్టులు పూర్తి కావటం లేదు. పూర్తి అయినా, అనుకున్న లాభాలు ప్రాజెక్టులనుండి రావటం లేదు. ఇవన్నీ చూడడానికి ప్రత్యేకంగా ఒక మంత్రిని నియమించి 'Programme Implementation' మంత్రిత్వశాఖను ఏర్పాటుచేశాను. కాని ఆ మంత్రి, కార్యదర్శులు అదేదో అధికారం లేని, పని లేని శాఖ అనుకొంటున్నారు. PMO లో అది నిన్నే చూడమన్నాం కదా! మంత్రిత్వశాఖ అంత శ్రద్ధ చూపకపోతే మనమే వారిని మేల్కొలిపి ఏమవుతోందో చూస్తే బాగుంటుందేమో! కొంచెం దానిమీద దృష్టి పెట్టు".

నిజానికి, ఆ విభాగం ప్రతి పథకానికి ఇచ్చిన బడ్జెటు ఎంత, ఖర్చుపెట్టినదెంత... అన్ని విభాగాలనుండి లెక్కలు తెప్పించి అందరికీ ఆ రిపోర్టులు పంపే ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఆ పని చేసే విధానం, ఆ నివేదికలు ఒక రొటీన్‌లో పడిపోయాయి. అవి ఎందుకు తెప్పిస్తున్నామో వాటి నుంచి ఏం లాభమో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇదే పని గణాంక శాఖవారూ చేస్తున్నారు. ఖర్చు విషయం కాబట్టి ఆర్థికశాఖ వారూ చూస్తున్నారు. ఇందులో వ్యవస్థలోని లొసుగులు తెలుసుకునే ప్రయత్నం గాని, మార్పు తేవడానికి చేసే ప్రయత్నం గాని ఏమీ లేదు. ... ప్రధానిగారి మనస్సులో ఈ మంత్రిత్వశాఖ చేయాల్సిన పని అది.

నేను వెంటనే సంబంధిత మంత్రిగారితో, కార్యదర్శిగారితో, ఒక సమావేశం జరిపి, ప్రధాని మనసులోని మాట వివరించి, దానికి తగ్గట్టు మన ఆలోచనా విధానం, మనం తెప్పించుకునే సమాచారం, లెఖ్ఖలు ఇతర విషయాలలో తగిన మార్పు తీసుకొచ్చే ప్రయత్నానికి నాంది పలకటం జరిగింది. మొదటగా ప్రభుత్వంలో అన్ని శాఖల గురించి ఈ ప్రయత్నం చేయకుండా, 100

కోట్ల రూపాయలకు మించి ఖర్చు చేస్తున్న ప్రతి ఒక్క ప్రాజెక్టు - పరిశ్రమ కావచ్చు, నీటి పారుదల ప్రాజెక్టుకావచ్చు, యింకేదైనా పరిశోధనా సంస్థ కావచ్చు, నిర్మాణం కావచ్చు - సమాచారం తెప్పించమన్నాం. మనకు కావల్సిన సమాచారం - ఆ ప్రాజెక్టు ఎప్పుడు ఆమోదించ బడింది, ఎప్పుడు పూర్తయింది, ఆమోదించినప్పుడు వేసిన అంచనా ఎంత, పూర్తి అయినప్పుడు అయిన ఖర్చు ఎంత, మొదట పూర్తి చేయటానికి ఎంత కాలం పడుతుందని అంచనా, పూర్తి అయిన నాటికి ఎంత కాలం పట్టింది....? ఇంకా పూర్తి కాకపోతే, ఎంతకాలానికి పూర్తి అవుతుంది.? ఇంకా ఎంత నిధులు కావాలి...? ఆలస్యానికి కారణాలు, అంచనాలు తారుమారు కావడానికి కారణాలు వివరిస్తూ ఒక నెలరోజులలో నివేదికలు పంపించమని ప్రధాని కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేయించాను.

రెండు నెలలోనే కావల్సిన సమాచారం దాదాపు అన్ని మంత్రిత్వశాఖల నుంచి తెప్పించగలిగాం. అప్పుడు బయటకు వచ్చిన విషయాలు చాలా ఆశ్చర్యకరంగా, విభ్రాంతి కల్గించే విధంగా ఉన్నాయి.

ఎన్నో ప్రాజెక్టులు ఆమోదించబడినా, ఇంకా మొదలే కాలేదు. మొదలుపెట్టినవి అనుకున్న సమయానికన్నా ఎన్నో సంవత్సరాలు దాటినా పూర్తి కాలేదు. మొదట వేసిన అంచనాలకు, ఇప్పటికి ఖర్చుపెట్టిన దానికి ఏమీ పొంతన లేదు. 1980 నుండి ఆమోదించబడి, ఇప్పటికి మొత్తం 10,000కోట్ల రూపాయల అంచనాలతో ప్రారంభమైన ప్రాజెక్టులమీద ఇప్పటికి 1,50,000 వేల కోట్ల రూపాయలు ఖర్చయినా, చాలా ప్రాజెక్టులు యింకా పూర్తి కాలేదు. పూర్తి కావడానికి ఇంకా లక్ష కోట్ల రూపాయలకు పైగా కావల్సి వుంటుంది... కారణాలు చాలా ఉన్నాయి. ఆమోదించినప్పుడు సరైన అంచనాలు వేయలేదు. పెరిగిన అంచనాలకు ఆమోదం లేదు. చాలా ప్రాజెక్టులకు సరైన సర్వే జరగకుండానే ఆమోదించిన తర్వాత, చాలా ప్రాజెక్టులకు యితర విభాగాల నుంచి 'అభ్యంతరంలేదు' అనే ఆమోదాలు రాకపోవడం వల్ల ఆలస్యం. అన్నీ సరిగ్గా ఉన్నా, పని చేసే శక్తి ఉన్నా కావల్సిన నిధులు విడుదల కాలేదు... విదేశీమారకద్రవ్యం కావాలన్నా, విదేశీ దిగుమతులు చేసుకోవాలన్నా సంవత్సరాల తరబడి జాప్యం జరిగింది. ప్రాజెక్టును ఆమోదించినా దానిమీద ఖర్చుచేయటానికి మళ్ళా మంత్రిత్వశాఖల ఆమోదాలకోసం పంపాల్సిన పరిస్థితి సాగుతోంది...

ఇదంతా విశ్లేషణచేసి, ప్రధానితో మాట్లాడి, మంత్రి మండలిలో చర్చకు ఒక అధికార పత్రం సమర్పించాం. ప్రణబ్ ముఖర్జీగారి ఆధ్వర్యంలో ఒక మంత్రివర్గ కమిటీని నియమించి, అందులోని చాలా సూచనలను ఆమోదించి, అమలుపర్చడం జరిగింది.

ఇలా ప్రధానమంత్రి కార్యాలయంలో జాయింట్ సెక్రటరీ, అడిషనల్ సెక్రటరీగా నేను చూడాల్సిన ఉపరితల రవాణా సమాచార - ప్రసారశాఖ, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్, తదితర విభాగాల వ్యవహారాలను అధికారికంగా చూస్తూనే - ఇలా పైకి ఎవరికీ చెప్పుకోలేని అనేక చర్చలను, రాయబారాలను సాగించాల్సి వచ్చేది. (డాక్టర్ మన్‌మోహన్‌సింగ్ రాజీనామా

చేసినప్పుడూ, అయోధ్య సమస్య వచ్చినప్పుడూ సాగించిన రాయబారాలు కూడా వీటిల్లో భాగమే.) దీంతో ఊపిరి సలపనంతటి పని ఒత్తిడి నామీద పెరిగింది.

ఇందువల్ల ఢిల్లీ మీడియాలో వుండే నాలుగైదువందల మంది జర్నలిస్టుల గురించీ తెలుసుకునే అవకాశం అసలు ఉండదు. పైగా సమాచార ప్రసారశాఖలో ముఖ్య సమాచార అధికారిగా ఉన్న నరేంద్ర బాధ్యత ఎలాగూ పాత్రికేయుల సమాచార అవసరాలను గుర్తించటమే.

ఒకసారి ప్రధానమంత్రి విదేశీ పర్యటనకు వెళ్ళే జర్నలిస్టుల జాబితా నా ఆమోదం కోసం వచ్చింది. అందులో నేనెప్పుడూ విని వుండని ఒక ఉర్దూపత్రిక తరపున ఒక మహిళా జర్నలిస్టు పేరు ఉంది. నాకెందుకో అనుమానం వచ్చి, "ఆమెకు ఉర్దూ మాట్లాడటం, రాయడం వచ్చేమో కనుక్కోండి" అని రిమార్కు రాసి పంపాను. నాకు సమాధానం రాకుండానే ఆ జాబితాలోంచి ఆమె పేరును సమాచారశాఖ అధికారులు తొలగించేశారు. విచిత్రంగా - ఇది జరిగిన కొన్ని వారాల తరువాత The Week అనే ఆంగ్ల వార పత్రికలో - జర్నలిస్టుల గురించి తెలియకుండా జర్నలిస్టుల విదేశీ పర్యటనకు అడ్డుపడే 'జోకర్' గా నన్ను అభివర్ణిస్తూ ఢిల్లీలో వీర్ సంఘ్వి అనే జర్నలిస్టు ఒక వ్యాసం రాశారు....

అప్పుడే నాకూ తెలిసింది - అంతకుముందు ప్రధాని పర్యటనకి నా ఆమోదం కోసం వచ్చిన మీడియా జాబితాలో నేను "ఉర్దూ వచ్చునా?" అని ప్రశ్నించటం వల్ల అధికారులు తొలగించిన పేరు సంఘ్విగారి భార్యదేనని!!

1996 లో లోక్‌సభకి ఎన్నికలు జరిగాయి.

ప్రధానమంత్రి మారిపోయారు. నేను హైదరాబాద్ వచ్చేశాను.

కొన్ని వారాలతర్వాత Outlook అనే పత్రికలో అదే వీర్ సంఘ్వి రాసిన వ్యాసం వచ్చింది. ఆ వ్యాసం గురించి చెబుతూ "నీ గురించి వెటకారం చేస్తూ, నిన్ను 'జోకర్' అని అభివర్ణిస్తూ వచ్చింది. నువ్వు ఉపేక్షించకూడదు. పరువునష్టం దావా వేద్దాం. న్యాయపరమైన చర్యలు తీసుకుందాం...." అంటూ ఢిల్లీ నుంచి న్యాయవాది అయిన ఓ బంధువు ఆవేశంగా ఫోన్ చేశాడు.

నాకు ఒక్కసారి ఢిల్లీలో వీర్ సంఘ్వి గతంలో రాసిన వ్యాసాలు గుర్తుకొచ్చాయి. నవ్వుకున్నాను. నవ్వుకొని మా బంధువుని సమాధాన పరిచాను :

"... ప్రధాని కార్యాలయంలో వున్నప్పుడు నా హోదా, నా శాఖలతో నిమిత్తం లేకుండా ప్రధానమంత్రి మనిషిగా ఆయన ఆదేశాలతో అన్ని రకాల కీలక పనుల్లోనూ నేను తలదూర్చాల్సి వచ్చింది. పేకాటలో ఇలా ఏ ముక్క స్థానంలోనయినా తిరుగులేకుండా, చెల్లుబాటు అయ్యే ముక్క ఏది? జోకరే కదా! .... అందుకని ఇక్కడితో వదిలేద్దాం....."

★ ★ ★

అయోధ్యలో 'పి.వి.'రామాలయం-1

ప్రధానమంత్రి చెప్పిన మాట వింటూనే ఒక్కసారిగా భయపడిపోయాను!!!

* * *

"అయోధ్యలో రామమందిరం వాళ్ళే కడతామంటున్నారు గదా! రాముడు వాళ్ళ సొంతమా?...."

ప్రధానమంత్రి పివి నరసింహారావు చాలా దీర్ఘంగా ఆలోచిస్తూ తనలో తనే మాట్లాడుకుంటున్నట్లు నాకు వినబడేలా చెబుతున్నారు.

"ఓ పని చేద్దాం...... అయోధ్యలో రామమందిర నిర్మాణం జరగాలి. దీనికి మన ప్రభుత్వం వ్యతిరేకం అన్నట్లుగా వాళ్ళు ప్రచారం చేస్తున్నారు. కాబట్టి దీన్ని తిప్పి కొడుతూనే రామమందిరం నిర్మాణం మరోరకంగా జరిగిపోయేలా చేద్దాం...." అంటూ ప్రధానమంత్రి ఓ కొత్త వ్యూహాన్ని ఆవిష్కరించారు.

ఆయన మాటల్లో ఆ వ్యూహం ఏమిటో విన్నాక నేను సంభ్రమాశ్చార్యాలలో మునిగిపోయాను. ఎంతటి దూరదృష్టి! ఎలాంటి వ్యూహ చతురత!!

* * *

'ఛలో అయోధ్య' యాత్రవల్ల అయోధ్యలో ఎలాంటి గందరగోళం ఉండదనీ, అంతా ప్రశాంతంగా జరిగేటట్లు చూస్తామనీ భారతీయ జనతాపార్టీ నాయకులు శ్రీవాజ్‌పేయి, శ్రీ అద్వానీ, శ్రీకళ్యాణ్‌సింగ్ తదితరులు ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుని స్వయంగా కలిసి హామీ ఇచ్చారు.

సమావేశం జరిగింది న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నివాసమైన రేస్‌కోర్సు రోడ్డు నెం.5లో. నేను ప్రధానివెంటే ఉన్నాను.

ప్రధానమంత్రి ఆదుర్దా అంతా ఈ రథయాత్రవల్ల అయోధ్యలో తలెత్తగల శాంతిభద్రతల సమస్యల గురించి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటమంటే 'ఛలో అయోధ్య' యాత్రను నిరోధించడం. కాని బిజెపి నాయకులంతా కలిసి వచ్చి ప్రధానికి నచ్చజెబుతున్నారు.

"పి.వి.జీ, మమ్మల్ని విశ్వసించండి. ఎలాంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూసే బాధ్యతను మా ప్రభుత్వం స్వీకరిస్తుంది. మీరు నిశ్చింతంగా ఉండవచ్చు. 'ఛలో అయోధ్య' కేవలం ఒక శాంతియాత్రగానే ముగుస్తుంది....." ఇది ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కళ్యాణ్‌సింగ్ చేస్తున్న వాగ్దానం. అయోధ్య ఉన్నది ఉత్తరప్రదేశ్‌లోనే కాబట్టి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కళ్యాణ్‌సింగ్ గట్టి

హామీ ఇచ్చారు. ఆయనకు వత్తాసుగా వాజ్‌పేయి, అద్వానీలు మాట్లాడుతున్నారు. అంత పెద్ద నాయకులు - అందులోనూ పార్లమెంటు ప్రతిపక్షపార్టీ నాయకుడు, ఆ పార్టీ జాతీయనాయకుడు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి.... ఇంతమంది స్వయంగా వచ్చి చెబుతుంటే.... వారిని నమ్మకపోవాల్సిన కారణం ఏముంటుంది?

(2007 చివర్లో రాహుల్‌గాంధీ ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో నెహ్రూ కుటుంబం వాళ్ళు అధికారంలో ఉండి వుంటే 1992 లో అయోధ్యలో బాబ్రీమసీదు కూల్చబడి ఉండేదికాదు - అని ప్రకటించారు... 'ఛలో అయోధ్య' కార్యక్రమాన్ని హిందూ సంస్థలు చేపట్టినప్పుడు - ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ముందుగానే బర్తరఫ్ చేసి, రాష్ట్రపతిపాలన విధించగలిగితేనే బాబ్రీ దుర్ఘటన జరగకుండా నిరోధించి ఉండవచ్చు. నిజానికి రాజకీయంగా, చట్టపరంగా, పరిపాలనా పరంగా ఎన్ని చర్యలు తీసుకోవాలో అవన్నీ పి.వి.గారి ప్రభుత్వం తీసుకోవటం జరిగింది. బాధ్యతగల నాయకులు వచ్చి హామీ కూడా ఇచ్చారు. అదే హామీని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు క్కూడా ఇచ్చింది. ఇంత జరిగాక ఏ ప్రధానమంత్రికైనా ఎందుకు సందేహం వస్తుంది?... కానీ అయోధ్య చేరుకున్నాక అకస్మాత్తుగా వేలాది ప్రదర్శనకారులు మూకుమ్మడిగా బాబ్రీ మసీదు పైబడి, దాన్ని కూలగొట్టడం ఆరంభిస్తే- అలా ఆరంభమయిన విధ్వంసకాండని ఆపాలంటే ఎన్నివేలమంది కరసేవకుల్ని చంపితే సాధ్యపడుతుంది? ఇలాంటి మారణహోమాన్ని ఏ ప్రధానమంత్రి అయినా ఎలా జరిపించగలరు? నెహ్రూ కుటుంబంలోని వ్యక్తి ప్రధానమంత్రి అయితే అలా చెయ్యగలరని రాహుల్‌గాంధీ భావిస్తున్నారా?)

ఉత్తరప్రదేశ్‌లో ముందుగానే రాష్ట్రపతి పాలన విధిస్తే....? ఇది ప్రధానమంత్రి పి.వి.కి కొందరు ఇచ్చిన సలహా. ఆ సలహా ఇచ్చిన వారిని పి.వి ఇలా అడిగారు: "అంటే, ఎలాంటి కారణం లేకుండానే, ముందు జాగ్రత్త చర్యగా మీ ప్రభుత్వాన్ని రద్దుచేస్తున్నాము అని ప్రజాస్వామికంగా ఎన్నికైన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలా? ఇది రాజ్యాంగబద్ధంగా ఉంటుందా? 'రాజ్యాంగ విరుద్ధమైన చర్యకు పాల్పడిన ప్రభుత్వం' అనే ముద్ర మనం వేసుకుని తీరాలా?..."

ఈ అంశం కేంద్రమంత్రి మండలి సమావేశంలోనూ, కాంగ్రెసు పార్టీ వర్కింగ్ కమిటీలో కూడా చర్చకు వచ్చింది. రాజ్యాంగ నిపుణులు ఇచ్చిన రాజ్యాంగపరిధులు కూడా పరిశీలించబడ్డాయి. ఒక రాష్ట్రంలో ఎప్పుడైనా రాష్ట్రపతిపాలన విధించాలంటే - ఆ రాష్ట్రం ఆర్థికంగా పూర్తిగా దివాలా తీసి ఉండాలి, లేదా శాంతిభద్రతలు పూర్తిగా అడుగంటిపోయి ఉండాలి.... ఆ రోజు ఉత్తరప్రదేశ్ ఈ పరిస్థితుల్లో లేదు. ఏం చేయాలి? పైగా ఆ రాష్ట్రముఖ్యమంత్రి సుప్రీంకోర్టుకి హామీ ఇచ్చారు. ఆ నాయకులంతా వచ్చి ప్రధానికి హామీ ఇచ్చారు.

ఈ హామీలను నమ్మకుండా, రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్రపతి పాలన ఎలా విధించగలరు? అందులోనూ రాజ్యాంగబద్ధంగా నడుచుకునే పి.వి.! "అకారణంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని

రద్దుచేసి, రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్రపతిపాలన ఎలా విధించగలం?" అని ప్రధానమంత్రి ప్రశ్నించి నప్పుడు అటు మంత్రి మండలిలోగానీ, ఇటు పార్టీ సమావేశంలో గానీ ఎవ్వరూ - అర్జున్‌సింగ్‌తో సహా - ఎదురు చెప్పలేదు. (దురదృష్టవశాత్తు, ఆ రోజు పి.వి.ని సమర్థించిన కొందరు తరువాత కాలంలో బాబ్రీ దుర్ఘటనకు పూర్తిగా పి.వి.ని మాత్రమే బాధ్యుణ్ణి చేస్తూ రోడ్డుకెక్కారు.)

బిజెపి నాయకుల హామీని పి.వి. విశ్వసించారు. తన వైపు తీసుకోవలసిన చర్యలన్నీ తీసుకున్నారు. అయినా, 1992 డిశెంబరు 6న 'ఛలో అయోధ్య' ప్రదర్శన ఒక విధ్వంసకాండగా మారింది. బాబ్రీ మసీదు కూల్చివేయబడింది.

విఫలమైన శాంతిభద్రతల దృష్ట్యా ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రపతిపాలన విధించబడింది.

* * *

1993లో నాలుగు ఉత్తరాది రాష్ట్రాలకి జరిగిన ఎన్నికలలో 'రామ మందిర నిర్మాణం' బిజెపి తక్షణ అజెండా.

1993 నుంచి బిజెపి తమ ప్రచారాలలో 'అయోధ్య రామమందిర' నిర్మాణం తమ తక్షణ కార్యక్రమంగా ప్రకటించసాగింది.

"రాముడు! హిందువుల ఆరాధ్యదైవమయిన రాముడు బిజెపి సొంతమా? ఇదేం ప్రచారం" - పి.వి. మనస్సుని తొలిచేస్తున్న రాజకీయ సమస్య రాముడు.

ఆ సమయంలోనే ఒకరోజు నేను వెళ్ళేసరికి, పి.వి. ఒక్కరే ఉన్నారు. నన్ను కూర్చోమని చెప్పి, నాకు వినబడేటట్లు ఆయన తనలో తానే ఏదో మాట్లాడుకుంటున్నారు. శ్రద్ధగా ఆలకిస్తున్నాను.

"బిజెపితో పోటీ చేయచ్చు. కాని రాములవారితో పోటీ ఎలా చేయగలం? రాములవారు వారి సొత్తు అన్నట్లు ప్రవర్తిస్తోంది బిజెపి. కాంగ్రెసు సెక్యులర్ పార్టీ. అంటే - మేం నాస్తికులం అని అర్థం కాదు గదా? మాకూ రాముడు దైవమే. ఆయనను వాళ్ళలా ప్రార్థిస్తారో మేమూ అంతే. అయోధ్యలో మందిరం కట్టే నెపంతో రాముడిని వాళ్ళు సొంతం చేసుకునే ప్రయత్నం చేసి, ప్రజలను మభ్యపెట్టాలని చూడడం ఎంతవరకు న్యాయం?...

"వాళ్ళు అధికారంలో ఉంటే ఏం చేయగలిగేవారో వాళ్ళకి తెలిసేది. విశ్వ హిందూ పరిషత్తు అనే సంస్థ హిందూ సంప్రదాయం కోసమయితే ఫరవాలేదు. అది ఒక రాజకీయ పార్టీ చేతుల్లోకి వెళ్ళిపోతే, వారికి అయోధ్యలో రామమందిరం కట్టడానికి ప్రభుత్వ భూమి ఎలా యిస్తాం? సాధువులను సంతులను కొందరిని పోగుచేసి హిందువులందరూ మాతో ఉన్నారంటే ఎలా?...."

ఇలా అంటూ కొంచెం ఆగారు. ఆయనలో పెల్లుబుకుతున్న ఉద్వేగం, తపన నాకు అర్థమవుతున్నాయి. నేను ఆ వాక్ప్రవాహాన్ని ఆపే ప్రయత్నం చేయలేదు. ఈ సమస్యకి పరిష్కారంగా అప్పుడే ఆయన నోట్లోంచి ఒక కొత్త వ్యూహం విన్నాను.

"దీనికి ఒక్కటే పరిష్కారం... పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల హిందూ మఠాధిపతులు, పీఠాధిపతులు, సంస్థలతో ఒక పూర్తి ప్రాతినిధ్య కమిటీని తయారుచేసి, మందిరం కట్టే బాధ్యత వారికి అప్పగిస్తే సరి."

ఇది ప్రధానమంత్రిగారి ఆలోచనాధోరణి. తనలో తనే మాట్లాడుకుంటున్నారా అన్నట్టు సాగుతోంది.... నేనక్కడ ఆయన ఎదురుగా ఉన్నానన్నది ఆయనకు జ్ఞాపకం వుందా? సరే చూద్దామని... చిన్నగా దగ్గి, "మీరనుకుంటున్నట్లు ఆసంస్థలో ఎవరెవరుంటే బాగుంటుంది?" అని అడిగాను.

"ఎవరేమిటి....అందరూ....అద్వైత, ద్వైత, విశిష్టాద్వైత పీఠాధిపతులు. దేశం అన్నిమూల లోనూ ఉండే శృంగేరి, కంచి, ద్వారక, బదరీ, పూరీ శంకరాచార్యులు, రామానుజ సంప్రదాయానికి చెందిన తమిళనాడు జియ్యర్లు, ఆంధ్రా అయ్యంగార్లు, ఉత్తరాదిన ఉన్న శ్రీ వైష్ణవ మఠాధిపతులు, ద్వైత సంప్రదాయానికి చెందిన ఉడుపి, ఉత్తరాది మఠపీఠాధిపతులు, వల్లభాచార్య, గౌడీయ, చైతన్య సంప్రదాయాల గురూజీలు, అయోధ్యలోని హనుమాన్‌గఢి, లక్ష్మణగఢి మొదలైన మహంతులు... ఇలా అన్నివర్గాల వారూ కలిసేలా, పార్టీలకు సంబంధం లేకుండా ఒక సంస్థ (trust) ని ప్రారంభిస్తే... వారికి రామాలయ నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తే అదేదో రాజకీయ వేదిక అనడానికి లేదుగదా? ఈ వివాదాన్ని ఏ రాజకీయ పార్టీ ఉపయోగించుకోకుండా చూడొచ్చు కదా!!"

"మరి యిప్పుడే కొంత మంది విశ్వహిందూ పరిషత్ మొదలు పెట్టిన రామాలయ నిర్మాణ కమిటీలో వున్నారు కదా!"

"కొంతమంది ఉన్నా అన్ని వర్గాలవారూ లేరు. దాన్ని పూర్తిప్రాతినిధ్యం వున్న కమిటీ అనటానికి లేదు. వారిని కూడా ఈ రాజకీయాతీత సంస్థలో పెడదాం".

"ఇటువంటి సంస్థను స్థాపించాలనుకున్నారంటేనే VHP నుంచీ BJP వాళ్ళనుంచీ వ్యతిరేకత వస్తుంది. దానిలో చేరొద్దని అందరూ పీఠాధిపతులపై ఒత్తిడి తెస్తారు కదా!"

"తప్పక తెస్తారు. అందుకే ఇది పార్టీ గానీ, ప్రభుత్వం గానీ చేసినట్లు ఉండరాదు. అందరు మఠాధిపతులూ ఎవరంతట వారే ఇటువంటి ప్రయత్నం చేస్తున్నట్లు చేయాలి. ఇదంతా కొంతకాలం వరకు ఎవరికీ తెలియకుండా జరగాలి. ముందు వారందరితో విడివిడిగా మాట్లాడి యిటువంటి యోచనకు వారి సమ్మతి తీసుకోవాలి. ప్రభుత్వం ఇటువంటి సంస్థకు పూర్తి మద్దతు ఇస్తుందనీ, యితర (యిప్పుడున్న) సంస్థలకు ఇవ్వదనీ- విడమర్చి చెప్పాలి...

"రామ మందిరం కట్టగలిగింది కోర్టులో ఉన్న కేసు తేలినతర్వాత. లేదా హిందువులూ, ముస్లింలూ కూర్చుని చర్చ చేసి ఒక నిర్ణయానికొచ్చిన తరువాత...

"ఇప్పుడు హిందువుల తరఫున మాట్లాడాలంటే ఈ రామమందిర నిర్మాణం కమిటీ (VHP) ది పూర్తి ప్రాతినిధ్యం ఉన్న కమిటీ కాదుకదా. దానికి ముస్లిం వ్యతిరేక కమిటీగా ముద్ర పడింది. నిర్మాణాత్మక చర్యలు జరగడానికది అవరోధమవుతోంది. ప్రభుత్వం జోక్యం చేసుకొంటే – రాజకీయాలు వస్తున్నాయి. కనుక సమస్యకు రాజకీయాలకు అతీతంగా పరిష్కార మార్గం కనుక్కొనే ప్రయత్నం జరగాలి. దానికి ప్రభుత్వం పూర్తి మద్దతునివ్వాలి....."

ఈ ఆలోచన నాకు నచ్చింది. "బాగుంది సర్, ఎవ్వరైనా మీరు అనుకున్నది చేయగలిగితే చాలాబాగుంటుంది. కాని ఎవరు చేస్తారు?" అడిగాను.

"అది నువ్వే చేయ్యాలి" అన్నారు పి.వి.

నిర్ఘాంతపోయాను. నాకు నోట మాట రాలేదు.

"అవునయ్యా, నువ్వే. నీకు చాలా మంది మఠాధిపతులు పీఠాధిపతులతో మంచి సంబంధాలున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా వారందరితో పరిచయం వుంది గదా! చాలా మఠాలకు నువ్వున్నప్పుడే తిరుమలలో వారి మఠాలు కట్టుకునేందుకు స్థలాలు ఇచ్చి ఒక పెద్ద మఠం వీధినే తయారు చేశావుగదా....." అన్నారు.

"నిజమే కాని, అందులో చాలామంది దక్షిణ భారతదేశానికి చెందినవారు.... కొద్దిమందే ఉత్తర భారత దేశీయులు. ఉత్తర భారతంలో చాలమందితో నాకు అసలు పరిచయమే లేదు సర్..."

"దానికి తగ్గ ఏర్పాట్లు నేను చేస్తాను. ఇప్పుడు ద్వారకా శంకరాచార్యులే బదరీ శంకరాచార్యులు కూడా. ఆయనకూ విశ్వహిందూ పరిషత్తుకూ పడదు. ఇదివరకే ఐదుగురు శంకరాచార్యుల్ని కలపడానికి ప్రయత్నం జరిగింది. అది ముందుకు పోలేదు. కాని ద్వారకాశంకరా చార్యుల్ని కాంగ్రెసు అనుయాయిగా అందరూ భావిస్తారు. ఆయనను ఇందులోకి తేవడానికి ఇబ్బంది లేదు. కాని తానే ఈ సంస్థకు అధ్యక్షునిగా ఉండాలనుకోవచ్చు. ఆయన అధ్యక్షుడైతే దాన్ని కాంగ్రెసు సంస్థగా భావించే అవకాశం ఉంది. దానివలన ప్రయోజనం లేదు...

"కంచి శంకరాచార్యులు మనతో బాగానే ఉన్నా ఆయనకు బిజెపి, విశ్వహిందూ పరిషత్తులతో మంచి సంబంధాలు ఉన్నాయి. పెజావరు విశ్వేశతీర్థ స్వామీజీ మొదటినుండి ఆ ఉద్యమంలో భాగస్వామి. ఒకసారి జైలుకు కూడా వెళ్ళారు. రామజన్మ మందిర ట్రస్టులో చాలా ముఖ్యమైన సభ్యుడు. విశ్వ హిందూ పరిషత్తులో ఉపాధ్యక్షుడు... నీకు చాలా సన్నిహితుడని విన్నాను...!"

"చాలా ఏళ్ళనుండి బాగానే తెలుసు. అయితే ఈ ఉద్యమానికి లేదా ఈ సంస్థకు ఎవరు నాయకుడుగా ఉండాలంటారు?"

"చెప్పడం కష్టమే. ఇప్పటిదాకా ఇటువంటి విషయాలకు దూరంగావున్న ఆ శృంగేరీ స్వామి అయితే ఎటువంటి వివాదం ఉండకపోవచ్చు. పీఠాలలో కూడా ఆ పీఠానికి మిగతా

వారు ఒప్పుకొన్నా ఒప్పుకోకపోయినా ప్రాముఖ్యత ఎక్కువ అంటారు. ఆయనను ఒప్పించడం ఒకటైతే, కంచివారిని ద్వారకావారిని ఆయన నాయకత్వంలో పనిచేయడానికి ఒప్పించడం మరీ కష్టం. శృంగేరీ వారికి ఉత్తర భారతదేశంలో కూడా విస్తృతమైన అనుచరగణం వుంది..."

ఇక్కడ వరకు ఆయన చెబుతున్నారు, నేను అడుగుతున్నాను. సీరియస్‌గా ఆయన వివరిస్తున్నారు.... నా మనస్సులో - ఇదేదో ఊబిలోకి కూరుకుపోతున్నానా? ఒక ఐఏఎస్ అధికారినయిన నేను ఈ రాజకీయేతరంగా కనబడే రాజకీయ వ్యూహాన్ని అమలుచేయగలనా? ఇలా మనసులో తర్జన భర్జన పడుతూనే మాట్లాడుతున్నాను... అప్పుడు ఆయన ఇంకో షరతు బైట పెట్టారు.

"ఏమి చేసినా, ఎవరిని కలిసినా బయటికి తెలియకూడదు. నీ పేరు కాని, నా పేరుగాని బయటకు రాకూడదు... నీకు ఉత్తరభారతంలో సహాయం చెయ్యడానికి బీహారులో ఒక ఐ.పి.ఎస్. అధికారి డిఐజి ర్యాంకులో ఉన్నాట్ట. నరేష్ చంద్రగారితో మాట్లాడి ఏర్పాటు చేసుకో. మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి దిగ్విజయసింగ్‌కు ద్వారకా శంకరాచార్యుల వారితో, యింకొందరు వైష్ణవ మఠాధిపతులు - మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వారితో పరిచయాలు బాగావున్నాయి. నీకు సహాయం చేయమని ఆయనకు చెప్తాను" అన్నారు.

అప్పుడే పి.వి. మరికొన్ని రహస్యాలు బైట పెట్టారు. నేను కళ్ళు, చెవులు అప్పగించి వింటూ వుండిపోయాను...

★ ★ ★

అయోధ్యలో పి.వి.రామాలయం-2

ఆ రకంగా - అయోధ్యలో రాముడు తమ సొంతమన్నట్లుగా భారతీయ జనతా పార్టీ చేసుకుంటున్న ప్రచారాన్ని శాశ్వతంగా త్రిప్పికొట్టేందుకు ఒక వ్యూహాన్ని రచించారు ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు. ఆ వ్యూహంలో నన్నొక కీలకపాత్ర వహించమనేసరికి నాకు చెమటలు పడుతున్నాయి.

ఆయన చెప్పేది చెబుతూనే వున్నారు. నేను రంగంలోకి దిగిపోయినట్లుగా పరిగణిస్తూ, అయోధ్యలో మహంతులు ఎవరెవరికి ఎవరితో లింకులు ఎలా వున్నాయో తెలిపే రహస్యాలు చెప్పసాగారు.

"...అయోధ్యలో మహంతులు చాలామంది ఇప్పుడు విహెచ్‌పితో ఉన్నారు. చంద్రస్వామికి అక్కడి కొంతమందితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కాని ఆయనతో జాగ్రత్తగా ఉండాలి. పని అయితే చేస్తాడు కాని, పబ్లిసిటీ లేకుండా చూసుకోవడం కష్టం. ఆయన పేరు చెబితే మిగతా స్వామీజీలు అందరూ వెనక్కిపోవచ్చు. జాగ్రత్తగా నడపాలి... ఎవరితో మాట్లాడినా ప్రతివారికి కొన్ని గొంతెమ్మ కోరికలుంటాయి. వాటిని చేస్తామని వాగ్దానం చేయకూడదు. చేయలేమనీ చెప్పకూడదు. ఆలోచించి ఇబ్బంది లేనివి, చెయ్యగలిగినవి కొన్ని చేయవచ్చు..."

నాకెందుకో చాలా భయం వేసింది. చాలా కీలకమైన విషయం. సున్నితమైన విషయం. మనం పబ్లిసిటీ యివ్వకపోయినా కలుసుకున్న స్వామీజీలు పత్రికలవారికి చెప్పరని ఏమి నమ్మకం? అయోధ్య విషయం ప్రధానికి ఎంత ముఖ్యమో నాకు తెలుసు.

అటువంటి అయోధ్య విషయంలో, ఇంత ముఖ్యమైన సున్నితమైన పనిని నాకు అప్పగించారన్నది తలచుకొంటే నాకు ఒళ్ళు గగుర్పొడుస్తోంది. అప్పటికే అదివరకు మంత్రివర్గ కార్యదర్శిగా పనిచేసిన నరేష్‌చంద్రగారికి ప్రధానమంత్రి కార్యాలయంలో అయోధ్య ప్రత్యేక విభాగాన్ని నిర్వహించే బాధ్యతను అప్పగించడం జరిగింది.

ఆయనతో చర్చించి, బీహారు CISF లో పనిచేస్తున్న కిషోర్ కునాల్‌ని నాతో పనిచేయడానికి అనధికారికంగా పిలిపించాను. అతనొక IPS officer. ఆధ్యాత్మికరంగంలో చాలా అనుభవం కలిగినవాడు. అంతకుముందు చర్చలు జరిగినప్పుడు మఠాధిపతులు పీఠాధిపతులతో సంబంధాలు కలవాడు. ఉత్తర భారతంలో అయోధ్య, ప్రయాగ, కాశీ ప్రాంతాలలోని చాలామంది మహంతులతో మఠాధిపతులతో మంచి పరిచయాలు కలవాడు. కాని మేమిద్దరం ప్రభుత్వ అధికారులమే కాబట్టి మఠాధిపతుల తరఫున వారి మనిషిగా ఈ పనంతా చేయటానికి ఒక ముఖ్యమైన వ్యక్తి కావాలి.

వీలయినంత వరకు అతను ఈ సంస్థకు నాయకత్వం వహించే పీఠాధిపతికి ఆంతరంగిక వ్యక్తి అయితే మరీ మంచిది.

నరేష్ చంద్రగారితో, కిషోర్‌తో చర్చించి, సంస్థకు నాయకత్వం వహించి, మొత్తం కార్యక్రమం సమన్వయం చేయడానికి శృంగేరీ శంకరాచార్యులవారైతే బాగుంటుందని అనుకున్నాం. ఆయనను ఒప్పించాలి. ప్రధానితో ఈ విషయాలు చెప్పి శృంగేరీకి బయలుదేరాను.

శృంగేరీ స్వామీజీతో నాకు బాగానే పరిచయం ఉంది. ఆయన పూర్వాశ్రమంలో నరసరావు పేటవాసి. నేను అదివరకు తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉండగా చాలాసార్లు కలవడం జరిగింది. వీరి గురువుగారు శ్రీ మహాసన్నిధానంవారు ఉన్నప్పుడు ప్రతి సంవత్సరం నవరాత్రులలో వేదసభలు జరిపేవారు. నన్ను ముఖ్యఅతిథిగా పిలవడం, నేను శృంగేరి వెళ్ళటం జరిగింది. అంతకు ముందు కూడా టిటిడి వసతిగృహం నిర్మాణ విషయంగా, తరువాత దానికి ప్రారంభోత్సవ సందర్భంగా రెండు సార్లు శృంగేరి వెళ్ళాను. తరువాత వారితో ఇంకొక రెండుమూడు సార్లు కలిసి సంభాషించడంతో వారి నిరాడంబరత, ఐహిక విషయ విరక్తి, జ్ఞానపిపాస, సున్నిత హాస్యం నా పై చెరగని ముద్ర వేశాయి.

'అయోధ్య' కాండ మొదలయినాక దాదాపు పదిసార్లు శృంగేరీ వెళ్లవలసివచ్చింది. ఆ పర్యటనలన్నీ వారిని నాయకత్వం వహించమని ఒప్పించడానికి. మేం అనుకున్నవారిని ఆ కమిటీలోకి తీసుకు వచ్చేందుకు వారి తరఫున వారి కార్యనిర్వహణాధికారి శ్రీ గౌరీ శంకర్‌ని ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా మాతో పనిచేయించేందుకు. ఉత్తరభారతంలో కొంత పర్యటన, పరిచయాలు అవసరం కనుక వెంటనే ఆ సంవత్సరం శృంగేరీపీఠాధిపతులు ఢిల్లీలో కొన్ని నెలలు (చాతుర్మాస కాలం) ఉండేటట్లు ఒప్పించాలి. అలా కొత్త సంస్థకు నాంది పలకడం జరిగింది.

గౌరీశంకర్, కిశోర్, నేను ఒక టీమ్‌గా తయారై చాలామంది మఠాధిపతులను, మహంతులను, పీఠాధిపతులను, సన్యాసులను కలవడం జరిగింది. వారు లేకుండా నేనొక్కడినే కంచికి, బెంగుళూరుకు, ఉడుపికి, పూరీకి ఎన్నోసార్లు వెళ్ళవలసివచ్చింది.

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీదిగ్విజయసింగ్ వారి విమానంలో మమ్మల్ని అలహాబాద్, బెనారస్, జైపూర్‌లకు తీసుకువెళ్ళి కొందరు స్వామీజీలను పరిచయం చేయడమే కాకుండా, వారిని ఒప్పించడంలో చాలా సాయం చేశారు. కొన్ని రోజులైన తర్వాత, "మీ వెంట తిరుగుతుంటే కుదిరేట్టుగా లేదు--నేను ముఖ్యమంత్రి పదవికూడా చూసుకోవాలి కదా! విమానం కావాలంటే ఏర్పాటు చేస్తాను" అన్నారు శ్రీదిగ్విజయ్‌సింగ్.

"విమానం అవసరం లేదు. ఎప్పుడన్నా ఎవరినైనా కలవాలంటే మీరు ఏర్పాట్లు చేసి మాట్లాడితే చాలు"

తరువాత కూడా ఆయన చాలా మద్దతు ఇచ్చారు....

ద్వారకా శంకరాచార్యులవారిని ఒప్పించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. చేరడానికి ఆయనకు చాలా ఉత్సాహం. కాని ఈ నాయకత్వం విషయంలోనే భేదాభిప్రాయం వ్యక్తంచేశారు. తాను ఈ ఉద్యమంలో మొదటినుంచీ ఉన్నాననీ, ఒంటరిపోరాటం విశ్వహిందూ పరిషత్‌తో చేస్తున్నాననీ, ఈ విషయంలో దక్షిణాదిస్వామీజీలకు అంతగా అవగాహన లేదనీ, ఇతర మఠాధిపతులను ఆకట్టుకునే పద్ధతులు శృంగేరీవారికి లేకపోవచ్చనీ... ఇలా అనేకభావాలు ఆయన వ్యక్తం చేస్తూవచ్చారు.

ఆయన చాలా సమర్థులే. అది వరకు ఆయన ఈ విషయంలో చేసిన పోరాటం దృష్ట్యా నాయకత్వం ఆయనకే దక్కాలి... కాని ఆయన నాయకత్వం వహించటంవల్ల చాలామంది విశ్వహిందూ పరిషత్ సానుభూతిపరులు ఇందులోకి వచ్చే అవకాశం లేకపోగా, ఇది ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమనీ, కాంగ్రెసు రాజకీయ ఎత్తుగడ అనీ నలుగురూ భావిస్తే, కమిటీయొక్క విశ్వసనీయత దెబ్బతినే ప్రమాదం ఉంది.... సున్నితంగా వారికి ఆ విషయాన్ని చెప్పడానికి, ఒప్పించడానికి చాలా అవస్థ పడవలసివచ్చింది. దిగ్విజయసింగ్‌గారు స్వయంగా రెండుసార్లు వచ్చి మాట్లాడటమేకాక, ఇతరుల చేతకూడా మాట్లాడించారు. చివరకు ప్రధానమంత్రి స్వయంగా కలగచేసుకొన్నాక గాని ఆయన ఒప్పుకోలేదు.

దిగ్విజయ సింగ్‌గారు ఉత్తరాది వైష్ణవ మఠాలలో మంచిపేరు, జనబలం ఉన్న వారణాసి శ్రీమఠం స్వామీజీని ఒప్పించడంలో కూడా చాలా సాయం చేశారు. మాతో వారణాసి వచ్చారు. అక్కడే ఉన్న ద్వారకా శంకరాచార్య, శ్రీమఠం రామానుజస్వాములను మాతో కలిపారు.

కంచి స్వామీజీలతో నాకు చాలా రోజులనుంచి - తిరుపతి రోజుల నుంచీ - మంచి పరిచయం. పరమాచార్యులవారితోనూ, జయేంద్ర సరస్వతీ స్వాములవారితోనూ, శ్రీ విజయేంద్రులతోను సత్సంబంధాలు ఉండటం వలన, కంచి వెళ్ళి వారిని ఒప్పించడానికి ప్రయత్నం చేశాను. వారికి బిజెపి రామజన్మ భూమి కమిటీలతో చాలా సన్నిహిత సంబంధాలు ఉండటం వలన - నాయకత్వం విషయంలో కొంత అసంతృప్తి ఉండటం వలన - కాదనీ అనలేరు, ఔననీ అనలేరు. పి.వి.గారితో కూడా వీరికి మంచి సంబంధాలు ఉన్నాయి. వారిపై సానుభూతి ఉండటంవలన కాదనే పరిస్థితీ కాదు. కాని అదివరకే చేసిన కొన్ని వాగ్దానాల వలన ఒప్పుకోవడం అంత తేలిక కాదు. దాదాపు పదిసార్లపైన ఈ విషయంలో కంచి వెళ్ళి ఇద్దరు స్వామీజీలను కలవవలసివచ్చింది. చివరకు వారు కూడా ఒప్పుకొన్నారు.

శ్రీ విశ్వేశతీర్థ స్వామీజీ (పెజావరు మఠం, ఉడుపి) నాకు గత 30సంవత్సరాలకు పైగా తెలుసు. 1970లో అయన పర్యాయంలో మొదటిసారి ఉడుపిలో ఆయనతో పరిచయం జరిగింది. తిరుపతిలో వారి 50 సంవత్సరాల ఉత్సవంలో పాల్గొనడం, దివి తాలూకా ఉప్పెన బాధితులకు

హంసల దీవిలో సహాయ కార్యక్రమాలలో ఆయనతో కలిసి పనిచేయడం, తిరుమల మఠం వీథిలో వారికి స్థలాన్ని యిచ్చి కృష్ణమఠం కట్టడంలో నావంతు సేవచేయడం... ఇలా చాలాసార్లు చాలా సభలలో వారితో పాల్గొనడం జరిగింది. ఆయనంటే నాకు చాలా గౌరవం. ఆయనకు నేనంటే చాలా అభిమానం, వాత్సల్యం.

ఎంతైనా ఆయన మొదటినుంచి విశ్వహిందూ పరిషత్తులో ఒక మూలస్తంభం. దానికి ఉపాధ్యక్షులు కూడా. రామజన్మభూమి ఉద్యమంలో మొదటి నుంచి చాలా ఉత్సాహంతో పనిచేసిన నాయకుడు. శ్రీ అద్వానీ, శ్రీ వాజ్‌పేయి, శ్రీ అశోక్‌సింఘాల్‌తో చాలా సన్నిహిత సంబంధాలు కలవారు. ఆయనను ఒప్పించడం మాట అటుంచి, వారితో ఈ విషయం ప్రస్తావన తేవడానికి కూడా చాలా జంకాను.

పైగా ఇంతవరకు చేస్తున్నదంతా బయట ఎవ్వరికీ తెలియకుండా, ఎటువంటి పబ్లిసిటీ లేకుండా జరుగుతూ వచ్చింది.

పెజావరు స్వామీజీతో ప్రస్తావన చేశాక ఇతరులకు తెలియకుండా ఉంటుందా? వారు ఒప్పుకోకపోవచ్చు. పైగా విశ్వహిందూ పరిషత్తుకు ఈ విషయం తెలియవచ్చు. నా ధర్మం నేను చేయాలి కాబట్టి, ఆయనను ఒప్పించడానికి ప్రయత్నం చేసి ఆయన ఒప్పుకోకపోతే, కనీసం ఈవిషయాన్ని గోప్యంగా ఉంచమని ప్రార్థించాలనుకొన్నాను.

ఆయనతో బెంగుళూరులో చాలాసేపు విషయాన్ని చర్చించాను. నామీద అభిమానం కొద్ది ఆలోచించి చెప్తానన్నారు. అంటే ఒప్పుకోలేదు. సరిపెట్టుకొని, విషయాన్ని గోప్యంగా ఉంచమని ప్రార్థించాను.... కాని ఒక వారం రోజులలో ఆయన నన్ను మళ్ళీ కలవమన్నారు. కలిసినప్పుడు అడిగిన ప్రశ్న ఒకటే– " ప్రధానమంత్రి ఈ విషయంలో - అంటే రామాలయ నిర్మాణం విషయంలో కృత నిశ్చయంతో వున్నారా?"

నేను వివరించాను: "చాలా పట్టుదలతో వున్నారు. ఆయన ఉన్నంతవరకు విశ్వహిందూ పరిషత్తు ప్రారంభించిన కమిటీకి ఆలయానికి స్థలం ఇచ్చే ప్రశ్న ఉదయించదు."

ప్రధానితో కలిసి ఒకసారి చర్చించాక, తన నిర్ణయం చెబుతానని స్వామీజీ అనడంతో, అలాగే వారిద్దరినీ నేను రహస్యంగా కలిపి మాట్లాడించడం జరిగింది. తరువాత ఒక్క షరతుపై వారు ఈ సంస్థలో చేరడానికి ఒప్పుకొన్నారు. తాను విశ్వహిందూ పరిషత్తుతో సంబంధాలు తెంచుకోనని, అయితే తనంత తానుగా ఈ విషయాన్ని బయటపెట్టనని మాత్రం చెప్పారు. నాకు కొంత ఆశ్చర్యంవేసింది. "కారణం అడగవచ్చా?" అని అడిగాను.

ఆయన చెప్పినది: "నాకు రాజకీయాలతో పనిలేదు. నేను బిజెపికి, విహెచ్‌పి చాలా దగ్గర. నిజమే... దానికి కారణం వారు హిందూత్వాన్ని బలపరచడమే. అయినా నాకు కాంగ్రెసు పట్ల గాని, వారి నాయకుల పట్లగాని వ్యతిరేకత లేదు. నాకు కావలసింది అయోధ్యలో

రామాలయనిర్మాణం. దానికి ఎవరు దోహదం చేసినా వారితో పనిచేయడానికి నేను సిద్ధం. ప్రధానమంత్రిని కలిశాక, వారు రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమం చేయాలను కుంటున్నారని నాకు పూర్తి నమ్మకం కలిగింది. వారి సామర్థ్యం మీద నాకు విశ్వాసం ఉంది. అటువంటిది జరిగితే అంతకంటే కావలసింది లేదు. అందుకే వారికి సహకరించడానికి సిద్ధపడ్డాను.... కాని ఇది పూర్తిగా జరగగలదా అన్న విషయం భవిష్యత్తే చెప్పగలదు, కాని ఇప్పుడు ఏమీ చెప్పలేం. పి.వి.గారు చేసినా, వి.హెచ్.పి. వారు చేసినా నాకు కావలసింది మందిర నిర్మాణం, అందులో భాగస్వామిగా ఉండటం. విషయం బయటకు వచ్చినతర్వాత విహెచ్‌పికి, బిజెపికి, అప్పటి కమిటీలలో ఉన్న ఇతర స్వామీజీలకు సమాధానం చెప్పుకునే బాధ్యత నాది" అన్నారు.

1993 చివర్లో ఈ పూర్తి ప్రాతినిధ్య కమిటీ నిర్మాణం ప్రయత్నాలు మొదలుపెట్టి ఇక్కడిదాకా పీఠాధిపతుల్ని ఒప్పించి ఒక కొలిక్కి తీసుకొచ్చే సరికి 1995 వచ్చేసింది.

పూరీ శంకరాచార్యుల వారు తప్ప అందరు శంకరాచార్యులను ఒప్పించడం, చాలా మంది వైష్ణవ, శ్రీవైష్ణవ పీఠాధిపతులను, ముఖ్యంగా పెజావరు స్వామీజీని ఒప్పించడం జరిగింది.

కాని అయోధ్యలో మాత్రం మా ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. అప్పటికి దాదాపు పదెనిమిదిసార్లు అయోధ్యకి కిషోర్ కునాల్, నేనూ, గౌరీశంకర్ వెళ్ళటం జరిగింది. చాలామంది స్వామీజీలతో రకరకాల చర్చలు జరపడం.... చాలా పెద్ద పెద్ద వారితో వారికి చెప్పించడం జరిగింది. అయినా ఒకరిద్దరు ఒప్పుకున్నా సంతకం పెట్టే ధైర్యం చేయలేదు. విశ్వహిందూ పరిషత్తులో ఉన్న పెద్దస్వామీజీలను కలవదలచుకోలేదు. కనీసం అయోధ్యలో మందీ, మార్బలం, పలుకుబడి కల హనుమాన్‌గడి, లక్ష్మణ గడిల స్వామీజీలనన్నా యీ సంస్థలో చేర్చకపోతే, అయోధ్యలో పట్టు వుండదు. మాకు తెలిసింది - హనుమాన్ గడి మహంతు చంద్రస్వామి గారికి సన్నిహితుడనీ, ఆయన బలంతోనే ఈయన అధికారానికి వచ్చాడనీ. కాని చంద్రస్వామి గారికి ద్వారకాశంకరాచార్యులతో పడదనీ, అంతేకాకుండా చంద్రస్వామి గారు శ్రీమఠంస్వామీజీకి పోటీగా యింకొక స్వామిని పీఠాధిపతిగా ప్రోత్సహించి అయోధ్యలో ఒక పోటీ మఠం స్థాపించారనీ, కనుక ఈ విషయంలో మెలకువతో ప్రవర్తించకపోతే ఒప్పుకున్న కొంతమంది స్వామీజీలు తప్పుకొనే ప్రమాదం వుందనీ కూడా తెలిసింది. నరేష్ చంద్రగారితో మాట్లాడితే, ఈ విషయాలలో తనకంత అవగాహన లేదనీ ప్రధానితోనే మాట్లాడమనీ సలహాయిచ్చారు.

ఏం చేయాలి?

నాకీ ప్రశ్న ఉత్పన్నమయిన వెంటనే వెళ్ళి ప్రధానిముందు కూర్చున్నాను. అయోధ్య గురించి అనగానే ఆయన చాలా శ్రద్ధ చూపిస్తారు. ఈ సమస్య మత విద్వేషాలకు అవకాశంలేని విధంగా సామరస్య పూర్వకంగా పరిష్కారం కావాలన్నది ఆయన తపన.....

కమిటీ నిర్మాణంలో తాజా పురోగతి వివరించి, "చంద్రస్వామి సంగతి ఏం చేయమంటారు? ఆయన్ని కలుపుకు వెళ్ళాలా వద్దా?...." అంటూ సమస్య విడమర్చి చెప్పాను. "నాకు చంద్రస్వామి చాలా సంవత్సరాల నుంచి తెలుసు. ఆయన కొన్ని విషయాలలో బాగా పనికొస్తాడు. ఆయనను దగ్గరకు తీయడంలో చాలా ఇబ్బందులున్నాయి. అందుకే ఆయనను చాలా దూరం పెట్టకుండా మరీ దగ్గరకు తీయకుండా నడుపుకొస్తున్నాను.... నువ్వు చెప్పిన పరిస్థితిని బట్టి ఈ విషయంలో ఆయన సహాయం తీసుకోవలసిందే కాని ఈ విషయం ఎవరికీ తెలియకుండా వుండటం చాలా మంచిది" ఇదీ ప్రధాని సలహా.

చంద్రస్వామి గురించి విననివారు లేరు. ఆయనకి ప్రతికూలంగా కూడా చాలా విషయాలు విన్నాను. అన్ని పార్టీల నాయకులు, మంత్రులు, ముఖ్యమంత్రులు, అది వరకు అధికారంలో వున్నవారు, అధికారం పోగొట్టుకొన్నవారు, అధికారం కావాలనుకునేవారు చాలా మంది ఆయనదగ్గరకు వచ్చేవారు... మొత్తం మీద మిగతా విషయాలు ఎలా వున్నా ఈ చంద్రస్వామి నా పని చేసి పెట్టారు. హనుమాన్‌గడి మహంతును, ఇంకా ఇద్దరు మహంతులను పిలిచి, పరిచయం చేసి వారిచేత సంతకాలు చేయించారు.

అలా దేశంలో వివిధప్రాంతాల్లోని అద్వైత, ద్వైత, విశిష్టాద్వైత పీఠాధిపతులతో, వివిధ ముఖ్య వర్గాలకు చెందిన మఠాధిపతులతో కలిపి, రాజకీయాలకు అతీతంగా అయోధ్యలో రామాలయం నిర్మాణ సంస్థ ఏర్పాటు చేశాం... ఆ సంస్థను రిజిస్టర్ చేయించాం.

రాముడు ఆరాధ్య దైవంగా భావించే అన్ని వర్గాలూ ఆమోదించే 'సంపూర్ణప్రాతినిధ్యం' వున్న కమిటీ సారథ్యంలో రామాలయం నిర్మాణానికి అలా మొదటి దశను అధిగమించాం. నా కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన అధ్యాయం ఈ కమిటీ నిర్మాణం.

ఈ కమిటీకి ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధంలేదు.... కాని, ఈ కమిటీలో అన్ని రాజకీయ పార్టీలకూ ఆమోదయోగ్యమైన సభ్యులున్నారు... ఈ కమిటీ సారథ్యంలో రామాలయం నిర్మాణం జరిగితే, అందుకు పూర్తి మద్దతు, సహకారం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది...

"ఇక ఆక్షేపణలకూ, అభ్యంతరాలకూ అతీతంగా రామాలయ నిర్మాణం జరుగుతుంది" అన్న విశ్వాసాన్ని పి.వి. వ్యక్తం చేశారు – ఈ సంస్థ రిజిస్ట్రేషన్ జరిగాక.

కాని,

అప్పటికి 1995 చివరికొచ్చేశాం... రామాలయ నిర్మాణం విషయంలో ఈ కొత్త కమిటీ ఒక సారి సమావేశమై, తమకు ఏం చేయాలో ప్రభుత్వానికి విన్నవించాలి. అప్పుడు ప్రభుత్వం తగు ఏర్పాట్లు చేయాలి. ఏదో ఇబ్బంది వచ్చింది. కమిటీ సమావేశం నిర్ణీత సమయంలో జరగలేదు. వాయిదా పడింది. ఆ వాయిదా మరి కొంచెం సాగింది.

1996 వచ్చేసింది..... ఎన్నికల వేడి దేశమంతా ప్రసరించింది. రాజకీయ వ్యూహాలు, ఎత్తుగడలతో పార్టీ అధ్యక్షుడి హోదాలో వున్న ప్రధానమంత్రి బిజీ అయిపోయారు.

ధైర్యం చేసి ఒకరోజున అయోధ్య రామాలయ నిర్మాణం విషయం ఎత్తాను.

"..... ఈ ఎన్నికల సమయంలో ఏం చేసినా, అది విపరీత పరిణామాలకు దారితీయవచ్చు.... ఎన్నికలయ్యేదాకా ఆగు. మళ్ళీ అధికారంలోకి వస్తాంగా, అప్పుడు ప్రారంభిద్దాం...." అన్నారు పి.వి.

అంతే ! రెండు సంవత్సరాలపాటు పీఠాధిపతులూ, మఠాధిపతుల చుట్టూ తిరిగి, రకరకాల ప్రయోగాలతో వారిని ఒప్పించి పడిన శ్రమంతా....

★ ★ ★

'నరసింహు'డు - శ్రీనివాసుడు

తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నేను పనిచేసింది 1978-82 కాలంలో. కాని, నేను ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుగారి దగ్గర మీడియా సలహాదారుగా వున్నప్పుడు 1992-96 కాలంలో కూడా శ్రీనివాసుడి పనులు చేయాల్సివస్తుందనుకోలేదు. ఒక దశలో ఈ వ్యవహారం ప్రధాని ముందర నా విశ్వసనీయతని దెబ్బతీస్తుందని భయపడిపోయాను.

ఒకసారి ప్రధానమంత్రితో కలిసి నేపాల్ పర్యటనకి వెళ్ళాను. నేపాల్ ప్రధానమంత్రి గిరిజా ప్రసాద్ కొయిరాలా సాదరంగా స్వాగతం పలికారు. ఇరుదేశాల మధ్య అనేక అంశాల విషయంలో ఒప్పందాలు కుదిరాయి. చివరగా కొయిరాలా గారికి, పి.వి.నరసింహారావుగారికి మధ్య ముఖాముఖీ ఆంతరంగిక చర్చలు జరుగుతున్నాయి. ఆంతరంగిక సమావేశంలో అధికారులెవ్వరూ వుండరు. ఉభయ ప్రభుత్వాల అధికారులం ప్రక్కన మరో హాల్లో నిరీక్షిస్తున్నాం.

అకస్మాత్తుగా నన్ను రమ్మంటున్నారని కబురు వచ్చింది. నాతోవున్న ఇతర భారత ప్రభుత్వ కార్యదర్శులు కనుబొమలెగరేశారు. నేను అయోమయంగానే లోపలికి వెళ్ళాను... వెళ్ళాక అర్థమైంది. రెండుదేశాల మధ్య సంబంధాలు మరింత బలపడటానికి అనువుగా ఏదైనా మతపరమైన సహాయం అందించటానికి భారత ప్రభుత్వం ముందుకొస్తున్నట్లు ప్రకటిస్తే బాగుంటుందని కొయిరాలాగారు కోరుతున్నారు.

మౌలికంగా నేపాల్ హిందూ రాజ్యం. కాబట్టి హిందూ మతపరమైన సంబంధాలు కూడా ఉభయదేశాలమధ్య వుంటే బాగుంటుందని కొయిరాలా గారు భావించారు. ఈ విషయంలో నేపాల్‌కీ, భారత్‌కీ మధ్య పౌరాణికంగా ఎలాంటి అభిప్రాయ భేదం వుండనక్కర్లేదు. సీతాదేవి పుట్టిన మిథిల నేపాల్‌లోనే వుంది. రాముడు ఏలిన అయోధ్య భారత్‌లో వుంది. కాబట్టి ఈ రెండు భూభాగాలకీ మధ్య కోటీన్నర సంవత్సరాలకు పైబడిన అనుబంధం ఉంది. ఈ మాత్రం దానికి పి.వి.గారు నన్నెందుకు పిలిచినట్లు? అనుకున్నాను.

కాని, నా సమక్షంలోనే పి.వి.గారు చాలా మర్యాదపూర్వకంగా నేపాల్ ప్రధానమంత్రికి వివరిస్తున్నారు.

"....మీ మనోభావాలను మేం గౌరవిస్తాం. మీరు చెప్పినట్లుగా ఉభయదేశాలమధ్య రామాయణ కాలంనాటి మైత్రి ఎప్పటికీ ఇలాగే వుండాలని మేమూ కోరుకుంటాం. కాని మీరు అడిగినంత సులభంగా మేం చెప్పలేం... భారతదేశం ఇప్పుడు మతాతీత లౌకిక రాజ్యాంగానికి కట్టుబడివుంది. ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వపరంగా ఎలాంటి వాగ్దానాలనూ, ప్రకటనలనూ మేం చేయలేం. దీన్ని మీరు తప్పుగా అనుకోరని భావిస్తాను..."

కొయిరాలా గారి మొహంలో నిరాశ కనుపించింది. అయినా ఆయన్ని మాట్లాడనివ్వకుండా పి.వి.గారే కొనసాగించారు.

"... అయినా మీరు కోరారు కనుక నాకు రాజ్యాంగపరంగా ఎలాంటి ఇబ్బందీలేని మరోమార్గంలో ఆలోచిస్తే మా తిరుపతి దేవస్థానం గుర్తొస్తోంది. వాళ్లవల్ల మీకు ఏమన్నా జరగవచ్చు..." అంటూ నావైపు తిరిగి, "ఏం ప్రసాద్? దేవస్థానం ఏమన్నా చేయగలదా?" అన్నారు ప్రధానమంత్రి.

నేను అనాలోచితంగా తలూపేశాను. కాని నేనెవర్ని దేవస్థానం తరఫున ఇక్కడ తలూపటానికి – అన్న ఆలోచన ఆ క్షణంలో రాలేదు.

నా గురించి కొయిరాలా గారికి కొంచెం ఘనంగా పరిచయం చేశారు పి.వి. "ఇతను ప్రసాద్, నా మీడియా సలహాదారు. గతంలో తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేశాడు. హిందూ ధార్మిక కార్యక్రమాలపరంగా మీకు ఎలాంటి సహాయం కావాలో చెప్పండి, ఇతను చేసేస్తాడు..."

నేను నోరు వెళ్ళబెట్టి చూస్తున్నాను. నేపాల్ ప్రధానమంత్రి నాతో కరచాలనం చేసి, చాలా సంబరపడిపోయారు.

"తిరుపతి – బాలాజీ–దగ్గర పనిచేశారా? ఎంత అదృష్టవంతులు?" అంటూ ఆ కరచాలన స్పర్శలోనే ఆయన భక్తి తత్పరత అంతా చూపించారు.

నాకు అప్పుడప్పుడే అర్థమవుతోంది. పి.వి.గారు ఈ మతపరమైన అంశం విషయంలో ప్రభుత్వానికి రాజ్యాంగ పరమైన ఇబ్బంది రాకుండా, నేపాల్‌తో దౌత్య సంబంధాల్ని సజావుగా నెరపటానికి తన రాజనీతిజ్ఞతని ప్రదర్శిస్తున్నారు. నేను చూస్తూవుండిపోయాను.

"... అందుచేత జనక్‌పూర్‌లో ధర్మశాల నిర్మించగలరేమో కనుక్కోండి" అంటున్నారు కొయిరాలా. క్షణాల్లో అప్రమత్తమయిపోయాను. జరుగుతుందో లేదో, చేయగలనో లేదో కాని ప్రయత్నం చేయాలి. తిరుమల శ్రీనివాసుడు తలుచుకుంటే తప్ప జరగదు...?

కొయిరాలాగారు అడిగింది చాలా చిన్న విషయం. మన విశ్వాసాల ప్రకారం – రామాయణ కాలంలో సీతాదేవి పుట్టిన మిథిల ఇప్పటి నేపాల్‌లో వుంది. ఆ ప్రాంతాన్ని జనక్‌పూర్ అంటారు. అక్కడే సీతాదేవి దేవాలయం కూడా వుంది. ఆ దేవాలయానికి అనుబంధంగా ఒక పెద్ద ధర్మశాలని కట్టిస్తే బాగుంటుందనీ, ఇది ఈ రెండు దేశాలకీ మధ్య మైత్రీబంధాన్ని పటిష్ఠంచేసే వారధి అవుతుందనీ కొయిరాలా గారు అప్పటికప్పుడు ఆలోచించి ప్రతిపాదించారు.

"ఏమయ్యా, దీన్ని మీ వేంకటేశ్వరుడు చేసిపెట్టగలడా?" అని అడిగారు పి.వి.

అంటే, నువ్విదిచేయగలవా? అని కొయిరాలాగారి ముందు అడిగితే బాగుండదనేమో అలా అడిగారు.

"అడిగి చూస్తాను సర్" అన్నాను.

నేను వెంటనే ఆ హాల్లోంచి బయటికొచ్చి అప్పటికప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.వి.ఎల్.ఎన్.మూర్తితో టెలిఫోన్‌లో మాట్లాడి విషయం చెప్పాను.

తక్షణం సమాధానం వచ్చేసింది. దేవస్థానం నిబంధనల ప్రకారం ధర్మశాల కట్టాల్సిన చోట భూమిని నేపాల్ ప్రభుత్వం విరాళంగా ఇవ్వాల్సివుంటుంది. ఇదే విషయం మళ్ళీ పి.వి.గారి ద్వారా కొయిరాలా గారికి చెప్పాను.

"ఓస్ ఇంతేనా?" అన్నారు కొయిరాలా. అప్పటికప్పుడు తన అధికారులతో మాట్లాడి, జనక్‌పూర్‌లో రెండు మూడు స్థలాలు ఎంపిక చేసి వుంచమని ఆదేశాలిచ్చారు. ఆ మధ్యాహ్నమే ఒక మంత్రిని నాతో పంపిస్తున్నామన్నారు. హెలికాప్టర్ ఏర్పాటు చేశామన్నారు. "మా మంత్రీ మీరూ కలిసివెళ్ళి స్థలం ఎంపికచేసి రండి" అన్నారు. అంతే! ఆ సాయంత్రానికల్లా నేనూ, ఆ మంత్రీ కలిసి, జనక్‌పూర్‌లో ధర్మశాల నిర్మాణానికి సువిశాల స్థలం ఎంపికచేసి వచ్చేశాం.

మరుసటిరోజు ఉదయం ఉభయదేశాల ప్రధానుల సంయుక్త విలేకరుల సమావేశంలో పి.వి.గారు ఒక ప్రకటన చేశారు.

"నేపాల్‌కీ, భారత్‌కీ గల మైత్రీ బంధం దృష్ట్యా, ఇక్కడ సీతాదేవి జన్మస్థానమైన జనక్‌పూర్‌లో విశాలమైన ధర్మశాలను నిర్మించి ఇవ్వాలని తిరుపతిలోని బాలాజీ దేవస్థానం నిర్ణయించింది..."

ఏం రాజనీతి చతురత!

ఏడాది తిరిగేసరికి ధర్మశాల నిర్మాణమై పోయింది. ప్రారంభోత్సవానికి పి.వి.గారిని పిలిచారు. "నేను రాలేను ప్రసాద్. నువ్వూ, మన పి.ఎం.ఓ.లోని మంత్రి భువనేష్ చతుర్వేది కలిసి వెళ్ళిరండి" అంటూ ఆయన మమ్మల్ని పంపించారు.

అలా, ఏ సీతా మహాసాధ్వి నామాన్ని జపించటాన్ని భారతదేశంలో కోట్లాది హిందువులు అత్యంత పుణ్యక్రియగా భావిస్తారో నేపాల్‌లోని ఆమె జన్మస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానంచేత పి.వి.నిర్మింపచేసిన ధర్మశాల ప్రారంభోత్సవంలో పాల్గొనే అదృష్టం నాకు కలిగింది.

మరోసారి వ్యక్తిగత సెలవుమీద అమెరికా వెళ్తూ దారిలో లండన్‌లో దిగాను. అక్కడ రెండురోజులు వుండాల్సివచ్చింది. బర్మింగ్‌హాంలో వున్న పాత మిత్రుడు డాక్టర్ గోపాల్‌ని కలిశాను.

1983లో ఇంగ్లాండులో ఒక కోర్సు చేయటానికి వెళ్ళినప్పుడు కూడా గోపాల్‌ని కలుస్తుండేవాణ్ణి. అప్పట్లో ప్రతి ఆదివారం గోపాల్ నన్నొక హిందూ దేవాలయానికి తీసుకెళ్ళేవాడు. పేరుకే దేవాలయం. కాని నిజానికి అదొక పురాతన చర్చి భవనం. దాన్ని హిందూ సమాజంవాళ్ళు కొని, అందులో తాత్కాలికంగా అన్ని దేవతా విగ్రహాల్నీ పెట్టి పూజ చేస్తున్నారు. వాటిల్లో ఒక చిన్న వేంకటేశ్వరస్వామి విగ్రహం కూడా వుంది.

నేను 1982 వరకూ తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వుండడం వల్ల వాళ్ళంతా నన్నేదో దేవస్థానం ప్రతినిధిగా లెక్కేసి, ఆధ్యాత్మిక ఉపన్యాసం చేయమని అడిగేవారు. నాది ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే స్థాయి కాదని చెప్పినా వాళ్ళు వినేవాళ్ళుకాదు. చివరికి తిరుపతి దేవస్థానంలో నా అనుభవాల్నే కథలు కథలుగా చెప్పి నడుపుకొచ్చేవాణ్ణి.

మళ్ళా 12 ఏళ్ళ తరువాత ప్రధానమంత్రి మీడియా సలహాదారుగా వుంటూ లండన్‌లో దిగినప్పుడు డాక్టర్ గోపాల్ కలిసి "బర్మింగ్‌హాం వెళదాం" రమ్మన్నాడు. మళ్ళా ఓ ప్రసంగం - శ్రీనివాసుడు... అవే కథలు ఇంకో రూపంలో.

అయితే ఈ సారి వాళ్ళు వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం పెద్దయెత్తున చేపట్టారు. ఇందుకోసం 20 ఎకరాల స్థలం సేకరించారు. పునాదుల దాకా వేశారు. అక్కడ ఆగిపోయింది. నిధుల కొరత వెంటాడుతోంది. వాళ్ళ అంచనా ప్రకారం ఆ ఆలయం కట్టడానికి 10 లక్షల పౌండ్లు (ఆరుకోట్ల రూపాయల దాకా) ఖర్చవుతుంది. అప్పటి వరకూ వాళ్ళు సేకరించి ఖర్చు పెట్టిన విరాళాలు రెండు లక్షల పౌండ్లు. ఇంకా ఎనిమిది లక్షల పౌండ్లు (సుమారు రూ.5 కోట్లు) కావాలి. ఎక్కడా నిధులు వచ్చే మార్గం కనబడటం లేదు.

"మీరే ఎలాగైనా సహాయం చేయాలి" అంటూ కమిటీవారు నన్ను పట్టుకున్నారు. అంటే నేను తలుచుకుంటే తిరుపతి వేంకటేశ్వరస్వామి చేత ఆ అయిదుకోట్లూ ఇప్పించేస్తానన్న భ్రమలో వున్నారు. వాళ్ళు అనుకోవడానికి ఒక కారణం వుంది. అమెరికాలోని పిట్స్‌బర్గ్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని టి.టి.డి.వారే కట్టించారు. అదంతా నేను టి.టి.డి.లో చేరకముందే అప్పటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజగోపాలరాజు, ఛైర్మన్ అన్నారావులు కలిసి విదేశాలలో శ్రీవారి ఆలయం కట్టాలని చేసిన తొలి ప్రయత్నం.

ఆ ప్రాజెక్టుని మంజూరు చేసింది వాళ్ళ హయాంలోనే అయినా, అది నా చేతులమీదుగా అమలు జరిగింది. అప్పుడు కూడా ఆలయం మొత్తాన్ని హైద్రాబాద్‌లోని ఇప్పటి దేవస్థాన కళ్యాణమంటపం స్థలంలో స్థపతుల సహాయంతో తాత్కాలిక నిర్మాణం చేసి, ప్రతి రాతికి ఒక నెంబరు వేసి, అప్పుడీ రాళ్ళన్నింటినీ తీసి ఓడలో అమెరికా పంపి, మళ్ళీ ఇదే స్థపతుల సహాయంతో నిర్దిష్ట డిజైన్ ప్రకారం అక్కడ రాళ్ళన్నింటినీ పేర్చి, ఆలయ నిర్మాణం చేయడం జరిగింది. ఆ స్ఫూర్తితో ఆ తరువాత అమెరికా, తదితర దేశాల్లో హిందూ సంస్థలు ఎక్కడికక్కడే ఆలయాలు కట్టుకోవడం ముమ్మరం కావడంతో, ఈ విదేశాల్లో ఆలయాల నిర్మాణ కార్యక్రమానికి టి.టి.డి స్వస్తి చెప్పింది. ఎవరన్నా వేంకటేశ్వరస్వామి ఆలయం కట్టుకుంటే విగ్రహాలనిస్తామనీ, తమ అర్చకులు వచ్చి సంప్రోక్షణ చేస్తారనీ టి.టి.డి. ప్రకటించింది.

...ఇదంతా వాళ్ళకి వివరించాను. దాంతో బర్మింగ్‌హాం ఆలయకమిటీ సభ్యులు నిరాశ చెందారు. కమిటీ ఛైర్మన్ నారాయణరావుగారు నన్ను పట్టుకొని, "అయితే మీరేమీ చేయలేరా?" అంటూ ప్రాధేయపూర్వకంగా అడిగితే ఏం చెప్పాలో తోచలేదు. చేయలేని మాట నిజం. వాళ్ళేమో

నేనేదో ప్రధానమంత్రి దగ్గరున్నాను కాబట్టి ఏం తలుచుకుంటే అది చేసేయగలను అనుకుంటున్నారు. కాని ప్రధాని పి.వి.తత్త్వం వేరు. ప్రభుత్వపరంగా ఒక మతానికి సంబంధించిన విషయాల్లో నేరుగా జోక్యం చేసుకోవడం సరికాదు. ఎంతో భక్తితత్పరుడైనప్పటికీ ఆయన ఈ విశ్వాసానికి కట్టుబడి జీవించారు. "నా వ్యక్తిగత విశ్వాసాలకోసం ప్రభుత్వ హోదాని దుర్వినియోగం చేయకూడదు" అనుకునేవారు. ఈ స్థితిలో నేను ఏమీ చేయలేననీ, శ్రీనివాసుడే సహాయపడాలని నిర్మొహమాటంగా చెప్పాను.

చివర్లో గోపాల్ కల్పించుకుని ఒక మాట అన్నాడు. "పోనీ ఇంగ్లాండులో స్వరాజ్‌పాల్, హిందూజా సోదరులు... ఇలాంటి వాళ్ళకోమాట చెప్పి చూడొచ్చు గదా - మీకు ఇబ్బంది లేకపోతే."

ప్రధానమంత్రి సమీప అధికారిగా వీళ్ళందర్నీ రెండుమూడు సందర్భాల్లో కలిశాను. కానీ వాళ్ళ ఫోన్ నెంబర్లు కూడా తీసుకోలేదు. వాళ్ళతో మనకేం పని వుంటుంది - అనుకునేవాణ్ణి.

హిందూజాలు ఢిల్లీ వచ్చినప్పుడల్లా పి.వి.గారిని కలవాలని నా దగ్గర కొచ్చేవారు. కాని బోఫోర్స్ కేసులో వాళ్ళ పేర్లు వచ్చాయి కనుక వాళ్ళని కలవటానికి పి.వి. సుముఖత చూపేవారు కాదు. అయితే వాళ్ళు రాజీవ్‌గాంధీ కుటుంబానికి సన్నిహితులు కావటంవల్ల "నేను కలవను" అని ప్రధానమంత్రి నిర్మొహమాటంగా చెప్పలేని స్థితి. అలాగని కలిశారా, పత్రికలలో విస్తృత ప్రచారం. అందువల్ల వాళ్ళ సందేశాలన్నీ నా ద్వారానే ప్రధానికి చేరేవి.

అంతమాత్రపు పరిచయంతో బర్మింగ్‌హాం గుడి నిర్మాణానికి విరాళమివ్వండని హిందూజాలని అడగటం ఎంత అసహ్యంగా వుంటుంది? అయినా వాళ్ళ ఫోన్ నెంబర్లు లేవు గదా - అనుకొని ఆనందంగా ఆ మాటే చెప్పేశాను. "విరాళాలిమ్మని వాళ్ళని అడగలేనండి. మీ కార్యక్రమాల గురించి చెబుతాను. వాళ్ళేం చేయగలరో చూస్తాను. అంతే. అదైనా వాళ్ళ ఫోన్ నెంబర్లు మీరు తెచ్చివ్వగలిగితేనే..." అన్నాను. ఆ పారిశ్రామిక దిగ్గజాల ఫోన్ నెంబర్లు వీళ్ళ దగ్గరెందుకుంటాయి అని నా ధైర్యం.

ఆశ్చర్యం! ఒక అరగంటలో వాళ్ళు ఆ ఫోన్‌నెంబర్లు తెప్పించారు. డాక్టర్ గోపాల్ అప్పటికప్పుడు వాళ్ళు నాతో మాట్లాడేలా చేశాడు. ఇక హిందూజాలు నన్ను మొహమాట పెట్టేశారు. "మీరు ఇంగ్లాండువచ్చి మా ఆతిథ్యం స్వీకరించకుండా ఎలా వెళ్తారు? ఈ రాత్రికి గాని రేపు మధ్యాహ్నంగానీ భోజనానికి రావాలి" అంటూ శ్రీచంద్ హిందూజా వత్తిడి చేశారు. అసలు విషయం మాట్లాడాలంటే వెళితేనే మంచిదేమో అనిపించింది.

కాని మనసులో పీకుతోంది. నేను ప్రధానికి అదనపు కార్యదర్శిని, మీడియా సలహాదారుని కాబట్టి గదా వీళ్ళు నన్ను ఇంత ప్రేమగా భోజనానికి పిలుస్తున్నారు. నేను ఆయనకి తెలీకుండా వీళ్ళ సహాయం కోరవచ్చునా?.... నేనింకా ఇరకాటంలో పడిపోయాను.

మర్నాడు మధ్యాహ్నం భోజనానికి వస్తానని చెప్పాక వెళ్ళాలిగరా! వెళ్ళాను. హిందూజాల సోదరుడు గోపీచంద్ కూడా జెనీవా నుంచి వచ్చారు. మంచి శాఖాహార భోజనం తినిపించారు.

పి.వి.గారి తత్త్వం, ఆలోచనాసరళి మనసులో పెట్టుకుని మాటల్లో అడిగాను: "...బర్మింగ్‌హాంలో పెద్ద బాలాజీ ఆలయం కడుతున్నారు. కమిటీలో అందరూ ఉద్యోగస్థులే. వాళ్ళ శక్తి సరిపోవటం లేదు. ఏదన్నా పరిష్కారం సూచించగలరా?".... పొరపాటున మొత్తం విరాళం తామే ఇచ్చేస్తామంటారేమో, అలా అంటే వద్దని ఎలా చెప్పాలి...? ఇలా నాలో నేను తర్జన భర్జన పడుతున్నాను.

శ్రీచంద్ హిందూజా వెంటనే స్పందించారు. పరిష్కారం చెప్పారు. "హమ్మయ్య" అనుకుంటూ నిట్టూర్చాను.

ఆ పరిష్కారం ప్రకారం – వాళ్ళే చొరవ తీసుకుని ఇంగ్లాండులోని హిందూపారిశ్రామిక వేత్తలు, వాణిజ్యవేత్తలతో ఒక సమావేశం ఏర్పాటుచేసి, ఆలయ కమిటీలో వాళ్ళందర్నీ చేర్చి, తలో చెయ్యివేసి ఆలయ నిర్మాణం కొనసాగింపు చేపట్టారు. బ్రిటిషు ప్రభుత్వపు హెరిటేజి నిధుల్లోంచి కూడా అయిదు లక్షల పౌండ్లు విడుదల చేయించారు.

(భారతదేశం వెలుపల నిర్మించబడిన అతి పెద్ద వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రపంచంలోకెల్లా ఇదే. దీని నిర్మాణం పూర్తయింది కూడా రెండు మూడేళ్ళ క్రితమే.)

నేను అమెరికానుంచి తిరిగొచ్చి పి.వి.గారిని కలిశాక చేసిన మొట్టమొదటి పని ఈ బర్మింగ్‌హాం ఆలయ నిర్మాణం కోసం హిందూజాల సలహా, సహకారాలు తీసుకోవటం గురించి ఆయన దృష్టికి తీసుకురావటమే.

"...మీకు చెప్పివుండాల్సింది సర్. కాని చెబితే మీరు వాళ్ళని అడగద్దంటారేమో, అలా అంటే ఆలయ నిర్మాణం జరగదేమో... ఇలా మీమాంసలో పడి మీకు టెలిఫోన్ చేయలేదు..." అంటూ వినయంగా సంజాయిషీ ఇస్తున్నాను.

అంతా విని, ఆయన కొద్ది క్షణాలు మౌనం వహించారు. నాకు చెమటలు పట్టేలా ఉంది... అంతలో ఆయనే నోరు విప్పారు.

"...నాకు చెప్పివుంటే హిందూజాలని కలవద్దని చెప్పివుండేవాణ్ణి. బోఫోర్స్ కేసులో వాళ్ళు నిర్దోషులని తేలేదాకా వాళ్ళ సేవల్ని మనం ఏ రకంగా వాడుకున్నప్పటికీ ప్రభుత్వానికి అప్రతిష్ఠ కలిగే అవకాశం వుంది... ఇప్పుడు జరిగిందేమైనా జరిగిన విధానం కొంతవరకూ గౌరవప్రదంగా వుందనుకో..."

'హమ్మయ్య' అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నాను.

★ ★ ★

'హవాలా రాకెట్‌లో పి.వి.'

పి. వి.నరసింహారావుగారిలో మొదటిసారిగా ఒక ఉగ్రనరసింహుడి ఛాయలు చూస్తున్నాను.

పత్రికల్లో వెల్లువెత్తుతున్న "హవాలా...హవాలా" వార్తలు, సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం సృష్టించిన రాజకీయ ప్రకంపనలు, న్యాయవ్యవస్థ నుంచి వస్తున్న వత్తిళ్ళు, కాంగ్రెసు పార్టీ వర్గాల నుంచి పెరుగుతున్న సిఫార్సులు, ప్రతిపక్షాలు విసురుతున్న సవాళ్ళు, మనస్సాక్షి చేస్తున్న బోధలు... వీటన్నిటి మధ్య పి.వి. నలిగిపోతున్నారు.

దేశానికి ప్రధానమంత్రి కావటమంటే ఎంత ప్రతిష్ఠాత్మక విషయమో అని ప్రజలు అనుకొంటూ ఉంటారు. అధికారం చేతిలో వున్నప్పుడే మనస్సాక్షి, వ్యక్తిగత విశ్వాసాలు మరింత గట్టిగా పైకి తన్నుకొస్తుంటాయి. అవి ఎంతగా పెల్లుబుకుతుంటాయో అంతకన్నా బలంగా వాటిని ఉప్పుపాతర వేసి పనిచేయించేలా రాజకీయవత్తిళ్ళూ, పదవిని అంటిపెట్టుకుని వచ్చే మొహమాటాలూ, ఆశ్రిత పక్షపాతాలూ చుట్టుముట్టేస్తుంటాయి... వీటన్నింటినీ తట్టుకొని మనస్సాక్షి చెప్పినట్లు చేయటానికే పి.వి. సిద్ధపడ్డారు. దీంతో 'హవాలా రాకెట్' దుమారం ఆయన్ని రాజకీయంగా చుట్టుముట్టేస్తోంది.

ఆ రోజు మొదటిసారిగా ఆయన మొహం కందగడ్డలా ఎర్రబడింది. ఎంత అదిమి పెట్టుకున్నా ఆవేశం ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో ప్రస్ఫుటంగా కనబడుతోంది. సి.బి.ఐ. డైరెక్టరు విజయరామారావు (ఇప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకుడు), రెవెన్యూశాఖ కార్యదర్శి శివరామన్, నేనూ ఆయనకి ఎదురుగా కూర్చొని వున్నాం.

"...మీరు నేను చెప్పినవన్నీ స్పష్టంగా అడ్విగారికి అర్థమయ్యేలా చెప్పారా?" ప్రధాని అడిగారు.

"అన్నీ చెప్పాం సార్. మేం గమనించిన అన్ని విషయాలూ పూసగుచ్చినట్లు చెప్పాం. ఏదో ఒక డైరీ దొరికితే అందులో వున్న కొన్ని పేర్ల మొదటి అక్షరాలని పట్టుకొని, అవన్నీ ఫలానా నాయకులవే అని నమ్మి, వాళ్ళమీద సి.బి.ఐ. కేసు పెట్టాలి, ప్రాసిక్యూట్ చేయాలి- అంటే ఎలా సార్ అని వాదించాం. సాక్ష్యాలున్నా లేకపోయినా కేసుపెట్టి ప్రాసిక్యూట్ చేయాలంటే ప్రభుత్వం అనుమతి లేకుండా సాధ్యపడదని కూడా చెప్పాం... " వాళ్ళిద్దరూ వివరిస్తున్నారు.

"ప్రభుత్వం అనుమతి ఎలా ఇస్తాం? అక్కడ ఏ ఆధారమూ లేకుండా, ప్రముఖనాయకు లందర్నీ ప్రాసిక్యూట్ చేయటానికి ఏ ప్రభుత్వమైనా ఎలా ఇస్తుంది?" పి.వి. ప్రశ్నించారు.

"అదే చెప్పాంసార్. కాని సుప్రీంకోర్టు జడ్జి గారు మా వాదన వినిపించుకోవడం లేదు. మేమేదో ప్రభుత్వ వత్తిడి వల్లనో, రాజకీయ నాయకులకు కొమ్ముకాయడం కోసమో ఈ హవాలాకేసుని మూసేస్తున్నామన్న అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. చేయటమే కాదు బహిరంగంగా కోర్టులోనే వ్యాఖ్యలు కూడా చేశారు. రేపటికి మళ్ళీ వాయిదా వేశారు...",అంటూ శివరామన్ కోర్టులో జరిగినదంతా పి.వి.కి వివరించారు.

పి.వి.గారికి చాలా ఆగ్రహం వచ్చింది. ఆ విషయం ఆయన మాటతీరులో స్పష్టమవుతోంది. "అదేమిటండీ, సాక్ష్యాలు లేవంటే కూడా కేసు పెట్టాలని సుప్రీం కోర్టు ఎలా బలవంతం చేస్తుంది? తగిన సాక్ష్యాధారాలు లేవని తెలిసి కూడా, నేనెలా ప్రాసిక్యూషన్‌కి అనుమతిస్తాను? కేసులో ఏ మాత్రమైనా స్పష్టత, ఆధారాలు వుండాలి కదా?... కోర్టుల విశ్వసనీయత పెంచడం కోసం ఎలాంటి ఆధారాలు లేకుండానే రాజకీయనాయకుల్ని ప్రాసిక్యూట్ చేయాలా? అందుకు నేను అనుమతివ్వకపోతే కోర్టు తనకు తానుగా విచారణ కమీషన్ వేసి, ప్రాసిక్యూట్ చేస్తుందా? అంటే తనకెంత అధికారాలున్నాయో, నలుగురూ తెలిసేలా న్యాయవ్యవస్థ ప్రదర్శిస్తుందన్నమాట! న్యాయవ్యవస్థతో తగాదాకి భయపడి నేను ప్రాసిక్యూషన్‌కి అనుమతినివ్వాలా?... కేసులో పస వుండి, స్పష్టమైన సాక్ష్యాధారాలు వుండి కూడా నిందితుల్ని కాపాడటం కోసం నేను ప్రాసిక్యూషన్‌కి అనుమతించటం లేదంటే న్యాయస్థానం జోక్యం చేసుకోవటంలో అర్థముంది కానీ, కేవలం కోర్టు ప్రతిష్ఠ పెంచుకోవడం కోసం రాజకీయనాయకుల్ని బజారు కెక్కించాలనుకోవడం ఏం న్యాయం?... నేనూ లా చదివాను. నాకూ తెలుసు...."

ఇలా సాగింది పి.వి.గారి ఆవేశపూరిత వాదన. నిజానికి అది వాదనకాదు ఆవేదన.

హవాలా కేసులో స్పష్టమైన ఆధారాలు లేకుండానే కేంద్రమంత్రుల్నీ, ప్రతిపక్షనాయకుల్నీ ప్రాసిక్యూట్ చేయటానికి సి.బి.ఐ.ని అనుమతించడమంటే అకారణంగా రాజకీయ వ్యవస్థ పట్ల ప్రజల్లో రోత కలిగించడమేనన్నది ఆయన నిశ్చితాభిప్రాయం. పైగా ఇందులో కోర్టు చేయించింది అనే దానికంటే "పి.వి. నరసింహారావు రాజకీయ కుతంత్రానికి పాల్పడ్డాడు" అన్న అప్రతిష్ఠని తాను శాశ్వతంగా మూటగట్టుకోవాల్సి వస్తుందన్న ఆవేదన కూడా వుంది. తన ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవరికీ అపకారం తలపెట్టలేదనీ, ఇప్పుడు మాత్రం ఎందుకు అకారణంగా చేయాలనీ ఆయన ప్రశ్నిస్తున్నారు. ఈ భావాలన్నీ ఆయన నోటివెంట ఒక ప్రవాహంలా వ్యక్తమవుతూనే వున్నాయి. మేం ముగ్గురం చేష్టలుడిగి, కళ్ళు చెవులూ అప్పగించి ఆయన మనోభావాలు అర్థం చేసుకొనే ప్రయత్నం చేస్తున్నాం.

ఒక దశలో ప్రధానమంత్రి తన వాక్ప్రవాహాన్ని అకస్మాత్తుగా ఆపారు. "విజయరామారావు గారూ, ప్రభుత్వం అనుమతినివ్వకుండా మీరు అద్వానీ, సింధియా, కమలనాథ్, అరవింద నేతం... వగైరా ఈ నాయకులెవర్నీ హవాలాకేసులో ప్రాసిక్యూట్ చేయలేరు కదా?"

"చేయలేం సర్."

"ఓ.కె. నేను మీకు అనుమతినివ్వటం లేదు. అర్థమైంది కదా!"

"సర్..." విజయరామారావు, శివరామన్‌లు తటపటాయిస్తూ చెబుతున్నారు. "జడ్జిగారి మూడ్‌ని బట్టి చూస్తే, మేం ప్రాసిక్యూట్ చేయకపోతే న్యాయస్థానమే తనకు తానుగా..."

"మీరు మరోసారి జస్టిస్ వర్మగారిని కలిసి నచ్చజెప్పే ప్రయత్నం చేయండి. మంచిది..." అంటూ ప్రధాని లేచారు. ఆయన దృఢనిశ్చయం అర్థం కాగానే వాళ్ళూ లేచారు. వాళ్ళు వెళ్ళిపోయాక, పి.వి. చిరాగ్గా నాతో అన్నారు. "ఇదేంటయ్యా, వీళ్లు జడ్జికి నచ్చజెప్పే ప్రయత్నం చేయకుండా నాకు చెబుతారు?" నేనేం మాట్లాడగలను?

అసలు జరిగిందే ప్రధానమంత్రి పరిధిలో లేకుండా ఆయన ప్రమేయం లేకుండా జరిగిపోయింది. ఇప్పుడు సి.బి.ఐ., న్యాయస్థానం వచ్చి ఆయన్ని అడుగుతున్నారు, "ఏం చేయమంటారు" అని.

అసలు జరిగిందేమిటంటే...

* * *

1991 మార్చిలో హిజ్బుల్ ముజాహిద్దీన్‌కి సంబంధించిన అష్ఫాక్‌లోన్ అరెస్టుతో కొందరు విదేశీ వ్యాపారస్థులు చేస్తున్న హవాలా వ్యాపారం గురించి బయటపడింది. నల్లధనంతో విదేశీ వ్యాపారం చేస్తున్న వాళ్లని కొందర్ని అరెస్టు చేశారు. వాళ్లని పోలీసులు ప్రశ్నించినప్పుడు, వాళ్ళిచ్చిన సమాచారం ఆధారంగా మధ్యప్రదేశ్‌లో పారిశ్రామికవేత్త సురేంద్ర కుమార్‌జైన్‌కి గల 'హవాలా' సంబంధాలు బయటపడ్డాయి. వెంటనే పోలీసులు అతని ఇల్లు సోదా చేశారు. ఆ సోదాలో రెండు డైరీలు దొరికాయి.

ఆ డైరీల్లో చాలామంది రాజకీయ నాయకులకు, అధికారులకు దాదాపు రూ.65 కోట్లు లంచాలుగా ఇచ్చినట్లు రాసివుంది. కానీ ఆయా ప్రముఖుల పేర్లలో మొదటి అక్షరాలు మాత్రమే ఆ డైరీల్లో రాసి వున్నాయి. దాంతో సి.బి.ఐ. రంగంలోకి దిగింది. ఆ సంకేత పదాలు ఆధారంగా మధ్యప్రదేశ్ నాయకుల్ని విచారించి, కొన్ని పేర్లు నిర్ధారించుకుంది. ఇక మిగతా నాయకుల పేర్లను నిర్ధారించుకోలేక పోయింది. పేర్లూ పూర్తిగా లేవు, ఆధారాలూ లేవు.

ఈ డైరీలు దొరికిన రెండేళ్ళ తరువాత - 1993లో ఈ కేసుని ఎత్తిచూపుతూ, "ఎందుకు ప్రభుత్వం చర్యతీసుకోవడం లేదు?" అంటూ ప్రముఖన్యాయవాది రామ్‌జెఠ్మలానీ ప్రధానమంత్రికి ఒక లేఖ రాశారు. ఇంచుమించుగా అదే సమయంలో ప్రశాంతభూషణ్, కామిని అనే లాయర్లు, వినీత్ నారాయణ్, రాజేందర్‌పూరి అనే జర్నలిస్టులు సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు వేశారు. 'హవాలా రాకెట్'లో పెద్ద పెద్ద నాయకులు, అధికారుల పాత్ర వుందని లోకమంతా

కోర్టై కూస్తుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎలాంటి చర్యతీసుకోకుండా వాళ్ళని కాపాడే ప్రయత్నం చేస్తోందనీ, కనుక సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలనీ వాళ్ళు ఆ పిటీషన్‌లో కోరారు. దాంతో అప్పటివరకూ వెలుగుచూడని డైరీల కథలు 1994లో వెలుగులోకి వచ్చాయి.

అలా వెలుగులోకి వచ్చిన సంకేతపదాల్ని బట్టి పత్రికల్లోనూ, ప్రతిపక్షాల్లోనూ అనేక ఊహాజనిత పేర్లు ప్రచారంలోకి వచ్చేశాయి. ఎల్.కె.అద్వానీ, మాధవరావు సింథియా, బలరామ్ జక్కర్, వి.సి.శుక్లా, అర్జునసింగ్, శరద్ యాదవ్, యశ్వంత్ సిన్హా, దేవీలాల్, కమలనాథ్, అరవిందనేతమ్, అరిఫ్ మహమ్మద్‌ఖాన్ వగైరా వగైరా.

ఇక పత్రికల్లో కథనాలు రూపందుకున్నాయి. 'హవాలా రాకెట్‌లో ఎవరెవరున్నారు?' అంటూ అనేక వార్తా కథనాలు. అప్పుడే సుప్రీంకోర్టు ఆదేశాలతో లలిత్‌సూరి, అరిఫ్ మహమ్మద్ ఖాన్‌ల ఇళ్ళపై సి.బి.ఐ. దాడులు జరిపింది. ఏవో డాక్యుమెంట్లు దొరికాయి కాని కోర్టులో ఫలానా ఫలానా వాళ్ళ పేర్లను నిందితులుగా చూపిస్తూ ఛార్జిషీట్ దాఖలు చేయటానికి తగిన ఆధారాలుగానీ, డబ్బు లావాదేవీలు జరిగినట్లు నిర్ధారించే ఆధారాలుగానీ దొరకలేదు. దాంతో సి.బి.ఐ. ఈ కేసులో ముందుకు వెళ్ళే అవకాశాలు లేవని తేల్చింది.

కాని ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసినవాళ్ళు సుప్రీంకోర్టులో జస్టిస్ వర్మ బెంచ్‌లో పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే శ్రద్ధ తీసుకోవటంలేదనీ, ఇదంతా నాయకుల్ని కాపాడటంకోసమే చేస్తోందనీ, కనుక న్యాయస్థానం జోక్యం చేసుకొని ఈ కేసులో సి.బి.ఐ. ఆయా డైరీల ఆధారంగా నాయకులమీద ఛార్జిషీటు దాఖలు చేసేలా ఆదేశించాలని వాళ్ళు వాదించారు. ఈ వాదనని జస్టిస్ వర్మ విశ్వసించారు.

అప్పటికే సి.బి.ఐ., ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌లు నిశితంగా దర్యాప్తుచేసి 'హవాలా రాకెట్' ఆరోపణలు ఎదుర్కొంటున్న జైన్ సోదరులు, మరికొంతమంది మీద కేసులు నమోదుచేసి, ఛార్జిషీటు కూడా ఫైలు చేశారు... ఇదంతా ప్రభుత్వ న్యాయవాది వివరించారు. కాని జస్టిస్ వర్మ సంతృప్తి చెందలేదు. ఆయన నేరుగా సి.బి.ఐ. అధికారుల్నీ, రెవెన్యూ విభాగంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారుల్నీ కోర్టుకు పిలిపించి విచారించటం ప్రారంభించారు. వాళ్ళు తమ వాదన వినిపించారు. ఏవో డైరీల్లో దొరికిన సంకేతపదాలు మినహా ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా పెద్దపెద్ద వాళ్ళందర్నీ కోర్టుకీడుస్తూ ఛార్జిషీట్ దాఖలు చేయటం సాధ్యపడదని వివరించారు. దాంతో ఆ అధికారుల మీద కోర్టు విరుచుకుపడింది. "మీ బాసుల్ని కోర్టుకి వచ్చి సంజాయిషీ ఇమ్మనండి" అంటూ ఆదేశించింది.!

అప్పటి పరిస్థితులే అలా వున్నాయి. న్యాయవ్యవస్థకి స్వతంత్ర అధికారాలు విస్తృతంగా కావాలని పట్టుబడుతున్న రోజులవి. జడ్జిల నియామకాల, బదిలీల విషయాల్లో న్యాయమంత్రిత్వ శాఖకి, ప్రభుత్వానికి గల అధికారాలను తమకే దత్తం చేయాలని న్యాయవ్యవస్థ వత్తిడి చేస్తున్న

నేపథ్యంలో ఒకసారి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య పాత పరిచయంమీద నన్ను పిలిపించి, కొన్ని ప్రతిపాదనల విషయంలో నా ద్వారా ప్రధానమంత్రికి రాయబారం పంపించారు. న్యాయశాఖామంత్రి భరద్వాజకి ఇష్టం లేకపోయినా, ప్రధానమంత్రి మాత్రం వేంకటాచలయ్య కోరినట్లే చేశారు.

ఇలాంటి పరిస్థితుల్లోనే ఈ హవాలా కేసు జస్టిస్ వర్మ ముందుకు వచ్చింది. ఈ లోపల అనేకమంది నాయకులు పి.వి.గారిని కలిసి భయాందోళనలు వ్యక్తం చేసేవారు. "ఆ కేసు గురించి నాకు తెలీదు. వేచి చూద్దాం" అని పి.వి. అనటం జరుగుతూండేది. ఒకసారి నన్ను ఇదేమిటో కనుక్కోమన్నారు పి.వి. నేను స్వయంగా విజయరామారావుతోనూ, శివరామన్‌తోనూ మాట్లాడితే తగిన సాక్ష్యాధారాలు లేవని ఛార్జిషీటు దాఖలు చేయలేకపోతున్నామని చెప్పారు. నేను ఇదే విషయాన్ని (ప్రధాని ఆదేశాలమీద) మాధవరావు సింధియాకీ, కమలనాథ్‌కీ, అరవింద నేతమ్‌కీ వివరించాను.

కాని జస్టిస్ వర్మ మాత్రం కోర్టులో విజయరామారావునీ, శివరామన్‌నీ కూడా నిలదీశారు. "... సాక్ష్యాధారాలు వున్నాయోలేదో మీరే నిర్ణయిస్తారా? డైరీల్లో పేర్లనిబట్టి అనుమానం వున్న వాళ్ళందరిమీదా ఛార్జిషీటు పెట్టాలికదా! ఎందుకు పెట్టడం లేదు?..." ఇలాంటి వ్యాఖ్యలతో జస్టిస్ వర్మ వాళ్ళకి క్లాసు తీసుకున్నారు.

వాళ్ళిద్దరూ నాతో మాట్లాడారు. జరిగిందంతా ప్రధానమంత్రికి తెలియజేయాలన్నారు. నేను అమాయకంగా అడిగాను: "ఇలాంటి సందర్భాల్లో పెద్దపెద్దవాళ్లని ప్రాసిక్యూట్ చేయాలంటే ప్రభుత్వ అనుమతి అక్కర్లేదా?"

"కావాలి. కాని, అసలు కేసు పెట్టడానికి కావలసిన సాక్ష్యాలే లేనప్పుడు, కేంద్రం దృష్టికి తీసుకువెళ్ళాల్సిన అవసరమేముంది అని భావించాం" అన్నారు.

నేను ఆ రాత్రికే ఈ విషయమంతా పి.వి.గారికి వివరించాను. ఆయన చాలా కలవరపడ్డారు. ".... ఎవడో ప్రైవేట్ డైరీలో రాసిన సంకేతాల్ని బట్టి ఇంతమంది పెద్ద నాయకుల్ని కోర్టుకీడ్చాలా? పైగా వీళ్ళలో మాధవరావు సింధియా వంటి కొంతమంది పెద్దమనుషులు అసలు డబ్బుకి కక్కుర్తి పడే వాళ్లేకాదు... వీళ్ళని ప్రాసిక్యూట్ చేయటానికి ప్రభుత్వం అనుమతివ్వదని చెప్పేయ్" అన్నారు పి.వి.

ఆ మర్నాడు వాళ్ళిద్దరూ, జస్టిస్ వర్మని ఛాంబర్‌లో కలిసి వాళ్ళదగ్గరున్న 'సాక్ష్యాధారాలన్నీ' చూపించి, తాము ఎందుక ఛార్జిషీటు దాఖలు చేయలేకపోతున్నామో వివరించమనీ, ఎల్.కె.అద్వానీ వంటివారు జైన్ సోదరుల్ని కలిసినట్లు వున్నా, డబ్బు లావాదేవీలు చేసిన దాఖలాలు, సాక్ష్యాలు లేవనీ, అందుకే కేసు నిలవదని భావించి తాము ఛార్జిషీటు దాఖలు చేయలేదనీ... చెప్పామని ఆ సాయంత్రం నన్ను కలిసి చెప్పారు.

"కాని ఆయన తీవ్రంగా ప్రతిస్పందించారు. అన్ని కేసులూ సాక్ష్యాధారాలతోనే పెడుతున్నారా?... న్యాయం అందరికీ సమానమే. న్యాయస్థానం ముందు అందరూ ఒక్కటే. నిందితులు పెద్దపెద్ద రాజకీయ నాయకులు కాబట్టి కేసు పెట్టట్లేదని మీరే నిర్ణయిస్తారా? పైగా ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు కోర్టులో వుండగానే మీరిలాంటి నిర్ణయం తీసుకొంటారా?... రాజకీయ సంక్షోభం వస్తుందని న్యాయస్థానం తన పని తాను చేయటం మానేయాలా?... కేసు మా ముందుకొచ్చాక మీ విచక్షణకి అవకాశం లేదు. సాక్ష్యాలు వున్నాయో లేరో తేల్చాసింది కోర్టు, మీరు కాదు... ఇలా జస్టిస్ వర్మ ఎడాపెడా వ్యాఖ్యానాలు చేశారు. ఈ విషయం ప్రధానమంత్రికి తక్షణం చెప్పాలి..." అన్నారు వాళ్ళిద్దరూ.

★ ★ ★

అలా పి.వి.గారితో వాళ్ళూ, నేనూ కలిసి కూర్చున్నప్పుడు, జరిగిందంతా వింటున్న పి.వి.గారి మొహంలో నాకు ఒక నరసింహుడి 'ఉగ్ర' ఛాయలు కనుపించాయి.

...ఆ పూట పి.వి.గారు ఖండితంగా చెప్పిందంతా విన్నాక, వాళ్ళిద్దరూ "యస్ సర్" అంటూ తలూపి వెళ్ళిపోయారు. కాని రెండు రోజుల తరువాత కోర్టు నుంచి తిరిగిరాగానే వాళ్ళు పి.వి.గారి ముందు ఖాళీ చేతులు చూపించారు.

".... జస్టిస్ వర్మ చాలా కోపంగా ప్రతిస్పందించారు సర్. .... ప్రాసిక్యూషన్ చేయడానికి సి.బి.ఐ. ముందుకి రాకపోతే కోర్టే తనంత తానుగా ఒక కమీషన్‌ని నియమించి, దర్యాప్తు చేయించి, ప్రాసిక్యూట్ చేయించాల్సివస్తుంది.... అంటూ హెచ్చరించారు సర్..."

అప్పటికి "రేపు కలుద్దాం" అని పి.వి. వాళ్ళని పంపేశారు.

కాని వాళ్ళు వెళ్ళాక ఆయన చాలా మథన పడిపోయారు. సి.బి.ఐ. డైరక్టరు తెలుగువాడవటం వల్లనే కోర్టు తన విశ్వసనీయతని శంకిస్తోందని ఆయన అనుమానం.

"ప్రసాద్... నాకిష్టం లేకపోయినా, ఆరోజు నువ్వూ కృష్ణమూర్తీ పోరి, విజయరామారావుని తీసుకొచ్చారు. మంచి ఆఫీసరే. కానీ ఇప్పుడు చూడు, కోర్టు ఎలా అనుమానిస్తోందో!... ఇప్పుడు ఎన్నికలు దగ్గరకొచ్చేశాయి. ఎల్.కె.అద్వానీ, మాధవరావ్ సింధియా వంటి పెద్ద మనుషుల ప్రతిష్ఠకోసం కోర్టుతో ఢీకొనడమా? లేక సి.బి.ఐ. ప్రాసిక్యూట్ చేయటానికి మనమే అనుమతించటమా? మనం అనుమతించకపోతే కోర్టే కమీషన్ వేస్తానంటోంది. అప్పుడు పార్టీ ప్రతిష్ఠ ఏమవుతుంది? అవినీతి పరుల్ని కొమ్ముకాస్తున్న పార్టీగా కాంగ్రెసుపార్టీకి ముద్ర పడిపోతుంది! పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటే, ఎన్నికలలో పరిస్థితి....?"

అలా ఒక నిర్వేదంలో మునిగిపోయారు పి.వి. అలా చాలాసేపు మౌనంగా వుండిపోయారు. నేను చూస్తూన్నాను. ఆయన మనస్సులో జరుగుతున్న సంఘర్షణ నాకు అర్థమవుతోంది. మనస్సాక్షికీ, పార్టీ ప్రయోజనాలకీ మధ్య నలిగిపోతున్నారు.

ప్రధానమంత్రి పదవి ఎంత ముళ్ళపాన్పు!

అకస్మాత్తుగా పి.వి.లేచారు. లోపలికి వెళ్తూవెళ్తూ, నా దగ్గర ఆగి, క్లుప్తంగా రెండుమాటలు చెప్పి వెళ్ళిపోయారు. "...సరే, నాకొచ్చిన చెడ్డపేరు ఎలాగూ వచ్చింది. వ్యక్తులకన్నా పార్టీ ముఖ్యం నాకు. విజయరామారావుతో చెప్పు - ఆ ఫైలు నాకు పంపిస్తే ప్రాసిక్యూషన్‌కి అనుమతిస్తానని."

అంతే! ఆ కేసులో కావలసినంత అప్రతిష్ఠని ఆయన మూటగట్టుకొన్నారు.

1996లో ఎన్నికలయిపోయాక, కొన్ని మాసాలకి సుప్రీంకోర్టులో ఈ హవాలా కేసు విచారణ ముగిసింది. సాక్ష్యాధారాలు లేవని కోర్టు ఈ కేసు కొట్టేసింది. ఆ వార్త వచ్చాక, వెళ్ళి పి.వి.గారిని కలిశాను.

మొట్టమొదటిసారిగా ఆయన కళ్ళు చెమ్మగిల్లటం గమనించాను.

* * *

పి.వి.గారి 'ఎగిరే గుర్రం'

1997...

రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాను.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో నేను రూపకల్పన చేసిన సంస్కరణల గురించి వివరించాను. మరికొంతమంది అధికారులు, సంబంధిత మంత్రులూ కూడా వున్నారు...

నా ప్రమేయం లేకుండానే మర్నాడు పత్రికలలో ఈ సంస్కరణల గురించీ, వాటి లక్ష్యం గురించీ భారీగా వార్తలు వచ్చాయి. ఆశ్చర్యపోయాను. ఆ సంస్కరణలు జి.ఓ.ల రూపంలో కార్యరూపం దాల్చేలోపల నాలుగైదు సార్లయినా ఆ సంస్కరణలకి సానుకూలంగా పత్రికలలో విస్తృతంగా వార్తలు వచ్చాయి. వార్తలన్నీ ముఖ్యమంత్రి ప్రతిష్ఠని పెంచేవే. పత్రికా సంబంధాల విషయంలో ఈ ముఖ్యమంత్రి సామర్థ్యం ఏమిటో తెలుస్తోంది.

ఒకరోజు ఆ వార్తలు చదువుతుంటే నా మనస్సు వెనక్కి - నేను పి.వి.గారి దగ్గర పనిచేసిన రోజుల్లోకి - వెళ్ళిపోయింది.

* * *

1989-91 కాలంలో మనదేశం భయంకరమైన ఆర్థిక దుస్థితిని ఎదుర్కొంది. ఎంత తీవ్రమైన స్థితి అంటే మన బంగారం నిల్వలని ఇంగ్లాండులో తాకట్టు పెట్టాల్సివచ్చింది.

1991 జూన్‌లో ప్రధానమంత్రిగా వచ్చిన పి.వి.నరసింహారావు ప్రపంచీకరణ, సరళీకరణ వంటి ఆర్థిక విధానాలతో ఒక్కసారిగా దేశ ఆర్థిక వ్యవస్థ దశనీ, దిశనీ మార్చేశారు. కుదువపెట్టిన బంగారం నిల్వల్ని విడిపించారు. అయిదేళ్ళలో భారతదేశాన్ని - ప్రపంచమంతా దిగ్భ్రాంతి చెందేలా - మహోన్నతమైన పురోగమన పథంలోకి నడిపించారు.

కాని...

మనదేశంలో మాత్రం ఆ మేధావికి, రాజనీతివేత్తకి రావలసిన గుర్తింపు రాలేదు.

నేను ప్రధానమంత్రి పి.వి.గారి దగ్గర పత్రికా వ్యవహారాల సలహాదారుగా (జాయింట్ సెక్రటరీ హోదాలో) 1992 మేలో చేరాను. ఆంధ్రప్రదేశ్‌లో 1984-86లో సమాచారశాఖ కమీషనర్‌గా పనిచేసిన అనుభవం వుంది. కనుక పత్రికల వ్యవహారాలు చూడడం పెద్ద కష్టం కాదనుకున్నాను. కాని క్రమంగా నాకు అర్థమవుతూవచ్చింది - ఢిల్లీలో పత్రికా వ్యవహారాల

నిర్వహణ అంత సులభం కాదు. అసాధ్యం కూడా కాదు. కాని నాకు ప్రధాన సమస్య ప్రధానమంత్రితోనే.

సమాజంలో ఎలాంటి వృత్తిలో వుండే వ్యక్తియొక్క ఎదుగుదలా పత్రికల మీద ఆధారపడిలేదు. సైంటిస్టులూ, డాక్టర్‌లూ, టీచర్‌లూ... ఇలా ఏ వృత్తిలో వాళ్ళూ పత్రికల చుట్టూ తిరగరు. కాని రాజకీయ నాయకుల మనుగడ పత్రికలమీద ఆధారపడి వుంది. ఇది కనిపెట్టిన ప్రతి రాజకీయ నాయకుడూ తన తన స్థాయికి తగినట్లు పత్రికల వాళ్ళతో 'సత్సంబంధాలు' నెరపాలని ప్రయత్నిస్తూనే వుంటారు. ఇది ఇటీవల దశాబ్దాలలో బాగా పెరిగింది. పత్రికా సంబంధాలనేవి రాజకీయ నాయకుల ప్రాధాన్యతా అంశాలలో ఒకటి.

కాంగ్రెసు పార్టీలో నాయకులు సీతారాంకేసరి, అర్జున్‌సింగ్, జగదీష్ టైట్లర్, రాజేష్ పైలట్... ఇలాంటి చాలామంది కాంగ్రెసు నాయకులకి పత్రికల వాళ్ళతో అద్భుతమైన సంబంధాలుండేవి.

కాని వీళ్ళందరికీ విరుద్ధంగా వుండేది పి.వి.గారి మనస్తత్వం. పత్రికల వారిని దగ్గరకు తీసుకొని మచ్చిక చేసుకోవాలనే విధానాన్ని ఆయన నమ్మేవారు కాదు. పెద్దపెద్ద పత్రికల సంపాదకుల్ని సయితం ఆయన తనకు తానుగా ఏనాడూ అల్పాహారానికో, విందుకో ఆహ్వానించి ఎరగరు. "అవసరమేముందయ్యా! ... వాళ్ళపని వాళ్ళు చేయటానికి మనం ఇంత హడావుడి చేయాలా?... మనమేమైనా తప్పులు చేస్తున్నామా - వాటిని కప్పిపుచ్చుకోవడం కోసం పత్రికల్ని ఆకట్టుకొనటానికి..." ఇలా వుండేది ఆయన వాదన.

నా దగ్గరకొచ్చే సీనియర్ జర్నలిస్టులు చాలామంది నాకు సలహా ఇస్తుండేవారు. "మీ ప్రధానమంత్రికి చెప్పండి. పత్రికలలో మంచి కవరేజ్ రావాలంటే ఆయన కొంచెం మాతో మాట్లాడుతూ వుండాలి..."

వాళ్ళేం చెబుతున్నారో నాకు బాగా అర్థమైంది. అయితే పి.వి.గారి ఆలోచన సిద్ధాంతపరంగా సరైనదే. ఎవరిపని వాళ్ళు చేసుకుంటూ వెళ్ళాలి. పత్రికలకు ప్రధానమంత్రి స్వయంగా చెప్పాల్సిన విషయాలుంటే చెబుతారు. లేదంటే ప్రసారమంత్రిత్వశాఖామంత్రి ఎలాగూ పత్రికలతో సంబంధాలు సాగిస్తూనే వుంటారు. ప్రతి మంత్రీ మాట్లాడుతూనే వుంటారు.

ప్రధానమంత్రి ఇందిరాగాంధీకి పత్రికావ్యవహారాల సలహాదారుగా పనిచేసిన హెచ్.వై.శారదాప్రసాద్ గారితో మాట్లాడాను. కొంతమంది సీనియర్ సంపాదకులతో కూడా మాట్లాడాక, నాకు ఒక విషయం స్పష్టమైంది.

పత్రికారంగంలో చాలామార్పులు వచ్చేశాయి. పి.వి.గారిముందు రోజుల్లో ప్రధాన మంత్రులకి కొందరు సంపాదకులంటే ఇష్టం. వాళ్ళకిచ్చే ప్రాధాన్యత వేరుగా ఉండేది.. లేదా ఎవరెవరు మనకి అవసరమనుకుంటే వాళ్ళని ప్రధాని తరపు వాళ్ళు బాగా 'చూసుకునే'వాళ్ళు. అప్పుడప్పుడూ ప్రధానితో కల్పించి మాట్లాడించే వాళ్ళు.

ఈ 'సంప్రదాయాన్ని' మిగతా కాంగ్రెసు నాయకులంతా ఇందిరాగాంధీ కాలంనుంచీ కొనసాగిస్తూనే వున్నారు. కొంత ఇందిరాగాంధీ ప్రతిష్ఠ కోసం, కొంత తమ సొంత ప్రతిష్ఠ కోసం... ఫలితంగా జర్నలిస్టుల విలువల్లో చాలా మార్పులు వచ్చేశాయి.

ఈ ఒరవడికి విరుద్ధంగా ఆలోచించే వ్యక్తి అకస్మాత్తుగా ప్రధానమంత్రి కావటం జరిగింది. ప్రధానమంత్రి కాకముందూ, అయ్యాక కూడా ఆయన ధోరణి ఒకేలా వుండేది. ప్రధాని కావటానికి ముందు ఒకటిన్నర దశాబ్దాలుగా ఢిల్లీలోనే వుంటూ వున్నా జర్నలిస్టులలో ఆయనకి సన్నిహితులమని చెప్పుకోగలిగినవాళ్ళు ఎవరూ లేరు - ఒక్క కళ్యాణిశంకర్ తప్ప.

కళ్యాణి శంకర్ హైద్రాబాద్‌లో కూడా పనిచేసి వున్నారు. ఢిల్లీలో ఏ సమయంలోనైనా ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుగారింట్లోకి చొరవగా వెళ్ళగలిగినంతటి సాన్నిహిత్యం ఆమెకి వుండేది. అలాంటి కళ్యాణి శంకర్‌కి సయితం ఆయన ప్రధానమంత్రి అయిన వెంటనే ప్రత్యేక ఇంటర్వ్యూ లభించలేదు. నేను చాలాసార్లు పి.వి.గారికి నచ్చచెప్పాలని ప్రయత్నించేవాణ్ణి. నాలుగైదుసార్లు ప్రయత్నిస్తే ఏదో ఒక బి.బి.సి.కో, మరో వార్తా సంస్థకో ఒక ఇంటర్వ్యూ ఇచ్చేవారు. అతి తక్కువ వ్యవధిలో - కేవలం 24 గంటల వ్యవధిలో నేను ఇప్పించగలిగిన ఒకే ఒక ఇంటర్వ్యూ 'ఈనాడు-న్యూస్‌టైం' పత్రికల సీనియర్ జర్నలిస్టు రామానుజన్‌కిచ్చింది.

ప్రధానమంత్రి హోదాలో పి.వి.నిర్వహించిన అధికారిక పత్రికా సమావేశాల సంఖ్య ఆ అయిదేళ్ళలో రెండోమూడో. మొదటిది 1992లో నేను చేరిన కొత్తలో పట్టుబడితే నన్ను నిరాశపర్చలేక తొలివార్షికోత్సవం సందర్భంగా ఆయన పాల్గొన్నది. విదేశీ పర్యటనలకు వెళ్ళి వచ్చేటప్పుడు మాత్రం విమానంలోనే పత్రికలవారితో సమావేశమయ్యేవారు.

ఎందుకు పత్రికలవాళ్ళని దూరంగా వుంచుతున్నారు? తరచుగా మీరెందుకు వాళ్ళతో సంభాషించటానికి ఇష్టపడరు? ఈ ప్రజాస్వామ్యంలో పత్రికల వాళ్ళని దూరంగా వుంచితే మనకి నష్టం కదా?... ఇలాంటి ప్రశ్నల్ని నేను పి.వి.గారికి అప్పుడప్పుడు (ఆయన ఏవన్నా ఇంటర్వ్యూలకి 'నో' అన్నప్పుడల్లా) సంధిస్తుండేవాణ్ణి.

ఒకసారి జి.కె.రెడ్డి స్మారక అవార్డుని అరుణ్ పూరి (ఇండియా టుడే)కి బహూకరించే సందర్భం వచ్చింది. ఆ కార్యక్రమాన్ని ఏటా కాంగ్రెసు నాయకుడు టి.సుబ్బిరామిరెడ్డి నిర్వహిస్తుంటారు. ఆ అవార్డు బహూకరణని పి.వి.గారి చేతులమీదుగా చేయించాలని సుబ్బిరామిరెడ్డి పట్టుబట్టి అభ్యర్థిస్తే, పి.వి.గారిని ఒప్పించాను. కార్యక్రమం ప్రధాని క్యాంప్ ఆఫీసు ఆవరణలో జరిగింది. అక్కడకు వెళ్తూవెళ్తూ కూడా "మీడియాని మీరు కొంచెం పట్టించుకోవటం లేదనే అభిప్రాయం మీడియాలో వుందని నాకనిపిస్తోంది..." అన్నాను. ఆయన తన సహజధోరణిలో తల పంకించారు.

మరో రెండు నిమిషాల్లో అవార్డు కార్యక్రమంలో వున్నాం. అరుణ్ పూరికి అవార్డు ప్రదానం చేశాక, పి.వి. మాట్లాడుతూ (నా ప్రశ్నకి జవాబా అన్నట్లుగా) అన్నారు:

"...నేను ఎప్పుడూ నా సహరాజకీయ నాయకులకి చెబుతూంటాను. పత్రికల వాళ్ళతో జాగ్రత్తగా వుండటం చాలా అవసరం. ఎందుకంటే ఏం రాయాలనుకుంటున్నారో వాళ్ళు ముందే నిర్ణయించుకుంటారు. అందువల్ల మనం ఎన్ని చెప్పినా, ఏం చెప్పినా చివరికి వాళ్ళు రాయాలనుకున్నదే రాస్తారు..."

నలభై ఏళ్ళ రాజకీయ అనుభవం. ఆయన కూడా ఒక జర్నలిస్టే. ఒకప్పుడు ఆయన కూడా పత్రికలకి రాస్తుండేవారు. ఎక్కడన్నా విందులోనో, పరిమిత సమావేశాల్లోనో పాత్రికేయులు ఎవరన్నా ఎదురుపడి ప్రశ్నలు వేసినా జవాబు దాటవేయటమే ఆయన నైజం.

ఒకసారి ఆయన ఏదో విదేశీ పర్యటనకి వెళ్తున్నారు. ప్రధాని విదేశీ పర్యటనకి వెళ్ళేటప్పుడు ఆంధ్రప్రదేశ్ భవన్‌కి వెనకాలఉన్న హైద్రాబాద్ హౌస్‌లో లాంఛనప్రాయంగా వీడ్కోలు కార్యక్రమం జరుగుతూండేది. దీనికి అందరు మంత్రులు, సీనియర్ దౌత్యవేత్తలు, సీనియర్ సంపాదకులు, పారిశ్రామిక వాణిజ్య మండళ్ళ ప్రతినిధులు తదితరులు హాజరవుతారు.

ప్రధానమంత్రే స్వయంగా ఆయా అతిథుల ముందుకువెళ్ళి, కరచాలనం చేస్తారు. ఆ అతిథి "బెస్టాఫ్ లక్"అనో "మీరు విజయంతో తిరిగిరావాలి" అనో... ఇలా ఏవో శుభాకాంక్షలు చెబుతారు.

ఒక సీనియర్ సంపాదకుడు ఈ అవకాశాన్ని ఎలాగైనా వాడుకొని, ఒక వార్త సేకరించాలనుకున్నాడు. తన దగ్గరికి ప్రధానమంత్రి రాగానే, కరచాలనం చేస్తూ ఆయన అడిగాడు:

"మండల్ కమీషన్ నివేదికని అమలుచేసి తీరాలని సుప్రీంకోర్టు ఆదేశిస్తే మీరు వ్యవధి కావాలని అడిగారే! ఎందుకు? ఎప్పటికైనా అమలు చేయాల్సిందే కదా!"

పి.వి. ఆగిపోయారు. అటూఇటూ వున్నవాళ్ళంతా ఉత్కంఠతో చూస్తున్నారు. పి.వి. ఏం చెబుతారు? గడువు పూర్తయ్యే లోపల అమలు చేస్తామంటారా? న్యాయపరమైన చిక్కుల్ని అధ్యయనం చేస్తున్నామంటారా? రాజ్యాంగ దృక్పథంలోంచి పరీక్షించటానికి ఓ కమిటీ వేస్తామంటారా? సుప్రీంకోర్టులో మరో రివిజన్ పిటీషన్ వేస్తామంటారా?...

ఎంత గొప్ప అవకాశం! "ఇంటర్వ్యూలడిగితే సమయం లేదని చెప్పే ప్రధానమంత్రి ఇప్పుడు జవాబు చెప్పకుండా ఎలా పారిపోతాడు. దొరికాడులే" అని ఆ సంపాదకులు భావించి వుండవచ్చు.

పి.వి.గారు మెడలో కండువా సవరించుకున్నారు. చిరునవ్వు నవ్వారు. పెదిమ విప్పారు.

"ఒక విషయం చెప్పనా?"

"చెప్పండి, చెప్పండి" ఆ సంపాదకులు ఉత్కంఠతో అన్నారు.

"ఒక వ్యక్తిని నేరస్థుడిగా రాజుగారు నిర్ణయించారు. ఉరిశిక్ష విధించారు. చివరికోరిక ఏమిటో కోరుకోమన్నారు. అతను 'నాకు ఆరుమాసాలు గడువిస్తే తమరికి ఎగిరేగుర్రం తయారుచేసి

ఇస్తాను ప్రభూ' అన్నాడు. రాజుగారు అంగీకరించారు. జైల్లోకెళ్ళాక తోటి ఖైదీ అడిగాడు. - 'ఆరుమాసాల తరువాతైనా ఉరిశిక్ష తప్పదు కదా! అలా ఎందుకు చెప్పావ్?' అతను ఏం జవాబు చెప్పాడంటే - 'ఆరు మాసాల తరువాత ఎవరుంటారో ఎవరుండరో, ఏం జరుగుతుందో, ఒకవేళ నేను ఎగిరే గుర్రాన్ని కూడా తయారుచేస్తానో ఏమో..."

ఇలా చెబుతూ ప్రధాని ముందు కెళ్ళిపోయారు. ఆ సంపాదకుడు అలా చూస్తూ వుండిపోయాడు. (ఈ సంఘటనని మర్నాడు 'ది హిందూ' పత్రికలో వార్తగా రాసుకున్నారు.)

ఇలాంటి సంఘటనలు క్రమంగా పత్రికల వారిలో ప్రధానమంత్రి పి.వి. మేధస్సుపట్ల, రాజనీతిజ్ఞతపట్ల కలిగించాల్సినంత గౌరవాన్ని, సదభిప్రాయాన్ని కల్గించలేకపోయాయి. దీనికి తోడు పార్టీలో తాను అధికారంలోకి వచ్చాక కూడా తనదంటూ ఒక వర్గాన్ని ప్రోత్సహించే ప్రయత్నం ఆయన చెయ్యలేదు. తనకు ఎవరిమీద అభిమానమో ఎవరిమీద దురభిమానమో పార్టీ నాయకుల కెవ్వరికీ తెలియనిచ్చేవారు కాదు. దీంతో పార్టీ నాయకుల్లో మొదట్లో ఆయన్ని అభిమానించిన వారు సయితం - క్రమంగా దూరమవుతూ వచ్చారు.

మొత్తంమీద మీడియాని ఆకట్టుకోవాలనే తత్త్వం పి.వి.గారిలో లేకపోవటం పార్టీలోని ఆయన ప్రత్యర్థులకు చాలా అవకాశం ఇచ్చింది. ముఖ్యంగా అయోధ్యలో బాబ్రీ మసీదు కూలిపోయిన ఘటన తదనంతర పరిణామాల విషయంలో దీని ప్రభావం మీడియా మీద బాగా పడింది. అన్ని పత్రికలలోనూ పి.వి.కి. ప్రతికూల వార్తలే! అర్జున్‌సింగ్ వంటివాళ్ళకి మీడియా మిత్రులకు కొదువలేదు.

తమని 'పట్టించుకున్న' నాయకులు, మంత్రులు ఏం చెబుతున్నారు అన్నదే పత్రికల వాళ్ళకి పట్టేది. ప్రధానికి మీడియా సలహాదారుగా నాకు పరిమితులుంటాయి. రాజకీయనాయకుల స్థాయిలో 'సన్మానాలు' నేను చేయలేను. అయినా చేయదగినవి చాలా చేశాం. ఎన్ని చేసినా మౌలికంగా పి.వి.పట్ల పత్రికల అభిప్రాయాన్ని ఇతర కాంగ్రెసు నాయకులు 'ప్రభావితం' చేసిన విధంగా చేయలేను. ఆ పని పి.వి.కి అభిమానులైన పార్టీ నాయకులే చేయాలి. కాని పి.వి.అభిమానులు ఎవరు?

మంత్రివర్గ నిర్మాణం జరిగినా, మంత్రివర్గంలో మార్పులు చేసినా, ముఖ్య సందర్భాలకి ప్రసంగాలు కావలసి వచ్చినా పి.వి. ఒంటరిగా తన గదిలో కంప్యూటర్ ముందు కూర్చొని స్వయంగా తయారుచేసుకునేవారు. ఎవరిమీదా ఆధారపడేవారు కాదు.

నేను వెళ్ళిన కొత్తలో ఏదో ఒక సమావేశానికి ప్రధాని ప్రసంగం తయారు చేయమన్నారు. అద్భుతంగా చేశాను (అనుకున్నాను). తీరా ఆ వేదికమీద మైకుముందు ప్రధాని ఆ ప్రసంగం చేసినప్పుడు చూస్తే ప్రారంభంలో 'అధ్యక్షా, సోదరసోదరీ మణులారా' అన్న పదాలు, చివర్లో 'జైహింద్' అన్న పదాలు నేను రాసినట్లే వున్నాయి. కానీ మధ్యలో విషయమంతా మారిపోయింది! (ఆయనే స్వయంగా మార్చుకున్నారు).

భారతీయ పాత్రికేయులు కొందరు ఎంత నిర్దాక్షిణ్యంగా వ్యవహరించేవారంటే, ఇద్దరు ముగ్గురు సీనియర్ జర్నలిస్టులు (కొందరు కాంగ్రెసు నాయకుల ప్రోత్సాహంతో) తెలుగు పత్రికల జర్నలిస్టుల చుట్టూ తిరిగి పి.వి.గారి గతంలోంచి ప్రతికూల విషయాలను తవ్వి తీసే ప్రయత్నాలు చేసేవారు.

పి.వి. ఏనాడూ ఏ పత్రిక గురించీ, ఏ ఒక్క పాత్రికేయుడి గురించీ ఒక్క ప్రతికూలవాక్యం కూడా మాట్లాడలేదు. కాని భారతీయ పత్రికలు, పాత్రికేయుల మద్దతు గెల్చుకోవడంకోసం ప్రత్యేక ప్రయత్నాలు చేయాలనిగానీ, చేయించాలనిగానీ ఆయన భావించనూలేదు. ఫలితం?

దేశ భవిష్యత్తుని కాపాడిన అసాధారణ మేధావి, రాజనీతి వేత్తకి భారతీయుల దృష్టిలో రావలసిన ప్రతిష్ఠ రాలేదు!

* * *

అమెరికాలో చంద్రబాబునాయుడు - 1

2007 ఆగష్టు.

అమెరికాలో - చికాగోనగరంలో మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గౌరవార్థం ఒకపెద్ద విందు సభ జరుగుతోంది. ఇరవయ్యేసి డాలర్ల టిక్కెట్లు కొని మా కుటుంబం అంతా వెళ్ళాం.

అక్కడ హాజరయిన వేలాది యువ ఇంజనీర్లని ఉద్దేశించి చంద్రబాబు నాయుడు ఒక సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఆ ప్రసంగం పూర్తయ్యేసరికి యువతీయువకులంతా లేచి నిలబడి, ఉత్సాహం పరవళ్ళు తొక్కుతుంటే ఏకధాటిగా ప్రశంసాపూర్వక కరతాళధ్వనులు చేస్తున్నారు.

ఒక్కసారిగా నా మనస్సు 1996, 1997 లలో నేను రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నప్పుడు జరిగిన సంఘటనల్లోకి వెళ్ళిపోయింది.

★ ★ ★

ఢిల్లీ నుంచి టెలిఫోన్‌లో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాలా ఆగ్రహంతో ఊగిపోతున్నారు.

జరిగిన నేరం పట్ల అసహనంతో పాటు, ప్రజల దృష్టిలో ప్రభుత్వ ప్రతిష్ఠకి ఏర్పడే మచ్చ, రాజకీయంగా ప్రతిపక్షాలు దీన్ని ఎంత అవకాశంగా తీసుకొని ప్రభుత్వం మీద దుమ్మెత్తిపోయొచ్చు అన్న ఆలోచన, పరిపాలనా పరంగా క్రమశిక్షణారాహిత్యాన్ని అదుపు చేయాలన్న ఆరాటం... అన్నీ ప్రస్ఫుటంగా ఆయన గొంతులో వినిపిస్తున్నాయి.

నా ఎదురుగా ముగ్గురు మంత్రులు - అశోక్‌గజపతిరాజు, దేవేందర్ గౌడ్, బాలయోగి కూర్చొని ఉన్నారు. వాళ్ళు ఈ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంలో మంత్రులు. నేను ఈ ప్రభుత్వ యంత్రాంగంలో 'ముఖ్య కార్యదర్శి' హోదాతో పనిచేస్తున్న ఒక సాధారణ అధికారిని.

ముఖ్యమంత్రి కోపం ఎంత తారస్థాయిలో ఉందంటే - ఆయనతో ఆ సమయంలో ఎదురు మాట్లాడటానికి నా ప్రక్కనున్న మంత్రులు కూడా వెనకాడుతున్నారు. వాళ్ళకి లేని ధైర్యం నాకెందుకుంటుంది? నేనూ నిశ్శబ్దంగా ఉన్నాను.

రెవెన్యూ మంత్రి దేవేందర్ గౌడ్ ముఖ్యమంత్రితో మాట్లాడుతూ మాట్లాడుతూ అకస్మాత్తుగా ఆ టెలిఫోన్ నా చేతికిచ్చారు - "మీరు మాట్లాడండి ముఖ్యమంత్రితో" అంటూ!

నేను అవాక్కయిపోయాను.

ముఖ్యమంత్రి మాటల్లో ఉధృతం .....

ఆయన్ని మంత్రులే నివారించలేకపోతే నేనేం నివారించగలను! నాకు చేతనైందల్లా బాధ్యత నెత్తిన వేసుకోవటమే.

మన శోక్యం ఏ మాత్రం ఉన్న పనివల్ల నైనా ఘనకీర్తి ఎక్కడన్నా వస్తోందంటే, "అది నేనే చేశాను" అనో "చేయించాను" అనో విర్రవీగుతాం. ఆ పనివల్ల అపకీర్తి వస్తోందనగానే "నేను చెప్పినట్లువాడు చేయలేదు, లేకపోతేనా....." అని చెప్పుకుంటాం..... ఇలాంటి భావాలన్నీ నా మనసులో కలగాపులగంగా వచ్చేశాయి.

అందుకే -

"ఆ ఐఏఎస్ అధికారిని ఎందుకు సస్పెండ్ చేయొద్దన్నారు? " అని ముఖ్యమంత్రి ఆవేశంతో ప్రశ్నించినప్పుడు మొండిధైర్యం తెచ్చుకుని చెప్పేశాను :

"సర్, ఒక ఐఏఎస్ అధికారిని సస్పెండ్ చేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని మీరు నమ్ముతున్నారు! సరే, అతనికి పై అధికారిని నేను. ఈ నేరంలో నాకూ పాత్ర ఉండొచ్చు. నేను ఇంకా సీనియర్ ఐఏఎస్ అధికారిని. నన్ను సస్పెండ్ చేసేయండి. మీకు ఇంకా మంచి పేరు వస్తుంది...."

★ ★ ★

1996 ఎన్నికలలో పి.వి. నరసింహారావుగారి నాయకత్వంలో పోటీ చేసిన కాంగ్రెసు పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చే అవకాశాలు లేవంటున్న వార్తలు వింటూనే, నేను కేంద్ర ప్రభుత్వానికి అర్జీ పెట్టాను - "నన్ను నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు పంపించివేయమని"....

నాలా ప్రధానమంత్రి ఆఫీసులో కీలకపదవుల్లో ఉన్నవారు - ఏ ప్రపంచ బ్యాంకుకో అంతర్జాతీయ ద్రవ్యనిధికో, ఇతర ప్రపంచ సంస్థలకో పోవడం ఆనవాయితీ... నాతో పాటు వున్నవాళ్ళు కొందరు అలానే వెళ్ళారు. నాకైతే అసలు ఢిల్లీకే వెళ్ళాలని ఉండేదికాదు. తప్పక ఢిల్లీ వెళ్ళాల్సి వచ్చింది. అదీ నరసింహారావుగారి కోసం. కేంద్రంలో అదనపు కార్యదర్శిగా మంచి శాఖలోకిమారడం ఆ పరిస్థితులలో చాలా తేలికే. కాని ఢిల్లీ అన్నా, ఢిల్లీలో ఉద్యోగం అన్నా నాకు కాని, నా భార్య గోపికకు గాని మొదట్నుంచి అసలు నచ్చలేదు. విపరీతమైన ఎండలు, లేదా విపరీతమైన చలి. మాకేమో ఉదయమే పూజా, పునస్కారాలు అలవాటైంది. చలికాలంలో చన్నీళ్ళ స్నానం పూజకు చాలా యిబ్బంది... ఏదైనా శాస్త్ర పాఠాలు చదువుకొందామనుకొన్నా, జ్ఞానకార్యం కావాలన్నా అవకాశం తక్కువ. అందుకే 1996లో ఎన్నికలవగానే హైదరాబాద్ వచ్చేశాం...

దాదాపు 10 ఏళ్ళ తర్వాత (1988-96) రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేయడానికి తిరిగి వచ్చాను. విశాఖలో పోర్టు ఛైర్మను గా చాలాకాలం చేసినా, అదికూడా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగమే. కొంతకాలం ఏదైనా కొంత విశ్రాంతి దొరికే పని యిప్పించమని ప్రధాన కార్యదర్శిని కోరడం, కమీషనర్ (భూసంస్కరణలు) గా పోస్టింగు రావడం జరిగిపోయింది. అంతగా పని ఉండే ఉద్యోగం కాదు, చాలా బాగుంది - అని సంతోషించే లోపలే - రెండు నెలల్లో - బదిలీ వచ్చింది. ఈ సారి ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా వేశారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలూ, అన్ని కాలేజీలూ, సాంకేతిక విద్యా సంస్థలూ, ఇంటర్‌మీడియట్ కాలేజీలు, ఇంకా ఇతర విభాగాలు - ఈ శాఖ క్రిందకు వస్తాయి. మా శాఖామంత్రి బాలయోగి చాలా మంచి వ్యక్తి. ఏ మంచి పని చేయాలనుకున్నా ఆయన పూర్తి సహకారం ఉంటుందన్నది చాలా త్వరగా అర్థమయింది.

నేను ముఖ్యకార్యదర్శిగా చేరిన కొద్ది రోజులకే చాలా యిబ్బందికర పరిస్థితి ఎదురైంది. ఇంటర్‌మీడియట్ పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయి - ఒకటీకాదు, రెండు కాదు, పైగా అవి పరీక్షల ముందుగానే వార్తా పత్రికలలో ప్రచురించబడే స్థాయికి వ్యవహారం ముదిరింది. అవి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర రాజకీయాల్లో కీలక స్థానం సంపాదించుకొని, ఆధునిక భావాలు కల వ్యక్తిగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని రాజకీయనాయకునిగా కాక ఒక వ్యాపార సంస్థని నడిపే ముఖ్య అధికారి (CEO)గా నడుపుతున్నారన్న ప్రచారం రూపుదిద్దుకొంటున్న రోజులు.... పత్రికలలో పరీక్షా పత్రాల లీకు విషయం బయటపడేప్పటికి ఆయన ఢిల్లీలో కొన్ని రోజులు ఉండి చాలా కీలక నిర్ణయాలలో చక్రం తిప్పుతున్న సమయం. అటువంటి పరిస్థితులలో ఆయన రాష్ట్రంలో పరీక్షలు ఆపివేసే స్థితి ఏర్పడింది. లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుకి సంబంధించిన విషయం!

ముఖ్యమంత్రి ప్రతిష్ఠకి చాలా ఇబ్బందికరంగా తయారవడంతో, ఆయన ఢిల్లీ నుంచి బాలయోగికి టెలిఫోనులో తన కోపం వ్యక్తం చేసి, సంబంధిత అధికార్ల పై వెంటనే చర్య తీసుకోవాలని ఆదేశించారు. పరిస్థితిని అదుపుచేయటంకోసం ఒక క్యాబినెటు మంత్రివర్గ ఉపసంఘాన్నొకటి అప్పటి రెవెన్యూ మంత్రి దేవేందర్ గౌడ్, అశోక్ గజపతిరాజు, బాలయోగిలతో నియమించి, ఎప్పటికప్పుడు తనకి పరిస్థితి తెలియజేయమని ఆదేశించారు.

వెంటనే ఇంటర్మీడియట్ బోర్డులో పనిచేసే జాయింట్ డైరక్టర్ హోదాలోని అధికారులిద్దరిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశాను. పరీక్షలు నిర్వహించే బాధ్యత, పరీక్షా పత్రాలు తయారు చెయ్యడం నుంచి, వాటిని ముద్రించి, పరీక్షా కేంద్రాలకు సరఫరా చేసి, ఏ రోజుకారోజు పరీక్ష సమయానికి అర్థగంట ముందు ఆయా కేంద్రాల పరీక్షాధికారుల సమక్షంలో సీళ్ళు విప్పించే వరకూ వారిద్దరిదే బాధ్యత. కనుక వారిద్దరినీ వెంటనే సస్పెండ్‌చేసి, ఇంకో శాఖ సంచాలకుని విచారణాధికారిగా కూడా నియమించేశాను. వెంటనే అప్పటి పరీక్షలు రద్దు చేసి, ఇంకొక నెలరోజులలోపే మళ్ళీ పరీక్షలకు తేదీలు నిర్ణయించడం కూడా జరిగింది. సిఐడి పోలీసులకు కేసు కూడా అప్పచెప్పాం.

ఇటువంటివి భవిష్యత్తులో జరగకుండా ఉండటానికి మంత్రిమండలి ముందు ఒక నిర్దిష్ట ప్రణాళిక కూడా తయారుచేశాం. ప్రతి పరీక్షకు ఒక ప్రశ్నా పత్రం బదులు మూడు ప్రశ్నా పత్రాలు తయారు చేసి, వాటన్నిటికీ ఇప్పటిలాగా భద్రతా మూతలు వేసి పరీక్షా కేంద్రాలకు పంపడం, ఏ పరీక్షకైనా ఆ పరీక్ష రోజు ఉదయం - రేడియోలో వార్తల సమయానికి అరగంట ముందు - అంటే 6.30 గంటలకల్లా ఒక ప్రముఖ వ్యక్తి చేత పత్రికల వారి సమక్షంలో.సీల్డ్ కవర్‌లో ఉండే ఆ మూడు ప్రశ్నాపత్రాలలో ఒక దానిని ఎంపిక చేయించి, అప్పుడు ఏ పరీక్షకు ఏ పత్రం ఎంపికయిందో ఆ సమాచారాన్ని రేడియో ద్వారా, పోలీసు వైర్‌లెస్ ద్వారా, టెలిఫోను ద్వారా అన్ని కేంద్రాలకు వెంటనే అందేట్టు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాం.

ఇంత హడావుడికి కారణం - లక్షల ప్రశ్నపత్రాలు ముద్రించే ముద్రణశాల దగ్గర ప్రశ్నపత్రాలు బయట పడే అవకాశం ఉండటం. అవి బెంగుళూరులోనూ కలకత్తాలోనూ ముద్రింపబడుతున్నా ఆ మధ్య మొదలైన కార్పొరేట్ కాలేజీల పోటీ పరిస్థితులతో, విద్యారంగమే పెద్ద లాభాలు ఆర్జించే సంస్థల మయమైపోవడంతో వారు ఎంతైనా ఖర్చుపెట్టి, ప్రశ్నపత్రాలు ముందుగా దొరికించుకొనే ప్రయత్నాలకు పాల్పడుతున్నట్లు మాకు సమాచారం వుంది.

ఈ నిర్ణయాన్ని ఒక్క రోజులోనే తీసుకొని ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రికి తెలియచేశాం. ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ, కమీషనర్‌ను కూడా సస్పెండ్ చేయాలనీ, ఒక పెద్ద ఐఏఎస్ అధికారి పై చర్య తీసుకొంటే ప్రభుత్వం చాలా పటిష్ఠంగా చర్య తీసుకొన్నట్లుంటుందని ఆయన ఉద్దేశం. ఆ విషయాన్ని ముఖ్య కార్యదర్శిని కనుక నాకు మంత్రి ద్వారా చెప్పించి, చర్య తీసుకోమన్నారు.

బిశ్వాల్ అనే ఐఏఎస్ అధికారి అప్పుడు ఆ శాఖకు కమీషనర్. చాలా నెమ్మదస్తుడు. కష్టపడి పనిచేసేవాడు. ముక్కుకు సూటిగా పోయే స్వభావం. అతను ఆ శాఖకు బదిలీ పై వచ్చి చేరింది కొన్ని నెలల క్రితమే. అతను చేరే నాటికే పరీక్షా పత్రాలు తయారుచేయబడి ముద్రణాలయాలకు పంపడం కూడా జరిగింది. జరిగిన తప్పు ముద్రణాలయంలో కనుక ఇతని బాధ్యత ఉండటానికి అవకాశం లేదు. ఆ శాఖలో ఉన్నదే నలుగురు సీనియర్ అధికారులు- ఇప్పటికే ఇద్దరిని సస్పెండ్ చేశాం. మళ్ళీ నెలరోజుల్లో పరీక్షలు జరపాలంటే (అదివరకు ఆరు నెలల పని ఇప్పుడు ఇరవై రోజులలో చెయ్యాలి) మళ్ళీ కొత్తవాళ్ళతో చేయించడం కూడా అసంభవం.

వెంటనే మంత్రివర్గ సంఘానికి ఈ విషయం తెలియ చేశాను. కాని వారెవరూ ఈ పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళే ధైర్యం చేయలేదు. ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నాక ఆగ్రహంతో ఉన్న ఆయనకు, నా ఉద్దేశ్యం చెప్పి ఇంకా కోపం తెప్పించడం ఎంతవరకూ సమంజసం అని వారి వాదన. మేం ఇట్లా మంత్రివర్గ సంఘంలో చర్చించు కుంటూండగానే, ముఖ్యమంత్రి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. దేవేందర్ గౌడ్ టెలిఫోన్ ఎత్తి మాట్లాడటం మొదలు పెట్టగానే ముఖ్యమంత్రి ప్రశ్న: "కమీషనర్‌ను సస్పెండ్ చేశారా?" -

దేవేందర్ గౌడ్: "ప్రసాద్ గారు దాని కంత సుముఖంగా లేరు..."

ఇంకా విపులంగా చెప్పబోతుండగానే... ముఖ్యమంత్రి ఇంకేదో అన్నారు. వెంటనే గౌడ్ "మీరు ప్రసాద్ గారితో మాట్లాడండి... ఆయన ఇక్కడే ఉన్నారు" అనేసి టెలిఫోన్ నా చేతిలో పెట్టేశారు.

* * *

చంద్రబాబు గారితో నాకు బాగానే పరిచయం అని చెప్పాలి.

నేను తిరుపతిలో తిరుమల తిరుపతి దేవస్థానాల ఇ.ఓగా ఉన్నప్పుడు ఆయన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రీసెర్చి స్కాలర్, విద్యార్థి నాయకుడు. వెంటనే ఎన్నికల్లో నిలబడి శాసన సభ్యుడయ్యారు, తరువాత మంత్రి అయ్యారు. ఆయన ఎన్.టీ.రామారావుగారి కుమార్తెను వివాహం చేసుకొంటున్నప్పుడు నన్నూ ఆహ్వానించారు. నేను వెళ్ళాను కూడా.

తర్వాత, ఆయన తెలుగుదేశం పార్టీ కార్యదర్శిగా ఉన్నప్పుడు, ఎన్.టీ.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేను సమాచార శాఖ, సాంస్కృతిక శాఖల కార్యదర్శి, కమీషనరుగా చేశాను. ఆ రోజుల్లో ముఖ్యమంత్రి గృహంలో దాదాపు రోజూ కలుసుకుంటుండేవాళ్ళం. తర్వాత నేను విశాఖపట్నంలోనూ, ఢిల్లీ ప్రధాన మంత్రి కార్యాలయంలోనూ పనిచేసేటప్పుడు రెండు మూడు సార్లు కలుసుకున్నాం. తగిన మర్యాద ఇచ్చి మాట్లాడేవారు. కాని ఇవేవీ ప్రశ్న పత్రాల లీక్ విషయంలో ఆయన్ని మొహమాట పెట్టలేవు గదా!

"ఏం ప్రసాద్‌గారు... ఏమిటండీ ఇలా జరిగింది?.. ఇక్కడ ఢిల్లీలో తలెత్తుకొనే పరిస్థితి లేకుండా పోయింది. మా పరిపాలనే హాస్యాస్పదంగా మారినట్లయింది... ప్రజలకి ఏం చెబుతాం? కఠిన చర్య తీసుకొందామన్నా మీరేమో మీ ఐఏఎస్ వాళ్ళని రక్షించుకొందామని చూస్తున్నారు, ఎలా?..."

ఇది నా విశ్వాసానికి, మనస్సాక్షికి సంబంధించిన విషయం. 'ఐఏఎస్' అధికారి కాబట్టీ అన్న కారణంగా నేను బిశ్వాల్‌ని కాపాడాలనుకుంటున్నానా? ఇది నిజమా? ముఖ్యమంత్రి మోపుతున్న అభియోగం సరైనదేనా! నేను ఉండబట్టలేక నా సహజధోరణిలో మాట్లాడేశాను:

"సర్, మీరు కోపం తెచ్చుకోకుండా నే చెప్పేది ఒక్క నిమిషం సావధానంగా వినండి... జరిగిన తప్పు చాలా పెద్దది. దాని వలన చాలా మందికి ఇబ్బంది కలిగింది. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చింది. అన్నీ నిజమే... కాని తప్పు చేసిన వాళ్ళని శిక్షించాలి కాని, ఆవేశంలో తొందరపడి ఏమైనా చేస్తే - తర్వాత ఇబ్బంది రావచ్చు... బిశ్వాల్‌ని రక్షించటంకోసం నేను చెప్పడం లేదు. అతను ఆ శాఖలో చేరేనాటికే తప్పు జరిగిపోయింది... ఆ జరిగిన పొరపాటులో అతని పాత్ర, బాధ్యత లేవని స్పష్టంగా కనిపిస్తోంది. అంతకంటే ముఖ్యం. ఒక్కనెలలో మళ్ళీ పరీక్షలు లక్షలమందికి నిర్వహించాలి. ఉన్న నలుగురిలో ఇద్దరిని ఇప్పటికే సస్పెండ్ చేశాం. ఒక్క నెలలోపు పరీక్షలు

జరపాలి. మనకి ఉన్న సమయం చాలా తక్కువ. ఇతన్ని సస్పెండ్ చేసి, కొత్త వ్యక్తిని నియమిస్తాం. అతనికి విషయాలన్నీ అర్థమవటానికి ఎంతో టైమ్ కావాలికదా! పని ఎలా జరుగుతుంది... అందులో అతని బాధ్యత లేనప్పుడు తొందరపడటం అంత మంచిది కాదేమో?"

"అదేమిటండీ, అలా అంటారు! ఆ శాఖ సంచాలకునిగా అతనిది బాధ్యత కాదా?... అతను తప్పు చేశాడా లేదా అన్నది ప్రశ్న కాదు. అతని పెత్తనంలో ఉండగా ఆ శాఖలో ఈ సంఘటన జరిగినప్పుడు, అతనికి నైతిక బాధ్యత లేదా? అలా ఆ శాఖ ప్రధానాధికారి మీద చర్య తీసుకోకుండా, ఎవరో ఇద్దరు అధికారుల పై చర్య తీసుకొన్నామంటే ప్రజలేమనుకుంటారు? ఐఏఎస్ అధికారి పై చర్య తీసుకొంటేనే కదా ప్రజలమీద, పరిపాలన మీద దాని ప్రభావం ఉండేది?"

నాకు చాలా ఆవేశం వచ్చింది. రైల్వేశాఖలో భారీ రైలు ప్రమాదం జరిగితే అప్పటి రైల్వేమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి రాజీనామా చేశారు. అలా మంత్రులంతా చేస్తున్నారా? -ఇలా మనస్సులో అనుకొన్నాను. సరే, ఇప్పుడు ముఖ్యమంత్రి ఏం కోరుతున్నారు? గొప్ప ప్రభావం ఉండే చర్య! అంతేకదా!

"సర్, ప్రభావం కోసం పెద్ద అధికారిపై చర్య తీసుకోవాలంటే – నా పైన చర్యతీసుకోండి. చాలా పెద్ద ప్రభావం ఉంటుంది... అసలు ఉన్నత విద్యాశాఖ మొత్తానికే నేను ముఖ్యకార్యదర్శిని... ఈ విషయంలో బిశ్వాల్ కి ఎంత బాధ్యతో నాకు అంతే. ఇంకా ఎక్కువే కూడా. నేను చాలా సీనియర్ని.. చాలామందికి తెలిసిన వాణ్ణి. ఢిల్లీలో కూడా ప్రధాని కార్యాలయంలో పనిచేయడం వలన, అక్కడా చాలా మందికి నేను తెలుసు. నా మీద చర్యతీసుకుంటే వచ్చేటంత పేరు, ప్రభావం బిశ్వాల్‌ని చేసినా రాదు. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది" అన్నాను.

కొద్దిక్షణాలు ఆయన మాట్లాడలేదు. నేనూ అంతే. "సర్లేండి ... నేను రేపు వచ్చేస్తున్నాను. వచ్చాక మాట్లాడదాం" అని ఆయనే చెప్పి ఫోన్ పెట్టేశారు. మంత్రులు ముగ్గురూ మా సంభాషణ వింటూనే ఉన్నారు. ఫోన్ కాల్ పూర్తికాగానే "అదేమిటండీ మీరు అలా అన్నారు! మిమ్మల్నే సస్పెండ్ చేయమన్నారు! ముఖ్యమంత్రితో అలా ఎలా చెప్పగలిగారు?" అన్నారు బాలయోగి విస్తుపోతూ. నాకూ తెలీదు.

అశోక్‌గజపతి, దేవేందర్ గౌడ్‌లు నా వంక విచిత్రంగా చూశారు!

మరునాడు ఢిల్లీ నుంచి ముఖ్యమంత్రి వచ్చారు. ఈ 'ప్రభావం కోసం సస్పెన్షన్' విషయాన్ని ఆయన మళ్ళీ ప్రస్తావించలేదు.

చంద్రబాబునాయుడుగారితో నా అనుభవం ఇదొక్కటే కాదు...

★ ★ ★

అమెరికాలో చంద్రబాబునాయుడు - 2

విద్యాశాఖలో విశ్వవిద్యాలయాల పరిస్థితి బాగా లేనట్లనిపించింది. కారణాలు ఏమైనా విధానంలో నిపుణతకు కొరతరావడం, ఉపాధ్యాయులు చాలా మంది చేయాల్సినంత అంకితభావంతో పనిచేయలేకపోవడం, చాలామంది విద్యార్థులు క్లాసులకు కూడా పోకపోవడం, విశ్వవిద్యాలయాల్లో పరిశోధన ఎక్కువ జరగకపోవడం, జరిగినా ఉండాల్సిన నాణ్యత లేకపోవడం, ప్రభుత్వ కళాశాలల్లో చాలా ఖాళీలు, ప్రైవేటు కాలేజీల్లో ప్రభుత్వం ఖర్చుతో పనిలేకుండా చాలామంది ఉపాధ్యాయులు ఉండటం, వసతులు లేకుండా చాలా కాలేజీలు పనిచేస్తూ ఉండటం... ఇదీ పరిస్థితి.

వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ఒక సమగ్ర సంస్కరణల విధానాన్ని తయారుచేసి, మంత్రిగారి, ముఖ్యమంత్రి ఆమోదం తీసుకొని, అమలు పరచడం మొదలుపెట్టాను. వెయ్యిమంది కాలేజీ ప్రిన్సిపాళ్ళను హైదరాబాదుకు పిలిపించి ముఖ్యమంత్రిగారి చేత సంస్కరణలు ఆవశ్యకత, ప్రభుత్వ ఉద్దేశ్యాలు చెప్పించి, పెద్ద ఎత్తున కార్యక్రమం మొదలు పెట్టడం జరిగింది.

ఆ సంస్కరణలలో భాగంగానే రాష్ట్రంలోని ఇంజనీరింగు కాలేజీలు, వాటి పరిస్థితి, వచ్చే 15/20 సంవత్సరాలలో మన రాష్ట్ర దేశ, అంతర్జాతీయ అవసరాలు వగైరా దృష్టిలో పెట్టుకొని ఒక ప్రణాళిక తయారుచేశాం. అది చేస్తున్నప్పుడే రాజీవ్ శర్మ (సాంకేతిక విద్యా సంచాలకుడు) అన్నారు : "సర్, మనం పథకాలు తయారు చేస్తున్నాం. కాని ఈ ముఖ్యమంత్రి కొత్త కాలేజీలకు వ్యతిరేకి. గత రెండేళ్ళుగా ఒక్క కాలేజీ కూడా మంజూరు చేయించుకోలేక పోయాం... మూడుసార్లు ఫైలు వెనక్కి వచ్చింది"!

ఇతర రాష్ట్రాలతో (ముఖ్యంగా తమిళనాడు, కర్నాటకలతో) పోలిస్తే రాష్ట్రంలో ఇంజనీరింగు కాలేజీల సంఖ్య చాలా తక్కువ. చాలా మంది లక్షల్లో విరాళాలు కట్టి, ఇతర రాష్ట్రాలకు చదువుకోవడానికి వెళ్తున్నారు. ఏవో కారణాల వల్ల కొత్త కాలేజీలు రాష్ట్రంలోకి తెచ్చుకోలేక పోతున్నాం. అన్ని విషయాలలో చాలా ప్రగతి పథంలో నడిచే ముఖ్యమంత్రి ఈ విషయంలో ఎందుకు శ్రద్ధ పెట్టలేదు?

అర్థం కాక బాలయోగి గారిని అడిగాను. ఆయన చెప్పిన సమాధానం చాలా ఆశ్చర్యమేసింది!!

"మళ్ళీ ఒక ప్రయత్నం చేద్దాం?" అని అడిగాను. ఆయన "సరే" అన్నారు. ఇద్దరం కలిసి ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్ళాం.

రాష్ట్రంలో అప్పుడు 20,000 సీట్లు కూడా ఇంజనీరింగు కాలేజీలకు లేవు. మా అంచనాల మేరకు దాదాపు 40 వేలమంది సీటుకు రెండు మూడు లక్షలు విరాళాలు ఇచ్చి ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారు. ఐటి రంగంలో చాలా ముందుకు పోయే అవకాశాలు వున్నాయి. ఇంజనీరింగ్‌కు, మేనేజిమెంట్ కోర్సులకు చాలా ఉద్యోగావకాశాలు ఉన్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రానికి న్యాయం జరగాలంటే సంవత్సరానికి ఒక లక్షమంది ఇంజనీర్లనైనా తయారుచేసే కాలేజీలు కావాలి... ఈ విషయాలన్నీ ముఖ్యమంత్రితో చర్చించాం.

అయన బాలయోగి చెప్పినట్లే స్పందించారు. "ప్రసాదుగారూ, మీరేమైనా చేయండి, నేను సమర్థిస్తాను. కొత్త కాలేజీల విషయం మాట్లాడకండి... మీకు తెలుసుగదా, నేదురుమల్లి జనార్ధన రెడ్డి గారి విషయంలో ఏం జరిగిందో? (పన్నెండు ఇంజనీరింగ్ కాలేజీలకు ప్రభుత్వం అనుమతి ఇస్తే, ఆ కేటాయింపు విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది.) కొత్త కాలేజీల విషయంలో అయన ముఖ్యమంత్రి పదవే పోయింది... ఎవరికిచ్చినా గోలే, ఎవరికివ్వకపోయినా గోలే. డబ్బులు తిన్నామంటారు, లేదా 'మీవాళ్ళకిచ్చారు' అంటారు. కోర్టులకు లాగుతారు. అరంతా తేనెటీగలతుట్టె. కదిలించడం ఎందుకు? తర్వాత బాధపడటమెందుకు?..."

ఓహో! ఇవా ఈయన నైరాశ్యానికి, నిరుత్సాహానికి కారణాలు. రాజకీయ కారణాల వల్ల ఒక చరిత్రాత్మకమైన చర్యతీసుకోలాసికి సంకోచిస్తున్నారు.

నేను ధైర్యం చేసి, కొంచెం చొరవతీసుకున్నాను.

"సర్, ఆ గొడవలన్నీ మనం పద్ధతి ప్రకారం పోకపోతే కదా!... అదీకాక మనం చేసేది సిఫార్సు మాత్రమే!... అసలు మంజూరు చేసేది కేంద్ర ప్రభుత్వ ఏఐసిటిఇ సంస్థకదా? అదీకాక ఏదో ఒకటి రెండు కాలేజీలకు మాత్రం అనుమతి ఇవ్వాలంటేనే ఇటువంటి బాధ. చాలామందికి ఇవ్వగలిగినప్పుడు ఇబ్బంది లేకపోవచ్చు. ఇప్పుడు కాలేజీలన్నీ హైదరాబాదులోనో, లేదా మూడు నాలుగు పెద్ద పట్టణాలలోనో ఉన్నాయి. మనం మన విధానం ముందుగా అందరికీ తెలిసే విధంగా ప్రకటనలు ఇద్దాం... మొదట ప్రతి జిల్లాకూ ఒక్క కాలేజీ అయినా ఉండాలని చెప్పి, ఇప్పుడు కాలేజీలు లేని అన్ని జిల్లాలలో కాలేజీలు వచ్చేట్లు చూస్తే, తర్వాత ప్రతి రెవెన్యూ డివిజన్లో ఒక కాలేజీ మంజూరు చేస్తామని ప్రకటించవచ్చు. అలా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, దానితో పాటు కొత్త కాలేజీలు వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. ఎక్కడైనా ఒకటికి నాలుగు మంచి సంస్థలు ముందుకు వస్తే మనం సిఫార్సు చేసేద్దాం. కేంద్రం పరిశీలించి తీసుకొనే నిర్ణయానికి కట్టుబడి వుంటామంటే సరి...' అన్నాను.

బాలయోగి కూడా సమర్థించారు... అయినా ముఖ్యమంత్రి సందేహంలో పడ్డారు.

అభివృద్ధికి సంబంధించిన అన్నివిషయాల్లోనూ సానుకూలంగా, వేగంగా స్పందిస్తూ, రాష్ట్రాన్ని అతివేగంగా సమగ్రంగా అభివృద్ధి చెందేలా చేయాలని ఆరాటపడే ముఖ్యమంత్రి ఈ విషయంలో మాత్రం ఎందుకు సంకోచిస్తున్నారు? .... నాకు పట్టుదల పెరిగింది.

"సర్, ప్రపంచం అంతా పోటీమయం. మన పొరుగు రాష్ట్రాలు కొత్త కాలేజీలతో ముందుకు దూసుకువెళ్తున్నాయి. మన పిల్లల్లో డబ్బున్నవాళ్ళు లక్షల ఖర్చు పెట్టి బయటకు వెళ్ళి చదువుకుంటున్నారు. స్తోమత లేని వాళ్ళ సంగతి?.... ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో అవకాశాలు పెరుగుతున్నాయి. ఇప్పుడు మనం చొరవ తీసుకోకపోతే కొన్ని దశాబ్దాలు వెనకబడిపోతాం..." నేను చెబుతూనే విన్నాను. ముఖ్యమంత్రి మనస్సాక్షికి నచ్చితేనే ఈ బృహత్ కార్యక్రమం చేయగలం. ఆయన్ని ఒప్పించడం చాలా ముఖ్యం.

ఎలాంటి లిటిగేషన్లకి అవకాశం లేని విధంగా కొత్త కాలేజీల ఏర్పాటుకి నిబంధనలు రూపొందించి చేయవచ్చనీ, కొత్త ఇంజనీరింగ్ కాలేజీలు రావటమనేది ప్రజలు మెచ్చే విషయం కాబట్టి రాజకీయ ప్రతిస్పందనకి అవకాశం తక్కువనీ... ఇలా వేర్వేరు కోణాల్లో విషయాన్ని ముఖ్యమంత్రి ముందు పెట్టాను. ఇందుకోసం రెండుమూడుసార్లు ప్రత్యేకంగా కలిశాను.

రకరకాల ప్రశ్నలు, అనుమానాలు, రాజకీయ సందేహాలు... చివరికి ముఖ్యమంత్రికి ఈ ప్రతిపాదన నచ్చింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం చేయాలని ఉంది. కాని, నేదురుమల్లి జనార్ధన రెడ్డిగారి అనుభవం దృష్ట్యా, రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయోనన్న సందేహం...!!

చివరికి, సందేహిస్తూనే ముఖ్యమంత్రి అన్నారు : "ఇబ్బంది ఏమీ ఉండదు కదా!"

"ముందు కాలేజీల్లేని వెనుకబడిన జిల్లాలకు సిఫార్సు చేద్దాం సర్. వీలయినన్ని మంజూరు చేయించి చూద్దాం... మనం తీసుకునే ప్రతిచర్యా పారదర్శకంగా వుండేలా చూసే బాధ్యత మాది" అన్నాను.

"సరే" అన్నారు.

'అమ్మయ్య' అనుకొన్నాను. అలా మొదలయిన ఆ కార్యక్రమం - మూడు నాలుగు సంవత్సరాలలోనే పెద్ద ఊపందుకొంది. ప్రతి జిల్లాలో, రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ డివిజన్లో కాలేజీలు వచ్చేశాయి.

పెద్ద పెద్ద భవనాలతో, మంచి వసరులతో ఇంజనీరింగ్ కాలేజీలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. విరాళాల పరిమాణం తగ్గిపోయింది. ప్రతి కాలేజీలో సగం సీట్లు ప్రతిభావంతులకు ('ఎమ్‌సెట్' ద్వారా) ఏర్పడ్డాయి. వాటిల్లో రిజర్వేషన్లు ఉండటంతో, బలహీనవర్గాల పిల్లలకూ, ప్రతిభగల విద్యార్థులందరికీ సానుకూలం అయింది... సంవత్సరానికి లక్షమందికి పైగా ఇంజనీర్లను రాష్ట్రంలో తయారుచేయగలుగుతున్నాం.

★ ★ ★

ఆగస్టు 2007 లో చికాగోలోని ఇండియా హౌస్‌లో పెద్ద విందు సభ జరుగుతోంది. వేలమంది భారతీయులు వచ్చారు. అందులో చాలామంది తెలుగువారే. ధగధగ మనే లైట్ల

కాంతిలో, సభ, విందు చాలా ఆలస్యంగా మొదలైనా, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని చూడటానికీ, ఆయన చెప్పేది వినటానికీ వేల మంది ప్రవాస భారతీయులు సీటుకు 20 డాలర్లు (విందు భోజనంతో కలిపి) వంతున కట్టి వేచి వున్నారు.

స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ హోదాలో నేను రిటైరయ్యాక మా అమ్మాయి మాధవి, మా అల్లుడు నరేంద్రని చూడటానికి నేనూ, నా భార్య గోపీ, మా అబ్బాయి సంజీవ్ చికాగో వెళ్ళాం. ఆరోజుల్లోనే ఈ విందు సభ జరిగింది. అదీ మా అమ్మాయి వాళ్ళ ఇంటికి దగ్గరలోనే కనుక తెలుగు వాళ్ళందరితో కలిసి తెలుగు వంటలు రుచికరంగా తినచ్చుగదా అని అందరం తలా ఒక 20 డాలర్లు చెల్లించి ఆ విందు సభకి వెళ్ళాం.

చంద్రబాబునాయుడు అమెరికాలోని పలు పట్టణాలు తిరుగుతూ, ప్రవాస భారతీయులను కలుస్తూ చేస్తున్న యాత్రలో భాగంగా చికాగోలో ఈ సమావేశం జరిగింది. స్పందన బాగానే ఉంది. ఇది రాజకీయాలకు గాని, చందాలు వసూలు చేయడానికి కాని చేస్తున్న యాత్ర కాదనీ, NTR Foundation కోసమనీ ఆయన తన తొలిపలుకుల్లో చెప్పుకుంటూ వెళ్ళారు. గ్రామీణాభివృద్ధికీ, ప్రత్యేకంగా ఆరోగ్య విభాగంలో ప్రజలకు సేవచేయడానికీ, రాష్ట్రానికీ, దేశానికీ సేవచేయడానికీ ప్రవాస భారతీయులు ముందుగా రావాలని NTR Foundation కిచ్చే విరాళాలు తనకి ఇవ్వక్కర్లేదనీ, నేరుగా ఎవరికి వారుగానే సేవలు చేయవచ్చుననీ, అలా చేయడానికి అవకాశం లేకపోతే ఈ సంస్థ ద్వారా చేయవచ్చునీ... ఇలా అంటూ అప్పటిదాకా ఫౌండేషను వివిధ రంగాలలో చేసిన సేవల గురించి మాట్లాడారు.

ఆయన ఒక్కరే రాలేదు. తెలుగుదేశం పార్టీలోని అయిదారుగురు మాజీ మంత్రులు విజయరామారావు, జనార్ధనరెడ్డి, ఉమా మాధవరెడ్డి వగైరాలతో కలిసి వచ్చారు.

ఈ అమెరికా యాత్ర చేయటంలో లక్ష్యం రాజకీయాల కోసం కాదని ఎంత చెప్పుకున్నా అంత మంది నాయకులు అంతమంది జనం ముందు నిలబడ్డాక కొంత రాజకీయం లేకుండా ఎలా ఉంటుంది....?

తన సారథ్యంలో "తెలుగు దేశం ప్రభుత్వం సాధించిన విజయాలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి ఇచ్చిన గణనీయ ప్రోత్సాహం.. అది వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించడం.. దానిలో భాగంగానే వేలాది మంది తెలుగువారు అమెరికాకు, ఇతర దేశాలకు వలస రావడం... అక్కడ ఉన్న సభికుల్లో సగం మంది యువకులు ఆ కార్యక్రమం ఫలితంగానే ఈ సభకు చికాగోలో రాగలిగారనటం..." ఇలాంటి అంశాలన్నీ ఈ సభలో కరతాళధ్వనుల మధ్య చంద్రబాబునాయుడు చెప్పుకుంటూ వెళ్ళారు:

"మా హయాంలో ఎన్నో కొత్త ఇంజనీరింగు కాలేజీలు తీసుకువచ్చాం. తెలుగు వారిని knowledge society గా మార్చే ప్రయత్నం చేశాం. అదివరకు ఉన్న 20,000 సీట్లను

సంవత్సరానికి లక్షకు పైగా చేసి, ప్రతి సంవత్సరం లక్షమంది ఇంజనీర్లు తయారయ్యేలా చేశాం. వారు భారతదేశంలోనే కాక, ప్రపంచంలోని పలు దేశాల్లో ఉన్న నిపుణుల కొరత తీరుస్తున్నారు. వారికి ఉపాధి, దేశానికి మంచి పేరు లభిస్తోంది... ఎంతో దూర దృష్టితో దాదాపు 100 కొత్త ఇంజనీరింగు కాలేజీల్ని మా పరిపాలనలో ప్రారంభించి రికార్డు సృష్టించాం... అవికాక, కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించి - దేశంలోని ఐఐటీలలోనూ ఇతర ఇంజనీరింగు కాలేజీలలోనూ కూడా తెలుగువారికి చాలా ఎక్కువ సీట్లు వచ్చేటట్లు ఏర్పాటుచేశాం..."

ఆ ప్రసంగం వింటున్నప్పుడు - నాకు గతం గుర్తుకువస్తోంది.....

కొత్త ఇంజనీరింగ్ కాలేజీల మంజూరు కోసం ప్రతిపాదనలు తయారుచేసి, ముఖ్యమంత్రి ముందు పెట్టినప్పుడు ఆయన అన్న మాటలు స్ఫురణకు వచ్చాయి.

"ప్రసాదుగారూ, ప్రపంచంలో టెక్నాలజీ మారిపోతోంది. మారిపోతున్న ప్రపంచానికి అనుగుణంగా మనం కూడా మారి తీరాలి. ప్రపంచ అవసరాలకు తగినట్లు ఎవరు ముందుగా మారతారో వాళ్ళే ఎక్కువ ప్రయోజనం పొందుతారు. ఈ విషయంలో నాకు భిన్నాభిప్రాయం లేదు. కాని రాజకీయ పర్యవసానాలు ఎలా ఉంటాయో కూడా చూసుకోవాలిగదా....!"

నిజమే.

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాష్ట్రానికి ఏది మంచిదో సలహా చెప్పటం, ప్రభుత్వ విధానాలని అమలు చేయటం వరకే అధికారులుగా మా పాత్ర. దాన్ని అమలు చేయటం వల్ల వచ్చే రాజకీయ పర్యవసానాలకి జవాబుదారీ మాత్రం ముఖ్యమంత్రి మీరే ఉంటుంది. ఒక్కొక్కసారి ఎంతో మంచి సలహా కూడా విపరీత రాజకీయ పరిణామాలకి దారి తీయవచ్చు. ప్రభుత్వం కూలిపోవచ్చు. కాని సలహా ఇచ్చిన ఐ.ఏ.ఎస్ అధికారికి ఉద్యోగం పోదు. అందులోనూ - అదే అంశంపై తీసుకున్న నిర్ణయం వల్ల గతంలో ఒక ప్రభుత్వం కూలిపోయిందని తెలిసీ, చూస్తూ చూస్తూ ఎవరు చేతులు కాలే ప్రయోగం చేస్తారు? అందుకే కార్యదర్శులుగా మాలాంటి వాళ్లం ఇచ్చే సలహాలలోని మంచి చెడులకన్నా వాటిని అమలు చేయడంలో వచ్చే రాజకీయ అవరోధాలను ఎదుర్కోవడంలో ముఖ్యమంత్రులకుండే సామర్థ్యం మీదనే వాటి జయాపజయాలు ఆధారపడి ఉంటాయి. ఆ సామర్థ్యం అనేది ఆయా పథకాలు, కార్యక్రమాల విషయంలో ముఖ్యమంత్రికుండే 'విశ్వాసం, సంకల్పం' ఎంత బలంగా ఉన్నాయన్న దానిమీదే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.

నిజానికి రాష్ట్రానికి సంబంధించి ఏ అధికారి ఎలాంటి సలహాలిచ్చినా, ఎలాంటి పథకం రూపొందించినా దానివల్ల వచ్చే ప్రతిష్ఠ గాని, అప్రతిష్ఠ గాని ముఖ్యమంత్రికి దక్కేదే కాని అధికారులకి దక్కేది కాదు. అందుకే ప్రతి అడుగు ఆచి తూచి వేయటం ముఖ్యమంత్రులకు తప్పని సరి.

ఇంజనీరింగ్ కాలేజీల విషయంలో మొదట్లో అంత తటపటాయించిన ముఖ్యమంత్రి ఒకసారి దృఢమైన రాజకీయ నిర్ణయం తీసుకున్నాక మాత్రం మేరుపర్వతంలా నిలబడ్డారు.

అసెంబ్లీలో ఈ కాలేజీల మంజూరు గురించి ప్రతిపక్షాలు ప్రశ్నల వర్షం కురిపించినా, కొన్ని పత్రికల్లో విమర్శలు వెల్లువెత్తినా, ఒకరిద్దరు కోర్టుకెక్కినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం చలించలేదు.

...చికాగోలోని ఇండియా హౌస్‌లో చప్పట్లు కొడుతున్న తెలుగువాళ్ళలో చాలామంది యువ ఇంజనీర్లే !

ఒకప్పుడు - బిశ్వాల్‌ని తక్షణం సస్పెండ్ చేసేద్దామన్న ముఖ్యమంత్రి...!

మరొకప్పుడు - ఇంజనీరింగ్ కాలేజీల ఫూసే ఎత్తవద్దన్న ముఖ్యమంత్రి...!

ఒక అరుచికరమైన పని చేయడానికీ రాజకీయంగా ఆలోచిస్తాం......!

ఒక అవసరమైన పని చేయాలన్నా రాజకీయంగా ఆలోచిస్తాం....!

ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రయోజనాలకు భిన్నంగా ఆలోచించగలిగితే ఎన్ని మంచి పనులు చేయవచ్చు!!

★ ★ ★

పత్రికలపై మంత్రుల రుసరుస

1999 నవంబరు 31.....

ఈనాడు, Newstime పత్రికల ప్రధాన సంపాదకుడు, పబ్లిషర్ రామోజీరావుతో మంత్రులంతా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా వాళ్లతో పాటే కూర్చున్నారు. దాదాపు రెండుగంటలపాటు ఆ కార్యక్రమం నడిచింది.

నేనూ వున్నాను. సంధాన కర్తని నేనే.

రామోజీరావు మాట్లాడుతున్నారు. మంత్రులు ప్రశ్నలు వేస్తున్నారు. ఆయన జవాబులు చెబుతున్నారు.

మధ్యలో అకస్మాత్తుగా మంత్రి అలిమినేటి మాధవరెడ్డి రామోజీరావు గారికి ఒక ప్రశ్న సంధించాడు.

"మీరు విలేకరులుగా నియమించేవాళ్ళు మాకు చాలా సమస్యాత్మకంగా తయారవుతున్నారు. మా అధికారులు వాళ్ళని చూస్తేనే భయపడుతున్నారు. మీరు విలేకరులుగా నియమించేవాళ్ళకి మంచి శిక్షణనిచ్చి, నియమించవచ్చుగదా?"

అప్పటిదాకా నవ్వుల్లో నడిచిన ఆ సమావేశం హాలు ఈ ప్రశ్నతో ఒక్కసారిగా వేడెక్కింది. అంతా నిశ్శబ్దం. మంత్రులందరూ ఒక్కసారిగా శ్రద్ధాసక్తులతో బిగుసుకుపోయారు.

దానికి కారణం – ఈ సమస్య అక్కడున్న ప్రతి ఒక్కరినీ వెంటాడుతున్నదే. పత్రికా ప్రపంచంలో అనేక కొత్త ప్రయోగాలకు నాంది పలికిన వ్యక్తిగా రామోజీరావుకి ప్రత్యేకమైన గుర్తింపు వుంది. పైగా ఆ రోజుకి దేశంలో అత్యధిక ప్రజాదరణ కలిగిన కొద్ది పత్రికల్లో 'ఈనాడు' ఒకటి. అందుకే రామోజీరావు గారితో ముఖాముఖీ సమావేశం మంత్రులందరికీ చాలా ఉత్కంఠభరితంగా వుంది. కాని నా ఆదుర్దా నన్ను వెంటాడుతూనే వుంది.

* * *

'విజన్ 2020' ప్రాథమిక సమావేశంలోనే చాలా ఎక్కువ మాట్లాడేసి లేనిపోని తలనొప్పి తెచ్చి పెట్టుకున్నాను. దానికి కొనసాగింపు ఇదొకటి? అసలా 'విజన్' సమావేశంలోనే మనకేమీ 'విజన్' లేదని పూరుకొని వుండొచ్చుకదా!

గతం గుర్తుకొస్తోంది. ఆ రోజు చాలా ఎక్కువ మాట్లాడేశాను...

2020 నాటికి ఆంధ్రప్రదేశ్‌ని 'స్వర్ణాంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పుడప్పుడు అంటున్నారు. చెబుతున్నారు. వింటున్నాం. ఉన్నట్టుండి ఒకరోజు 'విజన్ 2020' మీటింగ్‌కి రమ్మన్నారు. ఉన్నతాధికారులంతా వున్నారు. ఎందుకూ కొరగాని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్' (ఐ.ఓ.ఏ.)కి కమీషనర్‌గా నేనూ వెళ్ళాను.

ముఖ్యమంత్రి తన ఉపోద్ఘాతంలో తన ఆకాంక్ష ఏమిటో చెప్పారు. "అభివృద్ధి చెందిన దేశాల్లోలాగా ఆంధ్రప్రదేశ్‌ని అభ్యుదయ పథంలోకి నడిపించటమే నా లక్ష్యం..." అన్నారు. ఇందుకోసం ఏం చేయాలి? ఎలాంటి ప్రణాళిక తయారుచేయాలి? వివిధ శాఖలని ఎలా స్పందించచేయాలి?... ఇవన్నీ ఎవరెవరో ఏదేదో చెబుతున్నారు. ముఖ్యమంత్రిగారి లక్ష్యం వినటానికి బాగుంది కాని, "ఆచరణ సాధ్యమేనా?" అన్న అనుమానం నన్ను వెంటాడుతోంది.

నా అనుమానం నిరాధారమైంది కాదు. ఇప్పుడున్న పాలనా వ్యవస్థలో మన పని సంస్కృతి ఎలావుందో మనకు తెలుసు. శెలవులు ఎక్కువ. మనం వాడుకునే క్యాజువల్ లీవ్‌లు, ఆర్జిత శెలవులూ... వీటికి అదనంగా అప్పుడప్పుడొచ్చే ఐచ్ఛిక శెలవులు... ఇవన్నీ కలిపితే ఎన్ని శలవులు? ఇవన్నీ అలా వుంచి, అసలు ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే మనం ఆఫీసుకి ఎన్ని గంటలకి రావాలి? నిజంగా ఎన్ని గంటలకి వస్తున్నాం? వచ్చిన తరువాత, రోజులో ఎన్నిసార్లు టీ, కాఫీలు సేవించటానికి బయటికి వెళ్తుంటాం? వెళ్లినప్పుడంతా ఎంత సమయం ఖర్చు పెడతాం? భోజనానికి నిర్దేశించిన సమయం ఎంత? కానీ మనం భోజనం పేరుతో 'తినే' సమయం ఎంత ఎక్కువ? సాయంత్రం ఎన్ని గంటలదాకా ఆఫీసులో వుండాలి? కానీ బస్సులు దొరకవనో, ఆటోలు దొరకవనో ఎంత త్వరగా వెళ్ళిపోతుంటాం?... మిగిలిన సమయంలో బాస్ చెప్పిన ఫైలు వెతకడం, తీయటం, రాయటంమినహా మనం నేర్చుకుంటున్నదేమిటి? అసలు మన పోస్టులో మన విధులేమిటో మనకు తెలుసా? మారుతున్న చట్టాలు, జిఓలు ఎప్పుడన్నా చదివే టైమ్ వుంటోందా? మనం చేయాల్సినంత పని చేయగలుగుతున్నామా?... వీటి గురించి ఆ సమావేశంలో ఎవరూ మాట్లాడడం లేదు. ముఖ్యమంత్రి గారి 'విజన్ ప్రణాళిక' గురించి మాత్రం 'అద్భుతం – ఆహా-ఓహో' అంటున్నారు.

అప్పటికే 'ఐ.ఓ.ఏ.'లో పనీపాటా లేకుండా జీతం తీసుకుంటున్నానన్న అపరాధ భావాలు వెంటాడుతున్నాయి కదా! నేను ఏమీ మాట్లాడకుండా ముక్కుమీద వేలు వేసుకూర్చున్నాను. ఈ సంగతి ముఖ్యమంత్రి కంట్లో పడింది.

లాంఛనప్రాయంగా ముఖ్యమంత్రి నన్నూ అడిగారు "మీరేమీ మాట్లాడడం లేదే చెప్పండి మీ సలహా ఏమిటో?"

చెప్పటం ఇష్టంలేదు. చెబితే ఆయనకి అరుచికరంగా వుండవచ్చు. కాని ముఖ్యమంత్రి నన్ను వదల్లేదు. దాంతో నాలో గూడుకట్టుకున్న భావాలన్నీ ఒక్కసారిగా కట్టలు తెంచుకున్నాయి.

అక్కడున్న నా సహ అధికారులు ఏమనుకుంటారో అన్న ఆలోచన లేకుండా నా మనసుకొచ్చిందంతా మాట్లాడేశాను.

"సర్... విజన్ ప్లాన్ ఆలోచన చాలా బాగుందిసర్... ఇది తయారు చేయడంకోసం చాలా ఆలోచన జరుగుతోంది. కాని నేను ఢిల్లీనుంచి చూసింది కానీ, ఇక్కడ రాష్ట్రంలో చూస్తున్నదీ కానీ ఒకటే విషయం. మన దేశంలో మనకి పథకాలు రచించడం చేతకాకపోవడం అంటూ ఎప్పుడూ లేదు. అనేక గొప్ప గొప్ప పథకాలు రచిస్తున్నాం. ఎటొచ్చీ వాటిని అమలు చేయలేక పోతున్నాం. అందుకు కారణాలు చాలా వున్నాయి. ప్రధానంగా రెండు కారణాలు చెబుతాను. ఒకటి - రాజకీయ నాయకులలో వాటిని శరవేగంతో అమలుచేయాలన్న తహతహ, రెండు - ఆ ఆరాటానికి తగినట్లుగా యంత్రాంగం లేకపోవటం. మన ఉద్యోగుల పని సంస్కృతి గురించి మనకు తెలుసు. వాళ్ళ గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో కూడా మనకి తెలుసు. లంచం తీసుకోకుండా ప్రభుత్వ సిబ్బంది చిత్తశుద్ధితో నిర్దిష్ట పని వేళల్లో పూర్తిగా పనిచేస్తారు - అని ప్రజలు విశ్వసిస్తున్నారా? పని చేస్తున్నవాడికి ప్రత్యేకమైన గుర్తింపునిస్తున్నామా? పని ఎగ్గొట్టేవాడిని దండిస్తున్నామా? ప్రమోషన్‌లు ఆపేస్తున్నామా?..."

ఇలా మాట్లాడుతున్నప్పుడు నా ఆవేశం నాకు తెలుస్తోంది. కొంతమంది ఇతర అధికారులు 'మీటింగ్ చివర్లో ఏమిటీ వితండవాదన' అని విసుక్కుంటున్నారని కూడా తెలుసు. కాని మనసులో అనేక సంవత్సరాలుగా పేరుకుపోయిన భావాల్ని ఆపుకోలేకపోతున్నాను.

"...మనకీ, మన ఉద్యోగులకీ పెరుగుతూ వచ్చిన నైపుణ్యం అంతా పనులుజరక్కుండా చేయడంలోనే. ఏ ఫైలు వచ్చినా, ఏ ప్రతిపాదన వచ్చినా అది ఎలా ఆచరణ సాధ్యంకాదో ముందు చెబుతాం. ఎన్నిరకాల రూల్సు అడ్డువస్తాయో రాసేస్తాం. నిజంగా ప్రతిపాదనని దాని స్వరూప స్వభావాలని బట్టీ, సామాజిక ప్రయోజనాన్ని బట్టీ విశ్లేషించి ఫైలుమీద రాస్తున్నామా? ఎల్.డి.సి. నుంచి అత్యున్నత స్థాయి అధికారి దాకా అంతా ఇలాగే వ్యవహరిస్తున్నాం... సర్, ఈ ప్రతికూలభావజాలంతోనే ఇంకో పథకం - విజన్ 2020 - అమలుచేయాలని మీరు కోరుకుంటున్నారా?... మనకి స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటివరకూ రాజకీయ నాయకులూ, అధికారులూ కలిసి కూర్చొని, ప్రజలకోసం, ప్రగతికోసం సామూహికంగా పనిచేసే సంస్కృతిని ఏ మేరకు అలవర్చుకోగలిగాం? ఎక్కడైనా, ఎప్పుడైనా ఈ రెండు వర్గాలూ కలవటం అంటూ జరిగితే, చాలావరకు వాళ్ళవాళ్ళ స్వలాభంకోసం తప్ప, నిజంగా ప్రజలకోసం కలసి పనిచేయటం ఎన్నిసార్లు జరిగివుంటుంది? అయినా అభివృద్ధి - ఎంతో కొంత - జరుగుతోంది. కానీ జరగాల్సినంత జరగటంలేదు. జరగాల్సిన పద్ధతిలో జరగటం లేదు. మరోమాటలో చెప్పాలంటే - జరగాల్సిన వాతావరణాన్ని మనం కల్పించటంలేదు సర్..."

మధ్యలో ఎవరో పక్కనుంచి నాకు అందిస్తున్నారు - "విజన్ 2020 గురించి మాట్లాడండి". నేను మొదలుపెట్టాక చెప్పదల్చుకున్నదంతా చెప్పేదాకా ఆగను. నా తత్వమే అది.

"...ఇటువంటి పని సంస్కృతితోనే మనం అమలు చేయదలిస్తే 2020 నాటికే కాదు, ఇంకో శతాబ్దం నాటికి కూడా మీరు ఆశిస్తున్న ప్రగతిని సాధించలేం సర్. మన ఆలోచనల్లో, పని సంస్కృతిలో మార్పురావాలి. ముఖ్యంగా, టీమ్‌వర్క్ – కలిసి పని చేసే సంస్కృతి, పాజిటివ్‌గా ఆలోచించే సంస్కృతి మనకీ, మన ఉద్యోగులకీ అలవడాలి. కాలం ఎంత విలువైనదో, ఫైళ్ళ నడకలో జాప్యం వల్ల సంభవించగల నష్టం ఎంత తీవ్రమైందో అందరికీ అర్థం కావాలి.... మన ఉద్యోగాల అంతిమ ప్రయోజనం ప్రజల అభివృద్ధి, సంక్షేమం అన్న భావనతో పనిచేసే అభ్యాసం కావాలి... ఇవన్నీ ఆలోచించకుండా, ఈ మార్పులు తీసుకురాకుండా ఎన్ని ప్రణాళికలు వేసినా మనం ముందుకు పోలేం సర్...."

కొంచెం ఆపి ముఖ్యమంత్రి మూడ్ ఎలావుందో చూశాను. ముఖ్యమంత్రి నేను చెబుతున్నది శ్రద్ధగా వింటున్నారు. ఆయన మొహంలో ఎక్కడా విసుగుదల, అసహనం కనుపించడం లేదు. నాకు మరింత ధైర్యం వచ్చింది. నేను ఆపడం చూసి, ఆయన ఒక ప్రశ్న వేశారు.

"మరి ఏం చేస్తే మన 'విజన్ 2020'ని సమర్థంగా అమలు చేయగలుగుతామని మీరనుకుంటున్నారు?"

"శిక్షణ సర్, శిక్షణ! మన లక్ష్యసాధనకి తగిన విధంగా గ్రామస్థాయి నుంచి ముఖ్యమంత్రి వరకూ మానవ వనరులన్నింటికీ మన ప్రణాళిక అమలుకి అవసరమైన శిక్షణ నివ్వడం ద్వారా మాత్రమే సాధించగలుగుతాం. టీం వర్క్ పని సంస్కృతి, విజన్ పట్ల అవగాహన, అంకితభావం వగైరా అంశాల్లో అందరి చేతా ఎప్పటికప్పుడు అభ్యాసం చేయిస్తూనే ఉండాలి. ఇంత విలువైన మానవ వనరుల శిక్షణని నిర్లక్ష్యం చేసి, మనం ఏ ప్రణాళికనీ అమలు చేయలేమని నా నిశ్చితాభిప్రాయం సర్..."

ఊపిరి పీల్చుకున్నాను.

ఆ హాలులో కాస్సేపు నిశ్శబ్దం. ఆ కాస్సేపట్లో నాలో తర్జన భర్జన, తప్పు చేశానా? అతిగా మాట్లాడేశానా? ఇంతమంది అధికారుల్లో ఎవరూ మాట్లాడని విషయం గురించి నేనొక్కణ్నే ఎందుకు మాట్లాడినట్లు? ముఖ్యమంత్రి ఎలా స్పందిస్తారు? 'ఇదంతా వృథా' అంటారేమో!... ఇలా సవాలక్ష సందేహాలు.

ముఖ్యమంత్రి నోరు విప్పారు. "ప్రసాద్ గారూ! మీరు చెప్పిన విషయాలన్నీ సమంజసంగానే కనుపిస్తున్నాయి. ఇదే విషయం ఒకటి రెండు సార్లు చీఫ్ సెక్రటరీ గారితో కూడా ప్రస్తావనకు వచ్చింది. నేను అనుకోవటం – మీ 'ఐటిఏ' మొదట్నుంచీ ఈ దిశగా సక్రమంగా పనిచేస్తూ వుండివుంటే, ఇప్పుడిలా ఆలోచించాల్సిన అవసరం వచ్చేదికాదు... ఇప్పటికైనా మీరే 'ఐటిఏ' కమీషనర్ కనుక మీరే ఈ బాధ్యతను తీసుకోండి. మీకు ఏమేం సదుపాయాలు కావాలన్నా నేను సమకూరుస్తాను. .... ఇంతకీ మీరు ఒక సమగ్ర ప్రణాళికని ఎన్ని రోజులలో తయారు చేసి ఇవ్వగలరు?"

"ఒక నెలరోజుల్లో సర్!"

"కాలం చాలా విలువైందని మీరే చెప్పారు గదా! 15 రోజుల్లో ఇవ్వలేరా?"

"సరే సర్. ప్రయత్నం చేస్తాను."

★ ★ ★

అలా మొదలైన ప్రణాళికతో 'ఐఏఏ' ని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణా సంస్థగా మార్చేశాం. సదుపాయాల విస్తరణ, మూడంచెల శిక్షణా వ్యవస్థని రూపొందించాం. ప్రతి ఉద్యోగానికి మ్యాన్యుయల్స్ తయారు చేయించి ఇచ్చాం. జిల్లా శిక్షణా కేంద్రాలు నెలకొల్పి ప్రతి ఉద్యోగి శిక్షణ పొంది తీరేలా కార్యక్రమం రూపొందించాం.

1999 ఎన్నికలలో మరోసారి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. అప్పటికి మా ఇన్‌స్టిట్యూట్‌లో చాలా సదుపాయాలు పెరిగాయి. శిక్షణ ఊపందుకుంది.

ఒకరోజు ముఖ్యమంత్రితో అన్నాను. "సర్, విధాన నిర్ణయాలు తీసుకునే మంత్రులక్కూడా శిక్షణ ఉండాలి కదా!" ముఖ్యమంత్రి వెంటనే సానుకూలంగా స్పందించారు. "అలాగే ఏర్పాటు చేయండి" అన్నారు.

మంత్రులకి ఎలాంటి అంశాలలో ఎలాంటి ప్రముఖ నిపుణుల చేత శిక్షణ నిప్పించాలీ - అని రెండు రోజులపాటు కసరత్తు చేశాను. ఢిల్లీలోనూ, ఇతర రాష్ట్రాలలోనూ విచారించాను. ఎవర్నడిగినా మంత్రుల కోసం శిక్షణ అనేది గతంలో ఎప్పుడూ వినలేదన్నారు. కేంద్రప్రభుత్వంలో అసలు అలాంటివేవీ జరగలేదన్నారు. అంటే - ఇది దేశంలోనే మొదటిది. ఇక నా బుద్ధికి తోచినట్లు మొత్తం శిక్షణని వివిధ విభాగాలుగా విభజించాను.

శాఖామంత్రిగా మంత్రి విధులేమిటి? ఇతర మంత్రులతో కలిసి సమన్వయంతో నిర్వహించాల్సిన పాత్ర ఏమిటి? మంత్రిగా రాష్ట్రంపట్ల ఎలాంటి బాధ్యత ఉంటుంది? శాసన సభ్యునిగా తన నియోజకవర్గం పట్ల ఎలాంటి బాధ్యత ఉంటుంది? తనకు అప్పగించిన జిల్లాకి మంత్రిగా ఎలాంటి పాత్ర ఉంటుంది?... శాసన సభలో నిర్వర్తించాల్సిన పాత్ర ఎలాంటిది? అందులోనూ ప్రభుత్వపరమైన పాత్రకీ, పార్టీ పరమైన పాత్రకీ వ్యత్యాసం ఏమిటి?... తన శాఖల మీద అవగాహన ఎలా పెంచుకోవాలి? వ్యక్తిగత సిబ్బందిని ఎలా ఎంచుకోవాలి? వాళ్ళమీద ఎంతవరకు ఆధారపడాలి? సమయపాలన ఎంత అవసరం? దాన్ని అభ్యసించడం ఎలా? విధాన నిర్ణయాల విషయంలో ఎలాంటి ఆలోచనా దృక్పథాన్ని అలవర్చుకోవాలి?... ఇలాంటి రెండు డజన్ల అంశాలతో ఒక టైమ్ టేబిల్‌ను రూపొందించాను. లోక్‌సభ సెక్రటరీ జనరల్ గోపాలన్‌ని, చీఫ్ విజిలెన్స్ కమీషనర్ ఎన్. విఠల్‌ని, ఐఐఎమ్ (అహ్మదాబాద్) నుంచి నిపుణుల బృందాన్ని, మాజీ సీనియర్ మంత్రుల్ని ఆహ్వానించి వాళ్ళ సహాయంతో ఈ శిక్షణా తరగతులు నిర్వహించాను.

పేషి నిర్వహణ, సమయపాలన అంశాలు నేను బోధించాను. ఆ క్లాసులు 3 రోజులపాటు నిర్విరామంగా మా ఇన్‌స్టిట్యూట్‌లో జరిగాయి.

ఆ శిక్షణలో భాగమే పత్రికలపట్ల, ఎలక్ట్రానిక్ మీడియాపట్ల మంత్రులకి అవగాహన కల్పించే కార్యక్రమం. బహుశా, 'ఈనాడు'లో రిపోర్టింగ్‌లో వివిధ హోదాల్లో వివిధ ప్రాంతాల్లో పాతికేళ్ళకు పైగా పనిచేసిన జర్నలిస్టు మిత్రుడు వల్లీశ్వర్ వంటి వాళ్ళ ద్వారా చాలా సందర్భాలలో రామోజీరావులో గల వృత్తి విలువల గురించి వినివుండటంవల్ల కావచ్చు - ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా రామోజీరావుగారిని ఎంచుకున్నాను. కార్యక్రమం అయితే పెట్టించాను కానీ, పెట్టాక ఒకళ్ళిద్దరు మంత్రులు నాతో అన్నారు. "రామోజీరావుగారు దొరుకుతారు కదా! అడగాల్సినవి చాలా ఉన్నాయి". నాలో ఆదుర్దా మొదలైంది. ఇదేమైనా రసాభాస అవుతుందా అన్న బెంగ వెంటాడింది.

ప్రశ్న - జవాబుల రూపంలో ఆయన చాలా విషయాల్ని మంత్రులకి వివరించారు. ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర గురించి అనేక ఉదాహరణలతో చెప్పారు. "... వార్త పవిత్రమైంది. వ్యాఖ్య స్వేచ్ఛగా చేయదగింది" అంటూ పత్రికలు ఎలా ఉంటాయో సుదీర్ఘంగా ఆ క్లాసులో చెప్పారు.

ముఖ్యమంత్రి అడిగారు. "మేం చేసే మంచిపనులకి పత్రికల్లో తగిన ప్రోత్సాహం రావాలి. అందువల్ల ఇంకా ఉత్సాహంగా పనిచేయగలుగుతాం..."

రామోజీరావు నవ్వారు. "మీరు చేసే పనులు మంచివే అయితే వాటికి ప్రచారం వచ్చే తీరుతుంది. అలాగని ప్రతిరోజూ 'వాటర్‌షెడ్ కార్యక్రమం గురించే రాయండి' అంటే సరికాదు. ఒకటి రెండుసార్లు ఆ కార్యక్రమం గురించి వివరంగా ఇస్తాం. ఆ తరువాత ఏదన్నా కొత్తకోణంలో చెప్పగలిగితే తప్ప పాత విషయాన్నే పదే పదే రాయటం సాధ్యపడదు. అలాచేస్తే పాఠకుడికి విసుగొస్తుంది. పఠనాసక్తి తగ్గిపోతుంది. మాకు అంతిమంగా మా పాఠకుడి స్పందన ముఖ్యం..."

ముఖ్యమంత్రి మళ్ళీ అడిగారు. "మేం చేసే మంచి పనులకి రావలసినంత ప్రచారం రావటంలేదు. చెడుని మాత్రమే ఎక్కువగా చూపిస్తూ రాస్తున్నారు అన్నది మా అభిప్రాయం. మంచిని ప్రమోట్ చేయటానికి మీరేం చేయగలరు?"

రామోజీరావు ఓపిగ్గా జవాబిచ్చారు. "ఈ విషయంలో నేను మీతో ఏకీభవించలేను. మీరు మంచి అనుకునేది ఎంత మంచో మాకూ అనిపించాలి. మీరు నిజంగా మంచి చేస్తే, దాన్ని వెతుక్కుంటూ మేమే వస్తాం. ఉదాహరణకి, నేను 1970 దశకం ద్వితీయార్థంలో అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు ఇక్కడ దివి తాలూకాలో వచ్చిన పెను ఉప్పెన గురించి రాస్తూ 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక అప్పుడు ఇక్కడున్న ముఖ్యమంత్రి ఎంతచురుగ్గా చొరవగా వ్యవహరించారో పెద్ద వ్యాసం రాసింది. 'న్యూయార్క్ టైమ్స్'ని ఎవరు మేనేజ్ చేశారని అంతలా రాశారు!... వార్తలు

మీరు ఆశించినట్లు 'మంచి'గా కనుపించాలంటే మీరు పాటించాల్సింది పారదర్శకత. ఎంత పారదర్శకంగా మీరు పనిచేస్తే అంత 'మంచి'గా వార్తలు వస్తాయి. మరోరకంగా ఎవరూ రాయలేరు. పరిపాలనలో పారదర్శకత లోపించినప్పుడే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి..."

ఈ దశలో మాధవరెడ్డి ప్రశ్న వేశారు. "మీ విలేకరులకి శిక్షణ ఇవ్వాలి సర్. చాలా బాధలు పడ్తున్నాం" అంటూ జిల్లాల్లో విలేకరులతో వస్తున్న సమస్యల్ని ఎత్తి చూపారు.

ఇది చాలా క్లిష్టమైన ప్రశ్న. అందరు మంత్రులూ చెవులు రిక్కించి వింటున్నారు ఆయనేం చెబుతారో అని.

రామోజీరావు జవాబు చాలా సూటిగా, నిశితంగా వచ్చింది.

"మీరు ఏ శిక్షణ తీసుకుని మంత్రులుగా పనిచేస్తున్నారు? మొదటిసారిగా ఇప్పుడేగదా ఈ ప్రయత్నం చేస్తున్నారు! మేం కూడా మా విలేకరులకి ప్రాథమిక శిక్షణనిచ్చి పంపిస్తే అనుభవంమీద వాళ్ళూ నేర్చుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఒక్కో విలేకరికి ఒక్కో బీట్ (శాఖ) ఇస్తాం. వాళ్ళని 2-3 ఏళ్ళకొకసారి మారుస్తుంటాం. ఉదాహరణకి ఒక విలేకరిని మోహనరెడ్డిగారి శాఖ నుంచి విజయరామారావుగారి శాఖకి మారుస్తాం. అలా మార్చకపోతే వాళ్ళు మీ దెబ్బకి తట్టుకోలేక ఏమైపోతుంటారో తెలుసు. జిల్లాల్లోనూ శిక్షణనిచ్చే పంపిస్తున్నాం. దురదృష్టవశాత్తూ రాజకీయ నాయకులు (తమకి అనుకూలంగా ప్రభావితం చేయటం కోసం) దొడ్డిదారుల్లో మావాళ్ళని బుట్టలో వేసుకుంటుంటే అదుపు చేయలేకపోతున్నాం... అయినా, తెలిసి తప్పు చేసే వాళ్ళని ఉపేక్షించటం లేదు..."

అంతే! ఒకళ్ళ మొహాలొకళ్ళు చూసుకుంటూ, మంత్రులంతా ఒక్కసారి నిశ్శబ్దమైపోయారు. వేడివేడి వాగ్యుద్ధాలు లేకుండా సమావేశం ముగిసింది.

"హమ్మయ్య" అంటూ ఊపిరి పీల్చుకున్నాను.

★ ★ ★

బ్రిటిష్ ప్రధానితో చంద్రబాబు

"మంత్రి మండలి సమావేశంలోకి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.వి.ఆర్.కె.ప్రసాద్‌ని ఎలా అనుమతించారు?... ఈ విషయం ఇప్పుడు అధికార వర్గాలలో తీవ్ర చర్చనీయాంశమైంది... ఇలాంటి సంప్రదాయాన్ని తానెప్పుడూ చూడలేదని ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి వ్యాఖ్యానించడం గమనార్హం..."

ఇలాంటి వ్యాఖ్యలతో ఒక ప్రముఖ దినపత్రికలో వార్త వచ్చింది.

నా పేరు పత్రికలలో రావటం కొత్తకాదు. కాని ఇలా రావటం అరుదు. ఇది ఎవరు పత్రికలకి ఎలా చెబితే పత్రికవాళ్ళు ఇలా రాశారో ఊహించగలను. సమాచారశాఖ కమీషనర్‌గా రాష్ట్రంలోనూ, ప్రధానికి మీడియా సలహాదారుగా కేంద్రంలోనూ పనిచేసిన నా గతం నాకు మిగిల్చిన కొద్దిపాటి జ్ఞానంలో ఈ పరిజ్ఞానం కూడా ఒకటి.

కొంతమంది మనుషుల్లో పైకి ఎదుగుతున్న కొద్దీ అసూయ, ఈర్ష్య, ద్వేషం, అహం తగ్గటానికి బదులు పెరిగిపోతుంటాయి. ఈ అవలక్షణాలకి కొందరు ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు కూడా లోకువే.

మంత్రిమండలి సమావేశంలో నేను కూర్చోవటం గురించి ఇంకెక్కడా ఎవరూ ఏ వ్యాఖ్యా చేయకపోయినా, పత్రికలో వచ్చిన వార్త చదివిన వాళ్ళకి మాత్రం 'జరగకూడనిదేదో జరిగిపోయింది' అన్న భావం కలుగుతుంది. కొంతమంది మిత్రులు, మంత్రులు నాకు టెలిఫోన్ చేసి ఆ వార్తపట్ల విస్మయం, విచారం వ్యక్తంచేశారు.

ఎటొచ్చీ ఈ విషయాన్ని మంత్రిమండలి అధ్యక్షుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎలా తీసుకుంటారో?

* * *

ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేస్తున్నప్పుడు ఒకసారి విమానంలో నాకు అకస్మాత్తుగా కలిగిన అస్వస్థత కారణంగా నాకుగా నేనే ముఖ్యమంత్రిని, ప్రధాన కార్యదర్శిని కలిసి, నన్ను కొంత విశ్రాంతిగా పనిచేసే పోస్టులో వేయించమని అడిగాను.

'అతి విశ్రాంతి' పోస్టుని వాళ్ళు గుర్తించి అందులో వేశారు. అది – 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్'కి కమీషనర్ పోస్టు. హైదరాబాద్ నగరంలో ఒక మూలగా జూబ్లీహిల్స్ రోడ్డు నెం. 25 లో ఒక లోయ అంచున విసిరేసినట్లు వుండే 'ఐఓఏ'కి పోస్టు చేయటమంటే, అక్కడ

కావల్సినంత విశ్రాంతిగా పనిచేసుకుని, అట్నుంచి అలే రిటైరయి ఇంటికెళ్ళి, శాశ్వతంగా విశ్రాంతి తీసుకోమని అర్థం - అంటూ నా సహచరులు కొందరు వ్యాఖ్యానించారు. "ఇదేంటి ఇలాంటి పోస్టు ఎంచుకున్నావ్? ఏదైనా కాస్త మంచి పోస్టు అడగొచ్చుకదా" అని జె.రాంబాబువంటి నా సహ ఐఏఎస్ అధికారులు (శ్రేయోభిలాషులు) సలహాలిచ్చారు. 'ఐఓఏ'కి వెళ్ళాక మొదటి నెలరోజుల్లోనే అర్థమయిపోయింది - రిటైరయి, ఇంటికెళ్ళాక కూడా జీవితం ఇలాగే ఉంటుంది అని!

ప్రభుత్వంలో ఉద్యోగంలో చేరే అన్ని స్థాయిల (ఐపిఎస్‌లూ, నాల్గవ తరగతి ఉద్యోగులూ మినహా) ప్రభుత్వోద్యోగులకూ ఉద్యోగంలో చేరిన వెంటనే ఇక్కడ శిక్షణ నివ్వాలి. ప్రభుత్వ ఉద్యోగం అంటే ఏమిటి? బాధ్యత లేమిటి? జవాబు దారీతనం ఎలా ఉండాలి? నియమ నిబంధనలెలా ఉంటాయి? ఫైళ్ళు ఎలా రాయాలి?...వగైరా అనేక అంశాలు.

కాని... నేను చేరాక చూశాను. అక్కడ ఈ ప్రాథమిక శిక్షణా తరగతులన్నీ 10-15 ఏళ్ళు సర్వీసు గడిపేసిన ఉద్యోగుల కోసం నడుపుతున్నారు? అతి కొద్దిమంది మాత్రమే సర్వీసు ఆరంభంలో పొందగలుగుతున్నారు. ఏడాదికి 100-200 మంది వస్తారు జట్లు జట్లుగా. 15 లక్షలమంది ఉద్యోగులకి శిక్షణ ఎప్పుడు పూర్తయ్యేను? 10-15 ఏళ్ళు సర్వీసున్న వాడికి ప్రాథమిక శిక్షణ కావాలా? వాళ్ళు కూడా జిల్లాలనుంచి వస్తారు కదా! రెండు మూడు వారాలపాటు 'జాలీట్రిప్' లాగా గడిపేసి వెళ్తుంటారు. ఎంత నిధులు వృథా? వాళ్ళకీ, శిక్షకులకీ ఎంత సమయం వృథా? ఇంత ఖర్చు పెట్టినా వాళ్ళు నేర్చుకునే కొత్త విషయం...? ... ఇలాంటి కార్యక్రమానికి నేను కమీషనర్‌నా? నాకు నెలకి 30వేలు జీతమా? ఒక ఎసి కారు, పిఏ లు, అటెండర్లూ కూడానా?

నా మనసులో ఎక్కడో ఒక అపరాధ భావన మొదలైంది. రోజులు గడుస్తున్న కొద్దీ అది నా మనసుని తొలిచేస్తోంది.

దీనికితోడు, అప్పటికే 'ఐఓఏ'లో జాయింట్ కమీషనర్‌గా పనిచేస్తున్న శ్రీమతి ఊర్మిళా సుబ్బారావు నాకు స్వాగత వచనాలు పలుకుతూనే, "ఇక్కడ హాస్టల్ డైనింగ్ హాల్లోకి వర్షం కారిపోతోంది సర్. దీని మరమ్మత్తుకు రూ.5లక్షలు అడుగుతుంటే నాలుగేళ్ళుగా ఫైళ్ళు తిప్పిస్తున్నారు కానీ నిధులు మంజూరవటం లేదు. ఇక్కడ నాకే పని అంతంతమాత్రంగా వుంది సర్. మీరొచ్చి..!" నిజాయితీ, అంకితభావం, పట్టుదల కల అధికారిణిగా ఆమెకు మంచి పేరుంది. (ఈమె భర్త దువ్వూరి సుబ్బారావు ఇప్పుడు రిజర్వుబ్యాంకు గవర్నర్) జాయింట్ కమీషనర్‌గా ఆమెకే పనిలేదంటే, కమీషనర్‌గా నేనేం చేయాలి?...

ఒక రెండుమాసాలు గడిచాక, 'విజన్ 2020' విధానపత్రం గురించి ముఖ్యమంత్రి ఒక సమావేశం నిర్వహించారు. 2020నాటికి రాష్ట్రం ఏం సాధించాలో ఆలోచించే బృహత్ ప్రణాళికకి అది నాంది. ఉన్నతాధికారులు అందరూ మాట్లాడేశాక, చివరగా ముఖ్యమంత్రి నా సూచనలు

అడిగారు. అప్పటిదాకా నా మనసులో పేరుకున్న అపరాధ భావనల మథనంలోంచి వచ్చిన అభిప్రాయం చెప్పాను. "ఈ విజన్ 2020 అమలు చేయడానికి తగినట్లుగా మనం మానవ వనరుల్ని అభివృద్ధి చేసుకోకపోతే, దీన్ని అమలు చేయటం సాధ్యపడే విషయం కాదు సర్..." ముఖ్యమంత్రి వెంటనే స్పందించారు. "ఆ పనేదో మీ ఇన్స్టిట్యూట్ ద్వారా మీరే ఎందుకు చేయకూడదు?"

అంతే! ఒక ప్రణాళిక తయారు చేసి, ఆయన ముందు పెట్టాను. దాని ప్రకారం....

★ ★ ★

ఒక సమగ్ర మానవ వనరుల తయారీ సంస్థని ఏర్పాటు చేద్దాం. ఈ సంస్థకోసం ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఒక మానవ వనరుల అభివృద్ధి శాఖని ఏర్పాటుచేద్దాం. ఈ శాఖ సెక్రటరీయే ఆ సంస్థకి డైరక్టర్ జనరల్గా కూడా ఉండాలి.

ఈ సంస్థ ఎంత విస్తృతమైన మానవ వనరుల అభివృద్ధిని చేపడుతుందంటే - మంత్రుల దగ్గర్నుంచి క్రిందిస్థాయి గజిటెడ్ అధికార్లదాకా (సెక్రటరీలు సహా) అందరికీ మూడంచెలుగా శిక్షణ ఇస్తుంది. విధాన నిర్ణయాలు తీసుకునే మంత్రులు, కార్యదర్శులకి ఒక శిక్షణ, పాలనా విభాగంలో కీలక స్థానాల్లో ఉండే అధికారులకు ఒక శిక్షణ, వివిధ ప్రభుత్వ రంగసంస్థల ఛైర్మన్లు, ఛీఫ్ ఎగ్జిక్యూటివ్లు, శాసనసభ్యులు ఇతర స్థాయి అధికారులకు ఒక శిక్షణ - ఇలా మూడంచెలలోనూ ప్రభుత్వం విధాన నిర్ణయాలు తీసుకోవటం దగ్గర్నుంచి వీటిని అమలు చేసే స్థాయివరకూ ఎవరిపాత్ర ఎలాంటిది? ఏ మేరకు ఎలా ఉంటుంది? - స్పష్టంగా నిర్దేశించే శిక్షణనిస్తాం.

ఎన్జిఓ లందరికీ జిల్లా స్థాయిలో శిక్షణా కేంద్రాల్ని ఏర్పాటు చేసి అక్కడ శిక్షణనిస్తాం. అసలు శిక్షణ ఏం ఇవ్వాలి? ఎలా ఇవ్వాలి? ... వగైరా ప్రశ్నలకు సమాధానంగా - రాష్ట్రంలో ప్రతిశాఖలోని ప్రతిపోస్టుకీ ఉండే విధులు, ఫైళ్ళ నిర్వహణ, పని సంస్కృతి మీద సీనియర్ ఉద్యోగులు, అధికారుల చేత వివిధ శాఖల మధ్య సమన్వయం ద్వారా మాన్యువల్స్ని -అంటే, మౌలిక విధుల సమాచార గ్రంథాల్ని తయారుచేయిస్తాం. ఇలాంటి మాన్యువల్స్ అప్పటివరకూ మన రాష్ట్రంలో సెక్రటేరియేట్లో కూడా లేవు.

ప్రతి ఉద్యోగికీ అతని పోస్టుకి సంబంధించిన మాన్యువల్ ఒకటి ఇస్తాం. అతను తనకి సంబంధించిన శిక్షణ పొందే దాకా తన విధులేమిటో తెలియని అజ్ఞానంలో వుండకుండా ఈ మాన్యువల్ మార్గదర్శనం చేస్తుంది.

ప్రతి జిల్లాలో శిక్షణా కేంద్రాల్ని పెట్టినా ప్రతి శాఖలోని ప్రతిస్థాయి వారికీ శిక్షణనిచ్చేటంత మంది శిక్షకులు దొరకరు కనుక అన్ని శాఖల్లోని అన్ని స్థాయిల ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాల్ని హైదరాబాద్లోనే నిపుణుల సహాయంతో వీడియో చేయించి, డివిడిల ద్వారా జిల్లా శిక్షణాకేంద్రాలకు పంపిస్తాం.

అంటే, హైదరాబాద్‌లోని మానవ వనరుల కేంద్రం ఇటుపై మూడంచెల కార్యకలాపాల్ని సాగిస్తుంది. అత్యున్నత స్థాయి విధాన నిర్ణయాల రూపకల్పనాకేంద్రంగా, మంత్రులు-సెక్రటరీల స్థాయివారికి విధానాల అమలుపై మేధామథన కేంద్రంగా పనిచేస్తుంది. అన్ని ప్రభుత్వ విధానాలపైనా, పోస్టులు - విధులు - పని సంస్కృతి వంటి అంశాలపైనా ప్రచురణలు చేస్తుంది. శిక్షణా కార్యక్రమాలు రూపొందించి డివిడిలుగా జిల్లాలకు పంపిస్తుంది.

... ఇలా ఒక బృహత్ మానవ వనరుల సంస్థను రూపొందించటంవల్ల, శిక్షణా కార్యక్రమాల్ని వికేంద్రీకరించటంవల్ల - భవిష్యత్‌లో శిక్షణ అనేది ఉద్యోగుల సర్వీసులో తొలి రోజునే ప్రారంభమవుతుంది. మంత్రులకు, కార్యదర్శులకు మధ్య సమన్వయంతో కూడిన మేధామథన చర్చల ఫలితంగా ఆచరణయోగ్యమైన విధానాల రూపకల్పన, లేదా విధానాలలో, చట్టాలలో మార్పులు సాధ్యపడతాయి. అంటే, ప్రభుత్వంలోని అన్ని స్థాయిల మానవ వనరుల శక్తికీ ఇక్కడ సాన పెట్టగలుగుతాం, నిర్మాణాత్మకంగా రాష్ట్ర అభివృద్ధిలో పాల్గొనేలా వాళ్ళని ఉత్తేజితుల్ని చేయగలుగుతాం... దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి వ్యవస్థ లేదు. మనమే మొదటి వాళ్ళమవుతాం...

★ ★ ★

ఈ ప్రణాళిక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారికి నచ్చింది. ఎంత నచ్చిందంటే - నేను ప్రతిపాదించిన వెంటనే ప్రత్యేక మంత్రిమండలి సమావేశంలో దీన్ని ఆమోదింపజేశారు 'డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ' పేరుతో పనిచేసే ఈ సంస్థలో అధునాతన సమావేశమందిరాలు, శిక్షణాలయాలు, 100 గదుల అధునాతన హాస్టలు సదుపాయం, అంతర్జాతీయ ప్రముఖులు వచ్చినా బస చేయదగిన అతిథి భవనాలు వగైరాల నిర్మాణాల కోసం నేనిచ్చిన రూ. 20 కోట్ల ప్రతిపాదనని ఒక్కసారిగా ఆమోదించేశారు.

ఈ సంస్థకి ఒక స్వతంత్ర ప్రతిపత్తిని కల్పిస్తూ 18 మందితో పాలకవర్గాన్ని నియమించారు. ఆ పాలక వర్గానికి ముఖ్యమంత్రే అధ్యక్షులు. ఈ పాలక వర్గంలో జాతీయ పరిపాలనా శిక్షణ సంస్థ, సర్దార్‌వల్లభాయ్ పటేల్ పోలీస్ అకాడమీల డైరక్టర్లు సభ్యులు. ఇద్దరు అంతర్జాతీయ మానవ వనరుల నిపుణులు కూడా సభ్యులు. దీని సర్వసభ్య సంఘంలో అందరు మంత్రులూ, అందరు సెక్రటరీలూ, అన్ని శాఖల అధిపతులూ, అన్ని జిల్లా శిక్షణాకేంద్రాల కమీషనర్లూ సభ్యులుగా ఉంటారు.

నేనిచ్చిన ప్రణాళిక అమలు చేయడానికి బాగా సహాయపడినవారు - మా పాలకమండలిలో సభ్యులైన ఆర్థిక శాఖామంత్రి యనమల రామకృష్ణుడు, రెవెన్యూశాఖామంత్రి (తర్వాత హోంశాఖామంత్రి) దేవేందర్‌గౌడ్, నీటి వనరుల శాఖామంత్రి శ్రీహరి, భవనాల శాఖామంత్రి విజయరామారావు, పరిశ్రమల శాఖామంత్రి విద్యాధరరావు. వీరంతా మా పాలకమండలి

వ్యవహారాలు చూడటానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన కమిటీ సభ్యులు. ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి హోదాలో కొంతకాలం అరోరా, ఆ తర్వాత దువ్వూరి సుబ్బారావు కూడా ఈ కమిటీలో సభ్యులు. ఏ నిర్ణయమైనా తీసుకోవడానికి ఈ కమిటీకి అధికారాలు ఉన్నాయి.

రాష్ట్రంలోని అన్ని శాఖలలో దాదాపు 15 లక్షలమంది ఉద్యోగస్థులున్నారు. ఇందులో 99శాతం అదివరకు అసలు శిక్షణ పొందటమనేదే జరగలేదు. దానికి తోడు, కొత్త కొత్త చట్టాలు, ఉత్తర్వులు. పని చేసేవారిలో చాలా కొద్దిమందికే నిబంధనలు తెలుసు... వారు వారిశాఖకూ, ప్రజలకు వాడేకన్నా, స్వప్రయోజనాలకు ఆ జ్ఞానాన్ని వినియోగించడం ఒక ఆనవాయితీ... కొన్ని సందర్భాలలో, కొన్ని కొన్ని ఆఫీసుల్లో ఆ ఉద్యోగస్థుడు ఒక్కడే పని తెలిసినవాడు కనుక, వాడు ఎంత దగుల్బాజీ, లంచగొండి అని తెలిసినా, ఆ సీటునుండి మార్చలేని పరిస్థితి! 15 లక్షల మందికి కాలయాపన లేకుండా శిక్షణ ఇవ్వడం తేలికకాదు. అందుకే ప్రతిశాఖలో ప్రతి ఉద్యోగం గురించి అన్ని విషయాలు అవగాహన కలిగేటట్లు మాన్యువల్స్ తయారు చేసే కార్యక్రమం – ఆయా శాఖల సహకారంతోనే మా సంస్థ చేయించే కార్యక్రమం – మొదలుపెట్టాం.

ఈ కార్యక్రమం మొత్తాన్ని ఒక్క సంవత్సరంలో ఒక మహాయజ్ఞంలా చేయగలిగాం. దేశం మొత్తంలో ఇటువంటి ప్రయోగం జరగడం ఇదే మొదటిసారి. జిల్లా స్థాయిలో DVD ల ద్వారా శిక్షణ ఇప్పించే ఇంకో పెద్దకార్యక్రమం... ప్రతిజిల్లా స్థాయిలో, మండల స్థాయిలో TVలు ఇచ్చి, ప్రసారం అందుకునే సాధనాలు ఇచ్చి – మా సంస్థలో జరిగిన, జరుగుతున్న కార్యక్రమాలు ప్రసారం చేయడం ద్వారా అన్ని జిల్లా కేంద్రాలలో, మండల కేంద్రాలలో శిక్షణ పొందే అవకాశాన్ని కల్పించాం. ఇందుకోసం నా అధ్యక్షతలోనే 'మన టివి'ని ఏర్పాటు చేసి, దాని ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ ఇచ్చే ప్రక్రియకు నాంది పలికాం.

ఇదంతా ఒక ఎత్తు. రాష్ట్రంలో 10,000 మందిని – ముఖ్యమంత్రి నుంచి M.R.O వరకు ఎంపిక చేసి వారికి ప్రభుత్వ విధానాలలో, ఆలోచనా పద్ధతులలో, మార్పు తేవడానికి పనిచేయగలిగే change agents గా తర్ఫీదు ఇవ్వడం ఇంకొక పెద్ద కార్యక్రమం. అధికారులు, అనధికారులు ప్రజానాయకులు కలిసి సమన్వయంతో పనిచేయాలంటే ఉండే అడ్డంకులు, వాటిని అధిగమించి పనిచేసే విధానాలు నేర్పే శిక్షణకు ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది. ప్రభుత్వ నిబంధనలను సరళీకృతం చేయడం, ప్రభుత్వ అధికారులలో జవాబుదారీ తనాన్ని తేవడం. లంచగొండితనాన్ని నిర్మూలించడం, ప్రభుత్వానికి ప్రజలకూ, ఉద్యోగస్తులకూ మధ్య న్యాయ స్థానాలలో జరిగే లిటిగేషన్లను తగ్గించటం వంటి ప్రక్రియలకు నాంది పలికాం.

పైన చెప్పినవి చదవడానికి, వినడానికి చాలా తేలికయినా, అమలు పరచడం దుస్సాధ్యమని చాలా త్వరగా నాకు తెలిసిపోయింది. మొదటిసారి మంత్రివర్గ మండలి సభ్యులకు శిక్షణ కార్యక్రమం చేస్తున్నప్పుడు, ప్రభుత్వంలోని లోటుపాట్లకు, ఆలస్యానికి, అవగాహనారాహిత్యానికి, ప్రజలలో ప్రభుత్వంపై అసంతృప్తికి మూలకారణం ప్రభుత్వ అధికారులేనని వారు వాదించారు. అదే

విధంగా రాష్ట్రప్రభుత్వ కార్యదర్శుల, శాఖాధికారుల కోసం చేస్తున్న కార్యక్రమంలో... ప్రస్తుత పరిస్థితికి కారణం రాజకీయ నాయకులు, వారి దూరదృష్టిలోపం, కొంత లంచగొండితనం, స్వలాభాపేక్షలేనని వారు అభిప్రాయపడ్డారు.

ఇలా మూడు నెలలు విడివిడిగా కార్యక్రమాలు జరిగాక మంత్రులను, అధికారులను కలిపి సమావేశాలకు పిలిచాం. మొదట్లో కొంచెం వాగ్వివాదాలు జరిగినా... రెండు మూడు కార్యక్రమాల తర్వాత ఇద్దరూ కలిసి, ప్రభుత్వ నిబంధనలను, తమ క్రింద పనిచేసే యంత్రాంగాన్ని ఈ పరిస్థితికి కారణంగా పేర్కొన్నారు... మేం వారి దృష్టికి తెచ్చిన విషయం - "నిబంధనలు మార్చే అధికారం. క్రిందవారిచే పని చేయించాల్సిన బాధ్యత మంత్రులు, కార్యదర్శులు, శాఖాధికారులదే కాని ఇంకెవరి మీదా తోయడానికి అవకాశం లేదు."

ఈ విషయం వారికి త్వరగానే అర్థమయ్యింది. దాంతో అంతర్మథనం, పరిశీలన, పర్యావలోకనం... ఏం కావాలి? ఎలా చెయ్యాలి? ఎందుకు కావడం లేదు? లోపం ఎక్కడ? ఏ నిబంధనలు ఎలామార్చాలి? మార్చాక ఎలా అమలులోకి తేవాలి? ఆలస్యం కాకుండా ఎలా పనిచేయాలి? మంత్రులు చేయాల్సిందేమిటి? అధికారులు చేయాల్సిందేమిటి? ప్రభుత్వంలో చేస్తున్న పనిలో వృథాపని ఎంత?... ఇలాంటి విషయాలు చర్చకు రావడం పెద్ద ఎత్తున మొదలయింది.

విధాన నిర్ణయం తీసుకోవడానికి బాధ్యులైన వారందరూ ఇక్కడ కలిసి కూర్చుంటున్నారు కనుక, ఇక్కడే కలిసి పరిష్కారాలను కూడా చర్చిస్తే బాగుంటుందన్న ఏకాభిప్రాయానికి రావడం జరిగింది. దానికి మా సంస్థ తగిన ఏర్పాట్లు చేయాలనే నిర్ణయం జరిగింది.

అన్ని రంగాలలో నిష్ణాతులైన నిపుణులు అందరినీ మాతో ఉంచుకోవడం అసాధ్యం. కనుక... అవసరమైనప్పుడు కావల్సిన నిపుణులను అంతర్జాతీయ స్థాయివారిని పిలిపించుకోగలిగిన స్థితికి సంస్థ ఎదగాలి. ఇందుకు ఆర్థిక వనరులే కాక, చాలా ప్రయత్నం, ప్రయాస అవసరం. ఇలాంటి ప్రయత్నాన్ని ఒక 'సుపరిపాలనా సంస్థ' ద్వారా మాత్రమే అమలు చేయగలుగుతాం అనుకున్నాను. కాని దానికి నిధులెవరిస్తారు?

రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, విశేష ప్రయత్నం చేసి బ్రిటిష్ ప్రభుత్వానికి ఒక పథకం తయారు చేసి ఇస్తే, DFID (అంతర్జాతీయ అభివృద్ధి శాఖ) ద్వారా వారు రూ. 50 కోట్లను 'సుపరిపాలనా సంస్థ' (Centre for Good Governance) ఏర్పాటుకు మంజూరు చేశారు. దేశంలో ఇదే మొదటి సుపరిపాలనా సంస్థ. ముఖ్యమంత్రి తీసుకున్న శ్రద్ధ, చూపించిన ఆసక్తి ఈ మానవవనరుల సంస్థ ప్రతిష్ఠని అంతర్జాతీయంగా ఎంత పెంచాయంటే, 'సుపరిపాలనా కేంద్రం' మా మానవవనరుల అభివృద్ధి సంస్థకి అనుబంధంగానే ఉండాలని DFID షరతు పెట్టింది.

ఈ రెండు సంస్థలూ కలిసి పనిచేసే సానుకూలత ఉండటానికి వీలుగా, నన్నే రెండిటికి Director General గా ముఖ్యమంత్రి నియమించారు.

ప్రభుత్వంలో ఏ శాఖలోనైనా, ఏ ఇబ్బందికైనా, ఏ క్లిష్ట సమస్యకైనా పరిష్కారం కావాలంటే సుపరిపాలనా సంస్థకు తెలుపడం, వారు నిపుణుల ద్వారా విషయ పరిశీలనచేసి, పరిష్కార మార్గాలు సూచించడం, వాటిని మానవ వనరుల సంస్థలో మంత్రివర్గ సభ్యులు సంబంధిత అధికారులతో చర్చించి, నిర్ణయం తీసుకొనేలా చేయడం జరిగింది.

2002 జూన్‌లో బ్రిటీషు ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ తన భార్యతో కలిసి హైదరాబాద్ వస్తున్నప్పుడు ఆయనకీ, ఆయనతో వస్తున్న సిబ్బంది మొత్తానికి బస కల్పించిన విశిష్టత ఈ మానవ వనరుల సంస్థకి దక్కింది. అక్కడి సదుపాయాల్ని చూసి బ్రిటీషు ప్రభుత్వ సిబ్బంది సయితం విస్తుపోయారు. హెలికాప్టర్‌లు దిగటానికి హెలిపాడ్‌ని కూడా మా సంస్థలో ఏర్పాటు చేయడం వాళ్ళకి ఆనందం కలిగించింది...

సుపరిపాలనా కేంద్రాన్ని బ్రిటీషు ప్రధానమంత్రి స్వయంగా ప్రారంభించారు. 'సుపరిపాలనా కేంద్ర' సిద్ధాంతాన్ని ప్రశంసిస్తూ టోనీ బ్లెయిర్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని అభినందనలలో ముంచెత్తారు. "ప్రజాస్వామ్యంలో దేశం అభివృద్ధి చెందాలంటే ఇదొక వివేకవంతమైన ముందడుగు" అన్నారు.

'సుపరిపాలనా సంస్థ' మంజూరై, పని మొదలయిన కొన్ని రోజులకు నాకు పదవీ విరమణ వయసు (60 సంవత్సరాలు) వచ్చేసింది. నా విషయంలో నిబంధనలన్నీ త్రోసిపుచ్చి, మొదట రెండేళ్ళు, తర్వాత మరో రెండేళ్ళు నా పదవీకాలాన్ని ముఖ్యమంత్రి పొడిగించారు. (నా 40 ఏళ్ళ అధికార జీవితంలో 6 సంవత్సరాలు ఒకే ఉద్యోగంలో పని చేయడం ఈ సంస్థలలోనే).

ప్రపంచ బాంకునుంచిగాని ఏ ఇతర ప్రభుత్వాల నుంచి గాని ఏ బృందాలు రాష్ట్రానికి వచ్చినా, ఈ సంస్థలను దర్శించి, చర్చిస్తే కాని వారి పర్యటన పూర్తికాదనే భావన అందరిలో ఏర్పడింది.

ముఖ్యమంత్రి ఆకాంక్షమేరకు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీని ఉపయోగించి, ప్రతి జి.ఓ. వెబ్‌సైట్‌లో AP online ద్వారా ప్రజలకు తెలిసేటట్లు, ఇంటర్నెట్ ద్వారా ఎప్పటికప్పుడు అతి మారుమూల గ్రామంలో నిర్దిష్టమైన ఏ అంశంలోనైనా అభివృద్ధి ఎలావుంది – అని సెక్రటేరియేట్ నుంచే తెలుసుకుని, తగిన ఆదేశాలు ఇచ్చేటట్లు అన్ని శాఖలలోనూ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీని ప్రవేశపెట్టడం జరిగింది.

ప్రభుత్వ పని తీరుపట్ల, ప్రజలేమనుకొంటున్నారు? నిత్యావసరాల పరిస్థితి ఏమిటి? ముఖ్యమంత్రి, మంత్రుల నుండి అధికారులు, శాసన సభ్యుల దాకా, ఎవరు ఎలా పనిచేస్తున్నారు?

ప్రజలలో ఆ విషయాలపై తృప్తి వుందా లేదా- అనే సర్వే ప్రతి నెలా రాష్ట్రమంతటా చేయించటం - తర్వాత విశ్లేషించి తగుచర్యలు తీసుకోవడం కూడా మా సంస్థ మొదలు పెట్టింది.

★ ★ ★

అలా రెండు సంస్థలకి డైరెక్టర్ జనరల్‌గా వున్న నాకు ఒక మంత్రివర్గ సమావేశానికి ఆహ్వానం వచ్చింది. నేను ఆ సమావేశానికి హాజరైనప్పుడు ఒక పత్రికలో నా హాజరుని ప్రశ్నిస్తూ వార్త వచ్చింది. (అప్పటికి నేను రిటైరయి, సర్వీసు పొడిగించబడివున్నాను.)

నేను ఈ వార్త చదివి "ఇది ముఖ్యమంత్రిగారికి ఒకసారి చూపించండి" అని పంపించాను.

ఆయనకేదైనా ఇరకాటం ఉందనుకుంటే ముందు ముందు అలాంటి సమావేశాలకు వెళ్ళనక్కర్లేరు కదా అన్నది నా ఆలోచన.

మర్నాడు నాకు జవాబు వచ్చేసింది. "ముఖ్యమంత్రిగారు అప్పటికే ఆ వార్త చదివారుట. పట్టించుకోనక్కర్లేదని చెప్పారు..."?!

అంతేకాదు, ప్రతి మంత్రివర్గసమావేశానికి హాజరు కావాల్సిన ఉన్నతాధికారుల జాబితాలో నన్ను కూడా చేరుస్తూ ముఖ్యమంత్రి ఒక జి.ఓ. జారీ చేయించారు.

నేను ఆ పోస్టులో 2004 ఆగస్టు వరకూ కొనసాగాను.

★ ★ ★

చంద్రబాబు - హాంగ్‌కాంగ్ - అవినీతి

చంద్రబాబునాయుడు సారథ్యంలో మంత్రివర్గం సమావేశమై ఒక విప్లవాత్మకమైన 'అవినీతి నిరోధక ప్రణాళిక'ను ఆమోదించింది.

ఈ ప్రణాళిక ఎంత పకడ్బందీగా రూపొందించబడిందంటే - ఏ వ్యక్తి అయినా ఒకసారి అవినీతి పరుడిగా కేసులో ఇరుక్కుంటే అతన్ని ఏ రాజకీయశక్తీ ఎలాంటి దొడ్డిదారిలోనూ బయటపడెయ్యలేరు. 'అతను అవినీతికి పాల్పడలేరు' అని విచారణలో నిర్ధారణ అయితే తప్ప, ఇంకేరకంగానూ ఆ వ్యక్తి శిక్షను తప్పించుకోలేడు. అవినీతి నిరోధక వ్యవస్థకి వుండే కోరలు ఎంత వాడైనవంటే, తెలిసి తెలిసీ ప్రభుత్వ ఉద్యోగి ఎవరూ లంచగొండిగా మారటానికి సాహసించడు. లంచం తీసుకోవాలన్న ఆశ పుట్టినా చెమటలు పట్టాల్సిందే!

ఈ ప్రణాళికని అమలుచేసితీరాలని నిర్ణయించుకున్నామని చంద్రబాబు నాయుడు నాతో స్వయంగా చెప్పారు. అందుకు కారణం వుంది.

★ ★ ★

ఒక ఐఏఎస్ అధికారి!

జిల్లా కలెక్టరుగా పని చేస్తున్న కాలంలో అవినీతి నిరోధక శాఖ దృష్టిలో పడ్డాడు. ఆ శాఖ అధికారులు నిర్దాక్షిణ్యంగా అతని ఇంటిని సోదా చేశారు. అతని ఆస్తిపాస్తులన్నీ తనిఖీ చేశారు.

"చట్టబద్ధంగా అతనికివచ్చే ఆదాయ వనరులకు మించి అపరిమితంగా ఆస్తుల్ని అతను కూడబెట్టాడు" అని అవినీతి నిరోధక శాఖ (ఎ.సి.బి) అతనిమీద కేసు పెట్టింది.

సస్పెన్షన్... విచారణ... కోర్టు... విజిలెన్స్ కమీషన్ నివేదిక... ఇలా ఆ కేసు సంవత్సరాల పాటు నడిచింది. ఆ ఐఏఎస్ అధికారికి పోస్టింగూ వచ్చింది. ప్రమోషన్లూ వచ్చాయి. ఎలా?

వాణిజ్య పన్నుల శాఖలో ఒక అధికారి. ఎ.సి.బి. దాడిలో అతని అక్రమ ఆదాయాల చరిత్ర అంతా బయటకొచ్చింది. సస్పెండ్ చేశారు... విచారణ కోర్టులో పెండింగ్‌లో వుండగానే మళ్లీ పోస్టింగ్ ఇచ్చారు... కొన్నేళ్లు గడిచాయి. మళ్లీ ఎ.సి.బి. దృష్టిలో పడ్డాడు. ఈ సారి అతని అక్రమ ఆస్తుల సంఖ్య ఇంకా పెరిగిపోయిందని ఎ.సి.బి. నిర్ధారించింది. మళ్లా సస్పెన్షన్... విచారణ... ఒక శుభ ముహూర్తాన అతను స్వచ్ఛంద పదవీ విరమణ చేసి, వ్యాపారాలు ప్రారంభించాడు. ఎలా అనుమతించబడ్డాడు?

...ఇలాంటి అనేక అవినీతి కేసుల్ని అధ్యయనం చేశాక, ప్రభుత్వం చిత్తశుద్ధితో అవినీతిని నిర్మూలించదలిస్తే 'ఇలా' చేయవచ్చు - అంటూ ఒక సమగ్ర ప్రణాళికను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి పంపించాను.

అప్పుడు నేను మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థకి డైరక్టర్ జనరల్‌గా (రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ హోదాతో) వున్నాను. ఈ సంస్థ ఆధ్వర్యంలో బ్రిటిష ప్రభుత్వం ఇచ్చిన గ్రాంటుతో ఏర్పాటు చేసిన 'సుపరిపాలన కేంద్రం'లో ఈ ప్రణాళిక కోసం అనేకసార్లు ఉన్నత స్థాయి చర్చలు నా ఆధ్వర్యంలో జరిగాయి.

అనేకమంది మేధావులు సభ్యులుగా గల ఈ కేంద్రం సుదీర్ఘమైన కసరత్తు చేసి, అవినీతి జాడ్యాన్ని సమూలంగా 'తొలగించగల, నిరోధించగల' ఒక సమగ్ర ప్రణాళికను తయారుచేయటం జరిగింది. నేను ప్రధానమంత్రి కార్యాలయంలో పనిచేసినప్పుడు వివిధ రాష్ట్రాల్లో అవినీతి నిరోధక సంస్థల పనితీరుని, సి.బి.ఐ. పనితీరుని గమనించే అవకాశం ఏర్పడటంతో కలిగిన కొద్దిపాటి పరిజ్ఞానాన్ని ఈ ప్రణాళిక నిర్మాణంలో ఉపయోగించాను.

నిజానికి ఈ కసరత్తులో పాల్గొన్న ఇతర రంగాల నిపుణుల పరిశీలనా శక్తి అపరిమితమైంది. వాళ్లు ప్రభుత్వాన్ని బయటనుంచి చూస్తున్న, అనుభవిస్తున్న వర్గాలకు ప్రతినిధులు. అనేక గొప్ప గొప్ప సూచనలు వచ్చాయి. వీళ్ళందరి ఆలోచనల్నీ సమన్వయ పరిచి, ఒక నిర్మాణాత్మకమైన అవినీతి నిరోధక ప్రణాళికను తయారుచేయించటం నా బాధ్యత.

బ్రిటిషువారి పాలన కాలంలో లంచం 10 రూపాయలు తీసుకున్నా, 10 వేలు తీసుకున్నా ఒకేరకమైన నేరంగా చూసేది ప్రభుత్వం. 'లంచం తినాలి' అనే తత్త్వం వున్న వారికి అవకాశం ఇస్తే ఎన్ని లక్షలైనా తినేస్తారు. ఇది సమాజానికే హానికరం – అని బ్రిటిష్ ప్రభుత్వం ఆలోచించేది. అందుకే ఎవడన్నా లంచగొండి అని తేలితే వాడు ప్రభుత్వంలో స్థానాన్ని శాశ్వతంగా కోల్పోయినట్లే. "అలా ఇప్పుడు మాత్రం ఎందుకు చేయలేం?" అనుకున్నాను.

రచన చేశాను. దేశంలో ఏ ఇతర రాష్ట్రంలోనూ ఇటువంటి ప్రణాళిక లేదు. ఇది ఎంత సమగ్రమైన ప్రణాళిక అంటే - అవినీతికి పాల్పడాలనుకునే ప్రభుత్వోద్యోగి – ఏ స్థాయిలో మనిషైనా సరే – లంచం అడగటానికి భయపడతాడు. ఒకవేళ 'రిస్క్' తీసుకుని, లంచగొండితనానికి పాల్పడితే అతని లంచగొండితనం దాగదు. సులభంగా బయటపడుతుంది. బయటపడ్డాక ఆ కేసు సంవత్సరాల తరబడి కోర్టుల్లోనూ, విజిలెన్స్‌లోనూ నానుతూ వుండే అవకాశం లేదు. కొన్ని మాసాల్లోనే పరిష్కారమైపోతుంది. కఠినమైన శిక్ష పడి తీరుతుంది. శిక్ష స్వరూపం ఎలా వుంటుందంటే – అతని అక్రమ సంపాదన అంతా ప్రభుత్వ పరమౌతుంది. అతనికి జీవితకాలంలో మళ్ళీ ప్రభుత్వ సర్వీసులోకి అడుగుపెట్టే అవకాశమంటూ వుండదు. ఎలాంటి రాజకీయ పలుకుబడీ అతన్ని ఆ శిక్షనుంచి కాపాడలేదు. ముఖ్యమంత్రి సయితం ఆ కేసులో ఇరుక్కున్న వాడ్ని రక్షించలేడు.

ఇంత సమగ్రమైన ప్రణాళిక తయారు చేసినందుకు నేనూ, మా సుపరిపాలనా కేంద్ర నిపుణుల సంఘం సభ్యులం అందరం - మమ్మల్ని మేం అభినందించుకున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మా ప్రణాళికను చూసి, "అద్భుతం. ఇంత సమగ్రంగా తయారు చేయగలుగుతారనుకోలేదు ప్రసాద్‌గారూ! మీ బృందాన్ని అభినందిస్తున్నాను. ఇలాంటి ప్రణాళిక కోసమే నేను చూస్తున్నాను. దీన్ని యథాతథంగా అమలుచేస్తే, రాష్ట్రంలో అవినీతిని నిరోధించడం చాలా సులభం..." అన్నారు.

కాని....!

★ ★ ★

చంద్రబాబు నాయుడు గారిని ఈ ప్రణాళిక అంతగా ఆకర్షించడానికి కారణం బహుశా హాంగ్‌కాంగ్ అనుభవం కావచ్చు.

25-30 సంవత్సరాలక్రితం వరకూ హాంగ్‌కాంగ్ దేశానికి పరమ అవినీతి దేశంగా పేరుండేది. కాని గత 15 సంవత్సరాలలో అక్కడి ప్రభుత్వం వ్యవస్థాగతంగా అనేక మార్పులు తీసుకువచ్చింది. పాలనా విధానాలలో మార్పు తెచ్చింది. అవినీతిని అదుపుచేసింది... ఈ విషయం చర్చకు వచ్చినప్పుడు మాటల్లో ముఖ్యమంత్రి అన్నారు. "మనం ఎందుకు చేయలేం అలా? సుపరిపాలనలో అవినీతి నిరోధం కూడా భాగమే కదా?"

ముఖ్యమంత్రికి నిజంగా మనసు పుడితే ఎందుకు చేయలేం? ఈ రాజకీయ వ్యవస్థలో ఇలాంటి ఆలోచనలు రావటమే గొప్ప విషయం కదా?... నేను వెంటనే స్పందించాను. హాంగ్‌కాంగ్‌లో అవినీతి నిర్మూలనా సంస్థకు పదేళ్ళపాటు సారథ్యం వహించిన బెర్ట్రండ్ డీస్పివెల్లె అనే నిపుణుడ్ని మన రాష్ట్రానికి ఆహ్వానించాను. "అవినీతి రహిత పాలనా వ్యవస్థను సాధించి తీరాలన్నది మా ముఖ్యమంత్రి ఆకాంక్ష. ఎలా సాధ్యపడుతుందో చెప్పండి" అని అడిగాను. హాంగ్‌కాంగ్‌కీ మనకీ పరిస్థితుల్లో గల వ్యత్యాసాల దృష్ట్యా ఆయన ఒక సుదీర్ఘమైన అధ్యయనాన్ని చేపట్టాడు.

అది ఎంత విస్తృత అధ్యయనం అంటే - రాజకీయ నాయకుల్ని, న్యాయమూర్తుల్నీ, అధికారుల్నీ, న్యాయవాదుల్నీ, పారిశ్రామిక వేత్తల్నీ, వ్యాపారస్థుల్నీ, స్వచ్ఛంద సంస్థల్నీ, జర్నలిస్టుల్నీ, సామాన్య పౌరుల్నీ... ఇలా ప్రభుత్వ సేవలతో సంబంధం వున్న అన్నివర్గాల అభిప్రాయాల్నీ - 10 వేల మంది నుంచి ఒక సమగ్ర ప్రశ్నావళి ద్వారా ఆయన సేకరించేందుకు ఏర్పాటు చేశాను.

"అవినీతికి మూలకారణం ఆశ - భయంలేకపోవటం".

ఈ మాట చాలామంది చెప్పారు. ఆశ (దురాశ) వున్నా భయంవున్న చోట అవినీతి తక్కువగా వుంటోంది. అవినీతి పరుడైన వాడికి ఆసరా ఇస్తున్న అంశాలు ప్రధానంగా రెండు :

1. కేసు విచారణ తేలటానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. ఈ లోపల అసలు దాడి చేసిన అధికారులూ, వాళ్ళ బాసులూ మారిపోతూనే వుంటారు. కాబట్టి క్రమంగా ప్రాసిక్యూషన్ నీరుకారిపోతుంది. ఆ దశలో 'అవసరమైన చోటల్లా' డబ్బు విరజిమ్మి పెద్ద లాయర్ల సాయంతో కేసు గెలిచిపోవచ్చు.

2. కేసు మరీ జటిలంగా వుంటే రాజకీయ నాయకుల్ని 'ఆశ్రయించి', కేసునుంచి ప్రభుత్వమే తప్పించేలా చేసుకోవచ్చు.

ఈ రెండు కారణాలవల్లా అవినీతి పరుడికి భయం తక్కువ. లంచగొండితనానికి మరో ముఖ్యకారణం - ప్రభుత్వం ఇచ్చే ఉత్తర్వులు, వాటిలో వస్తున్న మార్పులు, చేర్పుల విషయాలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం. చాలా సందర్భాలలో ఆయా శాఖల అధికారులకే తెలీకపోవడం. నియమ నిబంధనలను, వాటిని అధిగమించే మార్గాలను తెలిసున్నవాళ్ళు కీలకస్థానాల్లో వుంటారు. ఎవరు లంచమిస్తే వాళ్ళకి అనుకూలంగా ఫైళ్ళు తయారుచేస్తారు, తిరగరాస్తారు, నిబంధనలకు కొత్త భాష్యాలు చెప్తారు.

ఒకసారి ఒక అవినీతి పరుడైన అధికారి నాతో ఒకమాట అన్నాడు. "డబ్బు సంపాదించక పోవడం మన అసమర్థత అనిపించుకుంటుందిగానీ, ఔన్నత్యం అనిపించుకోదు. డబ్బు సంపాదన వల్ల మాత్రమే సాంఘిక హోదా పెరుగుతుంది. అది లేకపోతే ఎవడూ గౌరవించడు - ఇంట్లో భార్యతో సహా..."

"పట్టుబడితే అవినీతి ముద్ర తెచ్చే హోదా కూడా గొప్పగా ఉంటుందా?" అని అడిగాను.

"రాజకీయ నాయకుల్ని పట్టుకుంటాం. డబ్బు ఖర్చుపెడతాం. మళ్ళీ వస్తాం. మళ్ళీ సంపాదిస్తాం...."

ఈ సంఘటన నా మనసులో నాటుకుపోయింది. రాజకీయ నాయకుల వత్తాసు వుండదు అని అనిపిస్తేనేగానీ, ఇలాంటి లంచగొండులకు భయం కలగదు? కాని, ఎలా ఎలా? అనుకునే వాణ్ణి.

అలా ఆలోచించినప్పుడే (బెర్ట్రండ్‌ని పిలిపించటానికి ముందు) కేంద్రంలో విజిలెన్స్ కమీషనర్‌గా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్న ఎన్. విఠల్, రాష్ట్ర ప్రభుత్వంలో సాధారణ పరిపాలనా శాఖ కార్యదర్శి రఘోత్తమరావు, నేనూ సభ్యులుగానూ, సుపరిపాలన కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.కె. మహంతి కన్వీనర్‌గానూ ఒక కమిటీని ఏర్పాటు చేయించాను. మేమంతా అప్పటి పరిస్థితుల్ని బాగా పరిశీలించాక, పాలనావ్యవస్థలోని కొన్ని విధానాలను మార్చడం ద్వారా, పారదర్శకత పెంచడంద్వారా అవినీతిని తగ్గించవచ్చుననుకొన్నాం. మా ప్రతిపాదనలన్నీ ముఖ్యమంత్రి ముందు పెట్టాం. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీని వినియోగించి ఎలా అనేక ప్రక్రియల్ని సులభతరం చేయవచ్చో, అవినీతిని నిరోధించవచ్చో వివరించాం. ఆయన ఆమోదించారు.

అలా ముఖ్యమంత్రి అందించిన ప్రోత్సాహం ఫలితమే ఇప్పుడు రాష్ట్రంలో పనిచేస్తున్న 'ఇ-సేవా' సర్వీసు కౌంటర్లు, రిజిస్ట్రేషన్ శాఖలో 'కార్డ్' (Computer Aided Registration and Documentation), రవాణాశాఖలో కంప్యూటరైజ్డ్ లైసెన్సింగ్ విధానం, ప్రభుత్వం జారీచేసే ప్రతి ఉత్తర్వు తక్షణం వెబ్‌సైట్‌లో ప్రదర్శించేలా Ap Online ప్రాజెక్టు...... వగైరా. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీని ఉపయోగించేలా రూపొందిస్తున్న ఈ కార్యక్రమాలు కార్యరూపం దాల్చేలా అప్పటి కార్యదర్శి స్థాయి అధికారులు ఆర్. చంద్రశేఖర్, జె.సత్యనారాయణలతో ప్రత్యేక ఒక శాఖని ఏర్పాటు చేశారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం, పైలట్ ప్రాజెక్టుల్ని అమలు చేయటం కోసం స్కిమ్స్, ఇ-సేవ తదితర ప్రతి ప్రాజెక్టుకీ ఒక కమిటీని ముఖ్యమంత్రి నియమించారు. అలాంటి ప్రతి కమిటీకి నన్ను ఛైర్మన్‌గా వేశారు.

ఇలా రకరకాల ప్రాజెక్టుల్నీ అమలు చేయడం ద్వారా పారదర్శకతని పెంచటానికి, కొద్దిమంది 'జేబుల్లోనే' దాక్కొన్న విజ్ఞానం బహిరంగంగా అందరికీ అందుబాటులోకి రావటానికీ విపరీతమైన కృషి జరిగింది.

అయినా అవినీతిని నిర్మూలించడం ఎలా సాధ్యపడుతుంది? అప్పుడే హాంగ్‌కాంగ్‌నుంచి బెర్‌ట్రండ్‌ని పిలిపించాం. అయన అనేక రంగాల్లోని అనేకమందితోపాటు అవినీతి నిరోధకశాఖ, విజిలెన్స్ – ఎన్‌ఫోర్స్‌మెంట్‌శాఖ, విజిలెన్స్ కమీషన్‌లతో కూడా సుదీర్ఘంగా చర్చించారు. ఆ అధ్యయనం తరువాత ఆయన ఒక మాట నాతో అన్నారు. "ప్రసాద్ అవినీతి నిరోధక వ్యవస్థ ఈ రాజకీయ నాయకుల అదుపులో వున్నంతకాలం అవినీతి పరులకు భయం ఉండదు..."

నాకు అర్థమైంది. ఆయన అధ్యయన ఫలితాలను ఆధారంగా చేసుకొని మూడు మౌలిక సూత్రాలకు లోబడిన అవినీతి నిరోధక విధానాన్ని ప్రతిపాదించాం. 1. అవినీతికి పాల్పడాలంటేనే ఉద్యోగులకు చెమటలు పట్టాలి. 2. అవినీతి పరుడికి కొమ్ముకాసే అవకాశం రాజకీయ నాయకులకు ఉండకూడదు, 3. అవినీతి కేసులు శరవేగంతో పరిష్కరింపబడాలి... ఇది నేను ఆశించిన విధంగానే రూపొందింది. ఉదాహరణకి, లంచం తీసుకొంటూ పట్టుబడ్డ వాళ్ళ విషయంలోనూ, చట్టబద్ధమైన ఆదాయవనరులకు మించి ఆస్తులు కలిగివున్నవాళ్ళ విషయంలోనూ – వాళ్ళ ఆస్తుల్ని జప్తు చేసే అధికారం, వాళ్ళ బ్యాంకు అక్కవుంట్లనూ, వారికి సహకరించినవారి బ్యాంకు అక్కవుంట్లనూ స్తంభింపజేసే అధికారం, కేసు పూర్తయ్యేవరకూ ఆ ఆస్తుల్ని వాళ్ళు అనుభవించే అవకాశం లేకుండా హక్కుల్ని స్తంభింపజేసే అధికారం మేం రూపొందించిన కొత్త సంస్థకి వుంటాయి.

ఆ సంస్థ ఎలా వుంటుందంటే – ఆ సంస్థకు అధిపతిని నియమించే కమిటీలో గవర్నరు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి మాత్రమే సభ్యులు. అతని పదవీకాలం అయిదేళ్ళు. పదవీకాలం పూర్తయ్యేలోగా ఏవైనా అనివార్యకారణాలవల్ల అతన్ని తొలగించాల్సివస్తే ఆ అధికారం శాసన సభకు మాత్రమే ఉంటుంది. నిధులకోసం ఈ సంస్థ ప్రభుత్వం మీద ఆధారపడి వుండకూడదు. వివిధ రంగాలలో అవినీతిని శోధించగల నిపుణుల్ని తెచ్చుకునే అధికారం ఆ

అధిపతికే వుండాలి. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ రంగాల్లోని అన్ని సంస్థల్లోని అందరు ఉద్యోగుల, చైర్మన్ వంటి పోస్టుల్లోవుండే రాజకీయ నాయకుల పనితీరుపై (అవినీతి కోణంలోంచి) ఎలాంటి తనిఖీ జరపటానికీ, దాడి జరపటానికీ, చర్యతీసుకోవటానికైనా ఈ సంస్థకు పూర్తి అధికారాలు వుండాలి. నిఘా దాడులు, విచారణ, శిక్ష విధింపు, ప్రజలలో అవగాహన పెంచటం వగైరా అంశాలన్నీ ఈ సంస్థ పరిధిలోకే వస్తాయి. ఈ సంస్థ ఏర్పడ్డాక ఇప్పుడున్న ఎ.సి.బి, విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ కమీషన్ రద్దు అవుతాయి. అలా అన్ని రకాల అవినీతి కేసుల్నీ అన్ని దశల్లోనూ రాజకీయ కారణాలకి అతీతంగా పట్టి, పిండి, శిక్షించే విశ్వరూపంతో ఈ సంస్థ వుండాలి....

దేశంలోనే ఇది తొలి ప్రయోగం. నేనూ, మా బృందం ఈ ప్రతిపాదనను సమగ్రంగా వివరించినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మమ్మల్ని అభినందించారు. వెంటనే మంత్రిమండలిని ప్రత్యేకంగా సమావేశపరిచారు. ఇదొక్కటే అజెండా. అంతా 'ఓకె' అనేశారు. ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు సారథ్యంలో ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. ఈ ఉపసంఘం మా ప్రతిపాదనను మరింత నిశితంగా, లోతుగా పరిశీలించి కొన్ని మార్పులు సిఫార్సు చేసింది. "ఇంత పెద్ద వ్యవస్థకు ఒకే అధిపతి బదులు ముగ్గురు సభ్యుల బోర్డు వుండాలి... ముఖ్యమంత్రిని మాత్రం ఈ అవినీతి నిరోధక సంస్థ పరిధినుంచి మినహాయించాలి... ఈ సంస్థకి ఎప్పటికప్పుడు సలహాలిచ్చేందుకు ఒక నిపుణుల సలహా మండలి వుండాలి..." ఈ మార్పులు చేర్పుల్ని కూడా మంత్రిమండలి ఆమోదించింది.

"ప్రజల దృష్టిలో ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచగల ప్రతిపాదన ఇది. కాబట్టి అమలుచేసి తీరాలి" అని ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నారు. కాని...

★ ★ ★

ఇది అమలు జరగాలంటే కొత్త చట్టం తీసుకురావాలనీ, దాన్ని అమలుచేయటానికి రెండేళ్ళు పడ్తుందనీ, కొత్త చట్టం వస్తే తమ ఉనికే వుండదని భావించే అవినీతి నిరోధక శాఖాధికారులు, విజిలెన్స్ – ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇప్పుడు చేస్తున్నంత పని చేయటానికి కూడా నిరాసక్తత చూపుతారనీ, దాంతో అవినీతి ప్రబలిపోయి, ఎన్నికలలో ఈ ప్రణాళికే అధికార పార్టీకి ఆత్మహత్యా సదృశమవుతుందనీ... ఇలాంటి అనేక అనుమానాలను చంద్రబాబు నాయుడుగారి ముందు ఆయన 'శ్రేయోభిలాషులు' పదే పదే వల్లించారు. "మళ్ళీ మనమే వస్తాంగదా! అప్పుడు అధికారంలోకి రాగానే అమలు చేసేద్దాం సర్" అంటూ వాళ్ళు సలహాలు కుమ్మరించారు.

అంతే!

ఆ బృహత్తర 'అవినీతి నిరోధక' ప్రణాళిక మరిక వెలుగు చూడలేదు. సుపరిపాలనా కేంద్రంలోనే నిద్రపోతోంది.

★ ★ ★

నా ఇల్లమ్మి పెడతావా ప్రసాద్!

"ప్రసాద్. నాకోచిన్న సహాయం చేయాలయ్యా!"

'జార్ఖండ్ ముక్తి మోర్చ పార్టీ ఎం.పీలకు ముడుపులు' కేసు వాదోపవాదాలు ముగిసి, ఆ కేసులో కూడా పి.వి.నరసింహారావుని నిర్దోషిగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. ఈ తీర్పు వచ్చిన కొన్ని రోజులకే పి.వి.గారు హైదరాబాద్ వచ్చారు. అప్పుడు నాతో అన్నమాటలివి.

"చిన్న సహాయమే కదా. మీరెలాగా పెద్ద సహాయాలు నన్ను అడగరు. అడిగినా చేయలేను. ...చెప్పండి" అన్నాను.

"ఇక్కడ జూబ్లీహిల్స్‌లో నాకో ఇల్లుంది. తెలుసుగదా! ఆ ఇల్లు అమ్మిపెట్టాలయ్యా"

"అంత అవసరం ఏమొచ్చింది సర్! మాజీ ప్రధానమంత్రిగా మీకు నివాస గృహాన్నీ, నౌకర్లనీ ప్రభుత్వమే ఇస్తుంది. వైద్యసదుపాయం ఉంటుందీ. నెలనెలా పెన్షన్ వస్తుంది...." అంటూ నసిగాను.

ఆయనకేమీ పెళ్ళికావలసిన కూతుళ్ళూ లేరు. నాకు తెలిసి ఆయన ఎవరిదగ్గరా భారీగా అప్పుచేసిన దాఖలాలు లేవు. ఏదన్నా ఇబ్బంది పడివుంటే ముఖ్యమంత్రిగా వున్నప్పుడు పడ్డారు.

కొడుకుని చదివించటానికి అల్లుడు బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది. కూతుర్ని మెడిసన్ చదివించడంకోసం ఫీజుకట్టడానికి ఇబ్బంది పడాల్సివచ్చింది. కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేయటానికి కూడా చాలా అవస్థలు పడాల్సివచ్చింది. ... పోనీ, ముఖ్యమంత్రిగా చేసిన నాటికి అంత రాజకీయపరిణతి లేదు అనుకున్నా, ఆ తరువాత కేంద్రంలో చాలా పదవుల్లో వున్నారు కదా! అవి కూడా ఏదో పనికిమాలిన పదవులూ కాదు, సహాయమంత్రి, ఉపమంత్రి పదవులూ కాదు. క్యాబినెట్ హోదావున్న మంత్రి పదవులే. దేశీయాంగశాఖ, విదేశాంగ శాఖ, మానవవనరులశాఖ. ఇంకా కాంగ్రెసు పార్టీలో కార్యదర్శి, ప్రధానకార్యదర్శి పదవులు కూడా చేశారు. 1991 నుండి అయిదేళ్ళపాటు ప్రధానమంత్రి పదవి కూడా చేశారు. ఇన్ని పదవులు అనుభవించిన వ్యక్తికి తనకున్న ఒకేఒక్క ఇల్లు అమ్ముకోవాల్సిన అగత్యం ఏమిటి?

పి.వి.గారు నావంక అదో రకంగా చూశారు. 'ఆ మాత్రం నీకు తెలీదా?' అన్న భావం ధ్వనించింది ఆ చూపులో. ఒకటి రెండు నిమిషాల మౌనం తరువాత చెప్పటం మొదలుపెట్టారు.

"... అన్ని కేసుల్లోనూ నిర్దోషిగా బయటపడ్డానంటే నాకోసం ఎవరెవరో వకీళ్ళు నా తరపున కోర్టుల్లో వాదిస్తేనే గదా! వాళ్ళెవరూ నా దగ్గర ఫీజు అర్ధాన్ను అడగలేదు. నేనెప్పుడు

ఏమిస్తే అదే పుచ్చుకున్నారు. అదైనా ఎలా ఇచ్చాను. పదవిపోయాక 'ఇన్‌సైడర్' పుస్తకం రాస్తే, దానిమీద వచ్చిన రాయల్టీని వాళ్ళకిచ్చేస్తూ వచ్చాను. ఇంకా ఇవ్వాల్సింది - నా అంచనాల ప్రకారం లక్షల్లో ఉంది. వాళ్ళకి ఫీజు ఇవ్వకుండా, బాకీ తీర్చకుండా చనిపోతానేమోనని భయంగా ఉందయ్యా..."

నిర్ఘాంతపోయాను. ఎలాంటి వ్యక్తి ఏం మాట్లాడుతున్నారు?

ఈ దేశం ఆర్థికంగా దివాలా తీసి, టన్నులకొద్దీ బంగారాన్ని ఇంగ్లాండులో కుదువపెడితేనేగాని బడ్జెట్ అవసరాలను తీర్చుకోలేని దుస్థితిలో ఉన్నప్పుడు, సన్యాసం తీసుకొని కొర్తాళం పీఠాధిపతిగా వెళ్ళే ప్రయత్నంలో వున్న పి.వి.ని అప్పటి రాజకీయ పరిస్థితులు వెనక్కి గుంజి, ప్రధానమంత్రిని చేస్తే, ఆయన అయిదేళ్ళలో ఆర్థిక దుస్థితి నుంచి ఈ దేశాన్ని గట్టెక్కించి, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలతో ప్రపంచం అంతా అబ్బురపడేలా వినూత్న ప్రగతిమార్గంలో నడిపించాడు. భారతదేశాన్ని ఈ 60కోట్ల జనాభా గర్వపడే ఒక వైభవదశలోకి మలుపుతిప్పాడు. అలాంటి మేధావి, రాజనీతివేత్త నన్ను అభ్యర్థిస్తున్నారు - ప్లీడర్లకి ఫీజులు చెల్లించటం కోసం తనకున్న ఒకే ఒక ఇల్లు అమ్మిపెట్టాలని!!

బుద్ధి వూరుకోరుకదా, అందుకని సన్నగా అడిగీఅడగనట్లు అడిగాను. "ఆ ఇంటిమీద అద్దె వస్తూండాలి కదా సర్!".

"అదేంటయ్యా నీకు తెలీదా? 1991 ఎన్నికలముందు ఢిల్లీలో నాకు పనేముంది అనుకొని నా సామాను, పుస్తకాలు మొత్తం హైదరాబాద్‌లో ఇంటికి తరలించేశాను. నేను వచ్చేస్తున్నా కాబట్టి అద్దెకున్నవాళ్ళని ఖాళీ చేయించాను. తీరా సామానంతా తరలించాక మన కాంగ్రెసు నాయకులంతా కలిసి నన్ను పార్టీ అధ్యక్షుడన్నారు, ఆనక ప్రధానమంత్రి అన్నారు. అప్పట్నుంచీ హైదరాబాద్‌లో ఇల్లు ఖాళీగానే ఉండిపోయింది..."

నేను నాలిక్కర్చుకున్నాను నా అజ్ఞానానికి. ఆయన సొంత విషయాలు ముఖ్యంగా కుటుంబసభ్యుల విషయాలు, రాబడీఖర్చులూ వగైరా విషయాలన్నీ ఆయన దగ్గర ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (OSD) గా వున్న ఎ.వి.ఆర్.కృష్ణమూర్తి చూసుకుంటూండేవాడు. నేనెప్పుడూ ఈ ఇంటి విషయం తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

"వున్న ఒక్క ఇల్లూ అమ్మేస్తే శేష జీవితం గురించి కూడా ఆలోచించాలి గదా..."

"ఏముంది ఆలోచించటానికి! పిల్లలందరికీ వాళ్ళ వ్యాపకాలు వాళ్ళకున్నాయి. వాళ్ళెవరూ నాతో వుండనక్కర్లేదు. నేనొక్కణ్ణీ ఉండటానికి ఎన్ని గదులు కావాలి? తినాలన్నా ఎన్ని తినగలను? పప్పు, అన్నం చాలు... మాజీప్రధానమంత్రి హోదాలో అవెలాగూ లభిస్తాయి కదా! అయినా ఒంటరిగా ఉండటం అలవాటై పోయింది. నా అనుభవాలన్నీ పుస్తకాల రూపంలో రాయాలను కుంటున్నానయ్యా. ఒకవేళ ఏదన్నా జబ్బు చేసినా మాజీ ప్రధాని అనే ముద్ర ఒకటి ఉంది కాబట్టి, నడిచి పోతుందిలే..."

ఎంత సులువుగా చెబుతున్నాడీయన. అయిదేళ్ళపాటు ఈ దేశపాలనా వ్యవస్థని శాసించిన వ్యక్తి, ప్రధానమంత్రిగా మూడు బంగళాల మధ్య జీవించిన వ్యక్తి రేపటి గురించి బెంగ పడనఖ్ఖర్లేదనుకుంటున్నాడు?... నేనిలా ఆలోచిస్తుంటే మళ్ళీ ఆయనే అందుకున్నారు.

"అమ్మేస్తే మంచి రేటు వస్తుందంటావా? ... రాకపోయినా ఫరవాలేదయ్యా. ఏదో ఒకరేటుకి అమ్మేసి ప్లీడర్లందరి బాకీలు తీర్చేస్తే నాకు మనశ్శాంతిగా ఉంటుంది. ప్రస్తుతం మన కృష్ణమూర్తి కొడుకు ప్రసాదే ఆ ఇంటి విషయం చూస్తున్నాడు. నువ్వుకూడా పూనుకుంటేనే త్వరగా అవుతుందనిపిస్తోంది. ...ఇప్పుడు నేను రాసిన రెండు పుస్తకాలు రెడీగా ఉన్నాయి. అవి ఎప్పటికి అచ్చయి మార్కెట్లోకి వెళ్ళి, మనకి రాయల్టీ వస్తుందో తెలీదుకదా! అప్పటిదాకా వాళ్ళ ఋణం తీర్చకుండా వుంటామా? ఈలోపలే నాకేమైనా అయితే...?"

పి.వి.నరసింహారావుగారి మాట నిజాయితీ మీద నాకు ఎలాంటి అనుమానం లేదు. కాని ఎందుకో ఆయన చెబుతున్న బీదకబుర్లు నమ్మలేకపోతున్నాను. ఆయన ప్రధానమంత్రిగా ఉండగా ఎన్నెన్ని అనధికార కార్యక్రమాలకి లక్షలకి లక్షలు ఎలా ఖర్చయ్యేవి? అవన్నీ ప్రభుత్వనిధులు కావు. పార్టీ నిధుల రూపంలో వచ్చేవి, ఖర్చయ్యేవి. పార్టీ నిధుల సేకరణ, వ్యయం, జమాఖర్చుల నిర్వహణ వగైరా 'నిధి నిర్వహణ' పనులన్నీ పార్టీ కోశాధికారి సీతారాంకేసరి చూసుకునేవారు. కాకపోతే ఆయన ఏం చేసినా పి.వి.గారికి చెప్పకుండా చేసేవారు కాదు.

నేను అయోధ్య రామాలయంకోసం ట్రస్టు ఏర్పాటుచేసే పనిమీద దేశంలో ఎక్కడెక్కడికో వెళ్ళాల్సివచ్చేది. అనేక సందర్భాలలో నా విమానం టిక్కెట్లు నాపేరుమీద ఉండేవికావు. కొన్నిసార్లు ప్రత్యేక విమానాలు కూడా నాకోసం ఏర్పాటయ్యాయి.

ఒకసారి ఏమైందంటే - అయోధ్య ట్రస్టు ఏర్పాటు విషయమై పెజావరు పీఠాధిపతి విశ్వేశతీర్థస్వామీజీని ప్రధానమంత్రితో కలిపించాల్సి వచ్చింది. మూడోకంటివాడికి తెలీకుండా ఒక సాయంత్రం కలిసే ఏర్పాటు చేశాను. కాని పెజావరు స్వామీజీ ఆ మర్నాడే బదరీనాథ్‌లో తమ చాతుర్మాసదీక్షకి సంకల్పం చేసుకోవాల్సి ఉంది. ఆ సాయంత్రం ఆయన ఢిల్లీలో ప్రధానిని కలిసేలా చేసితీరాలంటే ఆ రాత్రికిరాత్రి ఆయన్ని బదరీనాథ్‌లో జోషి మఠానికి చేర్పించే ఏర్పాటుచేయాలి. ఎవరు చేస్తారు? డబ్బెవరిస్తారు?... నాకు తెలీదు. నేను ప్రధానికి పరిస్థితి వివరించాను. ఆయన కేసరికి చెప్పమని ఖండేకర్‌కి పురమాయించారు. రెండు గంటల్లో హెలికాప్టర్ రెడీ అయిపోయింది.

అలాగే మరోసారి ద్వారకాశంకరాచార్యుల కోసం, ఇంకోసారి కాశీ శ్రీమఠం స్వామీజీ విషయాలలోనూ ఇలాంటి ఆకస్మిక ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది. నేను ప్రధానికి చెప్పేవాణ్ణి. అవి జరిగిపోయేవి.

ఇవేకాక ప్రధానమంత్రి కోసమని దేశంలో ఎక్కడెక్కడో పూజలు, హోమాలు చేయించేవాళ్ళం. వాటికి ఎంతెంత ఖర్చయ్యేది?

ఇవి ఇలా ఉంచి, ప్రధానికి మీడియా సలహాదారు అంటే పత్రికల వాళ్ళతో సత్సంబంధాలు వుండేలా, నేను కూడా వాళ్ళ 'బాగోగులు' కొంత పట్టించుకోవాలి కదా? ఇక, పార్టీ పరంగా అనేక వీడియో ప్రకటనలకి, పత్రికాప్రకటనలకీ అయ్యే ఖర్చు అంతా కోట్లల్లోనే ఉండేది. పార్టీకి కోశాధికారి సీతారాంకేసరే అయినా పార్టీ అధ్యక్షుడి ఆమోదం లేకుండా కోట్లరూపాయలు ఖర్చు ఎలా జరుగుతుంది?

కొంతమంది పారిశ్రామిక వేత్తలకి పార్టీ విరాళాల్ని అధ్యక్షునిద్వారా అందజేస్తేనే సంతృప్తి ఉంటుంది.

ఒకసారి ఏం జరిగిందంటే-

సీతారాంకేసరి ఏదో విదేశీ పర్యటనలో ఉన్నారు. అప్పుడు ఎ.కె.ఆంథోని (ఇప్పటి కేంద్ర రక్షణమంత్రి) పార్టీలో తాత్కాలిక కోశాధికారిగా బాధ్యత నిర్వర్తిస్తున్నారు. ఆంథోని ఒకరోజు అకస్మాత్తుగా నాకు టెలిఫోన్ చేసి, "అర్జెంటుగా ఒక విషయం పి.ఎమ్.గారిని కనుక్కొని చెప్పండి ప్రసాద్" అన్నారు.

అయన కనుక్కోమన్నది ఏమిటంటే – ఎవరో ఒక పారిశ్రామికవేత్త ఒకపెద్ద సూట్‌కేస్ తెచ్చి ఆంథోనీకిచ్చి, పార్టీకి విరాళంగా ఇస్తున్నాననీ, పి.వి.గారిని కలిసి ఇవ్వబోతే ఆయన పార్టీకోశాధికారికి ఇవ్వమని చెప్పారనీ అన్నాడట. ఆ సూట్‌కేస్ నిండా కరెన్సీ కట్టలే. పి.ఎమ్.గారిని వీడు నిజంగా కలిశాడా? ఆయన నిజంగా అలా చెప్పారా... ఇవి ఆంథోని సందేహాలు. నేను పి.వి.గారితో మాట్లాడి "అంతా నిజమే" అని నిర్ధారించాను.

అప్పుడు ఆంథోనీకి వచ్చిన రెండో సమస్య - "నేను తాత్కాలిక కోశాధికారినే కదా! ఈ కరెన్సీ కట్టలగోల నాకెందుకు అప్పగిస్తున్నారు?"

"కేసరిగారు విదేశీయాత్రనుంచి తిరిగివచ్చేదాకా ఆ కరెన్సీకి మీరే కాపలా కాసి, ఆయన వచ్చాక అప్పగించేయమన్నారు సర్ పి.వి.గారు" అన్నాను.

"సరే సరే" అంటూ ఆయన అయిష్టంగా ఒప్పుకున్నాడు.

మరి అలా వచ్చిన విరాళాలన్నీ కోట్లల్లోనే ఉంటాయే! ఇవన్నీ నా కళ్ళముందు మెదిలాయి. ఉండబట్టలేక అడిగేశాను.

"సర్, మీ చేతుల మీదుగా కోట్లాదిరూపాయల నిధులు ఖర్చయ్యేవికదా! మీరు మరీ అడ్వకేట్లకివ్వాల్సిన ఫీజులు కూడా ఇవ్వకుండా..." అని తటపటాయిస్తూనే అడిగాను.

పి.వి గారు నావంక విచిత్రంగా చూశారు.

"అదేంటి ప్రసాద్, అదంతా పార్టీ ఫండయ్యా. పార్టీకోసమని ఇచ్చిన డబ్బుని మన సొంతానికి ఎలా వాడుకుంటామయ్యా? ఎవరు తెచ్చి ఏమిచ్చినా దాన్ని నేరుగా సీతారాంకేసరికే పంపించేస్తూ

వచ్చాను... (కొంచెం ఆగి) ఇవ్వాళ ఇలాంటి సొంత అవసరం వస్తుందనీ, అందుకోసం అప్పుడా డబ్బు దాచుకోవాలనీ అనిపించలేదయ్యా..."

నాకు మనస్సు చివుక్కుమంది. ఎందుకు అడిగానా అనుకున్నాను. నోటికొచ్చింది వాగేశానా అనుకున్నాను. ఏదో కేసులన్నింటిలోంచి బయటపడ్డ ఆనందంలో ఆయన తనకోసం వాదించినవాళ్ళకి ఇవ్వాల్సిన ఫీజులబకాయిల గురించి మాట్లాడుతుంటే, నేను కొంచెం ఎక్కువ మాట్లాడాననిపించింది.

నిజానికి ఆయన ఎదుర్కొన్న కేసులు మొత్తం నాలుగే. కాని ప్రతి కేసులోనూ క్రిందికోర్టులో గెలిస్తే, ప్రత్యర్థులు పైకోర్టుకి లాగించటం, అక్కడా గెలిస్తే, ప్రత్యర్థులు ఇంకో పైకోర్టుకి లాగించటం, అక్కడా గెలిస్తే ఇంకా పైకోర్టుకి అప్పీలు చేయటం... అలా సుప్రీంకోర్టు దాకా 'ఎక్కేకోర్టు, దిగేకోర్టు' అయిపోయింది ఆయన పదవీ విరమణానంతర జీవితం. అదే ఆయనలో ఆందోళన పెంచేసింది. వయసు పెరుగుతోంది. ఆరోగ్యం క్షీణిస్తోంది. ఉత్సాహం తగ్గిపోతోంది. తనకంటూ ఏమీ చేసుకోలేదు. తనవాళ్ళకీ ఏమీ చేసిపెట్టలేదు. (ఈ మాటని ఆయన కొడుకు ఒకరు బాహాటంగానే పత్రికల ముందు వెళ్ళగ్రక్కాడు). కనీసం తన అధికార బలంతో ఆశ్రిత పక్షపాతం చూపించి అయినా తన వర్గం అంటూ ఎవర్నీ కూడగట్టుకునే ప్రయత్నం చేయలేదు.

ఆయనవల్ల లాభం పొందిన కొందరు ముఖ్యమంత్రులుగానీ, ఇతర నాయకులు గానీ పదవీవిరమణ తరువాత ఆయన్ని పట్టించుకొనే ప్రయత్నం చేయలేదు. పట్టించుకోకపోయినా ఈయన ఏమీ అనుకోడు అన్న భరోసాతో కొంతమంది, ఈయన్ని పట్టించుకుంటే ఈయన తరువాత వచ్చిన పార్టీ నాయకత్వం దృష్టిలో నేరం చేసినవాళ్ళమవుతామన్న భయంతో కొంతమంది ... మొత్తంమీద ఆయన ఏకాకి అయిపోయాడు.

ఎంత దేశ ఆర్థిక వ్యవస్థని అగాథంలోంచి పైకి తీసి, పురోగమన దిశలోనడిపించినా, ఎంత పర్మిట్‌లు – లైసెన్సుల వ్యవస్థని పెకలించి ఆ స్థానంలో సరళీకరణ విధానాన్ని తీసుకొచ్చినా, ఎంత మ్యూచువల్ ఫండ్స్ వంటి చిన్న మదుపరుల మార్కెట్‌ని సృష్టించి, షేర్ మార్కెట్లో కొత్త చరిత్ర సృష్టించినా, ఎంత టెలికామ్ – ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగాలలో పెట్టుబడుల్ని పెంచి ప్రపంచ దృష్టిని ఆకర్షించినా... ఇలా తన దూరదృష్టితో, పాలనా దక్షతతో ఉజ్జ్వల దేశ భవిష్యత్తు కోసం ఎన్ని మార్గాల్ని ఆయన సృష్టించినా రాజకీయంగా తనదంటూ ఒక్క సొంత వర్గాన్ని నిర్మించుకోలేకపోయాడు.

చివరిరోజుల్లో ఆయనకి ఆప్తులుగా ఆయన పరిగణించిన వాళ్ళంటూ ఎవరన్నా మిగిలివుంటే – బహుశా – ఆయన వ్యక్తిగత సిబ్బందిగా పనిచేస్తూ వచ్చిన ఎ.వి.ఆర్. కృష్ణమూర్తి, రామూ దామోదరన్, ఖండేకర్, ఐఏయస్ అధికారి రతన్ వట్టల్, నేనూ మాత్రమే. ఆయనకి పరిచయంలేని అనేకమంది దేశభక్తులు మాత్రం ఆయనకి సానుభూతిపరులుగా మిగిలిపోయారు.

నేను అతిగా మాట్లాడాననిపించిన వెంటనే ఆ మాటల్ని సమర్థించుకునే ప్రయత్నం చేశాను.

"సర్, సర్... అంటే నా ఉద్దేశ్యం, మీ వల్ల ఉపకారం పొందిన వాళ్ళు ఎంతోమంది ఉంటారు కదా, మీకీ అవసరం వచ్చిందంటే ఎవరుమాత్రం సహాయం చేయరు!" అన్నాను.

"కాని నేనెప్పుడూ వాళ్ళకి సహాయం చేయటం వెనకాల వాళ్ళు నాకు రుణపడి ఉండాలని భావించ లేదే! కనీసం ఆ భావాన్ని వాళ్ళకి కలిగించే ప్రయత్నం కూడా చేయలేదే! ఇవ్వాళ ఏమని అడుగుతానయ్యా? ఏనాడైనా నేను అధికారాన్ని ఒక బాధ్యతగా భావించానే తప్ప భవిష్యత్ కోసం ఉపయోగించుకునే అవకాశంగా కాదు. దుర్వినియోగం చేయగలిగిన వాళ్ళకి అధికారం ఒక వరం. నాలాంటి వాళ్ళకి అదొక శాపం. ఆ శాపం వల్లనే ఇప్పుడు ఆర్థికంగా నేనూ బాగుపడలేకపోయాను, నన్ను నమ్ముకున్నవాళ్ళకీ ఏమీ చేయలేకపోయాను... ఎవరైనా ఇప్పుడు ఎందుకు వచ్చి, నా అవసరాలు కనిపెట్టి పలకరిస్తారయ్యా! నా ప్రారబ్ధం నేనే అనుభవించాలి గదా..."

నా కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. అప్పటికింకేమీ మాట్లాడలేకపోయాను. ఆయన తన ఇంటి పత్రాల గురించి ఏదో చెప్పారు, వెళ్ళిపోయారు.

నేను ఆ ఇల్లు అమ్మకం గురించి తీవ్రంగా ప్రయత్నం చేసే లోపల - ఇది జరిగిన కొన్ని మాసాలకే - 2004 డిసెంబరు 23 న ఆయన ఢిల్లీలో కన్నుమూశారు.

ఆయన తన వకీళ్ళకి ఫీజుల బకాయిలు చెల్లించారో లేదో నాకు తెలీదు!

* * *

ఐఏఎస్ గుండెలోతుల్లోంచి...1

ఒక ఐఏఎస్ అధికారి. చాలా సీనియర్. 20 ఏళ్ళకి పైగా సర్వీసుంది. అకస్మాత్తుగా అతడి స్థానంలో మరో అధికారిని నియమించారు. ఇతనికి మాత్రం పోస్టింగ్ ఇవ్వలేదు. ఎక్కడా నియమించలేదు.

అతనికి అర్థమైంది. ముఖ్యమంత్రికో, మంత్రికో తనమీద ఆగ్రహం వచ్చింది. వాళ్ళు చెప్పిన పని తాను చేయలేదు. తమకి అనుకూలంగా వుండేవాడ్ని వేసుకున్నారు. వేసుకున్నారు సరే, తనని మరో పోస్టులో నియమించాలి కదా! ఎందుకు పోస్టింగ్ ఇవ్వలేదు.

ఆయన నా దగ్గరకు వచ్చాడు. "నాకు పోస్టింగ్ ఇవ్వకుండా గాలిలో వుంచేశారు ప్రసాద్. నెల రోజులు దాటిపోయింది. ఇదేమన్నా బాగుందా?" అని అడిగాడు.

అప్పట్లో నేను ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుకి మీడియా సలహాదారుని (సమాచారశాఖ కమీషనర్ని). ప్రతిరోజూ తెల్లవారు ఝామున సి.ఎం.ని కలిసే ఇద్దరు ముగ్గురు అధికారుల్లో నేను కూడా ఒకణ్ణి కావటంతో ముఖ్యమంత్రికి చాలా సన్నిహితుణ్ణని ఆయన అనుకున్నాడు. నేను అన్నాను "మీకు పోయిందేముంది. జీతం క్రమం తప్పకుండా వచ్చేస్తుంది కదా?"

"కాని, పనిచేయకుండా జీతం తీసుకోవడం అనైతికం కదా! పైగా అదంతా ప్రజాధనం వృథాచేయటమే అవుతుంది కదా!"

"ఇలాంటి ఛాందసభావాలు పెట్టుకునే రోజులు కావు వేదవ్యాస్‌గారూ. ఈ వ్యవస్థలో మార్పులు తప్పవు. మార్పులతో రాజీ పడకపోతే ఈ సర్వీసుల్లో ఇమడలేం. మీకు పోస్టింగ్ ఎప్పుడిస్తారో చెప్పలేను. అంతవరకూ మీకిష్టమైన ఆధ్యాత్మిక పుస్తకాలు రాసుకోవటం మేలు" అంటూ సలహా ఇచ్చాను. (ఆయన నిజంగానే నెలరోజుల్లో ఒక పుస్తకం రాశాడు.)

ఇలాంటి సంఘటనలు 1970 దశకం వరకూ ఒకటీ అరా వుండేవి. 1980 దశకం నుంచీ పెరుగుతూ వచ్చాయి. స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ స్థాయి అధికారుల్ని సయితం పోస్టింగ్ ఇవ్వకుండా సతాయించే రోజులు వచ్చేశాయి. పోస్టింగ్ ఇవ్వకపోతేనేం? జీతం ఇస్తారు కదా - అని బయటవాళ్ళు అనుకుంటారు. కాని ఉద్యోగంలో స్థాయి పెరిగినకొద్దీ ఐఏఎస్, ఐపిఎస్ అధికారుల్ని వెంటాడే ప్రధాన సమస్య - సాటి అధికార్లు తన గురించి ఏం చెప్పుకుంటున్నారో అన్న ఆలోచన. ముఖ్యమంత్రికో, మంత్రికో వచ్చిన కోపం కంటే, తనకి పోస్టింగ్ ఇవ్వకుండా, నెలల తరబడి గాలిలో వుంచేస్తే, సహచరుల ముందు చులకన అవుతానేమో నన్న భావన వల్ల

కలిగే బాధ వర్ణనాతీతం. పొరపాటున సహ అధికారి ఎవరన్నా ఫోన్ చేసి, "ఏం గురూ! నీకింకా పోస్టింగ్ ఇవ్వలేదట కదా!" అంటే అది పుండు మీద కారం చల్లినట్లు.

రాజకీయ నాయకులకు నచ్చకపోతే పోస్టుల్లోంచి మార్పించేస్తారు. మూడేళ్ళు పనిచేయాల్సిన చోట మూడు నెలలు కూడా వుండన్వరు. ఉదాహరణకి 1989లో ఒక మంచి ఐఏఎస్ అధికారి భాస్కర్‌ని విశాఖజిల్లా కలెక్టరుగా ప్రభుత్వం నియమించింది. ఎన్నికలొచ్చాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే రాజకీయ వత్తిడి వచ్చింది. భాస్కర్‌ని ఇంకేదో పోస్టులోవేశారు. అలాంటి అనుభవమే మరో పరిపాలనా దక్షుడైన అధికారి సి.ఎస్.రావుకి అదే జిల్లాలో అప్పటికి అయిదారేళ్ళు ముందు జరిగింది. మూడేళ్ళు చేయాల్సిన పోస్టు మూడు మాసాలకే ముగిసింది. వాళ్ళు చేసిన నేరం ఏమీ లేదు. అలాగని కారణం వివరించాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు.

నాకు తెలిసి, ఈ కాలంలో చాలామంది అమ్మాయిలు, అబ్బాయిలు సివిల్ పరీక్షలు రాస్తున్నారు. వాళ్ళందరికీ కనుపించే ఐఏఎస్ పోస్టులు సబ్‌కలెక్టరు, జాయింట్ కలెక్టరు, జిల్లా కలెక్టరు. ఈ పోస్టుల్లో వుండే ఆకర్షణ లక్షణం వాళ్ళని బాగా ప్రభావితం చేస్తోందని సివిల్స్‌కి సెలెక్షన్ అయిన వాళ్ళ ఇంటర్వ్యూలు చూస్తుంటే తెలుస్తోంది.

నిజం చెప్పాలంటే – పదోన్నతి క్రమంలో ప్రతి ఐఏఎస్ అధికారీ కనీసంగా రెండు మూడేళ్ళపాటు ఒకే పోస్టులో కొనసాగే వాతావరణం ఒకప్పుడు సహజంగా సాగేది. ఐఏఎస్ అధికారి జిల్లా కలెక్టరు స్థాయికి వచ్చాక కనీసం రెండు జిల్లాల్లో పనిచేయటం రివాజు. (గతంలో డిప్యూటీ సెక్రటరీ స్థాయిలో వుండగా ఈ అవకాశం కలిగేది. ఇప్పుడు జాయింట్ సెక్రటరీ స్థాయి వాళ్ళకే ఇస్తున్నారు.) కాని రెండు జిల్లాలు అవకాశం రాని వాళ్ళు ఒక జిల్లాతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిన సందర్భాలూ వున్నాయి. కొందరు మూడు జిల్లాల్లో కలెక్టరుగా పనిచేసిన సందర్భాలూ వున్నాయి. అసలు జిల్లా కలెక్టరుగా అవకాశం రానివాళ్ళూ వున్నారు. ఇంతచేసీ, రెండు జిల్లాల్లో పోస్టింగ్ ఇచ్చినా, ఏ జిల్లాలోనూ ఏడాదికి మించి పనిచేయనివ్వని రాజకీయ పరిస్థితులు. అసలు జిల్లాలో తూర్పుపడమరలు, స్థానిక అవసరాలూ, సమస్యలూ అర్థమయ్యేసరికే ఆరునెలలు గడిచిపోతాయి. ఇంక ఆ జిల్లాకి ఏ అధికారి అయినా ఏం చేయగలుగుతాడు?

పనిచేసే తాపత్రయం వున్న వాళ్ళకి ఇలా తగినంత అవకాశం లేకపోవటం, అత్యంత అసమర్థుడూ, అపారమైన 'బ్రతుకుతెరువు' మూటగట్టుకున్నవాడూ ఏళ్ళతరబడి ఒకే పోస్టులో కొనసాగటం, 'రాజీ' తత్వాన్ని ఒంటపట్టించుకున్నవాడు కీలకపోస్టుల్లోనే నియమితుడవుతూ వుండటం... ఇలాంటి వ్యత్యాసాలు సివిల్ సర్వీసుల్లో అసంతృప్తికీ, నైరాశ్యం, నిస్పృహ పెరగటానికీ దారితీస్తున్నాయని నేనొక విశ్లేషణ చేశాను.

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణాసంస్థ డైరక్టర్ జనరల్‌గా వుండగా నేను ఈ విశ్లేషణని అప్పటి కేంద్ర విజిలెన్స్ కమీషనర్ ఎన్. విఠల్ ముందు పెట్టాను. ఆయన ఛీఫ్

విజిలెన్స్ కమీషనర్ హోదాలో దేశంలోని సివిల్ సర్వీసుల పరిస్థితిని బాగా ఆకళింపు చేసుకున్న వాడు. నా ఆరాటం ఆయనకి వివరించాను. సివిల్ సర్వీసులనిర్వహణ రాను రాను ఎంత అసంబద్ధంగా తయారవుతోందో అనేక ఉదాహరణలతో వివరించాను.

నేను 1966 ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌కి చెందిన వాణ్ణి. మా బ్యాచ్‌లో ఆలిండియా టాపర్ అభాష్ ఛటర్జీ. అసాధారణమైన ప్రజ్ఞాపాటవాలు కలవాడు. ఈ అభాష్ ఛటర్జీ వంటి వాళ్ళు రాష్ట్రానికో పదిమంది కీలక స్థానాల్లో వుంటే దేశ భవిష్యత్‌ని మార్చేయచ్చు అనుకునేవాణ్ణి. ఇతనికి బీహార్‌లో పోస్టింగ్ వచ్చింది. అంటే ఆ రాష్ట్ర కేడర్‌కి కేటాయించారు. 15 ఏళ్ళు సర్వీసయ్యేసరికి అతని మేధస్సంతా తుప్పుపట్టే పరిస్థితి ఏర్పడింది. "ఈ రాజకీయ నాయకుల్ని సంతృప్తి పరచటం కోసం రాజీపడే క్రమంలో - మనం ఏ ఉదాత్తలక్ష్యంతో ఈ సర్వీసుల్లోకి వచ్చామో ఆ లక్ష్యాన్ని సాధించలేమని నాకర్థమైపోయింది బాస్. నేను రాజీనామా చేసేస్తున్నాను" అన్నాడు నాతో ఢిల్లీలో ఒక రోజు. అప్పటికి దాదాపు 20 ఏళ్ళు సర్వీసు పూర్తిచేసుకున్నాడు.

నేనొక వేదాంతం చెప్పాను. "నువ్వు రాజీపడాల్సిన విషయాలు 20 శాతమో 30 శాతమో వుండొచ్చు. మిగతావన్నీ నువ్వు స్వతంత్రంగా ఆలోచించి ప్రజలకీ, మీ రాష్ట్రానికీ ఏది మంచిదో అదే చేయగల అవకాశాన్నిస్తున్నాయి గదా! ఇంకే ఇతర సర్వీసులోనూ ఇలాంటి అవకాశం లేదుగదా!"

"కాని రాజీపడే ధోరణి క్రమంగా నా సృజనాత్మక శక్తిని, పనిచేసే స్ఫూర్తిని చంపేస్తున్నాయి..." అంతే! అతను సర్వీసులు వదిలేసి వెళ్ళిపోయాడు.

అతనొక్కడే కాదు. రాజస్థాన్ కేడర్‌కి చెందిన శ్రీమతి అరుణా రాయ్‌కూడా అంతే. 15 ఏళ్ళు కూడా ఆమె సర్వీసులో కొనసాగలేదు. "జిల్లా కలెక్టరు పోస్టు తర్వాత ప్రజలకి దూరమైపోతాం. సెక్రెటేరియెట్‌లో ఫైళ్ళు రాసుకోవటమే తప్ప ప్రజలకోసం పనిచేసే అవకాశం తక్కువ..." అంటూ రాజీనామా చేసేసి, ఆమె ఒక స్వచ్ఛంద సేవా సంస్థని స్థాపించి, దాని ద్వారా సమాచార హక్కు చట్టంకోసం పోరాడింది. (అప్పుడే మొట్టమొదటగా రాజస్థాన్ ప్రభుత్వం ఈ సమాచార హక్కు జి.ఓ.ని జారీ చేసింది)

ఇలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా జరిగింది. నిజంగా ప్రజలకోసం పనిచేయాలన్న తపన తాపత్రయం వున్న ఎంతమంచి ఆఫీసరైనా ఒకే పోస్టులో కనీసం రెండేళ్ళు వుంటాడన్న గ్యారంటీ లేదు. అదే సమయంలో - ఎంతటి అసమర్థుడైనా ఏదో ఒక పోస్టులో రిటైరయ్యేదాకా పనిచేస్తూనే వుంటాడు. ఇలాంటి భావాలతో సర్వీసు వదిలేసి బయటకి వచ్చినవాడే డాక్టర్ జయప్రకాశ్ నారాయణ కూడా.

... ఇలాంటి విషయాలన్నీ విఠల్‌తో సుదీర్ఘంగా చర్చించాను. విఠల్ సారథ్యంలో ఒక కమిటీని ఏర్పాటుచేశాం. ఈ కమిటీ సివిల్ సర్వీసుల ప్రస్తుత స్థితిగతుల్ని అధ్యయనం చేసింది.

సర్వీసుల్లో భద్రత కావలసినంత వుంది. కాని పోస్టింగుల్లో మాత్రం అభద్రతాభావం వెంటాడుతూనే వుంటుంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో చాలా సంవత్సరాల వరకూ బ్రిటిష్‌కాలంనాటి ఇండియన్ సివిల్ సర్వీసెస్ (ఐసిఎస్) అధికారులు కొనసాగుతూ వచ్చారు. అప్పట్లో చీఫ్ సెక్రటరీ అధికారాలేమిటి? విధులేమిటి? రాష్ట్ర ప్రభుత్వానికి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా చీఫ్ సెక్రటరీ పాత్ర ఎంత కీలకమైంది?... ఇలా ప్రారంభించి, ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ అమల్లోకి వచ్చాక పాలనా యంత్రాంగం ఎలా వుండేది? పరిపాలనలో ఐఎఎస్ అధికారులకి విధులు, సర్వీసులు ఏయే స్థాయిలో ఎలా వుండేవి! పోస్టింగుల్లో భద్రత, పనిచేసేవాళ్ళకి ప్రోత్సాహం, పోస్టింగ్‌ల క్రమం ఎలా వుంటే ఈ సర్వీసులు రాష్ట్రాల అభివృద్ధికి మరింత ఎక్కువగా ఉపయోగపడతాయి? బదిలీల విధానం ఎలా వుండాలి?... పోస్టింగుల్లో ఎలాంటి విధానాన్ని పాటించాలి?... ఇలాంటి అనేక అంశాలను కమిటీలో చర్చించాం.

రాజకీయ నాయకులతో రాజీపడితే ఏమైంది? మంచిపోస్టింగ్‌లు సంపాదించుకోవచ్చు గదా! అనుకునేవాళ్ళు లేకపోలేదు. కాని వాళ్ళకి సులభంగా అర్థంకాని విషయం ఏమిటంటే ఈ రాజకీయ వ్యవస్థకి వాళ్ల సేవల్ని వినియోగించుకోవడంలో వుండే నైపుణ్యం, వాళ్లేదన్నా సమస్యలో ఇరుక్కుంటే కాపాడటంలో వుండదు.

ఒక ఐఎఎస్ అధికారి వుండేవాడు. అతను పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరుగా పనిచేసినప్పుడు మంచిపేరు సంపాదించుకున్నాడు. ఆ పేరువల్లనే రంగారెడ్డి జిల్లా ఏర్పడ్డాక ఆ జిల్లాకి తొలి కలెక్టరుగా నియమితుడయ్యాడు. క్రమంగా ఒక కీలక మంత్రి గారికి చాలా సన్నిహితుడిగా ప్రచారంలోకి వచ్చారు. అప్పుడు మరో జిల్లా (నెల్లూరు)కి కూడా కలెక్టరుగా వేశారు. ఏవో ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణ విషయంలో నిబంధనల్ని అతిక్రమించాడన్న అభియోగంపై ప్రభుత్వం అర్థాంతరంగా బదిలీ చేసింది. అంతే! ఏ రాజకీయ శక్తీ ఆ బదిలీని ఆపలేకపోయింది.

నేను తరచూ పోస్టింగుల్లో ఔచిత్యం గురించి మాట్లాడుతుంటే, ఒకరోజున విఠల్‌గారు అడిగారు. "పోస్టింగుల్లో ఔచిత్యం ప్రశ్నేముంది ప్రసాద్! ఏ పోస్టులో అయినా పనిచేయాలికదా?"

"పనిచేస్తాం. చేయాలి. కానీ ఒక్కోసారి ఏం జరుగుతుందంటే..." అంటూ నా సొంత ఉదాహరణ ఒకటి చెప్పాను.

1973లో రాష్ట్రపతిపాలన అమల్లోకి రాగానే అంతకుముందు ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావుగారి దగ్గర పనిచేసిన నన్ను చక్కెర శాఖకి డైరక్టరుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది ప్రభుత్వం. రాష్ట్రపతిపాలనలో నా పోస్టింగే మొదటి పోస్టింగు. అప్పుడు గవర్నరు సలహాదారులుగా నియమితులైనవారు హెచ్.సి.శరీన్, వి.కె.రావు. తీరా నేను వెళ్లి ఆ శాఖలో

చూస్తే ఈ డైరక్టరు పోస్టు అజమాయిషీలో చాలా సహకార చక్కెర ఫ్యాక్టరీలున్నాయి. వాటిల్లో నాలుగు ఫ్యాక్టరీల మేనేజింగ్ డైరక్టర్లు ఐఏఎస్.లే. కాని వాళ్లు నలుగురూ నాకన్నా సీనియర్‌లు. రేపట్నుంచి వాళ్లు తమకన్నా చాలా జూనియర్ అయిన పి.వి.ఆర్.కె.ప్రసాద్‌కి రిపోర్టులు పంపుతూ వుండాలి అంటే వాళ్ళకి ఎంత మనోవ్యధ? వాళ్ళకి నేనేం ఆదేశాలిచ్చి పనిచేయించగలను?...

ఈ పరిస్థితిని నేను శరీన్, వి.కె.రావుల దృష్టికి తీసుకువెళ్ళాను. వాళ్ళు నాలుక కొరుక్కున్నారు.

"అరెరే, నువ్వు సి.ఎం దగ్గర సెక్రటరీగా వుంటే, సీనియర్‌వే అయివుంటావనుకున్నామయ్యా ప్రసాద్! ఇంత జూనియర్‌వి అనుకోలేదు. కాని, ఇదే మా మొదటి జి.ఓ. దీన్ని మార్చటం మహా అవమానం. కాబట్టి మార్చే ప్రశ్నే లేదు. నువ్వెళ్ళి షుగర్ డైరక్టర్‌గా జాయిన్ అయిపో" అన్నారు. అయితే నా పోస్టింగులో ఏర్పడిన అనౌచిత్యాన్ని సరిచేసుకోవడంకోసం ఆ నలుగురు ఐఏఎస్ అధికారుల్ని అక్కడ్నుంచి మార్చేసి, వాళ్ళ స్థానాల్లో నాకన్నా జూనియర్‌లని నియమించారు. ఇదేం విధానం?

ఒక నగరంలో పోలీసు కమీషనర్, మున్సిపల్ కమీషనర్, జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, నగరాభివృద్ధి సంస్థ వైస్ ఛైర్మన్... ఇలా అయిదారు విభాగాల అధిపతులుగా ఐఏఎస్‌లుండే చోట ఒకరిద్దరు చాలా సీనియర్‌లయి, మిగతా వాళ్ళు జూనియర్‌లయితే, 'ఎక్కువ-తక్కువ' భావాల ఘర్షణలు తలెత్తుతున్నాయి. ప్రతి ఐఏఎస్సూ ముందుగా చూసేది - మిగతావాళ్ళు ఏ బ్యాచ్ వాళ్ళు అన్నదే. ఇలా జరక్కుండా ఎందుకు చేయలేం?

విఠల్‌కి నేను చెప్పదల్చుకున్నది బాగా అర్థమైంది. అక్కడ్నుంచి ఈ కమిటీ సుదీర్ఘంగా కొన్ని మాసాలపాటు కసరత్తుచేసి, సివిల్ సర్వీసుల వినియోగాన్ని క్రమబద్ధం చేయటానికి ఒక 'సివిల్ సర్వీసెస్ బోర్డు' వుండాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సుని అప్పటి చంద్రబాబు నాయుడి ప్రభుత్వానికి పంపించాం.

బహుశా... ఆ సిఫార్సు నివేదిక ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో 'భద్రంగానే' వుందనుకొంటాను!

★ ★ ★

ఐఏఎస్ గుండెలోతుల్లోంచి...2

కొంతమంది చీఫ్ సెక్రటరీలు వాళ్ళ పదవీ కాలం పూర్తికాక మునుపే అకస్మాత్తుగా ప్రాధాన్యత లేని పోస్టులోని బదిలీ కాబడుతుంటారు.

చీఫ్ సెక్రటరీగా పనిచేసిన రామకృష్ణ అనుభవం అదే. ఆయన తరువాత కొంతకాలం సాఫీగా నడిచినా, మళ్ళీ ఆనందరావు దగ్గరకొచ్చే సరికి పరిస్థితులు వికటించి, ఆయన కూడా అర్ధాంతరంగా సెలవు పెట్టేశారు. ఆయన్ని అంతగా ప్రాధాన్యత లేని పోస్టులో ప్రభుత్వం నియమించింది.

ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో చేరిన ప్రతివ్యక్తీ 30-35 ఏళ్ళ సర్వీసు గడిచాక ఏదో ఒక రోజు చీఫ్ సెక్రటరీ అవుతాను కదా అనుకుంటాడు. కాని ఆ హోదాకి చేరుకున్నాక చీఫ్ సెక్రటరీగా నియమింపబడే అవకాశం (అదృష్టం) మాత్రం అందరికీ రావటం లేదు. సీనియారిటీ ప్రకారం నియమించి తీరాలన్న నిబంధన ఏమీ లేకపోవటంతో, ఎవర్ని చీఫ్ సెక్రటరీగా నియమించాలి అన్నది ముఖ్యమంత్రి ఇష్టం.

ఒక్కో ముఖ్యమంత్రి విధానం ఒక్కో రకంగా వుంటుంది. ఒకరు సీనియారిటీని గౌరవిస్తాం అంటారు. మరొకరు సామర్థ్యాన్ని గౌరవిస్తాం అంటారు. పైకి ఎవరు ఎలా చెప్పినా ప్రతి ముఖ్యమంత్రీ తన ప్రభుత్వ ప్రతిష్ఠని ఇనుమడింపచేయగల/కాపాడగల అధికారి చీఫ్ సెక్రటరీగా రావాలని కోరుకుంటారు. ప్రభుత్వ ప్రతిష్ఠని కాపాడటం అన్న పదాలకి అర్థం చాలా 'లోతైంది'.

నిజానికి ఒకప్పుడు చీఫ్ సెక్రటరీ పోస్టుకి పరిపాలనలో చాలా ప్రాధాన్యత ఉండేది. ప్రజాస్వామ్య వ్యవస్థలో మంత్రి మండలి అనేది విధాన నిర్ణయాలు తీసుకునే వేదిక. దీనికి అధ్యక్షుడు ముఖ్యమంత్రి. రాష్ట్రానికి మంచిది అనుకునే విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం, పథకాలు రచించడం మంత్రి మండలి బాధ్యత. దీన్ని అమలు చేసే యంత్రాంగాన్ని నడిపే వ్యవస్థకి ప్రధాన సారథి చీఫ్ సెక్రటరీ. స్వాతంత్ర్యం వచ్చాక 1970 దశకం మధ్యలో రెవెన్యూ బోర్డు రద్దు అయ్యేవరకూ ఇదే విధానం నడిచేది. రాష్ట్రానికి వివిధ మార్గాల్లో వచ్చే రెవెన్యూని పెరిగేలా చూసే బాధ్యత ఈ బోర్డు సభ్యులదే. ఒక్కో సభ్యుడు రెవెన్యూ తెచ్చే ఒక్కొక్క శాఖకి కమీషనర్‌గా ఉండేవారు. (చాలా సందర్భాల్లో వీళ్ళు కార్యదర్శి కన్నా సీనియర్ అయి ఉండేవారు)

ఈ బోర్డు ఉన్నంత వరకూ రాష్ట్రంలో ఐ.ఏ.ఎస్ సర్వీసులు ఒక పద్ధతిగా సాగేవి. ప్రతి సభ్యుడూ ప్రతి జిల్లా కలెక్టరు పనితీరు మీద రిపోర్టులు రాసేవాళ్ళు. బోర్డు మొత్తం సంతృప్తి చెందితేనే ఆ జిల్లా కలెక్టరుగా బాగా పనిచేసినట్లు లెఖ్క. అందుకే బోర్డు మెంబరు జిల్లాకి

వస్తున్నారంటే కలెక్టర్లు, అప్పటి జిల్లా రెవెన్యూ అధికార్లు (ఇప్పటి జాయింట్ కలెక్టర్లు) విపరీతమైన శ్రద్ధతో లక్ష్యాల సాధన మీద దృష్టి కేంద్రీకరించే వాళ్ళు. మంత్రికి భయపడినా పడకపోయినా రెవెన్యూ బోర్డు మెంబరుకి కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు భయపడేవాళ్ళు.

అందుకే జమాబందీ (జిల్లాలో రెవెన్యూ వసూళ్ళు, రికార్డుల నిర్వహణ), ఇన్‌స్పెక్షన్‌లు ఒక క్రమపద్ధతిలో జరిగేవి. అప్పటికే పూర్వప్రధానకార్యదర్శి ఎం.టి. రాజు రూపొందించిన సమీకృత పాలనా విధానం ప్రకారం జిల్లాల్లో అన్ని అభివృద్ధి కార్యక్రమాల అమలుకి జిల్లా కలెక్టర్లని బాధ్యుల్ని చేయటం జరిగింది. (బ్రిటిష్ కాలంలో జిల్లాకి కలెక్టరు అంటే రెవెన్యూ కలెక్టరు, శాంతి భద్రతల నిర్వహణాధికారి మాత్రమే.) దీంతో ప్రభుత్వానికి జిల్లాల్లో అభివృద్ధి పనులను పర్యవేక్షించటం సులభమైంది. దీన్ని మరింత పటిష్ఠం చేసింది రెవెన్యూ బోర్డు వ్యవస్థ.

పనిచేయాలన్న తపన, పనిచేసే తత్వం వున్న ఐఏఎస్ అధికారుల సామర్థ్యాన్ని మరింత వాడిగా తీర్చిదిద్దటంలో రెవెన్యూ బోర్డు వ్యవస్థ బాగా దోహదపడుతుండేది. అలాంటి నేపథ్యంలో ఎదిగిన కొందరు ఐఏఎస్ అధికారుల్లో - అమెరికాలో మన దేశ రాయబారిగా పనిచేసిన అబిద్ హుస్సేన్, కేంద్ర ప్రభుత్వంలో క్యాబినెట్ సెక్రటరీలుగా పనిచేసిన కృష్ణస్వామి రావు సాహెబ్, టి.ఆర్.ప్రసాద్, ప్రధానమంత్రి కార్యాలయంలో కార్యదర్శులుగా పనిచేసిన రాజామణి, కె.ఆర్.వేణుగోపాల్, యుగంధర్, ప్రపంచ వాణిజ్య సంస్థలో భారత ప్రతినిధిగా పనిచేసిన ఎస్.నారాయణన్, రిజర్వుబ్యాంకు గవర్నర్లు వై.వేణుగోపాలరెడ్డి, దువ్వూరి సుబ్బారావు వంటి వాళ్ళు వున్నారు. జిల్లాల్లో పనిచేసినప్పుడు అక్కడి ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా పనిచేసినవాళ్ళు కూడా వున్నారు. ఉదాహరణకి పశ్చిమగోదావరి జిల్లా రైతులు ఇప్పటికీ - 40 ఏళ్ళ క్రితం పనిచేసిన కలెక్టరు కె.సుబ్రహ్మణ్యాన్ని స్మరిస్తూనే వుంటారు. అలాగే పేద ప్రజల పక్షపాతిగా ఎస్.ఆర్.శంకరన్ ప్రతిష్ఠ సుస్థిరమైంది. ఎస్.ఆర్.రామ్మూర్తి, యు.బి.రాఘవేంద్రరావు, జి.పి.రావు వంటి ఐఏఎస్ అధికారులు కొందరు తాము పనిచేసిన ప్రతిచోటా తమదంటూ ఒక చెరగని ముద్ర వేశారు. ఇలాంటి వాళ్ళు ఇంకా ఎందరో... అలాగే కొంతమంది బద్ధకస్తులైన అధికారులు రెవెన్యూ బోర్డు ఉనికివల్ల భయపడి శ్రద్ధగా పనిచేయటం నాకు తెలుసు.

ఎప్పుడైతే రెవెన్యూ బోర్డు వ్యవస్థ రద్దయిందో పరిస్థితులు మారుతూ వచ్చాయి. ఐ.ఏ.ఎస్ అధికారుల పనితీరుపై రెవెన్యూ బోర్డు రాయవలసిన రిపోర్టుల్ని ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు లేదా ప్రధాన కార్యదర్శి రాస్తూ వస్తున్నారు. రెవెన్యూ బోర్డు ఉన్నప్పటి భయభక్తులు తగ్గుతూ వచ్చాయి. సరైన ఇన్‌స్పెక్షన్ వుంటేనే గదా ఏ కలెక్టరుకయినా భయం వుండాలి?

1980 దశకం ద్వితీయార్థంలో ఒక తెలంగాణా జిల్లాలో ఒక కలెక్టరు వుండేవాడు. జిల్లాలో పరీక్షలు జరుగుతున్నాయి. పదవతరగతివో, ఏడవ తరగతివో పరీక్షలవి. ఆ పరీక్షలకి ఒక విద్యార్థి 35 నిమిషాలు ఆలస్యంగా వెళ్తే, పరీక్షహాల్లో ఇన్విజిలేటర్ అనుమతించలేదు. ఆ విద్యార్థి తండ్రికి కలెక్టరుగారి దగ్గర పరపతి బాగా వుంది. దాంతో కలెక్టరు రంగ ప్రవేశం

చేశారు. ఆయన ఆదేశంతో జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా ఆ విద్యార్థిని తన జీపులో ఎక్కించుకొని అదే పరీక్ష హాలుకి తీసుకెళ్ళి, నిబంధనలకి విరుద్ధంగా "కలెక్టరు ఆదేశాలమేరకు" ఆ విద్యార్థిని అనుమతింపజేశాడు. (కొద్ది రోజులకే ఆ కలెక్టరుని ప్రభుత్వం బదిలీ చేసింది).

ఇలాగే మరో ఐఏఎస్ ఆఫీసర్ - 1982 లో అనుకుంటాను - చిత్తూరు జిల్లాలో సబ్ కలెక్టరుగా వుండేవాడు. అతను ఏదో క్యాంపు నుంచి తిరిగి వస్తూ ఒక రాత్రివేళ దారిలో కనబడిన సోషల్ వెల్ఫేర్ హాస్టల్ మీద 'తనిఖీ'కి దిగాడు. అతని దగ్గర భరించలేని మద్యం కంపుకొడుతోంది. "హాస్టల్ వార్డెన్ ఎక్కడ?" అని హుంకరించాడు. పిల్లలు "తెలీదు" అన్నారు. తాను తనిఖీకి వస్తే హాస్టలు వార్డెన్ లేకుండాపోతాడా? - అనుకుంటూ వార్డెన్ గది తలుపుల తాళం పగలగొట్టించి, అక్కడి రికార్డులన్నీ తన వాహనంలో వేయించి పట్టుకుపోయాడు. మర్నాడు ఆ వార్డెన్‌కి 'సస్పెన్షన్' ఉత్తర్వులు తానే జారీ చేశాడు. (నిజానికి సాంఘిక సంక్షేమ శాఖకి చెందిన వార్డెన్‌ని సస్పెండ్ చేసే అధికారం సబ్ కలెక్టర్‌కి వుండదు.)

రెండోరోజున ఇదంతా ఒక పత్రికలో వచ్చింది. ఎలాంటి ముందస్తు కార్యక్రమం లేకుండా సబ్ కలెక్టర్ తనిఖీ ఏమిటి? అదైనా అంత రాత్రివేళ తనిఖీ ఏమిటి? అయినా వార్డెన్ గదితాళం పగలగొట్టి రికార్డు పట్టుకుపోవటమేమిటి? పైగా మర్నాడు తనకు లేని అధికారాన్ని ఉపయోగించి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయటమేమిటి? ఇదంతా అప్పట్లో సంక్షేమ శాఖకి, రెవెన్యూ శాఖకి మధ్య వివాదాన్ని, అగాధాన్ని సృష్టించింది.

... ఇలాంటి సంఘటలన్నింటికీ కారణం కొత్తతరం ఐఏఎస్ అధికారుల్లో తాము సర్వ స్వతంత్రులమనో, సర్వశక్తిమంతులమనో భావం కలగటం, ప్రభుత్వ వ్యవస్థలో తాము కేవలం ప్రజాసేవకోసం నియోగించబడ్డ ఉద్యోగులం మాత్రమే అన్న స్పృహ తగ్గటం, ప్రభుత్వానికి గల క్రమశిక్షణాధికారాల పట్ల భయం క్షీణించటం, విలువలు దిగజారటం.

ఇదెలా జరిగిందంటే...

రెవెన్యూ బోర్డు రద్దయ్యాక దానికి ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పడలేదు. చీఫ్ సెక్రటరీకే ఆ అధికారాలు చాలావరకు సంక్రమించాయి. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు పెరుగుతున్నకొద్దీ చీఫ్ సెక్రటరీకి పని వత్తిడి పెరిగిపోయింది. నిజంగా జిల్లాలో తిరిగి ఇనస్పెక్షన్ రిపోర్టులు రాసే తీరిక, సమయం ఛీఫ్ సెక్రటరీకి లేకుండా పోయింది. దానికి తోడు చీఫ్ సెక్రటరీ అవటానికి కేవలం సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకునే రోజులు పోయాయి. ఎంత సీనియారిటీ వున్నా పనిలో (రాజకీయ వ్యవస్థతో రాజీ పడటంలో) సామర్థ్యం ఎక్కువగా వున్న ఐఏఎస్ అధికారినే చీఫ్ సెక్రటరీగా ఎంచుకునే పరిస్థితులు వచ్చాయి. అలాంటి సామర్థ్యం ప్రదర్శించ గల్గినంత కాలం చీఫ్ సెక్రటరీగా ఉంటారు. రిటైర్ అయినా ఎక్స్‌టెన్షన్ తెచ్చుకుంటారు. ఏ రోజు అలా చేయకపోతే ఆ రోజే రామకృష్ణలాగా, ఆనందరావు లాగా లూప్ లైన్లోకి వెళ్ళిపోతారు... ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని స్వప్రయోజనాల కోసం అధికారుల మీద పెత్తనం చలాయించాలని

చూసే రాజకీయ శక్తులు పుట్టుకొచ్చాయి. ఈ పరిస్థితి ప్రొటోకాల్‌కి విరుద్ధంగా, ఛీఫ్ సెక్రటరీకి సయితం తెలియకుండా మంత్రుల్ని, ముఖ్యమంత్రిని మంచి చేసుకుని లబ్ధిపొందాలనుకునే అధికారులకి అవకాశమిచ్చింది... క్రమంగా విలువలు కూడా మారిపోతూ వచ్చాయి.

అసలు విలువలకి అర్థాలే మారిపోతున్నాయి.

నేను ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుగారి దగ్గర మీడియా సలహాదారుగా వుండగా ఒకసారి పి.వి.గారు గల్ఫ్ దేశాల పర్యటన చేశారు. ఓమన్ దేశంలో పర్యటన ముగిసి తిరిగి వచ్చేటప్పుడు ఆ దేశపు రాజు మన ప్రధాని వెంట వెళ్ళిన అధికారులకు బహుమతులిచ్చారు. నాకూ ఒక వాచీ ఇచ్చారు. అది చాలా ఖరీదైనది. సర్వీసు నిబంధనల ప్రకారం విలువైన బహుమతుల్ని ఎక్కడన్నా ఎప్పుడన్నా తీసుకోవాల్సి వస్తే సదరు ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారి ఎవరైనా సరే దాన్ని వెంటనే ప్రభుత్వానికి అధికారికంగా తెలియజేయాలి. తనకి ఎవరా బహుమతి ఇచ్చారో, ఏ సందర్భంలో ఇచ్చారో తెలుపుతూ, తన ఉద్యోగంలోని విధినిర్వహణకూ ఆ బహుమతిచ్చిన వ్యక్తికీ ఎలాంటి సంబంధమూ లేదని కూడా రాత పూర్వకంగా ప్రకటించాలి. ఒకవేళ ఆ బహుమతి తన అధికార హోదాని బట్టి ఇతర రాష్ట్రంలోనో, దేశంలోనో అక్కడి ప్రభుత్వమో, సంస్థలో ఇచ్చివుంటే ఆ బహుమతిని ప్రభుత్వానికి చెందినదిగా గుర్తించి, ప్రభుత్వానికి అప్పగించాలి.

ఈ నిబంధనల ప్రకారం నేను ఆ వాచీని భారత ప్రభుత్వానికి అప్పగించెయ్యాలి కదా! నేను అలాగే ఓ డిక్లరేషన్ (ప్రకటన పత్రం) తయారుచేసి, దానికి ఈ వాచీని ఆతపరిచి, ప్రధాన మంత్రి ముఖ్యకార్యదర్శి ఎ.ఎన్.వర్మగారికి సీల్డ్ కవర్‌లో పంపించాను. ఆయన అది తెరిచి, చూసుకున్న వెంటనే నాకు కబురుచేశారు. వెళ్ళాను.

"ప్రసాద్, ఏమిటిదీ?" అన్నారు.

"నిబంధనల ప్రకారం చేయాల్సింది చేశాను సర్" అన్నాను.

"భలే వాడివయ్యా! నువ్విలా చేస్తే మిగతా వాళ్ళంతా ఏమై పోవాలి? ఇలా బహుమతుల్ని ప్రకటించటం, అప్పగించటం అంతా నిబంధనల్లో వున్నప్పటికీ, ఒకటి రెండు దశాబ్దాల నుంచీ ఇక్కడెవరూ చేస్తున్నట్లు లేదు. ఇందిరాగాంధీతో, రాజీవ్‌గాంధీతో, వి.పి.సింగ్‌తో విదేశాలకు వెళ్ళిన ఏ అధికారీ ఇలా ప్రకటించిన దాఖలా లేదు. ఇప్పుడు ఏ అధికారీ చేయటం లేదు. నువ్వు కొత్తగా మొదలు పెడితే నేను మిగతా అధికారులందర్నీ అడగాల్సి వస్తుంది. మమ్మల్నందర్నీ ఇరకాటంలో పెట్టిన వాడవవుతావు. దయచేసి, దీన్ని నీతో పట్టుకుపో, నిన్నెవరూ దీన్ని గురించి అడగరు."

"సర్, నిబంధనల ప్రకారం..." అంటూ నేను నీళ్ళు నమిలాను. వర్మగారు నన్నింక మాట్లాడనివ్వలేదు. ఆ కవర్ నాచేతుల్లో పెట్టేసి "నువ్వీ విషయం ఇక్కడితో మర్చిపోవటం మంచిది ప్రసాద్" అంటూ నన్ను పంపిచేశారు.

విలువల్లో మార్పులకి అద్దం పట్టే ఒక అల్పాతి అల్పమైన సంఘటన ఇది. ఇంతగా విలువలు మారుతూవున్నా, రెవెన్యూ బోర్డుకి ప్రత్యామ్నాయంగా బలమైన క్రమశిక్షణా నియంత్రణ వ్యవస్థ ఏదీ ఏర్పడకపోయినా ఇంకా రాష్ట్రంలో ఎంతో కొంత అభివృద్ధి జరుగుతోందీ అంటే అందుకు కారణం నిజంగా ప్రజలకోసం ఏదో చేయాలన్న తాపత్రయం వున్న వ్యక్తులు... అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులోనూ, రాజకీయాల్లోనూ మిగిలివుండటమే.

జిల్లాలో వుండగా సబ్‌కలెక్టరు, జాయింట్ కలెక్టరు, ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసరు, డిఆర్‌డిఏ ప్రాజెక్టు ఆఫీసరూ, జిల్లా కలెక్టరూ – ఇలాంటిపోస్టుల్లో పనిచేసేటప్పుడు మన వల్ల ప్రయోజనం పొందిన ప్రజలు జయజయ ధ్వానాలు చేస్తుంటే అదంతా నిజమే అనిపిస్తూంటుంది. పనిచేయించుకునే వాళ్ళు ఎంత తెలివైన వాళ్ళంటే వాళ్ళు ఆయా అధికారుల్ని "మీ లాంటి గొప్ప అధికారిని గతంలో ఎప్పుడూ చూడలేదు సర్" అంటుంటారు. ఈ పొగడ్తలన్నీ మన పెరుగురలకి అగడ్తలని అప్పుడు తెలీక, అంతా నిజమేనన్న భ్రమలో మునిగిపోతాం. జిల్లాల్లో వుండే విస్తృత అధికారాల కారణంగా మన క్రింది అధికారులు మనం చేసే ప్రతి పనికీ "ఆహా, ఎంత తెలివైన వారు సర్ మీరు" అంటుంటే అదొక మైకం కమ్మేసి "నా అంతటి మేధావి నేను ఒక్కణ్ణే" అన్న అతి విశ్వాసంలో మునిగి తేలుతుంటాం.

కాని సమస్య అక్కడే మొదలవుతుంది. జిల్లాపోస్టింగ్‌లు దాటి సెక్రటేరియట్‌కి వచ్చాక కూడా జిల్లాల్లో ఉండగా కమ్మిన మైకం పొరలు ఒక పట్టాన విడిపోవు. ఇతర అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాల్సి వచ్చేసరికి ఎక్కడలేని అతివిశ్వాసం, అభిజాత్యం అడ్డుపడు తుంటాయి. సెక్రటేరియట్‌లో ఒక్కొక్కసారి ఒకే ఫైల్‌ని నాలుగైదు శాఖల కార్యదర్శులు చూడాల్సి వస్తుంది. ఒకరి అభిప్రాయం మరొకరికి నచ్చదు. ఒక్కోసారి మంత్రిగారో, ముఖ్యమంత్రిగారో ఏదన్నా సమస్య ఇచ్చి దానికి పరిష్కారం అడుగుతారు. లేదా ఒక పథకం గురించి చర్చ లేవనెత్తుతారు. ఇలాంటి ఏ విషయమైనా పరిష్కరించాలంటే ఆ స్థాయిలో కేవలం ఒక ఐఏఎస్ అధికారి వల్లనే జరగదు. అనేక సందర్భాల్లో ఒకే విషయంలో సంబంధిత టెక్నోక్రాట్స్ (సాంకేతిక నిపుణులు) అభిప్రాయాలు తీసుకోవాలి. న్యాయశాఖ అధికారుల అభిప్రాయాలు తీసుకోవాలి. ఆర్థిక శాఖ ఆమోదం తీసుకోవాలి. అమలుచేయటానికి గల సానుకూలతపై క్రింద క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది అభిప్రాయం తీసుకోవాలి. రాజకీయంగా బాస్‌ల ప్రయోజనాలు కూడా పరిగణనలోకి తీసుకోవాలి. (వాళ్ళు పనిచేసేదీ ప్రజలకోసమే కదా!) ఒక్కొక్కసారి ఇతర శాఖల కార్యదర్శుల్ని సంప్రదించి, వాళ్ళ భావాల్ని కూడా సమన్వయం చేసుకుని ఆలోచించాలి.

అలాంటి సందర్భాల్లోనే 'అహం' భావాల ఘర్షణలు తలెత్తుతున్నాయి. "నా అంతటి మేధావి ఇచ్చిన సలహానే కాదంటున్నాడే" అన్న కోపం, అవతలి వ్యక్తి భావాలని గౌరవించలేని అసహనం, సమన్వయంతో పనిచేయాలన్న స్పృహ లేకపోవడం... వగైరాలు సంభవిస్తున్నాయి. చివరికి నలుగురు మేధావులైన ఐఏఎస్‌లు కలిస్తే ఎంత మంచి కార్యక్రమం అయినా సజావుగా అమలు కాలేని పరిస్థితి ఏర్పడుతోంది. అన్ని సందర్భాలలోను ఇలాగే జరుగుతోందనికాదు,

కాని అనేక సందర్భాలలో ఇదే జరుగుతోంది. అందరు ఐఏఎస్‌లూ ఇలాగే ఉంటారని కాదు, కాని...

నేను మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణా సంస్థకి, సుపరిపాలనా సంస్థకి డైరక్టరు జనరల్‌గా ఉండగా (2001-02 కాలంలో అనుకుంటాను) హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి మేనేజ్‌మెంటు నిపుణులైన ప్రొఫెసర్లని రప్పించాను. వారం రోజుల పాటు సీనియర్ ఐఏఎస్, ఐపిఎస్ అధికారులకీ, వివిధ శాఖాధిపతులైన నాన్-ఐఏఎస్ అధికారులకీ పునశ్చరణ కార్యక్రమం నిర్వహించాను. సర్వీసులో రకరకాల సమస్యలు వస్తే ఎలా ఎదుర్కోవాలి? పరిష్కారం కోసం చూసేటప్పుడు మన ఆలోచనా ధోరణి ఎలా వుండాలి? 'పాజిటివ్ థింకింగ్' అంటే ఏమిటి? పాలనా యంత్రాంగంలో దీని అవసరం ఎంత వుంది?... ఇలాంటి అనేక అంశాల మీద ఆ కార్యక్రమం జరిగింది. సీనియర్ అధికారులందర్నీ ఉత్సాహపరిచి మరీ పాల్గొనేలా చేశాను. హార్వర్డ్ ప్రొఫెసర్లు మన దేశ ప్రజాస్వామిక వ్యవస్థకి తగినట్లుగా తయారుచేసిన ఈ కార్యక్రమంలో మన అధికారుల పరిశీలనా, పరిపాలనా శక్తి సామర్థ్యాలని క్షుణ్ణంగా విశ్లేషించే కసరత్తుని కూడా చేర్చారు.

పునశ్చరణ కార్యక్రమం అంతా ముగిశాక హార్వర్డ్ ప్రొఫెసర్‌ల బృందం ఒక విశ్లేషణా పత్రాన్ని నాకు అందజేసింది.

అందులో...

"... ఇక్కడి ఎగ్జిక్యూటివ్‌లంతా అసాధారణ ప్రజ్ఞాపాటవాలున్న మేధావులు. స్వతంత్రంగా, సృజనాత్మకంగా ఆలోచించటంలో వాళ్ళ శక్తిసామర్థ్యాలు అద్భుతం. కాని ఒక టీమ్‌లో సభ్యులుగా ఇతరులతో కలిసి పనిచేయాల్సి వచ్చేసరికి ఇతరుల భావాల్ని గౌరవిస్తూ, నిష్పక్షపాతంగా ఆయా అంశాల మంచి చెడుల్ని బేరీజు వేసి, కలిసి పనిచేసే ధోరణి చాలా తక్కువగా వుంది. ఇందువల్ల ఫలితాలు కూడా అలాగే వుంటాయి. అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో బ్యూరోక్రాట్స్ (అధికారులు) మీ కన్నా తక్కువ సగటు తెలివితేటలు మాత్రమే వున్న వాళ్ళు. కాని, వాళ్ళు టీమ్ వర్క్‌లో వుండాల్సిన సంస్కృతిని నిక్కచ్చిగా పాటించటం వల్ల ఎక్కువ సత్ఫలితాలను సాధించగలుగుతున్నారు. అలా ఒక టీమ్‌లో కలిసి పనిచేయాల్సిన చోట సంయుక్త విధి నిర్వహణా తత్వాన్ని వ్యతిరేకించే భావాల ధోరణిని విడిచి పెట్టగలిగితే మీరు మీ రాష్ట్రంలో, మీ దేశంలో అభివృద్ధి చెందిన దేశాలను మించిన సత్ఫలితాలను సాధించగలుగుతారు... ఈ దిశగా మీ సుపరిపాలనా సంస్థ ఒక నిర్మాణాత్మకమైన కార్యక్రమాన్ని రూపొందించుకొని, ప్రణాళికాబద్ధంగా పనిచేయటం వాంఛనీయం..."

★ ★ ★

ఐఏఎస్ గుండెలోతుల్లోంచి...3

ముఖ్యమంత్రి డాక్టర్ మర్రిచెన్నారెడ్డి 1978 లో మొదటిసారిగా ముఖ్యమంత్రి అయ్యారు. తర్వాత కొంతకాలానికి చిత్తూరు జిల్లా పర్యటనకి వచ్చారు. ఆ జిల్లాలో ముఖ్యమంత్రిగా అది ఆయన తొలిపర్యటన.

నిర్ణీత కార్యక్రమం ప్రకారం – జిల్లాలో పర్యటన ముగించుకొని ఆ రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి తిరుమల చేరుకోవాలి. తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నేను ముఖ్యమంత్రిగారి భోజనానికి T.B. అతిథి గృహంలో ఏర్పాట్లు చేసి ఎదురుచూస్తున్నాను. అప్పట్లో సంచార ఫోన్‌లు లేవు. చంద్రగిరి పోలీస్ స్టేషన్ దాటితే పోలీస్ వైర్‌లెస్ సెట్‌లో సమాచారం నాకు అందుతుంది. రాత్రి తొమ్మిదయింది. 10 గంటలు – 11 గంటలు – 12 గంటలు... ముఖ్యమంత్రి తిరుమలకి చేరలేరు. ఏమైనట్లు?

అర్ధరాత్రి గడిచింది. తెల్లవారు ఝామున మూడు గంటలకి ముఖ్యమంత్రి తిరుమల చేరుకున్నారు. నేను ఎదురువెళ్ళి స్వాగతం చెప్పాను.

ఆయన కారు దిగుతూనే, "ప్రసాద్, నాకు ఆకలిగా వుందయ్యా. చిత్తూరులో మీ కలెక్టరు నాకు సరైన భోజనం కూడా పెట్టకుండా పంపించాడు. ఇప్పుడు భోజనం దొరుకుతుందా?" అని అడిగారు.

"అంతా సిద్ధంగా వుంది సర్. మీరు బట్టలు మార్చుకునే లోపల వడ్డించేస్తారు" అన్నాను.

"మరి నాలుగున్నరకి అభిషేకదర్శనానికి వెళ్ళచ్చా?"

"ఫరవాలేదుసర్. ముందు భోజనం చేసేసి, తరువాత స్నానం చేయండి. అప్పుడు నేరుగా అభిషేకానికి వెళ్ళిపోదాం."

కాని నాకు మనస్సులో ఒక సందేహం తొలిచేస్తోంది. చిత్తూరు కలెక్టరు చాలా మంచివాడు, సౌమ్యుడు, సమర్థుడు. భోజనం సరిగా పెట్టకపోవటమేమిటి? మర్నాడు కలిసినప్పుడు ఆ కలెక్టరుని అడిగాను – "ముఖ్యమంత్రి ఇలా అంటున్నాడేమిటి గురూ!"

"నన్నేం చేయమంటావ్ బాస్. అసలు రాత్రి భోజనం మీ తిరుమల కొండమీద. నా దగ్గర కాదు. కాని ఈయన ఎక్కడెక్కడ సన్మానాలూ, ఎడ్లబళ్ళమీద ఊరేగింపులూ చూసుకుంటూ పన్నెండయినా చిత్తూరు చేరలేరు. ఎందుకైనా మంచిదని ముందుజాగ్రత్త చర్యగా హాట్‌కేస్ క్యారియర్‌తో భోజనం నా కారులో పెట్టించి, పదిగంటలకల్లా ఆయన వున్న చోటుకి వెళ్ళి

అడిగాను - 'భోంచేస్తారా' అని. 'ఇదిగో అదిగో' అంటూ 11 గంటలకి దారిలో ఎక్కడో ఓ గెస్ట్ హౌస్ దగ్గరా ఆగారు. అంత ఆకలి మీద వున్న మనిషీ నేను క్యారియర్ విప్పి భోజనం వడ్డిస్తుంటే - ఆనందించటమూ లేరు, అభినందించటమూ లేదు. కాని నామీర ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రికి క్యారియర్‌లో తెచ్చిన భోజనం వడ్డిస్తావా! - అంటూ నిప్పులు కక్కేశారు నలుగురి ముందూ..." ఆ కంఠంలో, ఆ మాటల్లో ఆవేదన పెల్లుబికింది.

"ఊరుకో గురూ, మన ఉద్యోగాలే అంత. థాంక్‌లెస్ జాబ్స్" అంటూ ఊరడించాను.

(అప్పటి కలెక్టరే ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం సభ్యులుగా నియమితుడైన వి.ఎస్.సంపత్)

ఇదెందుకు చెప్పానంటే.....

★ ★ ★

జిల్లా పరిషత్‌లో గానీ, మున్సిపల్ కార్పొరేషన్‌లోగానీ.... రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి స్థాయి నుంచి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ పోస్టుదాకా ఏ స్థాయిలో పనిచేసినా ఐఏఎస్‌లకి తమ పాత్ర ఏమిటో చాలా స్పష్టంగా తెలుసు. రాజ్యాంగం ఇచ్చిన నిర్వచనాల ప్రకారం తాము పాటించాల్సిన ఔచిత్యం కూడా తెలుసు.

ఇలాంటి ఏ ప్రజాస్వామిక వేదికలోనయినా విధాన నిర్ణయాలపై చర్చించటం, నిర్ణయించటం ఎన్నికైన ప్రజాప్రతినిధుల బాధ్యత. ఆ నగరానికి, జిల్లాకి, రాష్ట్రానికి మంచిది అనుకునే విధానాల రూపకల్పనపై ప్రజాప్రతినిధుల సభలు ప్రతిపాదనలు తీసుకువచ్చి చర్చించేటప్పుడు - వాటిని అమలు చేయటంలో గల సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాలను గురించి ఛీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా వున్న ఐఏఎస్ అధికారి వివరించేవాడు.

ఒక్కోసారి పథకం చాలామంచిదే అయినప్పటికీ ఆర్థికంగా సాధ్యపడకపోవచ్చు. లేదా ఒక్కోసారి చట్టపరమైన, రాజ్యాంగపరమైన, న్యాయపరమైన చిక్కులు ఏర్పడే అవకాశాలుండవచ్చు. లేదా, అమల్లో నియమనిబంధనలకు విరుద్ధంగా కనిపించవచ్చు. ... ఇటువంటి అవకాశమున్న సందేహాల్ని, చిక్కుల్ని వివరించే బాధ్యత ఛీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా వ్యవహరిస్తున్న ఐఏఎస్‌దే.

రెండు రెండున్నర దశాబ్దాల క్రితం వరకూ ఐఏఎస్‌ల పాత్ర ఇది. ఇప్పుడైనా ప్రజాస్వామిక సూత్రాల ప్రకారం పాత్ర ఇంతే. ఐఏఎస్ అధికారుల పాత్రకి ఒక అర్థం వుంది. ప్రజాప్రతినిధుల వేదిక తీసుకునే నిర్ణయం వల్ల వచ్చే పేరు ప్రఖ్యాతులు అయా వేదికకే దక్కుతాయి. కాని వాటిని అమలు చేయటంలో ఎదురయ్యే, ఆర్థిక న్యాయ సమస్యలను ఎదుర్కోవలసిన వ్యక్తి మాత్రం ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఒక్కడే.

ఒక విధాన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎవరన్నా ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కోర్టులో వేస్తే, దాని గురించి కోర్టు చుట్టూ తిరగాల్సిన వ్యక్తి ఆ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ మాత్రమే. ఆ జిల్లా

పరిషత్ ఛైర్మన్‌గానీ, ఆ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గానీ కోర్టుకి పోనఖ్ఖర్లేదు. రాష్ట్ర స్థాయిలో కూడా ఈ బాధ్యత ఛీఫ్ సెక్రటరీదే. అందుకే ఇలాంటి ప్రజాప్రతినిధుల వేరికల్లో ఛీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేటప్పుడు ఐఏఎస్‌లు చాలా మెలకువతో వ్యవహరించాల్సి వచ్చేది.

కాని ఇటీవలి సంవత్సరాలలో అనేక మార్పులు వచ్చేశాయి. రాజకీయ వాతావరణం మారిపోయింది. ఒకప్పుడు ప్రజాప్రతినిధుల వేదికలకి మార్గదర్శిగా వ్యవహరించిన ఛీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల పాత్ర కేవలం విధాన నిర్ణయాలను అమలుచేసే ఎగ్జిక్యూటివ్‌లుగా మారిపోయింది. తాము చెప్పింది చేసే ఎగ్జిక్యూటివ్‌లు కావాలనే రాజకీయ నాయకులు, తమకి భద్రత గల పోస్టులు కావాలనుకునే ఎగ్జిక్యూటివ్‌లు పెరిగారు. "నిర్ణయాలు మేం ఎలా తీసుకున్నా వాటిని అమలు చేసి తీరాల్సిన పాత్ర మాత్రమే మీది" అంటూ ఎగ్జిక్యూటివ్‌లను శాసించే ధోరణి కొత్త తరం రాజకీయ నాయకుల్లో పెరుగుతూ వస్తోంది.

దీనికి తోడు ప్రజల మెప్పుకోసం బహిరంగ వేదికలమీద అధికారుల లోపాలను ఎత్తిచూపించే కొత్త సంస్కృతి రాజకీయ నాయకుల్లో పెరుగుతూ వస్తోంది.

★ ★ ★

ఒకసారేమయిందంటే – 1980లో – పశ్చిమగోదావరి జిల్లా భీమవరం దగ్గర యనమదుర్రు డ్రెయిన్ పొంగింది. చాలామంది కొట్టుకుపోయారు. కొంతమంది చనిపోయారు. కొల్లేరుని సముద్రంతో కలిపే ఈ డ్రెయిన్ పొంగటం అసాధారణ మైన విషయం. డ్రెయిన్ పొంగుతున్న సమయానికి జిల్లా కలెక్టరు ఏలూరులో ఇరిగేషన్‌కి సంబంధించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో కూర్చున్నారు. నిబంధనల ప్రకారం ఆ సమావేశానికి జిల్లా కలెక్టరు మాత్రమే అధ్యక్షత వహించాలి. అందుకని కలెక్టరు హుటాహుటిన వెళ్ళి సహాయకార్యక్రమాలు పర్యవేక్షించవలసిందిగా జాయింట్ కలెక్టరుని ఆదేశించారు... జరగాల్సిన ప్రాణనష్టం జరిగిపోయింది. పత్రికల్లో పతాకశీర్షికల్లో వార్తలు, విమర్శలు...

మరునాడు ఇద్దరు మంత్రులు ఈ ప్రమాదం ఎలా జరిగిందో చూడాలని భీమవరం వెళ్ళారు. వాళ్ళకోసం ఒక లాంచీపెట్టారు. లాంచీలో ఆ మంత్రులు, కొందరు స్థానిక నాయకులు, పత్రికా విలేకరులు ఎక్కారు. జిల్లా కలెక్టరు వివరిస్తున్నారు. అక్కడున్న ఒక మంత్రి భవనం వెంకట్రామ్‌కి ఆగ్రహం పెల్లుబికింది. ఆ లాంచీలోనే, పత్రికలవారూ, స్థానిక కార్యకర్తలు చూస్తుండగానే కలెక్టరుని పట్టుకుని ఎడాపెడా దులిపారు. తాను ఎందుకు సమావేశాన్నుంచి రాలేకపోయి, జాయింట్ కలెక్టరుని పంపానో కలెక్టరు వివరించిన కొద్దీ ఆ మంత్రికి కోపం పెరిగిపోయింది. అందరూ చూస్తుండగానే "బాధ్యతారాహిత్యం" "అసమర్ధపాలన", "ఇంగితజ్ఞానం లేకపోవడం"... వగైరా పరుషమైన పదాలతో కలెక్టరుని నిందించారు. అంత బహిరంగంగా దుమ్మెత్తిపోస్తున్న మంత్రిని ఒక రాజకీయ నాయకుడి స్థాయికి 'ఎదిగి' ఎదిరించే తత్త్వం

వాంఛనీయం కాదు కనుక కలెక్టరు సంయమనం పాటించక తప్పలేదు. పైగా ఆ సందర్భం కూడా చాలా దురదృష్టకరమైంది. ఇదంతా మర్నాడు పత్రికల్లో వచ్చింది.

మరోసారి విశాఖపట్నంలో – 1989 చివర్లో - కొత్త ముఖ్యమంత్రి చెన్నారెడ్డి తొలిపర్యటనకి వచ్చారు. నాలుగైదు చోట్ల ప్రారంభోత్సవాలు చేశారు. చివరగా సర్క్యూట్ హౌస్‌లో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కూర్చొని దర్బారు నడుపుతుంటే, పత్రికా విలేకరులు ఆయనకి ఫిర్యాదు చేశారు. పోలీసులు తమ పట్ల ఆ రోజు చాలా దురుసుగా ప్రవర్తించారనీ, ముఖ్యమంత్రి పాల్గొన్న ఏ కార్యక్రమంలోనూ అనుమతించకపోగా, చొక్కాలు పట్టుకుని గుంజటం వంటి చర్యలకి పాల్పడ్డారన్నది వాళ్ళ ఆరోపణ.

ముఖ్యమంత్రికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. "ఎవరయ్యా ఇక్కడ పోలీస్ కమీషనర్?" అంటూ కేకలేశారు.

క్షణాల్లో కమీషనర్ ఆయన ఎదురుగా నిలబడి శాల్యూట్ చేశారు. ఆ కమీషనర్‌ని అలాగే నిలబెట్టి, ముఖ్యమంత్రి తన ఆగ్రహాన్నంతా కుమ్మరించారు. "మేం పర్యటనకి వస్తున్నప్పుడు పత్రికలవారు వుండితీరాలని తెలీదా? వాళ్ళని ఆపేటంత గొప్పవాళ్ళా మీ పోలీసులు... ముఖ్యమంత్రి పర్యటనలో పత్రికా విలేకరులు వుండటం ముఖ్యమని తెలీని నువ్వేం కమీషనర్‌వి?..." ఇలా సాగింది చెన్నారెడ్డి గారి ఆగ్రహ ప్రవాహం.

దాదాపు 50-60 మంది పార్టీ కార్యకర్తలు, డజనుమంది పత్రికా విలేకరుల ముందు సిటీ పోలీస్ కమీషనర్‌ని నిలబెట్టి ముఖ్యమంత్రి మారు మాట్లాడనీయకుండా హెచ్చరికలు చేస్తుంటే ఎదురు చెప్పలేని నిస్సహాయస్థితి ఆ కమీషనర్‌ది. కారణం - పత్రికల పట్ల క్రింది స్థాయి పోలీసు అధికారులు ఆ రోజు పర్యటనలో అనుచితంగా ప్రవర్తించడం అయన ఆదేశాల ప్రకారం జరగలేదు. అసలు ఏం జరిగిందో, ఎంత జరిగిందో కూడా అతనికి పూర్తిగా తెలీదు. కాని బాధ్యత నుంచి తప్పించుకోలేడు. అలాగని ముఖ్యమంత్రిని ఎదిరించి, తమ సిబ్బంది తొందరపాటుని సమర్థించుకోలేడు.

సివిల్ సర్వెంట్ల స్థితిగతులు ఎంత మారిపోయాయో స్పష్టంగా తెలియాలంటే ఒకసారి 1950 దశకంలోకి వెళ్ళాలి.

నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి హోదాలో చిత్తూరు వెళ్ళారు. అప్పటికి ఆ జిల్లాకేంద్రంలో ఉన్న ఒకేఒక మంచి అతిథి భవనం రహదార్లు-భవనాల శాఖ వారిది. సంజీవరెడ్డిగారికి ఆ అతిథి భవనంలో కాక, వేరే ఇంకెక్కడో బస ఏర్పాటుచేశారు జిల్లా కలెక్టరు బి.కె.రావ్.

సంజీవరెడ్డి అక్కడ దిగీ దిగడంతోనే కలెక్టరును పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

"ఆర్ అండ్ బి గెస్టుహౌస్ వదిలేసి, ఇలాంటిచోట విడిది ఏర్పాటుచేశారేమిటి?"

"ఆ గెస్టుహౌస్‌ని రాజాజీగారికి కేటాయించాం సర్. ఆయన నిన్నటినుంచి ఇక్కడే ఉన్నారు."

సంజీవరెడ్డిగారికి కోపం పెరిగిపోయింది.

"ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నేను క్యాంప్ వస్తుంటే, నాకు కాకుండా ఆ గెస్టుహౌస్‌ని రాజాజీకి ఎలా కేటాయిస్తారు? How dare you?"

"క్షమించాలి సర్. ప్రొటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి హోదా కన్నా మాజీ గవర్నర్ జనరల్ హోదా చాలా ఎక్కువ సర్... రాజాజీగారికి ఆ హోదాలోనే ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది.... ఒక సివిల్ సర్వెంటుగా ప్రొటోకాల్ పాటించాల్సిన నా విధ్యుక్త ధర్మాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారు తప్పు పట్టరని భావిస్తున్నాను." సంజీవరెడ్డిగారు మారు మాట్లాడలేదు.

(ఈ సంఘటన గురించి నా సీనియర్‌లు చాలాసార్లు చెప్పారు.)

అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా!

★ ★ ★

ఇటీవలి కాలంలో వస్తున్న పరిణామాలతో రాజకీయ పదవుల్లో వున్న శక్తి ఎలా పెరుగుతోందో 'అభద్రతా సర్వీసుల్లో' వున్న సివిల్ సర్వెంట్స్‌కి బోధపడుతూ వచ్చింది. ఈ వాతావరణం వాళ్ళని కూడా రాజకీయాల్లో చేరేలా ప్రోత్సహిస్తూ వచ్చింది. (లాంచీ సంఘటనలో ఉదహరించిన అప్పటి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు కూడా 2009 ఆరంభంలో ఒక రాజకీయ పార్టీలో చేరారు.)

జాతీయస్థాయిలో ఇలా సివిల్ సర్వీసుల్ని వదిలిపెట్టి రాజకీయాల్లోకి వచ్చిన వాళ్ళు రెండు దశాబ్దాల క్రితం వరకూ చాలా తక్కువ. మణిశంకర అయ్యర్, యశ్వంత్ సిన్హా, శ్రీమతి మీరాకుమార్... వగైరాలను వ్రేళ్ళమీద లెక్కించవచ్చు. కాని ఇటీవలి కాలంలో ఈ సంఖ్య పెరిగింది.

1991లో ఆంధ్రప్రదేశ్‌లో హోమ్ సెక్రటరీ పోస్టులో ఉండగానే రాజీనామా చేసి, ఎన్నికల్లో దిగిన పి.వి. రంగయ్యనాయుడు నుంచి గత ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికలలో పోటీ చేసిన, పోటీ చేయాలని యత్నించిన దాదాపు డజను మంది ఐఏఎస్, ఐపిఎస్‌ల దాకా రిటైరవుతూనే రాజకీయాల్లోకి దిగే సివిల్ సర్వెంట్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

ఎందుకని? రాజకీయ శక్తిగా ఎదిగితేనే తప్ప చాలా పనులు సాధించలేం అన్న భావం క్రమంగా బలపడుతోంది.

ఉదాహరణకి - ఒక జిల్లాలో ఒక ఆలయం ఉంటుంది. ఆలయానికి ఆదాయం బాగా వుంది కనుక ఒక ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ని దేవాదాయ శాఖ నియమిస్తుంది. ఆ ఆలయానికి ధర్మకర్తల సంఘం లేకపోతే దేవుడికి నిత్యధూపదీపనైవేద్యాలు సక్రమంగా జరగకపోయే ప్రమాదముంటుందని భావించి, దేవాదాయశాఖ పరిధిలోకి వచ్చే ప్రతి ఆలయానికి ధర్మకర్తల

సంఘాన్ని నియమించాలని చట్టంలో నిర్దేశించబడింది. దైవభక్తి వుండాలి, స్థానికంగా పెద్దమనిషిగా గుర్తింపు ఉండాలి. ఇలాంటి కొన్ని మంచిలక్షణాలున్న వాళ్ళనే ధర్మకర్తలుగా నియమించాలని ఉంది. కాని క్రమంగా దేవాలయ ధర్మకర్తల సంఘాలు కూడా రాజకీయ పునరావాస క్షేత్రాలుగా మారిపోయి, అధికార పార్టీ కోసం పనిచేసేవారిని మాత్రమే వాళ్ళ యోగ్యతతో నిమిత్తం లేకుండా నియమించే పరిస్థితి చాలా సందర్భాల్లో జరుగుతోంది. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అక్కడ కొనసాగేదీ లేనిదీ ఆ ధర్మకర్తల సంఘానికీ, అతనికీ మధ్య ఉండే – సంబంధాల నాణ్యతని బట్టి నిర్ణయమవుతోంది. అంటే ధర్మకర్తల్ని వాళ్ళ మంచిచెడుల్ని బట్టి సిఫార్సు చేసే అధికారం దేవాదాయ కమీషనర్‌గా వుండే ఐఏఎస్ అధికారం చేతిలోనో, నియామకాన్ని నిర్ధారించే అధికారి రెవెన్యూశాఖ కార్యదర్శిగా ఉండే ఐఏఎస్ చేతుల్లోనో వుండటం అన్నది కేవలం నామమాత్రమై పోయింది.

అధికారాలుంటాయి. కాని వాటిని వినియోగించే విచక్షణాధికారం చాలా సందర్భాల్లో రాజకీయబాస్‌ల చేతుల్లో వుంటుంది. స్వతంత్రంగా వ్యవహరించి ఏదో చేయాలని తాపత్రయపడి చేసేవాళ్ళూ వున్నారు. మొండిగా అలా చేసి, రాజకీయ బాస్‌ల అసంతృప్తికి గురై, టరమ్ పూర్తి కాకుండానే బదిలీ అయిపోతున్న వాళ్ళూ వున్నారు.

– మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో నేను డైరక్టర్ జనరల్‌గా వుండగా ఐఏఎస్, ఐపిఎస్ అధికారుల కోసం పునశ్చరణ కార్యక్రమాలు నిర్వహించినప్పుడు ఇలాంటి పరిస్థితుల్ని వాళ్ళు ఏకరువు పెట్టేవారు. ఒక్కొక్కళ్ళది ఒక్కోరకం అనుభవం. ఒక్కోసారి ఇద్దరు రాజకీయ బాస్‌ల ప్రచ్ఛన్న పోరాటంలో ఐఏఎస్‌లు సమిధలైపోతుంటారు.

సర్వీసులోకి వచ్చేటప్పుడు వుండే ఉత్సాహం, తాపత్రయం, దీక్షా, విశ్వాసం... సర్వీసు పెరుగుతున్న కొద్దీ క్రమంగా సడలిపోయేలా వ్యవస్థ మారిపోతోంది.

ఇలా సడలటానికి కారణం – అధికారులు ఒక పనిచేసేటప్పుడు ఫలితం ఎలా ఉండాలో ఊహించి, ఆశించటం, ఆశించిన దానికి అనుగుణంగా ఫలితం లేకపోతే కారణాలు వెతుక్కోవడం, రాజకీయ బాస్‌ల్ని నిందించడం, లేదా క్రింది సిబ్బందిని నిందించడం...

★ ★ ★

నేను మర్రి చెన్నారెడ్డి సంస్థనుంచి బయటకి రావటానికి కొన్ని మాసాల ముందు జరిగిన ఒక శిక్షణ వీడ్కోలు కార్యక్రమంలో కొంతమంది అధికారులు పాలనాపరమైన, రాజకీయమైన అనేక ఇబ్బందుల గురించి మాట్లాడినప్పుడు నాకు తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేసినప్పటి నా అనుభవాలు గుర్తుకొచ్చాయి. అదే చెప్పాను.

"...నాకు తెలిసిందే వేదం కాదు. కాని నాకు తెలిసింది కూడా మీకు ఉపయోగపడవచ్చు. ఏ లక్ష్యంతో, ఏ ప్రమాణాలతో ఈ సర్వీసులోకి వచ్చామో, ఆ ప్రయోజనం కోసం నిరంతరం పనిచేస్తూనే ఉండాలి, వుంటాం. మనమెంత మంచి సలహా ఇచ్చినా బాస్ వినలేరనో, దాన్ని

నవరించారనో, సరిగ్గా అమలు చేయలేరనో, చేసింది గుర్తించలేదనో..ఇలాంటి అసంతృప్తి మనకు కలగటానికి కారణం మనం చేసే పని వల్ల కలిగే ఫలితాన్ని మన కిష్టమైన విధంగా ముందుగానే ఆశించి వుండటం. ఆశాభంగం కలిగినప్పుడు అసంతృప్తికి, నైరాశ్యానికి గురవుతున్నాం. లక్ష్యానికి కట్టుబడి పని చేయాలి. సివిల్ సర్వీసుల్లో నలుగురూ మెచ్చుకుంటే పొంగిపోయి అహంభావాన్ని పెంచుకోవటమూ పనికిరాదు, ఆశించినట్లు జరగలేదని భంగపడటమూ పనికిరాదు. ...ప్రజాస్వామిక వ్యవస్థలో మనం సామాజిక స్పృహ, బాధ్యత గల కార్యనిర్వాహకులం మాత్రమే. మన విధిని మనం నిర్వర్తించాలన్న కాంక్షే మనకి వుండాలి తప్ప, ఫలితాన్ని కూడా శాసించాలన్న ఆరాటం వుండకూడదు....."

★ ★ ★

ఐఏఎస్ గుండెలోతుల్లోంచి...4

అమెరికాలో అధ్యక్షుడిగా కొత్త వ్యక్తి ఎన్నికవగానే మొత్తం పాలనా వ్యవస్థ స్వరూపం ఉన్నతస్థాయిలో మారిపోతుంది.

మంత్రులు, కీలక స్థానాల్లోని అధికారులు అంతా మారిపోతారు. దేశవ్యాప్తంగా ఈ మార్పు ప్రభావం కొట్టొచ్చినట్టు కనుపిస్తుంది.

కాని మన రాజ్యాంగం నిర్వచించిన పాలనా యంత్రాంగం మాత్రం ఇలాంటిది కాదు.

విధాన నిర్ణయాలు తీసుకునే మంత్రిమండలి మారిపోవచ్చు. ప్రధానమంత్రి, లేదా ముఖ్యమంత్రి కార్యాలయంలో వ్యక్తిగత సిబ్బంది మారిపోవచ్చు. మిగతాపాలనా యంత్రాంగం మీద మాత్రం ఎన్నికల పరిణామాల ప్రభావం వుండకూడదు.

ఇందుకు రాజ్యాంగం నిర్వచించిన పాలనా వ్యవస్థే కారణం. ఈ వ్యవస్థలో పాలనా యంత్రాంగం స్థిరమైంది. ఎన్ని ఎన్నికలొచ్చి, ఎలాంటి రాజకీయ మార్పులొచ్చినా, ఈ యంత్రాంగం ప్రజలకోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. రాజకీయంగా మార్పులు వచ్చినప్పుడు ఏర్పడే మంత్రిమండలి హక్కు –విధాన నిర్ణయాలు రూపొందించటం, ఆయా నిర్ణయాలను ఈ పాలనా యంత్రాంగం చేత అమలుచేయించటం.

విధాన పరమైన నిర్ణయాలు అంటే – ఒక కొత్త సంక్షేమ పథకాన్ని, అభివృద్ధి కార్యక్రమాన్ని మంత్రి మండలి రూపొందించవచ్చు. లేదా అమల్లో వున్న ఒక పథకంలో మార్పులు, చేర్పులు చేయవచ్చు. విధి, విధానాలను రూపొందించవచ్చు. ఇంతవరకే... అంటే మంత్రిమండలి రచించే ఇలాంటి విధానాన్ని యథాతథంగా అమలుచేయటం పాలనా యంత్రాంగం బాధ్యత.

కాని ఇంతకుమించిన నిరంతర విధ్యుక్తధర్మాలు పాలనాయంత్రాంగానికి వుంటాయి. వాటిని నిర్వర్తించటానికి మంత్రిమండలిలో మార్పులతో సంబంధంలేదు. ఉదాహరణకి – ఏడాదికి ఒకసారి జిల్లాలో జమాబందీ నిర్వహించాలి. వ్యవసాయభూములపై రెవెన్యూ, వరదలు, తుఫానులు, దుర్భిక్షం వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగిన రెవెన్యూ నష్టాలు, భూబదిలీల నమోదు... వగైరా అనేక భూసంబంధమైన అంశాలను గ్రామస్థాయినుంచి జిల్లా స్థాయివరకు విశ్లేషించి, ప్రభుత్వానికి నివేదికలు పంపటం జిల్లా కలెక్టర్లపని.

అకస్మాత్తుగా ఎక్కడైనా ఘర్షణలు, కొట్లాటలు, ఉద్యమాలు చెలరేగి శాంతిభద్రతల సమస్య ఏర్పడితే వీలైనంత శీఘ్రంగా, వేగంగా సమర్థంగా వాటిని పరిష్కరించటం, శాశ్వతంగా

పరిష్కరింపబడేలా చర్యలు తీసుకోవటం, ఇందులో ప్రభుత్వస్థాయిలో ఏదన్నా జరగాల్సివుంటే ఆ నివేదికల్ని ప్రభుత్వానికి పంపించటం కలెక్టర్లు చేయాల్సి ఉంటుంది.

విద్యా సంవత్సరం సక్రమంగా నడవాలి అంటే పరీక్షలు సకాలంలో జరగాలి. ఫలితాలు వెంటవెంటనే వెలువడాలి. జిల్లాల్లో విద్యాసంస్థల పనితీరు మీద పర్యవేక్షణాబాధ్యత జిల్లా కలెక్టర్లకి... ఇలా వివిధ శాఖల పనితీరుని జిల్లా స్థాయిలో ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ, ఏ శాఖలో నయినా అనుకోకుండా ఏదన్నా సమస్య ఎదురయితే పరిష్కరిస్తూ, రాజకీయ మార్పులతో సంబంధం లేకుండా నడిచే అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయిస్తూ, సామాన్య ప్రజలు తీసుకొచ్చే పిటీషన్లను పరిష్కరిస్తూ, పాలనా వ్యవస్థ పట్ల ప్రజలకు విశ్వాసం కలిగించటం జిల్లా స్థాయిలో కలెక్టర్ల బాధ్యత. జిల్లా స్థాయిలో కలెక్టరునుంచి రాష్ట్రస్థాయిలో చీఫ్ సెక్రటరీ వరకూ వందలాది ఐఏఎస్ అధికారులు ఇలాంటి బాధ్యతలు నిర్వర్తించటానికి 'ఎన్నికలలో ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడతారు' అన్న దానితో సంబంధం లేదు.

అందుకే మన రాజ్యాంగంలో ప్రభుత్వం అనేది ఒక నిరంతర చైతన్య స్రవంతి. ముఖ్యమంత్రిగా ఏ పార్టీ నాయకుడొచ్చినా, ఈ పాలనా వ్యవస్థ నిర్దిష్టమైన విధానంలో పనిచేస్తూ ఉండాలి. ఇది సవ్యంగా పనిచేస్తూ వున్నంతకాలం క్రింది స్థాయి నుంచి పైదాకా ప్రతి ఉద్యోగికీ పాలనా వ్యవస్థ పట్ల భయభక్తులు, గౌరవం ఉండేది.

గత మూడు మూడున్నర దశాబ్దాల కాలంలో చాలా మార్పులు వచ్చేశాయి. జిల్లాలో ఒక చిన్న రెవెన్యూ అధికారి మీద కలెక్టరు క్రమశిక్షణా చర్య తీసుకోవాల్సి వస్తే, ఆ ఉత్తర్వులు అమలు జరిగేలోపలే కలెక్టరుమీద రాజకీయ వత్తిడి వచ్చేస్తోంది. ఇది ఒక్క జిల్లా స్థాయిలోనే కాదు. ఏ స్థాయిలో ఏ అధికారి తన క్రింది ఉద్యోగుల మీద క్రమశిక్షణా చర్య తీసుకోవాల్సి వచ్చినా నిస్సంకోచంగా తీసుకోగల పరిస్థితి లేకుండా పోతోంది. అంటే – రాజకీయ జోక్యం పెరగటంతో, తానున్న పోస్టులో భద్రత కావాలని కోరుకునే ఐఏఎస్‌లు కూడా ఇలాంటి రాజకీయ వత్తిళ్ళకి తలొంచుతున్నారు. "ఏ పోస్టులో వేస్తే నాకేంటి? నా పని నేను చేసుకుపోతాను" అని ధీమాగా చెప్పగల ఐఏఎస్‌లు మాత్రమే ఇలాంటి వత్తిళ్ళకి అతీతంగా వ్యవహరించగలుగుతున్నారు.

ఈ రాజకీయ వత్తిళ్ళ స్వరూపం చాలా విస్తృతమైంది. ఇది ఉద్యోగుల విషయంలో ఆశ్రిత పక్షపాతానికి మాత్రమే పరిమితం కావటం లేదు. అభివృద్ధి పథకాల అమలులో లబ్ధిదారుల ఎంపిక కూడా విస్తరించింది. నిజం చెప్పాలంటే ఈ లక్షణం మనకి పశ్చిమ బెంగాల్ నుంచి సంక్రమించింది.

ఒకసారి వెంగళరావుగారు ముఖ్యమంత్రిగా, నేను ఖమ్మంజిల్లా కలెక్టరుగా వుండగా కొంతమంది జిల్లా కాంగ్రెసు నాయకులు నాదగ్గరకు వచ్చారు. ఏదో అభివృద్ధి పథకం క్రింద లబ్ధిదారుల ఎంపికలో తమ వాళ్ళకి న్యాయం 'జరగాలని' వాళ్ళు కోరారు. న్యాయం అంటే? అర్హులైన వాళ్ళకే ఇమ్మనా? అనర్హులకు్కూడా ఇమ్మనా? అదే మాట అడిగాను. వాళ్ళు

నిర్మొహమాటంగా చెప్పారు. "మా పార్టీ అధికారంలో వుంది సార్. మా వాళ్ళకి కాకపోతే కమ్యూనిస్టులకే చేస్తారా? పేద వాళ్ళంటే కమ్యూనిస్టులే అనుకుంటున్నారా?" (అప్పటికింకా తెలుగుదేశం పార్టీ పుట్టలేదు.)

నేను సందిగ్ధంలో పడ్డాను. అధికారపార్టీ నాయకుల మాటని మన్నిస్తే, అనర్హులక్కూడా ఆ పథకం ప్రయోజనాలు అందించాలి. ఇది న్యాయమా? ఎలాంటి ఆశయాలతో ఈ సర్వీసులో కొచ్చాను? వచ్చాక చేయాల్సిందేమిటి? వాళ్ళని కాదని నా మనస్సాక్షి చెప్పినట్లు అర్హులకి మాత్రమే ఆ ప్రయోజనాలు అందాలని చూస్తే, ప్రతిపక్షాలు మింగలేరు, కక్కలేరు. కాని, అధికార పార్టీ గణం వూరుకుంటారా? నామీద ముఖ్యమంత్రికి లేనిపోని చాడీలు మోయచ్చుగదా? చాడీలు మోసినంత మాత్రానికే ముఖ్యమంత్రి నన్ను బదిలీ చేస్తారా? బదిలీచేస్తే మాత్రం ఏమిటి! ఈ పోస్టు పట్టుకువేళ్ళాడాలన్న వెంపర్లాట నాకుందా?... ఇలాంటి అనేక భావాలు నన్ను వెంటాడాయి.

ఎందుకైనా మంచిదని హైద్రాబాద్ వచ్చినప్పుడు ముఖ్యమంత్రిగారిని కలిశాను. మాటల్లో ఈ విషయం చెప్పాను. వెంగళరావుగారు నవ్వారు.

"ప్రసాద్, ఎన్నికల్లో పోటీ చేసేవరకే 'వీళ్లు మన పార్టీ మనుషులు, వాళ్లు వేరే పార్టీ మనుషులూ' అన్న విచక్షణ ఉండేది. ఎన్నికల్లో గెలిచాక నేను రాష్ట్రానికంతటికీ ముఖ్యమంత్రి నవుతాను గానీ, కాంగ్రెసుపార్టీ అభిమానులకు మాత్రమే ముఖ్యమంత్రినవుతానా? ప్రజలు మమ్మల్ని ఎన్నుకొన్నది ఇక్కడ నిరంతరం పనిచేస్తూ ఉన్న ప్రభుత్వానికి సారథులుగా ఉండమని.

'పార్టీ ప్రభుత్వాన్నే' నడపడానికి కాదు... పైగా రాష్ట్రం అంటే ఒక్క అధికారపార్టీ కార్యకర్తలు, అభిమానులేనా? ప్రజలందరూ కలిస్తేనే రాష్ట్రం. నేను ముఖ్యమంత్రిని– అంటే ఈ అయిదుకోట్ల మందికీ ముఖ్యమంత్రిని అనికదా అర్థం..." ఆ మాటలతో నాకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది. జిల్లాకి తిరిగొచ్చాక, నిష్పక్షపాతంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని ఆదేశాలిచ్చాను.

అప్పటికి ఇప్పటికీ ఎంత మార్పు? గత 30 ఏళ్ళలో వచ్చిన మార్పుల్లో ఇలాంటి లబ్ధిదారుల ఎంపిక ఒకటి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కార్యకర్తలకు, సానుభూతిపరులకే ప్రయోజనం చేకూరేలా లబ్ధిదారులను ఎంపికచేసే తత్త్వం మనకి క్రమక్రమంగా ఒంటబట్టింది. పశ్చిమబెంగాల్‌లో గతంలో ఏం జరిగిందో అలా అక్కడ మాత్రం ఎందుకు జరగకూడదు?– అన్న ధోరణి అధికార పార్టీల్లో పెరుగుతూ వచ్చింది.

దీని పర్యవసానం ఏమిటంటే– 'పాలనాపరమయిన చర్యలు' పేరుమీద రాజకీయ ప్రయోజనాలు సాధించి పెట్టే విధానాల్ని ప్రవేశపెడుతూ వచ్చాం. అధికారపార్టీ అవసరాలకి తగినట్లుగా విధానాల్లో 'పాలనాపరమైన మార్పులు' చేస్తూ వచ్చాం. అలా చాపకింద నీళ్ళలా రాజకీయజోక్యం పెరుగుతూ వచ్చింది.

రాజకీయ వత్తిళ్ళు లేకుండా వుంటే తాము స్వచ్ఛమైన పాలన అందిస్తామని ఐఏఎస్ అధికారులు వాదిస్తూ వుంటారు.

నిజానికి రాజకీయ నాయకులంతా అధికార దుర్వినియోగం చేసేవాళ్ళే అనిగానీ, ఐఏఎస్‌లంతా అత్యంత బుద్ధిమంతులనిగానీ చెప్పగలమా?

ఒకవేళ బ్యూరోక్రాట్స్ వాదనే నిజమనుకుంటే, మరి రిటైరయ్యాక వాళ్ళురాజకీయాల్లో చేరి, ఎన్నికల్లో గెలిచి, ఎంపీలవుతున్నారు, ఎమ్మెల్యేలవుతున్నారు, మంత్రులవుతున్నారు. అలా రాజకీయ నాయకులుగా మారాక, "పాలనా వ్యవస్థలో రాజకీయ నాయకుల జోక్యం ఎలా వుండకూడదు" అని గతంలో తాము వాదిస్తూ వచ్చారో, అలా వుండగలుగుతున్నారా?

ఈ ప్రశ్నలకి సమాధానం మనకి తెలుసు. ఈ పరిణామానికి కారణం మౌలికంగా మానవ విలువల్లో పడిపోతున్న ప్రమాణాలు. ఈ ప్రమాణాలని సరిదిద్దే పని 30 సంవత్సరాల వయస్సు దాటిన అధికారుల్లో చేయగలమా?

కనీసం పరిపాలనా పరంగా మనం చేయగలిగిందేమిటో చూద్దామని సుపరిపాలనా కేంద్రంలో ఆలోచనలు చేశాం. ప్రయత్నం చేశాం.

- స్పష్టమైన, ఖచ్చితమైన విధానాలను, మార్గదర్శక సూత్రాలను రూపొందించటం.
- ఆయా మార్గదర్శక సూత్రాలకు లోబడి మాత్రమే ఏ కార్యక్రమాన్నయినా రూపొందించటం.
- నిర్దిష్టమైన అర్హతలను నిర్వచించి, ఆయా అర్హతలున్న వారిని మాత్రమే (రాజకీయాలకు అతీతంగా) ఆయా పథకాలకు లబ్ధిదారులుగా ఎంపికచేసే విధానాలను అమలు చేయటం.
- ప్రతి పథకం క్రిందా లబ్ధిదారుల ఎంపిక, గ్రామాల ఎంపిక భూములు, ఇళ్ళు, పెన్షన్‌లు వగైరా కేటాయింపుల వివరాలన్నీ బహిరంగంగా ప్రకటించటం ద్వారా పారదర్శకత పాటించటం.
- లబ్ధిదారుల ఎంపిక హక్కులు ఎన్నికైన ప్రజాప్రతినిధుల చేతుల్లోకాక గ్రామసభలకే వుండేలా చేయటం.

... ఇలాంటి పలు సిఫార్సులు రూపొందించి ప్రభుత్వానికి పంపించాం.

మళ్ళా నా ప్రశ్న మొదటి కొచ్చింది... వీటిని ఎవరు అమలుచేయాలి?

★ ★ ★

ఐ.ఎ.ఎస్ గుండెలోతుల్లోంచి... 5

ఒక జూనియర్ ఐఏఎస్ అధికారి ఈ మధ్య నా దగ్గర ఒక వ్యాఖ్య చేశాడు.

"మీరు చాలా కీలకమైన పోస్టుల్లో పనిచేశారు కానీ, బహుశా మీకు జిల్లాల్లో వర్గ కక్షలు, పార్టీ ఘర్షణల మధ్య పనిచేసే అవసరం రాలేదేమో సర్. మీకు సర్వీసు అంతా నల్లేరుమీద బండి నడకలా సాగిపోయి వుంటుంది. ఇప్పుడు జిల్లాలకొచ్చి చూడండి. చచ్చిపోతున్నాం. ఈ గ్రామకక్షలతో. ఒక పనిచేస్తే ఒక వర్గానికి కోపం, చెయ్యకపోతే మరో వర్గానికి కోపం.. తొందరపడి ఒక నిర్ణయం తీసుకున్నామా, మా మీద పిటీషన్ల బాణాలు వేసేస్తారు. అందుకే పనిచేయగలిగి వున్నా కొన్ని సందర్భాల్లో చేయాలనిపించదు..."

అతను చెప్పింది కొంతవరకు నిజమే. ఈ వర్గకక్షలు గ్రామాల్లో ఎక్కువగా వుంటాయి. అందుకే అనుభవజ్ఞులైన రాజకీయనాయకులు అంటుంటారు. పంచాయితీ ఎన్నికల్లో కన్నా పార్లమెంటు ఎన్నికల్లో పనిచేయటం సులభం. గ్రామాల్లో ప్రతి ఒక్కరి ఉనికీ మిగిలిన వాళ్ళందరికీ తెలిసి వుంటుంది. ఎవరు ఏ పార్టీకి చెందినవాడు, ఏ వర్గానికి పనిచేసేవాడో చాలా వరకు తెలిసిపోతుంది. ఇందువల్ల ఏదన్నా ఒక ప్రతిపాదన వచ్చిందంటే ఈ ప్రతిపాదన ఏ వర్గం వారు చేశారూ అన్న అంశం దగ్గర చర్చ మొదలవుతుంది. ఈ ప్రతిపాదన ఎందుకు చేసి వుంటారూ, దీని వెనకాల వాళ్ళకొచ్చే ప్రయోజనం ఏమిటి?... ఇలా సవాలక్ష సందేహాలు, అనుమానాలు.

అక్కడ్నుంచి అవతలి వాళ్ళకి ఈ పథకం వల్ల రాగల ప్రతిష్ట ఎంత? అది వాళ్ళకి రాకుండా చేయాలంటే ఏం చేయాలి? మనం ఇంకో ప్రత్యామ్నాయ ప్రతిపాదన ఇద్దామా? లేకపోతే వాళ్ళ పథకంలో లోపాలు వెతికి అడ్డం పడదామా?.... ఇలా గ్రామాల్లో రెండు వర్గాల మధ్య ఘర్షణల కారణంగా దశాబ్దాల తరబడి ఆగిపోయిన పథకాలు మనకి చాలా వూళ్ళల్లో కనిపిస్తాయి.

నేను ఆ జూనియర్ ఐఏఎస్‌తో పూర్తిగా ఏకీభవించలేకపోయాను. ఎందుకంటే ఇలాంటి పరిస్థితులు 1960 దశకంలోనే నాకు ఎదురయ్యాయి. ఇటీవలి సంవత్సరాల్లో నేను మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణా సంస్థలో వర్క్‌షాప్‌లు నిర్వహించినప్పుడు కూడా జిల్లాల నుంచి వచ్చిన కొంతమంది అధికారులు ఈ సమస్యల్ని లేవనెత్తేవారు. వాళ్ళు చెప్పింది అబద్ధం కాదు. కానీ, అన్ని సందర్భాల్లోనూ నిజం కూడా కాదు. నిజమే అయి వున్న చోట ఏం ఎలా చెయ్యాలి? ఎలా చెయ్యాలి? అధికారం వుంది కదా అని బలవంతంగా ఎందుకు అమలు చేయలేం అనుకుని ప్రయత్నం చేస్తే, జరిగేదల్లా – నెల తిరక్కుండా బదిలీ అయిపోవటమే. కాని

మానవ సంబంధాలు సవ్యంగా ఉంటే సాధించగలిగేది అపారం అని నా నమ్మకం. ఈ నమ్మకం ఇవ్వాళ వచ్చింది కాదు.

పశ్చిమగోదావరి జిల్లాలో నాకు శిక్షణనిచ్చిన కలెక్టరు కె.సుబ్రహ్మణ్యం దగ్గర చాలా నేర్చుకున్నాను. "మనం బ్రిటీషు ఇండియా ప్రభుత్వంలో పనిచేయడం లేదు - మనం ఏ చేస్తే అదే 'లా' అని ప్రజలు తలొంచుకొని పూరుకోవటానికి. ఇది ప్రజాస్వామ్య యుగం. ప్రజల్లో అన్ని వర్గాలూ, అన్ని మనస్తత్వాలూ వుంటాయి. నలుగురినీ ఒప్పించి కలుపుకు వెళ్ళే ప్రయత్నం చేస్తేనే నిజమైన అభివృద్ధిని సాధించగలుగుతాం. ఇది జరగాలంటే ప్రజలకి దగ్గరగా వెళ్ళాలి. ఎంత దగ్గరగా వెళ్ళగలిగితే అంతగా వాళ్ళ విశ్వాసాన్ని గెల్చుకుంటాం. ఆ విశ్వాసం అనే పునాది మీద అద్భుతాలు సాధించగలం..."

ఆయన మాటల్ని నేను ఇవ్వాల్టికీ మననం చేసుకుంటాను. ఆయన అలా ప్రజల విశ్వాసాన్ని గెల్చుకోబట్టే పశ్చిమగోదావరి జిల్లాని వ్యవసాయ పరంగా అద్భుతమైన ప్రగతిమార్గంలో నడిపించ గలిగాడు. ఇవ్వాల్టికీ ఆ జిల్లాలో రైతులు తల్చుకునే కలెక్టరు సుబ్రహ్మణ్యంగారే. పరిపాలనలో మానవ సంబంధాలు అంత గొప్ప సత్ఫలితాలనిస్తాయని మొదట్లో నేనూ నమ్మలేదు. కాని ఆ విశ్వాసంతోనే ప్రయత్నిస్తూ వచ్చాను. నా మొదటి ప్రయత్నం ఎలా జరిగిందంటే.....

* * *

పశ్చిమ గోదావరి జిల్లాలో నిడదవోలు దగ్గర సమ్మిశ్రగూడెం సమితి (ఇప్పటి మండల బ్లాకులు ఏర్పడక ముందు సమితులు వుండేవి) పరిధిలో దొమ్మేరు అనే గ్రామం వుంది. ఈ గ్రామంలో ఒక జిల్లా బోర్డు స్కూలు అత్యంత దైన్యస్థితిలో వుండేది. ఆ వూళ్ళో సంపన్నులు చాలా మంది ఉన్నారు. కానీ, వర్గ కక్షల కారణంగా స్కూలుని అందరూ పట్టించుకోవటం మానేశారు.

నేను ఐఏఎస్ అధికారిగా ఆ జిల్లాలో అడుగుపెట్టాక అసిస్టెంట్ కలెక్టరు హోదాలో శిక్షణ పొందుతున్నప్పుడు ఆ శిక్షణలో భాగంగా సమ్మిశ్రగూడెంకి బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (బి.డి.ఓ.)గా ఆరుమాసాలు పనిచేయాల్సి వచ్చింది. ఆ పోస్టులో వున్నప్పుడే, ఈ దొమ్మేరు స్కూలు గోడు నా దృష్టికి వచ్చింది. మా సమితి అధికారులు నన్ను సున్నితంగా వారించారు. "ఆ దొమ్మేరు గొడవల్లో తల దూర్చకండి సార్. తరువాత చాలా బాధపడాల్సి వస్తుంది". నాకు కుర్రతనం కదా! పట్టుదల పెరిగింది. పైగా అప్పటికే ఎర్నగూడెం సబ్‌స్టేషన్ కట్టిస్తున్నానన్న అతి విశ్వాసం ఇంకాస్త ధైర్యంగా ముందుకు తోసింది.

అసలు ఎర్నగూడెం సబ్‌స్టేషన్ నాకు ఆ అతి విశ్వాసాన్ని కలిగించటానికి కారణమేమిటంటే- దాదాపు 20 పంచాయితీలకు, అంటే ఆ సమితిలోని 50, 60 గ్రామాలకు కరెంటు లేదు. చాలా చోట్ల బావులు వున్నా, డీజిలు ఇంజన్‌తో వ్యవసాయం చాలా ఖర్చుతో పని. వాకబు చేస్తే ఒక కొత్త పెద్ద సబ్‌స్టేషన్ కడితేగాని ఈ గ్రామాలకు కరెంటు సాధ్యం కాదన్నారు. విద్యుత్ బోర్డుని

అడిగాం. "సబ్‌స్టేషన్ కట్టాలంటే ఈ సంవత్సరపు బడ్జెటులో లేదు... నిధుల కొరత వలన వచ్చే సంవత్సరం కూడా అనుమానమే" అన్నారు.

చాలా పథకాలలో గ్రామస్థులు కొంత నిధులు సమకూరిస్తే సమితి తరపున కొన్ని నిధులిచ్చి అమలు చేయటానికి అవకాశం వుంది. స్కూలు బిల్డింగులు కట్టడం, వూళ్లో రోడ్లు వేయడం వంటివి ఇదివరకు జరిగేవి. ఇప్పుడు కూడా అమలులో వున్నాయి. కాని అలా ఏదో ఒక్క గ్రామానికి సంబంధించి అయితే చెయ్యొచ్చు. అటువంటి పథకం క్రింద సబ్‌స్టేషన్ కట్టడానికి ఆలోచిస్తే కొంత ఖర్చుని సమితి, కొంత ఖర్చుని గ్రామాలు, మరికొంత ఖర్చుని విద్యుత్ బోర్డు కనుక పెట్టగలిగితే...! అందరినీ ఒప్పించాలి.

సమితి అధ్యక్షుడు ముళ్ళపూడి కృష్ణారావుగారితో మాట్లాడితే "సమితి నుంచి కొంత ఇవ్వవచ్చు. ఆ గ్రామాలకు మనం చేసిందేమీ ఎక్కువ లేదు. కాని అవి పేద గ్రామాలు. గ్రామస్థులు కొంత వరకన్నా ఇవ్వగలుగుతారో? లేదో? అందరికీ బావులుండవు. మోటార్లు అక్కరలేదు... కాని ఇళ్ళకు కూడా కరెంటు వస్తుంది కదా. పంచాయితీకి కూడా వస్తుంది కదా. పంచాయితీలనుండి కొంత డబ్బు ఇప్పించి, గ్రామస్థులు పెట్టాల్సినదాన్ని కరెంటు కావల్సిన రైతుల (పంపుసెట్లు కావల్సిన వారి) నుంచి, ఇండ్లకు కరెంటు కావలసిన వారినుంచీ తీసుకోవచ్చు. కాని వారికి దీని కోసం, బావులకోసం, పంపుసెట్ల కోసం అప్పులిప్పించాల్సి వుంటుంది... చాలా పెద్ద పనే... చేస్తే మటుకు ఈ గ్రామాల జాతకం మార్చినట్లవుతుంది... మీరు ప్రయత్నం చేయండి, మేమంతా మీకు అండగా వుంటాం" అని ధైర్యం ఇచ్చారు.

అలా ఎర్నగూడెం సబ్‌స్టేషను... దేశంలోనే మొదటి సామూహిక కరెంటు ప్రాజెక్టుగా మొదలయింది. కలెక్టరు సుబ్రహ్మణ్యంగారి మద్దతుతో విద్యుత్ బోర్డుతో మాట్లాడి, నెలరోజుల్లో స్కీముని మంజూరు చేయించడమే కాక, సహకార బ్యాంకులతో చెప్పి అప్పులిప్పించడం, సమితికీ, పంచాయితీలకు దీనికోసం అదనపు నిధులు మంజూరు చేయించడం జరిగింది. అంతా చకచకా జరిగిపోయింది.

ఎండాకాలం... ఎండలు మండిపోతున్నాయి. ఎర్నగూడెం సబ్‌స్టేషన్ పూర్తి కావస్తోంది. దానితో పాటే 48 గ్రామాలకు కరెంటు తీగలు లాగడం, ట్రాన్సుఫార్మర్లు పెట్టడం... పెద్ద యజ్ఞంలా కార్యక్రమం సాగుతోంది. ఆదివారం మిట్టమధ్యాహ్నం... డివిజనల్ ఇంజనీర్ రామకృష్ణ గారితో జీపులో ఆ గ్రామాలలో పని పూర్తి చేసుకొని నిడదవోలుకి వాపసు వస్తున్నాం... జీపు చెడిపోయింది.. ఎండకు ఇంజను వేడెక్కినట్లు వుంది. 50 గజాల్లో చెట్టు నీడ.... పాపం డ్రైవరు ఏదైనా చేద్దామన్నా విపరీతమైన ఎండ.. రామకృష్ణ గారితో "నీడ వరకూ జీపుతోద్దాం రండి" అన్నాను. ఆ పని మొదలుపెట్టాం.... ఆయనది భారీకాయమేమో తట్టుకోలేకపోయారు. "ఆదివారం మాతో పనిచేయిస్తున్నారు... కాలువలు కట్టేశారు. మా ఆవిడ రొయ్యలు, చేపలకూర చేశానని త్వరగా రమ్మంది. మీతో పెట్టుకుంటే ఇంతే! మేము రెండేళ్ళు చేసే పని నాలుగు నెలల్లో

చేయించాలని చూస్తున్నారు. పైగా ఈ ఎండలో జీపు తోయిస్తున్నారు కూడా!... మీ మొహం చూసి చేయాల్సివస్తోంది. ఏం ఖర్మండీ మనకు! ఇంత పెద్ద ఉద్యోగాలు చేస్తున్నా, సుఖపడనీయరు" అంటూ నిష్ఠూరంగా మాట్లాడారు.

పాపం ఆయన అలా అన్నారు గాని... చాలా మంచి ఆఫీసరు. ఆ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని ఒక సవాల్‌గా తీసుకొని పూర్తి చేశారు. ఆ రోజుల్లో అదొక పెద్ద వింత. అన్ని గ్రామాలకు, అన్ని పంపుసెట్లకు, అన్ని ఇళ్లకు నాలుగుమాసాల్లో విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా అన్ని శాఖలూ సమష్టిగా పనిచేసి, ప్రజల సహాయసహకారాలతో చేసిన ఈ పెద్ద పథకం దేశంలోనే మొదటిసారి జరగడంతో నా మీద నాకు విశ్వాసం పెరిగింది.

అది ఎక్కువగా ఊహించుకున్నానన్న సంగతి దొమ్మేరు స్కూలు విషయంలో వేలు పెట్టాక అర్థమైంది. ఎందుకు చేయలేం అనుకున్నాను. కానీ...

ఎంతో ప్రయత్నం చేశాను. కాని వాళ్ళు కలిసి రావటంలేదు. డబ్బులు లేవా అంటే? అదికాదు, మంచి సంపన్నమైన గ్రామం. చాలా వరకు చెరుకు పండిస్తారు. అదికాక ఇంకా పొగాకు, కూరగాయలవంటి వాణిజ్య పంటలు కూడా పండిస్తారు. చాలా మంది రైతులు ధనవంతులే. మరి వాళ్ళు ప్రజల తరపున - అంటే గ్రామం తరపున కట్టాల్సింది రెండువేల అయిదువందల రూపాయలు, వాళ్ళకు అదొక లెఖ్ఖా? కావాలంటే ఒక్కరైతే కట్టగలడు.

ఒకసారా రెండుసార్లా! దాదాపు ఎనిమిదిసార్లు ప్రయత్నం చేశాను. ఆరుసార్లు రాత్రిపూట వాళ్ల గ్రామానికి వెళ్ళి గ్రామంలోనే పడుకున్నాను. మా సమితి అధికారులు చెప్పనే చెప్పారు. "ఆ గ్రామం అంతేనండీ, తగాదాలు తప్ప, అభివృద్ధి ఎవ్వరికీ పట్టదు. మూడేళ్ళ క్రితం స్కూలు భవనం కప్పు రిపేరు చేయడానికి రూ. 15,000 మంజూరు చేశాం. అందులో వారి వాటా రెండువేల ఐదొందలు. మిగతాది సమితే భరిస్తుంది. ఇంతవరకూ కట్టలేదు. అడిగి అడిగి విసిగిపోయి వూరుకొన్నాం... ఆ డబ్బు ఇంకేవూరికైనా మంజూరు చేస్తే బాగుండేది."

"ఎందుకు చేయరు?" అని అడిగితే చెప్పారు. "వూళ్లో రెండు వర్గాలు. ఒకరంటే ఒకరికి పడదు. వాళ్లల్లో వాళ్లకు ప్రతిదానికీ పోటీయే... మళ్ళా... సహకార సంఘాలు ఎలక్షన్ల కోసం ఒక్కొక్క వర్గం రెండేసి లక్షలు ఖర్చు చేశారు. అలాగే పంచాయితీ ఎన్నికలకు ఖర్చు పెడతారు. మంచిపనికి మాత్రం ఎవ్వరి దగ్గరా డబ్బులు వుండవు."

మా వాళ్ళు చెప్పిందంతా నిజమే. పాత జిల్లా బోర్డు స్కూల్లో 150 మందిపైగా పిల్లలు, ఆడా మగా కలిపి వున్నారు. ఎకరం పైన స్థలం వున్నా, చుట్టూ ప్రహరీ లేకపోవడంతో, వూళ్ళో వాళ్ళంతా లహిర్భూమిగా వాడుతున్నారు. స్కూలు భవనం చుట్టూ తుప్పలూ, గొడ్లూ గోరా, పందులు, వానాకాలంలో బురద, పెంకులూడిపోయి, నాలుగు గదులకు గాను, ఒక్క గది మాత్రమే వాడకం, మిగతా క్లాసులు ఫర్లాంగు దూరంలో వున్న గుడి వరండాలో అరుగుల

మీదా... సరే, గుడి కూడా అంతంత మాత్రమే. ఊళ్ళో మాత్రం చాలా మంచి ఇళ్ళు. ఒక జమీందారు గారి బంగళా కూడా ఉంది...

గ్రామాధికారులను, గ్రామ సర్పంచిని పిలిచి మాట్లాడితే, గ్రామంలో రెండు గ్రూపుల గురించి చెప్పారు. సుబ్బారావుగారి గ్రూపు, రాజు గారి గ్రూపు! విడివిడిగా ఎవరైనా డబ్బులు ఇవ్వడానికి తయారు. కాని ఒకరు ఇస్తానంటే ఇంకొకరు ఇవ్వనివ్వరు, పని చెయ్యనివ్వరు. ఇద్దరూ కలిసి రారు.

వాళ్లను పిలిపించి మాట్లాడాను. అంతా కలిసి రాలేదు. విడివిడిగా వచ్చి మాట్లాడారు. ఇద్దరూ మంచి వాళ్లలాగానే అనిపించారు. గ్రామాభివృద్ధి కావాలని ఇద్దరికీ వుంది. కాని కలిసి చెయ్యాలని లేదు. ఎవరికివారు డబ్బు కట్టడానికి సిద్ధం. కాని అవతలివారు డబ్బుకట్టి పనిచేయించడం ఒప్పుకోరు. గ్రామంలో పోనీ ఎవరికి తోచినంత వారిచ్చి కావలసిన డబ్బు సేకరిద్దామంటే - తగాదాల వల్ల ఎవరూ అలా ముందుకు రావడం లేదు.

నాకు కూడా ఏం చేయాలో అర్థం కావటం లేదు. సమితి అధ్యక్షుడు కృష్ణారావుగారి నడిగితే "వాళ్లు మొండివాళ్ళండీ. మీరు మీ కాలం పాడుచేసుకోవద్దు. ఆ మాత్రం సమయం ఇంకో పనిలో పెడితే చాలా చెయ్యవచ్చు. నేను కూడా చెప్పి చెప్పి విసిగిపోయాను. ఆ కేసు వదిలేయండి" అని సలహా ఇచ్చారు. నాకూ పట్టుదల పెరిగింది. సమ్మిశ్రగూడెంలో పడుకునే బదులు, దొమ్మేరులోనే పడుకొని, సాయంత్రంపూట ఇరువర్గాల వారిని మళ్ళీ మళ్ళీ పిలిచి మాట్లాడేవాణ్ణి... "మాకు తెలుసులేండి" అని వాళ్ళు అంటున్నా వినకుండా, వాళ్ళని విడివిడిగా నాతో స్కూలుకి తీసికెళ్ళి చూపిస్తుండేవాణ్ణి... ఇలా రెండుమూడు సార్లు దొమ్మేరులో రాత్రిళ్ళు గడిపాక వాళ్ళు కొంచెం మెత్తబడుతున్నట్లు (నామీద జాలి పడుతున్నట్లు కూడా) అనిపించింది.

'మనపిల్లల స్కూలు కోసం ఈయన ఇంత శ్రమపడటం ఏమిటి... ఆయనలా వచ్చిపోతుంటే, మళ్ళీ మళ్ళీ అడుగుతుంటే ఏరో ఇదిగా వుంది' అని గ్రామాధికారులతో అంటున్నారని తెలిసింది. నామీద జాలిపడతారో, విసుగొచ్చి వింటారో- ఎలాగైనా సరే. నామాట వినాలి, స్కూలు బాగుచేయాలి. ట్రైయినింగ్‌లోనే ఇంత చేతకానివాడిలా వూరుకోవటమేమిటి? అన్న పట్టుదల పెరిగింది.

మళ్ళీ వెళ్ళినప్పుడు వాళ్ళతో అన్నాను. "మీ తగాదాలు మానుకోమని చెప్పడం లేదు. అవి మీ స్వవిషయం. ఈ స్కూలు విషయం ఒక్కదాంట్లో కలిసి రాకూడదా? మీరు కలిసి పని చెయ్యనక్కర్లేదు. కలిసి చేస్తాం అని చెప్పండి చాలు. చెరిసగం డబ్బులివ్వండి. కాని అది మీ ఇరువర్గాలు కలిసి వచ్చి నాముందు లిఖితపూర్వకంగా చెప్పాలి.." విని వూరుకున్నారు.

మళ్ళీ మళ్ళీ వెళ్ళాను. "మీరిలా రాకండి సార్. మాకు బాగా అనిపించడం లేదు. మాకిష్టం లేనప్పుడు మీరిలా బలవంతం చేయటం బాగా లేదు... మాకిష్టమయితే వాళ్ళకిష్టం వుండవద్దా?

ఇద్దరూ కలిస్తే కదా మీ పనీ, మా పనీ అయ్యేది." అంటూ ఒక వర్గం సన్నగా గొణిగారు. విడిగా మాట్లాడితే, రెండో వర్గం కూడా అదే ధోరణికి రావడంతో ఇద్దరినీ కొద్దిరోజుల తర్వాత ఒక్కసారే సమితి ఆఫీసుకి రమ్మన్నాను. చాలా అయిష్టంగా వచ్చారు. నన్ను మనసులో బాగా తిట్టుకుంటున్నారని వాళ్ళ మొహాలు చూస్తుంటేనే తెలుస్తోంది. అయినా ఏమీ తెలియనట్టు మొహం పెట్టాను.

"రండి, రండి" అంటూ వాళ్ళని నా టేబుల్ ఎదురెదురు కుర్చీల్లో కూర్చోబెట్టాను. కొబ్బరినీళ్ళిచ్చి మర్యాద చేశాననుకున్నాను. మళ్ళీ స్కూలు – పిల్లలు – చదువులు – భవిష్యత్... అంటూ ఉపన్యాసం మొదలుపెట్టాను. వాళ్ళకి అప్పటికే ఈ కథ విని విని తలబొప్పి కట్టినట్లుంది. "వాళ్ళకిష్టమయితే మాకభ్యంతరం లేదు" అని రెండు వర్గాలూ నాకేసి చూస్తూ చెప్పేసి వూరుకున్నారు.

"పనులు కూడా మీరే పంచుకుంటే బాగుంటుందేమో... అహ, మీకిష్టమయితేనే. మేం సమితి తరఫున మొదలుపెడితే మళ్ళీ సంవత్సరాలు గడిచిపోతాయేమోనని నా భయం..." అన్నాను. ఇదేదో పని చేసినట్లుంది. మెటీరియల్ రూపంలో తమ వాటా సొమ్ముని అందించేందుకు ఒప్పుకున్నారు. ముందే రాసి వుంచిన కాగితం బయటకు తీసి, సంతకాలు పెట్టించుకున్నాను.

వారం తర్వాత రూ. 12,500 సమితి నిధులతో చెక్కు తీసుకొని గ్రామానికి వచ్చేటప్పటికీ– స్కూలులో పని జరుగుతోంది. దాదాపు రూ. 25,000 ఖర్చుపెట్టి ఎకరం స్థలంలో కాంపౌండు గోడ కట్టేశారు... "అదేమిటీ? మేం మంజూరు చేసింది కప్పు బాగు చేయడానికే కదా?" అన్నాను విస్తుపోతూ.

"మీరు వెళ్ళాక మేం కూర్చొని మాట్లాడుకున్నాం సార్.. చేసేది ఎట్లాగా చేస్తున్నాం కాబట్టి మొత్తం స్కూలు బాగు చేస్తే బాగుంటుందనిపించింది. చుట్టు ప్రక్కల శుభ్రంగా వుండాలంటే ప్రహరీ అవసరం అనిపించింది... కప్పు కూడా వేస్తాం.. దాంతో పాటు ఆడపిల్లలకు మరుగుదొడ్లు, బడికి ఇంకో నాలుగుగదులు, అంతా లక్షన్నర రూపాయలు అవ్వచ్చు. మేం అందరం చందాలు వేసుకొని పని పూర్తి చేద్దామని నిర్ణయించాం. మేమంతా కలిసే చేస్తున్నాం. మెటీరియల్ మేం ఇస్తున్నాం.. పని అంతా సుబ్బారావుగారు చేస్తున్నారు" అన్నారు రాజుగారు. నా కళ్ళని నేను నమ్మలేకపోయాను.

అలా మొదలయింది పని. పని పూర్తయ్యేటప్పటికి మూడు లక్షలపైన ఖర్చు జరిగింది. లక్షన్నర తర్వాత డబ్బులు అయిపోతే, వాళ్ళంతా కలసి, సమితి ఆఫీసుకి వచ్చి ఒక అభ్యర్థన చేశారు. "మా గ్రామం నుండి వేల టన్నుల చెరుకుని ఫ్యాక్టరీకి తోలుతున్నాం. స్కూలుకోసం గ్రామంలో రైతులందరూ టన్నుకింతని వేయడానికి ఒప్పుకున్నాం. మీరు ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ గారితో మాట్లాడి మాకు అడ్వాన్సుగా కొంత ఇప్పిస్తే మా బిల్లుల్లో అనక వాళ్ళు మినహాయించుకోవచ్చు. ఈ సహాయం చేయండి." వెంటనే చాగల్లు ఫ్యాక్టరీ వారితో మాట్లాడి ఏర్పాటు చేయడం జరిగింది.

నేను సమితిలో ఆరునెలల శిక్షణ పూర్తి చేసేటప్పటికే స్కూలు పని దాదాపు పూర్తి అయింది... వాళ్లంతా నేను వెళ్ళే లోపల ప్రారంభోత్సవం చేయాలని చాలా ఆత్రుతతో పని చేశారు. ఒక మంచిరోజు కూడా చూశారు. కాని రెండు మూడు రోజుల ముందు రాజుగారు వచ్చి... "అయ్యా ఈ ఫంక్షను ఇప్పుడు వద్దు... సుబ్బారావు గారు రాలేరు. (ఆయన ప్రత్యర్థివర్గం వాడు). వాళ్ల అబ్బాయికి ఒంట్లో బాగోలేదు. వారు లేకుండా ఈ ప్రారంభోత్సవం చేయడం మాకు ఇష్టం లేదు. మీరేమో రెండు రోజుల్లో సమితినుండి వెళ్ళిపోతున్నారు. మేం ఇంకోరోజు ప్రారంభోత్సవం పెట్టుకుంటాం. మేం తర్వాత ఎప్పుడు ఫంక్షను చేసినా, మీరెక్కడ వున్నా దానికి రావాలి. మీరు లేకుండా ఫంక్షను చేయదల్చుకోలేదు" అన్నారు!!

తర్వాత నేను జిల్లా పరిషత్ కార్యదర్శిగా మూడు నెలలు ఏలూరులో పని (శిక్షణలో భాగం) చేసేటప్పుడు వాళ్ల స్కూలుకు ప్రారంభోత్సవం జరిగింది. అప్పటి చీఫ్ సెక్రటరీ ఎం.టి. రాజు గారి చేత చేయించాం. కలెక్టరు, జిల్లా పరిషత్ చైర్మన్, ఇతర నాయకులు, అధికారులు వచ్చారు. చాలా హడావుడిగా జరిగింది. బాణాసంచాకే వేలు ఖర్చుపెట్టి ధూం ధాం గా చేశారు. ఆ సమావేశంలోనే వారి గ్రామంలో వారి స్వయంశక్తితో ఈ స్కూలు లాగానే ఒక ఆసుపత్రి, పశువుల ఆస్పత్రి కూడా పదిలక్షల ఖర్చుతో కట్టాలని తీర్మానించారు...

నా జీవితంలో ఐఏఎస్ అధికారిగా ఎన్నో పోస్టులు చేశాను. అయినా నా ఈ మొదటి పరిపాలనా అనుభవం చాలా సంతృప్తినిచ్చిన పని. మానవ స్వభావాలు అప్పుడూ ఇప్పుడూ ఒకేలా వున్నాయి. గ్రామ కక్షలు లేని గ్రామం ఉండదు. రాజకీయాలు లేని ప్రభుత్వం ఉండదు.

* * *

నాకు శిక్షణ నిచ్చిన సుబ్రహ్మణ్యంగారు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి... "ఏ ఇద్దరూ మనుషులూ ఒకేలాగా ఆలోచించరు. కాని కమ్యూనిటీ ప్రయోజనాలు మాత్రం అందరికీ ఒకటే. మంచిపని చేయాలంటే ఓర్పు, లౌక్యం, పట్టుదల, తార్కికమైన వాదన అవసరం. ఇవి వున్నవాళ్ళే పాలనా యంత్రాంగంలో అనేక మంచిపనులు చేయగలుగుతారు..."

అదే విషయం ఆ జూనియర్ ఐఏఎస్‌కి కూడా చెప్పాను!

* * *

ఐఏఎస్ గుండెలోతుల్లోంచి...6

జిల్లాకి కలెక్టరుగా పనిచేసే రోజులే ఒక ఐఏఎస్ అధికారికి నిజమైన పరీక్షా దినాలు.

జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల మీదా అజమాయిషీ చేసే అధికారం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోస్టల్, టెలిఫోన్, సెంట్రల్ ఎక్సైజు వగైరా శాఖల అధికారులు సయితం కలెక్టరు మాటని గౌరవించటమనేది బ్రిటిషుకాలం నుంచీ వస్తున్న రివాజు. వివిధ సాంస్కృతిక, సాహిత్య, క్రీడా సంస్థల వాళ్ళూ, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల వాళ్ళూ తాము చేసే ప్రతి కార్యక్రమానికీ కలెక్టరుగారే ముఖ్య అతిథిగా రావాలని కోరుకుంటుంటారు. ఇక ప్రజలు గౌరవించటం సరేసరి.

ఇలాంటి పొగడ్తలు నిండిన సత్కారాల మధ్య, రకరకాల కమిటీలకి ఛైర్మన్‌గా పెరిగి పోతుండే పని వత్తిడి మధ్య ప్రజలతో నేరుగా మాట్లాడుతూ, వాస్తవాలు తెలుసుకునే అవకాశం తగ్గుతూంటుంది. మన చుట్టూ "మీరే నిజమైన పబ్లిక్ సర్వెంట్ సర్" అనే వాళ్ళే ఎక్కువ కనిపిస్తూంటారు. ఇది నిజమని నమ్మే భ్రమలో వాస్తవ పరిస్థితికి దూరమైపోతూంటాం. బాగా చేస్తున్నామని క్రింది ఉద్యోగులు చెబుతున్నదే నిజమనిపిస్తూంటుంది. 'నేను ప్రజల కోసం ఎంత బాగా పనిచేస్తున్నానూ' అన్న ఆనందమైకంలో పడిపోతాం.

నేను ఖమ్మం కలెక్టరుగా జాయిన్ అయిన కొత్తలో రకరకాల వాళ్ళు నన్ను కలవటానికి బంగళాకి వచ్చేవాళ్ళు. వాళ్ళల్లో సామాన్యులు చాలా ఎక్కువ. ఇళ్ళ స్థలం కావాలనో, పని ఇప్పించమనో... అడిగే వాళ్ళు ఎక్కువ. నాకు ముందున్న కలెక్టరు పార్థసారథి బంగళాలో ఎక్కువగా జనాన్ని పరామర్శించేవారు. ఆ అలవాటు ప్రకారం జనం వచ్చేస్తున్నారు. "వీళ్ళంతా బంగళాకి ఎందుకు రావడం? ఆఫీసులో కలవచ్చుగదా?" అని క్యాంపు క్లర్క్‌ని అడిగాను. "పార్థసారథిగారు బంగళా దగ్గరే చూసేవారు సర్" అన్నాడు. ఇప్పుడు నేను ఈ విధానాన్ని మారిస్తే, "పార్థసారథి మంచివాడు, ప్రసాద్ కాదు" అనిపించుకుంటానేమో అనిపించింది. నేను ఇంకేమీ మాట్లాడలేదు.

అలా కొన్ని రోజులు గడిచాక ఆ విజిటర్లలో రెండు మూడు మొహాల్ని అంతకముందు చూసినట్లుగా అనిపించింది. "ఏమయ్యా, వచ్చిన వాళ్ళే వస్తున్నట్లున్నారు" అని మా క్యాంపు క్లర్క్‌ని అడిగాను. "అలాంటిదేమీ లేదు సర్. ఏ ఒక్కడూ రెండేసి ఉపకారాలు అడగలేదు కదా సర్" అని జవాబిచ్చాడు. "నిజమే సుమా" అనుకున్నాను.

మళ్ళా నాలుగైదు రోజులు గడిచాక నాకెందుకో క్యాంపు క్లర్కు అబద్ధం చెబుతున్నాదనిపించింది. ఈసారి నాకు అనుమానం వచ్చిన ఒక విజిటర్‌ని పట్టుకున్నాను. "ఏమయ్యా, నువ్వు ఇంతకు ముందోసారి వచ్చావ్ కదా?"

"లేదు సర్. ఇదే మొదటిసారి..." అన్నాడు భయపడుతూ.

విజిటర్ల రిజిష్టర్‌లో అతనిపేరు, చిరునామా తనిఖీ చేస్తే, అతను మొదటిసారిగా వచ్చిన మాట నిజమేనని తేలింది. మరి నాకెందుకలా అనిపించింది? అతన్ని దబాయించాను. "నువ్వు ఇదే రంగు ఇదే చిరిగిన చొక్కా వేసుకుని వారం క్రితం నా దగ్గరకు వచ్చావ్. ఇప్పుడు బుకాయిస్తున్నావ్?"

వాడు వలవల ఏడ్చేశాడు. "నేను ఇదే మొదటిసారి వస్తున్నాను సర్... బహుశా వారం క్రితం ఈ చొక్కా వేసుకుని ఇంకెవరన్నా వచ్చి ఉంటారు సర్..." అంటూ వెక్కుతున్నాడు.

"నీ చొక్కా వేసుకుని ఇంకోడెలా వస్తాడయ్యా! కహానీలు చెబుతున్నావా?"

"లేను సర్... ఈ చొక్కా నాది కాదు సర్... బంగళా గేటు బయట అద్దెకు తీసుకున్నాను..."

నిర్ఘాంతపోయాను. అంటే - వారం క్రితం ఇదే చొక్కాతో వేరెవరో వచ్చిన మాట నిజమా? మరి ఇదే చొక్కా నాలుగైదు సార్లు వచ్చింది నా దగ్గరకి? అంటే ప్రతిసారీ వేర్వేరు మనుషులే వచ్చి ఉంటారా?

వెంటనే ఆ చొక్కాలు అద్దెకిచ్చేవాణ్ణి లాక్కురమ్మని మా వాళ్ళకి పురమాయించాను. వచ్చాడు. వాడికి పెద్ద బండి ఉంది. ఆ బండినిండా చొక్కాలే. రకరకాలుగా చిరిగిపోయిన చొక్కాలు, చిరిగిపోయిన పంచెలు, చీరలు కూడా ఉన్నాయి. వాణ్ని పట్టుకొని, ఏమిటీ కథా? అని ఆరా తీశాను.

నాకు ముందు పనిచేసిన కలెక్టరు పార్థసారథికి 'పేదల పక్షపాతి' అని పేరు. ఆ విషయం ప్రజలకి తెలియాలి కదా! తనని చూడటానికి వచ్చేవాళ్ళలో పేదవాళ్ళకే ప్రథమావకాశం కల్పించేవాడు. ఆ విషయం కలెక్టరుగారి దగ్గరకి పని మీద వచ్చే సామాన్యుడికి అక్కడికి వచ్చాక గదా తెలిసేది. మరి, అతి పేదవాడిలా కలెక్టరుగారికి అప్పటికప్పుడు కనుపించటం ఎలా? అకస్మాత్తుగా పేదవాడిగా ఎలా అయిపోవాలి?....అంతే! సిబ్బందిలో ఒక 'తెలివైన' వాడు తన స్నేహితుడితో ఈ 'పేద బట్టలు' అద్దెకిచ్చే వ్యాపారం పెట్టించాడు!

ఆ 'పేదబట్టలు' అద్దెకిచ్చే వాడు బంగళా బయట బ్రిడ్జి క్రింద ఒకతోపుడు బండిమీద ఈ వ్యాపారం నడుపుతూ, బంగళాకి నడిచి వచ్చే విజిటర్లకి చెబుతుంటాడట.

"కలెక్టరుగారు డబ్బున్న వాళ్ళను, పెద్ద వాళ్ళను తొందరగా చూడరు. పేదవాళ్ళనే ముందు చూస్తారు. వాళ్ళతోనే బాగా మాట్లాడతారు... మీరు ఇలా మంచి బట్టలతో వెళ్తే - మూడు

నాలుగు గంటలు పడిగాపులు కాయాల్సిందే. ఇదిగో ఈ చొక్కా, పంచె వేసుకొంటే గంటలోపల కలెక్టరుగార్ని చూసి, మీ దరఖాస్తు ఇచ్చి, ఆయనతో బాగా మాట్లాడి బయటపడతారు. చొక్కాకి రూపాయి, పంచెకు రూపాయి... మీ బట్టలు ఇక్కడ పెట్టివెళ్ళండి. తిరిగి వచ్చాక మా బట్టలు మాకిచ్చి, మీ బట్టలు తొడుక్కొని హాయిగా వెళ్ళిపొండి..."

ఇలాంటి సంఘటనలు అనేకం జరుగుతుంటాయి. మన మంచితనాన్ని కూడా సొమ్ముచేసుకొనే తెలివిగల ఉద్యోగులకి ఈ వ్యవస్థలో కొదవ లేదు. ఉద్యోగస్థులలో మంచివాళ్ళూ ఉంటారు. ముంచేవాళ్ళూ ఉంటారు. ఎవరు ఎలాంటి వాళ్ళూ అని విశ్లేషించుకునే శక్తీ, ఎవరిమీద ఏ మేరకు ఆధారపడవచ్చును అన్న విచక్షణా జ్ఞానం ఐఏఎస్‌లకైనా, ఐపిఎస్‌లకైనా అత్యవసరమైన లక్షణాలలో ఒక భాగం.

అది లేకపోతే ఎలా ఉంటుందంటే -

నేను ఐఏఎస్ అధికారిగా (అసిస్టెంట్ కలెక్టర్‌గా) పశ్చిమగోదావరి జిల్లాలో శిక్షణ పొందేటప్పుడు ఏలూరు తాలూకాకి తహశీల్దారుగా వేశారు. అక్కడ శిక్షణలో ఉండగా ఎవరో మంత్రిగారు వచ్చారు. ఆయన్ని ఏదో ప్రారంభోత్సవానికి ఆహ్వానించిన వాళ్ళు ఆయనకి గెస్టుహౌస్ పెట్టలేదు. భోజనం ఏర్పాట్లూ చెయ్యలేదు. నేను ఏం చేయాలో తెలీక నాక్రింద పనిచేసే డిప్యూటీ తహశీల్దారుని, రెవెన్యూ ఇన్‌స్పెక్టరునీ సంప్రదించాను. వాళ్ళు "మా కొదిలేయండి సార్, మేం చూసుకుంటాం" అన్నారు.

మంత్రిగారి ఏర్పాట్లనీ బాగా చూసుకున్నారు. మంత్రి వెళ్ళి పోయాక వాళ్ళని అడిగాను. "ఎంత ఖర్చయింది?"

వాళ్ళు చెప్పారు.

"డబ్బు ఎక్కడిది?... ఇలా వి.ఐ.పిలు వచ్చిన ప్రతిసారీ ఎక్కడ్నుంచి తెస్తూంటారు?..." మళ్ళీ అడిగాను.

వాళ్ళు చాలా వినయంగా నా ముందు చేతులు కట్టుకొని చెప్పారు. "మా టి.ఏలూ, డి.ఏలూ ఉంటాయి గదండీ, వాటిల్లోంచి తీసి ఇలా ఖర్చు పెడ్తుంటాం సర్..."

నాకు జాలేసింది. పాపం! వాళ్ళ జేబుల్లో డబ్బుల్లోంచి వి.ఐ.పిలకి సపర్యలు చేయటమా? ఎంత అన్యాయం? - అనుకున్నాను. నాలుగు రోజుల తరువాత ఏదో సందర్భంలో కలెక్టరు సుబ్రహ్మణ్యం గారిని కలిసినప్పుడు ఆవేశంగా చెప్పాను.

"ఇలా రెవెన్యూ సిబ్బంది చేత సొంత ఆదాయాల్లోంచి వి.ఐ.పిలకి ఖర్చు పెట్టించడం బాగాలేదు సర్. మనం ఏదైనా 'అతిథి మర్యాదల భత్యం' అని ఒకటి ఏర్పాటు చేయాలి కదా! లేకపోతే వాళ్ళుమాత్రం ఎంతకాలం ఇలా భరించగలరూ?...."

సుబ్రహ్మణ్యంగారు నవ్వుతూ నామీద జాలిపడ్డారు. "ప్రసాద్ నువ్వు చెప్పిందే నిజమైతే రెవెన్యూశాఖలో పనిచేసే ఉద్యోగులు ఆఫీసుల్లో ఫైళ్ళు చూసే పోస్టులు వద్దని, ఫిర్కాలో రెవెన్యూ ఇన్‌స్పెక్టరు పోస్టుకావాలనో, తాలూకాఫీస్‌లో డిప్యూటీ తహశీల్దారు కావాలనో ఎందుకు ఎగబడుతున్నారు?..."

నేను వెర్రిమొహం వేశాను.

"వాళ్ళకి తెలుసు - 'పవర్' ఉన్న పోస్టులో వుంటే విఐపిలను ఎలా పట్టించుకోవచ్చో, తమని తాము ఎలా పట్టించుకోవచ్చో..."

తరువాత కాలంలో విషయాలు అర్థమయ్యాయి. ఒక్క రెవెన్యూ శాఖలోనే కాదు ఏ శాఖలోనయినా ఇదే విధానం. రాను రాను అనేక క్రొత్త విషయాలు తెలుస్తూ వచ్చాయి. ఉద్యోగుల్లో కొంతమంది కేవలం కష్టపడి పనిచేయటాన్ని నమ్ముకుని పనిచేస్తుంటారు. కొంతమంది పనిదొంగలు, బద్ధకస్తులు మాత్రం బాస్‌లు అదమాయిస్తేనే కష్టపడుతుంటారు. ఇంకొంతమంది బాస్‌ల బలహీనతల్ని, అవసరాల్ని వెతికి, వెతికి కనిపెట్టి వాటిని తమకు అనుకూలంగా వాడుకోవటం కోసం కష్టపడుతుంటారు.

నేను ఎక్సైజ్ కమీషనర్‌గా వుండగా మా అమ్మాయి మాధవికి మద్రాసులో మెడిసిన్ సీటువచ్చింది. ఫీజు కట్టడానికి నా దగ్గరున్న సేవింగ్స్ సరిపోలేదు. నా తోటి ఐఏఎస్ అధికారి కమలనాథన్‌కి ఫోన్‌చేసి పదివేలు అప్పుకావాలన్నాను. అతను 'సరే' నంటే నా పి.ఏ.ని పంపించి, ఆ డబ్బు తెప్పించి, అతనిచేతనే చలానా కట్టించాను.

ఇది జరిగిన మూడోరోజునో నాలుగోరోజునో ప్రముఖ లిక్కర్ వ్యాపారి మాగుంట సుబ్బరామిరెడ్డి మా ఇంటికి రావడం, పుల్లారెడ్డి స్వీట్స్ ప్యాకెట్‌లో లక్షరూపాయలుంచి "స్వీట్స్" అని చెప్పి ఇచ్చి వెళ్ళటం, అందులో ఏముందో తెలుసుకున్న వెంటనే నేను అవినీతి నిరోధక శాఖకి ఫోన్ చేయటం, సుబ్బరామిరెడ్డి అరెస్టూ, కేసూ, గొడవా జరిగాయి. ఇంతకీ ఆయన నా దగ్గరికి వచ్చి అలా ఎందుకు చేశారూ అన్న ప్రశ్నకి సమాధానం చాలా కాలం తరువాత ఆయనే చెప్పాడు.

"మీ అమ్మాయికి ఫీజు కట్టలేక అప్పు చేయాల్సివచ్చిందనీ, చాలా ఇబ్బందుల్లో వున్నారనీ మీ డిప్యూటీ కమీషనర్ చెప్పి పంపిస్తేనే వచ్చాను సర్. లేకుంటే అంత ధైర్యం చేసుండేవాణ్ని కాదు...." (ఆయన చెప్పిన డిప్యూటీ కమీషనర్ తరువాత కాలంలో అవినీతి ఆరోపణల మీద సస్పెండయ్యాడు.)

ఉన్నత స్థాయిల్లోకి వెళ్ళే ఐఏఎస్, ఐపిఎస్‌లకి ఎలాంటి బలహీనతలు, అవసరాలు వుంటాయో కనిపెట్టి చూసే తత్వం ఉద్యోగుల్లో వుండటం అసహజం కాదని నా సర్వీసులో అనేక అనుభవాలు స్పష్టంచేస్తున్నాయి. బలహీనత చిన్నదా పెద్దదా అని కాదు, అసలు ఏదో

ఒకటి వుంటే చాలు. అది మద్యంకోసమా, మగువలకోసమా... మరొకటా మరొకటా అన్నది విషయంకాదు.

ఆఖరికి మిరపకాయ బజ్జీలంటే ఇష్టపడటం కూడా ఒక బలహీనతగా కనిపెట్టిన పోలీసు ఉద్యోగుల్ని కూడా చూశాను.

ఖమ్మం కలెక్టరుగా వున్నప్పుడు నా పరిధిలో నేను జిల్లాలో నక్సల్స్ ప్రభావం తగ్గించాలంటే ఏం చేయాలనే దాన్ని గురించి సుదీర్ఘంగా ఆలోచించాను. వాళ్ళ కార్యక్రమాలు, వాళ్ళ సంచారం, రహస్యంగా అడవులలో, గిరిజన వాసాల్లో జరుగుతున్నాయి. చాలామంది గిరిజన యువకులను ప్రభావితం చేసి తమలో కలుపుకోవడం జరుగుతోంది... ప్రభుత్వ అధికారులు చేసే అన్యాయాల మీదా, రాజకీయనాయకుల శుష్కవాగ్దానాలమీదా, గ్రామాధికార్లు, భూకామందులు చేసే దౌర్జన్యాలమీదా... గిరిజన ప్రజలను ఉత్తేజపరిచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాళ్ళు పనిచేసేలట్లు చేయడం, ఎవరైనా ఎదురుతిరిగినా మాటవినకపోయినా వాళ్ళతో క్రూరంగా ప్రవర్తించడం- తమకి వ్యతిరేకులను, తమని వ్యతిరేకించేవారిని చంపివేయడం... ఇలా ఉండేది.

ఈ పరిస్థితుల్ని మెరుగుపరచాలంటే దగ్గరదారులు లేవు. అందుకే గిరిజనుల ప్రగతి గిరిజనుల ద్వారానే అన్న నినాదంతో గిరిజన యువకులను దగ్గరకు తీసి ప్రభుత్వ పథకాలకు వారిని దగ్గర చేయడం, వాళ్ళకి యితర గిరిజనులకు సహాయం చేయదానికి కావలసిన వనరులు ఏర్పాటుచేయడం, వాళ్ళచేత గ్రామాభ్యుదయ సంస్థలు పెట్టించటానికి సహాయపడటం... ఇలా మొదలుపెట్టి గిరిజనాభ్యుదయ కార్యక్రమాలు గ్రామ గ్రామానా విస్తరింపచేశాం. వేలమంది గిరిజనులు ప్రభుత్వ కార్యక్రమాలలో నేరుగా పాలుపంచుకునే విధంగా పరిస్థితి మారింది. సంజయ్‌గాంధీ కిన్నెరసానికి వచ్చినప్పుడు జిల్లాలో ఈ కార్యక్రమం ప్రభావం గిరిజనుల మనస్సుల్లో ఎలా నాటుకుందో అందరికీ తెలిసివచ్చింది. 60 వేల మందికి పైగా గిరిజనులు ఆ సభకు హాజరై, ప్రభుత్వానికి, ప్రభుత్వ కార్యక్రమాలకి, వాళ్ళకి వున్న సన్నిహితత్వాన్ని నిరూపించారు... ఆ రెండేళ్ళలో మెల్లమెల్లగా ఖమ్మం అడవులలో నక్సలైటు కార్యక్రమాల ఉధృతం తగ్గడమే కాకుండా, వాళ్ళకి గిరిజనుల అండదండలు సన్నగిల్లుతూ వచ్చాయి.

ఈ నేపథ్యంలో, ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఇప్పటి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హోదా) ఖాన్‌గారు ఖమ్మం జిల్లాలో పర్యటించి, నక్సలైట్ల ప్రాబల్యం ఎలా వుందో స్వయంగా తెలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కలక్టరుగా నన్ను కూడా వారితో పర్యటించమని కబురుపంపారు... ఆయన తగినంత ముందుగా సమాచారం ఇవ్వకుండా మరుసటిరోజే వస్తున్నాననడంతో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సదాశివరావు, అడిషనల్ ఎస్.పి. సుదర్శన్ వచ్చి, ఖాన్‌గారి పర్యటన వివరాలు నాతో చర్చించారు.

మరుసటిరోజు ఖాన్‌గారు వచ్చారు. ఆయన్ని మేమందరం ఖమ్మం ట్రావెలర్స్ బంగళాలో కలుసుకొన్నాం. ... మధ్యాహ్నం భోజనం తరువాత ఇల్లెందుకు బయలుదేరాం. భోజనంలో

వడ్డించిన వేడివేడి మిరపకాయ బజ్జీలు ఖాన్‌గారికి చాలా నచ్చాయి. చాలా మెచ్చుకున్నారు... "నాకివి ఇష్టమని మీకెట్లా తెలుసు?" అని అక్కడున్న పోలీసు అధికారులతో హాస్యంగా అడిగారు.

ఇల్లెందులో కొందరు పోలీసు ఆఫీసర్లతో మీటింగు జరిగింది. మధ్యాహ్నం తేనీరుతో మిరపకాయ బజ్జీలు పెట్టారు. వేడిగా బాగున్నాయి. అక్కడ నుంచి అటవీ మార్గం ద్వారా గుండాల దాకా జీపుల్లో ప్రయాణం సాగించాం. ...దారిలో రెండు మూడు గిరిజన గ్రామాల్లో 10 నిమిషాలు ఆగి గిరిజనులతో ఐజిపి మాట్లాడేవారు... వెళ్ళిన చోటల్లా ఆతిథ్యం వేడి వేడి మిరపకాయ బజ్జీలతోనే. ఒకచోట అడవి మధ్యలో కుంపటి, బాణీనూనె, మిరపకాయబజ్జీలు – వాటికి తోకలా ఒక సబ్ ఇన్‌స్పెక్టరూ, కానిస్టేబులూ కాపలా...! చూసేవాడికి నాకే కొంచెం ఇబ్బందిగా అనిపించింది. ...ఖాన్‌గారి వైపు క్రీగంట చూశాను... ఆయనకూడా ఇబ్బంది పడ్డాడు.

ఇంతలో – వైర్‌లెస్‌లో ఏదో మెసేజ్ పెద్దగా వస్తోంది. నక్సలైట్లను కంట్రోల్ చేసే కార్యక్రమంలో భాగంగా ప్రతి పోలీసుస్టేషన్‌లోనూ వైర్‌లెస్ సెట్లు, ప్రతి పోలీసు వాహనానికి వైర్‌లెస్ సెట్లు వున్నాయి. ఆ సెట్ల ద్వారా సీనియరు ఆఫీసర్లకు వారి పరిధిలోని అన్ని స్టేషన్లలో జరిగే సంభాషణ వినడానికీ అవకాశం ఉంది. ఎవరు ఎవరితో మాట్లాడాలని పిలుస్తున్నారో, ఎవరు దానికి జవాబు ఇస్తున్నారో, వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో... ఆ సమాచారాన్నంతా ఎస్‌పి., అడిషనల్ ఎస్.పిలు తమ తమ జీపుల్లో కూర్చొనే వినవచ్చు, ఎవరితో కావాలంటే వారితో మాట్లాడొచ్చు కూడా.

ఇల్లెందు నుండి వైర్‌లెస్ ఆఫీసర్ గుండాల పోలీసుస్టేషనుకి బిగ్గరగా మాట్లాడుతున్నాడు. చాలా పెద్ద కంఠంతో "ఇల్లెందు కాలింగ్ గుండాల ... ఇల్లెందు కాలింగ్ గుండాల... ఇల్లెందు పి.ఎస్. మాట్లాడుతున్నాను... ఐజి దొరగారి ప్రోగ్రాం గురించి ... అంతా సిద్ధమేనా?!"

"అంతా రెడీ... దొరగారు ఇల్లెందు వదిలారా?"

"వదిలి అరగంట అయింది. ఇంకో గంటలో గుండాల వస్తారు. దొరగారితోపాటు కలక్టరు దొరగారు, ఎస్.పి. దొరగారు, అడిషనల్ ఎస్.పి దొరగార్లు కూడా వస్తున్నారు. ఇక్కడ ఖమ్మంలో ప్రోగ్రాములు బాగా జరిగాయి. ... ఐజి దొరగారికి మిరపకాయ బజ్జీలంటే మహా పిచ్చి.... వేడివేడిగా అరేంజ్ చేయండి.... ఓవర్..." అని పెట్టేశాడు.

జీపులో అంతా వింటున్నాం. వెనక జీపులో వున్న వాళ్ళు కూడా వింటున్నారని తెలుసు...

ఐజిగారి ముఖం ఎర్రబడింది... ఏదో అనబోతుండగా అడవి క్లియరెన్స్‌లో (కొంచెం ఖాళీ ప్రదేశం) జీపులు ఆగాయి. విరామం కోసం దిగాం. అక్కడ రెండు గిరిజన గుడిసెలు. ప్రక్కనే – కుంపటి, వేడి వేడి మిరపకాయబజ్జీలు... వెనక జీపులోంచి ఎస్.పి, అడిషనల్ ఎస్.పి.లు, మిగతా పోలీసు అధికారులు దిగుతూ కొంచెం ఇబ్బందిగానే ముఖాలు పెట్టారు. వాళ్ళని చూస్తూనే ఖాన్‌గారు మండిపడ్డారు.

"ఏమనుకుంటున్నారు? ఏమిటిదంతా? నేను ఖమ్మం వచ్చింది మిరపకాయ బజ్జీలు తినటానికా? ఏదో బాగున్నాయని అంటే - ఇంత హడావుడా? నేనేమైనా తిండిపోతునను కుంటున్నారా? నన్ను మిరపకాయబజ్జీలతో కొనేయాలనుకుంటున్నారా? లేదా ఎగతాళి చేస్తున్నారా?..." ఇలా అంటూ ఆయన ఆవేశంగా అందరిమీదా విరుచుకుపడ్డారు. ఎవరూ ఎదురు మాట్లాడలేదు. ఖాన్‌గారు మంచి ఆఫీసరు. చాలా కష్టపడి పనిచేసే అలవాటుంది. హైదరాబాదు కమీషనరుగా మంచి పేరు సంపాదించారు. నాకు బాగా పరిచయం. నేను పి.వి. గారి దగ్గర ముఖ్యమంత్రి కార్యదర్శిగా వున్నప్పుడు ఆయన జంటనగరాలకి పోలీసు కమీషనరుగా ఉండేవారు.

ఇంతకీ ఇందులో నాకో విషయం అర్థం కాలేదు... "ఇల్లెందునుంచి ఆపరేటర్ ఇప్పుడే కదా మాట్లాడుతూ మిరపకాయబజ్జీల గురించి చెప్తున్నాడు. మనం వింటూవుండగానే ఈ అడవి మధ్యలో జీపు ఆగింది. అప్పటికే ఇక్కడ.... అడవిలో కుంపటి, వేడి వేడి బజ్జీలు రెడీగా వున్నాయే. అంత వేగంగా, సమర్థంగా ఎలా ఏర్పాటుచేయగలిగారు?" అని సుదర్శన్‌ని పక్కకి పిలిచి అడిగాను.

"సామర్థ్యమా, నా బొందా! ఐజీగారు ఖమ్మంలో భోంచేసేటప్పుడే బజ్జీలు బాగున్నాయనీ, తనకు యిష్టమనీ అన్నారు కదా!... అంతే, ఖమ్మం నుంచే అన్ని స్టేషన్‌లకీ వార్త వైర్‌లెస్‌లో వెళ్ళిపోయుంటుంది. అందుకే ఇల్లెందులో ఎక్కడ చూసినా అవే!... ఎందుకైనా మంచిదని మళ్ళీ ఇల్లెందు వాళ్ళు మిగతా వాళ్ళక్కూడా జ్ఞాపకంచేస్తున్నారు... ఈ సరఫరాల విషయంలో మా వాళ్ళు చాలా ఎఫిషియంటే" అన్నాడు నవ్వుతూ సుదర్శన్.

అప్పుడే నాకూ మనోవికాసం కలిగింది. దాంతో, మిరపకాయ బజ్జీలంటే నాకూ ఇష్టమే అయినా ఈ విషయం నేను పనిచేసిన చోట్ల మాత్రం ఎవరికీ చెప్పలేదు!!

★ ★ ★

ఐ.ఏ.ఎస్ గుండెలోతుల్లోంచి...7

నాకు తెలిసిన ఒక ఐ.ఏ.ఎస్ అధికారి.

గ్రూప్-1 సర్వీసు నుంచి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌కి ఎంపికయ్యాడు. రెండు జిల్లాల్లో కలెక్టరుగా పనిచేశాడు.

జిల్లా రెవెన్యూ అధికారిగా (ఇప్పటి జాయింట్ కలెక్టరు పోస్టులో) పనిచేసిన చోటే కలెక్టరుగా పనిచేసే అవకాశం లభించింది. ఆ జిల్లాలో చాలా మంచిపేరు సంపాదించుకున్నాడు కాబట్టి అక్కడే కలెక్టరుగా నియమితుడయ్యాడు.

ఏ ఫైలునీ 24గంటలకి మించి తన దగ్గర వుంచకూడదనుకునేవాడు. చాలా వేగంగా నిర్ణయాలు తీసుకుంటాడనీ, నిజాయితీ గలవాడనీ, క్రమశిక్షణతో జీవితం గడుపుతాడనీ... ఇలాంటి అనేక మంచి లక్షణాలున్న అధికారిగా జిల్లాల్లో అతను పనిచేసిన చోట పేరు సంపాదించుకున్నాడు. అయితే...

* * *

సాధారణంగా ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌లో నేరుగా ప్రవేశించిన వాళ్ళకు ఇలా గ్రూప్-1 నుంచి ఐ.ఏ.ఎస్‌కి ఎంపికయిన వాళ్ళు తమంత మేధావులు కారేమోనన్న సందేహం పీడిస్తూ వుంటుంది. ఇది అనేక సందర్భాలలో అనేక రూపాలలో ప్రతిఫలిస్తూ వుంటుంది. నిజానికి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌కి లేదా, ఇండియన్ పోలీస్ సర్వీసెస్‌కి లేదా, ఇండియన్ ఫారిన్ సర్వీసెస్‌కి ఎంపిక కావటమే ఒక వ్యక్తి మేధస్సుకి కొలబద్ద అవుతుందా? మేధస్సుని కొలవగల యంత్రంగానీ, కొలబద్దగానీ ఏమైనా వుందా?

గ్రామాల్లోకి వెళ్ళి చూస్తే తెలుస్తుంది. భారతదేశం వున్నదే గ్రామాల్లో కదా! గ్రామాల్లో అడుగు పెట్టే ఐ.ఏ.ఎస్ అధికారిని - 'ప్రభుత్వవాహనం' అని బోర్డున్న కారు, బిళ్ళ బంట్రోతు (డఫేదారు) వెంటలేకుండానూ, ఐ.పి.ఎస్ అధికారిని - యూనిఫారమ్ లేకుండానూ వెళ్ళిరమ్మంటే తెలుస్తుంది - అతని మేధస్సుని, హోదాని వాళ్ళెంత గుర్తిస్తారో. ఈ సంగతి జిల్లాల్లో పనిచేసేటప్పుడు బాగా అర్థమవుతుంది.

నేను ఖమ్మం జిల్లా కలెక్టరుగా వున్నప్పుడు మధిర దగ్గర ఒక గ్రామంలో గ్రామపునర్నిర్మాణ కార్యక్రమం క్రింద పెద్ద కాలనీ ప్రారంభోత్సవానికి హాజరు కావాల్సి వుంది. ఆహ్వానించటానికి గ్రామస్థులంతా నా దగ్గరికి రాలేరు కాబట్టి వాళ్ళ తరపున వాళ్ళ సమితి ప్రెసిడెంటో ఇంకెవరో

వచ్చి నన్ను ఆహ్వానించారు. సరే, వెళ్ళాను. వెళ్తుండగా దారిలో నా కారు చెడిపోయింది. ఏం చెయ్యాలి? ఎలా వెళ్ళాలి? కారు బాగుపడాలంటే మెకానిక్ కోసం కొన్ని మైళ్ళదూరం వెళ్ళాలి.

నా దఫేదారుని, డ్రైవరుని "మీరెలాగైనా మెకానిక్‌ని తీసుకురండి. బాగుచేయించండి. నేను నడిచి వెళ్తాను" అన్నాను. వాళ్ళు ఖంగారు పడ్డారు.

"సర్, ఇక్కడ్నుంచి ఇంకా నాలుగైదు మైళ్ళు వెళ్ళాలి సర్. మీరు నడవటం కష్టం. ఏదన్నా ప్రత్యామ్నాయం చూద్దాం సర్..." అన్నారు వాళ్ళిద్దరూ. మా దఫేదారైతే "నేను లేకుండా మీరు వెళ్ళొద్దు సర్, బాగుండదు" అంటూ బ్రతిమాలాడు. అంతలో ఎవరో ఒక యువకుడు మోటారు సైకిల్‌మీద ఆ దారిలో వచ్చాడు. మావాళ్ళు చెయ్యి చూపగానే అతను సర్కారు బిళ్ళబంట్రోతుని గుర్తుపట్టి ఆగాడు. అతను అక్కడే ఓ గ్రామంలో డాక్టరుట. వీళ్ళు పరిస్థితి వివరించి, కలెక్టరుగారిని(నన్ను) కొంచెం ఆ ఊరిదాకా తీసుకువెళ్ళమని అడిగారు.

అతను మహదానంద పడిపోయాడు. "రండి సార్, రండి" అంటూ నన్ను ఎక్కించుకున్నాడు. కారుని బాగు చేయించి ఆ గ్రామానికి తీసుకువస్తామని డ్రైవరూ, దఫేదారూ నిలిచిపోయారు.

10-15 నిమిషాల్లో మోటారు సైకిల్ ఆ గ్రామ పునర్నిర్మాణ కాలనీ ప్రారంభోత్సవం జరిగే చోటుకి చేరుకున్నది. అక్కడ బ్యాండు మేళం పూలదండలు వగైరా హడావుడి కనిపించింది. అది నాకోసమే అని నాకు తెలీదు. అక్కడ నేను బైక్ దిగి తల దువ్వుకుంటుంటే, నా మోటారు సైకిలిస్టు అక్కడున్న వాళ్ళలో ప్రధాన నిర్వాహకుడికోసం విచారించాడు.

ఆ ప్రధాన నిర్వాహకుడు - అంటే నన్ను ఆఫీసులో కలుసుకొని ఆహ్వానించిన పెద్దమనిషి - అక్కడ లేడు. మిగతావాళ్ళు మా వంక మామూలుగా చూసి, "కలెక్టరుగారొస్తారని లోపల ఏర్పాట్లు చేస్తున్నాడు" అన్నారు.

నా మోటారు సైకిలిస్టు చాలా నొచ్చుకున్నాడు. "అయ్యయ్యో, ఈయనే కలెక్టరుగారు. ఆయన్ని వెంటనే పిలవండి"అన్నాడు.

వాళ్ళు నా మోటరు సైకిలిస్టువంకా, నావంకా ఎగాదిగా చూశారు. సాదాసీదా పాంటూ (టక్ చేయాలని కూడా అనుకోలేదు. వెళ్తున్నది ఒక గ్రామానికి కదా!), కళ్ళద్దాలు, సన్నగా... కనబడిన నన్ను చూసి, వాళ్ళు నవ్వారు. నా మోటారు సైకిలిస్టు వంక వెటకారంగా చూస్తూ "పరాశికాలాడద్దు. కలెక్టరుగారు ఇప్పుడు కారులో వస్తారు. చూద్దువులే, కూర్చో" అన్నారు.

నేను కూడా ఏమీ మాట్లాడలేకపోయాను. వాళ్ళ మాటలు నేను వినడం లేదన్నట్టుగా మొహం తిప్పుకుని, ఆ కాలనీని చూస్తున్నట్లు అటూ ఇటూ తిరుగుతున్నాను. లేకపోతే, కలెక్టరుని నేను కాదంటున్నవాళ్ళ దగ్గర "నేనేనయ్యా మీ జిల్లా కలెక్టరుని, నమ్మండి స్వామీ" అని చెప్పుకోవడం ఎంత నామోషీ! (ఐ.ఏ.ఎస్ లక్షణం కదా!)

కాలనీ లోపల్నుంచి నన్ను ఆహ్వానించిన పెద్దమనిషి ఇవతలకొచ్చాడు. అతను నన్ను చూస్తూనే "కలెక్టరుగారు, కలెక్టరుగారు" అని హడావుడి పడటంతో నా మర్యాద నిలబడింది. గ్రామస్థులంతా మహా బాధపడిపోయారు. "క్షమించండయ్యా, బిళ్ళబంట్రోతు లేకపోతే మీరే కలెక్టరని తెలుసుకోలేకపోయాం..."

అంటే – నా హోదా ఏమిటో నా వెంట వుండే బిళ్ళబంట్రోతుని బట్టే తెలుస్తుంది. హోదా తెలిశాక మేధావులమన్న ముద్రని అక్కడ మాట్లాడే వాళ్ళే వేస్తారు.

★ ★ ★

నేను పైన ఉదహరించిన ఐ.ఏ.ఎస్ అధికారి నిజంగా తెలివైనవాడు. అద్భుతమైన ప్రజా సంబంధాలను నెరపినవాడు. పత్రికల వాళ్ళు అతనికి బ్రహ్మరథం పట్టేవారు. (వాళ్ళనుకూడా అతను బాగా చూసుకునేవాడు!) రాజకీయనాయకులు సయితం అతని గురించి చాలా బాగా చెప్పేవారు. ఆ రోజుల్లో చెన్నారెడ్డితో సహా ప్రతి ముఖ్యమంత్రికీ అతను అభిమాన పాత్రుడే. కొన్ని కీలకమైన పోస్టుల్లో కూడా పనిచేశారు. కాని... సాటి అధికారులలో అతనికున్న ఇమేజి మాత్రం...?

కారణం! అతనికున్న అనేక గొప్ప లక్షణాలని మించిన అసూయ, అహంభావం అతన్ని అంటి పెట్టుకుని వుండేవి. తనకి ముందు ఆ స్థానంలో పనిచేసిన అధికారికి ఏ మాత్రం మంచి పేరున్నా ఓర్వలేకపోయాడు!! బయట ప్రపంచంలో ఎంతమంచి పేరువున్నా సాటి అధికారులను కలుపుకు వెళ్ళగల మాట మంచితనం లేకపోయినా, సాటి ఐ.ఏ.ఎస్‌ల పట్ల సుహృద్భావంతో మెలగకపోయినా పాలనా యంత్రాంగంలో పైకి వెళ్ళిన కొద్దీ కార్యసాధన దుర్లభమవుతూంటుంది.

ఇలాంటి మరో సమర్థుడైన అధికారి విషయంలో మరో చిన్న 'లక్షణం' అతనికున్న సామర్థ్యాన్ని సూర్యుణ్ణి కప్పేసే మబ్బుల్లా చాలాకాలం కప్పేసింది. అతను మాజీ సైనికుడు కూడా. చాలా కష్టపడి పనిచేసే తత్త్వం. జిల్లాలో చాలా తక్కువ కాలంలో చాలా ఎక్కువ పేరు సంపాదించుకున్న చరిత్రవుంది. రాత్రింబవళ్ళూ ప్రజలకి అందుబాటులో వుండేవాడు. ఒక పని చేసినా, నిర్ణయం తీసుకున్నా దానికి చివరిదాకా నిలబడే మనిషి. కొన్ని కొన్ని నిర్ణయాలు తీసుకోవాలంటే ఎంతో ధైర్యం, సాహసం కావాలి. అవన్నీ పుష్కలంగా ఉన్నవాడు.

ఇంతటి ప్రజ్ఞావంతుడు కూడా మనసులో వున్న భావాల్ని వున్నవి వున్నట్లుగా నిష్కర్షగా బయటికి కక్కేయడం అన్న ఒకే ఒక్క 'లక్షణం' కారణంగా కొన్ని సంవత్సరాలపాటు అవస్థ పడాల్సివచ్చింది. మనసులో వున్నది వున్నట్లుగా మాట్లాడడం తప్పా – రైటా?

నాకు శిక్షణనిచ్చిన సుబ్రహ్మణ్యంగారు చెప్పిన మాటలే నాకు ఎప్పుడూ గుర్తుకొస్తాయి. పాలనలో పనులు జరగాలంటే లౌక్యం అవసరం. గొప్ప మానవతా భావాలు, విపరీతంగా కష్టపడి పనిచేసే తత్త్వం, అపారమైన సృజనాత్మకత, అద్భుతమైన ప్రజా సంబంధాలు, పత్రికా

సంబంధాలు ఉన్నప్పటికీ ఒక ఐ.ఏ.ఎస్. అధికారి విజయవంతంగా అధికార సోపానాలు అధిరోహిస్తాడని చెప్పలేం. నిజమైన సామర్థ్యానికి కొలబద్ద ప్రజలు మెచ్చేలా పనులు సాధించ గలగటం.

మనం ఒక పోస్టులో పనిచేస్తున్నప్పుడు అందరూ మన గురించి మంచిగా చెప్పుకుంటున్నట్లే కనిపిస్తుంది. ఆ పోస్టులోంచి వెళ్లిపోయాకే మన గురించిన వాస్తవ ప్రజాభిప్రాయం బయటపడేది. జిల్లాల్లో పనిచేసే వాళ్లకే అలాంటి అవకాశం ఎక్కువుంటుంది.

ఎన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు - 1987లో అనుకుంటాను - ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటిస్తూ విశాఖపట్నంలో ఆగినప్పుడు, ఒక పత్రికా విలేకరుల సమావేశంలో అప్పటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు గురించి ప్రశంసల వర్షం కురిపించారు.

"వారు అద్భుతంగా పనిచేస్తున్నారు. ప్రజా సంక్షేమం పట్ల కమిట్‌మెంట్‌తో పనిచేస్తున్నారు. ప్రజలకోసం ప్రతి ఒక్క అధికారీ అలా పనిచేయాలని కోరుకుంటున్నాను..." ఇంకా అనేక పదాలు ఉపయోగించి తూర్పుగోదావరి కలెక్టరు గురించి విశాఖపట్నంలో ముఖ్యమంత్రి మాట్లాడడం ఆ ఐ.ఏ.ఎస్. అధికారి సామర్థ్యానికి అద్దం పడుతుంది. (ఆ కలెక్టరు ఆ ముఖ్యమంత్రికి బంధువూకాదు, సన్నిహితుడూ కారు, కులస్థుడూ కాదు). అప్పటికీ ఇప్పటికీ ఆ జిల్లా గుర్తుంచుకొనే అధికారుల్లో అతనూ ఒకడు.

★ ★ ★

కొంతమంది తెలివైనవాళ్ళు - మంచి ప్రజా సంబంధాలు, మంచి పత్రికా సంబంధాలు, రాజకీయ నాయకులతో సత్సంబంధాలు వుంటే చాలు, మంచిపేరు వస్తుందిగదా అనుకొంటారు.

నాకు తెలిసిన ఒక ఐ.ఏ.ఎస్.అధికారి ఒక జిల్లాలో పనిచేసినప్పుడు, సమర్థుడిగా గుర్తింపు తెచ్చుకోలేకపోయాడు. నిజానికి అతనికి మేధస్సు తక్కువేంకాదు. కాని అప్పటికి ప్రజా సంబంధాల గురించి అవగాహన తక్కువ. చాలా ఇబ్బంది పడ్డాడు. ప్రజలచేత మంచి కలెక్టరు అనిపించుకోలేకపోయాడు. ఆ తరువాత కొంతకాలం ఏరో ఒక కోర్సు చదవటానికి విదేశాలకి వెళ్ళాడు. తిరిగొచ్చాక అతన్ని మరో పెద్ద జిల్లాకి కలెక్టరుగా వేశారు.

అతనికి అప్పటికి ప్రజా సంబంధాల విలువేమిటో తెలిసిపోయింది. ఇంక ఆ జిల్లాలో వున్నన్నాళ్ళూ పత్రికలతో, రాజకీయ నాయకులతో సత్సంబంధాలే నెరుపుతూ వచ్చాడు. అతను బదిలీ అయినప్పుడు వందకి పైగా వీడ్కోలు సభలు జరిగాయి. ఘనంగా అందరూ పొగిడారు. కాని, ఆ జిల్లా గుర్తుంచుకునే సమర్థుల జాబితాలో ఇవ్వాళ అతనిపేరు కనబడదు.

మరో ఐ.ఏ.ఎస్. అధికారి. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కి వచ్చిన తమిళుడు. జిల్లాల్లో పనిచేసినప్పుడు కానీ, తరువాతగానీ చాలా మంచిపేరు సంపాదించుకున్నాడు. చాలా ఉన్నత ప్రమాణాలు గల జీవితం గడిపినవాడు.

ఒక ప్రభుత్వ సంస్థలో పనిచేసేటప్పుడు తనకున్న విచక్షణాధికారాలు ఉపయోగించి కార్మికుల ప్రయోజనం కోసం ఒక చిన్న కొనుగోలు చేశాడు. ఆ కొనుగోలు విలువ చాలా చిన్నదే అయినప్పటికీ నిబంధనలను పాటించలేదన్న కారణంగా సస్పెండయ్యాడు. అతని నిజాయితీని ప్రభుత్వం శంకించలేదు, కానీ నిబంధనలు పాటించలేదని ఆగ్రహించింది. ఒక్కొక్కసారి ఎంత సమంజసమైన పనిచేసినా, మేనేజిమెంట్ టెక్నిక్ (లౌక్యం) ఉపయోగించకపోతే వచ్చే ప్రమాదం అది. (ఆ తరువాత కాలంలో అతను చాలా ఉన్నత పదవులు అధిష్ఠించాడు.)

'చరిత్రలో నిలిచిపోయే పబ్లిక్ సర్వెంట్' అనిపించుకోవాలంటే సృజనాత్మకతతో, అంకిత భావంతో పనిచేసే వ్యక్తి అయివుండాలి.

కనీస విలువల్ని పాటించాలి.

మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.

పాలనను విమర్శించే రాజకీయ నాయకుల్ని, పత్రికలను దుమ్మెత్తిపోయటమో, వాళ్ళ పట్ల ద్వేషం పెంచుకోవటమో కాకుండా మన పని తీరుతో, మాటతీరుతో వాళ్ళని కూడా ఒప్పించగలిగేలా వ్యవహరించాలి.

సహ అధికారులను కలుపుకు వెళ్ళగలగాలి. వాళ్ళతో కలసి పనిచేయగలగాలి.

ఎంత గొప్ప లక్షణాలు మనలో వున్నప్పటికీ "నేను మాత్రమే చాలా నీతి, నిజాయితీ కల అధికారి"ని అన్న అహంభావం తలకెక్కినా, నోటిని అదుపులో వుంచుకోలేకపోయినా, అసూయ, దుగ్ధ, ద్వేషం వంటి అవలక్షణాలు ఆవహించినా – అవి మన వ్యక్తిత్వంలోని ఔన్నత్యం మొత్తాన్ని మసకబారేలా చేస్తాయి.

"నాకు ఎలాంటి బలహీనతలూ లేవు. నేను అన్నింటికీ అతీతుణ్ణి" అని చెప్పగలిగిన ఐ.ఏ.ఎస్. అధికారిని నేను చూడలేదు. కాని తమ వ్యక్తిగత బలహీనతలవల్లా, లోపాలవల్లా ప్రజా ప్రయోజనాలు, రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినకుండా సాటి అధికారులకు ఇబ్బంది కలిగించకుండా జాగ్రత్తపడిన అధికారుల్ని – నా సీనియర్‌లలో – చాలామందిని చూశాను.

నిజానికి రాగద్వేషాలకి బానిసైన మనుషుల్లో ఏ లోపమూ లేనివాళ్ళంటూ వుంటారా?

★ ★ ★

ఆ మధ్య నేను ఛైర్మన్‌గా హాజరైన ఒక ట్రస్టులో బోర్డు సమావేశం జరుగుతుండగా అక్కడున్న ఒక పెద్దాయన ఒక చీటీ రాసి నాకిచ్చి, "తరువాతెప్పుడైనా చదువుకోండి" అన్నాడు.

సమావేశం అయిపోయాక చదువుకున్నాను.

"... మీకున్న ఒక అలవాటు గురించి ఇలా చెబుతున్నందుకు అన్యథా భావించకండి. ...అవతలివాళ్ళు మీకు ఏం చెప్పదల్చుకున్నారో చెప్పటం పూర్తయ్యే లోపలే మీరు గ్రహించ గలిగినప్పటికీ, వాళ్ళు చెప్పేదేదో పూర్తిగా చెప్పనిస్తే, వాళ్ళ ఉత్సాహాన్ని కాపాడిన వాళ్ళవుతారు గదా...!"

ఇదే విషయాన్ని నాకెవరైనా ఓ 40 ఏళ్ళక్రితం చెప్పివుంటే ఎంత బాగుండేది?

★ ★ ★

అసలేం జరిగిందంటే...

'అసలేం జరిగిందంటే...' అనే ఈ శీర్షికను నేను రాయటం ఆరంభించి, 10–12 భాగాలు రాశాక, నాకొక ఇ–మెయిల్ వచ్చింది. ఆ మెయిల్ నా పేరు మీద రాలేదు. కాని నాకోసమే ఉద్దేశించబడింది.

'అనూష' అనే పేరుతో వచ్చిన ఆ మెయిల్ వేరెవరికో రాసింది. నాకు ఒక కాపీ పెట్టారు. ఆ మెయిల్ రాసిన వ్యక్తి తన 'దోస్త్'కి ఇలా రాశారు:

"...మిత్రమా, 'స్వాతి' పత్రికలో పి.వి.ఆర్.కె.ప్రసాద్ రాస్తున్న స్వోత్కర్ష చూస్తున్నావా? నవ్వొస్తోంది కదూ! ...."

* * *

2002 లో 'స్వాతి' వార పత్రికలో 'సర్వసంభవామ్' శీర్షికన నేను స్వీయ అనుభవాల్ని రాయటం జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నేను పనిచేసిన కాలంలోనూ, ఆ తరువాతా నాకు కలిగిన కొన్ని విచిత్రమైన అనుభవాలను ఆ శీర్షికలో రాశాను.

ఆ అనుభవాలన్నీ నాకు విస్మయం కలిగించేవీ, నన్ను నిర్ఘాంతపరిచేవీ. వాటిల్లో ఏ అనుభవాన్ని తీసుకున్నా ఏది ఎందుకు అలా జరిగిందీ అన్న ప్రశ్నకు తార్కికమైన సమాధానం దొరకనివే. అందుకే ఆ అనుభవాల సందేహాల్ని కూడా పాఠకుల ఊహకే వదిలేశాను. ఏది ఎందుకలా జరిగిందో, ఏ శక్తి చేయించిందో నా మనస్సుకి తెలుసు. కాని నేను నిరూపించలేను.

నిజానికి, హేతువాదానికి అందని ఆ అనుభవాల్ని రాయాలని నేను ఎప్పుడూ ఆశించలేదు. నేను ప్రధానమంత్రి కార్యాలయంలో అదనపు కార్యదర్శిగా, మీడియా సలహాదారుగా వున్నప్పుడు ప్రధానితోపాటు అనేక విదేశీ పర్యటనలు చేశాను. ప్రతి పర్యటనకీ కొందరు పత్రికా సంపాదకుల్ని, ప్రతినిధుల్ని కూడా ఆహ్వానించటం ఆనవాయితీ. అలా కొన్ని పర్యటనలలో పాల్గొన్న తెలుగు సంపాదకులలో 'స్వాతి' సంపాదకులు శ్రీ బలరామ్ ఒకరు.

మా పర్యటనల సమయంలో పిచ్చాపాటీ మాట్లాడుకునేటప్పుడు నేను మాటల్లో నా అనుభవాల గురించి చెబుతూంటే, "వాటినన్నింటినీ ధారావాహికంగా ప్రచురించాలని వుంది" అని శ్రీ బలరామ్ ఆసక్తి చూపించారు. నేను మర్రిచెన్నారెడ్డి మానవవనరుల సంస్థకి డైరక్టర్ జనరల్‌గా స్పెషల్ ఛీఫ్‌సెక్రటరీ హోదాలో పనిచేసే రోజుల్లో కొంత వ్యవధి చిక్కి రాయడం ఆరంభించాను. పాత డైరీలు వెతికి, టి.టి.డిలో పాత రికార్డులు గాలించి, ఫొటోలు తెప్పించీ...

అలా ఆ శీర్షికను రాశాను. ఆ శీర్షికలో వచ్చిన అనుభవాల్నే 'ఎమెస్కో' సంస్థవారు 'నాహంకర్తా...' టైటిల్‌తో పుస్తకంగా ప్రచురించారు.

ఆ పుస్తకం విడుదల 2003 ఆగస్టులో జరగాల్సివుంది. అప్పటి ప్రభుత్వ సలహాదారు (ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ) త్రిపురనేని హనుమాన్ చౌదరి చొరవతో రవీంద్రభారతిలో ఏర్పాటైన ఆ ఆవిష్కరణోత్సవంలో కేంద్ర విజిలెన్స్ కమీషనర్ శ్రీవిఠల్ ముఖ్యఅతిథి. మరికొంతమంది ప్రముఖులు కూడా వున్నారు.

ఆ సాయంత్రం అయిదుగంటలకి ఆవిష్కరణోత్సవ సభ జరగాల్సి వుండగా 7-8 గంటల ముందుగా ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. ఫలితంగా - నేను హైదరాబాద్‌లోనే వుండి, ఆఫీసులో ఖాళీగానే కూర్చొనికూడా ఆ సభకు హాజరు కాలేకపోయాను.

అసలేం జరిగిందంటే...

* * *

ఆ ఉదయం 9-10 గంటల ప్రాంతంలో నేను, నా భార్య గోపిక మా ఇంట్లోనే ఒక ధార్మిక పాఠం వింటూన్నాం. మధ్యలో ఎక్కడో ఒకచోట పాఠం ఆగింది.

చిన్న విరామం.

అంతలో గోపిక వ్యాఖ్యానం పాఠంమీదనుంచి నామీదకు మళ్ళింది.

"నాహంకర్తా, హరిఃకర్తా (నేను కాదు కర్తని, ఆ శ్రీహరే కర్త).... అని పైకి చెప్పటం తప్ప నిజంగా మీకు ఆ విశ్వాసం వుందా!... వుంటే పుస్తకం వేయించుకుని, అవన్నీ మీరే సాధించుకున్నట్లు ప్రచారం చేసుకోవాలనుకుంటారా?... నిజంగా ఆ విశ్వాసం వున్నవాళ్లు తామే అన్నీ సాధించినట్లు చెప్పుకుంటారా..." ఇలా ఆమె ఆవేశంగా సంధించిన విమర్శనాస్త్రాలు నేను ఊహించనంత ఉధృతంగా సాగాయి.

నేను ఏమీ మాట్లాడలేకపోయాను. ఆమెని వారించలేక కాదు, ఆమె చెప్పిన దాంట్లో సత్యం వుందా అన్న ఆత్మశోధన వల్ల.

నాకు తెలిసి ఆ 'సర్వసంభవామ్' (నాహం కర్తా...) శీర్షికలో - తిరుమలతిరుపతి దేవస్థానంలో నేను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వున్నప్పుడు జరిగిన ఏ అభివృద్ధి పనినీ నేను నా విజయంగా చెప్పుకోలేదు. ఇప్పటికీ చెప్పుకోలేను. ఆ సంఘటనలు, ఆ సందర్భాలూ, ఆ అనుభవాలూ తలుచుకుంటే అవి కేవలం ఒక మానవశక్తి వల్ల సాధ్యమయ్యేవి కావని నిర్ద్వంద్వంగా చెప్పగలను. పరిపాలనలో ఎదురయ్యే అనేక రకాల నియమనిబంధనలు, అధికార పరమైన అవరోధాలు, రాజకీయ వత్తిళ్ళు, పాలనాపరమైన చిక్కులు వగైరా అర్థం చేసుకున్న ఏ ఐఏఎస్ అధికారీ తానొక్కడే అలాంటి అద్భుతాలను సాధించగలనని చెప్పలేడు కూడా.

అంటే - ఏదో ఒక శక్తి - మానవశక్తికి మించిన శక్తి వల్ల మాత్రమే అది సాధ్యపడుతుంది. నేను ఇంత నమ్ముతున్నా, ఆ పుస్తకం ఆవిష్కరణకు వెళ్ళాలన్న నా ఉత్సాహం వెనకాల గల ఔచిత్యాన్ని నా భార్య ప్రశ్నించినప్పుడు నేను కూడా సందిగ్ధంలో పడిపోయాను. నిజంగానే ఆ 'సర్వసంభవామ్' (నాహంకర్తా...) పుస్తకంలో నాకు తెలీకుండా ఎక్కడన్నా నేనే ఏదో సాధించానన్న భావ వ్యక్తీకరణ చేశానా? ఇప్పుడా సభకు వెళ్ళి అందరూ చప్పట్లు కొడుతుంటే విని పొంగిపోవాలనుకుంటున్నానా? మానవాతీతశక్తి వల్ల జరిగిన అద్భుతాలకి నేను కీర్తి పొందాలనుకుంటున్నానా?... ఇలాంటి సవాలక్ష ప్రశ్నలు నా మనస్సుని తొలిచేశాయి.

సభ ఇంకో రెండు మూడు గంటల్లోమొదలవుతుందనగా, 'ఎమెస్కో' విజయకుమార్‌కి కబురు పంపాను - "నేను ఈ సభకి రాలేకపోతున్నాను."

కాని ఆ సంఘటన తాలూకు ఆత్మశోధన నన్ను ఇటీవలి 'వెయ్యికాళ్ళమంటపం' సంఘటన దాకా వెంటాడుతూనే వుంది.

★ ★ ★

నేను భగవంతుణ్ణి ప్రార్థించాను - నేను తెలిసిగానీ, తెలియకగానీ ఆ పుస్తకంలో ఎక్కడైనా 'స్వోత్కర్ష'కి పాల్పడివుంటే, దానికి మూల్యం చెల్లించే అవకాశం కలగాలని.

నిజానికి ఆ పుస్తకం విడుదల తరువాత రెండు మూడు సంవత్సరాలపాటు నేను ఊహించని అనేక అవాంఛనీయ పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది.

2003లో అప్పటి ప్రభుత్వం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ సంస్థ డైరెక్టర్ జనరల్‌గా మరో రెండేళ్ళు నా సర్వీసు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక ఏడాది గడిచేసరికి ఎన్నికలొచ్చాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడింది. రిటైరైన వాళ్ళని ఏ పదవిలోనూ కొనసాగించకూడదనే కొత్త విధానం ప్రకటిస్తూ జి.ఓ. వెలువడుతోందని తెలిసిన వెంటనే రాజీనామా చేశాను. అంటే ఒక ఏడాది పొడిగింపుని కోల్పోయాను. ...సరిగ్గా ఆ 2-3 సంవత్సరాల్లోనే పిల్లల కుటుంబాల్లో చీకాకులు... ఆర్థిక ఇబ్బందులు... నేను ఎప్పుడూ అనుభవించి వుండని అశాంతి...!

అన్ని క్లిష్ట పరిస్థితుల్లోనూ మనసుకి స్థైర్యాన్నిచ్చే ఒకే ఒక్క భావన - 'నాహం కర్తా, హరిః కర్తా'. ఈ భావం వల్ల కలిగే ఊరట, నిబ్బరం, మనోధైర్యం - ఇంకే రకమైన శక్తివల్ల మాత్రం లభించగలవు?

అకస్మాత్తుగా 2004 అక్టోబరులో ఒకరోజు అప్పటి రెవెన్యూ ముఖ్యకార్యదర్శి (ఎండోమెంట్స్) శ్రీ జె.పి.మూర్తి టెలిఫోన్ చేశారు.

"సర్, తిరుమలలో వెయ్యికాళ్ళమంటపం కూలగొట్టడం ఎంత తీవ్రమైన వివాదానికి దారి తీసిందో మీకు తెలుసు. ఆ వివాదంపై మీరు ఛైర్మన్‌గా ఒక త్రిసభ్యకమిటీని వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది..."

ఈ అవకాశం ఎవరిచ్చారు?

ఆరుమాసాలలోగా మా కమిటీ ఒక నివేదిక ఇవ్వాల్సివుంది. మనసుపెట్టి, మా కమిటీ రాష్ట్రమంతా పర్యటించింది. కొన్ని రాష్ట్రేతర నగరాలలో కూడా భక్తుల్ని సంప్రదించింది. మా కమిటీ ఈ సమస్యను కూలంకషంగా పరిశీలించి, దానికి పరిష్కారాన్ని సూచిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపించింది. చినజీయర్‌గారి నిరశన దీక్షదాకా వెళ్ళిన అంత పెద్ద వివాదమూ మబ్బులు విడిపోయినట్లు సమసిపోయిందంటే - దానికి నేను క్రెడిట్ తీసుకోగలనా? లక్షలాది భక్తుల మనోభావాలకు, విశ్వాసాలకు సంబంధించిన పెను సమస్యని మానవశక్తి పరిష్కరించగలదా? అదే నిజమైతే వరుణయాగాలెందుకు చేస్తున్నాం?

★ ★ ★

పదిమందికి సహాయపడే ఉద్యోగం మనకి లభించటం కూడా భగవంతుడి ప్రసాదమే అని నేను విశ్వసిస్తాను. మనకి అప్పగించిన బాధ్యతలను అర్థవంతంగా నెరవేర్చాలన్న తపన వుంటే, ఆ తపనలో స్వార్థం, కుత్సితం లేకుండా ఉంటే ఆ ప్రయత్నానికి దైవబలం తోడుండి తీరుతుందని నా విశ్వాసం.

దైవబలం సహకరించకపోయి ఉంటే ప్రభుత్వ సర్వీసులో ఉన్నప్పుడు ఖమ్మం జిల్లా కలెక్టరుగా ఐ.టి.సి.కి వందల ఎకరాలను ఒక్కరోజులో అప్పగించినప్పుడే సస్పెండ్ కావలసినవాణ్ణి... ఎన్.టి.ఆర్.హయాంలో శివరాత్రినాడు రామప్ప గుళ్ళో జరిగిన తోపులాటకి సస్పెండ్ కావలసినవాణ్ణి... తిరుపతి దేవస్థానంలో నా పనితీరు గురించి నా మీద కొందరు ముఖ్యమంత్రికి మోసిన, మోపిన అభాండాలకి సస్పెండ్ కావలసిన వాణ్ణి... విశాఖ పోర్టులో నేరుగా రైలింజన్ కొనేయటం వంటి నేను తీసుకున్న పలు నిర్ణయాలకి ఉద్యోగం కూడా పోగొట్టుకొని, పెన్షన్ కూడా రాకుండా అవస్థలు పడుతూండాల్సిన వాణ్ణి...

సమాజశ్రేయస్సుకి పనిచేయటం కోసం మనకి ఉద్యోగం వచ్చింది. అధికారులకైతే అధికారాలు ఎక్కువుంటాయి కాబట్టి అవకాశం ఎక్కువ ఉంటుంది.

దేశంలో 100 కోట్లకి పైగా జనాభా ఉంటే ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌కి ఎంపికయ్యే అదృష్టం ఏటా ఏ 300 మందికో మాత్రమే లభిస్తోంది. సాటి ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసేలా కొన్ని వందల మందికి మాత్రమే భగవంతుడు అవకాశం కల్పించాడు కనుక, ఆ కొన్ని వందల మందిలో నేనూ ఒకణ్ణి అన్న భావనతో పనిచేస్తే, 'నా సంకల్పంలో స్వార్థం లేనంతవరకు దైవబలం తోడయి తీరుతుంది' అన్న విశ్వాసంతో శాయశక్తులా పనిచేస్తే, తీసుకునే ప్రతి నిర్ణయం యొక్క లక్ష్యం ప్రజల, రాష్ట్ర, దేశ ప్రయోజనం మాత్రమే అయివుండేలా తీసుకుంటే... అన్ని కార్యాలనూ ('నాహం కర్తా, హరిఃకర్తా') దైవబలమే సాధించిపెడుతుంది.

మనం చేసేది తప్పో రైటో - మన మనస్సాక్షికి తెలుసు. ప్రజల్ని మోసం చేసే ఐఏఎస్‌ల్నీ చూశాను, ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించే ఐఏఎస్‌ల్నీ చూశాను. నిజానికి ఈ ప్రభుత్వాన్ని

ఎన్నుకొన్నది ఆ ప్రజలే. తమ అభివృద్ధికోసం ఎన్నుకున్నారు. 'ఐఏఎస్' అనబడే వాళ్ళంతా ఆ ప్రజాప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడం కోసం పనిచేసే ఎగ్జిక్యూటివ్‌లు.

ఒక్కోసారి – ఇంత సిద్ధాంతపరంగా ఆలోచించి, అత్యంత నీతివంతంగా, అతి నిజాయితీతో, చాలా చాకచక్యంగా, రాత్రింబవళ్ళూ ప్రజలకోసమే కష్టపడి పనిచేసే అధికారికి సయితం ఇక్కట్లు రావచ్చు. ఊహించని శిక్షకి గురి కావలసిరావచ్చు.

అప్పుడైనా సమాధానం ఒక్కటే – 'నాహం కర్తా, హరిఃకర్తా'

ఎప్పుడో ఎక్కడో తెలిసో, తెలియకో ఈ జన్మలోనో, క్రిందటి జన్మలోనే చేసిన పాపానికి అనుభవిస్తున్నాం. కాని ఇప్పుడు చేసే సత్కార్యానికి సత్ఫలితం కూడా అందుకుంటాం. అది ఇప్పుడే కావచ్చు... రేపు కావచ్చు... ఎప్పుడైనా కావచ్చు.

భారత ప్రధానమంత్రిగా – అథోగతి పాలవుతున్న ఈ దేశ భవిష్యత్తుని ఉజ్జ్వలమైన పురోగతి పథంలోకి నడిపించిన మహామేధావిగా పి.వి. నరసింహారావుని ఇప్పుడు ప్రపంచమంతా గుర్తిస్తోంది. దేశ బడ్జెట్ అమలు చేయటం కోసం ఒకప్పుడు బంగారం నిల్వల్ని కుదువపెట్టుకున్న ఈ దేశాన్ని – మిత్రదేశంగా గుర్తించాలని అమెరికా, ఫ్రాన్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు అర్రులు చాచేస్థాయికి తీసుకువెళ్ళిన రాజనీతిజ్ఞుడు పి.వి. ఆయన అమలు చేసిన ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల్ని ఈ దేశం ఎప్పటికీ తిరస్కరించలేదు. ఆయన జీవించినంత కాలం దైవబలాన్నే విశ్వసించాడు.

అంతటి దేశభక్తుడు సయితం కోర్టుల్లో కేసుల్లో ఇరుక్కున్నాడు. బాబ్రీ మసీదు కూల్చివేత వంటి రాజకీయ వివాదాలకి బలిపశువు చేయబడ్డాడు...చివరికి ఆయన చనిపోతే, కీర్తి శేషులైన మాజీ ప్రధానమంత్రులతోపాటు భారత రాజధానిలో ఆయన (భౌతికకాయం) ఉండతగదని, హైద్రాబాద్‌కి తరలించబడ్డాడు...

ఇది ప్రారబ్ధం!

* * *

గుంటూరులో నేను చదివిన హిందూ కాలేజి హైస్కూల్లో కృష్ణారావు మాష్టారని ఇంగ్లీషు ఉపాధ్యాయులుండేవారు. అందరు విద్యార్థులూ గౌరవించే ఉపాధ్యాయుడు. మహాదైవభక్తి పరుడు. అను నిత్యం జపతపాలు చేసేవాడు. ఆయనకి పదమూడు మందిపిల్లలు!

నేను నాగపూర్‌లో ఎం.ఏ. చదవటానికి వెళ్ళేముందు గుంటూరు వెళ్తే నా ఇంటర్ క్లాస్‌మేట్ సదాశివ కలిశాడు. టైపు ఇన్‌స్టిట్యూట్ నడుపుతున్నాడు. వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. అప్పుడే తెలిసింది – అతని తండ్రే మా కృష్ణారావు మాస్టారు. ఆయన ఉద్యోగంలో వున్న రోజుల్లో పెద్ద జబ్బు చేసి, మాటపడిపోతే, రెండేళ్ళు శెలవుపెట్టి, పొలాల్లో కూర్చొని ఆధ్యాత్మిక సాధనచేసి మాట్లాడగలిగే శక్తిని సంపాదించుకున్నాడు, మళ్ళీ 'గొప్ప టీచర్' అనిపించుకున్నాడు.

మళ్ళీ ఏడాది తరువాత గుంటూరు వెళ్ళేసరికి సదాశివ తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధితో హాస్పిటల్‌లో వున్నాడు. అతనికిపైన చాలామంది అక్కలు, అన్నయ్యలు వుండాలి. కాని అప్పటికే వాళ్ళంతా పెద్దవాళ్ళయ్యాక చనిపోయారు. నన్ను చూసి సదాశివ ఏడ్చేశాడు. "మానాన్నకి మిగిలింది నేనూ మా తమ్ముడూ. వాడింకా చిన్నవాడు. నేను సంపాదనకొచ్చే సమయానికి ఇలా ఆసుపత్రి పాలయ్యాను. నేనింక బ్రతకను ప్రసాద్. మాకే ఆస్తిపాస్తులూ లేవు. మా అమ్మా, నాన్నా ఎలా బ్రతుకుతారో..." అంటూ వలవల ఏడ్చాడు. కొన్నాళ్ళకి సదాశివ చనిపోయాడని విన్నాను.

మాస్టారి కుటుంబం ఎక్కడికెళ్ళిపోయారో తెలీదు...! 14 ఏళ్ళ తరువాత 1980లో నేను తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వుండగా గుంటూరులో సదాశివుడి టైప్ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామి సుబ్బుశింగ్ కనబడి, కృష్ణారావు మాస్టారు పూర్తిగా ఆధ్యాత్మిక చింతనలో మునిగిపోయారని, హైద్రాబాద్‌లో బెజవాడ రోడ్డుకి దగ్గరగా మూసీనది ఒడ్డున ఒక తాటాకుల పాకలో వుంటున్నారని చెప్పాడు. చూడాలనిపించింది. ఆయన మాకు పాఠాలు చెప్పిన ఉత్తమ ఉపాధ్యాయుడు. నా మిత్రుడుకి తండ్రి.

నేను వెళ్ళేసరికి మాస్టారు చిన్న తుండుగుడ్డ కట్టుకుని పూలుకోసుకుంటున్నారు. బాగా ముసలివాళ్ళయి పోయారు. తలంతా ముగ్గుబుట్టలా నెరిసిపోయింది. ఆవిడ అలాగే అవస్థపడుతూ నీళ్ళు మోసుకొస్తోంది. ఆయన నన్ను గుర్తుపట్టడానికి చాలాసేపు పట్టింది. ఆయన చెప్పిన విషయాలు విని మ్రాన్పడిపోయాను...! రోజూ కొన్ని గంటలపాటూ భగవంతుడి ధ్యానంలో మాత్రమే మునిగిపోయే మహా భక్తుడి పదమూడుమంది పిల్లల్లో ఒక్కరు కూడా ఆయన వృద్ధాప్యంలో మిగల్లేరు. మరి చివరికొడుకు? "...వాడు మానసికంగా ఎదగలేదు. మాతోనే ఉంటే చచ్చిపోతాడని దత్తత ఇచ్చేశామయ్యా. కానీ వాడు కూడా బ్రతకడు..." అన్నారు నిర్వేదంతో.

ఆయన అన్న ప్రతి మాటా నాకు గుర్తుంది. "...నేను గంటలకొద్దీ సమయం ఆ సర్వేశ్వరుడి పూజలలోనే గడుపుతున్నాను. నాకు ఇన్ని కష్టాలు ఎందుకిచ్చావని అడగటానికి కాదు. నాకు తెలుసు గదా! ఏదో జన్మలో చేసిన కర్మ ఫలాన్నే అనుభవిస్తున్నాను. ...80 ఏళ్ళు దాటాయి. దుఃఖం అలవాటయిపోయింది. శరీరబాధ బాధనిపించదు. దుఃఖం ఏడుపు తెప్పించదు... ఇంకా మంచిరోజులు ఏం వస్తాయని ఆశించాలి? ఈ చేతులమీదుగా పెళ్ళీడుకొచ్చిన, చేతికందివచ్చిన 12 మంది పిల్లలకి దహనకాండలు చేసిన తండ్రినయ్యా... అయినా ఇప్పటికీ దేవుణ్ణి గంటల తరబడి జపతపాల్లో ఆరాధిస్తున్నానంటే – ఈ కష్టాన్ని అనుభవించే శక్తినిమ్మని, కనీసం ఇతరులనైనా సుఖశాంతులతో బ్రతకనిమ్మని కోరటం కోసమే. 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' అని ప్రార్థించటం ఒక్కటే చేస్తున్నాను... నా సమస్యల్లా నా భార్య వుండుండి రోదిస్తుంటే ఎలా ఓదార్చాలో తెలీకపోవటం. జీవించినంతకాలం పొట్టగడవాలి కదా? ఎలా...?ఎలా? అందరూ సుఖంగా వుండాలని దేవుణ్ణి ప్రార్థించటానికైనా నాకు శక్తి వుండాలి గదా...!?"

అంతటి దుఃఖంలోనూ, అంతటి నిస్సహాయస్థితిలోనూ ప్రజలందరూ బాగుండాలని దేవుణ్ణి ప్రార్థించే కృష్ణారావు మాష్టారుకి మించిన ఆదర్శం వుంటుందా?... తిరుపతి తిరిగివెళ్ళగానే, నిత్యం దేవాలయాల్లో వేదపారాయణ చేసే వాళ్ళకి గౌరవవేతనం ఇచ్చే పథకంలో లబ్ధిదారుల పేరుల్లో కృష్ణారావు మాస్టారిపేరు చేర్చాను. నియమనిబంధనల ప్రకారం చేస్తే ఆయనకి 'అది దక్కదు. ఆ జాబితాని బోర్డులో పెట్టినప్పుడు ఆయన అర్హతల కాలమ్‌లో ఏమీ రాయలేకపోయాను. వాటి గురించి ఏ ఒక్కసభ్యుడు ప్రశ్నించినా ఆయనకి అది దక్కదు.

నేను నమ్మే దైవాన్ని ప్రార్థించాను... ఆ జాబితాలో కృష్ణారావు మాష్టారి అర్హత గురించి బోర్డులో ఎవ్వరూ ప్రశ్నించలేదు. (ఆయన తుది శ్వాస వరకూ ఆ గౌరవవేతనం ఆయనకి అందేది).

★ ★ ★

కొందరికి స్వోత్కర్షలా కనిపించినా, కొందరికి అసంబద్ధంగా కనుపించినా నేను రాసిన అనుభవాలన్నీ – అనేక కీలక పరిణామాలలో నా క్రియాశీలక పాత్రని, లేదా నా సాక్షి పాత్రని వెల్లడించేవి, ఆ అనుభూతుల్ని నలుగురితో పంచుకునేవి.

మన సంకల్పంలో శుద్ధత వుంటే, నేను పైన చెప్పిన ఆలోచనా ధోరణితో పనిచేసే ఎగ్జిక్యూటివ్ లెవరికైనా దైవబలం తోడవుతుందని నేను ఇప్పటికీ నమ్ముతున్నాను.

నా అనుభవాల్ని ఇలా రాయాల్సి రావటం కూడా బహుశా 'నాహం కర్తా, హరిఃకర్తా'.

★ ★ ★







ఈ పుస్తకంలో ఏముందంటే...

బాబ్రీ మసీదు కూల్చివేతకు పి.వి. బాధ్యత ఎంత? అయోధ్య రామాలయం విషయంలో ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు రహస్యంగా సాగించిన మంతనాల కైవారం ఎంత? వాటిలో ఐఏఎస్, ఐపిఎస్ అధికారుల పాత్ర ఎంత?

కేంద్రంలో మన్మోహన్‌సింగ్ తన పదవికి రాజీనామా చేస్తే ఐఏఎస్ అధికారికి ఏం సంబంధం? అయినా తెరవెనకాల నేను ఏం చేస్తే తెర ముందు ఏం జరిగింది?

ఎన్.టి.ఆర్. చెప్పుడు మాటలు వింటే, ఐఏఎస్‌లు ఎలా బలి కావాల్సివచ్చేది?... ఫరూక్ అబ్దుల్లాకి, రాఘవేంద్రస్వామి మఠానికీ ఎన్.టి.ఆర్. కలిపిన సంబంధం ఎలాంటిది?

రజనీకాంత్‌ని తమిళనాడు ముఖ్యమంత్రిని చేయాలని పి.వి.మనస్ఫూర్తిగా కోరుకున్నారా? ప్రధానమంత్రి పి.వి.ని అడకత్తెరలోకి తోసిన తమిళనాడు రాజకీయశక్తుల చదరంగంలో ఒక ఐఏఎస్ అధికారిగా నా పాత్ర ఏమిటి?

ఒక ఐఏఎస్ అధికారినైన నా ద్వారా డబ్బు పంపిణీ జరగాలని కోరుకున్న ముఖ్యమంత్రి ఎవరు? ఆ ప్రజాఉద్యమకాలంలో అలా జరగటానికి దారి తీసిన పరిస్థితులేమిటి?

చంద్రస్వామి ఎవరు? కేంద్ర ప్రభుత్వంలో కొందరు మంత్రులు సాగించిన క్షుద్రపూజల లక్ష్యం ఏమిటి? ఇలాంటి క్షుద్రరాజకీయాలలో ఒక ఐఏఎస్ అధికారిగా నా పాత్ర...??

ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటుని మొదట్లో ఎందుకు తీవ్రంగా వ్యతిరేకించారు? రాజకీయాలకీ, పరిపాలనకీ మధ్య అగాధమెంత?

అవినీతిని అంతమొందించడానికి నిపుణుల సాయంతో తయారుచేసిన సమగ్ర ప్రణాళికని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎందుకు అటకెక్కించేశారు?

1992లోనే వై.యస్.రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అవ్వాల్సివున్నా, నేను కూడా సూచించినా, అప్పటి పార్టీ అధ్యక్షుడుగా పి.వి.నరసింహారావు ఎందుకు ఆమోదించలేదు?

అమితాబ్ బచ్చన్, అంబానీలు నన్నే వెతుక్కుంటూ ఎందుకువచ్చారు? ఢిల్లీ రాజకీయాల్లో వ్యాపారవేత్తల పాత్ర ఎలాంటిది?

...ఇలా సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తే అనేక కీలక పరిణామాలలో ఒక పాత్రధారిగా లేదా ఒక మౌనసాక్షిగా తాను నిర్వహించాల్సి వచ్చిన పాత్ర గురించి రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. అధికారి పి.వి.ఆర్.కె.ప్రసాద్ 'స్వాతి' వార పత్రికలో రాసిన యథార్థగాథల సంకలనం ఈ '*అసలేం జరిగిందంటే...*

. 120/-

ఎమెస్కో బుక్స్

978-93-80409-13-9